# శాంతి ప్రదాత శ్రీ ఓంకార్ స్వామీజీ ఆత్మకథ

## అధ్యాయం - 1

**పూర్ణమిదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే।**
**పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే॥**

**- బృహదారణ్యక ఉపనిషత్తు**

## బాల్యం

నేనిప్పుడు నా జీవితంలో గడిచిపోయిన పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకోవటానికి డెబ్బది ఎనిమిది సంవత్సరాల కాలం వెనక్కి వెళ్ళాలి. నేనిప్పుడు ఓంకార స్వామీజీని, శాంతి ఆశ్రమ స్థాపకుడిని, శాంతి ప్రదాతను. 1967లో ఆశ్రమంలో 50 స్వర్ణోత్సవాల కార్యక్రమాలు అన్నీ మర్చిపోయి కేవలము ఒక చిన్న కుగ్రామంలో జన్మించిన బాలుడిగా మారి ఈ విషయాలన్నీ గుర్తు చేస్తున్నాను.

నేను పిఠాపురంలో జన్మించానో లేదా మా పూర్వీకులు నివసించిన కొత్తపల్లిలో జన్మించానో గుర్తు లేదు. అవి రెండూ గోదావరి జిల్లాలోని గ్రామాలు. కానీ నా ఉద్దేశ్యం ఏమిటంటే నేను ఎక్కడ జన్మించినా ఆ భగవంతుని ఒడిలో ఉన్నాను. నిజానికి ఈ ప్రపంచమంతా ఆయన ఒడినుండి ఆవిర్భవించిందే కదా!

మా తల్లిదండ్రులకు చాలాకాలం సంతానం కలుగలేదు. సంతానం కోసం వారు చేయని వ్రతం లేదు. తిరగని గుడి లేదు. ప్రార్థించని భగవంతుడు లేదు. వారి పూజల ఫలితంగా ఒక పవిత్ర దినం ఒక పొడగరి అయిన సాధు మహాత్ముడు అనుకోకుండా మా ఇంటికి వచ్చారట. ఆ మహాత్ముడు మా తల్లిదండ్రులను ఆశీర్వదించి మంత్ర జలాన్ని ఇచ్చారు. మా తల్లిగారు ఎంతో భక్తిశ్రద్ధలతో ఆ పవిత్ర జలాన్ని సేవించారు. వచ్చిన పని నెరవేరగానే ఆ సాధు మహాత్ముడు వెంటనే అక్కడి నుండి వెళ్ళిపోయారు. అతడిని పూజించాలని భావించిన మా తల్లిదండ్రులు ఎంతో నిరాశ చెందారు.

అటు పిమ్మట కొన్ని నెలల తర్వాత 1895వ సంవత్సరంలో వారికి ఒక బాలుడు జన్మించాడు. అతని పేరు వెంకటేశ్వర లేదా వెంకటరావు. నాకిప్పుడు నా చిన్నతనపు

రోజులు అంతగా గుర్తు లేవు. కాని నేను నాలుగైదు సంవత్సరాల వయస్సులో మా తండ్రి గారు ఉదయకాలపు పూజాదికాలు నిర్వర్తించే సమయంలో పూజగదిలో పద్మాసనంలో కూర్చునేవాడిని. మా తండ్రి గారు భగవద్గీత మొదలైనవి పారాయణం చేసిన తర్వాత అందరికి ప్రసాదం పంచేవారు. దాని కోసమే నేను బొమ్మలాగా అక్కడే కూర్చుని నా వంతు ప్రసాదం కోసం ఎంతో ఆతురతతో ఎదురుచూసేవాడిని. నా బాల్యంలోని మధుర క్షణాలలో ఇది ఒకటి. ఇప్పటికి కూడా ఆ సన్నివేశం గుర్తుకు వస్తే నాకు చాలా ఆనందంగా ఉంటుంది.

నా తల్లిదండ్రులకు నేను ఎంతగానో ఋణపడి ఉంటాను. అంత చిన్న వయస్సులోనే వారు నాకు ఆధ్యాత్మికంగా బలమయిన పునాది వేసి ఆశీర్వదించారు. తల్లిదండ్రుల సంస్కారమే బిడ్డలకు అబ్బుతుంది కదా! ఆశీర్వదించబడిన బిడ్డల వలన ఆ తల్లిదండ్రులు తమ పిల్లలను భగవంతుని దిశగా నడిపించగల్గుతారు. మానవ జీవితానికి నిజమయిన సార్ధకత అదే కదా!

## పాఠశాల రోజులు

నా మొదటి పాఠశాల పిఠాపురంలోని చిన్న గ్రామంలో ఉండేది. ఆ రోజుల్లో నేను ఎంతో సంతోషంగా రోజూ పాఠశాలకు వెళ్ళేవాడిని. బడికి వెళ్ళాలంటే చిన్న పూరిపాక వరండాలోంచి వెళ్ళాలి. బాగా వంగి వెళ్ళాల్సి వచ్చేది. ఒక రోజు అలా వెళుతూ ఉంటే ఒక వెదురుబొంగు నా నుదుటి మీద బలంగా గుచ్చుకొని విపరీతంగా రక్తం కారసాగింది. ఎలా ఇంటికి చేరుకున్నానో గుర్తు లేదు. వైద్యుల పర్యవేక్షణలో ఆ గాయం త్వరగానే నయం అయింది కాని ఆ మచ్చ ఇప్పటికీ కూడా మిగిలిపోయింది. అప్పటికి నాకు అయిదారేళ్లు వయసు ఉండవచ్చును. అంత చిన్న వయస్సులో కూడా నేను ఎంతో ఓర్పుతో ఆ బాధను భరించినట్లు గుర్తు.

బాల్యంలోని మధురానుభూతుల్లో మరొక సంఘటన కూడా నాకు ఎంతో ఆనందాన్ని ఇస్తుంది. నాకు పెంపుడు జంతువులన్నా, మూగజీవులన్నా చాలా ఇష్టం. నేనొక చిన్న కుక్క పిల్లను ఎంతో ప్రేమగా పెంచుకున్నాను. దురదృష్టవశాత్తూ ఒక రోజు కుక్కపిల్లను తేలుకుట్టింది. అది బాధతో ఏడవడం మొదలుపెట్టింది. దాని బాధను చూడటం నాకు సాధ్యం కాలేదు. నేను కూడా దానితో పాటు ఏడుస్తూ దాని బాధని తగ్గించటానికి

సహాయం కోసం ఇంటింటికి తిరగసాగాను. చాలా మంది మా ఇద్దరి ఏడుపు చూచి నవ్వటం మొదలు పెట్టారు. కొందరు సానుభూతి చూపారు. నెమ్మదిగా దాని బాధ తగ్గిపోయింది. దానితో నా బాధ కూడా ఉపశమించింది.

భగవంతుని సృష్టిలో అందరూ ప్రేమించతగినవారే. పక్షులు, జంతువులు, చెట్లు, క్రిమికీటకాలు, మానవులు అందరూ సమానంగా ప్రేమించటానికి అర్హులే. అందమయిన పువ్వు, స్వేచ్ఛగా ఎగిరే పక్షి, అమాయకపు జంతువు, హాయిగా నవ్వే పాపాయి.

## అధ్యాయం - 2

# ఉన్నత పాఠశాల విద్య

పిఠాపురంలో శ్రీ చెల్లాయమ్మరావు ఉన్నత పాఠశాలకు మంచి పేరు ఉంది. అక్కడి ఉపాధ్యాయులు చక్కని విద్యాబోధన చేసేవారని ప్రతీతి. శ్రీ కూచి నరసింహం గారు పాఠశాల ప్రధానోపాధ్యాయులు. వీరంతా పిల్లలను విద్యలోనే కాకుండా మంచి క్రమశిక్షణలో ఆధ్యాత్మికంగా కూడా చక్కగా తీర్చిదిద్దేవారు. ప్రతిరోజు తరగతులు ప్రార్థనతో ప్రారంభమయ్యేవి. విద్యార్థులందరూ కలిసి సామూహికంగా భగవద్గీత పదకొండవ అధ్యాయం పారాయణం చేసేవాళ్ళము. విశ్వ సందర్శనయోగమది.

పాఠశాల రోజుల్లో నా చదువు గురించి నాకు పెద్దగా ఏమీ గుర్తు లేదు. నా వయస్సు అబ్బాయిలందరము కలిసి సరదాగా ఇంటి నుండి తెచ్చిన పదార్థాలను ఎంతో ఆసక్తిగా తింటూ గడిపేవాళ్ళము. తరచుగా అందరము కలిసి సరదాగా తిరిగి వచ్చేవాళ్ళం. దగ్గరిలోని రైలు స్టేషనుకు వెళ్ళి అక్కడి డ్రైవర్లకు మేము తెచ్చిన చిరుతిళ్లు, పచ్చళ్లు మొదలయినవి ఇచ్చేవాళ్ళము. బదులుగా వాళ్ళు ఎంతో విలువయిన బొగ్గును మాకు ఇస్తూ ఉండేవాళ్ళు. ఏదో విధంగా ఈ విషయం తెలుసుకున్న మా ప్రధానోపాధ్యాయులు మా అందరినీ పిలిచి అరచేతిపై ఆరు బెత్తం దెబ్బలు తగిలించారు. దానితో మేము అక్కడికి వెళ్లటం మానుకున్నాము.

చాలా సంవత్సరాల తర్వాత నేను శాంతి ఆశ్రమం స్థాపించిన అనంతరము మా శాంతి పత్రికలో 'గురు దర్శనం' అనే వ్యాసాన్ని ప్రచురించాను. అది చదివిన మా ప్రధానోపాధ్యాయులు ఎంతో సంతోషించి నన్ను అభినందిస్తూ ఉత్తరం వ్రాశారు. గురుమూర్తులందరికి గురువైనవాడు అంతర్యామిగా ఎల్లప్పుడు పవిత్రమయిన అంతరంగంలో కొలువై ఉంటాడు. ఆయనని దర్శించడానికి మనము బహిర్ముఖులమై దేవాలయాల్లో, చర్చిల్లో, మసీదుల్లో లేదా హిమాలయ పర్వత సానువుల్లో వెతకవలసిన పనిలేదు. నిజమయిన గురువును మౌనంగా అంతర్ముఖులై దర్శించాలి.

రైలు స్టేషనులో మేము చేసిన నిర్వాకం తర్వాత కొన్ని సంవత్సరాల అనంతరం నన్ను ఆ బడి నుండి విశాఖపట్టణంలోని క్రైస్తవ బాప్తిస్టు మిషన్ స్కూలుకు మార్చారు. అక్కడ నేను మాకు బాగా తెలిసిన ధనవంతులయిన బంధువుల ఇంటిలో ఉండేవాడిని. అందువలన నాకు స్వేచ్ఛగా విలాసవంతమయిన జీవనం గడిపే అవకాశం కల్గింది. తరుచుగా నేను దగ్గరిలోని సముద్రపు ఒడ్డున అలల సవ్వడులు వింటూ గడిపేవాడిని. కాని అప్పటికింకా నాకు ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించటం, అంతటా ప్రతిధ్వనించే ఆ పవిత్రమయిన ఓంకార నాదాన్ని గుర్తించటం అలవడనందువలన నేను నా వయస్సు స్నేహితులతో కాలక్షేపం చేసేవాడిని. కాని రాత్రి సమయంలో పండు వెన్నెలలో సముద్రపు అలల సవ్వడులు వింటూ, ఆకాశంలో మిలమిలా మెరిసే నక్షత్రాలను చూస్తున్నప్పుడు తెలియకుండానే నా మనస్సు అంతర్ముఖమయ్యేది. గాఢంగా ధ్యానంలో లీనమయ్యేవాడిని.

ఇక నా చదువు విషయానికి వస్తే నాకందులో అంత ఆసక్తి లేని కారణంగా మార్కులు తక్కువ వచ్చేవి. జతగాళ్ళతో కలిసి సముద్రపు ఒడ్డున పచార్లు చేయడానికే ఆసక్తి చూపేవాడిని. మా ప్రధానోపాధ్యాయులు రెవరెండు లాజరస్ గారికి నేనంటే చాలా అభిమానం ఉండేది. వారి కుటుంబం పవిత్రమయిన ఆధ్యాత్మిక జీవనం గడిపేవారు. నేను బిడియపడినా వారు ఎంతో ప్రేమతో వారితో పాటు వారి రెండెడ్ల బండిలో నన్ను కూడా బడికి తీసుకు వెళ్ళేవారు. వాళ్ళింట్లో పిల్లలు ఆడుకోవడానికి టెన్నిస్ కోర్టు ఉండేది. వారి బంధువుల పిల్లలందరితో పాటు నేను కూడా సాయంత్రాలు సరదాగా వాళ్ళతో టెన్నిస్ ఆడుకోవడానికి వాళ్ళింటికి వెళ్ళేవాడిని.

మంచి క్రమశిక్షణ, ఆధ్యాత్మిక జీవనం గడిపే అటువంటి క్రైస్తవ కుటుంబంతో కలిసి మెలసి మెలగటం వలన రోజు రోజుకి నాలో భగవాన్ జీసెస్ క్రీస్తు పట్ల ఆరాధనా

భావం పెరగసాగింది. పాఠశాలలో తరగతులు మొదలు పెట్టే ముందు ప్రార్థనలు జరిగేవి. తర్వాత ప్రతి రోజు ఒక తరగతి ప్రత్యేకంగా పవిత్ర గ్రంథం బైబిల్ పఠనానికి కేటాయించేవారు. పిఠాపురంలో నేను అంతకు ముందు చదువుకొన్న బడిలో వైదిక ప్రార్థన భగవద్గీత పఠనం జరిగేది. ఇవన్నీ కూడా భగవంతుని ఆశీర్వచనము వలన, నా పూర్వజన్మ సుకృత ఫలము వలన నాకు లభించాయి.

భగవద్గీత, బైబిల్ గ్రంథాల్లోని సారాంశము ఒక్కటేనని నాకు అనిపించేది. నేను చిన్నవాడినయినా మత మార్పిడులంటే నాకు ఇష్టం ఉండేది కాదు. భగవంతునికి బాగా తెలుసు. అందుకే మన స్వభావానికి అనుగుణమయిన మతంలోనే మనకి జన్మ ఇస్తాడు. నేను క్రైస్తవ మిషనరీ స్కూలులో చదువుకోవటం వలన నాకు కల్గిన అవగాహన వలన పవిత్రము, ఆదర్శవంతమయిన జీసెస్ పట్ల నాకు గౌరవాభిమానాలు పెరిగాయి. కాలం గడిచే కొద్దీ ఆ గౌరవం మరింతగా పెరిగింది.

విశాఖపట్టణంలో నా జీవితం చాలా విలాసవంతంగా, సౌకర్యంగా గడిచింది. ఖరీదయిన దుస్తులు, విలువయిన జీవితం గడిపాను. నా పసితనంలోనే నేను మాతృప్రేమకు దూరమవటం వలన నాన్నగారే నాకు తల్లిదండ్రి అయ్యారు. నా తల్లి గురించిన జ్ఞాపకాలేమీ నాకు గుర్తు లేనందుకు నాకు చాలా బాధగా అనిపించేది. నా తల్లి ఆత్మ ఎక్కడ ఉన్నా శాంతిగా ఉండుగాక! నా కోసం నాన్నగారు ఎంతో డబ్బు ఖర్చు చేసేవారు. ఇంటి నుండి స్కూలుకు రెండు మైళ్లు నడవాల్సి వచ్చేది. అందువలన నాన్నగారు నాకు సైకిల్ కొనిచ్చారు.

నాకు చిన్నారి సాధుశీలి అయిన చెల్లెలు ఉండేది. ఆమె నన్ను ఎంతగానో ప్రేమించి సేవలందించేది. కాని ఆమె 12 సంవత్సరాల చిన్న వయస్సులోనే దేహం చాలించింది. ఆమె గురించిన వివరాలు మళ్ళీ మీకు నేను వివరిస్తాను.

నాన్న కొనిచ్చిన సైకిల్‌పై తిరగడానికి నాకు ఖరీదయిన దుస్తులు కావాల్సి వచ్చాయి. స్నేహితులతో కలిసి వెళ్ళి చాలా ఖరీదయిన బట్టలు బీరువా నిండా కొన్నాను. అయినా సైకిల్‌పై స్కూలు వరకు వెళ్ళటం నాకు చాలా కష్టంగా అనిపించింది. అందుకని స్కూలుకి దగ్గరగా ఒక గది అద్దెకు తీసుకున్నాను. నాతో పాటు సోమయాజులు నా గదిలో ఉండేవాడు. నేను కొన్న ఖరీదయిన బట్టలన్నీ రోడ్డుకు దగ్గరగా ఉన్న గోడ మీద ఆరవేశాను.

నేను బయటికి వెళ్ళినప్పుడు, నా స్నేహితుడు నిద్రపోతుండగా కొందరు దొంగలు నా ఖరీదయిన బట్టలన్నీ దొంగిలించారు. నేను గదికి తిరిగి వచ్చినప్పుడు అది గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశాను. కాని వాళ్ళు నా ఖరీదయిన దుస్తులను తెచ్చివ్వకపోగా వాటిని అంత నిర్లక్ష్యంగా రోడ్డుకు దగ్గరగా ఆరవేసినందుకు నన్నే కోప్పడ్డారు. ఏదయినా, నేను జీవితంలో గొప్ప గుణపాఠం నేర్చుకున్నాను. ఎంతో విలువయిన ధనాన్ని అలా ఖరీదయిన దుస్తులకి, వస్తువుల కోసం దుబారా చేయకుండా నిరాడంబరంగా జీవించటం, జాగ్రత్తగా మెలగటం అవసరమని గ్రహించాను.

భవిష్యత్తును గురించి ఎవ్వరూ అంచనా వేయలేరు. “ఈ రోజు జీవించి ఉన్న వ్యక్తి రేపుండడు” అన్నది ఎంత నిజం. నాతో పాటు అద్దె గదిలో ఉండే సోమయాజులు స్నానం చేయటానికి సముద్రపు ఒడ్డుకు వెళ్ళి మళ్ళీ తిరిగి రాలేదు. దురదృష్టవశాత్తూ సముద్రంలో మునిగి చనిపోయాడు. అది నాకు ఎంత దిగ్భ్రాంతిని కలిగించిందో, అంత బాధ కలిగించింది. సోమయాజులు తల్లిదండ్రులు అతని వస్తువులు తీసుకువెళ్ళటానికి వచ్చారు. అతని వస్తువుల్లో దొరికిన ఒక ప్రామిసరి నోటులో నేను అతని దగ్గర 1000 రూపాయలు అప్పు తీసుకున్నట్లుగా ఉంది. అమెరికా వెళ్ళాలి అనే నా ఆశతో డబ్బు తీసుకోకుండానే నేను అతనికి అలా ప్రామిసరి నోటు వ్రాసి ఇచ్చాను. నా మీద ఉన్న స్నేహం కొద్దీ సోమయాజులు తన ధనవంతులయిన స్నేహితుల వద్ద డబ్బు ఇప్పిస్తానని చెప్పటం వలన అమాయకంగా నేను అలా చేశాను. అది విని అతని తల్లిదండ్రులు నవ్వి, ఇంకెప్పుడు అలా అజాగ్రత్తగా వ్యవహరించవద్దు అని చెప్పారు. వాళ్ళకి బాగా తెలుసు. తమ బిడ్డ దగ్గర డబ్బు ఏమీ లేదని. భగవంతుని దయ వలన ఆపద గట్టెక్కింది. దైవఘటనలు ఎంత విచిత్రంగా ఉంటాయి!

రెవరెండు లాజరస్, ఇతర ఉపాధ్యాయులు నేను నా చదువు పట్ల చూపిస్తున్న నిర్లక్ష్యానికి ఎంతో బాధ పడ్డారు. నేను ఎప్పుడూ గాలిలో తేలుతూ ఊహాలోకాల్లో విహరిస్తుండేవాడిని. ఎప్పుడో గాని భూమిపై నిల్చి ఆలోచించేవాడిని కాను. ఇంగ్లీషు భాషలో నేను శ్రద్ధ పెట్టకపోవడం వలన ఆఖరి పరీక్షలో రెండు మార్కులు తక్కువ వచ్చాయి. అందువలన నేను పరీక్షలో తప్పాను. కారణమేమిటో నాకిప్పుడు గుర్తు లేదు గాని నేను క్రిష్టియన్ బిషప్ స్కూలు నుండి శ్రీ అంకితం వెంకట నరసింగరావు కాలేజికి మారాను. అప్పటి నుండి నేను నా చదువు పట్ల బాగా శ్రద్ధ పెట్టాను. రకరకాల

ఇంగ్లీషు గ్రంథాలు చదవటం ద్వారా నా ఇంగ్లీషు భాషా పరిజ్ఞానాన్ని పెంచుకోసాగాను. అదే సమయంలో నాకు తిరునల్‌వేలి జిల్లాలోని సైకాలజీ కళాశాల ప్రొఫెసర్ శ్రీరామస్వామి గారితో పరిచయం జరిగింది. వారే ఆ కాలేజీని స్థాపించారు. వారికి నా అభిరుచులు నచ్చాయి. ఆయన నాకు హిప్నాటిజం, మెస్మరిజం, జబ్బులను నయం చేయటం వంటివి నేర్పించారు. వారికి విదేశాలలో ఎందరో స్నేహితులుండేవారు. అంతేకాకుండా కొంత మంది విదేశీయ విద్యార్థులకు కూడా పరిచయం చేశారు. విదేశాలకు వెళ్ళాలి అనే నా కలలు సాకారం అయ్యేవిధంగా భగవంతుడు నాకు నూతన ద్వారాలు ఈ విధంగా తెరిచిపెట్టాడు.

### అధ్యాయం - 3

# యవ్వనపు కలలు

ప్రొఫెసర్ రామస్వామి గారు 'అకల్ట్' అనే పత్రికకు సంపాదకులుగా పనిచేసేవారు. వారు నన్ను ఎంతగానో ప్రోత్సహించి నా ఆలోచనలకు అక్షర రూపమిచ్చి వారి పత్రికకు వ్రాయమని సలహా ఇచ్చారు. నేను తయారు చేసిన వ్యాసం పంపగానే వారు దానిని తన పత్రికలో "ప్రపంచ శాంతి ప్రార్థన" పేరుతో ప్రచురించటమే గాక దానిని విడిప్రతిగా ముద్రించి ఎంతో దయతో నాకు రెండు వందల ప్రతులు కూడా పంపించారు. అంత చిన్న వయస్సులో నేను చేసిన ఆ ప్రయత్నం నన్ను ఎక్కడో ఉన్నత శిఖరాలలో నిలబెట్టింది. వెంటనే నేను పంపించిన రెండవ వ్యాసాన్ని కూడా వారు ప్రచురించి నా సన్నిహితులకు పంచి పెట్టటానికి మరికొన్ని ప్రతులు నాకు పంపించారు. దీని వలన నేనొక మంచి రచయితను అనే ఆలోచన నాలో స్థిరపడేందుకు దోహదపడింది. డా॥ రామస్వామి గారికి అమెరికా, ఇంగ్లాండులో సైకాలజీ సంస్థల్లో పనిచేసేవారందరితో మంచి సంబంధ బాంధవ్యాలు ఉండేవి. అలాంటి గొప్పవారందరితో నాకు వారి ద్వారా పరిచయం ఏర్పడింది. 'మానసిక జబ్బులను నయం చేయటం' అనే అంశంలో నాలుగు సంవత్సరాలు చదువుకోవడానికి అమెరికాలోని 'నెవాడా సైకిక్ కళాశాల' వారు నాకు విద్యా ఉపకార వేతనం ఇస్తామన్నారు. వెంటనే నేను మరో ఆలోచన లేకుండా స్వదేశంలోని నా చదువు వదలిపెట్టి విదేశాలకు వెళ్ళి చదువుకోవడానికి సిద్ధపడ్డాను.

నా అదృష్టం కొద్దీ పంజాబు సాధు మహాత్ముడు, గొప్ప ఆధ్యాత్మిక వేత్త, కవి అయిన శ్రీ స్వామి రామతీర్థ గారి జీవిత చరిత్ర, వారి రచనలు చదివే అవకాశం లభించింది. ఆయన సాధించిన మహోన్నత స్థితి నాపై ఎంతగానో ప్రభావం చూపింది. ఆధ్యాత్మికంగా నాలో పరిణితి పెరిగింది. ప్రాపంచిక దృష్టి తగ్గిపోయి అంతర్ముఖ దృష్టి పెరిగింది. స్వామి రామతీర్థ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని నేను కూడా అలాగే జీవించాలని నా హృదయం తహతహ లాడింది. నా ప్రతి శ్వాస, ప్రతి పని శ్రీరామతీర్థలాగా మారిపోవాలి. ముఖ్యంగా అమెరికా వెళ్ళి వారిలాగా ఆధ్యాత్మిక ప్రచారం చేయాలని నిశ్చయించుకున్నాను. శ్రీ రామస్వామి గారి పర్యవేక్షణలో హిప్నాటిజంలో శిక్షణ పొందిన నేను నా సన్నిహితులను, స్నేహితులను హిప్నాటిజంతో నిద్రలోకి పంపగలిగేవాడిని. నా మనోబలం వల్ల వస్తువులను గాలిలోకి పైకి లేపగలిగేవాడిని. ప్రాణిక్ హీలింగ్ వంటి శక్తులను ప్రయోగించి చిన్న చిన్న జబ్బులను తలనొప్పి, జ్వరాల వంటి వాటిని కూడా నయం చేయగలిగేవాడిని. నేను పొందిన ఈ శక్తుల ద్వారా నా ఆలోచనలు ఎలా ఉండేవి అంటే అమెరికా వెళ్ళి అక్కడ నెవాడా కాలేజిలో చదువుకొని అక్కడి వారందరి జబ్బులను నయం చేయడానికి నేను అర్హత సంపాదించుకున్నానని భావించేవాడిని.

నా స్నేహితులు, నా తోటి విద్యార్థులు విశాఖపట్టణం సముద్రపు ఒడ్డున నన్ను కలిసేవారు. మేమందరము కలిసి ప్రార్థనలు, ధ్యానం అభ్యసించేవాళ్ళము. నా సూచనలన్నీ వాళ్ళు తు.చ. తప్పకుండా పాటించేవారు. వీరందరి సహాయంతో నేను 'ఎకాడమీ ఆఫ్ రెలిజిన్సు' అనే సంస్థను ప్రారంభించి వారందరిని అందులో సభ్యులుగా చేర్పించాను. వారందరూ చక్కగా సాధన చేస్తుండేవారు. సాధనలో వారి పురోగతిని తెలుసుకోవడానికి వారితో వారి దినచర్యను ప్రతి రోజు వ్రాయించి, అది చదివి సరిదిద్దుతూ వారి ఆధ్యాత్మిక పురోగతికి సహాయపడేవాడిని. వారికి సరయిన అవసరమయిన సలహాలు, సూచనలు ఇస్తూ ఉండేవాడిని. కొన్ని పర్యాయాలు మేమంతా పున్నమి వెన్నెలలో సముద్రపు ఒడ్డున ధ్యానంలోనే గడిపేవారము.

తరుచుగా మేము చాలా ఆలస్యంగా ఇంటికి చేరుకోవటం వలన వారి తల్లిదండ్రులు, పెద్దలు మేమంతా సమయాన్ని వృధాగా గడుపుతున్నామని, లేదా చెడు అలవాట్లకు అలవాటు పడ్డామని అపోహపడేవారు. ఏది ఏమయినా అంత చిన్న వయస్సులో కూడా నా వల్ల ఇతరుల ఆధ్యాత్మిక వికాసానికి ఎంతో మేలు జరిగినందుకు నాకు ఎంతో

సంతోషంగా ఉంది. నా స్నేహితులందరూ పవిత్రమయిన జీవితం గడిపేందుకు తగిన క్రమశిక్షణ అలవర్చుకున్నారు. వారందరికి ఎంతో ఉన్నతమయిన ఆలోచనలతో, దివ్యమయిన జీవనాన్ని అలవాటు చేసుకునేందుకు ప్రేమమయ జీవనాన్ని గడిపేందుకు నేను ప్రేరణ నివ్వగలిగాను.

ఓం తత్ సత్

అధ్యాయం - 4

# చిన్నారి చెల్లులు - ప్రేమమూర్తి నా తండ్రి

ముందుగా నా చిన్నారి చిట్టి చెల్లెలు గురించి చెపుతాను. ఆమె మరణించేటప్పటికి పన్నెండు సంవత్సరముల వయస్సు ఆమెది. చాలా చిన్నది అయినా ఆమెను చూడగానే ఎవరికయినా ఆమె పవిత్రమయిన మనస్సు కలదని, ప్రేమమూర్తి అని తెలుస్తుంది. ఆమె చాలా సమయం పూజ చేస్తూ గడిపేది. అందరు, దేవతలను పూజించినా ఆమెకు రాముడు, కృష్ణుడు అంటే చాలా భక్తి భావన ఉండేది. ఆమె చాలా సున్నితమయిన మనస్సు కలది. మధురంగా మాట్లాడేది. దయార్ద్ర హృదయం కలది. ఎప్పుడయినా ఆమె తల్లిదండ్రులు, పెద్దవాళ్ళు, బంధువులు డబ్బులు ఇచ్చినప్పుడు తన కోసం అవి దాచుకోకుండా వెంటనే నాకు ఇచ్చివేసేది. ఆమె ఇచ్చిన ఆ డబ్బును నేను బాగా దుబారా ఖర్చులకు వాడేవాడిని. స్నేహితుల కోసం, చిరుతిళ్ల కోసం ఖర్చు చేసే వాడిని. ఆ వయసులో నాకు ఆమెను బాగా చూసుకోవాలి అని తెలిసేది కాదు.

ఒక రోజు ఆమె లాంతరు గ్లాసును తుడిచి శుభ్రం చేస్తుండగా అది పగిలి దాని గాజు పెంకులు ఆమె అరచేతిలో బలమయిన గాయం చేశాయి. రక్తం ధారాపాతంగా కారిపోయింది. దాని వలన ఆమె చాలా బలహీనపడిపోయింది. రక్తహీనత ఏర్పడింది. అంతేకాక ఆమె ఊపిరితిత్తుల్లో దాని ప్రభావం పడింది. విశాఖపట్టణం వైద్యశాలలో ఆమెను ఉంచి వైద్యం చేసినా లాభం లేకపోవటం వలన పిఠాపురం తీసుకు వచ్చారు. అప్పటికి నేను కూడా చిన్నవాడినే కావటం వలన ఆమెకు కలిగిన అనారోగ్యం ఎంత ప్రమాదకరమైనదో అర్థం కాలేదు. ఆమె చివరి దినాల్లో ఎప్పుడూ నన్నే కలవరిస్తూ

ఉండేది. అంతగా ఆమె నన్ను ప్రేమించేది. నా కోసం తంతి పంపించారు. కాని నేను సమయానికి చేరుకోలేకపోయాను. నా రాక కోసం ఎదురుచూస్తూ, నా పేరే కలవరిస్తూ నా చెల్లెలు తనువు చాలించింది. నా జీవితాంతం ఈ సంఘటన నన్ను అంతులేని బాధకు గురి చేసింది. నేను ఆమె ప్రేమకు బదులుగా ఎటువంటి సేవలు అందించ లేకపోయాను. ఆమె జీవించి ఉండగా ఆమెకు నేను ఏమి చేయలేదు. ఆమె మరణం తర్వాత ఇంకేమి చేయగలను? అది గ్రహించే సరికి చాలా ఆలస్యం అయిపోయింది. అందువల్లనే ప్రపంచంలోని చిన్నారి చెల్లెళ్ళందరిలో ఆమెను చూస్తున్నాను. ఎంతో అంకిత భావంతో సేవలందిస్తూ అందరినీ ప్రేమిస్తూ, దివ్యత్వాన్ని తనలో నింపుకున్న జ్ఞానేశ్వరి జీవితం నాకు నా చెల్లెలిని గుర్తు చేస్తూ ఉంటుంది. ఆమె నిరంతరము నా చెల్లి లాగే సేవలందిస్తుంటుంది. నాకు ఒక్కోసారి అనిపిస్తుంటుంది, మరణించిన నా చెల్లెలే మళ్ళీ జ్ఞానేశ్వరి రూపంలో తిరిగి వచ్చి ఆ ప్రేమను, సేవలను నాకు అందిస్తోంది కాబోలు అని. ప్రేమైక మూర్తులు, దయగల ఆత్మ స్వరూపులు ఎక్కడ ఉన్నా వారందరూ దైవ సమానులే అవుతారు.

మా తండ్రి గారు కూడా చాలా మంచి వ్యక్తి. వారు నా అమెరికా ప్రయాణానికి అవసరమయిన ధనాన్ని సమకూర్చారు. ప్రతి చిన్న, పెద్ద విషయాలు అన్నింటిలో నా పట్ల ఎంతో శ్రద్ధ వహించేవారు. నేనెప్పుడు ఎలాంటి ఇబ్బంది పడకుండా సౌకర్యవంతంగా జీవించాలని, చదువుకోవాలని ఆశించేవారు. నేను శాంతి ఆశ్రమం స్థాపించిన తరువాత చాలా సంవత్సరములు ఆశ్రమములోనే జీవితం గడిపారు. ఎప్పుడూ ప్రార్థనలతోనూ, ధ్యానంలోనూ కాలం గడిపేవారు. వారి చివరి రోజుల్లో జారిపడి కాలు విరగటం వలన స్వగ్రామం పిఠాపురం వెళ్ళవలసి వచ్చింది. అది చాలా విచారకరమయిన విషయం. వారి చివరి క్షణాలను ఆశ్రమంలోనే గడిపి ఉండాల్సింది. ఈ విషయం తలుచుకుంటే నా కిప్పటికి ఎంతో బాధ కలుగుతుంది. తల్లిదండ్రి తానే అయి నన్ను పెంచి పోషించి, ఆశ్రమంలో సాధువుగా ఉన్న నా పాదాలను కూడా సేవించిన ఆయనను చివరి రోజుల్లో నా బాధ్యతగా ఆశ్రమములోనే ఉంచి సేవలందించడములో నేను ఘోరంగా విఫల మయ్యాను. ఎంతో తెలివి తక్కువగా ఆశ్రమ వాసుల మాటలకే ప్రాధాన్యతనిచ్చి నా తండ్రి గారిని వారి చివరి రోజుల్లో స్వగ్రామానికి పంపివేశాను. ఇప్పుడు నేను అందరిలో నా తండ్రిని చూసుకుంటున్నాను. కాని జరగవలసిన నష్టం జరిగిపోయింది. నా తండ్రి ఆత్మ ఎక్కుడుందిప్పుడు? అది ఎవరిలో ఆత్మగా ప్రకాశిస్తోంది? నాకు తెలియదా! కాని

ప్రతి ఒక్కరిలో నా తండ్రి ఆత్మను దర్శించి పూజిస్తాను. ప్రకృతిని ఆరాధించటమే పరమాత్మ సేవగా భావిస్తాను.

అమెరికా వెళ్ళాలి అనే పిచ్చి కోరికలో అదే ధ్యాసలో పడిపోయి వివేకం కోల్పోయి నా చిన్నారి చెల్లెలి పట్ల నిర్లక్ష్యం వహించాను. అలాగే ఆశ్రమ నిర్వహణలో పడిపోయి సర్వం నేనే అని భావించి ప్రేమించి, చివరిదాకా నా సమక్షంలోనే జీవితం గడపాలి అని భావించిన తండ్రి గారిని బాధ పెట్టాను. ఇప్పటికీ ఇది గుర్తు వచ్చినప్పుడల్లా నా హృదయం బాధతో బరువెక్కిపోతుంది. ఒక్కోసారి ఇలాంటివి సంభవిస్తుంటాయి. విధిరాతను మనం మార్చలేము. కర్మ ప్రభావం చాలా తీవ్రంగా ఉంటుంది. విరిగిపోయిన పాలను గురించి బాధపడి సమయం వృధా చేసుకోవటం అవివేకం. ఇది కూడా అంతే. ప్రపంచాన్ని వదలిపెట్టిన నా చెల్లెలు, తండ్రి ఆత్మలకు శాంతి కల్గుగాక! వారికి ముక్తి కలగాలని ప్రార్థిస్తున్నాను.

ఓం..ఓం..ఓం..

✤✤✤

**అధ్యాయం - 5**

# అమెరికా ప్రయాణము

అమెరికా చాలా దూర ప్రాంతం. నాకేమో వయస్సుతో పాటు ప్రపంచ జ్ఞానం కూడా తక్కువే. అయినా నేను ఎంతో ఉత్సాహంతో నా ప్రయాణానికి సన్నద్ధమయ్యాను. చాలా ధైర్యంగా ఒంటరిగా నా ఏర్పాట్లు చేసుకున్నాను. దూరదేశానికి వెళ్ళాలి అంటే ఎన్నో ఏర్పాట్లు, అలాగే ప్రభుత్వ పరమయిన లాంఛనాలు అవసరమవుతాయి. బ్రిటీష్ ప్రభుత్వం నుండి పాస్‌పోర్టు, వీసా అవసరమవుతుంది. అవి దొరకాలి అంటే బాగా పలుకుబడి ఉన్న పెద్దవారి సహాయ సహకారాలు కావాలి. వాళ్ళు సిఫారసు చేయాల్సి ఉంటుంది. దాని కోసం నా స్నేహితులు, ఉపాధ్యాయులు చాలా సహాయం చేశారు.

నేను మా తల్లిదండ్రులకు జన్మించక ముందు వారు ఒక అమ్మాయిని దత్తత తీసుకున్నారు. తర్వాత ఆమెకు ఒక సంపన్నుల కుటుంబములోని వ్యక్తితో వివాహం

జరిపించారు. ఆమె తన భర్తతో కలిసి వాల్తేరులో ఉండేది. ఆమే నన్ను తన ఇంటిలో ఉంచుకొని చాలా జాగ్రత్తగా చూసుకొని చదివించింది. నా అమెరికా ప్రయాణానికి కూడా ఆ దంపతులిద్దరూ ఎంతో సహాయపడ్డారు.

మా నాన్నగారు మాత్రం నేను దూరదేశానికి అంత చిన్న వయస్సులో వెళుతున్నందుకు ఎంతో విచారించారు. అయినా నా కోసం నా దృఢ సంకల్పం వలన చేసేదిలేక ఒప్పుకున్నారు. ప్రయాణానికి అవసరమయినంత ధనాన్ని సమకూర్చారు. కలకత్తాలో మా బంధువులు నా కోసం స్టీమరులో టికెట్టు కొని సిద్ధం చేశారు.

కలకత్తా చేరుకున్న నాకు అంతా క్రొత్తగా అనిపించింది. స్టీమరులోని కళాసీలు, పనివారు, స్టీమరు నడిపేవారు బెంగాళి వాళ్ళు మరియు ముస్లీములు. వారి భాష నాకు అర్థం కాకపోయినా వారందరూ నా పట్ల ఎంతో ప్రేమ చూపించారు. సముద్రయానంలో కలిగే ఇబ్బందులు, అజీర్తి మొదలైన వాటిని తట్టుకునేందుకు నా స్నేహితులు నాకు అల్లం మొదలయిన ఆయుర్వేద మందులు, పొడులు ఏర్పాటు చేశారు.

ఒకనాడు అర్థరాత్రి మా 'సిటి ఆఫ్ బెనారస్' అనే స్టీమరు కలకత్తా వదలి అమెరికా దిక్కుగా ప్రయాణం మొదలుపెట్టింది. ఆ ఓడలో చాలా కొద్ది మంది ప్రయాణీకులున్నారు. అది కార్గో అవడం వలన నా కేబిన్‌లో నాతో పాటు బెనర్జీ అనే బెంగాలి వ్యక్తి ఉండేవాడు. మా ఓడ కలకత్తా రేవు నుండి కదలగానే నేను 'ఓంకారాన్ని' జపిస్తూ విశ్వశాంతికై ప్రార్థిస్తూ నిదురించాను.

మా కేబిన్‌లో రెండు పడకలుండటం వలన నాతో పాటుగా బెనర్జీ ఉన్నా ఎలాంటి అసౌకర్యము అనిపించలేదు. బెనర్జీ మంచి వాడే కానీ అతనికి మద్యం త్రాగే అలవాటు ఉండేది. అతడు తనతో పాటుగా నన్ను కూడా ఏదో విధంగా మద్యం త్రాగించటానికి ప్రయత్నించి నిరాశ చెందాడు. మద్యపానం దురలవాటున్న వారికి అందరికి ఆ అలవాటు చేయాలని ఉంటుంది. ఒక రోజు అతడు బాగా మద్యం త్రాగిన మత్తులో ఉండి నా గొంతు మీద చేయి పెట్టి గట్టిగా నొక్కిపెట్టి బలవంతంగా నా నోట్లో మద్యం పోయటానికి ప్రయత్నించాడు. అతని భయంకరమయిన చేష్టలకి నేను చాలా భయపడిపోయాను. అదృష్టవశాత్తూ నా చేతికి దగ్గరలోనే కేబిన్ బెల్ ఉండటం వలన దానిని నొక్కగానే దగ్గరలోనే ఉన్న కేబిన్ బోయ్ వచ్చి అతని బారి నుండి నన్ను కాపాడి అతడిని వెంటనే

వేరే కేబిన్‌లోకి మార్చాడు. భగవంతుని దయ వలన నేను ఒంటరిగానే నా కేబిన్‌లో జపధ్యానాదులు చేసుకుంటూ కాలక్షేపం చేశాను.

భగవంతుడు దయామయుడు. తనను ఆర్తితో నమ్మి ఆశ్రయించిన వాళ్ళను అనుక్షణం కంటిరెప్పలా కాపాడుతాడు. అనంతమయిన ఆయన కరుణామృతానికి పదే పదే కృతజ్ఞతలు తెలియచేసుకుంటున్నాను.

నలుబది రోజుల అనంతరము మా ఓడ ప్రతి ముఖ్యమయిన ఓడరేవుల్లో ఆగుతూ చివరికి న్యూయార్క్ పట్టణానికి చేరుకుంది. నేను ప్రకృతి ప్రేమికుడిని అవటం వలన ప్రయాణంలో సూర్యోదయ, సూర్యాస్తమయాలను చక్కగా ఆస్వాదిస్తూ ఆనందంగా గడిపాను. భగవంతుని సృష్టి ఎంత అద్భుతమయిన సౌందర్యంతో ఒప్పారుతుందో గమనించి నా కళ్ళ నుండి ఆనందబాష్పాలు జలజలా రాలాయి. నా హృదయం ఉప్పొంగి పోయింది.

ఓడ ఎల్లిస్ ద్వీపం చేరుకోగానే ప్రయాణీకులందరు వారి సామాన్లు సర్దుకుని హడావుడిగా దిగిపోయారు. నేను ఒక్కడినే ఒంటరిగా మిగిలిపోయాను. కస్టమ్స్ అధికారులు నాకు అమెరికా ప్రవేశించడానికి తగిన అర్హతలున్నాయా అని పరిశీలించడానికి నన్ను అక్కడ ఆపేశారు. చిన్న వయస్సు కారణంగా అప్పుడు నేను చాలా ఒంటరితనం అనుభవించాను. పైగా నా కోసం ఎవ్వరూ రాలేదు. నా విషయం తెలుసుకున్న అమెరికాలోని పత్రికల వాళ్ళు, రిపోర్టర్లు ఎంతో కుతూహలంగా నన్ను కలుసుకుని ప్రశ్నలు అడగడానికి వచ్చారు. నేను అప్పుడే బాల్యం నుండి కౌమారంలోకి అడుగు పెడుతున్న వయస్సులో ఉన్నాను. భారతదేశం వంటి దూరదేశం నుండి నా వయస్సు బాలుడు ఒంటరిగా అమెరికా వంటి దేశానికి రావటం వాళ్ళకి ఆశ్చర్యం కలిగించింది. నా గురించి వార్తాపత్రికల్లో రకరకాల సంచలనాత్మకమయిన వార్తలు ప్రతి రోజు వెలువడుతుండేవి. వాళ్ళు నన్ను రకరకాల ప్రశ్నలు వేసేవారు. వాళ్ళు నన్ను “మీరు రాజ కుటుంబానికి చెందినవారా?” అని ప్రశ్నించారు. “మనమందరము పరమాత్మకు చెందిన వారము. అతని సంతానమే. అలాగే నేను కూడా భగవంతునికి చెందిన రాజ కుటుంబములోని వాడినే” అని చెప్పాను. వారి దృష్టిలో భారతదేశం నుండి కేవలం రాజకుటుంబాలకు చెందిన వారు మాత్రమే అమెరికా వంటి సంపన్న

దేశాలకి వస్తారని భావిస్తున్నారు. అందుచేత వారు నన్ను 'రాజారావుగారు' అని పిలిచేవారు.

వాళ్ళు నన్ను నా గురించి, ప్రత్యేకంగా భారతదేశంలోని ఆచార వ్యవహారాల గురించి, ఆధ్యాత్మిక సాధనల గురించి ఎన్నో ప్రశ్నలు అడిగేవారు. నేను వారందరికి నాకు తోచిన సమాధానాలు చెప్పేవాడిని. ముఖ్యంగా కస్టమ్స్ అధికారాలు నన్ను ఈ ఎల్లిస్ ద్వీపంలో ఆపివేసి అమెరికా దేశంలోనికి ప్రవేశించడానికి అనుమతి ఇంకా ఇవ్వకపోవటం వలన నేను ఎటువంటి నిస్సహాయ స్థితిలో ఉండిపోయానో వివరించాను. కొంతమంది నా పట్ల సానుభూతి చూపించారు. నా కోసం ఆపిల్, కమలాలు వంటి ఫలాలు తెచ్చి పెట్టేవారు.

వార్తాపత్రికల వాళ్ళు ప్రతిరోజు నా గురించి పలు ఆసక్తికరమయిన విషయాలు వ్రాస్తూ ఉండేవారు. నాకిప్పటికీ గుర్తుంది. ఒక న్యూయార్క్ వార్తాసంస్థ ప్రకటించిన వాక్యాలు చాలా ఆసక్తి కలిగించాయి. **"మేము ఆ భారతీయ యువ సన్యాసిని అమెరికా దేశానికి ఎటువంటి సందేశాలను అందించడానికి వచ్చావు అని ప్రశ్నించగా అతడు తన మృదుమధురమైన స్వరంతో విశ్వమానవ కళ్యాణానికై జ్ఞానదీపికను తీసుకువచ్చాను అని చెప్పాడు"** అని వ్రాశారు. ఇప్పుడు ఏభై ఆరు సంవత్సరాల అనుభవజ్ఞానంతో అప్పుడు నేను అలా చెప్పకుండా సత్యాన్వేషణకై వచ్చానని, వాళ్ళకి నేర్పించటానికి కాకుండా అమెరికా వంటి గొప్ప దేశం నుండి నేను నేర్చుకోగలిగిన విలువైన విషయాలను తెలుసుకోవడానికి వచ్చానని చెప్పి ఉండాల్సింది. కాలం గడిచేకొద్దీ ఎవ్వరికయినా ఒక సత్యం బోధపడుతుంది. ఈ ప్రపంచంలో నేర్చుకోవాల్సింది ఎంతో ఉంటుందని, చీకటి నుండి వెలుగులోనికి, అజ్ఞానం నుండి విజ్ఞానంలోనికి ప్రయాణించాల్సి ఉంటుందని.

ఆ రోజుల్లో అమెరికా దేశంలో ప్రవేశించాలంటే ప్రయాణీకులు నూట యాభై అమెరికా డాలర్లు ప్రవేశ రుసుముగా చెల్లించాలి అనే నియమం ఉంది. దాని గురించి ఇమిగ్రేషన్ ఆఫీసర్లు అడిగినప్పుడు నేను వారికి థామస్ కుక్ కంపెనీ వారిచ్చిన రశీదును చూపించాను. అది కేవలం రసీదు మాత్రమే కాని బ్యాంక్ డ్రాఫ్ట్ కాదు. మా ఓడ లండన్‌లో ఆగినప్పుడు నేను ఆ బ్యాంక్ డ్రాఫ్ట్ తీసుకోవాల్సింది. అయితే నా అనుభవ రాహిత్యం వల్ల, చిన్నతనం వల్ల, తొందరలో రశీదు మాత్రం తీసుకున్నాను. కొద్దిసేపు ఆగి ఉంటే వాళ్ళు నాకు ఆ బ్యాంక్ డ్రాఫ్ట్ ఇచ్చి ఉండేవారు. ఆ డ్రాఫ్ట్ ఇచ్చి న్యూయార్క్‌లో

డబ్బు తీసుకోవాలి. ఇవన్నీ నాకప్పుడు తెలియదు. ఆ తర్వాత ఎప్పుడో నేను లండన్‌లో ఉండగా థామస్ కుక్ కంపెనీ వాళ్ళు నాకు ఆ బ్యాంక్ డ్రాఫ్ట్ పంపించి, నేను దాన్ని తీసుకోవటం మర్చిపోయానని తెలియచేశారు.

ఎల్లిస్ ద్వీపంలో అలా ఒంటరిగా ఉండిపోవల్సి వచ్చినందువలన నేను చాలా నిరాశకు లోనయ్యాను. అప్పుడు ప్రఖ్యాత రచయిత 'ఓ.ఎస్. మర్సెడన్' నన్ను వెతుక్కుంటూ వచ్చి నాకు ఎంతో ధైర్యం చెప్పి కాలక్షేపం కోసం వారి రచనలు కొన్ని ఇచ్చి వెళ్ళారు. ఆయన చాలా పొడగరి. మంచి వ్యక్తి. వారి పరిచయం నాకు చక్కని మానసిక ధైర్యాన్నిచ్చింది. ఆయన నాకు తనకు చేతనయిన సాయం చేస్తానని మాటిచ్చారు. భగవంతుని దయ వలన, శ్రీ రామస్వామి గారు వారికి నా గురించి పరిచయ ఉత్తరము వ్రాయటం వలన ఆయన నన్ను చూడడానికి వచ్చారు.

నేను కార్గో ఓడలో ప్రయాణించి రావటం వలన ఎల్లిస్ ద్వీపంలోని ఆఫీసర్లు నన్ను మూడవ తరగతి ప్రయాణికుడిగా భావించారు. వారు నాకిచ్చిన ఆహారం చాలా నాసిరకమయినది. పైగా అవి గొడ్డు మాంసంతో తయారు చేసినవి. అవి తిరస్కరించి నేను అతి కష్టం మీద ఎండిపోయిన బ్రెడ్ ముక్కలు, ఉడికించిన బంగాళాదుంపలు తిని పాలు కలపని కాఫీ త్రాగి కాలం వెళ్ళబుచ్చాను. ఆకలితో అలమటించి పోసాగాను. అది నాకు భయంకరమయిన శిక్షలా ఉండేది. వార్తాపత్రికలు వాళ్ళు అడిగినప్పుడు నేను ఇలాంటి ఆహారం మా దేశంలో కుక్కలు కూడా ముట్టుకోవు అని చెప్పాను. ఆ వార్త వెంటనే పత్రికల వాళ్ళు ప్రచురించినందు వలన ఇమిగ్రేషన్ ఆఫీసర్లు అవమానంగా భావించారు. నేను అక్కడ వాళ్ళని ఇబ్బంది పెట్టి అభాసుపాలు చేసినట్లుగా భావించి నన్ను భారతదేశానికి తిరిగి పంపి వేయాలని భావించారు. అదే సాధ్యమయినంత తొందరగా ఆ పని చేయాలనుకున్నారు.

నా దగ్గర సరయిన పత్రాలు లేవని, అమెరికాలో ప్రవేశించటానికి అవసరమయిన ధనం లేదని కారణాలు చెప్పి ఒక రోజు హఠాత్తుగా నన్ను తిరిగి భారతదేశం పంపుతామని ఇమిగ్రేషన్ ఆఫీసర్లు ప్రకటించారు. నేను వారితో నన్ను అమెరికాలో ఉండనిస్తే వారికి ఎలాంటి భారము ఉండదని, పైగా నాకున్న అతీతశక్తులతో జబ్బులను నయం చేయగలనని నచ్చచెప్పాను గాని ప్రయోజనం లేకపోయింది. నేను అక్కడున్న మిగిలిన రోజుల్లో వారు నాకు కొద్దిగా మంచి ఆహారాన్ని మాత్రం సమకూర్చారు. ఎక్కువగా

కూరగాయలతో కూడిన ఆహారం ఇచ్చేవారు. అలాగే వార్తాపత్రికల విలేకరులు, భక్తి గల మహిళామ తల్లులు నా కోసం కొన్ని మంచి ఫలాలు తెచ్చి పెట్టేవారు. దానితో నా ఆరోగ్యం కుదుటపడింది.

ప్రయాణికులు అమెరికాలో ప్రవేశించటానికి అర్హత లేనపుడు వాళ్ళని వెనక్కి తిరిగి వారి దేశానికి పంపివేయటానికి అవసరమయిన ఖర్చులు అమెరికా ప్రభుత్వమే భరించవలసి వస్తుంది. నా విషయంలో లండన్ లేదా ఇంగ్లాండు వరకే అనుమతి లభించింది. నా తిరుగు ప్రయాణానికి దయతో వాళ్ళు రెండవ తరగతి సౌకర్యాలు కల్పించారు. నేను ఎక్కవలసిన ఓడ నేనిప్పుడున్న ప్రదేశానికి చాలా దూరంగా ఉన్న ఓడరేవు నుండి బయలుదేరుతుంది. అందువలన నన్ను ఒక గుర్రపు బండిలో కూర్చోబెట్టి న్యూయార్క్ నగరం గుండా ఓడరేవు వరకు పంపించారు. అందమయిన న్యూయార్క్ నగరంలోని ఆకాశ హర్మ్యాలను చూచి ఆశ్చర్యపడ్డాను. వాళ్ళు నాకు ముందుగా చెప్పకపోవటం వలన న్యూయార్క్ నగర వీధులలో తిరుగుతున్నప్పుడు వాళ్ళు నాకు న్యూయార్క్ నగర ప్రవేశానికి అనుమతి ఇచ్చారని అపోహపడ్డాను. కాని చివరికి వాళ్ళు నన్ను ఓడలోని క్యాబిన్‌లోకి పంపించినప్పుడు గాని నాకు తెలియలేదు. నన్ను వాళ్ళు వెనక్కి పంపివేస్తున్నారని. నన్ను క్యాబిన్‌లోకి పంపగానే దాని తలుపు తాళం వేశారు. దానితో నేను ఖంగు తిన్నాను. ఆ విధంగా వాళ్ళు చాలా క్రూరంగా నన్ను అమెరికా నుండి తరిమివేశారని అర్థమయింది. నేను ఓడ నుండి తప్పించుకొని పారిపోకుండా వాళ్ళు నేనున్న క్యాబిన్‌కి తాళం వేశారని అర్థమయింది.

ఓడ రేవు నుండి బయలుదేరగానే నా క్యాబిన్ తలుపులు తెరుచుకున్నాయి. నాకప్పుడు వాళ్ళు అన్ని సౌకర్యాలు, మంచి భోజనము ఇచ్చారు. ఎన్నో ఆశలతో, కలలు కంటూ అమెరికా గడ్డపై కాలు మోపాలని బయలుదేరిన నా హృదయం నిరాశా నిస్పృహలతో ఎంతగా క్రుంగిపోయి ఉంటుందో మీరు ఊహించగలరు. నా మాతృభూమికి పేరు తేవాలని, ప్రపంచానికి మేలు జరగాలని, బాధిత హృదయాలకు స్వాంతన చేకూర్చాలని, వారి జబ్బులను నా మానసిక శక్తులతో నయం చేయాలని ఇలా ఎన్నెన్నో కలలు కన్నాను. అవన్నీ ఒక్కసారిగా ఆవిరయిపోయాయి. నన్ను ఒంటరితనం ఆవరించింది. హృదయం బరువెక్కిపోయి చిన్నపిల్లవాడిలా వెక్కి వెక్కి ఏడ్చాను. భగవద్గీతను అందుకొని అది చదువుతూ నెమ్మదిగా మనోధైర్యాన్ని, నిశ్చలత్వాన్ని పొందాను. గౌరవనీయమయిన

జీవితాన్ని గడిపిన అబ్రహం లింకన్ గారి మాటలు నాకు చాలా ఉపయోగపడ్డాయి. సత్యాన్వేషకులకు, ఆయన త్యాగమయ జీవనము, అంకితభావంతో పనిచేసిన విధానము ఎంతో స్ఫూర్తినిస్తాయి. అందుకే నేను ఆయన మాటలకి అంత గౌరవమిస్తాను.

అబ్రహంలింకన్ గారి మాటలను గుర్తు చేసుకున్నాను. "హృదయపు లోతుల్లోని ఒక నూతనమయిన ఉత్తేజాన్ని పొందటానికి ప్రయత్నించు. చిమ్మచీకటిలో కూడా వెలుగు కోసం వెతుకు. నిరాశా నిస్పృహలలో కూడా ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగిపో!" నిజంగానే నేనిప్పుడు నిరాశలో, చీకటిలో, బాధలో కూరుకొనిపోయి ఉన్నాను. అందుకే నేను అలిసిపోయి సొమ్మసిల్లిపోయి నా క్యాబిన్‌లో పడి నిద్రపోయాను. 'మారిటానియా' ఓడలో నా మొదటి రోజు ఆ విధంగా గడిచిపోయింది.

నేను ఎప్పుడూ ఆశావాదుల మాటలను విశ్వసించి ఆరాధిస్తాను. అలాంటి వారు ఎలాంటి పనినయినా తమ జీవితాలను కూడా ఫణంగా పెట్టి అనుకొన్న విజయాలను సునాయాసంగా సాధిస్తారు. అందువల్లనే నేను నెమ్మదిగా నా నిరాశ అనే భూతం వలలోంచి బయటపడి, ధ్యానంలో కాలం గడిపాను. నేను మనస్సులో గట్టిగా నిర్ణయించుకొన్నాను. నేను అమెరికా దేశంలో అడుగు పెట్టడంలో ఘోరంగా విఫలమయ్యాను. కాని తప్పకుండా ఏదో ఒకనాడు విజయం సాధిస్తాను. గొప్ప ఆధ్యాత్మిక వేత్తగా, తూర్పు పడమరల్లోని బాధిత ప్రజలందరికి సేవలందిస్తాను. రోగంతో బాధపడేవారి జబ్బులను నయం చేస్తాను. అబ్రహం లింకన్ గారి వాక్యాలు నా మనస్సులో గొప్ప దృఢ సంకల్పాన్ని కలిగించాయి. "నేను భగవంతుని ముందు ప్రమాణం చేస్తున్నాను. నేను అనుకున్నదానిని సాధించి తీరుతాను" అన్న అబ్రహం లింకన్ గారి మాటలనే నేను కూడా అనుసరించ దలచాను. ఆ వాక్యాలు ఆ మహానుభావుడు తన డైరీలో వ్రాసుకున్నారు. మనలో ఎంతమందిమి మన ఆత్మోన్నతి కోసం డైరీ వ్రాస్తాము? ఎంతమందిమి భగవంతుని ముందు ప్రమాణము చేయగలము, మన బలహీనతలను జయించి విజయం సాధిస్తామని? ఎంతమందిమి పగలు రాత్రి కష్టపడి గొప్ప ఉన్నతస్థితిని పొందగలము?

బానిసత్వం నుండి విముక్తి కలిగిస్తామని అబ్రహంలింకన్ తన అంతరాత్మలో కొలువైయున్న భగవంతుని ముందు నిలిచి చెప్పాడు. అతని దేశాన్ని బానిసత్వపు కోరల నుండి విముక్తి కలిగేలా చేశాడు. బానిసత్వం అనే భయంకరమయిన జాడ్యాన్ని ఆయన

రూపుమాపాడు. భగవంతుని బిడ్డలందరు సమానమే. అలాంటప్పుడు ఒక మనిషిని బానిసగా చేసికొనటం, లేదా అమ్మటం ఎంత భయంకరమయిన పాపము? అందుకే అబ్రహాంలింకన్ తన ప్రాణాలకు తెగించి, అందరి ధిక్కారాలను అణచివేసి తాను భగవంతుని ముందు చేసిన ప్రమాణాన్ని నిలబెట్టుకున్నాడు. ఇనుములా ధృఢ సంకల్పాలు మాహాత్ములు మాత్రమే చేయగలరు. అలాంటి వారు స్వతహాగా మితభాషులై ఉంటారు. వాళ్ళు చిన్న చిన్న విషయాలను పరిగణనలోకి తీసుకోరు. ఇంకొకరి విషయాల్లో తలదూర్చరు. ఒకసారి ఏదయినా సాధించాలి అని సంకల్పిస్తే మాత్రం వారి మార్గానికి కొండలు అడ్డువచ్చినా పిండి చేసి విజయాన్ని సాధించి తీరుతారు. క్రీస్తు తన తండ్రికి ప్రతిజ్ఞ చేసి చెప్పాడు. "ప్రభూ! ఈ భూమిపై నా చివరి రక్తం బొట్టు చిందించి అయినా సరే మోక్ష సామ్రాజ్యాన్ని సాధిస్తాను" అని భగవంతుని సంకల్పాన్నే తన సంకల్పంగా మార్చుకున్నాడు.

బుద్ధ భగవానుడు దుఃఖిత మానవాళిని ఉద్ధరించటానికి కంకణబద్ధుడై నిర్వాణస్థితిని పొందేవరకు కదలనని భీష్మించుకొని కూర్చున్నాడు ధ్యానంలో. ఆ అంతర్జ్యోతిని దర్శించే వరకు నిద్రించలేదు, ఆహారం ముట్టుకోలేదు. శ్రీకృష్ణ భగవాన్ లోక కల్యాణం కోసం, సత్యాన్వేషణ కోసం నిర్వికల్ప సమాధిస్థితిని సాధించి జ్ఞానబోధ గావించారు.

మరి మన ఆదర్శం ఏమిటి? ఎన్నడయినా భగవంతుని ముందు నేను దీనిని సాధిస్తాను అని ప్రమాణం చేశావా? ప్రమాణం చేయటం చాలా తేలిక. కాని దానిని మర్చిపోవటం కూడా అంతే తేలిక. ఒకసారి ఏదయినా నిర్ణయం తీసుకున్నామంటే మనం పగలు రాత్రి కష్టపడి అనుకున్నది సాధించి తీరాలి. ఒక వేళ ఏదయినా ఆటంకం వచ్చినా, ఇబ్బందులు ఏర్పడినా నిరాశ చెందవలసిన పనిలేదు. ప్రయత్నశీలురు తప్పకుండా విజయం సాధిస్తారు. క్రిందికి పడిన ప్రతిసారీ తిరిగి పైకి లేవటానికి ప్రయత్నించాలి. అప్పుడే మన జీవితంలో అపజయం అనేది లేకుండా ముందుకు సాగిపోతాము.

అసలు నీకు ఏమి కావాలి? నీ జీవితంలో ఏమి సాధించాలనుకుంటున్నావు? దాని కోసం ఎలాంటి ప్రణాళికలు రూపొందించుకున్నావు? భగవంతుని ముందు ప్రతిజ్ఞ చేయటానికి ఆలస్యం చేయకూడదు. ఆలస్యం చేయకుండా గొప్ప కార్యాలు సాధించటానికి ప్రయత్నాలు ప్రారంభించాలి. ప్రతి క్షణము ఎంతో విలువయినది. ఆ విషయాన్ని మనం గుర్తించి భగవంతుని సేవలో తరిద్దాము. భగవాన్! మమ్మల్ని ఆశీర్వదించు. జ్యోతికే

పరంజ్యోతివయిన నీ ప్రేమ వెల్లువలో మమ్మల్ని మునిగిపోనీ. నీతో మాకు ఏకత్వాన్ని గుర్తించని, భగవంతుని దిశగా మా ప్రయాణం సాగాలి.

నేను ప్రయాణం చేస్తున్న 'మారిటానియా' ఓడ చాలా పెద్దవాటిలో ఒకటి. 'ఓషియానిక్' ఓడ లాంటిదే. ఈ రెండు ఓడలు కూడా దాదాపు యాభై వేల టన్నుల బరువుంటాయి. అన్నింటికన్నా పెద్దది, పేరున్న 'టిటానిక్' ఓడ తర్వాత ఈ రెండే అంత గొప్పవి. దురదృష్టవశాత్తూ ఐదు వేల మంది ప్రయాణికులతో బయలుదేరిన ఆ 'టిటానిక్' ఓడ సముద్రంలో తేలియాడే ఐసుకొండను ఢీకొట్టి అట్లాంటికా సముద్రం మధ్యలో మునిగిపోయింది. ఏ నిమిషంలో ఏమి జరుగుతుందో ఎవ్వరమూ ఊహించలేము. మరణం ప్రతి ఒక్కరిని ఎప్పుడయినా వరిస్తుంది. పరిణితి చెందిన వారు మరణం ఎప్పుడు, ఏ విధంగా సంభవించినా తయారుగా ఉంటారు. కాని అందరూ జీవించి ఉండాలనే కోరుకుంటారు. కేవలం కొద్ది మంది మాత్రమే మరణానికి భయపడకుండా సంసిద్ధత చూపిస్తారు. సముద్రయానంలో ఓడలు మునిగిపోయి ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మలు శాంతించు గాక! అలాగే ఆ ప్రమాదంలో నుండి క్షేమంగా బయటపడిన వారందరికి కూడా భగవంతుడు తన ఆశీస్సులను, శాంతిని ప్రసాదించుగాక!

నేను అమెరికా వెళ్ళలేకపోయినందుకు చాలా నిరాశ చెందినప్పటికి ఇలాంటి సౌకర్యవంతమయిన పెద్ద ఓడలో ప్రయాణించడం గొప్ప అవకాశంగా భావించాను. ఓడలో ప్రయాణించే వారిలో కొలంబియా విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్రం చదువు కొంటున్న 'బెస్టర్ సోలమన్' అనే యువకుడితో నాకు బాగా స్నేహం ఏర్పడింది. అతను నా పరిస్థితి తెలుసుకుని ఎంతో సానుభూతి చూపించేవాడు. అమెరికా ప్రభుత్వాన్ని, న్యాయసమ్మతంగాని ఇమిగ్రేషన్ నిబంధనలను బాగా విమర్శిస్తూ మాట్లాడేవాడు. అతను అమెరికా తిరిగి వెళ్ళగానే నాకు అవసరమయిన సహాయాన్ని అందిస్తానని, తన పలుకుబడి ఉపయోగించి తిరిగి నేను అమెరికా రావటానికి తగిన ఏర్పాట్లు చేస్తానని మాటిచ్చాడు. అతను ఓదార్పు మాటలకి నేను చాలా సంతోషించాను. అతను టిక్కెట్టు లేకుండా ప్రయాణం చేస్తున్నాడని, అతనితో పాటు వస్తామని చెప్పిన బంధువులు చివరి నిముషంలో ఓడ ఎక్కలేదని, వారి వద్దే టిక్కెట్టు ఉండిపోయిందని చెప్పాడు. ఆ భగవంతునికే తెలియాలి అసలు నిజం ఏమిటో. ఏది ఏమయినా మేమిద్దరము మంచి స్నేహితుల్లాగా మా ఆలోచనలతో పాటు వస్తువులను కూడా పంచుకున్నాము.

ఓడలో మా ప్రయాణం సుదీర్ఘంగా, నిశ్శబ్దంగా సాగిపోయింది. పొగమంచు కారణంగా ఎదురుగుండా వచ్చే ఓడలు కన్పించేవి కావు. అవి మా ఓడను ఢీకొట్టే ప్రమాదం ఉండడం వలన ఆగకుండా సైరన్ మ్రోగిస్తూ ఓడ ప్రయాణించేవి. అయినా కొన్ని ఓడలు మా ఓడను రాసుకుంటూ వెళ్ళేవి. భగవంతుని అనుగ్రహం వలన మాకు ఏలాంటి ఆపద వాటిల్లలేదు.

ఇంగ్లాండులో ప్రవేశించడానికి ఎలాంటి ఇమిగ్రేషన్ నిబంధనలు లేవు. మా పెద్ద ఓడ 'సౌతాంప్టన్' ఓడరేవులో ఆగింది. అక్కడి నుండి మేము లండన్ నగరానికి చేరుకోవాలి. అమెరికా ప్రభుత్వం వారు నాకు సౌతాంప్టన్ నుండి లండన్ వరకు కూడా ఉచిత టికెట్టు ఇచ్చారేమో నాకు గుర్తు లేదు. నా కొత్త స్నేహితుడు బెస్టర్ సోలమన్ నన్ను వదలకుండా వెంబడించడానికి అతని కారణాలు అతనికున్నాయి. నేను అనుభవం లేని చిన్నవాడిని కావటం వలన తేలికగా అతని వలలో పడిపోయాను. నాకు అవసరమయిన సహాయం చేస్తానని అతను చెపుతూ వస్తున్నాడు. లండన్ నగరంలో మేమిద్దరము ఒక గది అద్దెకు తీసుకుని కల్సి ఉన్నాము. అతని ఖర్చు అంతా నేనే భరించేవాడిని. తర్వాత వచ్చే ఓడలో అతని తల్లిదండ్రులు వస్తారని, తర్వాత అమెరికా వెళ్ళి నాకు అవసరమయిన ఏర్పాట్లు అన్నీ చేస్తానని నమ్మకంగా చెప్పేవాడు. కాని అతని బంధువులు ఎవ్వరూ రానేలేదు. అప్పుడు సోలమన్ మరొక కొత్త సలహా ఇచ్చాడు. ఆ పరిస్థితుల్లో నాకు కూడా అది ఇద్దరికి మంచిది అనిపించింది.

సోలమన్ తను అమెరికా వెళ్ళడానికి కావాల్సిన ధనాన్ని ఇవ్వమని తాను అమెరికా చేరుకోగానే మనియార్డర్ ద్వారా ఆ డబ్బు తిరిగి పంపిస్తానని నన్ను అభ్యర్థించాడు. అంతేకాకుండా అతను అమెరికా వెళ్ళగానే నా ఇమిగ్రేషన్‌కి కల్గిన ఇబ్బందులను తొలగించి నేను అమెరికా ప్రవేశించే ఏర్పాటు చేస్తానని కూడా మాటిచ్చాడు. నేనతని మాటలు గుడ్డిగా నమ్మాను. నాకెలాంటి మోసకారుల పట్ల అనుభవం లేదు. అందుకే అతను చెప్పిన మాటలన్నీ నిజమని నమ్మాను. అతనికి కావాల్సిన సహాయం చేశాను. నా డబ్బుతో అతనికి అమెరికాకి టిక్కెట్టు కొనిపెట్టి దారి ఖర్చులకి కొంత డబ్బు కూడా ఇచ్చాను. జాగ్రత్తగా వెళ్ళమని చెప్పి వీడ్కోలు చెప్పాను. అతను వెళ్ళగానే నాకు సహాయం చేస్తాడని ఓపికగా ఎదురుచూసి, ఎదురుచూసి విసిగిపోయాను. అతని వద్ద నుండి ఎలాంటి సహాయం గాని, సమాచారం గానీ నాకు అందలేదు.

ఇంగ్లాండులో ఒక ఆంగ్లో ఇండియన్ అసోసియేషన్ ఉంది. అక్కడి విదేశీ గడ్డపై ఉంటూ కష్టాలు, ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిస్సహాయులయిన భారతీయ విద్యార్థుల సహాయార్థమై దానిని స్థాపించారు. నేను వారిని కలుసుకున్నాను. వారు నాకు తప్పకుండా అవసరమయిన సహాయం చేస్తామని చెప్పారు.

నా అదృష్టం కొద్దీ నా చిన్ననాటి చిరకాల మిత్రుడు వి.వి. గిరిని కలుసుకోవటం జరిగింది. అతడు అప్పుడు లండన్‌లో బారిష్టర్ చదువుతున్నాడు. అతను మొదటి నుండి నా పట్ల ఎంతో ప్రేమ, జాలి, సానుభూతి చూపేవాడు. నా పరిస్థితి తెలుసుకుని చాలా బాధపడ్డాడు. వి.వి. గిరికి 'వరాహ' అనే పేరు కూడా ఉండేది. 'వరాహ' అంటే బంగారమని అర్థం. నా అవసరం తెలుసుకొని వి.వి.గిరి నాకు వెంటనే బంగారు నాణ్యాలు ఇవ్వటంలో ఆశ్చర్యం లేదు. గిరి నాకు చిన్ననాటి నుండి కూడా చాలా మంచి స్నేహితుడు. అతను తన మాతృదేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమయినవి. అవి నాకెప్పుడూ ఆనందాన్ని, బలాన్ని ఇస్తాయి. "నిష్కల్మషంగా పనిచేసేవారికి అన్ని కోరికలు నేరవేర్చబడతాయి" అని స్వామి రామతీర్థ గారు అన్నట్లుగా వి.వి. గిరి జీవిత లక్ష్యం ప్రతిఫలాపేక్ష లేకుండా సమాజ సేవ చేయటం కాబట్టే ఆయనని భారతదేశపు అధ్యక్ష పీఠం వరించటంలో ఆశ్చర్యం ఏముంది?

లండన్‌లో నాకు ఇంకొక బంధువు కూడా ఉన్నాడు అతను కూడా బారిష్టర్ చదువుతున్నాడు. అతడు ఎప్పుడు నన్ను తన మాటలతో నిరుత్సాహ పరుస్తూ అమెరికా వెళ్ళే ఆశ వదలుకోమని, భారతదేశానికి తిరిగి వెళ్ళిపొమ్మని అంటుంటేవాడు. నేను అద్దెకుంటున్న ఇంటి యజమానురాలు నా పట్ల ఎంతో ప్రేమ చూపించేది. తన స్వంత బిడ్డలాగా చూసుకునేది. ఆవిడకి సాధ్యమయినంతగా నన్ను సంతోష పెట్టడానికి ప్రయత్నించేది. ధనవంతుడయిన నా బంధువుని ఆశ్చర్యపరచటానికి నేను అతడిని భోజనానికి ఆహ్వానించాను. నేను మా ఇంటి యజమానురాలిని భారతీయ వంటకాలను సిద్ధం చేయమని కోరగానే ఆవిడ సంతోషంగా ఎంతో మంచి వంటకాలను తయారు చేసింది.

నా బంధువు ధర్మారావు భోజనానికి వచ్చి, ఎంతో రుచికరమైన ఖరీదయిన భారతీయ వంటకాలను చూసి ఆశ్చర్యపడ్డాడు. తన కళ్ళను తానే నమ్మలేకపోయాడు. నేను లండన్ క్రొత్తగా వచ్చాను. నాకు అక్కడ మంచి పరిచయాలుంటాయని, అంత ఖరీదయిన,

రుచికరమైన వంటకాలను తయారు చేయించగలనని అనుకోలేదు. మా ఇంటి యజమానురాలు ఎంతో ప్రేమతో శ్రమపడి చేసిన వంటకాలను అతడు ఏమీ తినలేదు. పైగా అవన్నీ తింటే జబ్బు చేస్తుందని అనడంతో మేము నిరుత్సాహపడ్డాము.

చేయడానికి పని ఏమీ లేదు కాబట్టి పగలు, రాత్రీ నేను లండన్ నగరవీథుల్లో తిరుగుతుండేవాడిని. అప్పుడప్పుడు ధర్మారావు కూడా నాతో కలిసి తిరిగేవాడు. ఆ విధంగా రెండు నెలలు గడిచిపోయాయి. నేను ఒక్కసారి కూడా సినిమాకి వెళ్ళిన గుర్తు లేదు. ప్రకృతి ఆహ్లాదకరమయిన ప్రదేశాలను చూస్తూ నిశ్శబ్దంగా, ఒంటరిగా గడుపుతూ, ప్రశాంతంగా ధ్యానంలో కాలం గడిపేవాడిని. బాల్యం నుండి కూడా నాకు అదే ఆనందాన్ని ఇచ్చేది.

ఆంగ్లో ఇండియన్ సంఘ అధ్యక్షుడు, సెక్రటరి నా మీద ఎంతో ప్రేమ చూపించేవారు. నేను ఒక్కడినే అప్పుడే బాల్యం వీడి కౌమారంలోకి అడుగిడుతున్న ఒంటరి విద్యార్థిని. తరుచుగా వాళ్ళు నన్ను తమతో కలిసి భోజనము చేయటానికి ఆహ్వానించేవారు. నాకు సహాయం చేస్తానని మాటిచ్చి తప్పిన నా స్నేహితుడు చెస్టర్ సోలమన్, ఇంకా ఇతర స్నేహితులు ఎలాంటి సహాయం చేయకపోయినా ఆంగ్లో ఇండియన్ అసోసియేషన్ వారు మాత్రం నా మీద ఎంతో దయతో నన్ను భారతదేశానికి తిరిగి పంపించడానికి 'బరోడా' అనే కార్గో ఓడలో నా ప్రయాణానికి అవసరమయిన ఏర్పాట్లన్నీ చేశారు. అది చాలా సౌకర్యవంతమయిన స్టీమరు. చాలా కొద్దిమంది ప్రయాణీకులనే వాళ్ళు తీసుకెళతారు. నాకు ఈ ప్రయాణం చాలా నచ్చింది. ప్రశాంతంగా, చాలా హాయిగా చాలా కాలం ఓడలో అందమయిన సముద్రాన్ని చూస్తూ గడిపే అవకాశం కల్గినందుకు సంతోషించాను. ఓడలో ఇద్దరు లేదా ముగ్గురు ప్రయాణికులు మాత్రమే ఉండేవారు. చాలా వరకు నేను ఒంటరిగానే గడపవలసి వచ్చేది. నేనప్పుడు ఎంతో స్వేచ్ఛగా, ఆనందంగా అంత పెద్ద ఓడకి యజమానిలాగా భావించేవాడిని.

చాలా సంవత్సరాల అనంతరం, నేను హిమాలయాలల్లో ఉంటున్నప్పుడు నా స్నేహితులు కొందరు న్యూయార్క్‌లో ఉంటున్న సోలమాన్‌ను కలిసారు. అతను అప్పుడు వాళ్ళకి క్షమాపణలు చెప్పి నేను ఇచ్చిన డబ్బును తిరిగి పంపిస్తానని, అప్పుడు తను చేసిన స్వార్థపూరితమయిన పనులకి సిగ్గుపడుతున్నానని చెప్పాడు. కాని నేను అప్పుడు

ఈ భౌతిక ప్రపంచపు పేరు ప్రతిష్ఠలకి, ప్రాపంచిక సుఖాలకి దూరంగా ప్రశాంతంగా హిమాలయాల్లో ధ్యానంలో కాలం గడుపుతున్నాను. ఆ డబ్బుతో నాకు అవసరం ఏముంటుంది? అందుకే తిరస్కరించాను. ఆ సోలమన్ ఏమయ్యాడో నాకిప్పుడు తెలియదు.

నేను బలవంతంగా అమెరికా నెవెడా కాలేజీలో ఉపకార వేతనంతో చదువుకోకుండా వెనక్కి భారతదేశానికి పంపి వేయబడినందువలన నా మనస్సులో విచారం ఏర్పడింది. ఆ నిరాశ నుండి నా మనస్సులో ఏర్పడిన అసంతృప్తిని తట్టుకోవటం కష్టమే అయింది. నా ప్రయాణమంతా అది నన్ను బాధకు, అసహనానికి గురిచేసింది. అది నా మేలు కోసమే జరిగిందో, ఇతరుల మేలు కోసం జరిగిందో తెలియదు.

కాని నేను గట్టిగా నిశ్చయించుకున్నాను. ఏదో ఒక రోజు నేను తప్పకుండా అమెరికా దేశం వెళ్ళి తీరుతాను. కాని ఒక విద్యార్థిగా కాదు. ఒక స్వామీజీగా వెళతాను. ఎవరయితే నిరాశా నిస్పృహలతో క్రుంగిపోతున్నారో వారిలో అసంతృప్తిని తొలగించి వారిలో జ్ఞానజ్యోతి వెలిగించి, వారి ఆధ్యాత్మికోన్నతికి సహాయమందించడానికి వెళతాను. నా తిరుగు ప్రయాణంలో భగవద్గీతను మొదటి నుండి చివరి అధ్యాయం వరకు చదువుతూ నేను మానసిక శాంతిని పొందటానికి ప్రయత్నించాను. అలాగే స్వామి రామతీర్థ గారి జీవితచరిత్ర, వారి బోధనలు ఇంకా ఇతర ఆధ్యాత్మిక గ్రంథాలు చదువుతూ మనోధైర్యాన్ని పెంచుకున్నాను.

ఓడపై భాగంలో ప్రకృతి సౌందర్యాన్ని తిలకిస్తూ, సూర్యోదయ, సూర్యాస్తమయాలను ఆస్వాదిస్తూ ప్రశాంతంగా ధ్యానంలో గడపటం వలన నాలో నూతన ఉత్తేజం కలగడానికి దోహదపడింది. ఓడ కెప్టెన్, ఇతర సిబ్బంది, సేవకులు అందరూ నన్ను చూసి చాలా గౌరవించి ఆదరించేవారు. నాకు కావాల్సిన సహాయం చేసేవారు. నేను మౌనంగా ధ్యానంలో కాలం గడపటం, చాలా చిన్న వయస్సులో అలా గంభీరంగా ఉండటం వాళ్ళకి ఆశ్చర్యం కలిగించింది. నేనున్న పరిస్థితులలో కూడా నా జీవన విధానం ద్వారా నాతో పరిచయము కల్గిన వారందరికీ భగవంతుని దయ వలన శాంతిని ఇవ్వగలిగాను.

**అధ్యాయం - 6**

# భారతదేశానికి తిరిగి రావటం

ఆ ఓడ మద్రాసు రేవుకు చేరుకుంది. కాని నా కోసం ఎవరు వస్తారు? నా ఒంటరితనం నన్ను వదలకుండా వెంబడించింది.

విధిలీలలు విచిత్రంగా ఉంటాయి. భవిష్యత్తులో ఏమి జరుగుతుంది అని ఎవ్వరూ ఊహించి చెప్పలేరు. తెలివితక్కువ పిల్లవాడిలాగా నేను నా ధనాన్ని అయోగ్యులకు దానం చేసి చేతిలో చిల్లిగవ్వ లేకుండా తిరిగి వచ్చాను. లోకజ్ఞానం లేకపోవటం వల్లనే నా విషయంలో అలా జరిగింది. ఇప్పుడు ఏభై ఐదు సంవత్సరాల తర్వాత కూడా నాడు నేను దీనంగా, అనుకున్నదానిని నెరవేర్చుకోలేని నిస్సహాయస్థితిలో, ఒంటరిగా ఏమీ సాధించలేక, అన్నింటా విఫలుడనయి పిఠాపురం తిరిగి వచ్చిన వైనం గుర్తుకొస్తుంది. అమెరికాలో మానసిక వైద్య శాస్త్రాన్ని చదువుకొని గర్వంగా తిరిగి రావల్సింది. కాని అలా జరగలేదు. అన్నివిధాలుగా నా ప్రయత్నాలు విఫలమయ్యాయి.

నా కోసం పిఠాపురం రైలు స్టేషనులో స్వాగతం చెప్పటానికి ఎవ్వరూ రాలేదు. నాతో పాటు చదువుకున్న వారు కాని, నాకు ఎంతో ప్రీతిపాత్రులయిన నమ్మకమయిన స్నేహితులు కూడా కనబడలేదు. నా తండ్రి గారు మాత్రం నా రాక కోసం దీనమయిన ముఖంతో ఎంతో ఆత్రుతతో ఎదురుచూస్తూ కనిపించారు. నేను నా కోటు మార్చుకొని భారతీయ ధోతి కట్టుకోవాలని అనుకున్నాను కాని, అది నా పెట్టెలో ఉండిపోయింది. అందువలన నేను విదేశీయుడిలాగా కోటు, బూటుతో దిగవలసి వచ్చింది. మానసిక వైద్యుడిగా తిరిగి రావాల్సిన నేను అలా నా స్వదేశానికి రావటం నాకు సహించరాని బాధగా మిగిలిపోయింది.

నేను తిరిగి వచ్చిన విషయం తెలిసిన నా కాలేజి స్నేహితులు, చిన్ననాటి స్నేహితులు అలాగే నేను స్థాపించిన 'ఏకాడమీ ఆఫ్ రెలిజిన్స్' సంస్థలోని సభ్యులు అందరూ నాకు హార్ధిక స్వాగతం చెప్పటానికి మా ఇంటికి వచ్చారు. వారందరి దృష్టిలో నేను గొప్ప హీరో అయిపోయాను. సప్త సముద్రాలు దాటి న్యూయార్క్ నగరంలో ప్రవేశించటం, అలాగే ఎల్లిస్ ద్వీపంలో, లండన్‌లో కొద్ది రోజులు గడపడం వలన నేను గొప్ప సాహసవీరుడిలా కనిపించాను వాళ్ళకి.

నా స్నేహితులందరు చాలా అల్లరిపిల్లలు. నేను స్నానం చేయటానికి వెళ్ళగానే నా కోటు జేబులోంచి ట్రంకు పెట్టె తాళం చెవులు తీసి పెట్టి తెరిచి వాళ్ళ కోసం నేను ఏమి వస్తువులు తెచ్చానో అని వెదకటం మొదలు పెట్టారు. నా బట్టలు, కాగితాలు అన్నీ చిందరవందర చేశారు. తర్వాత నేను వాళ్ళందరికి కొన్ని పుస్తకాలు, శాంతి ప్రార్థన కాగితాలు పంచి పెట్టాను. అప్పటికి ఇంకా నేను ఎంతో స్ఫూర్తిదాయకమైన 'విశ్వశాంతి ప్రార్థన' వ్రాయలేదు. అయినా నా దగ్గర ఎప్పుడూ వాళ్ళకు ఇవ్వటానికి ఏవో కొన్ని వాక్యాలతో కూడిన ప్రార్థన గీతాలుండేవి. భక్తులకు సహాయం చేయడానికి ఆ భగవంతుని అనుగ్రహం ఎల్లప్పుడూ నా మీద ఉండేది.

నేను మానసిక వైద్య శాస్త్రాన్ని అమెరికాకు వెళ్ళి చదువుకోవటంలో ఘోరంగా విఫలమయినప్పటికి, నాలో ఆ స్ఫూర్తి, ఉత్సాహం ఏ మాత్రం తగ్గలేదు. భవిష్యత్తులో అలాంటి అవకాశం కోసం నేను ఎదురుచూస్తున్నాను. నేను తప్పకుండా ఏదో ఒక రూపంలో ఇతరుల మానసిక సమస్యలను, బాధలను, జబ్బులను తగ్గించటానికి ప్రయత్నించేవాడిని. నేనింకా చిన్న వయస్సులోనే ఉన్నా సోమరిగా, ఏ పని చేయకుండా సమయం వృధా చేసేవాడిని కాదు. క్రిందికి పడిన ప్రతి సముద్ర కెరటం మళ్ళీ ఉవ్వెత్తున పైకి ఎగిసిపడుతుంది. ప్రతి చీకటి రాత్రిని చీల్చుకుంటూ మళ్ళీ అరుణోదయం అవుతుంది. జీవితంలోని ప్రారంభదశలోనే నాకు ఎదురయిన చేదు అనుభవము, ప్రతికూలత, బాధ నుండి బయట పడడానికి నేను మరింతగా ఆధ్యాత్మిక గ్రంథ పఠనంలో లీనమయ్యాను.

అంతేకాకుండా నాకు తెలిసిన కొద్దిపాటు అనుభవంతో నేను తెలుసుకున్న ఆధ్యాత్మిక విషయాలను నా స్నేహితులకు చెపుతూండేవాడిని. భగవద్గీత, ఉపనిషత్తుల గురించి వారికి బోధిస్తుండేవాడిని. జీసెస్ క్రీస్తు పవిత్ర జీవనము కూడా నాకు ఎంతో ప్రేరణనిచ్చేది. వీటన్నింటి వలన నేను నా స్నేహితులందరికి గురువుగా మారాను. నా పాత స్నేహితులతో పాటు అనేక మంది క్రొత్త వారు నా చుట్టూ చేరి నేను బోధించే ఆధ్యాత్మిక విషయాలను ఎంతో ఆసక్తిగా వినేవారు. వీరంతా నన్ను తమ ఆధ్యాత్మిక గురువుగా భావించేవారు. అంతేకాక మెస్మరిజం, హిప్నాటిజం పట్ల నాకున్న అవగాహనతో అనేకమంది మానసిక సమస్యలను, చిన్న చిన్న రోగాలను నయం చేసేవాడిని. అది భగవంతుని ఆశీర్వాదమా? లేదా నేను గడిపే పవిత్రమయిన ఆధ్యాత్మిక జీవనం వలన కలిగిన మనఃశక్తి బలమో నాకు తెలియకపోయినా ఎందరో బాధితులకు, రోగులకు ఈ విధంగా సహాయపడు తున్నందుకు నాకు చాలా ఆనందము, సంతృప్తి కలిగింది.

ఇతరులకు సహాయపడటం చాలా మంచి విషయం. అయినా కేవలం నా మనోశక్తితో ఇతరుల జబ్బులను నయం చేయటమే కాకుండా నేను ఏదయినా వైద్యవిద్యలో ప్రావీణ్యం సంపాదించుకోవటం మంచిది అని నాకు అనిపించింది. నా చిన్ననాటి స్నేహితుడు డా॥ గోవిందరాజు, విజయవాడలో పేరు ప్రఖ్యాతులు గడించిన సర్జను, కలకత్తాలో వైద్య విద్య చదువుతుండేవారు. నన్ను కూడా కలకత్తాలోని ప్రముఖ వైద్యకళాశాలలో హోమియోపతి వైద్యవిద్యలో చేరమని సలహా ఇచ్చారు. అది ఐదు సంవత్సరాల చదువు. నాకు చాలా సంతోషం అనిపించింది. చక్కగా చదువుకొని డిగ్రీ సంపాదించుకొని పేదలకు, బాధల్లో ఉన్న వారికి సేవ చేసే అవకాశము లభించనున్నది. మా తండ్రి గారు కూడా ఎంతో సంతోషించి చదువుకు అవసరమయిన ధనాన్ని సమకూర్చారు. నేను కలకత్తాలో ఉండే మా బంధువుల సహాయంతో కాలేజీలో చేరాను. పిఠాపురంలో నేను బయలు దేరేటప్పుడు నా స్నేహితులు, సన్నిహితులు రైల్వేస్టేషనుకు వచ్చి నాకు ఘనంగా వీడ్కోలు చెప్పారు. ఆ విధంగా కలకత్తాలో ఒక హోమియోపతి విద్యార్థిగా నా కొత్త జీవితం ప్రారంభమయ్యింది. డా॥ గోవిందరాజులు గారికి, నా స్నేహితులకు, బంధువులకు, మళ్ళీ ఇంకొక కొత్త అవకాశం అందించిన దైవానికి నా కృతజ్ఞతలు తెలియచేసు కుంటున్నాను.

నా అంతఃశక్తి, నాలో అణగివున్న ఆత్మశక్తి బహిర్గతమయి నాతో ఏదో ఒక మంచి పని చేయించటానికి, ఒక మంచి వ్యక్తిగా నన్ను తయారు చేయటానికి నా జీవన విధానం ద్వారా నా కుటుంబానికి, నా ప్రాంతానికి, నా దేశానికి, యావత్తు ప్రపంచానికి మేలు జరగటానికి ప్రయత్నిస్తోంది. తద్వారా అందరికి మేలు జరుగుగాక!

డా॥ గోవిందరాజు కలకత్తా రైల్వేస్టేషనుకు వచ్చి నన్ను బంధువుల ఇంటికి తీసుకువెళ్ళాడు. నేను వారింట్లోనే ఉండి హోమియోపతి వైద్య కళాశాలకి రోజు వెళ్ళేవాడిని. డా॥ గోవిందరాజు గారు నన్ను ఏదో ఒక విధంగా వైద్యుడిగా చేయాలని సంకల్పించారు. అందుకే హోమియోపతి వైద్య కళాశాల ప్రధానోపాధ్యాయులకు, ఇతర ఉపాధ్యాయులకు, అక్కడి వైద్యులకు నన్ను పరిచయం చేశారు. నేను అంత చిన్న వయస్సులోనే అమెరికా వంటి దేశానికి వెళ్ళి వచ్చానని తెలుసుకుని వారు ఎంతగా ఆశ్చర్యపడ్డారంటే, అది ఒక సంచలన వార్తగా మారింది. వైద్యశాలలోని ఉపాధ్యాయులందరూ నా పట్ల ప్రత్యేకమయిన గౌరవాభిమానాలు చూపించేవారు.

మా బంధువుల ఇల్లు చాలా చిన్నది. పైగా ఇరుకుగా ఉండే బజారులో ఉండేది. మేడ మీద చిన్న గది నా కోసం కేటాయించారు. అక్కడి నుండి చూస్తే కలకత్తా నగరంలోని చిన్న పెద్దా ఇళ్ళన్నీ కనిపించడం వలన నాకు అది బాగానే ఉండేది. కాని నా మనస్సుకి ఆ ఇరుకు వీధిలోని చిన్న ఇంట్లో మేడ మీద చిన్న గదిలో ఉండటానికి అసౌకర్యంగా అనిపించేది. చక్కని అందమయిన తోట, చుట్టు సరస్సులు, రకరకాల పూల మొక్కలు అలాంటి ఆహ్లాదకరమయిన ప్రకృతి సౌందర్యానికి నిలయమయిన ప్రదేశంలో నివసించాలని నా మనస్సు ఉవ్విళ్ళూరుతుండేది.

సెలవులు వచ్చినప్పుడు కలకత్తా నగరం చుట్టు ప్రక్కల అలాంటి సుందరమయిన ప్రదేశాలను వెదుకుతూ ఉండేవాడిని. నగరానికి దూరంగా ఉన్నా కొంచెం తక్కువ ఖరీదుకి అద్దెకు ఇల్లు దొరుకుతుందేమోనని ఆశించేవాడిని. నిస్స్వార్థంగా కోరే కోరికలు తప్పకుండా ఫలిస్తాయి అన్నట్లుగా నేను కోరుకున్న విధంగా ఒక చిన్న గది నాకు అద్దెకి దొరికింది. ఒక పెద్ద తోట బంగళా వారి పనివాడి ఇంట్లో నాకు ఒక గదిని అద్దెకి ఇవ్వడానికి అంగీకరించాడు. అతను ఆ బంగ్లాను, తోటను సంరక్షణ చేస్తూ ఉండేవాడు. నేనక్కడ చాలా స్వేచ్ఛగా, ఆనందంగా తోటంతా తిరుగుతూ ప్రకృతిని ఆస్వాదిస్తూ, ధ్యానంలో కాలం గడిపేవాడిని. ప్రకృతి ఒడిలో నాకు ధ్యానంలో ఎంత నిశ్చలత, ప్రశాంతత లభించేవి. అక్కడి నుండి నేను రైలులో రోజు నా హోమియోపతి వైద్య కళాశాలకు వెళ్ళి వచ్చేవాడిని.

కొంతకాలం తర్వాత నేను తరచుగా దక్షిణేశ్వరము లాంటి పవిత్ర స్థలంలో, ఎక్కడయితే శ్రీ రామకృష్ణ పరమహంస వంటి అవతార పురుషులు సాధనలు చేశారో అక్కడ నిశ్శబ్దంగా ఒంటరిగా ధ్యానంలో కాలం గడిపేవాడిని. అలాగే బేలూరు మఠాన్ని కూడా తరచుగా దర్శించేవాడిని. అక్కడ నేను గంటల కొద్ది కాలం తెలియకుండా గాఢంగా ధ్యానంలో లీనమయ్యేవాడిని. కలకత్తాలోని 'బొటానికల్స్ గార్డెన్స్' భారతదేశంలోనే అందమయిన ఉద్యానవనంగా పేరుపొందింది. చాలా సుందరమయిన తోటలు, పూలమొక్కలు ఉండేవి. నాకు హోమియోపతి వైద్యకళాశాలకి వెళ్ళటం కంటే అలాంటి ప్రకృతి రమణీయమయిన, మనస్సుకు ఆహ్లాదాన్నిచ్చే అలాంటి నందనవనాల్లో ధ్యానం చేసుకోవటం వలన చాలా ఆనందంగా ఉండేది.

నేను నివసిస్తున్న తోట బంగ్లాకి సమీపంలో ఒక ముస్లీం స్నేహితుడు నాతో ఎంతో సన్నిహితంగా, స్నేహంగా మెలిగేవాడు. అతను తరచుగా నన్ను ప్రేమగా వాళ్ళింటికి ఆహ్వానించేవాడు. అక్కడ మేమిద్దరము సర్వమత సిద్ధాంతాల్లోని సామ్యతను గూర్చి, ప్రార్థనలను గురించి చర్చించుకునేవాళ్ళము. నా కోసం అతడు ప్రత్యేకంగా కూరగాయలతో బిర్యానీ తయారుచేయించి పెట్టేవాడు. నా పూర్వజన్మ సుకృతము వలన భగవంతుడు నాకు ఎల్లవేళలా దయతో విశ్వప్రేమ గల హృదయాన్నిచ్చాడు. అందువల్లనే బాల్యం నుండి నేను ఎల్లప్పుడు అందరిలో జాతి, మతము, కులము, దేశము లాంటి భేదభావాలు లేని ప్రేమమయుడయిన భగవంతుడినే దర్శించగల్గుతున్నాను.

నేను నివసిస్తున్న ఆ పెద్ద అందమయిన తోటలో పెద్ద పెద్ద వృక్షాలు, చెరువులు, పూలమొక్కలుండటం వలన విపరీతంగా దోమలుండేవి. అవి కుట్టడం వలన నాకు మలేరియా జ్వరం వచ్చింది. అది తెలుసుకున్న నా తండ్రి గారు, నా స్నేహితులు ఎక్కడో దూర ప్రాంతంలో అనారోగ్యంతో ఒంటరిగా ఉండటం ఇష్టపడక నన్ను తిరిగి వచ్చి వేయమని చెప్పారు.

నా చిన్ననాటి స్నేహితుడు రంగాచారి, స్టేషన్ మాస్టారుగా పనిచేస్తూ అతని నెల జీతం నుండి ప్రతినెలా నా చదువు కోసం డబ్బు పంపించేవాడు. అతని గురించి చెప్పకపోతే నా కలకత్తా విద్యార్థి జీవితం అసంపూర్తిగా అనిపిస్తుంది. నేను కొందరు స్నేహితుల ద్వారా విన్నాను. రంగాచారి నా కోసం డబ్బు పంపించి తాను తన భోజనానికి కూడా చాలా ఇబ్బంది పడేవాడని, ఒక్క పర్యాయం గంజినీళ్ళతో సరిపెట్టుకునేవాడని. అది తెలిసుకుని నా హృదయం అతని పట్ల కృతజ్ఞతాభావంతో ద్రవించిపోయింది.

అలాంటి స్వార్థం అణువయినా లేని ప్రేమమూర్తులయిన స్నేహితులుండటం ఎంతటి సౌభాగ్యం. స్నేహితుని కోసం తన రోజువారి తిండి తిప్పలను కూడా త్యాగం చేయ గలగటం సామాన్యమయిన విషయం కాదు. అలాంటి స్నేహితుడు దొరకటం వలన నా జీవితం ధన్యమయింది.

లోకాసమస్తా సుఖినోభవంతు

ఓం తత్సత్ ఓం

**అధ్యాయం - 7**

# జబ్బులను నివారించటం

భౌతికమయిన దేహం అద్దె ఇల్లు వంటిది. దానికి నెల నెలా మనం అద్దె చెల్లించుకోవాల్సి ఉంటుంది. అది సామాన్యుడయినా, సాధువయినా తప్పదు. జాగ్రత్త వహించకపోతే ఒక్కోసారి అమూల్యమయిన మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వస్తుంది. నాకు వచ్చిన మలేరియా జ్వరం రోజు రోజుకి పెరిగిపోయి పెద్ద మహమ్మారిగా తయారయ్యింది. మొదట్లో నేను సరయిన మందులు వాడి జాగ్రత్తగా ఉంటే అలా జరిగి ఉండేది కాదు. మా తండ్రి గారు, స్నేహితులు ఇంటికి తిరిగి రమ్మని చెప్పటం వలన, నాకు కూడా చదువు మీద పెద్దగా ఆసక్తి లేకపోవటం వలన, నా వస్తువులు, పుస్తకాలు, బట్టలు అన్నీ నా అద్దె గదిలోనే వదలిపెట్టి గదికి తాళం వేసి నాకు గదిని అద్దెకిచ్చిన మాలికి దాన్ని అప్పగించి ఇంటికి తిరిగివచ్చాను. నా ముస్లీం స్నేహితుడికి, ఇంకా ఇతరులకు వీడ్కోలు చెప్పాను. వాళ్ళతో మళ్ళీ తిరిగి వస్తానని చెప్పాను. క్షేమంగా భగవంతుని దయ వలన పిఠాపురం చేరుకున్నాను.

నాకు మందులు వాడటం ఇష్టం ఉండదు. కొన్ని మందులు నిజంగానే దుష్ఫరిణామాలు కలుగచేస్తాయి. మనకి నిజంగా, చక్కగా వ్యాధి నివారణ జరగాలంటే ప్రకృతి వైద్యంపై ఆధారపడటం మంచిదని నా అభిప్రాయం. దాని వలన ఎలాంటి చెడు ప్రభావం ఉండదు. వ్యాధిని సమూలంగా నయం చేస్తుందని నేను క్యూరింగ్‌టన్ మరియు ఇతరుల అనేక గ్రంథాలను అధ్యయనం చేసి తెలుసుకున్నాను. ఆవిరి తొట్టిలో స్నానం, నూనె మర్దనలు, మట్టి పట్టీలు వేయటం, అంతేకాకుండా చాలా ప్రత్యేకమయిన ఆహార విధానాలు ఇవన్నింటి ద్వారా నాకు వచ్చిన మలేరియా జ్వరం నయం అవుతుందని నా విశ్వాసం. అయితే దీనికి చాలా ఎక్కువ సమయం తీసుకుంటుందని నా స్నేహితులు, బంధువులు నన్ను నిరుత్సాహపర్చినప్పటికి అంత తీవ్రమయిన జ్వరంతో బాధపడుతున్నా నేను ప్రకృతి వైద్యానికే ప్రాధాన్యం ఇచ్చాను. నా ధృఢ సంకల్పానికి భగవంతుని ఆశీస్సులుంటాయి అని ఋజువయింది.

రోజురోజుకి నా ఆరోగ్యం మెరుగుపడి నాలో నూతనోత్సాహం కల్గసాగింది. నేను ఎక్కువగా అంతర్ముఖుడనయి ధ్యానంలో, ప్రార్థనలో కాలం గడపసాగాను. సాయంసంధ్య

వేళలో, అలాగే ఒక్కోసారి అర్థరాత్రి వరకు నేను నడక సాగించేవాడిని. నాతోపాటు నా సన్నిహిత స్నేహితులు నన్ను అనుసరించేవారు. నా జీవన విధానము, సాధారణంగా ప్రవర్తించే విధానము గమనిస్తున్న నా శిష్యులే కాకుండా మిగతా వారందరిపైనా ఆ ప్రభావం పడిందని చెప్పవచ్చు. నా జీవితాదర్శము అందరికీ సేవ, శాంతి అందించటమే.

తరచుగా జబ్బుతో బాధపడేవారు వారి వ్యాధి నివారణ కోసం నా దగ్గరికి వస్తుండేవారు. నా ప్రార్థనల ద్వారా, నా మనశ్శక్తి ద్వారా వారి జబ్బులు నయమయ్యేవి. పవిత్రమయిన ఓంకారాన్ని జపిస్తూ మంత్ర జలాన్ని వారికిచ్చేవాడిని. దానికి తోడు నాకున్న మెస్మరిజము, హోమియోపతి వైద్యవిధానం కూడా దానికి తోడయ్యేవి. మంచి ఆరోగ్యము, మనోబలము, రోగ నివారణ కలగాలి అంటే భగవంతుని శరణాగతి పొందాలని నేను వారికి బోధించేవాడిని. ఈ విధంగా అనుకోకుండానే నేను ఒక ఆధ్యాత్మిక వైద్యుడిగా, రోగనివారణ చేసేవాడిగా అందరిలో గుర్తింపు పొందాను. నా వద్దకు వచ్చిన వారందరూ వారి జబ్బులు నయం కావటం వలన ఉపశమనం పొంద గలిగేవారు.

భగవంతుని లీలలు బహు విచిత్రంగా ఉంటాయి. ఆయన తన దివ్యత్వాన్ని లోకానికి చాటి చెప్పటానికి తన బిడ్డల్లో కొందరిని ఎన్నుకుంటాడు. వాళ్ళు ఏమి తెలియని అమాయకులయినా, బలహీనులయినా తన పనికి వారిని ఉపయోగించుకుంటాడు. పవిత్రమయిన బైబిల్ గ్రంథంలో దేవుని బిడ్డ అయిన క్రీస్తు భూత ప్రేత పిశాచులు ఆవరించి రోగాలతో బాధపడుతున్నవారి జబ్బులను నయం చేశాడని చదువుకున్నాము. భగవంతుని ఆశీర్వాదము వలన నేను కూడా ఆ రోజుల్లో నా దగ్గరికి వ్యాధులతో వచ్చేవారి బాధలను పోగొట్టగలిగేవాడిని.

నా పురాకృత కర్మ ఫలితంగా యాదృచ్ఛికంగా మరొక సంఘటన జరిగింది. మా గ్రామానికి సుమారుగా ఎనిమిది మైళ్ళ దూరంలో చెందుర్తి అనే గ్రామంలో ఒక తాంత్రికుడుండేవాడు. అతను తనకున్న తాంత్రిక శక్తులతో వందలాది మంది రోగుల జబ్బులను నయం చేయటమే కాక భూతప్రేత పిశాచాలు ఆవరించిన వాళ్ళకు కూడా భూత వైద్యం చేసేవాడు. అతను నా గురించి తెలుసుకుని నన్ను కలుసుకోవటానికి పిఠాపురం వచ్చాడు. అతను చేస్తున్న వైద్య విధానం నన్ను కూడా ఆకర్షించటం వలన అతని కోరిక మేరకు నేను నా శిష్యవర్గంలోని కొందరు స్నేహితులతో కలిసి అతని

గ్రామానికి వెళ్ళాను. అతని వద్ద నుండి రోగాలు నయం చేయటం, భూతాలను పారద్రోలటం మొదలైన విద్యను నేర్చుకుని ప్రపంచానికి సేవ చేయాలనే నా ఆకాంక్షను నెరవేర్చుకోవాలని భావించాను. ఆ విధంగా నా చిరకాల వాంఛితమయిన విశ్వశాంతి, విశ్వమానవ సేవ, ప్రపంచానికి వెలుగు చూపి మార్గదర్శనం చేయగల అవకాశం లభిస్తోందని ఆనందపడ్డాను.

చెందుర్తికి చెందిన తాంత్రికుడు ఆ ఊరికి కరణంగా పనిచేసేవాడు. అతని వద్దకు వైద్యం కోసం జనం గుంపులుగా వచ్చేవారు. గుర్రపు బగ్గీలలో, ఎడ్లబళ్ళ మీద, ఇంకా అనేకమంది కాలినడకతో అతని వద్దకు వైద్యం కోసం వచ్చేవాళ్ళు. ఆయన మంత్రజలం ఇచ్చి, వారిని తాకగానే వారు ఎంతో ఉపశమనం పొందేవారు. అయితే చెందుర్తి గ్రామ ప్రజలు మాత్రం అతని తాంత్రిక విద్యలన్నీ బూటకంగా భావించి దగ్గరలోని వైద్యశాలలకి, మంచి వైద్యుల దగ్గరికి వైద్యం కోసం వెళ్ళేవారు. అలాంటి పరిస్థితుల్లో చెందుర్తి కరణం గారు నన్ను అతని గ్రామానికి తీసుకువెళ్ళాడు. అతని దగ్గరికి వైద్యం కోసం వచ్చేవాళ్ళలో నూటికి తొంభై తొమ్మిది మంది ఆడవారు, చిన్నపిల్లలు చదువు సంధ్యలు లేనివారే అయి ఉండేవారు. మగ వాళ్ళెప్పుడూ అతని వద్దకు వైద్యం కోసం వచ్చేవారు కారు.

ఒకసారి కాకినాడలోని గొప్ప ధనవంతుని భార్యని భూతం ఆవహించి పిచ్చి చేష్టలు చేస్తూ కుటుంబమంతా బాధపడుతుండగా మమ్మల్ని పిల్చుకొని వెళ్ళారు. భూతం పట్టిన వాళ్ళని చూడడం నాకు మొదటిసారి అవటం వలన నేను చాలా భయపడ్డాను. అయినా ధైర్యంగా తాంత్రికుడి పక్కన కూర్చున్నాను. ఆయన ఎదురుగా కూర్చొన్నప్పుడు భూతం ఆవహించిన ఆ ఇల్లాలు ఆయన చెప్పిన మాటలు విని బుద్ధిగా, నెమ్మదిగా, మాట్లాడకుండా ఉండేది. కాని మేము వాళ్ళింటికి వెళ్ళినప్పుడు పరిస్థితి అందుకు చాలా భిన్నంగా ఉంది. ఆమె పెద్దగా ఏడుస్తూ, స్తంభం పట్టుకుని నాట్యం చేస్తూ గందరగోళం సృష్టిస్తూ ఉంది. తాంత్రికుని ఎదుట మాత్రం మౌనంగా కూర్చుంది. అది చూచి ఆమె కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.

చెందుర్తి గ్రామ ప్రజలు మాత్రం ఆ తాంత్రికుడు రోగుల జబ్బులను నేను అతనితో ఉండటం వలన నయం చేయగల్గుతున్నాడు అని నమ్మేవారు. ఆ తాంత్రికుడు నన్ను భూతం పట్టిన వాళ్ళందరి దగ్గరికి, దాన్ని వదిలించడానికి తీసుకువెళ్ళేవాడు. కిర్లంపూడిలో ఒక ధనికుని ఇల్లాలికి భూతం పట్టి పీడించసాగింది. ఆయన భూతవైద్యుడి కోసం, నా

కోసం ఒక పల్లకీ పంపించాడు. పన్నెండు మైళ్ళ దూరంలోని కిర్లంపూడి దాకా మమ్మల్ని పల్లకిలో మోయటానికి ఎనిమిది మంది బోయీలు వచ్చారు. అలా మనుష్యుల చేత మోయించుకోవటం నాకు ఎంత మాత్రం నచ్చదు అని చెప్పినా తాంత్రికుడి బలవంతం వలన నేను పల్లకీలో వెళ్ళక తప్పలేదు. అదొక తమాషా అనుభవంగా గుర్తుండిపోయింది.

మా కోసం మంచి రుచికరమయిన భోజనము, పళ్ళు, కొబ్బరి నీరు ఇచ్చి సౌకర్యవంతమయిన ఒక గదిని నాకు బసగా ఏర్పాటు చేశారు. నాతోపాటు సన్నిహితులయిన కొందరు శిష్యవర్గం కూడా అది చూడడానికి ఎంతో కుతూహలంగా వచ్చారు. నాకు విడిగా గది ఇవ్వటం వలన నేను ప్రశాంతంగా ధ్యానం చేసుకోవటానికి అవకాశం దొరికింది. ఆమెకు రెండు మూడు రోజుల్లో శాంతి కుదిరింది. దానితో మేము మళ్ళీ పల్లకీలో తిరుగు ప్రయాణమయ్యాము.

సాధారణంగా పల్లకీలో వివాహ సమయంలో పెళ్ళి కూతురిని గాని, పెళ్ళికుమారుడిని గాని తీసుకువెళ్ళటం రివాజు. బోయీలు వాళ్ళ శ్రమను మర్చిపోవటానికి ఏదో కూనిరాగం తీస్తూ ఉంటారు. బోయీలు భోం భోం అన్నప్పుడు నాకు అందులో పరమ పవిత్రమయిన ఓంకార నాదం వినిపించింది. పల్లకీలో కూర్చున్నవాళ్ళకి ఎంత సౌకర్యంగా ఉంటుందో దాన్ని మోసే వాళ్ళకి అంత శ్రమ కల్గుతుంది. అందుకు బదులుగా వాళ్ళకి మంచి భోజనము, కొంత డబ్బు ముడుతుంది. అందువలన వాళ్ళు పడిన శ్రమంతా మర్చిపోయి సంతృప్తి పడతారు.

ఒకసారి ఒక భక్తుడు నన్ను వాళ్ళింటికి తీసుకువెళ్ళాడు. అతనిది చాలా గౌరవనీయమయిన కుటుంబం. వారింటిలో ఒక స్త్రీని ప్రేతాత్మ ఆవహించటం వలన ఆమె పెద్దగా అరుస్తూ అందరిని తిట్టసాగింది. నేను వాళ్ళింటికి వెళ్ళినప్పుడు ఒక కుర్చీలో కూర్చుని ధ్యానం చేయసాగాను. కొంతసేపటికి ఆమెను ఆవహించిన ప్రేతాత్మ బిగ్గరగా అరవసాగింది. "దయచేసి కిటికీ తలుపులు తెరవండి. పవిత్రమయిన ఈ మహాత్ముని సన్నిధిలో నేనుండలేకపోతున్నాను. నేను ఈమె శరీరాన్ని వదలి పెట్టి వెళ్ళిపోతాను. ఇంక ఆమె శాంతిగా ఉంటుంది" అని చెప్పింది. నేనప్పుడు ఆమెతో మృదువుగా "మేము కిటికీ తలుపులు తెరుస్తాము. ఇంకెప్పుడు ఆమె జోలికి రావద్దు" అని చెప్పాను. ఆ కుటుంబంలో మళ్ళీ సుఖసంతోషాలు వెల్లివిరిశాయి. భగవంతుని దయ వల్లనే ఇదంతా సాధ్యపడింది.

ఈశ్వరుడు తల్చుకుంటే సాధ్యం కానిది అంటూ ఏమీ ఉండదు. అన్ని గౌరవాలు ఆయనకే చెందుతాయి. కుంటివాడిని నడిపించగలడు, మూగవాడిని పలికించగలడు. గ్రుడ్డివానికి చూపును ప్రసాదించగలడు. సామాన్యుడయిన మానవుడికి ఇవన్నీ ఎలా సాధ్యపడతాయి. భగవంతుని సంకల్పంతోనే మానవుడు మాధవుడై వెలుగొందుతాడు.

ఓం తత్సత్ ఓం

### అధ్యాయం - 8

# వైరాగ్యము

పైకి ఎగసిన ప్రతి సముద్ర కెరటము కూడా పడిపోవలసిందే. అందుకే నేను ప్రాపంచిక విషయాల పట్ల సంతృప్తి చెందలేకపోతున్నాను. కీర్తిప్రతిష్ఠల వలన ఒరిగేది ఏముంది? అసలివన్నీ ఎక్కడికి దారితీస్తాయి అని ఆలోచించసాగాను. వాటి వలన స్వర్గ సౌఖ్యాలను అనుభవించగలనేమో గాని ఆత్మసాక్షాత్కారాన్ని, నిజమయిన ఆత్మశాంతిని పొందగలనా? ఒకవేళ నేను భారతదేశాన్ని పరిపాలించినా లేదా ప్రపంచానికే అధిపతిని అయినప్పటికి అది ఆత్మసాక్షాత్కారాన్ని ఇవ్వలేదు. అసలు మానవజన్మ వచ్చింది దేనిని సాధించడానికి? ఇటువంటి ఆలోచనలు నాలో మెదలుతున్నాయి.

గొప్ప పేరు ప్రతిష్ఠలు అన్నీ గాలిలో దూదిపింజెల్లా కల్సిపోతాయి. ప్రాపంచిక భోగభాగ్యాలు రాలిపోయే పూలరేకుల్లా, గడ్డిపరకల్లా ఉంటాయి. పూలు వికసించి, నెమ్మదిగా వాడిపోయి రాలిపోతాయి. అలాంటిదే ఈ ప్రాపంచిక జీవనం. వీటిలో మునిగితేలేవాడు నీడ వెనుక పరుగెత్తినట్లుగా ఎన్నటికి దైవాన్ని చేరుకోలేడు. మానవుడు తాను ఎక్కడి నుండి వచ్చాడో తిరిగి అక్కడికి చేరుకోవాలి. అసత్యంలో నుండి సత్యంవైపుగా ప్రయాణించాలి. అనిత్యం నుండి నిత్యత్వాన్ని పొందాలి. చంచలత్వం నుండి నిశ్చలత్వాన్ని, స్థిరత్వాన్ని సాధించాలి. అలాంటి స్ఫూర్తిదాయకమైన ఆలోచనలు నాలో కల్గసాగాయి. ఈ విధమయిన వైరాగ్య భావన వలన నేను ప్రాపంచిక విషయాలకు దూరంగా ఉంటూ పేరు ప్రతిష్ఠలను తృణప్రాయంగా భావించి నాలో నేను నెమ్మదిగా అంతర్ముఖ స్థితిని పొందాను.

"వికసించినదంతా నశిస్తుంది" నేను ఈ గురుశిష్య అనుబంధాలన్నింటిని త్యజించాలను కున్నాను. వీటన్నింటికి బదులుగా శాశ్వతమయిన శాంతి, ఆనందము నా మనస్సుకు, బుద్ధికి, ముఖ్యంగా నా ఆత్మకు అవసరం అనిపిస్తుంది. నేనిప్పుడిప్పుడే తెలుసుకుంటున్నాను. నా తాంత్రిక గురువు నన్ను అపమార్గం పట్టిస్తున్నాడని. ఆయన తన చుట్టూ ఉండే బాధిత జనులను, తనని పూజ్యభావంతో ఆరాధించే భార్యను కూడా మాయలో పడేస్తున్నాడు. గుడ్డిగా గొఱ్ఱెల మందలాగా అందరూ అతని మాయాజాలంలో పడిపోతున్నారు. వాళ్ళకే తెలియకుండా అంధకారంలో కూరుకుపోతున్నారు. అప్పుడే నాకు అనిపించింది సమయం ఆసన్నమయిందని, ఈ బాహ్య గురువుల బారినుండి బయట పడి నాలో వెలుగుతున్న అంతర్జ్యోతి అయిన గురువును దర్శించాలని.

ఒక మంచి రోజు నేను చెందుర్తిలోని నా తాంత్రిక గురువును అతని కర్మకి అతన్ని వదలి వచ్చేశాను. "మనం ఎలాంటి విత్తనాలు జల్లుతామో, అలాంటి పంటనే పొందుతాము". నేను వదలి వచ్చివేయగానే ఆ తాంత్రికుడి పేరు ప్రతిష్ఠలు తగ్గిపోయాయి. మంత్రజలం కోసం వచ్చేవారు, భూతవైద్యం కోసం వచ్చేవారు కూడా తగ్గిపోయారు. **"ఎవరయినా కొద్దికాలం ఎవరినయినా మోసం చేయగలరు కాని ఎల్లకాలము అందరినీ మోసం చేయలేరు"** అని చెప్పిన అబ్రహం లింకన్ గారి మాటలు యథార్థమయ్యాయి.

పవిత్రమయిన ధర్మానికి అంతరాలుండవు. సడలింపులు కూడా ఉండవు. అది అందరికీ ఒకే విధంగా వర్తిస్తుంది. పేదవాడయినా, ధనవంతుడయినా, జ్ఞాని అయినా అజ్ఞాని అయినా, ఆరోగ్యవంతునికయినా, రోగిష్ఠికయినా, యువకుడయినా లేదా ముసలివారయినా, మనస్సును అంతర్ముఖము చేసినప్పుడు ఆత్మశుద్ధి, అంతరంగ పరిశుద్ధి కలుగుతుంది. భగవంతుని అనుగ్రహము వలన నేను నిజమయిన ఆనందాన్ని, మార్పులేని శాంతిని పొందగల్గుతున్నాను. నాతోపాటు నన్ను నమ్మి నా మార్గంలో నడుస్తున్న నా అంతరంగ శిష్యులకి కూడా ఆ శాంతి, ఆనందం దొరుకుతున్నాయి. వారందరూ ప్రాపంచిక సౌఖ్యాలను త్యజించినవారే.

నా మనస్సు పవిత్రమయిన హిమాలయాలను దర్శించాలని తపన పడసాగింది. అన్నింటినీ పరిత్యజించిన వారికే నిజమయిన ఆత్మానందం దొరుకుతుంది. సర్వసంగ పరిత్యాగం వల్లనే అంతరంగశుద్ధి, ఆత్మ జ్ఞానము ప్రాప్తిస్తాయి. ఆ ఆత్మానందం ఎన్నటికీ మార్పు చెందనిది, నిత్యమయినది, సత్యమయినది. దానిని సాధించాలంటే అన్నింటిని

పరిత్యాగం చేయాలి. అదే నా అంతిమ నిర్ణయం. సంపూర్ణమయిన దైవానుగ్రహంతో సత్యాన్వేషణకై ధర్మపథం వైపుగా అన్నింటిని పరిత్యజించి ఒంటరిగా ప్రయాణమయ్యాను.

హఠాత్తుగా సర్వసంగ పరిత్యాగం చేయటం అంత సామాన్యమయిన, తేలికయిన విషయం కాదు. అసలు తాను అందుకు తగిన అర్హత పొందాడో లేదో ముందుగా తన్ను తాను పరీక్షించి తెలుసుకోవాలి. ఒక వ్యక్తి భార్యతో పోట్లాడి కోపంతో ఇల్లు వదలి వచ్చేశాడట. సన్యాసిగా మారాలనుకున్నాడు. ఒక్క రోజు మంచి భోజనము, సౌకర్యవంతమయిన పడక దొరకని కారణంగా మాట్లాడకుండా వెంటనే వెనక్కి తిరిగి ఇంటికి వచ్చేశాడట. హాయిగా భార్యతో కాపురం చేస్తున్నాడు. అలా నా జీవితం కాకూడదు కదా! నేను కూడా ఇప్పటిదాకా చాలా సుఖకరమయిన జీవితం గడిపాను. నా ధనవంతులయిన బంధువులు, నా ప్రియమయిన భక్త వర్గము నా పట్ల ఎంతో శ్రద్ధ వహించారు. అలాగే నా స్నేహితులు ఎంతో సహాయం చేశారు. అందుకే సన్యాస జీవితానికి నన్ను నేను తయారు చేసుకోవటానికి ఇల్లు, ప్రపంచం వదలి సాధువు కావటానికి ముందుగా నా జీవితంలో అనేక మార్పులు అవసరం అనిపించింది. నా ఆహారపు అలవాట్లు, కొద్ది నిద్ర, మైళ్ల దూరం నడవటం, నిరాహారంగా ఉండటం నా దినచర్యగా మార్చుకున్నాను.

నేను చాలా సాదాసీదాగా జీవితం గడపటం, అణిగిమణిగి ఉండడం వలన అమెరికా వంటి సంపన్న దేశానికి వెళ్ళివచ్చాను అనే అహంకారాన్ని వదిలించుకోవటానికి ప్రయత్నించాను. కూలి పనులు చేసయినా నా తిండి నేనే సంపాదించుకోవాలి అని సంకల్పించి రాత్రి వేళల్లో రైల్వే స్టేషనులో ప్రయాణికుల సామాన్లు మోయటానికి ప్రయత్నించాను. నేను చిన్నవయస్సులో ఉండడం వలన నాకు ఆ పని దొరకలేదు. కాని నన్ను నేను కూలివాడిగా మార్చుకోవటానికి చేసిన ప్రయత్నం వలన ఎంతో కొంత అనుభవం వచ్చింది.

ఉప్పుకారం వేసిన పదార్థాలను వదలిపెట్టి కేవలం ఉడకబెట్టిన కూరగాయలు, పళ్ళు తినడం అలవాటు చేసుకున్నాను. కొబ్బరి, అరటిపళ్ళు తిన్నాను. బ్రహ్మచర్య వ్రతానికి కలబంద మంచిది అని చెప్పగా విని కలబంద గుజ్జును పాలలో కలిపి ఆహారంగా తీసుకున్నాను. నా దగ్గరున్న ఖరీదయిన విదేశీ దుస్తులన్నింటినీ రోగులకు,

బీదవారికి పంచి పెట్టాను. పరివర్తన, పవిత్రత అనేది బాహ్యంలోనే కాదు, ఆంతర్యంలో కూడా కల్గాలి.

ఆ సమయంలో నేను వాల్తేరులో నా స్నేహితులతో ధ్యానంలో గడిపేవాడిని. సముద్ర తీరంలోనే ఎక్కువగా కాలం గడిపేవాడిని. నా స్నేహితులకు నాకు చేతనయినంత ఆధ్యాత్మిక శిక్షణను ఇవ్వసాగాను. వారిలో చాలామంది నాతోపాటు గృహ పరిత్యాగం చేసి సన్న్యాస జీవితం గడపటానికి సిద్ధపడ్డారు. కాని దానికి నేను అంగీకరించలేదు. ముందుగా నేను ఆత్మ సాక్షాత్కారము పొందటానికి ప్రయత్నం చేయాలి.

ఒక పుణ్యదినము అర్ధరాత్రి వేళ ఇల్లు వదలిపెట్టాను. నా దుస్తులు గాని, డబ్బుగాని తీసుకోలేదు. కేవలం కమండలము, నీటి పాత్ర పవిత్ర గ్రంథాలయిన భగవద్గీత, అష్టావక్ర గీత మాత్రం నాతో తీసుకువెళ్ళాను. క్రీస్తు సత్యాన్వేషణ కోసం సమస్తాన్ని త్యజించినట్లుగా నేను దైవాన్వేషణ చేస్తూ జ్ఞానజ్యోతి కోసం బయలుదేరాను. చివరికి నా బంధువులు, స్నేహితులు, గురువులు, భక్తులు, శిష్యులు అందరినుండి విముక్తుడనయి స్వేచ్ఛగా బాహ్య ప్రపంచంలోకి అడుగుపెట్టాను. పరివ్రాజక జీవితం మొదలుపెట్టాను. నిర్మానుష్యమయిన మార్గాల్లో మైళ్ళకొద్ది దూరం పాదచారినై నడిచేవాడిని. స్వేచ్ఛగా నా జీవిత లక్ష్యమయిన పరమేశ్వర ప్రాప్తిని సాధించడానికి అవకాశం దొరికింది.

నీవు ఎక్కడ ఉన్నప్పటికి, ఒంటరివైనా, జన సమూహం మధ్యలో ఉన్నా, ధ్యానంలో ఉన్నా నీవు ఎప్పటికీ ఒంటరిగా ఉండవు. జననంనుండి మరణంవరకూ భౌతిక దేహం నశించిపోయిన అనంతరము కూడా నిన్ను అనుక్షణం వెన్నంటి ఉండే ఆ దైవశక్తి ఏమిటి? అదే నీ అంతరాంతాలలో నిండి ఉండి నిన్ను నడిపించే నీ అంతర్జ్యోతి స్వరూపం. దివ్య చైతన్య స్వరూపం. ఎవరయితే ఈ సత్యాన్ని తెలుసుకోగల్గుతారో వారు ధన్యులవుతారు. జీవితంలో ఎదురయ్యే కష్టాలన్నింటిని సాధనతో ఎదుర్కోగలిగే వారికి ఈ సత్యం బోధపడుతుంది. ఒకసారి మహమ్మదు ప్రవక్త తన అనుచరుడితో ఉన్నప్పుడు శత్రువులు చుట్టుముట్టారు. అనుచరుడు భయవిహ్వలతతో "గురుదేవా! మనం ఇద్దరమే ఉన్నాము. శత్రువులు అనేకమంది ఉన్నారు. వాళ్ళు మనల్ని తప్పకుండా చంపి వేస్తారు" అన్నప్పుడు ప్రవక్త అంటారు "మనం ఇద్దరం కాదు ముగ్గురం ఉన్నాము. మనల్ని నిరంతరం అనుసరిస్తూ సంరక్షించేవాడు, ఆ మూడవ వాడు భగవంతుడు".

సృష్టి అంతా భగవంతుని స్వరూపమే. అందుకే నేను ఒంటరిగా అర్ధరాత్రి వేళ ప్రయాణం చేస్తున్నా ప్రకృతి సౌందర్యాన్ని చూచి, పక్షుల కిలకిలారావాలను విని ఆనందించేవాడిని. దైవం నన్ను అనుక్షణం వెన్నంటే అనుసరిస్తున్నాడనే నమ్మకం ఉంది. ఆకాశంలో మిణుకుమిణుకు మంటూ మెరుస్తున్న కోట్లాది నక్షత్రాల కాంతి నాకు తోడున్న భావం కలిగేది. అలాంటప్పుడు ఎవరయినా తాను ఒంటరివాడినని ఎలా అనుకోగలడు? భగవంతుడు మన లోపల, బయటా, క్రిందా, పైనా, మన చుట్టూ, ఇప్పుడు, ఎల్లప్పుడూ, గతంలో, భవిష్యత్తులో కూడా మనతోనే ఉన్నాడు. ఆయన సర్వాంతర్యామి. సాక్షిమాత్రుడై తాను సృజించిన ప్రపంచాన్ని నడిపిస్తున్నాడు.

చీకటిలో, చలిలో, సుదీర్ఘమయిన రాత్రివేళల్లో నా ప్రయాణం అలాగే కొనసాగుతోంది. ఎప్పుడయినా ఎడ్లబండి ఎక్కేవాడిని, ఒక్కోసారి ఏ దయామయుడో పిలిచి బండిలో ఎక్కించుకునేవాడు. కాని ఎక్కువగా నేను కాలినడకతోనే నెమ్మదిగా ప్రయాణించేవాడిని. నా ప్రతి అడుగులో భగవంతుని సన్నిధిని అనుభూతి చెందేవాడిని. ఒక్కో పర్యాయం ఎడ్లబండి వెనకాలే నడిచేవాడిని. నేనిప్పుడిప్పుడే సన్న్యాసి జీవితాన్ని అలవాటు చేసుకోవటానికి ఒంటి మీద చొక్కా గాని, పాదరక్షలు గానీ లేకుండా నడిచేవాడిని. అయినా నేను చాలా ఆనందంగా, సంతృప్తిగా, స్వేచ్ఛగా ఉండేవాడిని. అలా మైళ్ళ దూరం పాదరక్షలు లేకుండా నడవడం వలన నా పాదాలు బొబ్బలెక్కాయి. అందువలన బాగా అలసిపోయి ఒక ఇంటి అరుగు మీద కూర్చున్నాను. ఆకలితో, దాహంతో నీరసించి పోయిన నన్ను చూచి జాలితో గంజి నీళ్ళు ఇచ్చారు ఒకరు. అవి స్వీకరించి ఎంతో సంతృప్తి చెందాను. నిజానికి మానవుని భౌతిక దేహం ఆరోగ్యంగా జీవించడానికి చాలా తక్కువ ఆహారం సరిపోతుంది.

ఆ రోజుకి ఆ ఇంటి అరుగు మీద విశ్రాంతి తీసుకున్నాను. అష్టావక్ర గీత తీసి చదువుతూ నిద్రపోయాను. మంచి నిద్ర తర్వాత నా శరీరము, మనస్సు బాగా సేదతీరాయి. ఎవరో దయామయులు ఆహారం ఇచ్చారు. ఆకాశంలో ఎగిరే పక్షులకి, నీటిలో ఈదే చేపలకి ఎవరు ఆహారాన్ని సమకూరుస్తున్నారో ఆ దైవమే అతని రూపంలో నా ఆకలి కూడా తీర్చాడని ఎరుగుదును నేను. అంతా భగవంతుని అనుగ్రహమే.

మొదటి రోజు నా పరివ్రాజక జీవన అనుభవము నాకెంతో ఆనందాన్నిచ్చింది. విశ్రాంతి తర్వాత మళ్ళీ ప్రయాణం మొదలుపెట్టాను. ఏ సంకల్పము లేకుండా, గమ్యం

లేని ప్రయాణం చేస్తూ రాత్రి చీకటి పడే సమయానికి ఒక చిన్న పట్టణంలోని ఒక భవంతి ముందుకు వచ్చాను. ఒక వ్యక్తి నన్ను ఆపివేశాడు. అతను ఒక రక్షక భటుడు. ఆ భవంతి పోలీసు స్టేషను అని గ్రహించాను. అతనికి ఆ సమయంలో పనేమి లేదనుకుంటాను. అందుకే నన్ను వంద ప్రశ్నలడిగి వేధించసాగాడు. నీవు ఎవరు? ఎక్కడి నుండి వస్తున్నావు? నీ తల్లిదండ్రులు ఎవరు? ఒంటరిగా ఎందుకు తిరుగుతున్నావు? నీవేమి చదువుకున్నావు? మీ తండ్రి గారు ఏమి చేస్తారు? నీ దగ్గర ధనమెంత ఉంది? లాంటి ప్రశ్నలు నాపై గుప్పించాడు.

నేను చాలా ఓపికగా అతడు అడిగిన ప్రశ్నలన్నింటికి ప్రశాంతంగా బదులిచ్చాను. నా దగ్గర చిల్లిగవ్వ కూడా లేదు అని తెలిసి అతను చాలా నిరుత్సాహ పడ్డాడు. చాలా కోపంగా నేను ముందుకు వెళ్ళడానికి వీలులేదని, అతని పై అధికారి వచ్చిన తర్వాతే నాకు వెళ్ళడానికి అనుమతి దొరుకుతుందని చెప్పాడు. నాకు ఒక చాప ఇచ్చి పోలీస్ స్టేషన్ గదిలో పడుకోమని చెప్పాడు. అతను నాకు ఏదయినా ఆహారం తినడానికి ఇచ్చాడో లేదో నాకిప్పుడు గుర్తులేదు. ఆ విధంగా నా రెండవ రోజు పరివ్రాజక జీవితం జైలు గదిలో గడపవలసి వచ్చింది. నాకప్పుడు శ్రీకృష్ణ భగవానుడి జన్మస్థలము గుర్తు వచ్చింది.

తెల్లవారిన తర్వాత, సబ్ ఇనిస్పెక్టర్ వచ్చి నన్ను ప్రశ్నించి, నా వద్ద ఉన్న వస్తువులన్నీ తీసి చూచాడు. నా వద్ద ఆధ్యాత్మిక గ్రంథాలు తప్ప ఇంకేమి లేకపోవటం వలన నేను మోసగాడినో, దొంగనో కాదని గ్రహించి నాకు వెళ్లడానికి అనుమతి ఇచ్చాడు. ఆ రాత్రి నన్ను జైలు గదిలో ఉంచినందుకు క్షమాపణ కూడా చెప్పాడు. నా అవసరాల కోసం డబ్బు కూడా ఇవ్వబోయాడు కాని నేను ఆ ధనాన్ని తిరస్కరించాను. ఎందుకంటే ఈ ప్రయాణంలో నా వద్ద ఆహారం గాని, ధనం గాని ఉంచుకోకూడదని ముందే నిర్ణయించు కున్నాను. రెక్కలు రాని పక్షులకు కూడా ఆహారాన్ని సమకూర్చే దైవం తన బిడ్డల యోగ క్షేమాలను చూడకుండా వదలిపెడతాడా? అందరికి శాంతి సౌభాగ్యాలు ప్రసాదించాలి ఆ దైవం అని భావన చేస్తూ నా ప్రయాణం తిరిగి కొనసాగించాను.

దేవుని దయ వలన ప్రయాణం 'పూరి జగన్నాథం' వైపుగా సాగింది. 'పూరి' అంటే దేవాలయం, ఈ దేహమే దేవాలయము, 'జగన్నాథం' అంటే భగవంతుడు. దేహం అనే దేవాలయంలోని పరంజ్యోతి. నేను ఇల్లు వదిలే ముందు నా నిర్ణయం ముందుగా

పూరి క్షేత్రాన్ని దర్శించుకొని తర్వాత హిమాలయాలకి వెళ్ళాలని. నా అనుభవం ద్వారా నేనసలు ఆధ్యాత్మిక జీవితానికి అర్హత కల్గి ఉన్నానో లేదో పరీక్షించి తెలుసుకోవాలనుకున్నాను. దాదాపు 300 మైళ్ళ దూరం కాలినడకతో ప్రయాణించాను. దారిలో ఎన్నో మంచి, చెడు అనుభవాలు ఎదురయ్యాయి. అందులో ఆనందకరమయినవి కూడా ఉన్నాయి. ఇది పూర్తిగా స్వేచ్ఛాయుత జీవనం. ఎక్కడి నుండి ఎటు వెళుతున్నామో కూడా తెలియకుండా పూర్తిగా భగవంతునిపై భారం వేసి, ఆ దైవం ఎప్పుడు ఎవరి ద్వారా ఎలాంటి ఆహారం ఇస్తాడో కూడా తెలియకుండా కాలం గడిపాను. మనం నిజంగా దైవానికి సంపూర్ణంగా శరణాగతి పొందితే, ఆయన మన కష్ట సుఖాలన్నీ చూచుకుంటాడు. పసిపిల్లలు బొమ్మలతో ఆడుకుంటున్నంత సేపు తల్లి తన పనిలో మునిగిపోయి పట్టించుకోదు. కాని పిల్లవాడు ఏడవడం మొదలు పెట్టగానే తల్లి చేతిలో పని వదలిపెట్టి పరుగెత్తుకొని వస్తుంది.

శరణాగతి గురించి మరొక ఆసక్తికరమయిన కథ ఉంది. శ్రీ మహావిష్ణువు, లక్ష్మీదేవి పాచికలు ఆడుతుండగా, హఠాత్తుగా విష్ణు భగవానుడు తటాలున లేచి భూమండలం వైపుగా పరిగెత్తాడు. అయితే సగం దూరం వెళ్ళగానే ఆగిపోయి నెమ్మదిగా వెనక్కి స్వర్గానికి తిరిగి వచ్చి మళ్ళీ పాచికలు ఆడసాగాడు. లక్ష్మీదేవికి అర్థం కాలేదు. విష్ణు భగవానుడు అలా ఎందుకు చేశాడో. అప్పుడు ఆయన లక్ష్మీదేవికిలా వివరించాడు. “నా భక్తుడు ఒకడు ఆపదలో పడ్డాడు. అందువలన నేను అతడిని రక్షించాలని భూమి వైపు పరిగెత్తాను. కాని అతను నా సహాయం కోసం ఆగకుండా ఆత్మరక్షణలో పడ్డాడు. అందుకని నేను అతడిని వదిలిపెట్టి వచ్చేశాను” అని చెప్పాడు.

నా ప్రయాణం స్థిరంగా, నెమ్మదిగా కొనసాగింది. నా అరికాళ్ళలో బొబ్బలు చాలా బాధ కలిగిస్తున్నాయి. కొద్ది దూరం కూడా నడవలేని స్థితిలో ఉన్నాను. నాకు సహాయం చేయడానికి వచ్చిన వారితో ఆ దైవ స్మరణ చేయమని ప్రార్థించసాగాను.

చివరికి నేను ఒరిస్సాలోని చంద్రాపూర్ చేరుకున్నాను. అక్కడ మా బంధువులున్నారు. వారు నన్ను చూచి చాలా సంతోషించి, నా అరికాళ్ళలోని బొబ్బలు, పుళ్లు చూసి నాకు ఎంతో సేవలు చేశారు. కొబ్బరినూనెతో మర్దనా చేశారు. వేడి నీళ్ళతో కాపడం పెట్టారు. వారు నాకు మంచి భోజనం పెట్టి ఆరోగ్యవంతుడిని చేసి రైలులో పూరి జగన్నాథ స్వామి దర్శనానికి పంపించారు. వాళ్ళు నన్ను తమతోనే పూర్తిగా ఉండి పొమ్మని కోరారు.

కాని నేను వైజాగ్‌లోని మా బంధువులకి తంతి పంపించాను. వారు నా తిరుగు ప్రయాణానికి అవసరమయిన డబ్బు పంపించారు.

వైజాగ్‌లో నా అక్క బావగారు, ఇతర బంధువులు, స్నేహితులు నేను వెనక్కి తిరిగి వచ్చినందుకు చాలా సంతోషించారు. ఇక నేను ఇల్లు వదలి ఎక్కడికి వెళ్ళనని భావించారు. నా పరివ్రాజక ప్రయాణంలో నాకు చిలక సరస్సు చాలా నచ్చింది. నిర్మలమైన నీళ్ళు, చిన్న చిన్న తేలియాడే పడవలు, ప్రకృతి సౌందర్యానికి అది ఆటనెలవుగా ఉండి ఎంతో మనోహరంగా, మనస్సుకు ఆహ్లాదాన్ని కలిగించింది.

విశాఖపట్టణం తిరిగి వచ్చిన తర్వాత నేను ఆధ్యాత్మిక గ్రంథాలు మరింతగా చదువుతూ, ఎప్పుడూ ప్రార్థనలతో గాఢమయిన ధ్యానంతోనూ కాలం గడపసాగాను. నా తోటి ఆధ్యాత్మిక సాధకులయిన స్నేహితులతో నా అనుభవాలను పంచుకొనేవాడిని. నా తోటి వారు, స్నేహితులు అలాగే నా కుటుంబ సభ్యులు ఇంక నేను మళ్ళీ పరివ్రాజక జీవితంలోనికి వెళ్ళనని, నాకు కల్గిన అనుభవం వలన ఆకలి, చలి ఎంత కష్టమో తెలుసుకున్నానని అనుకున్నారు. కాని వాళ్ళు పూర్తిగా తప్పుగా అనుకొన్నారు. నిజానికి నా పరివ్రాజక జీవితం నాకు మరింత ఉత్తేజాన్ని, నూతనమయిన బలాన్ని, దృఢ సంకల్పాన్ని ఇచ్చింది. ముందు ముందు అది నా సన్యాస జీవితానికి ఎంతో ఉపయోగపడింది.

భగవంతుని ఘటనలు విచిత్రంగా, ఊహించటానికి నమ్మశక్యం కాకుండా ఉంటాయి. హృదయపు లోతుల్లోకి వెళ్ళేకొద్దీ నూతనమయిన ఉత్తేజం వస్తుంది అన్నది యథార్థం.

ఓం తత్సత్ ఓం

**అధ్యాయం – 9**

# ఆత్మశోధన

అందరికి తెలిసిన విషయాన్ని గూర్చి తెలుసుకోవటంలో ఏముంది? ఏది అయితే తెలుసుకోవాలో, అది నీలోనే ఉందని గుర్తించు. నీ వ్యక్తిగత అనుభవం చాలా గొప్ప ఆశీర్వచనంగా మానవాళికి ఉపకరిస్తుంది. ఆత్మానుభవం పొందకుండా, ఆత్మసాక్షాత్కారం

అనుభవించకుండా, దైవంతో ఏకత్వాన్ని అనుభవంలోనికి తెచ్చుకోకుండా దైవాన్ని గురించి ఇతరులకు బోధించడానికి ప్రయత్నించకూడదు.

విశాఖలోని మా అక్కగారింటికి 'రెడ్నమ్ గార్డెన్'కి తిరిగివచ్చిన తర్వాత నా ఆధ్యాత్మిక సాధన, ధ్యానం మరింత గాఢతరంగా మారాయి. నేను ఆ ప్రకృతి సౌందర్యానికి ముగ్ధుడనయిపోయి అందులో లీనమయిపోయేవాడిని. సముద్రపు ఒడ్డున కూర్చొని సముద్రపు కెరటాలు జపిస్తున్న పవిత్రమయిన ఓంకార నాదాన్ని విని ఆనందించేవాడిని. సూర్యాస్తమయ సమయంలో సూర్యుడు కొండల చాటున మరుగవుతున్నప్పుడు ఆకాశంలో పర్చుకున్న వింత వింత రంగులను చూచి పులకించి పోయేవాడిని. ప్రతి ఉదయం సూర్యుడు ఉదయించగానే తన బంగారు రంగు లేత కిరణాలను, వెలుగును ప్రపంచానికి జీవాన్ని, జీవితాన్ని ప్రసాదించటం చూస్తూ సంతోషించేవాడిని. ప్రకృతి రహస్యాలు ఎంతో నిగూఢమయినవి. వెలుగుతున్న నక్షత్రాలు, సుగంధాలు వెదజల్లే పుష్పాలు భగవంతుని వైభవాన్ని చాటిచెపుతున్నట్లుగా ఉంది. దైవం యొక్క దివ్యత్వాన్ని నీలో మాత్రమే కాదు, ప్రకృతిలోని అణువణువులోనూ ప్రతి జీవిలోనూ దర్శించవచ్చు.

అక్కడి పర్వతాల్లో చాలా అందమయిన తోట ఉంది. అక్కడే గలగలా పారే సెలయేరుని 'సీతమ్మ ధార' అని పిలుస్తారు. ఆ ప్రాంతము సన్యాసి చెట్టి అనే వ్యక్తికి చెందినది. విశాఖపట్టణానికి దగ్గరలోని భీమునిపట్నంకి చెందినవాడతను. ఒకప్పుడు అది చాలా వైభవంగా వెలుగొందిన ఓడరేవు. ఆ ప్రాంతం చాలా అందంగా ఉండటం వలన చాలా మంది అక్కడికి సరదాగా గడపడానికి వస్తుంటారు. ఉపాధ్యాయులు తమ విద్యార్థులను తీసుకు వస్తుంటారు అది చూపించటానికి. అంతేకాకుండా ఎన్నో కుటుంబాలు సరదాగా గడపడానికి వస్తుంటారు. ప్రత్యేకించి ఆదివారాలు అక్కడ ఎంతో సందడిగా ఉంటుంది. వాళ్ళు అక్కడే వంటలు చేసుకొని తిని సెలవురోజు ఆనందంగా తమ కుటుంబ సభ్యులతో ప్రకృతి ఒడిలో సేదతీరుతారు. నేను నా స్నేహితులతో తరుచుగా అక్కడికి వెళ్ళి గంటల తరబడి మౌనంగా ధ్యానంలో కాలం గడిపేవాడిని. ఒక్కోసారి మేము కొండ ఎక్కేవారము. జలపాతం దగ్గరగా వెళ్ళిచూచి ఆనందించేవారము. పగలు రాత్రి తేడా లేకుండా అక్కడ మేము ధ్యానం చేసేవాళ్ళము.

పవిత్రమయిన గంగానది తీరంలో హిమాలయాల్లో ఎందరో మహాత్ములు, సాధువులు తపస్సులో తమ జీవితాలను పునీతం చేసుకుంటూ శాంతిమయ జీవనం గడుపుతుంటారు.

ఒకప్పుడు నాకు అమెరికా దేశం వెళ్ళటమే లక్ష్యంగా, కలగా ఉండేది. కాని ఇప్పుడు నా ఆలోచనలు మారిపోయాయి. మనస్సు హిమాలయాలను దర్శించాలని, అక్కడ ధ్యాన సాధనలో తరించాలని, తపస్సులో మునిగిపోవాలని పరితపిస్తోంది. నా బుద్ధి, మనస్సు, హృదయం, ఆత్మ అన్నీ ఉన్నత భూమికలలో విహరించసాగాయి.

జాతకాలు నిజమో, అబద్ధమో చెప్పలేము. దైవజ్ఞుల విషయంలో వారు చెప్పే జాతకాలు ఒక్కోసారి నిజం కావచ్చు. కాని అది చాలా అరుదుగా ఉంటుంది. కాని ఎక్కువగా జాతకాలు చెప్పటం అనేది వ్యాపారంగానే ఉంటుంది. అందువలన వారి మాటలు నమ్మటానికి వీలులేదు. నా జాతకం ఒక బ్రాహ్మణ పండితుడు, పురోహితుడు గ్రామంలో నివసించే 'పుల్లకవి' అనే వ్యక్తి చేత వ్రాయబడింది. అతను నేను కేవలం ఏబది ఎనిమిది సంవత్సరాలు మాత్రమే జీవిస్తానని చెప్పాడు. కాని నాకిప్పుడు దాదాపు ఎనభై సంవత్సరాలు వయస్సు దగ్గరపడింది. పైగా నేను చాలా ఆరోగ్యంగా, ఆనందంగా వున్నాను. అతను నాకు జలగండం ఉందని కూడా చెప్పాడు. నీటిలో మునిగి చనిపోయే అవకాశముందని అన్నాడు. అలాంటి తప్పుడు జాతకం వలన నా బుద్ధిలో చిన్న వయస్సులోనే భయం ఏర్పడింది. నేను అమెరికా చదువు కోసం స్టీమరులో ప్రయాణం చేసినపుడు, ప్రత్యేకించి తుఫానులు వచ్చినప్పుడు ఓడ అల్లకల్లోలం అవుతున్నప్పుడు నాకు ఆ జ్యోతిష్కుడి మాటలు గుర్తు వచ్చి భయం వేసేది. దేవుని దయ వలన నేను ప్రపంచంలోని ఎన్నో సముద్రాల మీద ప్రయాణం చేశాను కాని నాకు ఎప్పుడూ, ఎలాంటి ఆపద వాటిల్లలేదు. మనమెప్పుడు భగవంతుని అంటిపెట్టుకొని ఉంటే మన జీవితాలను కాపాడే బాధ్యత ఆయనే వహిస్తాడు. మనకి ఏది మేలు చేస్తుందో మనకంటే ఈశ్వరుడికే బాగా తెలుస్తుంది. ఈశ్వరుడు ఎంతటి ప్రేమమూర్తి. ఆయన విభూతి అనంతమయినది.

జాతకాల విషయంలో మరొక సరదా సంఘటన కూడా నాకు గుర్తు వస్తోంది. శాంతి ఆశ్రమంలో చాలాకాలము ఒక వృద్ధుడయిన భక్తుడు నివసించేవాడు. అతను శాంతి ఆశ్రమాన్ని దర్శించటానికి వచ్చే భక్తులకు సేవలందిస్తూ, సత్సంగములో పాల్గొనేవాడు. రాట్నంపై నూలు వడికేవాడు. అలా తయారయిన నూలుతో నాకు ధోతి కూడా ఇచ్చాడు. అతను నా పట్ల ఎంతో భక్తి భావంతో మెలిగేవాడు. నాకు కూడా అతని పట్ల ప్రేముండేది. కాలం చక్కగా గడచిపోతుండగా ఒక రోజు హఠాత్తుగా నా

దగ్గరికి వచ్చి "స్వామీజీ! నేను మా ఊరికి వెళ్ళిపోవాలనుకుంటున్నాను. మీ అనుమతి కోసం వచ్చాను" అన్నాడు. నేను అతడితో "ఎందుకింత హఠాత్తుగా ఇప్పుడు నీవు ఇంటికి వెళ్ళాలనుకుంటున్నావు" అని అడిగాను. దానికతను "నేను ఇంకొక ఇరవై రోజుల్లో చనిపోబోతున్నాను. నా చివరి రోజులు నా స్వంత ఇంట్లో, నా పిల్లలతో, మనమలతో గడపాలనుకుంటున్నా" అని చెప్పాడు. "నీవు సరిగ్గా ఇరవై రోజుల్లోనే చనిపోతావని నీకెలా తెలుసు" అని అడిగాను. అందుకతనిలా చెప్పాడు. "నా జాతకం ప్రకారం ఇంకొక ఇరవై రోజుల్లో చనిపోతానని ఉంది. జ్యోతిష్కుడు ఫలానా రోజు, గంటలతో సహా చెప్పాడు. అంతేకాకుండా మా అబ్బాయి కూడా జ్యోతిష్కుడే. అతను కూడా నా జాతకం చూచి అది నిజమేనని చెప్పాడు" అన్నాడు. నాకతని తెలివి తక్కువ నమ్మకం చూచి నవ్వు వచ్చింది. నేనతనితో నవ్వుతూ ఎంతో నమ్మకంగా చెప్పాను. "నీవు ఇరవై రోజుల్లో చనిపోవు. అంతేకాదు చాలా కాలం జీవిస్తావు. నీవు ఆశ్రమంలో భగవంతుని సేవలో ఉన్నావు. భగవంతుని పిల్లలకి సేవలందిస్తున్నావు. ప్రతిఫలాపేక్ష లేకుండా వారి అవసరాలన్నీ తీరుస్తున్నావు. అందువలన అలా జరగదు" అన్నాను.

కాని అతను మాత్రం "లేదు స్వామీజీ! నా జాతకం ఎలా రాశారో అలాగే నేను చనిపోతాను. నా కొడుకు మాటలు కూడా అలాగే ఉన్నాయి. జ్యోతిష్కం తప్పదు" అంటూ వచ్చాడు. నేను అతడికి సర్ది చెప్పలేకపోయాను. నేనతని కోసం ప్రార్థనలు చేశాను. అతను ఆశ్రమము వదలిపెట్టి వెళ్ళిపోయాడు. పదిహేనురోజులు దాటినా ఆయన చక్కగా సంపూర్ణ ఆరోగ్యంతోనే ఉన్నాడు. ఇరవయ్యవ రోజున అతను తన మరణం కోసం సన్నద్ధమయ్యాడు. కాని అది అతని దరిదాపులకు రాలేదు. జాతకం తప్పు అయినందుకు అతను, అతని కుమారుడు నిరుత్సాహ పడ్డారు. నేను అతనికి మృత్యుంజయుడు అయినందుకు శుభాకాంక్షలు తెలియచేస్తూ ఉత్తరం రాశాను. దానికతడు బదులిస్తూ ఆ ప్రత్యేక దినాన తనకు కొన్ని మరణ సూచనలు కనిపించాయని వ్రాశాడు. ఏది ఏమయినా అతడు ఇప్పుడు కూడా ఆరోగ్యంగా, ఆనందంగా జీవించి ఉన్నాడు.

నేను గడిచిపోయిన జీవితం గురించి గాని, భవిష్యత్తులో జరగబోయే వాటి గురించి గాని, ఎలాంటి ఆసక్తి చూపించను. జ్యోతిష్కుల ఊహాగానాల గురించి వినటానికి కూడా ఇష్టపడను. నాకు ప్రస్తుతము, ఈ క్షణంలో ఎలా జీవిస్తున్నాము అన్నదే ప్రధానం. ఎల్లప్పుడూ ఆ పరంజ్యోతితో అనుసంధానము ఉండాలి. అప్పుడే మనం మరణం ఏ

క్షణంలో ఎదురయినా సన్నద్ధులమయి ఉంటాము. భక్త తుకారం పాటలు విన్నప్పుడు హృదయం ఆనందంతో నిండిపోతుంది.

**"హే! భగవాన్! ఈ దేహం మరణించుగాక, లేదా ఉండిపోగాక!**
**నాకు కావలసింది నీ పాదపద్మాలను అంటిపెట్టుకుని ఉండటం**
**నా మనస్సు ఎప్పుడూ నీతోనే ఉంటూ నీలో లీనమయి పోవాలి.**
**ఒక్క క్షణం కూడా నీ నామ స్మరణ మరచిపోకుండా ఉండేలా**
**వరం ప్రసాదించు స్వామీ!"**

ఓం తత్సత్ ఓం

**అధ్యాయం - 10**

# సన్న్యాస స్వీకారము

రాజమండ్రికి చెందిన శ్రీ కక్కిరాల రామారావు, అతని సహధర్మచారిణి మాతృదేవి రత్నం, అలాగే వారి ఇద్దరు కుమారులు ఎంతో మంచి భక్తులు. నేను హిమాలయాలకి వెళ్ళాలని నిర్ణయించుకున్నప్పుడు ఆ ప్రేమమయ కుటుంబము వారు నా కోసం ప్రత్యేకంగా ఉన్ని దుస్తులు తయారు చేయించారు. హిమాలయాల వంటి ఎత్తయిన ప్రదేశాల్లో తట్టుకోలేనంతగా విపరీతమయిన చలి బాధిస్తుంది. నేను ఆ విధమయిన బాధ పడకూడదని వారు భావించారు. వారికి నేను హిమాలయాలకు వెళ్ళటం ఇష్టం లేకపోయినా, నా దృఢ సంకల్పం వలన, నేను తప్పకుండా వారిని కలవటానికి తిరిగి వస్తానని మాటివ్వటం వలన ఒప్పుకొన్నారు. హరిద్వార్ వరకూ వారే నాకు సంతోషంగా రైలు టిక్కెట్టు కొని తెచ్చారు. నన్ను ఎంతగానో ప్రేమించే నా కుటుంబ సభ్యులు, స్నేహితులు నేను వారిని వదలిపెట్టి వెళుతున్నందుకు చాలా బాధపడ్డారు.

నా దగ్గరున్న ఆధ్యాత్మిక గ్రంథాలతో పాటుగా స్వామి రామతీర్థ వారి గ్రంథాలు, చాలా పాతది అయిన అవధూత గీత కూడా సర్దుకున్నాను. నా రైలు ప్రయాణం చాలా కులాసాగా గడిచింది. కాళిమాత దర్శనం కోసం కలకత్తాలో దిగాను. ఆ తల్లి ప్రపంచానికే

తల్లి కదా! జగన్మాత! వారణాసిలో కాశీ విశ్వనాథుని దర్శించుకోవటానికి మళ్ళీ ఆగాను. ఆయనను జగత్పిత అంటారు కదా! చివరికి హరిద్వార్ చేరుకున్నాను. శ్రీహరి స్వర్గ ధామానికి అదే ప్రవేశ ద్వారం. అక్కడంతా చిన్నా, పెద్దా ఆశ్రమాలతో నిండిపోయి ఉంటుంది. మఠాలు పెద్ద భవనాల్లాగా ఉంటాయి. అలాగే చిన్న పూరి కుటీరాల్లో సాధుసంతులు తమ సాధనలు చేస్తూ ఉంటారు. హరిద్వార్ నుండి పదిహేను మైళ్ళు కాలి నడకతో ఋషికేశ్ చేరుకున్నాను.

రిషికేశ్‌లో నాకు కొద్దిగా పప్పు, రొట్టెలు ఆహారంగా దొరికాయి. రిషికేశ్‌లో స్వామి రామతీర్థ గ్రంథాలయము ఎదురుగా చాలా ప్రఖ్యాతి గాంచిన స్వర్గాశ్రమముంది. నీలకంఠేశ్వర పర్వతశ్రేణి పాదపీఠంలో దాదాపు రెండు మైళ్ళ దూరం దాకా ఆశ్రమం విస్తరించి ఉంటుంది. వందలాది కుటీరాలలో సాధువులు నివాసముండి సాధనలు చేసుకుంటారు. నాకు తప్పకుండా అక్కడ సాధనలు చేసుకోవటానికి ఒక కుటీరము దొరుకుతుంది అని ఆశించాను. పవిత్రమయిన గంగానదీ తీరంలో పరమ పవిత్రమయిన స్వర్గాశ్రమములో నివసించే భాగ్యం దొరుకుతుంది. కాని స్వర్గాశ్రమము ధర్మశాల నిర్వహణాధికారి అయిన మహంతు గారు రోజు కొన్ని వందల మంది సాధువులను ఆహ్వానించే వ్యక్తి నా వయస్సు, అనుభవరాహిత్యం చూచి నాకు నివాసానికి ఒక కుటీరాన్ని ఇవ్వడానికి నిరాకరించాడు. నేను మౌనంగా సాధనలో నిమగ్నమవటానికే అక్కడికి వచ్చానని ఆయనతో చెప్పాను. అప్పుడు నా మాటల్లోని నిజాయితీ గమనించిన మహంతు స్వర్గాశ్రమములో దూరంగా విసిరివేసినట్లుగా ఉన్న మారుమూల కుటీరాన్ని ఇవ్వటానికి అంగీకరించాడు. అక్కడ తేళ్ళు యథేచ్ఛగా తిరుగుతున్నాయి. సాధువులు పగలు కూడా అక్కడ అడుగుపెట్టడానికి సంశయిస్తారు. కాని నేను మాత్రం చాలా సంతోషించాను. తలదాచుకోవటానికి, సాధన చేసుకోవటానికి నాకు ఒక కుటీరం దొరికినందుకు. ఎంతో సంతృప్తిగా మహంతుకు ధన్యవాదాలు తెలియచేసుకున్నాను. నేను ఆ చిన్ని కుటీరంలో సర్దుకోగానే ప్రపంచంలో నా అంత సంతోషపడే వ్యక్తి ఇంకొకడు ఉండడు అన్నంతగా సంబరపడిపోయాను. భగవంతుని పట్ల కృతజ్ఞతతో నా కళ్ళ వెంట ఆనందబాష్పాలు కారిపోసాగాయి. ప్రశాంతమయిన మనస్సుతో హాయిగా నిద్రపోయాను.

స్వర్గాశ్రమములో ఒక నిర్ణీత సమయానికి గంట మ్రోగుతుంది. అప్పుడు కుటీరాల్లోని సాధువులందరూ క్షేత్రానికి వెళ్ళి తమ వంతు పప్పు, రొట్టెలు తీసుకుంటారు. కొందరు

వాళ్ళ జోలిలో, మరికొందరు కొబ్బరి చిప్పలో ఆహారాన్ని తెచ్చుకొని తల్లి గంగానది ఒడ్డుకి వచ్చి ముందుగా నదిలోని చేపలకు కొద్దిగా ఆహారాన్ని సమర్పిస్తారు. తర్వాత వారు స్వీకరిస్తారు. మొదటి రోజు నేను బాగా అలసిపోయి మంచి గాఢ నిద్రలో ఉండటం వలన, పైగా నా కుటీరము ఆశ్రమములో చాలా దూరంగా, పెడగా ఉండటం వలన నాకు గంట శబ్దం వినిపించలేదు. ఆ రోజు నాకు ఆహారం దొరకలేదు. అయినా నేను సంతోషంగానే ఉన్నాను. ఆధ్యాత్మికానందాన్ని ఆస్వాదిస్తూ స్వర్గ లోకంలో విహరిస్తున్న నన్ను భౌతికమయిన ఆకలి బాధ బాధించటం లేదు. నా యువ హృదయం ఆనందంతో, సంతృప్తితో నిండిపోయింది. చివరికి నేను కోరుకున్న వరాలన్నీ ఈశ్వరుడు అందించాడు. ఇప్పుడు నాకు అవకాశాలు లభించాయి భగవంతుడిని తెలుసుకోవడానికి. భౌతిక ప్రపంచాన్ని పూర్తిగా మరచిపోవటానికి. అంతా ఆ దైవ లీల.

## సన్న్యాస స్వీకార దీక్షా సమయం

నన్ను నేను ఇంతకు ముందే అన్ని విధాలుగా పరీక్షించుకున్నాను. నిజంగా నాకు సన్యాస దీక్ష స్వీకరించడానికి అర్హత లభించిందా లేదా అని. ప్రకృతి నన్ను తన మాయ నుండి విడుదల చేసింది. నా లోపల నుండి నా అంతర్వాణి చెపుతోంది నాకు సన్యాస స్వీకారానికి సమయం వచ్చిందని. నేను అందరిని నా గురువులుగానే భావించేవాడిని. నాకు జన్మనిచ్చిన తల్లిని, నా బాగోగులు జాగ్రత్తగా చూచిన తండ్రిని, నాకు అన్నివిధాలుగా సహాయ సహకారాలందించిన బంధువులను, స్నేహితులను గురువులుగానే భావించినా, అసలయిన గురువు ఎప్పుడూ మన అంతరంగంలోనే ఉంటాడు. దివ్యజ్యోతిగా మనలో వెలుగుతూ ఉంటాడు.

నాకు పెద్దగా అనుభవం లేదు. వయస్సు కూడా లేదు. అయినా ఏదో ఒక సన్యాస పరంపరలో చేరాలి అనుకోవటం లేదు. కాని సర్వ ప్రపంచానికి చెందిన స్వేచ్ఛా మయుడయిన పరమాత్మకు నన్ను నేను చెందినవాడినిగా భావిస్తున్నాను. అంతేకాక నేను స్వామి రామతీర్థ జీవితాన్ని అధ్యయనం చేసి బాగా ప్రభావితుడనయ్యాను. ఆయన అడుగుజాడల్లో నడుస్తూ నాలోని అంతర్జ్యోతిని అనుభవంలోనికి తెచ్చుకున్నాను.

ఒక పవిత్రమయిన రోజు, తెల్లవారుజామునే పరమ పవిత్రమయిన గంగానది తీరానికి చేరుకున్నాను. మౌనంగా గాఢమయిన ధ్యానంలో మునిగిపోయాను. గాఢమయిన

ధ్యానంలో పరమాత్మను అనుభవంలోనికి తెచ్చుకున్నాను. ఆయన ఉనికి, అణువణువునా అనుభూతి చెందాను. నా లోపల, బయటా, క్రింద, పైనా నా చుట్టూరా పర్వత సానువుల్లో, గంగానది గలగల పారుతున్న సవ్వడుల్లో, అంతటా ఆయన ఉనికి ఉంది. ఆ పవిత్ర క్షణాలలో నా ఒంటి మీద పాత బట్టలు తీసివేసి కాషాయ వస్త్రాలు ధరించాను. దీక్షా స్వీకారం చేసి సన్న్యాస జీవనం గడుపుతానని పరమాత్మ ముందు ప్రమాణం చేశాను. ఎంత పవిత్రతమయినవి ఆ దివ్య క్షణాలు. మరపురాని ఉత్తేజితమయిన సమయమది. నదిలో ఈదులాడుతున్న చేపలు సంతోషంగా నా వైపుగా వస్తున్నాయి. ఆకాశంలో స్వేచ్ఛగా ఎగిరే పక్షులు సంతోషంగా కుకూరావాలు చేస్తూ నా తల మీదగా ఎగరసాగాయి. భగవన్మయమయిన స్వేచ్ఛాయుత శాంతిమయ జీవనానికి సన్న్యాసమే ప్రతీక.

'ఓం'.... ఓంకారమే ప్రథమ నాదము. సృష్టి ప్రారంభమయింది ఓంకారముతోనే. మనం ఓంకారము నుండే పుట్టాము. ఓంకారముతోనే జీవిస్తున్నాము. మనం చేస్తున్న ప్రతి పనిలోనూ ఆ దివ్యనాదమే ఉంది. జీవుడు మరణించేటప్పుడు కూడా ఆ ఓంకారములోనే లీనమవుతున్నాడు. స్వామి రామతీర్థ గారి జీవితాన్ని, ఆయన ఆచరణని బాగా అధ్యయనం చేసిన తర్వాత నేను ఓంకారము యొక్క యథార్థ స్వరూపాన్ని బాగా అర్థం చేసుకున్నాను. ఆయన సర్వకాల సర్వావస్థల్లో ఓంకారాన్ని జపిస్తూనే అద్భుతాలు సృష్టించారు. అందువల్లనే నేను కూడా దివ్యమయిన ఆ ఓంకార నాదం పట్ల ఎంతగానో ఆకర్షితుడనయ్యాను.

నా పూర్వజన్మ సుకృతము వల్ల, నా గత జన్మలలో నేను చేసిన మంచి పనుల వలనా నేను ఇన్ని సంవత్సరాలుగా ఓంకారాన్ని జపించగల్గుతున్నాను. నేను పనిచేస్తున్నా, విశ్రాంతిగా ఉన్నా ఆ నామ జపాన్ని ఆపలేదు. అన్నీ, అన్నింటా ఓంకారమే వినిపిస్తుంది నాకు. నాకు 'ఓంకారము' పట్ల గల ప్రీతిని గమనించిన కొందరు సాధువులు నన్ను 'ఓం స్వామి' అని పిలవటం ప్రారంభించారు. తర్వాత నాకు బాగా సన్నిహితులయిన సాధు మహాత్ములు నేను ఎల్లప్పుడు ఓంకారములోనే లీనమయిపోవటం, నాలోపలా, బయటా అంతటా ఆ నాదాన్ని నేను అనుభూతి చెందటం గమనించారు. వారు నన్ను 'ఓంకార స్వామి' అని పిలిచేవారు. అది నాకు చాలా బాగా సరిపోయిందనిపిస్తుంది. పూర్తిగా ఆ పేరు నాకు తగినదే అవుతుంది. ప్రణవనాదాన్ని నేను నా శరీరంలోని అణువణువునా, ప్రతి జీవకణంలో ప్రతిధ్వనించటం గమనించాను. నా ఊపిరి కూడా

ఓంకారాన్నే ఉచ్ఛరిస్తోంది. ఓంకారము అజ్ఞానమనే చీకట్లను చీల్చుకుని జ్ఞానజ్యోతిని వెలిగించి ఆత్మానందంలో మునిగిపోయేలా చేస్తుంది. కోట్లాది సూర్యుల తేజస్సును మనలో నింపుతుంది.

జాతి, మత, కుల బేధము లేకుండా భగవంతుని బిడ్డలందరూ ఓంకారము అనే నామము వలన రక్షింపబడుదురు గాక! అది అందరికి చెందుతుంది. సూర్యుడికే సూర్యుడయిన పరమాత్మ నామమే ప్రణవము. లోకాలన్నీ శాంతిమయమగు గాక! అందరూ శాంతిగా జీవించెదరు గాక!

**"ప్రణవో దనుః శరోహ్యాత్మా బ్రహ్మతల్లక్ష్య ముచ్యతే।**
**అప్రమత్తేన వేద్ధవ్యం। శరవత్ తన్మయో భవేత్"**

పవిత్రమయిన ఓంకారము ధనుస్సు, ఆత్మ బాణము వంటిది. దానితో లక్ష్యమయిన బ్రహ్మాన్ని సాధించాలి. లక్ష్యాన్ని సాధించాలంటే ఏకాగ్రత చాలా అవసరం. అప్పుడు సాధకుడు బ్రహ్మమే అవుతాడు. అప్పుడు బాణము ఎక్కుపెట్టేవాడు, లక్ష్యము ఏకమయి పోతాయి. అంతా బ్రహ్మమయమే.

ముండకోపనిషత్తు ప్రణవము యొక్క ప్రసిద్ధిని చక్కగా వివరిస్తోంది. అనాహత చక్రం నుండి ప్రణవం వెలువడుతుంది. హృదయ పద్మదళంలో కొలువైన పరమాత్మను ధ్యానించు. నిత్యం ప్రణవ మంత్రాన్ని జపించు. ఆ మంత్రం జపం వలన నీవు అజ్ఞానమనే సముద్రాన్ని అవలీలగా దాటిపోగల్గుతావు. వైభవమంతా భగవంతుడిదే!

ఓం తత్సత్ ఓం

**అధ్యాయం - 11**

# స్వర్గాశ్రమము

నేను ఎక్కడో మారుమూల ప్రాంతంలో చక్కని ఆదర్శవంతమయిన జీవితాన్ని గడుపుతున్నాను. భగవంతుడు నా యోగ క్షేమాలు చూడటానికి పవిత్రాత్మ స్వరూపులను

నా దగ్గరికి పంపించాడు. ఒక పర్యాయం మహంతు గారు నన్ను పరామర్శించడానికి వచ్చారు. నాకు ఏమయినా అవసరమయితే చెప్పమన్నారు. "భగవంతుడు నాకు అన్నీ సమకూర్చాడు. పైగా మీరు ఎంతో ప్రేమతో నన్ను సంరక్షిస్తున్నారు. ఇంకా ఇంతకంటే నాకు ఏమి కావాలి?" అంటూ కృతజ్ఞతాపూర్వకంగా బదులిచ్చాను.

"స్వామీజీ! మీరు ఒక లాంతరు దీపం ఉంచుకోండి. రాత్రివేళల్లో చీకట్లో తేళ్ళు వంటి విషకీటకాల నుండి మీకు రక్షణగా ఉంటుంది. నేనిప్పుడే మీ కోసం ఒక లాంతరు, దానిలోకి నూనె పంపిస్తాను" అన్నారు మహంతుగారు. "దయచేసి మీరు నా కోసం ఎలాంటి దీపం పంపించవద్దు. నాలో వెలుగుతున్న ఆత్మజ్యోతి ప్రకాశం వల్ల నేను ఎంతో సంతృప్తిగా ఉన్నాను. సుఖంగా ఉన్నాను. నేను ఆ ఆత్మజ్యోతితో మరింతగా అంటిపెట్టుకొని ఉండాలని కోరుకుంటున్నాను. బాహ్య జ్యోతులు నాకు అవసరం లేదు. భౌతికమయిన సౌకర్యాలు కావాలని అనుకుంటే నేను ఇల్లు వదలి వచ్చేవాడిని కాను. నన్ను నా అంతర్జ్యోతి స్వరూపుడితో కలిసి ఉండే విధంగా ఆశీర్వదించండి చాలు" అన్నాను.

మహంతు ఆత్మ ప్రకాశ్ గారు ఎంతో దయామయుడు, అంకిత భావం గలవాడు. నా సమాధానం అతడిని ఎంతో సంతోషపెట్టింది. చాలా సాధారణమయిన నా జీవన విధానము అతడికి నా పట్ల మరింతగా గౌరవాన్ని, అభిమానాన్ని పెంచింది. మా ఇద్దరి మధ్యా మంచి అనుబంధం ఉండేది.

ఒక తమిళ సాధువు నన్ను ఎంతగానో ప్రేమించి నాకు ప్రతి రోజు సేవలు అందించడానికి ఉదయం పదకొండు గంటల సమయంలో వచ్చేవాడు. సాధువులంతా కల్సి మా వంతు రొట్టెలు, పప్పు తీసుకుని జోలిలో వేసుకొని గంగాతీరం వెళ్లేవాళ్లము. భగవంతుని సన్నిధిని అనుభవిస్తూ ప్రశాంతంగా, మౌనంగా ధ్యానం చేసుకొనేవాళ్ళం. గంగాతీరంలోని చేపలు మమ్మల్ని చూడగానే దగ్గరికి వచ్చేవి. వాటికి చిన్న చిన్న రొట్టె ముక్కలు పెట్టటం చాలా సంతోషంగా ఉండేది.

నారాయణస్వామి చాలా భక్తిపరుడు. ఆయన నాకు ఎన్నో విధాలుగా సేవలు చేసేవాడు. అందువలన నేను ఎక్కువసేపు మౌనంగా ధ్యానం చేసుకోగలిగేవాడిని. మహంతు గారు నన్ను తనతో పాటు భాండాగారము లోని వంటశాలలో భోజనానికి

రమ్మని కబురు చేశారు. నేను ఆయనకి ధన్యవాదాలు తెలియచేస్తూ, నాకు గంగాతీరంలో ఆరుబయట ఆహారం తీసుకోవడం ఎంతో ఆనందాన్ని కల్గచేస్తుందని చెప్పాను. నారాయణస్వామి తనతో పాటు నా వంతు రొట్టెలు, పప్పు తెచ్చి పెట్టేవాడు. అతడు ఆ విధంగా సేవలందించటం వలన నేను చాలా సమయం గంగాతీరంలో ధ్యానం చేసుకోవటానికి అవకాశం చిక్కేది. నారాయణస్వామి వచ్చిన తర్వాత ఇద్దరము కల్సి గంగాతీరంలో ఆహారం స్వీకరించేవారము.

నారాయణస్వామి తన్ను తాను నాకు శిష్యుడిగా భావించుకుని నాకు ఎన్నో సేవలు చేసేవాడు. నా గది శుభ్రం చేసేవాడు. నా బట్టలు ఉతికి ఆరవేసేవాడు. నీటి పాత్ర శుభ్రం చేసేవాడు. కాని నేను అతడిని నా గురువు కంటే ఎక్కువగా భావించేవాడిని. నా కోసం ఆయన ఎంతో భక్తిరసమయిన భజనలు, కీర్తనలు పాడి వినిపించేవాడు. దక్షిణ ప్రాంత సాధుమహాత్ములయిన తాయుమానవర్, రామలింగ స్వామి మొదలైనవారి కీర్తనలు పాడేవాడు.

భగవంతుడు ఎంత మంచి వాడు. నా కోసం ఇంత అంకితభావంతో సేవ చేసే స్నేహితులను ఈ ఉపాధి కోసం ప్రసాదించాడు. దాని వలన నాకు భగవంతుని సన్నిధిలో సమయం గడపటానికి అన్ని అవకాశాలు దక్కాయి. ప్రశాంతంగా ధ్యానమగ్నుడనయ్యే వాడిని. నేను నాకు సేవలందించిన వారందరి పట్లా ఎంతో కృతజ్ఞుడిని అయి ఉంటాను. నారాయణస్వామిని భగవంతుడు అనుగ్రహించుగాక!

సాధువులందరికి నేను చాలా చిన్న వయస్సులోనే అమెరికా వెళ్ళాను అనే విషయం తెలిసిపోయింది. ఒక రోజు ఒక పొడుగరి, దృఢకాయుడు అయిన వ్యక్తి నా కుటీరానికి వచ్చి తన్ను షహరాన్‌పురా జిల్లా డిప్యూటీ కలెక్టర్‌గా పరిచయం చేసుకున్నాడు. నన్ను ఉపదేశం చేయమని అడిగారు. కాని నేను అతడితో “నిర్మలమయిన అంతరంగములో కొలువై ఉండే ఈశ్వరుడే నిజమయిన గురువు. కనుక ఆయనే ఉపదేశిస్తాడు” అని చెప్పాను. నా కోసం అతను యాలుకలు తెచ్చాడు. అతను నన్ను రకరకాల ప్రశ్నలు అడగసాగాడు. మధ్య మధ్య నా గది నంతా బాగా పరిశీలనగా గమనిస్తున్నాడు. నా గ్రంథాలన్నీ ఒక మూటలో ఉన్నాయి. అందులో ఏముంది అని అడిగి, నా సమాధానం కోసం ఎదురుచూడకుండానే దాన్ని విప్పి చూడసాగాడు. నేను చిన్నవాడిని, పైగా లోకజ్ఞానం బొత్తిగా లేదు. అందుచేత అతని చేష్టలన్నింటిని మౌనంగా గమనించసాగాను.

నా కుటీరమంతా వెతికినా గ్రంథాలు తప్ప అతనికి ఏమీ దొరకలేదు. నాకు క్షమాపణలు చెప్పి అతడు వెళ్ళిపోయాడు. వెళ్ళేటప్పుడు నాకు బుట్ట నిండా పళ్ళు పంపిస్తానని చెప్పాడు గురుదక్షిణగా.

మహంతు ఆత్మప్రకాష్ గారు ఈ విషయం తెలుసుకొని, అలాంటి వ్యక్తులతో చాలా జాగ్రత్తగా మసులుకోవాలని, అతను డిప్యూటీ కలెక్టరు కాదని, నేర పరిశోధక శాఖ నుండి వచ్చిన పోలీస్ అని చెప్పాడు. నేను అమెరికా వెళ్ళి వచ్చాను అనే విషయం అందరికీ తెలియడం వల్ల పోలీస్ వాళ్ళు బహుశా నేను ఏదయినా విప్లవ రాజకీయ సంస్థకు చెందినవాడినని, విప్లవకారులతో కలిసి బాంబులు తయారుచేసి విధ్వంసం సృష్టించడానికి వచ్చి ఉంటానని అనుమానించారు. అణుబాంబులు తయారు చేయటంలో నాకు ఎలాంటి ఆసక్తి లేదు కాని, ప్రేమ, దయ, కరుణ అనే అణుబాంబుల పట్ల నాకు ఎంతో ఆసక్తి ఉంది. వాటితో ఈ ప్రపంచాన్నంతా జయించవచ్చు. అందరికి శాంతి సౌఖ్యాలను పంచిపెట్టవచ్చు.

మానవజన్మ సాఫల్యతను అర్థం చేసుకుని, సర్వత్రా ఈశ్వరుడిని దర్శించగలిగిన ఆత్మజ్ఞాన స్వరూపులయిన మహనీయులు అరుదయిన ఆత్మజ్ఞులు. వారిని భగవంతుడు ఆశీర్వదించుగాక!

అనాది కాలం నుండి హిమాలయాలలో ఎందరో యోగిపుంగవులు, ఋషులు, మహాత్ములు, మహర్షులు సాధనలో, తపస్సులో తమ పవిత్రమయిన జీవితాలను గడుపుతూ ప్రపంచానికి శాంతిని ప్రసాదిస్తున్నారు. అటువంటి మహాత్ములను దర్శించడానికి వారి ఆశీర్వచనాలు పొందటానికి ఎంతో వ్యయప్రయాసలకు ఓర్చి ఎక్కడెక్కడి నుండో యాత్రికులు వస్తు ఉంటారు. వారిలో ధనవంతులు ఉంటారు, దరిద్రులుంటారు. యువకులు, ముసలివారు ఉంటారు. మహోన్నతమయిన హిమగిరి శిఖరాలను దర్శించి పునీతులవుతారు. మహాత్ములను దర్శించి ఎంతో స్ఫూర్తిని, శాంతిని పొందుతారు.

యాత్రికులు సాధుసంతులకు, యోగులకు రకరకాల బహుమతులిస్తూ ఉంటారు. కొందరు ఫలాలు సమర్పిస్తే, మరికొందరు డబ్బులు ఇస్తారు. అక్కడ ఉండే సాధువుల్లో కొందరు కేవలం యాత్రికులు ఇచ్చే కానుకలు కోసం సాధు వేషధారులై ఉంటారు. వారు నిజమయిన సాధువులు కారు. కాని మహాత్ములయిన సాధుసంతులు మౌనంగా

ధ్యానం చేసుకుంటూ ఎంతో సంతృప్తిగా జీవిస్తుంటారు. వాళ్ళకి భౌతిక సంపదల పట్ల ఎలాంటి ఆసక్తి ఉండదు. వారు నిరంతరము భగవధ్యానంలో ఆత్మానందంలో మునిగి తేలుతూ ఉంటారు. నిజమయిన సాధు దర్శనం వల్ల కలిగే పుణ్యఫలం అలాంటి మహాత్ముల పాదసేవ వలన లభిస్తుంది.

ఒక రోజు రష్యా నుండి ఒక ధనవంతుడు వచ్చాడు. డబ్బంటే అతనికి లెక్కలేనట్లు ఉంది. అతని వద్ద నోట్ల కట్టలు చాలా ఉన్నాయి. అతని సామాన్లు మోసుకు వచ్చిన కూలి వానికి రెండు వందల రూపాయలు ఇచ్చాడు. అడిగిన వారందరికి, సాధువులకు ఒక్కొక్కరికి వంద రూపాయలు ఇచ్చాడు. అతడిని నా కుటీరములోనికి తీసుకు వచ్చారు. ఆ సమయంలో నేను ఏకాగ్రతగా అవధూత గీత చదువుతున్నాను. కొద్దిసేపు అతను నిశ్శబ్దంగా నేను చదువుతున్న విషయాలు వింటూ కూర్చున్నాడు. ఎంతోసేపు అతను అలా వింటూ కూర్చోలేకపోయాడు. వెళ్ళిపోవటానికి లేచి నిలబడ్డాడు. కాని నేను అతనితో అవధూత గీతలోని కొన్ని వాక్యాలను చదవమని చెప్పి అతనితో కొద్ది సేపు ధ్యానం చేయించాను. అతను వెళ్ళే ముందు నా కోసం తెచ్చినవి అక్కడపెడుతూ "స్వామీజీ! మీరు ఆత్మజ్ఞానులు. నా దగ్గర నుండి మీరు ఏమీ ఆశించరని నాకు తెలుసు. ఎందుకంటే మీ వద్ద అమూల్యమైన జ్ఞాన సంపద ఉంది" అని నమస్కరించాడు. అతని భక్తి, ప్రేమపూర్వకమయిన పరామర్శ నాకు ఎప్పుడూ జ్ఞాపకముంటాయి.

దేనికి పనికిరాదు అని వదిలివేసిన రాయి కూడా గృహ నిర్మాణానికి పనికి వస్తుంది. పునాది వేయడానికి దాన్నే తాపీమేస్త్రి వాడవచ్చు. అదేవిధంగా స్వర్గాశ్రమానికి వచ్చిన కొత్తలో మహంతు నాకు నివాసం కోసం కుటీరం ఇవ్వడానికి నిరాకరించి, చివరికి దూరంగా ఏదో మూలనున్న కుటీరాన్నిచ్చాడు. కాని నేను నా నిరాడంబరమయిన జీవన విధానము ద్వారా స్వర్గాశ్రమములోని సాధువులందరికి ప్రేమపాత్రుడనయ్యాను. అక్కడ పనిచేసేవాళ్లు, సంతులు, అలాగే దయాళువయిన మహంతు కూడా నా పట్ల ఎంతో ప్రేమ చూపించేవారు. స్వర్గాశ్రమములో సుమారు 200 నుండి 250 మంది సాధువులు నివాసముండేవారు. దయాళ్‌షరన్ ప్రకాశ్ గారు కూడా వీళ్ళలో ఒకరు. అతను నన్ను ఎంతగానో ప్రేమించేవాడు. మహంతు గారికి ఆయన సహాయకారిగా ఉంటూ అక్కడికి వచ్చే యాత్రికుల మంచిచెడ్డలు చూస్తూ, అన్ని బాధ్యతలు సక్రమంగా నిర్వహించేవారు. దయాళు ప్రకాశ్ గారు ఉన్నతాసనం అయిన గద్దెపై కూర్చొని అక్కడికి

వచ్చే యాత్రికులను ఏదో ఒకటి చెపుతూ ఉండేవారు. నేను నా ఉత్తరాలు పోస్టు డబ్బాలో వేయడానికి లేదా తీసుకోవటానికి వెళ్ళినప్పుడు, వారిని గాని, మహంతుగారిని గాని కలవడానికి వెళ్ళినప్పుడు వారు నన్ను బలవంతంగా ఆ ఉన్నతాసనం లాంటి గద్దెమీద కూర్చోబెట్టి తాము క్రింద కూర్చునేవారు. అది నాకు ఇష్టం ఉండేది కాదు. అయితే వారికి కష్టం కల్గించలేక మొహమాటంగా కూర్చునేవాడిని. వారు చూపించే ఆదరాభిమానాలకు నేను అర్హుడినేనా అనిపించేది నాకు.

వారు నా కోసం పంచదార, నెయ్యి, బాదంపప్పులు, ద్రాక్షపళ్ళు ఇంకా ఇతర పళ్ళు, మిఠాయిలు మొదలయినవి పంపేవారు. నారాయణస్వామి ఈ పదార్థాలన్నింటిని క్షేత్రంనుండి నా కోసం తీసుకు వచ్చేవాడు. నేను వాటిని ఇతర సాధువులకు, నా కోసం వచ్చే యాత్రికులకు, నారాయణ స్వామికి పంచిపెట్టేవాడిని. నా దర్శనం కోసం ఎంతో ముఖ్యమయిన వాళ్ళు చాలా మంది వస్తూ ఉండేవారు. మహంతు గారు నా నివాసాన్ని కుటీరము నుండి రెండు గదులు, వరండా ఉన్న కాటేజీకి మార్చారు. అక్కడి నుండి గంగానది కనిపించేది. ఇప్పుడు నాకు ఎంతో సౌకర్యంగా ఉంది. కాని నా పాత కుటీరంలో ఎంతో నిశ్శబ్దంగా, ప్రశాంతంగా ఉండేది.

హిమాలయాల్లోని ఆశ్రమాలు, మఠాలలో కూడా వేడిగా ఉన్నప్పుడు సాధువులు చల్లని పానీయాన్ని తయారుచేస్తారు. దాన్ని 'తండాయీ' అంటారు. అది దాహాన్ని తీర్చుతుంది. ముఖ్యమయిన అతిథులు వచ్చినప్పుడు ఆ పానీయాన్ని ఇస్తూ ఉంటారు. నానబెట్టిన బాదంపప్పులు, నల్ల మిరియాలు, గసగసాలు నూరిన ముద్ద, చారపప్పులు దంచిన పదార్థాలన్నింటిని చల్లని పాలల్లో కలుపుతారు. మహంతుగారు తరుచుగా పానీయాన్ని నా కోసం పంపించేవారు.

ఒకసారి అలా పంపిన పానీయంలో భంగు లాంటి పదార్థం ఏదో కలిసింది. ఆ విషయం నాకు తెలియదు. అది త్రాగినప్పుడు రుచిలో ఎలాంటి తేడా నాకు తెలియలేదు. కాని ఆ పానీయం త్రాగిన తర్వాత నా శరీరం గాలిలో తేలిపోతున్నట్లు మారిపోయింది. నేను బాహ్య ప్రపంచాన్ని మర్చిపోయి మత్తుగా అనిర్వచనీయమైన స్థితిలో ఉండిపోయాను. శరీరము, బుద్ధి అన్నింటికీ అతీతంగా మనస్సు గాలిలో తేలిపోతున్నట్లుగా ఉంది. నిర్వికల్ప సమాధి స్థితిలో ఉన్నట్లుగా, భగవంతుడు కల్పించిన అనుభవంలా అనిపించింది. గంటల కొద్దీ అలాంటి స్థితిలో వళ్ళు మర్చి ఉండిపోయాను. రోజంతా గడిచిపోయింది. ఇప్పటికీ

ఆ అనుభవం తలుచుకుంటే ఆ అనిర్వచనీయమైన ఆనంద స్థితి మరుపు రాదు. అరవై సంవత్సరాలు గడిచిపోయినా ఆ అనుభూతి ఇంకా నన్ను వదలిపోలేదు. నా గత జన్మలలో నేను ఎటువంటి కర్మలు చేశానో నాకు తెలియదు. అలాంటి అద్భుతమయిన అనుభవాన్ని భగవంతుడు అంత చిన్న వయస్సులోనే నాకు అందించాడు. అయితే అది సహజంగా నిర్వికల్ప సమాధి స్థితిలో పొందిన ఆనందం కాదు. హిమాలయ వనమూలిక మహిమ. అది అత్యంత సహజంగా ధ్యానస్థితిలో నిర్వికల్ప సమాధి కల్గినప్పుడు ఆనందం వర్ణింపలేనిది. శాశ్వతంగా ఉండిపోతుంది. ఆత్మసాక్షాత్కారం పొందిన వారికి ఆ స్థితి కల్గుతుంది.

నాలో నేను ఆత్మ పరిశీలన చేసుకున్నప్పుడు నేను ఒక నిర్ణయానికి వచ్చాను. నిజానికి నేను పొందిన అనుభవం చాలా ఉన్నతమయినదే అయినా అది సహజంగా సమాధిలో రావాలి. మూలికల సహాయంతో కాదనిపించింది. అయినప్పటికి అలాంటి గొప్ప అనుభూతినిచ్చిన భగవంతునికి సదా కృతజ్ఞతలు తెలియచేసుకుంటున్నాను.

స్వర్గాశ్రమములో భూగర్భంలో రెండు గుహలుండేవి. అక్కడ కొందరు మహనీయులయిన సాధు మహాత్ములు బాహ్య స్పృహ కూడా లేకుండా ధ్యానంలో నిమగ్నమయి సాధనలో ఉండేవారు. నాకు కూడా వారిలాగా సాధన చేసుకోవాలనే సంకల్పం కలిగింది. నేనింకా చిన్న వయస్సులో ఉండటం వలన సాధ్యం కాదనిపించింది. అందువల్ల కనీసం అలాంటి సాధు పుంగవులను దర్శించి, వారి ఆశీర్వాదాలు పొంది సంతృప్తి పడాలనుకున్నాను. నేనా గుహలోకి వెళ్ళినప్పుడు అక్కడ చాలా కాలం నుండి తపస్సు ఆచరిస్తున్న సాధు మహాత్ముని దర్శించాను. ఆయన మౌనదీక్షలో ఉన్నారు. అందుచేత ఆయన ఎవరితో మాట్లాడేవారు కాదు. నా అదృష్టం చాలా బాగుండి నేనా మహాత్ముని ఎదురుగా చాలాసేపు కూర్చున్నాను. అప్పుడు ఆ మహనీయుడు చాలా నెమ్మదిగా హృదయపు లోతుల్లోంచి వస్తున్నట్లున్న గొంతుతో గొణుగుతున్నట్లుగా హిందీలో అడిగారు. "స్వామీ! బిడ్డా! ఏమీ కావాలి నీకు?" అప్పుడు నా సంతోషానికి అవధులు లేవనిపించింది. "మీ ఆశీర్వాదాలు కావాలి" అన్నాను. ఆయన ప్రేమగా చూస్తూ "వెళ్లు బిడ్డా! నీకు మేలు జరుగుతుంది" అని ఆశీర్వదించారు. అది నా జీవితంలో ఎంతో పవిత్రమయిన ఆశీర్వచనాలు అందుకొన్న రోజు. నా జీవితాంతం ఆ మధుర క్షణాలు నా హృదయంలో పదిలంగా దాచుకున్నాను. భగవంతుని గొప్పతనం వర్ణించనలవి

కానిది. మౌనంగా ధ్యానంలో గడిపే సాధు మహాత్ములకు దీర్ఘ జీవితాన్ని ప్రసాదించుగాక! కొండ గుహల్లో సాధన చేసే అలాంటి మహాత్ముల తపస్సిద్ధి వలన ప్రపంచానికి శాంతి లభించుగాక!

దయాళ్‌షరన్ ప్రకాశ్ గారు దశనామ సన్న్యాస సంప్రదాయానికి చెందినవారు. స్వర్గాశ్రమములో వారిని రెండవ మహంతుగా భావించేవారు. సాధువులందరూ అతడిని 'మహాత్మా! అని సంబోధించేవారు. ఆయన నా పట్ల ఎంతో గౌరవాన్ని ప్రకటిస్తూ నన్ను తన గురువుగా భావించేవాడు. ఆయన నన్ను తన గ్రామానికి ఆహ్వానించాడు. ఆ గ్రామ ప్రజలకి నన్ను పరిచయం చేశాడు. అప్పటికే నేను రాజమండ్రి నుండి బయలుదేరి సాధన కోసం వచ్చి సంవత్సర కాలము దాటిపోవటం వలన ఆంధ్రాలోని నా భక్తులు, స్నేహితులు నన్ను చూడడానికి తపించసాగారు. నా తిరుగు ప్రయాణం కోసం, రైలు టిక్కెట్టు కొని పంపటమే కాక, దారి ఖర్చుల కోసం కొంత డబ్బును కూడా పంపారు. తొందరగా తిరిగి రావాలని వారంతా కోరుకుంటున్నారు. నా భక్తులకు సేవలందించడానికి నేను కూడా ఎదురు చూస్తున్నాను. అందువలన తొందరలోనే ఆంధ్రాకు తిరిగి వెళ్ళడానికి నిశ్చయించుకున్నారు. మహంతు దగ్గర వీడ్కోలు తీసుకొని నా తిరుగు ప్రయాణానికి సన్నద్ధమయ్యాను.

నేను ప్రయాణం అవుతున్న విషయం తెలుసుకున్న దయాళ్‌షరన్ గారు నన్ను తనతో వారి స్వగ్రామమయిన రోహత్‌కు ఆహ్వానించారు. అది మీరట్ జిల్లాలో ఉంది. అక్కడి నుండి నాతో పాటుగా ఆంధ్ర దేశానికి వచ్చి నా కుటుంబాన్ని, స్నేహితులను కలుస్తానని చెప్పాడు.

దయాళ్‌షరన్ గారు మంచి వక్త. సంవత్సరంలో ఆరు నెలలు స్వర్గాశ్రమములో యాత్రికుల రద్దీ బాగా ఉండే సమయంలో మహంతు గారికి మంచి సహాయకారిగా ఉండేవాడు. యాత్రికులు, భక్తులు ఆశ్రమ నిర్వహణ కోసం భూరి విరాళాలు ఇస్తుండేవారు. అలాగే సాధు మహాత్ముల భోజన సదుపాయాల నిమిత్తం కూడా ఇస్తుండేవారు. దయాళ్‌షరన్ గారు స్వగ్రామానికి వెళ్ళేటప్పుడు మహంతు గారు అతని ఊరి వారి సాయం కోసం ధనము, వస్తువులు ఇచ్చి పంపించేవారు.

నేను అతని స్వగ్రామంలో కొద్ది రోజులు ఉన్నప్పుడు ఎంతో ప్రేమతో ఆదరించాడు. గ్రామస్థులందరికి నన్ను పరిచయం చేస్తూ ఆ కాలంలో ఉండే మహాత్ములలో నేను చాలా గొప్పవాడినని చెప్పాడు. అంతేకాకుండా చాలా చిన్న వయస్సులోనే నేను అమెరికా వెళ్ళి వచ్చానని, అయినా ఎలాంటి భేషజం లేకుండా స్వర్గాశ్రమములో నేను ఎంతో నిరాడంబరమయిన జీవితం గడిపేవాడినని చెప్పాడు. చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు కూడా నా దర్శనార్థమై వస్తుండేవారు. నేను వారికి ఇంగ్లీషులో ప్రవచనాలు చెపుతుండగా ఎవరో ఒకరు దానిని హిందీలోకి తర్జుమా చేసి చెప్పేవారు. నేను వారితో చక్కని భజనలు చేయించేవాడిని.

ఎగిసిపడే ప్రతి కెరటం విరిగి పడక తప్పదు. మళ్ళీ అది ఎగిసి పడుతుంది. నేను అమెరికాలో చదువుకోవటానికి వెళ్ళి విఫలుడనయి తిరిగి వచ్చినప్పుడు పిఠాపురం రైల్వే స్టేషన్‌లో నాకు స్వాగతం పలకటానికి ఒక్కరు కూడా రాలేదు. కాని ఇప్పుడు నేను హిమాలయాల నుండి ఒక బాల సన్యాసిగా తపస్సు నుండి తిరిగి వచ్చినప్పుడు ఘనమయిన స్వాగతం లభించింది. తెలియకుండానే నా ప్రమేయం లేకుండా నా మనస్సు ఈ రెండు సంఘటనలను పోల్చి చూస్తోంది. నన్నిప్పుడు నూతనమయిన తేజస్సులో, సన్నగా, పొడుగ్గా, కాంతులీనుతున్న యువ సన్యాసిగా గుర్తిస్తున్నారు. భగవంతుని లీలలు చాలా చిత్రంగా ఉంటాయి. నా కుటుంబ సభ్యులు, స్నేహితులు ప్రేమతో నా రాకను స్వాగతించారు. వాళ్ళందరూ చాలా కుతూహలంగా ఉన్నారు. హిమాలయాల్లో నా సాధనల గురించి వినటానికి, అలాగే నా వద్ద మంత్రోపదేశం పొందటానికి సిద్ధంగా ఉన్నారు. నా ఆధ్యాత్మిక అనుభవాలను వారితో పంచుకుని వారందరికి ఆధ్యాత్మికోన్నతి కల్గించి సేవ చేసేందుకు ఇది మంచి అవకాశంగా భావించాను. ఎంతో ఆనందంగా నేను వారందరితో భగవన్నామాన్ని పలికిస్తూ సంకీర్తనలు, భజనలు చేశాను.

**హరే రామ, హరే రామ, రామ రామ హరే హరే!**
**హరే కృష్ణ, హరే కృష్ణ, కృష్ణ కృష్ణ హరే హరే!**

**శ్రీరామ జయరామ జయ జయ రామ ఓం!**
**ఓం నమశ్శివాయ, ఓం శివాయ నమః!**

ప్రతి మంత్రము కూడా పరమ పవిత్రమయిన ఓంకారముతో మొదలవుతుంది. అలాగే చివరల్లో కూడా ఓంకారము వస్తుంది. చివరిలో ఓంకారాన్ని మూడుసార్లు జపించాలి.

భక్తులు నన్ను వారి ఇళ్ళకు ఒంటెద్ల బళ్ళ మీద, అలాగే రెండెద్ల బళ్ళ మీద భగవన్నామాన్ని కీర్తిస్తూ ఊరేగింపుగా తీసుకువెళుతుండేవారు. ఆ రోజుల్లో కార్లు గాని, బస్సులు గాని అందుబాటులో ఉండేవి కావు.

భక్తులు మంత్రదీక్ష కోసం అడిగినపుడు నేను ఏ మాత్రం తటపటాయించకుండా వారికి మంత్రోపదేశం చేసి వారి కోరిక తీర్చి తృప్తి పరిచేవాడిని. కేవలం మందు మాత్రమే జబ్బు నయం చేయదు. దానిపై విశ్వాసం కూడా చాలా అవసరం. అందుచేత నేను వారికి తగిన మంత్రాన్నే ఇచ్చేవాడిని. వారి ఇష్ట దైవము ఎవరో తెలుసుకుని ఆ మంత్రోపదేశం చేసేవాడిని. ఈ ఉపాధికి జన్మనిచ్చిన తండ్రి గారు వచ్చి మంత్రోపదేశం ఇవ్వమని ప్రార్థించినప్పుడు నేను ఎంతో గాఢంగా విచలితుడనయ్యాను. నేను ఆయనకి చాలా సున్నితంగా, సూటిగా చెప్పటానికి, సేవించడానికి ప్రయత్నించాను. నేను హిమాలయాలలో తపస్సాధనలో ఉండగా వాడిన పాదుకలు, కొబ్బరి చిప్పతో తయారయిన కమండలాన్ని ఇవ్వమని వారు అడిగారు. తండ్రి గారు వాటిని ఎంతో పవిత్రంగా భావించారు నేను వాటిని ఆయనకిచ్చినప్పుడు.

నా బంధువులు, స్నేహితులు నన్ను సాధువుగా చూస్తున్నందుకు చాలా ఆనందించాను. అలాగే ప్రతి గ్రామంలో నేను చేస్తున్న ధార్మిక ప్రచారాన్ని గమనించి చాలా సంతోషించారు.

స్వర్గాశ్రమము నుండి మహంతు గారి వద్ద నుండి ఉత్తరాలు రాసాగాయి. అక్కడి సాధుసంతులు, తల్లి గంగా భవాని, తండ్రి హిమగిరి పర్వత శ్రేణులు నా రాక కోసం ఎదురుచూస్తున్నారని. స్వాగతం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని. నా వాళ్ళంతా నేను మళ్ళీ హిమాలయాలకు ప్రయాణమయ్యే సమయంలో చాలా విచారించారు. వాళ్ళ ఆధ్యాత్మిక జీవితాలకి ఆసరాగా ఉండకుండా వాళ్ళని నేను అనాథలుగా వదిలిపెట్టి వెళుతున్నట్లుగా భావించారు. వాళ్ళని ప్రతి రోజు వారి ఆధ్యాత్మిక సాధనలను డైరీలో వ్రాయమని చెప్పాను. అలాగే సాధనలో వారి పురోగతిని గూర్చి నాకు ఉత్తరాలు వ్రాయమని కూడా చెప్పాను. హిమాలయాల్లో ఉండే నేను అవి చదివి వారికి తగిన

సూచనలు, సలహాలు పంపిస్తానని వాగ్దానం చేసి చెప్పాను. వారికి నేను ఉపదేశించిన మంత్రాన్ని బాగా సాధన చేస్తూ ఉండాలని, తొందరలోనే తిరిగి వస్తానని నమ్మకంగా చెప్పి మంచి రోజు చూసుకొని ఆంధ్రదేశాన్ని వదలిపెట్టి నా అసలయిన ఆధ్యాత్మిక పుట్టినిల్లయిన హిమాలయాలకు ప్రయాణమయ్యాను.

సంస్కృతంలో ఒక మంచి శ్లోకం ఉంది. నేనెల్లప్పుడూ ఆ శ్లోకాన్ని స్మరిస్తూ ఉంటాను. భగవంతుని బిడ్డలయిన ఆధ్యాత్మిక వేత్తలతో కలిసి పంచుకొంటూ ఉంటాను. అది చాలా ప్రసిద్ధి చెందిన శ్లోకము.

**దేహో దేవాలయః ప్రోక్తో, జీవో దేవః సనాతనః**
**త్యజేదజ్ఞాన నిర్మాల్యం సోఽహం భావేన పూజయేత్॥**

దేహమే భగవంతునికి నిజమయిన దేవాలయము. ప్రతి వ్యక్తి విశ్వంతో సమానమే. జ్ఞానమే అజ్ఞానాన్ని తరిమివేస్తుంది. భేదభావాన్ని, ద్వంద్వాలను తరిమివేస్తుంది. అందుచేత భగవంతుని 'సోఽహం' అంటూ ఆరాధించు. నీ ప్రతి శ్వాస నీవే విశ్వశక్తివని గుర్తు చేస్తుందని అర్థం చేసుకోవటానికి ప్రయత్నించు.

ఆ రోజుల్లోనే నేను 'జీవన్ముక్తి వివేకం' స్వేచ్ఛామయ జీవనం లేదా బంధ విముక్తిని గురించి వివరించే అత్యద్భుతమైన ఆధ్యాత్మిక గ్రంథాన్ని అధ్యయనం చేశాను. మరణం నుండి లేదా మరణించిన తర్వాత లభించే ముక్తి వలన అసలు ప్రయోజనం ఏముంటుంది? జీవించి ఉండగానే, ఇప్పుడే జీవన్ముక్తి స్థితి పొందాలనుకొంటున్నాను నేను. ఆ గ్రంథపఠనం నిజంగా నాకు ఆధ్యాత్మికంగా ఎంతో స్ఫూర్తిని, ఉన్నతమయిన స్థితిని కలిగించింది. నేను ఏదయినా గ్రంథాన్ని మొదటి పేజి నుండి చివరి పేజి వరకు కొన్ని గంటల్లో తిరగేసి పక్కన పడేసే రకం కాదు. లేదా రెండు మూడు రోజులు చదివి తర్వాత మర్చిపోయే రకం కూడా కాదు. గ్రంథ పఠనం అంటే గ్రంథంలోని కొన్ని వాక్యాలను చదివి, జీర్ణించుకోవాలి. అప్పుడు నేను గ్రంథాన్ని మూసివేసి కళ్ళు మూసుకొని ధ్యానంలో కూర్చుని శాంతంగా, నిశ్శబ్దంగా ఆ గ్రంథంలోని వాక్యాలను మననం చేస్తూ దాని సారాన్ని గ్రహించడానికి ప్రయత్నిస్తాను. ఆ గ్రంథంలోని అమూల్యమయిన విషయాలు కొన్ని పాఠకుల కోసం చెప్పాలనుకుంటున్నాను. అవి నాకు ఎంతో సహాయపడ్డాయి. వాటిని నేను మూడు మంత్రాలుగా భావిస్తుంటాను.

1) జ్ఞానం, 2) మనోనాశనం, 3) వాసనాక్షయం – ఈ మూడు పవిత్రమయిన సుభాషితాలు.

జ్ఞానం అంటే ప్రజ్ఞానం బ్రహ్మ అనే భావము. బ్రహ్మము తప్ప అన్యమయినది ఏమీ లేదు అనే వ్యక్తిగత అనుభవము ఒక్క క్షణం కూడా వదలకుండా ఉండగల్గడం. మనోనాశనం అంటే మనస్సును సమూలంగా నశింపచేయటం. బుద్ధిలోని ఆలోచనలు స్తంభింపచేయటం. మనస్సు ఎప్పుడూ వికారం చెందుతూ ఉంటుంది. రకరకాలుగా ఊహాగానాలు చేస్తూ ఉంటుంది. వాటిని వేళ్ళు, కొమ్మలు నరికి వేసినట్లుగా సమూలంగా పెకలించి వేయాలంటే కళ్ళు మూసుకొని ధ్యానంలో మనస్సును ఏకాగ్రత చెందించాలి. మనస్సు పనిచేయటం అప్పుడు నిలిచిపోతుంది. ప్రవృత్తి ఆగిపోయి నివృత్తి స్థితిలోకి వెళ్ళిపోవాలి. అప్పుడే జీవితం నుండి విముక్తి లభిస్తుంది. ఇక మూడవదయిన వాసనా క్షయం. జీవుడికి రకరకాల వాసనలుంటాయి. కొన్ని అభిప్రాయాలుంటాయి. ఈ జీవితం గురించే కాదు, గత జన్మల నుండి ఆ సంస్కారాలన్నీ వస్తుంటాయి. వాటన్నింటిని నాశనం చేయాలి. జ్ఞానాగ్నిలో జన్మజన్మాంతర వాసనలన్నింటిని దగ్ధం చేసి వేయాలి. అప్పుడే అతడిని దైవజ్ఞానం, విజ్ఞానం విస్తరిస్తుంది. అప్పుడే ఆత్మోన్నతి కల్గుతుంది.

ఈ మూడు ఒకదాని తర్వాత ఒకటి సాధించడానికి ప్రయత్నం చేయటం సరికాదు. మూడింటిని ఏక కాలంలో సాధన చేయాల్సి ఉంటుంది. ఉదాహరణకి మనం భోజనం చేసేటప్పుడు అన్నము, కూరలు, పప్పు విడివిడిగా తినకుండా అన్నీ కలిపి తింటాము కదా! అప్పుడే అది సంపూర్ణమయిన ఆహారం అవుతుంది. అదేవిధంగా జ్ఞానము అనేది పునాది వంటిది. దాన్ని ఆధారంగా జీవుడు తనలోని వాసనలన్నింటిని ఒక్కోదానిని వదిలించు కోవటానికి సాధన చేయాలి. సహస్ర సూర్యతేజోమయమయిన జ్ఞానాగ్ని సాయంతోనే దీనిని సాధించగలము. ఉన్నతమయిన ఆధ్యాత్మికోన్నతి సాధించిన పవిత్రాత్మ స్వరూపులందరూ ఈ విధంగానే ఉన్నతిని పొందారు. సంపూర్ణ శరణాగతి దైవం పట్ల కలిగి ఉండడమే ఆత్మసాక్షాత్కారాన్ని పొందటానికి చెల్లించవలసిన మూల్యం.

ఆ రోజుల్లో నేను గంగానది తీరంలోని ఎత్తైన పర్వతాల మీద చాలా దూరం నడిచేవాడిని. గాఢమయిన ధ్యానంలో విలీనమయ్యేవాడిని. గంగానది నిశ్శబ్దంగా పారుతున్నప్పుడు అది నెమ్మదిగా ఓంకార నామాన్ని జపిస్తున్న సవ్వడులు విని ఆనందించే

వాడిని. కొండల మీదనుండి, రాళ్ళ మీదనుండి వడివడిగా పెద్ద శబ్దంతో ఉరుకలెత్తినప్పుడు కూడా బిగ్గరగా ఓంకారాన్ని ఉచ్ఛరిస్తున్నట్లుగా అనిపించేది. గంగాతీరంలో ప్రశాంతంగా కూర్చుని మంత్ర జపం చేయటం ఒక అద్భుతమయిన అనుభవం.

స్వర్గాశ్రమంలో అనేక సంప్రదాయాలకు చెందిన సాధు మహాత్ములుండటం వలన సత్యాన్వేషకులయిన యాత్రికులకు అది స్వర్గధామంగా ఉండేది. కొన్నిసార్లు విదేశీ యాత్రికులు కూడా దర్శనార్థమై వస్తుండేవారు. అక్కడ వారు కొన్ని నెలలు, సంవత్సరాలు కూడా బస చేస్తుండేవారు. వాళ్ళు ఎంతో సాదాసీదాగా జీవించేవారు. యాత్రికులకు విదేశీ భక్తులు ప్రత్యేక ఆకర్షణగా కనబడేవారు. ఒక అమెరికా వనిత స్వర్గాశ్రమంలో నివాసముండేది. ఆమె వారానికి ఒక్కసారి క్షేత్రానికి వచ్చి గోధుమ పిండి, ఇతర ఆహార పదార్థాలు తీసుకువెళ్ళేది. సాధారణమయిన జీవితం గడిపేది. కొందరు సాధువులు అదేపనిగా వాగుతూ కాలక్షేపం చేస్తుండేవారు. మరికొందరు మహాత్ములు మౌనంగా వారి సాధనల్లో, ధ్యానంలో ప్రశాంతమయిన జీవితం గడిపేవారు. వారిని చూచి నాకు చాలా ఆనందం కలిగేది. ఈ విధంగా స్వర్గాశ్రమంలో ఆరు సంవత్సరాల కాలం గడిచిపోయింది.

నేను అక్కడున్న రోజుల్లో ఒకసారి హరిద్వార్‌లో కుంభమేళా జరిగింది. కుంభమేళా సాధు మహాత్ములకు పరమ పవిత్రమయినది, చాలా ముఖ్యమయినది. పన్నెండు సంవత్సరాలకి ఒకసారి వచ్చే కుంభమేళా అంటే సాధువులకు గొప్ప పండగలా ఉంటుంది. పవిత్రమయిన నదీతీరాల్లో వాటిని నిర్వహిస్తారు. త్రివేణి సంగమమయిన అలహాబాదులో జరుగుతుంది. ఆ సంవత్సరము శ్రీహరి స్వర్గసీమకు ముఖ ద్వారమయిన హరిద్వార్‌లో జరుగుతోంది. అన్ని సంప్రదాయాలకు చెందిన సాధు మహాత్ములు వారి వారి సంప్రదాయ పద్ధతుల్లో కుంభమేళాలో రకరకాల పూజల్లో పాల్గొంటారు. కొందరు మహా మండలేశ్వరులు ఏనుగు అంబారీలో ఊరేగింపుగా వస్తే, మరి కొందరు గుఱ్ఱాల మీద వస్తుంటారు శిష్య పరివారంతో. దురదృష్టకరమయిన విషయం చెప్పటానికి నాకు చాలా విచారంగా ఉంది. వీరిలో చాలా మంది కేవలం కాషాయ వస్త్రధారులు మాత్రమే అయి ఉంటారు కాని నిజమయిన సాధుమహాత్ములు కారు. కుంభమేళాకు వచ్చే అమాయకులయిన భక్తులు వీరికి ఉచితంగా భోజనము, దుస్తులు, దక్షిణలు ఇచ్చి గౌరవిస్తుంటారు. వాటి కోసం చాలా మంది సోమరిపోతులు కాషాయం ధరించి మేళాకు వస్తుంటారు.

ప్రాపంచిక భోగ భాగ్యాలను తృణప్రాయంగా త్యజించి భగవంతుని కోసం పరితపించే మహనీయులు అరుదుగా ఉంటారు. వారు కేవలం భగవంతుని దయ కోసం బ్రతుకుతారు తప్ప, లౌకిక సౌఖ్యాల కోసం తమ ఆత్మను అమ్ముకోరు. అలాంటి సాధు మహాత్ములు హిమాలయాల్లో, తపస్సాధనల్లో ఉండి ప్రపంచ శాంతి కోసం ధ్యానంలో ఉంటారు. అలాంటి మహనీయులు మాత్రమే సత్యాన్వేషకులకు మార్గదర్శనం చేయగలరు.

స్వర్గాశ్రమము పవిత్రమయిన పుణ్యక్షేత్రం కావటం వలన, సాధు సంతులతో నిండి ఉండడం చేత ప్రతి రోజూ రకరకాల వారు దర్శించడానికి వస్తుంటారు. వారిలో అన్ని మతాల వారుండేవారు. గొప్ప ధనవంతులు, నిరుపేదలు ఉండేవారు. కొందరు మంచి జ్ఞానవంతులు, మరికొందరు మూర్ఖులు కూడా ఉండేవారు. వయస్సు మళ్ళినవారు, యువకులు ఈ విధంగా అందరూ అక్కడ నివసించే మహాత్ములను దర్శించి తృప్తి చెందేవారు. వారిలో కొందరు అంకిత భావంతో కూడిన భక్తితో మమ్మల్ని వారి ఇళ్ళకు ఆహ్వానించేవారు. మహాత్ముల పాదస్పర్శ వలన వారి గృహాలు పావనమవుతాయని అభ్యర్థించేవారు. మహంతు గారికి సహాయ సహకారాలు అందించే దయాళ్‌షరన్ గారు ఒక ధనికుడయిన భక్తుడిని నా కుటీరానికి దర్శనం కోసం తీసుకువచ్చాడు. అతను ఢిల్లీ నివాసి. నేను అతనితో నా కుటీరంలో ప్రార్థన చేయించాను. ధ్యానం కూడా చేయించాను. కొంతకాలం తర్వాత నేను అతని కోరిక మేరకు అతని ఇంట్లో కొంత కాలమున్నాను.

స్వర్గాశ్రమానికి ఐదారు కిలోమీటర్ల దూరంలో బ్రహ్మపురి అనే దట్టమయిన అడవి ఉండేది. అది గంగానదికి ఆవలి తీరంలో ఉంది. ఆ భయంకరమయిన అడవి ప్రదేశంలో పులులు, చిరుతలు, ఎలుగుబంట్లు, ఇంకా ఇతర క్రూరమృగాలు యథేచ్ఛగా తిరుగు తుండేవి. శ్రీ రామతీర్థ స్వామీజీ ఆ పవిత్రమయిన ప్రదేశంలో నివసించారని, ధ్యానం, తపస్సులో కాలం గడిపారని తెలుసుకున్నప్పటి నుండి నా మనస్సు ఆ పవిత్రమయిన స్థలాన్ని దర్శించాలని, వారి లాగా నేను కూడా అక్కడ తపస్సాధనలు చేసుకోవాలని ఉవ్విళ్ళూర సాగింది. నా అంతరాత్మ ప్రబోధం మేరకు ఒక పవిత్రమయిన రోజు నేను ఒంటరిగా బ్రహ్మపురి కీకారణ్యం చేరుకున్నాను. నాకు అక్కడ ఎలాంటి క్రూరమృగాలు కనిపించలేదు. కాని ఎక్కడ చూచినా, హనుమంతుని స్వరూపమయిన వానర సేనలు యథేచ్ఛగా తిరుగుతూ కనిపించాయి. దుష్ట రావణాసురుడి చెరలో ఉన్న సీతమ్మ తల్లిని

రక్షించడానికి సముద్రానికి వారధి కట్టి యుద్ధంలో గెలవటానికి శ్రీరామునికి సేవలందించిన హనుమ మూర్తీభవించిన భక్తి స్వరూపం.

బ్రహ్మపురి అంటే బ్రహ్మదేవుని నగరమని అర్థం. ఆ ప్రదేశం ఎంతో ప్రశాంతంగా ఆహ్లాదకరంగా ఉంది. అక్కడ నివాసముండడానికి తగిన ప్రదేశం ఏమీ లేదు. గంగానది తీరంలో పడిపోవడానికి సిద్ధంగా ఉన్న చిన్న పూరిగుడిసె మాత్రం ఉంది. రాళ్ళతో నిండిన ఆ దట్టమయిన అడవిలో నేను నిశ్చలంగా ధ్యానమగ్నుడయ్యాను. నెమ్మదిగా, నిశ్చలంగా ప్రవహిస్తున్న గంగానది సవ్వడులు తప్ప అంతా నిశ్శబ్దంగా ఉంది. ఆ విధంగా ఎన్ని గంటలకాలం గడిచిపోయిందో తెలియదు. స్వామి రామతీర్థ అన్నట్లుగా "ఆహారం అవసరం లేకుండా రోజులు గడిచిపోతాయి. నిద్ర అవసరం లేకుండా రాత్రిళ్లు గడుస్తాయి." ఆత్మానందంలో మునకలు వేసేవాడికి, భగవంతుని అనుగ్రహం వలన నిద్రాహారాలతో అవసరమేముంది? బ్రహ్మములో లీనమయిన వాడికి నిద్రాహారాలు అవసరముండవు. అలాగే అతనికి సమయము, ప్రదేశము అన్న స్పృహ కూడా ఉండదు. నేను ఒక రాత్రంతా ఆ పాడుబడిన కుటీరంలో సోహంకారములో ఓలలాడుతూ బ్రహ్మానందంగా ధ్యానస్థితిలో ఉండిపోయాను.

నేను, నా శరీరము అనే భ్రాంతిని వదిలివేసిననాడు ఆత్మజ్యోతిని దర్శిస్తూ, అంతర్ముఖుడయి మానవ జన్మ పరమావధిని సాధిస్తాడు. నిరంతరము పరిణామము చెందే ప్రకృతి నుండి విముక్తిని పొంది పరిణామ రహితమయిన చైతన్య స్వరూపుడవుతాడు. నేను బ్రహ్మపురిలో గడిపినది చాలా తక్కువ సమయమే అయినా, అద్భుతమయిన ఆత్మశాంతిని పొందాను. ఒంటరిగా ప్రకృతి ఒడిలో పరవశించిన నేను నిర్భయంగా భగవంతుని సాన్నిధ్యాన్ని అనుభవంలోకి తెచ్చుకున్నాను. ఇప్పుడు చాలా సంవత్సరాలు గడిచిపోయినా బ్రహ్మపురిలో నా అనుభవం గుర్తు వచ్చినప్పుడు ఆ అనుభూతి అలాగే ఉంది అనిపిస్తుంది. అనుభవం నాకు నిరతిశయానందాన్నిచ్చింది. ఇవన్నీ వ్రాస్తున్నప్పుడు నేను ఆ గంగానది ప్రశాంతంగా ప్రవహించటము దర్శిస్తున్నాను. మనమిప్పుడు కళ్ళు మూసుకుని ధ్యానం చేద్దాం. మానసికంగా మనమిప్పుడు బ్రహ్మపురి కీకారణ్యంలో గంగానది తీరంలోని రాళ్ళ మీద కూర్చుని ధ్యానం చేస్తున్నట్లుగా ఊహించుకుందాము. సోహం, సోహం, సోహం అంటూ జపం చేద్దాము. నెమ్మదిగా అంతర్ముఖులమై ఆత్మజ్యోతిని దర్శిద్దాము. బ్రహ్మపురికి జయమగు గాక! అజ్ఞానాన్ని, అంధకారాన్ని తొలగించుగాక!

ఇష్టం లేకపోయినా నెమ్మదిగా నేను బ్రహ్మపురి నుండి అడుగులో అడుగు వేసుకుంటూ స్వర్గాశ్రమము వైపుగా బ్రహ్మ భావనతో, భగవచ్చింతనతో సాగిపోయాను. నా శరీరం గాలిలో తేలిపోతున్నట్లుగా ఉంది. నా బుద్ధి పనిచేస్తోంది అయినా స్వర్గాశ్రమానికి ఎలా వచ్చి చేరుకున్నానో అంత తక్కువ సమయంలో నాకు అర్థం కాలేదు. వైభవమంతా భగవంతుడిదే!

ఓం..ఓం..ఓం

**అధ్యాయం - 12**

# హిమాలయాలలో పాదయాత్ర

నేను హిమాలయాలకి వచ్చినప్పటి నుండి బదరీనాథ్ క్షేత్రాన్ని దర్శించాలని ఆలోచిస్తున్నాను. యాత్రాస్థలాలన్నింటిలోకి పవిత్రమయినది. అలాగే గంగోత్రిని కూడా దర్శించాలనుకున్నాను. పరమపవిత్రమయిన గంగానది పుట్టిన స్థలమది. యమునోత్రి యమునానది జన్మస్థలం. కేదార్‌నాథ్ శివమహాదేవుడి నివాస స్థలం. పశుపతి అజ్ఞానాంధకారాలను దూరం చేసేవాడు. ఆయన అనుగ్రహముతో మనల్ని నడిపిస్తేనే అక్కడికి మనం చేరుకోగల్గుతాము. ప్రారబ్ధకర్మ ఫలితమే అంతా.

నేను బదరీనాథ్ వరకే వెళ్ళగలిగాను. నాకు అంతవరకే భగవంతుని ఆశీస్సులు దొరికాయి. కేదారనాథ్, గంగోత్రి దానికి దగ్గరగానే ఉన్నా నాకంత అదృష్టం దక్కలేదు. వాటిని దర్శించేటందుకు.

బదరీనాథ్ క్షేత్రంలో ఆరునెలలు మాత్రమే పూజాదికాలు నిర్వహిస్తారు. సంవత్సరములో మిగిలిన ఆరునెలలు దేవాలయాన్ని మూసివేస్తారు. అది మంచుతో కప్పబడిపోతుంది ఆ సమయంలో. ఎప్పటిలాగే నేను ఒంటరిగా స్వర్గాశ్రమము ఎత్తైన పర్వత శిఖరాలను అధిరోహించడానికి బయలుదేరాను. చాలా మైళ్ళ దూరం దారి పెద్ద ఇబ్బంది పెట్టకుండా బాగానే ఉంది. ఎక్కువ కష్టపడకుండానే ఆయాసపడకుండా నడిచాను. కాని కొంత దూరం తర్వాత దారంతా జారిపోతున్నట్లుగా ఎత్తైన పర్వత

శిఖరాలను అధిగమించవలసి ఉంటుంది. పైకి ఎక్కేటప్పుడు ఊపిరి ఆడనట్టుగా ఉంటుంది. అతి కష్టం మీద ప్రయాణం సాగుతోంది. ఆ రోజుల్లో బదరీనాథ్ యాత్ర చేయాలంటే దారి అంత బాగుండేది కాదు. సన్నని కాలి బాట. ఇరుకైన ఆ రోడ్డు మీదే యాత్రికులు అతి జాగ్రత్తగా అడుగులో అడుగువేస్తూ వెళ్ళాలి. గమ్యం చేరుకోవటానికి బస్సులు గాని వేరే ఇతర వాహనాలు గానీ ఉండవు.

కొంతమంది యాత్రికులు డోలీల్లో ప్రయాణించేవారు. చిన్న మంచం లాంటి దానిపై ప్రయాణీకులు కూర్చుంటే నలుగురు కూలీలు వారిని మోసుకు వెళతారు. ముసలివాళ్ళు, నడవలేనివారు, ఆరోగ్యం బాగోలేని వారు సాధారణంగా అలాంటి డోలీల్లో వెళ్ళేవారు. అలాగే బాగా డబ్బున్న వాళ్ళు కూడా వాటిని ఉపయోగించేవారు. కాలినడకతో వెళ్ళినా, డోలీల్లో వెళ్ళినా చివరికి ఆ ఎత్తైన పర్వత శిఖరంపైనున్న పుణ్యక్షేత్రమయిన బదరీ క్షేత్రాన్ని చేరుకోవటమే గమ్యం. ఎక్కడ చూచినా అంతటా భగవంతుడు ఆ శంకరుని దర్శిస్తున్న అనుభూతి కలుగుతుంది. ఎంతటి అదృష్టం! దైవం అనుగ్రహం వలన అంతటా ఈశ్వరుని అనుభూతి కలుగుతోంది ఒక్కొక్క అడుగు వేస్తుంటే.

దారి పొడుగునా యాత్రికులు భగవన్నామాన్ని బిగ్గరగా ఉచ్చరిస్తూ, పెద్దగా కేకలు పెడుతూ, అరుస్తూ, పాటలు పాడుతూ ప్రయాణం కొనసాగిస్తారు. శివనామాన్ని జపించటం వలన మన ప్రయాణపు అలసట అంతా మాయమయిపోయి, హృదయం ఆనందంతో పరవళ్ళు తొక్కుతుంది. ఒకరిని చూచి ఒకరు సంతోషంతో శివనామం పాడుతూ, మంత్ర జపం చేస్తూ సాగిపోతుంటారు. కొందరు కలిసి సత్సంగంగా పాడుతుంటారు. బెంగాలి వాళ్ళు, పంజాబివాళ్లు, గుజరాతి వాళ్ళు ఇలా ఎవరి భాషలో వాళ్ళు పాడుతుంటారు. ఆంధ్రా నుండి వచ్చిన వాళ్ళు తెలుగు పాటలు, త్యాగరాజు కీర్తనలు పాడుతుంటారు. ఎక్కడ చూచినా ఆధ్యాత్మిక వాతావరణం కనిపిస్తుంది. అది స్వయంగా అనుభవించాలి తప్ప వర్ణించడానికి మాటలు సరిపోవు. ఎక్కడ చూచినా అద్భుతమయిన, ఆనందకరమయిన ఆధ్యాత్మికత. అక్కడక్కడా విదేశీ యాత్రికులు వాళ్ళ వెంట తెచ్చుకున్న కెమెరాల్లో ప్రకృతి సౌందర్యాన్ని బంధిస్తుంటారు.

అక్కడి ప్రకృతి సౌందర్యం, భగవంతుని గొప్పదనం పరచుకున్న ఎత్తైన పర్వత శిఖరాలు ఉరుకులు పరుగులతో పాములా మెలికలు తిరుగుతూ ఉత్తుంగ తరంగాలతో వేగంగా గలగలా పారే గంగానది అద్భుతాన్ని ఆవిష్కరిస్తుంది. ఇవన్నీ మాటల్లో వర్ణించటం

చాలా కష్టం. వర్షం పడినప్పుడు దారి చాలా ప్రమాదకరంగా ఉంటుంది. అసలే సన్నని నడకదారి. వర్షం మూలంగా జారిపోతూ ఉంటుంది. ఒక్కోసారి కొండల మీద నుండి రాళ్ళు వర్షంలా పడి యాత్రికులు వాటి కింద సజీవ సమాధి అవుతుంటారు. బదరీనాథ్ యాత్రకు వెళుతుండగా అలా హఠాత్తుగా ప్రమాదవశాత్తూ మరణించిన వాళ్ళు యాత్రికులు సరాసరి స్వర్గానికి చేరుకుంటారని నమ్ముతుంటారు. ఎంతో శ్రమకోర్చి కష్టతరమయినా యాత్రను ముసలివాళ్ళు, నడవలేని వాళ్ళు కూడా ఎంతో ఇష్టంగా చేయటానికి కారణాల్లో ప్రధానమయినది వారి నమ్మకము, విశ్వాసమే. బదరీనాథ్ నారాయణుడిని చేరుకొనే ప్రయత్నంలో దారిలో ఎదురయ్యే ఎంతో శ్రమని, కష్టాన్ని భరిస్తారు. మార్గమధ్యంలో ప్రాణాలు పోయినా అది పుణ్యమని భావిస్తారు. అదికూడా నారాయణుడి అనుగ్రహమని, తనలో ఐక్యం చేసుకున్నాడని విశ్వసిస్తారు. నిజానికి బాహ్యమయిన యాత్రల వలన భగవంతుని చేరుకోలేము. మనలోనే నెలకొని ఉన్న నారాయణుడిని దర్శించడానికి హృదయపు లోతుల్లోకి ప్రయాణం సాగించాలి.

బదరీనాథ్ చేరుకోవాలంటే ఋషికేశ్ నుండి దేవ ప్రయాగ అక్కడి నుండి ఉత్తర కాశి మీదుగా ప్రయాణించాలి. దారిలో ఆగుతూ ఆయాసం తీర్చుకుంటూ ప్రయాణం కొనసాగించాలి. ప్రతి పది, పదిహేను మైళ్ళ దూరంలో ఒక చట్టి ఉంటుంది. అక్కడ ప్రయాణీకులు విశ్రాంతి కోసం ఆగుతూ ఉంటారు. అక్కడ యాత్రికులకు ఆహారము, ఉండడానికి వసతి గృహాలు దొరుకుతాయి. గోధుమపిండి, బంగాళాదుంపలు కొనుక్కొని ఉడకబెట్టుకొని తింటారు. వంట చేసుకోవటానికి అవసరమయిన వంట సామగ్రి, కట్టెలు, కుండలు అన్నీ చాలా ఎక్కువ మూల్యం చెల్లించి కొనుక్కోవాల్సి ఉంటుంది.

నా గురించి చెప్పాలంటే, నాకు ఆహారం గాని, డబ్బు గాని దగ్గర ఉంచుకొనే అలవాటు లేదు. నేను వంట కూడా చేసుకోను. అందరిని ఆదుకొనే ఆయనే ఆహారాన్ని సమకూర్చుతున్నాడు. ఆగిన ప్రతి చోటా ఎవరో ఒకరి రూపంలో వచ్చి నాకు ఆహారం ఇచ్చేవాడు. నిజంగా నా విశ్వాసం చాలా గొప్పది. అప్పుడు, ఇప్పుడు, ఎల్లప్పుడూ భగవంతుని దయ నా పట్ల అలాగే ఉంది. నా హృదయంలో కొలువై ఉన్న పరంజ్యోతి నన్ను కాపాడుకొంటోంది. నేను చిన్న కుటీరంలో తలదాచుకొని విశ్రాంతి తీసుకుంటుండగా నాకు పరిచయం కూడా లేని యాత్రికుడు ఒకరు తన వంతు ఆహారంలో కొంత నాకు ఇచ్చి వెళ్లాడు. నిజంగా భగవంతుని అనుగ్రహానికి నా హృదయం

కదలిపోయింది. సనాతన ధర్మం అందరూ భగవంతుని బిడ్డలేనని, ఒకరికొకరు పరిచయం లేని వారు కారని చెపుతుంది. వసుధైక కుటుంబం అన్నదే మన విశ్వాసం. ప్రపంచమంతా ఉత్తరమయినా, దక్షిణమయినా, పాశ్చాత్యులయినా అందరూ భగవంతుని సంతానమే.

స్వామి రామతీర్థ జీవితచరిత్రను అధ్యయనం చేశాను నేను. ఆయన ఈ ప్రాంతంలో పర్యటించినప్పుడు రోజుకి నలభై మైళ్ళ దూరం కాలినడకన ప్రయాణం చేసేవారని చదివాను. ఆ మహనీయుని ఆదర్శంగా భావించి వారి అడుగుజాడల్లో నడవాలని తహతహలాడే నేను కూడా నలభై మైళ్ళు ఒక్కరోజులో నడవాలని నిర్ణయించుకున్నాను. ఎంత బలవంతుడయినా, ఆరోగ్యవంతుడయినా అలాంటి దారిలో రోజుకి నలభై మైళ్ళు దూరం నడవటం అసాధ్యమయిన విషయం. అయినా నేను దృఢ సంకల్పంతో, స్వామి రామతీర్థను ఆదర్శంగా తీసుకొని రెండు రోజులు రోజుకు నలభై మైళ్ళ దూరం నడిచాను. నా జీవితంలో అది చాలా గొప్ప ఘనకార్యంగా అనిపించింది. అంతేకాక నా యువ హృదయం ఆనందంతో పొంగిపోయింది. శరీరాన్ని కష్టపెట్టి నా శాయశక్తులా ప్రయత్నించి నడిచిన ఫలితంగా దేహం తట్టుకోలేని నిస్సత్తువకు లోనయింది. ఇంకొక్క అడుగు కూడా వేయలేని పరిస్థితి ఏర్పడింది. బాల్యంలోని ఉత్సాహంతో నేనీ పని చేశాను. చాలాసార్లు నేనీ విధంగా ప్రవర్తించి తరచుగా కష్టాల్లో పడిపోతుంటాను. నా పాదాలు బొబ్బలెక్కి పచ్చిపుళ్ళుగా మారాయి. బొబ్బలు మానే వరకు విశ్రాంతి తీసుకోవడం తప్ప చేయగలిగేది ఏమీ లేదు. కానీ అప్పటికే నేను బదరీనాథ్ క్షేత్రానికి చాలా దగ్గరిగా వచ్చేశాను. ఇంకా అక్కడ సమయం వృథాగా గడుపుతూ విశ్రాంతి తీసుకోవడం నాకిష్టం లేదు. నాకిలాంటి పరిస్థితి కలగడానికి నా మూర్ఖత్వమే కారణమని నాకు తెలుసు.

భగవంతునిపై పూర్తిగా భారం వేసి అతడినే నమ్ముకొని, నిరంతరం ఆయన నామస్మరణ చేస్తూ నెమ్మదిగా ప్రాకుతూ నా ప్రయాణం బదరీ క్షేత్రం వైపుగా కొనసాగించాను. భగవంతునికి భక్తుల హృదయాంతరంగం బాగా తెలుసు. వారి కష్టాలన్నీ చూస్తుంటాడు. నమ్మశక్యం కాకుండా నేను నెమ్మదిగా, ఓపిగ్గా, స్థిర నిశ్చయంతో మోకాళ్ళు, మోచేతులపై ప్రాకుతూ, నా భౌతిక శారీరక బాధల్ని మరచిపోయి ఏ విధంగా దేవాలయ ప్రాంగణం చేరుకున్నానో తలచుకుంటే ఆశ్చర్యం వేస్తుంది. అంతా బదరీనాథుని దివ్య కరుణాకటాక్షాలే. నమ్మిన వాళ్ళని మరచిపోకుండా తన అనుగ్రహ వీక్షణాలను ప్రసరింపజేసి రక్షిస్తుంటాడు.

బదరీ క్షేత్రంలో నేనున్న కాలం మరచిపోలేని దివ్యానుభూతులు కలుగచేశాయి. అక్కడ నేనున్నది కొద్ది రోజులే అయినా నేనెప్పటికీ మరచిపోలేను. మూడు నాలుగు రోజులు మాత్రమే ఉన్నానక్కడ. సాధారణంగా యాత్రికులు దర్శనం చేసుకొని వెంటనే తిరుగు ప్రయాణం అవుతుంటారు. సాధువులు కూడా దర్శనం కాగానే అదే రోజు ప్రయాణమై వెళ్ళిపోతారు. అక్కడ ఎలాంటి వసతులు గాని, సౌకర్యాలు గాని, వసతి గృహాలు కానీ ఉండవు. విపరీతమయిన చలికి తట్టుకోవడం చాలా కష్టం.

చలిగా ఉన్నా, వేడిగా ఉన్నా, వాతావరణం ఎలాంటిదయినా అంత అద్భుతమైన ప్రకృతి సౌందర్యానికి మైమరచిపోయాను. రంగురంగుల పుష్పాలు మైళ్ళ దూరం పర్యంతం తివాచీ పరచినట్లుగా వికసించి చూడడానికి ఆహ్లాదకరంగా ఉన్నాయి. ఎన్నడూ చూడని ఆశ్చర్యకరమయిన ఆ పుష్పాలు కొన్ని చాలా పెద్దగా అడుగు సైజులో ఉన్నాయి.

భగవంతుని చమత్కారం చాలా విచిత్రంగా ఉంటుంది. అంతటి చల్లని ప్రదేశంలో వేడినీటి సరస్సులు ఉన్నాయి. సృష్టికర్త సృష్టి ఎంత గొప్పది. అంత ఎత్తైన పర్వతశ్రేణుల్లో రక్తం గడ్డకట్టే చలి ప్రదేశంలో వేడి నీటి బుగ్గలు చూస్తుంటే మాయాజాలంలా అనిపిస్తుంది. భగవంతుని సృష్టి కంటే గొప్ప మాయాజాలం కానీ, ఆయన కంటె గొప్ప మాంత్రికుడు కాని ఎవరుంటారు?

భూలోకంలో స్వర్గం ఎక్కడయినా ఉంది అంటే అది తప్పకుండా బదరీ క్షేత్రమే. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, నేను ఎక్కడ విడిది చేసినా ఆ స్థలం నాకు స్వర్గంలోని శాంతిని ప్రసాదిస్తుంది. ఉదాహరణకి నీలగిరి కొండల్లోని కోటగిరిలో ప్రకృతి సౌందర్యం కూడా స్వర్గాన్ని తలపిస్తుంది.

స్వర్గాన్ని తలదన్నే ప్రకృతి సౌందర్యము, శాంతి, పవిత్రతలతో పాటు బదరీలో కొద్ది రోజులుండడానికి మరొక కారణం కూడా ఉంది. బదరీ క్షేత్రం లోని మఠానికి అధిపతి, చాలా ఉత్తముడు, భాగవతోత్తముడు, మంచి హృదయం కల రావల్ అనే వంశ పారంపర్య పూజారి నా పట్ల ఎంతో ప్రేమ చూపించాడు. ఆయన నా పట్ల ప్రేమ మాత్రమే చూపలేదు, నాకు కావాల్సిన సౌకర్యాలన్నీ సమకూర్చాడు. అక్కడ ఎవ్వరినీ గర్భగుడిలోనికి ప్రవేశించడానికి అనుమతి ఇవ్వరు. 'రావల్' నన్ను గర్భగుడిలోనికి అనుమతించడమే

కాకుండా నన్ను తన ప్రక్కనే కూర్చోబెట్టుకొన్నాడు. భగవంతునికి నా పట్ల ఎంత కరుణ ఉందో అర్థమయింది. తన బిడ్డని జాగ్రత్తగా చూసుకొంటున్నాడు.

దేవాలయానికి ఎదురుగా వేడినీటి బుగ్గలో స్నానం చేసి సేదతీరాను. 'రావల్' తనతో పాటు నాకు కూడా భోజనం ఏర్పాట్లు చేశాడు. ఇక అందులో ఆశ్చర్యం ఏముంటుంది? నేను వేడి నీటి బుగ్గలోనే కాకుండా 'రావల్' ప్రేమలో కూడా తడిచి ఉంటానని చెప్పటానికి. 'రావల్' మహంతు నన్ను తనతో పాటు అక్కడే ఉండిపొమ్మని చెప్పాడు.

మంచు బాగా కురవటం ప్రారంభం కాగానే పర్వతముతో పాటు దేవాలయం కూడా మంచులో కూరుకుపోతుంది. అప్పుడు మహంతు, మిగిలిన పూజారులందరూ జోషి మఠానికి దిగి వస్తారు. దాదాపు నలభై మైళ్ళ క్రింద ఉంటుంది జోషి మఠం. తిరిగి వేసవి కాలం వచ్చేవరకు అక్కడే ఉంటారు. సూర్యుని వెచ్చని కిరణాలు సోకగానే మంచు కరిగి దేవాలయం బయటపడుతుంది. అన్నింటికన్నా ఆశ్చర్యకరమయిన విషయం ఒకటుంది. పవిత్రమయిన బదరీ క్షేత్రం ప్రత్యేకత ఇది. ఆలయం తలుపులు మూసేటప్పుడు వెలిగించిన అఖండజ్యోతి ఆరునెలల తర్వాత ఆలయం ద్వారాలు తెరచినప్పటికి అలాగే వెలుగుతూ ఉంటుంది.

ఈ ప్రథమ జ్యోతి దర్శనం కోసం ఎంతో శ్రమకోర్చి విపరీతమయిన చలిలో కూడా దర్శనార్థమై వేలాది భక్తులు తరలి వస్తారు. సైంటిస్టులు దీనికి సరయిన కారణం చెప్పగలరో లేదో నాకు తెలియదు. ఆలయం మంచుతో మూసుకుపోయినా ఆరు నెలల కాలం పాటు జ్యోతి అఖండంగా వెలుగుతుండడం వెనక కారణాలు చెప్పలేకపోయినా, మతానికి, సైన్సుకి పెద్ద తేడా ఏమీ లేదు అని చెప్పక తప్పదు.

సృష్టిలో ఎన్నో అద్భుతాలు, రహస్యాలు దాగి వున్నాయి. వాటన్నింటికి కారణాలు చెప్పటం సాధ్యం కాకపోవచ్చు. తెలివితేటలతో తర్కించి తెలుసుకోవటానికి చాలా కష్టం. పెద్ద పంచదార పర్వతం ముందు చీమల్లాగా భగవంతుని ముందు మనం ఎంతటి వాళ్ళం?

ఇష్టం లేకపోయినా 'రావల్' నేను ఒకరికొకరము పవిత్రమయిన ఓంకారాన్ని జపిస్తూ వీడ్కోలు తీసుకున్నాము. మళ్ళీ ఎప్పుడయినా తిరిగి కలుస్తామని ఆశతో ఇద్దరము కలిసి ప్రార్థనలు చేశాము.

దాదాపుగా 180 మైళ్ళు దూరం నేను ఒంటరిగా ప్రయాణం చేశాను. కాని ఎప్పుడూ నేను ఒంటరితనాన్ని అనుభవించలేదు. ప్రతి క్షణము దైవము నాతో ఉండి నన్ను నడిపిస్తూనే ఉన్నాడు. కొన్నిసార్లు నా ముందు నడిస్తే మరికొన్ని సందర్భాల్లో నా వెనుక నడిచేవాడు. ఆయన లేని సమయం గాని స్థలం కాని లేదు. నేను పదే పదే ఎప్పుడూ వల్లిస్తూ ఉంటాను. భగవంతుడు ఎప్పుడూ నాతోనే ఉన్నాడు. నా లోపలా, బయటా, పైనా, క్రిందా, నా చుట్టు ప్రక్కలా అంతటా నిండి నిబిడీకృతమై ఉన్నాడు. వృక్షాల్లో కదులుతున్న చెట్టు కొమ్మల్లో, గాలిలో, ప్రతిధ్వనిలో నేను భగవంతుడిని అనుభూతి చెందుతున్నాను.

ప్రయాణంలో ఒక్కో పర్యాయం నేను వెనక్కి తిరిగి చూస్తూ ఉంటాను. నా వెనుక ఎవరయినా నడిచి వస్తున్నారని నాకు అనిపిస్తుంటుంది. ఎవరో నన్ను వెంబడిస్తూ దారి చూపిస్తున్నారని, హిమాలయ పర్వతశ్రేణుల్లో ప్రయాణం అంతా దట్టమయిన కీకారణ్యాలతో నిండి ఉంటుంది. దారిలో పెద్ద పులులు, చిరుత పులులు, అలాగే భయంకరమయిన విషసర్పాలు కనబడడం అత్యంత సహజం. అందువలన యాత్రికులు చాలా జాగ్రత్తగా గుంపులుగా ప్రయాణిస్తుంటారు. అంతేకాక అందరూ కలిసి పెద్దగా భగవన్నామాన్ని పాడుతూ వెళతారు. దాని వలన జంతువులు దూరంగా వెళ్ళిపోతాయి. భగవన్నామ జపము భక్తులను ఆపదల నుండి కాపాడుతుంది అని వారు భావిస్తారు. అన్ని జాగ్రత్తలు తీసుకున్నా అప్పుడప్పుడు యాత్రికులనో, లేదా సాధువులనో పెద్ద పులులు చంపి తినివేయటం జరుగుతూనే ఉంటుంది. అలాగే కొన్నిసార్లు విషసర్పాలు కరిచి కొందరు చనిపోతుంటారు. అక్కడ వారికి సహాయం అందించే వారు ఎవరూ ఉండరు. జీవితం క్షణభంగురమనిపిస్తుంది.

అందరూ నన్ను ఒంటరిగా ప్రయాణం చేయవద్దు అని హెచ్చరించినా నేను ఒంటరిగా యాత్రికులందరి కంటే ముందుగా వెళ్ళిపోయేవాడిని. ఏదో ఒక గమ్యం చేరాలి అని ముందుగానే అనుకోవటం వలన ఒక్కోసారి పగలు, రాత్రి తేడా లేకుండా, ఆగకుండా ప్రయాణం కొనసాగించేవాడిని. ఏదయినా చట్టి వద్ద విశ్రాంతి కోసం ఆగినప్పుడు, రాత్రివేళల్లో యాత్రికులు గుంపులుగా చట్టీల వద్ద విశ్రాంతి కోసం ఆగి వంటలు చేసుకుంటూ ఉండేవారు. వారితో కలిసి చిన్న గుడిసె లాంటి కుటీరాల్లో ఉండేవాడిని.

ఆ విధంగా బదరీనాథ్ నుండి ఋషీకేశ్ చేరటానికి దాదాపుగా సగం దూరం ప్రయాణించాను. నా ప్రయాణం నెమ్మదిగా స్థిరంగా సాగిపోతోంది. యాత్రికులు ప్రయాణంలో ఆహారం వండుకోవటానికి అవకాశం లేనివారు, బీదవారు ఒక విధమయిన గోధుమపిండి లాంటి దాన్ని బెల్లంతో కలిపి ఆహారంగా తీసుకొనేవారు. దాన్ని సత్తు అంటారు. అది చాలా రుచికరంగా ఉంటుంది కాని పచ్చి పిండి అవడం వలన జీర్ణం కావడం కష్టం. అది తిన్నవారు తరచుగా డయేరియా వంటి వ్యాధులతో బాధపడేవారు.

నేను చాలా అజాగ్రత్తగా ఉండేవాడిని. సమయానికి ఏది దొరికితే దాన్ని ఆహారంగా తీసుకోవటం, జలపాతాల్లోని నీరు త్రాగటం వలన నాకు బాగా రక్త విరోచనాలు అవసాగాయి. డయేరియాతో చాలా ఇబ్బంది కలిగింది. దారిలో 25 మైళ్ళకి ఒక ప్రభుత్వ ఆసుపత్రి ఉండేది. ప్రత్యేకంగా యాత్రికులకు అత్యవసర చికిత్సలు అందిచడం కోసం ఇవి ఎంతో ఉపయోగపడేవి. కాని నేను ప్రకృతి వైద్యానికే ఇష్టపడేవాడిని అవటం వలన ప్రభుత్వ వైద్యశాలలో చూపించుకొని మందులు వాడటానికి ఇష్టపడలేదు. ఒకరోజు రాత్రి నా ప్రయాణం ఆపి ఒక చిన్న గ్రామంలో విశ్రాంతి కోసం ఆగాను. అక్కడ వైద్యశాలలోని డాక్టర్లు, నర్సులు నాకు ఎంతో సేవ చేశారు.

విశ్రాంతి లేకుండా నడక సాగించటం వలన తిరిగి నా పరిస్థితి దారుణంగా తయారయ్యింది. అరికాళ్ళు బొబ్బలు ఎక్కాయి. పచ్చిపుళ్ళ వలన నేను నడిచే పరిస్థితిలో లేను. అదృష్టం కొద్దీ నేను నెమ్మదిగా ఒక చట్టి వద్దకు చేరుకున్నాను. ధనవంతులు సౌకర్యవంతమయిన మంచి కుటీరాల్లో విశ్రాంతి పొందేవారు. కానీ సాధువులు, పేదలయిన యాత్రికులు పూరిపాకల్లో విశ్రాంతి తీసుకొనేవారు. ఒకనాటి రాత్రివేళ విశ్రాంతి తీసుకోవటానికి పైన ఆకులు కూడా లేని చిన్న పూరిపాక దొరకటమే మహాభాగ్యంగా భావించాను. బాగా అలసిపోయి, జబ్బు పడి ఉన్నాను. దానికి తోడు విపరీతంగా విరోచనాలు అవుతుండడం వలన నీరసించిపోయాను.

స్పృహలేకుండా పడి ఉన్న నేను ఆ స్థితిలో నా శిష్యుల గురించి, స్నేహితుల గురించి ఆలోచించాను. స్వర్గాశ్రమంలో నారాయణస్వామి నాతో పాటు రావాలనుకున్నాడు. నాకు సేవలు చేయాలని భావించాడు. కాని నేను అతడికి అనుమతి ఇవ్వకుండా నేను స్వర్గాశ్రమానికి తిరిగి వచ్చే వరకూ నా కుటీరంలోనే ఉండమని చెప్పాను. ఆకలితో నా కడుపు మాడిపోతోంది. మరోప్రక్క విరేచనాలవుతూ కదలటానికి కూడా ఓపిక లేకుండా

పడి ఉన్నాను. కొందరు యాత్రికులు వంటలు చేసుకుంటున్నారు. రొట్టెలు, కూర, పప్పు సువాసనలు నా పూరిపాక వరకూ వస్తున్నాయి. నేనున్న పాకకి పైన ఆకులు కూడా లేవు. అలా నేల మీద పడుకొని పైకి చూస్తుంటే అనంతమయిన ఆకాశంలో లెక్కలేనన్ని నక్షత్రాలు మిణుకుమిణుకు మంటూ మెరుస్తూ కనిపిస్తున్నాయి. జబ్బు పడి నీరసంతో ఉన్న నాకు ఆ నక్షత్రాల కాంతి ఎంతో ఊరట కలిగిస్తోంది. నా పక్కనున్న పూరిపాకల్లోని యాత్రికులు బాగా నడవటం వలన అలసి పోయినా ఒకరికొకరు సేవలు చేసుకుంటున్నారు. కొందరు వాళ్ళ పాదాలు నొక్కుతూ నూనె రాసి మర్దనా చేస్తున్నారు. మరి కొందరు పాదాలని వేడినీటిలో కాపడం పెడుతున్నారు. దానివలన వారి బాధలు తగ్గుతాయి. అది చూడగానే నాలో నేను అనుకోసాగాను. నాకు కూడా ఎవరయినా స్నేహితులు నాతో పాటు ఉండి ఉంటే నాకు కూడా వారు అలా సేవలు చేసి ఉండేవారు కదా! నాకు పాదాలకు నూనె మర్దన చేయడం వలన నా ఒంటి బాధలన్నీ తగ్గిపోతాయి అనుకున్నాను.

నా కళ్ళను నేను నమ్మలేకుండా ఉన్నాను. ఎవరో అపరిచితుడయిన యాత్రికుడు నేనున్న స్థలానికి వచ్చి నెమ్మదిగా మృదువుగా మాట్లాడుతూ “బాబాజీ! మీరు చాలా దూరం నడచి బాగా అలసిపోయినట్లుగా ఉన్నారు. మీకు కొద్దిగా సేవ చేసే అవకాశం ఇవ్వండి” అన్నాడు. అతను తనతో బొగ్గుల కుంపటి, మర్ధన చేయడానికి నూనె, వేడి నీరు తెచ్చాడు. నేను ఆశ్చర్యపోతుండగానే అతను నాకు సేవలు చేయసాగాడు. అప్పుడు నా మనోభావాలని నేను ఏ విధంగా వివరించగలను? ఒక్క క్షణం కూడా నన్ను వదలకుండా రక్షిస్తూ, నా బాగోగులను చూస్తున్న ఆ భగవంతునికి కృతజ్ఞతలు చెప్పటం తప్ప. నా కళ్ళ నిండా కృతజ్ఞతా భావంలో నీళ్ళు కారిపోసాగాయి. నా స్నేహితుడు పరమభక్తుడు. మౌనంగా తన పని చేసుకుపోతున్నాడు. నా పాదాలకు నూనె మర్ధన చేశాడు. వేడినీటితో కాపడం పెట్టాడు. నా బాధలన్నీ తగ్గిపోతున్నాయి. నేను భూమి మీద లేను, స్వర్గంలో ఉన్నట్లుగా ఉంది. భగవంతుని ఒడిలో సేదతీరుతున్నట్లుగా ఉంది. నా కళ్ళ వెంట ధారాపాతంగా ఆనందంతో కృతజ్ఞతతో నీరు కారుతూనే ఉన్నాయి. ఆ పవిత్రాత్మ స్వరూపుడు చివరిగా నా ఒళ్ళంతా నూనె రాసి మర్దన చేయటం మొదలుపెట్టాడు. కాలి వేళ్ళనుండి, తల వరకూ అతి లాఘువంగా, సున్నితంగా మర్ధన చేశాడు. నాకతనికి కృతజ్ఞతలు చెప్పటానికి మాటలు రావటం లేదు. వచ్చినంత నెమ్మదిగా నా ఆత్మబంధువు నాకు సేవలు చేసి వెళ్ళిపోయాడు. నా శరీరం ఎంతో తేలికగా,

హాయిగా ఉంది. బాధలన్నీ తగ్గిపోయాయి. అతడు వెళ్ళేటప్పుడు నాకు సేవ చేసేందుకు అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు చెప్పి వెళ్ళాడు. ఎంత గొప్ప ప్రతిఫలాపేక్ష లేని సేవ చేశాడతను. భగవంతుడు ఎంతటి కరుణామయుడు. నిరాపేక్షగా ఇతరులకు సేవలందించే వారికి భగవంతుని ఆశీర్వచనాలు అందుగాక!

ఇంకొక స్థలంలో ఒంటరిగా పూరిపాకలో విశ్రాంతి తీసుకుంటున్నాను. ఇంకా నాకు విరోచనాలు తగ్గకపోవటం వలన నేను ఘనపదార్థాలు తీసుకోనే స్థితిలో లేను. బాగా ఆకలితో అలమటించిపోతున్నాను. పైగా నీళ్ళ విరేచనాలు అవటం వలన ఒక అడుగు కూడా కదిపే స్థితిలో లేను. ఒంటరిగా, నీరసంగా, నిస్సహాయంగా పడి ఉన్నాను. కొంతసేపటికి ఎవ్వరూ లేని ఒక నిర్మానుష్య ప్రదేశానికి హఠాత్తుగా ఒక వ్యక్తి వచ్చారు. అతనితో ఒక బొగ్గుల కుంపటి, ఒక పాత్రలో పాలు ఉన్నాయి. అతను సగ్గుజావ తయారుచేసి నా దగ్గరికి వచ్చి, “బాబాజీ! దయచేసి ఈ సగ్గు జావ త్రాగండి. మీరు బాగా జబ్బు పడి నీరసించి ఉన్నారు. ఇది త్రాగితే మీకు మేలు చేస్తుంది” అన్నాడు. నా నోట మాటలు రావటం లేదు. నెమ్మదిగా అతనికి ధన్యవాదాలు చెప్పాను. భగవంతునికి అన్నీ తెలుసు. కనపడని ఆ దైవానికి, అతని అపారమయిన దయకు, ఇలాంటి నిర్మానుష్య ప్రదేశంలో కూడా ఒక బిడ్డకి సేవలందించడానికి అపరిచితులను పంపించిన కరుణకు కృతజ్ఞతలు. ఎంతో కష్టంలో, బాధలో ఉన్న నాకు సేవలందించడానికి ఎవరో ఒకరి రూపంలో వస్తున్నాడు. నిజంగా నాకు అప్పుడు సగ్గు జావ కావాలని అతనికి ఏ విధంగా తెలిసి వచ్చాడు? ఇది నిజంగా అద్భుతమే కదా! ఆశ్చర్యం కూడా! ఇదంతా ఎలా జరిగిందో నాకు అంతుబట్టని రహస్యంగా, అగమ్యగోచరంగా అనిపిస్తోంది. అలాంటి అద్భుతాలు ఎన్నో జరిగాయి. అందుకు నేను అర్హుడినా అనిపిస్తుంది నాకు. దేవుడు తన బిడ్డల పట్ల ప్రత్యేకమయిన శ్రద్ధ వహిస్తాడు. అందువల్లనే నేను క్షేమంగా, ఆధ్యాత్మిక క్షేత్రమయిన ఋషీకేశ్ చేరుకున్నాను. స్వర్గాశ్రమం చేరుకున్న నేను బాగా విశ్రాంతి తీసుకొని మళ్ళీ ఎప్పటిలా ఆరోగ్యవంతుడిని అయ్యాను. అంతా భగవంతుని దయ.

లోకాసమస్తా సుఖినోభవంతు

ఓం తత్సత్ ఓం

**అధ్యాయం - 13**

# ఆంధ్రదేశానికి తిరుగు ప్రయాణం

కొన్ని సంవత్సరాలు గడిచిన తర్వాత ఆంధ్రదేశంలోని నా స్నేహితులు తిరిగి వచ్చి అక్కడి భక్తులకు సేవలందించవలసిందిగా అభ్యర్థించారు. వాళ్ళు నా ప్రయాణానికి అవసరమయిన ఏర్పాట్లు అన్నీ చేసి టిక్కెట్టు కూడా పంపించారు. అవసరమయిన డబ్బు కూడా పంపటం వలన ఇక తప్పనిసరిగా నేను ఆంధ్రాకు వెళ్ళడానికి నిశ్చయించు కున్నాను.

దారిలో నేను బుద్ధ గయ దర్శించాను. బుద్ధుడు నిర్వాణస్థితిని పొందిన పరమ పవిత్రమయినది బోధి వృక్షము. అక్కడే గౌతమబుద్ధుడు ధ్యానంలో ఉండేవాడు. అక్కడ నేను గడిపిన కాలము ఎంతో విలువయినది. దేవాలయ ప్రాంగణంలో భూగర్భంలో చిన్న గుహలాంటిది ఉంది. అక్కడ కూర్చుని ప్రశాంతంగా గంటల తరబడి ధ్యానంలో కాలం గడిపాను.

సారనాథ్ క్షేత్రం చాలా అందమైన ప్రదేశం. పవిత్రమయిన దేవాలయం. అనేక బౌద్ధ విహారాలు ఉన్నాయి. గయ నుండి నేను వారణాసి చేరుకున్నాను. హిందువులకు పరమ పవిత్రమయిన ప్రదేశము. అక్కడ పవిత్రనది గంగామాత పరవళ్ళు తొక్కుతూ ప్రవహిస్తూ ఉంటే చూడడానికి ఎంతో ఉత్తేజితంగా ఉంటుంది. గంగానది తీరంలో లెక్కలేనన్ని స్నానఘట్టాలుంటాయి వారణాసి పట్టణంలో. అన్నింటిలోకి హరిశ్చంద్ర స్నానఘట్టాన్ని దర్శించడానికి ఎంతో కుతూహలపడ్డాను. అక్కడ మహా శ్మశానం ఉంది. వారణాసిలో మరణిస్తే ముక్తి లభిస్తుందని భక్తుల నమ్మకం. హరిశ్చంద్ర స్నాన ఘట్టంలో కూర్చుని మరణించిన వారి శరీరాలను కాలుస్తుంటే వాటిని చూస్తూ చాలాసేపు ఉన్నాను.

బెంగాల్‌లోని 'బంకూరా'లో నా బాల్య స్నేహితుడు రంగాచారి ఉంటున్నాడు. నేను కలకత్తాలో హోమియోపతి చదివేటప్పుడు నా చదువు కోసం స్టేషన్ మాస్టర్ తన జీతాన్ని పంపించేవాడు. తన అవసరాలన్నింటిని త్యాగం చేశాడు. అటువంటి నమ్మకమయిన స్నేహితుడు ఒక్కడయినా చాలు మన కోసం అన్నీ వదలుకోవటానికి సిద్ధపడేవాడు. కేవలం భగవంతుని అనుగ్రహం వల్లనే అలాంటి వారు దొరుకుతారు. అతనితో

కొద్దిరోజులే గడిపినా ఆ సమయం నా జీవితంలో ఎంతో విలువయినది, అమూల్య మయినది అని నేను భావిస్తాను.అక్కడ నేను చాలా ప్రశాంతంగా, సంతృప్తిగా ఉంటూ ధ్యానంలోనే ఎక్కువ సమయం గడిపేవాడిని. అలాగే నా స్నేహితుడు రంగాచారికి, అతని సన్నిహితులకు, స్నేహితులకు సేవలు అందించేవాడిని.

కలకత్తా నుండి తిన్నగా విశాఖపట్టణం చేరుకున్నాను. అక్కడి నుండి రాజమండ్రి వచ్చాను. శాంతి బీజాలు వెదజల్లుతూ, ప్రేమను పంచుతూ, భక్తులకు సందేశాలు ఇస్తూ ఉపదేశాలు చేస్తూ ఉండేవాడిని. ప్రతిరోజు ఎందరో భక్తులు నన్ను దర్శించడానికి వస్తూ ఉండేవారు. రాజమండ్రిలో శ్రీరామారావు, మాతృశ్రీ రత్నమ్మగారి ఇళ్ళు చాలా విశాలంగా ఉండేది. అందువలన భక్తుల తాకిడి వలన వారికి ఎలాంటి ఇబ్బంది గాని, అసౌకర్యం గాని కలిగేది కాదు.

హిమాలయాలలో చాలా సంవత్సరాలు ప్రశాంతంగా ఒంటరిగా ధ్యానంలో కాలం గడపటం వలన రాజమండ్రి లాంటి నగరంలో గృహస్థుల ఇళ్ళల్లో ఉండడం కొంచెం ఇబ్బందిగానే అనిపించేది. వాళ్ళు నా కోసం ఎంతో భక్తి శ్రద్ధలతో అన్ని సదుపాయాలు చూసేవారు. మానవమాత్రుడు తన జీవితాన్ని గాని భవిష్యత్తును గాని అనుకున్న విధంగా మల్చుకోలేడు. భగవంతుని సంకల్పానుసారం అంతా జరుగుతుంది. అవి చిన్న కార్యాలయినా, పెద్ద కార్యాలయినా జీవుని కర్మానుసారం జరుగుతాయి.

సామర్లకోట రాజమండ్రికి ముప్ఫై మైళ్ళ దూరంలో ఉంది. అక్కడి నుండి నా దర్శనానికి తరచుగా వచ్చే భక్తులు నన్ను తమ ప్రాంతానికి వచ్చి కొంతకాలం వారితో ఉండమని అడిగారు. ఒక ధనవంతుడయిన భూస్వామి తన వద్ద చాలా పెద్ద స్థలముందని, అది ఊరికి దూరంగా ప్రశాంతంగా, చాలా అందంగా ఉంటుందని, దానిలో చక్కని కుటీరాన్ని కట్టించి ఇస్తానని చెప్పాడు. అది నాకు భగవంతుని ద్వారా అందిన సందేశంలాగా అనిపించి సరేనని చెప్పాను. చెప్పినట్లుగానే ఆయన నా కోసం చాలా అందమయిన కుటీరాన్ని కట్టించాడు. అక్కడ నేను చాలా ప్రశాంతంగా ధ్యానంలో మునిగిపోయి అంతర్ముఖుడయి పోయేవాడిని. అక్కడ నేనున్న సమయంలో నేను చాలా సాదాసీదా ఆహారం తీసుకొనేవాడిని. కొబ్బరి, అరటిపళ్ళు, పాలు అలాగే కలబంద గుజ్జును స్వీకరించేవాడిని. అపక్వాహారం సాధనకు ఎంతో ఉపయోగపడింది.

త్వరలోనే సామర్లకోట నుండే కాక చుట్టుప్రక్కల గ్రామాల వాళ్ళు, ఇంకా ఎంతో దూరం నుండి కూడా భక్తులు నా దర్శనానికి వచ్చేవారు. నా బోధలు శ్రవణం చేయడానికి మంత్రోపదేశం తీసుకోవటానికి ఆసక్తి చూపేవారు. నేను ఎప్పుడూ వారిని నిరుత్సాహపరిచే వాడిని కాదు. వారి కోరికలు తీర్చి సంతోషపెట్టడానికి ప్రయత్నించేవాడిని. సామర్లకోట రాజమండ్రికి దగ్గర అవటం వలన నా పాత భక్తులు, శిష్యులు తరచుగా వచ్చేవారు. కక్కరాల తన బంధువులు, స్నేహితులతో వచ్చి రెండుమూడు రోజులు గడిపి వెళ్లేవాడు. వాళ్ళు తమతో వారి అబ్బాయి ఆత్మారాంని కూడా తీసుకువచ్చేవారు. ఆత్మారామ్ నాకు రోజు రోజుకి ఎంతో దగ్గర కాసాగాడు. మేమిద్దరము కలిసి అమెరికా వెళ్ళవలసి ఉంది అన్నది ముందే నిశ్చయించబడింది. దానికి బీజము ముందుగానే పడుతుంది. ప్రతి కోరిక, సంకల్పము, ఆలోచన అది మంచిది, ఇతరులకు మేలు చేసేది అయితే తప్పకుండా ఏదో ఒక రోజు ఫలిస్తుంది.

సామర్లకోటలో ఊరికి ఒకవైపు కాలువ ప్రవహిస్తుంటుంది. కాలువ వైపు భీమేశ్వర స్వామి దేవాలయం ఉంటుంది. నేను తరుచుగా కాలువ ఒడ్డున చాలా దూరం నడుస్తూ సంతోషంగా కాలం గడిపేవాడిని. అలాగే భీమేశ్వరాలయంలో శివుని ఎదురుగా కూర్చుని గంటల తరబడి ధ్యానంలో మునిగిపోయేవాడిని. నిజంగా ఆ రోజుల్లో నేను చాలా ఆనందంగా, సంతృప్తిగా, మౌనంగా అంతర్ముఖుడనయి ఉండేవాడిని. అప్పటి నా స్థితిని గమనించిన భక్తులు కూడా పూర్వంలాగా దెయ్యం పట్టి పీడించేవారి జబ్బులను నయం చేయాలని, వారింటికి రమ్మని అడిగేవారు కారు. నా ప్రశాంతతకి ఎలాంటి ఆటంకం కల్గించేవారు కాదు. అందువల్ల నా సాధనలు చక్కగా సాగిపోయేవి. ఎప్పుడూ భగవంతుని సన్నిధిలో మనస్సు నిల్పి సంతోషంగా ఉండేవాడిని. ఇతరులకు కూడా వారి ఆధ్యాత్మిక పురోగతికి సహాయపడేవాడిని.

చింతలూరు నుండి ఒక భక్తుడు లక్ష్మణస్వామి అనే వ్యక్తి నా గురించి విని నన్ను చూడడానికి వస్తుండేవాడు. చింతలూరు నిర్మానుష్యమైన అడవి ప్రదేశం. అదే భవిష్యత్తులో నా జీవితంలో చాలా ముఖ్యమయిన భూమిక వహించబోతోంది. అది సామర్లకోటికి సుమారు ముప్పై మైళ్ళదూరంలో ఉంటుంది. లక్ష్మణస్వామి తరుచుగా నాతో చింతలూరు ఒక్కసారి వచ్చి చూడమని, అక్కడ ఆశ్రమము నిర్మించడానికి చాలా అనుకూలంగా ఉంటుందని చెప్పేవాడు. కాని నేను కొత్త బంధాలు, బాధ్యతల్లో చిక్కుకోవటానికి సిద్ధంగా

లేనని ఆశ్రమం నిర్మించే ఉద్దేశ్యం లేదని చెప్పి తిరస్కరించాను. అయినా లక్ష్మణస్వామి ఏ మాత్రం నిరాశ చెందకుండా 'మళ్ళీ వచ్చి మీరు ఆశ్రమం పెట్టవద్దు. కాని ఒక్కసారి వచ్చి ఆ ప్రదేశం చూడండి చాలు' అన్నాడు. అందమయిన జలపాతం ఉందని, ఆ నీరు ఎంతో నిర్మలంగా, అక్కడి వాతావరణం చాలా ఆహ్లాదకరంగా ఉంటుందని చెప్పాడు.

లక్ష్మణస్వామి మాట కాదనలేక అతని తృప్తి కోసం ఒక్క రోజుకి అక్కడ ఉండడానికి ఒప్పుకొని అతనితో బండి మీద బయలుదేరాను. అక్కడి ప్రశాంతమయిన, ఆహ్లాదకరమయిన వాతావరణము చూచిన తర్వాత ఆశ్చర్యకరంగా ఇంక నేను మళ్ళీ సామర్లకోటకి తిరిగి రాలేదు. ఆ అందమయిన ప్రదేశం రెండు పర్వత శ్రేణుల మధ్య నిర్మానుష్యంగా ఉంది. దగ్గరలో కనుచూపు మేరలో గ్రామాలు లేవు. కాని కొద్ది దూరంలో చుట్టూ చిన్న చిన్న గ్రామాలున్నాయి. అది కొండలతో కూడిన దట్టమయిన అరణ్య ప్రాంతం. అక్కడి ప్రకృతి సహజసిద్ధంగా అత్యంత రమణీయంగా, ప్రశాంతంగా ఉండడం వలన నా మనస్సును బాగా ఆకర్షించింది. ఆ ప్రదేశమే భవిష్యత్తులో శాంతి ఆశ్రమంగా రూపు దిద్దుకొంది. భయంకరమయిన అడవి ప్రదేశం ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలలో శాఖోపశాఖలుగా విస్తరించి శాంతిని ప్రభోదిస్తూ అనేక సేవలకు, కార్యకలాపాలకు కేంద్ర బిందువుగా మారింది. అంతేకాదు శాంతిని కోరే సత్యాన్వేషకులందరికి తూర్పు, పశ్చిమ దేశాల వారందరికి శాంతి సందేశాలను అందించింది.

అది 1917వ సంవత్సరము. అప్పుడు నాకు కేవలం ఇరవై మూడు సంవత్సరాల వయస్సు మాత్రమే.

ఓం తత్సత్ ఓం




**20 సంవత్సరాల వయస్సులో ధ్యానంలో శ్రీ ఓంకార్ స్వామీజీ**



బోధి వృక్షం

## అధ్యాయం - 14

# చింతలూరు

కొన్ని స్థలాలు మొదట్లో మరుభూముల్లా కనిపిస్తాయి. కాని దైవం నిర్ణయించినప్పుడు ఆ భాగమే పవిత్రమయిన పుణ్యక్షేత్రంగా మారిపోతుంది. అదేవిధంగా రోడ్డు ప్రక్కన పడి ఉన్న రాయి కూడా దైవానుగ్రహం చేత నిర్ణయించబడితే అదే దేవాలయంలో శివలింగంగా మారి పూజలందుకొంటుంది.

ఆశ్రమ నిర్మాణం కోసం నిర్ణయించబడ్డ స్థలం ముళ్ళ పొదలతో, రాళ్ళు రప్పలతో, పొదలతో నిండి ఉండి క్రూరమృగాలు యధేచ్ఛగా తిరుగుతుండేవి. అక్కడ ఒక పెద్ద మామిడి చెట్టు ఉండేది. ఆ స్థలం మొత్తంలో అది ఒక్కటే పెద్ద చెట్టు. చిరుతలు, పులులు ఇంకా ఇతర జంతువుల బారి నుండి రక్షణ కోసం ఆ చెట్టుకు ఒక ఉయ్యాల కట్టి రాత్రివేళల్లో అందులో పడుకునేవాడిని. పగలు కూడా ఆ ఉయ్యాలలో ఊగుతూ ఆనందించేవాడిని. ప్రతి ఊపులోనూ నాకు సోహంకారము చక్కగా వినిపించి ఆనందించేవాడిని.

లక్ష్మణస్వామి ఆశ్రమం కోసం ఎంత స్థలం కావాలన్నా తీసుకోమని చెప్పాడు. నేను మొదటి నుండి ఏ పని చేసినా పెద్దగా చేయటం అలవాటు అవడం వలన పది ఎకరాల స్థలం ఆశ్రమం కోసం తీసుకుని, ఆ స్థలంలో ముళ్ళ పొదలు, తుప్పలు, రాళ్ళు తొలగించి చదును చేయడానికి పూనుకున్నాను. శుభ్రం చేసిన తర్వాత ఆ స్థలం చూడడానికి బాగుంది. చుట్టూ తీగలతో కట్టాము. లక్ష్మణస్వామి, అతని ముగ్గురు అన్నదమ్ములు డబ్బుకి గాని, శ్రమకి గాని వెనుదీయకుండా ఈ పనిలో పాలుపంచుకోవడమే కాకుండా దర్శనానికి వచ్చే భక్తులందరికీ ఎంతో సహాయం చేసేవారు. మామిడిచెట్టు దగ్గరలో ఒక చిన్న పాక వేసి దానిపైన తాటాకులు కప్పారు. చెందుర్తినుండి సూరమ్మ అనే నడివయస్సు మహిళ వచ్చి ఆ పాకలో ఉండేది. ఆశ్చర్యకరంగా ఆ పాకలో ఒక పాముపుట్ట మొలిచి రోజు రోజుకు పెద్దది కాసాగింది. ముందు రెండు మూడు సార్లు దాన్ని తవ్వి వేశారు. అయినా అది అలా పెరుగుతూనే ఉంది. చివరికి మేము సుబ్రహ్మణ్యస్వామి ఆ పాము పుట్ట రూపంలో అక్కడ వెలిసినట్లుగా భావించాము. సూరమ్మ రోజూ ఆ పుట్టకి పూజ చేసి ఎంతో పవిత్రంగా చూసుకునేది. వెంకటేషు అనే చెప్పులు కుట్టుకునే వ్యక్తి

నాతో ఎంతో సన్నిహితంగా ఉంటూ మొదటినుండి ఎన్నో సేవలు చేస్తుండేవాడు. చాలా ఆశ్చర్యంగా అతను భవిష్యత్తును ఊహించి చెపుతూ ఉండేవాడు. "స్వామీజీ! మీరు చూస్తూ ఉండండి. కేవలం కొన్ని సంవత్సరాలలోనే ఈ ఆశ్రమము ఆ కొండల దాకా విస్తరించి పోతుంది. ఎలక్ట్రిక్ దీపాలు వస్తాయి. కారుల్లో, బస్సుల్లో భక్తులు తండోపతండాలుగా ఆశ్రమానికి రోజూ వచ్చి పోతుంటారు" అనేవాడు. అతను ఈ మాటలు అన్నప్పుడు అక్కడ కేవలం ముళ్ళ చెట్లు, చిన్న పెద్ద రాళ్ళ గుట్టలు మాత్రమే ఉండేవి. అతను చెప్పినట్లుగా ఆశ్రమము రూపుదిద్దుకోవడానికి యాభై సంవత్సరాల కాలం పట్టింది. ఆశ్రమం అలా రూపుదిద్దు కోవాలని కలలు కన్న భక్తుడయిన వెంకటేషు మాత్రం ఇప్పుడు లేడు.

ఆశ్రమము నిర్మానుష్యంగా, నిశ్శబ్దంగా ఉన్నా చుట్టుప్రక్కల అన్నీ చిన్న చిన్న గ్రామాలుండేవి. మైలు దూరంలోనే లక్ష్మణస్వామి వాళ్ళ ఊరు చింతలూరుండేది. అది చాలా చిన్న ఊరు. కొద్ది గుడిసెలుండేవి. అందరూ వ్యవసాయదారులు. హరిజనులు కూడా ఉండేవారు. ఆ ఊరి జమిందారుకు చాలా పెద్ద భవంతి ఉండేది. అతను గ్రామ ప్రజల రక్తం పీల్చి పనులు చేయించుకొని, వాళ్ళని పీడిస్తూ ఉండేవాడు. వెంకట నగరం మరో చిన్న ఊరు. అలాగే పోతులూరు, వాకపల్లి కూడా చిన్న ఊళ్ళు. వీటితో పాటు తోటపల్లి అనే ఊరిలో కూడా కేవలం కొన్ని గుడిసెలుండేవి. మల్లికార్జునధారకి అత్యంత చేరువలో వుండేది. కొండల మీద నుండి జాలువారే జలపాతం నీళ్ళు క్రింద సహజంగా ఏర్పడిన శివలింగాన్ని అభిషేకిస్తూ ఉంటాయి. అది ఎంతో సహజంగా, అద్భుతంగా ఉంటుంది. నాకు తెలియదు భగవంతుడు ఈ ఆశ్రమానికి సరిగ్గా సరయిన పేరు 'శాంతి ఆశ్రమం' అని ఏవిధంగా నిర్ణయించాడో? బహుశా అది భగవంతుని కోరిక కావచ్చు. ఆశ్రమానికి అలాంటి సరయిన, అందమయిన, తయారయిన పేరు శాంతి, ప్రశాంతత ఇస్తూ గొప్ప భవిష్యత్తు, పేరు, ప్రఖ్యాతులు పొందింది.

లక్ష్మణస్వామి యెఖాసాదారు అనే వెంకటనగరం నివాసి వద్ద కౌలుదారుగా పనిచేస్తుండేవాడు. తన దగ్గర కౌలుదారుగా ఉన్న వ్యక్తి ఆశ్రమానికి పది ఎకరాలు ఇవ్వటం చూచి యెఖాసాదారు కూడా తన స్వంత భూమి కొన్ని ఎకరాలు ఆశ్రమానికి దానంగా ఇచ్చాడు. ఆశ్రమ నిర్మాణము ప్రారంభమయిన తర్వాత లక్ష్మణస్వామి, అతని తమ్ముళ్ళు వాళ్ళకి చేతనయినంత సహాయం చేస్తూ ఉండేవారు. వారి ఇంటి ఆడువారు

కూడా ఎంతో భక్తి శ్రద్ధలతో పనిచేస్తున్న మేస్త్రీకి, కూలీలకు భోజనము వండి పంపేవారు. వారు గొప్ప ధనవంతులు కాకపోయినా ఆశ్రమ నిర్మాణం జరుగుతున్నప్పుడు నా గురించి, ఆశ్రమ నిర్మాణంలోనూ ఎంతో సేవ చేశారు. తర్వాత కాలంలో నాకు తెలిసింది ఏమిటంటే వారికి యోఖాసాదారు వలన చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అందువలన నా సహాయంతో ప్రభుత్వ అధికారులకి ఫిర్యాదు చేయవచ్చునని వారు భావించారు.

ఆ సమయంలోనే నేను మస్తాన్ సాహెబ్‌ను కలుసుకున్నాను. బాగా చదువుకున్నవారు, విశాఖపట్టణంలో నివసించే నాగరీకులు కూడా మస్తాన్ సాహెబ్ బాగా గొప్ప ఆధ్యాత్మిక వేత్తని, ఆత్మసాక్షాత్కారము పొందిన వ్యక్తిగా భావించేవారు. అక్కడి కొండ మీద మహ్మదీయుల మసీదు, క్రైస్తవుల చర్చి, హిందువుల దేవాలయం ఉన్నాయి. మస్తాన్ సాహెబ్ ఎక్కువగా ఆ కొండ మీద కాలం గడిపేవాడు. మూడు మతాలకి సంబంధించిన ఆలయాలు, మత చిహ్నాలు ఒక చోట ఉండి పూజలందుకోవటం వలన నాకు ప్రపంచంలోని మతాలన్నింటికి గల సామరస్యాన్ని అర్థం చేసుకోవటానికి బాగా ఉపయోగపడింది. అటువంటి అందమయిన విశ్వమత సామరస్యం గల పవిత్ర స్థలంలో మస్తాన్ సాహెబ్ రోజంతా మౌనంగా ఒంటరిగా కాలం గడిపేవాడు. ఎవరయినా అతని ప్రశాంతతకి భంగం కలిగిస్తే వాళ్ళ మీద రాళ్ళు రువ్వి తరిమికొట్టేవాడు. అతనికి కాలం ఎంతో అమూల్యమైనదని, ప్రతి క్షణాన్ని సాధనతో సద్వినియోగం చేసుకోవాలని తెలుసు.

కేవలం రాత్రి బాగా చీకటి పడిన తర్వాత మస్తాన్ సాహెబ్ కొండ దిగి క్రిందికి దిగివచ్చి మిఠాయి దుకాణాలున్న వీథుల్లో తిరిగేవాడు. మిఠాయి దుకాణదారులు కొందరు అతనికి తాము తయారుచేసిన పదార్థాలు ఇస్తే ఆయన స్వీకరిస్తే తమకు మేలు జరుగుతుందని, భవిష్యత్తు బాగుంటుందని నమ్మేవారు.

ఒక రాత్రి వేళ మస్తాన్ సాహెబ్ పకోడీలు తింటూ ఉండగా నేను ఆయన పక్కన నిలబడ్డాను. ఆయన నా వైపు తిరిగి తాను తినగా మిగిలిన పకోడి ముక్కని నాకు ఇచ్చి ఇలా అన్నారు "బేటా! నా బిడ్డా! ఇది తిను. నీ వల్ల చాలా గొప్ప కార్యాలు జరగవలసి ఉంది. భగవంతుని వదలకుండా పట్టుకో!" ఆయన తన నోటిలోని ఆహారాన్ని నాకు ఇచ్చారు. అది ఎంగిలి అయినా, మహాప్రసాదంగా, పవిత్రంగా భావించాను. ఎంతో

సంతోషంగా దానిని తీసుకొని తిన్నాను. అది ఆ మహాత్ముడి ఆశీర్వాదంగా అనిపించింది. హఠాత్తుగా జరిగిన ఈ సంఘటన భగవంతుని అనుగ్రహమే కదా!

మొదట్లో నేను ఆ నిర్మానుష్య ప్రాంతంలో ఆశ్రమము ప్రారంభించినప్పుడు నా ఉద్దేశ్యం ఏమిటంటే అక్కడ నేను ఒంటరిగా ప్రశాంతంగా ధ్యానం చేసుకోవచ్చునని, గృహస్థుల ఇళ్ళల్లో ఉండనక్కరలేదని భావించాను. కాని ఆశ్రమము ప్రారంభించిన తర్వాత ఎన్నో బాధ్యతలు, ఇబ్బందులు మొదలయ్యాయి.

ఆశ్రమం నిర్వహించడానికి అక్కడ ఉండే మూగ జీవాలను, పనివారిని, ఆశ్రమంలో ప్రశాంతంగా గడపాలని వచ్చి ఉండే భక్తులను పోషించడానికి నేను చుట్టు ప్రక్కల పల్లెలకు, పట్టణాలకు వెళ్ళి అక్కడి భక్తులను ధన సహాయం చేయవలసిందిగా అడగవలసి వచ్చింది. ఇది నాకు చాలా క్రొత్తగా అనిపించింది. అంతవరకు నేను ఎన్నడూ ఎవరినీ, దేనికీ యాచించినది లేదు. పైగా నేను డబ్బు ముట్టుకొనేవాడినే కాదు. కాని ఇప్పుడు ఇంటింటికి తిరిగి గృహస్థులను ధనం కోసం యాచించవలసి వచ్చింది. నా ప్రపంచం తలక్రిందులయినట్లుగా విచిత్రంగా ఉంది. ఇదంతా ఆశ్రమము కోసం చేయవలసి వచ్చింది. భగవంతుడు ఆడుతున్న చిత్రమయిన నాటకంలా ఉంది.

నాకు ఇంకా ఇప్పటికి కూడా బాగా గుర్తుంది. ఆశ్రమము మొదలుపెట్టిన క్రొత్తలో దారి సరిగ్గా ఉండేది కాదు. అతి కష్టం మీద ఎడ్ల బండిలో ఆశ్రమానికి వచ్చేవారు. ఒకసారి ఆ గతుకుల దారిలో ఎడ్లబండి బోల్తాపడి ప్రమాదం జరిగింది.

గొల్లప్రోలు అనే సమీప గ్రామానికి ఒకసారి వెళ్ళవలసి వచ్చింది. ఆశ్రమానికి అవసరమయిన సరుకులు, బియ్యం బస్తాలు, అలాగే మూత లేని ఒక కిరసనాయిలు డబ్బా తీసుకు వస్తున్నారు. నాకిప్పుడు గుర్తు లేదు అది చీకటి రాత్రా లేదా పున్నమి రాత్రా అనే విషయం. దారి సరిగ్గా లేనందువల్ల ఎడ్ల బండి సరుకులతో సహా బోల్తా పడింది. క్రింద పడిపోయిన నా మీద బరువయిన బియ్యం బస్తాలు పడ్డాయి. కాని నేను మాత్రం మూత లేని కిరసనాయిలు డబ్బా గురించి చాలా ఆందోళన చెందాను. నా శారీరక బాధ కంటే నాకు దీని గురించి దిగులు ఎక్కువగా ఉంది. బస్తాలు చాలా బరువయినవి మీద పడడం వలన ఊపిరాడటం లేదు. అయినా నేను కిరసనాయిలు డబ్బాకి నా చేయి అడ్డం పెట్టి అది కారకుండా జాగ్రత్తగా కాపాడడానికి ప్రయత్నించాను.

విషయం తెలుసుకుని సహాయం చేయడానికి వచ్చినవాళ్ళు బరువయిన బస్తాలను నా మీద నుండి తీసివేసేవరకు నేను అలాగే కిరసనాయిలు కారకుండా నా చెయ్యి అడ్డంపెట్టి ఉంచాను.

అంత ప్రమాదం జరిగినప్పటికి, ఇప్పటికి కూడా నాకు చాలా ఆనందంగా ఉంటుంది. దీని గురుంచి గుర్తు వచ్చినప్పుడు. ఆశ్రమం కోసం కిరసనాయిలు కారిపోకుండా జాగ్రత్తగా కాపాడగలిగాను. మేము జాగ్రత్తగా, నెమ్మదిగా తెల్లవారే సరికి భగవంతుని దయ వలన ఆశ్రమానికి చేరుకున్నాము. ఎద్దులకు గాని, మాకు గాని ఎలాంటి ప్రమాదం గాని, బలమయిన గాయాలు గాని అవలేదు. అంతా భగవంతుని మాయ.

లోకాసమస్తా సుఖినోభవంతు!

**అధ్యాయం - 15**

# రక్షణ లేని వారిని రక్షించడానికి ప్రయత్నము

హృదయము నిండా దేశభక్తిని నింపుకోవాలి లేదా ప్రపంచంలోని వారందరి శాంతి సౌభాగ్యాలను కోరుకోవాలి. ఆధ్యాత్మిక పునాది చాలా అవసరం. జీవితమనేది విశ్వప్రేమ మీద ఆధారపడి ఉంటుందని గుర్తుంచుకోవాలి. సత్యం అనే సూత్రానికి అర్థం అందరిని ప్రేమించటము. మనం భగవంతుడిని మాత్రం ప్రేమిస్తాము. కాని ఇతరులను బాధ పెట్టడం అంటే భగవంతుని సజీవ రూపాన్ని బాధపెట్టటమే కదా!

గ్రామ పెద్దలు గాని, అధికారులు గాని ప్రజలను, తమ క్రింద పనిచేసేవారిని ఎంతో ప్రేమతో తమ స్వంత బిడ్డల్లా చూసుకోవాలి. లేదా తమ స్వంత కుటుంబ సభ్యుల్లాగా భావించాలి. కాని ఇది కలియుగం. మానవుడు చాలా స్వార్థంతో, పొగరుబోతు తనంతో కేవలం తన స్వార్థాన్ని తాను చూసుకొంటున్నాడు. రాక్షసుల్లాగా ఏదో విధంగా పేదవారిని పీడించసాగారు. భూకామందులు తమ పొలంలో పనిచేసే వ్యవసాయదారులతో, నిరుపేద నిస్సహాయులతో వెట్టి చాకిరి చేయిస్తూ వాళ్ళ రక్తం పీలుస్తూ డబ్బు దండుకొంటున్నారు. నాకు చాలా విచారంగా అనిపించేది. ఆశ్రమము

చుట్టూ అనేక చిన్న చిన్న గ్రామాలున్నాయి. ఎప్పుడు చూచినా పోట్లాటలు, గొడవలు, కొట్టుకోవడాలు జరుగుతుండేవి. జమిందారులు, ధనవంతులు డబ్బు ఎరగా వేసి పోలీసులతో గ్రామస్థులపైన కేసులు పెట్టేవారు. తరుచుగా పోలీసులు గ్రామస్థులపై దాడి చేసి వారిని వేధిస్తుండేవారు. డబ్బుతో దేనినయినా సాధించవచ్చు. అందుకే పోలీసులు ఏదో ఒక కేసులో ఇరికించి వారిని జైలులో పెడుతుండేవారు.

జమీందారుకి, రైతులకి మధ్య క్రిమినల్ కేసు నడుస్తోంది. ఈ కేసు గురించి జమీందారు వేల రూపాయలు ఖర్చు పెట్టి క్రింద కోర్టులో నెగ్గాడు. ఈ కేసు చాలా సంవత్సరాలుగా నడుస్తోంది. క్రింది కోర్టు చాలా మందికి జైలు శిక్ష విధించింది. ఈ కేసు ఇప్పుడు హైకోర్టుకు వచ్చింది. నేను ఆ ప్రాంతంలోనే ఆశ్రమంలో నివసిస్తున్నందువల్ల జరిగిన విషయాలన్నీ నాకు బాగా తెలుసు. అందువల్ల జరుగుతున్న అన్యాయం చూచి నేను తట్టుకోలేకపోయాను. చివరి తీర్పు వెలువడితే జైలులో అప్పటికే మగ్గిపోతున్న ముప్పై మంది జీవితాలు నాశనమవుతాయి. ఆ రాత్రి నేను డిప్యూటీ కలెక్టరు గారిని కలవడానికి వెళ్ళాను. అమాయకులయిన ముప్పై మంది జీవితాలు ఆయన చేతుల్లోనే ఉన్నాయి. డిప్యూటీ కలెక్టరు గారు మంచి భక్తుడు, దయామయుడు. నేనతనికి ఆధ్యాత్మిక ఉన్నతిని కల్గించడానికి నా వంతు ప్రయత్నం చేశాను. మేమిద్దరము నేల మీద పద్మాసనం చేసుకొని కూర్చున్నాము. భగవంతుని గురించి నేను బోధించిన విషయాలన్నీ ఆయన ఎంతో శ్రద్ధగా విన్నారు. ఆ మరుసటి రోజు ఆ కేసును కొట్టివేస్తూ తీర్పు వెలువడింది. రైతు కూలీలందరూ ఆనందంతో పండగ చేసుకున్నారు. తప్పుడు కేసుల్లో ఇరుక్కొని జైలు పాలయిన వారందరూ విడుదలయ్యారు. జమిందారు మొహం మాడిపోయింది. అంతా భగవంతుని అనుగ్రహం. నిస్సహాయస్థితిలో ఉన్న దేవుని బిడ్డలకు సహాయ సహకారాలు అందించడానికి ఈ ఉపాధిని వినియోగించుకున్నందుకు దైవానికి కృతజ్ఞతలు తెలియచేసుకున్నాను.

అలాగే కుంకుడు కాయల కేసు కూడా చాలా జటిలమయినది. అక్కడి పేద రైతులు తమ పొలాల్లో కుంకుడుకాయలు నిలువచేసుకున్నారు. దౌర్జన్యపరుడైన జమిందారు రెండు లారీల నిండా రౌడీలను, గూండాలను తీసుకువచ్చి రైతులను భయపెట్టి బీభత్సం సృష్టించాడు. అందులో కొందరికి పోలీస్ ఇన్‌స్పెక్టర్ దుస్తులు వేశారు. మరి కొందరు పోలీసుల దుస్తుల్లో వచ్చారు. అమాయకులైన రైతుల హృదయంలో భయం సృష్టించడమే

వారి ధ్యేయం. రైతుల ఇళ్ళల్లో దౌర్జన్యంగా దూరి వారి వస్తువులన్నీ చిన్నాభిన్నం చేశారు. మంచాలు, కుండలు, బుట్టలు వంటి వాటిని ధ్వంసం చేసి బయటికి విసిరిపారేశారు. కొన్ని పగలగొట్టారు. గ్రామస్థులందరూ భయంతో ప్రాణాలు అరిచేతిలో పెట్టుకొన్నారు. అసలు ఇదంతా వారిని తికమక పెట్టి అసలు పని చేసుకోవడానికి చేశారు. రైతులు దాచుకున్న కుంకుడు కాయల్ని బస్తాల్లో నింపి లారీల్లో ఎక్కించారు. రైతుల కష్టార్జితాన్ని దోచుకోవటానికి జమిందారు ఆడించిన నాటకమది. చివరికి వెళ్ళిపోతూ గూండాలు రైతుల గుడిసెలకు నిప్పు పెట్టి పోయారు. దానితో పేద రైతులు మరింతగా భయపడిపోయి జరుగుతున్నది ఏమిటో, ఎందుకో అర్థం కాని అయోమయంలో పడ్డారు. అర్థరాత్రి వరకూ బీభత్సం సృష్టించిన రౌడీలు కుంకుడు కాయల బస్తాలు లారీల్లో వేసుకొని వెళ్ళిపోయారు. నెమ్మదిగా కోలుకున్న రైతులు ఆశ్రమానికి వచ్చి జరిగిన విషయమంతా వివరించి జమిందారు చేసిన దౌర్జన్యాన్ని గురించి చెప్పుకుని వాపోయారు.

నేను సర్వసంగ పరిత్యాగినయిన సన్న్యాసిని అయినా, ప్రాపంచిక విషయాలకి, కార్యకలాపాలకి దూరంగా ఉంటున్నప్పటికీ, నా కర్తవ్యం, బాధ్యతలను నేను మరచిపోలేను. నాగరీకులము, చదువుకున్నవాళ్ళము అని చెప్పుకుంటూ తిరిగేవారు. పోలీసు అధికారుల సహాయంతో చాలా క్రూరంగా, దయా, కనికరం లేకుండా నిస్సహాయులైన నిరుపేద రైతులను దోచుకుంటూ అన్యాయం చేస్తుంటే చూస్తూ ఊరుకో లేకపోయాను. ఆ మరుసటి రోజు జిల్లా కలెక్టర్ గారిని కలవటానికి కాకినాడ వెళ్ళాను. నా అభ్యర్థన మేరకు జిల్లా కలెక్టర్ గారు విచారణ మొదలుపెట్టారు. విచారణ చేయడానికి ఒక సూపరింటెండెంట్‌ని నియమించారు. చివరికి నా వద్దకు వచ్చి అవి కుంకుడు కాయల బస్తాలు కాదని సిమెంటు బస్తాలని చెప్పాడు. అందువలన ఆ కేసును కొట్టివేశారు. నేను ఎన్నో ప్రయత్నాలు చేసినప్పటికి దొంగిలించబడిన కుంకుడు కాయల బస్తాలను పేద రైతులకి తిరిగి ఇప్పించలేకపోయాను. జమిందారు బాగా ధనవంతుడవడం వలన లంచగొండులయిన పోలీసు అధికారుల సహకారంతో ఈ కేసునుండి అతడి అనుచరులను తప్పించాడు. పేద రైతులకి నేను అండగా నిలబడటం గమనించిన జమిందారు నా పట్ల గౌరవంతోనో, లేదా రైతుల పట్ల జాలితోనో సానుభూతితోనో కాకుండా నాకు భయపడి రైతులతో స్నేహంగా ఉండటం మొదలుపెట్టాడు. వారిని బాధించటం, పీడించటం మానివేసినందుకు నేను సంతోషించాను.

అలాంటి సన్నివేశాలు అనేకం జరిగాయి. నేను తోటపల్లి కొండల్లోని ఆశ్రమంలో జీవితం గడిపినప్పుడు. నేను ఎప్పుడూ నిరుపేద రైతుల పక్షం వహించి వారికి న్యాయం చేయడానికి ప్రయత్నించేవాడిని. వీటి గురించి వివరించాలంటే నేను చాలా చాలా విషయాలను చెప్పాల్సి ఉంటుంది. కాబట్టి ఇంకొక్క సంఘటన గూర్చి చెప్పి నేను దీన్ని ముగిస్తాను. వేరొక గ్రామంలో ఒక గౌరవనీయమయిన కుటుంబంలో జరిగిన బాధాకరమయిన సంఘటన అది.

రెండు గ్రామాల మధ్య ధనవంతులయిన కుటుంబాల మధ్య ఏదో కారణం వలన గొడవ మొదలయింది. ఆ కారణం ఏమిటో నాకిప్పుడు గుర్తు లేదు. కాని రెండు కుటుంబాల వారు ఒకరికొకరు హాని చేసుకోవటానికి ఇబ్బందులు పెట్టడానికి ప్రయత్నించ సాగారు. ఏదయినా చేయటానికి వెనకాడకుండా సిద్ధపడ్డారు. అందులో ఒక గ్రామంలోని కుటుంబం వారు పోలీస్ ఇన్‌స్పెక్టర్‌కి లంచం ఇచ్చి వేరే గ్రామంలోని కుటుంబం వారిని ఇబ్బంది పెట్టమని అడిగారు. లంచంగా ధనం బాగా ముట్టడం వలన ఆ ఇన్‌స్పెక్టర్ చాలా మంది పోలీసులతో ఆ గ్రామాన్ని ముట్టడించి, ఆ గ్రామంలోని వారినందరిని ఇళ్ళలోంచి బయటికి లాగి బాగా కొట్టడం మొదలుపెట్టారు. మనుష్యుల్ని బయటకు ఈడ్చుకొంటూ తెచ్చి ఆడ మగ అని తేడా చూపించకుండా లాటీలతో చితకబాదటం మొదలుపెట్టారు. దీనికి వారు ఎలాంటి కారణం చెప్పలేదు కూడా. వారిలో ఒక వ్యక్తి ఎదురు తిరిగేసరికి అతడిని విపరీతంగా కొట్టారు. పోలీసులు బూటు కాళ్ళతో బాగా తన్నారు. అతడి ఒంటి నిండా గాయాలతో, వాతలతో నిండిపోయింది.

పోలీసుల దాడి ముగిసిన తర్వాత బాగా గాయపడిన వ్యక్తిని ఆశ్రమానికి తీసుకు వచ్చారు. అతడిని చూచి నాకు చాలా బాధ కలిగింది. అతని శరీరము పోలీసులు కొట్టిన లాటి దెబ్బల వలన, బూటు దెబ్బల వలన ఏర్పడిన గాయాలతో రక్తం కారుతూ ఉంది. ఈసారి ఇది పోలీసుల దౌర్జన్యం. అది కూడా ధనవంతులనుండి లంచం తీసుకొని చేసిన పని. దానిని నేను ఎంత మాత్రం చూచి సహించలేకపోయాను. ఇంత క్రూరత్వం, అన్యాయం సహించరానిది. అందుకే నేను మళ్ళీ ఇంకొకసారి కాకినాడ వెళ్ళి పోలీస్ హెడ్ క్వార్టరులో ఉండే జిల్లా సూపరింటెండెంట్ గారిని కలిసాను. ఆయన ముసల్మాన్ అయినా మంచి భక్తుడు. అలాగే నేరస్తుల పాలిట సింహ స్వప్నం లాంటి వాడు. అతన్ని కలవడానికి కూడా అందరూ భయపడేవారు. బాగా పలుకుబడి ఉన్న నా స్నేహితుడు

ఒకరు ఆయనకి నా గురించి, నా ఆశ్రమ కార్యక్రమాల గురించి పరిచయం చేశాడు. అది విన్న తర్వాత ఆయన నన్ను ఎంతో గౌరవంగా ఆహ్వానించారు. ఒక్క నిముషం మౌనంగా ఆయన ఎదుట నిలబడి నెమ్మదిగా ఆయనతో అన్నాను. "నా దృష్టిలో అంతా భగవంతుడే. అంతటా ఆయన నిండి ఉన్నాడు. కనుక ఇప్పుడు నేను ఆయన సన్నిధిలోనే ఉన్నానని భావిస్తున్నాను. నేనా భగవంతునితోనే నేను చెప్పదలచు కున్నది చెపుతున్నాను".

అది వినగానే ఆయన ఎంతో ప్రభావితుడయ్యాడు. తాను నా కోసం ఏమి చేయాలో చెప్పమన్నాడు. నేనిప్పుడు ఆయనతో జరిగిన సంఘటన గురించి ఎంతో జాగ్రత్తగా అన్నీ వివరంగా తెలియచేశాను. అంతా ఓపిగ్గా విన్న తర్వాత ఆ విషయం తాను చూసుకుంటానని చెప్పారు.

నా కర్తవ్యం నేను నెరవేర్చగల్గినందుకు భగవంతుని కీర్తిస్తూ చాలా సంతోషించాను. కాకినాడలోనే ఆయన చాలా పెద్ద పోలీస్ ఆఫీసర్. వారికి కృతజ్ఞతలు తెలియచేసి ప్రశాంతంగా ఆశ్రమానికి తిరిగి వచ్చాను.

నేను వచ్చిన వెంటనే ఆ పోలీస్ ఆఫీసర్ గారు వెంటనే తన వాహనంలో హడావుడిగా ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్‌లో తనిఖీ ప్రారంభించారని తెలుసుకొని ఎంతో ఆశ్చర్యంతో పాటు ఆనందం కూడా పొందాను. ఆయన ఆ కేసు గురించిన ఫైళ్ళు అన్నీ తెప్పించుకొని పరిశీలించారు. వెంటనే లంచం పుచ్చుకొని దాడి చేసిన పొగరుబోతు పోలీస్ ఇన్‌స్పెక్టర్‌ని ఉద్యోగం నుంచి తొలగించారు. అలాగే అందులో పాలుపంచుకున్న మిగిలిన పోలీస్ ఉద్యోగులను కూడా సస్పెండ్ చేశారు. అక్కడి నుండి ఆయన తుని స్టేషన్‌కి వెళ్ళి ఆ కేసుకి సంబంధించిన ఫైళ్ళు అన్నీ తనతో తీసుకువెళ్ళారు. ఆయన తునిలో ఉన్నారని తెలుసుకొని నేను వెంటనే దాడిలో బాగా గాయపడిన వ్యక్తిని తీసుకువెళ్ళి చూపించాను. అతని పరిస్థితిని స్వయంగా చూచిన సూపరింటెండెంట్‌గారు అతడిని వైద్యుని వద్ద సర్టిఫికెట్ తీసుకున్నారా? అని ప్రశ్నించారు. అందుకు అతడు తనకు ఎలాంటి వైద్య సహాయం చేయలేదని చెప్పగానే ఆయన స్వయంగా అతడిని వైద్యం కోసం వైద్యశాలకు పంపించారు. అలాగే గాయపడినట్లుగా సర్టిఫికెట్ కూడా తీసుకోమని చెప్పారు. ఇప్పుడు కేసు తిరగబడింది. న్యాయం ధర్మం ప్రకారం ఆ సూపరింటెండెంటు గారు తన క్రింది ఉద్యోగస్థులందరిపైన కేసు పెట్టి శిక్ష వేయించారు.

లంచగొండి పోలీస్ ఇన్‌స్పెక్టర్‌ని ఉద్యోగంలోంచి పూర్తిగా తొలగించి, మిగిలిన వారిని హెచ్చరించి వదలిపెట్టారు. దానితో అంతా పూర్తిగా సర్దుకుంది. దీని వలన నేను పేదలకు, నిస్సహాయులైన వారందరికీ ప్రేమపాత్రుడనయిన స్నేహితుడిగా మారితే, దుర్మార్గులకు, విధ్వంసం సృష్టించే ధనికులకు శత్రువుగా మారాను. ఏ ఒక్కరు కూడా మంచి వాళ్ళని, చెడ్డ వాళ్ళని ఇద్దరినీ కూడా సేవించలేరు. ఆ రోజు నేను చాలా సంతోషించాను. భగవంతుడు తన బిడ్డలకి సేవలందించేందుకు గొప్ప ఆపదల్లో ఉండే అనాథలను ఆదుకొనేందుకు గొప్ప అవకాశం ఇచ్చాడు.

ఈ సంఘటనలన్నింటి మూలంగా అన్ని గ్రామాల ప్రజలు ఆశ్రమానికి బాగా దగ్గరయ్యారు. వివిధ రూపాల్లో వారి సేవలు ఆశ్రమానికి అందుతుండేవి. బావులు త్రవ్వటంలో, కుటీరాలు ఏర్పాటు చేయటంలో, ఆశ్రమానికి ముఖద్వారం కట్టడంలో, ఇంకా ఆశ్రమానికి వచ్చే అతిథుల కోసం, ఆశ్రమంలో ఉండే భక్తుల కోసం కట్టడాలు నిర్మించటంలో వీరందరూ ఎంతో సహాయపడ్డారు.

గొప్పతనమంతా భగవంతునిదే. మనమంతా ఆయన చేతిలో పనిముట్లు లాంటి వారము. మన చేత ఏ పని చేయించాలో అది మనతో చేయిస్తాడాయన. భగవంతునికి బాగా తెలుసు మనకి ఏది మేలు చేస్తుందో. ఆశ్రమానికి నాకు జరిగిన మేలు అంతా ఆయన అనుగ్రహమే. అలాగే ప్రపంచానికంతా మేలు జరుగుతుంది.

ఓం తత్సత్ ఓం

అధ్యాయం - 16

# గురుకులము

ఎవరయితే దివ్యమయిన భగవతత్త్వంతో అనుసంధానము కల్గి ఉంటారో అనంతమయిన సోహం తత్త్వం వారిని ఆనందంగా, నిర్భయంగా, శాంతికి ప్రతినిధులుగా తయారు చేస్తుంది. దివ్యశక్తితో ఎలాంటి సంబంధం పెట్టుకోని వారు దుర్భరమయిన

జీవితాన్ని గడుపుతూ, జీవం లేక, కృంగిపోతూ, అయోమయస్థితిలో, ఆత్మతత్త్వం తెలుసుకోలేని వారై జీవితాలను వెళ్ళదీస్తారు.

ఒకసారి ఎవరో అన్నారు. భగవంతుడు ప్రపంచాన్ని సృష్టించింది మానవుడు దాన్ని చక్కదిద్దుకోవడానికి కాదు. మనము ఈ ప్రపంచాన్ని బాగుచేయడానికి రాలేదు. కాబట్టి జరుగుతున్న వాటికి బాధపడకుండా, భగవంతునిపై నమ్మకంతో ఆయనపై భారము వేసి ఇంకా ఇంకా దైవానికి చేరువ కావడానికి ప్రయత్నించాలి. ఆశ్రమము నిర్మించిన తర్వాత అనేకులతో నిత్యం కలిసి మెలసి మెలగవలసి వస్తుంది. ఆశ్రమము కోసం ప్రాపంచిక విషయాలతో కార్యకలాపాలు ఎక్కువ కాసాగాయి. దీనితో నేను భగవస్సాన్నిధ్యానికి దూరం అవుతున్నట్లు అనిపించి బాధ కలగసాగింది. అందువలన తిరిగి హిమాలయాలకు కొంతకాలమయినా వెళ్ళి ప్రశాంతంగా ధ్యానంలో కాలం గడపాలని మనస్సు తహతహలాడ సాగింది. ఆశ్రమము గురించి, వాటి కార్యక్రమాల గురించి కొంతకాలం మరచిపోవచ్చు. అందువలన అంతర్వాణి ప్రబోధాన్ని అనుసరించాలను కొన్నాను. దానికి తోడు స్వర్గాశ్రమము మహంతు ఆత్మ ప్రకాష్, ఇంకా ఇతర సాధువులు, ప్రత్యేకంగా గురుకులం విద్యార్థుల నుండి రమ్మని పిలుపు కూడా అందింది. ఆశ్రమంలో గురుకులం స్థాపించడానికి ఆ పిల్లలు కూడా బీజాలు నాటారని చెప్పాలి.

అందరూ తిరిగి నేను హిమాలయాలకు వచ్చినందుకు చాలా సంతోషించారు. పవిత్రమయిన గంగానది, హిమాలయ పర్వతశ్రేణులు, చెట్లు, వృక్షాలు, పక్షులు, అందమయిన పూలు అన్నీ నా రాకకి ఆనందంగా ఉన్నాయనిపించింది. ఎక్కడయితే నేను మొదట్లో ధ్యానంలో ఆనందాబ్ధిని అనుభవించానో ఆ ప్రదేశాలన్నీ నాకు తిరిగి స్వాగతం పలికాయి. భగవంతుడు సర్వాంతర్యామి. ప్రకృతిలోని సమస్తము భగవంతుని స్వరూపమే. గంగానది ఒడ్డున కూర్చుని పవిత్రమయిన ఆ నదీ తరంగాలు చేస్తున్న గలగలా సవ్వడుల్లో పరమ పవిత్రమయిన ఓంకారనాదాన్ని శ్రవణం చేస్తున్న నాకు నదిలో ఎగురుతున్న చేప పిల్లలను చూస్తుంటే అవి ఎంతో ఆనందంతో నాకు స్వాగతం పలుకుతున్నట్లుగా ఉంది. ప్రకృతిలో లీనం కావటం, దానితో అనుసంధానం కావటం భగవంతుని గొప్ప అనుగ్రహమే. ఉన్నతమయిన పర్వత శిఖరాలు, గుట్టలు, రాళ్ళు, మహావృక్షాలు, చిన్న చిన్న మొక్కలు, వికసిస్తున్న పుష్పాలు, నీటిలో ఈదులాడుతున్న

చేపపిల్లలు ఆకాశంలో స్వేచ్ఛగా, ఎగిరే పక్షులు, మిలమిలలాడే నక్షత్రాలు అన్నింటిలో ఏకత్వాన్ని అనుభవించే స్థితిని అనుగ్రహించిన భగవంతునికి ధన్యవాదాలు. చల్లని పిల్లగాలుల్లో, వేడిగా వీచే సూర్యుని తాపాన్ని కలిగించే వడగాలుల్లో కూడా ఆయన వైభవమే దర్శనమిస్తోంది. భూమిపై సంచరించే ప్రతి జీవి కదిలే దేవాలయమే. జీవమున్న ప్రతివారు ఏ ప్రాంతము వారయినా, ఏ దేశము, జాతి, మతము వారయినా, తూర్పు పడమర వారయినా అందరూ దైవానికి ప్రతిరూపాలే. అంతా భగవత్స్వరూపమే తప్ప అన్యంగా ఏమీ లేదు. అణువు నుండి బ్రహ్మాండం వరకు నిండి నిబిడీకృతమైనవాడు పరమాత్మ.

నా పాత మిత్రుడు నారాయణస్వామి నా కోసం నా కుటీరములో ఎదురుచూస్తూ ఉన్నాడు. నన్ను చూడగానే పరమానందపడిపోయాడు. అతను నిజమైన భక్తుడు, సేవకుడు. ఎలాంటి అభినందనలు ఆశించడు. నాకు ఇప్పటికీ కూడా చాలా ఆశ్చర్యంగా అనిపిస్తుంది. ఈ ఉపాధి భౌతిక అవసరాలు, సేవలు ఎంతో నిస్స్వార్థంగా చేశాడాయన. అంతటి నిస్వార్థ సేవా పరాయణుడయిన నారాయణస్వామికి నేను ఏమి చేయలేకపోయాను అనే బాధ నన్ను అసంతృప్తికి లోను చేస్తుంది. ఆంధ్రదేశంలో ఆశ్రమము బాగా అభివృద్ధి చెందిన తర్వాత నారాయణస్వామి వచ్చి అక్కడ కొన్ని నెలలు ఆశ్రమంలో కాలం గడిపారు. ఆశ్రమం చేసే సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకుంటూ ఉండేవారు. శాంతి ఆశ్రమము ఆయనకి అందించిన సేవ ఏమిటంటే ఆయన ప్రశాంతంగా ధ్యాన అనుష్ఠానం, సాధనలు చేసుకోవడానికి సహకరించడమే. ఆ విధంగా వారి ఆధ్యాత్మిక ప్రగతికి తోడ్పడగలిగాము.

రోజు రోజుకి కాలం విలువ నాకు తెలిసి వస్తోంది. ఎక్కువ సమయం నేను గంగానది ఒడ్డున ధ్యానంలోనే ఉండేవాడిని. నిశ్శబ్దంగా గంగానది ఒడ్డున నడుస్తూ ఉండేవాడిని. గంగానదిలో ఎగిరి గంతులు వేసే చేపపిల్లలు ఎలా ఉన్నావు అంటూ పలకరించేవి. ఒంటరిగా నిర్మానుష్యమయిన ప్రదేశాలలో ధ్యానం చేసుకోవడానికి వెళితే అక్కడి రాళ్ళు వచ్చి నా మీద కూర్చొని ధ్యానం చేసుకోమని ఆహ్వానిస్తూ ఉండేవి. అక్కడి లక్ష్మణజూలా వంతెన, చుట్టూ అనేక ఆశ్రమాలు, అందులో తపస్సాధనల్లో మునిగితేలే ఎందరో సాధు మహాత్ములు, యోగినీ మాతలు, అద్భుతమయిన ఆహ్లాదకరమయిన ఆధ్యాత్మిక వాతావరణం ఎక్కడ చూచినా దర్శనమిచ్చేది. అది తలుచుకుంటే ఇప్పుడు కూడా నాకు

ఎంతో ఉత్సాహం, ఆనందం కలుగుతుంటాయి. ఎంతో ప్రశాంతమయిన ఆనందమయిన జీవితం గడిపానక్కడ.

తరుచుగా నేను బాగా శాస్త్రం చదువుకుని ఆధ్యాత్మికోన్నతి సాధించిన సాధు మహాత్ముల సన్నిధిలో గంటల తరబడి మౌనంగా కాలం గడిపేవాడిని. ఆ మౌనమే మా మధ్య ఆధ్యాత్మిక తరంగాలను సృష్టించేది. కలకత్తాలోని రామకృష్ణ మిషన్ వారు నిర్వహిస్తున్న గురుకులాన్ని సందర్శించాను. కంకల్‌లో వందల మంది బ్రహ్మచారులను చూస్తూ గురుకులం పనిచేస్తున్న తీరుతెన్నులను గమనిస్తూ రెండు మూడు రోజులున్నానక్కడ. అప్పుడే అక్కడే నా హృదయంలో గురుకులం స్థాపించాలనే సంకల్పం కల్గింది. స్వర్గాశ్రమంలో హిమాలయాల్లో కాలం గడుపుతున్న రోజుల్లోనే శాంతి ఆశ్రమంలో కూడా ఇలాంటి గురుకులాన్ని స్థాపించాలనే సంకల్పానికి బీజాలు పడ్డాయి.

స్వర్గాశ్రమములోని నల్గురు పిల్లలు విశ్వామిత్ర, వశిష్ఠ, కశ్యప, తార మొదలైన వారు నాకు రోజు రోజుకి ఎంతో చేరువ కాసాగారు. వాళ్ళు నాతో ఆంధ్రాకు రావాలని ఆశ్రమంలో ఉండి ఇంగ్లీషు విద్య నేర్చుకోవాలనే వారి కోరికను నా దగ్గర వెళ్ళబుచ్చారు. మహాభక్తుడయిన మహంతు ఆత్మప్రకాష్ కూడా పిల్లల్ని నాతో పంపించడానికి ఎంతో ఉత్సాహం చూపించారు. ఆ పిల్లలు ఇంగ్లీషు నేర్చుకొంటే స్వర్గాశ్రమానికి, దాని అభివృద్ధికి ఎంతో సహాయపడతారని ఆయన అభిప్రాయం. దక్షిణ ప్రాంతంనుండి ఎందరో యాత్రికులు నిత్యం వస్తూ వుంటారు. వారికి హిందీ భాష రాదు. ఆశ్రమంలో ఇంగ్లీషు భాష వచ్చిన వారు చాలా కొద్దిమంది ఉండడం వలన యాత్రికులతో మాట్లాడ్డంలో ఇబ్బంది ఏర్పడుతోంది. అందువలన మేమందరము ఈ పిల్లలు ఇంగ్లీషు నేర్చుకోవడం వలన ఆశ్రమానికి, పిల్లలకి కూడా చాలా ఉపయోగం ఉంటుందని భావించాము. నేను స్వర్గాశ్రమంలో ఉన్నప్పుడు మహంతుగారు నా పట్ల ఎంతో ఆదరాభిమానాలు చూపించేవారు. స్వంత వ్యక్తిగా భావించి ఎంతో ఉన్నతమయిన గౌరవాన్ని ఇచ్చారు. ఎన్నో సందర్భాల్లో వారు కూర్చొనే ఉన్నతాసనం 'గద్దె' మీద నన్ను కూర్చుండబెట్టి గౌరవించారు. వీటన్నింటికి నేను నా కృతజ్ఞతలు ఈ విధంగా అందచేయాలనుకున్నాను.

ఆ విధంగా ఆ నల్గురు పిల్లలను నాతో పాటు ఆంధ్రాకి తీసుకువచ్చాను. మా ప్రయాణం కోసం అన్ని సౌకర్యాలు మహంతుగారే చేశారు. అక్కడి స్నేహితులందరి వద్దా సెలవు తీసుకొని విశాఖపట్టణం చేరుకున్నాము. నాతో వచ్చిన గురుకుల

విద్యార్థులను అందరూ ఎంతో ఆసక్తిగా చూచారు. వారు ఎంతో మధురమయిన గాత్రంతో భక్తి గీతాలు, భజనలు, సంకీర్తనలు చేస్తూ ఉంటే చూడటానికి ముని బాలకుల మాదిరిగా ఎంతో తేజస్సుతో ఉండేవారు. వారు పవిత్రమయిన హిమాలయాల్లో జన్మించటం వలన, ఆశ్రమ జీవనం గడపటం వలన వారిలో తేజస్సు ఉట్టిపడుతుండేది. నేను ఆరు సంవత్సరాలు హిమాలయాల్లోని స్వర్గాశ్రమంలాగా సాధనలు చేయటం వలన సహజంగానే తోటపల్లి కొండల్లోని ఆశ్రమాన్ని ఒక చిన్న స్వర్గాశ్రమంలో తీర్చిదిద్దాలని, అక్కడి నుండి తీసుకువచ్చిన పిల్లలతో గురుకులాన్ని ఏర్పాటు చేయాలని సంకల్పం కల్గటంలో ఆశ్చర్యం ఏముంది? 'కన్‌కల్' శ్రీహరి పాదపీఠం అయిన హరిద్వార్‌కి దగ్గరలోనే ఉంటుంది. కనకల్‌లోని కాంగ్రి అనే స్థలంలో రెండు ప్రసిద్ధి చెందిన గురుకులాలున్నాయి. అందులో ఒక దాని పేరు 'రిషికుల్' వేరొకటి గురుకులము. ఒక్క దానిలో దాదాపు వెయ్యిమంది బ్రహ్మచారులుండేవారు. అందులో ఒక గురుకులాన్ని ఆర్య సమాజం వారు నిర్వహిస్తుండగా, మరొకదానిని హిందూ సమాజం వారు నిర్వహించేవారు. గురుకులంలోని పిల్లలను చేతిలో సమిధలతో చూస్తూ ఉంటే ఎంతో ప్రేరణ, ఉత్సాహం కలుగుతుంది. ఎండు పుల్లలతో వారు యజ్ఞ కార్యం నిర్వహిస్తారు. ఆ సమయంలో వైదిక మంత్రాలు చదువుతూ భగవంతునికి హవ్యాన్ని సమర్పిస్తారు. అది చూచినప్పుడు నిజంగా దేవలోకంలో ఉన్నట్లుగా ఉంటుంది. అది వర్ణించడానికి మానవ మాత్రులకి సాధ్యం కాదు. అక్కడి గురుకులంలోని పిల్లలు యజ్ఞకార్యం నిర్వహించడం చూస్తుంటే నేను స్వర్గంలాగా భావించేవాడిని. అందువల్లనే గురుకులం స్థాపించాలనే దృఢమైన సంకల్పం స్వర్గాశ్రమంలో తపస్సాధనలు చేస్తున్న కాలంలోనే నా యువ హృదయంలో నిజరూపంగా ఉండేది. అప్పటికి నేను చాలా చిన్న వయస్సులోనే ఉన్నాను. తోటపల్లి కొండల్లోని ఆశ్రమంలో చిన్నగా గురుకులం ప్రారంభించాలనుకున్నాను.

అందువల్లనే భగవంతుడు నాకు నల్గురు ఋషి బాలురను గురుకులం ప్రారంభించ డానికి పంపించాడు. అయితే అది చాలా గొప్ప బాధ్యతాయుతమైన పని. అంతేకాదు ఎంతో శ్రమతో కూడిన వ్యవహారం. గురుకులంలోని విద్యార్థులను ఎంతో ప్రేమతో, నిస్వార్థంగా సంరక్షణ చేయాలి. వారి ఆహారం విషయంలో చాలా జాగ్రత్తలు పాటించాలి. భక్తిభావంతో, అంకితభావంతో వారికి ప్రేమతో వండి వడ్డించి కన్నబిడ్డల్లాగా ప్రేమగా సంరక్షించాలి. నా చిన్ననాటి స్నేహితుడు, అకాడమీ ఆఫ్ రెలిజియన్ సభ్యులు అయిన శ్రీ నరసింహము గారు మా అదృష్టం కొద్దీ గురుకులము బాధ్యతలను తీసుకున్నారు.

ఆయన ధర్మపత్ని గారు కూడా మంచి సద్గుణశీలి కావడం వలన వారిద్దరు ఆశ్రమానికి రాత్రి పగలు అనే తేడా లేకుండా ఎన్నో సంవత్సరాలు సేవలు అందించారు. అనేక బాధ్యతలను ఎంతో ఇష్టంగా స్వీకరించారు. ఒక రిటైరయిన ఉపాధ్యాయుడు కూడా గురుకులంలో సేవలందించేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చాడు. ఆయన ప్రధానోపాధ్యాయుడుగా బాధ్యత తీసుకున్నారు. పిల్లలను మంచి క్రమశిక్షణతో, ఆధ్యాత్మిక ఉన్నతి కలిగించేందుకు మంచి హృదయంతో భక్తి శ్రద్ధలతో ముందుకు వచ్చారు.

కాని దురదృష్టకరమయిన విషయం ఏమిటంటే, రెండవ ఉపాధ్యాయుడు ప్రాపంచిక విషయాలకు దూరం కాలేకపోవటం వలన అతనికి పొగ త్రాగే అలవాటు ఉండేది. ఆశ్రమం కొత్తగా నిర్మించటం వలన మూలధనం అంటూ ఏమీ లేదు. అందువలన ఆశ్రమ నిర్వహణకి అవసరమయిన డబ్బు ఎలా ఎప్పుడు అందుతుందో తెలిసేది కాదు. భగవంతుని అనుగ్రహం వలన ఏ రోజుకారోజు గడిచిపోయేది. వచ్చిన రెండవ ఉపాధ్యాయుడికి పొగత్రాగే అలవాటు ఉండడం వలన ఋషి బాలురుల్లో ఇద్దరికి సన్నిహితంగా మెలుగుతూ వారికి కూడా పొగత్రాగటం అలవాటు చేశాడు. దగ్గరలోని పల్లెలకి వాళ్ళని పంపించి బీడీలు, సిగరెట్లు తెప్పించుకునేవాడు. అది చూచి నేను చాలా బాధపడ్డాను. అలాంటివి జరుగుతుంటే ఉత్తరదేశంలోని ఆదర్శవంతమయిన గురుకులాన్ని ఎలా నేను నిర్వహించగలను? నీచమయిన రెండవ ఉపాధ్యాయుడి వలన పవిత్రమయిన ఆశ్రమ జీవనం గడపవలసిన పిల్లలు దిగజారిపోవటం నాకు చాలా నిరుత్సాహం కలిగించింది. చుట్టు ప్రక్కల గ్రామల నుండి కూడా కొందరు విద్యార్థులు గురుకులంలో చదువుకోవడానికి వచ్చేవారు. ఋషి కుమారులతో పాటు వారు కూడా కలిసి చదువుకునేవారు. మహంతు ఆత్మ ప్రకాశ్ గారు ఋషి బాలురకి ఇంగ్లీషు విద్య నేర్పుతాననే ఆశతో నాతో ఆంధ్రదేశానికి పంపారు. కానీ అందుకు బదులుగా వీరు దురలవాట్లకు లోనుకావటం అంటే ఎక్కడో ఉత్తరదేశంలోని పవిత్రమయిన హిమాలయ శిఖరాల నుండి వారిని అధఃపాతాళంలోకి పడవేసినట్లే కదా! అందువలన నాకు చాలా విచారం కలిగింది.

ఇలాంటి నిరాశాజనకమయిన సంఘటనలకు తోడు, ఆశ్రమంలో నిధుల కొరత ఏర్పడింది. ఒక దాని తర్వాత ఒకటిగా ఏదో ఒక ఇబ్బంది వస్తుండేది. ప్రతి రోజు ఏదో ఒక కొత్త సమస్య తలెత్తేది. దానికి తోడు ఋషి బాలురు మంచి విద్యావంతులుగా

తయారు కావటానికి బదులుగా ఉపాధ్యాయుడి చెడు ప్రభావానికి లోనయి పాడయిపోవటం జరుగుతోంది. అందువలన ఆ బాలకుల్ని తిరిగి వెనక్కి వారి అసలయిన పవిత్రమయిన హిమాలయ ప్రాంతానికి పంపించి వేయటం మంచిది అని భావించాను. దీనికి తోడుగా, వారిలో ఒక పిల్లవాడికి జబ్బు చేసి బాగా జ్వరం వస్తోంది. నేను కూడా వయస్సులో ఇంకా చిన్నవాడినే కావటం వలన నాకు ఉపాధ్యాయవృత్తిలో ఎలాంటి నైపుణ్యంగాని, అనుభవం గాని లేదు. వీటన్నింటి కారణంగా విచారకరంగా ఒక రోజు గురుకులాన్ని మూసి వేయాలని, ఉపాధ్యాయుడిని తీసివేయాలని, పిల్లలందరిని వెనక్కి పంపించేయాలని నిర్ణయించుకున్నాను.

ఈ రోజుకి కూడా నాకు బాగా గుర్తుంది. ఆ నలుగురు పిల్లలను ఆంధ్రదేశం నుండి ఋషికేశ్‌కి రైలులో తిరిగి పంపటానికి ఆశ్రమములో గాని, భక్తుల వద్ద సరిపడ డబ్బులు లేకపోవటం చాలా విచారాన్ని, నిరాశను కల్గించింది నాకు. నేను ఎంతో పశ్చాత్తాపంతో సిగ్గుపడుతూ మహంతు ఆత్మ ప్రకాశ్ గారికి పిల్లల్ని వెనక్కి పంపటానికి అవసరమయిన డబ్బు పంపవల్సిందిగా తంతి పంపించాను. వారు డబ్బు పంపిన వెంటనే పిల్లల్ని క్షేమంగా స్వర్గాశ్రమానికి వెనక్కి పంపించ గలిగాను. ఇప్పటికి కూడా నేను చాలా బాధపడుతున్నాను ఆ పిల్లలను అలా పంపివేసినందుకు. అందులో ఒక అబ్బాయి తీవ్రమయిన జ్వరంతో బాధపడుతున్నాడు. వారితో పాటుగా నేను కూడా వెళ్లి ఉండవలసింది. కాని వారిని ఒంటరిగానే పంపించాను. ఇదంతా నాకు ఎంతో నిరాశను మిగిల్చింది. హిమాలయాల్లో లాగా ఒక ఆదర్శవంతమయిన గురుకులాన్ని తయారు చేయడానికి ప్రయత్నించిన నేను విఫలుడనయ్యాను. మహంతు ఆత్మప్రకాశ్ గారికి నా పట్ల ఉన్న గౌరవాన్ని, నమ్మకాన్ని నేను కోల్పోయాను. పిల్లలను వెనక్కి పంపటానికి కూడా అతడినే డబ్బు పంపమని అడగవలసి వచ్చింది. పైగా పెద్దవారి తోడు లేకుండా ఒంటరిగా జబ్బుతో ఉన్నవారిని వెనక్కి పంపాను.

మానవుడు ఏదో సంకల్పిస్తాడు. కాని భగవంతుని సంకల్పం వేరే విధంగా ఉంటుంది. పిల్లల కోసం ఏదేదో చేయాలని ఎంతో ఆశతో చాలా దూరం నుండి వారిని తీసుకు వచ్చాను. ఆ పిల్లలు కూడా ఎంతో నిరాశ చెంది ఉంటారు. అంతేకాదు మహంత్ గారు, నేను కూడా చాలా విచారించాము. ఇది జరిగి నలభై సంవత్సరాలు గడిచి పోయాయి. అయినా ఆ దురదృష్టకరమయిన సంఘటన గుర్తుకు వస్తే నా గుండె

బరువుగా, విచారంగా మారిపోతుంది. ఇలాంటప్పుడే ఎల్లిస్ ద్వీపంలో నేను నిరాశకు గురైనప్పుడు అబ్రహం లింకన్ గారి వాక్యాలను గుర్తు తెచ్చుకొన్నట్లుగా నూతనమయిన ఉత్తేజాన్ని పొందుతుంటాను.

**“హృదయపు లోతుల్లోంచి నూతన ఉత్తేజాన్ని పొందాలి.**
**చీకటి కుహరం లోంచి వెలుగులోనికి పయనించాలి.**
**దిక్కుతోచని స్థితిలో కూడా దారి వెతుక్కుంటూ సాగిపోవాలి”.**

తర్వాతి కాలంలో విశాఖపట్టణంలో యాభై మంది విద్యార్థులతో ఇంకొక గురుకులాన్ని ప్రారంభించాము. రెండు సంవత్సరాలు చక్కగా విజయవంతంగా దాన్ని నడిపించాము. అయితే తర్వాత దాన్ని కూడా మూసివేయడానికి గతంలో జరిగిన సంఘటనలు మళ్ళీ ఎదురుకావడం ఒక కారణమయితే, విద్య నేర్పవలసిన ఉపాధ్యాయులే పిల్లలకి పొగ త్రాగటం అలవాటు చేసి వారిని ఆధ్యాత్మిక మార్గంనుండి మళ్ళించటం నాకు చాలా బాధ కలిగించింది.

ఏదయినా ఘనకార్యాలు సాధించాలంటే కొన్ని ఇబ్బందులు, కష్టాలు ఎదుర్కోవలసి ఉంటుంది. అయినప్పటికి అనుకున్న కార్యాలు నెరవేరేదాకా మళ్ళీ మళ్ళీ ప్రయత్నిస్తూ ఉండాలి. ఓటమికి కృంగిపోకూడదు. మొదటిసారి నేను అమెరికా దేశంలో అడుగు పెట్టడంలో విఫలుడనయినప్పుడు నేను నిరాశతో కృంగిపోయినప్పటికి చతికిలపడిపోలేదు. నెమ్మదిగా, ఎలాంటి ఆర్భాటము లేకుండా నాకు తెలియకుండానే పరమాత్మ మళ్ళీ నన్ను అమెరికా దేశానికి వెళ్ళడానికి మానసికంగా తయారుచేశాడు. ఈసారి ఆధ్యాత్మిక జ్ఞానజ్యోతిని పట్టుకొని వెళుతున్నాను. ఆయనకి తెలుసు ఏది మంచిదో, వ్యక్తిగతంగానే కాదు దేశానికి, ప్రపంచానికి, విశ్వానికి ఏది మంచిదో, దేని వలన శాంతి సౌభాగ్యాలు కల్గుతాయో అలాంటివే చేస్తుంటాడాయన. ప్రస్తుతం మళ్ళీ అమెరికా వెళ్ళాలనే నా కోరికను నేను మర్చిపోలేను కనుకనే ఈశ్వరుడు అందుకు సంబంధించిన వారందరితో నాకు పరిచయాలు కలిగేలా చేశాడనుకుంటాను. ఎంతో పలుకుబడి కల్గిన సంస్థలు, ప్రేమమయులైన భక్తులు నా అమెరికా ప్రయాణానికి సహకరించేందుకు ముందుకు రావటం వలన త్వరలోనే భగవంతుని కార్యాలను నెరవేర్చడానికి నేను అమెరికా దేశం వెళ్ళడానికి నిశ్చయించుకున్నాను.

అదేవిధంగా గురుకులం నిర్వహించటంలో నా మొదటి ప్రయత్నం ఘోరంగా విఫలమయినప్పటికి నేను నిరాశ చెందలేదు. మంచి సంకల్పాలు, ఆధ్యాత్మికంగా భగవంతుని బిడ్డలకి సేవలందించాలనే ప్రయత్నాలు కొద్దిగా ఆలస్యంగానయినా తప్పకుండా నెరవేరుతాయి. అందువలన ఎవరో ఒకరు ఒక ఆదర్శవంతమయిన గురుకులాన్ని తీర్చిదిద్దగల ఉత్తమ ఉపాధ్యాయులు దొరుకుతారని ఆశిస్తున్నాను. అదే భగవంతుని ఆశీర్వచనాలు అవుతాయి శాంతి ఆశ్రమానికి. అలాగే ఆంధ్రదేశానికి యావత్తు ప్రపంచానికి కూడా శాంతిని ప్రసాదిస్తాయి.

### అధ్యాయం - 17

# రెండవ పర్యాయము అమెరికా ప్రయాణము, 1923

అమెరికాలో 'రోసిక్రూషియన్స్' అనేది చాలా పేరు ప్రఖ్యాతులున్న సంస్థ. దానికి అమెరికా దేశమంతటా, అన్ని ప్రముఖ నగరాలలో శాఖలున్నాయి. అలాగే విద్యాసంస్థలు, ధ్యాన మందిరాలు, ప్రచురణ సంస్థలు కూడా నిర్వహిస్తుంటారు. భగవంతుని ప్రతిరూపము అయిన మానవుడిలో అంతర్గతంగా దాగి ఉన్న దివ్యశక్తులను వెలికితీయటం ఆ సంస్థ ముఖ్య లక్ష్యంగా చేసుకొని పనిచేస్తుంది.

ఆ సంస్థ వారు నాతోనూ, శాంతి ఆశ్రమంతో ఏ విధంగా పరిచయమయ్యారో నాకిప్పుడు గుర్తు లేదు. ఆ సంస్థ వ్యవస్థాపకులు, ప్రసిడెంటు అయిన 'ఇంపరేటర్' నాకు ఎంతో ప్రేమతో ఉత్తరాలు వ్రాస్తుండేవారు. ఆయన నన్ను అమెరికా వచ్చి వారి సంస్థలన్నింటిని దర్శించి ఆధ్యాత్మిక ప్రచారము చేయమని ఆహ్వానించారు. భగవంతుడు విచిత్రంగా ఆయన బిడ్డలకి సేవ చేసే వాళ్ళను కలుపుతూ ఉంటాడు. ఆయన లీలలు మానవమాత్రుల ఊహలకి కూడా అందవు. ఇంపరేటరు చాలా మంచివాడు. నా ప్రయాణపు ఖర్చులన్నీ వారే భరిస్తారని చెప్పాడు. అలాగే అమెరికాలో నా పర్యటన వివరాలన్నింటిని పంపించి, అక్కడ నేను చేయవలసిన ప్రచారము గురించి, అక్కడ ఉన్న వివిధ సంస్థలను దర్శించాలని చెప్పాడు. అంత చిన్న వయస్సులో వారు నన్ను "హోలి ఫాదర్" అంటే పవిత్రమయిన తండ్రిగా గుర్తించారని, వారి సంస్థ తరఫున ప్రచారం చేపట్టాలని కోరారు.



ఆత్మారామ్ మరియు శ్రీ ఓంకార్ స్వామీజీ

గౌరవనీయులైన ఆ సంస్థ వ్యవస్థాపకుడు నన్ను వారి ఇతర శాఖల అధిపతులందరికీ పరిచయం చేస్తూ ఉత్తరాలు రాయడం వలన వారందరూ నాకు ఎంతో ప్రేమతో వారి శాఖలను దర్శించాలని ఆహ్వానాలు పంపించారు. ఫిలడెల్ఫియా, టేంపా, చికాగో, లాస్ ఏంజిలిస్ మొదలయిన కాలిఫోర్నియాలోని పట్టణాల నుండి అలాగే అమెరికాలోని ఇంకా ఇతర శాఖల నుండి కూడా ఆహ్వానాలు అందాయి. ఎల్లలు లేని పరమాత్మ కృపకు, కరుణా కటాక్షాలకు, ఆశీర్వచనాలకు ఆయన కల్పించిన గౌరవానికి నా కళ్ళ వెంట ఆనంద బాష్పాలు ధారాపాతంగా కారసాగాయి. అంత చిన్ని వయస్సులో అంతటి గౌరవాన్ని అందించిన పరమాత్మకు అన్నీ తెలుసు. కాని దీనిని నేను ఎన్నడూ ఊహించను కూడా లేదు. క్రొత్తగా పరిచయమయిన స్నేహితులు ఎంతో ప్రేమతో ఆశ్రమానికి విరాళాలు పంపసాగారు. ఇదంతా చూస్తుంటే చాలా అందమయిన అద్భుతమయిన కలలా ఉంది. భగవంతుని దయకు, కరుణకు ఎల్లలు లేవనిపిస్తోంది.

ఫిలడెల్ఫియాలో మాతృమూర్తి మరియా ఆమె భర్త రాల్ఫ్ ఎంట్రికన్ దంపతులు నా పూర్వజన్మ సుకృతం వల్ల లేదా గత జన్మల్లో వారితో నాకున్న అనుబంధం వల్ల గాని నా పట్ల ప్రత్యేకమయిన ప్రేమను, ఇష్టాన్ని పెంచుకొని నన్ను వారి సొంత బిడ్డలాగా భావించారు. వారు ఎంతో ప్రేమ ఉట్టిపడుతూ నాకు ఉత్తరాలు రాస్తుండేవారు. నన్ను అమెరికా వచ్చినప్పుడు వారింట్లో ఉండమని ప్రత్యేకంగా ఆహ్వానించారు. వాళ్ళు కూడా 'రోసిక్రూషియన్స్' సంస్థలో ముఖ్యమయిన భక్తులు. నా పట్ల వారు పెంచుకున్న ప్రత్యేకమయిన ప్రేమతో నా మంచి కోరి ఏ మత సంస్థ తరఫునా అమెరికా రావద్దని, అందువలన నేను వారి ప్రతినిధిగా ఉండవలసి వస్తుందని, స్వేచ్ఛా స్వాతంత్ర్యం కోల్పోవలసి వస్తుందని తెలియచేశారు. అంతేకాక అమెరికా రావటానికి అవసరమయిన ఏర్పాట్లు అన్నీ వారే చేస్తామని కూడా ఉత్తరంలో వ్రాశారు.

శ్రీ కక్కిరాల గారి అబ్బాయి ఆత్మారామ్ పన్నెండు సంవత్సరాల బాలుడు నాతో ఎంతో సన్నిహితంగా ఉండేవాడు. అంత చిన్న వయస్సులోనే అతడు నా పట్ల ఎంతో భక్తి శ్రద్ధలతో సేవలు చేసేవాడు. నాతో కలిసి గంటల తరబడి కూర్చుని ప్రార్థనలు, ధ్యానము చేస్తుండేవాడు. అలాంటి ఆత్మారామ్‌ని కూడా నాతో పాటు అమెరికా దేశానికి తీసుకువెళితే చాలా బాగుంటుంది అనిపించింది నాకు. అమెరికా వంటి దేశాన్ని చూడడానికి అతనికి కూడా అవకాశం కల్పించాలని భావించాను. అయితే అది ఏమంత

తేలికయిన విషయం కాదు. అంత చిన్న పిల్లవాడిని తల్లిదండ్రులు వెంట లేకుండా అమెరికా తీసుకు వెళ్ళడానికి ఇమిగ్రేషన్ చట్టాలు ఒప్పుకోవు. ఆత్మారామ్‌తో నేను మరియా మాతకు, ఆమె భర్త గారికి ఉత్తరాలు వ్రాయించాను. ఆ దంపతులకు పిల్లలు లేని కారణం చేత ఆత్మారామ్ పట్ల వారు ఎంతో ప్రేమను పెంచుకొన్నారు. వెంటనే ఆత్మారామ్‌ని కూడా నాతో పాటు అమెరికా తీసుకు రమ్మని, అందుకు అవసరమయిన కాగితాలు, అఫిడవిట్లు అన్నీ పంపుతానని ఉత్తరం ద్వారా తెలియచేశారు. ఆ విధంగా ఎంతో నాగరిక దేశమయిన అమెరికా దేశానికి మా ప్రయాణం ఖరారు అయింది.

మేము పరమాత్మ అనుగ్రహం వలన అన్నివిధాలయిన సహాయ సహకారాలు అమిరినందుకు చాలా ఆనందించాము. ప్రత్యేకించి అంత ముందు మాకు పరిచయం కూడా లేనివారు, మా ముఖాలు కూడా ఎన్నడూ చూడని అపరిచితులు మా పట్ల ఎంతో ప్రేమతో అన్నీ సమకూర్చటం దైవానుగ్రహమే కదా! ఈ విధమయిన అనుకోని ఆనందాల వలన నా మనస్సు భూమిని వదిలి పెట్టి ఆకాశంలో విహరించసాగింది. అంతా ఏదో అద్భుతంలాగా భగవంతుడు సృష్టించిన మాయాజాలంలాగా ఉంది. ఇప్పుడు మళ్ళీ నేను భగవంతుని దయ వలన రెండవ పర్యాయం అమెరికా దేశంలో అడుగు పెట్టబోతున్నాను. ఎంతో గౌరవప్రదంగా వెళుతున్నాను ఒక విద్యార్థిలా కాకుండా ఒక ఆధ్యాత్మిక గురువులాగా బోధించడానికి, ప్రవచనము చేయడానికి వెళుతున్నాను. ఒకప్పుడు ఎల్లిన్ ద్వీపంలో చిక్కుకు పోయినప్పుడు వార్తాపత్రికల్లో వచ్చిన వార్త గుర్తుకొస్తోంది.

“ఈ దేశంలోకి నిన్ను అడుగు పెట్టనిస్తే నీవు ఏమి చేయాలనుకుంటున్నావు అని అడిగినప్పుడు మృదుమధురమైన స్వరంతో జ్ఞానజ్యోతిని తీసుకువచ్చాను ప్రపంచ శాంతి కోసం అంటూ బదులిచ్చాడు”.

నేనిప్పుడు కూడా అదే చెబుతున్నాను. అంతా ఈశ్వరేచ్ఛ ప్రకారం జరుగుతుంది. నాదంటూ ఏమీ లేదు. ప్రతీది ఆయన అనుగ్రహమే. ఈశ్వరేచ్ఛ వల్లనే సుదూర ప్రాంతాలకి, అపరిచితులయిన వారి వద్దకు వారి ప్రేమను పంచుకోవడానికి వెళ్ళ గల్గుతున్నాను.

ఆత్మారామ్ తల్లిదండ్రులు మంచి భక్తులు. నాతో పాటు వాళ్ళ అబ్బాయిని అమెరికా తీసుకువెళుతున్నందుకు వారు చాలా సంతోషించారు. అది చాలా అరుదయిన అవకాశం. భారతదేశం నుండి అంత చిన్న వయస్సులో అమెరికా వంటి దూరదేశాలకి వెళ్ళడం అందరికీ సాధ్యం కాదు. ఫిలిడెల్ఫియా నుండి ఎంట్రికన్ దంపతులు మా ప్రయాణానికి అయ్యే ఖర్చులకి అవసరమయిన డబ్బు పంపించినప్పటికి ఆత్మారామ్ తల్లిదండ్రులు ఎలాంటి లోటు చేయకుండా వాళ్ళకి చేతనయినంతగా అన్ని విధాలయిన సహాయం చేశారు. డబ్బు కూడా ఇచ్చారు. ఆత్మారామ్ సముద్ర ప్రయాణం గురించి, అమెరికా వంటి సంపన్న దేశాన్ని సందర్శించి అక్కడి వారందరితో పరిచయం చేసుకోవటం గురించి ఆలోచించి ఎంతో ఉత్సాహంగా ఉన్నాడు. తల్లిదండ్రులను వదలిపెట్టి నాతో దేశాలు తిరిగి రావడానికి ఎలాంటి సంకోచం లేకుండా సంతోషంగా ఉన్నాడు. అమెరికాలో ధరించడానికి వీలుగా సూట్లు కుట్టించుకోవడంలో హడావుడిగా ఉన్నాడు. యూరోపియన్లు ధరించే టోపీ కూడా కొన్నాడు.

దైవము రోసిక్రూషియన్ సంస్థను, దాని వ్యవస్థాపకుడయిన ఇంపరేటర్‌ని అనుగ్రహించుగాక! అతని ద్వారా, అతని సంస్థ ద్వారా భగవంతుడు నాకు రెండవసారి అమెరికా దేశానికి వెళ్ళడానికి దారి చూపించాడు. అమెరికా ప్రయాణానికి అవసరమయిన అఫిడవిట్లు, కాగితాలు అమెరికా స్నేహితుల ద్వారా అందటం వలన మా పాస్‌పోర్టు, వీసా మొదలైనవన్నీ మద్రాసులోని అమెరికన్ కౌన్సిల్ జనరల్ మద్రాసు వద్ద నుండి అందాయి. అందువలన మేము సంతోషంగా, సంతృప్తిగా అమెరికా ప్రయాణానికి అవసరమయిన ఏర్పాట్లన్నీ చేసుకున్నాము. అమెరికాలోనూ, ఓడ ప్రయాణంలోనూ భోజనానికి ఇబ్బంది పడకుండా ఆత్మారామ్ తల్లిదండ్రులు అప్పడాలు, కేకులు, పచ్చళ్లు, పొడులు, చట్నీలు, పప్పులు అన్నీ కట్టి ఇచ్చారు. ఆత్మారామ్ వయస్సులో బాగా చిన్నవాడు అయినా నా కోసం అన్నీ సేవలు చేస్తూ ఉండేవాడు. ఓడలో ప్రయాణం చాలా రోజులు పడుతుంది. పైగా ఓడ ప్రయాణంలో ఇబ్బంది పడకుండా, అజీర్తి చేయకుండా ఉండేందుకు ఆయుర్వేద మందులు, అల్లం పొడులు ఇచ్చాడు ఆశ్రమ భక్తుడయిన ఆయుర్వేద వైద్యుడు.

కలకత్తా డైమండ్ రేవు నుండి ఒక మంచి రోజు మా ప్రయాణం సంతోషంగా మొదలయింది. ముందు మా ఓడ ఒక నదిలో ఒక రోజంతా ప్రయాణించి చివరికి

అనంతమయిన సముద్రంలోనికి ప్రవేశించింది. ఆ ప్రాంతాన్ని 'బే ఆఫ్ బెంగాల్' అంటారు. భగవంతుని దయ వలన మా ప్రయాణం ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యం లేకుండా సజావుగా సాగిపోయింది. మేము ఎక్కినది స్టీమరు కార్గోఓడ కావటం వలన కొద్ది మంది ప్రయాణీకులే ఉన్నారు. అది సరుకులు మోసుకువెళ్ళే ఓడ. జనం ఎక్కువగా లేకపోవడం వలన మా ప్రయాణం ప్రశాంతంగా హాయిగా జరిగింది.

మా ఓడ ప్రతి రేవు దగ్గర ఆగుతూ ఉండేది. సామాన్లు ఎక్కించుకోవడానికి అలాగే దించడానికి. అందువలన ఒక్కోసారి నాలుగైదు రోజులు ఓడరేవులో ఉండాల్సి వచ్చేది. అలాంటి సమయాల్లో మేము చాలా ఆనందంగా ఆ ప్రాంతం అంతా తిరిగి అక్కడి సంప్రదాయాలను గమనించే వాళ్ళము. ఆత్మారామ్ చిన్నగా, నల్లగా ఉండేవాడు. యూరోపియన్ టోపి పెట్టుకొని, చిన్న కోటు, బూట్లు ధరించి రేవులో తిరుగుతుండే ఆత్మారామ్‌ని అక్కడి వారు విచిత్రంగా చూచేవారు. అమెరికా వాసులు పెద్దగా ఉంటారు. వారి ముందు ఆత్మారామ్ చిన్ని లిల్లిపుట్‌లా కనిపిస్తాడు.

ఆత్మారామ్ చాలా చిన్న పిల్లవాడు కావటం వలన, ఫుట్‌బాల్, బాట్మింటన్, టెన్నిస్ లాంటి ఆటలాడుకునే బదులుగా అతడిని నాతో పాటుగా భజనలు, సంకీర్తనలు ధ్యానం చేయించటం చూచి ఓడలోని స్టీవర్టులు నన్ను తప్పు పట్టసాగారు. నిజంగానే అతడు తప్పకుండా అలాంటి ఆటలు ఆడుకొనే వయస్సులోనే ఉన్నాడు. కాని ఆ వయస్సులోనే ఆధ్యాత్మిక మార్గానికి మంచి బలమయిన పునాది కూడా చాలా అవసరము. స్టీవర్టులు నన్ను తప్పు పట్టినప్పుడు నేను వారికి తూర్పు పడమర దేశాల మధ్య ఉన్న భేదాన్ని చక్కగా వివరించాను. తూర్పుదేశాల్లో ప్రజల జీవిత లక్ష్యం ఆధ్యాత్మికంగా ఉన్నతిని సాధించటం అయి ఉంటుంది. అందుకే చిన్న పిల్లలకి కూడా భగవంతుని పట్ల భక్తిని అలవాటు చేస్తారు. భౌతిక ప్రపంచము నుండి విడివడి, అంతర్ముఖ స్థితిని పొందటమే మా సంస్కృతి. కాని పశ్చిమ దేశాలు భోగభూములు. భౌతిక సుఖ సౌఖ్యాల కోసం వెంపర్లాడుతుంటారు. మతం వారికి జీవిత అవసరాలన్నింటిలో ఒక భాగం మాత్రమే తప్ప జీవితానికి పునాది మాత్రం కాదు.

భగవంతుడు మా సుదీర్ఘమయిన నలభై నాలుగు రోజుల ఓడ ప్రయాణంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా సురక్షితంగా కాపాడాడు. ఏ విధమయిన ఆరోగ్య సమస్యలు ఎదురవలేదు. చివరికి మేము ఎల్లిస్ ద్వీపం చేరుకున్నాము. దాన్ని చూడగానే నా

గతకాలపు చేదు అనుభవాలు గుర్తుకు వచ్చాయి. కాని ఈ సారి అక్కడ మా కోసం స్వాగతం పలకటానికి రాల్ఫ్ ఎంట్రికన్ ఎదురుచూస్తున్నాడు. ఇమిగ్రేషన్ అధికారులకు అతను ముందుగానే భారతదేశంనుండి ఇద్దరు ప్రముఖులు వస్తున్నట్లుగా చెప్పాడు. అమెరికా వారు వస్తున్న మహాత్ములు ఎవరా అని కుతూహలంగా ఉన్నారు. అవసరమయిన కాగితాలన్నింటిని పరిశీలించిన అధికారులు మమ్మల్ని న్యూయార్క్ పట్టణానికి అనుమతించారు. అక్కడి నుండి సుమారుగా వంద మైళ్లు దూరం ప్రయాణించి ఫిలిడెల్ఫియా నగరానికి చేరుకున్నాము. మాకు సోదర ప్రేమని అందించింది ఆ నగరం.

అధ్యాయం - 18

# మరియామాత పవిత్ర మందిరం

నా జీవితంలోకంతటికి గొప్ప ఆశీర్వచనము మరియామాతను కలుసుకోవటమే. మేము వారి అందమయిన ఇంటికి చేరుకున్నాము. కాని ఆమె మమ్మల్ని స్వాగతించడానికి హాల్లో కనిపించలేదు. పైన పూజ గదిలో ఆమె మా కోసం ఎదురుచూస్తున్నారు. అది ఎంతో పవిత్రమయిన మందిరములా ఉంది. అగరుబత్తి కడ్డీలు వెలుగుతూ చక్కని పరిమళాలను అంతటా వెదజల్లుతున్నాయి. ఆ గదిలో నీలిరంగు కాంతి పరచుకొని వుంది. మరియా నన్ను ప్రేమతో ఆలింగనం చేసుకొని తన ఒడిలోకి తీసుకుంది. ఆమె కళ్ళ నుండి ఆనందబాష్పాలు ధారాపాతంగా కారసాగాయి. నేను కూడా ఆమె దివ్యమయిన ప్రేమ అనురాగాల వెల్లువలో పూర్తిగా మునిగిపోయాను. మా ఇద్దరి కలయికని, పవిత్రమయిన అనుబంధాన్ని మానవుల భాషలో వర్ణించటం శక్యం కాదు. ఆ క్షణంలో నేను మళ్ళీ పునర్జన్మను పొందినట్లుగా, భూ పరిమితులను దాటి స్వర్గలోకంలోకి అడుగుపెట్టినట్లుగా అనిపించింది. అందుచేత మేమిద్దరము అవ్యాజ్యమైన దివ్యత్వాన్ని, అమరత్వాన్ని అనుభవిస్తూ కాలాన్ని, బుద్ధిని, మనస్సు, భౌతికమయిన శరీర స్థితిని దాటి దివ్యలోకాల్లో విహరిస్తూ గంటల తరబడి తన్మయత్వంతో ఉండిపోయాము. అక్కడ కేవలం ఉన్నది ఒక్కటే. అది భగవతత్త్వము. నాలో, ఆమెలో, మా చుట్టూ అంతటా పరమాత్మ ఉనికిని మాత్రమే అనుభవిస్తూ ఆనంద పారవశ్యంలో కాలం మరిచిపోయి ఒకలాంటి సమాధిస్థితిలోనికి వెళ్ళిపోయాము. కొంతసేపటికి ఆత్మారామ్, రాల్ఫ్ కూడా

మాతో వచ్చి కూర్చున్నారు. అప్పుడు మరియా మాత భగవంతుని విభూతిని గొప్పగా కొనియాడుతూ చిన్న ప్రార్థన చేసింది. ఎక్కడో దూరదేశమయిన భారతదేశం నుండి సురక్షితంగా మమ్మల్ని అమెరికాలోని మరియామాత పవిత్ర మందిరానికి చేర్చినందుకు పరమాత్మకు ధన్యవాదాలు తెలియచేసింది.

మరియామాత పవిత్ర మందిరం ఎంతో ప్రశాంతంగా ఉంటుంది. అక్కడ ఆమె గంటల తరబడి ధ్యానంలో నిమగ్నమయిపోయి బాహ్య ప్రపంచాన్ని మర్చిపోయి కనీసం ఆహారం కూడా తీసుకోకుండా గడుపుతుండేది. ఆమె ఆధ్యాత్మిక జీవనం ప్రారంభం నుండి కూడా అనేక దివ్యమయిన అనుభవాలతో, అనుభూతులతో నిండిపోయింది. అవి అత్యంత రహస్యమయినవి మాత్రమే కాదు కొన్ని విచిత్రంగా ఉండేవి. భగవంతుడు ఆమెను ఆధ్యాత్మికంగా వెంట ఉండి నడిపిస్తూ ఒక్కో మెట్టు జాగ్రత్తగా ఎక్కిస్తున్నాడు. ఆమెకు ధ్యానంలో ఉన్నప్పుడు విచిత్రమయిన అనుభవాలు వస్తుండేవి. కొన్ని రూపాలు, కొన్ని విచిత్రమయిన గుర్తులు కనిపించేవి. ధ్యానంలో నుండి లేచిన తర్వాత ఆమె వాటిని చిత్రించి చూపించి, దాని అర్థాన్ని కూడా వివరించేది. అలాంటి విచిత్రాలు ఎన్నో ఆమెకు ధ్యానంలో అనుభవంలోకి వచ్చేవి. అలాంటి అనుభవాల్లో ఒకటి అద్భుతమయినది. ధ్యానంలో ఆమె మనస్సులో ఒక అనుభూతి కలిగింది. ఎక్కడో సుదూర ప్రాంతంలోఆమె బిడ్డ భారతదేశంలో ఉన్నాడని, త్వరలో ఆమెను కలుసుకోవడానికి వస్తాడని ఆమెకు అంతర్వాణి ప్రబోధించింది. అందుకే ఆ దైవ ప్రేరణతోనే ఆమె మా కోసం అమెరికా ప్రయాణం కోసం కావాల్సిన సదుపాయాలన్నీ ఏర్పాటు చేసింది. ఆమె మాతృప్రేమకు ఎల్లలు లేవు. మా కోసం ఉన్ని దుస్తులు కూడా పంపించింది. సముద్ర ప్రయాణంలో చలికి తట్టుకోవడానికి అవి మాకు ఎంతో ఉపయోగపడ్డాయి. నా గురించి విన్న మరుక్షణం నుండి నేను అమెరికా చేరేంతవరకు మరియామాత నా కోసం ఎదురు తెన్నులు కాచింది. ఆమె మాతృ హృదయంలో నేను ఆమె బిడ్డగా స్థానం సంపాదించు కున్నాను. ఇక ముందు నేను చేయబోతున్న నిజమైన ఘనకార్యాలు, శాంతి బీజాలను, ప్రేమ తత్త్వాన్ని అందరికి అందించటం. దగ్గరి వారికి, దూరంలో ఉన్నవారికి, ప్రేమ మూర్తులయిన వారి హృదయాలలో శాంతి బీజాలు నాటాలి. తూర్పు పడమర దేశాలలోని ప్రజలందరికి ప్రేమను, శాంతిని పంచిపెట్టాలి. అందుకు మరియా మాత సహకారం నాకు తోడయింది.

నేను నిజంగానే క్రొత్త జన్మ తీసుకున్నట్లుగా అనుభూతి చెందుతున్నాను. పరమ పవిత్రమయిన దివ్య జనని ఆశీర్వచనాలు, ఆమె ప్రేమానురాగాలు రుచి చూశాను. కొన్ని దివ్యానుభవాలను అనుభవించాలి తప్ప వాటిని మాటల్లో వర్ణించటము, పేపరు మీద వాక్యాల్లో పొందుపరచటం వీలు కాదు. వాటిని అలా పవిత్రంగా హృదయంలో పదిలంగా భద్రపరచుకోవాలి అంతే. ఎందుచేతనంటే సామాన్య మానవులు కేవలం ప్రాపంచిక పరిధుల్లోనే ఆలోచిస్తారు తప్ప ఆధ్యాత్మిక స్థాయి వారికి ఉండదు. అలాంటి వారికి ఆధ్యాత్మిక దివ్యానుభూతులు, అందులోని రహస్యాలు అర్థం కావు. మరియా మనస్ఫూర్తిగా నన్ను తన కన్న కుమారుడిగానే భావిస్తోంది. భగవంతుడు ఆమెకు అనేక విధాలుగా అలాంటి అనుభవాలను ఇచ్చాడట. అవన్నీ ఇప్పుడు నిజమయినట్లుగా ఋజువవుతున్నది. ఆమెకు నాకు ఉన్న అనుబంధం ఆధ్యాత్మికమయినది.

ఇలాంటి ఆధ్యాత్మిక అనుబంధాలు ఏర్పడటం వలన మనం అనుకోవాల్సిన అవసరం ఏముంది? ఎక్కడ అమెరికాలోని ఫిలడెల్ఫియా, ఎక్కడ అడవుల్లో తోటపల్లి కొండల్లోని శాంతి ఆశ్రమము! ఎక్కడ మరియా మాతృదేవి, నేనెక్కడివాడిని? నేను కేవలం సాధారణమయిన సాధువును. ఆదర్శవంతమైన జీవనాన్ని గడపాలి అని తహతహ లాడేవాడిని. ప్రపంచంలోని దేవుని బిడ్డలందరికీ సేవలందించాలని ఉబలాట పడుతుంటాను. ఇది నిజంగా చాలా విడ్డూరంగా ఉంది. నా పసితనము రోజులనుండీ నా కోసం ఒకరు ఎదురుచూస్తుండటము, నాకు తెలియకుండానే నేను ఆమె సన్నిధికి చేరుకోవటము. నిజంగా నాకు ఇదంతా ఒక మాయాజాలంగా అనిపిస్తోంది. నేను మొదటిసారి అమెరికాలో ప్రవేశించడానికి ప్రయత్నించి విఫలుడయినప్పటికీ, ఇప్పుడు నేను విజయవంతంగా మరియా మాతృదేవి ఒడిలోనికి చేరుకున్నాను. కనిపించని దైవశక్తి పనిచేస్తోంది.

ఈ ఉపాధికి జన్మనిచ్చిన మాతృదేవి ఎక్కడో భారతదేశంలో ఏనాడో దేహం చాలించింది. నేనప్పుడు చాలా చిన్నవాడిని కావటం వలన నాకు ఆమె ముఖం కూడా గుర్తు లేదు. నాకు మాతృప్రేమ అంటే ఎలా ఉంటుందో తెలియదు. కాని ఇప్పుడు, ఇక్కడ నా హృదయాన్ని కదిలించి వేస్తున్న అపురూపమయిన మాతృప్రేమను, పవిత్రమయిన దివ్యత్వాన్ని మరియా మాతృదేవి ద్వారా పొందుతూ, ఆమె ఆశీర్వచనాలు అందుకోవటం ద్వారా నిజమయిన మాతృప్రేమకు అర్థం తెలుసుకున్నాను. ఆమెను

నేను కలుసుకున్న క్షణమే నాకు పునర్జన్మ లభించింది. నేను గంటల తరబడి కాలాన్ని మరియా మాతృదేవి గారి పవిత్రమయిన మందిరంలోనే గడపసాగాను. అప్పుడప్పుడు మరియా తల్లిగారు కూడా నాతో పాటు అక్కడ కూర్చొని గాఢమయిన ధ్యానంలో లీనమయ్యేవారు.

సముద్రంలో లెక్కలేనన్ని అలలు పుడుతున్నట్లుగా మానవుడు కూడా ఎన్నో జన్మలు ఎత్తుతుంటాడు. అలాంటి లెక్కలేనన్ని జన్మలలో నేను మరియా మాత గర్భంలో ఎన్నోసార్లు జన్మించి ఉంటాను. అందువల్ల మా అనుబంధం కేవలం ఈ జన్మది కాక అనేక జన్మల సంబంధం అయి వుంటుంది. అందువల్లనే మా ఇద్దరి మధ్య గొప్ప అనుబంధం ఏర్పడింది.

ఆత్మారామ్ చాలా తొందరగా రాల్ఫ్ ఎంట్రికిన్‌తో స్నేహం చేశాడు. వాళ్ళిద్దరూ బాగా దగ్గరయ్యారు. కలిసి బయటికి వెళ్ళి వస్తూ ఉండేవారు. లేదా ఇంట్లో కూర్చొని భారతదేశం గురించి, అమెరికా గురించి గాని మాట్లాడుకునేవారు. వాళ్ళు నన్ను, మరియా అమ్మను మా మానాన మమ్మల్ని ప్రార్థనలు, ధ్యానం చేసుకోనిచ్చేవారు. మేమిద్దరము ఆధ్యాత్మికానందానుభూతిలో ఓలలాడుతుండేవారము. నేను ఎప్పుడూ మౌనంగా, ధ్యానంలో ప్రశాంతంగా ఉండటానికి ఇష్టపడతాను. గతంలో నేను చేసుకున్న మంచి కర్మల వలన నేను ఎప్పుడూ కలలో కూడా ఊహించని విధంగా మార్పులు జరుగుతున్నాయి. అవి నాకు గొప్ప అవకాశాలను కల్పిస్తున్నాయి. నా సమయమంతా నేను ఆధ్యాత్మికంగా ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి అలాగే ఆధ్యాత్మికానందంలో మునిగి తేలటానికి, మాతృమూర్తి మరియా ప్రేమలో ఓలలాడటానికి భగవంతుడు నన్ను అనుగ్రహించాడు. నేను ఎప్పుడూ మౌనంగా, ఒంటరిగా పవిత్రమయిన ఆధ్యాత్మిక జీవనం గడపడానికి ఇష్టపడతాను కనుక ఎక్కువగా బయటికి వెళ్ళేవాడిని కాదు. ఫిలిడెల్ఫియా వీధుల్లో తిరగటం కంటే మరియా మాత పవిత్ర మందిరంలో ధ్యానంలో కాలము గడిపేందుకు ఇష్టపడేవాడిని.

ఓం తత్సత్ ఓం

**అధ్యాయం - 19**

# శ్రీ మరియా ఆశ్రమము

1923వ సంవత్సరములో మరియా ఆశ్రమము ప్రారంభించబడింది. ఆశ్రమానికి ఆ పేరు నిర్ణయించినది మరియా అమ్మను దృష్టిలో ఉంచుకొని కాదు. అది **పరాశక్తి** పేరుతో ప్రారంభించబడింది. ఆమె ప్రపంచానికంతటికీ మాతృదేవత, విశ్వానికి శక్తి ప్రదాత్రి. ఆశ్రమము ప్రపంచములోని అందరికి మంచి చేయడానికి, సేవలందించడానికి భగవంతుని బిడ్డలందరికి శాంతిని, సౌఖ్యాన్ని ప్రసాదించడానికి, తూర్పు పడమరల భేదం లేకుండా అందరికి ప్రేమ నందించడానికి పనిచేస్తుంది. జాతి, మతము, కులము, దేశము, ప్రాంతము మొదలైనవన్నీ మానవుడు కల్పించుకున్న భేదభావాలు విశ్వంలో అందరూ ఒకే కుటుంబానికి చెందుతారు. ఒకే మతం, ఒకే దైవం అన్నది సత్యం. రాల్ఫ్ ఇంజనీరు, మంచి శిల్పి, ఆర్కిటెక్ కూడా కావటం చేత అన్ని మతాలకి చెందిన చిహ్నాలను కలిపి విశ్వమత చిహ్నంగా ఒకదానిని చక్కగా చిత్రించాడు. క్రిష్టియానిటి, హిందూయిజం, బుద్ధిజం, ఇస్లామ్, జోరాష్ట్రియఇజమ్, జైనిజం మొదలయిన మత చిహ్నాలన్నింటిని కలిపి దానిని తయారుచేశాడు. ఒక్క పాత మతానికి చెందిన చిహ్నాన్ని కూడా వదలలేదు. తూర్పు, పడమర దేశాలకి చెందిన మతాలన్నింటిని ఒకటిగా చేసి ఆ పవిత్రమయిన చిహ్నాన్ని చేశాడు. కొత్త మతాలను కూడా మేము అధ్యయనము చేశాము. రోసిక్రూషియన్, థియోసోఫిస్ట్‌ల కొత్త ఆలోచనలను, క్రిస్టియన్ సైన్స్‌ను, బాహయి ఇంకా ఇతర మతాలన్నింటి సారాంశాన్ని కలిపి విశ్వ ప్రార్థనని తయారు చేశాము. ఇది చాలా అద్భుతంగా ఉంది. ప్రపంచంలోని వారందరూ కల్సి మెల్సి తోబుట్టువుల్లాగా ఒకరికొకరు ప్రేమతో సేవించటం అన్నది మా ఉన్నతోన్నత లక్ష్యం.

ఒక పవిత్రమయిన రోజు, ఆశ్రమ స్థాపనకి నాంది పలికాము. అమ్మ మరియాకు సరస్వతీ దేవి అని పేరు పెట్టాను. అలాగే రాల్ఫ్‌కి సూర్యానంద అని ఆధ్యాత్మిక నామకరణం జరిగింది. ఈ సందర్భంగా మరియా పవిత్ర మందిరంలో చిన్న కార్యక్రమాన్ని కూడా నిర్వహించాము. చిన్ని ఆత్మారామ్ కూడా అందులో పాల్గొన్నాడు. భగవంతుడు ఈ ఉపాధిని పనిముట్టుగా వాడుకొని మరియా మాతని, రాల్ఫ్‌ని ఆశీర్వదించాడు.



సరస్వతీ దేవి ఆశ్రమానికి అధ్యక్షురాలిగా, సూర్యానంద సెక్రటరీగా బాధ్యతలు నిర్వహించడానికి అంగీకరించారు.

ఇంకా అనేకమంది సభ్యులుగా, ఆశ్రమానికి సేవలందించేందుకు ముందుకు వచ్చారు. ఆశ్రమము ఆశయాలను ప్రచారము చేయడానికి శాంతిని ప్రతి హృదయానికి అందించడానికి, దగ్గరలో ఉండేవారినే కాకుండా సుదూర ప్రాంతాల వారి హృదయ శాంతికి కూడా ప్రయత్నిస్తామని, మనమందరము ఒక్కటే అనే నినాదాన్ని ప్రతి ఒక్కరిలో ఆ పవిత్ర భావాన్ని ప్రచారం చేస్తామని కార్యకర్తలందరూ ప్రతిజ్ఞ చేశారు. ఆశ్రమ ప్రధానోద్దేశ్యం ఏమిటంటే 'ముందు నీ హృదయాన్ని శాంతితో నింపుకో. అక్కడి నుండి ప్రపంచ శాంతికై ప్రయత్నించు'. అందుచేత శాంతిని నీ హృదయంలో నెలకొల్పు. తర్వాత నీ ఇంటిని శాంతిమయం చేసుకో. దానిని నీ ప్రాంతీయులందరికీ ప్రసారం చేయి. ఆ విధంగా శాంతి ప్రకంపనలు హృదయం నుండి హృదయానికి ప్రసారమవుతూ యావత్తు ప్రపంచానికి శాంతిని ప్రసాదిస్తాయి. అదే పవిత్రమయిన ఆశ్రమ ప్రధానాశయం.

గంటల తరబడి నేను ధ్యానంలో లీనమయిపోయి పైన గదిలో ఉన్న పూజామందిరానికి అంకితమయిపోవడం గమనించి మరియా, రాల్ఫ్ దంపతులు నా ఆర్యోగం గురించి ఆందోళన చెందసాగారు. ముఖ్యంగా శని, ఆదివారాల్లో ఆత్మారామ్‌ని, నన్ను అన్ని సౌకర్యాలున్న వారి కారులో దూర ప్రాంతాలకి తీసుకు వెళుతుండేవారు. అందమయిన అడవి ప్రాంతాలకు లేదా సుందరమయిన పార్కులకు వెళ్ళేవాళ్ళము. అక్కడ ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ, ప్రశాంతంగా, మౌనంగా ధ్యానంలో కాలం గడిపేవాడిని. అలాంటి సమయాల్లో మరియామాత మా కోసం రుచికరమైన వంటలు తయారుచేసి తెచ్చేది. ఆరుబయట, చక్కని వాతావరణంలో మేము ప్రశాంతంగా ప్రార్ధనల్లో, ధ్యానంలో మునిగిపోయేవారము.

సూర్యానంద ఆత్మారామ్‌కి అందరికి అనుకూలించే చక్కని ప్రార్ధనా గీతాన్ని నేర్పించాడు. ప్రతి వారము ఆశ్రమంలో భక్తులందరూ కలిసి ప్రార్థన చేసేవాళ్ళము. భక్తులందరికీ ఆత్మారామ్ పాడే ప్రార్థన ఎంతగానో నచ్చింది. రోజు రోజుకి భక్తుల సంఖ్య బాగా పెరిగిపోయి హాలంతా నిండిపోసాగింది. కొన్నిసార్లు హాల్లో స్థలం సరిపోనందుచేత చాలా మంది భక్తులు బయట వేచి ఉండవలసి వచ్చేది. అంతా దైవానుగ్రహమే కదా!

మొదటి సంవత్సరం ఫిలిడెల్ఫియాలో నేను గడిపిన మధుర క్షణాలు, మరియా మాతృదేవి పవిత్ర మందిరంలో గడిపిన రోజులు నా హృదయంలో పదిలంగా మిగిలిపోతాయి. నలభై సంవత్సరాలు గడిచిపోయినా ఆ మధురానుభూతి ఇంకా అలాగే ఉంది. నేను ఆధ్యాత్మికంగా బాగా పురోగతి సాధించటము వలన ఒంటరిగా పూజగదిలో ధ్యానంలో ఎక్కువ సమయం గడపటం, ఆహారం కోసం కూడా క్రిందికి దిగి రాకపోవటం గమనించి మరియా, ఎంట్రికన్ దంపతులు నా ఆరోగ్యం గురించి దిగులు పడసాగారు. అసలు నేను ఈ భౌతిక ప్రపంచానికి పనికివస్తానో లేదో అని వారు సందేహించారు. భోజనానికి కిందికి రమ్మని, వారితో కలిసి భోజనము చేయాల్సిందిగా మరియా నన్ను ఎంత బలవంత పెట్టినా, మీరు చేయండి, నేను తర్వాత వస్తాను అని చెప్పేవాడిని. ధ్యానంలో నిమగ్నమయిపోయేవాడిని. తర్వాత ఎప్పుడో నేను ఒంటరిగా భోజనం చేసేవాడిని. ఇది వారందరికీ బాధ కలిగించేది. దీనినుండి నన్ను తప్పించడానికి ఆ దంపతులు తరచుగా నన్ను వారితో దూర ప్రాంతాలకి సరదాగా తీసుకు వెళుతూండేవారు. ఆ విధంగా నేను నెమ్మదిగా ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించడానికి అలవాటు పడ్డాను. మొదట్లో మేము కొద్దిపాటి దూరం అయితే కారులోనే వెళ్లేవాళ్ళము. తర్వాత మేము దూర ప్రయాణాలు చేయటం మొదలుపెట్టాము. తరుచుగా అలా ప్రకృతిని వీక్షించడానికి వెళ్ళడం వలన నేను దానికి బాగా అలవాటు పడ్డాను. ఆత్మారామ్ బాగా చిన్నవాడు కావటం వలన దూర ప్రయాణాలు బాగా ఇష్టపడేవాడు. కొన్ని పర్యాయాలు దాదాపు 200 మైళ్ల దూరం ప్రయాణించేవాళ్ళం. తిరిగి ఇంటికి రావడానికి అర్థరాత్రి దాటిపోయేది. మేము బాగా అలసిపోయి నిద్రపోయేవాళ్ళము.

ఆత్మారామ్ రాల్ఫ్‌కి దూర ప్రయాణాలనుండి తిరిగి వచ్చిన తర్వాత కారును శుభ్రం చేయడానికి సహాయం చేసేవాడు. వాళ్ళిద్దరూ రోజు రోజుకీ మరింతగా సన్నిహితులయ్యారు. ఆ దంపతులకు పిల్లలు లేకపోవడం వలన ఆత్మారామ్‌ని ఆత్మీయంగా చూసుకొనేవారు. ఇక మరియా మాతృదేవి నన్ను తన కన్నబిడ్డగానే భావించేది. రక్తమాంసాలు పంచుమని పుట్టిన బిడ్డగానే ఆమె అనుకొనేది. రాల్ఫ్ ఆత్మారామ్‌ని తన సొంత బిడ్డలా భావించేవాడు. భగవంతుని లీలలు ఎంత విచిత్రంగా ఉంటాయి. ఎక్కడి వారమో! వారి స్వంత కుటుంబ సభ్యుల కన్నా ఎక్కువగా ఒకరికొకరు ప్రేమించుకుంటూ కలిసి జీవిస్తున్నాము. భగవంతుడే అతని బిడ్డలకి సేవ చేసేందుకు మమ్మల్ని ఈ విధంగా కలిపాడు.

కాలం నెమ్మదిగా గడిచిపోతోంది. మేమందరము ఆశ్రమానికి వచ్చే భక్తులతో, నేర్చుకోవటానికి వచ్చే విద్యార్థులతో, ప్రవచనాలు వినడానికి వచ్చే వారితో తీరిక లేకుండా కాలం గడపసాగాము. ఆత్మారామ్‌కి ఎక్కువగా రాల్ఫ్ తర్ఫీదు ఇస్తుండేవాడు. నేను కూడా అతడికి కొన్ని సూచనలు చేస్తుండేవాడిని. ఆత్మారామ్‌కి చిన్న చిన్న ఉపన్యాసాలు ఇవ్వడం నేర్పించాము. అతడు వాటిని రాసుకొని, బాగా చదివి చెపుతుండేవాడు. అవి ప్రజలను ఎంతగానో ఆకర్షించేవి. అంత చిన్న పిల్లవాడు, దూరదేశం నుండి వచ్చి, తన భాష కాని భాషలో చక్కగా ఉపన్యాసం చెప్పటం వారికి చాలా ఆశ్చర్యంగా, ఆనందంగా అనిపించేది. మరియా మాత కూడా నాకు ప్రజలను, భక్తులను ఆకట్టుకొనే విధంగా ప్రవచనాలు చేయడానికి అవసరమయిన సూచనలు, సలహాలు ఇస్తుండేది.

మరియా, రాల్ఫ్ దంపతులు నన్ను ఫిలిడెల్ఫియాలోని థియోలాజికల్ కళాశాలలో కొన్ని నెలలు చదువుకోవడానికి వెళ్ళమని సలహా ఇచ్చారు. అక్కడ క్రైస్తవ మిషనరీలలో బోధించేవారికి తర్ఫీదు ఇస్తుంటారు. క్రైస్తవ మత ప్రచారానికి వారిని పంపుతుంటారు. అక్కడ కొన్ని నెలలు నేను చదువుకోవటం వలన మంచి మత ప్రబోధకుడిగా తయారు కావచ్చుని ఆ దంపతులు ఆశించారు. వారు నన్ను అక్కడి రివరెడ్ ఫాదర్‌కి పరిచయం చేశారు. ఆ కళాశాల ప్రధానోపాధ్యాయుడు నన్ను చూచి చాలా ఆశ్చర్యపడ్డాడు. నా పట్ల ఎంతో ఆసక్తి కనబరిచేవాడు. మొదటిసారిగా వారి కళాశాలలో ఒక హిందూ సాధు మహాత్ముడు క్రైస్తవ మతానికి సంబంధించిన విషయాలను నేర్చుకోవడానికి, పవిత్రమయిన క్రీస్తు జీవితాన్ని, ప్రబోధాలను తెలుసుకోవడానికి ఆ కళాశాలలో చేరటం వలన ఆయనకి ఆనందం కలిగింది. ప్రిన్సిపాల్ గారి ప్రేమానురాగాల వల్ల, మరియా రాల్ఫా దంపతులను సంతోషపెట్టడానికి సహజంగానే నాకు క్రీస్తు పవిత్రమయిన జీవనం పట్ల ఉన్న గౌరవంతోనూ నేను ప్రతి రోజు శ్రద్ధగా కళాశాలకు వెళ్ళి జాగ్రత్తగా అక్కడ ఉపాధ్యాయులు బోధించిన విషయాలు నోట్సు వ్రాసుకొని వచ్చి మరియాకు చూపించేవాడిని.

ఒకరోజు నాకు ఎంతో సంతోషం, ఆశ్చర్యం కల్గించే విధంగా ఆ కళాశాల ప్రిన్సిపాల్ గారు నా వద్దకు వచ్చి, "స్వామీజీ! మీరు ఇన్ని నెలలు ఎంతో శ్రద్ధగా కష్టపడి చదివారు. మిమ్మల్ని జాగ్రత్తగా గమనించిన తర్వాత మీకు మేము ఇంకా నేర్పించడానికి ఏమీ లేదని అర్థమయింది. మీరు చాలా సాధారణ జీవితం గడుపుతారు. అలాగే ఎప్పుడూ

మౌనంగా, ధ్యానంలో ఉంటారు. అందువల్ల మీ వద్ద నుండి మేము నేర్చుకోవలసింది చాలా ఉన్నట్లుగా మేము భావిస్తున్నాము" అన్నారు. ఆ విషయం చెప్పినప్పుడు మరియా, రాల్ఫ్ దంపతులు చాలా సంతోషంచి, తృప్తి చెందారు. అందువలన వారు నన్ను ఎక్కువ సమయం పూజగదిలో ధ్యానంలో గడపడానికి అనుమతించారు. మరియా కూడా అప్పుడప్పుడూ వచ్చి నాతో పాటు ధ్యానంలో కాలం గడిపేది.

ఆత్మారామ్‌ని కూడా బడిలో చేర్పించారు. అక్కడి ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు ఆత్మారామ్‌తో ఎంతో ప్రేమగా ఉండేవారు. బాగా చిన్నవాడవటం వలన మార్కెట్‌కి వెళ్ళి అక్కడి దుకాణాల్లో 'ప్లేజర్సు' కావాలని అడిగితే, దుకాణదారులు ఆత్మారామ్ హిందూ బాలుడు కావడం వలన ముద్దుగా చిన్నగా ఉండడం చేత అడిగిన వాటికన్నా ఎక్కువ ఇచ్చి పంపేవారు.

మరియా రాల్ఫ్ దంపతులు మేమిద్దరము అన్నివిధాలుగా అభివృద్ధిలోకి రావడం గమనించి ఎంతో ఆనందించారు. ఆశ్రమ కార్యక్రమాలు కూడా దినదినాభివృద్ధి చెందసాగాయి. ఫిలడోల్ఫియా వాసులే కాకుండా దూర ప్రాంతాల నుండి కూడా భక్తుల తాకిడి పెరిగింది. భగవంతుని దయ వలన అందరూ ఆశ్రమ కార్యక్రమాలని కొనియాడ సాగారు.

## అధ్యాయం - 20

# మరి కొంతకాలం మరియా ఆశ్రమంలో

ఆత్మారామ్ నేను అమెరికా దేశానికి సందర్శకులుగానే వెళ్ళాము. అమెరికా దేశము నిబంధనల మేరకు మాకు అక్కడ ఆరునెలలు ఉండడానికి మాత్రమే వీలుంది. కాని మరియా, రాల్ఫా దంపతులు వారి పలుకుబడిని ఉపయోగించి, మంచి పని నిమిత్తం మేమిక్కడికి వచ్చామని చెప్పి మళ్ళీ ఆరు నెలలు కాలము పొడిగించారు. ఇప్పుడు సంవత్సర కాలం గడిచిపోయింది మేము అమెరికా దేశం వచ్చి. మా వీసా గడువు ముగిసిపోయింది. అందుచేత మరియా, రాల్ఫ్ దంపతులు ఈసారి మళ్ళీ వీసా గడువు

పొడిగించడానికి కారణాలు చెపుతూ, ఆత్మారామ్ చదువుకుంటున్నాడని, నేను ధార్మిక ప్రచారం చేస్తూ దేశం నలుమూలలా తిరుగుతున్నానని చెప్పారు. అందువలన మా వీసా మళ్ళీ పొడిగించబడింది. మేము రాత్రింబవళ్ళు ఆధ్యాత్మిక ప్రచారం చేస్తూ, ధార్మిక ప్రసంగాలను ఇస్తూ, సత్యాన్వేషకులకు మార్గదర్శనం చేస్తూ క్షణం తీరిక లేకుండా గడపసాగాము. కొందరు భక్తులు వందల మైళ్ళ దూరం నుండి మార్గదర్శనం కోసం మా వద్దకు వస్తుండేవారు. మరికొందరు భక్తులు ఒకటి, రెండు వారాల పాటు మాతోనే ఉండి సాధన చేస్తుండేవారు. వారు ఫిలడెల్ఫియాలోనే ఉండి ధ్యానంలో మెలకువలు నేర్చుకునేవారు. ఎవరి అవసరాన్ని బట్టి, సాధనని బట్టి వారికి తగిన రీతిలో నేను సహాయ సహకారాలు అందించేవాడిని. నేను వారందరి చేత ప్రతి రోజు వారి ఆధ్యాత్మిక సాధన గురించి దినచర్య వ్రాయమని చెప్పేవాడిని. సాధకులందరికి ఇది తప్పనిసరి.

మీకు ఆశ్చర్యంగా అనిపించవచ్చు. ఇంతకాలము ఆధ్యాత్మిక పరంగా అనుభవం పొందిన తర్వాత ఇప్పటికి కూడా నేను క్రమం తప్పకుండా నా ఆధ్యాత్మిక దినచర్యని డైరీలో వ్రాస్తున్నాను. అది నాకు ఎంతో ఉపయోగకరంగాఉంటుంది. ఎంతో నమ్మకంగా, నిజాయితీగా నా ఆధ్యాత్మిక దినచర్యని వ్రాయుట వలన అది నా ఆధ్యాత్మికోన్నతికి, నన్ను నేను పరీక్షించుకోవడానికి సహాయకారిగా ఉంటుంది. అద్దంలో చూసుకున్నట్లుగా సాధనలోని లోటుపాట్లు, పొరపాట్లు అన్నీ బాగా అర్థమవుతాయి. నన్ను నేను ఆత్మ పరిశీలన చేసుకోవడానికి సహాయకారిగా ఉంటుంది. ఆధ్యాత్మిక డైరీ అనేది ఒక గురువులాగా సాధనలోని లోపాలు సరిదిద్దుతుంది. అంతరంగ ఉపాధ్యాయుడిలా చేయిపట్టుకొని సాధకులని ఒక్కో మెట్టు పైకి ఎక్కిస్తూ భగవంతుడిని తెలుసుకోవడానికి సహకరిస్తుంది.

ఒక్కో సాధకుని ఆధ్యాత్మిక దినచర్య డైరీని చదివి సరిదిద్దటం, వారికి సూచనలు ఇచ్చి వారి భవిష్యత్తు ఉన్నతికి సహకరించటం చాలా కష్టమయిన పని. కాని ఇదంతా చాలా ప్రయోజనాన్ని, ఉపయోగాన్ని కలిగిస్తుంది. ఈ లోకంలో దేనిని సాధించాలన్నా దానికి సరయిన మూల్యాన్ని చెల్లించాలి. లేకపోతే దానిని ఎన్నటికి పొందలేము. ఆధ్యాత్మిక లబ్ధికి మాత్రమే కాదు ప్రాపంచిక విషయాలకయినా ఇదే వర్తిస్తుంది. ఆధ్యాత్మిక దినచర్యని వ్రాసే వారందరి ఉపయోగం కోసం అప్పుడు నేను రూపొందించిన సందేశాన్ని మీకు నేనిప్పుడు  వివరిస్తాను.



## ఆధ్యాత్మిక దినచర్య వ్రాయటంలో గల ఉపయోగాలు

ప్రపంచ ప్రసిద్ధులయిన మహాత్ముల జీవిత చరిత్రలు, ఆత్మకథలు చదివినప్పుడు వారు క్రమం తప్పకుండా దినచర్యని వ్రాసేవారని తెలుస్తుంది. వారి జీవితంలో సాధించిన జయాపజయాలను గూర్చి, వారు పొందిన గొప్ప అనుభవాలను గురించి వారు వివరించారు. దాని వలన మంచి అవగాహన, ఆత్మ పరిశీలన, ఆత్మావలోకనం చేసుకునేందుకు ఉపయోగపడుతుంది. మన జీవితంలో ఎదురయ్యే అనేకరకాల అనుభవాలను మించినది, ఉపయోగకరమయినది వేరొకటి ఉండదు.

ఆధ్యాత్మిక దినచర్యని వ్రాయటం వలన కలిగే ఉపయోగాలు వెలకట్టలేనంత విలువైనవి. ఇది దినచర్య వ్రాయటం అలవాటు లేని వారికి అర్థం కాదు. దినచర్య డైరీ సహాయంతో హృదయాన్ని పవిత్రం చేసుకొని రోజు రోజుకి అభివృద్ధిని సాధించవచ్చు. జీవితం అద్దంలో చూసుకొన్నంత స్పష్టంగా మంచి చెడులన్నింటినీ యథార్థంగా చూపిస్తుంది. ముందే చెప్పినట్లుగా మనం ఎలాంటి మూల్యం చెల్లించకుండా అన్నింటినీ పొందాలని అనుకుంటాము. రోజుకి ఐదు నిముషాల సమయాన్ని కూడా వెచ్చించడానికి, దినచర్య వ్రాయడానికి, ప్రయత్నించకుండానే మనం భగవంతుని గురించిన ఆత్మ సాక్షాత్కారము దానంతట అదే కలగాలని ఆశిస్తుంటాము. అసలు దినచర్య వ్రాయటం మొదలుపెడితే, ఒక వారం తిరిగేసరికి విసుగుపుట్టి, లేదా ఏదయినా ముఖ్యమయిన పని వలన దినచర్య వ్రాయటం ఆపివేసి, చివరికి అసలు దినచర్య వ్రాయటం పూర్తిగా మానివేస్తారు. మరికొందరయితే వారికి అన్నీ తెలుసునని, తెలుసుకోవాల్సింది ఇంకా ఏమీ లేనందువలన దినచర్య వ్రాయటం అనవసరమని భావిస్తుంటారు.

సాధు మహాత్ములు, మహనీయులు, మహోన్నత స్థితిని పొందినవారు, గొప్పవారిగా భావించబడిన వారందరి జీవితాలను పరిశీలించినపుడు వారందరూ కూడా ఎంతో క్రమశిక్షణతో క్రమం తప్పకుండా వారి జీవితంలోని ప్రతి సన్నివేశాన్ని, వారు పొందిన అనుభవాలను, ఆధ్యాత్మిక ఉన్నతిని గురించి డైరీ వ్రాసేవారని తెలుస్తోంది. దాని వలన వారు గొప్ప అభివృద్ధిని సాధించగలిగారు. చాలా నెమ్మిదిగా వారు జీవితంలో ప్రగతి పథంలో సాగిపోవడానికి ఉపయోగపడింది. డైరీ అనేది మనకి చాలా మంచి సన్నిహితుడైన, శ్రేయోభిలాషి అయిన స్నేహితుని వంటిది. సత్యాన్వేషణకి మనకి మార్గదర్శనం చేసే అంతరంగ గురువు అని చెప్పాలి.

అసలు ఆధ్యాత్మిక దినచర్య పుస్తకాన్ని ఎలా వ్రాయాలి? ఏమేమి విషయాలు అందులో వ్రాయాలి? ఎలా మొదలు పెట్టాలి? ముందుగా దాన్ని మొదలు పెట్టడానికి సాధారణమయిన నోటు పుస్తకం సరిపోతుంది. దాని కోసం ఏమీ ఎదురు చూడవలసిన పనిలేదు. మన కోసం డైరీలను ఎవరూ తయారుచేసి ఇవ్వరు. ఆధ్యాత్మిక దినచర్య డైరీలో ముఖ్యంగా ఐదు విషయాలు ముఖ్యమయినవిగా గుర్తుంచుకోవాలి. ఆత్మవిశ్వాసంతో పనిచేయడం, దానినే సంకల్ప శక్తి అని కూడా అనవచ్చు. రెండవది ఉదయ కాలము ధ్యానము. నిరంతర దైవప్రార్థన, సాయంకాలపు ధ్యానము, ఇంకా చివరిది ఆత్మ పరిశీలన.

ఉదయం నిద్ర నుండి మెలకువ రాగానే ముందుగా భగవంతుని గురించిన ఆలోచన చేయాలి. నిద్రలో మనకి ఏమీ తెలియదు. భౌతిక ప్రపంచము పూర్తిగా కనుమరుగవు తుంది. మెలకువ రాగానే శరీరంలోని ప్రతి నాడీ ప్రతిస్పందిస్తూ బాహ్య ప్రపంచము స్ఫురణకి వస్తుంది. దానికి కారణము ఏమిటి? నిన్ను జీవంతో నింపే ఆ దైవశక్తిని గురించి ఆలోచించు. నిజంగా నీవు నిద్రలేవగానే భగవంతుని స్మరిస్తున్నావా?

ఎందుకు రోజు ప్రారంభాన్ని ఆలోచనలతో, బాధలతో, చింతలు చికాకులతో ప్రారంభించటము? మంచి ఆలోచనలతో, దైవ ప్రార్థనలతో నీ దినచర్యని ప్రారంభించు. నిద్రలేవగానే మంచము మీద నుండి వెంటనే లేవకూడదు. రోజంతా మంచి పనులు చేయాలి. ఇతరులకు చేతనయినంత మన పరిధిలో సహాయం చేయాలి. ప్రతిక్షణము భగవంతుని నామస్మరణని మరచిపోకుండా గడపాలని చక్కని సంకల్పం చేసుకోవాలి. అందరిలో ఆ పరమాత్మను దర్శించడానికి ప్రయత్నించాలి. ఇక్కడ విషయం ఏమిటంటే మెలకువ రాగానే మంచం మీద పడుకుని ఆ పరమాత్మ సన్నిధిని అనుభవిస్తూ, మిగిలిన రోజంతా ఏ పని చేస్తున్నప్పటికీ, ఎక్కడ ఉన్నప్పటికీ భగవంతుని మీద ధ్యాస ఉండేలా చూసుకోవాలి.

ఉదయకాలము ధ్యాన సమయంలో ఎవరికి అనుకూలమయిన ఆసనంలో వారు సౌకర్యంగా కూర్చోవాలి. కనీసం పదిహేను నిముషాలు ఏకాగ్రతగా ధ్యానం చేయడానికి ప్రయత్నించాలి. ఆసనంలో సరిగ్గా కూర్చోగల్గుతున్నామా లేదా అని దినచర్య డైరీలో వ్రాసుకోవాలి. మనస్సులో ఆలోచనలు స్థిరంగా ఉన్నాయా లేదా మనస్సు చంచలంగా ఉందా అని గమనించాలి. అలాగే ధ్యానంలో ఉన్నప్పుడు ఏమయినా అనుభూతులు కల్గుతున్నాయా అని తెలుసుకోవాలి. నెమ్మదిగా తప్పకుండా ధ్యానంలో స్థిరత్వం వస్తుంది.

ఎంత సమయం మౌనంగా, ధ్యానంలో గడుపుతున్నాము అనే విషయాన్ని గుర్తించి వ్రాసుకోవాలి.

నిరంతర దైవ చింతన అన్నది అందరికి సాధ్యం కాకపోవచ్చు. ఆధ్యాత్మిక జీవితంలో విజయం సాధించాలంటే దానికి ఒక్కటే మార్గముంది. అదే నిరంతరమైన దైవ చింతన. అది ఎల్లప్పుడూ ఉంటుంది. ఒక్కసారి దాన్ని అనుభవంలోకి తెచ్చుకోవాలి. అంతే ఇక అది ఎన్నటికీ మరుగుపడిపోదు. సూర్యుడు మబ్బుల చాటున దాగి ఉన్నప్పుడు కనిపించడు. కావాల్సినదల్లా దాన్ని మనం గుర్తించగల్గటం మాత్రమే. మన జీవితంలో ప్రతి క్షణము సత్య దర్శనం కావాలి అంటే నిరంతర దైవచింతన అవసరము.

ఆధ్యాత్మిక దినచర్య డైరీ వ్రాసేటప్పుడు అన్నీ నిజాలే వ్రాయాలి. మనలోని బలహీనతలను మరుగు పరచకూడదు. ఎప్పుడూ ఆత్మావలోకనం చేసుకుంటూ ఉంటే ఆ బలహీనతలను అధిగమించడానికి అవకాశం దొరుకుతుంది. ఒక్కోసారి గంటల తరబడి మనము దైవ చింతనలో లేకుండా వివిధ కార్యాల్లో తలమునకలవుతుంటాము. అలాంటి విషయాలను కూడా నిజాయితీగా డైరీలో వ్రాసుకొని భవిష్యత్తులో అలా జరక్కుండా జాగ్రత్త పడవచ్చు. ఈ విధంగా ప్రయత్నించినప్పుడు సాధకులు రోజు రోజుకి సాధనలో ప్రగతిని, ఉన్నతిని, పురోగవృద్ధిని సాధిస్తారు. నిరంతర దైవచింతన అలవర్చుకోగలుగుతారు.

సాయంకాలపు ప్రార్థన సమయంలో ఉదయపు సమయంలో ధ్యాన సమయంలో ప్రార్థనతో పోల్చి చూసుకోవాలి. రెంటికి తేడా ఏమయినా ఉందా? లేదా ఏమయినా పురోగతి సాధించావా? అని సరిపోల్చి చూడాలి. ఆధ్యాత్మిక అనుభవాలు అంటే ధ్యానంలో కొన్ని దృశ్యాలు, రూపాలు దర్శించటం కాదు. ఆధ్యాత్మిక శక్తిని, దివ్యత్వాన్ని, ప్రశాంతతని పొందటము. సత్యదర్శనం అంటే రూపంతో సంబంధం ఉండదు. అక్కడ చూచేది, వినేది అంటూ ఏమీ ఉండదు. సత్యం నిర్గుణం, నిరాకారం, అనంతం, అద్వితీయం, అమృత్యైక్య అనుభవం. ఏకత్వం, ధ్యానం అనేది సాధనాక్రమం. నిరంతర ధ్యానం వలన తప్పకుండా పురోగతి కనిపిస్తుంది. ప్రతిరోజు విడువకుండా ధ్యానంలో కూర్చున్నప్పుడు మనకే తెలియకుండా నెమ్మదిగా క్రమక్రమంగా ఏకాగ్రత, ఉన్నత స్థితి తప్పకుండా కలుగుతుంది. కొద్దిగా అభివృద్ధి కల్గగానే సాధనని వదలిపెట్టకూడదు. సంకల్పానికి చాలా బలముంటుంది. ప్రయత్నలోపం లేకుండా కృతనిశ్చయంతో, అకుంఠిత

దీక్షతో ప్రయత్నించినప్పుడు తప్పకుండా విజయం సిద్ధిస్తుంది. కావలసినదల్లా సరయిన మార్గం, నిరంతర సాధన, ఆత్మోన్నతి కలగాలి అంటే గమ్యం చేరేదాకా దేనికయినా సిద్ధపడి సాధించాలి.

ఆత్మపరిశీలన చాలా ముఖ్యం. ఆ రోజంతా ఏ విధంగా గడిచింది అని నిద్రపోయే ముందు జాగ్రత్తగా ప్రతి క్షణాన్ని గుర్తు చేసుకొని ఆత్మ పరిశీలన చేయాలి. భగవంతుని గురించే ఆలోచిస్తూ నిద్రకు ఉపక్రమించాలి. ఎవ్వరూ కూడా పడుకొనేముందు చికాకులతో, బాధలతో, చింతలతో కూడిన ఆలోచనలు చేయకూడదు. ఐదు నిముషాలు ఆ రోజంతా ఎలా గడిచింది అని ఆలోచించాలి. నిర్మొహమాటంగా ఉదయంనుండి రాత్రి వరకూ చేసిన మంచి, చెడు పనులను నిజాయితీగా అంగీకరించాలి. మంచి కర్మలు చేయాలని కోరుకోవాలి. భగవంతుని గురించి మరచిపోవటం, సాధనలో దిగజారిపోవటం వలన దిగులు చెందకు. ఆత్మస్థైర్యంతో మళ్ళీ సాధనలో పురోగమించటానికి, నిరంతరం దైవనామ స్మరణలో ఉండడానికి ప్రయత్నించు. క్రొత్త ఉత్సాహంతో పడిపోయిన ప్రతిసారి మళ్ళీ పైకి లేచి అనుకున్నది సాధించు.

ఆధ్యాత్మిక దినచర్య డైరీ వ్రాయడానికి మంచి సమయము నిద్రపోయే ముందు సమయం. అయినా దానిని ఎప్పుడయినా వ్రాయవచ్చును. ఒక్కో సమయంలో వెంటనే ఎప్పటికప్పుడు మరచిపోకుండా వ్రాయటం మంచిది. తర్వాత ఆ అనుభవం, అనుభూతి తట్టకపోవచ్చు. అందువలన దినచర్య డైరీ వెంట ఉంచుకొని తోచినప్పుడు వ్రాస్తూ ఉండాలి.

ప్రతి రోజు రెండు పర్యాయాలు ధ్యానం చేయటం చాలా ముఖ్యం. కొందరు పవిత్రాత్మ స్వరూపులు రోజుకి నాలుగైదు పర్యాయాలు ధ్యానం చేస్తుంటారు. అయినా అది కష్టము అనిపించినప్పుడు అలా చేయాల్సిన పనిలేదు. ధ్యానము అనేది సహజంగా మనం ఊపిరి పీల్చుకున్నంత సహజంగా జరగాలి. అప్పుడే ఎవరయినా ధ్యానంలో ఆనందాన్ని అనుభవించగలుగుతారు. సాధకులు తప్పనిసరిగా రోజుకు రెండు పర్యాయాలు ధ్యానం చేయటం, ఆధ్యాత్మిక దినచర్యని వ్రాయటం గుర్తుంచుకోవాలి.

మనలోపల దివ్యమయిన అంతర్గతశక్తి నిండి నిబిడీకృతమై ఉంది. అది బహిర్గతమవడానికి ఎదురు చూస్తుంది. ఆ శక్తిని మేల్కొలిపి దానిని వెలికితీయడానికి

ప్రయత్నించాలి. దాని కోసం పెద్దగా కష్టపడకుండా, చాలా తేలికగా ఆత్మపరిశీలన, ఆత్మ విమర్శ, ఆత్మావలోకనం చేస్తూ ఉండాలి. దానివలన మంచి పరిపక్వత లభిస్తుంది. చాలా తేలికయిన పదాలలో సూచనలు ఇస్తుండాలి. అంతేగాని కష్టమయిన పరిభాష, కఠినమయిన సాధనలు అవసరం లేదు. వాటివలన ఎలాంటి ప్రయోజనం ఉండదు. కనీసం ఒక రెండు మూడు నెలలు ఆధ్యాత్మిక దినచర్యని డైరీలో వ్రాసి ప్రయోగాత్మకంగా పరిశీలించి చూడండి. అద్భుతమయిన ఫలితాలను చూచి మీరు ఆశ్చర్యపడతారు.

ఒకసారి డైరి వ్రాయటం మొదలుపెట్టిన తర్వాత మొదట్లో ఉన్న ఉత్సాహాన్ని కోల్పోవద్దు. మధ్యలో వ్రాయటం ఆపివేయవద్దు. నాకు తెలిసిన కొంతమంది వ్యక్తులు వారు కాలానికి, స్థలానికి, కారణాలకి అతీతులము అని అంటూ ఉంటారు. అందువలన వారికి డైరి వ్రాయవలసిన అవసరం లేదంటారు. వృథా మాటలు చెప్పటం చాలా తేలిక. నిజంగా అంతటి అతీతమయిన స్థితికి చేరిన మహాత్ములకు నా భక్తి వందనాలు సమర్పిస్తున్నాను. వారు ఉన్నతోన్నతమయిన పరిపక్వస్థితిని పొందినవారు. కాని మన జీవిత గమ్యం అందుకునేంత వరకు, మనం సమాధి స్థితిని, నిర్వాణ స్థితిని, ఆత్మసాక్షాత్కార స్థితిని పొందేవరకూ మనం ప్రతిక్షణం కష్టపడి, ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పైకి ఎదగడానికి ప్రయత్నించాలి.

నాకు చాలా మంది గురించి తెలుసు. వారు ప్రతి రోజు దినచర్య డైరీలో వ్రాయడానికి బద్ధకించి, ఎప్పుడో వారానికో పదిరోజులకో ఒక్కసారిగా ఒక్క రాత్రిలో వ్రాయడానికి ప్రయత్నిస్తుంటారు. అందువలన వారు జరిగిన విషయాలన్నీ గుర్తులేక ఏదో ఒకటి వ్రాసి డైరీని నింపుతారు. డైరీని ఈ విధంగా వ్రాయటం వలన ఎలాంటి ప్రయోజనము ఉండదు. ఏవో కట్టుకథలు అల్లి పాడినట్లుగా ఉంటుంది. దాని బదులుగా అసలు డైరీ వ్రాయటం వలన కలిగే ప్రయోజనాన్ని సరిగ్గా గుర్తించాలి. తెలివయిన వ్యక్తి కేవలం మాటల వలన ప్రయోజనం ఉండదని, చేతల్లోనే అసలు ప్రయోజనం ఉందని గ్రహిస్తాడు. అందుచేత కృతనిశ్చయంతో ఈ రోజే మొదలుపెట్టి క్రమం తప్పకుండా మీ ఆధ్యాత్మిక దినచర్యని, సాధనలో కలిగే అనుభవాలను డైరీలో వ్రాయటం వలన, సంకల్ప శక్తి పెరిగి శారీరకంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా మంచి పురోగతిని సాధించగల్గుతాము.

సత్యాన్వేషకులారా! మీకందరికి సేవ చేయటం నాకు ఎంతో సంతోషాన్ని, ఆనందాన్ని కలిగిస్తుంది. ఇంకా కొన్ని వివరాలు అందించాలని ఉంది దినచర్య డైరీ వ్రాయటం గురించి. కానీ ఇక్కడితో దీనిని ముగిస్తున్నాను. కాబట్టి దీని వలన కలిగే ఫలితాలు

అందుకోవడానికి, ఆనందించడానికి సిద్ధంగా ఉండండి. ఈ క్రొత్త సంవత్సరంలో ఒక స్థిరమయిన సంకల్పాన్ని చేయండి. భగవంతుని ఎదుట నిజాయితీగా ప్రతిన పూనండి. మన జీవితంలో ప్రతి క్షణము పరమాత్మ దివ్యత్వాన్ని, ప్రకాశాన్ని అనుభవంలోనికి తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తున్నామని, ఈ రోజే దానికి శ్రీకారం చుడతామని, దాని వలన పరిమితులు లేని ఉన్నతిని అందుకోవడానికి మహాత్ములు, సాధువులు, సంతులు జీవితాలను మార్గదర్శకంగా భావించి వారి అడుగుజాడల్లో నడుస్తామని ప్రతిజ్ఞ చేయండి.

మీ ఆధ్యాత్మిక జీవనానికి దినచర్య డైరీ ఒక పునాదిరాయిగా ఉండి మిమ్మల్ని ఆధ్యాత్మికంగా ఉన్నత స్థితిలో నిలబెట్టాలని ఒక సోదరుడిగా ఆశీర్వదిస్తున్నాను.

నాకు చిన్ననాటి నుండి ఆధ్యాత్మిక గ్రంథాలను సేకరించడం అలవాటు. ఫిలడెల్ఫియాలో చాలా పుస్తకాల దుకాణాల్లో ఒకసారి చదివేసిన పుస్తకాలు ఎన్నో అమ్ముతుంటారు. అక్కడ అన్ని రకాల గ్రంథాలు లభ్యమవుతాయి. అక్కడ అన్నింటిలోనికి చాలా పెద్ద దుకాణం దాదాపు ఐదారు అంతస్తుల భవనంలో ఉండేది. దాని పేరు 'లియరిన్' అక్కడ అన్ని విషయాలకు సంబంధించిన గ్రంథాలు దొరుకుతాయి. కొన్నిసార్లు నాకు ఎంతో విలువయిన వేదాలు, ఉపనిషత్తులు, ఖురాన్, పిటకాలు వంటి సంస్కృత గ్రంథాలు దొరికేవి. సాధారణమయిన పుస్తకాలు నేల మీద పరిచే ఉండేవి. అలమరాలో వాటిని సర్దడానికి స్థలం ఉండేది కాదు. పుస్తకం మీద దాని వెల ముద్రించి ఉండేది. కొనుక్కునే వారికి సౌకర్యంగా ఉండేది. సాధారణమయిన పుస్తకాలు ఏవయినా పది సెంటలు విలువ అయితే పెద్ద గ్రంథాలు ఇరువై నాలుగు సెంటలు ఉండేవి.

నేను గంటల తరబడి ఆ దుకాణంలో ఉండి గ్రంథాలన్నీ చదివేవాడిని, అందులో విలువైన వాటిని ఏరుకుని పెద్ద కట్టలుగా కట్టించుకొని, ఎంతో బరువయిన ఆ గ్రంథాలను అతి కష్టం మీద బస్సులో నిలబడి ఇంటికి తెచ్చేవాడిని. నేను ఎక్కడో దూరంగా అమెరికాలో ఉంటున్నప్పటికీ నా అసలయిన ఆశ్రమము తోటపల్లి కొండల్లోని శాంతి ఆశ్రమంతో నాకున్న అనుబంధం అపురూపమయినది. దానిలో గ్రంథాలయం కోసమని నేను అనేక గ్రంథాలను వెతికి సేకరించేవాడిని. అవన్నీ కూడా ఆధ్యాత్మిక స్ఫూర్తిని అందించే గ్రంథాలు. కేవలం గ్రంథాలు మాత్రమే కాకుండా చిత్రపటాలు, కుర్చీలు, మడత పెట్టే బల్లలు, గ్రంథాలయానికి ఉపయోగపడే వాటినన్నింటినీ సేకరిస్తుండేవాడిని. అలాంటి వాటిలో బాగా పాతబడిపోయినవి కూడా ఉండేవి. అవి చూచి మరియా, రాల్ఫ్ దంపతులు నవ్వేవారు. వీటన్నింటినీ నీవు భారతదేశానికి తీసుకువెళతావా! అనేవారు.

కొన్నిసార్లు పుస్తకాల దుకాణంనుండి నేను తిరిగి వచ్చే సమయానికి నా కోసం చాలా మంది సాధకులు తమ ఆధ్యాత్మిక దినచర్య డైరీలతో ఎదురుచూస్తుండేవారు. రోజంతా అలసిపోయి వచ్చినప్పటికీ నేను వారిని ఎన్నడూ నిరాశ పరచలేదు. వారు నా మీద ఎంతో నమ్మకంతో, నా మార్గదర్శకత్వంతో ఆధ్యాత్మికంగా పురోగమించడానికి సాధనలు చేస్తున్నారు. వారికి అన్ని విధాలయిన సేవలు అందించటం నా కర్తవ్యం. ఈ విధంగా కాలం ఒక్కో నెల గడిచిపోతోంది. మా వీసా గడువు ముగిసిపోయినప్పుడల్లా అమ్మ మరియా ఇమిగ్రేషన్ అధికారులతో మాట్లాడి మళ్లీ కాలం పొడిగిస్తూ వస్తున్నది. ఆమె ప్రేమానురాగాలు అపారమయినవి. మా పట్ల ఆమె ఎంతో అనుబంధం ఏర్పరుచు కుంది.

ఒక ఆసక్తికరమయిన సంఘటన మరియా ఆశ్రమంలో జరిగినది గుర్తు వస్తోంది. ఒకసారి నా వద్దకు ప్రవచనాలు వినడానికి వచ్చే విద్యార్థి ఒక క్రొత్త వ్యక్తిని తనతో తీసుకు వచ్చింది. నేను నా వద్దకు వచ్చే ప్రతి ఒక్కరిని అవసరాన్ని బట్టి విడివిడిగా లేదా అందరికీ కలిపి కొన్ని ఆధ్యాత్మిక సూచనలు ఇచ్చేవాడిని. వచ్చిన కొత్త వ్యక్తికి సందేహం వచ్చింది. తనని అక్కడికి తీసుకువచ్చిన ఆవిడతో "స్వామీజీ ఏమయినా డబ్బు తీసుకుంటారా! ప్రవచనాలు, సూచనలు ఇస్తున్నారు కదా, ప్రత్యేకమయిన రుసుము చెల్లించాలా!" అని అడిగింది. అందుకు ఆవిడ "లేదు, లేదు స్వామీజీ ఎవరినీ దేనికి డబ్బు అడుగరు. ఆయన ప్రవచనాలు, సూచనలు గాలిలాగా స్వేచ్ఛగా ఎవరయినా పొందవచ్చు. కాని ఒకసారి వారిని దర్శించి, అద్భుతమయిన కంఠంతో వారు చేసే ప్రవచనాలు విన్న తర్వాత ఎవరయినా వారి వద్ద నున్న డబ్బంతా ఆయన పాదాల వద్ద సమర్పించి వేస్తారు" అని చెప్పింది.

కొన్నిసార్లు మమ్మల్ని విద్యార్థులు వారి అందమయిన ఇంటికి ఆహ్వానించేవాళ్ళు. అలాగే ఆధ్యాత్మిక వేత్తలు కూడా ప్రవచనాలు చేయడానికి మమ్మల్ని పిలుచుకు వెళ్ళేవారు. కొన్నిసార్లు నా ప్రవచనాలు చర్చీల్లో జరిగేవి. అప్పుడు అక్కడి చర్చి ఫాదర్ నా ప్రవచనాలు విని ఎంతగానో స్పందించేవారు. చాలా పెద్ద సంఖ్యలో శ్రోతలు ప్రవచనం వినడానికి వస్తుండేవారు. ఆధ్యాత్మిక ప్రసంగాలు ఎంతో స్ఫూర్తిని అందించి వారిని ఆకట్టుకునేవి.

**అధ్యాయం - 21**

# భారతదేశానికి తిరిగి వచ్చాము

నాకు మాతృదేశము ఎప్పుడూ ఒక్కటే. అది విశ్వ ప్రపంచము. ప్రపంచమంతా ఒక్కటే అని విశ్వసించే వారి జీవితం ధన్యము. కేవలం తాను ఒక దేశానికి, మతానికి పరిమితము అని భావించేవారు నూతిలో కప్పల వంటి వారు. వారి అజ్ఞానము వలన వారు ఆ విధంగా పరిమితులు ఏర్పరుచుకుంటారు. చాలామంది చాలా గొప్పగా తమ మాతృదేశమే చాలా గొప్పదని, తన దేశము, మతము అన్నింటికన్నా చాలా గొప్పవని గర్వంగా చెప్పుకుంటూ ఉంటారు. సనాతన భావాలు గల చాంధసులకు నా మాటలు రుచించకపోవచ్చును. ఎందుకంటే నేను ఈ ప్రపంచమే నా ఇల్లుగా భావిస్తాను. అన్ని మతాలు నాకు సంబంధించినవే అనుకుంటాను. అందుకే నేను ఏ ఒక్క దేశానికో, మతానికో పరిమితమై పోలేను.

ఈ ప్రపంచమంతా నా సొంత ఇల్లు లాంటిది. అందులో నివసించే వారందరూ నాకు తోబుట్టువుల వంటి వారు. నేను వారందరినీ ప్రేమించి సేవ చేస్తాను. అదే నా గొప్ప మతము. మొదటి నుంచి కూడా నా ఆధ్యాత్మిక జీవనానికి ఈ భావమే పునాదిగా పనిచేసింది.

మన బుద్ధి, విశ్వాసము, మానవత్వము పట్ల ప్రేమ ఎలా ఉంటుందో, అదే విధంగా ప్రపంచములోని ప్రజలందరూ మన పట్ల ఆకర్షితులవుతారు. ఎవరయితే కేవలం తన గురించి మాత్రమే ఆలోచిస్తూ, రక్తమాంసాలతో కూడిన తన భౌతిక శరీరానికి పరిమితమయిపోతారో, స్వార్థంతో ఆలోచిస్తారో అలాంటి వారి పట్ల ఎవరికీ ప్రేమ ఉండదు. వారు దగ్గరి వారయినా, లేదా దూరపువారయినా సరే. కాని విశాల హృదయంతో, విశాలమయిన ఉన్నతమయిన ఆలోచనలతో అందరినీ మనతో కలుపుకుంటే, అప్పుడు జాతి, మతము, దేశము, ప్రాంతము అనే భేదము లేకుండా అందరూ మనల్ని ప్రేమిస్తారు. విశ్వప్రేమకు, దివ్యత్వానికి గుర్తు అది.

శాంతి ఆశ్రమమే దీనికి సరయిన ఉదాహరణగా నిలుస్తుంది. 1917లో స్థాపించబడిన ఆశ్రమము భగవంతుని బిడ్డలందరినీ ఆదుకొని వారికి శాంతిని అందిస్తోంది. అన్ని

దేశాల వారు తూర్పు, పడమర దేశాల వారు, అన్ని మతాల వారు, అన్ని కులాల వారు, అన్ని జాతుల వారు గుంపులుగా శాంతి ఆశ్రమానికి చేరుకున్నారు. అందుకే అది విశ్వ కుటుంబము అయింది.

శాంతి ఆశ్రమము నుండి భక్తులు వెనక్కి తిరిగి రమ్మని పిలవటం వలన నేను, ఆత్మారామ్ భారతదేశానికి తిరిగి రావాలని నిర్ణయించుకున్నాము. అందువలన మా ప్రయాణానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నాము. సూర్యానంద మా ప్రయాణానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా అవసరమయిన ముఖ్యమైన ఏర్పాట్లు దగ్గరుండి చేశాడు. కాని సరస్వతీ దేవి చాలా బాధపడుతోంది. రోజులు దగ్గరపడే కొద్దీ ఆమె చాలా నిరాశలో కృంగి పోసాగింది. ఆమె హృదయం తీరని దుఃఖంతో భారంగా మారింది. ఆ దంపతులిద్దరూ మాతోపాటు భారతదేశానికి వచ్చి ఉండిపోవాలని నిర్ణయించుకున్నారు. అయితే మేము ముందుగా వెళ్ళిన తర్వాత వాళ్ళకి అవసరమయిన ఏర్పాట్లు చేయాలని నిర్ణయించు కున్నాము. అప్పుడు వారి ఇళ్లు, సామాన్లు అన్నీ అమ్మివేసి ఆస్తి మొత్తం అమ్మివేయాలను కున్నారు. శాంతి ఆశ్రమానికి వారి జీవితాలను అంకితం చేయాలని వారు నిర్ణయించు కున్నారు. శాంతి ఆశ్రమం అభివృద్ధిని వారు కాంక్షిస్తున్నారు. ఎందుచేతనంటే ఆశ్రమము శాంతి మిషన్, భారతదేశానికి సేవ చేయాలని వారి సదుద్దేశ్యము.

ఆ దంపతులిద్దరూ ఎంతో దయామయులు. నా పేరుతో బ్యాంక్‌లో ప్రత్యేకంగా ఖాతా మొదలుపెట్టి అక్కడి ప్రవచనాలకి వచ్చిన ధనమంతా అందులో జమ చేశారు. భక్తులు దక్షిణలు బాగా ఇచ్చేవారు. అది నా దారి ఖర్చులకి సరిపోతుంది. అయినా వారు స్టీమరు టికెట్టు కొని, ప్రయాణంలో దారి ఖర్చులకి కూడా డబ్బు ఇచ్చి పంపారు.

ఫిలడెల్ఫియా ఆశ్రమము నుండి మేము బయలుదేరేముందు అమ్మ విపరీతంగా గుండెలు పగిలిపోయేలాగా ఏడ్చింది. ఆమె ముఖమంతా వాచిపోయింది. కళ్ళ వెంట ధారాపాతంగా కన్నీళ్లు కారసాగాయి. అది చూచి నాకే చాలా బాధగా అనిపించి హృదయం బరువెక్కింది. ఆమెది దివ్యమయిన మాతృప్రేమ. భగవంతుడు ఎల్లప్పుడు నన్ను ఆమె మాతృప్రేమకు పాత్రుడిని చేయాలని, ఆమె ప్రేమ నా పట్ల ఎప్పుడూ అలాగే ఉండాలని ప్రార్థిస్తున్నాను.



అనేకమంది స్నేహితులు, పాతభక్తులు, ఆశ్రమానికి క్రమం తప్పకుండా వచ్చేవారు ఎందరో మాకు వీడ్కోలు చెప్పడానికి స్టీమరు వద్దకు వచ్చారు. కాని మరియా పరిస్థితి బాగాలేదు. ఆమె చాలా విచారంగా, బాధలో ఉండడం వలన జబ్బు పడింది. మేము ఆమెను వదలి వెళ్ళడం చూడలేక ఆమె పూజా మందిరంలో ఒంటరిగా ఏడుస్తూ ఉండిపోయింది. తర్వాత ఆమె కొన్ని వందల ఉత్తరాలు ఆమె అవ్యాజమైన ప్రేమానురాగాలను తెలియచేస్తూ వ్రాసింది. ఆమె నా ఎడబాటును తట్టుకోలేక హృదయం ముక్కలయిపోయినట్లుగా భావించింది. ఆమె వ్రాసిన ఉత్తరాలన్నీ దివ్య ప్రేమతో, ఆధ్యాత్మికత ఉట్టిపడుతూ ఉండేవి. ప్రాపంచిక జీవితం గడిపే వారికి అవి హాస్యాస్పదంగా అనిపించవచ్చు.

నిజానికి దివ్యత్వం నింపుకున్న ప్రేమకు హద్దులు గాని, ఎల్లలు గాని ఉండవు. మాతృమూర్తి మరియా ప్రేమను వివరించడం గాని, వర్ణించడానికి మాటలు గాని సరిపోవు. ఆమె ప్రేమ భూపరిమితులను దాటి స్వర్గ లోకపు వాకిళ్ళను దాటి భగవత్ ప్రేమతో నిండి ఉండేవి. మమ్మల్ని రైల్వే స్టేషన్‌కి తీసుకువెళ్ళడానికి టాక్సీ వచ్చింది. నేనింకా మరియా మాత మందిరంలో ఆమెతో పాటు ఉన్నాను. ఆమె ఏడ్చి ఏడ్చి ముఖమంతా వాచిపోయి కన్నీళ్ళతో తడిసి పోయి ఉంది. నాకు కూడా ఆమె పరిస్థితి లానే ఉంది. నా కళ్ళలో నీరు కారుతోంది. హృదయం భారంగా ఉంది. ఆ పరిస్థితిలో భారతదేశం గురించి, శాంతి ఆశ్రమం గురించి మరిచిపోయి మా ప్రయాణాన్ని రద్దు చేసుకొని మరియా జీవించి ఉన్నంత కాలం ఆమె వద్దే ఉండి ఆమెకు ఆనందాన్ని కలిగించాలని అనిపించింది.

అయితే మనం అనుకున్న విధంగా ఏమీ జరగవు. భగవంతుని నిర్ణయాలు చాలా బలీయంగా ఉంటాయి. మన వ్యక్తిగత పూర్వకర్మను అనుసరించి ఏదయినా ఆయన చేత ముందే నిర్ణయించబడుతుంది. అమ్మను ఊరడిస్తూ, ఓదార్పుగా ఆమెతో "అమ్మా! ఏడవవద్దు. నీ కోసం తప్పకుండా నేను తిరిగి వస్తాను" అని చెప్పగా ఆమె నాకు వెళ్ళటానికి అనుమతి ఇచ్చింది.

ఏ విధంగా టాక్సీ ఎక్కి రైలు దగ్గరికి చేరుకున్నామో, తర్వాత రైలు మమ్మల్ని స్టీమరు వరకూ ఎలా చేర్చిందో అంతా కలలో లాగా జరిగిపోయింది. ఓడ రేవులో మా కోసం చాలా మంది స్నేహితులు, భక్తులు ఎదురుచూస్తున్నారు. వారు మా కోసం ఎన్నో

బహుమతులు, బుట్టల నిండా సామగ్రి, గ్రీటింగ్ కార్డులు తెచ్చారు. ఇప్పుడు నాకు ఆ పవిత్రాత్మ స్వరూపులయిన భక్తులందరి పేర్లు గుర్తుకు రావటం లేదు. స్టీమరు బయలుదేరే సమయం అయినట్లుగా గంట మ్రోగించగానే మాకు వీడ్కోలు చెప్పటానికి వచ్చిన వారందరూ స్టీమరు దిగి క్రిందికి వెళ్ళిపోయారు. సూర్యానంద చాలా విచారంగా ఉన్నాడు. ఆత్మారామ్ పట్ల ఆయన పుత్ర ప్రేమను పెంచుకొన్నాడు. కళ్ళ నిండా నీళ్ళతో ఆత్మారామ్‌ని మళ్ళీ మళ్ళీ కౌగలించుకొని వదలలేక వదిలిపెట్టి వెళ్ళాడు. నెమ్మదిగా స్టీమరు ప్రయాణం మొదలుపెట్టింది. మేమిద్దరం ఒంటరిగా ఓడ పై భాగంలో నిలబడి మా కోసం వీడ్కోలు చెప్పటానికి వచ్చిన వారు చేతిరుమాలు ఊపుతో జాగ్రత్తగా వెళ్ళండి అని చెపుతుంటే చూస్తూ నిలబడ్డాము.

మేము ఎక్కిన స్టీమరు పేరు ఎస్ ఎస్ యునికార్న్. అది కార్గో ఓడ. సామాన్లు చేరవేస్తూ అమెరికా భారతదేశానికి మధ్య ప్రయాణం చేస్తుంది. అందువలన అందులో చాలా కొద్దిమంది ప్రయాణీకులే ఉంటారు. ఎనిమిది, పది మందికి మించరు. సరదాగా కాలక్షేపం చేస్తూ ప్రయాణించాలి అనుకునే వారు ఇలాంటి నెమ్మదిగా వెళ్ళే స్టీమరులో ప్రయాణం చేయరు. బాగా వేగంగా వెళ్ళే వందలమంది ప్రయాణీకులను తీసుకువెళ్ళే స్టీమరులో వెళతారు. కేవలం ఆధ్యాత్మిక మత గురువులు, మిషనరీ ప్రబోధకులు, వారి కాలాన్ని ప్రశాంతంగా ప్రార్థనలతో, ధ్యానంతో గడపాలని భావించేవారు ప్రశాంతంగా ఇలాంటి స్టీమరులో ప్రయాణం చేస్తూ జపధ్యానాదులు చేసుకుంటూ ప్రకృతి సౌందర్యాన్ని, సూర్యుని అస్తమయాన్ని, ఉదయకాలపు ఉషోదయపు అందాలను చూచి పులకించి పోతూ ఉంటారు. ప్రయాణికులు ఎక్కువ మంది లేకపోవటం వలన మేమిద్దరము ఆ స్టీమరుకి యజమానుల్లాగా, ప్రపంచానికే రాజుల్లా హాయిగా, స్వేచ్ఛగా ప్రయాణం సాగించాము. ఇప్పుడు మేము మాతృదేశానికి చాలా కాలం తర్వాత తిరిగి వస్తున్నాము. అమెరికాలో అనేకమంది కొత్త వారితో పరిచయాలయ్యాయి. వివిధ దేశాల వారందరితో స్నేహం చేశాము. వారందరికీ నిస్వార్థంగా ఆధ్యాత్మిక సేవలందిస్తూ సంతోషంగా కాలం గడిపాము. అన్ని మతాలకి చెందిన సోదర సోదరీమణులను కలిశాము. అమ్మ మరియా గురించిన ఆలోచనలు వచ్చినప్పుడు మాత్రం బాధతో హృదయం భారంగా మారిపోతుంది. ఆమె ఎంతో ఆలోచించి ఓపిగ్గా మా కోసం యాభై ఉత్తరాలను రాసి ఇచ్చింది. స్టీమరులో మా ప్రయాణం చాలా రోజులు పడుతుంది కనుక వాటిని చదువుకొని ఉత్సాహంగా ఉంటామని ఆశించింది. ఆమె నాతో వాటన్నింటిని ఒకేసారి చదవవద్దని ప్రతి రోజు

ధ్యానము చేసుకోమని, రోజుకి ఒక్క ఉత్తరాన్ని దానిపై వేసిన తేదీ ప్రకారం చదివి అందులోని ఆధ్యాత్మిక విషయాలను గూర్చి ధ్యానము చేయమని చెప్పింది. ఆ ఉత్తరాలు ఎంతో స్ఫూర్తిదాయకంగా మహాత్ములు, ప్రవక్తల సూక్తులతో నిండి ఉన్నాయి. క్రీస్తు, భగవాన్ బుద్ధుడు, శ్రీకృష్ణ భగవానుడు మొదలయినవారి సందేశాలతో అవి నిండి పోయాయి.

అమ్మ మరియా మా కోసం మాత్రమే కాకుండా ఆత్మారామ్ తల్లిదండ్రులకు, శాంతి ఆశ్రమంలో పనిచేసేవారి కోసం అక్కడ నివసించే భక్తుల కోసం కూడా ఎన్నో బహుమతులు పంపించింది. స్టీమరు కెప్టెను దగ్గర నుండి అందులో పనిచేసే వారందరూ మా పట్ల ఎంతో భక్తి శ్రద్ధలతో మా ప్రయాణం సౌకర్యంగా, సంతోషంగా జరిగేందుకు ప్రయత్నించారు. వంటగదిలో పనిచేసే బెంగాలీ వారు మా కోసం ప్రత్యేకంగా సూపులు కూరగాయలతో వంటకాలు తయారుచేసేవారు. దీనితో పాటు ప్రతిరోజు తీపి పదార్థాలు, ఐసుక్రీములు కూడా ఉండేవి. ఆత్మారామ్‌కి నాకు ఉడికించిన బంగాళా దుంపలు, వెన్న, బ్రెడ్డు, జామ్, ఐస్‌క్రీములు ఇష్టంగా ఉండేవి. వాతావరణం బాగాలేనప్పుడు తుఫాను సమయాల్లో ఓడ సముద్రపు అలల్లో ఉయ్యాలలాగా ఊగిపోతుండేది. అప్పుడు ఆత్మారామ్ నేను మా గదిలోనే ఉండిపోయి గంటల తరబడి నిద్రపోయేవాళ్ళము. ఆత్మారామ్ చిన్నవాడయినా భయం లేకుండా ఒక్కోసారి తుఫాను సమయంలో ఓడ పై భాగంలో కాలం గడిపేవాడు. అలాంటి సమయాల్లో స్టీమరులోని కుర్చీలు, బల్లలు గట్టిగా తాళ్ళతో కట్టివేసేవారు. అలాగే అలమరా తలుపులు తెరుచుకోకుండా వైర్లతో బంధించేవారు. ఓడ కుదుపులకి వాంతులు అవుతుండేవి. ప్రతి ఓడలో ప్రయాణీకులు జబ్బు పడితే మందులు ఇచ్చి వైద్యం చేయడానికి ఒక వైద్యుడు, నర్సు ఉండేవారు.

ప్రతివారము ప్రమాదం జరిగినపుడు లైఫ్ బోటులో ఎలా వెళ్ళాలి అని తర్ఫీదు ఇచ్చేవారు. సైరన్ మ్రోగించగానే స్టీమరులోని ఆడ, మగ ప్రయాణీకులందరూ తప్పనిసరిగా వారిచ్చిన ప్రత్యేకమయిన దుస్తులు ధరించి ఓడ పైభాగానికి చేరుకుని వారిచ్చే తర్ఫీదు తీసుకునేవారు. ప్రమాదం జరిగితే ఎవరికి వాళ్ళు ఆత్మరక్షణ ఎలా చేసుకోవాలి అనే అంశంపై తర్ఫీదు ఉండేది. తుఫానుల్లో ఒక్కోసారి ఓడ మునిగిపోయే ప్రమాదం ఏర్పడవచ్చు. అలాంటి సమయంలో వారిచ్చే తర్ఫీదు ఎంతో ఉపయోగపడుతుంది. ఈ విధంగా మా స్టీమరు ప్రయాణం చాలా ఆసక్తికరంగా సాగుతోంది. సముద్రం ప్రశాంతంగా

ఉన్నప్పుడు అలలు ఎగిసి విరిగి పడడం చూస్తూ కాలం గడిపేవాళ్ళము. చేపలు సముద్రపు నీళ్ళలో నుండి ఎగిరి మళ్ళీ సముద్రంలో పడుతూ ఉంటే చూసేందుకు సరదాగా ఉండేది. అవి నాట్యం చేస్తున్నట్లుగా ఉండేది. అంతులేని సముద్రము ఎప్పుడూ ఒక విధంగా ఉండేది కాదు. కొన్నిసార్లు అల్లకల్లోలంగా ఉంటే మరికొన్ని సార్లు ఎంతో ప్రశాంతంగా ఉండేది. ఒక్కోసారి పర్వతమంత పెద్దగా భయంకరమయిన రాకాసి అలలు ఎగిసిపడి మా స్టీమరును ఢీకొట్టి తల్లక్రిందులు చేసినంత పని జరిగేది. ప్రశాంతంగా ఉన్నప్పుడు మాత్రం సముద్రము చూడడానికి ఎంతో అందంగా ఉండేది.

సముద్రంలో చాలా రోజులు ప్రయాణం కావటం వలన వాతావరణం ప్రశాంతంగా ఉన్నప్పుడు స్టీమరు సిబ్బంది నన్ను ఆధ్యాత్మిక ప్రవచనాలు చేయమని శాంతి సందేశాన్ని ఇవ్వమని అడిగేవారు. వాళ్ళందరూ చాలా మంచి వారు, భక్తులు. మరియామాత చెప్పినట్లుగా ఆమె వ్రాసి ఇచ్చిన ఉత్తరాలను ప్రతిరోజు ఒకటి చదువుతుండేవాడిని.

మా స్టీమరు మద్రాసు ఓడరేవును చేరుకోవటం నా జీవితంలో ఆనందకరమయిన క్షణాల్లో ఒకటి. మా కోసం ఆనందరావు దంపతులు, వారి కుమార్తెలు పూలహారాలతో మాకు స్వాగతం పలకడానికి ఎదురుచూస్తుండటం చూచి ఆనందించాను. ఆత్మారామ్ తల్లిగారు రత్నమ్మ గారు కూడా రాజమండ్రి నుండి మా కోసం వచ్చారు. తన బిడ్డను చూసుకోవడానికి. ఆత్మారామ్ లాంటి చిన్న పిల్లవాడు అమెరికా దేశానికి వెళ్ళిరావడమే కాకుండా ఫిలడెల్ఫియా లాంటి గొప్ప నగరంలో చదువుకోవడం అనేది భగవంతుని అనుగ్రహమే కాకుండా అది చాలా గొప్ప అవకాశం. అతనికి భగవంతుని అనుగ్రహం బాగా ఉంది. అమెరికాలో బాగా ప్రసిద్ధి చెందిన చర్చిల్లో నేను ప్రసంగాలు చేసేటప్పుడు ఆత్మారామ్ భారతీయ సంప్రదాయసిద్ధమైన ప్రార్థనా గీతాలను ముందుగా ఆలపించేవాడు. అక్కడ సమావేశమయిన సత్యాన్వేషకులు అతని ప్రార్థనా గీతాలు విని చాలా ఆనందించేవారు. చాలా రోజుల దూర ప్రయాణం తర్వాత మేము క్షేమంగా మద్రాసు చేరుకున్నాము. ఆనందరావు, కమలాదేవి దంపతులు మరియు వారి ఇద్దరు కుమార్తెలు శాంతి ఆశ్రమానికి చాలా పాత భక్తులు, శ్రేయోభిలాషులు. మేము వారింట్లోనే ఉన్నాము. ప్రతి రోజు భజనలు, సంకీర్తనలతో వారి ఇల్లు భక్తులతో కళకళలాడుతుండేది. మేము చాలా రోజులు స్టీమరులో ప్రయాణం చేసి రావటం వలన నేల మీద నడిచేటప్పుడు

కూడా సముద్రంలో స్టీమరులో ప్రయాణం చేస్తున్నట్లుగా, ఊగిపోతున్నట్లుగా అనిపించడం వింతగా అనిపించేది.

మేము మద్రాసులో చాలా కొద్ది రోజులే ఉన్నప్పటికీ నాకు బాగా గుర్తుంది. బహిరంగ సమావేశాల్లో నా ప్రసంగాలు కొన్ని ఏర్పాటు చేశారు. అలాగే ప్రతి రోజు వారింట్లో సత్సంగం జరిగేది. ఈనాటికి కూడా ఆనందరావు కమలాదేవి కుటుంబము శాంతి ఆశ్రమాన్ని వారి స్వంత ఆధ్యాత్మిక కేంద్రంగా భావించే ఆదర్శ భక్తులు. నేను నా మొదటి అమెరికా ప్రయాణానికి, ఇప్పటి ప్రయాణానికి వ్యత్యాసాన్ని గమనించినప్పుడు విచిత్రంగా అనిపిస్తుంది. మొదటిసారి నేను అమెరికా నుండి నిస్సహాయస్థితిలో చేతిలో పైసా లేకుండా, ఒంటరిగా తిరిగివచ్చాను. అమెరికా దేశంలో నన్ను అడుగు కూడా పెట్టనివ్వకుండా ఎల్లిస్ ద్వీపంలో ఉంచి, లండన్ నగరం ద్వారా భారతదేశానికి ఓడ గదిలో బంధించి వెనక్కి పంపించారు. కాని నేడు నేను అమెరికా నుండి తిరిగి రాగానే ఘనమయిన స్వాగత సత్కారాలు లభించాయి. భగవంతుని లీలలు ఎంత విచిత్రంగా ఉంటాయి!!

ఓం తత్సత్ ఓం

**అధ్యాయం - 22**

# శాంతి ఆశ్రమానికి తిరిగి రావటం

మేము శాంతి ఆశ్రమానికి చేరుకునేసరికి మాకు స్వాగతం చెప్పటానికి పూలదండలతో అందరూ సిద్ధంగా ఉన్నారు. ఆశ్రమమంతా బాగా అలంకరించారు. ఆశ్రమవాసులు, భక్తులు, వారి పిల్లలు మా కోసం ఎదురుచూస్తూ కనిపించారు. చాలా కాలం తర్వాత మేము తిరిగిరావటం వలన అందరూ చాలా సంతోషంగా ఉన్నారు. అంతేకాదు మేము ఫిలడెల్ఫియా నుండి  బయలుదేరిన రోజు నుండి మరియా వ్రాసిన హృదయాన్ని కదిలించివేసే ప్రేమానురాగాలు వర్షించే ఉత్తరాలన్నీ నా కోసం ఆశ్రమంలో ఎదురు చూస్తున్నాయి.

భగవంతుని అనుగ్రహము వలనా, స్నేహితుల, భక్తుల ప్రార్థనల వలనా శాంతి ఆశ్రమము దినదినాభివృద్ధి చెందసాగింది. మేము ఇంకొక గురుకులాన్ని, వైద్యశాలను, వృద్ధాశ్రమాన్ని ఆశ్రమంలో ప్రారంభించాము. వృద్ధాశ్రమంలో స్త్రీలు, పురుషులు కూడా ఉండేవారు.

ఆశ్రమ నిర్వహణకి నిధులు కావాలి. అలాగే ఆశ్రమానికి వచ్చే భక్తులకు నిస్వార్థంగా సేవలు అందించేందుకు సేవాభావము, భక్తి భావంతో, అంకిత భావంతో పనిచేసేవారు కావాలి. ఆశ్రమంలో ఉండడానికి, శాంతి పొందడానికి ఎంతో దూరం నుండి భక్తులు వస్తుంటారు. మద్రాసులో ఉండే నా స్నేహితులు కొందరికి ఆశ్రమంలో నిధుల కొరత గురించి తెలుసు. అందుకని వారు నన్ను మద్రాసు రమ్మని, అక్కడి వారి ధనవంతులయిన స్నేహితులు, పరిచయస్థులకు పరిచయం చేస్తామని, ఆశ్రమంలో జరుగుతున్న నిస్వార్థ సేవలను గురించి వారికి వివరించి చెపుతామని చెప్పారు.

అందువలన నేను గురుకులంలో చదువుకుంటున్న ఇద్దరు బాలకులను నాతో మద్రాసు తీసుకువెళ్ళాను. ఆశ్రమంలో జరిగే వివిధ కార్యక్రమాల నిర్వహణకు నిధులు చాలా అవసరము.

నేను మద్రాసు విరాళ సేకరణ కోసం వెళ్ళిన సమయంలోనే నన్ను బొబ్బిలి మహారాజు వారిని కలవటానికి తీసుకువెళ్ళడం జరిగింది. మా ఆశ్రమ నిర్వహణ కోసం వారిని అర్థించాలనుకున్నాము. ఆయన ఎంతో పేరు ప్రఖ్యాతులు గడించిన మహారాజు. అంతేకాక ఆయన హిందూయిజం మీద ఎన్నో గ్రంథాలు రచించిన రచయిత కూడా. ఆయన ఎంతో ఓపిగ్గా మేము చెప్పిన విషయాలన్నీ విన్నారు. మా మధ్య ఎంతో ఆసక్తికరమయిన సంభాషణ జరిగింది. అందులో ఆయన నన్ను ఎన్నో రకాల ప్రశ్నలు అడిగారు. ఆయన ఎంతో దయామయుడు. ఆశ్రమానికి భూరి విరాళం ఇచ్చారు. అంతేకాక తప్పకుండా ఆశ్రమాన్ని సందర్శించడానికి వస్తానని వాగ్దానం కూడా చేశారు. అయినా వారు జీవించి ఉండగా ఆశ్రమానికి రాలేకపోయారు. కాని ఎంతో ప్రేమతో, భక్తితో ఆశ్రమానికి లేఖలు వ్రాసేవారు. అందుకు నాకు చాలా సంతోషం వేసింది. ఇదంతా నలభై సంవత్సరాల క్రితం విషయం. ఆయన కుమారుడు బొబ్బిలి సింహాసనాన్ని విజయవంతంగా అధిరోహించి పాలించారు. ఆయన కూడా ఆశ్రమాన్ని దర్శించనే లేదు. ఇప్పుడు వారిద్దరూ సజీవంగా లేరు. కానీ వారిద్దరూ ఎన్నో గొప్ప పనులు చేశారు. భగవంతుని నిర్ణయాలు,

విధి విధానాలు చిత్రంగా ఉంటాయి. బొబ్బిలి సంస్థానానికి చెందిన వారసులను ఆశ్రమానికి మంచి భక్తులుగా మార్చారు. ఈ రోజు ఆశ్రమానికి వారు మంచి శ్రేయోభిలాషులు. బొబ్బిలి వంశం వారు నిర్మించిన మందిరం ఆశ్రమంలో పూజలందు కుంటోంది. అదే భగవాన్ శ్రీ కృష్ణ మందిరము. రెండు సంవత్సరాలు కాలచక్రంలో గతించి పోయాయి. ఇప్పుడు తోటపల్లి కొండలు చాలా పెద్ద ఆశ్రమంగా రూపుదిద్దుకుంది.

అధ్యాయం - 23

# మూడవ పర్యాయము అమెరికా ప్రయాణము, 1928

రోజు రోజుకి ఆశ్రమం అభివృద్ధి పథంలో నడుస్తున్నది. నా అవసరం ఆశ్రమానికి చాలా ఉంది. ఆశ్రమంలో ఎన్నో క్రొత్త కార్యక్రమాలు, నిస్వార్థ సేవలు అందిస్తూ ప్రగతిపథంలో నడవడానికి ఇంతకు ముందు కంటె నా అవసరం మరింత పెరిగింది. అయినప్పటికి మరియామాత ప్రేమపూర్వకమయిన గొప్ప ఆహ్వానాన్ని మన్నించి నేను మళ్ళీ ఇంకొకసారి అమెరికా తీరానికి చేరుకోవాల్సి వచ్చింది. అందువలన నేను శాంతి ఆశ్రమాన్ని, అందులో జరుగుతున్న కార్యక్రమాలను, అక్కడి అంకితభావంతో ఉంటున్న భక్తులను అందరినీ అన్నింటినీ వదలిపెట్టి భారతదేశం వదలి అమెరికాలోని భక్తుల కోసం మళ్ళీ మూడవ పర్యాయం అమెరికా పర్యటన చేశాను. మరియామాత, రాల్ఫ్ సోదరుని వద్దనుండి నిరంతరం వస్తున్న ఉత్తరాలు, టెలిగ్రామ్‌లు మాత్రమే కాకుండా అక్కడి స్నేహితులు, క్యాలిఫోర్నియానుండి కూడా సందేశాలు అందటం వలన అమెరికాలోని నా సొంత యింటికి చేరుకున్నాను. న్యూయార్క్ ఇంకా ఇతర రాష్ట్రాల నుండి కూడా నా సేవలను, సందేశాలను, ప్రవచనాలను కోరి ఆహ్వానాలు అందాయి. మరియామాత నా ప్రయాణానికి అవసరమయిన ఏర్పాట్లు చేసి ఖర్చుల కోసం డబ్బు కూడా పంపించింది.

ఆశ్రమవాసులు, భక్తులు ఇచ్చిన వీడ్కోలు సందేశపత్రం ఆశ్రమంలోని కార్యక్రమాల గురించి తెలియచేస్తోంది. అలాగే సూర్యానంద తయారు చేసిన స్వాగత పత్రం నేను అమెరికా క్షేమంగా చేరుకుని ఆనందంగా స్వాగతం అందుకున్న వైనాన్ని వివరిస్తుంది.

పరమపూజ్య స్వామీజీ ఓంకార్ మహరాజ్, ఇది మీకు ప్రియం కలిగించుగాక! మేము శ్రీ శాంతి ఆశ్రమ సభ్యులము. మీరు మమ్మల్ని వదలి అమెరికా వెళుతున్న సందర్భంగా మీ పవిత్ర సన్నిధికి మా అందరి ప్రణామాలు సమర్పిస్తున్నాము. ఎంతో గౌరవంగా, భక్తి పూర్వకంగా, అత్యంత వినయంగా మా హృదయపూర్వక అభినందనలు తెలుపుతున్నాము.

మీరు మూడవ పర్యాయము అమెరికా దేశానికి వెళ్ళడానికి నిర్ణయించుకున్నారని మీ ద్వారా తెలియగానే మా అందరికీ చాలా బాధ కల్గిన మాట వాస్తవమే అయినప్పటికీ, మీరు మమ్మల్ని కొద్దికాలం మాత్రమే వదలి వెళుతున్నారని అర్థం చేసుకొని, అమెరికా సోదర సోదరీమణులకు వారి కోరిక మేరకు ఆధ్యాత్మిక సందేశాలను, మతసామరస్యాన్ని అందించేందుకు వెళుతున్నందు చేత చాలా ఆనందిస్తున్నాము. గతంలో మీరు అమెరికా వెళ్ళి సంవత్సరం ఆరు నెలలు అక్కడ ఎంతో ప్రేమతో, ఆసక్తితో ఎన్నో కార్యక్రమాలు చేపట్టడం మేము గమనించాము. మాకు తెలుసు మీరు మీ ఆధ్యాత్మిక ప్రవచనాల ద్వారా, ప్రాథమిక ఆదర్శాల ద్వారా, రచనల ద్వారా, ప్రపంచములోని మతాలన్నింటి సారాంశాన్ని, వేదాంత సిద్ధాంతాలను విశ్వవ్యాప్తం గావించారు. సత్యాన్వేషకులందరికీ మీరు సహనము, శాంతి, స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు ప్రసాదించారు.

1926లో మీరు అమెరికా నుండి స్వదేశం క్షేమంగా తిరిగి వచ్చిన అనంతరము మీరు ఎంతో నిస్వార్థ సేవలు అందించారు. ప్రపంచ మానవాళికందరికీ ఆధ్యాత్మిక ఉన్నతిని, నైతికంగా, సామాజికంగా, వ్యక్తిగతంగా మన దేశ ప్రజలందరికీ సేవలు అందించారు. అనేక కార్యక్రమాలు చేపట్టారు. 'మదర్ ఇండియా' అద్భుతమయిన గ్రంథాన్ని ప్రచురించారు. వైద్యశాల, విద్యాలయాలు, పుస్తక ముద్రణాలయము నిర్మాణం జరిగింది. అలాగే రెండు ఆధ్యాత్మిక మాసపత్రికలు 'పీస్' ఇంగ్లీషులో, 'శాంతి' పత్రిక తెలుగులో ప్రచురించారు. ప్రేమ, వెలుగు – అవి జీవితాన్ని అందిస్తాయి. ఆశ్రమంలో తపాలాశాఖ ప్రారంభించారు. ఆశ్రమానికి సరయిన రోడ్లు వేయించారు. శ్రీ శాంతి ఆశ్రమం సహజమయిన ప్రకృతి సౌందర్యంతో అలరారుతుంది. కొండకోనల్లో, అందమయిన ఉద్యానవనాలతో, పెద్ద పెద్ద వృక్ష సంపదతో ఎంతో ప్రశాంతంగా ప్రపంచ వాతావరణానికి దూరంగా ఉంటుంది. మీ నిర్మలమయిన పసిబాలుడి లాంటి ప్రశాంతమయిన వ్యక్తిత్వము, విదేశీయులకు వారి సత్యాన్వేషణ ప్రయత్నాలలో మీరిచ్చే

ప్రేమపూర్వకమైన బాసట, ఎంతో స్ఫూర్తినందించే అత్యంత సహజమయిన మీ వేదాంత ధోరణి, ఆధ్యాత్మికంగా, మతపరంగా వచ్చే అనేక సమస్యలను మీ సహజరీతిలో పరిష్కరించే విధానము, వెలకట్టలేని మీరు చేసిన ప్రయత్నాలు, విదేశాలల్లో అనేక ఆశ్రమ శాఖలను విస్తరింపచేయటం మొదలైన మీ కార్యక్రమాలు మా మనసుల్లో, హృదయంలో ఎంతో గౌరవాన్ని ఇనుమడింపచేశాయి. మీతో కలిసి పనిచేసిన వారందరికీ మీరు సాధించిన ఘనకార్యాలు ఎంతో స్ఫూర్తిని అందిస్తాయి.

అంతేకాకుండా అమెరికాలో లెక్కపెట్టలేనంత మంది అభిమానులు, భక్తులు, సోదర సోదరీమణులు ప్రత్యేకంగా సరస్వతీ దేవి మరియు సూర్యానంద గార్లు మా కోసం ఎంతో ప్రేమాభిమానాలతో బహుమతులు పంపించారు. వారందరికీ మా హృదయపూర్వక ధన్యవాదాలు. వారి సహాయ సహకారాలు, దయాగుణము వలన ఆశ్రమానికి ఎంతో మేలు జరిగింది. మీ పట్ల వారందరికి హృదయపు లోతుల్లోంచి పొంగిపొరిలే ప్రేమాను రాగాలు, భక్తిశ్రద్ధలు గమనించి మేము ఎంతో ఆనందిస్తున్నాము. మీ పట్ల మాకున్న అభిమానాన్ని వివరించడానికి మాకు మాటలు సరిపోవడం లేదు. మేమంతా ఎంతో నమ్మకంగా అమెరికా సోదరులు, భక్తులు మీ ఈ మూడవ ప్రయాణం వలన ఎంతో శాంతిని, ఆధ్యాత్మిక లబ్ధిని పొందగలరని ఆశిస్తున్నాము.

పూజ్య స్వామీజీ! మీరు భగవంతుని ఆశీర్వచనములతో దీర్ఘకాలము జీవించాలని, మంచి ఆరోగ్యంతో ఉండాలని, అప్పుడే మీరు ఎంతో ఉన్నతమయిన మీ గొప్ప ఆశయాలను కార్యరూపంలో పెట్టడానికి అవకాశం దొరుకుతుందని అలాగే తొందరలో మళ్ళీ మీరు భారతదేశానికి తిరిగివచ్చి మాకందరికీ మీ ప్రేమ, శాంతి, ఆనందం, కలిసి పనిచేసే అవకాశం కల్గిస్తారని భావిస్తూ భగవంతుడిని అందులకై ప్రార్థిస్తున్నాము. ఇంతటితో ముగించటానికి మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాము.

మీ అనుచరులు, అభిమానులు అయిన ఆశ్రమవాసులు
శ్రీ శాంతి ఆశ్రమము అనుచరులు, 1928

అక్టోబరులో ఈ వీడ్కోలు పత్రం 'పీస్' పత్రికలో ముద్రించబడింది.

నేను అమెరికా చేరుకోగానే సూర్యానంద నాకు స్వాగత పత్రాన్ని సమర్పించాడు. దానిలో వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

వేలాది మంది భక్తుల కోరిక మేరకు పరమపూజ్య స్వామీజీ శ్రీ ఓంకార్ మహరాజ్ గారు శాంతి ఆశ్రమ వ్యవస్థాపకులు, తోటపల్లి మండలం, భారతదేశంనుండి క్షేమంగా సుదీర్ఘ ప్రయాణం చేసి మన అమెరికా దేశానికి చేరుకున్నందుకు చాలా సంతోషం. వారు అమెరికాను సందర్శించటము ఇది మూడవ పర్యాయము. స్వామీజీ ఎస్ఎస్ సిటి ఆఫ్ బరోడా అనే స్టీమరులో శుక్రవారం 26వ తేదీన 1928వ సంవత్సరంలో బోస్టన్ పట్టణానికి చేరుకున్నారు. అక్కడి నుండి మేము న్యూయార్క్ మీదుగా ప్రయాణించి మరియా ఆశ్రమానికి ఫిలడెల్ఫియా చేరుకున్నాము. బోస్టన్ నుండి 300 మైళ్ళు రైలులో ప్రయాణించి అదే రోజు రాత్రి 10.30 ని॥లకు వచ్చాము. మళ్ళీ స్వామీజీని కలుసుకోవటం చాలా సంతోషకరమైన వార్త. అమెరికాలోని భక్తులు అందరికీ ఇది చాలా ఆనందాన్ని కలిగిస్తుంది.

పూజ్య స్వామీజీ స్టీమరు దిగి వస్తుంటే అందులో పనిచేసే ఆఫీసర్లు అందరూ ఎంతో గౌరవంతో స్వామీజీకి వీడ్కోలు చెప్పి, వారి ఆశయం సంపూర్ణంగా నెరవేరాలని కోరుకున్నారు. వారందరూ ఆయన్ని ఎంతగానో ప్రేమించారు. స్వామీజీ సన్నిధిలో కొంతకాలం గడిపిన వారు ఎవరయినా వారి వద్ద నుండి వచ్చే ఆధ్యాత్మిక తరంగాల ప్రసారం నుండి తప్పించుకోలేరు. ఆ దివ్యానుభూతి వారిని అంత తొందరగా మామూలు ప్రాపంచిక స్థితిలోనికి వెళ్ళనీయదు. వారిని మర్చిపోలేరు.

ప్రపంచంలో ఎవరయినా అత్యున్నతమయిన ఆధ్యాత్మిక శిఖరాలను అధిరోహించారంటే అది కేవలం స్వామీజీ మాత్రమే. అమెరికాలో ఆయన రాక కోసం ఎంతో మంది ఎదురుచూస్తున్నారు. వారిని కలవడానికి ఎంతో ఓపిగ్గా చాలా కాలం నుండి ఎదురుతెన్నులు కాస్తున్నారు. మన కోసం స్వామీజీ చేసిన త్యాగము, వారింత దూరం మన ఆత్మోన్నతి కోసం వచ్చి మనకు సేవ చేసేందుకు, విశ్వశాంతిని, సత్యాన్ని అందించి మనలను ధన్యులను చేసేందుకు వచ్చినందుకు వారికి ధన్యవాదాలు. ఆయన సన్నిధిలో కూర్చుని వారు చేసే ప్రబోధాలు విన్నవారిపై వారి ప్రభావం తప్పకుండా పడుతుంది. ఆత్మసాక్షాత్కారము పొందిన మహనీయులు వారు. రూపం దాల్చిన జ్ఞాన స్వరూపమే వారు. మనమందరము భారతదేశంలోని పవిత్ర ఆత్మ స్వరూపులయిన సోదర సోదరీమణులకు ధన్యవాదాలు తెలియచేసుకోవాలని అనుకుంటున్నాను. వారి వల్లనే పూజ్య స్వామీజీ వారి మాతృదేశాన్ని వదలిపెట్టి మళ్ళీ అమెరికా రాగలిగారు.

వారి త్యాగం ద్వారా, సోదర ప్రేమ ద్వారా తూర్పు పడమరల మధ్య పటిష్ఠమైన అనుబంధం, ప్రేమానురాగాలు బలపడినాయి. విశ్వప్రేమ, సహనము, ప్రేమ ద్వారా ఇది సాధ్యపడింది. ఈ విశ్వశాంతి మహాయజ్ఞంలో పాలుపంచుకోవాలని ఆశించేవారు భారతదేశంలోని శ్రీ శాంతి ఆశ్రమము లేదా అమెరికాలోని మరియా ఆశ్రమం ఫిలడెల్ఫియా వారి ఆహ్వానాన్ని అందుకోవచ్చు. ఈ రెండు ఆశ్రమాలు అనుబంధ సంస్థలే కనుక ఎవరికయినా ఉత్తర ప్రత్యుత్తరాలు వ్రాయవచ్చును.

సూర్యానంద, సెక్రటరి, శ్రీ మరియా ఆశ్రమము.

**అధ్యాయం - 24**

# ప్రకృతి సందర్శనానికై విహారయాత్ర

అంతర్వాణి పిలుపునందుకొని, అది చెప్పినట్లుగా నడుచుకునే వారికి స్వేచ్ఛ లభిస్తుంది. నాగరిక ప్రపంచపు గుంపుల్లో తిరిగేవాళ్ళకి, ఆధునికత వ్యామోహంలో చిక్కుకుపోయి అలాగే ప్రవర్తించేవారికి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లభించవు. ఎవరయితే నిరాడంబరంగా, పవిత్రంగా జీవిస్తారో వారికి భగవంతుని ఆశీర్వచనాలు లభిస్తాయి.

ఒకరోజు విపరీతంగా వర్షం కురుస్తోంది. నాకు అప్పుడు బయటికి వెళ్ళి వీథుల్లో, ఫిలడెల్ఫియాలోని ఉద్యానవనాల్లో స్వేచ్ఛగా, హాయిగా తిరిగి రావాలి అనిపించింది. ఒక దేశదిమ్మరిలాగా నా గతాన్ని మర్చిపోయి, భవిష్యత్తును గురించిన ఆలోచనలు కొంచమయినా లేకుండా స్వేచ్ఛగా తిరగాలనిపిస్తోంది. ఈ క్షణంలో జీవించే వారే ఆ ఆనందాన్ని అనుభవించగలరు. ఒక్కో సమయంలో అన్ని బాధ్యతలు, కర్తవ్యాలు, పనులు వదలిపెట్టి స్వేచ్ఛగా, ఎలాంటి బాదరబందీ లేకుండా కొద్దిసేపు గడపాలనిపిస్తోంది.

ఆ రోజు బాగా మబ్బులు పట్టి ఆకాశం వెలుతురు లేకుండా ఉంది. సూర్యుడు మబ్బుల చాటున కనుమరుగయిపోయాడు. కాని నా హృదయంలో సూర్యుడు దేదీప్యమానంగా ప్రకాశిస్తున్నాడు. నేను బయటికి వెళ్ళి ప్రకృతి ఒడిలో గడపాలను కున్నాను. అయితే ప్రకృతి భయానకంగా నా కోరికకి విరుద్ధంగా విపరీతమయిన వర్షం కురిపిస్తోంది. కానీ నా ఆత్మని ఇంటి గది గోడలు బంధించలేకపోయాయి. నేను స్వేచ్ఛగా

బయటి వాతావరణంలో తిరిగి రావాలనుకున్నాను. నా పాత కోటు, బూట్లు, తలపై టోపీ ధరించి బయట పడ్డాను. నా జేబుల నిండా బాదం పప్పులు, వేరుశనగ పప్పులు నింపుకొని వాటిని తింటూ వర్షంలో తడుస్తూ రోడ్లు వెంట నడవసాగాను. చిన్నపిల్లాడిలా నా మనస్సు ఆనందంగా ఉంది. ఆ వర్షంలో తడుస్తూ ఆనందంతో పాటలు కూడా పాడాను.

**ఈ వర్షం నా కోసం కురవటం లేదు డాఫడిల్స్ కోసం కురుస్తోంది**
**ఈ వర్షం నా కోసం కురవటం లేదు రోజాపూల కోసం కురుస్తోంది**

ఓ! ఎవరు వర్ణించగలరు? ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించడంలో ఎంత దివ్యత్వం ఉంది! నేను అలా ఎన్నో వీథుల్లో తిరుగుతూ నడుస్తూ చివరికి జార్జి కొండపైనున్న ఫెయిర్‌మౌంట్ పార్కు చేరుకున్నాను. నా విహారయాత్రని పూర్తి చేయడానికి ఒక ఐస్‌క్రీమ్ కొనుక్కొని ఆ వర్షంలోనే తిన్నాను. తర్వాత కొండమీదికి మెట్ల మీదుగా ఎక్కేటప్పుడు ఓంకారాన్ని జపిస్తూ ప్రతి మెట్టు ఎక్కాను.

నా ఆనందానికి హద్దులు లేకుండా ఉంది. నేను ఒక్కడినే ప్రకృతిలో లీనమయిపోయాను. ఎంతో ప్రేమతో నా చుట్టూ ఉన్న ప్రకృతి సౌందర్యాన్ని తిలకిస్తూ కళ్ళ వెంట నీరు కార్చాను. నడక దారిలో ఒక చిన్న పురుగు నెమ్మదిగా ప్రాకుతూ వస్తోంది. ఎవరయినా దాన్ని తొక్కుతారనిపించి నెమ్మదిగా ఆ సోదరుడిని పక్కనున్న గడ్డిలో వదలిపెట్టాను. అందరి జీవితాలు ఒక్కటే కదా! ప్రకృతిని ఆరాధించాలి, అంటే విశ్వంలోని ప్రతి జీవిని ప్రేమించగలగాలి. దేవదూత అయినా, మానవుడు అయినా చిన్న పురుగు అయినా అంతా సమానమే కదా! బయట వర్షం ధారాపాతంగా కురుస్తోంది. నా అంతరంగంలో శాంతి వర్షం వర్షిస్తోంది.

అలా తిరుగుతుండగా ఒక అందమయిన చెట్టు క్రింద కూర్చోవడానికి బల్ల కనబడింది. వర్షం వలన అది బాగా తడిసిపోయి ఉంది. నాకు దాని మీద కూర్చొని నా మధ్యాహ్న భోజనము చేయాలని కోరిక కలిగింది. దాన్ని నేను ఆపుకోలేకపోతున్నాను. నా చేతి రుమాలు ఆ బల్లపై పరుచుకొని హాయిగా కూర్చుని ఆనందంగా నా జేబులు ఖాళీ చేశాను. మహాద్భుతమయిన శాంతి తరంగాలు నా హృదయం నిండా, నా చుట్టూ పరచుకున్నాయి. భగవంతుని దయ నా మీద వర్షిస్తోంది.

పక్షులు కిలకిలరావాలు చేస్తూ నా కోసమే పాడుతున్నట్లుగా ఉంది. అక్కడ అందమయిన పుష్పాలు నా కోసమే వికసించాయి అనిపిస్తోంది. చల్లని పిల్లగాలులు నా కోసమే వీస్తున్నట్లుగా ఉంది. కేవలం నా కోసమే వర్షం చిరుజల్లులు కురిపిస్తుంటే పుష్పాలు ఆనందంగా తలలూపుతున్నాయి. నిజంగా స్వర్గలోకంలో ఉన్నట్లుగా భావన కలిగింది. నెమ్మదిగా నేను బాహ్య స్మృతి కోల్పోయాను. నేను నా కాళ్ళు చేతులు కదిలించడానికి ప్రయత్నించాను కాని ప్రపంచ స్థితి కల్గలేదు. కాని లెక్కలేనన్ని గడ్డిపోచలు లాగా మానవుని జీవితం కూడా అలాగే తృణప్రాయం కదా అనిపించింది. నామరూపాలు కనుమరుగయిపోయాయి. మానవుని గొప్పతనము ఏముంది ఈ సృష్టిలో? గడ్డిపోచకి, పుష్పాలకి సృష్టిలోని ఇతర జీవులకి ఏ విధంగా వినాశనం సంభవిస్తుందో, మానవుని భౌతిక జీవితం కూడా అలాగే అంతమవుతుంది. జీవుడు తన నీడ వెంట పరుగెత్తి పరుగెత్తి దివ్య జీవనానికి దూరమయిపోతున్నాడు. నాకు ఆ గడ్డి మీద కాలుపెట్టాలంటే కూడా బాధగా అనిపిస్తోంది. ఎందుకంటే సృష్టిలోని ప్రతి అణువులో నేను ఏకత్వాన్ని అనుభవిస్తున్నాను. అలాంటి భావ రహిత స్థితిలో చాలాసేపుండిపోయాను. తెలియకుండానే నా మనస్సు పలుకుతోంది. "ప్రియమయిన గడ్డిపోచల్లారా! హాయిగా జీవించండి. సున్నితమయిన పుష్పాలు ఆనందంగా వికసించాలి. నన్ను సృష్టించిన భగవంతుడే మిమ్మల్ని కూడా సృష్టించాడు. ఆయనే అందరికీ జీవనాధారం. అందుచేత నేను నీ మీద కాలు కూడా పెట్టలేను? ఓ గడ్డిపరకా! హాయిగా, ఆనందంగా జీవించండి నా అమూల్యమయిన మిత్రులారా!"

కొంతసేపటికి నేను మామూలు స్థితికి వచ్చాను. నెమ్మదిగా ఆ పార్కులో రహదారి వెంట నడుస్తూ వస్తుండగా ఒక చోట ఒక వ్యక్తి దిగాలుగా నిలుచుని తన కారు వంక చూస్తుండటం గమనించాను. అతని కారు టైరు పంక్చర్ పడింది. రెండవదికూడా లేకపోవడం వలన ఏమి చేయాలో దిక్కుతోచక ఆకాశం వంక చూస్తూ దిగాలుగా ఉన్నాడు. అతనికి శాంతి కల్గుగాక!

ప్రతిరోజూ యథావిధిగా ప్రారంభమవుతుంది. రోజు గడిచి ముగిసిపోతుంది. మానవుని జీవితంలో ఎప్పుడు, ఏ నిముషంలో ఏమి జరుగుతుందో తెలియదు. అది తామరాకు మీద నీటి బిందువులాగా అనిశ్చితంగా, అస్థిరంగా ఉంటుంది. అయినా దాన్ని గ్రహించలేని మానవుడు ఎండమావుల వెంట పరుగెత్తినట్లుగా భౌతిక సుఖాల

కోసం తన నీడ వెంట తానే పరుగెత్తుతాడు తప్ప ఎన్నటికీ శాంతిని పొందలేడు. కేవలం కొద్ది మంది మాత్రమే పరమాత్మ గురించి పరితపిస్తారు. అలాంటి వారికే మనశ్శాంతి దొరుకుతుందని గ్రహించాలి.

నేను ఆ ఉద్యానవనంలో అలాగే తడుస్తూ వ్యవసాయ ప్రాంతంలోకి వచ్చేసరికి బాగా అలసిపోయి ఒక బల్లపై కూర్చుండిపోయాను. కనుచూపుమేర చాలా ఆహ్లాదకరంగా అందంగా ఉంది. గుత్తులుగా వ్రేలాడుతున్న అందమైన పుష్పాలు ప్రధాన ద్వారానికి ఇరువైపులా బాగా పెరిగిన అందమయిన చెట్లు, మధ్యలో నీటి కొలనులు, వాటిలో తామరమొగ్గలు ఎంతో అందంగా తీర్చిదిద్దారు ఆ ఉద్యానవనాన్ని. అక్కడక్కడా చాలా అందమైన శిల్పాలు, చుట్టూ పచ్చని తివాచీ పరచినట్లుగా అందమైన గడ్డి లాన్ ఉంది.

అవన్నీ చూస్తున్న నా మనస్సు సంతోషంతో, ఆనందంతో స్వర్గలోకంలో ఉన్నట్లుగా తేలిపోసాగింది. ఇంకా వర్షం కురుస్తూనే ఉంది. అప్పుడప్పుడు పక్షులు తీయని, మధురమైన సవ్వడులు చేస్తున్నాయి. స్వేచ్ఛగా, హాయిగా ఎగురుతున్నాయి. రాజులు, చక్రవర్తులు కూడా పొందలేనటువంటి ఆనందాన్ని పొందుతున్నాను నేను. అసలు ప్రపంచంలో అందరి కంటే సంతోషంగా ఉండే వ్యక్తి ఎవరు? అది తప్పకుండా 'నేనే'. ఇక్కడ నేను అంటే వ్యక్తిగతమైన నేను కాదు. అది విశ్వానికి చెందిన 'నేను'. ఆ నేను అనేది పరిమితులు లేనిది. అంతటా నిండి ఉండేది. నామరూపాలు లేనటువంటిది. అది లోపలా, బయటా కూడా నిండి నిబిడీకృతమై ఉంది. చిన్న గడ్డిపరక మొదలుకొని మహా వృక్షానికి భేదము లేకుండా సృష్టి అంతా ఒక్కటై ఉంది. దానికి అంతము లేదు.

నా శరీరం చాలా తేలిగ్గా, హాయిగా ఉంది. అసలు నాకు భౌతిక శరీరం లేనట్లుగా ఉంది. నా భౌతిక శరీరం స్పృహలేని స్థితిని నిర్ధారించుకోవడానికి నా వైపు నేను చూసుకున్నాను. నా శరీరంపైన పెద్ద కోటు ఉంది. ఇప్పుడు నాకు ఆ దుస్తుల పట్ల కూడా స్పృహ లేదు. శరీరానికి దుస్తులు ఏ విధంగా ఒక తొడుగులాగా ఉందో, నా ఆత్మకు కూడా ఈ శరీరం ఆ విధంగా ఒక తొడుగులాంటిదని అర్థమయింది. నా శరీరము దానిపైన వేసుకున్న దుస్తులు నాకు చెందుతాయి, కాని వాటితో నాకు ఎలాంటి సంబంధము లేదు. ఇలాంటి విచిత్రమైన స్థితిలో చాలాసేపుండి పోయాను.

అలాంటి భావాతీత స్థితిలో శరీరస్థితి తెలియకుండా నిర్వికల్ప సమాధి స్థితిలో ఆనందంలో మునిగి తేలుతూ ఎంతకాలం గడచిపోయిందో తెలియకుండా అంతర్ముఖ స్థితిలో ఉండిపోయాను. నాకు నేను జీవిస్తున్న సత్యంలాగా భావిస్తున్నాను. స్వర్గలోకపు తండ్రికి నాకు అబేధాన్ని పొందాను. నేను నా కుడి ప్రక్కకు తిరిగి చూచాను. సింహాసనాన్ని అధిష్ఠించి క్రీస్తు భగవానుడు దర్శనమిచ్చాడు. కాని ఆయన అక్కడ లేరు. నేను నా హృదయంలో ఆయన సన్నిధిని దర్శిస్తున్నాను. పవిత్రమయిన అంతరంగంలోనే భగవంతుడు స్థిర నివాసం ఏర్పరచుకుంటాడు. అంతేకాని వేరే ఎక్కడో స్వర్గంలో భగవంతుడి నివాసం ఉండదు కదా!

నెమ్మదిగా నా ఊపిరి తగ్గిపోతూ వచ్చి చివరికి నిశ్చలస్థితిని పొందింది. అలాంటి శ్వాసరహిత స్థితిలో ప్రతి శ్వాస ఒక క్రొత్త జీవితం లాగా అనిపించింది. ఎంత గొప్ప ఆలోచన?! ప్రతి శ్వాస ఒక క్రొత్త జీవితానికి పునాది. నిజంగా ఎంతో విలువయిన జీవితాన్ని మనం సద్వినియోగం చేసుకుంటున్నామా? మనం ఎంతో జాగ్రత్తగా ప్రతి పవిత్రమయిన శ్వాసని ఒక జన్మగా భావించాలి. నేను ఇంకా ఇంకా గాఢమయిన అంతర్ముఖ స్థితిలో ఈ సృష్టి అంతా పవిత్రమయిన శ్వాస ద్వారా నేను సృజించినట్లుగా తెలుసుకున్నాను. ఎవరికి అర్థమవుతుంది ఆత్మసాక్షాత్కారము పొందిన పవిత్రాత్ముని అనుభవం ఎలా ఉంటుందో? లోతులకు వెళ్ళేకొద్దీ, అంతర్ముఖ సమాధి స్థితిలో సృష్టి రహస్యాలు ఎన్నో బహిర్గతమవుతాయి. ఎవరికయితే భగవత్సంబంధం ఉంటుందో వారికి మాత్రమే ఈ రహస్యాలు అర్థమవుతాయి. ప్రతి శ్వాస ఒక పునర్జన్మ. ప్రతి గుండె చప్పుడు ఒక నూతన సృష్టి. ఇది పవిత్రాత్మ పాడుతున్న గీతంలా అనిపించింది.

వర్షం నెమ్మదిగా తగ్గిపోయింది. సూర్యుడు మబ్బుల చాటు నుండి బయటపడి తన ప్రకాశాన్ని ప్రసరించసాగాడు. నేనింకా ఆ దివ్యానుభూతి నుండి బయటికి రాలేదు. సూర్య భగవానుడు తన లేత కిరణాలతో సమస్తాన్ని ప్రకాశింప చేస్తున్నాడు. ఆ లేలేత సూర్యకిరణాలలో స్నానమాడుతూ నేనింకా ఆ మధురానుభూతిలో తేలియాడ సాగాను. గొప్పతనమంతా పరమాత్మునిదే. నేను అతి ప్రయత్నం మీద నా చేతులను చాచి భగవాన్ క్రీస్తును కీర్తించసాగాను. అంతా నాకే తెలియని అతీతస్థితిలో ఉన్నాను.

రోజంతా గడిచిపోయింది. సూర్యాస్తమయం అయింది. నెమ్మదిగా చీకట్లు ముసురు కుంటున్నాయి. ఉద్యానవనాన్ని కాపలాకాచే వాళ్ళు అందరినీ బయటికి పంపించి వేసి

తలుపులు వేయడానికి సిద్ధపడుతున్నారు. అందువలన నేను మరొక్కసారి ఉద్యానవనం లోపలికి వెళ్ళి ఆ సుందర దృశ్యాలను తనివితీరా వీక్షించాను. అందమైన పూలను, చెట్లను ప్రేమతో ముద్దాడాను. లతలను పెనవేసుకున్నాను, ఎత్తైన వృక్షాలను చూస్తుండిపోయాను. అక్కడి గాజు తొట్టెలోని చేపలకు తలవంచి నమస్కరించాను. ఈ మూగ జీవాలు, వృక్షాలు మనుష్యుల హృదయాలతో ఏ విధంగా మాట్లాడుతాయి. వాటి భావాలను మానవులు ఎలా అర్థం చేసుకుంటారు. వాటికి కళ్ళుంటాయి కాని చూడలేవు. చెవులుంటాయి కాని వినలేవు, ప్రకృతిని మానవుడు ప్రేమించి ఆరాధించి నప్పుడే అతడు నిజంగా జీవించి ఉన్నట్లు, లేదా మరణించిన వాడితో సమానమే అవుతాడు.

అందువలన నేను ప్రకృతిలో లీనమయిపోయి దానితో తాదాత్మ్యం చెంది నా హృదయంలోకి భావాలను చెట్లతో, లతలతో, పుష్పాలతో పంచుకుంటున్నాను. అలాగే అవి ఆనందంగా తలలూపుతూ నాతో మాట్లాడుతున్నట్లే ఉంది. బయటికి వచ్చేముందు మళ్ళీ అదే బల్ల మీద కూర్చుని కాసేపు ఆ ఉద్యానవన సౌందర్యాన్ని తిలకించి ముగ్ధుడినయి పోయాను. ఎంతో పొడవయిన నీడ నిచ్చే ఆ వృక్షాలు నావి కావా? ఈ అందమయిన పుష్పాలు నా ప్రేమకు ప్రతిరూపం కాదా? భూమి, ఆకాశం, నక్షత్రాలు ఇంకా ఇతరాలన్నీ నాకు మాత్రమే చెందుతాయి. అసలు నాది కానిది అంటూ ఏమీ లేదు. ఎవరికి ధైర్యం ఉంది ఈ నా ఆనందానికి అడ్డుపడడానికి? ఎవరయినా వీటినుండి నన్ను వేరు చేయగలరా? ఈ ప్రపంచమంతా నా సొంత కుటుంబమే. అందులో నివసించే వారందరూ నాకు సోదరసోదరీమణులు. వారిని ప్రేమించి, వారందరికి సేవ చేయటమే నా మతము.

ఇది ఎంతో గొప్ప ఆశీర్వాదము. నా ప్రతి శ్వాసలో నేను భగవంతుని ఉనికిని గుర్తించగలుగుతున్నాను. ప్రతి శ్వాస పునర్జన్మ. నా జేబులో ఒక ప్రియ సోదరి వ్రాసిన ఒక కవిత ఉందని గుర్తు వచ్చి, దానిని బయటికి తీసి చదవటం మొదలుపెట్టాను.

## కవిత – 1

**నా మీద శ్వాస నిలుపు, అది భగవంతుని శ్వాస అవుతుంది**
**మా ఉనికిని మేము పూర్తిగా కోల్పోయి, భౌతికమయిన**
**ఆవరణలు నశించి ఈశ్వరుడి దివ్యజ్యోతిలో ప్రకాశించేదాకా**

**మా మీద శ్వాస నిలుపు, అది భగవంతుని శ్వాస అవుతుంది**
**మాలో నూతన జీవితాన్ని ప్రవేశపెట్టు**
**అప్పుడు మేము కూడా ఈశ్వరుడి వలే ప్రేమించగల్గుతాము**
**ఈశ్వరుడు చేసే పనులు చేయగల్గుతాము**
**మా మీద శ్వాస నిలుపు. అది భగవంతుని శ్వాస అవుతుంది**
**దాని వలన మాకు మరణం అనేది ఉండదు**
**కాని ఈశ్వరుడితో కల్సి యదార్థమయిన జీవితాన్ని**
**గడుపుతూ అమరత్వాన్ని పొందుతాము**

అది చదివిన తర్వాత నాకు ఎంతో ఆత్మానందం కలిగింది. నా ప్రతి శ్వాసలో దివ్యత్వం నిండిపోయింది. బాగా చీకటి పడిపోయింది. వర్షం బాగా కురవసాగింది. నాకు అక్కడి నుండి కదలాలి అనిపించడం లేదు. కాని తప్పక అక్కడి నుండి లేచి నెమ్మదిగా నడుచుకుంటూ ఇంటిదారి పట్టాను. దారిలో అందరిలో ఏకత్వాన్ని భావిస్తూ, అందరిలో నా ప్రియమయిన ముఖాలను దర్శిస్తూ ఇంటికి చేరుకున్నాను. తడిసిపోయిన బట్టలు మార్చుకొని, నా మంచంపై పడుకున్నాను. కాని ఇంకా నేను ఆనందమయ స్థితిలో ఉండిపోయి, మనస్సు నిండా కోటి సూర్యుల తేజస్సును దర్శిస్తూ నిద్రలోకి జారిపోయాను.

**అధ్యాయం - 25**

# రోసిక్రూషియన్ లాడ్జి సందర్శనం

మళ్ళీ నేను మరియమాత ఆశ్రమానికి వెళ్ళినందుకు చాలా సంతోషించాను. మరియా అమ్మ ఆనందానికి అంతులేదు. మేమిద్దరము ఆమె పవిత్రమయిన పూజా మందిరంలో కలుసుకుని ఆనందబాష్పాలు కార్చాము. నిశ్శబ్దంగా చాలా గాఢమయిన ధ్యానంలో కూర్చుని చాలా కాలం తర్వాత అమెరికా క్షేమంగా చేర్చినందుకు, మమ్మల్ని ఇద్దరినీ కలిపినందుకు భగవంతునికి ధన్యవాదాలు తెల్పుకున్నాము. పడమర దేశంలోని భగవంతుని బిడ్డలందరికి సేవలందించేందుకు మాకు శక్తిని ఇమ్మని ప్రార్థించాము.



అమెరికాలోని శాంతి కేంద్రములు భక్తులు

ఖాళీ కుర్చీ ఎక్కువ రోజులు అలాగే ఉండదు. ప్రపంచము క్రొత్త జీవితానికి నాంది పలుకుతుంది. అందమయిన నక్షత్రాలు గగన వీథిలో మళ్ళీ తళుక్కుమంటున్నాయి. సూర్యోదయం, సూర్యాస్తమయం మళ్ళీ వెలుగులు వెదజల్లుతున్నాయి. ఎండిపోయిన రోజా తోట మళ్ళీ చిగురించి, మొగ్గ తొడిగి వికసించింది. ఆ ఇంట్లో నా రాకతో మళ్ళీ పవిత్రమయిన ఓంకారనాదము వినిపించసాగింది. వాతావరణము ఆధ్యాత్మిక సౌరభాలను వెదజల్ల సాగింది. మరియా ఆశ్రమము నుండి ఫిలడెల్ఫియా నగరానికి, అక్కడి నుండి అమెరికాలోని దగ్గర, దూరపు భక్తులందరికి ఆ సౌరభాలు అందసాగాయి.

నేను ఎప్పుడూ చెపుతూనే ఉంటాను. వ్యక్తిగతమయిన ప్రశాంతత మాత్రమే విశ్వశాంతికి దారితీస్తుందని, ముందుగా మనమందరము మన హృదయాలను శాంతితో నింపుకోవాలి. అప్పుడే అది సహజంగా అందరి హృదయాలను శాంతితో నింపుతుంది. దగ్గరలోని వారికి, దూరంగా ఉంటున్న వారి వద్దకు కూడా అది ప్రవహిస్తుంది. ఏ విధంగా సువాసనలు వెదజల్లే పుష్పాలు ఆ పరిమళాలను అందరికి పంచినట్లుగా నక్షత్రాల కాంతి అందరికి మార్గదర్శనం చేసినట్లుగా ఒక్కరి హృదయంలోని శాంతి అందరి హృదయాలను చేరుకుంటుంది. దీనికై ప్రతిదినము ఆధ్యాత్మిక దినచర్య డైరి వ్రాయటం అత్యంత ఆవశ్యకమని నేను ఎప్పుడూ చెపుతుంటాను. కాని మాయ మానవుడిని ఆడిస్తుంది. అందుకే అతడు ఏవయితే అనిత్యము, అసత్యము అయిన వాటి పట్ల ఆకర్షించబడి వాటికి చాలా విలువ ఇస్తుంటాడు. కాని ఏదయితే సత్యమో, ఏది నిత్యమయినదో, మానవజన్మ సార్థకత, గమ్యము అయిన ఆత్మసాక్షాత్కారము పట్ల ఆసక్తి చూపించడు. వీటన్నింటికన్నా నాకు చాలా బాధ కలిగించే విషయం ఏమిటంటే, మానవుడు తాను దేనినయితే పొందాలని ఆశిస్తాడో దానికి తగిన మూల్యాన్ని చెల్లించడానికి సిద్ధంగా లేడు. అతనికి భగవంతుడు కావాలి, ఆత్మ సాక్షాత్కారం ఇప్పుడు, ఇక్కడే పొందాలని ఉవ్విళ్ళూరుతుంటాడు. కాని అతను పరమాత్మునికి శరణాగతి చెందాలని, తన్ను తాను భగవంతునికి అర్పించుకోవాలని తెలియటం లేదు. ఎంత అర్థరహితమైన విషయమిది!?

ప్రపంచస్థితిని అర్థం చేసుకోవటం నిజానికి చాలా తేలిక. సైన్సు పరంగా ఆలోచించినా, ఆధ్యాత్మికంగా చూచినా ఒకే రకంగా ఉంటుంది. విత్తనాలు భూమిలో నాటితే, మొక్కలు పెరిగి పెద్దవయి, పూలు, కాయలు నెమ్మదిగా పండ్లుగా మారినట్లుగా



మానవుని విషయంలో కూడా అదే పద్ధతి వర్తిస్తుంది. ఆస్తికులయినా, నాస్తికులయినా అందరికీ ఒక్కటే వర్తిస్తుంది. ఎంత తొందరగా మంచి బీజాలు పడతాయో అంత మంచి భవిష్యత్తు ఉంటుంది. అది పూర్వజన్మ సుకృతం వలన గాని, లేదా గత జన్మల కర్మానుసారంగా గాని అలాగే ఈ జన్మలో చేస్తున్న మంచి పనుల వల్ల గాని, నేను చాలా చిన్న పిల్లవాడిగా ఉన్నప్పటి నుండి ఆధ్యాత్మిక దినచర్య డైరీ వ్రాయటం అలవాటు చేసుకున్నాను. అది పరమాత్మ అనుగ్రహం. నేను విదేశీ పర్యటనలు చేసినప్పుడు వ్రాసుకున్న దినచర్య డైరీలు నాకే ఇప్పుడు నా ఆత్మకథ వ్రాయడానికి ఎంతో ఉపయోగపడ్డాయి. యాభై సంవత్సరాలు డైరీల్లోని పేజీలన్నీ తిరగవేసి, పాత సంఘటనలన్నీ తవ్వి తీసి ఆత్మకథ వ్రాయటం కొద్దిగా కష్టంగానే ఉంది.

నేను మళ్ళీ అమెరికా తిరిగి వచ్చాను అని తెలుసుకున్న నా పాత భక్తులు, స్నేహితులు, అభిమానులు ఉత్తర ప్రత్యుత్తరాలు వ్రాయటం మొదలుపెట్టారు. చాలా మంది ధ్యాన తరగతులకు, ఆధ్యాత్మిక సాధనలు చేసుకునేందుకు వస్తుండేవారు. కొద్ది మంది చాలా దూరం నుండి రావటం వలన హోటళ్లలో ఉండేవారు. అందులో కొందరు వాషింగ్టన్ నుండి వచ్చారు. రోషిక్రూషియన్ లాడ్జిలో నా ప్రవచనము కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి. నాకు ఎంతో ఇష్టమయిన విషయం 'ధ్యానం' గురించి వచనము చేయమని ఆహ్వానించటం ఎంతో ఆనందంగా అనిపించింది.

నేను వాషింగ్టన్ లోని రోసిక్రూషియన్ లాడ్జిని సందర్శించిన సందర్భంలో ఆ సంస్థ అనుచరులు వాళ్ళ పద్ధతిలో పవిత్రమయిన ఉపాసనా విధానాన్ని నిర్వహించారు. అది నాకు తూర్పు దేశాల్లోని దేవాలయాల్లో నిర్వహించే పవిత్రమయిన పూజావిధానాన్ని గుర్తుకు తెచ్చింది. మనము పరమాత్మకు పుష్పాలు సమర్పించి, దీపం వెలిగించి, అగరుబత్తి కడ్డీల ధూపాన్ని చూపిస్తాము. కాని వారి విధానము దీనికి కొంత భిన్నంగా ఉంది. అది పూర్తి అయిన తర్వాత నా ఆధ్యాత్మిక ప్రసంగాన్ని ఇవ్వమని కోరారు. రాల్ఫ్ నన్ను ఆ సమావేశంలో బాగా చదువుకున్నవారికి పరిచయం చేస్తూ, నా సాధు జీవనం గురించి, నేను చేసిన ఆధ్యాత్మిక సేవలను గురించి ఎంతో ఉన్నతంగా వివరించాడు. నా ఆధ్యాత్మిక కార్యక్రమాలు విశ్వశాంతి స్థాపన కోసము ప్రతి ఒక్కరి హృదయంలో శాంతిని నెలకొల్పటమే లక్ష్యంగా సాగుతున్నాయని చెప్పాడు. మార్చి 17వ తేదీ 1929 సంవత్సరంలో నా ఆధ్యాత్మిక దినచర్య డైరీలో ఆనాడు నేను వ్రాసుకున్న విషయాలను ఇక్కడ వ్రాస్తున్నాను.

రోసిక్రూషియన్ లాడ్జి ప్రసిడెంట్ అయిన సోదరుడు కిన్‌మెట్ మాకు మంచి ఆతిథ్యమిచ్చాడు. అందులకు చాలా సంతోషము. నేను నా ప్రసంగం కోసం ఎక్కువగా ఏమీ తయారుకాలేదు. చాలా మంది మంత్ర దీక్షలు తీసుకున్నారు. క్రొత్త భక్తులకు నా పరిచయం ఎంతో స్ఫూర్తిని, సంతోషాన్ని కలిగించింది. భగవంతుని అనుగ్రహము వలన అంతా చక్కగా సవ్యంగా జరిగిపోయింది.

దాదాపు 45 నిముషాల నా ప్రసంగం శ్రోతలను మంత్రముగ్ధులను చేసింది. చాలాసేపు వారు ఆ ఆధ్యాత్మ్య స్థితిలో నిశ్శబ్దంగా ఉండిపోయారు. నేను చెప్పిన విషయాలు వారి మనస్సును బాగా ఆకట్టుకున్నాయి. ప్రతి ఒక్కరూ ఆ పరమాత్మ దివ్యానుభూతిని అనుభూతి చెందారు. ఆ దివ్యానందానుభూతిలో తేలిపోయారు.

నా ప్రసంగం పూర్తి అయిన తర్వాత, ఒక వ్యక్తి నా వద్దకు వచ్చి "స్వామీజీ! మీ ప్రసంగం మొదలునుండి చివరి వరకు ఒక పవిత్రాత్మ పాడుతున్న పాటలా ఉంది" అన్నాడు. మరొక సోదరి, ఆమె అంతకు ముందు భగవంతుని గూర్చి ఎప్పుడూ ఎలాంటి ప్రసంగాలు వినలేదని, నా ప్రసంగం విన్న తర్వాత భగవంతుడు అంటే ఏమిటో తెలిసిందని అంది. చాలా మంది శ్రోతలు నా ప్రసంగాన్ని ప్రశంసిస్తూ మాట్లాడారు. అయితే నేను వారందరిని నిశ్శబ్దంగా, శాంతిగా ఉంచేందుకు ప్రయత్నించాను. వారందరూ ఆ దివ్యానుభవాన్ని తలచుకొని కళ్ళ నీరు తుడుచుకున్నారు.

ఈ కీర్తి, గొప్పతనము అంతా పరమాత్మకే చెందుతుంది. ఆ పరమాత్మ అనుగ్రహం వలన ఇంకా గొప్ప శక్తిని ఇచ్చి అతని బిడ్డలందరికి సేవ చేసే అవకాశం లభించాలని కోరుకుంటున్నాను. మా చక్కని మంచి కార్యక్రమం పూర్తి అయిన తర్వాత మరియా, రాల్ఫ్, నేను క్షేమంగా ఇంటికి చేరుకున్నాము. మేము నిస్వార్థంగా పరమాత్మ సేవ చేసేందుకు అవకాశం లభించినందుకు ఆయనకి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు అర్పించాము. ఆ విధంగా కాలం తెలియకుండా గడిచిపోసాగింది. ప్రతి రోజు ఎక్కడో ఒక చోట నా ప్రసంగాలు, సమావేశాలు, పాత్రికేయుల ఇంటర్వ్యూలు జరుగుతుండేవి. అలాగే ఎందరో క్రొత్త భక్తులు వారి ఆధ్యాత్మిక సాధనల కోసం, మార్గదర్శనం కోసం వస్తూ ఉండేవారు. వారందరికీ సేవ చేయటం గొప్ప అదృష్టంగా భావించేవాడిని.

అధ్యాయం - 26

# మరియా ఆశ్రమంలో నా జీవితం

కొన్నిసార్లు చుట్టూ ఉన్న ప్రపంచంలోని అద్భుతమయిన ప్రకృతి సౌందర్యాన్ని అలా చూస్తూ ఉండిపోవాలనిపిస్తుంది. మరికొన్ని సందర్భాలలో కళ్ళు విప్పి చూడాలని కూడా అనిపించదు. ఎందుచేతనంటే మనస్సు అంతర్ముఖమయినప్పుడు హృదయంలోనే పరమాత్మ దర్శనమవుతుంది. ఇక ప్రాపంచిక విషయాలవైపు, దృశ్యాలవైపు అప్పుడు మనస్సు మళ్ళదు. కొన్నిసార్లు వ్రాస్తూ ఉంటే వర్షం ధారాపాతంగా కుమ్మరించినట్లుగా పదాలు దొర్లుకుంటూ వస్తాయి. నయాగరా జలపాతం దూకుతున్నంత ఒరవడిలో, భావావేశంలో అంతరంగ భావాలు పెల్లుబికి వస్తుంటాయి. మరికొన్నిసార్లు ఎంతో ప్రయత్నించినా ఎలాంటి స్ఫూర్తినిచ్చే పదాలు గాని, మాటలు గాని రానేరావు. అంతరంగము నుండి గాని, బాహ్యం నుండి గాని అంతా నిర్లిప్యంగా ఉంటుంది. కనీసం వ్రాయటానికి కాగితము, పెన్ను పట్టుకోవాలని కూడా అనిపించదు. ప్రకృతి సహజ పరిస్థితుల్లో, ఆహ్లాదకరమయిన వాతావరణంలో కోకిల పాడినపుడు ఎంతో మధురంగా ఉంటుంది. కాని ఆ పక్షిని బలవంతంగా పాడించాలని ప్రయత్నిస్తే అది కాకి అరుపులాగా వినిపిస్తుంది. ఈ భౌతిక ప్రపంచంలో మానవుడు రకరకాల భావావేశాలకి లోనవుతుంటాడు. ఎవరయినా వారి భావాలకి అనుగుణంగానే ప్రవర్తిస్తారు. ఎవరయితే వీటన్నింటికి అతీతమయిన స్థితిని పొందుతారో, అలాంటి వారు భగవంతుని అనుగ్రహానికి పాత్రులవుతారు. అలాంటి పవిత్రమయిన ఆత్మ స్వరూపులు చాలా అరుదుగా, కేవలం కొద్దిమంది మాత్రమే ఉంటారు. అలాంటివారే మహాత్ములు.

నేను నా ఆత్మకథని వ్రాస్తున్నప్పుడు, ఏదో ఒక అధ్యాయం వ్రాస్తున్నప్పుడూ నాకు ఒక ప్రశ్న మదిలో మొదలవుతుంది. భగవధనుభూతి కన్నా నా ఆత్మకథ వ్రాయటం ఎక్కువ అవసరమా? అనిపిస్తుంది. భగవంతుని గూర్చిన అవగాహన పెంచుకోవటం అన్నింటికన్నా ముఖ్యం. వెయ్యి ఆత్మకథలు వ్రాయటం కన్నా అదే ముఖ్యమని నాకు తెలుసు. కానీ ఈశ్వరాజ్ఞ వల్లనే గడ్డిపోచ కూడా కదులుతోంది. భగవంతుని సంకల్పం తోనే ఆయనే వ్రాసుకుంటున్నారు. కనుక వ్రాయనివ్వండి. ఆయన చేతిలో పనిముట్టుగా మారటానికి ప్రయత్నిస్తే సరిపోతుంది. ఈ పరికరము నిస్స్వార్థంగా, పవిత్రంగా, సంపూర్ణ

సమర్పణ భావంతో భగవంతుని పట్ల శరణాగతి చెందినప్పుడు ఎంతో ఉన్నతమయిన విషయాలు చాలా తేలికగా, సరళమయిన భావంతో, భాషతో, అత్యంత సహజంగా వస్తాయి. మనస్సు, బుద్ధి, ఆలోచనలు భేదాలన్నీ కలిగిస్తాయి. హిమాలయాల్లో నిర్మానుష్యమయిన గుహలో ఉన్నా లేదా జనంతో కిక్కిరిసి పోయి ఉండే ఫిలడెల్ఫియా, న్యూయార్క్, న్యూఢిల్లీ లాంటి పట్టణాలలో ఉన్నా తేడా ఏమీ ఉండదు. ఎప్పుడయితే మనస్సు భౌతిక శరీరం నుండి విడివడిపోతుందో, ఇంద్రియ విషయాలకు దూరంగా ఉంటుందో అప్పుడు అంతర్జ్యోతి వెల్గుతుంది. అప్పుడు హిమాలయాలు, తూర్పు పడమర దేశాల్లో ఎక్కడ ఉన్నా ఏమీ బేధం అనిపించదు. మానవజన్మ వచ్చిన తర్వాత అన్నింటికన్నా ముఖ్యమయిన విషయం భగవంతుని కోసం పరితపించటం. ఆయన పని చేయటము, పరమాత్మ కోసమే జీవించటము, ఊపిరి పీల్చినా భగవంతుని కోసమే అయి ఉండాలి అంటే ఆయన బిడ్డలకు సేవ చేయటము, వారిని ప్రేమించటము చేయాలి.

నేను నా జీవితంలో అత్యంత ఆనందమయ జీవితం అమ్మ మరియా మాత ఆశ్రమంలో గడిపానని చెప్పటంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఆమె పూజామందిరంలో ఆమె మాతృప్రేమ వర్షంలో తడిచి ముద్దయిపోయాను. ఆమె నా ఆరోగ్యం గురించి చాలా శ్రద్ధ వహించేది. అంతేకాక నా ఆధ్యాత్మిక జీవితంలో పురోగమించడానికి తన మాతృ ప్రేమతో నన్ను ఎంతో సున్నితంగా, జాగ్రత్తగా ప్రేమగా చూసుకునేది. నేను ఆమె పవిత్ర మందిరంలో గంటల తరబడి గాఢమయిన ధ్యానంలో మునిగిపోయి బాహ్య ప్రపంచాన్ని మర్చిపోయేవాడిని. చాలా సమయాల్లో నిద్రాహారాలు కూడా వదిలి ధ్యానంలోంచి బాహ్యస్థితికి వచ్చేవాడిని కాదు. అలాంటి సమయాల్లో మాతృదేవి మరియా నా గురించి దిగులుతో మెట్లపైనే కూర్చుండిపోయేది.

ఆమె మాతృప్రేమని నేను మాటల్లో వర్ణించి చెప్పలేను. తరుచుగా ఆమె కూడా నాతో కలిసి ధ్యానంలో కూర్చునేది. గంటలు గడిచిపోయేవి. ఆమె పవిత్ర పూజాగదిలో ప్రశాంతంగా, మౌనంగా సమాధి స్థితిలో ఉండిపోయేవాళ్ళము. కాని ఉదయకాలపు ఫలహారము, మధ్యాహ్న సమయంలో, రాత్రివేళల్లో భోజనము తయారుచేయడానికి మరియా మాత క్రిందికి వెళ్ళేది. ఆమె నేను ఎప్పుడు ధ్యానం ముగించి కళ్ళు తెరుస్తానా అని ఆత్రుతతో ఎదురుచూస్తుండేది. క్రింద భోజనాల గదిలో నా కోసం ఎదురు చూస్తుండేది. నా శరీరానికి మంచి శక్తిని, పోషణని అందించే ఆరోగ్యకరమయిన,

రుచికరమయిన పదార్థాలు తయారుచేసేది. పదార్థాలు చల్లారిపోకుండా నేను ధ్యానంలో నుండి బయటికి వచ్చి తినాలని ఆమె కోరిక. కాని నేను చాలాసేపు ధ్యానంలో ఉండిపోయి క్రిందికి సమయానికి వెళ్ళేవాడిని కాదు. తరుచుగా దీని గురించి మా ఇద్దరి మధ్యా వాదం జరిగేది. నేను వేళకి ఆహారం తీసుకోక పోవటం వలన నా ఆరోగ్యం గురించి అమ్మ మరియా చాలా ఆందోళన చెందేది. ఆమె ఎంతో ప్రేమానురాగాలతో నా కోసం గ్లాసు నిండా పళ్ళరసం గాని, పాలు గాని పైకి పూజాగదిలోకి తెచ్చి నా చేత బలవంతంగా త్రాగించేది. నేను ఇష్టం లేకపోయినా త్రాగేవాడిని. కొన్ని సందర్భాల్లో యాంత్రికంగా త్రాగేవాడిని. ఎందుచేతనంటే నేను బాహ్య స్మృతిలో ఉండేవాడిని కాదు.

నేను స్టీమరులో ప్రయాణం చేస్తూ సముద్రము మధ్యలో ఉన్నప్పుడు ఆమె వైర్‌లెస్ మెసేజెస్ పంపించేది. నా క్షేమం కోరి రేడియోగ్రామ్‌లో ప్రార్థనలు పంపేది. నా వద్ద నుండి తిరుగు జవాబు కోసం ఆమె ముందే డబ్బు కట్టి టెలిగ్రామ్ పంపివేసేది. ఆమె ప్రేమమయి, కరుణామూర్తి, దయామయి, అమృత హృదయంకల మాతృదేవత. ఆమె గొప్పతనాన్ని ఇంతకన్నా ఎక్కువగా చెప్పలేను.

ఆ రోజుల్లో నా జీవితం ఎంతో ఆనందంగా, గాలిలో తేలిపోతున్నట్లుగా హాయిగా సాగిపోయింది. నా ప్రపంచంలో నేనుండిపోయేవాడిని. మరియా మాతృప్రేమలో తలమునకలవుతుండేవాడిని. ఆమె ప్రేమపూరితమైన చిన్న చిన్న మాటలు కూడా నాకు ఎంతో సంతోషాన్ని, స్ఫూర్తిని, బలాన్ని ఇస్తుండేవి. ఆమె వ్రాసిన ప్రతి ఉత్తరము ఎంతో ఉత్తేజపూరితంగా ఉండి నాకు ఆనందాన్ని ఇచ్చేవి. దాదాపు ప్రతిరోజు ఆమె నాకు ఉత్తరాలు వ్రాసేది. పగలు, రాత్రి కూడా వ్రాసేది. ఆమె వ్రాసిన కొన్ని ఉత్తరాలు ఆమె పవిత్రమయిన కన్నీటి ధారలతో తడిచి, అక్షరాలు అర్థం కాకూండా ఉండేవి. నేను మరియామాత ఆశ్రమంలో లేనప్పుడు నేను ఆమెకు వ్రాసిన ఉత్తరాల్లో గొప్ప ప్రేరణని, స్ఫూర్తిని అందించే విషయాలన్నింటిని ఏర్చికూర్చి ఆమె రెండు అందమైన పుస్తకాలుగా తయారుచేసి దానిని **"ఓంకార్ ఆత్మ"** అని పేరు పెట్టి నాకు వాటిని బహుమతిగా అందచేసింది. ఆమె ప్రగాఢమయిన మాతృప్రేమకు దివ్యస్మృతిగా ఏదో ఒక రోజు వాటిని గ్రంథరూపంగా ముద్రించాలని ఉంది. అది ఆమె నిస్వార్థమయిన మాతృప్రేమకు, ఆమె నిరంతర శ్రమకు గుర్తుగా ఉంటాయి.

ఆ విధంగా అప్పుడు రోజులు ఎంతో ఆనందంగా గడిచాయి. మరియా, సూర్యానంద, అలాగే వందలాది భక్తులు నా నుండి ఎంతో గొప్ప ఆధ్యాత్మిక మార్గదర్శకత్వాన్ని, గురుత్వాన్ని ఆశిస్తున్నారు. అక్కడి సాధకులు, జిజ్ఞాసువులు నా సహాయం కోసం, అధ్యాత్మికంగా ప్రగతిని సాధించటం కోసం ఎదురుచూస్తున్నారు. అందువల్లనే అమెరికా వచ్చిన వార్త తెలియగానే కుప్పలు తెప్పలుగా భక్తులనుండి ఉత్తరాలు రాసాగాయి. కొందరు పొగడుతూ, మరికొందరు ధన్యవాదాలు తెలుపుతూ సందేశాలు పంపేవారు. నేను క్షేమంగా యు.ఎస్.ఎ. చేరుకున్నందుకు అక్కడి నా స్నేహితులు, సన్నిహితులు ఆనందించారు.

జాతి, మతము, కులము, రంగుల భేదము లేకుండా అమెరికాలోని సోదర సోదరీమణులందరికీ, ఆధ్యాత్మిక జిజ్ఞాసువులందరికీ, సాధకులందరికీ సేవలు అందించేందుకు భగవంతుడు నాకు మహదవకాశాన్ని అందించినందుకు నా ధన్యవాదాలు. అందువలన నేను అనేక చర్చిల్లో, యూనిట్ సెంటర్లలో, క్రొత్త ఆలోచనల సొసైటీలలో, బాహాయి సంస్థల్లో, రోసిక్రూషియన్ సమ్మేళనా సంఘాలలో, క్రైస్తవ మత సంస్థలలో ఉపన్యాసాలు చెప్పేవాడిని. అంతేకాకుండా థియోసోఫికల్ సంస్థలకి చెందిన కుటుంబాల వారు, వారి స్నేహితులు, సన్నిహితులు వారింటికి నన్ను ఆహ్వానిస్తూ ఉండేవారు. ఎక్కడ సమావేశం జరిగినా, నేను అక్కడి వారందరికి ప్రవచనము అనంతరము వారితో ఏకాగ్రతగా ధ్యానము చేయించటము, భజనలు, సంకీర్తనలు, ప్రార్థనలు, సేవాకార్యక్రమాలు మొదలయినవి చేయించేవాడిని. అవన్నీ వారి ఆధ్యాత్మిక జీవనానికి ఎంతో తోడ్పడతాయి. అమెరికా భక్తులందరూ నన్ను “శాంతి స్వామీజీ” అని పిలువసాగారు. అప్పటి రోజుల్లో గాని, ఇప్పుడు గాని, ఎప్పుడయినా నా ఆశయము, ధ్యేయము, గమ్యము ఒక్కటే. నా వద్దకు మార్గదర్శనం కోసం ఎవరు వచ్చినప్పటికి వారందరిని అసత్యం నుండి సత్యం వైపుగా, అనిత్యంనుండి నిత్యత్వం వైపుగా, మృత్యువు నుండి అమృతత్త్వం వైపుగా నడిపించాలి. వారందరికి సత్యదర్శనం కలిగించాలి. ఓం శాంతిః, శాంతిః, శాంతిః

నన్ను తన గురువుగా, మార్గదర్శకుడిగా నమ్మి నా వద్దకు వచ్చేవారిని ఏ ఒక్కరిని నిరాశపరచటం నాకు ఇష్టం ఉండేది కాదు. ఒక ఆదర్శవంతమయిన గురువులా కాకుండా ఒక మంచి స్నేహితుడిలాగా వారికి సహాయపడేవాడిని. వారిని శాంతిపథం వైపుగా

నడిపించేవాడిని. వారికి సరయిన అవగాహన కల్గించేవాడిని. ఎందరో ఆధ్యాత్మిక గురువులు సైతం నా వద్దకు వస్తుండేవారు. వారికి ఎన్నో అనుమానాలు, సందేహాలు ఉండేవి. వాటన్నింటికి సమాధానం కోసం, నా వద్దకు వచ్చి వాటిని తీర్చుకొని సంతోషంగా వెళ్ళేవారు. నేను వారితో గాఢమయిన ధ్యానం చేయించేవాడిని. ఏవో నాలుగు మాటలు చెప్పి పంపడం నా ఉద్దేశ్యం కాదు. వాళ్ళకి అనుభవ జ్ఞానం రావాలి. కేవలం తపస్సు, ధ్యానము మాత్రమే మానవుడిలోని అజ్ఞానమనే అంధకారబంధురమైన మబ్బులను తొలగింపచేసి జ్ఞానజ్యోతిని వారిలో వెలిగింపచేస్తుంది అని నేను నమ్ముతాను. మనిషిలోని బలహీనతలు, అజ్ఞానము తొలగిపోవాలంటే అది ఒక్కటే సరయిన మార్గము.

మరియా ఆశ్రమంలో గాని, మరేదయినా ఇతర స్థలాల్లో, చర్చిల్లో, మత సంస్థల్లో గాని సమావేశాలు, ప్రసంగాలు, ప్రవచనాలు జరిగేటప్పుడు మరియా మాత, రాల్ఫ్ నా ప్రక్కనే కూర్చునేవారు. నన్ను సభ్యులకు పరిచయం చేయటమే కాకుండా నాకు ఎన్నో విధాలయిన సేవలు చేసేవారు. వారిద్దరికి సమస్తము నేనే. నన్ను వారి కన్నబిడ్డలాగా, ఆధ్యాత్మిక వారసుడిలాగా భావించేవారు. వారి జీవితాశయము ప్రపంచములోని ప్రజలందరికీ శాంతిని అందించటము, ప్రచారము చేయటము. మానవజన్మను సార్థకము చేసుకోవాలని వారి హృదయము, ఆత్మ పరితపించటము సహజమే కదా!

అధ్యాయం - 27

# న్యూయార్క్‌లో శాంతి సంస్థ స్థాపన

ఆధ్యాత్మికంగా మంచి ఉన్నతస్థితిలో వెలుగొందుతున్న ఆ రోజుల్లో నాకు ఎప్పుడూ ఒక్కటే ఆలోచన ఉండేది. అది ఇతరులకు ఏ విధంగా సేవ చేయగలనా? వారికి ఏ విధంగా సహాయపడగలనా? అని. నన్ను చూడడానికి వచ్చేవారికి, సత్యాన్ని తెలుసుకోవాలని భావించేవారికి, అలాగే వివిధ మత సంప్రదాయాల గురించి, తూర్పు పడమర దేశాల్లోని మత బేధాలను గురించి విమర్శించే వారిని పరిశీలించాలని వచ్చేవారు అందరూ కూడా నా వద్దకు వచ్చిన తర్వాత ఏదో ఒక రకంగా ఆధ్యాత్మిక లబ్ధిని పొంది


State of New York

Department of State

Albany

IT IS HEREBY CERTIFIED THAT THE

CERTIFICATE OF INCORPORATION

of

Swami Omkar Peace Foundation, Inc.

వెళ్ళేవారు. నేను ఎల్లప్పుడూ భక్తులకు, జిజ్ఞాసువులకు, సాధకులకు సహాయం చేసే శక్తి నివ్వమని ప్రార్థిస్తూ ఉండేవాడిని. ఎంతో దూరం నుండి, చాలా డబ్బు ఖర్చు పెట్టుకొని, ఎన్నో శ్రమలకు ఓర్చి వారు నా వద్దకు వస్తుంటారు. అందువలన నా గురించి నేను ఆలోచించుకోవటం చాలా కాలం క్రిందటే మరిచిపోయాను. నాకు నిరంతరము ఇతరుల గురించి, వారికి ఎలా సేవ చేయాలనే చింత తప్ప మరింకే ఆలోచనలు ఉండేవి కావు.

సత్యాన్ని చేరుకోవాలి అంటే ఇతరులకు సేవ చేయటము చాలా తేలికయిన సూటి అయిన దారి. అందులో ఎలాంటి సందేహము లేదు. మొదట్లో ఆ దారి చాలా ఇరుకుగా, రాళ్ళు, ముళ్ళతో నిండి, జారిపడిపోతున్నట్లుగా చాలా కష్టంగా ఉంటుంది. కాని మనం ప్రయత్నం విడువకుండా, ఇతరులకు సహాయం చేస్తూ పోతూ ఉంటే, అదీ నిస్స్వార్థంగా, ఎలాంటి ప్రశంసలుగాని, పొగడ్తలు గాని ఆశించకుండా చేస్తుంటే అప్పుడు ఆ దారి చివరికి మనలను స్వర్గలోకపు అంచుల దాకా తీసుకు వెళ్ళి ఆనందాన్ని, శాంతిని, అనుగ్రహాన్ని ఇస్తుంది. ఇతరులకు సేవ చేటయమే పునాది వంటిది. ధ్యానము కట్టడము వంటిది. దాని ఫలితమే అందులోని ఆనందము. అదే ఆత్మానందము. నిర్వికల్ప సమాధి స్థితి లభిస్తుంది. ఇవన్నీ మెట్లు లాంటివి. ఒక్క మెట్టు ఇంకొక దానికి దారితీస్తుంది. కాని భగవదనుగ్రహము లభించినవారికి, భగవదైశ్వర్యము పొందిన వారికి, ఎంతో ఉన్నతమయిన స్థితి లభిస్తుంది. అప్పుడు ఆ స్థితిలో జీవమున్న ప్రతి ఒక్కరూ భగవంతునికి ప్రతిరూపంగానే అనిపిస్తుంది. అది మహోన్నతమయిన స్థితి. కంటికి కనిపించని పరమాత్మను ప్రతి ఒక్కరిలో దర్శించగలుగుతారు. ఆయన సృష్టిలోని అతి నికృష్టమయిన దానికి కూడా సేవలు అందిస్తారు. అప్పుడు మనకు మనమే సహాయము, సేవ చేసుకుంటున్నట్లుగా అనిపిస్తుంది. అందువలన ఒక్క క్షణం కూడా ఇతరులకు సేవ చేయకుండా ఉండలేము.

ఆ రోజుల్లో నాకు కేవలం ఒక్కటే ఆలోచన ఉండేది. నా మీద ఎంతో నమ్మకంతో, ప్రేమతో, భక్తితో, నా మీదే ఆధారపడిన వారందరికి ఆధ్యాత్మిక ఉన్నతికి నేను ఏ విధంగా సహాయసహకారాలు అందించగలనా అని మాత్రమే ఆలోచించేవాడిని. దాని కోసం నేను గాఢమయిన ధ్యానంలో కూర్చుని ఆలోచించాను. వాళ్ళకి తేలికగా, సూటి అయిన మార్గాన్ని, అనుసరణీయమైన సాధనా మార్గాలను తెలియచేయాలి. ఆ ధ్యానస్థితిలో నా మనస్సులో కొన్ని ప్రణాళికలు రూపొందించుకున్నాను. నాలుగు రకాలయిన సాధనల

ద్వారా భక్తులు పరిపక్వస్థితిని పొంది చివరికి భగవంతుని తెలుసుకోగలుగుతారు. ఒకదాని తర్వాత ఒకటిగా వారు తేలికగా, సూటి అయిన మార్గంలో సాధన చేసుకోవచ్చు.

మంత్రదీక్ష తీసుకునేవరకూ ప్రతి సాధకుడు తప్పనిసరిగా ఆధ్యాత్మిక దినచర్య డైరీని వ్రాయాలి. అందులో వారి సాధనల గురించి, నెమ్మదిగా వారు పొందిన ఉన్నతి గురించి ప్రస్తావించాలి. అది చాలా అవసరము. అది మాత్రమే సరిపోదు. సాధకులయిన విద్యార్థులు వ్రాసే దినచర్య డైరీలను నేను పూర్తిగా చదివి వాటిని ప్రతివారము సరిదిద్దేవాడిని. దానికోసము నేను చాలాసార్లు అర్థరాత్రి వరకూ మేలుకొనేవాడిని. అవసరమని తోచినపుడు వారికి సరయిన సలహాలు, సందేశాలు ఇస్తూ వారు ధ్యానంలో పురోగతి సాధించడానికి సహకరించేవాడిని. సాధకుల దినచర్య డైరీలను చదివి సరిదిద్దటం చాలా శ్రమతో కూడిన పని. ఎక్కడో దూరంగా ఉండే సాధకులు వారి డైరీలను పోస్టు ద్వారా పంపమని అడిగేవారు. అవన్నీ సరిదిద్ది వారికి పంపించేవాడిని. ఒక గురువుకు ఎంతో బాధ్యత ఉంటుంది తన శిష్యులను చక్కగా తీర్చిదిద్దాలి అని సంకల్పం చేసినప్పుడు.

శాంతి ఆశ్రమానికి, నా హృదయానికి కూడా అత్యంత ప్రియమయిన ముగ్గురు భక్తులు అయిన మాతృమూర్తులు. వారిలో ఒకరు శాంతిదేవి. ఆమె చాలా గొప్ప సంగీత విద్వాంసురాలు, అలాగే ఉపాధ్యాయురాలు కూడా. రెండవ వ్యక్తి రత్నమ్. నాతోపాటుగా అమెరికా వచ్చిన ఆత్మారామ్‌కి ఆమె తల్లి గారు. మూడవ వ్యక్తి సుశీలాదేవి. ఆమె సంగీతంలో ఎం.ఎ. చేశారు. వారి ముగ్గురు గురించిన ఆలోచనలు నా హృదయంలో పదిలంగా ఉండేందుకు వారి పేర్లు అమెరికాలోని ముగ్గురు భక్తులకు పెట్టాను. వారు ముగ్గురు చాలా మంచి భక్తులు. నన్ను ఎంతగానో ఆరాధించేవారు. వారు న్యూయార్క్ వాస్తవ్యులయిన జీన్‌లిల్లీ, ఆమె కుమార్తెలు నివేన్, డేటన్యూలు. శ్రీమతి నివేన్‌కు సుశీలాదేవి అని, డేటన్యూకి రత్నం అని, వారి తల్లిగారయిన శ్రీమతి జీన్‌లిల్లీకి శాంతిదేవి అని నామకరణం చేశారు. అలా నాకు ఒక కూతురు, ఒక చెల్లెలు, ఒక మాతృమూర్తి న్యూయార్క్ నగరంలో లభించారు. మరియా మాతృమూర్తి ఫిలడెల్ఫియాలో ఉన్నారు. ఇంకా అనేకమంది సోదర సోదరీమణులు అమెరికా దేశమంతటా ఉన్నారు.

న్యూయార్క్ నగరంలోని ముగ్గురు స్త్రీ మూర్తులు బాగా చదువుకున్నవారు. మంచి భక్తులు, ధనవంతులు. వారు ఫిలడెల్ఫియాలోని మరియా ఆశ్రమానికి తరుచుగా న్యూయార్క్ నగరం నుండి వంద మైళ్ళ దూరం కారులో ప్రయాణం చేసి నా ప్రసంగాలు

వినడానికి చాలా తరచుగా వస్తుండేవారు. అదేరోజు సాయంత్రం బయలుదేరి అర్ధరాత్రికి ఇంటికి చేరుకునేవారు. ఆ విధంగా వారు భగవంతునికొరకు వారి సమయాన్ని, ధనాన్ని సద్వినియోగం చేసుకునేవారు. వారు నన్ను న్యూయార్క్ నగరానికి రమ్మని అడుగు తుండేవారు. అక్కడ శాంతి ఆశ్రమ సంస్థను ప్రారంభించాలని వారి కోరిక. న్యూయార్క్ నగరం ఎంతో ఎత్తైన భవనాలతో కూడిన చాలా పెద్ద నగరము. శ్రీమతి జీన్‌లిల్లి (శాంతి దేవి) వారి సౌకర్యవంతమయిన ఇంటిలో ప్రసంగాలు ఏర్పాటు చేసి అవసరమయిన ఖర్చులన్నీ భరించేది. ఆమె బాగా ధనవంతురాలు మాత్రమే కాదు గొప్ప భక్తురాలు కూడా. న్యూయార్క్ నగరం నుంచే కాకుండా ఇంకా చాలా ప్రాంతాల నుండి చికాగో, డెనవర్, శాన్‌ఫ్రాన్సిస్‌కో, ఇంకా దూర ప్రాంతాల నుండి కూడా భక్తులు నా ప్రవచనాలు వినటానికి వస్తుండేవారు. నా సందేశాలు చాలా తేలికయిన భాషలో శాంతి, ప్రేమల గురించే ఉండేవి. నేను ఎప్పుడూ కూడా మానవులు ముందు వారి హృదయాలను శాంతితో నింపుకోవాలని, అప్పుడే అది విశ్వశాంతికి దారితీస్తుందని చెప్పేవాడిని.

నేను సుశీలా, రత్నం, శాంతిదేవి గార్లకు ఎల్లప్పుడూ ఋణపడి ఉంటాను. వాళ్ళు ముగ్గురూ ఎంతో నిజాయితీ గల మంచి భక్తులు. న్యూయార్క్ వంటి మహానగరంలో శాంతి స్థాపనకు వారు నాకు ఎన్నో విధాలుగా సహకరించారు. వారికి బాగా సన్నిహితులు, స్నేహితులు, బంధువులు అందరిని శాంతి ఆశ్రమానికి మంచి భక్తులుగా మార్చారు. న్యూయార్క్ నగరంలో నివాసం ఉండేందుకు ఎంతో విశాలమయిన, విలాసవంతమయిన, సకల సౌఖ్యాలు ఉన్న శ్రీమతి లిల్లి గారి ఇంటిలోనే నాకు సదుపాయం కల్గచేశారు. ఎంతో మంది భక్తులు, జిజ్ఞాసువులు, సాధకులు వారింట్లో జరిగే సమావేశాలకు హాజరవుతూ ఉండేవారు. వారి వల్లనే న్యూయార్క్ నగరంలో శాంతి ఆశ్రమానికి ఒక అనుబంధ సంస్థను ఏర్పాటు చేయగలిగాము.

జాన్ హాన్‌రహన్ వంటి ప్రముఖ న్యాయవాది మంచి భక్తుడు, అతని స్నేహితులందరూ శాంతి సంస్థ ఆశయాల పట్ల చాలా ఆసక్తి కలవారవటం వలన ఆకాశహర్మ్యాలతో నిండిన న్యూయార్క్ నగరంలో శాశ్వతంగా ఒక అనుబంధ సంస్థను ప్రారంభించాలని కంకణబద్ధులయ్యారు. న్యూయార్క్ నగరంలో 25, 30, 50 అంతస్తుల ఎత్తైన భవనాలు, ఆకాశాన్ని అంటుతున్నట్లుగా ఉంటాయి. అన్నింటికన్నా ఎత్తైన భవనము 150

అంతస్తులుంటుంది. ఎంతోమంది భక్తులు ధనికులు, దరిద్రులు, యువకులు, ముసలివాళ్ళు అనే భేదం లేకుండా శాంతి సంస్థ నిర్వహించే సమావేశాలకు క్రమం తప్పకుండా వస్తుండేవారు. వారిలో కొందరు ప్రసిద్ధులయిన సంగీత విద్వాంసులు, పేరు ప్రఖ్యాతులున్న వేదాంతవేత్తలు, గొప్ప సైంటిస్టులు ఉండేవారు. కార్మిలా ఇఫోలిటో అనే ఇటలీ విద్యార్థిని మా సమావేశాలు జరిగేటప్పుడు ముందుగా తన ఖరీదైన వయోలిన్ పై సంగీతాన్ని వినిపించి శ్రోతలను మంత్రముగ్ధులను గావించింది. ఆమె మాతో అది చాలా ఖరీదయిన, అరుదయిన, అతి విలువైన వాయిద్యమని చెప్పింది. దాని ఖరీదు లక్షల్లో ఉంటుందంట. అయినా ఆధ్యాత్మిక కార్యక్రమాలకి మనము భౌతికమయిన విలువ కట్టలేము కదా! ఆమె వయోలిన్ మీద వినిపించిన సంగీతం ఎంతో దివ్యంగా ఉండి ఆత్మానందాన్ని కలిగించింది.

మేము అనేక ప్రదేశాలకు సమావేశాల నిమిత్తము తిరుగుతుండేవాళ్ళము. నాకు ఇంకా గుర్తుంది నేను భక్తులతో కలిసి న్యూయార్క్‌లోని మాతా దియాటోరిసన్‌ని కలవటానికి వాళ్ళింటికి వెళ్ళాము. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త లియో టాలాస్టాయె గారి కుమారుడు ఇలియా టాల్‌స్టాయ్ ఆయన సతీమణి నాడిని టాల్‌స్టాయ్ గారితో కలిసి మా శాంతి సమావేశానికి హాజరయ్యారు. నాకు ఇప్పటికి బాగా గుర్తుంది. మా సమావేశం అనంతరం, ప్రార్థన పూర్తయిన తర్వాత కౌంట్ ఇలియాటాల్‌స్టాయ్ నన్ను ప్రక్కకి తీసుకెళ్ళి నాతో ఇలా చెప్పారు. "మీరు గొప్ప ఉపన్యాసకులు కాలేరు. ఎందుచేతనంటే ప్రసంగం చేస్తున్నప్పుడు మధ్యలో మీరు మాటలు మ్రింగి వేస్తున్నారు తన్మయత్వంతో. దానికి బదులుగా మీరు సింహగర్జనలు చేస్తూ ప్రసంగాలు చేయాలి. మేమందరమూ మీ నుండి ఎంతో గొప్పగా ఆశిస్తున్నాము".

చాలా సంవత్సరాల తర్వాత మహాత్మాగాంధీ నిర్యాణం అనంతరము కౌంట్ ఇలియా గారు నాకు ఒక ఉత్తరం వ్రాస్తూ "స్వామీజీ! ఇప్పుడు గాంధీ మహాత్ములు భౌతిక శరీరంతో జీవించి లేరు. మేమందరము శాంతి ఆశ్రమము వైపు చూస్తున్నాము. ప్రపంచ శాంతి స్థాపన కోసం, ప్రపంచ ప్రజల కష్టాలు, ఇబ్బందులు తొలగించేందుకు, ఆధ్యాత్మికంగా ఉన్నతంగా ఎదిగేందుకు శాంతి ఆశ్రమం పనిచేస్తుందని ఆశిస్తున్నాము. చాలా సంవత్సరాల నుండి ఇంకా ఇప్పటికి కూడా అమెరికా దేశ భక్తులందరూ, ఇంకా ఇతర ప్రదేశాల నుండి కూడా భక్తులు శాంతి ఆశ్రమంతో మంచి అనుబంధం ఏర్పర్చుకుని

ఎంతో శ్రద్ధగా, నిశ్శబ్దంగానే వారి సేవలను ఆశ్రమానికి అందిస్తూ ఆశ్రమ అభివృద్ధికి సహాయపడుతూ ఆశ్రమ శాంతి ఆశయాలను ప్రపంచవ్యాప్తంగా వ్యాపింపచేస్తున్నారు.

నేను అమెరికా సోదరులకు, సోదరీమణులకు, మాతృమూర్తులకు, పిల్లలకి అందరికి ధన్యవాదాలు తెలియచేస్తున్నాను. వారందరూ వారి సమయాన్ని, శక్తిని, ఎంతో భక్తి శ్రద్ధలతో న్యూయార్క్ నగరంలో స్థాపించిన శాంతి సంస్థ అభివృద్ధికి వినియోగించారు. అందువలన ఆ సంస్థ చాలా అభివృద్ధిలోకి వచ్చింది. తొంబై శాతం మంది మహిళలే సమావేశాలకు వస్తుంటారు. చాలా కొద్దిమంది పురుషులు మాత్రం అప్పుడప్పుడు వస్తుంటారు. మరియా, సూర్యానందా ఫిలడెల్ఫియా నుండి న్యూయార్క్ నగరానికి తరుచుగా సమావేశాలకి హాజరవుతూ ఉండేవారు. నేను వారి నుండి దూరమయి పోయినందుకు చాలా బాధపడేవారు. అయినా న్యూయార్క్ వచ్చి శాంతి కార్యక్రమాల్లో పాలుపంచుకునేవారు. ఒక మంచి ముహూర్తంలో న్యూయార్క్ నగరంలో శాంతి కేంద్రం మొదలు పెట్టబడింది. శ్రీమతి జీన్‌లిల్లి మా శాంతి దేవి ఆ కేంద్రానికి నిజమయిన వ్యవస్థాపకురాలు కనుక భక్తి శ్రద్ధలు గల ఆమెను దానికి ప్రసిడెంటుగా వ్యవహరించేవారు.

## న్యూయార్కులో క్రొత్త శాంతి కేంద్ర స్థాపన

ప్రియమైన స్వామీజీ! స్వామి ఓంకార్ గారు ఇక్కడ అద్భుతమయిన పని చేస్తున్నారు. మేము న్యూయార్క్ నగరంలో ఒక క్రొత్త శాంతి కేంద్రాన్ని నెలకొల్పుతున్నాము. అది చక్కగా అభివృద్ధి చెందుతున్నది. స్వామీజీ భారతదేశానికి తిరిగి వెళ్ళేలోపునే ఆ కేంద్రం చాలా పెద్దగా అవుతుంది. మేము ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న శాంతి సందేశాలను ప్రతి ఒక్కరి హృదయంలో స్వామీజీ నెలకొల్పారు. అవి ఎప్పటికీ శాశ్వతంగా ఉంటాయి.

అధ్యాయం - 28

# సముద్రము అందించిన సందేశం

అట్లాంటిక్ నగరం, న్యూజెర్సీలో చాలా అందమయిన సముద్రము ఒడ్డున విశ్రాంతి కుటీరాలుండేవి. అది న్యూయార్క్ నగరానికి, ఫిలడెల్ఫియా నగరానికి కూడా బాగా



నయాగరా జలపాతం వద్ద స్వామీజీ

దగ్గరగా ఉండేది. అక్కడికి మేము చాలా తరుచుగా వెళ్ళి సముద్రపు ఒడ్డున ఇసుక తిన్నెల మీద సముద్రానికి అభిముఖంగా కూర్చుని గాఢమయిన ధ్యానంలో మునిగిపోయే వాళ్ళము.

అక్కడే నేను మొదటిసారి స్వామి యోగానందగారిని కలుసుకున్నాను. తర్వాత మేము జీవితాంతము సన్నిహితంగా, స్నేహంగా ఉండేవాళ్ళము. ఆయన నన్ను న్యూయార్క్ నగరంలో కలుసుకున్నారు. తర్వాత భారతదేశములోని విశాఖపట్టణంలో ఉన్న మా ఆశ్రమానికి కూడా వచ్చారు. ఆయన చాలా మధురంగా పాడుతుంటే అందరికి చాలా ఆనందంగా, ఉత్తేజంగా ఉండేది. చాలా చిన్న మాటల్లో ఆయన పాడే పాటలు జీవితాంతం గుర్తుండిపోయాయి.

**"నీ నామాన్నీ నేను పాడుతాను, నీ నామామృతాన్ని నేను త్రాగుతాను**
**పూర్తిగా త్రాగేవరకూ నీ నామాన్నే వదలకుండా ఉండిపోతాను".**

అట్లాంటిక్ నగరంలో స్వామి యోగానందగారితో గడిపిన మధురక్షణాలు నాకు ఇంకా బాగా గుర్తున్నాయి. సముద్రం ఒడ్డున ఉండే విశ్రాంతి మందిరాల్లో ఆయనకి ఒక్క గది కూడా అద్దెకు దొరకలేదు. అందువలన వారిని నా గదిలోనే నాతో పాటు ఉండమని కోరాను. అక్కడ ఒక్కటే మంచం ఉంది. ఇద్దరము దాని మీదే పడుకున్నాము. ఆయన నిద్రలేచిన తర్వాత నవ్వుతూ నన్ను అడిగారు. "స్వామీజీ! నిద్రలో నేను బాగా గుఱకపెట్టానా? మీకు నిద్రాభంగం అయిందా?" అన్నారు. అందుకు నేను సమాధానం చెపుతూ "స్వామీజీ! అది గుఱక లాగానే లేదు. కాని అలాంటి వింత శబ్దం నా జీవితంలో ఎప్పుడూ వినలేదు. ఏదో పెద్ద రైలు ఇంజనునుండి వస్తున్న శబ్దంలా అనిపించింది. అందువలన నేను దానిని యోగ ప్రక్రియగా భావించి రాత్రంతా మేలుకొని మిమ్మల్ని గమనిస్తూ గడిపాను" అన్నాను. ఆయన పద్ధతిలో చాలా మధురంగా పెద్దగా నవ్వారు స్వామీజీ. తర్వాత ఆయన భారతీయ వంటకాలు, కూరలు సిద్ధం చేశారు. మేమిద్దరము కలిసి భోజనము చేశాము. ఆయన ఎప్పుడూ సున్నితంగా, మధురంగా మాట్లాడేవారు. మంచి హాస్యప్రియులు. సభల్లో ప్రసంగించేటప్పుడు గాని, స్నేహితులతో కలిసినప్పుడు గాని, సాధకులతో గాని ప్రేమపూర్వకంగా మాట్లాడేవారు. అలాగే చక్కని సలహాలు, సూచనలు ఇస్తుండేవారు.

అట్లాంటిక్ నగరంలో సముద్రపు ఒడ్డున ఒక బల్లపై కూర్చుని భగవంతుని దివ్యమయిన నామామృతాన్ని గానం చేస్తూ, పానం చేస్తూ, సముద్రపు అలలు చేస్తున్న సవ్వడులలో పవిత్రమయిన ఓంకారనాదాన్ని శ్రవణం చేస్తూ సముద్రంతో మాట్లాడటం మొదలుపెట్టాను. అప్పుడు సముద్రము నాకు అందించిన సందేశము శాంతిని సౌభాగ్యాన్ని ప్రసాదించింది.

నేను సముద్రాన్ని ప్రశ్నించాను "ఓ అనంతమయిన సముద్రమా! నీవు తూర్పు పడమరలకు, ఉత్తర దక్షిణాలకు తీరం కనిపించకుండా అనంతంగా వ్యాపించి ఉన్నావు. నీ అంతులేని ప్రయాణంలో రాత్రి పగలు అనే భేదం లేకుండా నిన్ను, నన్ను, ఈ సమస్త జీవజాలాన్ని సృష్టించిన ప్రేమ స్వరూపుడయిన పరమాత్మను దర్శించాలని అన్వేషిస్తున్నావు. నీవు ఆయన దర్శనమయినపుడు నా గురించి అడుగుతావా? ఈ జనన మరణ ప్రవాహ రూపమయిన సంసార చక్రం నుండి నాకు విముక్తి ఎప్పుడు దొరుకుతుంది? ఆత్మ సాక్షాత్కారం నా జన్మహక్కు కదా? ఈ భౌతికమయిన విషయాలకు అతీమయినది, సత్యమయినది, నిత్యమయినది ఆత్మానందానుభవం నాకు ఎప్పుడు లభిస్తుంది?"

సముద్రుడు నాకు దివ్యమయిన సందేశాన్ని అందించాడు. "నా ప్రియమైన స్నేహితుడా! భగవదనుగ్రహము లభించిన వారి హృదయమే ఆత్మ సాక్షాత్కారము కోసం తపించి పోతుంది. నీ ప్రశ్నకి సమాధానము చెప్పటానికి నాకు చాలా ఆనందంగా ఉంది. నీవు ఎంతో ప్రియమయిన వాడివి కనుక. ఈ సృష్టిని రచించిన పరమాత్మ సృష్టికి భిన్నంగా లేడు. ఆయన నా అలల మీద నాట్యం చేస్తూ కనిపించటము లేదా? నీవు ఆయన ఉనికిని అనుభూతి చెందటం లేదా? నీవు అడిగిన సమస్యకు సమాధానం ఇప్పుడు, ఇక్కడే నీకు లభిస్తుంది.

అనంత కాలమునుండి నాలో రాత్రి పగలు బేధం లేకుండా లెక్కపెట్టలేనన్ని అలలు ఎగిసిపడుతున్నాయి. అలాగే మానవుడు అహంకారంతో, అసహనంతో లేదా స్వార్థంతో ఉన్నంతకాలము మళ్ళీ మళ్ళీ జన్మలు తీసుకోవాల్సి వస్తుంది. లెక్కలేనన్ని జన్మలు ఎత్తిన తర్వాత కూడా అహంకారాన్ని వదిలించుకోలేకపోతే మానవజన్మ సాఫల్యము అయిన ఆత్మసాక్షాత్కారాన్ని పొందటంలో అతడు విఫలమవుతాడు. ఈ సత్యం తెలియటం వలన నిరాశ చెందాల్సిన పని లేదు. స్వార్థ రహితుడు అయిన మానవునికి ఉత్తమమయిన జీవితం లభిస్తుంది. పవిత్రమయిన, అమాయకుడయిన, అహంకారము లేని మానవుడు

ఈ ఉత్తర క్షణంలోనే భగవద్దర్శనము పొందుతాడు. అంతటా, అన్నింటా, అన్నికాలాల్లో భగవదనుభూతిని అనుభవిస్తాడు.

నీవు నా దగ్గరగా రా! నా లోపల మునిగి చూడు. నా లోతుల్లోకి వెళ్ళి పరిశీలించు. అక్కడ ఎలాంటి అలలు గాని, అలజడులు గాని ఉండవు. నిర్మలంగా, నిశ్చలంగా ఎలాంటి అలలు, కెరటాలు లేని స్థితిని ఊహించు. వెంటనే నీకు ముక్తి లభిస్తుంది. నిశ్చలత్వాన్ని, ఎలాంటి చంచలత్వము లేని స్థిరత్వాన్ని అనుభవిస్తూ మౌనంగా ఉండు. అలాంటి నిశ్చలస్థితిలో నీవే దైవము అని గుర్తిస్తావు.

సముద్రము చెప్పిన ఆ పవిత్రమయిన మాటలు నా హృదయంలో గాఢంగా నాటుకొని నాలో భాగం అయిపోయాయి. నేను మౌనంగా, నిశ్చలంగా, ఎలాంటి కదలికలు, అలజడులు లేని స్థితిలో శ్వాసను కూడా మర్చిపోయి భగవత్ అనుభూతిలో మునిగిపోయాను. తలవంచి సముద్రానికి నమస్కరిస్తూ వినయంగా మళ్ళీ అతడిని ఇంకొక ప్రశ్న అడిగాను. "ఓ గొప్ప సముద్రమా! నీ అద్భుతమయిన సందేశాన్ని తూర్పు పడమర దేశాలకి, ప్రపంచానికి అందించు. భగవంతుని బిడ్డలందరికి నీ సందేశాన్ని ఉపదేశించు" సముద్రము నాతో మధురంగా మాట్లాడుతూ "ఓ నా బిడ్డా! నీవు భగవంతుని ప్రతిరూపానివే. సృష్టిలోని ప్రతి ప్రాణి కూడా భగవత్స్వరూపమే. ఇదే నా సందేశము. ఈ సందేశాన్ని గ్రహించి దానిని ప్రపంచంలోని దేవుని బిడ్డలందరికి ప్రచారము చేయి" అని చెప్పింది.

**1) "ఏకం సత్ విప్రా బహుధా వదంతి" :** ఉన్నది ఒక్కటే సత్యము. వేదాంతులు దానిని పలువిధాలుగా వివరిస్తుంటారు. దానికి ఉదాహరణంగా నన్నే చూడు. నేను నిజానికి కేవలం నీరు మాత్రమే. కాని నన్ను ప్రపంచంలో ఒక్కో ప్రదేశంలో ఒక్కో పేరుతో పిలుస్తారు. ఒక ప్రాంతంలో పసిఫిక్ సముద్రము అంటారు. వేరొక ప్రదేశంలో అట్లాంటిక్ సముద్రం అంటారు. కొన్ని చోట్ల హిందూ మహాసముద్రం అని, ఇంకొక చోట అరేబియా సముద్రము అని పిలుస్తారు. నాకు ఇంకా చాలా చాలా పేర్లున్నాయి. కేవలం కొన్ని పేర్లు వలన నేను ఏమీ మారిపోలేదు. నేను నేనుగానే ఉన్నాను. నేను ఎప్పుడూ నీరుగానే ఉన్నాను. నీరు లేకుండా నేను లేను. ప్రపంచమంతా నేను నీరుగానే ఉన్నాను.

అదేవిధంగా భగవంతుడు అనంతుడు. ఆయన నామరూపాలకు అతీతుడు. క్రైస్తవుల దేవుడు, హిందూ దేవుడు, బౌద్ధుల దేవుడు ఇలా ఇన్ని రూపాల్లో ఉండడు. భగవంతుడు ఒక్కడే. భగవంతుడు అంటే శాంతి. ఎవరు అతడిని తెలుసుకుంటారో వారికి సృష్టి అంతటిలో దర్శనమిస్తాడు. నమ్మకములోనే దైవదర్శనముంది. కనుక మతాలన్నింటికి పునాది సత్యము, ధర్మము, విశ్వమంతా భగవన్మయము అనే నమ్మకము అవుతుంది.

**2) విడిపోవటము మృత్యువు, కల్సి ఉండటమే జీవితము :** ఉదాహరణకు నాలోని కెరటాన్ని చూడు. కెరటం నా నుండి వేరుగా భావించినపుడు అది కేవలం ఒక కెరటంగానే ఉంటుంది. దానికి ప్రత్యేకమయిన ఉనికి ఉండదు. శాశ్వతత్వము లేదు. ఎప్పుడు అది నా నుండి వేరు కాదు అని గ్రహిస్తుందో అప్పుడు అది నాతో ఏకమవుతుంది. నాలో కలిసిపోతుంది. అప్పుడే అది నాకు చెందుతుంది. అప్పుడు నేనే కెరటాన్ని, కెరటమే నేను అంటే అనంతమయిన, ఎల్లలు లేని సముద్రము ఒక్కటే అవుతాము.

అదేవిధంగా సృష్టిని సృష్టించిన పరమాత్మకి సృష్టికి ఎలాంటి భేదము లేదు. పరమాత్మ లేకుండా జీవుడికి ఉనికి లేదు. ఎప్పుడయితే మానవుడు తన్ను తాను విశ్వశక్తి అయిన పరమాత్మకి వేరుగా అనుకుంటాడో అతను శక్తిహీనుడు అవుతాడు. భౌతికంగా అతడు ప్రపంచంలోకి గొప్ప ధనవంతుడు కావచ్చును. కాని విశ్వశక్తి నుండి విడివడినప్పుడు అతడు కేవలం కదిలే అస్తిపంజరము వంటి వాడవుతాడు. దాని వలన అతడు బలహీనుడు, శక్తిహీనుడు, అస్తిత్వం లేని వాడవుతున్నాడు. నెమ్మదిగా మృత్యువుకు లోనయి తన ఉనికిని కోల్పోతాడు. అందువలన మానవుని అస్తిత్వం ఎటువంటి పరిస్థితుల్లోనూ తన్ను తాను పరమాత్మకు ప్రతిరూపంగా గుర్తించగల్గినప్పుడు ఆ విశ్వశక్తిని సంపాదించుకొని అమరత్వాన్ని, అమృతత్వాన్ని సాధించగలుగుతాడు.

ఏ విధంగా సముద్రంలో కెరటం ఒక్క క్షణం కూడా సముద్రం కంటే భిన్నంగా ఉండలేదో, అదేవిధంగా మానవుడు కూడా ఆ పరమాత్మ కంటే ఒక్క క్షణం కూడా వేరుగా ఉండలేడు. కెరటాలు సముద్రంలోనే పుట్టి, ఎగిసిపడి, విరిగిపడి మళ్ళీ సముద్రంలోనే కలిసిపోతాయి. అదేవిధంగా జీవుడు కూడా పరమాత్మ అయిన భగవంతుడి నుండే పుట్టాడు. పరమాత్మగానే ఉన్నాడు. పరమాత్మలోనే కలిసిపోతాడు. భగవంతుని అనుగ్రహము వలన జీవుడు అనుక్షణము ఆయన స్వరూపంగానే విరాజిల్లుతూ,

పరమాత్మకు ప్రతిరూపంగా, దివ్యత్వాన్ని అనుభవించాలి. అలాంటి తపన, కోరిక జీవుని ఉన్నతికి, ప్రగతికి దారితీస్తుంది. ప్రతి జీవమున్న ప్రాణి కూడా పరమాత్మకి ప్రతిరూపమే.

**3) అంతర్ముఖుడవు కావాలి :** జీవుడు అనుక్షణము భగవదనుభూతిలోనే ఉండాలని కోరుకుంటాడు. కాని అలాంటి అనుభూతి కలగాలి అంటే దానికి సరయిన సాధన, పట్టుదలతో తగిన శ్రమ కూడా చేసి తీరాలి. ఆశించినది మనకు దొరకాలి అంటే తప్పకుండా దానికి సరయిన మూల్యాన్ని చెల్లించాలి. బాహ్య ప్రకృతికి లోబడిపోయి ఆధ్యాత్మిక ప్రగతిని పొందాలనుకోవటం వృధా ప్రయాస అవుతుంది. ఓర్పు, సహనము, శాంతి, దయ, కరుణ, నిస్వార్థము, ప్రేమ మొదలైన దైవీగుణాలను మూల్యంగా చెల్లించినప్పుడే మానవుడు ఆత్మోన్నతిని పొందుతాడు. అంతరంగం లోపలా బయటా కూడా ప్రతి నిముషం శక్తితో, ప్రేమ, సేవలతో, ఆనందంతో నింపుకుని ఆ కళ్ళతో చూడటం ప్రారంభిస్తే అది ఏ మాత్రం కష్టం కాదు. దివ్యానుభవం చాలా స్పష్టంగా, సూటిగా అనుభవంలోకి వస్తుంది. దాన్ని స్పష్టంగా అనుభూతి చెందాలి, అనుభవంలోకి తెచ్చుకోవాలి అంటే తప్పనిసరిగా అందుకు తగిన సాధన పట్టుదలతో చేయాలి. అప్పుడు ప్రతి క్షణం ఆ దివ్యానుభవం నీకు లభిస్తుంది.

బాహ్యంలో నుండి అంతరంగంలోనికి గాఢంగా, లోతుగా లోలోతుల్లోకి మునిగిపోవాలి. ఆ నిశ్చలస్థితిలో అంతరంగంలో దివ్యమయిన అనుభూతులు నీ స్వంతం అవుతాయి. ఆత్మానందాన్ని కలిగించే అద్భుతమయిన ఆలోచనలు అంతరంగంలో కదులుతాయి. నీ అంతరంగంలోనికి నీవు మునిగిపోయినప్పుడు అంతర్ముఖ స్థితిలో, నిర్మలమైన, నిశ్చలస్థితిలో భగవదనుభవాన్ని అందుకోగల్గుతాడు. అది ఒక వర్ణించలేని అద్భుతమయిన స్థితి. ఎవరికయినా ధ్యానంలో భగవదనుభవం కల్గకపోతే నిరాశ చెందవలసిన పనిలేదు. ఒక్కసారిగా అది ఎవ్వరికీ సాధ్యం కాదు. సాధన బాగా పక్వమయినప్పుడు అలాంటి స్థితి దానంతట అదే కలుగుతుంది. సముద్రములో ముత్యపు చిప్పలను వెదకటానికి వెళ్ళిన వారికి వెంటనే అవి దొరకవు. కాని మళ్ళీ మళ్ళీ విసుగు లేకుండా, పట్టుదల వదలకుండా ప్రయత్నించినపుడు సఫలీకృతుడవుతాడు. అమూల్యమయిన ముత్యాలు ఉన్న చిప్పలు అతనికి దొరుకుతాయి.

భగవంతుడు ఎల్లవేళలా ఉన్నాడు. అతను ఎప్పుడూ లేకుండా లేడు. లేదా నీకు దూరంగా లేడు. అందువల్ల ప్రతి జీవుడు ప్రయత్నపూర్వకంగా తనలోకి తాను

అంతర్ముఖుడయినప్పుడు తన్ను తాను తెలుసుకోగలుగుతాడు. సత్యం ఏమిటో అనుభవంలోనికి తప్పకుండా వస్తుంది. గాఢమయిన ధ్యానంలో అందరి అంతరంగాలు ఏకమవుతాయి. సమయంతో, ప్రదేశంతో ఏలాంటి సంబంధము ఉండదు. అంతటా వ్యాపించి ఉన్న పరమాత్మ స్వరూపమే జీవాత్మ అని అర్థమవుతుంది.

ఒకే రకమయిన భావాలున్నవాళ్ళు ఒకరినొకరు ఆకర్షించుకుంటారు. అందువల్ల ఆత్మానుభూతి పొందిన పవిత్రాత్మ స్వరూపులందరూ భగవంతుని ఆజ్ఞ ప్రకారం ఏదో విధంగా కలుసుకుంటారు. అదే జీవన విధానము. పరంజ్యోతి, ప్రేమ దారి చూపిస్తుంది. ప్రతి పనిలో దాని అనుభవం వారికి తప్పకుండా కల్గుతుంది. అలాంటి వారికి వర్ణనాతీతమయిన, ఎల్లలు లేని ఆత్మానందము అనుభవంలోనికి వచ్చేస్తుంది. అది పరమాత్మ తీర్మానము. నీలోలోపలికి నీవు మునిగిపోయి నిన్ను నీవు తెలుసుకోవటానికి ప్రయత్నము చేయాలి. అప్పుడు నీలో వెలుగుతున్న ఆ అంతర్జ్యోతిని దర్శించగల్గుతావు. ప్రతిక్షణము ఆ దివ్యజ్యోతి సాయంతో, మార్గదర్శనంతో నిరంతరము అంతర్ముఖుడవయి జ్ఞాన ప్రకాశంతో వెలుగొందుతావు.

**4) భరించటం నేర్చుకోవాలి :** దేనినయినా, ఎలాంటి పరిస్థితులనయినా ఓర్పుతో, సహనంతో భరించటం నేర్చుకోవాలని ఒక్క మాటలో నా సందేశాన్ని అందిస్తాను. నన్ను చూడు నిరంతరం అల్లకల్లోలంగా ఎగిసిపడే కెరటాలు, ఉవ్వెత్తున ఆకాశాన్ని అంటే అలలు ఉండే సముద్రాన్ని. భీకరమయిన తుఫాను పెనుగాలులు వీస్తుంటాయి. అయినా మౌనంగా వాటిని సహిస్తాను. ఎలాంటి సంచలనము లేకుండా నిబ్బరంగా నా ఉనికిని కోల్పోకుండా అలాగే ఉంటాను. అలల కెరటాలపై నాట్యం చేస్తుంటాను. నురగలు కక్కుతూ ఎగిసిపడే కెరటాల సవ్వడుల్లో పవిత్రమయిన ఓంకారనాదాన్ని వినిపిస్తాను. నా ఉపరితలం మీద ఎంతో అల్లకల్లోలంగా కనిపించినప్పటికి సముద్రపు అట్టడుగు భాగంలోనికి దిగి చూడు. అక్కడ ఎలాంటి సంచలనాలు ఉండవు. నిశ్చలంగా ఎలాంటి కదలికలు, కల్లోలాలు లేకుండా ప్రశాంతంగా ఉంటుంది. ఏమి నన్ను కదిలించలేవు. నా ప్రశాంతతని భంగం చేయలేవు. మబ్బులు కమ్ముకుంటాయి. మళ్ళీ విడిపోతాయి. అప్పుడు మళ్ళీ సూర్యుడు దేదీప్యమానంగా ప్రకాశిస్తాడు. కెరటాలు ఎగిరి విరిగి పడుతుంటాయి. కాని నా లోలోపల మాత్రం ప్రశాంతంగా నిశ్చలంగా ఉంటుంది. నా ఆనందానికి, సంతోషానికి ఎలాంటి అడ్డంకులు ఉండవు. ఎందుచేతనంటే నాకు

తెలుసు ఎలాంటి మార్పు లేని నిశ్చలస్థితి నాది. నాలో నేనుంటాను కనుక పరమాత్మ నుండి నాకు అనంతమయిన శక్తి సంపన్నత లభిస్తుంది. దానికి అంతము లేదు. ఎప్పటికి మార్పు ఉండదు. ఎల్లప్పుడు ప్రేమని అందిస్తుంది. కాలం మారుతూ ఉంటుంది. నెలలు, సంవత్సరాలు గడిచిపోతాయి కాని భగవదనుభవానికి ఎలాంటి మార్పు ఉండదు. అందువల్ల అన్నింటిని సమానంగా, సహనంగా భరించే శక్తి లభిస్తుంది.

పోరాటం వల్ల శాంతి లభించదు. ప్రేమతో భరించటము వల్ల మాత్రమే శాంతి లభిస్తుంది. నేను ఇన్ని అల్లకల్లోలాలనూ సహనంతో భరిస్తున్నాను కదా! అలాంటప్పుడు భగవంతుని బిడ్డవయిన నీవు ఎంత ఓర్పుగా, నేర్పుగా పరిస్థితులను తట్టుకోవటం అలవాటు చేసుకోవాలి? నీవు సత్స్వరూపుడివి. జీవుడివి అయిన నీవు ప్రపంచానికి వెలుగును ఇవ్వగలవు. అందువలన నీవు అన్నింటిని భరించలేవా? విమర్శలను, ఖండనలను, చీకట్లను, నీలినీడలను సహించటం అలవర్చుకో. చీకటి కంటే వెలుతురు శక్తిమంతమయినది కదా! అందువలన అజ్ఞానం ఏవిధంగా జ్ఞానవంతుడిని అవమానించ గలదు? అలజడులు, చీకట్లు, కల్లోలాలు, అశాంతి అన్నీ జ్ఞానజ్యోతితో కల్సి మటుమాయమయి పోతాయి. అవి చిన్నవయినా, పెద్దవయినా తేడా ఏమీ ఉండదు.

ప్రపంచానికి వెలుగునిచ్చే జ్యోతి సూర్యుని ప్రకాశం లాగా తేజోమయమయినది. అది వెలుగుతూ ప్రపంచానికి జీవాన్ని ఇస్తుంటుంది. అందువలన ఎలాంటి నీలినీడలు, చీకట్లు, దుఃఖాలు, బాధలు నీ తేజస్సుకి భంగం కలిగించనీయకు. నీలోని తేజస్సును దాచిపెట్టుకోకు. మృత్యువులో కూడా నీ చిరునవ్వుని చెరిగిపోనీయకు. పరమాత్మ గొప్పతనం ముందు సమస్త ప్రపంచము నీటి బుడగలాంటిది. నీలో నీవు ఏమి చూడగలవు? జీవము, వెలుగు, ప్రేమ తప్ప. బాగా ఆలోచించు. నిజానికి ఉన్నది ఒక్కటే అదే సత్యమయిన సత్యము. అందువలన నీలో నీవు ఎల్లప్పుడూ అంతర్ముఖుడవు అవ్వు! నీ ఆత్మ స్వరూపాన్ని నీవు దర్శించు. దాని గొప్పతనాన్ని గ్రహించు. అప్పుడు స్థితప్రజ్ఞతను సాధించగలుగుతావు.

**5) ఎన్నో రకాలయిన అలలు సముద్రంలో ఉంటాయి :** నా ప్రియమైన స్నేహితుడా! నాలో ఎన్నో రకాలయిన అలలను నీవు చూడలేదా? బాగా ఆలోచించు. ఒక్కో రకమయిన కెరటము ఒక్కో సందేశాన్ని అందిస్తుంది అనిపించడం లేదా? నెమ్మదిగా, ప్రశాంతంగా ఉండే కెరటాలను చికాకుగా, అల్లకల్లోలంగా ఉండే కెరటాలతో పోల్చి గమనించు.

వాటి రెంటికి ఉన్న బేధాన్ని తెలుసుకోవడానికి ప్రయత్నించు. కొన్ని చాలా అందమయిన, సున్నితమయిన అలలుంటాయి. కొన్ని బీభత్సంగా, భయానకంగా ఎగిసి పడుతుంటాయి. అందులో కొన్ని అసూయను కలిగించేవి, దుఃఖాన్ని కలిగించేవి, క్రూరమయినవి, ప్రాణాలను హరించేవిగా ఉంటాయి. అలాంటి భావ తరంగాలను నియంత్రించేందుకు మనస్సాక్షిగా ప్రయత్నించాలి. లేకపోతే అవి ప్రపంచానికి హాని చేస్తాయి. ఒక్కో భయంకరమయిన సముద్రపు కెరటము కొన్ని వందల వేల ప్రాణాలను బలిగొంటుంది. మానవుడు తన బుద్ధి తర్కంతో, తెలివితేటలతో వాటిని నియంత్రించడానికి ప్రయత్నం చేయాలి.

స్నేహితుడా! నాలోని అలలు అంత భయంకరమైనవి కావు. కాని మానవుని అంతరంగంలోని దుష్ట భావాలను నియంత్రించకపోతే అవి సర్వ వినాశనం సృష్టిస్తాయి. ప్రపంచాన్ని దుఃఖముతో, బాధలతో, జబ్బులతో, మృత్యువుతో కబళించివేస్తాయి.

ప్రపంచంలోని దుఃఖానికి, బాధలకి కారణం ఎవరు? మానవుడు తప్ప మరింకెవరూ కాదు. ఆలోచనలతోనే జీవుడు ఉన్నతిని సాధిస్తాడు. అలాగే పతనం వైపుగా కూడా పయనిస్తాడు. మంచి ఆలోచనతో చక్కని భవిష్యత్తుకు బాటలు వేస్తాడు. అలాగే చెడు సంకల్పాలతో తనకు తానే హాని చేసుకొని ఇతరులకు కూడా హాని కలిగిస్తాడు. అద్దంలో మన ప్రతిబింబము కనిపించినట్లుగా, మన ఆలోచనలు, భావాలు ప్రపంచం మీద పనిచేస్తాయి. అతనికి తెలిసినా, తెలియకపోయినా మానవుని భావనా తరంగాలు, ఆలోచనా స్రవంతులు యావత్ప్రపంచం మీదా దాని ప్రభావాన్ని చూపిస్తుంది. అతి శక్తి వంతంగా, నిశ్శబ్దంగా దాని పని అది చేసుకుపోతుంది. మనం నమ్మినా, నమ్మకపోయినా, ప్రకృతి తన ధర్మం ప్రకారం ప్రవర్తిస్తుంది. దీనికి ఎలాంటి మార్పు, మినహాయింపు ఉండదు.

జీవుడు అజ్ఞానాంధకారంలో మగ్గిపోతూ, అహంకారంతో, స్వార్థంతో, నాది నేను అనే సంకుచిత భావాలతో నలిగిపోతూ ఉన్నంతకాలం ఈ ప్రపంచంలో అతనికి ఎలా శాంతి లభిస్తుంది? వ్యతిరేకభావాలు ఎన్నడూ మంచి చేయలేవు. వాటిని మంచి ఆలోచనలు, భావాలతో నియంత్రించినప్పుడు ఎంతో మేలు చేస్తాయి. ఎప్పుడూ మంచి భావాలు చెడు ఆలోచనలను అణచివేస్తాయి. ఈ ధర్మాన్ని అనుసరించినప్పుడు మానవుడు

శక్తిమంతుడు, ఉన్నతుడు, స్వతంత్రుడు అవుతాడు. ఇదే నిజమయిన అనుసరణీయమైన మార్గము. మంచి చెడును నిర్మూలించి, తనలో కల్పుకొనే గొప్ప శక్తిగా ఆవిర్భవిస్తుంది.

చిట్టచివరికి సద్బుద్ధి కూడా అంతర్ముఖ స్థితిలో నిశ్చలంగా, నిర్మలంగా, ప్రశాంతంగా ఉన్న స్థితిలో ఎలాంటి కోరికలు, ఆశలు లేని స్థితికి చేరుకుంటుంది. అప్పుడు అతను ఎలాంటి గౌరవాలు కోరుకోడు. తనకంటూ ప్రత్యేకమయిన ఉనికిని కూడా ఆశించడు. గౌరవాలు కోసం ఎదురు చూడటము స్వార్థమే అవుతుంది. అది పరమాత్మ నుండి జీవుడిని వేరు చేస్తుంది. ఎంత ఎక్కువ గౌరవాన్ని, పురస్కారాలను ఆశిస్తే అంతగా జీవుడు దిగజారిపోతాడు. ప్రేమ స్వార్థాన్ని లేకుండా చేస్తుంది. ప్రేమ అందరిని దగ్గరికి చేరుస్తుంది. ఎవరయితే స్వార్థ రహితంగా ప్రవర్తిస్తారో వారు అందరిచేతా ప్రేమించ బడతారు. అలాగే గౌరవించబడతారు. ప్రేమకు ఎల్లలు లేవు. దానికి పరిమితులు ఉండవు. అది మానవుడిని సంతృప్తిగా ఉండేలా చేస్తుంది. పరిపూర్ణతను చేకూరుస్తుంది. మనిషిలా జీవించేలా చేస్తుంది. దివ్యత్వం వైపుగా నడిపిస్తుంది. ముందు మానవుడు ప్రేమ అంటే ఏమిటో తెలుసుకోవాలి అంటే స్వార్థాన్ని, అహంకారాన్ని, మమకారాన్ని, పరిమితులను వదులుకోవాలి. అహం అందరికి దూరం చేస్తుంది. ఒంటరిగా మిగులుస్తుంది. అతను ఎన్నటికి కలిసి ఉండడం నేర్చుకోలేడు. ప్రతి మతము ప్రేమతత్త్వాన్నే బోధిస్తుంది. ప్రేమే దైవము. ప్రేమ వల్లనే భగవతత్త్వాన్ని ఎవరయినా తెలుసుకోగల్గుతారు. ద్వేషించేవారికి శాంతి దక్కదు. కేవలం ప్రేమించే వారికే జీవితంలో శాంతి లభిస్తుంది.

ఇదంతా సత్యం యొక్క ఒక కోణం మాత్రమే. అంతర్ముఖస్థితిలోనే జీవుడు సత్య దర్శనం చేయగలడు. అజ్ఞానపు చీకటి నీడల్లో జీవుడు ఎంత వెంపర్లాడినా సత్యాన్ని తెలుసుకోలేడు. స్వార్థ రహితమయిన ప్రేమ శాంతిని ప్రసాదిస్తుంది. జీవుడు ఏ మార్గం ద్వారా అయినా తన అంతిమ లక్ష్యమయిన మోక్షాన్ని, లేదా ముక్తిని, ఆత్మసాక్షాత్కారాన్ని పొందవచ్చు. అది ఆ మార్గం మానవత్వము కావచ్చు లేదా జ్ఞానం ద్వారా పొందవచ్చు. మరి కొందరు యోగ మార్గాన్ని అవలంబించవచ్చు. మరికొందరు భక్తిమార్గాన్ని ఎంచుకోవచ్చు. వీటిలో ఏ మార్గం ద్వారా అయినా స్థిత ప్రజ్ఞత్వం సాధించి బుద్ధిని, మనస్సును, ఇంద్రియాలను నిశ్చలస్థితిలో ఉంచగల్గినప్పుడు లక్ష్యాన్ని పొందవచ్చు.

ఈ భూమి మీద ప్రభవించిన ఏ మతమయినా దీనినే బోధిస్తుంది. అన్ని మతాల సారాంశము, అంతిమ లక్ష్యము ఒక్కటే. మనస్సును స్వాధీనంలో ఉంచుకొని శాంతిని పొందిన మహనీయులందరికీ నా వందనాలు.

ప్రియమైనవాడా! మనమిద్దరము మన ఆలోచనలు పంచుకొన్నాము. ప్రేమను పంచుకొన్నాము. నేను సముద్రాన్ని, నీవు పరమాత్మకు ప్రతిరూపానివి. నీవిప్పుడు సత్యాన్ని గ్రహించావు. ఈ సత్య సందేశాన్ని జీవితకాలము నీ హృదయములో నింపుకో. నీవు బుద్ధికి అతీతమయిన వాడివి, పరంజ్యోతివి, ప్రేమమూర్తివి. అందుచేత నీవు అమరత్వాన్ని పొందుతావు.

ఈ విధంగా నేను సముద్రము అందించిన సందేశాన్ని అర్థం చేసుకొన్నాను. విశ్వదర్శనం, కలిసి జీవించటం, ఎల్లలు లేని ఆత్మ జ్యోతిగా ప్రకాశించటము, స్థిత ప్రజ్ఞత్వము, అన్నింటిని అంగీకరించటము, నిశ్చల మానసిక ప్రశాంతత, లోపలా, బయటా అంతటా శాంతిమయ జీవనము, సమాధిస్థితిలో కూర్చుని సముద్రుని సందేశాన్ని ఆకళించుకున్నాను. నెమ్మదిగా ధ్యానం నుండి బయటపడి కళ్ళు తెరిచి చూచాను అంతులేని కృతజ్ఞతాభావంతో నా కళ్ళ నుండి ధారాపాతంగా కన్నీళ్లు కారసాగాయి. నేను సముద్రము యొక్క ఆత్మను దర్శించి, ఆయనకి వాగ్దానం చేశాను. సముద్రము నాకు అందించిన సత్య సందేశాన్ని ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సృష్టికర్త సృష్టించిన ఆయన బిడ్డలందరికీ దేశము, మతము బేధము లేకుండా అందిస్తాను.

ప్రియమైన సోదర సోదరీమణులారా! అన్ని మతాలకీ, సంప్రదాయాలకీ చెందిన ఆస్తికులందరికి నేను ఏదయితే సముద్రము ద్వారా అయిదు అంశముల సందేశాన్ని అందుకున్నానో, దాన్ని మీకు అందిస్తున్నాను. అది నాకు ఎంతో స్ఫూర్తిని, బలాన్ని అందించింది. అది మీకు కూడా ఎంతో మేలు చేస్తుందని నమ్ముతున్నాను. ఇది మీ అందరికి మీ ప్రియమైన సోదరుడు అందిస్తున్న ప్రార్థన.

గొప్పతనమంతా సందేశాన్ని అందించిన సముద్రానికి, దానిని సృష్టించిన పరమాత్మకు చెందుగాక!

**అధ్యాయం - 29**

# మంచు మీద జారిపడిపోయాను

మానవుడి జ్ఞానం చాలా తక్కువ. ఎవరికి తెలుసు మరు నిముషంలో ఏమి జరుగుతుందో కనీసం ఊహించను కూడా లేదు. ఏ నిముషంలో అయినా ఏదయినా జరగవచ్చు.

నేను మరియా మాత ఆశ్రమము నుండి న్యూయార్క్ శాంతి కేంద్రానికి వెళ్ళి అక్కడ ప్రవచనము చేయడానికి సిద్ధమవుతూ ఉన్నాను. మాతృమూర్తి శాంతిదేవీ, సోదరి రత్నం, కుమార్తె సుశీలాదేవి న్యూయార్క్ శాంతి కేంద్రంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. సమావేశానికి ముందు ఘనమయిన స్వాగతం ఇవ్వడానికి నిశ్చయించారు. నేను సాధ్యమయినంత తొందరగా వీలయితే సమావేశానికి ముందుగానే అక్కడికి చేరుకోవాలని ఆత్రుతతో ఉన్నాను. మానవుడు ఒకటి సంకల్పిస్తే దేవుడు మరొకటి సంకల్పిస్తాడని పెద్దలు చెప్పే మాటల్లో ఎంతో వాస్తవం ఉంది. సాధారణంగా మరియా మాత, సూర్యానంద శాంతి కేంద్రాలలో సమావేశాలకి దగ్గరుండి తీసుకువెళుతుంటారు. కాని వారు వేరే కార్యక్రమానికి వెళ్ళవలసినందున వారు నేను ఒక్కడినే వెళ్ళడానికి అనుమతించారు. అందువల్ల ఆ రోజు నేను మరియామాత ఆశ్రమాన్ని వదిలి భగవంతుడి తోడుగా ఒక్కడినే బయలుదేరాను.

భగవంతుడు తోడుగా ఉన్నప్పటికీ, జరగవలసినవి జరిగే తీరుతాయి. కర్మ సిద్ధాంతము నుండి దేవతలు, భగవంతుడు కూడా తప్పించుకోలేరు. మానవుడు తన జీవితానికి తానే కర్తనని భావిస్తుంటాడు. కాని పూర్వజన్మల్లో చేసిన కర్మల ఫలితాన్ని, లేదా ఈ జన్మలోనే చేసిన పనుల ఫలితాన్ని అనుభవించవలసి వస్తుంది. ఆ రోజు నేను చాలా ఆనందంగా ఉన్నాను. ఒక మంచి ఆధ్యాత్మిక కేంద్రాన్ని సందర్శించబోతున్నాను. అక్కడ ఎందరో భక్తులను, విద్యార్థులను, సాధకులను, జిజ్ఞాసువులను కలుసుకోబోతున్నాను. ఆనాటి ఆదివారం సాయంత్రం జరగబోతున్న సమావేశంలో అక్కడికి వచ్చే మంచి హృదయము, పవిత్రమయిన ఆత్మ కలవారు, భక్తులతో శాంతి సందేశాన్ని, ప్రేమానురాగాలను పంచుకోబోతున్నాను. కాని భగవంతుని సంకల్పము, నా పూర్వ



కర్మ ఫలితము వేరుగా ఉంది. నన్ను ఫిలడెల్ఫియా రైల్వేస్టేషన్‌కి తీసుకువెళ్ళడానికి కారు వచ్చింది. అక్కడి నుండి న్యూయార్క్ నగరము వందమైళ్ళ దూరములో ఉంది. కాబట్టి నేను న్యూయార్క్ శాంతి కేంద్రానికి ఉదయం పదిగంటలకే చేరుకుంటాను అని భావించాను.

అమెరికాలోని కొన్ని ప్రదేశాల్లో చలి విపరీతంగా ఉంటుంది. బకెట్లలోని నీరు కూడా మంచుగా మారిపోతుంది. ఇక రోడ్డు ప్రక్కన నడకదారి అంతా బురదలా మంచు పేరుకు పోతుంది. దాన్ని స్లీట్ అంటారు. మంచు, నీరులా కనిపిస్తుంది. వాతావరణంలో మార్పు వచ్చినప్పుడు నేలంతా మంచు పేరుకు పోతుంది. కాని చూడడానికి మాత్రం నీరులా కనిపిస్తుంటుంది. మంచు కురుస్తున్నప్పుడు చూడడానికి ఎంతో అందంగా ఉంటుంది. చెట్లు, భవనాలు అన్నీ తెల్లని మంచుతో కప్పబడిపోతాయి.

ఆ రోజు ఉదయం తెల్లవారుజామున మంచు లేదు గాని స్లీట్ ఉంది. దాన్ని చూచి నేను వాన నీరు అని భ్రమపడ్డాను. నేను ఆశ్రమము నుండి బయటికి వచ్చి చూచినపుడు రహదారి బాగా తడిసిపోయి ఉంది. నేను మెట్లు దిగి క్రిందికి రాగానే రహదారిపై కాలు పెట్టగానే కాలుజారి పడిపోయాను. నేనింకా కాలు జారింది అందుకే పడిపోయాను అని భావించాను. అందువలన లేచి కారు వద్దకు వెళ్ళడానికి ప్రయత్నించాను. మళ్ళీ వెంటనే జారి మంచులో పడిపోయాను. ఈసారి నేను ఎంతగా ప్రయత్నించినా పైకి లేవలేక పోయాను. కారు నడిపే వ్యక్తి బెల్ మ్రోగించి మరియా మాతను పిలిచాడు. కారు నడిపే వ్యక్తి సాయంతో మరియా నన్ను నెమ్మదిగా లేపి ఇంట్లోకి తీసుకెళ్ళి నా గదిలో మంచము మీద పడుకోబెట్టింది.

అమెరికా దేశంలో చలికాలంలో ఇలాంటి ప్రమాదాలు వేలల్లో జరుగుతుంటాయి. ఈ ప్రమాదాలను తప్పించుకోవడానికి ప్రజలు రబ్బరు తొడుగులను వాడతారు. మామూలుగా వాడే బూట్లపైన రబ్బరు తొడుగులు వాడతారు జారిపడిపోకుండా ఉండేందుకు వాటిని రక్షణగా ఉపయోగిస్తారు. కార్ల టైర్లను కూడా గొలుసులు వేసి రోడ్డు మీద జారిపోకుండా జాగ్రత్త పడతారు. ముఖ్యంగా ఎత్తైన కొండ ప్రదేశాలలో, రోడ్ల మీద చాలా ప్రమాదకరంగా ఉంటుంది. నాకు అనుభవం లేకపోవటం మూలంగా ఆ రోజు నేను రబ్బరు తొడుగులు వేసుకోలేదు.

మరియామాత ఎంతో అనుభవజ్ఞురాలయిన నర్సు కాబట్టి ఇలాంటి స్థితిలో ఎంత జాగ్రత్తగా చూసుకోవాలో బాగా తెలుసు. అందువలన వెంటనే వైద్యుడికి కబురు పెట్టింది. జాగ్రత్తగా పరీక్షించిన తర్వాత ఆయన ఎక్స్‌రే తీయవలసి ఉంటుందని, తుంటి ఎముక విరిగినట్లుగా అనుమానంగా ఉందని చెప్పాడు. అలాంటి పరిస్థితి ఉంటే నేను ఆసుపత్రిలో కొన్ని నెలలు ఉండవలసి వస్తుందని కూడా అన్నాడు. అది విన్న తర్వాత ఏమి చేయగలను? దేనిని మనము బాగు చేయలేమో, దాని గురించి ఎంతో ఓపికగా ఎదురుచూడాలి అంతే.

మరియా ఎంతో ఓపిగ్గా, ప్రేమగా బలవర్ధకరమయిన ఆహారాన్ని తయారుచేసి నా మంచం వద్దకే అన్నీ తీసుకువచ్చి తినిపించేది. తుంటి ఎముక విరగటం వలన కొంత నొప్పితో బాధపడినట్లు గుర్తుంది. ఈ విధమయిన ప్రమాదాలు సంభవించినపుడు అమెరికాలో వైద్యం కోసం చాలా ఖర్చు పెట్టవలసి వస్తుంది. మరియా, సూర్యానంద నా వైద్యం కోసం, మందులు, హాస్పిటల్ ఖర్చులు భరించగలిగేంత ధనవంతులు కారు. అందువలన వారు చాలా ఆందోళన చెందసాగారు. అది చూచి నాకు కూడా నిరాశ కలిగింది.

భగవంతునికి బాగా తెలుసు. తన బిడ్డలకి ఏది మేలు చేస్తుంది అనే విషయం. చిన్న పిచ్చుక నుండి పాకే చీమ గురించి కూడా ఆయన చూసుకుంటాడు. ఏమి జరిగినా అంతా మంచికే అంటారు. ఎందువల్లనంటే నేను శాంతి కేంద్రాల స్థాపన కోసం తపన పడుతూ పరుగులు పెడుతున్నాను. ఎందరో ధనవంతులు, భక్తులయిన మహిళలు అంకితభావంతో శాంతి కేంద్రాల స్థాపనకై పనిచేస్తున్నారు. అందరూ నా దగ్గర సాధన చేసే వారే. ఇప్పుడు ఈ పరిస్థితి చూస్తుంటే వారందరికి ఇది ఒక పరీక్షలా అనిపించింది నాకు. ఎవరు నిజమయిన భక్తులు, స్నేహితులు నా గురించి శ్రద్ధ తీసుకుంటారో, నేను తిరిగి మామూలు స్థితికి వచ్చేవరకు అంకిత భావంతో భక్తిశ్రద్ధలతో ఎవరు నా గురించి నిలబడతారో వేచి చూడాలి. అప్పుడు నేను మరియామాతతో వెంటనే న్యూయార్క్‌లోని భక్తురాలు శ్రీమతి జీన్ డి లిల్లికి ఈ ప్రమాదం గురించి తెలియచేయమని చెప్పాను. అది తెలిసిన వెంటనే ఆమె పరిస్థితిని తన చేతుల్లోకి తీసుకుని అన్ని ఏర్పాట్లు చేసింది. నన్ను న్యూయార్క్‌లోని వారి ఇంటికి తీసుకువెళ్ళాలని నిర్ణయించుకుంది. ఆమె ఇల్లు కూడా న్యూయార్క్‌లో శాంతికేంద్రంగా పనిచేస్తోంది.

నన్ను న్యూయార్క్ చేర్చటానికి ఎంతో ఖర్చు పెట్టి అంబులెన్స్‌ని పంపించింది. రత్నం, సుశీలా కూడా జాగ్రత్తగా వాళ్ళతో తీసుకువెళ్ళడానికి అంబులెన్స్‌లో వచ్చారు. వారందరూ ఎంతో దయా హృదయము గల మంచి వ్యక్తులు. మరియా నా తుంటి ఎముక విరిగినందుకు చాలా బాధపడుతోంది. ఆమె హృదయం ముక్కలయిపోయింది. అంతేకాక నాకు ఎంతో అవసరమయినప్పుడు సేవలు చేయడానికి అవకాశం లేకపోవటం ఆమెకు చాలా బాధ కలిగించింది. కాని పరిస్థితుల వలన తప్పనిసరిగా నన్ను వారితో పంపించడానికి అంగీకరించింది. నా వైద్యం కోసం చాలా ఖర్చు పెట్టవలసి వస్తుంది. హాస్పిటల్‌లో ఉంచాలి. తరుచుగా డాక్టర్లు, నర్సులు పర్యవేక్షణలో ఉండాలి. అన్నీ అర్థం చేసుకుని భగవంతుని ఇచ్ఛకు వదిలి నన్ను వారితో న్యూయార్క్ పంపటానికి సంసిద్ధురాలయ్యింది.

నేను ఒక్క అడుగు కూడా వేయలేని, కదలలేని స్థితిలో ఉన్నాను. అందువల్ల నన్ను స్ట్రెచర్ మీద ఏటవాలుగా పడుకోబెట్టి తీసుకువెళ్ళి అంబులెన్స్‌లో ఎక్కించారు. శాంతి దేవి, రత్నం, సుశీలా నా ఎదురుగా కూర్చొన్నారు. నేను కళ్ళు మూసుకొని నవ్వుతూ భగవంతునికి ధన్యవాదాలు తెలుపుకున్నాను. ధ్యానంలో మునిగిపోయాను. దైవము ఎల్లప్పుడూ నన్ను జాగ్రత్తగా గమనిస్తూ కాపాడుతున్నాడు. కేవలం నన్ను మాత్రమే కాదు. సృష్టిలోని ప్రతి ప్రాణి పట్ల ఆయన అంతే దయ చూపిస్తారు. నేను మంచు మీద జారిపడిపోయినపుడు నా పక్కనే ఉన్నాడు. ఎందువల్లనంటే దైవము సర్వత్రా వ్యాపించి ఉంటాడు. అది తెలుసుకోగలిగినవారు అదృష్టవంతులు. బాధల్లోనూ, సుఖాల్లోనూ, పరీక్షల్లోను, కష్టాల్లోనూ, జీవితంలో అనుకోకుండా జరిగే సంఘటనలన్నింటిలోనూ భగవంతుని మరిచిపోకుండా గుర్తుంచుకోగలిగినవారు ధన్యులు. వందమైళ్ళ దూరం ప్రయాణం చేసి న్యూయార్క్ నగరం చేరుకునేంత వరకూ మేమందరము మౌనంగా ధ్యానం చేస్తూ పరమాత్మకి ధన్యవాదాలు తెలియచేసుకున్నాము.

న్యూయార్క్ చేరుకోగానే ఎంతో సౌకర్యవంతమయిన శాంతిదేవి గారి ఇంటిలో మేడ పై భాగంలోని గదిలో నన్ను జాగ్రత్తగా పడుకోబెట్టారు. కొందరు అనుభవజ్ఞులు నన్ను హాస్పిటల్‌కి తరలించటం మంచిదని సలహా ఇచ్చారు. అక్కడ మంచి వైద్య సదుపాయాలు ఉంటాయని చెప్పారు కాని భక్తులు అందుకు అంగీకరించలేదు. శాంతాదేవి ఉంటున్న బహుళ అంతస్తుల భవనంలోనే క్రింది అంతస్తులో నా భక్తులు స్పానిష్

వైద్యుడు డా॥ డెల్‌వల్లి అతని భార్య మేరి ఉంటున్నారు. వారిద్దరూ కూడా నా వద్ద ధ్యానంలో మెలకువలు నేర్చుకునేవారు. వారు నా వద్ద ఉచితంగా ధ్యానం తరగతులకు వచ్చేవారు. ఇప్పుడు వారికి నాకు సేవలందించేందుకు చాలా మంచి అవకాశం దొరికింది. ఈ విధంగా నేను జబ్బుతో మంచంలో ఉన్నప్పుడు నాకు అవసరమయిన వైద్య సేవలు అందించి కృతజ్ఞతలు తెలియచేయాలనుకున్నారు. అందువలన వారు నన్ను హాస్పిటల్‌కి పంపించకుండా, లిల్లి ఇంటిలోనే ఉంచి వైద్యం చేయసాగారు. నా పూర్తి బాధ్యత ఆ దంపతులు తీసుకున్నారు. ఏమయినా సలహాలు, సూచనలు కావలసి వచ్చినప్పుడు ఆయన తన తోటి వైద్యులను కూడా తీసుకువచ్చేవారు. అందుచేత వారు కూడా నా సౌకర్యం కోసం ఇంటిని వైద్యశాలగా మార్చి నాకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చాలా జాగ్రత్తగా చూసుకున్నారు. దాని వలన ఖర్చు కూడా బాగా తగ్గింది.

నన్ను జాగ్రత్తగా చూసుకోవటానికి పగలు ఒకరు, రాత్రివేళ ఒకరు భక్తులయిన ఇద్దరు నర్సులను నియమించారు. ఎక్స్‌రే పరికరాలు డా॥ డెల్‌వల్లి హాస్పిటల్ నుండి తీసుకువచ్చి ఇంటిలోనే పరీక్షించారు. అతను నా వద్ద ధ్యానం నేర్చుకునే విద్యార్థి కనుక నా వైద్యం గురించిన పూర్తి బాధ్యతలు అతనికే అప్పగించబడ్డాయి. మా అందరికి అతని సామర్థ్యం మీద పూర్తిగా నమ్మకముంది. అందువలన అతను ఎలా నిర్ణయిస్తే అలాగే చేయాలని అనుకున్నాను. మరికొందరు అతనితో పాటు పనిచేసే వైద్యులు కూడా వచ్చి పరీక్షించి తుంటి ఎముకకి ఎక్స్‌రే తీశారు. మా అందరికి నిరాశను కలిగిస్తూ నా తుంటి ఎముక రెండు చోట్ల విరిగినట్లుగా నిర్ధారించబడింది.

భగవంతుని పట్ల అపారమయిన నమ్మకము కలవాడిని కావటం వలన, ఏమి జరిగినా అంతా ఆయన లీలగా భావిస్తాను. ఏది ఊరికే జరగదు. అంతా దైవ నిర్ణయం ప్రకారమే జరుగుతుంది అని నాకు బాగా తెలుసు. అందువలన నేను అంత బాధలో కూడా సంతోషంగా ఉండడానికి ప్రయత్నించేవాడిని. నేను ఒక రోజు, రెండు రోజులలో కాకుండా కొన్ని నెలల పాటు మంచం మీద గడపాల్సి ఉంటుంది కనుక ఈ సమయాన్ని జాగ్రత్తగా సద్వినియోగం చేసుకోవాలని నిశ్చయించుకున్నాను. కాని నా స్నేహితులు, భక్తులు, నా శ్రేయోభిలాషులు ప్రత్యేకంగా శాంతాదేవి నా పరిస్థితి చూసి చాలా విచారించారు. శాంతదేవి నన్ను తన సొంత బిడ్డలాగా ఎంతో జాగ్రత్తగా, ప్రేమగా చూసుకునేది. ఆమె నా కోసం నియమించిన నర్సులకు వారానికి వెయ్యి రూపాయలకు పైననే జీతంగా

ఇచ్చేది. నా పొట్ట మీద నుండి ఎడమ కాలు అంతా సిమెంటు కట్టు వేశారు. ఇప్పుడు నేను కుడి లేదా ఎడమ వైపుకు కూడా తిరుగలేని పరిస్థితి ఏర్పడింది. అలాంటి దుర్భరమైన స్థితిలో కూడా నేను ధైర్యం కోల్పోకుండా చిరునవ్వుతో నా భక్తులతో బాధపడవద్దు అని చెప్పేవాడిని. ఎప్పుడూ నవ్వుతూ, భగవంతుని ఉనికిని అనుభవిస్తూ ఉండాలని ప్రబోధించేవాడిని. ఇదంతా పరమాత్మ ధ్యానంలో కాలం గడపడానికి వచ్చిన గొప్ప అవకాశంగా నాకు అనిపించింది. భక్తులతో కూడా అదే విషయాన్ని చెప్పేవాడిని.

ఆకస్మికంగా జరిగిన ప్రమాదం గురించి తెలుసుకున్న నా భక్తులు, నా వద్ద ధ్యానం నేర్చుకునే విద్యార్థులు పగలు, రాత్రి తేడా లేకుండా గుంపులుగా వచ్చి నాకు సానుభూతి తెలుపుతూ విచారం వ్యక్తం చేయసాగారు. అదేపనిగా నన్ను చూడడానికి అలా అందరూ రావటం వలన నాకు చాలా ఇబ్బందిగా ఉండేది. డాక్టర్లు, నర్సులు కూడా అలా నన్ను ఇబ్బంది పెట్టకూడదని వారితో చెప్పారు. చివరికి చూడడానికి వచ్చేవారికి మధ్యాహ్న సమయాన్ని కేటాయించారు. కొందరు చూడడానికి వచ్చిన వాళ్ళు మాటలు, గుసగుసలు నాకు ఆందోళన కలిగించేవి. వచ్చినవాళ్ళు గతంలో జరిగిన ప్రమాదాల గురించి, వాళ్ళకు తెలిసిన వారికి జరిగిన ప్రమాదాల గురించి, అలాగే వార్తాపత్రికల్లో చదివిన వాటిని గురించి వివరిస్తుండేవారు. సమయం విలువ తెలిసిన నాకు వారి అనవసరపు మాటలు నా తుంటి ఎముక విరగటం వలన కలిగిన బాధ కంటే ఎక్కువగా అనిపించేది. అనవసరమయిన సానుభూతి, వ్యతిరేక భావాలు కల్గించే మాటలు ఎక్కువగా బాధించాయి. నా ఆలోచనలను కాగితం మీద రాసి వాటిని ముద్రించి చూడడానికి వచ్చే వారందరికీ ముందుగానే అందచేసేవాళ్ళము. దానితో వారు అలాంటి మాటలు ఏమీ మాట్లాడకుండా మౌనంగా చూచి వెళ్ళిపోయేవారు. అనుకోకుండా ఆ రోజు నేను వారికి ముద్రించి ఇచ్చిన కాగితం దొరికింది. అందులోని ప్రతి మాటా మీ కోసం ఇక్కడ వ్రాయాలి అని భావిస్తున్నాను.

## చూడడానికి వచ్చేవారికి సూచనలు

దయచేసి ముఖాలు వ్రేలాడేసుకుని, విచారంగా నన్ను చూడడానికి రావద్దు. వాటిని బయట వదిలిపెట్టి, చిరునవ్వుతో లోపలికి రండి. మంచి మాటలు మాట్లాడండి. దయచేసి మీ తాతగారికి, అమ్మమ్మ గారికి జరిగిన ప్రమాదాల గురించి మాట్లాడవద్దు. మీ జీవితంలో జరిగిన దురదృష్టకరమైన విషయాల గురించి, ప్రపంచంలోని బాధలు, కష్టాల గురించి

మాట్లాడవద్దు. విచారకరమైన ప్రమాదాలు, విమానాలు, రైళ్ళు పడిపోవటం గురించి వార్తాపత్రికల్లో చదివి వాటిని గురించి ఇక్కడ మాట్లాడవద్దు. తప్పనిసరిగా మాట్లాడాలి అని మీకు అనిపిస్తే భగవంతుని గురించి మాట్లాడండి. లేదా మౌనంగా ఉండండి. మీ అనవసర ప్రసంగాలు, వ్యర్థమైన ఆలోచనల ద్వారా దివ్యమైన దైవభావాన్ని అనుభవించకుండా అడ్డు పడవద్దు. మీ ప్రేమ, సానుభూతి అవసరమయిన వారి వద్దకు వచ్చినప్పుడు ఏమి మాట్లాడాలో బాగా ఆలోచించుకుని మాట్లాడండి. సందర్శకులకు, భగవంతుడు మీకు ఆశీర్వాదాలు అందించు గాక! మీరు నిశ్శబ్దంగా బయటికి వెళ్ళండి. సంతోషానికి మార్పు లేదు. శాంతిని ప్రసాదించుమని, అందరికీ ఆరోగ్యాన్ని అందించమని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను.

## అధ్యాయం - 30

# మౌనవ్రతం

ప్రతి అనుభవాన్ని చాలా గొప్పగా చేసుకోవటం నా స్వభావం. అనుభవం సంతోషమయినా, దుఃఖమయినా సరే, అలాగే అది మంచిదయినా లేక చెడ్డదయినా పర్వాలేదు. అడ్డంకులను అధిగమించి వాటినే పునాదిరాళ్ళుగా మార్చుకోగలిగిన వాళ్ళు భగవంతుని అనుగ్రహానికి పాత్రులవుతారు. తుంటి ఎముక రెండు చోట్ల విరగటం వలన నాకు కాలి వేలి దగ్గర నుండి తుంటి ప్రాంతం వరకు విపరీతమయిన నొప్పి వస్తుండేది. అలాంటప్పుడు కూడా నేను ఆధ్యాత్మిక మార్గంలో పురోగమించాలని సాధన చేసే సాధకులయిన నా భక్తులకు భగవదనుభూతి పొందటానికి సహాయపడటానికి ప్రయత్నించేవాడిని. అలుముకున్న మబ్బులు, అడ్డంకులు, బాధలు ఈ రోజో రేపో అతి తొందరలోనే తొలగిపోతాయి. లేదా కొంతకాలము పట్టవచ్చు. శాశ్వతంగా, నిత్యంగా ఉండేది, దేదీప్యమానంగా తేజోమయంగా వెలుగులు ఇచ్చేది మన అంతఃకరణంలో వెలిగే ఆత్మజ్యోతి మాత్రమే. దీనిని అందుకోవటము ప్రతి వ్యక్తికి గమ్యం కావాలి.

డాక్టరు డెల్‌వెల్లి దయగల నర్సు. డెల్‌వెల్లి గారి ధర్మపత్ని ఇంకా ఇతర వైద్య బృందము, భక్తులు అందరూ ఎంతో ప్రేమతో నన్ను చాలా జాగ్రత్తగా సంరక్షించారు. వాళ్ళందరూ

కూడా నన్ను తమ సొంత కుటుంబ సభ్యుడిలాగా, వారి జీవితంలో ఒక భాగంలాగా భావించి సేవలు చేశారు. నన్ను చూడడానికి దగ్గరిలోని వారేకాకుండా ఎంతో దూర ప్రాంతాల నుండి కూడా భక్తులు, సాధకులు వస్తు ఉండేవారు. నా శరీరంలో సగభాగం కట్లతో నిండిపోవటం వలన నాకు చాలా ఇబ్బందిగా ఉండేది. జాన్ హెన్‌రాహన్ ప్రఖ్యాత న్యాయవాది. చాలా మంచివాడు. నా ధ్యాన తరగతులకు తప్పనిసరిగా హాజరయ్యేవాడు. నన్ను చూడడానికి ప్రతి రోజు తప్పకుండా వచ్చేవాడు.

హన్‌రాహన్ ప్రకృతి వైద్యంలో నిపుణుడు కావటం వలన నా ఒళ్ళంతా చక్కగా మసాజ్ చేసేవాడు. మసాజ్, తొట్టి స్నానం ఇంకా ఇతర ప్రకృతి వైద్య విధానాలు శరీరానికి మంచి ఆరోగ్యాన్నిచ్చి చాలా సహాయం చేస్తాయి. నేను మంచంపై పడుకొని ఉంటే నా శరీరాన్ని అతి లాఘువంగా కట్టు ఉన్న భాగాన్ని తాకకుండా మసాజ్ చేసేవాడు. కొన్నిసార్లు అర్ధరాత్రి వరకు నాకు సేవ చేస్తూ ఉండిపోయేవాడు. దాదాపు రాత్రి 2, 3 గంటలకి ఇంటికి చేరుకునేవాడు. చాలా దూరం ప్రయాణం చేయాల్సి వచ్చేది. అతను ఎంతటి దయ, ప్రేమ, కరుణ కలిగిన వ్యక్తి! అతని అద్భుతమయిన, శక్తిమంతమయిన మసాజ్‌ని, పవిత్రమయిన ఓంకారాన్ని జపిస్తూ గంటల తరబడి చేసేవాడు. అతను శాంతి కేంద్రాలలో నా సందేశాలను శ్రోతలకి వినిపిస్తూ ఉండేవాడు. నా సందేశాలను అతని కార్యాలయములో టైపు చేసి తెస్తుండేవాడు. ఇలా ఎన్ని రకాల సేవలు అవి, ఇవి అన్ని చెప్పలేనివి ఎన్నో చేసేవాడు. అంకితభావంతో, ఎంతో నమ్మకమయిన తూర్పు దేశాల్లో అంతరంగ శిష్యుడిలా ప్రవర్తించేవాడు. భగవంతుడు ఎంత దయామయుడు. నా పట్ల ఎంతటి కరుణామృతాన్ని వర్షించాడు!!

నన్ను దర్శించడానికి వచ్చే భక్తుల కోసం ప్రత్యేక సమయాన్ని కేటాయించినా వేరే సమయాల్లో కూడా కొందరికి అవకాశం ఇవ్వవలసి వచ్చేది. వైద్యులు, సన్నిహితులు, అంతరంగ భక్తులు, అలాగే చాలా దూర ప్రాంతాల నుండి వచ్చేవారికి మినహాయింపు ఉండేది. కొందరు వృద్ధులు కూడా వచ్చేవారు. అలాంటప్పుడు వారిని నేను కాదు అని చెప్పలేకపోయేవాడిని. నేను మంచం మీద కట్లతో పడి ఉండడం వలన శ్రీమతి లిల్లి ఇంటి ఆవరణలో జరిగే శాంతి సమావేశాలు తరుచుగా నా గదిలోనే జరుగుతుండేవి. అలాంటప్పుడు కేవలం కొద్ది మంది భక్తులు నా మంచం చుట్టూ కుర్చీలలో కూర్చునేవారు. మంచి భక్తురాలయిన ఒక నర్సు నా గురించి ఎంతో శ్రద్ధ వహించి సేవలు చేసేది.

ఆమె పేరు విక్టోరియా. తను నన్ను ఒక స్నేహితుడిలా, అన్నలా భావించేది. ఆమె శాంతి సందేశాలను ఇష్టపడి నిస్వార్థమయిన సేవలు అందించటానికి భారతదేశం వచ్చి శాంతి ఆశ్రమంలో ఉండాలని చాలా ఆరాటపడేది. నాకు సేవలు చేయటంతో పాటు, నాకు వచ్చే ఉత్తరాలకి ప్రత్యుత్తరాలు వ్రాయటం చేసేది. అమెరికా భక్తులు, అలాగే భారతదేశం నుండి ఎందరో భక్తులు ఉత్తరాలు వ్రాస్తుండేవారు. ఆమె తన పేరును సేవాదేవి అని మార్చుకుంది. ఒక దేవతలాగా ఆమె నాకు రాత్రి, పగలు ప్రేమతో సేవలు అందించింది.

నేను తప్పనిసరిగా విశ్రాంతి తీసుకోవాల్సి వచ్చింది కనుక ఆ సమయాన్ని బాగా సద్వినియోగం చేసుకోవాలని నిశ్చయించుకున్నాను. అది నా ఆధ్యాత్మిక జీవితానికి గొప్ప ప్రగతిని ఇస్తుంది. దివ్య చైతన్యంలో లీనమవటానికి, అంతర్ముఖమవటానికి, అంతరంగంలో వెలిగే దివ్యజ్యోతిని అనుభవంలోకి తెచ్చుకోవటానికి వినియోగించుకోవాలని భావించాను. నలభై రోజులు మౌన దీక్ష చేయాలని ఒక మాట కూడా మాట్లాడకూడదని కట్లుతో మంచంపై బాధ పడుతున్నప్పటికీ అలాగే చేయాలని నిశ్చయించుకున్నాను. మౌనదీక్షలో ఉన్న సమయంలో ఏదయినా చేయాలన్నా, చెప్పాలన్నా కాగితం మీద వ్రాసి చూపించేవాడిని. విదేశీయులకు మౌనదీక్ష అంటే తెలియదు. అందువలన దానిని అర్థం చేసుకోవటం వారికి చాలా కష్టంగా ఉండేది. కొన్నిసార్లు ఒకదానికి ఒకటని అర్థం చేసుకొనేవాళ్ళు. ప్రత్యేకంగా నేను జబ్బుతో మంచంలో ఉండగా మౌనదీక్ష ఏమిటి అని వారికి అనిపించేది. నాకు ఎంతో ప్రేమతో సేవలు చేసే నర్సుకి ఇది చాలా ఇబ్బందిగా ఉండేది. కాని ఒకటి రెండు రోజుల్లోనే వాళ్ళకి నా మౌనాన్ని అర్థం చేసుకోవటం తేలికయింది. భక్తులకి, నన్ను చూడడానికి వచ్చేవారికి కూడా నెమ్మదిగా అలవాటయింది.

సాయంత్రపు సమయాల్లో నాకు సేవ చేయడానికి స్పానిష్ నర్సు వచ్చేది. ఆమె మంచి భక్తురాలు. ఆమె ఎంతో సంతోషంగా తను పెంచుకొంటున్న పెంపుడు కొండచిలువ గురించి నాకు చెపుతూ ఉండేది. ఆమె దాన్ని తనతో తాను నివసిస్తున్న అపార్టుమెంటులోనే పెంచుకుంటున్నది. అది చాలా పెద్ద పాము అవటం వలన మిగిలిన అపార్టుమెంటుల్లో ఉండేవాళ్ళు చాలా భయపడేవారు. న్యూయార్క్ లాంటి జన సాంద్రత గల పెద్ద నగరాల్లో అలాంటి ప్రమాదకరమైన కొండచిలువను ఇంటిలో ఉంచుకోవటం మంచిది కాదని

చెప్పేవారట. కాని ఆమె తాను పెంచుతున్న పాము ఎలాంటి హాని చేయదని, అది చాలా సాధుజంతువని చెప్పేది. అంత పెద్ద పాము ఆ నర్సుతో పాటు నిద్రపోతుంది అని తెలిసి నేను చాలా ఆశ్చర్యపడ్డాను. వాళ్ళిద్దరూ ఒకరినొకరు ఎంతో ప్రేమించు కునేవారు. ప్రేమ ఎక్కడ ఉంటుందో దైవం అక్కడ ఉంటాడు. ప్రేమ మూగజీవాల ద్వారా లేదా మానవుల ద్వారా ప్రకటించబడినా అక్కడ దివ్యత్వం నెలకొంటుంది.

నేను మౌనదీక్షలో ఉన్న సమయంలో నా హృదయంలో అనేక ఆలోచనలు, భావాలు మెదలుతుండేవి. వాటిని అందరికీ ఉపయోగపడాలని ఇక్కడ వ్రాస్తున్నాను.

"ప్రియమైన బిడ్డా! భగవదనుభవం పొందడానికి నలభై రోజులు మౌన వ్రతం కావాలా? ఈ క్షణంలో దైవము నీతో లేడా? దైవాన్ని ఇప్పుడు నీవు మర్చిపోయినందుకు నీకు సిగ్గు అనిపించటం లేదా? నీవింతగా నమ్మకాన్ని ఎలా కోల్పోయావు? జీవమున్న ప్రతి ప్రాణి హృదయంలో నివసించే దైవాన్ని నీవు ఎలా విస్మరించగలవు? నలభై రోజుల మౌనదీక్ష అవసరమా భగవంతుని తెలుసుకోవడానికి? ఆయన ఈ క్షణంలోనే నీ స్వరూపంగానే విరాజిల్లుతున్నాడు కదా? కంటికి కనిపించని ఆత్మ స్వరూపంగా విశ్వమంతా వ్యాపించి లేడా? నలభై రోజుల మౌనదీక్ష బదులుగా నలభై గంటలు సరిపోదా? లేదా నలభై నిముషాలు సరిపోవా? అది కూడా చాలా ఎక్కువ సమయం కాదా? నలభై సెకండ్లు చాలవా? నీ లోపల ఆత్మ చైతన్యం దేదీప్యమానంగా వెల్గుతుంటే నలభై సెకండ్ల కాలం కూడా ఎలా ఎదురుచూడగలవు? మేల్కొని, లేచి నీలోనికి నీవు మునిగిపో, ఆత్మలో లీనమయిపోతావు. గట్టిగా పట్టుకో. దైవం నీలోనే ఉన్నాడు ఈ క్షణంలో. ఈ క్షణం నీలోనే జీవిస్తున్నాడు. ఇప్పుడు, ఈ క్షణంలోనే నీవు గుర్తించు. ఒక్క సెకనులో నీలోని ఆ దివ్య చైతన్య స్వరూపాన్ని, తేజోమయ కాంతిని గుర్తించి, అందులో మునిగిపో. అప్పుడు నీవే దైవము, దైవమే నీవు. ఎలాంటి అభేదము ఉండదు. ఆ చైతన్యానికి సమయము, దేశము, కారణము అనే పరిధులు ఉండవు. శాంతిగా ఉండు".

## తత్త్వమసి, అది నీవే అయి ఉన్నావు

ఆ రోజులు నిజంగా దైవానుగ్రహం వలన అనుక్షణము పరమాత్మ సన్నిధిని మౌనదీక్షలో హాయిగా అనుభవిస్తూ గడిచిపోయాయి. మౌనదీక్షతో పాటుగా ఉపవాస దీక్ష కూడా చేయాలనుకున్నాను. నాకు ఉపవాస దీక్ష చేయటం అంటే చాలా ప్రీతి.

కాని నాకు వైద్యం చేస్తున్న వైద్యులు, స్నేహితులు, ప్రియమయిన భక్తులు ఆ ఆలోచనని పూర్తిగా మానుకోవాలని అభ్యర్థించారు. అందువలన నేను కేవలం మౌనదీక్షతో తృప్తిపడి ఉపవాసదీక్షను మానుకున్నాను.

చాలా మంది నన్ను చూడడానికి వచ్చేవారు విచారవదనాలతో వస్తుండేవారు. వారికి నన్ను ఒంటి నిండా కట్లతో మంచం మీద ఒక రోగిలా చూడడం చాలా బాధగా ఉండేది. కాని నేను ప్రపంచంలోని అందరికన్నా సంతోషంగా, ఆరోగ్యంగా ఉండే వ్యక్తిలా అనుకునేవాడిని. సంతోషంగా, చిరునవ్వుతో ఉన్న నన్ను చూడగానే వారందరూ వారి దుఃఖాన్ని, బాధని మర్చిపోయి వాళ్ళు కూడా ఆనందంగా మారిపోయేవాళ్ళు. వచ్చినవాళ్ళు కాసేపు నా గదిలో మౌనంగా ధ్యానంలో గడపగానే వాళ్ళ ముఖంలో నూతన తేజస్సు, హృదయంలో ఆనందం, ప్రశాంతత, ప్రేమ అంకురించేవి. నాకు ఇంకా గుర్తుంది. అలా దిగాలుగా వచ్చే వారి గురించి మంచి భావాలు, ఆలోచనలు, ఆధ్యాత్మిక సూచనలు కాగితం మీద వ్రాసి ఇచ్చేవాడిని.

## దైవసన్నిధికి ఆహ్వానం

“మీ ప్రేమామృతమయిన దర్శనానికి ధన్యవాదాలు.

మీరు చూపించే ప్రేమకు ప్రతిఫలంగా ఏమి ఇవ్వగలను? దయచేసి మీ హృదయంలో ప్రేమ, శాంతితో నింపుకోకుండా ఈ గదిని, నన్ను వదిలి వెళ్ళవద్దు. మనం కల్సి నిశ్శబ్దంగా ధ్యానం చేద్దాము. దయచేసి మీ మీ పనులు చేసుకోవటానికి భౌతిక ప్రపంచంలోనికి వెళ్ళేటప్పుడు జ్ఞానజ్యోతిని వెంట తీసుకు వెళ్ళండి. ధ్యానంలో పూర్తిగా మునిగిపోయి ఆ పాంచ భౌతిక దేహాన్ని, బుద్ధిని, ప్రపంచాన్ని పూర్తిగా మర్చిపోదాము. మీ లోపల జ్యోతి వెలుగుతోంది. మీరు ఆ వెలుగులో ఉన్నారు. మీరే ఆ జ్యోతి స్వరూపము. దయచేసి ఆ జ్యోతి మీ లోపలా, బయటా అంతటా పరుచుకొని ఉన్నదని భావన చేయండి. మీ అణువణువులో ఆ దివ్యజ్యోతి వెలుగుతోంది. దయచేసి ఇప్పుడు, ఎల్లప్పుడు ఓంకారాన్ని జపిస్తూ ప్రతి అడుగూ వేయండి. భగవంతుడు మిమ్మల్ని ఆశీర్వదించు గాక! ఎల్లప్పుడు దైవానుభూతిలో ఉందురుగాక!”

నా గది ఎప్పుడూ అందమయిన సువాసనలు వెదజల్లే పూలగుత్తులతో నిండిపోయి ఉండేది. గులాబీలు, లిల్లీలు, క్రిశాంతిమమ్ పూలు, అలాగే ఎన్నో రకాల పళ్ళు, ఆధ్యాత్మిక

గ్రంథాలు ఇంకా అనేక ఇతర వస్తువులు గది నిండా ఉండేవి. పాశ్చాత్యులు కూడా మన తూర్పుదేశపు ఆధ్యాత్మిక సోదరుల మాదిరిగా ఏదో ఒక కానుక తీసుకు వస్తారు తప్ప ఖాళీ చేతులతో దర్శనానికి రారు. పెద్దలు చెపుతుంటారు కదా, ఎవరయినా మహాత్ములు, సాధువులు, పెద్దవారు, రాజులు, దేవాలయాలకు వెళ్ళేటప్పుడు ఒట్టి చేతులతో వెళ్ళరాదు అని. మన భారతదేశంలో భక్తులు సాధారణంగా కొబ్బరికాయలు, అరటిపళ్ళు, పూలు తీసుకువస్తుంటారు.

ఒక పర్యాయం అమెరికాలో ఒక భక్తురాలు ధ్యానం నేర్చుకున్న తర్వాత "స్వామీజీ! నేను ఎంత మూల్యం చెల్లించాలి?" అని అడిగింది. ఆమెతో నేను చిరునవ్వుతో "నా ప్రవచనాలు ఎవరయినా ఎలాంటి మూల్యము చెల్లించవలసిన అవసరం లేకుండానే వినవచ్చు. ఏ విధంగా సూర్యకాంతిని అనుభవిస్తున్నామో, ఏవిధంగా స్వేచ్ఛగా గాలిని పీలుస్తున్నామో అదే విధంగా స్వేచ్ఛగా పొందవచ్చు" అని చెప్పాను. ఆమె మధురంగా సమాధానమిచ్చింది. "ఓ స్వామీజీ! మీ వద్ద నుండి పొందిన దానికి మేము తప్పకుండా మూల్యం చెల్లించాలి. లేదంటే మేము పొందిన దానికి ఫలితము లభించదు. మూల్యం చెల్లించకుండా ఉచితంగా పొందిన దాని వలన ఎలాంటి ప్రయోజనం కలగదు" అని చెప్పింది. నా స్నేహితులు, భక్తులు చాలా ఉదార స్వభావం కలవారు.

ఈ ప్రపంచంలో అందరూ ధనవంతులే ఉండరు. చాలామంది నిరుపేదలుంటారు. ఎవరికి అవసరం ఉంటుందో, అలాంటి నిరుపేదలకు నాకు తోచిన సహాయం చేసేవాడిని. కొందరు భక్తులు చాలా పెద్ద కుటుంబం, బాధ్యతలు ఉన్నవారు బస్సు చార్జీలు గాని, టాక్సీకి డబ్బులు గాని చెల్లించలేని పేదవారు నన్ను చూడడానికి వస్తుండేవారు. వారికి నేను వెళ్ళేటప్పుడు కవరులో డబ్బులు పెట్టి మూసివేసి ఇచ్చి ఇంటికి వెళ్ళిన తర్వాత తెరిచి చూడమని చెప్పేవాడిని. భగవంతుని బిడ్డలకి చేతనయిన సహాయం చేయటం అంటే స్వయంగా కనిపించని ఆ దైవానికి సేవచేయటమే అవుతుంది. ఇవ్వగలిగే వారు అదృష్టవంతులు.

అధ్యాయం - 31

# ఒంటినిండా కట్లతో క్రిష్టమస్ పండగ సంబరాలు

నా జీవితంలో ఎందరో మాతృదేవతల, సోదరీమణుల ఆశీస్సులు పొందాను. కేవలం తూర్పు దేశంలోనే కాదు పశ్చిమదేశాల వారి ఆశీస్సులు కూడా అందాయి. వాళ్ళందరూ నన్ను వారి సొంత బిడ్డలాగా లేదా సోదరుడిలాగా భావించేవారు. మనము వారిని ప్రేమిస్తే వారు కూడా మనల్ని ప్రేమిస్తారు. నాకు, ఇతరులకు గజం దూరం ఉన్నా వారికి, నాకు కూడా అదే గజం దూరం ఉంటుంది. ఒకవేళ వేయి మైళ్ళ దూరం నేను ఇతరులతో ఉంటే వారు కూడా నాకు వెయ్యి మైళ్ళ దూరంగా ఉంటారు. దైవ నిర్ణయం అందరికీ ఒకే విధంగా వర్తిస్తుంది. అన్ని కాలాల్లో ఇదే వర్తిస్తుంది. ప్రేమించే వాళ్ళు ప్రేమించబడతారు అనే న్యాయం ప్రపంచంలోని వారందరి పట్లా ఒకే విధంగా వర్తిస్తుంది. మన హృదయంలో ప్రేమ ఉంటే ప్రపంచమంతా ప్రేమమయంగా కనిపిస్తుంది. కాని మనం కఠినంగా, ఈర్ష్యా ద్వేషాలతో ఉంటే మనం ప్రపంచంలో ఎక్కడికి వెళ్ళినా మనకు కూడా అవే ఎదురవుతాయి.

దాదాపు నలభై సంవత్సరాల క్రితం 1929వ సంవత్సరంలో క్రిష్టమస్ పండగ దినాలు. మీరు ఎవ్వరూ ఊహించలేరు. అలాగే నేను కూడా మీకు వర్ణించి చెప్పలేను. నా స్నేహితులు, నా వద్ద ధ్యానం నేర్చుకున్న విద్యార్థులు, భక్తులు శాంతి కేంద్రాల సభ్యులు న్యూయార్క్ నగరంలోని వారే కాక అమెరికా అంతటి నుండి వచ్చిన వారందరూ వారి ప్రేమామృతాన్ని నా మీద వర్షింపచేశారు. శాంతిదేవి, శ్రీమతి జీన్‌లిల్లి, ఖర్బాన్, శ్రమకి వెనకాడకుండా క్రిష్టమస్ పండుగ వేడుకలు నా జీవితాంతము గుర్తుండిపోయేలా ఘనంగా చేశారు. చాలా పెద్ద క్రిష్టమస్ చెట్టుని నా గదిలో ఉంచి దానిని రంగు రంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. మంచి ఛాయాగ్రాహకుడిని పిలిపించి వేడుకల ఛాయా చిత్రాలు తీయించారు. నా మంచానికి కుడివైపుగా క్రిష్టమస్ చెట్టును పెట్టారు. శాంతిదేవి, సుశీలా నా మంచం దగ్గరగా కూర్చున్నారు. ఎడమవైపు జీసస్ క్రీస్తు ఛాయా చిత్రం చాలా అందమైన దానిని తెచ్చి అమర్చారు. ఆ రాత్రి అంతా ఆయన దివ్య స్మృతులతో పవిత్రంగా గడిపాము. అది క్రీస్తు అందమయిన చిత్రపటము. దానిని నేను భారతదేశానికి తీసుకువచ్చాను. ఆ చిత్రపటము మాతృసంస్థ అయిన శాంతి

ఆశ్రమము తోటపల్లి కొండల్లోని సుశీలా మందిరంలో వ్రేలాడుతూ ఉంటుంది. దీని వలన పాఠకులకు ఆ రాత్రి నేను క్రిష్టమస్ వేడుకలను ఎంత ఆనందంగా గడిపానో బాగా అర్థమవుతుందని భావిస్తున్నాను. నా ఆత్మకథలో జీసస్ క్రీస్తు రంగుల చిత్రపటము గురించి, ఆయన దివ్య జీవనం గురించి ఉండాలని నా కోరిక.

**రోజాపూల మంచంపై స్వామీజీ :**

నా భక్తురాలయిన నర్సు ఒక చక్కని వ్యాసము వ్రాసి నాకు ఇచ్చింది. దాని పేరు "రోజాపూల మంచంపై స్వామీజీ" దాదాపు రెండు వేల సంవత్సరాలకు పూర్వము గొఱ్ఱెల కాపరులు తూర్పువైపున ఒక దివ్య నక్షత్రాన్ని గమనించారు. అప్పటి నుండి తూర్పు నుండి మహాత్ములు వస్తూనే ఉన్నారు. 1929వ సంవత్సరము క్రిస్మస్ పండుగ నాడు ఒక మహాత్ముడు మంచం మీద ఒంటి నిండా కట్లతో పడుకొని ఉన్నాడు. చైతన్య రహితంగా, అందమయిన ఆయన దివ్య సన్నిధిలో ధ్యానము చేస్తుంటే, నాకు ఒక ఆలోచన వచ్చింది, అది మాకందరికి కూడా మళ్ళీ ఆయన తిరిగి జన్మించాడు అనిపిస్తోంది. ఆయన మమ్మల్ని అందరినీ మమ్మల్ని మేము తెలుసుకునేలా చేశారు. నిశ్శబ్దంగా ఆ రాత్రి ఎంతో పవిత్రంగా గడిచింది.

ఆయన మంచం మీద ఉన్నా తన ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏవీ మరిచిపోలేదు. వచ్చిన వాళ్ళకి మంత్రదీక్ష ఇవ్వటము, ధ్యాన తరగతులు నిర్వహించటము, ప్రవచనాలు, సందేశాలు యధావిధిగా కొనసాగించారు. వారి సందేశాలలో ఇలా వివరించారు. ఒకసారి జీసెస్ క్రీస్తు నలభై రోజులు పర్వతాల్లోకి వెళ్ళిపోయారని, వేరొక సందర్భంలో క్రీస్తు అక్కడ నిశ్శబ్దంగా గాఢమయిన ధ్యానంలో మునిగిపోయి పరమాత్మతో అనుసంధాన మయ్యారని చెప్పారు. నలభై రోజులు మౌనంగా గడపటం అనేది అమెరికా వంటి దేశాల్లో అసంభవమనిపిస్తోంది. కాని స్వామీజీ మా ముందే నలభై రోజులు మౌనవ్రతంలో ఉన్నారు. లెక్కలేనంత మంది పవిత్ర హృదయము గలవారు వారి గదిలో ధ్యానంలో గడిపి మౌనంగా కళ్ళ నిండా నీళ్ళతో బయటికి వస్తుండేవారు. వాళ్ళు లోపలికి వెళ్ళేటప్పుడు ఏవేవో మాట్లాడాలనుకొనేవారు. కానీ స్వామీజీ పవిత్రమయిన సన్నిధిలో ఆధ్యాత్మిక ఆలోచనలు మాత్రమే ఉండేవి. మౌనంగా భగవంతునితో మాట్లాడి తిరిగి వచ్చేవారు. ఒక్కటే ఆలోచన కలిగేది మేము భగవంతుని ఉపకరణాలుగా పనికివస్తామా? అనిపించేది.

అమెరికా దేశమంతటా స్వామీజీ కార్యక్రమాలు నిశ్శబ్దంగా జరిగిపోతున్నాయి. ఈ ప్రపంచం స్వామీజీ ఆధ్యాత్మిక ప్రేమను అర్థం చేసుకునేంత స్థాయికి ఇంకా ఎదగలేదు. కాని వారు ప్రయత్నం చేస్తున్నారు. ఆయనలాగా జీవించాలని, ఆయనలాగా మాట్లాడాలని, ఆయన లాగా ప్రేమను పంచాలని ప్రయత్నిస్తుంటారు. వారి లాగా చాలామందికి కాకపోయినా కనీసం కొద్దిమందికి అయినా ప్రేమ అందించాలని అనుకుంటారు. చాలా సంవత్సరాల నుండి ఆయన కార్యక్రమాలు నిరంతరాయంగా జరుగుతున్నాయి. ఎందరో ఉన్నత స్థితిని పొందారు. అందరు ఆయనని మహాత్ముడు అంటారు. భారతదేశానికి శాంతి కేంద్రాలకు మేమెంతో ఋణపడి ఉంటాము. అది మేము ఎప్పటికీ తీర్చుకోలేము. స్వామీజీ మాకు అందించిన సేవలు అలాంటివి. నేను ఎంతో వినయంగా చెపుతున్నాను. ఆ మహానుభావుడికి కొన్ని నెలలు సేవలు అందించగలిగే అవకాశం దొరకటం నా అదృష్టం. ఆయన మాకు ఇచ్చిన దానికి మేము భారతదేశానికి, స్వామీజీకి ఎప్పటికి ఋణపడి ఉంటాము".

ఆమె ఒక ప్రార్థనా గీతాన్ని కూడా రచించింది.

## ప్రార్థన - 1

**కదిలించు నన్ను! ఓహ్ కదిలించు నన్ను! ప్రభూ!**
**అది ఏ విధంగా చేస్తావో నాకు తెలియదు**
**నీ ప్రేమ కోసం పరితపించే విధంగా నా హృదయాన్ని కదిలించు**
**ఇవ్వటానికీ, వెళ్లటానికీ, ముఖ్యంగా నిన్ను ప్రార్థించటానికీ**
**నీ ఉనికి ద్వారా ప్రతి ఆత్మ కదిలేదాకా కదిలించు ప్రభూ!**
**కదిలించు నన్ను! ఓహ్ కదిలించు నన్ను! ప్రభూ!**
**నీ హృదయం దివ్యప్రేమ జ్వాలతో కదిలిపోయింది**
**నీ ఒక్కగానొక్క ప్రియాతిప్రియమయిన కుమారుడిని**
**మాకు ఇచ్చివేసే దాకా కదిలిపోయింది**
**దుర్భరమైన శిలువ లాంటి జీవితం నేను గడపవల్సి వచ్చినా**
**నన్ను నేను నీకు సమర్పించుకునే విధంగా కదిలించు నన్ను**
**అప్పుడు ఇంక మళ్ళీ నీవు నా ద్వారా**
**నిన్ను నీవు ఇవ్వవల్సిన పని ఉండదు**

క్రిష్టమస్ సందర్భంగా నాకు ఎన్నో విలువయిన బహుమతులు భక్తులు ఇచ్చారు. అలాగే శాంతాక్లాజ్, స్నేహితులనుండి కూడా బహుమతులు అందాయి. నేను ఎప్పుడూ శ్రీమతి జేన్ డి లిల్లి, మన శాంతాదేవికి ఋణపడి ఉంటాను. నేను అనారోగ్యంతో మంచంలో ఉన్నప్పుడు నా వైద్యం కోసం ఆమె చాలా డబ్బు ఖర్చు పెట్టింది. దాదాపు మూడు లక్షల రూపాయలకు పైగా ఆమె నా గురించి ఖర్చు చేసింది.

క్రిష్టమస్ పండుగకి వచ్చిన కానుకలన్నింటిలోకి విలువైనది సినిమాలు తీసే కెమేరా, ప్రొజెక్టరు. ఎప్పుడో ఒకసారి నేను మాతృసంస్థ అయిన శాంతి ఆశ్రమంలో ప్రొజెక్టర్ ఉంటే బాగుంటుందని, దాని వలన ఆశ్రమ కార్యక్రమాలు చక్కగా ప్రచారమవుతాయి అని చెప్పాను. అది విని గుర్తుంచుకున్న శాంతాదేవి చాలా ఉదారంగా ప్రేమతో, ముఖ్యంగా శాంతి ప్రచారం నిమిత్తమై దానిని నాకు బహుమతిగా ఇచ్చింది. కెమేరాతో పాటుగా, ప్రొజెక్టర్, తెర ఇంకా అవసరమయిన సామగ్రి కూడా తెచ్చింది. సినిమా తీయడానికి పనికివచ్చే వస్తువులన్నీ ఇచ్చింది. అది 16 ఎమ్.ఎమ్. సినిమా కెమేరా. అది ఇప్పుడు కూడా మా మాతృసంస్థ అయిన శాంతి ఆశ్రమంలో వినియోగిస్తున్నాము. మా శాంతాదేవి, ఎంతో దయతో కొన్ని రీళ్ళను కూడా తెచ్చింది. అందులో ఒక సినిమా 4000 ఫీట్, 'అంకుల్ టామ్స్ క్యాబిన్' అనే ప్రసిద్ధ అమెరికా సినిమా అది. ఇంకొక సినిమా శాంతి ఆశ్రమానికి ఇచ్చింది. అది 'పాము, ముంగిస మధ్య పోరాటం' ఇంకా కొన్ని భారతీయ చలన చిత్రాలు కూడా ఇచ్చింది. భగవంతుడికే తెలియాలి ఆమె వీటన్నింటికి కోసం ఎంత ధనం ఖర్చు పెట్టిందో. ముందే ఆమె నా ఆరోగ్యం కోసం చాలా ధనం ఖర్చు పెట్టింది. అది కూడా ఎంతో ప్రేమతో, చిరునవ్వుతో ఖర్చు చేసేది. ఆమె నన్ను తన సొంత బిడ్డలా భావించి నా కోసం, నా సౌకర్యం కోసం ఎంతయినా ఖర్చు పెట్టడానికి సిద్ధంగా ఉండేది. నన్ను ఎప్పుడూ సంతోషంగా, సంతృప్తిగా ఉంచడానికి ప్రయత్నించేది.

ఆమె చాలా మంచిది. భగవంతుడు నా జీవితంలో మొదటినుండి చివరి దాకా కొన్ని పరీక్షలు, ఇబ్బందులు కల్గించినా నా తుంటి ఎముక విరిగినా అది కూడా ఆశీర్వాదంగా మలిచాడు. దాని వలన ఎందరో ఆత్మీయుల, స్నేహితుల, భక్తుల హృదయంలో నా పట్ల ప్రేమానురాగాలు, సానుభూతి కలిగాయి. వారందరిని నాకు

ఎంతో సన్నిహితులను చేశాడు. అందరికీ ధన్యవాదాలు. భగవంతుని బిడ్డలందరికి క్రిష్టమస్ పండుగ శుభాకాంక్షలు.

అధ్యాయం - 32

# లాస్ ఎంజిల్స్‌లో క్రొత్త శాంతి కేంద్ర స్థాపన

మనం సంకల్పం చేస్తే గడ్డిపరకను కూడా కదిలించలేము. కాని అదే భగవంతుని సంకల్పము, కోరిక అయినట్లయితే కొండలు కూడా కదులుతాయి. నాకు ఇంకా చాలా ఆశ్చర్యంగా అనిపిస్తుంది, ఆ రోజుల్లో శాంతి సందేశము తూర్పు పడమర దేశాల్లో, అమెరికా అంతటా ఎంతగా వ్యాపించి పోయిందో తలుచుకున్నప్పుడు. నేను అమెరికాలో తూర్పు ప్రాంతములో నివసిస్తున్నప్పటికీ చాలా తరుచుగా పడమర తీరంలోని ప్రజల నుండి, భక్తుల నుండి, లాస్‌ఎంజిల్స్‌లో శాంతి కేంద్రాన్ని స్థాపించవలసిందిగా ఆహ్వానాలు అందాయి. అలాగే కాలిఫోర్నియా నుండి కూడా శాంతి సందేశం అందించవలసిందిగా అక్కడి శాంతి కాముకులు ఆధ్యాత్మికంగా ఆసక్తి గల భక్తులనుండి ఆహ్వానం అందింది. చిట్టచివరికి న్యూయార్క్ నగరం నుండి దాదాపు మూడువేల మైళ్ళ దూరంలో ఉన్న లాస్ ఏంజిల్స్ నగరానికి వెళ్ళడానికి నిర్ణయించుకున్నాను.

డా. ఇ.హెచ్. గ్రోవ్ అనే పెద్దవాడయిన వైద్యుడు లాస్‌ఎంజిల్స్‌లో ఉన్నాడు. ఆయన స్వామి వివేకానంద, అలాగే స్వామి రామతీర్థ భక్తుడు. డా॥ హెన్రిగ్రాస్ అనే వేరొక వైద్యుడు, ఇద్దరూ కలిసి నాకు కావల్సిన ఏర్పాట్లు అన్నీ చేశారు. లాస్‌ఏంజిల్స్‌లో క్రొత్తగా ప్రారంభించబోతున్న శాంతి కేంద్రానికి దగ్గరలోనే ఒక పెద్ద ఇల్లు నా కోసం అద్దెకు తీసుకున్నారు. అలాగే మరియామాత నాతో పాటుగా వచ్చి అక్కడ శాంతి కేంద్రం ఏర్పాట్లలో సహాయపడింది.

శాంతి పత్రికలో ఈ వివరాలన్నీ ప్రకటించారు.

## మా పాశ్చాత్య శాంతి కేంద్రాలు అమెరికాలో

డా॥ హెన్రి గ్రోస్, ప్రసిడెంట్, శాంతికేంద్రము 111 సౌత్ ఆల్వరాడో స్ట్రీట్. లాస్ఏంజెల్స్, కాలిఫోర్నియా నుండి ఆగష్టు 28 1930 వ్రాయబడిన లేఖలో

మా శాంతి కేంద్రంలో మొత్తం నలభై మంది ధ్యాన తరగతులకు హాజరవుతున్నారు. చాలా తక్కువ సమయంలోనే వారు దాదాపు గంట సేపు ధ్యానంలో గడుపుతున్నారు. ఇప్పటి వరకు ముగ్గురు మంత్రదీక్ష తీసుకున్నారు. స్వామి ఓంకార్ గారు మాతో ఉండటం వలన మాకు చాలా సంతోషంగా, అద్భుతంగా ఉంది. సాధకులందరూ వారి మార్గ దర్శనంలో భగవంతుని సన్నిధిని అనుభవం లోనికి తెచ్చుకుంటున్నారు.

ప్రియమైన స్వామీజీ ప్రబోధాల వలన మేమందరము భగవదనుభవాన్ని పొందగల్గు తున్నాము. ఆగష్టు 24వ తేదీన స్వామీజీ 'భగవంతుని సన్నిధి' అనే అంశంపై ప్రసంగించారు. అది విన్న తర్వాత సాధకులందరూ భగవచ్ఛింతనలో నిమగ్నమయి నిశ్చలస్థితిని, మౌనంగా హృదయంలో ప్రశాంతతను పొందారు.

ఇంకొక లేఖ కూడా శాంతి పత్రిక సంపాదకులు స్వామి రాజేశ్వరానంద గారికి ఈ విషయాలనే ప్రస్తావిస్తూ అందింది. అది ఈ విధంగా ఉంది.

## శ్రీ స్వామి ఓంకార్ గారు అమెరికాలో - రెండవ శాంతి కేంద్ర స్థాపన

### డా॥ హెన్రిగ్రాస్, లాస్ ఏంజిల్స్, కాలిఫోర్నియా, యు.ఎస్.ఎ. జులై 22, 1930లో వ్రాసిన లేఖ

నేను ఎంతో సంతోషంగా ఈ లేఖను వ్రాస్తున్నాను. ఈ రోజు నేను 1000 డాలర్లు విరాళంగా శాంతి ఆశ్రమానికి పంపుతున్నాను. బంగారు కాలిఫోర్నియా నుండి లాస్ ఏంజెల్స్ జులై 19, 1930న మా ప్రియమైన సోదరుడు స్వామి ఓంకార్ గారి రాకను పురస్కరించుకొని ఈ విరాళాన్ని పంపుతున్నాను.

ఆయన తన మొదటి ఉపన్యాసము మొదలుపెట్టి నాలుగు మంత్ర దీక్షలు జులై 19 నుండి 20 వరకు ఇచ్చారు. ఈ రెండు రోజులు మేము వారి రాకను పురస్కరించుకొని

సంతోషంగా వేడుకలు చేసుకొన్నాము. రెండవ శాంతి కేంద్రము స్థాపన జరిగిన శుభ సందర్భంగా మేము చాలా సంతోషంగా ఉన్నాము.

నేను నిజాయితీగా చెపుతున్నాను. ఏదో ఒక రోజు తప్పకుండా అవకాశం చేసుకొని నేను మీ అందరినీ కలుసుకుంటాను. ఇప్పుడు మనమందరము ఒకే మార్గంలో పయనిస్తున్న సాధకులము. స్వామీజీ వద్ద మంత్రదీక్ష పొంది మనమందరము చాలా దగ్గరయ్యాము. విశ్వశాంతి ప్రయోజనాలకొరకై మనమందరము కలిసి పనిచేద్దాము. మన శాంతి కేంద్రాల ద్వారా విశ్వశాంతికై ప్రయత్నము చేద్దాము"

'జగదంబ' అనే మహిళ పాశ్చాత్య భక్తురాలు. నేను కాలిఫోర్నియాలో ఉన్నప్పుడు నాకు ఎన్నో సేవలు చేసింది. ధ్యాన తరగతులకు వచ్చే విద్యార్థులకు మేము క్రొత్తగా ప్రారంభించిన శాంతి కేంద్రంలో శిక్షణ ఇచ్చేవాళ్ళము. వైద్యులు నాకు అవసరమయిన సదుపాయాన్ని ఏర్పాటు చేసి చాలా జాగ్రత్తగా చూసుకునేవారు. కేంద్రంలోనే కాకుండా బయటి పనులు కూడా వారే చూసుకునేవారు. నిజానికి అసలయిన ఆనందము, సంతృప్తి మన అంతరంగంలోనే కొలువై ఉంటాయి. ఎవరి హృదయం పవిత్రంగా, నిశ్చలంగా ఉంటుందో వారిలో ఆనందం నెలకొంటుంది.

మరియా మాతృదేవి నా పట్ల ఎంతో శ్రద్ధ వహించేది. ఆమెకు చాతనయిన పద్ధతుల్లో క్రొత్తగా ఏర్పడిన శాంతి కేంద్రం పనులు చక్కబెట్టేది. మా మొదటి శాంతి కేంద్రము మరియా ఆశ్రమము వదిలి రావాల్సి వచ్చినందుకు ఆమెకు కొద్దిగా బాధగానే ఉండేది. కుమారి అన్నా బెస్సింగ్ లాస్ఏంజెల్స్‌లో మాకు చాలా సహాయం చేసేది. ఆమె పవిత్రమయిన ఆత్మ స్వరూపిణి. ఆమెకు కుటుంబ సభ్యులు ఎవ్వరూ లేరు. ఒంటరిగా ఉండేది. అందువలన అంకితభావంతో, ఎంతో భక్తిశ్రద్ధలతో మా పనులలో సహాయపడేది. ఆమె భారతదేశానికి వచ్చి తన జీవితమంతా శాంతి ఆశ్రమానికి సేవ చేస్తూ గడపాలనుకుంది. ఇంకా ఎందరో సోదరులు, సోదరీమణులు భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలలో శాంతి ప్రచారం కోసం తమ జీవితాలను అంకితం చేశారు. వారందరి పేర్లు ఇక్కడ ప్రస్తావించలేక పోతున్నాను. ఎందువల్లనంటే చాలా మంది ఉన్నారు. కాని నేను వారందరికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుతున్నాను. శాంతి ప్రచారము కోసం నిస్వార్థంగా వారు అందించిన సేవలు చిరస్మరణీయులు.

శ్రీమతి హోగన్, జగదంబ, హోలివుడ్‌లో నివసిస్తుంది. కాని ఆమె క్రమం తప్పకుండా లాస్‌ఏంజెల్స్‌లో శాంతికేంద్రంలో ధ్యానతరగతులకు వస్తుండేది. ఆమె తన ఇంటిలోనే శాంతి కేంద్రాన్ని నెలకొల్పాలని నిర్ణయించుకుంది. ఆమె ఇంట్లో నీగ్రో వనిత పనిచేస్తుండేది. ఆమె పేరు గ్రేస్ బ్రౌవున్. ఆమె కూడా ఎంతో భక్తిశ్రద్ధలు, ప్రేమానురాగాలు చూపేంచేది నా పట్ల. నా కోసం ప్రత్యేకంగా ఆరోగ్యకరమయిన, రుచికరమయిన ఆహార పదార్థాలు తయారుచేసి నా చేత తినిపించేది. ఆమె ఎంతో ప్రేమతో నన్ను 'బిడ్డా!' అని పిలిచేది. అది విని నా సాధకులయిన విద్యార్థులు, స్నేహితులు చాలా ముచ్చటపడేవారు. కుమారి గ్రేస్ బ్రౌన్ మంచి వస్తువులను సేకరించి తెచ్చేది. ఆ విధంగా మా శాంతి కేంద్రం యు.ఎస్.ఎ.లో చాలా చక్కగా పనిచేసింది.

న్యూయార్క్ నగరంలో శ్రీమతి లిల్లి ఇంట్లో కూడా ఒక నీగ్రో మహిళ పని చేస్తుండేది. ఆమె పేరు సారాహాస్మిత్. ఆమె కూడా నన్ను 'బిడ్డా!' అని పిలిచేది. అప్పుడు నేను చాలా సంతోషించేవాడిని. నేను తెల్లవారికే కాకుండా నల్లవారికి కూడా బిడ్డని అయినందుకు. నీగ్రో పనిమనిషి చాలా భక్తి కలది. ఆమె న్యూయార్క్ శాంతి కేంద్రానికే కాకుండా మాతృసంస్థ భారతదేశంలోని శాంతి కేంద్రానికి కూడా మంచి భక్తురాలిగా మారింది. భారతదేశంలో శాంతి కేంద్రానికి భక్తులయిన కుటుంబంలోని వారు కొందరు జబ్బుపడి మందులు, మంచి దుస్తులు లేక ఇబ్బందులతో మరణించాని తెలుసుకుని చాలా బాధపడింది. ఒక భక్త కుటుంబం వారు జ్వరంతో మరణించారు. అది విని ఆమె తాను దాచుకున్న కొద్ది డబ్బును భారతదేశంలోని వారికి మందుల కోసం విరాళంగా ఇచ్చింది. ఆమె పెన్ని పెన్ని చిన్న కిడ్డీబ్యాంక్‌లో దాచుకుని తన కోసం చలికాలంలో వేసుకునే కోటు కొనుక్కోవాలనుకుంది. చలికాలంలో అమెరికాలో విపరీతమయిన చలితో బాధపడతారు. నీళ్ళు కూడా మంచులాగా మారిపోతాయి. నేను లిల్లితో భారతదేశంలో మాణిక్యం అనే భక్త కుటుంబంలోని వారు జ్వరంతో చనిపోయారు అని చెపుతుండగా విన్న నీగ్రో పనిమనిషి నా వద్దకు తన కిడ్డి బ్యాంక్‌తో వచ్చి "నా బిడ్డా! దూరంగా ఉన్న భారతదేశంలోని ఆశ్రమంలో డబ్బు కొరత ఉంది అని తెల్సి నాకు చాలా బాధగా ఉంది. నేను ఎప్పటి నుండో దాచుకున్న ఈ కొద్ది డబ్బు నీవు తీసుకుంటే నేను చాలా సంతోషిస్తాను. దీనితో ఆకలితో బాధపడే కొద్దిమందికయినా అన్నం పెడితే నాకు సంతోషంగా ఉంటుంది. నా కోసం చలి కోటు లేకపోయినా ఫర్వాలేదు" అని చెప్పింది.

ఆమె మాటలు నా హృదయాన్ని ద్రవింపచేశాయి. ఎంతో కృతజ్ఞతా భావంతో వినయంగా ఆమె విరాళాన్ని స్వీకరించి ధన్యవాదాలు చెప్పాను. మొత్తం లెక్కపెడితే అవి పది డాలర్లు ఉన్నాయి. దానితో ముప్ఫైవేల క్వినైన్ మందులు కొని ఆశ్రమం చుట్టుప్రక్కల గ్రామాల్లోని పేదవారందరికి, జబ్బు పడిన వారికి పంచాము. అది విని ఆమె చాలా సంతోషించి, ప్రతి సంవత్సరము పది డాలర్లు విరాళంగా ఇస్తానని చెప్పింది. మీకు చెప్పవలసిన పనిలేదు, నేను ఆమె సహృదయతకూ, త్యాగనిరతికి, గొప్పబుద్ధికి ఎంతగా కదలిపోయానో, ఆమె పేరు మీద వెంటనే భారతదేశానికి విరాళం అందింది. అది తెలుసుకున్న మహిళలు ఆమెను ఎంతగానో అభినందించారు. శ్రీమతి హేవార్డ్ ఆమెకు చాలా ఖరీదయిన ఉన్ని కోటును బహుమతిగా ఇచ్చింది. కాబట్టి మనం ఎవరికయినా ఇవ్వటం నేర్చుకుంటే, భగవంతుడు మనకు అవసరమయినవి ఎవరో ఒకరి ద్వారా సమకూరుస్తాడు. కొందరు ప్రేమమూర్తులయిన, నిస్వార్థపరులు సేవాభావం గలవారిని, సేవకులను కూడా మా శాంతికేంద్రాలు ప్రేరేపించాయి. ఎలాంటి ఆర్భాటం లేకుండా చేసే మా నిస్వార్థ సేవలను ప్రశంసిస్తూ ఎందరో భారతీయ సోదరులకు వారి విరాళాలను అందచేసేవారు. గొప్పతనమంతా దైవానికే చెందుతుంది.

శ్రీమతి హేగన్ హృదయము ఎంతో పవిత్రమయినది. ఆమెకున్న విశ్వప్రేమ గురించి నేను ఆమెకు 'జగదంబ' అని పేరు పెట్టాను. 'జగదంబ' అంటే విశ్వమాత. అది తెలుసుకుని ఆమె, ఆమెకున్న మంచి హృదయం గల స్నేహితులు, ఆత్మబంధువులు చాలా సంతోషించారు. ఒక మంచి రోజు చిన్న వేడుక చేసి ఆమెకు 'జగదంబ' అని నామకరణం చేశాను. ఆమెకు వర్జీనియా అనే కూతురు, లేలాండ్ అనే కుమారుడు ఉన్నారు. ఇద్దరూ కూడా నన్ను ఎంతో ప్రేమతో సొంత సోదరుడిలా భావించి వారి కారులో సముద్రపు ఒడ్డున బీచ్‌కి గాని, లేదా అందమైన ఉద్యానవనాలకి గాని తీసుకు వెళుతుండేవారు. లేలాండ్ ఇంకా చిన్నవాడు, మంచి మెకానిక్, ఐదు డాలర్లు పెట్టి ఒకసారి వాడిన కారు కొని దాన్ని బాగుచేశాడు. బయటికి వెళ్ళడానికి ఆ కారునే ఉపయోగించేవాడు. నన్ను కూడా అతని కారులోనే బయటికి వెళ్ళడానికి రమ్మని ఆహ్వానించేవాడు, కాని జగదంబ అందుకు ఒప్పుకునేది కాదు. నా జీవితం ప్రమాదంలో పడటం ఆమెకు ఇష్టం లేదు.

లాస్ఏంజెల్స్‌లోని శాంతి కేంద్రాలలో చిన్న పిల్లలు ఎప్పుడూ నా చుట్టూ మూగుతుండేవారు. నేను వారందరితో స్నేహపూర్వకంగా మాట్లాడేవాడిని. బాబి అనే చిన్న పిల్లవాడు నా ఒళ్ళో కూర్చున్న ఛాయాచిత్రం మా శాంతి కేంద్రంలో తీయబడింది. వాళ్ళ తల్లిదండ్రులు ఇన్స్యూరెన్స్ ఏజెంట్లుగా పనిచేస్తూ భూములు అమ్ముతుండేవారు.

జగదంబ హాలివుడ్‌లో నివసించేది. అక్కడ హాలివుడ్ సినిమాతారలు నివసించేవారు. వారంతా చాలా పేరు ప్రఖ్యాతులున్న తారలు. భగవంతుడు చాలా తమాషాగా అలాంటి ప్రసిద్ధి పొందిన స్థలంలో మా శాంతి కేంద్రాన్ని నెలకొల్పడానికి అవకాశం కల్పించాడు. ఆయన పనిముట్టుగా నన్ను వాడుకుంటున్నాడు. జగదంబ, ఆమె గౌరవనీయులైన స్నేహితుల కోరిక మేరకు అక్కడ శాంతి కేంద్రాన్ని ప్రారంభించడం జరగడంతో లాస్ఏంజెల్స్‌లోని కేంద్రానికి విడవకుండా వచ్చి ధ్యానతరగతులకు హాజరవటమే కాకుండా శాంతి సందేశాలను బాగా ప్రచారము చేసేది. ఆమె ఇంటిలోనే నూతన శాంతి కేంద్రాన్ని భగవంతుని దయ వలన ప్రారంభించాము.

ఆ రోజుల్లో నేను నూతన శాంతి కేంద్రము స్థాపించడానికి చాలా ఆత్రుతపడేవాడిని. ఎవరయిన భక్తులు వచ్చి వారి ఇళ్ళల్లో, లేదా వారి దగ్గరిలోని కేంద్రాల్లో, వారి నగరాల్లో క్రొత్త కేంద్రాలను ప్రారంభించమని అడిగినప్పుడు నేను చాలా సంతోషంగా అందుకు అంగీకరించేవాడిని. పెన్‌సిల్‌వేనియా, మినియా, పాలీస్, చికాగో నగరాలలో ఆ విధంగా చాలా నూతన శాంతి కేంద్రాలు ప్రారంభించబడినాయి. ఎక్కువగా అంకితభావము, సేవాభావము, భక్తిశ్రద్ధలు గల భక్తుల ఇళ్ళల్లోనే ప్రారంభించే వాళ్ళము. అక్కడికి చుట్టు ప్రక్కల భక్తులు, క్రొత్తవారు, ఆధ్యాత్మికంగా ఆసక్తి గల వారు ఎందరో వస్తూండేవారు. గొప్పతనమంతా ఈ ప్రపంచాన్ని సృష్టించిన ఆ సృష్టికర్తకే చెందుతుంది. ఆయన దివ్య సంకల్పము వల్లనే తూర్పు పడమర దేశాల్లో ఉన్న శాంతి కేంద్రాలు వెలిసాయి.

నా వద్ద చాలా అందమయిన ఖరీదయిన పవిత్రమయిన బైబిల్ గ్రంథము ఉంది. దాని పేరు 'రెడ్ లెటర్ టెస్ట్‌మెంట్'. దానిపై బంగారు అక్షరాలతో ఓంకార్ స్వామికి అని వ్రాసి ఉంది. అంత అమూల్యమైన కానుక డా॥ హెన్రిగ్రోస్, ప్రసిడెంట్ లాస్ ఏంజెల్స్ శాంతికేంద్రము అతను ఇచ్చాడు. ఆయన వ్రాసిన మాటలు ఆయన ప్రేమను, భక్తిని చాటి చెబుతున్నాయి. ముప్పై ఏడు సంవత్సరాల క్రితం ఇచ్చినా అది ఇప్పటికి కూడా

క్రొత్త గ్రంథంలా ఉంటుంది. అందులో ఆయన వ్రాసిన మాటలు నిన్ననే వ్రాసినట్లుగా చాలా తాజాగా అనిపిస్తాయి.

ప్రియమైన నా సోదరా!

మేము నిరంతరము శ్వాస తీసుకుంటున్నాము, జీవిస్తున్నాము, ఆలోచిస్తున్నాము, కదులుతున్నాము, భగవంతుని సన్నిధిని అనుభూతి చెందుతున్నాము. ప్రతి రోజు మేము భగవంతుడిని ప్రార్థిస్తున్నాము. దేవుని బిడ్డ అయిన జీసస్ క్రీస్తు పేరిట జీవము, ప్రేమ, జ్యోతి అయిన పరమాత్మను మీ పుట్టినరోజు కోసం ప్రార్థిస్తున్నాము. మీరు ప్రారంభించిన నూతన శాంతి కేంద్రాలను నెలకొల్పి శాంతి సందేశాన్ని ప్రపంచమంతా వ్యాప్తి చేయాలని ఆకాంక్షిస్తూ మీ దివ్యమైన కార్యక్రమాలకు భగవంతుని ఆశీస్సులుండాలని కోరుకుంటున్నాను.

అక్టోబర్ 10, 1930

**డా॥ హెన్రీగ్రాస్,** సోదరుడు, లాస్ఏంజెల్స్ శాంతి కేంద్రము

చాలా మంది నా పాత భక్తులు నా పుట్టినరోజు వేడుకలు జనవరి నెలలో కాకుండా అక్టోబర్ నెలలో ఎందుకు జరుగుతున్నాయి అని తెలుసుకోవాలని కుతూహల పడుతుంటారని భావిస్తున్నాను. ఆ రోజు ఆశ్రమంలో పూజలు, ప్రార్థనలు, ధ్యానం జరుగుతాయి. నేను ఎలాంటి వాడినంటే ప్రత్యేకంగా పుట్టినరోజు జరుపుకోవాలని అనుకోను. ఎందుకంటే ప్రతి రోజు నాకు పుట్టినరోజు వంటిదే. నేను ఎప్పుడూ ఈ క్షణంలో జీవించడానికే ప్రయత్నిస్తుంటాను. గతాన్ని పాతిపెట్టి, భవిష్యత్తుని గురించి ఎలాంటి ఆలోచనలు చేయను. రోజులు గడచిన తర్వాత అక్టోబర్ 10వ తేదీ నా పుట్టిన రోజుగా భావించి వేడుకలు చేస్తుండేవారు. కాని ఒక రోజు అనుకోకుండా ఇంటిలో నా జాతక చక్రం ఉన్న కాగితాలు దొరికాయి. అవి వారు ఆశ్రమానికి పంపించారు. అప్పుడే తెలిసింది నా పుట్టిన రోజు అక్టోబర్ 10వ తేదీన కాదని జనవరి 21వ తేదీ అని. అప్పటి నుండి ఆ రోజు ఆశ్రమంలో ఏకాహం, నిరంతర నామ జపము, కోటి పత్రి పూజ, లక్షపత్రి పూజ, శివునికి అభిషేకాలు, కోటి బిల్వార్చన మొదలయినవి సంతోషంగా జరుపబడుతున్నాయి.

నా ఆత్మకథ చదువుతున్న పాఠకులు ఆశ్చర్యపడతారు. నేను హాలివుడ్‌లో దాదాపు సంవత్సరము పైననే ఉన్నాను కాని ఒక్కసారి కూడా సినిమా చూడలేదు. ప్రపంచ ప్రఖ్యాత సినిమాలు అక్కడ ప్రదర్శించబడతాయి. నేను ఎప్పుడూ నూతన శాంతి కేంద్రాలను స్థాపించి భక్తుల హృదయాల్లో శాంతి బీజాలు నాటే ప్రయత్నంలో తీరిక లేకుండా ఉండేవాడిని.

జగదంబ ఇంటిలో ప్రారంభించిన శాంతి కేంద్రము ప్రారంభోత్సవానికి చాలా మంది బాగా చదువుకున్నవారు, మేధావులు, హాలివుడ్ నటీనటులు, పేరు ప్రఖ్యాతులున్న వారు, లాస్‌ఏంజెల్స్ శాంతి కేంద్రము సభ్యులు, డా॥ గ్రోవ్, గ్రాస్, మరియా, ఇంకా మా శాంతి కేంద్రాల్లో ధ్యాన తరగతులకు హాజరయ్యే విద్యార్థులు ఇలా ఎందరో హాజరయ్యారు. కార్యక్రమం విజయవంతంగా, సంతోషంగా జరిగింది. కార్యక్రమానికి వచ్చిన వారందరూ అది తమ అదృష్టంగా భావించారు. శ్రీమతి హేగన్స్ బంధుమిత్రులు, సామాజిక సభ్యులు ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తుంటారు. వారందరూ వచ్చి వేడుకని సంతోషముగా, ప్రశాంతంగా జరిపించారు. ఎప్పటిలాగే నేను ప్రశాంతంగా, తేలికయిన భాషలో శాంతి సందేశాన్ని అందించాను. అనంతరము ఎందరో మేధావులు, సైంటిస్టులు, సినిమాతారలు మా శాంతి కార్యక్రమాలను కొనియాడుతూ ప్రసంగించారు. శాంతి సందేశాలు ఒక హృదయం నుండి మరొక హృదయానికి చేరుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. ప్రపంచమంతటా శాశ్వతంగా శాంతిని నెలకొల్పవలసిన అవసరముందని అందరూ ముక్తకంఠంతో నినదించారు. ఆ రోజంతా చాలా ఆనందంగా గడిచింది.

ప్రార్థన, ధ్యానము తర్వాత శ్రీమతి హేగన్ వచ్చిన అతిథులందరికీ చాలా రుచికరమైన పదార్థాలు, కాఫీ, టీ, ఐస్‌క్రీమ్ మొదలైనవి ఏర్పాటు చేసింది. ప్రతివారము సమావేశాలు జరిగేవి. ఎంతో దూర ప్రాంతాల నుండి కూడా పవిత్రమయిన హృదయము గల భక్తులు సమావేశాలకు హాజరయ్యేవారు. అందువలన వారికి ఎంతో ప్రయోజనము చేకూరేది.

డా॥ గ్రోవ్ నేచురోపతి వైద్యుడుగా మంచి పేరు ప్రఖ్యాతులు పొందాడు. లాస్‌ఏంజెల్స్‌లో ఆయనకి సొంతంగా శానిటోరియమ్ ఉంది. ఎనభై సంవత్సరాల వృద్ధుడు అయినా చాలా చలాకీగా, యువకుడిలా ఉండేవాడు. ఆయన శానిటోరియమ్ సూర్యరశ్మి పడే గాజు గదులతో, చక్రాలపై కదిలే విధంగా ఉండేది. అందువలన దానిని ఎటు కావాలంటే ఆ దిక్కుగా కదిలించి సూర్యకాంతి రోగులపై సూటిగా పడే విధంగా

అమర్చేవారు. ఆయన వద్ద కదిలే కట్టడాలు, స్నానపు గదులు, ఆవిరితొట్టెలు, సూర్యస్నానం చేసే గదులు అన్నీ ఆయన ఆఫీస్ గది ప్రక్కనే ఉండేవి. అవన్నీ చూడాలి తప్ప మాటల్లో వర్ణించటం సాధ్యం కాదు. అల్లోపతి వైద్యులు ఆశవదిలేసినవి, ఇక తగ్గవు అనుకున్న జబ్బులను కూడా డా॥ గ్రోవ్ తన ప్రకృతి వైద్యంతో నయం చేసేవాడు. అలాంటి వారి వద్ద నుండి ఆయన కేవలము ఇరవై ఐదు రూపాయలు లేదా ముప్పై రూపాయలు మాత్రమే తీసుకునేవాడు. ఆయన ఎంత దయామయుడు అంటే పేదవారికి ఉచితంగానే వైద్యం చేసేవాడు.

డా॥ గ్రోవ్ స్వామి వివేకానంద శిష్యుడు. ప్రస్తుతము లాస్ఏంజెల్స్ శాంతి కేంద్రానికి చాలా చురుకయిన సభ్యుడు కావటం వలన ఆయన శానిటోరియమ్‌లో అన్ని సౌకర్యాలను నా వైద్యం కోసం ఉచితంగా వినియోగించుకోవడానికి అవకాశం కల్పించాడు. నా తుంటి ఎముక విరగటం వలన అక్కడ ప్రకృతి వైద్యంలో భాగంగా ఎంతో అద్భుతమయిన వైద్య విధానాలు, సూర్య స్నానం, మసాజ్‌లు, ఇంకా ఇతర విధానాలన్నీ డా॥ గ్రోవ్ నాకు చేసేవారు. అవన్నీ నా ఆరోగ్యానికి ఎంతో మేలు కల్గించాయి. నేను ఎల్లప్పుడూ డా॥ గ్రోవ్, డా॥ గ్రాస్ మరియు జగదంబా మొదలైన వారి పట్ల ఎంతో కృతజ్ఞతా భావంతో ఉండేవాడిని. హాలివుడ్‌లో శాంతికేంద్రంలో, లాస్ఏంజెల్స్‌లో వారందరూ నా పట్ల ఎంతో ఆదరాభిమానాలు చూపించారు.

## అధ్యాయం - 33

# శాంతా సుసన్నా కొండలు

'శాంతా సుసన్నా పర్వతాలు' అనే ప్రదేశం చాలా అందమయిన లోయ ప్రాంతము. చుట్టూ కొండలతో చూడ ముచ్చటగా ఉంటుంది. హాలివుడ్ నుండి నలభై మైళ్ళ దూరంలో ఉంది. ఎక్కడ భారతదేశంలోని తోటపల్లి కొండల్లోని శాంతి ఆశ్రమము? ఎక్కడ యు.ఎస్.ఎ.లోని కాలిఫోర్నియాలోని శాంతి సుసన్నా పర్వతాలు? చాలా ఆశ్చర్యకరంగా అవి రెండూ నా ఆధ్యాత్మిక జీవితంలో గొప్ప పాత్ర పోషించాయి. మౌనంగా జీవితం గడపాలి అని భావించేవారు ఒంటరి ప్రదేశాలను ఎంచుకుంటారు. నేను ఎప్పుడు

చూచినా హాలివుడ్‌లోనూ, అలాగే లాస్‌ఏంజెల్స్‌లోనూ శాంతి కేంద్రాలకి వచ్చే సాధకులకు సాయం చేయడానికి ప్రయత్నిస్తూ బాగా అలసిపోతున్నానని, ప్రశాంతంగా మౌనంగా ధ్యానంలో భగవదనుభూతిని పొందడానికి తహతహలాడుతున్నానని జగదంబ భావించింది.

ఒక మంచి సమయంలో ఆమె తనకు అందమయిన శాంతా సుసన్నా పర్వతాల దగ్గరున్న లోయ ప్రాంతంలో ఒక చిన్న కుటీరం ఉందని, అది చూచి నాకు బాగా నచ్చితే అక్కడే ఉండి కొన్ని రోజులు ప్రశాంతంగా ధ్యానంలో కాలం గడపవచ్చునని చెప్పి నన్ను కారులో అక్కడికి తీసుకువెళ్ళి చూపించింది. ఆమె నాతో అక్కడ పట్టణంలో మాదిరిగా సౌకర్యాలు ఉండవని, కమోడ్, ఫ్లష్, షవర్, ఫ్రిజ్ వంటివి ఉండవని కూడా చెప్పింది. అక్కడ నేను నా జీవితంలో ఎంతో ఆనందకరమయిన కొన్ని రోజులు మౌనంగా ధ్యానంలో గడిపాను. అక్కడ ఆహారం తేలికగా దొరకదు. అందువలన నేను ఎక్కువగా అపక్వాహారం, పళ్ళు, కూరగాయలు మొదలైనవి, జగదంబ తెచ్చిన వాటితోనే సరిపెట్టుకునేవాడిని.

నా తుంటి ఎముక విరగటం వలన నేను నేల మీద కూర్చోలేను, అలాగే నా కాళ్ళు వంగేవి కావు. ఉదయపు వేళల్లో కాలకృత్యాలు తీర్చుకోవడానికి నాకు బాగా ఎత్తులో ఉన్న కమోడ్ అవసరమయ్యేది. అన్ని సౌకర్యాలు ఉన్న ఆధునిక గృహంలోనే నాకు ఎవరో ఒకరి సహాయం కావాల్సి వచ్చేది. ఇంక ఈ చిన్న కుటీరంలో పరిస్థితి గురించి చెప్పవలసిన పనిలేదు. జగదంబ ఒక కమోడ్ నా కోసం గదిలో ఒక మూల ఏర్పాటు చేసింది. నేను చేతి కర్రల సాయంతో నడిచేవాడిని. కుటీరము చుట్టుప్రక్కల చాలా అందమైన ప్రకృతిని చూడడానికి ఆ కర్రల సాయంతోనే నడిచి వెళ్ళేవాడిని. జగదంబ నా కోసం ప్రతి రోజూ ఏవో కొన్ని ఆహార పదార్థాలు తీసుకొని వచ్చేది. అలాగే నేను వాడిన కమోడ్‌ని శుభ్రం చేసేది. వాసన రాకుండా ఉండేందుకు గాఢమైన డిస్‌ఇన్ఫెక్షన్ వేసేది. అసలు ఎవరయినా ఇలాంటి పనులు చేస్తారా? ఆవిడ తల్లి కంటే ప్రేమగా నాకు అన్ని సేవలు చేసింది. రూడ్‌యార్డ్ కిప్లింగ్ ఒకసారి అంటాడు 'తూర్పు పడమరలు కలవవు' అని. కాని నిస్వార్థ సేవలు అందించిన జగదంబ తల్లి తూర్పు పడమరలను కలిపింది కదా! ప్రేమ ఉన్న చోట పనిలో ఉచ్చనీచాలు చూడరు. గాంధీమహాత్ముడే

మనందరికి గొప్ప ఉదాహరణగా ఆయన జీవితాన్ని జీవించి చూపించారు. ఆయన సేవలో భాగంగా పాయిఖానాలు కూడా శుభ్రం చేశారు కదా!

హాలివుడ్ నుండి శాంతా సుసన్నా పర్వతాలు దూరం అవటం వలన నన్ను చూడడానికి నా అదృష్టం కొద్దీ ఎవరూ వచ్చేవారు కాదు. చాలా కొద్ది మంది, ముఖ్యమైన వాళ్ళు మాత్రమే వచ్చేవారు. అందువల్ల నేను మౌనంగా నా సాధనలో, ధ్యానంలో రాత్రి పగలు మునిగిపోయేవాడిని. భగవంతుని అనుగ్రహం వలన నిరంతరము దైవ చింతనలో కాలం గడిపేవాడిని. అక్కడ ఉన్న సమయాన్నంతా చక్కగా సద్వినియోగం చేసుకుంటూ నిరంతరాయంగా ధ్యానంలో, ప్రార్థనలో ఆనందంగా, హాయిగా ఉండేవాడిని. అక్కడ ప్రశాంతంగా కాలం గడిపినప్పుడు నా హృదయపు లోతుల్లోని కొన్ని సందేశాలు వచ్చినవి వ్రాశాను. ఎంతో ఉత్తేజపూరితమైన విశ్వశాంతి ప్రార్థనకి పవిత్రమయిన హిమాలయాల్లో బీజం పడితే అది శాంతాసుసన్నా పర్వతాల్లో పూర్తి రూపాన్ని దిద్దుకుంది. అది ఇప్పుడు కొన్ని వేల మంది భక్తుల హృదయాలలో ఎంతో ఉత్తేజాన్ని, ఆధ్యాత్మిక శక్తిని, దైవిక బలాన్ని ఇస్తోంది. భగవంతుని బిడ్డలయిన ప్రపంచంలోని, తూర్పు పడమర దేశాల్లోని భక్తులందరి హృదయాలను శాంతితో ప్రేరేపిస్తోంది. మతంతో సంబంధం లేకుండా విశ్వశాంతి ప్రార్థన ప్రపంచ వ్యాప్తంగా అన్ని భాషల్లోకి అనువదించబడి ముద్రించబడింది.

ఒక రోజు జగదంబ వార్తాపత్రికలతో ఎంతో ఉత్సాహంగా వచ్చి, లాస్ఏంజెల్స్ హెరాల్డ్ వార్తాపత్రికలో పిఠాపురం మహరాజు ఛాయాచిత్రం వేశారని చూపించింది.

పిఠాపురంలోనే నేను జన్మించాను. ఆ రోజుల్లో మహారాజా అంటే చాలా గొప్ప. వారిని సమీపించడానికి కూడా ఎవరికి అవకాశం ఉండేది కాదు. పిఠాపురం మహారాజా వారి పట్టాభిషేక మహోత్సవం జరిగినప్పుడు నాకు సుమారుగా పది సంవత్సరాలు లేదా ఇంకా తక్కువ వయస్సు ఉంటుంది. నాకు ఒక విషయం బాగా గుర్తుంది. ఊరంతా సంబరాలు జరిగాయి. ఎక్కడ చూచినా తోరణాలతో, జెండాలతో, పూలతో కూడిన ఆర్చీలతో ఊరంతా బాగా అలంకరించారు. సంగీత వాయిద్యాలతో ఊరంతా పెద్ద ఊరేగింపు జరిగింది. మహారాజా వారి భవంతి చుట్టూ చాలా పెద్ద మట్టి దిబ్బ ఉండేది. దాని వలన భవంతి లోపల కనపడకుండా అది అడ్డుగా ఉండేది. మహారాజా వారి భవనం లోపల జరుగుతున్న వేడుకలు బయటివారికి కనపడకుండా ఆ దిబ్బ పెద్ద గోడలాగా అడ్డుగా ఉంది. మేము చిన్నపిల్లలము కావడం వలన భవనం గేటు వద్దకు

కూడా పోనివ్వలేదు. నాకు ఇంకా బాగా గుర్తుంది. నేను నా తోటి స్నేహితులతో కలిసి ఆ మట్టి దిబ్బపైకి ఎక్కి కూర్చుని అక్కడ జరుగుతున్న వేడుకలను చూసి ఆనందించాము. భవనం లోపల సంగీత కచేరీలు, నాట్యాలు, ఇంకా రకరకాల వేడుకలు, సంబరాలు జరుగుతున్నాయి. ఆ ఎండలోనే మేము అవన్నీ చూచాము.

కాలంలో ఎన్నో మార్పులు చోటు చేసుకుంటాయి. మహారాజులు బిక్షగాళ్ళుగా మారవచ్చు, అలాగే బిక్షగాళ్ళు మహారాజులు కావచ్చు, మహాధనవంతులు కావచ్చు. ఆ రోజు నేను చిన్న పిల్లవాడిని, మహారాజా వారి పట్టాభిషేక మహోత్సవాన్ని చూడడానికి భవంతికి గాని, లోపల ప్రదేశంలోనికి గాని వెళ్ళలేకపోయాను. మట్టిదిబ్బ లాంటి గోడ మీద ఎక్కి చూసాను. కానీ నేడు కాలిఫోర్నియా, హాలివుడ్ వచ్చాను. అమెరికాలోని భక్తుల కోసం, లాస్ఏంజెల్స్‌లోనూ, హాలివుడ్‌లోనూ ఆధ్యాత్మిక సేవలు అందించడానికి శాంతికేంద్రాలను స్థాపించి, శాంతాసుసన్నా పర్వతాల్లో ధ్యానం చేసుకుంటున్నాను. ఇప్పుడు ఆ పిఠాపురం మహారాజా వారు మహారాణి వారితో ఆయన కుటుంబ సభ్యులందరితో కలిసి విదేశీ యాత్రకు హాలీవుడ్ వచ్చారు.

మానవుని జీవితంలో జరగబోయే సంఘటనలను ముందుగా ఊహించటం ఎవ్వరికి సాధ్యం కాదు. జరిగే మార్పులను నిజంగా తెలుసుకోవడం కష్టం. దాదాపు అరవై సంవత్సరాలు జరిగిపోయాయి. ఇప్పుడు కూడా ఆనాటి నా బాల్యంలోని సంఘటన గుర్తు వస్తోంది. మహారాజా వారి పట్టాభిషేక మహోత్సవాన్ని గోడ ఎక్కి చూడడం. కానీ ఇప్పుడు నేను చాలా వింతగా నన్ను నేను ఒక సాధు మహాత్మునిగా, జపధ్యానాదుల్లో మౌనంగా జగదంబ కుటీరంలో శాంతాసుసన్నా పర్వత ప్రదేశంలో గడుపుతూ గమనిస్తున్నాను.

పిఠాపురం మహారాజు, మహారాణి, వారి కుటుంబ సభ్యులను చూడాలని జగదంబ చాలా కుతూహల పడటం గమనించి నేను రాజా వారికి హాలివుడ్‌లోని మా శాంతి కేంద్రాన్ని దర్శించమని ఉత్తరం వ్రాశాను. అప్పుడు వారు హాలివుడ్‌కి చాలా దూరంలో ఉన్నారు. అలాగే పిఠాపురంలోని రాజమందిరానికి కూడా దూరంగానే ఉన్నారు. ఆయన నా ఆహ్వానాన్ని మన్నించి రావటానికి ఒప్పుకున్నారు. ఒకరోజు సాయంత్రం వేళ రాజా వారు తన కుటుంబ సభ్యులందరితో కలిసి హాలివుడ్‌లోని మా శాంతి కేంద్రాన్ని దర్శించారు. మేము ఆర్భాటం లేకుండా ప్రశాంతంగా చేస్తున్న ధార్మిక ప్రచారాన్ని

గమనించి చాలా సంతోషించారు. జగదంబ మహారాజా వారి కుటుంబాన్ని తన ఇంటికి భోజనానికి ఆహ్వానించింది. వాళ్ళు మొత్తం ఇరువై మంది వచ్చారు. విందు చాలా బాగా జరిగింది. జగదంబ చేసిన రుచికరమైన వంటలను వారు ఎంతో మెచ్చుకుంటూ భోజనం చేశారు. ఆమె వారి కోసం భారతీయ వంటకాలను కూడా సిద్ధం చేసింది. కూరలు, అప్పడాలు, వడియాలు మొదలైనవి తిని మహారాజావారు ఆయనతో వచ్చిన వారందరూ సంతోషించారు. అమెరికాలో భారతదేశపు వంటకాలు రుచి చూసి చాలా రోజులయిందని చెప్పారు.

తర్వాత ఆధ్యాత్మిక సమావేశంలో కొన్ని సందేశాలు చదివి వినిపించిన అనంతరము అందరితో ధ్యానము చేయించాను. ఆ రోజు సాయంత్రం జగదంబ కార్లలో స్నేహితులను కూడా వెంటబెట్టుకొని హాలివుడ్‌లో జరిగే కార్యక్రమానికి తీసుకువెళ్ళింది. అక్కడ సంగీత కార్యక్రమం జరుగుతోంది. వేలమంది దానిని చూడడానికి వచ్చారు. చాలా ప్రసిద్ధి చెందిన కళాకారులు వివిధ రకాలయిన వాయిద్యాలపై సంగీతాన్ని వినిపిస్తున్నారు. జగదంబ తెలిసినవారి ద్వారా ప్రత్యేకమయిన టికెట్లు తెచ్చింది. అందువలన మేమందరము స్టేజికి దగ్గరగా ముందు వరుసలో కూర్చోగలిగాము. ఆ రాత్రి నా జీవితంలో మర్చిపోలేని మధురానుభూతి కలిగింది.

శాంతి ఆశ్రమానికి మంచి భవిష్యత్తు ఉండడం వలన తర్వాతి కాలంలో మహారాజు గారి అబ్బాయి సూర్యారావు గారు యువరాజు ఆశ్రమ సేవల్లో పాలుపంచుకున్నారు. ఆదర్శవంతమయిన భక్తునిగా మారాడు. ఆయన చాలా శ్రద్ధతో, ఇష్టంగా శాంతి ప్రచారంలో పాల్గొనేవారు. మూడు సంవత్సరాలు శాంతి ఆశ్రమానికి వారే ప్రెసిడెంటుగా ఉండి ఆశ్రమ కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేలా శ్రద్ధ వహించారు. శాంతి సందేశాలను విస్తృతంగా ప్రచారం చేయడానికి తోడ్పడ్డారు. ఆశ్రమం చుట్టు ప్రక్కల మాత్రమే కాకుండా దూర ప్రాంతాల్లో కూడా ఆధ్యాత్మిక ప్రచారానికి పాటుపడ్డారు.

మహారాణి గారు సాధ్వీమణి మంచి భక్తిపరురాలు. ఆవిడ ఆశ్రమంలోని స్త్రీలకు, చిన్నపిల్లలకి ఎన్నో సేవలందించేవారు. ఆమెకు సోదరి సుశీలాదేవి అంటే ఎంతో ప్రేమ ఉండేది. ఆవిడ ఎక్కువ సమయము భగవంతుని పూజాదికాలు చేయటంలో గడిపేది. ప్రమిదలు, అగరుబత్తులు వెలిగించేది. అనుకోకుండా ఒక రోజు చాలా విషాదకరమైన సంఘటన జరిగింది. ఆమె పూజ చేసేటప్పుడు చాలా దీపాలు వెలిగించేది. ఆ రోజు

ఆమె చీరకు నిప్పు అంటుకొని ఒళ్ళంతా కాలిపోయి చనిపోయింది. అది విన్నవారంతా నిర్ఘాంతపోయారు. అంతటి సాధ్వీమణి, భక్తిపరాయణురాలు ఎప్పుడూ భగవచ్చింతనలోనే కాలం గడిపే భక్తురాలు భగవంతుని ఆరాధిస్తూనే ప్రాణాలు వదిలింది. కర్మనుండి ఎంతటి వారయినా తప్పించుకోవటం అసాధ్యం కదా! చిన్నమాంబ రాణి గారి ఆత్మకు శాంతి కల్గుగాక! భగవంతుని సన్నిధిలో శాంతిగా ఉండుగాక! శాంతి ఆశ్రమ సభ్యులు, భక్తులు, ఆమె స్నేహితులు, బంధువులు ఆమెను ఆరాధించే వారందరూ ఆమె ఆత్మ శాంతి కోసం ప్రార్థనలు చేశారు.

## అధ్యాయం - 34

# కాలిఫోర్నియాకు వీడ్కోలు

కాలిఫోర్నియాలో నేను గడిపిన ఆధ్యాత్మిక మౌన జీవనం ఎందరో సత్యాన్వేషకులకు, ఆత్మాన్వేషకులకు, సాధకులకు, శాంతి కోసం ప్రయత్నించేవారికి మార్గదర్శకంగా నిలిచింది. నేను స్థాపించిన శాంతి కేంద్రాలు అటు లాస్ఏంజెల్స్‌లోనూ, ఇటు హాలివుడ్‌లోనూ ఎందరికో శాంతిని ప్రసాదించాయి. ధ్యానం చేయటం నేర్చుకోవడానికి దోహదపడ్డాయి. నన్ను వారు తరుచుగా ఆహ్వానించి ప్రవచనాలు ఇమ్మని అడిగేవారు. అలాగే సాధకులకు వ్యక్తిగతంగా, ఆధ్యాత్మికంగా ఎదగడానికి సహాయం చేసేవాడిని. వాళ్ళతో క్రమం తప్పకుండా ధ్యానం చేయించేవాడిని. వాళ్ళతో ఆధ్యాత్మిక దినచర్య డైరీని వ్రాయించేవాడిని. ప్రతి వారం అందులో తప్పులు సరిదిద్దేవాడిని.

నేను అక్కడ ఉండగా సాధకులకు ఉపకరించే చక్కని సందేశాన్ని తయారుచేశారు. సాధకులందరూ దానిని ఎంతగానో మెచ్చుకున్నారు. అందులో అన్నీ నా సాధన అనుభవాలను తెలియచేశారు. అవి సాధకులను ఒక్కో మెట్టు పైకి ఎక్కించి సమయం వచ్చినప్పుడు సమాధి స్థితిని అందిస్తాయి.

## అంతర్వాణి

ఉష్ .... ఉష్..... బాహ్య ప్రపంచపు విషయాల్లో తలమునకలు అవుతున్నంత కాలం నీ అంతర్వాణి ప్రబోధము నీవు వినలేవు. నీకు బాహ్య ప్రపంచపు విషయాలలో విసుగు పుట్టడం లేదా? నీకు నీ అంతర్వాణి ఏమి చెపుతుందో వినాలి అనిపించడం లేదా? నీ మనశక్తులన్నింటిని వినియోగించి అంతర్వాణి ప్రబోధాన్ని వినాలి అనుకుంటున్నావా? అలా అయితే ప్రార్థించు. వచ్చి నాలో కలిసి కాసేపు కాలం గడుపు. నీ శరీరాన్ని స్థిరంగా, సుఖంగా ఉంచుకో. నీ గురించి గాని, నీ పనుల గురించి గాని ఏమీ ఆలోచించవద్దు. నిశ్శబ్దంగా నీ అంతర్వాణి ఏమి చెపుతోందో వినడానికి ప్రయత్నించు. ఎప్పుడు నీ అంతర్వాణి ప్రబోధాన్ని నీవు వినగల్గుతావో అప్పుడే నీ హృదయంలోని తాపము చల్లారుతుంది. అంతేగాని బాహ్య ప్రాపంచిక భోగాల వెంట పరుగెత్తి పరుగెత్తి అలసిపోతావు తప్ప శాంతి దొరకదు. అంతర్వాణి ఎప్పుడూ నీతో మాట్లాడడానికి సిద్ధంగా ఉంటుంది. కానీ నీవే దాన్ని వినడానికి, పట్టించుకోవటానికి సమయం లేకుండా, క్షణం తీరిక లేకుండా బాహ్య ప్రపంచంలో మునిగిపోతున్నావు.

ఓ ఇంద్రియాల్లారా! ప్రార్థించండి మీ ఇంద్రియలోలత్వాన్ని కనీసం కొద్దిసేపు పనిచేయకుండా నియంత్రించండి. ఓ నా బుద్ధీ! కనీసం కాసేపయినా పనికిమాలిన ఆలోచనలు వదిలిపెట్టి అంతర్వాణి ప్రబోధాన్ని వినటానికి ప్రయత్నించు. ఓ అహంకారమా! ప్రార్థించు. అంతరాత్మతో అహంకారాన్ని అణిచివేసి నీ అంతర్వాణి ప్రబోధాన్ని వినటానికి ప్రయత్నించు.

ఇంద్రియాలు, బుద్ధి, మనస్సు, అహంకారము అన్నీ అణిగిపోయినప్పుడు ఆత్మ తన అంతర్వాణిని వినిపిస్తుంది. దివ్యత్వాన్ని తెలియచేస్తుంది. అంతరాంతరాల్లో నిండిపోయిన పరంధాముడిని దర్శింపచేస్తుంది. అందువల్ల ప్రియమైన సాధకులారా! ఇంకా ఇంకా మనస్సు లోతుల్లోకి అంతర్ముఖమయినప్పుడు ఆత్మ తన అంతర్వాణిని వినిపిస్తుంది. అది మాత్రమే నీ జన్మహక్కు అని మరిచిపోవద్దు.

నీ అంతర్వాణి ప్రబోధాన్ని వినటానికి ప్రయత్నించు. అది వినగల్గినప్పుడు నీవు జనన మరణ చక్రము నుండి విముక్తి చెందుతావు. భగవంతుని అనుగ్రహం వలన

సాధకులందరికి అలాంటి దివ్యమయిన అంతర్వాణి ప్రబోధాన్ని వినగలిగే అవకాశం లభించుగాక! ఆత్మదర్శనము కల్గుగాక! ఓం...ఓం...ఓం...

ఇక కాలిఫోర్నియాకు వీడ్కోలు అనే ఈ అధ్యాయాన్ని ముగించేముందు శాంతి కేంద్రములో నేను భక్తులందరికి అందించిన శాంతి సందేశాన్ని వివరిస్తాను.

నా ప్రియమైన ఆత్మ స్వరూపులయిన సోదరసోదరీమణులారా!

ఈ రోజు మనం వీడ్కోలు తీసుకుంటున్న సందర్భంలో నేను నా చేతులు చాచి మీ అందరినీ ప్రేమపూర్వకంగా దగ్గరికి తీసుకుంటున్నాను. ఆ ప్రేమకు ఎల్లలు లేవు. ఎలాంటి గౌరవాలు, పురస్కారాలు కోరదు. కేవలం ఆనందం, సంతృప్తి, ప్రేమ అంతే. అందులో కలయికలు, విడిపోవటాలు ఉండవు. అంతులేని శాంతి తరంగాల్లో తేలియాడుతూ ఒకరినొకరము మనస్ఫూర్తిగా అర్థం చేసుకుంటాము. భగవంతుని గొప్పతనము సహస్ర సూర్యకాంతితో తేజోమయంగా విరాజిల్లుగాక!

నేను సూర్యుడికే సూర్యుడిని

ఓం...ఓం...ఓం....

తేజస్సు ... తేజస్సు ... తేజస్సు

నీ లోపల బయటా కూడా తేజోవంతమయిన జ్ఞాన ప్రకాశం వెల్గుతోంది. అది నీ పైన, క్రింద, నీ చుట్టూ ప్రకాశవంతంగా దేదీప్యమానంగా ప్రజ్వరిల్లుతోంది. ఆ దివ్యానుభూతిని అనుభవంలోనికి తెచ్చుకో. అనంతమయిన ఆ శాంతిలో మునిగిపో.

భగవదనుగ్రహం పొందిన నా ప్రియమైన సాధకులారా! మీరు మీ మొదటి మంత్ర దీక్షలో నిన్ను నీవు తెలుసుకోవటం నేర్పబడింది. మౌనంగా నీలో నీవు నిశ్చలస్థితిని పొందటం రెండవ మంత్రదీక్షలో నేర్పబడింది. ఆలోచనలను నియంత్రించటము మూడవ మంత్ర దీక్షలో. అత్యద్భుతమయిన సోహం దివ్యానుభవాన్ని, హృదయ కవాటాలను తెరిచి, నాడీ చక్రాలన్నింటిని వికసింపజేసి చిట్ట చివరికి నిన్ను భగవంతుని సన్నిధికి చేరుస్తుంది. అక్కడ నీవు సత్యాన్ని దర్శించగల్గుతావు. పరమాత్మునికి నీకు అభేదాన్ని గుర్తించగల్గుతావు. భగవదనుభూతిని వదలకుండా పట్టుకోవడానికి ప్రయత్నించు. ఓం... ఓం... ఓం...

అలాంటి దివ్యమయిన స్థితిలో చూచేవాడు, చూడబడేది అంటూ ఉండదు. నీ అన్వేషణ పూర్తి అవుతుంది. నీ సందేహాలన్నీ తీరిపోతాయి. నీ ప్రశ్నలన్నింటికి సమాధానాలు లభిస్తాయి. మాటలు ఆగిపోయి మౌనంలోకి వెళ్ళిపోతావు. నీ అహం చల్లారిపోతుంది. దివ్యమయిన పరమాత్మానుభవంలో తేజోవంతుడివి అవుతావు. ఓం....ఓం...ఓం...

పవిత్రమయిన పక్షులు స్వేచ్ఛగా ఆకాశంలో ఎగిరేటప్పుడు వాటి రెక్కల సవ్వడులలో సోహంకారం వినిపిస్తాయి. ఊపిరి పీల్చేటప్పుడు పవిత్రమయిన ఓంకారాన్ని జపిస్తున్నాయి. నీ ఆత్మ, నీ జీవితం, నీ ఉనికి పరమాత్మను గుర్తించే ఓంకారాన్నే తలపిస్తున్నాయి. అందువల్ల పక్షుల్లారా! స్వేచ్ఛగా కొండకోనల్లో, పల్లెల్లో, పట్టణాల్లో విహరిస్తూ శాంతి సందేశాన్ని మీ రెక్కల చప్పుళ్ళలో దగ్గరి వారికి, దూరంలో ఉన్నవారికి, యావత్తు ప్రపంచానికి అందించండి. సత్యాన్వేషకులకు మార్గదర్శనం చేయండి. వారిపై పూల వర్షం కురిపించండి. అంతటా శాంతి సంతోషాలను నింపండి.

పేద, గొప్ప, పుణ్యాత్ములు, పాపాత్ములు అనే తేడా లేకుండా అందరికీ ఆశీర్వాదాలు అందచేయండి. ఎందుచేతనంటే ఎవ్వరూ నీకు పరాయి వారు కాదు. నీ చేతులు ఎల్లప్పుడూ ఆశీర్వదించడానికే ముందుకు రావాలి. ఎన్నడూ ఎవరినీ మాటలతో కాని, చేతలతో గాని, ఆలోచనలతో గాని బాధ పెట్టవద్దు. ప్రపంచాన్నంతటిని నీ సోహంకారముతో ఒక్కటిగా చేయి. తేజస్సు, దివ్యత్వము, స్వేచ్ఛ నీ సొంతము.

నీ జీవితం చివరి వరకూ నేను నీతోనే ఉంటాను.

స్నేహితులారా! నేను మీతో మూడు పవిత్రమయిన పుష్పాలను నా దివ్యమైన ఆధ్యాత్మిక జీవితమనే చెట్టునుండి వచ్చిన వాటిని పంచుకోవాలనుకుంటున్నాను. మీరు ఆ పవిత్రమయిన పుష్పాల సౌరభాలను ఆస్వాదిస్తున్నారు. అదే 'విశ్వ ప్రేమ' అనే పుష్పము. దానినే మీరు మీ బాహ్య ప్రపంచంలో కూడా ఆస్వాదించడానికి ప్రయత్నం చేయండి. ఇక రెండవ పుష్పము 'అనంతమయిన శాంతి'. మనము అందరము ఆ దివ్య పుష్ప సౌరభాన్ని ఆస్వాదిస్తూ ప్రపంచ మానవాళికందరికి దాన్ని పంచి పెడదాము. ఇక మూడవ పుష్పము 'అంతర్ముఖ స్థితి' అలాంటి నిశ్చలస్థితిలో ప్రాపంచిక విషయాలన్నీ కనుమరుగయి పోయి దివ్యానందంలో మునిగితేలిపోదాము.

ఈ రోజు భగవంతుని ఆశీర్వాదములతో జరిగిన ఈ సమావేశాన్ని మనం ఎప్పటికీ మన హృదయాలలో పదిలంగా, మర్చిపోకుండా దాచుకుందాము. మనందరికి ఎడబాటు అన్నది లేనే లేదు. ధ్యానస్థితిలో మనందరి ఆత్మలు ఏకంగా ఉంటాయి.

అధ్యాయం - 35

# శాంతి కేంద్రాలు

శాంతి కేంద్రాలు పనిచేసిన విధానాన్ని గురించి ఇక్కడ నేను, వాటి ప్రాముఖ్యం గురించి కొద్దిగా చెప్పాలనుకుంటున్నాను. భారతదేశానికి తిరిగి వచ్చేముందు అమెరికాలో వివిధ ప్రాంతాల్లో నేను నెలకొల్పిన శాంతి కేంద్రాలను, అవి పనిచేసిన తీరుతెన్నులను ఎందరో ఆర్తులకు, జిజ్ఞాసువులకు ఆధ్యాత్మిక శాంతిని ప్రసాదించిన వైనాన్ని ఈ ఆత్మకథ మధ్యలో చేర్చటానికి నేను ఎంతో ఆనందిస్తున్నాను. సోదరి సుశీలాదేవితో కలిసి మేము ఎన్నో శాంతి కేంద్రాలను, శాంతి ఆశ్రమానికి అనుబంధ సంస్థలను స్థాపించి భక్తుల హృదయాల్లో అంతరంగ శాంతిని నెలకొల్పామని చెప్పాలి.

అన్ని సంకల్పాల నుండి విముక్తి పొందిన వారు అదృష్టవంతులు. అన్ని సంకల్పాలకు అతీతులయిన వారికే ప్రశాంతత చిక్కుతుంది. కానీ ఈ ప్రపంచంలో భౌతిక దేహంతో జీవిస్తున్నంత కాలము ఏదో ఒక సంకల్పం, లేదా భగవంతుని పేరుతో సేవ చేయాలనే భావము వస్తుంటాయి. నా బాల్యం నుండే నాకు శాంతికేంద్రాలను స్థాపించాలనే సంకల్పం ఉండేది. కేవలం ఈ భూమి మీదే కాకుండా ప్రతి వ్యక్తి హృదయంలోనూ తూర్పు, పడమర దేశాల్లోకి వారందరికి శాంతి సందేశాలను అందించాలనే తపన ఉండేది. ప్రతి వ్యక్తి హృదయంలో శాంతి నెలకొన్నప్పుడు అది ప్రపంచ శాంతికి, విశ్వశాంతికి దారితీస్తుందని, అది తొందరగా కావచ్చు లేదా కొంత సమయము పట్టవచ్చు గాని అలాగే జరుగుతుందని నా ప్రగాఢ విశ్వాసము. అదే శ్రీ శాంతి ఆశ్రమము మాకు ఆదర్శంగా నిలిచింది.



**వ్యక్తిగత శాంతి ప్రపంచ శాంతికి దారితీస్తుంది. కాబట్టి ముందుగానే హృదయాన్ని శాంతితో నింపుకో. ముందు నీ ఇంటిలో శాంతిని నెలకొల్పదానికి ప్రయత్నించు. దాన్ని నీ సంఘానికి లేదా సమాజానికంతటికి అందించడానికి ప్రయత్నించాలి. ఆ విధంగా ఒక హృదయం నుండి మరొక హృదయానికి శాంతి తరంగాలను ప్రసరింపచేయాలి. నీ పవిత్రమయిన ఆదర్శవంతమయిన శాంతియుత జీవనం ద్వారా విశ్వానికంతటికి శాంతి సందేశాలు, తరంగాలు ప్రసరించి, విశ్వశాంతి కలిగే దాకా ప్రయత్నించాలి.**

నా జీవితంలో అత్యంత ఆనందకరమయిన క్షణాలు, భగవంతుడు నాకు శాంతి కేంద్రాలను స్థాపించటం ద్వారా ప్రతి ఒక్క భక్తుని హృదయాన్ని శాంతితో నింపే సదవకాశాన్ని కల్పించటమే. నేను జీవితంలో ఎన్నడయినా బాధ పడిన క్షణాలున్నాయి అంటే, అవి నేను మీ హృదయంలో శాంతిని నింపటంలో విఫలమయినప్పుడు, క్రొత్త శాంతి కేంద్రాలను స్థాపించడానికి విఫలమయినప్పుడు మాత్రమే అని చెప్పగలను.

మన భక్తిమయ అంకిత హృదయ క్షేత్రాలను శాంతి కేంద్రాలుగా మార్చుకొని, అక్కడి నుండి శాంతి, ప్రేమలను ఉరకలు వేసే నదుల నీరులాగా గలగల పారే జలపాతాల్లాగా మనకు ప్రియమయిన వారికి, దగ్గరలోని వారికే కాకుండా ఎక్కడో దూరంగా ఉండేవారికి, ప్రపంచంలోని మానవాళి కందరికి కూడా అందించగల్గటం ఎంతో అదృష్టం. అలాంటి వారు భగవంతుని అనుగ్రహానికి పాత్రులవుతారు.

"ప్రేమించు! ప్రేమించటానికే జీవించు" ఎంత గాఢమయిన అనుభూతి. అది కల్గినప్పుడు అందరిని ప్రేమించటము చాలా తేలికవుతుంది. కానీ ప్రేమించటం కోసమే జీవించటము చాలా గొప్ప విషయం. అది మహోన్నతమయిన స్థితి. నిజానికి మనం మన హృదయానికి బాగా నచ్చినవాళ్ళను మాత్రమే ప్రేమించి, మిగిలిన వారి గురించి పట్టించుకోము. కాని మనం ప్రేమించటానికే జీవించేటప్పుడు ప్రేమ విశ్వప్రేమగా మారిపోతుంది. ఒక్క క్షణం కూడా ఏ ఒక్కరిని మర్చిపోవటం గాని, వదలిపెట్టటం గాని, ప్రేమించకుండా ఉండడం గానీ సాధ్యం కాదు.

**విశ్వప్రేమ ఎవ్వరిని వదిలిపెట్టదు. అందరినీ ప్రేమించేలా చేస్తుంది. మాటలు అయోమయాన్ని, ద్వంద్వాన్ని, అనుబంధాన్ని సృష్టిస్తాయి. కాని మౌనం ఆత్మను దర్శింప చేస్తుంది, ఆత్మ సాక్షాత్కారాన్ని అందిస్తుంది.**

మానవుని స్వయంజ్యోతి ప్రకాశంలో ఇతరులకే ప్రథమ స్థానం ఉంటుంది. ఏ మానవుడు తాను ఇతరులకు సేవ చేస్తున్నాను అని భావిస్తాడో అతడు అజ్ఞాని. అజ్ఞాని దృష్టిలో ఇతరులు ఉన్నారని అనుకోవటమే అజ్ఞానము. సృష్టి సర్వము బ్రహ్మమయము అయినప్పుడు ఉన్నది ఒక్కడే దైవము. మన బాహ్య దృష్టికి గోచరించకపోయినా అంతా బ్రహ్మమయంగా ఉంటుంది. అప్పుడు పరాయివారంటూ ఎవరుంటారు? నీవు ఎవరికయినా సేవలు అందిస్తే అది నీకు నీవు సేవ చేసుకున్నట్లే అవుతుంది.

నీకు నేను సహాయం చేస్తే, అది నాకు నేను సహాయం చేసుకున్నట్లే.

మీ అందరిని నేను ప్రేమిస్తే, నన్ను నేను ప్రేమించుకున్నట్లే.

అందరిలో ప్రకాశిస్తున్న ఆత్మ స్వరూపాన్ని ఆరాధించు. నీ కళ్ళల్లో వెలుగులు నింపుతున్నది ఆత్మ చైతన్యమే. అది దగ్గరగా ఉంది. నీ ఆత్మ స్వరూపంగానే ఉంది. అది నీ కంటే వేరుగా లేదు. అదే పరమాత్మ స్వరూపం. మన శ్వాసలో నిండి ఉన్న నీ ప్రతి ఉచ్ఛ్వాస నిశ్వాసల్లోనూ నీవు ఆ దైవము ఉనికిని గుర్తించగలిగితే, నీ హృదయంలోనే నిశ్శబ్దంగా కొలువై ఉన్న పరమాత్మను తెలుసుకోగలిగితే ఇక నీకు నా దగ్గరికి రావలసిన పని లేదు. ఈ శాంతి కేంద్రాల అవసరం అసలు ఉండదు. ఎందుకంటే నిజమయిన శాంతి కేంద్రము నీ లోపలే ఉంది. నీవు తనని ఎప్పుడు గుర్తించగలుగుతావా అని ఎదురుచూస్తుంది.

నేను నీకు నీవు సహాయం చేసుకునేందుకు సహాయము చేయాలనుకుంటున్నాను.

నేను నీవు సేవ చేయాలనుకుంటున్నప్పుడు నీవు నిలబడటం నేర్చుకోవచ్చు. నీ కాళ్ళ మీద నీవు నిలబడగల్గుతావు.

నా జీవితాశయము, నా ప్రబోధాల సారాంశము నంతటిని మూడు వాక్యాల్లో చెపుతాను.

1. నా మీద ఆధారపడవద్దు.

2. ఎవ్వరి మీదా ఆధారపడవద్దు

3. నీ అంతరాంతరాల్లో దివ్యమైన ప్రకాశంతో వెలుగొందుతున్న ఆత్మజ్యోతిపై ఆధారపడు. అది నీవు తనను గుర్తించాలని ఎదురుచూస్తోంది. నీ అణువణువులో నిండి నిబిడీకృతమై ఆత్మగా అది వెలుగొందుతోంది. ఇప్పుడు ఈ క్షణంలోనే గుర్తించు.

మనం దేనిని గురించి ఆలోచిస్తామో, అదే అవుతుంది. మనము దేనిని విత్తుతామో, ఆ పంటే వస్తుంది. మానవుడే తన కర్తకు విధాత. మన ఆలోచనలు ఎలా ఉంటాయో, పనులు కూడా ఆ విధంగానే ఉంటాయి. అందువలన మన ఆలోచనలను భగవంతుని వైపుగా మళ్ళించాలి. ఆయన మననుండి ఎన్నడూ వేరుగా లేడు అన్న విషయం అర్థం చేసుకోవాలి.

ఎవరయితే ఈ విశాల ప్రపంచాన్ని తన సొంత ఇళ్ళుగా భావిస్తారో, అందులో నివసించే వారందరిని తన సొంత సోదర సోదరీమణులుగా భావించి ప్రేమిస్తారో, వారిని సేవిస్తారో అదే నిజమయిన మతము. వారందరూ భగవదనుగ్రహం పొందుతారు.

నా ప్రపంచంలో నాకు ఎవ్వరూ గురువులు గాని శిష్యులు గాని లేరు. సృష్టిలో అందరూ భగవంతుని ప్రతిరూపాలే. ప్రతి ఒక్కరూ జ్యోతి స్వరూపాలే. నేను చెప్పాల్సిన అవసరం లేదు. మీలో ఎవరినీ నా భక్తులుగా మార్చుకోవాలనే ఉద్దేశ్యము నాకు లేదు. నాకున్న సంకల్పం కేవలం మీకు సహాయం చేయాలని. ప్రతి ఒక్కరికి సహాయం చేయాలనుకుంటున్నాను. మీ లోపలున్న అంతర్జ్యోతిని ఆవిష్కరింపచేయడానికి దోహదపడాలని ఉంది. అది ఎల్లప్పుడు ప్రతి ఒక్కరిలో భగవంతుని ప్రతిరూపమయిన అందరిలో ఉంది.

నేను దైవం గురించి మాట్లాడినప్పుడు ఎక్కడో దూరంగా ఆకాశంలో, లేదా స్వర్గలోకంలోని దైవం గురించి మాట్లాడటం లేదు. లేదా ఒక మతం గురించి గాని, ఒక దేశానికి సంబంధించి గాని మాట్లాడటం లేదు. నేను దైవం గురించి చెపుతోంది అణువణువులో నిండి నిబిడీకృతమైన దైవం గురించి. అది నీవే అయివున్నావు. ఆ దైవం నీ కళ్లలో వెలుగులు నింపుతోంది. ఇప్పుడు, ఇక్కడే ఆ దివ్యానుభవాన్ని అనుభవించు. దైవము అంటే నీ బుద్ధికి బుద్ధి అయినవాడు, నీ హృదయానికి హృదయమైనవాడు. నీ శ్వాసలో శ్వాస అయినవాడు, నీ జీవితానికే జీవితమయినవాడు, నీ ఆత్మకు ఆత్మ అయినవాడు.

నీలో వెలుగొందుతున్న ఆ జ్యోతి స్వరూపం పట్ల నిజాయితీగా ఉండు. అది నీ దివ్యమయిన అంతరాత్మ. అదే నీ నిజమయిన జీవన గమ్యము, జీవిత లక్ష్యము. నీ పట్ల నీవు నిజాయితీగా లేకపోతే, నీ అంతరాత్మపై నీవు ఆధారపడకపోతే అంతరాత్మగా వెలుగొందుతున్న ఆ దివ్యజ్ఞాన ప్రకాశాన్ని నీవు గుర్తించలేకపోతే, ఏదయితే నీకు అత్యంత సమీపంగా, ఆనందమయంగా ఉందో దాని పట్ల నీవు నిజాయితీని ప్రదర్శించలేకపోతే ఇంక ఇతరుల పట్ల, బాహ్యలోకపు వ్యక్తుల పట్ల ఏ విధంగా నిజాయితీని ప్రదర్శించగలవు? గొప్పవారి పట్ల, అవతారమూర్తుల పట్ల ఏ విధంగా భక్తి శ్రద్ధలు ప్రదర్శించగలవు? ఏ మతానికయినా నిన్ను నీవు తెలుసుకోవటమే మొదలు, మధ్య, చివర కూడా అయివుంటుంది. ఎవరయితే ఆత్మను దర్శించగలిగారో అలాంటి మహనీయులందరికి తలవంచి నమస్కరిస్తున్నాను. ఆత్మ సాక్షాత్కారమే శాంతిని ఇస్తుంది. ధైర్యాన్ని, శక్తిని ప్రసాదిస్తుంది. అదే ఆరోగ్యాన్ని, ఆనందాన్ని దీర్ఘాయుష్షను కూడా ఇస్తుంది. ఆత్మాసాక్షాత్కారము పొందిన వ్యక్తికి ఈ లోకంలో సాధ్యం కానిది ఏమీ ఉండదు. ఆయన ఏదయినా సాధించగలడు. ఆయన వేదాంత తత్త్వానికి సింహం లాంటివాడు. మేధా సంపత్తికి మారు పేరు ఆయన.

ఎవ్వరి మీదనయినా ఆధారపడటము అంటే వారు గొప్పవారయినా, పేరున్నవారయినా సరే అది బానిసత్వము, అజ్ఞానము, బలహీనత అవుతుంది. ఆత్మసాక్షాత్కారము పొందిన వ్యక్తి సింహములాగా గర్జిస్తాడు. అలాగే ఇతరులపై ప్రతిదానికి ఆధారపడేవాడు, మేకపిల్లలాగా పిరికిగా ఉంటాడు. మీ అందరూ సింహాల్లాగా గర్జించాలని, మీ ప్రేమామృతాన్ని అందరిపై వర్షించాలని, అలాగే మీరందరూ శాంతిని మానవాళికందరికి పంచిపెట్టాలని ఆశిస్తున్నాను. శాంతి అనేది ఇచ్చేవాడికే సొంతమవుతుంది కాని ఆశించేవాడికి కాదు. అందువలన మీరు ఎప్పుడూ ఇతరులకు ప్రేమను పంచేవారుగా ఉండాలి. విశ్వప్రేమ, ఆదర్శవంతమయిన జీవన విధానము, తేజోమయమయిన జ్యోతి స్వరూపంగా ఉండాలి.

మతము, వేదాంతము కూడా మానవుడిని దుఃఖమునుండి దూరం చేయలేకపోతే, అప్పుడు అతని దుఃఖానికి అతనే కారణమవుతాడు. లేదా అతడు ఆనందంగా, సంతోషంగా ఉంటున్నాడు అంటే అతడే అతని సంతోషానికి కారణము. నీవు సంతోషంగా ఉన్నావా లేదా దుఃఖంతో ఉన్నావా? నీవు దుఃఖంలో కూరుకుపోవాలని అనుకుంటే

కేవలం నీ గురించే నీవు ఆలోచించాలి లేదా నీవు సంతోషంగా ఉండాలని భావిస్తుంటే ఇతరుల గురించి ఆలోచించటం నేర్చుకో. ఇతరులను సంతోషంగా ఉంచగల్గినప్పుడే నీవు కూడా సంతోషంగా ఉండగల్గుతావు.

**ఇతరుల సంతోషమే మన సంతోషం కావాలి**
**ఇతరుల ఆరోగ్యమే మన ఆరోగ్యం కావాలి**
**ఇతరుల శాంతి మన శాంతి కావాలి**

ఇక నేను నా సందేశాన్ని వైదిక శాంతి మంత్రాలతో ముగిస్తూ, మీ హృదయాల్లో శాంతి సందేవాన్ని నింపటానికి ప్రయత్నిస్తాను.

**స్వర్గలోకం శాంతిగా ఉండుగాక!**
**ఆకాశము శాంతిగా ఉండుగాక!**
**నీరంతా శాంతిగా ఉండుగాక**
**భూమి మీద శాంతి నెలకొనుగాక!**
**శాంతి చిన్న పొదల నుండి మొక్కలకు, పెద్ద వృక్షాలకు ప్రవహించుగాక!**
**అందరూ శాంతిమయ జీవనాన్ని కొనసాగింతురుగాక!**
**అందరూ ప్రశాంతిగా వర్ధిల్లుదురు గాక!**

**అధ్యాయం - 36**

# భారతదేశానికి తిరిగి రావటం

సోదరి సుశీలాదేవిని పరిచయం చేయడానికి సమయం వచ్చింది. ఈ ఆత్మకథను చదువుతున్నవారందరికీ సుశీలాదేవి గురించి తెలియాలి. ఆమె శాంతి ఆశ్రమంలో ప్రధాన భూమిక పోషించినది. దాదాపు ఇరువై ఐదు సంవత్సరాలుగా ఆశ్రమానికి సేవలందించింది. ఆమె అసలు పేరు కుమారి ఎలెన్ సెయింట్ క్లేయర్ నోవాల్డు. నేను మూడవ పర్యాయం అమెరికా దేశము వెళ్ళినప్పుడామె న్యూయార్క్, ఫిలడెల్ఫియా నగరాల మధ్యనున్న న్యూజెర్సి నగరంలో నివసిస్తుండేది. ముందుగా ఆమెకు మా శాంతికేంద్రాలు



**సుశీలాదేవి**

ఎలాంటి ఆర్భాటమూ లేకుండా చేస్తున్న శాంతియుత కార్యక్రమాల గురించి ఏ మాత్రము తెలియదు. తెలిసిన తర్వాత క్రమం తప్పకుండా ఎంతో దూరంనుండి ఎలాంటి అసౌకర్యము భావించకుండా పాల్గొనేది. నా మొట్టమొదటి శాంతి సందేశాన్ని మొదటి సమావేశంలో ఆమె విన్న తర్వాత వ్యక్తిగత హృదయ శాంతి ప్రపంచశాంతికి బాటలు వేస్తుందని గ్రహించి, దాని పట్ల ఆమె ఎంతగానో ఆకర్షితురాలయి శాంతి సందేశాలను ప్రచారం చేయడానికి తన యావత్తు జీవితాన్ని శాంతి ఆశ్రమ సేవలకే అంకితం చేసింది.

ఆ రోజుల్లో నా సమావేశాలకు హాజరయిన ఎంతో మంది సహృదయులు, భక్తిశ్రద్ధలు గల వారు ఎంతో అంకితభావంతో తమ జీవితాలను శాంతికేంద్రాల కార్యక్రమాలకే అంకితం చేస్తామని ప్రమాణాలు చేసేవారు. వారంతా నాతో పాటు భారతదేశానికి వచ్చి భారతీయ సోదర సోదరీమణులకు, అలాగే పాశ్చాత్య దేశాల్లో శాంతి ప్రచారానికి సేవ చేస్తామని చెప్పేవారు. చివరికి సుశీలాదేవి ఒక్కరే తల్లిదండ్రులను, సోదరుడిని, సోదరిని, బంధుమిత్రులను, తన సర్వస్వాన్ని త్యాగం చేసి అందరినీ వదలిపెట్టి భారతదేశానికి వచ్చి సేవలందించింది. వారి కుటుంబము సెవెంత్ డే ఎడ్వంటిస్టు క్రైస్తవులు. వారి మతంలో వారికి ఎంతో పేరు ప్రఖ్యాతులు ఉన్నాయి. ఎంతో క్రమశిక్షణ, సేవానిరతి, త్యాగబుద్ధి కలవారు. కుమారి ఎలెన్ సెయింట్ క్లేయర్ నోవాల్టు (సుశీలాదేవి) కులమతాలకి, దేశకాలాలకి అతీతురాలు. ఆమె హృదయం విశ్వప్రేమకు నిలయం. అందరిని ప్రేమించేది.

మేరీ మాత అడుగుజాడల్లో నడిచిన సాధుశీలి క్లార మాదిరిగా ఆమె పేరుతో కూడా చాలా అర్థవంతమయిన భావమున్నందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. నేను ఆమెను మొదటిసారి చూచినప్పుడే ఆమె సద్గుణాలకు తగిన పేరు సుశీలాదేవిగా నిశ్చయించుకున్నాను. ఆ పేరు అంటే నాకు చాలా చాలా ఇష్టం. ప్రేమ, శాంతి, దయ, పవిత్రత మూర్తీభవించిన లక్షణాలు ఆమెలో నిండుగా ఉన్నాయి. ఆమె జీవితం సేవకి అంకితం చేసింది. ఒక పవిత్రమయిన రోజు కుమారి ఎలెన్ సెయింట్ క్లేయర్ నోవాల్టుకు అందరి భక్తుల సమక్షంలో 'సుశీలాదేవి' అని నామకరణం చేయబడింది. ఆమెపై పరమాత్మ అనుగ్రహం అమృతవర్షంలా కురవాలని, తద్వారా ఆమె భక్తిమయ జీవితంలో ప్రేమ, ఆధ్యాత్మిక క్రాంతి నిండిపోవాలని ప్రార్థిస్తున్నాను.

నిజానికి నేను మీతో చెప్పినట్లుగా చాలా మంది భక్తులు నాతో పాటు భారతదేశానికి రావాలని, శాంతి ఆశ్రమంలో సేవలందించాలని అనుకున్నారు. కానీ సమయం వచ్చినప్పుడు మాత్రం ఒకరి తర్వాత ఒకరు ఏదో ఒక కారణం చెప్పి తప్పించుకున్నారు. తర్వాత తోటపల్లి కొండల్లోని శాంతి ఆశ్రమానికి వీలుచూసుకొని తప్పకుండా వస్తామని చెప్పారు. ఇంకొక ఇద్దరు పవిత్రాత్మ స్వరూపిణులయిన మహిళలు మాతో రావటానికి సిద్ధపడ్డారు. వారిలో ఒకరు కుమారి ఓలిఫాంట్, ఆమె చాలా పొడవుగా ఉండే పెద్దావిడ ఆమె చాలా కాలము టీచరుగా పనిచేసింది. రిటైర్ అయిన తర్వాత ఆధ్యాత్మిక జీవితం గడుపుతూ, అలవాటు ప్రకారం అందరిపై పెత్తనం చెలాయిస్తూ ఏదో ఒకటి చెపుతూ ఉండేది. ఆమె ముందుగా అమెరికాలోని రామకృష్ణ మిషన్ సంస్థతో అనుబంధం కల్గి ఉండేది. తర్వాత శాంతి కేంద్రాలు ప్రచారం చేస్తున్న శాంతి సందేశాల పట్ల ఆకర్షితురాలయి ఈ మార్గంలోనికి వచ్చింది. ఆమె తన మిగిలిన జీవితాన్ని భారతదేశ సేవలో గడపాలని నిర్ణయించుకుంది.

కుమారి ఓలిఫాంట్‌కి, సుశీలాదేవికి అన్ని విషయాల్లో చాలా భేదముంది. సుశీలాదేవి వినయశీలి, తన్ను తాను ఒక విద్యార్థిలాగా ఓలిఫాంటాకి ఒదిగి ఉండేది. మాకు భారతదేశానికి సరాసరి రావడానికి టికెట్టు దొరకనందువలన జపాను వెళ్ళి అక్కడి నుండి భారతదేశానికి రావాలనుకున్నాము. కుమారి ఓలిఫాంటా కూడా మాతో పాటు జపానుకు వచ్చింది. ఇంకొక పెద్దావిడ కూడా నా వద్ద ధ్యాన తరగతులకు వస్తుండేది. ఆవిడ కూడా జపాను వచ్చింది. ఆమె కూడా తన జీవితాన్ని భగవంతుని బిడ్డలకి సేవ చేసేందుకు అంకితం చేయాలనుకుంది. దురదృష్టవశాత్తూ ఆవిడ జపాను దేశంలో జబ్బు పడింది. అందువలన ఆవిడా, కుమారి ఓలిఫాంటా ఇద్దరూ కల్సి అమెరికా తిరిగి వెళ్ళిపోయారు.

శాన్‌ఫ్రాన్సిస్కోలో మేము 'డాలర్ లైన్' అనే చాలా పెద్ద పేరున్న స్టీమరు ఎక్కాము. ఆ స్టీమరులో ప్రశాంతత అన్నది మచ్చుకయినా లేదు. నేను ఎప్పుడూ నిశ్శబ్దంగా, ప్రార్థనలో కాలం గడిపేవాడిని కావటం వలన అందులో ప్రయాణం నాకు గాని, సుశీలాదేవికి గాని అంతగా నచ్చలేదు. ఏదో విధంగా ఆ వాతావరణానికి నెమ్మదిగా అలవాటు పడి, అందులో ప్రయాణిస్తున్న ప్రయాణీకులతో నెమ్మదిగా స్నేహం చేసి వారిలో చాలా మందిని శాంతి ఆశ్రమానికి సన్నిహితులుగా మార్చాము. అందులో

కొంత మంది భారతదేశానికి వచ్చి శాంతి ఆశ్రమంలో కొంతకాలము ప్రశాంతమయిన జీవితం గడపాలనే కోరిక వ్యక్తం చేశారు.

జపాను దేశాన్ని 'చక్రిపూల దేశము' అని పిలుస్తుంటారు. అక్కడి చెట్లన్ని విరగపూసి చూడడానికి చాలా ఆహ్లాదకరంగా, స్ఫూర్తిదాయకంగా ఉండి సంతోషాన్ని కలుగ చేస్తున్నాయి. జపాను నుండి భారతదేశానికి వెళ్ళడానికి మేము దాదాపు నెల రోజుల పాటు ఆ దేశంలోనే ఉండిపోవాల్సి వచ్చింది. నాకప్పుడు మేము ఏ నగరంలో విడిది చేశామో గుర్తు లేదు. కాని అది మంచి అందమయిన, ఆరోగ్యకరమయిన విశ్రాంతి భవన సముదాయము. అందులో ఎందరో విదేశీయులు బస చేశారు. మంచి సౌకర్యవంతమయిన పెద్ద గదిలో మేమున్నాము. జపానులో ఉన్నంతకాలము సోదరి సుశీలాదేవి మా విడిది కోసం చాలా డబ్బు ఖర్చు చేసింది.

మాకు అక్కడ చేయడానికి పని ఏమీ లేకపోవడం వలన సుశీలాదేవి ఒక కారు మాట్లాడి జపానులోని దూర దూర ప్రాంతాలకి చూడడానికి తీసుకువెళుతుండేది. జపానులో మేము ఎలాంటి పెద్ద సమావేశాలు నిర్వహించలేదు కాని కొద్దిమందిని పోగు చేసి వారికి శాంతి సందేశాలను వినిపించి, వారితో ప్రార్థన, ధ్యానము మొదలైనవి చేయించేవాళ్ళము. వాళ్ళ హృదయాలను భక్తితో, శాంతితో నింపే ప్రయత్నం చేసేవారము.

నాకు ఇప్పటికి కూడా ఆ సంఘటన బాగా గుర్తుంది. నాకు కాఫీ త్రాగే అలవాటు లేదు. సుశీలాదేవి పదే పదే కోరటం వలన నేను మొదటిసారి కాఫీ త్రాగాను. కానీ త్రాగడం నాకు పడకపోవడం వలన వెంటనే వాంతి చేసుకున్నాను. సుశీలాదేవి చాలా బాధపడింది. నన్ను జపానులోని దూరప్రాంతానికి కొండలు, పొలాలు ఉన్న ప్రదేశాలకి తీసుకువెళ్ళింది. జపానులోని స్త్రీలు, పురుషులు, చిన్నపిల్లలు కూడా పొల్లాలో కష్టపడి పనిచేయడం చూసి నేను చాలా ఆనందించాను. జపానులోని ప్రధానమయిన ఆహారం వరి. అందువలన ఆ దేశాన్ని 'వరి దేశము' అని కూడా అంటారు. కొండల్లో అందమైన ప్రకృతి సౌందర్యంతో ఉన్న దారుల్లో చాలా దూరం ప్రయాణం చేయటం వలన నా మనస్సుకు ఉల్లాసంగా అనిపించింది. క్షేమంగా మా గదికి చేరుకున్నాము.

హోటల్‌కి చేరుకున్న తర్వాత నా గదికి వెళ్ళాను. వెళ్ళేటప్పుడు నేను నా గదికి తాళం వేశాను. కానీ ఆశ్చర్యకరంగా నా గది తాళం తీయగానే లోపల ఒక వ్యక్తి

కనిపించాడు. గదంతా చిందరవందరగా ఉంది. ముఖ్యంగా నా పెట్టె తెరిచి పుస్తకాలు, పేపర్లు, నా ఉత్తరాలను పరిశీలిస్తున్నప్పుడు నేను అతడిని తాళం వేసిన నా గదిలోకి ఎందుకు ప్రవేశించావని, నా వస్తువులను ఎందుకు వెదుకుతున్నావని ప్రశ్నించగా అతడు పొరపాటుగా అది తన గది అనుకొని లోపలికి వచ్చానని చెప్పాడు. అతను పట్టుబడిపోయిన దొంగలాగా కంగారుగా నా గది నుండి తొందరగా బయటికి వెళ్ళిపోయాడు. నేను హోటల్ యజమానితో జరిగినదంతా వివరించి, ఇలాంటి కుత్సితమయిన పనులు చేయటం వలన జపాను దేశీయులు మంచివారు కారు అని భావిస్తారని చెప్పాను. దానికి ఆ హోటలు యజమాని నవ్వుతూ అతను సి.ఐ.డి. ఏజెంట్ అయి ఉంటాడని ఏమయినా ఆధారాలు దొరుకుతాయి అని వెదకడానికి వచ్చి ఉంటాడని, మేము విప్లవకారులతో సంబంధాలు లేనివారయితే ఎలాంటి ఇబ్బంది ఉండదని చెప్పాడు. అయినా జరిగిన దానికి తాను చాలా విచారిస్తున్నానని, దాని గురించి కనుక్కుంటానని, ఇకపై అలాంటి సంఘటనలు జరగకుండా చూసుకుంటానని వాగ్దానం చేశాడు.

భగవంతుని అనుగ్రహం వలన మిగిలిన రోజులన్నీ చాలా సంతోషంగా గడిచిపోయాయి. మేము చాలా విశ్రాంతిగా ఉండటం వలన నిరంతరం ప్రార్థనల్లో, ధ్యానములో కాలము గడిపాము. దాని వలన భవిష్యత్తులో మా వలన జరగనున్న బృహత్తరమైన కార్యక్రమాలు నిర్వహించడానికి కావలసిన శక్తిని సమకూర్చుకున్నాము. జపానులోని చర్రీపూల అందాలను చూస్తూ మేము అలసట అనేది తెలియకుండా కాలం గడిపాము. సుశీలాదేవి అందమైన చర్రీపూల మీద, అక్కడి ఆహ్లాదకరమైన ప్రకృతి సౌందర్యం పట్ల తన ఆలోచనలను కాగితంపై కవితలా పెట్టింది. దైవం ఆశీర్వదించిన వారి హృదయాలు కేవలం దైవాన్ని మాత్రమే కాకుండా ప్రకృతిలోని ప్రతి చెట్టు, పుట్ట, పిట్ట, మొక్కలు, పూలు, క్రిమికీటకాలను కూడా ఒకే విధంగా ప్రేమిస్తారు. అప్పుడు జీవితం ఎంతో ఆనందమయంగా, ఆహ్లాదకరంగా ఉంటుంది. సాధు హృదయాలు శాంతిమయంగా ఉంటాయి.

ప్రకృతితో అనుబంధం ఏర్పర్చుకొని అనుసంధానం అవటం భగవదనుగ్రహమే. అలాంటివారు కేవలం మానవుడిలోనే కాకుండా ప్రకృతిలోని జీవరాసులన్నింటిలో భగవంతుని దర్శించగల్గుతారు. పక్షులు, మొక్కలు, పూలు అన్నీ భగవంతుని స్వరూపం గానే గోచరిస్తాయి. సాధుమహాత్ముల హృదయం సంతోషంతో, శాంతితో నిండిపోతుంది.

సాధువు, ఫ్రాన్సిస్ వంటి మహాత్ముడు నిరంతరము సృష్టి అంతటా భగవంతుని దర్శించేవాడు. ఆయన చుట్టూ జంతువులు కూడా ఎలాంటి భయం లేకుండా కూర్చునేవి. ఎంత అదృష్టమిది అందరిని ప్రేమించగల్గటం, అలాగే అందరి చేత ప్రేమించబడటము రెండూ గొప్ప విషయాలే. మేము జపాను దేశంలో గడిపిన ఆనందమయ జీవనం ఇంకా నా హృదయంలో మధురంగా, సజీవంగా ఉంది. జపాను దేశస్థులు చాలా దయ గలవారు, ప్రేమాస్పదులు. వారు కష్టజీవులు. అలాగే దైవభక్తి కలవారు. జపాను దేశంలో అందమయిన దేవాలయాలు చాలా ఉన్నాయి. అందులో బుద్ధ భగవాన్ విగ్రహాలు అనేక భంగిమల్లో కొన్ని చోట్ల పద్మాసనంలో కూర్చొని ధ్యానముద్రలో ఉంటే మరికొన్ని చోట్ల నిలబడినట్లుగా ఉన్నాయి. జపాను దేశం మనల్ని బుద్ధ భగవానుడికి దగ్గరగా చేర్చింది. ఆయన జీవితం గొప్ప స్ఫూర్తినందిస్తుంది.

గొప్పతనమంతా దయామయుడు, కరుణామయుడు అయిన బుద్ధ భగవానుడికే చెందుతుంది.

నేను మూడు సంవత్సరాల తర్వాత భారతదేశానికి తిరిగి వస్తున్నాను. జూన్ 1931 నేను భారతదేశం చేరుకున్నాను. సుశీలాదేవి జపాను దేశంలోనే ఆగిపోయి తర్వాత వచ్చే స్టీమరులో వచ్చే ఏర్పాట్లు చేసుకున్నారు.

స్టీమరు మద్రాసు ఓడరేవు చేరుకున్నప్పుడు నా కోసం ఎందరో భక్తులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు ఆశ్రమవాసులు నాకు అభినందనలు తెలియచేయడానికి వచ్చారు. కమలాదేవి, ఆమె ముగ్గురు కుమార్తెలు ఎంతో గొప్పవారయిన మనోరమ, సుశీలా, సుమతి స్టీమరు రేవు చేరుకుంటున్నప్పుడు ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తూ చేతిరుమాళ్ళు ఊపుతూ కనిపించారు. ఓడ రేవును చేరుకోగానే బంధువులు, స్నేహితులు హడావుడిగా పరుగెత్తుకొని వచ్చి నిచ్చెన ఎక్కి స్టీమరుపైకి చేరుకున్నారు. నాకిప్పుడు జపాను నుండి మద్రాసు చేర్చిన కార్గో స్టీమరు పేరు గుర్తు లేదు. అందులో చాలా కొద్ది మంది ప్రయాణీకులే ఉన్నారు. చాలా నెమ్మదిగా ప్రయాణించటం వలన నేను బాగా విశ్రాంతి తీసుకున్నాను. సూర్యోదయ సూర్యాస్తమయాలను ఆనందంగా తిలకించేవాడిని.

నాతో పాటు స్టీమరులో ప్రయాణం చేసిన వారు నా వద్దకు వచ్చి వీడ్కోలు తీసుకొని శాంతి ఆశ్రమానికి వీలయినంత తొందరలో వస్తామని వాగ్దానం చేసి వెళ్ళారు. ప్రతిసారి

స్టీమరులో ప్రయాణం చేసేటప్పుడు నేను తోటి ప్రయాణీకులకు ఆధ్యాత్మిక ప్రసంగాలు వినిపించి, ధ్యానము చేయించి వారికి సహాయం చేయటం అలవాటు. స్టీమరు నడిపించే కెప్టెన్ నుండి సేవలు అందించే క్యాబిన్ బోయ్ వరకు అందరికీ ఆధ్యాత్మిక శాంతి సందేశాలను వినిపించేవాడిని. నేను స్టీమరు ప్రయాణం చేసినా లేదా రైలులో అయినా, సముద్రంలో ప్రయాణం అయినా లేదా భూమి మీద అయినా నేను ఎల్లప్పుడూ ఒకే విషయాన్ని గుర్తు పెట్టుకునేవాడిని. అది ఎంతో స్ఫూర్తిని అందించి సహకరిస్తుంది.

**నీవు వెళ్ళే దారిలో గులాబీలను పరుచుకుంటూ సాగిపో...!**
**ఎందుకంటే మళ్ళీ ఈ దారిలో నీవు వస్తావో రావో కదా!**

కాబట్టి జపాను నుండి మద్రాసు చేరుకోవడానికి నేను ఎక్కిన కార్గో స్టీమరులో అదే ప్రయాణీకులతో మళ్ళీ నేను ప్రయాణించటం జరగని పని. అందువలన నా కర్తవ్యంగా భావించి వారందరికి శాంతి, ప్రేమ సందేశాలను పంచిపెట్టాను. నన్ను కల్సిన ప్రతి ఒక్కరికి ప్రేమను అందించాను. స్టీమరు ప్రయాణంలోనే కాదు, మద్రాసు నగరంలో కూడా అదే పనిచేశాను. శ్రీమతి మరియు శ్రీ ఆనందరావు గారు, ఇంకా అనేక మంది ఆశ్రమ భక్తులు అందరము కలిసి భజనలు, సంకీర్తనలు, సమావేశాలు, ప్రార్థనలు, ధ్యానము చేసేవారము. ప్రతి రోజు సాయంత్రము తప్పనిసరిగా సత్సంగము ఉండేది. మేమందరము ప్రపంచములోని భగవంతుని బిడ్డలందరూ శాంతిసౌఖ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించేవాళ్ళము.

**లోకాస్సమస్తా స్సుఖినో భవంతు**
**అందరికీ శాంతి లభించుగాక!**

**అధ్యాయం - 37**

# సుశీలాదేవి భారతదేశం చేరుకుంది

ఆ రోజు మేము చాలా సంతోషించాము. సుశీలాదేవి వద్ద నుండి టెలిగ్రామ్ అందింది. ఆమె జపానులో బయలుదేరి సిలోన్ చేరుకుంటారు. అమెరికా భక్తులు ఇచ్చిన విల్లిస్

కారు శాంతి ఆశ్రమంలో ఉంది. దానిని నేను రెండవ పర్యాయము అమెరికా వెళ్ళినప్పుడు తీసుకువచ్చాను. దానిని ఇప్పుడు సుశీలాదేవిని తీసుకురావడానికి వినియోగించాలను కున్నాను. ఆత్మారామ్, రత్నం, మరొక ఆశ్రమ భక్తులు నాతో పాటు కారులో బయలుదేరారు. మా కారు డ్రైవర్ బలరామ్ చాలా నమ్మకస్తుడు, భక్తుడు. భారతదేశం నుండి సిలోన్ సముద్రం మధ్యలో ఉండటం వలన సిలోన్ వరకు కారులో వెళ్ళటం కుదరదు. అందువలన ఆశ్రమ కారును మేము మద్రాసులోని భక్తుల ఇంటిలో వదలిపెట్టాము.

మద్రాసు నుండి మేము రైలులో బయలుదేరి సాధ్యమయినంత వరకూ వెళ్ళి అక్కడి నుండి స్టీమరులో ప్రయాణించి కొలంబో చేరుకున్నాము. సుశీలాదేవి మా అందరిని చూచి చాలా సంతోషించింది. మూడు రోజులు కొలంబోలోనే ఉండి సుశీలాదేవికి అందమయిన పగోడాలు, ఉద్యానవనాలు, ఆహ్లాదాన్ని కలిగించే బీచ్‌లు అన్నీ చూపించాము. మేము మద్రాసు చేరుకునేసరికి మా శాంతి ఆశ్రమం కారుని వదలిపెట్టిన ఇంటి వాళ్ళు, అక్కడి భక్తులు మా కోసం ఎంతో ఆత్రుతతో ఎదురుచూస్తున్నారు. వారందరి ప్రేమ, ఆదరాభిమానాలతో మద్రాసులో వారం రోజులున్నాము. సుశీలాదేవిని మద్రాసు చుట్టుప్రక్కల ప్రదేశాలన్నీ తిప్పి చూపించాము. మధుర మీనాక్షి దేవాలయాన్ని దర్శించాము. పరమ పవిత్రమయిన ఆ దేవాలయము అద్భుతమయిన శిల్ప సౌందర్యంతో, వందలాది శిలాతోరణాలతో, రాతి స్తంభాలతో, మహాద్భుతంగా ఉంటుంది. ఆ పవిత్రమయిన దేవాలయాన్ని మానవమాత్రులు నిర్మించలేదని, స్వయంగా దేవతలు నిర్మించారని చెపుతుంటారు. అందులో వాస్తవం ఏమయినప్పటికీ సుశీలాదేవి ఆ ఆలయ సౌందర్యాన్ని తిలకించి ముగ్ధురాలయిపోయింది. ఆమె ఆ ప్రయాణాన్ని ఎంతో ఆనందంగా గడిపింది.

సుశీలాదేవికి ఆహారము, భాష, వేషధారణ అంతా క్రొత్త అయినా ఈ వాతావరణానికి అలవాటు పడడానికి ప్రయత్నించింది. ఆమె చాలా తేలికపాటి ఆహారం తీసుకునేది. పచ్చి కూరగాయలు, సలాడ్లు, పళ్ళు, పాలు అలవాటు చేసుకుంది. భారతీయ మహిళలు ధరించే చీర కట్టుకోవటం నేర్చుకుంది. ఆమె పూర్తిగా భారతీయురాలిలాగా అచ్చమైన హిందువులా కనిపించడానికి, కేవలం ఆలోచనలకి పరిమితం కాకుండా వ్యవహారంలో కూడా అలాగే ఉండడానికి ప్రయత్నించేది.

నా మాటల్లో కంటే ఆశ్రమవాసులు ఆమెకిచ్చిన స్వాగత పత్రము, ఆమె దానికిచ్చిన సమాధానము చదివినప్పుడు పాఠకులకు పూర్తిగా అర్థమవుతుంది.

పీస్ పత్రిక జులై 1931

## స్వాగత పత్రము

గౌరవనీయురాలైన సోదరి ఎలెన్ సెయింట్ క్లేయర్ నోవాల్డు, సోదరి సుశీలాదేవి, మీరు మాకు ఎంతో ప్రియమైన సోదరి! శ్రీశాంతి ఆశ్రమము సోదర సోదరీమణులందరూ మీకు హృదయపూర్వకంగా స్వాగతం పలుకుతున్నాము. మీరు ఎంతో దూరదేశమయిన అమెరికా నుండి మా శాంతి ఆశ్రమానికి వచ్చారు.

మీరు మా పూజ్య స్వామీజీ ఓంకార్ గారితో వస్తున్నారని విని మేము ఎంతగా ఆనందించామో మాటల్లో వర్ణించలేము. మీరు ఎంతో ఆసక్తితో, అంకితభావంతో శాంతి మిషన్ చేస్తున్న శాంతి కార్యక్రమాల్లో మాతో కలిసి పాలు పంచుకునేందుకు భగవంతుని ఆదేశము మేరకు రావటం చాలా సంతోషదాయకం. సోదరీ సుశీలాదేవి! మేము మీలో ఎంతో ఉన్నతమయిన, ఆదర్శవంతమయిన ఆలోచనలను, సాధుశీలత్వాన్ని ప్రేమాస్పదమయిన హృదయాన్ని, ప్రపంచాన్ని యావత్తును ప్రేమించే గుణాలను గుర్తించి ఆనందిస్తున్నాము. మీ ఆదర్శాలు, ఉన్నతమయిన, పవిత్రమయిన సంకల్పాలు, ఎల్లలు లేని మీ హృదయపు లోతుల్లోని ప్రేమ ప్రతి ఒక్కరికి ఆదర్శం కావాలని, ఆ స్ఫూర్తితో వారందరూ కూడా ఆధ్యాత్మికంగా ఉత్తేజితులు కావాలని ఆశిస్తున్నాము. మీ జీవితంలో ఏదయితే వ్రాసిపెట్టి ఉందో, ఎల్లప్పుడూ నీ పెదవులపై చిరునవ్వుతో, స్వర్గలోకపు శాంతిని అందించే పనిలో అందరూ మీతో కలిసి పనిచేస్తారు.

ఈ సందర్భంలో మీరు మా పూజ్య స్వామీజీకి అందించిన సహాయ సహకారాలకి మేము మా ప్రగాఢమయిన కృతజ్ఞతలను, మనస్ఫూర్తిగా ధన్యవాదాలను తెలియచేయాలనుకుంటున్నాము. స్వామీజీని మీరు మొదటిసారి కలుసుకున్నప్పటినుండి మీరు వారి ప్రవచనాలు విన్నప్పటి నుంచి ఎంతో భక్తి శ్రద్ధలతో వారిని సేవించటమే కాకుండా, స్వామీజీ భారతదేశానికి తిరిగి వచ్చేంతవరకూ వారికి ప్రయాణంలో కూడా ఎంతో సహాయం చేశారు. వాటన్నింటికి మా ఆశ్రమం తరపున ధన్యవాదాలు తెలియచేస్తున్నాము.

ఆ పరమాత్మ మీ మీద తమ అనుగ్రహవర్షాన్ని కురిపించాలని, దానివలన మీరు అనంతమయిన శక్తి సామర్థ్యాలు పొందాలని, మంచి ఆరోగ్యంతో వర్థిల్లాలని, దీర్ఘాయుష్షుతో ఉండాలని, అప్పుడు మీ పవిత్రమయిన ఆశయాలు, సంకల్పాలు నెరవేరాలని, అందరికి శాంతి ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాము.

## సుశీలాదేవి సమాధానము

ప్రియమైన భారతీయ సోదర సోదరీమణులారా! నేను నిజముగా ఆ భగవంతుని గొప్పతనము వలన, మీ అందరూ నా పట్ల చూపించిన ఆదరాభిమానాలకు నా హృదయం ఆనందంతో నిండిపోవడం వలన మాటలు రావడం లేదు. మీ అద్భుతమయిన స్వాగత సత్కారాలకు హృదయం పొంగిపోతున్నది. ఇలాంటి సందర్భాలలో మాటల్లో మన సున్నితమయిన భావాలను వెల్లడించటం చాలా కష్టము. నేను సిలోన్‌లో దిగినప్పటి నుండి మీరందరూ నా పట్ల చూపిస్తున్న ప్రేమకు చాలా సంతోషము. కోలంబోలోనూ, మద్రాసులోనూ నన్ను కలుసుకోవడానికి పూజ్య స్వామీజీ, ఆత్మారామ్ మూర్తీభవించిన స్త్రీత్వంతో ఉన్న రత్నం గారు మల్లెపూలు, చామంతుల దండలతో వచ్చి స్వాగతం చెప్పటం నాకు చాలా ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని కలిగించింది. ఆనందరావు, కమలాదేవి, వారి ముగ్గురు ముద్దుబిడ్డలు ఎంతో ప్రేమానురాగాలతో, అపురూపమయిన, అరుదయిన భారతీయ సంప్రదాయాలతో ఆతిథ్యమిచ్చారు. ఇంకా శాంతి ఆశ్రమంనుండి మద్రాసు వచ్చిన భక్తులందరూ మా ప్రయాణాన్ని ఎంతో ఉల్లాసభరితంగా ఆనందంగా గడిపే విధంగా తోడ్పడి నందులకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

రాజమండ్రిలో శ్రీరామారావు, రత్నం దంపతులు వారింట్లో ఎంతో చక్కని ఆతిథ్యమిచ్చారు. చాలా సంతోషంగా రోజులు గడిచాయి. పగలు రాత్రి తేడా లేకుండా భక్తులు తండోపతండాలుగా, ప్రవాహంలా వచ్చి పూజ్య స్వామీజీకి పాదపూజలు చేయటం చూచి చాలా ఆనందించాను. అది మర్చిపోలేని మధురానుభవము. ఇక శ్రీ శాంతి ఆశ్రమంలో శాంతి సభ్యులందరూ ఎంతో ప్రేమతో స్వామీజీతో కలిసి అమెరికానుండి వచ్చిన నాకు స్వాగతం పలికారు. ప్రియతములారా! ఒక్క విషయాన్ని చెప్పనివ్వండి. నా కృతజ్ఞతలు తెలియచేయడానికి నాకు మాటలు సరిపోవడం లేదు. నా అదృష్టం వలన పరమ పూజ్య స్వామీజీ వంటి పవిత్రాత్మ స్వరూపులతో కలిసి ఇంత పవిత్రమయిన

ఆశ్రమానికి రాగలిగాను. ఇక్కడ అందరూ ఎంతో పవిత్రమైన హృదయం కలవారు. ఒకరికొకరు సహాయ సహకారాలు అందించుకుంటున్నారు. మానవత్వంతో దైవకార్యాలు చేస్తున్నారు. మీతో కలిసి అందులో పాలుపంచుకోగల్గటం నా అదృష్టంగా భావిస్తున్నాను.

న్యూయార్క్ నగరంలో స్వామీజీని మొదటి సమావేశంలో కలిసిన క్షణంనుండి నా హృదయంలో గాఢంగా నమ్ముతున్నాను. స్వామీజీ ఆత్మ సాక్షాత్కారము పొందిన మహానుభావులు. భగవంతుని సామ్రాజ్యాన్ని చేరుకోవడానికి హృదయ పవిత్రత ఉండాలని, పరమాత్మను గురించి కళ్ళ వెంట ధారాపాతంగా కన్నీళ్ళతో భక్తుల హృదయాలలో చెరగని ముద్ర వేస్తూ స్వామీజీ ప్రవచనాలు చేస్తూ ఉండేవారు. అది విన్న తర్వాత చాలా కష్టమయిన ఆధ్యాత్మిక మార్గంలో పయనించడానికి అలాంటి మహానుభావుల మార్గదర్శనం అవసరమని, ఆ మహితాత్ముని అడుగుజాడల్లోనే పయనించాలని దృఢనిశ్చయం పొందాను. బుద్ధ భగవానుడు నిర్వాణ స్థితిని పొందినప్పుడు అనంతమయిన శాంతిని, ప్రకాశవంతమయిన జ్ఞానజ్యోతిని, శాశ్వతమయిన ఆనందాన్ని పొందారు. అలాంటి గొప్ప అనుభవాన్ని, సమాధి స్థితిని, నిర్వాణ స్థితి, స్వర్గలోకపు శాంతిని పొందిన పరమపూజ్య ఓంకార్ స్వామీజీ, దానిని ప్రపంచంలోని ప్రజలందరికి కూడా పంచిపెట్టాలని ఆశిస్తున్నారు. వారిలో నేను కూడా ఒకరిని కావటం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఇంకా ఇంతకంటే ఏమి చెప్పగలను? ఈ అవకాశం దొరకటం కేవలం నా అదృష్టంగా భావిస్తూ ఎంతో సంతోషంగా ఉన్నాను. ఆధ్యాత్మికంగా ఎదగడానికి, మానవాళికి సేవలందించడానికి గొప్ప అవకాశం దొరికింది. మీ అందరికి ధన్యవాదాలు తెలియజేసు కుంటున్నాను. ప్రతి ఒక్కరికి నా ప్రేమాభివందనాలు.

దీనిని నేను ప్రార్థనతో ముగించాలనుకుంటున్నాను.

## ప్రార్థన - 2

**అమరమైన, శాశ్వతమైన ఆలోచనాసరళి**
**ఎక్కడ నుండి వస్తుందో...**
**ఆ జీవిత ప్రవాహం మనకి నేర్పిస్తుంది,**
**ఎలాంటి భయము లేని స్థితిని**
**మన హృదయానికి అందిస్తుంది**

ఆ స్థితిలో మనము పవిత్రమయిన కన్నీటిని వర్షిస్తాము
అలాంటి స్థితిని మాకు ప్రసాదించు
ఆ వాస్తవాన్ని మా ప్రేమమయ హృదయాలలో
పదిలపర్చుకోనివ్వు
అది ఎంతో అద్భుతమయిన విషయమని
దానిని గూర్చి సాధువులు, మహాత్ములు పాడుతూ ఉంటారు.

అధ్యాయం - 38

# తోటపల్లి కొండల్లో శ్రీ శాంతి ఆశ్రమము

నేను వేల మైళ్ళ దూరంలో ఉన్న అమెరికా దేశంలో ఉన్నప్పుడు కూడా నా మాతృ సంస్థ తోటపల్లి కొండల్లో నెలకొన్న శ్రీ శాంతి ఆశ్రమంతో ఎన్నడూ సంబంధాలు తెగిపోకుండా జాగ్రత్త వహించాను. అమెరికా దేశంలో మేము స్థాపించిన శాంతి కేంద్రాలన్నీ కూడా మాతృసంస్థకు అనుబంధ సంస్థలుగానే వ్యవహరించేవి. అమెరికాలో ధ్యాన తరగతులకు వచ్చే విద్యార్థులు, ఇంకా అనేకమంది విదేశీ భక్తులు భారతదేశానికి వచ్చి మాతృసంస్థ అయిన శాంతి ఆశ్రమాన్ని దర్శించాలనుకున్నారు. మరికొంత మంది పాశ్చాత్య దేశాన్ని పూర్తిగా వదిలిపెట్టి శాశ్వతంగా శాంతి ఆశ్రమంలోనే తమ శేష జీవితాన్ని ఆశ్రమసేవకు వినియోగించాలని భావించారు. చాలా మంది ఆశ్రమాన్ని దర్శించడానికి వచ్చారు. కానీ కేవలం సుశీలాదేవి మాత్రమే తన జీవితాన్ని పూర్తిగా ఆశ్రమ సేవలకు, ప్రపంచ మానవాళి సేవలకు చాలా సంవత్సరాలు అంకితం చేయగలిగారు.

మద్రాసు నుండి రాజేశ్వరానంద స్వామి మాతృసంస్థ అయిన శాంతి ఆశ్రమానికి వచ్చి పీస్ పత్రికకు సంపాదకులుగా వ్యవహరించేవారు. నేను అమెరికాలో ఉన్న సమయంలో వారే పత్రికను నడిపించారు. ఆయన తనతో ఒక యువ బ్రహ్మచారి 'మహాదేవన్'ను కూడా ఆశ్రమానికి తీసుకువచ్చారు. ప్రస్తుతం వారు మద్రాసు విశ్వవిద్యాలయంలో వేదాంతము డిపార్టుమెంట్‌కు ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఆయన



వేదాంతములో మంచి పాండిత్యం కలవారు కావటం చేత శంకరాచార్యుల వారి గ్రంథాలను అనువాదము చేసి వేదాంత మార్గాన్ని ఆధ్యాత్మిక జిజ్ఞాస కల పవిత్రాత్ములకు మార్గం సుగమం చేశారు. ఆశ్రమంలో నివసిస్తున్న ఆశ్రమ వాసులు, భక్త కుటుంబాల వారు నేను అమెరికాలో ఉన్న సమయంలో ఆశ్రమం అభివృద్ధికి ఇతోధికంగా వారి సహాయ సహకారాలు అందించటం వలన భగవంతుని అనుగ్రహంతో ఆశ్రమం చాలా అభివృద్ధిలోనికి వచ్చింది.

మండువేసవిలో చల్లని గాలి కోసం తాటి ఆకులతో చేసిన విసనకర్రతో విసురుకున్నట్లుగా ఉంటుంది మానవుని ప్రయత్నాలు. కాని భగవంతుని సంకల్పంతో పనులు జరిగినప్పుడు మాత్రం చల్లని, ఆహ్లాదకరమయిన ప్రకృతి సహజమయిన గాలులు వీచినట్లుగా వాతావరణమంతా ఆ చల్లని గాలులతో నిండిపోతుందని పెద్దలు అంటూ ఉంటారు. కాబట్టి రోజు రోజుకి చూస్తుండగానే ఆశ్రమం ఇంతగా పురోభివృద్ధిని, ప్రగతిని సాధించటం వెనుక కేవలం మానవ ప్రయత్నం కాకుండా భగవంతుని అనుగ్రహము, ఆశీర్వాదములు పనిచేశాయని చెప్పక తప్పదు. ఆధ్యాత్మిక ప్రపంచ చరిత్రలో ఒక నూతన అధ్యాయం సృష్టించడానికే ఈ ఆశ్రమము నెలకొల్పబడింది. ఈ శాంతి కేంద్రము మానవులందరిని ఏకం చేయడానికి, కులాలన్నింటిని ఒక్కటిగా కలపడానికి, దేశాల మధ్య నున్న అంతరాలను తొలగించడానికి, సత్యాన్వేషకులకు ఆత్మశాంతి కల్గించడానికి, వారందరికి చక్కని ఆధ్యాత్మిక జీవన విధానాన్ని అలవర్చడానికి ప్రపంచంలోని ప్రతి వ్యక్తి హృదయంలో శాంతిని నెలకొల్పడానికి పనిచేస్తుంది.

ఒక్కడే దైవము, మానవాళి అంతా ఒక్కటే. అందరికి ఆ పరమాత్మయే తండ్రి. ప్రపంచంలోని మానవులందరూ సహోదరులు అన్నది ఆశ్రమానికి పునాది వంటిది. తోటపల్లి కొండల్లో ఆశ్రమము ప్రారంభించిన మొదటి రోజునుండి కూడా ఈ సదాశయాలతోనే ఆశ్రమాన్ని అభివృద్ధి చేయటం జరిగింది.

తుప్పలు, ముళ్ల చెట్లు అన్నీ నరికి చదును చేయబడ్డాయి. అడవి ప్రాంతము అందమయిన ప్రార్థనా మందిరాలుగా, ధ్యాన కేంద్రాలుగా రూపుదిద్దుకున్నాయి. సత్యాన్వేషణకులకు, సాధకులకు, జిజ్ఞాసువులకు, ఆర్తులకు, తూర్పు పడమర దేశాల్లోని భక్తిమయ హృదయము కలవారందరికి సహాయం చేయడానికే ఈ ఆశ్రమ నిర్మాణం జరిగింది. ఆధ్యాత్మికంగా మహోన్నత స్థితిని సాధించిన మహాత్ములు ఎందరో ఆశ్రమాన్ని

దర్శించి, ఎలాంటి ఆర్భాటము లేకుండా ప్రశాంతంగా జరుగుతున్న ఆశ్రమ కార్యకలాపాలను గమనించి అభినందించారు. అలాంటి వారు ఆశ్రమంలో ప్రశాంతంగా కొన్ని రోజులు సాధనలో గడిపి వెళ్ళేవారు. శ్రీ రామతీర్థ గారికి ప్రత్యక్ష శిష్యుడయిన శ్రీ నారాయణ స్వామి గారు ఆశ్రమాన్ని దర్శించినప్పుడు అతిథులు వారి అభిప్రాయాలను వ్రాసే పుస్తకంలో ఈ విధంగా వ్రాశారు.

"నేను ఆశ్రమము అంతా తిరిగి జాగ్రత్తగా పరిశీలించాను. అది సాధనకు చాలా అనుకూలంగా ఉంది. ఆశ్రమములోనూ, చుట్టూ ఉన్న తోటపల్లి కొండల్లోనూ తిరిగి చూచినప్పుడు నా హృదయము ఆనందంతో నిండిపోయింది. శాంతి ఆశ్రమము స్థాపకులు ఎన్నో ప్రయత్నాలు చేసినందుకు వారు అభినందనీయులు. ఆధ్యాత్మికోన్నతి పొందిన మహనీయులు వారి సహాయ సహకారాలు అందించడానికి అర్హులు అయినారు. స్వామి వారి శిష్యులు ప్రత్యేకంగా వారి సహకారం తప్పక అందిస్తారు."

మహాయాన బుద్ధిస్ట్ మిషన్, లండన్ సంస్థ అధ్యక్షులు గొప్ప తపస్వి అయిన 'అనగామిమైన్' గారు ఇలా వ్రాశారు.

"అడవి సుందరమయిన ఉద్యానవనంగా మారిపోయింది. అక్కడ నిజమయిన ప్రేమ, ఆనందం, ఎల్లలు లేని సంతోషం దొరుకుతాయి. అవి శరీరానికే కాక ఆత్మకు కూడా ఆనందాన్ని కలిగిస్తాయి".

శ్రీ వేలుముదలియార్, అడ్వకేట్ మరియు అధ్యక్షులు పెద్దాపురం తాలూకా బోర్డ్ వారు ఈ విధంగా వ్రాశారు.

"ఈ ఆశ్రమము యువకులకు తర్ఫీదునిచ్చే ప్రదేశంగా, మధ్య వయస్కులకు ఆశాజ్యోతిగా, పెద్దవారికి సాధనా కేంద్రంగా ఉపయోగపడుతుంది".

రివరెండ్ ఆర్థర్ స్కాట్, కెనడా దేశస్థుడు బాపిస్టు మిషన్, తుని శాఖ అధ్యక్షుడు ఈ విధంగా వ్రాశారు.

"ఇక్కడికి వచ్చిన ప్రతి వ్యక్తి శాంతిని పొందుతాడు. తాను పొందిన శాంతిని ఇతరులకు అందించడానికి ప్రయత్నిస్తాడు. నా గురించి చెప్పాలంటే, జీసస్ క్రీస్తు శిష్యులందరి

తరఫున చాలా సంతోషంగా చెపుతున్నాను, నేనక్కడ చాలా మనశ్శాంతిని పొందాను. పాపాలన్నీ కడిగి వేయబడినాయి. నా ఆత్మకు పూర్తి శాంతి చేకూరింది."

భారతదేశంనుండే కాకుండా, ఇతర దేశాలనుండి వచ్చిన వివిధ సంప్రదాయాలకు చెందిన మహాత్ములు, మేధావుల్లో కొందరి అభిప్రాయాలను మాత్రము ఇక్కడ ప్రస్తావించాను. చాలా గొప్ప అభినందనలు కొద్ది సంవత్సరాల అనంతరము వెల్లువలా వచ్చాయి. ఆశ్రమము ఎలాంటి ఆర్భాటాలు లేకుండా ప్రశాంతంగా, నెమ్మదిగా చేస్తున్న సేవలకు తగిన ఆశీర్వచనాలు భగవంతుని అనుగ్రహము వలన లభించాయి. ఆయన ఎల్లప్పుడూ తన బిడ్డల యోగ క్షేమాల పట్ల శ్రద్ధ వహిస్తారు. ఆ విధంగా వారిని తనకు దగ్గరు చేర్చేందుకు మార్గాన్ని ఏర్పరచి అక్కున చేర్చుకుంటాడు.

**అధ్యాయం - 39**

# స్వామీజీలు - యోగినిలు

ఒకప్పుడు దట్టమయిన అడవి ప్రదేశము. చీకటిలో ఒంటరిగా నడవాలంటే క్రూర మృగాల వలన ప్రజలు భయపడిపోయిన ప్రదేశము, నేడు భగవంతుని ప్రత్యేకమయిన ఆశీస్సులతో, ఆయన అనుగ్రహంతో చాలా సుందరమయిన దేవతలు నివసించే ఉద్యానవనంగా మారిపోయింది. క్రూర మృగాల బదులుగా సాధు మహాత్ములు, వివిధ సంప్రదాయాలకు చెందిన మహానుభావులు దేవదూతల లాంటి అవధూతలు, యోగినిలు ఈ ప్రదేశంలో విహరిస్తున్నారు. బారులు తీరిన పెద్ద వృక్షాలు, సువాసనలు వెదజల్లుతున్న పూల మొక్కలు, ప్రశాంతమయిన వాతావరణంలో కుటీరాలు, మౌనంగా ధ్యానంలో గడిపే సాధకులు, ప్రపంచ శాంతి సౌభాగ్యాల కోసం, తూర్పు పడమర దేశాల వారందరికి శాంతిని ప్రసాదించే ఆశ్రమము నమ్మశక్యం కాని రీతిలో తయారయింది. వెంకటేశు చెప్పులు కుట్టుకునే భక్తుడు. చదువుకోనివాడు ఒకనాడు ఊహించిన విధంగా నిజంగానే ఆశ్రమం రూపుదిద్దుకుంది. అతను ఎప్పుడూ అంటూ ఉండేవాడు "స్వామీజీ! నాకు ఆశ్రమమంతా కుటీరాలతో నిండిపోయినట్లుగా కనిపిస్తుంది. చాలా పెద్ద పెద్ద భవంతులు, ఆశ్రమానికి నిరంతరాయంగా భక్తులు పెద్ద కార్లలో వచ్చి పోవటం కనిపిస్తోంది.

ఆశ్రమానికి భక్తులు గుంపులు గుంపులుగా సుదూర ప్రాంతాల నుండి వెల్లువలా రావటం కనిపిస్తోంది" అనేవాడు.

తరుచుగా పాఠశాల విద్యార్థులు ఆశ్రమానికి విహారయాత్రకు వచ్చి భజనల్లో, ప్రార్థనల్లో పాల్గొనేవారు. పెద్ద గుంపులుగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆశ్రమానికి వచ్చి శాంతి సందేశాలను విని ఆధ్యాత్మిక ప్రయోజనాన్ని పొందేవారు. ఎన్నో కుటుంబాల వారు బంధుమిత్రులతో కలిసి వచ్చి ఆశ్రమ కార్యక్రమాల్లో పాల్గొని ప్రార్థనలు, ధ్యానము చేస్తూ ఉండేవారు. కొన్ని సందర్భాల్లో భారతదేశమంతా యాత్రలు చేసే యాత్రీకులు సైతం వారి యాత్రల్లో భాగంగా శాంతి ఆశ్రమాన్ని దర్శించి ఆధ్యాత్మిక లాభాన్ని పొందేవారు. ఆశ్రమాన్ని వారు పరమ పవిత్రమయిన పుణ్యక్షేత్రంగా భావించేవారు. బజారులో డబ్బులు పెట్టి కొనుక్కోలేని అనంతమయిన శాంతిని వారు ఆశ్రమంలో పొంది ఆనందించేవారు.

ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త శ్రీ స్వామి శివానంద మహరాజ్, ఎవరయితే దివ్య జీవన సంఘాన్ని స్థాపించారో ఆ మహనీయుడు, పవిత్రాత్మ స్వరూపులు ఆశ్రమాన్ని ఆశీర్వదించటమే కాకుండా చాలాసార్లు శాంతి ఆశ్రమంలో నివసించి వారు మహాసమాధి చెందే వరకు కూడా శాంతి ఆశ్రమంతో సత్సంబంధాలు కొనసాగించారు. వారు దివ్య జీవన సంఘాన్ని హిమాలయాల్లోని రిషికేశ్‌లో స్థాపించక పూర్వమే శాంతి ఆశ్రమము అదృష్టం వలన ఆ మహాత్ముడు ఇక్కడ తపస్సు చేశారు. ప్రార్థనలు, ధ్యానము చేసుకొనేవారు. ఇప్పుడు దివ్య జీవన సంఘానికి ప్రపంచవ్యాప్తంగా అనేక శాఖలున్నాయి. వారు ఎంతో సాధారణంగా జీవించేవారు. ప్రేమమూర్తి, చిన్న పిల్లవాడిలా పవిత్రమయిన మనస్సు కలవారు. ఆయన నన్ను తన శరీరంలో భాగంలాగా భావించి ప్రేమించేవారు. ఒకసారి వారు ఆశ్రమంలో ఉన్నప్పుడు చిన్నపిల్లవాడు తల్లిని అడిగినట్లుగా "స్వామీజీ! ఈ రోజు మనం ఇడ్లీలు తిందామా? దయచేసి వంట చేసే వ్యక్తితో చెప్పి తయారు చేయించండి" అని అడిగారు.

నేను ఎప్పుడూ వారి అవ్యాజ్యమయిన ప్రేమకి కరిగిపోయేవాడిని. ఆయన చాలా గొప్ప గాయకుడు. దివ్యత్వం నిండిన గానం వారిది. ఆత్మను పట్టి మేల్కొలిపే విధంగా వారి సంకీర్తనలు, భజనలు భక్తుల కోరిక మేరకు పాడేవారు. ఆ ప్రాంతంలోని భక్తుల కోరిక మేరకు చాలా ఉత్తేజకరమయిన సందేశాలను అందించేవారు. ప్రార్థనలు, భజనలు,

ధ్యానము, సత్సంగము మొదలయినవి చుట్టు ప్రక్కల ప్రాంతాల వారి కోరిక మేరకు, జమీందారుల ఉద్యానవనాలలో, పట్టణాలలో జరుగుతుండేవి. పవిత్రమయిన ఆత్మజ్ఞానం కలవారు ఎందరో వారిని ఆహ్వానిస్తూ ఉండేవారు. స్వామీజీ వందలమంది భక్తులను తన ఆధ్యాత్మిక ప్రవచనాలతో, భజనలతో, సత్సంగాలతో ఆకర్షించేవారు. అలాంటి సత్సంగాల్లో భక్తులు ప్రేమకొద్ది సమర్పించిన దక్షిణలను వారు వెంటనే శాంతి ఆశ్రమ అభివృద్ధి కోసం ఇచ్చి వేస్తుండేవారు. శాంతి ఆశ్రమాన్ని వారు తన స్వంత ఆధ్యాత్మిక గృహంలాగా భావించటము ఆశ్రమ అదృష్టము. పీస్ పత్రికలో వచ్చిన వ్యాసము ఆ రోజుల్లో వారి కార్యక్రమాల వివరాలను చక్కగా తెలియచేస్తుంది.

## శాంతి – ఫిబ్రవరి 1933 – మా శాంతి కార్యక్రమాలు

క్రొత్త సంవత్సరంలో హిమాలయాల్లోని స్వర్గాశ్రమము నుండి శ్రీ స్వామి శివానంద గారు, వైద్యులు, రచయిత, మంచి వక్త, కవి, ఆధ్యాత్మికవేత్త మా ఆశ్రమానికి విచ్చేశారు. వారితో స్వామి స్వరూపానందజీ మరియు స్వామి ఆత్మానంద జీ కూడా వచ్చి శాంతి ఆశ్రమంలో వేదాంత గోష్ఠులు జరిపి ధార్మిక ప్రచారం చేయటంలో ఎంతో సహకరించారు. సత్సంగాలు, భజనలు, సంకీర్తనలు చేశారు.

వారి పవిత్రమయిన సందర్శనము వలన ఆశ్రమము చుట్టు ప్రక్కల గ్రామాల భక్తులు, ప్రజలు, భక్తి ప్రవాహంలో మునిగితేలారు. వారితో పాటుగా పరమపూజ్య స్వామి ఓంకారజీ గారు ఓంకార జపము కూడా తోడయింది. వారి శాంతి సందేశాలు భక్తులను ఆత్మానందంతో ముంచెత్తాయి. స్వామి ప్రణవానందజీ, సుశీలాదేవి, సోదరి బ్రోనిమన్, సోదరుడు సారంగపాణి, మన ఆశ్రమ భక్తుడు మేనేజరు మరియు సోదరుడు పూర్ణ చైతన్య, నారాయణ, సూర్యారావు మొదలయిన వారందరూ ఎంతో శ్రద్ధగా, నిశ్శబ్దంగా వారికి సహకరించారు.

గ్రామస్థులకు ఆధ్యాత్మిక ప్రయోజనాన్ని కల్గించటంతో పాటుగా వారికి అవసరమయిన వైద్య సదుపాయాలు, మందులు అందించబడ్డాయి. స్వామి శివానంద గారు అనారోగ్యంతో బాధపడేవారందరికి ఉచితంగా వైద్య సేవలు అందించటమే కాకుండా శాంతి ఆశ్రమానికి వచ్చి వారికి అవసరమయిన మందులు ఉచితంగా తీసుకువెళ్ళమని చెప్పి ఆహ్వానించారు.

గ్రామాల్లోని జమిందారులందరికి మేము ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియ చేసుకుంటున్నాము. వారందరూ ఎంతో ప్రేమతో, హృదయపూర్వకంగా స్వాగత సత్కారాలు, సత్సంగాలు ఏర్పాటు చేశారు. లక్ష్మీనర్సాపురం రాణి గారు మరియు వారి కుటుంబ సభ్యులు ఎంతో ఉదారంగా వారి సుందరమయిన ఉద్యానవనంలో ఈ పవిత్రమయిన సత్సంగాన్ని ఏర్పాటు చేసుకునేందుకు ఉత్సాహంగా సహకరించారు. సహకారాన్ని ఆశ్రమము ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటుంది. శాంతానంద మౌని దేవి గారు కూడా అప్పటి నుండి వారు నిర్వహిస్తున్న బాలికల పాఠశాలకు తీసుకువెళ్ళి అక్కడి విద్యార్థినులతో వారి ప్రతిభా విశేషాలను ప్రదర్శింపజేసి మమ్మల్ని ఎంతగానో ఉత్తేజితులను గావించారు.

డి. శేషగిరి రావు పంతులు గారు, అలాగే ఆశ్రమ శ్రేయోభిలాషి అయిన మరొక భక్తుడు కలిసి కాకినాడలోని సత్యలింగం ఛారిటీ విద్యార్థుల పాఠశాలకు ఆహ్వానించి, చక్కని సత్సంగాన్ని ఏర్పాటు చేశారు. అక్కడి బాలురు ఎంతో భక్తి శ్రద్ధలతో స్వామి శివానంద గారి రామమంత్రాన్ని, స్వామి ఓంకార్ గారి శాంతి సందేశాలను విన్నారు. స్వామీజీలు ఇద్దరూ మంచి సోదరుల్లాగా వారు గుర్తించారు. మేము పాఠశాల అంతా తిరిగి చూచి చాలా సంతోషించాము. అక్కడి విద్యార్థుల్లోని ప్రతిభా పాటవాలను తెలుసుకుని ఆనందించాము. అలాగే కాకినాడ పట్టణంలోని అనేక గృహాలలో, సత్సంగాలు ఏర్పాటు చేసి సహకరించిన కొత్త వెంకటరత్నం గారు, శ్రీ పైడా రామకృష్ణయ్య గారు మొదలైన వారి సహృదయాన్ని ఆశ్రమము ఎల్లప్పుడూ గుర్తుచేసుకుంటుంది.

కొత్తపల్లి గ్రామస్థులు కూడా ఆహ్వానించి సత్సంగాన్ని ఏర్పాటు చేశారు. శాంతి సందేశాలు, ప్రేమ అందరికి అందించడానికి వారు చేసిన ప్రయత్నం మంచిది. గ్రామస్థులు ఎంతో గౌరవంతో, ఆదరంతో, భక్తి శ్రద్ధలతో వేదాంత సత్యాలను గ్రహించారు. ఉపన్యాసకులు, సంకీర్తనలు అందించిన సందేశాల్లోని సారాన్ని అందుకున్నారు. తర్వాత ఉప్పాడ సముద్రపు ఒడ్డున, ఆరుబయట చక్కని సత్సంగం జరిగింది. సముద్రపు అలలు మాతో పాటుగా ఓంకారాన్ని జపించాయి. ఓం....ఓం....ఓం....

భగవంతుని కరుణ, ప్రేమ వలన నమ్మకమయిన స్నేహితుల ద్వారా వారి సహాయ సహకారముల ద్వారా శాంతి సందేశములు వ్యాప్తి చెందాయి. ఓం తత్సత్ ఓం.

స్వామి శివానంద గారు మా ఆశ్రమంలో నివసించిన రోజుల్లో జరిగిన ఒక సంఘటన గుర్తుకు వచ్చినప్పుడు నాకు చాలా ఆనందం కలుగుతుంది. ఇది మిగిలిన జ్ఞాపకాలన్నింటి కన్నా మధురమయినది. వారి నిశ్శబ్దమయిన ధ్యానము, ఒంటరిగా నడవటము, ఎంతో ఉత్తేజపూరితమయిన సంకీర్తనలు, సంగీతము భజనల్లో మునిగితేలిపోతూ వారు నర్తించటం వీటన్నింటికన్నా విభిన్నమయినది.

వారు అనారోగ్యంతో ఉన్నప్పుడు నేను వారికి నేను వ్రాసిన 'బాధాబోధామృతం' అనే గ్రంథాన్ని మూడు భాగాలు ఇచ్చాను. తర్వాత నేను వారి కుటీరానికి వెళ్ళాను. వారు నేల మీద చాప పరచుకొని కాళ్ళు చాచుకొని పడుకుని ఉన్నారు. ఆయన నేను ఇచ్చిన గ్రంథాన్ని చదువుతూ పూర్తిగా అందులో లీనమయిపోయారు. వారు దాన్ని చదువుతూ ముఖ్యమయిన విషయాలను గుర్తులు పెడుతున్నారు. వారు అందులో ఎంతగా లీనమయిపోయారంటే నేను వారి పవిత్రమయిన ప్రదేశమయిన ఆ కుటీరంలోనికి ప్రవేశించటం కూడా గమనించలేదు. వారు తమ కళ్ళను పైకి ఎత్తి నన్ను చూడగానే చాలా సంతోషంతో లేచి నన్ను గాఢంగా కౌగలించుకున్నారు. ఆ విధంగా మేమిద్దరము ఎంతో ఆనందంగా, ఒకే విధమయిన ఆలోచనలు కల్గి ఉండేవారము. శరీరాలు రెండుగా ఉన్నప్పటికి మేమిద్దరము బుద్ధి, హృదయము, ఆత్మ ఏకంగా జీవించాము. నా వరకూ స్వామి శివానందగారు ఎప్పటికీ సజీవంగానే ఉన్నారు. నా అదృష్టము వలన వారి దివ్యమయిన గానామృతాన్ని, ఎంతో ఉత్తేజపూరితమయిన భక్తి రసముతో నిండిన వారి సంకీర్తనలు వినగలిగాను. వారి ఆత్మ సాక్షాత్కార స్థితిని దర్శించగలిగాను. అలాంటి భగవదనుభూతిని, దివ్యానుభవములను పొందిన పవిత్రాత్మ స్వరూపులు అయిన మహితాత్ములకు మరణము అనేది ఉండనే ఉండదు. దేహము నశించిపోవచ్చు గాక, కాని వారు ఎప్పటికీ సజీవంగానే ఉంటారు.

గతించిన ఏభై నాలుగు సంవత్సరాల కాలంలో ఆశ్రమానికి ఎందరో సాధు మహాత్ములు వచ్చారు. తోటపల్లి కొండల్లోని ఆశ్రమానికి, అలాగే విశాఖ శాఖకి కూడా వచ్చారు. పాత జ్ఞాపకాలను తవ్వుతుంటే ఒక యోగిని తన ప్రశిష్యులతో రెండు, మూడు పర్యాయాలు ఆశ్రమానికి వచ్చి ఆశీర్వదించిన విషయం గుర్తుకు వచ్చింది. ఆమె మహాజ్ఞాని, ప్రేమమూర్తి. ఆమె నడివయస్సులో ఉండేది. ఆమె తన శరీరాన్ని కేవలం ఒక పాత దుప్పటితో కప్పుకునేది.

ఒక పర్యాయం చిన్నమ్మ అనే యోగిని, నేను మామిడిచెట్టు నీడలో కూర్చున్నాము. నేను నా వేలితో నేల మీద ఏదో వ్రాస్తూ ఉన్నాను. అది బహుశా పవిత్రమయిన ఓంకారము కావచ్చును. అప్పుడు ఆ యోగిని నాతో ఇలా అన్నారు. "ఏమిటది? ఎందుకు వ్రాస్తున్నావు?" అది నాకు చాలా పెద్ద గుణపాఠం అయింది. సమాధి స్థితిని పొందాలి అని భావించేవారు. నిశ్చలంగా, నిశ్శబ్దంగా చలనరహితంగా, భావాతీతస్థితిలో పూర్తిగా లీనమయిపోవాలి.

మరొక పర్యాయం చిన్నమ్మ యోగిని గారు ఆశ్రమానికి వచ్చినప్పుడు జరిగిన సంఘటన అపూర్వమయినది. నేను ఎక్కువగా జ్ఞాన గుహలో గంటల తరబడి ఒంటరిగా, నిశ్శబ్దంగా, చలనరహితంగా ధ్యానంలో కాలం గడిపేవాడిని. నేల మీద పడుకునేవాడిని. అలాంటి స్థితిలో నేను ఉండగా చిన్నమ్మ యోగిని గుహలోనికి వచ్చి నా పక్కన పడుకున్నదట. కొంతసేపటి తర్వాత ఆమె లేచి వెళ్ళిపోయింది. ఆ తర్వాత ఆమె తన శిష్యులతో అన్న మాటలు నాకు తెలిసాయి. "అతను తెలుసుకోవల్సిన విషయాలన్నింటిలో ఆరితేరినాడు" అది వినప్పుడు నా మనస్సు సంతోషంతో నిండిపోయింది. ఆమెకు నా పట్ల ఉన్న ప్రేమానురాగాలు ఆమె చేత అంత గొప్పగా నా గురించి మాట్లాడించాయి. నేను కేవలం భగవంతుని సేవకుడిని మాత్రమే. ఒక పరికరాన్ని.

చివరిగా సాధువులు, యోగినిలు గురించి చెప్పుకునేటప్పుడు మరొక సాధు మహాత్ముడి గురించి కూడా చెప్పాల్సి ఉంది. ఆయన స్వామి బ్రహ్మానంద పంజాబు నుండి వచ్చారు. కేవలం హిందీ భాష మాత్రమే మాట్లాడేవారు. ఆశ్రమాన్ని దర్శించడానికి వచ్చి కొన్ని రోజులు ఇక్కడే కుటీరంలో ఉండి ధ్యానంలో గడిపారు. ఆయన ఎన్నో సంవత్సరాలు పవిత్రమయిన హిమాలయాల్లో తపస్సు చేసిన మహనీయుడు. ఆయనని నేను గాని, ఆశ్రమవాసులు గాని ఎప్పుడూ మర్చిపోలేము. ఎందుచేతనంటే వారు కోయిల కూతలోని అంతరార్థాన్ని మాకు వివరించి చెప్పారు. మామిడి పూత వచ్చే కాలంలో ఆ పిట్ట చాలా మధురమయిన కంఠంతో కూత వేస్తుంటే అది ఆశ్రమమంతా ప్రతిధ్వనించేది. అలాగే ఆశ్రమం చుట్టూ ఉన్న కొండ కోనల్లో దాని మధురమయిన ధ్వని వినిపించేది. అది ఎంతో మధురంగా "పియూ కహన్, పియూ కహన్" అని పాడేది. దాని అర్థం "ప్రియతమా! నీవు ఎక్కడ ఉన్నావు? భగవంతుడు ఎక్కడ ఉన్నాడు?" అని అర్థమట.

దానికి సమాధానం మౌనంగానే వచ్చేది. "నీవు ప్రేమించే నీ ప్రియతముడు నీ హృదయంలోనే ఉన్నాడు. నీ నిర్మలమయిన పవిత్రమయిన మనస్సులోనే ఉన్నాడు". దానికి రెండవ సమాధానం ఆ పక్షి ఆత్మబంధువునుండి వచ్చేది.

**"కళ్ళు ఉన్నాయి. కాని అవి చూడలేవు.**
**చెవులున్నాయి కాని అవి వినలేవు"**

ఆ పవిత్రమయిన మహానుభావుడు వివరించి చెప్పేవరకు మాకు ఆ పక్షికూతలోని అర్థం తెలియదు. వారు మా కళ్ళు తెరిపించారు. మూసుకుపోయిన మా చెవులు తెరుచుకున్నాయి. అప్పటిదాకా మేము కళ్ళుండి గుడ్డివారులా, చెవులండి చెవిటివారిలా ఉన్నాము. ఆ పక్షి పాడుతున్న పవిత్రమయిన పాటలోని అర్థం ఇప్పుడు మాకు బోధపడింది.

శాంతి ఆశ్రమాన్ని దర్శించి, ఆశీర్వదించిన మహాత్ములు, సాధుసంతులు, యోగినులు, స్వామీజీలందరికి ధన్యవాదాలు. భగవంతుని సృష్టిలోని మానవులందరికి పవిత్రమయిన పక్షులకు, భూమి, ఆకాశమునకు శుభమగు గాక!

**అధ్యాయం - 40**

# ఉపవాసము

## శాంతి పత్రిక, ఏప్రిల్ 1934 - ఆశ్రమ వార్తలు

### గురుదేవుల ఉపవాస దీక్ష

మన ప్రియతమ స్వామీజీ పది రోజుల నుండి ఉపవాస దీక్షలో ఉన్నప్పటికి ఆశ్రమ కార్యకలాపాలన్నింటిలో పాలు పంచుకుంటున్నారు. వారు ఆరవరోజు ఉపవాస దీక్షలో ఉండగా ఆశ్రమ భక్తులు ఒకరు వారిని ఎందుకు ఉపవాసము చేస్తున్నారని ప్రశ్నించారు. అందుకు స్వామీజీ నవ్వుతూ 'నన్ను నేను పవిత్రం చేసుకుని నా ముందున్న గొప్ప కార్యాలను విజయవంతంగా సఫలం గావించుటానికి అవసరమయిన శక్తి సామర్థ్యాలను

పెంపొందించుకోవడానికి, అలాగే నన్ను ఆదర్శంగా భావించి ప్రేమాభిమానాలు చూపించి, నాపై నమ్మకం ఉంచిన వారికి సంపూర్ణంగా సేవలందించడానికి, అన్నింటికన్నా ముఖ్యంగా భగవంతుని ఆశీస్సుల కోసం నేను ఉపవాసదీక్ష చేస్తున్నాను" అని చెప్పారు. ఆయనలోని అనంతమయిన శక్తి వారి భౌతికమయిన దేహానికి బుద్ధికి అతీతమయినది. ఆయన ఉపవాసదీక్షలో ఉన్నప్పటికి ఎప్పటిలా ఎంతో ఉత్సాహంగా, సంతోషంగా పనిచేస్తూ ఉండటం అభినందనీయము. భక్తులతో ఉత్తర ప్రత్యుత్తరాలు, ధ్యానము, ఇతర ఆశ్రమ కార్యక్రమాలు యధావిధిగా జరుగుతున్నాయి.

ప్రతి రోజు వారు మాతో తాను చాలా సంతోషంగా ఉన్నావని చెప్పేవారు. దాని వలన ఒక విషయం చాలా స్పష్టంగా అర్ధమయింది. కేవలం మనస్సే అన్నింటికి కారణం. మిల్టన్ చెప్పినట్లుగా, **మనస్సే అన్నింటిని నియంత్రిస్తుంది. అది స్వర్గాన్ని అయినా సృష్టిస్తుంది, లేదా నరకానికి అయినా కారణమవుతుంది.** స్వామీజీ విషయంలో ఇది అక్షరసత్యం అని నిరూపణమయింది.

## శాంతి పత్రిక, అక్టోబర్ 1934 – ఆశ్రమ వార్తలు

మన పరమపూజ్య గౌరవనీయులయిన స్వామీజీ, అలాగే సోదరి సుశీలాదేవి రెండు వారాల కఠినమయిన ఉపవాస దీక్షను విజయవంతంగా ముగించారు. భక్తులు వారిని ప్రశ్నించినప్పుడు వారు నవ్వుతూ "ఆనందప్రాప్తి కోసం' ఉపవాసదీక్షను చేశామని చెప్పారు. సన్నిహితులు, భక్తులు, ఆశ్రమవాసులు అందరూ కూడా దైవికశక్తి వారితో ఈ పనిని చేయించిందని భావించారు. వారు ఉపవాస దీక్ష తర్వాత ఎంతో ఆరోగ్యంగా, ఉల్లాసంగా, నూతనశక్తి ఉత్సాహాలతో కనిపించడం అందరికీ ఆశ్చర్యం కల్గించింది. వారు వారి దైనందిన కార్యక్రమాల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొనేవారు. వారిలో ఒక దివ్యమయిన తేజస్సు, నూతనోత్సాహం కనిపించేవి. అంతర్గత శక్తులు వారిలో ఉద్దీపన కల్గించినట్లుగా వారిలో పవిత్రమయిన భావన, ఉత్తేజం కలిగించాయి.

ఉపవాసదీక్షలో ఉన్న పవిత్రమయిన రోజుల్లో స్వామీజీ కొన్ని సందేశాలు "ఆనందప్రాప్తి కోసం ఉపవాసదీక్ష" అనే పేరుతో రచించారు. అందులో వారు ప్రస్తావించిన విషయాల సాధకులకు, భక్తులకు ఎంతో సహాయపడతాయి. ఆధ్యాత్మిక మార్గంలో ప్రయాణం సాగించేవారికి మార్గదర్శకంగా ఉంటాయి.

## స్వామీజీ సందేశం

ఈ రోజు ఉపవాసదీక్షలో పదవరోజు. నేను నా అనుభవాలను, ఆలోచనలను పాఠకులతో పంచుకోవాలనుకుంటున్నాను. కంటికి కనిపించని అనుబంధం వారితో నాకు ఏర్పడింది. అది నన్ను వారి వైపు లాగుతోంది. వారి సుఖ సంతోషాలు, శాంతిని కోరుకుంటున్నాను. అందువలన నేను వారితో నా సుఖ సంతోషాలు, కష్టాలు, ప్రయత్నాలు మాత్రమే కాకుండా ప్రత్యేకంగా నా ఆధ్యాత్మిక అనుభవాలను కూడా పంచుకోవాలని ఆశిస్తున్నాను.

నేను నా సందేశాన్ని ప్రారంభించడానికి ముందుగా గాంధీ మహాత్మునికి నివాళులు అర్పించాలనుకుంటున్నాను. పరమ పవిత్రమయిన ఉపవాస దీక్షలు చేసేవారికి ఒక గొప్ప ఉదాహరణగా వారు నిలిచారు. వారి నిరాడంబర జీవన విధానము, ఆధ్యాత్మిక దీక్ష చేసేవారికి గొప్ప స్ఫూర్తిదాయకంగా ఉంటుంది. వారి వాక్కులు ప్రమాణికమయినవి. తూర్పు పడమర దేశాల్లోని వారందరికి కూడా మహాత్మాగాంధీ కంటే ఉత్తమమయిన మార్గదర్శకులు వేరొకరు లేరంటే అతిశయోక్తి కాదు.

నాకు కౌమారం నుండి కూడా జీసస్ క్రీస్తు లాగా నలభై రోజులు ఉపవాస దీక్ష చేయాలనే సంకల్పం ఉండేది. ఆయన ఉపవాస దీక్షా కాలంలో ప్రార్థనలతో, ధ్యానంలో తన పవిత్రమయిన జీవనాన్ని గడిపారు. ఏ విధంగా ప్రతి పూమొగ్గా కాలం సమీపించినప్పుడు పుష్పంగా వికసిస్తుందో, అదేవిధంగా నాకు కూడా ప్రగాఢమయిన విశ్వాసముంది, నా సంకల్పం తప్పకుండా కాలం పరిపక్వమయినప్పుడు నెరవేరుతుందని.

నేను దీర్ఘ ఉపవాస దీక్షకి ఏ విధంగా సన్నద్ధమయ్యానంటే ముందుగా నెమ్మదిగా ప్రతి శుక్రవారము ఒక్క రోజు ఉపవాసము చేసేవాడిని. కొద్ది కాలం తర్వాత రెండు, మూడు రోజులు ఉపవాసం చేయటం కొనసాగించాను. ప్రస్తుతం నేను ఎంతో సంతోషంగా, ఆనందంగా ఎనిమిది రోజులు ఉపవాస దీక్షలో ఉన్నాను. ఇక ఇప్పుడు కనీసం పదిహేను రోజులు ఈ దీక్షను కొనసాగించాలను కుంటున్నాను.

ఇప్పటి వరకూ నాకు దీక్షా సమయంలో కనీసం తలనొప్పి గాని లేదా ఎలాంటి అసౌకర్యం కానీ కల్గలేదు. కడుపులో త్రిప్పటం లాంటి సూచనలు కూడా ఏమీ లేవు.

ప్రతి రోజు ఆశ్రమ కార్యక్రమాల్లో కనీసం ఆరు నుండి ఏడు గంటలు పనిచేసేవాడిని. అయినప్పటికి నాకు ఎలాంటి బలహీనత గాని, ఆకలి గాని అనిపించలేదు.

పని సక్రమంగా చేసుకోవాలంటే ఆహారం తీసుకోవటం తప్పనిసరి అని భావించి తరుచుగా నేనింతకు పూర్వం ఆహారం తీసుకునేవాడిని. నిజానికి నాకు ఆకలి వేయకపోయినా అలవాటు ప్రకారం భోజనం చేసేవాడినని చెప్పటానికి నేను విచారిస్తున్నాను. ఆశ్చర్యకరంగా ఇప్పుడు పది రోజులు ఉపవాసం చేసినప్పటికి నాకు ఆకలి అనిపించడం లేదు. భగవంతుని అనంతమయిన అనుగ్రహానికి ఆయన అనుగ్రహించిన ఆధ్యాత్మిక బలానికి ధన్యవాదాలు.

దీక్షా సమయంలో నేను ఏ విధమయిన ఆహారాన్ని, పానీయాలను తీసుకునేవాడిని అని ప్రశ్న వస్తుంది. నేను మధ్యలో అప్పుడప్పుడు అలాంటి ఆహారాన్ని తీసుకుంటే అది ఉపవాసం అవుతుందా? అని సందేహం కల్గవచ్చు. నేను ప్రతి రెండు గంటలకి స్వచ్ఛమైన నీటిని స్వీకరించేవాడిని. దాని వలన శరీరం లోపల పరిశుద్ధమవుతుంది. కొన్నిసార్లు నీటిలో కొద్ది నిమ్మరసం పిండుకొని త్రాగేవాడిని. అందులో తేనె గాని, పంచదార గాని వాడేవాడిని కాదు. నాకు దాహం కూడా వేసేది కాదు. కేవలం ఆరోగ్యంగా ఉండడం కోసం మాత్రమే నేను నీటిని త్రాగేవాడిని. ప్రతిరోజు విరోచనము సాఫీగా జరిగేలా జాగ్రత పడేవాడిని. అది నాకు ఎంతో సహాయపడింది. కొన్నిసార్లు నేను సూర్యకిరణాలతో స్నానం చేసి కొద్దిగా తేలికపాటి వ్యాయామాలు చేసేవాడిని. చల్లని పిల్లగాలులు నా శరీరంలోని ప్రతి జీవకణాన్ని ఎంతో ఉత్తేజపరిచేవి. ఈ స్థితి నాకు వేదకాలం నాటి ఋషులు ఆహారం, నీరు లేకుండా కేవలం గాలి పీల్చి జీవించేవారని గుర్తు చేసేది. భగవంతుని మీద విశ్వాసం ఉన్నవారికి ఏదయినా సాధ్యమవుతుంది.

అసలు నేను ఉపవాస దీక్ష చేయటానికి కారణం ఏమిటి? అది కేవలం ఆనంద ప్రాప్తి కోసం మాత్రమే అని చెపితే మీకు ఆశ్చర్యం కల్గవచ్చు. కానీ అదే నిజం. ఈ రోజుల్లో ఉపవాసం అంటే చాలామందికి ఒక సాకుగా మారింది. ప్రతి ఒక్కరూ ఏదో ఒక కారణం చెప్పి ఉపవాసం చేస్తూ ఉంటారు. కొందరు ఇతరులు చేస్తున్నారని తాము కూడా చేస్తుంటారు. మరికొందరు ప్రత్యేమయిన మంచి కారణం కోసం, దేశంకోసం ఉపవాసం చేస్తారు. ఇతరులకు గుణపాఠం నేర్పటానికి కొందరు ఉపవాసం చేస్తారు. తమ మాట నెగ్గించుకోవడం కోసం, ఇతరులను, ప్రత్యర్థులను భయపెట్టడం కోసం

ఉపవాసం చేసేవారు కొందరుంటారు. తనలోని బలహీనతలను జయించి, వాటిని అతిక్రమించడానికి కొందరు ఉపవాసం చేస్తుంటారు. జైలులో బందీలుగా ఉండేవారు తప్పనిసరి పరిస్థితుల్లో ఆహారం లేకుండా ఉపవాసం చేయవలసి రావటం చూచి నా హృదయం ద్రవించిపోతుంది. ఇలా రకరకాల కారణాలతో ఉపవాసం చేసేవారు చాలా మంది ఉంటారు, కాని ఆత్మానందం కోసం, ఆనందప్రాప్తి కోసం ఉపవాసం చేసేవారు ఎవరుంటారు? కేవలం ఉపవాసం చేయటం కోసమే ఉపవాసం చేయటం, అది కూడా ఎలాంటి గుర్తింపు, గౌరవాలు ఆశించకుండా చేసేవారు ఎవరుంటారు? ఆనందప్రాప్తి కల్గటం కోసం ఉపవాస దీక్ష చేయగల్గటం ఎంత అదృష్టం? అలాంటి ఉపవాస దీక్ష మాత్రమే పవిత్రమయినది, దివ్యమయినది, ఆరోగ్యకరమైనది అవుతుంది. దీని వలన ఆ వ్యక్తిలో అజ్ఞానం నశించి, దివ్యమయిన ఆత్మజ్ఞానం ఆత్మసాక్షాత్కారం లభిస్తాయి. తాను భగవంతుని స్వరూపంగా గుర్తించగల్గుతాడని భగవంతుని కంటే తాను భిన్నంగా లేనని, ఆత్మ స్వరూపంగా ఉన్నానని తెలుసుకుంటాడు.

ఇంకా ముందుకు వెళ్ళేముందు మనం నిజంగా అసలు ఉపవాసం అంటే ఏమిటి అని అర్థం చేసుకోవాలి. రోజంతా ఏమి ఆహారం తీసుకోకుండా ఉంటే అది ఉపవాసం అని చాలా మంది భావిస్తారు. కొందరు రోజుకి మూడుసార్లు కాకుండా ఒక్కసారి ఆహారం తీసుకోవడం ఉపవాసం అనుకుంటారు. మరి కొంతమంది ప్రతి రోజు తాము తీసుకునే అన్నం, పప్పు, కూరలు, రొట్టెలు మానివేసి పళ్ళు, పాలు తీసుకోవటం ఉపవాసం చేయటం అనుకుంటారు. కాని ఇవి ఏమీ కూడా నిజమయిన ఉపవాసం కాదు. అలాంటప్పుడు అసలు నిజమయిన ఉపవాసం అంటే ఏమిటి?

నిజమయిన ఉపవాసం అంటే ఆహారం తీసుకోవటం లేదా మానివేయటం ఎంత మాత్రము కాదు. ఆహారాన్ని త్యజించటం మాత్రమే ఉపవాసం కాదు. నిజమయిన ఉపవాసము అంటే ఆహారంతో పాటుగా మనలోని దుర్గుణాలన్నింటిని దూరంగా ఉంచటం, వాటిని వదిలించుకోవటం నిజమయిన ఉపవాసం. ఒకవేళ నీవు కోపంగా, చికాకుగా, ఆందోళనగా, పొగరుమోతుతనంగా, అహంకారంతో సతమతమవుతూ ఉంటే కేవలం శారీరకంగా ఉపవాసం చేయటం వలన ఒనగూడే ప్రయోజనం ఏముంటుంది? నీ మనస్సులోని బలహీనతలను, దుర్గుణాలను జయించటమే లక్ష్యంగా నీవు ఉపవాసం చేయటం మంచిది. దాని వలన నీ హృదయం పవిత్రమవుతుంది. అప్పుడే పుట్టిన

పాపాయి లాంటి నిర్మలత్వము, అమాయకత్వం, పవిత్రత చేకూరేంత వరకూ నీవు ఉపవాస దీక్షను కొనసాగించు. అమరత్వపు అమృత మకరందాన్ని ఆస్వాదించేవరకూ అనుగ్రహించబడేంత వరకూ నీ దీక్షను కొనసాగించు.

ప్రయాణికుడు తన ప్రతి అడుగును లెక్కిస్తూ ఎన్ని మైళ్ళు నడిచాము అనుకుంటే ఆ ప్రయాణం చాలా అలసటగా, భారంగా మారుతుంది. అదే విధంగా ఉపవాసం చేసేవారు దీక్ష ముగిసిన తర్వాత తీసుకునే ఆహారం మీదనే దృష్టి పెడితే ఇక ఉపవాసం చేసిన ప్రయోజనం వారికి దక్కదు. లేదా ఇంకా ఎన్ని రోజులు ఉపవాసం చేయాలి అని లెక్కించుకోవటం వలన, ఎప్పుడెప్పుడు దీక్ష ముగిసిపోతుందా అని ఆలోచించటం వలన పొందవలసిన ప్రయోజనానికి దూరం అవుతారు. ఉపవాసం చేసేటప్పుడు ఎంత బరువు తగ్గామా అని ఆత్రుత చెందే బదులుగా అనంతమయిన ఆత్మకు ఎంతగా బరువు పెరిగిందా అని ఆరాటపడటం మంచిది. ఉపవాసం మనలను బానిసలుగా మార్చకూడదు. మనము గురువులుగా మారాలి. నియంత్రణ వలన మనము బందీలుగా కాకుండా అధికారులుగా అవుతాము.

నా వరకూ నిజమయిన ఉపవాస దీక్షకు పరమార్థం ఏమిటంటే, ఎవరయినా అత్యంత సహజంగా ఉపవాస దీక్షను స్వీకరించాలి. ఎందుచేతనంటే నీవు భౌతికమయిన శరీరం మాత్రమే కాదు. నీవు సజీవమయిన ఆత్మ స్వరూపానివి. అందువలన ఆత్మకు ఆహారం, నీరు అవసరం లేదు. అదే నిజమయిన, అత్యున్నతమయిన ఉపవాసం యొక్క పరమార్థం. కాని దీనిని అర్థం చేసుకోవటం చాలా కష్టము.

అత్యున్నతమయిన స్థితిని పొందిన వారు, పవిత్రమయిన ఆత్మ స్వరూపులు, ఆదర్శవంతమయిన వారు, ఆరాధ్యనీయులు అయిన మహాత్ములు వారు ఉపవాసం చేస్తున్నప్పటికి, దాన్ని గురించి వారు పెద్దగా పట్టించుకోరు.

ఉపవాసం అంటే ఆకలితో అలమటించటం కాదు. ఉపవాసం అంటే తపించిపోవటం. భగవంతుని కోసం, ఆయన అనుగ్రహం కోసం తపించటము. విశ్వశక్తిని పొందటం కోసం తపించటం. దేహాభిమానికి ఉపవాసం సాధ్యం కాదు. భగవదనుభూతిని పొందిన వారికి అది సుసాధ్యం. దేహం పట్ల అభిమానంతో అపవిత్రమయిన లక్ష్యంతో చేసే ఉపవాసం వలన ప్రయోజనం ఏమి లభించదు. పరమ పవిత్రమయిన లక్ష్యంతో,

దివ్యత్వం నిండిన హృదయంతో, ఆనందప్రాప్తి కోసం చేసే ఉపవాసం సంపూర్ణంగా విజయవంతమవటమే కాకుండా, దేవతలు కూడా ఆశీర్వదిస్తారు. హృదయ పరిశుద్ధి కోసం చేసే ఉపవాసం పవిత్రమయినది. అది ఆధ్యాత్మిక వికాసాన్ని కలుగచేస్తుంది.

ఇప్పుడిక నా సందేశాన్ని ముగించే ముందు నేను ఎంతో గాఢంగా, దృఢంగా, ఉత్సాహపూరితంగా నా శరీరము, స్వేచ్ఛాపూరితమయిన బుద్ధి, ఆత్మ నాకు లభించాయని భావిస్తున్నాను. నా పాఠకులందరికి మనవి చేస్తున్నాను, దయచేసి మీరందరూ నాతో కలిసి మౌనంగా ధ్యానం చేద్దాము. భగవంతునికి, ఆ పరాత్పరునికి ధన్యవాదాలు తెలియచేద్దాము. మన హృదయంతో అంతర్యామిగా కొలువైన దేవాదిదేవుడు ఎల్లప్పుడూ మనందరిపైన తన అమృత వర్షాన్ని కురిపించి అనుగ్రహించినందులకు నాపైనా, మీ అందరిపైనా ఆశీస్సులు అందించినందులకు కృతజ్ఞతలు తెలియచేసుకుందాము.

మనమందరము కలిసి మౌనంగానే మన ప్రతి శ్వాసలోనూ భగవంతుని ఆరాధిద్దాము. మనం ప్రతి రోజు తీసుకునే 21,600 శ్వాసల ద్వారా భగవంతుని పూజించాలని నా ప్రార్థన. హృదయపూర్వకంగా మన ప్రేమ, సేవలను అందించడం ద్వారా భగవంతునికి ధన్యవాదాలు తెలియచేసుకుందాము.

## శాంతి పత్రిక, డిసెంబర్ 1934 - ఆశ్రమ వార్తలు

### సందర్శకులకు విజ్ఞప్తి

మన పరమపూజ్య స్వామీజీ ఉపవాస దీక్ష వలన భౌతికంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా వారికి వ్యక్తిగతంగా అనుభవమయిన బహుళ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని త్వరలోనే మళ్ళీ విదేశీ పర్యటనకు వెళ్ళడానికి సమాయత్తమవుతుండడం వలన దానికి కావాల్సిన శక్తి సామర్థ్యాలను సమకూర్చుకోవడానికి ఈ పర్యాయము సుదీర్ఘంగా ఒక నెల రోజులు ఉపవాస దీక్ష చేయడానికి సంకల్పించారు. అయితే స్వామీజీ ఈ విషయాన్ని ఎవరికీ తెలియపర్చదల్చుకోలేదు. కాని వారిని దర్శించుకోవడానికి సుదూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులు, సన్నిహితులు, ఆశ్రమ శ్రేయోభిలాషుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకొని వారు ఉపవాస దీక్షలో ఉండే తేదీలను మేము మీకు తెలియచేస్తున్నాము. దాని వలన స్వామీజీ దర్శనార్థము వచ్చే భక్తులు నిరాశ చెందకుండా ఉంటారు. నవంబరు

15వ తేదీ నుండి డిసెంబరు 14వ తేది వరకూ స్వామీజీని కలుసుకుని, మాట్లాడటానికి అనుమతించబడరు.

తరుచుగా దూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులు శుక్రవారం స్వామీజీ మౌనదీక్షలో ఉంటారు అనే విషయం మరచిపోతుంటారు. అందువలన వారితో మాట్లాడలేకపోవటం చేత నిరాశ చెందుతుంటారు. అందువలన భక్తులకు ఆ విధమయిన అసౌకర్యాన్ని తొలగించడానికి మేము భక్తులకు స్వామీజీ ఉపవాస దీక్షలో ఉండే సమయంలో వారికి ఎలాంటి ఇబ్బంది కల్గచేయకుండా మౌనంగా, ధ్యానంలో గడిపి వెళ్ళడానికి ఏ సమయంలో అయినా అనుమతిస్తాము. మేము భక్తులకు చేసే విజ్ఞప్తి ఏమిటంటే మీరు స్వామీజీకి, ఆశ్రమానికి అన్నివిధాలుగా సహాయ సహకారాలు అందించగలరని ఆశిస్తున్నాము. నెల రోజుల పాటు ఆశ్రమానికి వచ్చే భక్తులు మౌనంగా ప్రార్థనలు చేసి, ధ్యానంలో కాలం గడిపినందువలన అదృశ్యంగా ఉంటూ కంటికి కనిపించని ఆ దైవశక్తి యొక్క అద్భుత తరంగాలను వారు కూడా అనుభవంలోనికి తెచ్చుకొని లబ్ధి పొందగల్గుతారు.

**విశ్వసంబంధమయిన ఉపవాసము**

ముప్పై రోజులు ఉపవాస దీక్షాకాలంలో నేను వ్రాసుకున్న దినచర్య పుస్తకము "విశ్వ సంబంధమయిన ఉపవాసము" అనే గ్రంథంగా రూపుదిద్దుకుంది. నేను నా అనుభవాలను పాఠకులతో ఎంతో ప్రేమతో పంచుకోవాలని భావిస్తున్నాను. ఆ పుస్తకంలోని కొన్ని అధ్యాయాలతో పాటు ఆ గ్రంథానికి పరిచయ వాక్యాలు అందించిన గొప్ప స్నేహితుడు, శాంతి ఆశ్రమాన్ని తన కుటుంబంగా భావించి సేవించిన డా॥ గోవిందరాజు గారు మద్రాసు నివాసి గురించి కూడా చెప్పాలి. ఆయన కొన్ని వందల విలువైన, అమూల్యమైన గ్రంథాలను శాంతి ఆశ్రమంలోని గ్రంథాలయానికి అందించారు.

**గ్రంథానికి డా॥ గోవిందరాజు గారు వ్రాసిన ఉపోద్ఘాతము**

స్వామి ఓంకార్ గారు రచించిన ఈ గ్రంథానికి ప్రశస్తి కలగడానికి కారణము ఎంతో గొప్ప విశేషముంది. ఈ గ్రంథం వైద్యానికి సంబంధించిన వ్యక్తి గాని లేదా ఒక సామాన్యమయిన వ్యక్తి వ్రాసినది కాదు. పూర్తిగా ఆహారాన్ని త్యజించిన, ఎలాంటి ఘన పదార్థము గాని, ద్రవపదార్థాలు గాని తీసుకోకుండా ఉపవాసం చేసిన జీవన్ముక్తుని

అనుభవం నుండి తయారయిన గ్రంథరాజమిది. వారు కేవలం నీటిని మాత్రమే ఆహారంగా తీసుకొని ఆరోగ్యాన్ని పరిరక్షించుకున్నారు. సాధారణంగా ఉపవాసము ఆరోగ్యం కోసం లేదా శరీరంలోని విష పదార్థాలను వదిలించుకోవడానికి లేదా ఆధ్యాత్మిక లబ్ధిని పొందడానికి గాని చేస్తూ ఉంటారు. కాని చాలా అరుదుగా ఆనందప్రాప్తి కోసం ఉపవాస దీక్ష చేసేవారు ఈ విధంగా శ్రీ ఓంకార స్వామీజీ మాత్రమే కనిపిస్తున్నారు.

సాధారణంగా మానవులు ఆకలి వేసినప్పుడు, పొట్ట ఆకలితో అలమటించి, ఆహారం కోరుకున్నప్పుడు భోజనం చేస్తారు. కాని శరీరానికి ఎలాంటి ఆహారం అవసరం లేనప్పుడు, ఆకలి లేనప్పుడు కూడా ఆహారాన్ని తీసుకోవటం వలన అది శరీరానికి పాపంగా మారి త్వరలోనే దానికి అంతాన్ని కలిగిస్తుంది. శరీరతత్వానికి సరిపడని ఆహారాన్ని తీసుకున్నప్పుడు అది జీర్ణ వ్యవస్థను దెబ్బతీస్తుంది. దాని పరిణామాలు లైంగిక వాంఛ, తీవ్రమయిన వాంఛ, దురాశ లేదా అత్యాశగా మారి మానవునిలోని పశుతత్త్వాన్ని మేలుకొల్పుతుంది. ఉపవాస దీక్షలు చేయటం వలన శరీరంలోని కణజాలము, ధాతువులు, ముఖ్యమయిన శరీర అవయవాలు అన్నీ కూడా పరిశుద్ధమవుతాయి. అంతేకాక శరీరంలోని విషపదార్థాలన్నీ కూడా బయటికి విసర్జింపబడతాయి. ఎంత ఎక్కువగా ఉపవాసము చేస్తూ ఉంటే మానవులు అంత ఆరోగ్యంగా ఉంటూ దీర్ఘకాలం జీవించగల్గుతారు.

మన పూర్వకాలపు ఋషులు, సాధువులు భౌతికమయిన ఆహారంగా తీసుకోకుండా ఉపవాసం చేస్తూ మన అవగాహనకి అర్థం కానటువంటి, అతి సూక్ష్మమైన విధానంలో సూర్యరశ్మి నుండి నీరు నుండి, గాలి నుండి వారి శరీరానికి అవసరమయిన శక్తిని పొందేవారు. దాని వలన వారు ఎంతో ఆరోగ్యంగా, ఉత్సాహంగా జీవించేవారు. ఈ నవీనకాలంలో కూడా అలాంటి స్త్రీ, పురుషులు మనకు గొప్ప ఉదాహరణలుగా నిలుస్తున్నారు. వారు యోగిని గిరిబాల మరియు థెరిస్సా న్యూమాన్. వారు ఎలాంటి ఆహారాన్ని స్వీకరించలేదు. గిరిబాల బెంగాల్‌కు చెందిన యోగిని మాత. ఆమె 1890వ సంవత్సరము నుండి రెండు మూడు సంవత్సరాల క్రితం మరణించే వరకూ ఎలాంటి ఆహారం తీసుకోకుండా జీవించారు. ఆమె సూర్యరశ్మి నుండి గాలి, నీరు ద్వారా శక్తిని గ్రహించేవారు. థెరిస్సా న్యూమాన్ ఒక క్యాథలిక్ మతానికి చెందినవారు. భావారియాకు

చెందినవారు. ఎలాంటి ఆహారము తీసుకోకుండా 1926 క్రిష్టమస్ నుండి కేవలము దైవశక్తిపై ఆధారపడి జీవించారు.

అనాది కాలము నుండి ఉపవాస దీక్షలు ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవడం కోసమే చేయబడేవి. ఎవరయినా ఆధ్యాత్మిక ప్రయోజనాలు పొందాలి అంటే ఉపవాస దీక్షా కాలంలో ఎక్కువగా ప్రార్థనలో కాలం గడపాల్సి ఉంటుంది. ఉపవాసము అనేది చాలా సహజ సిద్ధమయిన ఆరోగ్య విధానము. శరీరాన్ని శక్తివంతంగా, ఆరోగ్యంగా ఉంచుతుంది. జంతువులు ఏదైనా అనారోగ్యం కల్గినప్పుడు అవి ఎలాంటి ఆహారాన్ని తీసుకోవు. తిరిగి ఆరోగ్యం కలిగేవరకూ అవి ఉపవాసము చేస్తుంటాయి. దానితో అవి తిరిగి జీవశక్తిని పుంజుకుంటాయి. అంతేకాకుండా ఉపవాసము చేయటం వలన మనలోని ఉద్వేగము, ఆవేశము, మనోవికారము మొదలైన రోగములను నియంత్రిస్తుంది. అలాగే అనుకోకుండా కలిగే బాధలను, ఇంద్రియలోలత్వాన్ని నిగ్రహిస్తుంది. మానవుని బుద్ధిని, హృదయాన్ని పవిత్రంగా మారుస్తుంది. ఎవరయినా ఉపవాసదీక్షలో ఉన్న సమయంలో వారు పరతత్త్వానికి చేరువుగా అవుతారు. అంతేకాక ఆ సమయంలో వారి మనస్సు ప్రార్థనకు చాలా అనుకూలంగా మారుతుంది.

ప్రార్థనలు, ఉపవాసదీక్ష కలిసి ఒక వ్యక్తి పరీక్షలను, అడ్డంకులను, ఉద్రిక్తతలను తట్టుకొని నిలదొక్కుకునేందుకు సహాయపడతాయి. ఉపవాసం చేయటం వలన ఆత్మానందము, జ్ఞానోదయము కలుగుతుంది. కేవలము కొద్ది రోజులు ముందు కష్టంగా అనిపిస్తుంది. శరీరము పరిశుద్ధమయిన తర్వాత ఉపవాసము చేయటం తేలికవుతుంది. ఉపవాసంతో పాటు ప్రార్థన చేయటం తప్పనిసరి. దాని వలన శరీరమంతా పరిశుద్ధమవటం వలన అది ఆధ్యాత్మిక వికాసం కల్గచేయడానికి దోహదపడుతుంది. ఉపవాసము చేయటం వలన మానవులు క్రింది స్థాయి నుండి అత్యున్నత స్థాయికి ఎదిగి పరమాత్మ యొక్క అద్భుతమయిన దివ్యత్వాన్ని తెలుసుకోవడానికి సహాయ పడుతుంది.

ప్రాఫెట్ 21 రోజుల నుండి 40 రోజులు ఉపవాసదీక్ష చేసిన తర్వాతే భగవదనుభవాన్ని పొందగలిగాడు. భగవాన్ బుద్ధ, భగవాన్ మహావీరుడు మొదలైన మహాత్ములు అరణ్యంలో ఘోరమైన తపస్సు, కఠినమయిన ఉపవాసదీక్ష చేసిన తర్వాతే నిర్వాణసిద్ధిని పొందగలిగారు. బైబిల్ గ్రంథంలో మోసెస్, ఎలిజా, డేవిడ్, డేనియల్, జీసస్ మరియు

ఫాల్ మొదలైన వారందరూ ఎంతో గొప్ప ఆధ్యాత్మిక శక్తిని ఉపవాసదీక్ష వల్లనే సాధించినట్లుగా ఉంది. మోసెస్ రెండు పర్యాయాలు నలభై రోజులు ఉపవాస దీక్ష చేసిన తర్వాతే అతనికి మానవ జీవన న్యాయసూత్రాలు పది తెలియచేయబడ్డాయి. డేనియల్ ఇరవై ఒక్క రోజులు దీక్షగా ఉపవాసము చేసిన తర్వాతే భగవంతుని దర్శించగలిగాడు. ప్రకృతి యొక్క జ్ఞానాన్ని పొంది భగవంతుని విభూతిని అర్థం చేసుకోగల్గటం వలన జ్ఞానోదయమయింది. ఎలిజా నలభై రోజుల ఉపవాస దీక్షానంతరమే భగవంతుని దివ్యత్వాన్ని తెలుసుకోగలిగాడు. జీసస్ కూడా నలభై రోజులు ఉపవాస దీక్ష చేసిన తర్వాతే ప్రవచనాలు చేస్తూ ప్రజలకు రోగవిముక్తి కలిగించాడు. జాన్ ఆకలి చావుకు గురిచేయబడినపుడు దానిని ఉపవాసదీక్షగా మార్చుకొని జీసస్ క్రీస్తు యొక్క అనుభవం మీద దృష్టి పెట్టగలిగాడు.

ఇస్లాం మతంలో కూడా పవిత్రమయిన ఖురాను గ్రంథంలో ఉపవాసదీక్ష పరమ పవిత్రంగా వర్ణించబడింది. ఆత్మశుద్ధి కోసం ఉపవాస దీక్షలు చేయాలని చెప్పబడింది. ఉపవాసమంటే కేవలం ఆహారాన్ని వర్జించటము మాత్రమే కాదు మనసా, వాచా, కర్మణా చెడు తలంపులను, కర్మలను కూడా వదిలిపెట్టాలని చెప్పబడింది. ఖురాను ప్రకారం ఉపవాసము యొక్క నైతిక విలువ చాలా స్పష్టంగా ఈ విధంగా తెలియచేయ బడింది. "ఉపవాసము నిన్ను నీవు చెడు నుండి సంరక్షించుకొనే విధంగా హెచ్చరిస్తుంది లేదా సహకరిస్తుంది."

ప్రార్థన ఎటువంటి అరమరికలు లేకుండా హృదయంలోని భావావేశాలను వినియోగించుకొని భగవంతుడిని వేడుకుంటుంది. అది నైతికంగా, ఆధ్యాత్మికంగా హృదయ పరివర్తనని కలిగిస్తుంది. దాని వలన పరమాత్మతో అనుబంధం ఏర్పడుతుంది. ప్రార్థన వలన మనస్సు, శరీరము, ఆత్మ పూర్తిగా ఏకత్వాన్ని పొందుతాయి. దాని వలన మానవుని జీవితానికి పరిపూర్ణత, అనంతమయిన శక్తి సామర్థ్యాలు లభిస్తాయి. ఆంతర్యంలోనూ, బాహ్యంలోనూ ఏకంగా ఉంటాడు. అన్ని జబ్బులకు మూలకారణము అతిగా ఆహారాన్ని తీసుకోవటమే. ఉపవాసము నిజమయిన, అత్యంత సహజమయిన రోగ నివారణని కలిగిస్తుంది. స్వామీజీ తెలియచేస్తున్నారు భగవంతుని సృష్టిలో సగం మంది మానవులు అతిగా తినటం వల్లనే మరణిస్తున్నారు. ఆధ్యాత్మికంగా, భౌతికంగా కూడా కొన్ని నియమాలను పాటించాలి. మన పూర్వకాలములో ఋషి పుంగవులు

మానవ జీవితానికి ఏకైక లక్ష్యం ఆత్మ సాక్షాత్కారము అని తెలియచేశారు. భగవంతునితో ఏకత్వాన్ని పొందటము, అంతర్యామిగా ప్రకాశిస్తున్న పరమాత్మను దర్శించటము పరమ గమ్యంగా ఉండాలి. స్వామీజీ ఎంతో సుందరంగా ఈ విధంగా చెపుతున్నారు. “మన జీవితంలోని ప్రతి క్షణము ఆ ఏకత్వాన్ని సాధించటము కోసము, పరిపూర్ణత్వాన్ని పొందటం కోసము ఉపవాస దీక్ష చేయటం ద్వారా, భగవంతుని స్మరించటం ద్వారా ప్రయత్నం చేద్దాము. మౌనంగా పనిచేయటం ద్వారా దానిని సాధించుదాము. అంతే కాని అర్థం లేని భవితవ్యం మనకు వద్దు. ఇప్పటి నుండి, ఈ క్షణం నుండి మన ప్రయత్నాలు కొనసాగిద్దాము. - గోవిందరాజ్

## సూర్యకిరణాల సందేశము

ఈ రోజు మరొక అద్భుతమయిన అనుభవము, ఆనందంగా జీవించడానికి, శ్వాసించడానికి, అలాగే భగవంతుని ఉనికిని అర్థం చేసుకోవడానికి లభించింది. ఆ రాత్రి నేను ప్రశాంతంగా, సంతృప్తిగా నిదురించాను. కాని ఆశ్రమంలో నివసించే చిన్ని పిల్లిపిల్ల ఒకటి నెమ్మదిగా నా పక్కన చేరి నాకు నిద్రాభంగం కలిగించసాగింది. అది పదే పదే నా దుప్పటి క్రిందికి దూరటానికి ప్రయత్నించసాగింది. నేను దీర్ఘకాలంలో ఆశ్రమంలో ప్రతిది సక్రమంగా, సవ్యంగా జరిగే విధంగా చేయగలిగాను కాని ఈ చిన్ని పిల్లిపిల్లను నియంత్రించలేకపోయాను. ఆశ్రమంలోని పిల్లలు దానిని ఎంతో జాగ్రత్తగా కనిపెట్టుకొని ఉండేవారు, అయినా ఆ పిల్లి పిల్లలు వాళ్ళ కళ్ళు కప్పి ఏదో విధంగా కిటికీలోంచి దూరి నా గదిలో ప్రవేశించేవి. నేను దీక్షలో ఉన్నాను కనుక ఆధ్యాత్మికశక్తి అవి అర్థం చేసుకున్నాయా! అనిపించే విధంగా నెమ్మదిగా, శబ్దం చేయకుండా వచ్చి నా కాళ్ళ వద్ద గాని, లేదా నా పక్కన గాని పడుకొనేవి. కాని ఒక పిల్లి మాత్రం పగలు ఆశ్రమంలో తిరుగుతుండేది. రాత్రి నిద్రపోయే సమయం కాగానే నెమ్మదిగా పాకుతూ నా గదిలో చేరి నా తొడ మీద తలపెట్టుకొని పడుకునేది. లేదా నా హృదయానికి బాగా దగ్గరగా చేరి నిద్రపోయేది. అది నాకు ఒక విషయాన్ని గుర్తుచేసింది. తొందరగానో లేదా నెమ్మదిగానో జీవితంలో మనకు సహాయం వస్తుంది. ప్రపంచపు ఆశాపాశాల్లో చిక్కుకుని అల్లాడుతూ తిరిగి తిరిగి అలసిపోయి విశ్రాంతి కోరుకుంటాము. ప్రశాంతత కోసం అలమటిస్తాము. అప్పుడు మనము కూడా నెమ్మదిగా విశ్వశక్తి స్వరూపమయిన ఈశ్వరుని సన్నిధానానికి చేరుకుంటాము.

నిన్న, ఈ రోజు కూడా నేను సూర్యరశ్మిలో చాలా ఎక్కువ సమయం గడిపాను. సూర్యకిరణాలతో స్నానం, ధ్యానం జీవితంలో ఎంతో ఆనందానుభవాన్ని కలిగిస్తుంది. మనకు ఆరోగ్యాన్ని, జీవితాన్ని సూర్యకిరణాలు ప్రసాదిస్తాయి. అసలు జీవితం అంటే ఏమిటి? సూర్యకిరణాలు లేకుండా మన జీవితాలకు ఉనికి ఉంటుందా? అసలు మనము ఎప్పుడయినా ఆలోచించామా? సూర్యకిరణాలు మనపై వెలుగు ప్రసరింపజేస్తూ నిరంతరము మనలను ఆశీర్వదిస్తూ ఆత్మ సాక్షాత్కారము వైపుగా మనలను నడిపిస్తుంటాయి. ఏ విధంగా సూర్యుని కిరణాలు గడ్డకట్టిపోయిన మన హృదయాన్ని చీల్చుకొని పోయి మానవత్వాన్ని మేలుకొల్పుతున్నాయో ఆ విధంగా మనము ఎప్పుడయినా ప్రయత్నం చేశామా? సూర్యుని కిరణాలు మన ప్రేమమయ హృదయాన్ని బాగా శుభ్రం చేసి పరిశుద్ధం గావించినప్పుడు, అవి హృదయాన్ని పూర్తిగా ప్రపంచము యావత్తును ప్రేమించే విధంగా తయారుచేసినప్పుడు, సూర్యునికే సూర్యుని వెలుగును ఇచ్చే పరమాత్మను తెలుసుకోగల్గుతాము, దర్శించుకోగలుగుతాము.

అది శీతాకాలము కావటం వలన, సూర్యుని కిరణాలు వెచ్చగా లేవు. అందువలన నేను ఆ లేలేత సూర్యుకిరణాలలో స్నానమాడుతూ సమయం తెలియకుండా చాలా సేపు ఉండిపోయేవాడిని. ప్రశాంతంగా ఆత్మానందాన్ని పొందేవాడిని. అది పూర్తి అయిన తర్వాత సాధారణంగా నేను ఎప్పుడూ చేసేవిధంగా గోరువెచ్చని నీటితో ముందుగా తర్వాత చల్లని నీటితో స్నానం చేసేవాడిని. అప్పుడు నాకు సోదరి సెయింట్ థెరిస్సా వాక్యాలు గుర్తు వస్తుండేవి. "ప్రియమైన భగవంతుడా! ప్రతి రోజు నాకు ఏదయినా చేయడానికి పని ఇవ్వు, దాని వలన నా బుద్ధి బాగుంటుంది. కొద్దిగా బాధను కూడా ఇవ్వు. అది నా ఆత్మను పరిశుద్ధంగా ఉంచుతుంది. కొద్దిగా మంచిని ఇవ్వు, దాని వలన నా హృదయం సుఖంగా ఉంటుంది." నేను కూడా నన్ను నేను ఆశ్రమ కార్యకలాపాలతో పాలుపంచుకొని పని కల్పించుకొనేవాడిని. నిరంతరము ప్రార్థనతో, ధ్యానంతో కాలం గడపటం చాలా కష్టము కదా! అందువలన మనకి కొంత పనిచేయటం కూడా చాలా అవసరము. అలాగే కొద్దిగా ఇబ్బందులు కూడా మనలను మనము పరిశుద్ధులము గావించుకోవడానికి అవసరము. దాని వలన మనము భగవంతునికి దగ్గరగా ఉంటాము. అలాగే మంచి పనులు చేయటం వలన అది మన ఆత్మానుభవానికి ఎంతో ఉపకరించి, ఉన్నతస్థితిని చేర్చి ఆనందంగా ఉండేలా చేస్తుంది.

పనిచేస్తున్నప్పటికీ నేను సంతోషంగా, ఆరోగ్యంగా ఉన్నాను. నా ముప్పై రోజుల ఉపవాస దీక్ష పూర్తి అయ్యేవరకు ఇదే విధంగా ఉండాలని కోరుకుంటున్నాను. నా ఆలోచనలు ఏ విధంగా రూపుదిద్దుకొన్నాయంటే, నేను దృఢంగా, శక్తివంతంగా తయారవడానికి దానిపై ధ్యానం చేయాలనుకుంటున్నాను. మానవుడు తాను దేనిని సంకల్పిస్తాడో, అదేవిధంగా తయారవుతాడు. మనము దేని గురించి ఆలోచిస్తామో, దేనిపైన ధ్యానం చేస్తామో, అతి తొందరలోనే లేదా నెమ్మదిగా అయినా దానిగా మారుతాము.

ఉపవాసదీక్ష చేసేటప్పుడు సాధారణంగా బలహీనత ఏర్పడుతుంది. అయినా ఆధ్యాత్మిక శక్తి లేదా విశ్వ శక్తి తోడుగా ఉంటుంది. ఎవరయినా బలహీనత వల్ల కాక ఆధ్యాత్మిక శక్తి ద్వారానే భగవంతుని తెలుసుకోగల్గుతారు. అసాధారణమయిన ఆధ్యాత్మిక శక్తి వల్ల మాత్రమే అది సాధ్యపడుతుంది. విశ్వప్రేమ, అనంతమయిన ప్రశాంతత మనకు లభిస్తాయి. నేను నిరంతరము దైవానికి చేరువుగా ఉన్నప్పటికీ తరుచుగా నేను శ్రీ రామకృష్ణ పరమహంస పలికిన అందమయిన మాటలను గుర్తు చేసుకునే వాడిని. "ఇంకొక రోజు వృథాగా గడిచిపోయింది. కానీ మాతా నీ దర్శనం ఇంకా నాకు లభించనే లేదు."

కబీర్‌దాసు అనేవాడు "రోజు గడిచిపోయింది రాత్రి కూడా వృథాగా గడిచిపోయింది భగవాన్! నీ దర్శనం కల్గచేయి" అలాగే క్రీస్తు మాటలు కూడా నేను గుర్తుకు తెచ్చుకునేవాడిని. "స్వర్గ రాజ్యం నీలోనే ఉంది" అదే విధంగా మన పూర్వీకులయిన ఋషులు, సాధు మహాత్ములు సత్యదర్శనం చేసిన మహాత్ములు, వేదాలు, ఇతర పవిత్ర గ్రంథాల్లో చెప్పిన మాటలు గుర్తుకు వస్తుండేవి.

ఈ విధమయిన ఆలోచనలు చుట్టుముట్టగా నాలో అంతర్యామిగా కొలువైన ఈశ్వరుడు నన్ను మేల్కొలుపుతూ నెమ్మదిగా ఇలా తెలియచేశారు. "నా మీద విశ్వాసం ఉంచు. ఎందుకు నీవు నన్ను మర్చిపోతూ ఉంటావు. నేను ఎల్లప్పుడూ నీతోనే ఉన్నాను. నీ శరీరంలోని అణువణువులోనూ కలిసిపోయి ఉన్నాను. జాగ్రత్తగా గమనించు. నేను ఎల్లప్పుడూ ఒక్కటిగానే ఉన్నాను తప్ప రెండుగా లేను. గమ్యం లేని వెతుకులాటలు మానివేసి ప్రశాంతంగా, సంతృప్తిగా నాతో ఉండు. నేను నిరంతరం నీతోనే ఉన్నాను. నీ జీవితము పూర్తి అయ్యేవరకు నీతోనే కలిసి ఉంటాను". అందువలన లోపలా, బయటా

అంతటా పరమాత్మ సన్నిధిని అనుభవిస్తూ నేను మౌనంగా, ప్రశాంతంగా, సంతోషంగా, సంతృప్తిగా ఉంటూ అన్ని చింతలు, చికాకులు, వ్యథలు, రొదలు వదిలిపెట్టి రోజులు గడపసాగాను. పరమాత్మ సర్వాంతర్యామి. అతనికి గతం లేదు. భవిష్యత్తు లేదు, వర్తమానము లేదు, కాలానికి, ప్రదేశానికి ఆయన అతీతుడు.

మన మానసిక, ఆధ్యాత్మిక స్థితిని బట్టి, ఆయా విధమయిన ధ్యానములు ఆయా సమయాల్లో సహాయకారిగా ఉంటాయి. సూర్యాస్తమయ సమయంలో ఆకాశం క్రింద లేలేత సూర్యకిరణాలతో స్నానమాడుతూ గాఢమయిన ధ్యానములో మునిగిపోయి విశ్వ శ్వాసలో గడిపేవాడిని. ఎలాంటి ఎడబాటు లేకుండా మన హృదయానికి ఎంతో దగ్గరగా ఉండే ఆ పరమాత్మను ధ్యానించేవాడిని. సూర్యకిరణాల ద్వారా అంతులేని అనంతమయిన శక్తి శరీరానికి అంది ఉత్తేజపరిచేవి. భగవంతుడు సూర్యకిరణాలకి ఆత్మగా వెలుగొందుతున్నాడు. శ్వాసలో శ్వాసగా, జీవితానికి జీవితంగా, ఆత్మలో ఆత్మగా నివసిస్తున్నాడు. 'సోహమ్' అనే విశ్వ శ్వాస ద్వారా పరమాత్మను దర్శించాలి. అదే సూర్యకిరణాల ద్వారా ప్రతి హృదయాన్ని తేజోవంతం చేస్తుందని గ్రహించాలి,.

ఆత్మానుభవమే నా జీవిత లక్ష్యము, నాకు ప్రియమయిన ఆలోచనలు, ఆత్మ సాక్షాత్కారము అంటే అది చిన్న విషయం కాదు. చాలా ఉన్నతమయిన స్థితి. ఆత్మ దర్శనం అంటే నిన్ను నీవు సంపూర్ణంగా భగవంతునికి శరణాగతి చెందటము. అదే సత్య దర్శనము. ఆత్మ దర్శనము, భగవదనుభవము రెండూ వేరు వేరు కాదు. అవి రెండూ ఒక్కటే.

దీక్షా కాలంలో ఇరువై అయిదవ రోజున ఆశ్రమ వాసులు నా క్షేమం కోరి వైద్యుడిని నన్ను పరీక్షించటం కోసం పిలిపించారు. దీర్ఘకాలం ఉపవాస దీక్షలో ఉండటం వలన శరీరంలో బలహీనత ఏర్పడుతుంది అని వారు ఆందోళన చెందటం సహజమే. వైద్యుడు నాకు చాలా మంచి మిత్రుడు. శాంతి ఆశ్రమానికి మంచి భక్తుడు, ఆధ్యాత్మికంగా మంచి వ్యక్తి కూడా. నేను ఎంతో ఆత్మవిశ్వాసంతో ఉన్నాను. అందువలన నేను అతడిని నన్ను ముట్టుకొని నా నాడిని పరీక్షించడానికి గాని, ఎలాంటి వైద్య పరీక్షలు జరపడానికి గాని అనుమతించకుండా సున్నితంగా అతడిని తిరస్కరించాను. కనీసం గుండె ఎలా కొట్టుకుంటుందో కూడా చూడనీయలేదు. దయచేసి నా సమయాన్ని వృథా చేయవద్దు అని అతనికి వ్రాసి చూపించాను. నేను చాలా ఆరోగ్యంగా, ఉల్లాసంగా ఉన్నానని

తెలియచేశాను. దానితో అతడు తృప్తి చెందాడు. ఎలాంటి వైద్యపరీక్షలు చేయకుండానే వెనుతిరిగి వెళ్ళిపోయాడు. ఆయన నా వంక ఎంతో భక్తితో, ఆరాధనతో చూచాడు. అంతా ఆ భగవంతుని లీల. విశ్వంలోని ధార్మిక శక్తిని ప్రసాదించి నన్ను మరింత దృఢంగా, ఆరోగ్యంగా తయారుచేసినందుకు భగవంతునికి కృతజ్ఞతలు తెలియచేసు కుంటున్నాను.

భగవంతుడు జీవుని ప్రతి అణువులోనూ కొలువై ఉన్నప్పుడు, అతని శరీరంలో అంతర్యామిగా నెలకొని ఉండగా అసలు అతడిని పరీక్షించవలసిన అవసరం గాని, తెలుసుకోవలసిన అవసరం గాని ఏముంటుంది? ఎవరికి వారు అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడిని మర్చిపోకుండా ఉండటం అవసరం అని గ్రహించాలి. ఉన్నతమయిన స్థాయికి చేరుకున్న వారే ఉత్తమ అధికారులు అవుతారు. అలాంటి వారు తమని తామే పరీక్షించుకోవాలి తప్ప వారిని ఇతరులు పరీక్షించడానికి అర్హులు కారు. ఎవరికి వారు ఆత్మావలోకనం చేసుకుని తమని తాము సరిదిద్దుకోవాలి. అలాగే ఆరోగ్యపరంగా కూడా వచ్చే ఇబ్బందులను అధిగమించగలగాలి. నిన్ను నీవే సక్రమమయిన పద్ధతిలో మనస్సును, శరీరాన్ని అదుపులో ఉంచుకోవాలి. అందువలన ఎవరికి వారే నిర్ణయించుకోవాల్సి ఉంటుంది. వారికి వారే ఉత్తమమయిన గురువులు లేదా వైద్యులు కాగల్గుతారని.

మహర్షులు పదే పదే మనకు తెలియచేస్తున్నారు. అన్ని మతాల సారాంశము ఆత్మ సాక్షాత్కారమేనని, నిన్ను నీవు తెలుసుకోలేకపోతే, నీ హృదయంలో హృదయంగా, బుద్ధికి బుద్ధిగా, ఆత్మకు ఆత్మగా వెలుగొందుతున్న ప్రకాశిస్తున్న అంతర్యామిని గుర్తించలేకపోతే, ఇంక నీవు ఇతర విషయాలను ఏ విధంగా గ్రహించగల్గుతావు? నీ అంతర్యామి పట్ల నీవు నిజాయితీగా ప్రవర్తించలేకపోతే ఇంక నీవు బాహ్యంలోని ఇతర స్నేహితులతో, బంధువులతో నిజాయితీగా ఎలా మసులుకోగల్గుతావు? అందువలన మహాత్ములు అంటూ ఉంటారు తరుచుగా నీవు నీ పట్ల, నీ లోపల అంతర్యామిగా ప్రకాశిస్తున్న పరమాత్మ పట్ల నిజాయితీగా ఉంటే అంతా సవ్యంగా ఉంటుంది.

బాహ్యంలో గురువులకు, దగ్గరి బంధువులకు, ఆత్మీయులయిన స్నేహితులకు భక్తి విశ్వాసంతో ప్రవర్తించే శిష్యుడిగా తయారు కావటం వలన వారిపై నమ్మకము విశ్వాసం ఉంచటం వలన ఎలాంటి ప్రయోజనం ఉండదు. వారు ఎంత నమ్మకమయిన వారయినా, ప్రేమించదగినవారయినా సరే బాహ్య జగత్తులోని వారిపై విశ్వాసము నెమ్మదిగానో,

ఆలస్యంగానో సడలిపోయి చివరికి నిరాశ, దుఃఖముగా మారిపోతుంది. ఎందుకంటే ఈ జగత్తు నిరంతరము పరిణామము చెందుతూ ఉంటుంది. మన కాళ్ళ మీద మనం నిలబడవలసిన సమయం వస్తుంది. మన స్వశక్తిపై విశ్వాసం పెంచుకోవాలి. మనలో అంతర్యామిగా ఉన్న దైవంపై ఆధారపడాలి. అంతే తప్ప బాహ్యంలో దేవాలయాల్లో, చర్చిల్లో, మసీదుల్లో ఉండే దైవంపై నమ్మకం పెట్టుకుని వారిపై ఆధారపడటం, నామరూపాలపై, స్వర్గ నరకాలపై విశ్వాసం పెంచుకోవటం వలన ఎలాంటి ప్రయోజనము ఉండదు. దేహమే దేవాలయము. మన హృదయంలో కొలువై ఉండే పరమాత్మను దర్శించు. హృదయక్షేత్రమే భగవంతునికి నివాసము. ఈ సత్యాన్ని తెలుసుకోవలసిన సమయం చాలా గొప్పది.

నిజానికి మన జీవితంలో చాలా సామాన్యమయిన విషయాలకు వస్తే, ఏదయినా పనిచేయవలసి వచ్చినపుడు మన పూర్తి శక్తి సామర్థ్యాలను వినియోగించి ఆ పనిని చేసినప్పుడే మనకు సంతృప్తి కలుగుతుంది. చాలా సందర్భాల్లో మనము ఆ పనిని ఇతరులకు అప్పగించడానికి సంకోచిస్తాము. వాళ్ళు దాన్ని సక్రమంగా నిర్వహించగలరో లేదో అని సందేహిస్తాము. అయినా ఎప్పుడయినా మన పని సక్రమంగా చేయడానికి అలసత్వం వహించి ఇతరుల సహాయం తీసుకున్నప్పుడు మనకి తప్పకుండా అనుభవమవు తుంది. చివరికి మనమే దానిని సక్రమంగా పూర్తి చేసుకోవాల్సిన పరిస్థితి వస్తుంది. అప్పుడే మనము సంతృప్తి చెందగల్గుతాము. ఇతరులు కేవలం మాటలతో సరిపెడతారు తప్ప మనము చేరుకున్నంత సమర్థవంతంగా ఆ పనిని సక్రమంగా చేయరు. ఇదొక ఉదాహరణ మాత్రమే.

## ఆశ్రమ వార్తలు – మన స్వామీజీ ఉపవాసదీక్ష

మేమందరము భగవంతునికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెల్పుకుంటున్నాము. మా పూజ్య స్వామీజీపై వారు సుదీర్ఘమయిన ఉపవాసదీక్ష సాగించిన సమయంలో అనంతమయిన ఆశీస్సులు అందించి ఆశీర్వదించినందులకు. నెలరోజుల ఉపవాస దీక్ష అనంతరము కూడా స్వామీజీ ఎలాంటి అసౌకర్యము లేకుండా, కనీసం తలనొప్పి, ఆకలిదప్పులు, బలహీనత, అనారోగ్యము లాంటి వాటికి గురికాలేదు. పైగా వారు ఆశ్రమ కార్యక్రమాల్లో పాల్గొని ఉత్తర ప్రత్యుత్తరాలు చూస్తూ రోజుకు నాలుగైదు గంటలు పనిచేసేవారు.

దీక్షాకాలంలో ఎన్నో సందేశాలు, వ్యాసాలు రచించారు. అవి ఎంతో ఉత్తేజకరంగా ఉండి భక్తులకు, సాధకులకు ఉపయోగపడ్డాయి. అవన్నీ "విశ్వ సంబంధమైన ఉపవాసము" పేరుతో గ్రంథంగా తయారయింది. ముప్ఫై రోజుల దీక్ష అనంతరము స్వామీజీ అరమైలు దూరంలోని కొండ దగ్గరికి వ్యాహ్యాళికై నడుచుకుంటూ వెళ్ళి అక్కడి ప్రశాంతమయిన, సుందరమైన సూర్యాస్తమయాన్ని తిలకిస్తూ ధ్యానంలో చాలాసేపు గడిపారు.

నెల రోజుల ఉపవాసదీక్ష వలన స్వామీజీ భౌతిక దేహము బాగా సన్నగా తయారయింది. కానీ వారి ముఖ మండలం దివ్య తేజస్సుతో ప్రకాశవంతంగా కనబడసాగింది. దీక్షా కాలంలో వారు మౌన దీక్షలో ఉండటం వలన దీక్ష ముగిసిన అనంతరము వారు మొదటిసారి మాట్లాడినప్పుడు వారి గొంతు చాలా చిన్నగా వినబడింది. వారు ఇప్పుడు ఎక్కువగా మౌనంగా, ప్రశాంతంగా, ధ్యానంలో ఎక్కువ సమయం గడుపుతున్నారు.

మరొక పర్యాయము ఆ భగవంతునికి ధన్యవాదాలు. ఆశ్రమవాసులు, సన్నిహితులు, శ్రేయోభిలాషులు అందరికి ప్రేమాభిమానాలు, ఆశీస్సులు, ప్రార్థనలు, భక్తి, గౌరవము అన్నీ స్వామీజీ విజయానికి సహకరించాయి. స్వామీజీకి ఆ పరమాత్మ ఆరోగ్యాన్ని, సుదీర్ఘమయిన ఆయుష్షును ఇచ్చి ఆశీర్వదించాలని, తద్వారా స్వామీజీ వారి శాంతి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించగల్గుతారని ఆశిస్తున్నాము.

**అధ్యాయం - 41**

# వివిధ ప్రాంతాల్లో పర్యటనలు

## శాంతి పత్రిక, సెప్టెంబర్ 1935

ఏలూరు : ఆత్మ సోదరుడు ఆంజనేయులు ఏలూరులో అందమయిన దేవాలయాన్ని నిర్మాణము చేసి ధర్మశాల ప్రారంభోత్సవానికి ఆహ్వానించగా వెళ్ళాము. కార్యకర్తలు ఎంతో గౌరవ మర్యాదలతో ఆహ్వానించారు. స్వామీజీని పూలదండతో సన్మానించి వారిని

తెల్లని గుఱ్ఱము పూనిన బగ్గీలో ఊరేగింపుగా తీసుకు వెళ్ళారు. భక్తులు ఎంతో భక్తితో ఓర్పుతో స్వామీజీ దర్శనభాగ్యం కోసం వేచియున్నారు.

హిందూ సంప్రదాయంలో భగవదనుభవం పొందిన మహాత్ములను దర్శించడానికి భక్తులు ఎంతో ఆరాటపడతారు. వారిని దర్శించినంత మాత్రాన తాము పునీతులు అవుతారని వారి ప్రగాఢ విశ్వాసం. ధర్మశాలలో స్వామీజీ రాక కోసం దాదాపుగా వేయి మంది భక్తులు ఎదురుచూస్తుండగా పరమపూజ్య స్వామీజీ ఓంకార్ గారిని కార్యకర్తలు బాజాభజంత్రీలతో, సన్నాయి మొదలైన వాద్యకారులు వెంటరాగా మహోత్సాహంగా తీసుకువెళ్ళారు.

ఏలూరులో పలు ప్రదేశాలలో పెద్ద భక్త సమూహంతో జరిగిన పలు ఆధ్యాత్మిక సమావేశాలు అక్కడి భక్తుల భక్తిశ్రద్ధలకు సంకేతంగా నిలిచాయి. పూర్వం కంటే ఎక్కువగా మంచి ఆధ్యాత్మిక వికాసం కలిగిన ఆత్మ స్వరూపులను భగవంతుడు తయారుచేశాడు అనిపించింది. శాంతి సందేశాలు వ్యాప్తి చెంది, అందరిలో ఆత్మ చైతన్యం కలిగించే విధంగా పూజ్య ఓంకార్ స్వామీజీ సందేశాలు చాలా సరళంగా, సూటిగా హృదయానికి హత్తుకునే రీతిలో సాగాయి. భవిష్యత్తులో ప్రపంచవ్యాప్తంగా శాంతి సందేశాలు, శాంతి కేంద్రాలు విస్తారంగా తయారవుతాయి అనే నమ్మకము ఆశాజనకంగా కలిగింది. శాంతి కేంద్రాల్లోని కార్యకర్తలు ముందుగా వారి హృదయంలో ఏ విధమయిన పరివర్తన కలిగిందో దానిని విస్తృతంగా ప్రచారం చేయసాగారు. ఏలూరులోని స్నేహితులు కూడా అలాంటి శాంతి కేంద్రాన్ని స్థాపించడానికి ఉవ్విళ్ళూరుతలూగసాగారు. వారి ఆశయం చాలా త్వరలోనే నెరవేరాలని ఆశిస్తున్నాను.

అంటరానివారుగా పరిగణించబడే హరిజనుల నుండి రాజాధిరాజులుగా చలామణి అయ్యే విలాసవంతమయిన జీవితం గడిపే జమిందారుల వరకు అందరూ కూడా స్వామీజీ యొక్క ఉత్తేజభరితమయిన సందేశాన్ని విని అద్భుతమయిన మార్పులు వారిలో గమనించారు. వారిలో నిగూఢంగా దాగి ఉన్న దివ్యత్వము మేలుకొంది అని చెప్పక తప్పదు. స్వామీజీ సందేశాల్లోని ఆధ్యాత్మిక బీజాలు వారి హృదయ క్షేత్రాల్లో చక్కగా నాటుకున్నాయి. ప్రతి వారు స్వామీజీ సందేశాలను పవిత్రమయిన మత గ్రంథాల సారాంశంగా, బైబిల్ గ్రంథంలోని సారాంశంగా, విశ్వదర్శనంగా పరిగణించసాగారు.



సత్యాన్వేషకులకు మంచి సంతృప్తికరమయిన, రుచికరమయిన మధుర భక్ష్యాలను భుజించినంతగా ఆత్మానందంతో సంతృప్తి చెందారు.

'పీస్' పాఠకులందరూ వారి హృదయంలో కొలువైఉన్న పరంధామునికి దగ్గరగా చేరుకున్నట్లుగా అనుభూతి చెందుతారని భావిస్తారు. ఏ విధంగా స్వామీజీ శాంతి సందేశాలు శ్రవణం చేసినవారు దివ్యానుభూతిని చెందారో అదేవిధంగా, ఎందువలనంటే ప్రతి ఒక్కరితో వ్యక్తిగతంగా శ్రద్ధ తీసుకొని మాట్లాడుతారు, వారి కోసం ప్రార్థనలు చేస్తారు. ఆశీర్వచనాలు అందిస్తారు. అనంతమయిన, అవ్యాజ్యమయిన ప్రేమామృతాన్ని వారు ప్రపంచంలోని అందరి పైనా వర్షింప చేస్తారు. ఓం...ఓం....ఓం...

ఈ సాయంత్రం నా జ్ఞాపకాల నిధిలో ఒక అపురూపమయిన సన్నివేశంగా మిగిలిపోయింది. చాలా అందమయిన మెరుపులతో కూడిన సంధ్యా సమయం స్వర్గాన్ని తలపింపచేస్తుంది. పవిత్రమయిన శాంతి ఆ ప్రదేశాన్ని అంతటా ఆవరించుకొనిపోయింది. అది అత్యంత తీవ్రమయిన ప్రభావం చూపిస్తుంది. దూరంగా దట్టమయిన పచ్చని అరణ్యం పక్కన ఉన్న కొండల్లోంచి ఒంటరిగా ఉన్న నెమలి అరవటం వినిపిస్తోంది. అక్కడ ఉన్న ఒక పెద్ద వృక్షం క్రింద దాని నీడలో పరమ పూజ్యులయిన స్వామీజీలు, శ్రీ నారాయణ స్వామి, శ్రీ ఓంకార్ స్వామీజీని పరివేష్ఠించి అనేకమంది భక్తులు, శిష్య పరివారము కూర్చుని ఉన్నారు. వారు ధరించిన కాషాయ వస్త్రాల కాంతి వారి ముఖ మండలాన్ని తేజోవంతము చేస్తోంది ఆ సాయం సంధ్యా సమయంలో.

వికసించిన పూల పొదరిళ్ళనుండి సువాసనలు వెదజల్లే పూల రెక్కలు అనుగ్రహ వర్షంలా రాలిపడినట్లుగా, అక్కడ జరుగుతున్న సత్సంగములో పరమ పవిత్రమయిన 'ఓంకారము' మీద అనుగ్రహ భాషణము జరుగుతోంది. శ్రీ ఓంకార స్వామీజీ అక్కడ ఉన్న పెద్దవారయిన స్వామీజీని శ్రీ రామతీర్థ స్వామీజీ ఏ విధంగా 'ఓంకారాన్ని' జపించేవారో తెలియచేయమని అడిగారు. శ్రీ నారాయణస్వామీజి ఓంకారాన్ని జపించటము మొదలుపెట్టగానే అది ఆ కొండల్లో ప్రతిధ్వనించ సాగింది. ఆయన అక్కడ సత్సంగంలో కూర్చుని ఉన్న వారందరిని సామూహికంగా ఓంకారాన్ని జపించమని చెప్పారు. ఆ పవిత్రమయిన ఓంకార ధ్వని తరంగాలుగా ఆ ప్రాంతమంతటా వ్యాపించి అందరి హృదయాలను పవిత్రీకరించింది. భగవంతుని విభూతి అంతటా వ్యాపించినట్లుగా మాకు తోచింది. దూరంగా ఉద్యానవనంలో ఉన్న దేవాలయంలోని పూజారి మేము

జపిస్తున్న ఓంకారనాదానికి ప్రతిగా శంఖం పూరించి ఊదసాగాడు. ఇదంతా చాలా గొప్పగా, అద్భుతంగా వర్ణించబడిన వైదికపరమయిన కథలాగా మా హృదయంలో పదిలంగా ఉండిపోయింది. మన ప్రాచీనమైన వైదిక సంస్కృతిలో శంఖం గురించిన కథ ఉంది. శంఖంలో ఉండే జీవి నశించిపోగానే ఆ ఖాళి శంఖం చక్కగా పరిశుభ్రం గావించబడి ఒడ్డుకు చేరుకుంటుంది. అది గాలి చేత పూరించబడినప్పుడే మొట్టమొదటి శబ్దం పరమ పవిత్రమయిన 'ఓంకారము' ఉద్భవిస్తుంది. అందువలన హైందవ ధర్మంలో దేవాలయాల్లో పూజాదికాలు నిర్వర్తించే సమయంలో అలాగే భగవద్గీతను పారాయణ చేసేటప్పుడు శంఖం పూరిస్తారు. కురుక్షేత్ర సంగ్రామ సమయంలో యోధులయిన వీరాధివీరులందరూ తమ తమ శంఖాలని పూరించి సైనికులను యుద్ధోన్ముఖులను గావించారు.

అద్భుతమయిన వర్ణనలతో కూడిన కథలను వివరిస్తూ మమ్మల్ని అందరిని మంత్ర ముగ్ధులను గావించి, ఎంతో నైపుణ్యంగా సత్సంగం జరిపి అక్కడ చాలా సమయం గడిపిన అనంతరం పున్నమి వెన్నెల కాంతిలో అందరము ఎవరి దారిన వాళ్ళము వెళ్ళాము. పౌర్ణమినాటి వెన్నెలను అనుభవించడానికి అందరికి పుట్టుకతో హక్కు ఉంది. మనము ఇంకా మాటలతో మనల్ని మనము మోసం చేసుకుంటూ, భగవంతుడిని కూడా మోసపుచ్చటానికి ప్రయత్నించకూడదు. మాటలతో, ప్రార్థనలతో అలాగే పొగడ్తలతో దానికి బదులుగా మన అంతరంగాన్ని పరిశుద్ధంగా ఉంచుకుని స్వార్థాన్ని తుడిచివేయాలి. అప్పుడే మనము మనదయిన లోకంలోనికి అడుగు పెట్టగలుగుతాము. అక్కడ పరమాత్మ మన కోసం ఎంతో ఓపిగ్గా ఎంతో కాలంనుండి ఎదురుచూస్తున్నాడు.

## శాంతి పత్రిక, నవంబరు 1935, హిమాలయాల్లో పర్యటనలు

స్వర్గాశ్రమము చేరుకున్న తర్వాత ఘనమైన స్వాగతం చెప్పి కొండ మీద చక్కని ఇంటిని నివాసంగా ఇచ్చారు. అక్కడి నుండి చుట్టు ప్రక్కల అందమయిన దృశ్యాలు కిటికీల నుండి, వరండా నుండి చక్కగా కనిపించసాగాయి. మన పూజ్య స్వామీజీ ఆనందంతో ఉప్పొంగిపోయారు. ఆయన హృదయం పాత మధురమయిన జ్ఞాపకాలతో నిండిపోయింది. ఆయన ముఖము వెలుగుతో నిండిపోయింది. తనకు ఎంతో సుపరిచితము అయిన ఆ వాతావరణము, ప్రదేశాలు స్వామీజీ మనస్సుకు ఆహ్లాదాన్ని కలిగించాయి. గంగానదిలో స్నానం చేసి ఒడ్డున ఉన్న బండరాళ్ళపై సూర్యకిరణాలలో

తడిసిన తర్వాత చపాతీలు, పప్పు, రసం, పెద్ద అరటిపళ్ళతో భోజనము పూర్తి చేశాము. పళ్ళు, కూరగాయలు ఇలాంటి ప్రదేశాలలో దొరకటం చాలా అరుదు. వందలకొలది సాధు మహాత్ములు మంచి పౌష్టికాహారాన్ని వివిధ ఆశ్రమాలలో ఉచితంగా స్వీకరించ గల్గుతున్నారంటే అది కేవలము భగవంతుని కృపవలన ధనవంతులయిన వర్తకులు దయాగుణంతో విరివిగా ఇచ్చే విరాళాలవలన సాధ్యపడింది.

త్వరలోనే సాధు మహాత్ములు, యోగులు మన స్వామీజీని ఆహ్వానించ సాగారు. వారందరికి స్వామీజీ చిరపరిచితులు. స్వామీజీ ఆరు సంవత్సరాలు యుక్త వయస్సులో తపస్సులో, ధ్యానంలో కాలం గడిపినప్పుడు వారందరి హృదయంలో ఎంతో ప్రేమతో స్థానం పొందారు. ఎవరి ఆత్మకయినా ఎంతో ఆహ్లాదము, ఆనందము కలిగిస్తుంది అక్కడి హిమాలయ సాధువులు, తమ పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని, పవిత్రమయిన తమ యవ్వనంలోని తపస్సు గురించి, భగవంతుని అనుభవం గురించి చేసిన సాధనలు గురించి కథలు కథలుగా చెప్పుకుంటున్నప్పుడు అక్కడ నివసించే ఒక యోగి పుంగవుడు, ఆ పవిత్ర ప్రదేశాన్ని స్వరంలా భావించే వ్యక్తి, ఎక్కువగా మౌనంగా ఉంటూ ఎవ్వరితో ఎక్కువగా మాట్లాడేవాడు కాడు. కాని ఆయన స్వామీజీ గురించి, ఆయన ఆత్మ సాధనల గురించి వివరిస్తూ, అక్కడ నివసించే సాధువులు, పర్యాటకుల ద్వారా స్వామీజీ గురించి విని ఎంతో స్ఫూర్తి పొంది వారిని దర్శించాలని అడవుల్లో వెతుకుతూ వెళ్ళి గాఢమైన ధ్యానంలో ఉన్న ఆ మహాత్ముని పాదాల చెంత కూర్చున్నానని ఎంతో వినయంగా, గౌరవంగా చెప్పారు.

ఆయన ఒక రష్యానుండి వచ్చిన ధనవంతుడి గురించి చెపుతూ కనబడిన సాధువులందరికి వంద రూపాయల నోట్లు ఇచ్చేవాడని, ఓంకార్ స్వామీజీ గురించి విని, అంత చిన్న వయస్సులో ఎంతో వైరాగ్యంతో అడవుల్లో, కొండ గుహల్లో, నిర్మానుష్యమైన, ప్రశాంతమయిన ప్రదేశాలలో తిరుగుతూ ఆత్మాన్వేషణకై తీవ్రమైన ధ్యానములో కాలం గడపటం గమనించి ఎంతో ఆశ్చర్యపడ్డాడని, పూజ్య స్వామీజీని వెతుక్కుంటూ వచ్చి గాఢమౌన ధ్యానంలో లీనమయిపోయిన స్వామీజీని దర్శించుకుని ఆయన ధ్యానంలోంచి బయటికి వచ్చేంతవరకు ఓపిగ్గా ఎదురుచూస్తూ కూర్చున్నాడు. స్వామీజీ ఆ రష్యా వ్యక్తి సందేహాలన్నింటికి ప్రశాంతంగా జవాబిచ్చారు. ఆయన స్వామీజీతో

ఒక గంట సమయం గడిపి ఎంతో శాంతిని పొందానని కనబడిన ప్రతి వ్యక్తికి తన అనుభవాన్ని చెప్పుకున్నాడు.

ఎందరో సాధు మహాత్ములు మన పూజ్య స్వామీజీ గురించి ఎంతో ప్రేమతో గౌరవంతో ఎన్నో విషయాలను వివరించారు. వారందరూ స్వామీజీ ఇంత తక్కువ సమయంలో ఎన్నో అద్భుతాలు సాధించారని, వారిని వదిలివెళ్ళిన తర్వాత తోటపల్లి కొండల్లో శాంతి ఆశ్రమాన్ని నిర్మించి జాతి, మత, కుల బేధము లేకుండా సత్యాన్వేషకులందరికి, సాధకులకు, శాంతిని కోరుకునేవారందరికి మార్గదర్శనం గావించారని కొనియాడారు. భగవంతుడు ఒక్కడే అనేక రూపాల్లో ఉంటాడు. అతడినే మనము బ్రహ్మము, అల్లా, బుద్ధుడు, తావో, అహుర్, ఎహోవా ఇలా రకరకాలుగా పిల్చుకుంటున్నాము. హృదయాంతరాళాల్లో కొలువై ఉండే ఈశ్వరుడు ఒక్కడే. మనమందరము ఒక్కటే. అన్ని మతాల సారాంశము, ప్రాథమిక సూత్రము ఒక్కటే అని గ్రహించాలి.

శ్రీ శివానంద మహరాజ్ గారు ఎంతో ప్రేమతో అన్ని ఏర్పాట్లు చేసి వారి ఆశ్రమానికి ఆహ్వానించారు. స్వామి స్వరూపానంద గారు అందుకు సహకరించారు. మన పూజ్య స్వామీజీ ఆశ్రమంలోని స్వామీజీలు, యోగులు, మహనీయులయిన సాధకులందరికి ప్రణామాలు సమర్పించి చాలా పెద్ద మొత్తంలో గుమిగూడిన భక్త సందోహాన్ని ఉద్దేశించి చక్కని స్ఫూర్తిదాయకమైన ప్రవచనాలు అందించారు. శ్రవణం చేసిన వారందరూ ఎంతో ఆనందించారు.

సాధు మహాత్ములు, యోగులు, వేదాంతములో ఉన్నత స్థానంలో ఉన్నవారిని ఉద్దేశించి, వారి ముందు ప్రసంగించటము అంత తేలికయిన విషయం కాదు. మన స్వామీజీ ఈ సన్నివేశాన్ని ఎంతో ప్రశాంతంగా స్వీకరించారు. పరమాత్మ ఆయన నాలుక ద్వారా పలికాడు అనిపించే విధంగా ఏదో ఒక భగవత్ శక్తి, పవిత్రమయిన జ్యోతి అందరి హృదయాల్లో వెలిగింది. ఎందుచేతనంటే స్వామీజీ ప్రవచనములోని ప్రతి పదము ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉండి వినేవారి హృదయాలలో తరంగాలను సృష్టించింది. ఒక అద్భుతమయిన సందేశము వెలువడింది. ప్రతి ఒక్కరి హృదయము పులకించిపోయింది.

స్వామీజీ ఇతర సాధు సంతులను ఉద్దేశించి ఈ విధంగా ప్రసంగించారు. “మనమందరము ఇక్కడ సమావేశమయ్యాము. ప్రపంచమంతా మనలను సాధువులు,

సంతులు, మహాత్ములు అని సంబోధిస్తుంటుంది. నిజంగా మనము అలాగే ఉంటున్నామా! అదే నిజమయితే ఈ ప్రపంచంలో ఇంకా ఇంత అజ్ఞానము, దౌర్జన్యము, బాధలు, క్రూరత్వము ఎందుకున్నాయి? మనము ఏమి చేస్తున్నాము? మనలో ఆత్మజ్యోతి ప్రకాశించటం లేదా? ప్రపంచమంతా సత్యమనే మకరందాన్ని గ్రోలటానికి ఆకలి దప్పులతో ఎదురుచూస్తోంది. అలాగే జీవిత సత్యాన్ని గ్రహించాలనుకునేవారు మనలను భగవంతునికి ప్రతినిధులుగా భావిస్తుంటారు. అలాగే సనాతన ధర్మజ్యోతిని జాగ్రత్తగా పరిరక్షిస్తామని మనపైన నమ్మకంతో ఉంటారు. అందువలన మనము ఆ జ్ఞాన జ్యోతి మనలో నిరంతరము ప్రకాశించే విధంగా సాధనలు, ప్రయత్నాలు చేయాలి కదా! ఆ పరంజ్యోతి మన హృదయంలోనే నెలకొని ఉన్నదనే సత్యాన్ని ముందుగా మనము అనుభవంలోనికి తెచ్చుకున్నప్పుడే ఈ ప్రపంచంలోని సమస్త మానవాళి అంతా, మనవైపు ఆశతో ఎదురుచూస్తోంది, నిజమయిన ప్రేమపూర్వకమయిన ఒక సర్వస్వం. నిజమయిన జీవిత సత్యాన్ని తెలుసుకోవటం కోసం దివ్యమయిన ఆనందానుభవం కోసం బ్రహ్మానుభూతిని పొందటం కోసం భగవదనుభూతిని నిత్యసత్యమయిన దైవానుభవం కోసం మాటలకు, ఆలోచనకీ అతీతమయిన స్థితిని మనము వారికి అందించగల్గుతాము అనే నమ్మకంతో మనవైపు చూస్తున్నారు.

హా! అందువలన మహాత్ములారా! దయచేసి మేల్కోండి! గ్రహించండి. మనలో మనకు విబేధాలు, ఈర్ష్యాద్వేషాలు, భేదాభిప్రాయాలు, అభిప్రాయభేదాలు, విభిన్న సంప్రదాయాలు, భిన్న ఆచారాలు ఎన్నయినా ఉండవచ్చును. ఇంకా అవన్నీ మన హృదయంలో పేరుకొనిపోయి ఉంటే గనుక మనము ఎంతో కాలము నుండి భగవంతుని ఆరాధిస్తూ, ఆయన ప్రేమ, అనుగ్రహము అనే జ్యోతిని పొందాలంటే వాటన్నింటిని సమూలంగా శుభ్రం చేసుకోవాల్సి ఉంటుంది లేదా వదిలించుకోవాల్సి ఉంటుంది.

సూర్యసమాన తేజోవంతమయిన పవిత్రమయిన కాషాయ వస్త్రాలు ధరించి, అలాగే బాహ్యమయిన పవిత్రతను సూచించే గుర్తులను ధరించి మనము పరమాత్మ ప్రతినిధులుగా ఉన్నందుకు, మన ధార్మికతను, దివ్యత్వాన్ని సంపూర్ణంగా సద్వినియోగము చేయటానికి మనము చేసిన ప్రతిజ్ఞను తిరిగి ఒక్కసారి గుర్తు చేసుకొందాము. మనమందరము ప్రపంచానికి మార్గదర్శనం చేయటానికి జ్ఞానదీపికల్లా జీవిస్తూ, ప్రపంచానికంతటికి ఆ

జ్ఞాన జ్యోతి వెలుగులను ప్రసరింపచేసి అందరిలో ప్రేమ, శాంతి సామరస్యాలను నెలకొల్పుదాము. ఓం శాంతి... శాంతి... శాంతి...

## తునిలో పర్యటనలు

శాంతి ఆశ్రమానికి సుమారుగా ఇరవై మైళ్ళ దూరంలోని తుని అనే చిన్ని పట్టణంలో ఆశ్రమ భక్తులయిన వ్యాపారులు చాలా మంది ఉండేవారు. డా॥ జి. అప్పారావు మరియు వారి సతీమణి ఆశ్రమానికి బాగా పాత భక్తులే కాకుండా ఆశ్రమ శ్రేయోభిలాషులు. వారి పిల్లలు కూడా మంచి భక్తులు. నేను వారింటికి వెళ్ళినప్పుడు వారు నా దగ్గరే ఎక్కువ సమయం గడపటానికి ఇష్టపడేవారు. వారిలో చిన్నవాడు హన్ను నాతో పాటు, ఆశ్రమానికి వచ్చి దాదాపు రెండు సంవత్సరాలు ఆశ్రమంలోనే ఉన్నాడు. ఇప్పుడు కూడా అతను తరుచుగా ఆశ్రమానికి వచ్చి వెళుతూ ఉంటాడు. అతని తల్లిదండ్రులు ఆశ్రమానికి సేవ చేయడానికి నాకు ఇచ్చి వేశారు. ఎందువల్లనంటే అతనికి పుట్టుకతోనే ఆధ్యాత్మిక సంస్కారం అబ్బింది. కాని రెండు సంవత్సరాలు అతను ఆశ్రమసేవలో గడిపిన తర్వాత అతని తల్లిదండ్రులకు వారి బిడ్డ సన్న్యాసి అయిపోతాడని భయం వేసింది. అందువలన వారు అతడిని ఇంటికి తీసుకు వెళ్ళిపోయి పాఠశాలలో చేర్పించారు. ఆ చిన్ని హన్ను ఇప్పుడు హనుమంతరావు. గొప్ప ఇంజనీరు, మంచి ఆస్తిపరుడు అయినా చిన్నతనంలో ఆశ్రమానికి ఏ విధంగా భక్తుడుగా ఉండి సేవ చేశాడో అలాగే చేస్తున్నాడు.

'రాఘవ', ఆయన కుమార్తె కూడా నాతోనే ఆశ్రమంలో ఉండి ఆశ్రమానికి సేవ చేస్తూ 'యోగిని'లాగా జీవితం గడిపేది. ఆమె తల్లిదండ్రులు కూడా ఆమె వివాహం చేసుకోకుండా యోగినిలాగా భగవంతుని సేవలోనే జీవితం గడుపుతుంది అని భావించేవారు. కాని నేడు ఆమె చాలా గొప్ప ధనవంతురాలు, చాలా మంది పిల్లలు, మనుమలు, మనుమరాళ్ళతో జీవితం గడుపుతున్నా ఆశ్రమానికి మంచి భక్తురాలుగా ఉండటమే కాకుండా ఆమె నివసించే గ్రామంలో 'విశ్వనాధ ఆశ్రమం' అనే పేరుతో సొంతంగా ఒక ఆశ్రమాన్ని స్థాపించి నిర్వహిస్తోంది.

నేను తునిలో బస చేసినప్పుడు ఒక రోజు సూరమ్మ అనే వృద్ధురాలయిన తపస్వినిని చూడడానికి వెళ్ళాను. ఆమె అప్పటికే ఎనభై ఏళ్ళ వృద్ధురాలు. మాతృ ఆశ్రమము ప్రారంభము అయిన దినాల్లో చిన్న పూరిపాకలో చాలా సాధారణమయిన జీవితాన్ని

గడుపుతూ అక్కడ వెలసిన పాముపుట్టలోని సుబ్రహ్మణ్యస్వామి అవతారంగా భావించబడే పామును ప్రతిరోజూ పూజిస్తూ తపస్సు, ధ్యానములో కాలం గడిపేది. ఇక్కడికి వచ్చిన మొట్టమొదటి స్త్రీ ఆమె. ఇప్పుడు ఆమె బాగా వయస్సు మీరటం వలన నడవలేకపోతున్నది. చూపు కూడా సరిగ్గా లేదు. ఆమెను సంతోషపెట్టడానికి నేను ఆమె వద్దకు వెళ్ళాను. నేను ఆమె ఇంట్లో ఉండగా గోడ మీద చాలా పెద్ద మండ్రగబ్బ కనిపించింది. అక్కడున్నవారు దాన్ని చూచి భయపడిపోయి, దాని చంపివేయడానికి ప్రయత్నించారు. దానిని చావు నుండి రక్షించాలని భావించి నేను వారితో దానికి ఎలాంటి హాని చేయవద్దని చెప్పి, వారించి దాన్ని అక్కడి నుండి సురక్షితంగా దూరంగా తీసుకువెళ్ళి వదిలిపెట్టాలని భావించి, నెమ్మదిగా దాని తోక పట్టుకున్నాను. కాని దురదృష్టవశాత్తూ నేను దాన్ని సరిగ్గా గట్టిగా పట్టుకోలేకపోవడం వలన అది నన్ను కుట్టటం వలన భరించరాని బాధ కల్గింది. ఇలాంటి చిన్న సంఘటనలు ఎప్పటికీ మరచిపోలేము. జీవితాంతము వరకూ అవి గుర్తుండిపోతాయి. ఇరువై నాలుగు గంటలు గడిచినా, చల్లని నీటిలో, వేడి నీటితో కాపటం పెట్టడం లాంటి ఉపచారాలు ఎన్ని చేసినా తేలు కుట్టటం వలన కల్గిన దుర్భరమైన బాధనుండి ఉపశమనం లభించలేదు. మేము వచ్చిన కారులోని బ్యాటరీ నుండి తేలు కుట్టినచోట చాలాసార్లు కరెంటు పెట్టినా లాభం లేకపోయింది. రోజంతా ఆ దుర్భరమయిన బాధను భరించక తప్పలేదు. దేని నుండి మనము తప్పించుకోలేమో దానిని ఓపిగ్గా భరించక తప్పదు. కొన్ని సార్లు మనము ఇతరులకు మేలు చేసి వారిని రక్షించడానికి ప్రయత్నం చేసినప్పుడు, దాని ఫలితం బాధగా, నిరాశగా పరిణమించవచ్చు.

తుని హైస్కూలు ప్రధానోపాధ్యాయులు గారు నాకు బాగా మంచి స్నేహితుడు. ఆశ్రమ భక్తుడు. ఆయన తరుచుగా ఆశ్రమానికి వస్తూ ఉండేవారు. వారు నన్ను వారి పాఠశాలకు వచ్చి తన తోటి ఉపాధ్యాయులకు, విద్యార్థులకు సందేశాన్ని ఇవ్వవలసిందిగా పదే పదే కోరారు. అలాగే చాలా మంది భక్తులను కూడా పిలిచారు. అందువలన చాలా పెద్ద సమూహం తయారయింది. నా ఉపన్యాసం జరుగుతున్నంత సేపు సూది మొన క్రింద పడినా కూడా వినిపిస్తుందేమో అన్నంత నిశ్శబ్దంగా ఉన్నారు. ఆ రోజు నాకు తుని శాఖను నిర్వహిస్తున్న కార్యకర్తలకు చాలా ఆనందకరమయిన రోజు అని చెప్పి తీరాలి. భగవంతుని ఆశీర్వాదము వలన నేను అక్కడి యువ విద్యార్థుల హృదయంలో, అలాగే ఉపాధ్యాయుల హృదయంలో మంచి స్థానం పొందాను. చాలా సరళంగా ప్రేమ, శాంతి సందేశాలను వారికి అందించగలిగాను.

తునిలో ఒక హరిజన కుటుంబం వారు ప్రతి సమావేశానికి హాజరయ్యేవారు. తరుచుగా సంకీర్తనల్లో పాల్గొనేవారు. క్రమంగా వారు మంచి భక్తులుగా మారిపోయారు. వారు మాంసము, చేపలు మొదలైన మాంసాహారాల్ని వదిలివేసి శాకాహారులుగా మారి మద్యం ఇతర మత్తు పదార్థాలను వదిలిపెడతామని ప్రతిజ్ఞ చేశారు. ఆ విధంగా ఆ హరిజన కుటుంబం వారు వారి కులంలో నుంచి మార్గదర్శకులుగా ఉండేవారు. వారు శుచి శుభ్రతను పాటిస్తూ మంచి బ్రాహ్మణ కుటుంబంలో పుట్టిన వారిలాగానే జీవించేవారు. ప్రతి రోజు చక్కగా స్నానం చేసి ఉన్నతమయిన సంస్కారము గల భక్తుల్లాగా శ్రీరాముడు, శ్రీకృష్ణుడు మొదలైన అవతార పురుషులను పూజిస్తూ, నామాలు ధరించేవారు. ఆ విధంగా వారు స్వేచ్ఛగా, వారికి నచ్చిన విధంగా ఉన్నతమయిన జీవన విధానాన్ని అలవర్చుకున్నారు. నామరూపాలన్నీ చివరికి ఒకే గమ్యమయిన పరమపథానికి చేరుస్తాయి. సచ్చిదానంద స్వరూపమే అసలయిన గమ్యము. అదే ఏకైక అస్తిత్వము. జ్ఞాన స్వరూపము, పరమానందస్థితి అని గ్రహించటమే నిజమయిన జ్ఞానము.

తుని గ్రామం నుండి ఒక రోజు దాదాపు అరవై మంది హరిజనులు పెద్ద బృందంగా నడుచుకుంటూ మాతృసంస్థ తోటపల్లి కొండల్లోని శాంతి ఆశ్రమానికి రావటం అందరిని ఆకట్టుకుంది. దాదాపు నలభై మైళ్ళు దూరం వాళ్ళ సంకీర్తనలు, భగవంతుని నామ జపము చేసుకుంటూ నడిచి వచ్చారు. ముప్పై ఐదు సంవత్సరాల కాలం గడిచిపోయినా ఆ సంఘటన ఇంకా నాకు బాగా గుర్తుంది. అది నాకు ఎంతో సంతోషాన్ని, ఆనందాన్ని కలిగించింది.

తర్వాత శాంతి మిషన్‌ని నిర్వహిస్తున్న శ్రీ శాంతి ఆశ్రమము వారు 'నిమ్నజాతి వారు' అనే చిన్న పుస్తకాన్ని ప్రచురించి చక్కని సందేశాన్ని అందించారు. నిమ్నజాతుల వారిని అంటరానివారుగా భావించే ఆ రోజుల్లో జాతిపిత భారతదేశానికి తండ్రి, మహాత్మాగాంధీ నిరాశా నిస్పృహలతో అణగారిపోతున్న నిమ్న జాతుల వారిని ఉద్ధరించడానికి కంకణబద్ధులై కోట్లాది రూపాయాలను విరాళంగా సేకరించి ఆ ధనాన్ని నిమ్నజాతుల వారి పురోభివృద్ధికి, చదువు కోసం వినియోగించారు. భారతదేశంలో ఆ రోజుల్లో మహాత్మాగాంధీ గారు నిమ్నజాతుల వారిని పైకి తీసుకువచ్చి, వారి గౌరవాన్ని పెంచటానికి వారిని భగవంతుని బిడ్డలు అనే అర్థం వచ్చే విధంగా 'హరిజనులు' అని పేరు పెట్టారు.

**'నిమ్నజాతి - వేదాంత సారము'** అనే పుస్తకంలో ఉన్నతమయిన సత్యాన్ని వెలుగులోనికి తీసుకురావడానికి ప్రయత్నం జరిగింది. వాస్తవానికి 'నిమ్నజాతి'ని కొందరు స్వార్థపరులు సృష్టించారు అనేది సత్యమయినది. ఎవరయితే తనను తాను ఉన్నతమయిన వ్యక్తిగా భావించుకుని తన చుట్టూ జైలు గోడలు సృష్టించుకొని ఇతరులను అంటరానివారుగా, నిమ్నజాతి వారుగా భావిస్తాడో అతడే నిజానికి అందరు జాలి పడాల్సిన వ్యక్తిగా, నిమ్నజాతి వాడిగా తయారవుతాడు అనే వాస్తవాన్ని ఆ గ్రంథంలో సందేశంగా అందించడం జరిగింది.

ఓం...ఓం..ఓం..

**అధ్యాయం - 42**

# మళ్లీ ఒళ్లంతా కట్లు

## శాంతి పత్రిక, మార్చి - ఏప్రిల్, 1936 ఆశ్రమ వార్తలు

పూజ్య స్వామీజీ మళ్ళీ అమెరికా వెళ్ళేముందు ఆయన స్నేహితులయిన వైద్యులు తుంటి ఎముకకి ఒకసారి ఎక్స్‌రే తీయించుకోవాల్సిందిగా సలహా ఇచ్చారు. క్రితం పర్యాయం అమెరికా వెళ్ళినప్పుడు జారి పడిపోయినప్పుడు స్వామీజీ తుంటి ఎముక విరగటం వలన, అది మళ్ళీ ఇబ్బంది పెట్టడం మొదలయింది. ఎక్స్‌రేలో వారి తుంటి ఎముక సరిగ్గా అతుక్కోలేదని తేలింది. డాక్టరు కిని, డాక్టరు రావు గార్లు స్వామీజీకి వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం ఆపరేషన్ చేయాలని నిర్ణయించారు. తుంటి నుండి ఎముక పూర్తిగా పక్కకి తొలగిపోయినా కేవలం కండరాల సహాయంతో స్వామీజీ సంతోషంగా ఎలా పరిగెత్త గల్గుతున్నారా అని ఆ డాక్టర్లు ఆశ్చర్యపడ్డారు.

స్వామీజీకి ఆపరేషన్ చేయాలి అనే వార్త విని మేమందరము తీవ్రమయిన విచారంలో మునిగిపోయాము. మన ప్రియతమ పూజ్య స్వామీజీ, తన అసాధారణమయిన వేదాంత ధోరణిలోనే ప్రవర్తించేవారు. వారు వ్రాసిన వ్యాసము విశ్రాంతిలో మనకు వారి అనుభవాలను సవివరంగా తెలియచేస్తాయి. ఆపరేషన్ తర్వాత వైద్యశాలలో వారి



అనుభవాలు అందులో పొందుపర్చబడ్డాయి. సోదరి సుశీలాదేవికి ధన్యవాదాలు వాటన్నింటిని అతి జాగ్రత్తగా సేకరించినందులకు అంతేకాక ఆమె స్వామీజీకి ఎన్నో సేవలందించారు. అతి జాగ్రత్తగా, ఎంతో ప్రేమతో ఆమె స్వామీజీకి అందించిన సేవల వలన వారు త్వరగా కోలుకొన్నారు.

ఆ సర్వేశ్వరుడు స్వామీజీ కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిపించేందుకు మంచి సామర్థ్యము గల ఉత్తముడైన వైద్యుడు కిని గారిని అతని అనుయాయులను ఎంచుకున్నాడని మేమందరము భావిస్తున్నాము. దాని వలన స్వామీజీ స్వేచ్ఛగా, స్వతంత్రంగా నిశ్చింతగా తమ శాంతి కార్యక్రమాలను నిర్వహించగల్గుతారు. స్వామీజీ స్నేహితులు, ఆయనను పూజించేవారు, ఆరాధించేవారు, భక్తులు, తూర్పు పడమర దేశాల్లోని వారి అనుయాయులు అందరూ కూడా వారి ఆరోగ్యం కోసం మాతో కలిసి ప్రార్థనలు చేయాలని కోరుకుంటున్నాము.

**మన పూజ్య స్వామీజీ**

భగవంతుని అనుగ్రహం వలన నా అదృష్టం చేత నేను సురక్షితంగా ప్రత్యేకమయిన విభాగంలోనికి తీసుకురాబడ్డాను. విశాఖపట్టణంలోని కింగ్‌జార్జి వైద్యశాలలోని మా కోసం కేటాయించబడిన ప్రత్యేకమయిన గదిలో విశ్రాంతి తీసుకుంటూ అనంతమయిన శాంతిని పొందటం నా అదృష్టదేవత ప్రసాదించిన ఆశీర్వచనం. స్వర్గలోకపు దేవతలు నా మీద బంగారు కిరణాలతో అనుగ్రహ వర్షాన్ని రోజు రోజుకి గుమ్మరిస్తున్నట్లుగా నేను అనుభూతి చెందాను. మంచం మీద పడుకొన్నా పక్కనే ఉన్న కిటికీలో నుండి బయటి ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ తల్లి ఒడిలో పడుకున్నంత ప్రశాంతంగా కాలం గడిపేవాడిని. చాలా పెద్ద కిటికీలోనుండి విశాలమయిన వినీలాకాశం, బారులు తీరిన కొండల వరసలు, పెద్ద పెద్ద వృక్షాలు, పచ్చని పొదరిళ్ళు కంటికి ఆహ్లాదాన్ని కలిగించేవి. సూర్యోదయం కాగానే సూర్య భగవానుని లేలేత బంగారు కిరణాలు నవ్వుతూ నా మంచం మీదుగా నాట్యం చేస్తున్నట్టుగా పరుచుకునేవి. సూర్యాస్తమయ సమయంలో కొండల్లోకి సూర్యుడు దిగిపోవడం చూస్తూ గడిపేవాడిని. దగ్గరలోనే ఉన్న సముద్రపు అలలు ప్రతినిత్యం 'ఓంకారాన్ని' జపిస్తుండేవి. సముద్రము మీద నుండి వీచే పిల్లగాలుల్లో నిండిన ఉప్పు వాసన చల్లని మలయమారుతంలా నన్ను పలకరిస్తూ ఉండేది. నాకు వైద్య సేవలు అందించిన ఎందరో నిపుణులయని మంచి వైద్యులు, నిస్వార్థంగా సేవలు

చేసిన నర్సులు, వారి ప్రేమానురాగాలు, మంచితనము, దయాగుణము, శ్రద్ధ తల్చుకొని నా హృదయం వారి పట్ల ఎంతో కృతజ్ఞతాభావంతో నిండిపోయింది.

నాలుగు రోజులు అన్నివిధాలమయిన పరీక్షలు చేసిన అనంతరము మార్చినెల 5వ తేదీన నన్ను ఆపరేషన్ థియేటర్‌లోనికి తీసుకువెళ్ళి మత్తు మందు ఇచ్చారు. అప్పుడు నేను ప్రశాంతంగా శ్వాస తీసుకొని వదులుతూ ప్రాణాయామ క్రియలు చేశాను. నెమ్మదిగా మత్తు నన్ను ఆవరిస్తుండగా నా ఆలోచనలు దివ్యజ్యోతి స్వరూపం మీద స్థిరంగా నిలిపి అందులో నన్ను నేను విలీనం చేయడానికి ప్రయత్నించాను.

నేను నెమ్మదిగా కళ్ళు విప్పే సమయానికి నేనింకా ఆ దివ్యానుభూతిలో ఉండి పోయాను. సుశీలాదేవి, నా జీవితానికి గొప్ప వరంగా శాంతి ఆశ్రమానికి వరంగా అనుగ్రహింపబడిన తల్లి, నెమ్మదిగా నా మీదకి వంగి నవ్వుతూ నా ఆపరేషన్ విజయవంతంగా జరిగినందుకు నాకు శుభాకాంక్షలు తెలియచేసింది. దాదాపు 45 నిముషాలు నేను మత్తులో ఉన్నట్లు తెలిసింది. చాలా పెద్ద గాటు పెట్టి ఎముకను రంపముతో కోసి మళ్ళీ తుంటి ఎముకకి అతికించారు. తుంటి భాగము నుండి కాలి బొటనవేలి వరకు సిమెంటు కట్టు వేశారు. ఆ విధంగా భయంకరమయిన, భయాన్ని కలిగించే ఆపరేషన్ చాలా విజయవంతంగా ముగిసింది. కట్లతో ఇప్పుడు ఇక్కడ నేను ఒక క్రొత్త అవతారం దాల్చినట్లుగా ఉంది. తాబేలు తన అవయవాలను చిప్పలో దాచుకున్నట్లుగా ఉంది నా పరిస్థితి. అయినా నేను తూర్పు, పడమరల్లోని శాంతి సభ్యులు, స్నేహితులు, సన్నిహితులు, భక్తులు, సాధకులు, శాంతి పత్రికను ఎంతో ప్రేమాభిమానాలతో చదివే పాఠకులతో నా సంతోషాన్ని, ఆనందాన్ని, శాంతిని పంచుకుంటున్నాను. ఈ విధంగా పన్నెండు రోజులు ప్రశాంతంగా గడిచిపోయాయి. నేను చెపితే బహుశా మీరు నమ్మకపోవచ్చు గాని ఈ దినాల్లో నేను నా శరీరంలో ఆపరేషన్ వలన కలిగిన గాయపు బాధ గాని లేకుండా కుట్లు వలన ఎముకకు అతకడం వలన కలిగే బాధ గాని లేకుండా అలాంటి సమయంలోగాని ఏ విధమయిన ఆందోళన లేకుండా ఎంతో ప్రశాంతంగా కాలం గడిపాను. భగవంతుడు మనతోనే ఉన్నప్పుడు మనకు ఎలాంటి ఇబ్బంది, వ్యతిరేకత ఉండదు కదా! అంతా ఆ పరమాత్మ దివ్యానుగ్రహమే అని భావించి సంతోషంగా ఉన్నాను.

నిజమయిన బాధ ఏదయినా ఉంటుంది అంటే అది నా వరకూ కేవలం ప్రియాతి ప్రియతముడు హృదయేశ్వరుడు, విశ్వాన్ని అంతటిని నియంత్రించే నియంత అయిన సర్వేశ్వరుడినుండి ఎడబాటు మాత్రమే అవుతుంది. పరమాత్మను మర్చిపోవటము, నిర్లక్ష్యం చేయటం, ఆత్మ స్వరూపాన్ని, జీవిత పరమార్థాన్ని వదలుకోవటాన్ని మించిన వేదన మానవునికి ఇంకేముంటుంది? ఇతరమయిన చిన్న చిన్న బాధలు, వేదనలు, మరణము వంటి సంవేదన పరమాత్మ ఐక్య అనుభూతి నుండి, సత్యం నుండి దూరము కావటం కన్నా గొప్ప బాధ కాదు కదా! మిగిలినవన్నీ గాలికి కదిలిపోయే మేఘాల వంటివి.

ఏదయినా అసౌకర్యం ఉంది అంటే అది కేవలం ఆ వైద్యశాలలోని ఇతర రోగుల బాధలను చూచినప్పుడు ఏర్పడినదే అని చెప్పవచ్చును. వారిలో కొందరు చాలా భయంకరమయిన బాధలను, ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. నిజంగా ఇక్కడి వైద్యులు ఎంతో సహృదయులు, ఆధ్యాత్మిక చింతన కలవారు కూడా కావటం వలన అద్భుతమయిన సేవలు అందిస్తూ రోగులకు ఉపశాంతి కల్గిస్తున్నారు. వారందరూ రాత్రి పగలు తేడా లేకుండా నిరంతరము, నిస్వార్థంగా ఆ పరమాత్మనే సేవిస్తున్నారు. అక్కడి మూగవారు, గుడ్డివారు, బలహీనులు, దుర్భలులు అయిన రోగుల సేవలో వారు తరిస్తున్నారు.

నా చుట్టూ ఉన్న మానవాళి పడుతున్న కష్టాలు, భౌతికమయిన బాధలు గమనించిన తర్వాత, ఇక్కడి వైద్యశాలలో వారికి వెంటనే అందుతున్న సేవలు, వైద్యము గమనించిన తర్వాత 'వైద్యో నారాయణ హరిః' అన్నట్లుగా ప్రాణదాతలు అయిన, నిస్వార్థపూరిత సేవలందించే వారు నిజంగా దేవతలుగా అనిపించారు. వారి ముందు నేను ఎంత అనిపించ సాగింది. వారు వైద్యవృత్తి నిపుణులు, విరిగిపోయిన ఎముకలను ఎంతో నైపుణ్యంతో అతికించగల్గిన సర్జన్లు. దానికి ఎంతో కృషి, పట్టుదల, దీక్ష, తెలివితేటలు, దక్షత అవసరమవుతుంది. ఎంతో అంకితభావంతో వైద్యులు అందించే సేవల ద్వారా వారు భగవంతుని చేతిలో చక్కని పనిముట్లుగా తయారవుతున్నారు. పరమాత్మ తన లీలలను, అనుగ్రహాన్ని, ఆశీస్సులను వైద్యుల ద్వారా అందిస్తున్నాడు అన్నది సత్యము కాదా!

అజ్ఞానం నుండి విడుదల పొందటం అనేది అపురూపమయిన అనుగ్రహించబడిన క్షణాలు. బంధనము అనేది కేవలము శరీరంపైనున్న సిమెంటు కట్టు మాత్రమే కాదు. మన భౌతిక శరీరమే తన తొడుగు లాంటిది. కేవలము కొద్ది మంది అరుదయిన ఆత్మ

స్వరూపాలు మాత్రమే అన్ని బంధనాల నుండి, తొడుగులనుండి విముక్తులు కాగలుగుతారు. అది మాటల్లో వర్ణించలేని అద్భుతమయిన అనుభవము, స్వేచ్ఛ, ఆరోగ్యం అన్ని బంధనాలనుండి విముక్తి పొందిన తేజోమూర్తులకే లభిస్తుంది.

'బంధనము' అనే పదము వినగానే దాని వలన కలిగే అనేక విధాలయిన ఇబ్బందులు, కష్టాలు గుర్తుకువస్తాయి. నిజానికి మనము ఒంటి నిండా కట్లతో మంచానికి కొంతకాలము పరిమితమయిన వాళ్ళను చూచి జాలి పడాల్సిన పని లేదు. వారి కంటె కట్టుబాట్లు, కులము అనే బంధనానికి బానిసలయిపోయిన వాళ్ల మీద ఎక్కువగా జాలి పడాల్సి ఉంటుంది. వీరు ఆత్మజ్ఞానానికి కన్నా సాంఘిక కట్టుబాట్లకి, ఆచార సంప్రదాయాలకి, జాతి, మతము, కులము మొదలైన వాటికి ఎక్కువ ప్రాధాన్యమునిస్తారు. అదే వారిని బంధనంలో చిక్కుకుని బాధపడేలా చేస్తాయి. అందువలన అలాంటి బంధనాలనుండి విముక్తి పొందటానికి ప్రయత్నించాలి. పరిస్థితులకు లొంగిపోయి ఆత్మనూన్యతకు ఎవ్వరూ గురికాకూడదు. విధివశాత్తూ ఇబ్బందులు ఏర్పడినా, శరీరానికి గాయం ఏర్పడి ఎముకలు విరిగి, రక్త మాంసము కారి కట్టుకట్టుకోవాల్సి వచ్చినా దాని గురించి బాధ పడాల్సిన పని లేదు. అదంతా తాత్కాలికమే. నెమ్మదిగా అవన్నీ మానిపోతాయి.

ఈ రోజు నన్ను చక్రాల కుర్చీలో కూర్చోబెట్టుకుని మళ్ళీ ఆపరేషన్ థియేటర్‌లోనికి తీసుకువెళ్ళారు. దయామయుడయిన వైద్యుడు నా తుంటి ఎముకకి ఆపరేషన్ చేసిన చోట ఎక్కడ కుట్లు వేశారో అక్కడ బెజ్జం పెట్టి పరీక్షించాడు. గాయం పూర్తిగా మానిపోయింది. అందువలన తొందరలోనే కుట్లు కూడా తీసివేశారు. తర్వాత నన్ను ఎక్స్‌రే గదిలోనికి చక్రాల కుర్చీలోనే తీసుకువెళ్ళి కొత్తగా అతికిన తుంటి ఎముక సరిగ్గా ఉందో లేదోనని పరీక్షించడానికి ఎక్స్‌రే తీశారు. మాకు ఎంతో సంతోషాన్ని కలుగజేస్తూ శుభవార్త తొందరగానే వచ్చింది. ప్రేమమూర్తి, మంచి భక్తిపరుడు, రేడియాలజిస్టు, ఎక్స్‌రే డిపార్టుమెంట్ అధిపతి నా తుంటి ఎముక చాలా బాగా అతుక్కుందని ప్రకటించాడు. ఆపరేషన్ చేసిన సర్జను ఏదయితే కోరుకున్నాడో అది నెరవేరింది. డాక్టరు గారు చాలా సంతోషించారు. అలాగే సుశీలాదేవి ఆనందానికి అవధులు లేవు. ఆమె కలలు, ఆశలు అన్నీ సాకారము అయ్యేందుకు అవకాశము ఏర్పడినందుకు దివ్యానందంలో మునిగిపోయింది. నేను అలాగే పడుకుని కళ్ళలో ఆనంద బాష్పాలతో చూస్తుండిపోయాను. నా హృదయం కృతజ్ఞతాభావంతో నిండిపోయింది. ఆపరేషన్ జరిగినప్పుడు, కుట్లు

విప్పినప్పుడు, బాధలు అనుభవించినప్పుడు నా కళ్ళలో నీరు రాలేదు కాని ఇప్పుడు ఆపరేషన్ విజయవంతమయింది అనే వార్త విన్నప్పుడు ఆ పరమాత్మస్వరూపుడి దివ్యానుగ్రహాన్ని తలుచుకొని కృతజ్ఞతతో నా కళ్ళలో నీరు తిరిగింది. నా హృదయం అరిచి పెద్దగా చెపుతోంది ఆ భగవంతుని అనుగ్రహాన్ని తలుచుకొని. వైద్యుడు ప్రకాశ వంతమయిన నవ్వు ముఖంతో నా వద్దకు సంతృప్తిగా వచ్చి చెప్పినప్పుడు నేను నెమ్మదిగా మృదువుగా "నా హృదయపూర్వక ధన్యవాదాలు మరియు మీకు శుభాకాంక్షలు" అని చెప్పాను. ఆయన మాత్రం దానికి పెద్దగా స్పందించలేదు, ఎంతో వినయంగా, ప్రశాంతంగా నవ్వుతూ "అంతా దైవానుగ్రహము" అన్నాడు.

ఇక ఇప్పుడు నన్ను ప్రత్యేకమయిన వార్డులోనికి మార్చారు. తిరిగి నేను ప్రశాంతంగా నా పవిత్రమయిన దేవాలయములో ఉన్నట్లుగా, ఆనందంగా, ఆహ్లాదంగా చల్లని సముద్రపు గాలులను ఆస్వాదిస్తూ, జీవ ప్రదాత అయిన సూర్య భగవానుడి ప్రకాశవంతమయిన సూర్యకిరణాలలో తడుస్తూ కాలం గడపసాగాను. ప్రతి రోజు నా మంచంపై పడుకుని సూర్యాస్తమయాన్ని తిలకిస్తూ మెత్తని పరుపును గులాబీల మంచంగా భావిస్తూ ఉండేవాడిని. సూర్యుడు బంగారు రంగులో మెరుస్తున్న బంతిలాగా ఊదారంగు కొండల్లోకి దిగిపోవటం చూస్తూ అంతులేని ప్రశాంతతను అనుభవించేవాడిని.

ఆపరేషన్ చేసిన వైద్యుడు నా వద్దకు వచ్చి "స్వామీజీ! నాకు మీ గురించి ఎంతో గర్వంగా ఉంది. నా కర్తవ్యాన్ని నేను విజయవంతంగా ముగించాను. ఇక ఇప్పుడు మీ వంతు వచ్చింది. ఇంకొక నెలరోజులు మీరు ఈ సిమెంటు కట్టుతో ఉండాలి. తర్వాత అరవై రోజులు చాలా జాగ్రత్తగా కదలకుండా ఉండాల్సి ఉంటుంది" అని చెప్పాడు. అందువలన నేను వెల్లకిలా పడుకోవాల్సి వచ్చేది. కనీసం కుడివైపుకు గాని లేదా ఎడమ వైపుకు గాని తిరిగి పడుకోవాలి అని కలలో కూడా అనుకోలేదు.

ఇప్పుడు నాకు చాలా సమయం విశ్రాంతి దొరకటం వలన నేను నా మనస్సు లోతుల్లో మెదలుతున్న ఆలోచనా తరంగాలను, నా హృదయంలో కదులుతున్న ప్రేమ తరంగాలను, ప్రశాంతతను నా ప్రియమైన స్నేహితులకు, తూర్పు పడమర ఉత్తర దక్షిణ ప్రాంతాల్లోని వారందరితో పంచుకోవాలసుకుంటున్నాను. శాంతి పత్రిక పాఠకులారా! నా చేతులు చాచి మీ హృదయాలను స్పృశిస్తూ చెప్పాలనుకుంటున్నాను. "శాంతి అనేది మీ హృదయాంతరాళాల్లోనే ఉంది'' మీ దేశానికి సేవలందించండి. ప్రపంచ

మానవాళికందరికి శ్రేయస్సు చేకూర్చండి. భగవంతుని దివ్యానుభూతిని ఇప్పుడు, ఎప్పుడూ ఎల్లప్పుడూ కూడా అనుభూతి చెందండి.

కొన్ని వేల మంది, కాదు మిలియన్ల కొద్ది వ్యాధిగ్రస్తులు అనేక వైద్యశాలల్లో ఎన్నో బాధలను అనుభవిస్తూ ఉన్నారు. వారందరి ఉపశాంతి కోసం మీరు ప్రార్థనలు చేయండి. వారికి మీ ప్రేమను మీ నిశ్శబ్దమయిన ప్రార్థనల ద్వారా అందించండి. వారందరూ త్వరగా కోలుకొని ఆరోగ్యవంతులు కావాలని భగవంతుని ప్రార్థించండి. పడిపోయిన వారిని ఉద్ధరించటం కోసం, పేదరికంతో బాధపడుతున్నవారి కోసం ప్రపంచంలోని వారందరికి శాంతి సౌభాగ్యాలను ప్రసాదించమని, తద్వారా ఈ భూమిపై శాంతి నెలకొనాలని, దేశాల మధ్య సౌభ్రాత్రం పెంపొందాలని ప్రార్థించండి.

డా॥ విల్లియన్ డేనియల్ గారికి ధన్యవాదాలు తెలియచేసుకుంటున్నాను. నన్నూ, సుశీలాదేవిని అమెరికాదేశానికి ఆహ్వానించి, అందుకు అవసరమయిన ఏర్పాట్లు చేసినందులకు, తొందరలోనే నేను అమెరికా దేశంలో ఉంటాను. అప్పుడు నేను చక్కగా, స్థిరంగా నా కాళ్ళపై నేను నిలబడగల్గుతాను, నడవగల్గుతాను. నా ప్రేమను, శాంతి సందేశాలను శాంతి ప్రేమికులతో పంచుకోవాలని నా మనస్సు ఉవ్విళ్ళూరుతుంది.

అధ్యాయం - 43

# విశాఖపట్టణంలో క్రొత్త ఆశ్రమ నిర్మాణము

వాల్తేరు దక్షిణ భారతదేశంలోని అందమయిన సముద్రతీరంలో ఒకటి కావటమే కాదు. చాలా ఆరోగ్యవంతమయిన ప్రదేశము కూడా. అక్కడ మా బంధువులు రెడ్నమ్ గారి కుటుంబము ఉండటము వలన నేను నా పాఠశాల చదువు సమయంలో చాలా సంవత్సరాలు గడిపాను. వాల్తేరు బీచ్‌లో ఎన్నో సంతోషకరమయిన దినాలు ప్రశాంతంగా ధ్యానంలో గడిపాను. సుశీలాదేవి భారతదేశానికి వచ్చిన తర్వాత గురుకుల విద్యార్థులతో మేము ప్రత్యేకించి వేసవి కాలంలో తోటపల్లి కొండల్లోని వేడి నుండి ఉపశమనం కోసం వాల్తేరు వస్తుండేవాళ్ళము. అలాంటి సమయంలో ఆశ్రమ భక్తుడు పురుషోత్తమ నాయుడు మాకు రెడ్నమ్ గార్డెన్‌లో ఆతిథ్యం ఇచ్చేవారు. ఆయన ఆయుర్వేద వైద్యంలో సిద్ధహస్తుడు

కావటం వలన మూలికలు, లతలు, చెట్ల నుండి అమూల్యమయిన మందులను తయారుచేసి పేదవారికి, రోగులకు ఉచితంగా వైద్య సేవలు చేసి వారి బాధలను పోగొట్టేవారు. సాధు మహాత్ములను, ఎప్పుడూ సంచారంలో ఉండే యోగులను సేవించి వారి వద్ద నుండి రహస్యమయిన ఆయుర్వేద వైద్యాన్ని నేర్చుకున్నాడు. ఆయన ఇల్లు ఎప్పుడు చూచినా ఎంతో మంది రోగులతో నిండిపోయి ఆయన కోసం, ఆయన అందించే వైద్యం కోసం ఎదురుచూస్తున్న వారితో కనిపించేది.

భగవంతుని అనుగ్రహము వలన నేను చాలాకాలము క్రితమే శారీరక మానసిక వైద్యం చేయటం మానివేశాను. ఇప్పుడు నా మనస్సులో అలాంటి వైద్యం చేయటం పట్ల ఎలాంటి ఆసక్తి లేదు. అంతర్ముఖమయి, ఆత్మానందంలో మునిగితేలుతూ ధ్యానంలో లీనమయ్యేందుకు తహతహలాడుతోంది. ఆ రోజుల్లోనే కాదు, ఇప్పుడు కూడా నాకు అనిపిస్తుంటుంది, ఆయన వైద్యులందరిలోకి గొప్ప వైద్యుడని. ఆయన ఎలాంటి మార్పు లేని చైతన్య స్వరూపుడు. ప్రపంచంలోని అశాశ్వతమయిన, చిన్న చిన్న విషయాలపైన దృష్టి పెట్టటము వలన సమయము వృథా అయిపోతుంది. భగవంతునికి మాత్రమే తెలుసు ఎవరికి ఎలాంటి మంచి చేయాలో, అందువలన మనము పరమాత్మను ప్రార్థిస్తూ ఉంటే మన యోగ క్షేమాలన్నింటికి ఆయనే బాధ్యత వహిస్తాడు. మనలోని చెడును, అనారోగ్యాన్ని తొలగించి మన కష్టాలనుండి బాధలనుండి మనకి విముక్తి ప్రసాదిస్తాడు.

మేము డా॥ పురుషోత్తమ నాయుడు గారింట్లో బస చేసిన సమయంలో ఆయన వద్దకు వైద్యం కోసం వచ్చే పురుషోత్తమ పంతులు గారు నా నిరాడంబరమయిన జీవన విధానాన్ని, సుశీలాదేవి ఆదర్శవంతమయిన పనులను చూచి ఎంతగానో ఆకర్షితులయి శాంతి స్థాపన కోసం మేము చేస్తున్న ప్రయత్నాలకు వారు కూడా నిస్వార్థమయిన సేవలను అందించాలని సంకల్పించారు. ఒక పవిత్రమయిన రోజున అతను నా వద్దకు వచ్చి "స్వామీజీ! సముద్రపు ఒడ్డున నాకు కొంత భూమి ఉంది. మీరు అక్కడ శాంతి ఆశ్రమానికి ఒక శాఖను ప్రారంభించవచ్చును కదా! దాని వలన ప్రత్యేకంగా విదేశీ భక్తులకు చాలా సౌకర్యంగా ఉంటుంది అని భావిస్తున్నాను" అని చెప్పాడు.

ఆయన మాటలకు నేను చాలా సంతోషించాను. సోదరి సుశీలాదేవితో కలిసి సముద్రపు ఒడ్డున ఉన్న ఆ భూమి చూడడానికి వెళ్ళాను. అది చాలా సుందరమయిన ప్రదేశం. ఎంతో ఆహ్లాదకరమయిన వాతావరణము చూచి మేము చాలా ఆనందించాము.





ఆ భూమికి ఒక వైపు సముద్రము, వేరొకవైపు ఋషికొండ, కైలాసకొండలు ఉన్నాయి. వెనుకవైపు చాలా పెద్ద కొండల వరస ఉంది. ఇది నిజంగా భగవంతుడు ప్రసాదించిన వరంగా భావించాను నేను. అందువలన వెంటనే అంగీకారము తెలిపాను. పురుషోత్తమ పంతులు గారు రెండు ఎకరాల భూమిని దానంగా నా పేరుతో రిజిష్టరు చేశారు. గొప్ప వాల్తేరు ఆశ్రమము ఆ విధంగా ప్రారంభమయింది.

డా॥ కిని ఎముకల వైద్యుడితో నాకు ఏ విధంగా పరిచయం కలిగిందో నాకిప్పుడు గుర్తుకు రావడం లేదు గాని, మేమిద్దరము బాగా సన్నిహితులము అయ్యాము. సుశీలాదేవి ఎంతో దూరదేశమయిన అమెరికా నుండి వచ్చి భారతదేశములోని నిరుపేద బాలలకు చేస్తున్న నిస్వార్థమయిన సేవలను చూచి డా॥ కిని గారు హృదయపూర్వకంగా సంతోషాన్ని వ్యక్తం చేశారు. విజయనగరం మహారాణి ఆయనకి ఆప్తులు. వారికి డా॥ కిని గారే వైద్య సేవలందించేవారు. మమ్మల్ని శ్రీమతి విద్యావతిదేవి గారి మహల్‌కి తీసుకువెళ్ళి పరిచయం చేశాడు. అక్కడ మేము ప్రార్థనలు, ధ్యానము చేశాము. ఆశ్చర్యకరంగా మరుసటి రోజున డా॥ కిని గారు 300 రూపాయలను బ్యాంక్ డ్రాఫ్ట్ తీసుకువచ్చి మహారాణి గారు వాల్తేరు ఆశ్రమానికి విరాళంగా ఇచ్చారని చెప్పారు. అంతా ఆ భగవంతుని అనుగ్రహమే అనిపించింది. భగవంతుడు తన అద్భుతమయిన లీలావిలాసంతో ఎక్కడో దూర ప్రాంతాల వారిని, మంచి హృదయము కలవారిని ఒక్కటిగా కలిపి తన పనులను చేయడానికి వారిని వినియోగించుకుంటాడు. ఆయన లీలలు మానవుడి పరిమితమయిన బుద్ధికి అంతుచిక్కవు. ఇంక మేము ఆ పరమాత్ముని ఆజ్ఞగా భావించి వాల్తేరు ఆశ్రమంలో మా కార్యకలాపాలు ప్రారంభించాము.

ఋషికొండలో తాత్కాలికంగా కాటేజీలను నిర్మించాము. విశాఖపట్టణం, వాల్తేరుల్లోని భక్తులందరూ సమయానుకూలంగా సహాయ సహకారాలు అందించారు. భగవంతుని ఎడతెగని అనుగ్రహము వలన మరొక అందమయిన శాంతి ఉద్యానవనము తయారయింది. దగ్గరలోని పల్లె ప్రజల జీవితాలలో వెలుగులు నింపి సేవలు అందించేందుకు సమాయత్తమయింది. భగవంతుడు ముందుగానే ఆ కేంద్రానికి ఆశీస్సులు అందించాడు. రమణీయమయిన ప్రకృతి సౌందర్యంతో, కనుచూపుమేర అంతా పరుచుకున్న కొండల వరసలు, పచ్చని పంట పొలాలు, వినీలాకాశం రంగుతో పోటీ పడుతున్న సముద్రము, ఎగిసిపడుతున్న కెరటాలు, మైళ్ళ దూరం పరుచుకున్న ఇసుక

తిన్నెలు, ప్రశాంతమయిన వాతావరణము. ఋషికొండ నీడలో చిన్ని ఉద్యానవనం దేవతల నివాసంలా ఉంది. పూర్వం ఈ కొండ మీద ఎందరో సాధువులు, యోగులు తపస్సు చేశారని చెపుతారు. ఇంత అందమయిన, పవిత్రమయిన ప్రదేశాన్ని చూచినప్పుడు నా మదిలో ఒక్కటే ఆలోచన కదులుతుంది. ఇక్కడికి వచ్చిన వారిని ఋషులుగా తీర్చిదిద్దాలని. ఎందుకంటే మనమంతా ఋషి బిడ్డలమే కదా! అలా ఆలోచించినప్పుడు హృదయాంతరాళాల్లో అనంతమయిన ఆనందోత్సాహాలు పెల్లుబుకుతాయి. ఇంకా ఇంకా మంచి కార్యాలు చేయడానికి, ఇతరులకు సేవలందించడానికి, అంతర్యామిగా కొలువైన ఆ పరమేశ్వరుడు అనంతమయిన శక్తిని, నూతనమైన ఉత్సాహాన్ని, గొప్ప సంకల్ప బలాన్ని ప్రసాదించి అనుగ్రహిస్తాడు.

స్వామీజీ మళ్ళీ అమెరికా పర్యటన వెళ్ళే ముందే వాల్తేరులో అంత చక్కని అందమయిన శాంతి మిషన్ కార్యకలాపాలకు తగిన ఆశ్రమము ఏర్పడేందుకు ఎంతో విలువయిన, సుందరమయిన స్థలాన్ని ఇచ్చిన పురుషోత్తమ పంతులు గారు చాలా సంతోషించారు. తాత్కాలికంగా పూరిపాకలతో తయారయిన ఆ ఆశ్రమంలో పక్కా నిర్మాణాలు చేపట్టడానికి అవసరమయిన నిధులు సమకూర్చడానికి ఎందరో భక్త మహాశయులు, విదేశీ భక్తులు కూడా ముందుకు వచ్చారు. అందువలన తాత్కాలికంగా వేసిన పూరిపాకలను తొలగించి వేశారు. తెలుగులో ఒక ప్రసిద్ధమైన సామెత ఉంది. "స్థలభోగం, శిలమహత్యం" ఆ విధంగా ఆ భూమి ఎంతో పవిత్రమయినది. సముద్రము, ఇసుక తిన్నెలు, అద్భుతమయిన ప్రకృతి సౌందర్యంతో అలరారే ఆ స్థలం భగవంతుని సృష్టికి నిర్వచనంలా ఉంటుంది. పరమాత్మ లీలలు అనంతములు, అద్భుతములు అని మళ్ళీ నిరూపించబడింది.

కొన్ని స్థలాలు, ప్రదేశాలు, ఆ భూమియొక్క పవిత్రత, అక్కడ మహాత్ములు చేసిన తపస్సాధనల వలన ఆ ప్రదేశంలో ఎన్నో అద్భుతమయిన ఘనకార్యాలు జరుగుతాయి. దానికి చక్కని భవిష్యత్తు ఉంటుంది. కొన్ని రాళ్ళు దేవతామూర్తులుగా చెక్కబడి దేవాలయాల్లో కొలువుదీరి వేలాది మంది భక్తుల చేత నీరాజనాలు అందుకుంటాయి. అదేవిధంగా మా వాల్తేరు ఆశ్రమము, ఋషికొండ, అక్కడ బీచ్ భవిష్యత్తులో పవిత్రమయిన తీర్థస్థలంగా మారి కేవలం భక్తులకే కాకుండా అన్ని మతాల వారికి, అన్ని దేశాల వారికి, పేదవారికి, రోగులకి, భగవంతుని బిడ్డలందరికి కూడా ఉపయోగపడుతుంది.

డా॥ ఎం.జి. కిని గారు ఆ రోజుల్లో చాలా ప్రసిద్ధులయిన ఎముకల డాక్టరు. అలాగే డా॥ దినకర రావు గారు కూడా డా॥ కిని గారి వలె మంచి వైద్యులు. వారు మంగుళూరు నివాసి. విశాఖపట్టణం కింగ్‌జార్జి వైద్యశాలలో వీరిద్దరు కలిసి నాకు చేసిన ఆపరేషన్‌లో చాలా ముఖ్యమైన భూమిక నిర్వహించారు. వారిద్దరూ వైద్యరంంలో ఏ విధంగా సింహాల్లాంటి వారో అలాగే ఆధ్యాత్మికంగా కూడా మంచి పక్వమయిన స్థితిని పొందినవారే కావటం వలన వారిద్దరూ కలిసి అద్భుతమయిన సేవలను వైద్యరంగంలో అందిస్తున్నారు. డా॥ సి.కె. ప్రసాదరావు గారు కూడా వీరి వలె ఎంతో చక్కగా వైద్య సేవలందించేవారు. వారు నిరాడంబరులు, మంచి భక్తులు. అంకితభావంతో, ప్రేమతో సేవలందించేవారు. అదేవిధంగా మేము వాల్తేరులో శాంతి కేంద్రాన్ని ప్రారంభించినపుడు అనేకమంది ఆత్మజ్ఞానం కలవారు ఎందరో ఆ కింగ్‌జార్జి వైద్యశాలలో రకరకాల సేవలు అందించేవారు.

అలాంటి గొప్ప ఆత్మసంస్కారం గల నిరుపమానమయిన వైద్యసేవలు అందించే ఆ వైద్యులు సామాన్యులకు అందుబాటులో ఉండేవారు కాదు. కారణం వారు ఒక్క క్షణం కూడా తీరిక లేకుండా రాత్రింబవళ్ళు నిస్వార్థంగా ఆ కింగ్‌జార్జ్ వైద్యశాలలో సేవలందించడమే తప్ప వారు కీర్తి కోసమో, పేరు ప్రతిష్ఠల కోసమో పనిచేసేవారు కాదు. భగవంతుని మనస్ఫూర్తిగా నమ్మేవారికి సాధ్యం కాని పని అంటూ ఉండదు. ప్రతి జీవి హృదయంలో అంతర్యామిగా కొలువై ఉండే ఈశ్వరుడు. భగవద్గీత మనకు ఏదయితే బోధిస్తున్నదో ఆ విధంగా ఆయన తల్చుకుంటే కనుక కుంటివానిని పర్వతాలను ఎక్కించగలడు, మూగవానితో మాట్లాడించగలడు. దీనిని నేను నా వ్యక్తిగత అనుభవంతోనే చెపుతున్నాను. ఫిలడెల్ఫియాలో మంచు మీద జారి పడిపోవడం వలన నేను అంగవికలుడిని అయ్యాను. తర్వాత తోటపల్లి కొండల్లో కూడా పడిపోవడం జరిగింది. ఇంత జరిగినా ఆ పరమాత్మ నా లాంటి వాని చేత ప్రేమతో మాట్లాడించాడు, ప్రబోధాలు చేయించాడు, సంతోషంగా పర్వతాలను ఎక్కించాడు. కైలాసగిరి కొండను, అలాగే మాతృ ఆశ్రమంలోని కొండపైన శివాలయానికి ఎక్కి వెళ్ళేవాడిని. భగవంతుడు ఎల్లవేళలా తన కరుణా కటాక్షాలను ఈ ఉపాధిపై కురిపిస్తూనే ఉన్నాడు.

సముద్రపు ఒడ్డున చాలా మంది చేపలు పట్టుకునే బెస్త వారు జీవించేవారు. నిరుపేదలయిన వారందరూ చిన్న పూరిపాకల్లో నివసించేవారు. వలలు అల్లుకుంటూ సముద్రంలో చేపల వేటకు వెళుతూ జీవనం సాగించేవారు. కేవలం అదే వారికి

జీవనోపాధి కల్పించేది. నిరుపేదలు కావటం వలన, రోజంతా కష్టపడితే కాని జీవితం గడపటం కష్టం కావటం వలన జబ్బుపడి ఆందోళనకరమయిన పరిస్థితి ఏర్పడినా వారు వైద్యుల దగ్గరికి కాని వైద్యశాలకు గాని వెళ్ళేవారు కాదు. ఒకవేళ వారిలో ఎవరయినా కింగ్‌జార్జ్ వైద్యశాల వంటి చోటికి వెళ్ళినా వారిని పట్టించుకునే వారు ఎవరుంటారు? వారి గురించి శ్రద్ధ తీసుకునేవారు ఎవరుంటారు? వారిలో కనీసం ఒక్కరు కూడా చదువుకున్నవారు లేరు. వారికి అక్షరజ్ఞానం లేదు. తెలుగు కాని ఇంగ్లీషు భాషలో గాని ఎ, బి, సి, డిలు కూడా తెలియవు.

నిరక్షరాస్యులు కావటం చేత వారు జబ్బు పడినప్పుడు కూడా మందులు వాడటం వైద్యశాలకు వెళ్ళడం చేసేవారు కాదు. అయితే వారిలో చాలా మంది ఆరోగ్యంగా, సంతోషంగా జీవించేవారు. ప్రతి రోజు ఉదయాన్నే వారి చేతితో తయారు చేసుకున్న వలలను తీసుకుని చిన్న చిన్న పడవల్లో చేపల వేటకు సముద్రములోనికి వెళ్ళేవారు. భయంకరంగా ఎగిసిపడే అలలను తట్టుకుని సాయంత్రానికి పడవ నిండా చేపలతో తిరిగి ఇళ్ళకు చేరుకొనేవారు. వారి ఆడవారు ఆ చేపలను బజారులో అమ్మి వచ్చిన డబ్బుతో ఆ రోజుకి సరిపడా వస్తువులు తెచ్చుకునేవారు. బియ్యం, పప్పులు మొదలయిన వంట సామగ్రి సమకూర్చుకునేవారు. వారి జీవితమంతా యాంత్రికంగా, ఎలాంటి మార్పు లేకుండా చేపలు పట్టటము, అమ్ముకుని దానితో రోజువారి వంట సరుకులు తెచ్చుకోవటం, అలా ప్రశాంతంగా గడిపేసేవారు.

నూతనంగా ఏర్పడిన ఆశ్రమాన్ని దర్శించడానికి వచ్చిన మా వైద్య బృందం వారితో పాటుగా వచ్చిన డా॥ రమణమూర్తి గారు అందమయిన ప్రకృతి సౌందర్యంతో శోభిల్లుతున్న సముద్రపు ఒడ్డున ఉన్న బీచ్‌ను చూచి ఆనందించారు. అప్పుడే వారు అక్కడి జాలరులకు వైద్యసేవల అవసరాలను కూడా గుర్తించారు. వారు పడుతున్న ఇబ్బందులు, జబ్బులతో, అనారోగ్యంతో ఆ నిరుపేద జాలరి కుటుంబాలు ఎంతగా అవస్థలు పడుతున్నారో వారి కళ్ళతో స్వయంగా చూచారు. ఒక పర్యాయం ఆశ్రమానికి వచ్చినప్పుడు వారు స్వచ్ఛందంగా ఉచితంగా ఆ జాలరులకు వైద్యసేవలందించాలనే సంకల్పాన్ని తెలియచేసి నన్ను, సుశీలాదేవిని ఆశ్చర్యచకితులను గావించారు. వైద్యశాలలో వారి సేవలు ముగించుకున్న తర్వాత ప్రతిరోజు కొంత సమయాన్ని కేటాయించుకుని నిరుపేదలు, నిస్సహాయులు, నిరక్షరాస్యులు అయిన ఆ చేపలు పట్టుకునే కుటుంబాలకు వైద్యసేవలు

అందించడానికి ముందుకు వచ్చారు. ఎంతో తెలివయిన వారి సూచనవలన అతి తొందరలోనే ఆశ్రమంలో చాలా పెద్ద వైద్యశాల నిర్మించబడింది. వెంటనే అందులో జాలరులకు వైద్యసేవలు మొదలుపెట్టారు. మా సింహాల్లాంటి వైద్యులకు తోడుగా నర్సులు, వార్డు బోయ్‌లు, మందులు ఇచ్చేవారు, అందరూ సేవలందించడానికి వచ్చేవారు. తొందరలోనే విశాలమయిన ఆ కుటీరం కుర్చీలు, బల్లలు, నీళ్ళ టాంకులు, బేసిన్లు ఇంకా ఇతర వైద్య పరికరాలతో నిండిపోయింది. దయామయులయిన వైద్యులు, వారి సిబ్బంది అన్నింటిని ఎంతో ప్రేమతో సమకూర్చారు.

వాల్తేరులో చక్కని వైద్యశాల ఏర్పడటము, మంచి నిపుణులయిన వైద్యుల పర్యవేక్షణ లభించటము నిజంగా ఇక్కడి ప్రజల అదృష్టము. కాని చాలా మారుమూల గ్రామాల్లోని ప్రజలకు ఈ రకమయిన అవకాశం, అదృష్టం దొరకటం లేదు. నిరక్షరాస్యులు, నిరుపేదలు, అవగాహనా రాహిత్యం వలన వైద్యశాలకు వెళ్ళి వైద్యులను సంప్రదించడానికి సంకోచిస్తారు. అందువలన వాల్తేరు శాంతి ఆశ్రమంలో ప్రథమ చికిత్సా కేంద్రం ఏర్పడటం వలన ఆ చుట్టు ప్రక్కల అనేకమంది నిరుపేద గ్రామ ప్రజలకు వైద్యసేవలు అందుబాటులోనికి వచ్చాయి. అవసరమయిన మందులు, సేవలు వారికి ఉచితంగా లభించేవి. ముఖ్యంగా వారికి పరిశుభ్రతను గురించి అవగాహన కల్గించడానికి జబ్బులు రాకుండా అరికట్టడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించవలసిన శుభ్రత వివరించి చెప్పేవాళ్ళము. చాలా మంది పిల్లలు కలరా, విషజ్వరాలు, అమ్మవారు లేదా తామర, గజ్జి లాంటి చర్మవ్యాధులతో బాధపడేవారు. పోషకాహారము, పరిశుభ్రత వారికి చాలా అవసరము.

సుశీలాదేవి న్యూయార్క్ నగరంలో నర్సు వృత్తిలో శిక్షణ పొందటంవలన ఆమె ఎంతో నిస్వార్థంగా వారందరికీ అందించే సేవలను గమనించినప్పుడు మాకందరికి మిస్ ఫ్లోరెన్స్ నైటింగేల్ గారి ఆదర్శవంతమయిన జీవితం గుర్తు వచ్చేది. సుశీలాదేవి ఎంతో కరుణామూర్తి, దయాగుణము కలది కావటం వలన అమాయకులు, నిరుపేదలు అయిన బెస్తవారి పట్ల ఎంతో ప్రేమతో వ్యవహరించేది. నిస్సహాయులయిన ఆ బెస్త ప్రజలు ముందు పదుల సంఖ్యలో వచ్చినా, రాను రాను వందలకొద్దీ రాసాగారు. ఎంతో పేరు ప్రఖ్యాతులు కల వైద్యులు, సర్జన్లు ప్రతి రోజు వారికి వైద్యసేవలందించేవారు. ఈ విధమయిన గొప్ప, నిస్వార్థ, నిరుపమానమయిన సేవలు అంతటి గొప్ప వైద్యులు

ఉచితంగా, స్వచ్ఛందంగా చేయటం, అందుకు వారి సిబ్బంది కూడా సహకరించటం ఒక మహా అద్భుతమయిన దృశ్యం. అది చూడడానికి కళ్ళున్న వారందరికి మహాదానందంగా ఉండేది. పవిత్రమయిన క్రిస్టమస్ దినాల్లో మేము ఒక శాంతికేంద్రాన్ని ప్రారంభించినట్లుగా గుర్తుంది. అందువల్ల ఇక్కడ నేను ఎంతో స్ఫూర్తినిచ్చే కవితను జీసస్ క్రీస్తు మీద అందిస్తున్నాను. "క్రీస్తు బెత్లహేములో వేయిసార్లు జన్మించినప్పటికీ, నా హృదయంలో ఆయన పుట్టి ఉండకపోతే నా ఆత్మ వదిలివేయబడింది అయివుండేది".

ఇప్పుడు అదంతా నమ్మశక్యం కాకుండా ఉంటుంది, ఎంతో పేరు ప్రతిష్ఠలున్న అంత పెద్ద కింగ్‌జార్జి వైద్యశాల నుండి చాలా ప్రముఖులయిన వైద్య బృందం బెస్తవారి పూరిగుడిసెల వద్దకు వచ్చి వైద్య సేవలందించారు. అది కూడా ఎలాంటి స్వార్థము లేకుండా, ఏ విధమయిన పేరు ప్రతిష్ఠలు ఆశించకుండా చేశారు. అదంతా నిస్వార్థ సేవలకు అద్భుతమయిన ఉదాహరణగా నిలిచిపోతుంది. ఎవరయితే భగవదనుభూతి పొందిన నిస్వార్థ సేవాపరాయణులు, భగవంతుని ఎల్లవేళలా విశ్వసించేవారు, ప్రతి జీవిలోనూ భగవంతుని ప్రతిరూపాన్ని దర్శించేవారు, కళ్ళకి కనిపించని ఆ పరమాత్మ అందరి హృదయంలో కొలువై ఉన్నాడని తెలుసుకున్నవారు మాత్రమే నిరుపేదలయిన రోగులకు నిస్వార్థ సేవలందించగలరు. అలాంటి నిస్వార్థ సేవలకు తగిన ప్రతిఫలము తప్పకుండా లభిస్తుంది. భగవంతుడు మన వద్దకు అన్ని రూపాల్లో వస్తుంటాడు. మనము దానిని గ్రహించుకుని చిరునవ్వుతో అందరికీ సేవలు అందించగలగాలి.

ఒక పర్యాయము సుశీలాదేవి తన ప్రేమ, దయా గుణాలతో నిరుపేద రోగులకు సేవలందిస్తోంది. వారిలో ఒక వ్యక్తి కుష్ఠురోగి. ఆమె ఎంతో ప్రేమతో అతని పుళ్ళు అన్నీ శుభ్రంగా కడిగి మందులు రాసింది. అప్పుడు ఆమె తన చేతులకు ఎలాంటి రబ్బరు తొడుగులు వేసుకోలేదు. నాకింకా గుర్తుంది, డా॥ కిని ఆమెను శుభ్రంగా ఉండాలని సున్నితంగా మందలించారు. తగిన జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. ప్రత్యేకించి కుష్ఠురోగులకు సేవలు చేసేటప్పుడు ఆమె రక్షణ గురించి శ్రద్ధ వహించాలని సూచించారు. కానీ సుశీలాదేవి చిరునవ్వుతో డా॥ కిని గారి సలహాను విని, అదే ప్రేమతో, సంతోషంగా, చిరునవ్వుతో తన పనిని, సేవలను కొనసాగించేది. భగవదిచ్ఛ లేకుండా గడ్డిపోచ కూడా కదలదు. ఆ పరమాత్మ స్వయంగా ఆమె హృదయంలో ప్రవేశించి, ఆమెను తన పరికరంగా వినియోగించుకున్నాడు. అందువలన స్వయంగా

పరమాత్మ ఆమె రక్షణ బాధ్యత వహిస్తాడు. ఆమె చేస్తున్న నిస్వార్థ సేవలు అలాంటివి. ఆమె నిజమయిన మాతృ హృదయము కలిగిన దేవత. బెస్త వారు ముసలివారు, యువకులు, పిల్లలు అందరూ గుంపులుగా ఆమె చుట్టూ మూగిపోయి ఆమెను పొగడుతూ, ఆ పరమాత్మ ప్రతినిధిగా ఆమె చేస్తున్న సేవలకు ఆనందించేవారు.

## వాల్తేరు ఆశ్రమంలో పవిత్ర క్షణాలు – సుశీలాదేవి

వాల్తేరులోని ఋషికొండ బీచ్‌లోని ఆశ్రమంలో వినీలాకాశం ఎదురుగా అరేబియా సముద్రపు ఒడ్డున జీవితం ఎంతో ఆహ్లాదకరంగా గడిచిపోతోంది. ఎవరికి అయినా స్వర్గ భూమిలో, దేవతలు నివసించే భూమిలాగా భావన కలుగుతుంది. ప్రతిరోజు అత్యద్భుతమయిన సౌందర్యంతో అలరారే సూర్యోదయ, సూర్యాస్తమయాలు దివ్యానుభవాన్ని కలుగచేస్తాయి. ఆ సూర్య కిరణాల బంగారు కాంతులు ఆనందంతో నాట్యమాడుతున్న సముద్రపు అలల మీద పరుచుకొని అందంగా కనిపిస్తుంది. మేము నివాసముంటున్న కుటీరాలు తాటిచెట్ల మధ్య, అందంగా గుబురుగా విరగబూసిన మందారచెట్ల మధ్య ఉన్నాయి. అక్కడి నుండి చూస్తుంటే ప్రకృతి సౌందర్యం మనస్సుకు ఎంతో ఆహ్లాదాన్ని కలిగించేది.

భగవదనుభూతిని పొందటము, ఆయనకు సన్నిహితంగా ఉండటము చాలా సులభం. ఆయన సన్నిధి భగవంతుని బిడ్డలందరికి ఇళ్ళు వంటిది. మన చుట్టూ ఉన్న ప్రకృతిని తిలకించి, ఆస్వాదించి, ఆనందించ గలగటమే భగవదనుభూతిని పొందటం. ఏ జీవుని హృదయంలో ప్రేమ, దయ, సౌందర్యం, గొప్పతనము నిండి ఉంటుందో అదే భగవంతునికి నిలయం. సముద్రపు అలలు తెల్లని ఇసుక తిన్నెలను తాకుతూ చేస్తున్న సవ్వడిలో ఓంకారనాదము వినిపిస్తోంది. సముద్రపు పక్షుల కిలకిలారావాలలో కూడా ఓంకారమే ధ్వనిస్తోంది. వెనుక వైపు కనుచూపు మేర పచ్చని పంట పొలాలు, అందులో పనిచేస్తున్న మనుషులు కనిపిస్తున్నారు. పంట పొలాలను దాటి దూరంగా కొండల వరసలు అద్భుతమయిన శిల్ప సౌందర్యంతో, నైపుణ్యం గల శిల్పి వివిధ ఆకృతులు చెక్కినట్లుగా ఉన్నాయి. హనుమంత వాగు ఎక్కడో కొండల్లో పుట్టి దట్టమయిన కీకారణ్యంలో నివసించే అనేక మృగాల దాహార్తిని తీరుస్తూ మా కుటీరాల దగ్గరగా పారుతూ చివరికి సముద్రుడిలో ఐక్యమవుతూ ఉంది.

పవిత్ర గ్రంథాలన్నింటిలో నదులు సముద్రములో కలిసే ప్రదేశాలు, నదీతీరాలు, ఆశ్రమాలు, దేవాలయాలు నిర్మించడానికి అనుకూలమయిన పవిత్రతను కల్గి ఉంటాయి అని తెలియచేస్తున్నాయి. జీవుని ఆత్మ పరమేశ్వరుని ఆత్మతో ఐక్యతను పొందటాన్ని అది సూచిస్తుంది. దీనికే ప్రకృతి పురుషుల ఐక్యత అని కూడా అంటారు. హనుమంతవాగు ఎంతో ప్రాచీనమయినది. అతి పవిత్రమయినది. సింహాచలము కొండల్లోంచి పరమ పవిత్రమయిన స్థలములో పుట్టింది. ఈ ప్రదేశంలో సింహాచలము చాలా గొప్ప పుణ్య క్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. అది సాధువులకు వరం లాంటిది. భగవంతుని అనుగ్రహము వలన ఆ కాలంలో అది పవిత్రమయిన స్నానఘట్టంగా విరాజిల్లింది. చిన్న జలపాతంలా కొండల మీద నుండి పడే ఆ జలధారల్లో స్నానం చేసిన వారికి జబ్బులను నయం చేసే అమృతధారగా ప్రసిద్ధి చెందింది. ఎందరో యాత్రికులు అక్కడ స్నానమాచరించి స్వామీజీ పాదాలను ఆశ్రయించడానికి గుంపులుగా వచ్చేవారు.

సముద్రము వైపుగా చూస్తూ ఉంటే ఋషికొండ పర్వతము అగ్ని పర్వత శిఖరంలా తేజోవంతంగా కనిపిస్తుంటుంది. అది సముద్రంలోనికి చొచ్చుకొనిపోయి చాలా పెద్ద వరసల్లో ఉండే పర్వతాల సముదాయము. అనాదికాలము నుండి ఆ పరమ పవిత్రమయిన పర్వత శ్రేణుల మీద సాధు మహాత్ములు, ఋషి పుంగవులు గుంపులు గుంపులుగా చేరి సాముహికంగా తపశ్చర్యలు, సాధనలు సాగించేవారట. వారి తపస్సు లోక కళ్యాణం కోసం ధారపోసేవారు. అదేవిధంగా పూజ్య స్వామీజీ మరియు ఇతర శాంతి ఆశ్రమ సాధకులు ఆనాటి పూర్వకాలపు ఋషుల మాదిరిగా సమస్త మానవాళి సౌభాగ్యం కోసం కృషి చేస్తున్నారు. ఈ పవిత్రమయిన ప్రదేశంలో పవిత్రమయిన అంతరంగశుద్ధి కల సాధకులు మరొక పర్యాయము వారి అనంతమయిన శాంతిని, ప్రేమను తమ జీవితాలను ప్రపంచ శాంతి కోసం ధారపోయడానికి సంకల్పం చేశారు. పవిత్రమయిన ఆ పర్వత పాద పీఠము వద్ద ఎప్పుడో నిర్మించబడిన దేవాలయము శిథిలావస్థకు చేరుకొంది. దానిని తిరిగి జీర్ణోద్ధారణగావించి అక్కడికి దర్శనానికి వచ్చే పవిత్రాత్మ స్వరూపులందరికి భగవంతుని ఆరాధించుకుని పగలు రాత్రి సేవించుకోవడానికి అవకాశం కల్పించారు.

బెస్తపల్లె నుండి ప్రతి రోజు మా ప్రియమయిన బెస్త ప్రజలు గుంపులుగా వారి రోజువారి కార్యక్రమాలు ముగిసిన తర్వాత సాయంత్రపు వేళల్లో ఆశ్రమానికి వచ్చి శరీరానికి అవసరమయిన మందులు, బుద్ధికి తోడ్పడే ఆధ్యాత్మిక లాభాన్ని పొంది

వెళ్ళేవారు. వారికి బలమయిన విశ్వాసము, నమ్మకము ఏర్పడడానికి కారణము వారు పొందుతున్న వైద్యసేవల వలన వారిలో మంచి ఆరోగ్యము చేకూరటమే. ఆ విధంగా గొప్ప వేదాంత ప్రబోధకులు గెలాలీ వారితో చాలా ఎక్కువ సమయాన్ని గడుపుతూ, వారిలోంచి కొందరు శిష్యులను కూడా తయారుచేసుకొని 'మాయ' అనే చేపల వలలోనుండి చేపలను బయటికి తీసినట్లుగా చేయగలిగారు.

క్రితం రాత్రి పూజ్య స్వామీజీ మరియు వారి శిష్య బృందము వైశాఖ పూర్ణిమ సందర్భంగా శాంతి సౌభాగ్యాలు లోపించి బాధలకు లోనవుతున్న వారందరికి శాంతి కలగాలని క్రతువులు నిర్వహించారు. ప్రకృతి తన సహజ లక్షణాలను చూపిస్తూ పౌర్ణమి చంద్రుని వెన్నెల వెలుగులను, తెల్లని పాల వంటి తేజస్సును భూమిపైన, సముద్రంపైన ఆవరించుకొని ఆహ్లాదాన్ని కలిగిస్తోంది. మలయమారుతం చల్లగా హాయిగా తాకుతూ వైశాఖ పూర్ణిమ చంద్రుని వెన్నెల కిరణాలకు తోడుగా ప్రపంచము దుఃఖానికి, బాధలకు ఓదార్పుగా పలకరిస్తున్నట్లుగా ఉంది.

ఈ ప్రపంచపు కర్మ బంధాల నుండి విముక్తులయి భౌతికంగా, ఆధ్యాత్మికంగా ఆశీర్వదించబడిన మహాత్ముల పవిత్రమయిన, ప్రశాంతమయిన స్థలములో నివసించే వారికి చేయవలసిన కర్తవ్యం, బాధ్యత ఎంతో ఉంది. అలాంటి వారు కేవలము వారి బంధ విముక్తి కోసం మాత్రమే స్వార్థంతో ప్రవర్తించకూడదు. వారి ఆత్మోన్నతితో పాటుగా ఇతరులకు కూడా ఆత్మోన్నతి కల్గించడానికి ప్రయత్నించాలి. ప్రపంచం యావత్తు అజ్ఞానం అనే చీకటిలో మగ్గిపోతూ, రక్తం కారుస్తూ ఉంటే తాను మాత్రం కళ్ళు మూసుకొని నిర్వాణ సుఖాన్ని అనుభవించటము, వేదాంత శాస్త్ర విచారణ చేస్తూ స్వార్థ పూరితమయిన శుష్క వేదాంతాన్ని చెవుల్లో నిలుపుకోవటం సమంజసం కాదు. మనలో కలిగిన జాగృతి వలన మనము తిరిగి ఉన్నతోన్నతమయిన శక్తిని, తెలివిని, ప్రేమను పంచిపెట్టి పరిస్థితులను సరిదిద్ది సృష్టిలోని చరాచరములన్నింటికి శాంతిని ప్రసాదించవచ్చును. దాని కోసం ముందుగా మనము మన అంతరంగాన్ని పరిశుద్ధంగావించుకొని, మన ఆచరణ సక్రమంగా ఉండే విధంగా జాగ్రత్త వహించి, పవిత్రమయిన శ్వాసతో కర్తవ్యోన్ముఖులు కావాలి. బుద్ధ భగవానుడు, జీసస్ క్రీస్తు, శ్రీ కృష్ణ భగవానుడు అందించిన ఆధ్యాత్మిక మార్గంలో పయనిస్తూ వారి అడుగుజాడల్లో నడుస్తూ ఈ ప్రపంచాన్ని మరింత ప్రగతిపథంలోనికి తీసుకువెళ్ళడానికి ప్రయత్నించాలి. ఆ అవతార పురుషులు అందించిన

మార్గంలో మనం ప్రయాణించి వచ్చాము. ఆ వారసత్వాన్ని మనము ముందుకు కొనసాగించాలి. ప్రపంచ మానవాళి కందరికి ఆదర్శవంతమయిన, శాంతియుతమయిన, అందమయిన, అనుసరణీయమయిన జీవన విధానాన్ని సూచించాలి.

వైశాఖ పూర్ణిమ స్ఫూర్తితో, మన జీవిత లక్ష్యం, గమ్యము మన హృదయాలను ఆవరించుకొని, ప్రపంచ మానవాళి కందరికి దానిని అందించేలాగా జీవిద్దాము. పరమాత్మ అందరికి ఆయుష్షు, ఆరోగ్యం, యశస్సు, సుఖ సంతోషాలను అందించు గాక!

ఓం..ఓం..ఓం..

## అధ్యాయం - 44

# జంతు బలులు

భారతదేశంలో ధార్మికత ఎంత ఉన్నత స్థాయిలో ఉంటుందో, అలాగే చాలా ప్రదేశాల్లో అనాగరిక, అమాయక ప్రజల్లో మత మౌఢ్యం, దురాచారాలు కూడా అంతేస్థాయిలో బాగా ప్రబలిపోయి ఉండడం వలన భయంకరమయిన పరిస్థితుల్లో వారు చిక్కుకు పోతున్నారు. ప్రకృతి సహజసిద్ధంగా వచ్చే ఇబ్బందులు, జబ్బుల నుండి తప్పించుకోవడానికి ప్రజలు మూర్ఖంగా గ్రామదేవతలకి జంతువులను బలులు ఇవ్వటం అనే దురాచారం బాగా ఉంది.

అనాగరికులు, నిరక్షరాస్యులు, అమాయకులు, నాగరిక ప్రపంచానికి దూరంగా ఉండే జాలరుల కుటుంబాలలో ఈ విధమయిన అనాగరిక దురాచారం చాలాకాలంగా కొనసాగుతూ వస్తోందని మేము తెలుసుకున్నాము. అది చాలా భయంకరమయిన, ప్రమాదకరమయిన ఆచారము అని వారికి అర్థం అయ్యేవిధంగా వారిలో అవగాహన కల్గించాలని భావించేవారు లేకుండా పోయారు. వారి కులాచారాలు కుల పెద్దల నుండి అలాగే కొనసాగుతూ వస్తున్నాయి. అమ్మవారుగా వారు తలచే దేవతకు రక్తతర్పణం చేసి జంతువులను, మూగజీవాలను బలులుగా సమర్పిస్తే ఆమె సంతృప్తి చెంది తమ జాతిని రక్షించి కాపాడుతుంది అని మూఢంగా నమ్మి ఆచరించేవారు.

చుట్టుప్రక్కల జాలరుల కుటుంబాల కులపెద్దలను, పూజారులను అందరిని పిలిపించి, ఆశ్రమములో సమావేశం ఏర్పాటు చేసి గంటల కొద్ది వారికి అవగాహన కల్గించేవారము. ఆ విధంగా చాలా రోజులు ఓపిగ్గా, వారి అంతరాంతరాళాల్లో గూడు కట్టుకొని పోయిన ఛాందసాలను, మూఢవిశ్వాసాలను, భయాన్ని తొలగించడానికి ప్రయత్నించాము. వీరందరూ ప్రకృతిమాత పుత్రులు. వారిలో అణగారిపోయిన దివ్యత్వాన్ని వెలికితీసి, పరమాత్ముని శరణాగతి చెందటము నేర్పించాము. భగవంతుడు సర్వశక్తిమంతుడే కాదు, అపారమయిన కరుణా సముద్రుడని, దయామయుడని, వారినుండి కేవలము భక్తి తత్పరత మాత్రమే కోరుకుంటాడని, వారు ఇతరులకి, కుటుంబ సభ్యులకు, స్నేహితులకు, బంధువులకి మేలు చేస్తే అందులకు సంతోషించి ఆయన వారికి సహాయం చేస్తాడని, వారి సంరక్షణ బాధ్యత పరమాత్మే స్వయంగా వహిస్తాడని బోధించాము. వారు జంతుబలులు సమర్పించినందువలన భగవంతుని దయకు దూరమయిపోతారని వివరించి చెప్పాము. చిట్టచివరికి మా ప్రయత్నాలు, ప్రబోధాలు ఫలించి వారందరూ ఇక మీదట ఈ దురాచారాలన్నీ మానివేస్తామని ప్రమాణం చేశారు. ఇసుక తిన్నెల మీదుగా వారి గ్రామాలకు తిరిగివెళ్ళేముందు అందరూ కలిసి సామూహికంగా భగవంతుని కీర్తిస్తూ భజనలు, సంకీర్తనలు చేస్తూ భగవన్నామాన్ని జపించారు.

దయామయుడు ప్రేమమూర్తి అయిన ఈశ్వరుని అనుగ్రహము వలన ఒక అద్భుతము జరిగినట్లుగా వారి హృదయాల్లోని భయాలన్నీ పటాపంచలయిపోయాయి. వారిలో క్రొత్తగా ఏర్పడిన నమ్మకానికి అతి తొందరలోనే పరీక్ష ఎదురయింది. వారి సంప్రదాయం ప్రకారం ఆచారబద్ధంగా వారు నిర్వహించుకునే అతి ముఖ్యమయిన పండుగ దినం రానే వచ్చింది. అమ్మవారి పండుగ దినం నాడు సముద్రపు ఒడ్డున చిన్న తాటాకులు కప్పిన దేవాలయం లాంటి ప్రదేశానికి రంగు రంగుల దుస్తులు, అలంకారాలతో జాలరుల కుటుంబాలన్నీ చేరుకున్నాయి. ఆశ్రమములో అంతకు ముందు రోజురాత్రి మేమందరము ఆధ్యాత్మిక చింతనలో గాఢమయిన ధ్యానము, ప్రార్థనతో గడిపాము. చెడును నిర్మూలించాలంటే అనంతమయిన ధార్మికశక్తిని కూడగట్టుకోవాల్సి ఉంటుంది.

గ్రామ పూజారులు జాతరకు సంబంధించిన వింత దుస్తులు, అలంకారాలతో, ఒంటి నిండా రకరకాల ముద్రలు ముద్రించుకుని అలంకరించుకుని వచ్చారు. గుండ్రంగా కూర్చుని వాద్యకారులు, నృత్యం చేసేవారు. భయం కలిగించే విధంగా కొమ్ము బూరలు,

డప్పులు వాయిస్తూ భయానకమయిన వాతావరణాన్ని సృష్టించారు. మూగ జీవాలను అమ్మవారికి బలి ఇవ్వడానికి తీసుకువచ్చారు. బలిపీఠాన్ని అలంకరించి దాని వద్దకు ఆ జంతువులను తెచ్చారు. ఇక మిగిలిన తంతు పూర్తి చేయడానికి వారందరూ సిద్ధంగా ఉన్నారు. ఆశ్రమవాసులందరూ ఆ గుంపులో చొరబడి బలిపీఠం దగ్గరికి చేరుకున్నారు. మేము పూజారి వద్దకు చేరుకుని, అతనిలో తరతరాల నుండి వస్తున్న ఆచార సంప్రదాయాలను మీరటం వలన కల్గుతున్న భయాందోళనలను, అతని అంతరంగంలో జరుగుతున్న భయంకరమయిన కల్లోలాన్ని గుర్తించి, అతని సందేహాలన్నింటిని రూపుమాసి పోయే విధంగా అతనితో మాట్లాడాము. "దయచేసి ఈ మూగజీవాలను భగవంతుని ప్రేమకు వదిలిపెట్టండి. మీ అనుమతితో మేము ఇప్పుడు ఇక్కడ ఆ జగన్మాతకు ప్రీతిని కలిగించే పూజాదికాలు చేసుకుందాము" అని చెప్పి ఒప్పించడానికి ప్రయత్నించాము.

గుంపులో చిన్నగా గుసగుసలు వినిపించాయి. ఇదంతా మంచికి, చెడుకి మధ్య జరుగుతున్న సంగ్రామంలా అనిపిస్తోంది. అక్కడి వాతావరణంలో గాలి కూడా భయాందోళనలతో వేడెక్కిపోయింది అనిపిస్తోంది. గొంతు తడారిపోతోంది. శరీరంలోని ప్రతి అణువు, హృదయము ఆందోళనతో కంపించసాగాయి.

తొందరగా, చాలా జాగ్రత్తగా బలి కోసం తీసుకురాబడిన చిన్ని గోధుమ రంగు గొఱ్ఱెపిల్లని, పాలుత్రాగే వయస్సున్న చిన్ని పంది పిల్లని, కోళ్ళను వదలిపెట్టాము. వాటిని జాగ్రత్తగా సంరక్షించేవారికి అప్పగించాము. అక్కడ గుంపుగా నిలబడినవారందరూ మౌనంగా, గౌరవంగా దారి వదిలారు. ఏ మాత్రం అజాగ్రత్త, అశ్రద్ధ వహించినా ఆ మూగ జీవాలు ఏమయి ఉండేవో తలుచుకుంటే మా గుండెలు భయంతో కదిలిపోయాయి. మానవత్వం, కనికరం లేని ఆ పూజారుల చేతిలో అవి బలయి ఉండేవి.

ఇక అక్కడ గుమిగూడిన వారందరి కోసం, వారు అప్పటిదాకా ఆచరిస్తూ వస్తున్న భయంకరము, అనాగరికము, క్రూరమయిన పూజాదికాలకు ప్రత్యామ్నాయంగా మేము చాలా ప్రశాంతమయిన, అందమయిన, అందరిని ఆకర్షించే క్రతువును నిర్వహించాము. అగ్నికార్యం అతి పవిత్రమయింది. అది పరంజ్యోతి స్వరూపం. నెయ్యి, సమిధలు, పూలు, అగరబత్తీలు, కొద్దిగా ధాన్యపు గింజలు సమర్పించాము. ఇక జాలరుల కులపెద్దలను, పూజారులను అందులో ముఖ్యమయిన పాత్ర వహించేలా శ్రద్ధ తీసుకున్నాము. దాని వలన వారు కూడా సంతోషించారు. వేడుకలు, ఉత్సవాన్ని

చూడడానికి గుంపులుగా వచ్చిన వారందరి ఎదుట వారికి గౌరవము, ఉన్నతమయిన స్థాయి లభించడము వలన అప్పటిదాకా ముఖాలు వ్రేలాడదీసుకున్న పూజారులు అది చాలా గౌరవంగా భావించారు. చాలా తొందరలోనే ఆ స్థలములో పూర్వమునుండి వారు ఆచరిస్తూ వస్తున్న అనాగరిక చర్యలు, బలులు వంటి అకృత్యాలు, దురాచారాలు సమసిపోయాయి. ఇప్పుడు అక్కడ నిత్యమూ దీప ధూప నైవేద్యాలతో, హారతులతో పవిత్రమయిన హృదయాలతో పూజారులు అఖిలాండకోటి బ్రహ్మాండనాయకికి, జగన్మాతకు పూజలు నిర్వహిస్తున్నారు. అది చూచి సముద్రము కూడా సంతోషంతో ఎగిసిపడుతోందా అనిపిస్తోంది. వెలుగులు, అందము నిండిన అలలు ప్రశాంతంగా, ఆనందంగా ఆశీర్వదిస్తున్నట్లుగా ఎగిసిపడు తున్నాయి. జాలరుల కులపెద్దలు, పూజారులు, వేడుకలు తిలకించడానికి వచ్చిన ప్రజలు అందరి హృదయాలలో ఒక సరిక్రొత్త కాంతిరేఖలు నిండిపోయాయి.

బెస్త ప్రజలందరూ దానితో ఇక మీదట ఎలాంటి జంతుబలులు ఇవ్వమని వారంతట వారుగా ప్రమాణాలు చేశారు. అతి తొందరలోనే మరొక పర్వదినము వచ్చినప్పుడు వారందరూ ఇచ్చిన మాట తప్పకుండా అమ్మవారిని చక్కగా పూలతో అలంకరించి ప్రేమ నిండిన హృదయాలతో, భక్తిగా ఆరాధనలు జరుపుకోవటం మాకు ఎంతో సంతోషాన్ని, ఆనందాన్ని కలిగించింది. మా హృదయాలు సంతృప్తితో నిండిపోయి వారికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు చెప్పాము. భగవంతుని అనుగ్రహం, సహకారం వలన ఈ పేద బెస్త ప్రజలకి చేతనయినంత సహాయం అందించి వారిని సంతోషంగా జీవించేలా చేయగలిగాము. నిజానికి అది చాలా పెద్ద బాధ్యత. దాన్ని మేము సక్రమంగా నిర్వర్తించగలగటం వలన జాలరుల కుటుంబాల వారందరికి మాపైన భక్తి విశ్వాసాలు, నమ్మకము  పెరిగాయి.

ఈ విధంగా ప్రపంచ వ్యాప్తంగా అజ్ఞానం అనే అంధకారములో అల్లాడుతున్న వారు ఎందరో ఉన్నారు. వారందరికి జ్ఞానజ్యోతిని అందించడానికి, వారి జీవితాలలో వెలుగు, ఆనందం నింపటానికి, తూర్పు పడమర దేశాల్లోని పవిత్రమయిన ఆత్మ స్వరూపుల సహాయ సహకారాలు ధన రూపేణ, సేవా రూపేణా కావాల్సి ఉంటుంది. నాతో కలిసి నడవడానికి, చేతులు చాచి ఆహ్వానిస్తున్నాము. కష్టపడి అంకితభావంతో పనిచేసేవారు ఎందరో కావాల్సి ఉంటుంది. మాపై ఉన్న బాధ్యతలను, భారాన్ని పంచుకోవడానికి,

ఆర్థిక సాయం అందించడానికి, పనిచేయడానికి మీ సహాయం మాకు కావాలి. భగవంతుడు ఎల్లప్పుడు ఆ బెస్తవారికి చక్కని మార్గదర్శకాన్ని, అనుగ్రహాన్ని, జ్ఞానాన్ని ఇచ్చి వారిని సదా రక్షించుగాక! అలాగే అలాంటి వారికి సహకరించే హస్తాలను దీవించి ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేవుని బిడ్డలకు మరింత సేవ చేయడానికి కావాల్సిన శక్తి సామర్థ్యాలను వారికి ప్రసాదించుగాక! శాంతిని శ్వాస ద్వారా లోపలికి పీల్చి వదలటము మన జన్మహక్కు. ప్రతి శ్వాస ద్వారా శాంతిని లోనికి పీల్చి వదలటం ద్వారా మనము ఏమి సాధించగలము? అని భావించవచ్చు. ఈ ఉన్నతమయిన క్షణాలు శాశ్వతమగు గాక! ఎవరికయితే వ్యక్తిగతమయిన శాంతి లభిస్తుందో తద్వారా వారు ప్రపంచ శాంతికి తోడ్పడుతారు. మనలో ఎవ్వరమూ ఇతరులను మార్చలేకపోవచ్చు, ఈ ప్రపంచానికి క్రొత్త రూపాన్ని ఇవ్వలేకపోవచ్చును. కానీ మనలను మనము మార్చుకోగలము కదా! స్వార్థపూరితమయిన మనస్సును నిస్వార్థంగా మార్చి మానవత్వము నుండి దివ్యత్వము వైపుగా పయనించగలము. ఆ విధంగా మనము మారితే, నిశ్శబ్దంగా మనము సమస్త మానవాళికి సేవలందించ గల్గుతాము.

భగవంతుని ఆశీర్వచనాలు మీకుండు గాక! మీ జీవితాలు ప్రపంచానికి ఆదర్శంగా మారి ఒక వరంలాగా అవుతుంది. శాంతి కేంద్రముయొక్క శాంతి సందేశాలను మీరు ప్రపంచానికంతటికి పంచి పెట్టెదరు గాక!

ఓం..ఓం..ఓం..

అధ్యాయం - 45

# అమెరికా నుండి ఆహ్వానము - నాల్గవ పర్యాయము, 1937

సుశీలాదేవి

మన ప్రియతమ పరమ పూజ్య స్వామీజీ వారి అమూల్యమయిన జ్ఞాన సంపదని, భగవంతుని దివ్యానుభవాలను మీతో పంచుకోవడానికి మీ ప్రాంతంలో చక్కగా నిర్వహించబడుతున్న శాంతి కేంద్రాలను సందర్శించడానికి మీ ఆహ్వానం మేరకు అతి

తొందరలో రాబోతున్నారు అని ప్రకటించడానికి తోటపల్లి కొండల్లో నెలకొన్న శ్రీ శాంతి ఆశ్రమము సంతోషిస్తోంది. స్వామీజీ బాల్యంలో ఉండగానే సమస్త మానవాళి పట్ల ఉన్న ప్రేమ వలన ప్రపంచాన్ని, తనని కూడా త్యజించి ధ్యానములో జ్ఞానాన్ని పొంది అందరికి ఆ జ్ఞానాన్ని అందించడానికి భారతదేశంలో ప్రయత్నాలు చేశారు. వారిలోని దివ్యత్వము, ప్రేమ వలన వారు పొందిన ఆత్మజ్ఞానాన్ని అమెరికాలోని సత్యాన్వేషకు లందరితో పంచుకోవాలని గతంలో మూడు పర్యాయములు వచ్చారు. ఎల్లలు లేని వారి దివ్యప్రేమ సమస్త మానవాళి పట్ల వారికున్న ప్రేమ మళ్ళీ ఇంకొక పర్యాయం పవిత్రమయిన హృదయం గల శాంతానంద, సరస్వతీదేవి లిల్లియన్ (ఎల్.కె. డానియల్) గార్ల ఆహ్వానం మన్నించి అలాగే వారి సహచరుల పిలుపు మేరకు స్వామీజీ వస్తున్నారు.

విశ్వశాంతి కేంద్రము లోని సభ్యులు స్నేహితులందరూ చాలా చక్కని ఆధ్యాత్మిక తత్త్వ జ్ఞానానికి సంబంధించిన కార్యక్రమాలకు హాజరవుతూ లిల్లియన్ డేనియల్ గారి సమావేశాలకు, ప్రసంగాలకు వస్తున్నారు. అలాంటి వారందరూ ఇప్పుడు శ్రీ ఓంకార్ స్వామీజీ గారి అభ్యుదయకరమయిన ఉన్నత స్థితిని చేకూర్చే ప్రబోధాలు శ్రవణం చేసేందుకు సమాయత్తమవుతున్నారు.

“వ్యక్తిగత శాంతి మాత్రమే ప్రపంచ మానవాళి శాంతి సౌభాగ్యాలకు పునాది వేస్తుందని, అందువలన పరమాత్మ అనుభవాన్ని పొంది ఇతరులకు సహాయ సహకారాలు అందించి వారిని కూడా పరమాత్మ సన్నిధి చేర్చాలి” అని శ్రీ ఓంకార్ స్వామీజీ పదే పదే ప్రస్తావిస్తుంటారు. సత్యాన్వేషకులందరూ భవిష్యత్తులో ఇతరులకు సత్యాన్ని ప్రబోధించడానికి, గురువులుగా, ప్రబోధకులుగా తయారయి సత్యాన్వేషకులకు మార్గదర్శనం చేయడానికి, శాంతిని, సంతోషాన్ని అందించడానికి ప్రయత్నించాలి. దీని కోసం స్వామీజీ ఒక ప్రత్యేకమయిన శిక్షణా తరగతులు నిర్వహించడానికి, నిరంతరము విశ్రాంతి లేకుండా జీవితం గడిపే పశ్చిమదేశాల వారికి అనుకూలంగా ఉండే విధంగా, అదే సమయంలో తూర్పుదేశాల వేదాంత తత్త్వశాస్త్రాన్ని ఆధారంగా చేసుకొని రూపొందించారు. అది చాలా తేలికగా అర్థమయ్యేవిధంగా ఎంతో ఆచరణాత్మకంగా పరిపూర్ణత్వాన్ని ఇచ్చేవిధంగా ఉంటుంది. వారు అందించే సూచనలు చాలా ముఖ్యమయిన భూమికను పోషిస్తూ, ఆధ్యాత్మిక అనుభవాలను అందించి ఆత్మజ్ఞానాన్ని ఇస్తాయి. ఏకాగ్రత,

పవిత్రత, నమ్మకము, ఉత్సాహంతో నిండిన ఆత్మ స్వరూపులకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

ఈ శిక్షణా తరగతులు నలభై రోజులు ఉండే విధంగా, పాశ్చాత్యులకు చక్కగా ఉపయోగపడే విధంగా రూపొందించబడ్డాయి. నలభై రోజుల్లో మీరు మీ హృదయపు లోలోతుల్లోకి ప్రయాణించి చివరికి మీ ఆత్మకు దగ్గరగా చేరుకుంటారు. మీ జీవిత గమ్యానికి చేరువవుతారు. అజ్ఞానపు తిమిరంలోనుండి శాశ్వతమయిన జ్ఞాన ప్రకాశం వైపుగా పయనిస్తారు.

పూజ్య స్వామీజీ పవిత్రమయిన, ప్రశాంతమయిన సన్నిధి మనకు భారతీయ సనాతన వైభవాన్ని, పూర్వీకుల జ్ఞాన తేజాన్ని ఉన్నతోన్నత స్థితిని గుర్తుకు తెస్తుంది. ఈ మహోన్నత ఆధ్యాత్మిక గురువు ఎంతో ఆత్మ విశ్వాసంతో ఈశ్వర సాక్షాత్కారము అనేది కేవలము భారతదేశంలోని హిమాలయ సాధు పుంగవులకు, మహాత్ములకు, యోగులకు, పీఠాధిపతులకు, మఠాధిపతులకు, మహంతులకు మాత్రమే జన్మహక్కు కాదని, ఆధ్యాత్మిక వాసన గల ప్రతి ఒక్కరికి వారు తూర్పు, పశ్చిమ, దక్షిణ, ఉత్తర ప్రాంతాలకు అతీతంగా రంగు, జాతి, మతము, దేశము కాలాలకి అతీతంగా స్త్రీ పురుష బేధం లేకుండా అందరికి సమానంగా అర్హత ఉంది అని చెపుతారు.

అడిగిన ప్రతి ఒక్కరికి స్వామీజీ తన ఆధ్యాత్మిక జ్ఞాన సంపదని ఉచితంగా పంచిపెడతారు తప్ప దానిని రహస్యంగా ఉంచి దాచిపెట్టుకోవాలని భావించరు. పరమపూజ్య శ్రీ ఓంకార స్వామీజీ పద్ధతులు చాలా సరళంగా, నిరాడంబరంగా, సూటిగా, నిర్మొహమాటంగా ఉంటాయి. మహాత్ములు, ప్రవక్తలు అందించిన మార్గాన్నే వారు అనుసరిస్తారు. ప్రేమమూర్తి జీసస్ క్రీస్తు, దయామయుడు గౌతమబుద్ధుడు, జ్ఞానమూర్తి శ్రీ కృష్ణ భగవానుడు ఇంకా అనేక మంది ప్రేమమయులు అయిన మహాత్ములు, సాధువులు, అవతారపురుషులు తూర్పు, పడమర దేశాల్లో ప్రభవించిన మహనీయులు తిరిగి మళ్ళీ సత్యాన్ని ఎలుగెత్తి చాటి చెప్పడానికి స్వామీజీ ద్వారా వారి అంకిత హృదయంలో నుండి పలుకుతున్నారు అనిపిస్తుంది. ఆయన మార్గదర్శకుడు. ఆయన అందరినీ సమానంగా ప్రేమించి, గౌరవిస్తారు. వారి ప్రబోధాలను, జీవితాలను మన హృదయానికి హత్తుకునే విధంగా వారి ప్రవచనాల ద్వారా దర్శింపచేస్తారు. అలాగే శాంతి బీజాలను వెదజల్లి మహోన్నతమయిన శాంతి కేంద్రాలను స్థాపిస్తున్నారు.

స్వామీజీ ఇతరుల మత విశ్వాసాలను, ఆరాధనా పద్ధతులను, వారి మతం లోని విశ్వాసాలను, సంప్రదాయాలను మార్చటానికి ప్రయత్నించరు. లేదా హేతుశక్తికి అంతుపట్టని ధోరణిలో సత్యాన్ని దాచిపెట్టరు. అద్భుతాలను, మంత్ర శక్తులను ప్రదర్శించి ఆకర్షించడానికి ప్రయత్నించరు. కానీ ఆయన పవిత్రమయిన ఆత్మ కలవారి హృదయాలలోనికి ప్రవేశించి, వారి లోని గొప్పతనాన్ని వెలికి తీయడానికి, వారిలో అంతర్గతంగా, నిగూఢంగా, నిద్రాణంగా ఉన్న ఆధ్యాత్మిక శక్తిని బహిర్గతం చేయడానికి ప్రేమ, తేజస్సు, ఓజస్సు అందించడానికి ప్రయత్నిస్తారు. మనలను పరమాత్మ సన్నిధిని అనుభవించే విధంగా తయారుచేస్తారు. యుగాల పర్యంతం నిజమయిన ప్రవక్తల గొప్ప న్యాయమయిన తీర్పు అది.

తూర్పుదేశం నుండి వచ్చే ఈ సాధుమహాత్ముని ప్రవచనాలను అర్థం చేసుకుని ఆచరించటము వలన మనలో సత్యదర్శనం అవుతుంది. ఆణిముత్యాలను ఏరుకుని మన హృదయాలను, అంతరంగాన్ని పవిత్రం చేసుకోవటం, ఆ వరాన్ని మనము వదులుకోకూడదు.

ముందుగానే చెప్పినట్లుగా పూజ్య స్వామి ఓంకార్‌జీ గారి ప్రవచనాలు, ప్రబోధాలు మనకు ప్రకృతి ప్రసాదించిన గాలి లాగా స్వేచ్ఛగా, ఉచితంగా లభిస్తాయి. సూర్యుని కిరణాలు ప్రసరించినట్లుగా వాటిని మనము సద్వినియోగం చేసుకోవచ్చును. ఎవరయినా ప్రేమతో, స్వచ్ఛందంగా దక్షిణ రూపంలో ఇవ్వదల్చుకుంటే ఆ ధనాన్ని వారు శాంతి మిషన్ చేస్తున్న ధర్మ ప్రచార కార్యక్రమాలకు వినియోగిస్తారు. ఆ ధనము సత్యాన్వేషకులయిన ధర్మ ప్రచారకులందరికి చెందుతుంది. ప్రతి ఒక్కరూ మంత్ర దీక్ష సమయములో కనీసం పది రోజుల పాటు నిబద్ధతతో హృదయశుద్ధి కోసం పూర్తి అంకిత భావంతో సాధన చేయవలసి ఉంటుంది.

## అంతరాత్మ అనే దేవాలయంలో నలభై రోజులు

1. సత్యాన్వేషణ, నీవు నిజంగా భగవంతుని తెలుసుకోవాలని భావిస్తున్నావా? (ప్రవచనము)
   మొదటి మంత్రదీక్ష
   ఆధ్యాత్మిక దినచర్య వ్రాయటం వలన కలిగే ప్రయోజనాలు

పవిత్రమయిన ఓంకారము యొక్క ప్రశస్తి (ప్రవచనము)
మౌనంగా ధ్యానం చేయటం (మొదటి మంత్ర దీక్ష ఉపాసన)

2. రెండవ మంత్రదీక్ష
భౌతికంగా, మానసికంగా విశ్రాంతి పొందటం (ఆసనాలు ద్వారా)
మతము, జీవితము వేరు కాదు, రెండూ ఒక్కటే (ప్రవచనము)
మౌనంగా ధ్యానం చేయటము (రెండవ మంత్ర దీక్ష ఉపాసన)

3. మూడవ మంత్రదీక్ష
ధ్యానము (ఉపన్యాసము)
ఆధ్యాత్మికంగా అంతరంగ పరిశుద్ధత (ప్రవచనము)
మౌనంగా ధ్యానం చేయటము (మూడవ మంత్రదీక్ష ఉపాసన)
ఉపవాస దీక్ష ద్వారా శక్తిని పొందటం (ఉపన్యాసము)

4. నాల్గవ మంత్రదీక్ష
ఉచ్ఛ్వాస, నిస్శ్వాశల ద్వారా శాంతిని పొందటం (ఉపన్యాసము)
మౌనము అనేది పవిత్రమయిన దేవాలయము (నాల్గవ మంత్రదీక్ష ఉపాసన)
శాంతి నీలో అంతర్గతంగా ఉంది (ఉపన్యాసము)
అర్థం చేసుకుని మౌనంగా ఉండటం నేర్చుకో (విశ్వప్రార్థన, ధ్యానము)

వీడ్కోలు సందేశము అనుగ్రహము ఆశీస్సులతో అందించటము.

ఓం..ఓం..ఓం..

అధ్యాయం - 46

# అమెరికా ప్రయాణంలో మధ్య మధ్య ఆగటం

## రంగూన్, బర్మా - జె. చటర్జీ

1937 మార్చి 10వ తేదీన పూజ్య స్వామీజీ మరియు సుశీలాదేవి గార్లు అమెరికా దేశం వెళ్ళి శాంతి సందేశాలను ప్రచారము చేయడానికి, విశ్వమానవ సౌభ్రాత్రాన్ని నెలకొల్పడానికి ప్రయాణమయి మార్గమధ్యంలో రంగూన్ వచ్చారు. వారి విడిది సమయంలో పవిత్రాత్మ స్వరూపులయిన రాజ్‌కృష్ణ గారు, రంగూన్ ఇంజనీర్ డిపార్టుమెంట్ ట్రస్టు సభ్యులు, భక్తుడు వారికి ఎంతో ప్రేమపూర్వకంగా, జాగ్రత్తగా అతిధి సత్కారాలు ఏర్పాటు చేశారు.

వారి రాక గురించి తెలుసుకుని కొద్దిమంది భక్తులు వారికి మనస్ఫూర్తిగా స్వాగతం పలికారు. కాని అతి తొందరలోనే పూజ్య స్వామీజీ నిండయిన విగ్రహము, పసిపిల్లవాడి లాంటి నిర్మలత్వము, పవిత్రత, ప్రేమ స్వరూపము చాలా పెద్ద జన సమూహాన్ని ఆకర్షించింది. అందువలన స్వామీజీ, సుశీలాదేవి అతి తొందరలోనే అతిథులను, వారిని కలవడానికి వచ్చే భక్తులను పలకరించటంలో పూర్తిగా నిమగ్నమయిపోయారు. అయినా వారు ఎప్పుడూ విసుగు చెందటం గాని, అలసిపోవటం గాని జరిగేది కాదు. పైగా వారు ఎంతో సంతోషించేవారు. స్వామీజీ వారి ప్రేమతో ప్రతి ఒక్కరిని బందీగా చేసుకునేవారు. ఆయనకి పేద, గొప్ప తారతమ్యం లేదు. అందరిపట్ల ఒకే విధమయిన గౌరవాన్ని ప్రకటించేవారు. వారు విడిది చేసిన ప్రదేశము అన్ని మత సంప్రదాయాల వారు కలుసుకునే సమావేశ స్థలంగా మారిపోయింది.

స్వామీజీ ఎక్కువగా ప్రసంగాలు చేయడానికి ఇష్టపడేవారు కాదు. కాని ఆయన మౌనంగా కూర్చున్నప్పుడు భక్తులు వారి ఎదుట కూర్చుని ఎంతో ఆనందాన్ని పొందేవారు. తన వద్దకు వచ్చేవారికి సందేశాలు, ప్రవచనాలు చేయడానికి బదులుగా స్వామీజీ వారితో ప్రార్థనలు, ధ్యానము చేయమని చెప్పేవారు. వారు ఓంకారాన్ని ఉచ్చరించగానే అందరి హృదయాలు దివ్యత్వంతో నిండిపోయేవి. ఆయన తన హృదయాన్ని తన ప్రార్థనల ద్వారా అందరికీ పంచిపెట్టేవారు. వినేవారిని కట్టిపడేసే విధంగా నైపుణ్యంతో, వాగ్ధాటితో

ప్రసంగాలు చేయటం పట్ల స్వామీజీకి అంత ఇష్టం ఉండేది కాదు. వారి మౌనం ఎన్నో రెట్లు ఎక్కువగా భక్తులను ప్రభావితం చేసేది. స్వామీజీ ఆచరణకి ఎక్కువగా ప్రాధాన్యము నిచ్చేవారు.

స్వామీజీ సుశీలాదేవితో సంప్రదించి మార్చి 21వ తేదీన సోనీరామ్ హాలులో ప్రజలందరికి బహిరంగ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆ రోజు అనుకున్న సమయం కన్నా చాలా ముందుగానే జనం ప్రవాహంలాగా స్వామీజీ దర్శనానికి ఎంతో ఆత్రుతతో రాసాగారు. అందువలన ఆ సమావేశ ప్రదేశం జనంతో కిక్కిరిసిపోయింది.

సమయం రాగానే స్వామీజీ వచ్చి సమావేశమయిన భక్త జనసమూహాన్ని ఉద్దేశించి ఎంతో ఉత్తేజపూరితమయిన ప్రసంగాన్ని దాదాపు గంటన్నరసేపు కొనసాగించారు. నిశ్శబ్దంగా భక్తులు ఊపిరి బిగబెట్టి ఎంతో ఏకాగ్రతతో స్వామీజీ ప్రసంగాన్ని శ్రవణం చేశారు. వారు ప్రసంగాన్ని ప్రార్థనతో ప్రారంభించారు. పవిత్రమయిన ఓంకారాన్ని ఉచ్చరించారు. ఆ శాంతి తరంగాలు అందరి హృదయాలను భగవదనుభూతితో నింపివేశాయి. ఆయన ప్రసంగంలో వాడిన పదాలు అందరికి ఉత్తేజాన్ని కలిగించి, వారి హృదయాలను ఆర్తితో నింపివేశాయి. వారి ప్రసంగం అందరి హృదయాలలో జ్ఞానజ్యోతిని వెలిగించింది. ఇక ప్రసంగాన్ని ఓం తత్సత్ అంటూ ముగించారు. శ్రవణం చేసిన వారందరూ శాంతిని, ఆనందాన్ని వెంట తీసుకువెళ్ళారు.

స్వామీజీతో సమావేశం రంగూన్‌లో చక్కని ఆధ్యాత్మిక వాతావరణాన్ని కలుగజేసింది. అలాంటిది అంతకు పూర్వము వారెన్నడూ ఎరుగరు. అప్పటి నుండి స్వామీజీని, సుశీలాదేవిని కలుసుకోవడానికి, దర్శించుకోవడానికి భక్తులు నిత్యం రాసాగారు. అందువలన వారు క్షణం కూడా తీరిక లేకుండా ఉండేవారు. ఇంటి వద్ద భక్తులకు దర్శనము ఇవ్వటమే కాకుండా స్వామీజీ, సుశీలాదేవి భక్తుల ఆహ్వానం మేరకు చాలా మంది ఇళ్ళకు వెళ్ళి వాళ్ళకు ప్రబోధాలు చేసేవారు. మంత్రదీక్ష ఇచ్చేవారు. ఆ కుటుంబాల వారికి ఉచితంగా శాంతి మిషన్ ఆశయాలను పొందుపరిచిన పుస్తకాలు, కాగితాలు ఇచ్చేవారు.

స్వామీజీ రంగూన్ వెళ్ళటం వలన, శాంతి సందేశాలను అందించటము వలన చాలా మంది భక్తుల హృదయాలలో రంగూన్‌లో ఒక నూతన శాంతి కేంద్రాన్ని నెలకొల్పాలి

అనే ఆలోచన, సంకల్పము కలిగింది. అతితొందరలోనే సంకల్పం సాకారమయింది. మార్చి 28వ తేదీ చటర్జీ గారి ఇంట్లోనే శాంతి కార్యక్రమాలు ప్రారంభించబడ్డాయి. ప్రారంభోత్సవ మహోత్సవం స్వామీజీ ప్రార్థనతో ప్రారంభమయి శాంతి కేంద్రము ఆశయాలను వివరించటంతో ముగిసింది.

రంగూన్‌లో స్వామీజీ విడిది చేసిన సమయంలో మహమ్మదీయ సాధువు బక్రీబాబాని కలుసుకున్నారు. ఆయన గత నాలుగు సంవత్సరాలుగా రంగూన్‌లోనే నివాసముంటున్నారు. ఆయన సేవాభావంతో పేద ప్రజలకు అన్నదానం చేయటం, పవిత్ర జలముతో రోగాలను నయం చేయటం చేసేవారు. ఆయన నిస్వార్థపరుడు, పరమ పవిత్రమయిన వాడు, అంకితభావంతో మానవాళికి సేవలందించేవాడు. ఆయన గురించి తెలుసుకున్న స్వామీజీ, సుశీలాదేవి వారిని కలుసుకోవడానికి అనుమతి పొందారు. వారిద్దరు ఒక రోజు రాత్రి 8 గంటల సమయంలో భక్రీబాబాని కలుసుకోవటం కోసం వెళ్ళినప్పటికి ఆయన వంటపనిలో నిమగ్నమయి తీరిక లేకుండా ఉన్నప్పటికీ ఎంతో సాదరంగా ఆహ్వానించారు. అతిథి సత్కారాలు చేశారు. పేద ప్రజలందరికి ఆయన స్వయంగా దగ్గరుండి భోజనం వడ్డిస్తున్నారు. ఎంతో ప్రేమతో, భక్తితో వారు చేస్తున్న సేవలను గమనించి స్వామీజీ సుశీలాదేవి ఎంతో సంతోషించారు. ఆ కార్యక్రమం పూర్తి కావటానికి రాత్రి 11 గంటలు పట్టింది. అప్పుడు బాబా తీరికగా స్వామీజీ వద్దకు వచ్చి విశ్రాంతిగా కూర్చున్నారు. అంతటా నిశ్శబ్దం, ప్రశాంతమయిన వాతావరణంలో అనంతమయిన ఆకాశం కప్పు క్రింద, మిణుకు మిణుకు మని వెలుగులీనుతున్న నక్షత్రాల కాంతిలో పవిత్రమయిన గొప్ప ఆత్మజ్ఞానులు సమావేశమయ్యారు. మౌనమే వారి మధ్య సంభాషణగా మారింది. ఆత్మలు మాత్రం పలకరించుకున్నాయి. ఆ స్థితిలో ఎన్ని గంటల సమయం గడిచిపోయిందో తెలియదు. చివరికి వీడ్కోలు తీసుకునే సమయం ఆసన్నమయింది. ఒకరి భావాలు, ఆలోచనలు మరొకరు మౌనంగానే అర్థం చేసుకున్నారు. కలిసి ప్రార్థనలు చేశారు. ప్రేమగా వీడ్కోలు తీసుకున్నారు.

## హాంకాంగ్ – డి ఓడి సిల్వా

సంవత్సరాలు, నెలలు, వారాలు, రోజుల తరబడి నేను ఒక భారతీయ సాధు మహాత్ముని దర్శనం కోసం తపించిపోతున్నాను. చివరికి నా కోరిక నెరవేరింది. నా

ప్రార్థనలు ఫలించాయి. నేను ఓంకార్ స్వామీజీని కల్సి చాలా కొద్ది నిముషాల కాలం గడిపాను అంతే, కాని వారితో నా కలయిక నాకు ఒక నమ్మకాన్ని ఏర్పరిచింది. మా ఇద్దరి మధ్య ఎన్నటికి తెగని అనుబంధము ఏర్పడింది. ఇప్పుడు నేను విశ్వశాంతి కేంద్రము, శాంతి ఆశ్రమము జీవితకాల సభ్యుడిగా మారిపోయాను.

కొద్ది రోజుల క్రితం ఒక భారతీయ వస్త్ర వ్యాపారితో మాట్లాడినప్పుడు అనుకోకుండా అతని ద్వారా స్వామీజీ అమెరికా ప్రయాణము మార్గమధ్యంలో హాంగ్‌కాంగ్ వస్తున్నట్లుగా తెలిసింది. దాదాపు ముప్పై ఎనిమిది సంవత్సరాల క్రితం స్వామి వివేకానంద గారిని నేను సిలోన్‌లో కలిసాను. అప్పుడు నేను కాలేజీ విద్యార్థిని. అయినా నేను అప్పటికే సత్యాన్వేషకుడిగా, మతం పట్ల గాఢమయిన విశ్వాసం కలవాడిని. ఇప్పుడు నేను థియోసోఫికల్ సొసైటీ సభ్యుడిని కావడం వలన స్వామీజీని మా మానుక్ లాడ్జికి వచ్చి గురువారము సాయంత్రము శాంతి సందేశాలను అందించవలసిందిగా కోరాలని నిశ్చయించుకున్నాను. ఆయన ఎంతో ప్రేమతో అందుకు అంగీకరించారు. 'జీవిత గమ్యము' అనే అంశంపై ప్రసంగించడానికి నిర్ణయించబడింది. సమయం చాలా తక్కువగానే ఉన్నప్పటికి నేను పత్రికా విలేఖరులను, ముఖ్యమయిన స్నేహితులను, సొసైటీ సభ్యులను ఆహ్వానించాను.

అది చాలా చిన్న ప్రదేశం కావటం వలన సమావేశానికి వచ్చిన వారితో కిక్కిరిసి పోయింది. అందరూ ఎంతో భక్తిశ్రద్ధలతో నిశ్శబ్దంగా స్వామీజీ మరియు సుశీలాదేవి మాటలు విన్నారు.

స్వామీజీ శ్రోతలను అప్పటిదాకా వారు విన్న విషయాలను గుర్తు చేసుకోమని చెప్పారు. బాహ్యంగా విన్న విషయాలను తొందరగా మర్చిపోతాము. కానీ అదే విషయం హృదయాంతరాళాల్లో చొచ్చుకొనిపోయి హృదయానికి హత్తుకొనిపోవటం చాలా ముఖ్యం. అప్పుడే ఆ విషయం వారికి జీవితకాలము గుర్తుండిపోతుంది. అందువలన మనము మనసు లోతుల్లోకి వెళ్ళడానికి ప్రయత్నము చేయాలి తప్ప, ఉపన్యాసాల మీద దృష్టి పెట్టకూడదు. అవి ఎంతగా మనలను ఉత్తేజితులను చేసినా, బాహ్యపరిస్థితులు మనలను ప్రభావితం చేసినప్పటికి మనం ఆత్మను మరిచిపోకూడదు అని వివరించారు.

సర్వత్రా వ్యాపించి ఉండే సర్వేశ్వరుడిని తెలుసుకోవడానికి ప్రయత్నించాలి. పరమాత్మ ఉనికిని గుర్తించినపుడు ఆయన ప్రతి జీవి హృదయంలో ప్రతిష్ఠితమై ఉన్నాడని అర్థం అవుతుంది. మన లోపల, బయటా, క్రిందా, పైనా, మన చుట్టూ అంతటా అణువణువు లోనూ పరమాత్మ నిండి ఉన్నాడు. ఆయన ఎప్పుడూ మనకంటే భిన్నంగా, వేరుగా, దూరంగా లేడు. వెలుగులీనుతున్న మన కళ్ళలో, అంతర్యామిగా మన హృదయంలో ఉన్నాడు. హృదయంలోని ఆత్మ స్వరూపాన్ని గుర్తించలేకపోతే ఇక మన జీవితాలకి పరమార్థం ఏముంటుంది? ఆ విషయం అర్థం చేసుకోలేకపోతే మన జీవితాలు వ్యర్థం అవుతాయి.

ఒక్కమాటలో జీవిత పరమార్థము, జీవన గమ్యము గురించి చెప్పాలంటే పరమాత్మను గురించి తెలుసుకోవటమే అని చెప్పాలి. అదే నిజమయిన జీవితము. భౌతికమయిన విషయాలకు అతీతమయినది, శాశ్వతమయినది, విశ్వజనీనమయినది. జంతువులకు, మానవులకి ఉన్న తేడా అంతా భగవంతుని ఉనికిని అర్థం చేసుకోవటంలోనే ఉంది. మానవాళికి భగవంతుని తెలుసుకోవటమే పూర్తి పరమార్థంగా జీవిత గమ్యం అని తెలుసుకోవాలి.

మానవ జీవితం ఐదు మెట్లుగా అర్థం చేసుకోవాలి. అవి ఖనిజము, కూరగాయలు, జంతువులు, మానవుడు, దైవదత్తమయిన జీవితము. కొందరు మానవులు కేవలం వారి భౌతికమయిన నామరూపాలకి పరిమితమయి జీవిస్తుంటారు. వారిది మొదటి మెట్టు. మరికొందరు వారి పిల్లలు, ఇతర కుటుంబ సభ్యుల గురించి మాత్రమే ఆలోచిస్తుంటారు. వారిది రెండవ మెట్టు. మరొక రకం మానవులు వారి అభ్యుదయం కోసం, వారి కుటుంబ సభ్యుల కోసం ఇతరుల మీద దాడి చేసి క్రూరంగా జంతువుల మాదిరిగా ప్రవర్తిస్తుంటారు. ఇంకొక రకం వారు కొద్దిగా ఉన్నతమయిన స్థితిని పొందినవారయి ఉంటారు. వీరు తన దేశ ప్రజలందరిని ప్రేమిస్తారు. ఇంక చివరిగా ఉన్నతోన్నత స్థితిని పొందిన మానవుడు దివ్యత్వాన్ని అనుభవిస్తూ భగవంతునితో ఏకత్వాన్ని పొందుతాడు. అతనికి అన్ని దేశాల ప్రజలు ఒక్కటే, అన్ని మతాలు ఒక్కటే, ప్రపంచమంతా అతనికి తన సొంత కుటుంబము లాగా ప్రజలందరూ తన సొంత కుటుంబ సభ్యులుగా అనిపిస్తుంది. అతనికి అందరిలో భగవంతుడే కనిపిస్తాడు తప్ప వేరు భావన కలగదు.


Peace Institute

మనము ఇతరులను ఏ కోవకు చెందుతారు అని తెలుసుకోవడానికి ప్రయత్నించే బదులుగా మనము ఏ కోవకు చెందుతామో మనల్ని మనము సరిగ్గా పరీక్షించి తెలుసుకోవడానికి ప్రయత్నించాలి. అప్పుడు మనము నెమ్మదిగా ఒక్కో మెట్టు పైకి ఎక్కటానికి ప్రయత్నించి చిట్టచివరికి ఉన్నతమయిన స్థితికి చేరుకోవాలి. జీసస్ క్రీస్తు, బుద్ధ భగవానుడు, మహమ్మదు మొదలైన మహాత్ములు మానవుల్లో గొప్ప ప్రవక్తలుగా ఎదిగిన విధంగా మనము బాగా ప్రయత్నించాలి.

అనవసరమయిన విషయాలకి ఎక్కువగా ప్రాధాన్యతనిస్తూ ఉంటారు చాలామంది. కానీ అన్నింటికన్నా అత్యవసరమయిన విషయం ఆత్మ సాక్షాత్కారము, భగవదనుభవము. దీనిని అందుకోవడానికి మనము మన నిత్య జీవిత కార్యక్రమాలను త్యాగం చేయవలసిన పనిలేదు. మనము ఎక్కడ ఉన్నప్పటికీ, ఏ పని చేస్తున్నప్పటికీ అది భగవంతునితో సంబంధం కలిగే ఉంటుంది. చర్చిగాని, దేవాలయము గాని సత్యాన్ని దర్శించడానికి అవసరం లేదు. ఎందుచేతనంటే జీవితము, మతము రెండూ వేరు కాదు. అవి రెండూ ఒక్కటే. అందువలన చర్చి వదిలిన తర్వాత భగవంతుడిని మర్చిపోకూడదు. మనతో పాటుగా మనం ఎక్కడికి వెళ్ళినా దేవుడు మనతోనే ఉంటాడు అని గుర్తు పెట్టుకోవాలి. ఆయన వైభవాన్ని, ఆనందాన్ని, తేజస్సును, ఉనికిని నిరంతరము మనము అనుభవిస్తుండాలి.

మనము భగవంతుడిని తెలుసుకోవాలంటే, భగవదనుభూతిని పొందాలంటే అంతటా, అందరిలో ఆయనని దర్శించాలంటే మనలను మనము భగవంతునికి మనస్ఫూర్తిగా అంకితం చేసుకోవాలి. అప్పుడు మన హృదయంలో సంపూర్ణమయిన శాంతి నెలకొంటుంది. మనము ప్రపంచాన్ని మార్చివేయలేము కానీ మనలను మనము మార్చుకోగలము. ఎప్పుడయితే మన హృదయంలో శాంతిని నెలకొల్పుతామో అప్పుడు ఇతరుల హృదయాలను శాంతితో నింపగలుగుతాము. అప్పుడిక ఆ శాంతి ప్రాంతాలను, దేశాలను దాటి యావత్తు ప్రపంచానికి అందుతుంది. ప్రపంచానికి శాంతిని అందించడానికి ఒకే ఒక మార్గము మనలో వ్యక్తిగత శాంతిని హృదయంలో నిండే విధంగా ప్రయత్నించటమే. మన హృదయము, బుద్ధి, ఆత్మ నిత్యము సత్యము అయిన పరమాత్మ అనుభవముతో నిండిపోతుందో అప్పుడు మనము ఆ అనుగ్రహాన్ని, ఆశీస్సులను

మన ఇంటి నుండి మనవారందరికి, దేశానికి ఇంకా యావత్తు ప్రపంచానికి అందించ గల్గుతాము.

ప్రార్థన, ధ్యానము, ఆత్మసాక్షాత్కారానికి దారితీస్తాయి. "నిశ్చలంగా ఉండు, అప్పుడే నీ లోని దివ్యత్వాన్ని, భగవతత్త్వాన్ని నీవు తెలుసుకోగలుగుతావు" అని చెప్పబడుతోంది.

ఇంక స్వామీజీ ప్రసంగాన్ని ముగించే ముందు ధ్యాన పద్ధతులను గూర్చి వివరించారు. అక్కడ సమావేశమయిన భక్తులందరిని ఉద్దేశించి ఏ విధంగా ధ్యానం చేయాలో వారితో చేయించారు. ఓంకారాన్ని మూడు పర్యాయాలు ఉచ్చరించి ప్రసంగాన్ని ముగించారు. వింటున్న శ్రోతలు స్వామీజీ ప్రసంగాన్ని మంత్రముగ్ధులయి విన్నారు. వారిలో చాలా మంది స్వామీజీని, సోదరి సుశీలాదేవిని వ్యక్తిగతంగా కలుసుకుని మాట్లాడడానికి ఆసక్తిగా ఉండిపోయారు.

మరుసటి రోజు నా స్నేహితుడు హాంగ్‌కాంగ్ దీవిలోని వివిధ దర్శనీయ స్థలాలని స్వామీజీకి చూపించడానికి కారులో తీసుకువెళ్ళాడు. ఆ రోజు అర్ధరాత్రి దాటిన తర్వాత 'ప్రెసిడెంట్ జాఫర్‌సన్' అనే పేరుగల ఓడలో స్వామీజీ, సుశీలాదేవి సీటిల్ వాషింగ్‌టన్ యు.ఎస్.ఎ. బయలుదేరారు. నేను, నా భార్య మరికొందరు స్నేహితులతో కలిసి వారికి వీడ్కోలు చెప్పి వారి ప్రయాణం సుఖంగా జరగాలని సందేశం ఇచ్చి వచ్చాము.

అధ్యాయం - 47

# అమెరికా వారు స్వాగతం పలికారు - జులై, 1937

స్వామీజీ మరియు సుశీలాదేవి భారతదేశం ఎల్లలు మార్చి 6వ తేదీ 1937లో దాటారు. మే 20వ తేదీ నాటికి క్షేమంగా, ఆరోగ్యంగా అమెరికాలోని ఫిలడెల్ఫియా చేరుకున్నారు. మార్గమధ్యంలో వారు రంగూన్, హాంగ్‌కాంగ్, షాంగై, టోక్యో, షియాటిల్ మరియు వాషింగ్‌టన్ మొదలైన ప్రదేశాల్లో ఆగారు. అక్కడి ప్రజలందరూ ఎంతో భక్తి శ్రద్ధలతో వారిని స్వాగతించారు. ఇప్పుడు వారిద్దరూ ఫిలడెల్ఫియా శాంతి కేంద్రంలో విడిది చేశారు.

## ఫిలడెల్ఫియాలో కార్యక్రమాలు

ఫిలడెల్ఫియా చేరుకోగానే స్వామీజీ శాంతానంద (డా॥ డేనియల్) మరియు సుశీలాదేవి సహకారంతో తమ నిస్వార్థమయిన మరియు ప్రేమపూరితమయిన శాంతి సందేశాలను ప్రచారము చేయటం ప్రారంభించారు. ధ్యానమందిరం చాలా అందంగా పూలతో అలంకరించ బడింది. డా॥ లెట్విన్ గారు 'ఓంకారాన్ని' చక్కగా అమర్చగా ఇతర సభ్యులు ఆధ్యాత్మికోన్నతమయిన వాతావరణాన్ని కల్గించారు. స్వామీజీ 'నలభై రోజులు అంతర్ముఖ స్థితిలో' మీద ప్రతి రోజూ చాలా చక్కని సందేశాలను, మంత్ర దీక్షలను ఇచ్చారు. పండుగ వాతావరణంలో చాలా సరళంగా, పవిత్రంగా, పాశ్చాత్యులకు అనుసరణీయంగా రూపుదిద్దుకున్న విధంగా వారికి అందించారు. చెన్నయ తన పవిత్రమయిన సంగీతంతో పండగ వాతావరణాన్ని కల్పించాడు. అందువలన శ్రోతలకు వీనులవిందుగా స్వామీజీతో గంటల తరబడి గడిపే అవకాశం లభించింది.

ఎందరో పవిత్రమయిన హృదయము గలవారు స్వామీజీ మాటలకి మంత్ర ముగ్ధులయి పోయారు. పవిత్రమయిన శాంతికిరణాలు గురుదేవుల హృదయం నుండి వెలువడి వారందరి జీవితాలను పునీతుల గావించాయి. వారి హృదయాలు శాంతిమయంగా మారి ఒకరి హృదయం నుండి మరొకరి హృదయానికి ఆ తరంగాలు వ్యాపించాయి.

అంతర్ముఖస్థితిని పొందాలని కోరుకునేవారితో పాటు స్వామీజీ ఎందరో సత్యాన్వేషకులకు ప్రత్యేకంగా, వ్యక్తిగతంగా మంత్ర దీక్షలు ప్రసాదించి ప్రబోధాలు అందించేవారు. వారికి సాధనకి అవసరమయిన సూచనలు ఇచ్చేవారు. క్రొత్తగా వచ్చే వారితో పాటు అంతకు పూర్వమే స్వామీజీకి అంతరంగ భక్తులు, అనుచరులు, సాధకులు శాంతి కేంద్రాలను నెలకొల్పిన పవిత్ర స్వరూపులు అందరితో స్వామీజీ ప్రతినిత్యం కాలం గడిపేవారు.

స్వామీజీ అమెరికా తిరిగివచ్చారు అనే వార్త తెలుసుకున్న ఎందరో భక్తులు స్నేహితులు ఎంతో దూర ప్రాంతాల నుండి వారి దర్శనం కోసం రాసాగారు. వారిని చూచి సుశీలాదేవి వారితో భారతదేశంలో భక్తులు సాధు మహాత్ముల దర్శనం కోసం ఎంతో వ్యయప్రయాసలకు ఓర్చి చాలా దూరం నుండి వచ్చి మహాత్ముల పాదసన్నిధిలో కూర్చుని

ఎంతో భక్తి శ్రద్ధలతో ఆ బ్రహ్మజ్ఞానుల నుండి వర్షించే అమృత బిందువుల కోసం ఎదురు చూస్తుంటారని వివరించారు.

శ్రీమతి మరియు శ్రీ హేవార్డు గారు న్యూయార్క్ నగరంలోని వారి నివాసంలో స్నేహితులందరిని పిలిచి ప్రతివారము స్వామీజీతో సత్సంగము జరిపించేవారు. జ్ఞానాదేవి, సోదరి సుశీలాదేవి వారికి సహకరించేవారు. స్వామీజీ వచ్చిన వారందరికి మంత్రదీక్ష ఇచ్చి ఎంతో ఉత్తేజభరితమయిన ప్రసంగాలు చేస్తూ వారిలో ఆధ్యాత్మిక వికాసాన్ని, ప్రేమ, శాంతి, తేజస్సు అందించేవారు. "భగవదనుభూతిని పొందటం ద్వారా ఆత్మ సాక్షాత్కారము" అనే పేరుతో కొందరు స్నేహితులు స్వామీజీ నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలకి పేరు పెట్టారు. ఇంతకు పూర్వము ఎవ్వరూ నేర్పించని విధంగా ఒక సరిక్రొత్త ప్రణాళికను స్వామీజీ రూపొందించారు. అద్భుతము, ఆధ్యాత్మికము తొణికిసలాడే ఈ సమావేశాలను వర్ణించడానికి, వివరించడానికి మాటలు సరిపోవు అని చెప్పాల్సి ఉంటుంది. అక్కడ అందరూ కలిసి ఒక్కటే అనే ఏకత్వభావనని పొందేవారు. సమావేశము జరిగే ప్రదేశములో తూర్పుదేశం వారి ఆచార సంస్కృతులు అలంకరణ ఒక దివ్యానుభవాన్ని అందించేది. అలాగే సనాతన ధర్మం గురించి భారతీయ సాధు మహాత్ముని నోటి వెంట వెలువడే ఆధ్యాత్మిక ప్రసంగాలు శ్రవణం చేస్తున్నప్పుడు అక్కడి పాశ్చాత్యుల హృదయాలలో శాంతి ప్రవాహం వెల్లువలా పొంగి పొరలేది. ఎంతో గొప్ప అద్భుతంలాగా ప్రేమ తరుచుగా వారి హృదయాలను నింపివేసి ఉక్కిరిబిక్కిరి చేసివేసి అది జలపాతంలాగా ఉరకలెత్తుతూ కన్నీటి రూపంగా బయటపడేది. ఆ కన్నీరు పవిత్రమయిన ఆనందబాష్పాలు, శాంతి మార్గానికి బాటలు వేసే పవిత్ర ఆత్మ స్వరూపులయిన స్వామీజీ, సుశీలాదేవి ఆశీస్సులు అందరికి లభించుగాక!

శ్రీమతి జేన్.డి. లిల్లీ, శాంతిదేవి మొదలైనవారు శాంతి ఆశ్రమానికి బాగా పాత భక్తులు. శాంతి స్థాపన కోసం పనిచేసేవారు. అమెరికాలో వారింట్లో దీని కోసం వారు ఎన్నో కార్యక్రమాలు ఏర్పాటు చేసేవారు. స్వామీజీ ప్రతివారం సమావేశాలు ఏర్పాటు చేసేవారు. ఆసక్తి కలవారందరూ వస్తుండేవారు. నిస్వార్థమయిన, ప్రేమమయ, హృదయపూర్వకమయిన ప్రయత్నాలు తప్పకుండా తగిన ఫలితాలను అందిస్తాయి.

బ్రదర్ కెట్నర్ ఆధ్వర్యంలో బయోసోఫికల్ సంస్థ వారు స్వామీజీని 'స్పినోజా' అనే గొప్ప వ్యక్తి పుట్టినరోజు నాడు ఆత్మ జ్ఞానోపదేశము కలిగించే సందేశాన్ని ఇవ్వవలసిందిగా

ఆహ్వానించారు. స్వామీజీ చేసిన ప్రసంగం ఆయన హృదయపు లోతుల్లోంచి జ్ఞానామృతాన్ని వర్షింపచేసింది. ప్రతి ఒక్కరూ ఎంతో కృతజ్ఞతా భావంతో హృదయపూర్వకంగా వారికి లభించిన జ్ఞానలబ్ధికి ధన్యవాదాలు తెలియచేసుకున్నారు. పూజ్య స్వామీజీ, సోదరి సుశీలాదేవి మరియు శాంతి మిషన్ సభ్యులు అందరూ ఎంతగానో సంతోషించారు. బ్రదర్ కెట్నర్ మరియు అతని సహచరులు ఎంతో స్నేహపూరితమయిన హృదయం కలవారు, శాంతి కాముకులు, యువకులు, ఉత్సాహభరితమయిన వారి నిస్వార్ధ సేవా తత్పరత, సత్యాన్వేషణ పట్ల వారికి గల ఆసక్తి గమనించి అలాంటి ఆధ్యాత్మిక స్ఫూర్తి గల వారితో పరిచయం ఏర్పడినందుకు స్వామీజీ ఆనందించారు. ముందు ముందు వారందరూ స్వామీజీతో కలిసి శాంతి సందేశాలను ప్రచారం చేయటంలో భాగస్వాములు అవుతారు.

## స్వామి ఓంకార్ కేప్‌కాడ్‌లో - జ్ఞానాదేవి

మా హృదయాలు ఆనందంతో నిండిపోయాయి స్వామీజీ చిరునవ్వు ముఖాన్ని రైలు కిటికీ నుండి చూడగానే. ఆయన మా ప్రశాంతమయిన కేప్‌కాడ్ ఇంటిలో పది రోజులు విడిది చేయడానికి వచ్చారు. ఆ ఇంటి చుట్టూ అందమయిన ఎంతో పొడవైన దేవదారు వృక్షాలతో నిండి ఉంటుంది. ఆ దేవదారు వృక్షాలతో నిండిన అడవి లాంటి ప్రదేశం దాటగానే సముద్రపు పాయ ఒకటి చిన్న ఏరులాగా ప్రవహిస్తుంటుంది. దాని తర్వాత కొద్దిగా మైదాన ప్రదేశం దాటగానే అంతులేని జలరాశితో సముద్రం ఉంటుంది. ప్రకృతి సౌందర్యంతో అలరారే మా ఇంటి వాతావరణం చూడగానే స్వామీజీకి సంతోషంతో ముఖం వికసించింది. ఆయన తన ఆనందాన్ని మాటల్లో వ్యక్తం చేశారు.

స్వామీజీ ఉన్నంతకాలము భగవంతుని వైభవాన్ని, గొప్పతనాన్ని పొగడుతూ మాట్లాడుతూనే ఉన్నారు. స్వామీజీ గొప్ప సంకల్పము ఒక్కటే, ఒక్క నిముషము కూడా వృధా చేసుకోకుండా, బుద్ధిని వికసింప చేసుకుని విలువైన వర్తమానాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నతోన్నత స్థితికి అందరూ చేరుకోవాలి. అదే మనము చేయవలసిన కర్తవ్యం. అయినా పాశ్చాత్యుల జీవన విధానానికి అది చాలా కష్టంగా అనిపిస్తుంది. రివరెండ్ హిబ్బర్డ్ గారు ఉత్తమ ఆధ్యాత్మిక వికాసం పొందిన వ్యక్తి. స్వామీజీని వైట్ ఓస్టర్‌విల్లి కమ్యూనిటీ చర్చికి వచ్చి ఉపన్యసించవలసిందిగా ఆహ్వానించారు. స్వామీజీ అక్కడ రెండు అద్భుతమయిన ప్రసంగాలు చేశారు.

ప్రతి రోజు స్వామీజీ మాతో కలిసి సముద్రపు ఒడ్డున ఉన్న బీచ్‌కి వస్తూ ఉండేవారు. మూడు రోజులు సాధన చేసిన తర్వాత స్వామీజీ సముద్రపు నీటిలో ఈదటము, నీటిపై తేలటము అలవాటు చేసుకున్నారు. ప్రకృతిలో అనుసంధానము పొందగల్గిన కొద్దిమందికి మాత్రమే అలాంటి అవకాశం వస్తుందని స్వామీజీ అభిప్రాయము. ఆయన దానిని ఎంతగానో ఆస్వాదించి ఆనందించేవారు. పాశ్చాత్యులు భగవంతుని అనుభవాలను కేవలం తూర్పుదేశాల వాళ్ళు మాత్రమే పొందగలరని, అది వారికి అసాధ్యమని అనుకుంటూ ఉంటారు. కాని సరయిన అవగాహన, క్రమశిక్షణ, సూచనలు, ఆచరణ, ఏకాగ్రత మొదలైన వాటి వలన సాధన చేసినప్పుడు అది వారికి కూడా సాధ్యపడుతుంది. దాని వలన వారికి మానసిక శాంతి లభిస్తుంది. విశ్వ ప్రేమ, విశ్వశాంతి వారికి కూడా సొంతమవుతాయి.

స్వామీజీకి సహజంగానే హాస్యధోరణి ఉంది. ఆయన చాలా త్వరగా స్పందించి చిరునవ్వులు చిందించడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. ఆయన వారు చేసిన అద్భుతమయిన ప్రసంగాల విషయం వచ్చినప్పుడు కూడా సరదాగా నవ్వించడానికి ప్రయత్నిస్తుంటారు. స్వామీజీ ఎల్లప్పుడూ చాలా ఉషారుగా, చిరునవ్వులు చిందిస్తూ, ఆహ్లాదంగా, చల్లగా నీటి తుంపరలు వెదజల్లే జలపాతంలాగా దివ్యత్వాన్ని, తేజస్సును వెలువరిస్తూ ఉంటారు.

స్వామి ఓంకార్‌జీ గారికి జాతి, మతము బేధము ఎంత మాత్రమూ లేదు. వారు అందరిపట్లా ప్రేమగా, శాంతిగా, ఒక సోదరుడిలాగా వ్యవహరిస్తారు. ఆయన ప్రపంచానికి భగవంతుడు ప్రసాదించిన వరం వంటివారు. ఈనాటి ప్రపంచానికి అల్లకల్లోలంలో, సంక్షోభంలో మునిగిపోతున్న స్థితిలో స్వామీజీ వంటి వారి అవసరం చాలా ఉంది.

ఈ ప్రపంచం ఒక్క క్షణం తన తీరికలేని దైనందిన జీవితంలోనుండి బయటికి వచ్చి స్వామీజీ ఎంతో సరళంగా నిస్వార్థమయిన ప్రేమ గురించి, సర్వమానవ సౌభ్రాతృత్వం గురించి, విశ్వశాంతి గురించి చేసే ప్రసంగాలు విని, వాటిని ఆచరించినట్లయితే గనుక అతి తొందరలోనే ఈ ప్రపంచం అంతా భగవంతుని దివ్యధామంలా, బృందావనంలా అందమయిన పూల సౌరభంతో, శాంతి పుష్పాలతో నిండిపోతుంది. నక్షత్రాలు సంతోషంతో దివ్యగానాన్ని వినిపిస్తాయి.

ఓం..ఓం..ఓం..

## అధ్యాయం - 48

# ప్రేమ మతము

ప్రతి సత్యాన్వేషకుడు ప్రేమ మతము పట్ల బలమయిన విశ్వాసము కలిగి ఉండటమే కాకుండా, అతడు ప్రతి ఒక్కరిని, ఎవ్వరినీ వదిలిపెట్టకుండా మనఃస్ఫూర్తిగా ప్రేమించే ఆరాధకుడయి ఉంటాడు. ప్రేమ మతంలో ఎలాంటి ఆర్భాటాలు, ఉత్సవాలు, ప్రసంగాలు అవసరముండవు. బాహ్యమయిన ప్రబోధాలు అస్సలు అవసరం లేదు. కావలసినదల్లా మంచి హృదయము మాత్రమే. ఆ హృదయం నిండా ప్రేమ నిండిపోయి ఉండాలి. నీ తోటి సోదర సోదరీమణుల ముఖాలను చూచినప్పుడు ఆ అనంతమయిన ప్రేమ, అనుబంధము కలగాలి. ఏదయితే వారిలో నీకు కనిపిస్తుందో అదే భగవంతుని తత్త్వము. నీ హృదయంలో కొలువై ఉన్నవాడు అతడే. ప్రేమ మతంలో మాటలకంటే నీ జీవితంలో ఏదయితే నిజంగా ఆచరిస్తూ వస్తావో అది మిక్కిలి విలువైనది. అదే ఆదర్శవంత మయినది.

నేను న్యూయార్క్ నగరంలో సోదరి సుశీలాదేవి, ఆమె తండ్రితో కలిసి రెండు వారాలు వారింటిలో కాలం గడిపాను. తరుచుగా నేను బజారుకు వెళ్ళి కుటుంబ అవసరాలకి కావలసిన సరుకులు తీసుకురావడానికి ఉత్సాహం చూపేవాడిని. ఆ ఇంటికి దగ్గరలోనే ఐదుగురు అన్నదమ్ములు కలిసి ఒక అంగడిని నడిపేవారు. నేను వెళ్ళినప్పుడల్లా ఆ అన్నదమ్ములు వారిలో వారు నాకు సరుకులు ఇవ్వడానికి పోటీ పడేవారు. వారిలో ఒకరు నాతో "స్వామీజీ! మీ వంటి మంచి స్నేహితులకు సరుకులు ఇవ్వటం నాకు చాలా సంతోషంగా ఉంటుంది" అనేవాడు. దుకాణం నడిపే పెద్ద అన్నగారు నాతో "సోదరా! మీకు ఏమి కావాల్సి వచ్చినా నా దుకాణం నుండి తీసుకువెళ్ళండి. కూరగాయలు, పళ్ళు అన్నీ తీసుకోండి. మీకు ఎప్పుడయినా డబ్బు అవసరం అయితే నా దగ్గర తీసుకోండి" అని చెప్పాడు. నా హృదయం వారి పవిత్రమయిన భక్తి, ప్రేమలకు సంతోషంతో ఉప్పొంగిపోయింది.

ఆ దుకాణం పక్కనే సిగరెట్లు అమ్మే దుకాణం ఉంది. అక్కడ వారు దినపత్రికలు కూడా అమ్మేవారు. టెలిఫోన్ బూత్ కూడా ఉండేది. తరుచుగా అందులో ఒక ఆవిడ, ఇద్దరు మగవారు ఉండేవారు. నేను వెళ్ళినప్పుడల్లా వారు ఎంతో గౌరవంతో లేచి

నిలబడేవారు. వారు నాతో, నా కోసం వచ్చే టెలిఫోన్ కబురు ఏదయినా నాకు తెలియచేయడానికి ఎంతో సంతోషంగా ఉంటుందని చెప్పేవారు. అది విని నా మనస్సు ఎంతో సంతోషించింది. నేను ఒక విషయం వ్రాసుకోవాల్సి వచ్చి వారిని పెన్సిల్ అడిగి తీసుకున్నాను. ఒక రోజు అలా తీసుకున్న పెన్సిల్ తర్వాత మరిచిపోయి నా జేబులో పెట్టుకొని ఇంటికి వెళ్ళిపోయాను. మరుసటి రోజు, నా తప్పు గ్రహించి చాలా సిగ్గుపడిపోయాను. వారి వద్దకు వెళ్ళి క్షమాపణ కోరాను. దుకాణంలోని స్త్రీ క్రొత్త బాక్సు తీసి అందులోని క్రొత్త పెన్సిల్ తీసుకోమని చెప్పటం నాకు చాలా ఆశ్చర్యం కలిగించింది. ఆమె నన్ను రెండు పెన్సిళ్లు ఉంచుకోమని చెప్పింది. నాకప్పుడు ఆమె పట్ల కల్గిన కృతజ్ఞతా భావాన్ని మాటల్లో వర్ణించలేను. ఆమె దయాగుణము చూచి నాకు తన్మయత్వం కలిగింది. ఈ విధమయిన మృదుత్వము ప్రత్యక్షంగా ప్రేమమతాన్ని ఋజువు చేస్తుంది. సిగరెట్టు దుకాణం ప్రక్కనే ఒక నిరుపేద చిన్‌మన్ అనే చైనా వ్యక్తి ఇస్త్రీ దుకాణం నడిపేవాడు. అతను కూడా ఎంతో మంచివాడు, దయ, ప్రేమ గుణాలున్న వ్యక్తి. నన్ను చూడగానే తలవంచి నమస్కరించేవాడు. తర్వాత పూల దుకాణం ఉండేది. ఒక రోజు పూల దుకాణం యజమాని నన్ను పిలిచి “మీకు పూలు అంటే ఇష్టం అని నాకు అనిపిస్తోంది. దయచేసి ఈ పూలగుత్తి నా బహుమతిగా తీసుకువెళ్ళండి” అని చెప్పాడు. ఇంకొక పర్యాయం భగవంతుని ప్రేమకి నా హృదయం ద్రవించింది.

పక్కనే దుస్తులు అమ్మే దుకాణం ఉండేది. అందులో రకరకాల దుస్తులు అమ్మేవారు. అందులో చాలా మంది పనివారుండేవారు. ఆ దుకాణం యజమాని నాతో “స్వామీజీ! నా పనివారికి మీకు కావల్సినవి ఇవ్వటం చేతకాదు. మీకు ఏ అవసరం వచ్చినా నా వద్దకు రండి. నేను మీకు కావాల్సినవన్నీ ఇస్తాను” అని చెప్పాడు. ఆ పక్కనే పూల మొక్కల దుకాణంలో ఐదు, పది సెంట్లకు వస్తువులు దొరుకుతాయి. అక్కడ నేను ఒక పూల మొక్క తీసుకున్నాను. నేను అటు వెళ్ళినప్పుడల్లా ఆ అమ్మాయి మొక్క ఎలా పెరుగుతోంది అని అడుగుతుండేది. నేను ఆమెతో నా మొక్కకు వచ్చే ఇబ్బందులు గురించి కొన్నిసార్లు, బాగా ఎదుగుతోందని కొన్నిసార్లు సంతోషంగా చెప్పేవాడిని. ఆమె దాని సంరక్షణ గురించి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో నాకు చెపుతుండేది. ఆమె చాలా మంచిది, అలాగే దయాగుణము కలది. ఆ దారి వెంట వెళుతున్నప్పుడు నాకు చాలా ఆనందంగా అనిపించేది. ఇది ప్రేమ మతము కాదా? అవతలి వ్యక్తి పేరు, జాతి, మతము తెలియకపోయినా వాళ్ళ ముఖం చూడగానే భగవంతుడు మనకు గుర్తుకు

వస్తుంటే అదే కదా ప్రేమ మతము? ఆ విధంగా నేను అనేకులను కలిసినప్పుడు వారితో మాట్లాడినప్పుడు కొన్ని వందల సంఘటనలు నా హృదయాన్ని కదిలించి వేశాయి. అవన్నీ కూడా ప్రేమ మతాన్ని గుర్తుకు తెచ్చేవే. కేవలం కొన్ని సంఘటనలను గూర్చి మాత్రమే నేను మీకు వివరించాను.

ఒకసారి సుశీలాదేవి తండ్రి గారికి జుత్తు కత్తిరించవలసి వచ్చింది. కాని ఆయన వయస్సులో పెద్దవారు కావటం వలన బయటికి రాలేరు. అందువలన నేను వారితో ఎవరయినా మంగలి పనిచేసే వ్యక్తి దొరికితే ఆయన కోసం ఇంటికి తీసుకువస్తాను అని చెప్పాను. నేను తరచుగా వెళ్ళి జుట్టు కత్తిరించుకునే దగ్గరిలోని మంగలి వద్దకు వెళ్ళి అతడిని ఇంటికి వచ్చి నోవాల్డ్ గారికి జుట్టు కత్తిరిస్తావా? అని అడిగారు. అప్పుడు అతడు పనితో తీరికలేకుండా ఉన్నాడు. నావైపు చూచి అతను మీ తండ్రిగారా! అని అడిగారు. నేను నవ్వుతూ తప్పకుండా నా తండ్రి లాంటి వాడేనని చెప్పాను. వెంటనే ఆ మంగలి వ్యక్తి నవ్వుతూ మీతో వస్తానని చెప్పి దుకాణం మూసివేసి నాతోపాటుగా వచ్చి తండ్రిలాంటి నోవాల్డ్ గారికి జుట్టు కత్తిరించాడు. దానికి అతను డబ్బులు కూడా తీసుకోలేదు. ఎందుకు అని అడిగితే, “స్వామీజీ! మీరు చాలా మంచివారు. భగవంతుని పనిచేస్తున్నారు, మీరంటే నాకు ఎంతో ప్రేమ” అని చెప్పాడు. భగవంతుని తలుచుకొని, ఆ మంగలివాని దయాహృదయానికి జోహార్లు అర్పించాను. నా కళ్ళ వెంట ఆనంద భాష్పాలు జాలువారాయి. అదే కదా ప్రేమ మతము.

అలాంటిదే మరొక సంఘటన న్యూయార్క్ నగరంలోని “సిలోన్ ఇండియా ఇన్’లో జరిగించి గుర్తుకు వస్తోంది. అక్కడ నేను బుద్ధ జయంతి సందర్భంగా ప్రవచనం చేశాను. అందులో పనిచేసే ఒక బౌద్ధ మతస్థుడు ఆ కార్యక్రమాన్ని జరిపించాడు. అతను ప్రారంభంలో పాళి భాషలో బుద్ధుని గురించి కొన్ని విషయాలు చెప్పాడు. ఆ తర్వాత వివిధ దేశాల నుండి వచ్చిన అనేకమంది పాండిత్యం గల ఉపన్యాసకులు మాట్లాడారు. నేను కూడా నా సందేశాన్ని అందించాను. అంతటా నిశ్శబ్దం అలుముకుపోయింది. కార్యక్రమం పూర్తి అయిన తర్వాత బౌద్ధ సోదరుడు నా వద్దకు వచ్చి కళ్ళ నిండా ఆనంద బాష్పాలతో “ఓ స్వామీజీ! నాకు నిజంగా తెలియదు. మీరు నిజమయిన బౌద్ధులు” అన్నాడు. అతని మాటలు నా హృదయాన్ని కదిలించివేశాయి. నేను అతనితో “అంతా

బుద్ధ భగవానుని అనుగ్రహమే. ఆయన ప్రేమ, దయ, నిర్వాణ సుఖము పొందిన భగవానుడు” అని చెప్పాను.

తర్వాత వారము నన్ను కొంతమంది స్నేహితులు అదే హోటల్‌కి తీసుకువెళ్ళారు. మా భోజనము పూర్తి అయిన తర్వాత టిప్‌గా కొంత డబ్బు ఇస్తే మాకు వడ్డించిన ఆ బౌద్ధుడు తీసుకోవడానికి నిరాకరించాడు. “మీరు నాకు సొంత సోదరుడి లాంటి వారు. మీ వద్ద టిప్ తీసుకోను” అని చెప్పాడు. ఈ విధంగా పరమాత్మ అనేక సంఘటనల ద్వారా, అనేక మంది ద్వారా ప్రేమ మతాన్ని వివరిస్తున్నాడు.

నేను ఎప్పుడూ మా వీధిలో నడిచివెళుతున్నా, ప్రతి ఒక్కరూ ప్రతి దుకాణంలోని వారు నన్ను చూచి నవ్వుతూ పలకరించి, నమస్కారం చేసేవారు. నాతో ఎంతో ప్రేమతో, దయతో మాట్లాడేవారు. నేను స్నేహితులతో కలిసి నడిచేటప్పుడు ప్రతి ఒక్కరూ “సార్! బాగున్నారా?” “స్వామీజీ! ఎలా ఉన్నారు?”, “స్వామీజీ! మీకు ఏమయినా సహాయం కావాలా?” అని అడుగుతూ ఉండేవారు. ప్రతిసారి నేను ఆ దారిలో నడిచేటప్పుడు నాకు పవిత్రమయిన చర్చి ప్రదేశంలో నడుస్తున్నట్లు అనిపించేది. నాకు ప్రతి వ్యక్తిలోనూ, ఆ దేవుడే కనిపించేవాడు.

అన్నింటికన్నా ఆశ్చర్యకరమయిన విషయం ఏమిటంటే నేను ఎప్పుడూ వీరిలో ఏ ఒక్కరితో కూడా నా మతాన్ని గురించి గాని, నా జాతిని గురించి గాని మాట్లాడలేదు. నాకు కనీసం వారి పేర్లు కూడా తెలియవు. అక్కడ అన్ని దేశాల వారు ఉన్నారు. ఆర్మేనియన్లు, అమెరికన్లు, ఇటాలియన్లు, స్పానిష్ వాళ్లు, జర్మన్ వాళ్ళు, చైనా దేశస్థులు, గ్రీస్ దేశం వాళ్ళు, బ్రిటన్ దేశం వాళ్ళు ఉన్నారు. అయినా జాతి మతాలకు అతీతంగా మేమందరము ఒకరికొకరము మనస్ఫూర్తిగా ప్రేమించుకుంటున్నాము. మేమంతా భగవంతుని అనుభూతిని పొందుతున్నాము. ఎందుకంటే ఆ పరమాత్మ అనుగ్రహంతో మేమందరము బంధించబడ్డాము. ఆయన దివ్యమైన ప్రేమను పొందుతున్నాము. అందువలన ఇంక జాతి మతాల గురించి చర్చించుకోవటం గాని, మాట్లాడుకోవటం గాని అవసరం ఏముంది? అవన్నీ కూడా నిరర్థకమయిన మాటలు.

ఒకరోజు బాగా పనిలో అలసిపోయాను. బస్సులో తిరిగి వస్తున్నాము. ఎందుకో ఆ రోజు చాలా నిరాశగా అనిపించసాగింది. ఆ బస్సు కండెక్టరు నా వద్దకు వచ్చి హిట్లరు,

ముస్సోలిన్, స్టాలిన్, ఫ్రాన్‌కో గురించి మాట్లాడటం మొదలుపెట్టాడు. చివరికి మహాత్మాగాంధీ గురించి మాట్లాడసాగాడు. అప్పుడు నేను అతనితో "ప్రేమ ఎక్కడ ఉంటుందో భగవంతుడు అక్కడ ఉంటాడు. లోలోపల శాంతి అనేది నీ హృదయంలో నుండి మొదలవ్వాలి. వ్యక్తిగత శాంతి వల్లనే ప్రపంచశాంతి సాధ్యమవుతుంది" అని చెప్పాను. అప్పుడు అతను సంతోషంతో ఎగిరి గంతులు వేస్తూ నా వద్దకు వచ్చి నా చేతులు పట్టుకొని "ప్రియమైన సోదరుడా! మీ మతము ప్రపంచంలోని మతాలన్నింటిలోకి చాలా గొప్పది" అంటూ దాదాపుగా నన్ను కౌగిలించుకున్నంత పని చేశాడు. అతనిలో నా పట్ల నిజమయిన ఆత్మీయతా భావం కనిపించింది. నేను బస్సు దిగేటప్పుడు కొంచెం ఎక్కువ సమయం ఆపి, శాంతి సందేశాలను పంపించవలసిందిగా కోరుతూ అతని చిరునామా ఇచ్చాడు. ఈ సంఘటన వలన అప్పటిదాకా నాలో ఉన్న నిరుత్సాహం దూరమయి పోయింది. భగవంతుని ప్రేమ ఇంకొక రూపంలో దర్శన మయ్యింది. నేను గాలిలో తేలుతున్నట్లుగా నడుస్తూ ఆ పరమాత్మ దివ్యానుభూతిలో మునిగిపోయాను. ఆ బస్సు కండెక్టరు నాకు జీవితకాలము స్నేహితుడిగా మారాడు.

మా శాంతి కేంద్రము అడవి లాంటి ప్రదేశంలో ఏ పట్టణానికయినా చాలా దూరంగా ఉండేది. సోదరి సుశీలాదేవి ఇంకా ఇతర స్నేహితులు మా శాంతి ఫౌండేషన్ కోసం ఒక చిన్న విల్లిస్ కారు తీసుకున్నారు. ఆశ్రమ సేవలకు ఏదయినా అత్యవసరమయిన పనుల కోసం, అనారోగ్యం కల్గినప్పుడు ఉపయోగపడుతుందని వారు భావించారు. అయితే ఆ కారుకి ఇంకా చాలా అవసరమయినవి అమర్చవలసి వచ్చింది. సామాన్లు పెట్టుకోవడానికి, సిగ్నల్స్ మొదలైనవి అవసరము అయ్యాయి. దానికోసం నా స్నేహితుడు ఒకరు ఆ కారుని మోటారు షాపుకి తీసుకువెళ్ళి రోడ్డు మీద వదిలిపెట్టాడు. వెంటనే పోలీస్ అక్కడికి వచ్చి "ఇక్కడ కారు నిలుపకూడదు. అందువలన జరిమానా కట్టాలి" అని చెప్పి కారు లైసెన్సు చూచి "స్వామీజీ ఎక్కడ?" అని అడిగాడు. నా స్నేహితుడు అతడితో "ఏ స్వామీజీ గురించి అడుగుతున్నారు?" అని ప్రశ్నించగానే అతడు "స్వామి ఓంకార్ గారు. ఈ కారుమీద శాంతికేంద్రము గుర్తులున్నాయి" అన్నాడు. అప్పుడు నా స్నేహితుడు "మీకు ఆయన ఏ విధంగా తెలుసు?" అని అడిగాడు. దానికి అతను నవ్వుతూ "నేను ఒక పర్యాయం శ్రీమతి విల్లిస్ గారి ఇంట్లో జరిగిన శాంతి సమావేశానికి హాజరయ్యాను. మీరు ఇక్కడ మీ కారును ఎంతసేపు అయినా ఆపి ఉంచవచ్చును" అని నవ్వుతూ వెళ్ళిపోయాడు.

నా స్నేహితుడు ఈ విషయాలన్నీ నాకు వివరించి చెప్పినప్పుడు నేను ఎంతగా సంతోషించానో మీకు వివరంగా చెప్పవలసిన అవసరం లేదు అనుకుంటాను. ఇది మరొక చక్కని అనుభవము. శాంతి ఏ విధంగా హృదయాలను పరివర్తనం చేస్తుందో, ఒక హృదయంనుండి మరొక హృదయానికి ఏ విధంగా వ్యాపిస్తుందో, నిశ్శబ్దంగా అది ఎలా పని చేస్తుందో, చివరికి ప్రపంచం యావత్తు శాంతి తరంగాలను ఏ విధంగా ప్రసరింప చేస్తుందో అర్థమవుతుంది. మా కారు మీద బంగారు రంగులో ఉన్న శాంతి చిహ్నాలు, ఓంకారము మొదలైనవి కూడా శాంతి సందేశాలను ప్రపంచానికి వ్యాపింప చేయడానికి దోహదపడ్డాయి అని గ్రహించి మేమందరము చాలా సంతోషించాము.

ఒక గొప్ప పాశ్చాత్య సాధువు గురించిన అందమయిన కథనం చెప్పకపోతే గనక ప్రేమ మతం యొక్క సందేశము, నిశ్శబ్ద ప్రేమలో ఉండే గొప్ప తనము వివరించడంలో నేను విఫలుడను అవుతాను. పైగా అది అసంపూర్ణం అవుతుంది. ఒక సాధు మహాత్ముడు నిరాడంబరంగా ప్రేమ, శాంతితో జీవితం గడిపేవాడు. ఒక శిష్యుడు సత్యదర్శనం కోసం ఆ సాధువును ఆశ్రయించి, ఆయనతో కలిసి ఉండాలని అనుకొన్నాడు. కాని సాధువు గారు ఎప్పుడూ మౌనంగా ఉండేవారు. అందువలన ఆ శిష్యుడు ఆయన వద్ద పెద్దగా ఏమీ నేర్చుకోలేకపోయాడు. శిష్యుడు అప్పుడే క్రొత్తగా ఆ మార్గంలోకి వచ్చాడు. అందువలన అవగాహన రాహిత్యంతో శిష్యుడు గురువు గారి గొప్పతనం తెలుసుకోలేక సాధువు గారు సోమరితనంతో, ఏమీ చేయకుండా ఊరికే కూర్చుంటాడని, ఏ విధమయిన ప్రబోధాలు చేయడని, ఎవరికి సహాయం చేయడని భావించాడు.

ఒక రోజు శిష్యుడు గురువు గారిని సమీపించి "ఓ పవిత్రమయిన స్వరూపా! మీ వంటి గొప్ప ఆధ్యాత్మికవేత్త అనవసరంగా సమయాన్ని వృథాగా గడపటం నాకు చాలా బాధగా ఉంది. మీరు బయటికి వెళ్ళి అందరికి మీకున్న పవిత్రమయిన ఆధ్యాత్మిక సంపదను పంచిపెట్టవచ్చు కదా! ప్రబోధాలు చేసి ప్రజలను తరింపచేయవచ్చు కదా?" అని ప్రశ్నించాడు. దానికి ఆ సాధుపుంగవుడు చిరునవ్వుతో తన క్రొత్తగా వచ్చిన శిష్యునికి తగిన గుణపాఠం నేర్పాలి అని భావించి, "అలాగే నాయనా! రేపు ఉదయం చాలా తొందరగా మనం బయలుదేరి చుట్టు ప్రక్కల గ్రామాలన్నీ తిరిగి ప్రబోధాలు చేసి అందరికీ సేవలందించుదాము" అని చెప్పాడు. శిష్యుడు చాలా ఆనందపడ్డాడు. ఉదయాన్నే నిర్ణయించుకున్న సమయంలో ఇద్దరూ బయలుదేరారు. గురువుగారు చాలా గ్రామాలు,

అనేక వీధులు తిరిగి మౌనంగా తన జ్ఞాన దృక్కులను ప్రసరింపజేసి ప్రజలందరిని మౌనంగానే ఆశీర్వదించి శిష్యునితో కలిసి తిరిగి తమ ఆశ్రమానికి చేరుకున్నారు.

శిష్యునికి చాలా చిరాకు వచ్చి గురువు గారితో ఇలా అన్నాడు. "మీరు మీ జీవితంలో నిశ్చల సమాధి స్థితినుండి బయటికి వచ్చి సంచారం చేస్తూ ప్రజలకు ప్రబోధాలు చేస్తానని వాగ్దానం చేశారు. దానికి బదులుగా మీరు వీధుల్లో మౌనంగా తిరిగారు తప్ప నోరువిప్పి ఒక్క మాట కూడా చెప్పలేదు. మీరసలు ఎలాంటి వ్యక్తి?" అజ్ఞాని అయిన తన శిష్యుని వంక జాలిగా చూసిన ఆ మహాజ్ఞాని అయిన సాధు మహాత్ముడు అతనికిలా చెప్పాడు "నాయనా! మనం ఈ రోజు ఏ ఏ గ్రామాల్లో, ఏ ఏ వీధుల్లో తిరిగామో మనము అక్కడి ప్రజలందరికి బోధించాము. వారందరిని ప్రేమతో తాకుతూ, బిడ్డలందరిని మౌనంగానే ఆశీర్వదించాము. వారి వైపు చూచి ప్రేమగా నవ్వాము. మనము మన ఆలోచనలను, అభినందనలను శాంతియుతంగా చాలా మందికి అందించాము. మనము తిరుగాడిన ప్రదేశాలన్నింటిని శాంతితో నింపి అనంతమయిన ప్రేమను మాటలకి అతీతంగా పంచిపెట్టాము. నిజమయిన ప్రబోధాలకి, మహోన్నతమయిన జ్ఞానప్రాప్తికి పరాకాష్ఠ మౌనమే కాని బాహ్యమయిన పదాలు కాదు" ఆ శిష్యుడు గురువుగారి అనుగ్రహము, ఆశీస్సుల వలన మనస్సులో వికాసం కల్గి గురువుగారి మాటలను సరిగ్గా అర్థం చేసుకోగలిగాడు. వెంటనే గురువు గారి పాదాలపై పడి తన అజ్ఞానంతో, అహంకారంతో పలికిన మాటలకు క్షమించమని వేడుకున్నాడు. ఉరుములకన్నా గొప్పగా శబ్దం చేస్తూంటుంది అనుభవం యొక్క అందమయిన స్థితి. ఇంకొక అందమయిన గొప్ప కథ ఒకటి నాకు గుర్తుకు వస్తోంది. భారతీయ సనాతన ధర్మంలోనిది.

గురువుగారు పదహారు సంవత్సరాల యువకుడు. అతని శిష్యుడు మాత్రం ఎనభై సంవత్సరాల వృద్ధుడు. శిష్యునికి అనేక విధాలయిన సందేహాలుంటాయి. తన సందేహ నివృత్తి కోసం ప్రపంచమంతటా తిరుగుతూ అందరిని ప్రశ్నిస్తూ ఉంటాడు. కాని అతనికి ఎవ్వరూ సరయిన సంతృప్తికరమయిన సమాధానాలు చెప్పలేకపోయారు. చివరికి అతని అదృష్టం కొద్దీ సమాధి స్థితిలో నిమగ్నమయిన ఒక యుక్త వయస్సులోని గురువు సన్నిధికి చేరుకొన్నాడు. గురువు సమాధిని భంగం చేయడానికి ఇష్టపడక శిష్యుడు కూడా ఆయన ఎదురుగుండా కూర్చొని ధ్యానంలో నిమగ్నమయ్యాడు. ఆశ్చర్యకరంగా జీవితాంతము అతడిని వేధించిన సందేహాలన్నీ ఎలాంటి ప్రశ్నలు, సమాధానాలు, మాటలు, వాదాలు

లేకుండానే నిశ్చలమైన ధ్యానస్థితిలో నివృత్తి అయిపోయాయి. ఆ గురు సన్నిధి అతని సందేహాలన్నింటిని పటాపంచలు చేసివేసింది. అంతా మౌనంగా, నిశ్శబ్దంగా జరిగిపోయింది. అదే పరమ పవిత్రమయిన మౌనంలోని గొప్ప మాహాత్మ్యము. అక్కడ అంతా ప్రశాంతతే. నిశ్చలస్థితి, జీవితము, వెలుగు, ప్రేమ అంతా మౌనంలోనే ఉంది.

నా ప్రియమయిన పాఠకులారా! ఇంకా నేను ఏమయినా చెప్పవలసింది ఉందా? నేను శాంతికాముకులయిన వారందరికి చెందిన వాడినని చెప్పటానికి చాలా సంతోషంగా ఉంది. నేను మీ అందరికి చెందినవాడిని కనుక నా వ్యక్తిగత అనుభవాలను మాటలకు అందని అందమయిన అనుభూతులను మీతో పంచుకుంటున్నాను. ప్రేమ మతం అంటే అందమయిన మౌన జీవితము యొక్క గొప్పతనము. అది ప్రపంచములోని తూర్పు అయినా, పడమర అయినా మానవుడు నిస్వార్థంగా, మౌనంగా పనిచేసినప్పుడు అది ప్రపంచానికంతటికి ఆశీస్సులుగా మారిపోతుంది. ఆయన మాటలు చెప్పవలసిన పనిలేదు. మౌనం మాట్లాడుతుంది. ఆయన జీవితం మాట్లాడుతుంది. ఆయన ప్రేమ మాట్లాడుతుంది. నెమ్మదిగా, స్థిరంగా, నమ్మకంగా అది ప్రపంచానికంతటికి అందుతుంది.

మనం ఇకముందు ఇదే బాటలో కలిసి నడవకపోవచ్చు. అయినా మనం శాంతి పుష్పాలను, సంతోష తరంగాలను ఈ బాటలో వెదజల్లుదాము. ఆనందము, ఆశ, ప్రేమ అందరికి పంచిపెడదాము. జాతి, కుల, మతభేదము లేకుండా అందరికి సమానంగా అందించుదాము. ఎందుకంటే అందరూ ఆ పరమాత్మ సంతానమే కదా! అందరూ భగవంతుని ప్రతిరూపాలే! సత్యం యొక్క సారాంశము మన హృదయంలో, బుద్ధిలో స్థిరపడుగాక!

ప్రేమించకు, ప్రేమించటానికే జీవించు!

మతము, ప్రేమ వేరు కాదు, ఒక్కటే!!

ఎందరో సాధు మహాత్ములు, ప్రేమ మతాన్ని మౌనంగా అవలంబించే మహనీయులు. అందరికీ అభివందనాలు.

ఓం..ఓం..ఓం..

### అధ్యాయం - 49

# అమెరికాలో శాంతి సందేశాలు

స్వామీజీ తన జన్మదినము జనవరి 21వ తేదీన ఎప్పుడూ గాఢమయిన ధ్యానంలో మౌనంగా, ఉపవాస దీక్షతో గడుపుతారు. ఆయన ప్రతి ఒక్కరికి కనీసం వారి జన్మదినము రోజు సంవత్సరానికి ఒక్కసారి అయినా పూర్తి అంకితభావంతో తమ శరీరానికి భౌతిక ప్రపంచానికి అతీతమయిన స్థితిలో కాలం గడపవలసిందిగా సందేశం ఇస్తుంటారు.

స్వామీజీ జన్మదినం ముందు రోజు చాలా మంది క్రొత్తవారికి మంత్ర దీక్షలు ఇవ్వటం వలన వారందరికి స్వామీజీ జన్మదినం గురించి తెలిసింది. అందువలన వారు అందరూ, స్నేహితులు, భక్తులు స్వామీజీ జన్మదినం రోజున ఎంతో ప్రేమతో, ఆరాధనతో మనస్ఫూర్తిగా అభినందనలు, జన్మదిన శుభాకాంక్షలు తెలియచేయటమే కాకుండా స్వామీజీని ఆశ్చర్యపరిచే విధంగా పెద్ద కేకు, కొవ్వొత్తులు తెచ్చి వచ్చినవారందరికి రకరకాల పదార్థాలు తినడానికి ఏర్పాడు చేశారు. ఎంతో గౌరవంగా స్వామీజీ పట్ల వారు చూపిన ప్రేమానురాగాలకు హేవార్డు దంపతులు మా అందరికంటే ఎక్కువగా ఆనందించారు. స్వామీజీ మాత్రమే కాదు, ఆ కార్యక్రమానికి హాజరయిన ప్రతి ఒక్కరూ ఎంతో సంతోషంతో ఆ రోజంతా గడిపారు.

స్వామీజీ జన్మదినమయిన జనవరి 21వ తేది, 1938లో న్యూయార్క్ నగరంలో "శ్రీ స్వామి ఓంకార్ శాంతి కేంద్రము" పేరుతో యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాలో రిజిష్టర్ చేయబడింది. స్వామీజీ శాంతి సందేశాలు వ్యక్తిగత స్థాయి నుండి విశ్వానికంతటికి విస్తరింపచేయటమే ఈ సంస్థ లక్ష్యము. సంస్థలో సభ్యులుగా గొప్ప పేరు ప్రఖ్యాతులు గడించిన లాయర్లు, ఇంకా శాంతి కేంద్రము ఇతర సభ్యులు, శ్రేయోభిలాషులు, స్నేహితులు పలువురు సంస్థ కార్యక్రమాలను విరివిగా తూర్పు, పడమర దేశాల్లో ప్రచారం చేయడానికి కర్తవ్యోన్ముఖులయ్యారు.

సంస్థ సభ్యులందరూ హేవర్డు దంపతుల ఇంటిలో సమావేశమయ్యారు. హేవర్డ్స్ దంపతులు నిస్వార్థంగా స్వామి ఓంకార్ శాంతి సందేశాలను ప్రచారం చేయటంలో చాలా ప్రముఖ పాత్ర వహిస్తున్నారు. స్వామి ఓంకార్ పీస్ ఫౌండేషన్ సర్టిఫికెట్ చక్కని

బంగారు రంగు ఫ్రేముతో గవర్నమెంటు వారి ముద్రలు, సంతకాలతో ఇచ్చారు. ఆ సందర్భంగా స్వామీజీ చాలా అద్భుతమయిన ప్రసంగం చేశారు.

## పీస్ ఫౌండేషన్

“ప్రియమైన స్నేహితులారా! భగవంతుడు ప్రేమమూర్తి కనుక నేను మిమ్మల్ని అందరినీ ప్రేమిస్తున్నాను. నా ఆత్మ మీకు సేవ చేయడానికి, మిమ్మల్ని ప్రేమించడానికి తపించిపోతుంది. ఎందుకంటే తద్వారా నేను ఆ భగవంతుని సేవిస్తున్నాను. భూమి మీద స్వర్గ రాజ్యాన్ని స్థాపించాలి అంటే శాంతిని నెలకొల్పాలి. ప్రపంచ శాంతికి మీ వంతుగా మీరు ఏమి చేయదల్చుకున్నారు? మీ హృదయాల్లో నిజమయిన శాంతి లేకుండా బాహ్యంగా ఉపన్యాసాలు చెప్పి, ఉత్సవాలు జరపటం అంటే పరమాత్మ ఉనికిని వెక్కిరించినట్లుగా ఉంటుంది. అలాంటప్పుడు ప్రతిరోజు చర్చికి, దేవాలయానికి వెళ్ళటము, పండుగలు, ఉత్సవాలు జరుపుకోవటం ఎందుకు? ఎక్కడ చూచినా అశాంతి తాండవిస్తోంది. ప్రతి దేశంలో విద్వేషాలు, విధ్వంసాలు, యుద్ధాలు జరుగుతున్నాయి. దానికి బదులుగా ప్రేమ, శాంతి, సఖ్యతలు మనము నెలకొల్పటానికి ప్రయత్నించాలి.

“నీకు ఇతరులు ఏమి చేయాలి అని నీవు ఆశిస్తున్నావో, దానిని నీవు ఇతరులకు చేయాలి” అనేది సనాతన ధర్మం. ఈ నియమాన్ని మనము నిత్య జీవితంలో మనతోటి వారి పట్ల, బంధువులు, స్నేహితుల పట్ల మాత్రమే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల్లోని సోదర సోదరీమణుల పట్ల కూడా ఆచరణలో పెట్టాలి. అంతేతప్ప సత్యదూరమైనదిగా, పురాణాల్లోని కథలాగా ఉండిపోకూడదు. మతము అంటే కేవలము కొన్ని ప్రత్యేక పండుగ సందర్భాల్లో మాత్రమే వినియోగపడేది కాదు. దానిని మనము మన జీవితంలోని ప్రతి క్షణము ఆచరించాలి. మన ఆలోచనల్లో, మాటల్లో చూపించాలి. మనము చర్చిలో ఉన్నా లేదా ఇంటిలో ఉన్నా మతము అనేది భగవంతుని ఉనికిని మనకు తెలియచేసేది. అది ఆంతర్యంలో ఉండాలి కాని బాహ్యంగా కాదు. పండిన పంట చాలా గొప్పది. కానీ పనిచేసేవారు కేవలం కొద్ది మంది మాత్రమే ఉన్నారు. భగవంతుని పేరులో క్రీస్తు, శ్రీకృష్ణుడు, సత్యము, ప్రేమ పేరుతో మీరు ఈ ప్రంచానికి మేలు చేయటం కోసం శాంతిని చేకూర్చటం కోసం ముందుగా మీ హృదయాలను ఎందుకు శాంతిమయం చేసుకోరు?

ప్రపంచములోని పరిస్థితులు మీ సమస్య కాదు అని చెప్పవచ్చు లేదా అది ప్రపంచ దేశాల మధ్య ఒప్పందము అనుకోవచ్చు. నీవు రాజనీతిజ్ఞుడవు కాదని చెప్పవచ్చు. కాని నీవు శాంతి ఉద్యానవనంలో రాజనీతిజ్ఞుడివే, వివేకవంతుడివే కదా! నీవు పరమాత్ముని రాజ్యములో ఒక సభ్యుడివి. శాంతి నీ జన్మహక్కు. నీ దివ్య సాంస్కృతిక వారసత్వము విశ్వశాంతి. కనుక శాంతి సౌభాగ్యాల కోసం నీవు పూర్తి అకుంఠిత భావంతో పనిచేయటము నీ కర్తవ్యం.

హృదయం నిండా, నీ ఆత్మ నిండా గొప్ప బలమయిన సంకల్పంతో యుద్ధ వాతావరణాన్ని తొలగించి శాంతి సామరస్యాలను భూమి మీద నెలకొల్పడానికి సమాయత్తము కావాలంటే ముందుగా మీరు మీ హృదయాన్ని శాంతి, ప్రేమలతో నింపుకోవాలి. కలిసి ఉంటే నిలబడగలుగుతాము. విడిపోతే పడిపోతాము. బాగా గుర్తు పెట్టుకోండి. ఐకమత్యమే జీవితము. విడిపోవటము అంటే మరణము. కాబట్టి నేను మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాను మీ సహకారము కోసము. దేశము, మతము, జాతితో సంబంధం లేకుండా మీరు ఒక దేశానికి రాష్ట్రపతి అయినా లేదా వ్యవసాయదారుడయినా, రాజయినా లేదా భిక్షగాడయినా, మతాధికారి అయినా లేదా సామాన్యుడయినా, నేను మీ వంతు సహకారాన్ని అందించమని ప్రార్థిస్తున్నాను. ముందుగా మీ హృదయంలో శాంతిని నెలకొల్పుకోండి. ఎందువల్లనంటే ఎప్పుడయితే వ్యక్తిగతమయిన శాంతి నెలకొంటుందో అదే విశ్వశాంతికి దారితీస్తుంది.

మన శాంతికి పునాది పరమాత్మ గురించిన సరయిన అవగాహన అయి ఉండాలి. అదే విశ్వశక్తి. ఈ సృష్టికి మూలకారణము. అంతే తప్ప మన శాంతికి పునాది రాజకీయ నాయకుల విలువలేని వాగ్దానాలు మాదిరిగా ఉండకూడదు. భగవంతునితో ఐక్యత చెందకుండా శాంతి అనేది ఏ విధంగా లభిస్తుంది? అందువలన సర్వాంతర్యామి అయిన ఆ సర్వేశ్వరునితో నీకున్న ఏకత్వాన్ని గుర్తించటానికి ఇప్పుడే ప్రయత్నం చేయాలి. ఆ పరమాత్మ ఉనికిని నీలో నీవు గుర్తించటం లేదా? నీ హృదయ స్పందనలో ఆ దైవం ఉనికి నీకు అర్థం కావటం లేదా? ఆయన ప్రత్యక్షంగా నీలోనే ఉన్నాడు. ఆయనతో ఐక్యతను చెందటానికి ప్రయత్నించు. అనుభూతి చెందు. నీ హృదయంలో అంతర్యామిగా కొలువైన ఈశ్వరుడిని గుర్తించడానికి ప్రయత్నించు. అప్పుడే నీవు ప్రతి జీవి హృదయంలో

కొలువైన ఈశ్వరుడిని దర్శించగల్గుతావు. జాతి, మతము, దేశము అనే భేదభావము లేకుండా అందరిలో ఆ దైవాన్ని చూడగల్గుతావు.

ప్రియతములారా! నా కోసం చిన్న సహాయం చేయగలరా? అలా చేయాలని ఉంటే దయచేసి భగవంతుని దివ్యానుభూతిని అనుభవించడానికి మీ ప్రయత్నం మీరు చేయండి. రేపు కాదు, లేదా మీరు చర్చికి వెళ్ళినప్పుడు కాదు. ఇప్పుడే, ఈ క్షణంలోనే, ఈ ప్రదేశంలోనే, ఈ క్షణంలో నా సందేశాన్ని వింటున్నప్పుడే మీరు ఆ ప్రయత్నం చేయండి. ఆ పరమాత్మ మీ కళ్ళలో వెలుగులు నింపుతున్నాడు. ఆ కళ్ళతో మీరు దైవాన్ని దర్శించలేరా? కళ్ళున్నందుకు దైవాన్ని దర్శించాలి. చెవులు ఉన్నందుకు దైవనామాన్ని శ్రవణం చేయాలి. చేతులున్నందుకు పరమాత్మను సేవించాలి. మాట్లాడగల్గుతున్నందుకు దైవాన్ని స్తుతించాలి. మీ ఆత్మలో దైవాన్ని దర్శించాలి. హృదయంలో పరమాత్మను ప్రతిష్ఠించుకోవాలి. బుద్ధిని పరమాత్మతో కలయిక చెందించాలి. అలాంటి శక్తి, అలాంటి అవగాహన అందరిలో, అంతటా వ్యాపించు గాక!

నా ప్రియమయిన సోదర సోదరీమణులారా! ఇదే నేను మిమ్మల్ని కోరుకొనేది. ఈ ప్రపంచము యావత్తూ భగవంతుని సృష్టి. శాంతి సామ్రాజ్యము. మానవసేవే మాధవసేవ అని గుర్తుంచుకోండి. అదే అత్యుత్తమమయిన భగవంతుని సేవగా గ్రహించండి.

ఐకమత్యము, సఖ్యత వరదలాగా ప్రవహించుగాక! శాంతి నదులుగా ప్రవహించుగాక! ప్రేమ సముద్రము లాగా ఒకరి హృదయము నుండి వేరొకరి హృదయానికి ప్రవహించు గాక! సమస్త మానవాళి సుఖ సంతోషాలతో వర్ధిల్లుగాక! మీ హృదయాంతర్యామి అయిన సర్వేశ్వరుడు మిమ్మల్ని శాంతితో, ఆరోగ్యంతో చిరకాల ఆయుష్షుతో అనుగ్రహించుగాక! ఇది మీ సోదరుడు ఓంకార్ యొక్క ప్రార్థన. అందరికీ శాంతి లభించుగాక!

## బుద్ధ భగవానుడి గురించి ప్రసంగం

న్యూయార్క్ నగరంలో మే 14వ తేదీన 1938లో బుద్ధ భగవానుడి 2482వ జయంతి మహోత్సవాల సందర్భంగా శాంతి కేంద్రంలో స్వామీజీ చేసిన ప్రసంగ సారాంశము.

“శాంతి కాముకులారా! భగవాన్ బుద్ధుని ఆరాధకులారా! ఈ రోజు పరమ పవిత్రమయిన వైశాఖ దినము. నా హృదయము నిర్వాణము అనే గొప్ప మహోన్నత

స్థితి గురించి, శాంతికి దారితీసే అద్భుతమయిన అవగాహన గురించి మీ హృదయాలకు అందించడానికి  తహతహలాడుతోంది.

గొప్ప మహనీయుడయిన బుద్ధ భగవాన్ గురించి మాట్లాడడానికి ప్రయత్నించేందుకు, ఆ కారుణ్యమూర్తి గురించి చెప్పేముందు, శ్రీరామకృష్ణ పరమహంస సరళంగా చెప్పిన వాక్యాలను మీ ముందు ఉంచుతున్నాను. వారు అంటారు, "చిల్లర దుకాణం నడిపే వ్యక్తి కూరగాయలకి విలువ కట్టగలడు కానీ విలువైన వజ్రానికి వెలకట్టలేడు" అని. నేను చిన్న పిల్లవాడి లాంటి వాడిని, నా జీవితము ప్రేమ కూడా మహోన్నతమయిన బుద్ధ భగవానుడి గురించి మాటల్లో నా భావాలను వివరించడానికి సరిపోదు. బుద్ధుని గురించి అర్థం చేసుకోవాలంటే ముందుగా మనము ఆయన చెప్పిన నిర్వాణము గురించి అర్థము చేసుకోవాలి. బుద్ధుడు, నిర్వాణము రెండూ వేరు కాదు, ఒక్కటే. నాకు తెలిసిన కొద్ది విషయాలు భగవానుడి గురించి నేను గ్రంథాల నుండి గ్రహించినది కాదు. అది నేను మౌనంగా గాఢమయిన ధ్యానస్థితి నుండి గ్రహించాను. నేను ఆయన సిద్ధాంతాల గురించి మాటల్లో మీకు సరిగ్గా చెప్పవచ్చు లేదా చెప్పలేకపోవచ్చు. కానీ మీరు మౌనంగా ధ్యానంలో కొద్ది నిముషాలు గడిపితే అర్థం చేసుకోగలరని చెప్పడానికి చాలా సంతోషిస్తున్నాను. ఈ రోజు నాకు ఇంత పవిత్రమయిన సందర్భంలో అవకాశం లభించినందుకు చాలా ఆనందంగా ఉంది. బుద్ధుడు ఏ బోధి వృక్షము క్రింద కూర్చుని తపస్సు చేసి నిర్వాణ స్థితిని పొందాడో, అదే బోధి వృక్షము క్రింద కొద్దిసేపు కూర్చుని ధ్యానములో గడిపే అవకాశము నాకు లభించినందుకు సంతోషంగా ఉంది.

బుద్ధ భగవానుడి సందేశము యొక్క సారాంశము ఆయన చివరి మాటల్లో కనిపిస్తుంది. ఆయన తన భౌతిక కాయాన్ని వదిలిపెట్టేముందు "భౌతికంగా కనిపించేవన్నీ సహజంగా నశించిపోతాయి. కనుక నీ మోక్షము కోసం, నీ స్వీయ ముక్తి కోసం ప్రయత్నం చేయి" అని చెప్పాడు. అలాంటి స్థితిని పొందటం కోసం ప్రయత్నం చేసినప్పుడే మనము భేదభావము నుండి విడుదల పొందుతాము. అప్పుడే అన్ని దుఃఖాలకి మూలకారణము కోరికలే అనే అవగాహన ఏర్పడుతుంది.

బుద్ధుడు నిర్వచించిన అష్టాంగ మార్గాన్ని అర్థం చేసుకొని ఆచరించినప్పుడు మనము నిర్వాణ సుఖాన్ని అనుభవించడానికి ఆశీర్వదించబడతాము. అవి సమ్యక్ దృష్టి, సమ్యక్

సంకల్పము, సమ్యక్ వాక్కు, సమ్యక్ కర్మ, సమ్యక్ జీవనము, సమ్యక్ వ్యాయామం, సమ్యక్ స్మృతి, సమ్యక్ సమాధి.

ప్రియమయిన స్నేహితులారా! మీరు ఇప్పుడు నేను చెబుతున్న మాటలు అంగీకరించినా, లేకున్నా గాని ఏదో ఒక రోజు మన హృదయాలు ఆ నిర్వాణ సుఖాన్ని అనుభవించినప్పుడు, శాంతి మన అవగాహనకి వచ్చినప్పుడు మాత్రమే మనము ఆదర్శవంతమయిన బౌద్ధులమని, గొప్ప ఆధ్యాత్మికత కల్గిన హిందువులమని మంచి దయ గల నాగరీకులయిన క్రైస్తవులమని మర్చిపోగల్గుతాము. అన్నింటినుండి విముక్తి పొందిన స్థితిలో మాత్రమే పరిమితమయిన మతము, దేశము అనే విశ్వాసము నుండి బయటపడగల్గుతాము.

నిజానికి మనమందరము ఒకే సముద్రములో పుట్టిన వేరు వేరు కెరటాల వంటి వారము. సూర్యునినుండి వెలువడిన వేరు వేరు కిరణాల వంటి వారము. పద్మములోని వేరు వేరు రేకుల వంటి వారము. అదే నిజమయిన జీవిత గమ్యము. అదే నిర్వాణ స్థితి. అందమయిన విజ్ఞానవంతమయిన స్థితి, విముక్తి, ఆధ్యాత్మిక వికాసము. అప్పుడే మనము సరయిన దారిలో నడవగల్గుతాము. ఇతరులకు మార్గాన్ని చూపించగల్గుతాము.

పాశ్చాత్య దేశాల్లోని ప్రజలు నిర్వాణము అనే పదము వినడానికి భయపడి పోతారు. యథార్థమయిన అర్థము ఏమిటంటే 'వికాసము చెందటము' లేదా 'ఆవిరి అయిపోవటం'. ఎవరికి కూడా మరణించాలని గాని, ఉపశమించాలని గాని ఉండదు. జీవితము ముగిసిపోవాలని కాదు. నిర్వాణము అంటే అదే అర్థము అయితే కనుక గొప్ప బుద్ధిస్టు అయిన మిష్టర్ కిరా గారు సిలాన్ ఇన్ యజమాని, మన అసహనం చూచి మన భోజనములో కొద్దిగా విషం కలిపితే మనం అందరము తెల్లవారేసరికి ప్రశాంతంగా మరణిస్తాము. కాని స్నేహితులారా! నిర్వాణము అంటే అదికాదు. నిర్వాణ స్థితి అంత తేలికగా పొందేది కాదు. నిర్వాణము అంటే జీవితాన్ని కొనసాగించడం కాదు. నిర్వాణము అంటే కోరికలనే మంటలను ఆర్పివేయటము. కీర్తికాంక్షను వదిలివేయటము. విద్వేషాలను, అసంబద్ధమైన విశ్వాసములను విడిచిపెట్టటము, ద్వేషము, సంకుచిత మనస్సును ఆవిరి చేయటం. నిర్వాణము అంటే పరమపవిత్రమయిన స్థితి. అంతులేని శాంతి మరియు విశ్వప్రేమ. విశ్వ సంబంధమయిన అవగాహన పొందగలిగే అద్భుతమయిన స్థితి. ఆ స్థితిని పొందగల్గిన వ్యక్తి కోరికలకు బానిసకాదు. జీవిత

గమ్యాన్ని నిర్దేశించగలడు. ఎల్లప్పుడు దివ్య తేజస్సుతో విరాజిల్లుతూ, ఇతరులకు మార్గదర్శనం చేస్తుంటాడు.

బుద్ధ భగవానుడు "నీకు నీవు వెలుగునిచ్చే జ్యోతివి కావాలి" అని చెప్పాడు. కాని దురదృష్టవశాత్తూ మనము వేరొకరికి జ్యోతి కావడానికి ప్రయత్నము చేస్తూ మనలను మనము నిర్లక్ష్యము చేసుకుంటున్నాము. మనలోపల దివ్యంగా ప్రకాశవంతంగా తేజోవంతమయిన అంతర్జ్యోతిని మర్చిపోతున్నాము. మనము ప్రతి ఒక్కరిని ఉద్ధరించడానికి ప్రయత్నిస్తాము కాని మనలను మనము ఉద్ధరించుకోము. మనము ప్రపంచమంతటా శాంతిని నెలకొల్పడానికి ఉద్యమిస్తాము కానీ మన హృదయంలో శాంతిని నింపుకోవడానికి ప్రయత్నించము. నేను మళ్ళీ మళ్ళీ చెప్పటానికి సంతోషిస్తున్నాను. ప్రియమైన స్నేహితులారా! కేవలము వ్యక్తిగత శాంతి మాత్రమే విశ్వశాంతికి బాటలు వేస్తుంది. మీ హృదయంలో శాంతి లేకుండా, మీరు ఏమి మాట్లాడినా, శ్రవణం చేసినా అదంతా నిష్ఫలమే. మీ అమూల్యమయిన సమయాన్ని వృథా చేయటమే అవుతుంది. బుద్ధుని జయంతి సందర్భంగా మనమందరము మన హృదయాలను ఇప్పుడే, ఇక్కడే శాంతితో నింపుకుందాము.

మాటలు గందరగోళాన్ని సృష్టిస్తాయి. మౌనము ఆత్మను మేల్కొల్పుతుంది. అందువల్ల ఇంకా ఎక్కువగా మాట్లాడి మిమ్మల్ని విసిగించను. కానీ నా ప్రసంగాన్ని ముగించేముందు నేను మీ అందరిని భారతదేశానికి ఆకాశమార్గంలో తీసుకువెళతాను. ఒక్క క్షణం ధ్యానంలో మీరు బుద్ధుని జన్మస్థలాన్ని సందర్శించండి. మనందరి శాంతి స్థావరము ఎక్కడ నేను నివసిస్తానో, ఏ గదిలో నేను ధ్యానము చేసుకుంటానో అక్కడ మూడు ప్రతిమలు ఉంటాయి. జీసస్ క్రీస్తు, శ్రీకృష్ణుడు, బుద్ధ భగవానుడు. తరుచుగా నేను ధ్యానములో కూర్చునే ముందు జీసస్ క్రీస్తును చూస్తాను. అప్పుడు నేను నా శరీరము శిలువలాగా, శరీరంలోని ఆత్మ జీసస్‌లాగా భావన చేస్తాను. క్రీస్తు తిరిగి లేస్తాడు. ఆయన ఏ క్షణంలోనయినా పునరుజ్జీవనం పొందుతాడు. శ్రీకృష్ణుని వంక చూచినపుడు పవిత్రమయిన వేణుగానం వినిపిస్తుంది. అప్పుడు నేను ఈ శరీరం వేణువులాగా, కోరికలు, వాసనలు అంతము చేసినపుడు పరమ పవిత్రమయిన ఓంకార నాదాన్ని వినగల్గుతాను అని భావన చేస్తుంటాను. ఇంక పద్మాసనంలో గాఢమయిన ధ్యానస్థితిలో కూర్చున్న బుద్ధుని

వైపుగా చూపులు ప్రసరించినప్పుడు, వేయి పద్మాల సహస్రార చక్రము వికసించి మాటల్లో వివరించలేనంతటి ప్రశాంతతను అనుభవిస్తాను.

ప్రియమైన స్నేహితులారా! మీరందరూ దయచేసి ఒక్క క్షణం మీ కళ్ళు మూసుకుని బుద్ధుని విజ్ఞానాన్ని, శ్రీకృష్ణుని జ్ఞానాన్ని, జీసస్ క్రీస్తు ప్రేమని ఇప్పుడే, ఇక్కడే అనుభూతి చెందండి. మనమందరము బోధి వృక్షము క్రింద కూర్చుని ప్రకాశానికే ప్రకాశమయిన దివ్యజ్యోతిపై ధ్యానము చేద్దాము. మనము స్థిరంగా అమూల్యమయిన వెలకట్టలేని రత్నం లాంటి మన హృదయ పద్మముపైన ధ్యానము చేద్దాము. మన లోపలా, బయటా అంతటా ప్రకాశవంతమయిన జ్యోతి ప్రజ్వరిల్లుతున్నది. మనపైన, క్రిందా అంతటా ఆ జ్యోతి ప్రకాశిస్తున్నది. ప్రపంచమంతటా విశ్వశాంతి నెలకొంటున్నది. ఆ విధంగా అనుభూతి చెందండి, మన ఆత్మోన్నతి కోసం అంకితభావంతో ప్రయత్నం చేయాలి.

ఓం....ఓం...ఓం...

## అమెరికా గురించి ధన్యవాదాలు

నా హృదయం అమెరికా సోదర సోదరీమణుల పట్ల కృతజ్ఞతా భావంతో నిండిపోతోంది. నాల్గవ పర్యాయం నేను అమెరికాలో అడుగుపెట్టినప్పుడు అనేకమందితో పరిచయ భాగ్యం ఏర్పడింది. అమెరికాలో అనేకమంది నిస్వార్థమయిన, అంకితభావము గల భక్తులు ఉన్నారని తెలుసుకుని నేను చాలా గొప్పగా, నిర్మలంగా, ఆత్మవిశ్వాసంగా భావించాను. మీ అందరికి చేతులు చాచి ధన్యవాదాలు సమర్పించుకుంటున్నాను. మీరు అందించిన ప్రేమ, సహకారము, ప్రోత్సాహము మన మధ్య నున్న మైళ్ళ దూరాన్ని దగ్గర చేసింది.

ప్రేమ విశ్వానికి సంబంధించినది, అది శాశ్వతమైనది. దానికి ఎల్లలు లేవు. ఎప్పటికీ మార్పు చెందనిది. వేల మైళ్ళ దూరము ప్రేమను ఏ విధంగా దూరము చేయగలదు? ప్రేమ అనేది భగవంతుని తత్త్వము. అదే సత్యము. పరమాత్మనుండే మనమందరము జన్మించాము. తిరుగాడుతూ పనులు చేసుకుంటున్నాము. చిట్టచివరికి ఆయనలోనే ఐక్యమయిపోతాము. అమెరికా స్నేహితులారా! మనము అందరము పరమాత్మ సన్నిధిలో కలిసి జీవిద్దాము, ఇప్పుడూ, ఎల్లప్పుడూ కూడా.

భారతదేశంలోని తోటపల్లి కొండల్లో నెలకొని ఉన్న శాంతి ఆశ్రమము ఒక లోయ వంటి ప్రదేశము. దాని చుట్టూ అనేక చిన్న చిన్న గ్రామాలున్నాయి. ఆ గ్రామాల్లోని ప్రజలకి సరయిన ఆహారము, మందులు లేక ఈగల్లాగా చనిపోతుంటారు. ఆశ్రమములోని సేవకులు గ్రామములు తిరిగి రోగులకు క్వినైన్ మాత్రలు ఇస్తూ ఉంటారు. వారు తరుచుగా మలేరియా బారినపడి చనిపోతుంటారు. హృదయవిదారకమయిన ఈ సంఘటనలు చూచి ఆ నిరుపేద ప్రజల కోసం ఒక వైద్యశాలను నిర్మించాలని నా జీవితాశయము. చాలా మంది సహాయం చేస్తామని చెప్పారు. కాని అది మాటల్లోనే గాని చేతల్లోకి రాలేదు. అందువలన వైద్యశాల నిర్మాణం కలగానే మిగిలిపోయింది. శాంతి ఆశ్రమంలో శాంతి ఏ విధంగా ఉంటుంది? ఆశ్రమము చుట్టూ అనేకులు మందులు అందుబాటులో లేక చనిపోతున్నారు.

అమెరికాలోని సత్యాన్వేషకుల నుండి నాకు, సుశీలాదేవికి శాంతి సందేశాలు, ప్రేమ పంచుకోవడానికి ఆహ్వానం అందింది. ఆశ్రమాన్ని భగవంతునిపై భారం వేసి వదిలిపెట్టి చిరునవ్వుతో మేము అమెరికా వచ్చాము. ఇక్కడ మేము శాంతి కార్యక్రమాల్లో తీరిక లేకుండా గడుపుతున్న సమయంలో హృదయవిదారకమయిన, బాధాకరమయిన వార్త అందింది. ఆశ్రమంలో ఆరుగురు భక్త కుటుంబము వారు మలేరియా వ్యాధితో ఒకరి తర్వాత ఒకరుగా మరణించారు. వారికి సమయానికి మందులు, మంచి పౌష్టిక ఆహారము లేదు. శాంతి కేంద్రానికి తమ జీవితాలను అంకితము చేసిన మాణిక్యం కుటుంబము మొత్తము తుడిచిపెట్టుకొని పోయింది. ఆ పసిపిల్లల మరణవార్త విని మా హృదయం బాధతో బరువెక్కిపోయింది.

వారి ఆత్మశాంతి కోసం ఒక వ్యాసము వ్రాయబడింది. చనిపోయిన వారి జ్ఞాపకార్థము, జీవించి ఉన్నవారి ఆరోగ్యము కోసము 'మాణిక్యం మెమోరియల్ హాస్పిటల్' పేరుతో ఒక వైద్యశాలను నిర్మించాలని తీర్మానించాము. న్యూయార్క్ నగరంలోని ఒక సోదరి మా అభ్యర్థన విని వెంటనే స్పందించి ఒక వైద్యుడిని ఒక నెల లేదా ఒక సంవత్సరం పాటు కాకుండా జీవితాంతము వైద్యసేవలందించడానికి ఆశ్రమానికి పంపించడానికి సిద్ధపడింది. ఇంకొక ప్రేమమూర్తి అయిన సోదరి మందుల కోసం ఎంత ధన సహాయం కావల్సివచ్చినా తాను భరిస్తానని వాగ్దానం చేసింది. దయామయులు అయిన అమెరికా సోదర సోదరీమణులకు ధన్యవాదాలు.

అమెరికా 'పీస్ ఫౌండేషన్' సంస్థను నెలకొల్పిన స్నేహితులకు, సంస్థ వ్యవస్థాపకులకు, డైరెక్టర్లకు నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియచేస్తున్నాను. న్యూయార్క్ నగరంలో వారు చేస్తున్న నిరుపమానమయిన సేవలకు, సహాయ సహకారాలకి కృతజ్ఞతలు. శాంతి కేంద్రాన్ని ప్రారంభించినప్పటినుండి నాకు దృఢమైన సంకల్పం ఉండేది. ఎవరిని దేని గురించి యాచించకూడదని, శాంతి ప్రచారము కోసము కూడా ఆర్థిక సహాయం అర్థించకూడదు అనుకున్నాను. పీస్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, డైరెక్టర్లు, స్నేహితులు, సభ్యుల వలన అది నేడు సాధ్యపడింది. అందువలన మరొక్క పర్యాయము నా హృదయము మనస్ఫూర్తిగా వారికి గౌరవంగా కృతజ్ఞతలు తెలియచేసుకుంటోంది.

పీస్ ఫౌండేషన్ వారి సహకారంతో శాంతి ఆశ్రమ సేవకులు 'మాణిక్యం మెమోరియల్ హాస్పిటల్''ని నిర్మించడానికి అంకితభావంతో సమాయత్తమయ్యారు. మలేరియా మహమ్మారి బారి నుండి ప్రజలను రక్షించడానికి తూర్పుదేశంలోని ధనవంతులు, దయామయులు ముందుకు వచ్చినా, అమెరికా దేశస్థులు ఎల్లప్పుడూ వారి చేతులు చాచి నిరుపేద ప్రజల కష్టాలు, కన్నీరు తుడిచి, రోగులకు సేవలందించడానికి, సహాయం చేయడానికి ముందుకు వచ్చారు.

అమెరికా సేవ, ప్రేమ, స్వతంత్రము గల భూమి. తూర్పు, పశ్చిమ దేశాల్లోని వారందరూ నా బిడ్డలే. నా మతము ప్రేమ మతము. అందరినీ ప్రేమించటము, అందరికి మేలు చేయటము నా అభిమతము. అందుకు జాతి, మతము, దేశము, కులము, రంగు రూపుతో సంబంధము లేదు.

నాకు పూర్తి హక్కు ఉంది ఇలా చెప్పడానికి. ఈ ప్రపంచం యావత్తు నా సొంత ఇల్లు వంటిది. ఇందులో నివసించే వారందరూ నా బిడ్డలు. వీరందరిని ప్రేమించటము, మంచి చేయటము నా మతము. భగవంతుడు అందరిని శాంతి సౌభాగ్యాలతో ఆశీర్వదించుగాక! ఓ! అమెరికా! నీకు ధన్యవాదాలు.

**అధ్యాయం - 50**

# స్వదేశానికి తిరిగి రావటం - జూన్ 1938

అమెరికాలో మంచి కార్యక్రమాలు నిర్వహించాము. ముఖ్యంగా ఫిలడెల్ఫియాలో "పీస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిలడోల్ఫియా" ఆధ్వర్యంలో చక్కని కార్యక్రమాలు జరిగాయి. మళ్ళీ జన్మభూమికి తిరిగి రావటం సంతోషంగా ఉన్నప్పటికీ, సుశీలాదేవి నాతో కలిసి తిరిగి రాకపోవడం విచారకరం. సుశీలాదేవి నర్సు కావటం వలన ఆమె కుటుంబ సభ్యులకు ముఖ్యంగా ఆమె తల్లిగారికి ఆమె సేవలు అవసరం కావటం వలన ఆమె అమెరికాలోనే ఉండిపోయి, నా తిరుగు ప్రయాణానికి కావాల్సిన పనులన్నీ చేసిపెట్టింది.

నా ప్రయాణం స్టీమ్‌షిప్ కంపెనీ వారి ఓడలో జరిగింది. వారు నాతో పాటుగా భారతదేశానికి ఘోష్ అనే వ్యక్తి కూడా ప్రయాణం చేస్తున్నట్లుగా చెప్పారు. అతను మంచి అంకితభావము గలవాడే కాని ఆధ్యాత్మికత లేదు. నాకు ప్రతి వ్యక్తి భగవంతుని ప్రతిరూపంగానే కనిపిస్తాడు. అందువలన అందరూ ఆధ్యాత్మికంగా అనిపిస్తారు. మేము కలిసి చాలా కాలము ప్రయాణం చేసిన తర్వాత అతని కోరిక మేరకు నేను అతనికి మంత్ర దీక్షనివ్వటం నాకు గర్వకారణం అయింది. ప్రతిరోజు ఆధ్యాత్మిక జీవితం కలిపి గడపటం వలన మేమిద్దరము త్వరలోనే మంచి స్నేహితులమయ్యాము.

సాయంత్రపు వేళల్లో ఘోష్ నాతో కలిసి ఏదో ఒక ఆట ఆడేవాడు. మేము ఓడపై భాగంలో డిస్క్ విసరటం లాంటి ఆటలు ఆడేవాళ్ళము. ప్రతిసారీ నేనే గెలిచేవాడిని. భగవంతుని ఆజ్ఞ లేనిదే గడ్డిపోచ కూడా కదలదు. ఆటలో గెలుపు అయినా అంతే.

మేము కార్గోషిప్‌లో కొద్దిమంది ప్రయాణికులతో ప్రయాణిస్తున్నాము. మాతో పాటుగా రెవరెండ్ కెర్న అనే మిషనరీ వ్యక్తి కూడా ప్రయాణించాడు. ఆయన నిరాడంబరమయిన జీవితము, ఆదర్శము, మతము పట్ల చాలా ఆసక్తి చూపించాడు. ఆయన తన మతం మాత్రమే చాలా గొప్పదని, బాప్టిజం పట్ల నమ్మకము కలవాడు. క్రీస్తు రక్తం ద్వారా మాత్రమే విముక్తి లభిస్తుందని నమ్ముతాడు. అది తప్ప వేరే దారి లేదని వాదిస్తాడు. అతని మతాన్ని నమ్మకపోతే అందరము ఓడ మునిగిపోయి సరాసరి నరకానికి పోతామని చెప్పేవాడు. ఏదయితే ఏమి, మా ప్రయాణం పూర్తి అయ్యేసరికి యాభై రోజులు పట్టింది.

మేమిద్దరము మంచి స్నేహితులుగా మారాము. అతను నా విశ్వప్రేమను అంగీకరించాడు. అదే చిట్టచివరికి ఆత్మ దర్శనానికి, మానవాళిని గమ్యానికి చేరుస్తుంది.

స్టీమర్ కెప్టెన్ మిస్టర్ స్నో గారు కూడా చాలా మంచి వ్యక్తి, ప్రేమమూర్తి, అంకిత భావము గల భక్తిపరుడు. ఎప్పుడు చిరునవ్వుతో అందరిని పలుకరిస్తుంటాడు. మా మధ్య జరిగిన సంభాషణలో నేను అతనికి మా శాంతి సందేశాల కాగితాలను ఇచ్చినప్పుడు ఆయన అన్నాడు "స్వామీజీ! నేను మతము గురించిన వ్యక్తిని కాదు. అలాగే నేను ఎప్పుడు ఆధ్యాత్మిక గ్రంథాలు గాని, కాగితాలు గాని చదవలేదు. దయచేసి నన్ను క్షమించండి". దానికి నేను నవ్వి అతనితో "నీకు ఎవరు చెప్పారు నీవు మతానికి సంబంధించిన వ్యక్తివి కావని? నీవు ఎప్పుడూ చాలా దయతో అందరికీ సహాయం చేస్తుంటావు. నీకు చేతనయిన పద్ధతిలో మంచి పనులు చేస్తుంటావు. అదే నిన్ను ఆధ్యాత్మికమయిన వ్యక్తిగా మారుస్తుంది" అని చెప్పాను.

దానికి అతడు "స్వామీజీ! నేను ఎన్నడూ చర్చికి వెళ్ళలేదు. కనీసం బైబిల్ కూడా చదవలేదు. అలాంటప్పుడు నేను మతానికి చెందిన వ్యక్తిని ఏవిధంగా అవుతాను?" అని అడిగాడు. నేను అతడితో, "ఎవరయినా చర్చికి వెళ్ళటం వలన, బైబిల్ చదవటం వలన మతానికి చెందినవారు కాలేరు. ఎవరయితే నిస్వార్థంగా ఇతరులకు సేవ చేస్తారో, సర్వమానవాళి పట్ల ప్రేమ చూపిస్తారో, వారు ఆధ్యాత్మిక వ్యక్తి కాగలుగుతారు. మీరు మీ ప్రేమ, దయ, మంచితనము వలన ఆధ్యాత్మిక వ్యక్తి అయ్యారు. మీరు కాక ఇంకెవరు అవుతారు?" అందుకు అతని ముఖం సంతోషంతో, సంతృప్తితో వెలిగిపోయింది. "స్వామీజీ! మీ కోసం నేను తప్పకుండా మీరు ఇచ్చిన శాంతి సందేశాలను చదువుతాను" అని చెపుతూ నాకు అనేకవిధాలుగా ధన్యవాదాలు చెప్పాడు.

ఈ విధంగా బాహ్యంగా చర్చిలకి వెళ్ళేవారే కాకుండా వారితో సమానంగా బయట ఎందరో నిస్వార్థంగా, అంకితభావంతో సేవలు అందించేవారు ఉన్నారని గ్రహించాను. అది నన్ను ఆలోచనలో పడవేసింది. ఈ ఓడలోని సిబ్బంది వారి జీవితాలను కూడా త్యాగం చేసి ఇతరులకు సేవలందించగలరు అనే నమ్మకం నాకు ఏర్పడింది. అలాంటి వారి జీవితాలు సేవకే అంకితమయిపోతాయి. మరి అలాంటి వారిని మనము ఆధ్యాత్మికత కలవారని ఎందుకు భావించరాదు? వారు చర్చికి వెళ్ళకపోవచ్చు లేదా ఆధ్యాత్మిక గ్రంథాలు చదవకపోవచ్చును. కాని వారి చర్చి విశాలమయినది, అనంతమయిన ఆకాశం,

అందులో మిణుకు మిణుకుమని వెలిగే తారకల్లాగా, వారు ప్రతి రోజు చేసే సేవలు, త్యాగమయ జీవనమే వారు చదివే పవిత్రమయిన బైబిల్ గ్రంథం. కనుక ఆధ్యాత్మికత, మతము కేవలము చర్చికి, బైబిల్‌కి పరిమితం కాదు, దైనందిన జీవితంలో ఆచరణ ముఖ్యం. దీనిని తెలుసుకుంటే వారు ఎంతో సంతోషిస్తారు. వారు కూడా ఆధ్యాత్మికత ఉన్నవారేనని, భగవంతునికి చెందినవారేనని, అది వారి జన్మహక్కు అని, దాని కోసం వారు చర్చికి వెళ్ళవలసిన అవసరం లేదని గ్రహించాలి. వారు చర్చికి వెళ్ళినా, వెళ్ళకపోయినా కూడా వారు భగవంతుని సంతానమే. భగవంతుని నిజమయిన దేవాలయము ఈ విశాలమయిన ప్రపంచమే. ఇతరులకు సేవలందించడమే నిజమయిన భగవంతుని ఆరాధన.

నా గది శుభ్రం చేసే వ్యక్తి చదువుకున్నవాడు. అతను నా గురించి చాలా శ్రద్ధ తీసుకునేవాడు. మేము ఒకరినొకరు ఎంతో ప్రేమించుకునేవారము. మా ఇద్దరి మధ్య ఒకనాడు జరిగిన సంభాషణలో అతను తాను ఆధ్యాత్మికవాదిని కాదని, ఎన్నడూ చర్చికి వెళ్ళలేదని చెప్పాడు. నేను అతడిని “ఎందుకు వెళ్ళలేదు?” అని అడిగాను. అందుకు అతడు “స్వామీజీ! మా వీధిలో చాలా మంది పిల్లలు ప్రతి వారము తప్పనిసరిగా చర్చికి వెళతారు. కానీ వ్యక్తిగతంగా వారు చాలా చెడుగా ప్రవర్తిస్తుంటారు. జంతువులకన్నా హీనంగా జీవిస్తారు. అందువలన చర్చికి వెళ్ళినా వారు తమ ప్రవర్తనని మార్చుకోలేనప్పుడు నేను చర్చికి వెళ్ళటం అనవసరము” అని భావించాను అని చెప్పాడు.

నేను అతడికి నచ్చచెప్పడానికి ప్రయత్నించాను. “అది చర్చికి వెళ్ళటం వలన కలిగిన దోషము కాదు. వారి ప్రవర్తన వారి స్వభావం వలన స్వార్థము చేత ఆ విధంగా ఉంది”. అయినాసరే అతను చర్చికి వెళ్లడానికి ఇష్టపడలేదు. “భగవంతుడు చర్చిలో లేడు బయటే ఉన్నాడు. తెలుసుకోవడానికే ప్రయత్నిస్తాను” అన్నాడు. తప్పకుండా జాక్ భగవంతుడిని తెలుసుకోగల్గుతాడు. అతను నిస్వార్థంగా, అంకితభావంతో ఎప్పుడూ ఇతరులకు సేవలందిస్తూ ఉంటాడు.

మా ఓడలో రేడియో ఆఫీసర్ చాలా చురుకయినవాడు, కష్టపడేవాడు. మంచి మనస్సున్నవాడు. మా ప్రయాణంలో అతడు ఎప్పుడూ ఏదో ఒకటి చదువుతూనే కనిపించేవాడు. కాని బైబిల్ చదవటం ఎన్నడూ చూడలేదు. అయినా అతను కూడా నిస్వార్థపరుడు, ప్రేమమూర్తి, దయాస్వభావం కలవాడు. తనకి సాధ్యమయినంత బాగా

ఏ పని అయినా చేసిపెట్టేవాడు. అతను కూడా భగవంతుని అతని మార్గంలో అన్వేషిస్తున్నాడు, చర్చిలో కాదు.

ఒకరోజు నాకు ఆహారం తెచ్చిపెట్టే వ్యక్తి నాతో “స్వామీజీ! ప్రపంచంలోని ప్రతి వ్యక్తి మీ లాగా విశ్వాసంతో పనిచేయాలి. అప్పుడే ఈ ప్రపంచంలోని దేశాలన్నింటి మధ్య శాంతి సామరస్యాలు నెలకొంటాయి” అని అన్నప్పుడు నేను కదిలిపోయాను. ఇంకొక రోజు అతను నాతో “ఏదో ఒక రోజు నేనుకూడా నా జీవిత గమ్యాన్ని చేరుకుంటానని ఆశపడుతున్నాను. అప్పుడు నేను కూడా మీరు అనుభవిస్తున్న శాంతిని, పంచిపెడుతున్న శాంతిని పొందగల్గుతాను” అన్నప్పుడు నిజంగా నేను చాలా సంతోషించాను. అతను తరచుగా అతని ఇబ్బందుల గురించి నాతో చెబుతుండేవాడు. నేను అతనికి సహాయపడటానికి ప్రయత్నించేవాడిని.

ప్రజలందరూ నిస్వార్థంగా, ప్రేమమూర్తులుగా, ఆధ్యాత్మికవంతులు, ఆదర్శవంతులుగా, నిజాయితీపరులుగా ఉండాలని కోరుకుంటాను. నాస్తికులుగా నేను ఎవరినీ చూడలేను. ఎందుకంటే చర్చిలు, దేవాలయాలు మాత్రమే ఆధ్యాత్మికతకి నిదర్శనం కాదు. అందువలన ఎవరయినా వాటిని సందర్శించనంత మాత్రాన వారిని నాస్తికులుగా భావించరాదు. త్యాగము, నిస్వార్థము, అంకితభావము కలవారందరూ ఆస్తికులే. మతము అంటే ప్రబోధాలు చేయటం మాత్రమే కాదు. మాటలు లేకుండా కూడా మతాన్ని ప్రచారం చేయవచ్చు. మతమును ప్రేమమయమయిన ఆలోచనలు, దయగల మాటల వలన ప్రకటించవచ్చు. నిస్వార్థపూరితమయిన పనుల ద్వారా పంచుకోవచ్చును.

మా ఓడ కెప్టెన్‌తో కలిసి మాట్లాడటం జరిగింది. నిశ్చలమైన సముద్రపు నీటిని ఓడ పై భాగమునుండి చూస్తున్నాము. పరస్పరము మేము మాట్లాడుకున్నప్పుడు అతను నన్ను నా జీవితం గురించి చాలా ప్రశ్నలు అడిగాడు. శాంతి మార్గము గురించి కూడా ప్రశ్నించాడు. చివరికి తన క్యాబిన్‌లోకి వెళ్ళే ముందు నాతో “స్వామీజీ! మీతో ఇంకొద్ది సేపు మాట్లాడితే నేను కూడా మీలాగా సాధువుగా మారిపోతానా” అన్నాడు. అందుకు నేను అతడితో “నేను మాటలను విశ్వసించను. అలాగే ఒక మతంనుండి వేరొక మతంలోనికి మారటం అనేదానిని కూడా నమ్మను. భగవంతుడు సర్వత్రా వ్యాపించి ఉన్నాడు. అందరి హృదయంలో అంతర్యామిగా కొలువై ఉన్నాడు. నీవు నీ హృదయంలోని పరమాత్మని గుర్తించలేనప్పుడు ఏ విధంగా అతడిని తెలుసుకుంటావు? అలా నీవు

పరమాత్మని తెలుసుకోగలిగిననాడు, నీవు స్వామీజీవి అవుతావు. కాబట్టి నిజమయిన మతము చర్చితో సంబంధం లేకుండా దానంతట అదే వ్యాపిస్తుంది. నెమ్మదిగా ప్రశాంతంగా ఒక హృదయం నుండి మరొక హృదయానికి అది అందుతుంది.

నాకు ప్రతి శుక్రవారము ఉపవాసదీక్ష చేయటం ఇష్టం. వారానికి ఒక రోజు మౌనంగా ఉండటం వలన వారానికి కావాల్సిన శక్తి కూడా అందుతుంది. నేను ఓడలో ప్రయాణం చేస్తున్నప్పుడు కూడా ఉపవాసం చేసేవాడిని. నాతోటి ప్రయాణీకులు, ఓడ సిబ్బంది చక్కగా సహకరించేవారు. నన్ను చూచి రివరెండ్ కెన్ని గారు కూడా రెండు రోజులు ఉపవాసము చేయాలని నిర్ణయించుకున్నాడు. అది తెలిసి ఓడలోని మిగిలిన ప్రయాణీకులు గుసగుసలాడుకోవడం మొదలుపెట్టారు. "స్వామీజీ రివరెండ్ కెర్న్‌ని ఉపవాసము చేసే విధంగా మార్చివేశారు". కానీ నేను ఎప్పుడూ అతనితో అలా చేయమని చెప్పలేదు. నేను కేవలం నా హృదయశుద్ధి కోసం ఉపవాసము చేస్తుంటాను. ఎందుకంటే వ్యక్తిగత ఆత్మోన్నతి మాత్రమే విశ్వ ఉన్నతికి తోడ్పడుతుందని నేను నమ్ముతాను. అందువల్ల నేను ఇతరులకు ఒక ఉదాహరణగా ఉండాలని భావిస్తాను. దాన్ని చూచి ఇతరులు అనుసరించాలి. ఆ రోజు సాయంత్రము కెప్టెన్ స్నో గారు నా వద్దకు వచ్చి "స్వామీ! మీరు నాతో ఇంక ఏమీ మాట్లాడవద్దు. మీ ప్రభావం వలన నేను కూడా ఉపవాసం చేయాలనుకుంటానేమో అనిపిస్తోంది" అన్నాడు. నేను అతడితో "ఉపవాసము చేయటం వలన మేలు జరుగుతుంది తప్ప ఎవరికి ఎలాంటి ఇబ్బంది కలుగదు. ఎక్కువగా తినటం వలన చాలా ఇబ్బందులు ఏర్పడతాయి" అని చెప్పాను. దానికతడు "అలా అయితే ఉపవాసము చేసి మీరు ఎక్కువ కాలము జీవిస్తారో, లేదా బాగా తిని నేను ఎక్కువ కాలము జీవిస్తానో చూద్దామా!" అని అడిగాడు. నేను దానికి నవ్వి సరే అని చెప్పాను.

నిజానికి జీసస్ క్రీస్తు మతంలో ఆయన కఠినమయిన ఉపవాస దీక్షలు చేసినట్లుగా ఉంది. కాని దురదృష్టవశాత్తూ ఆయన శిష్యులు, అనుచరులు జీసెస్ క్రీస్తు చేసిన ఆధ్యాత్మిక బోధలు, ఆచరణ సరిగ్గా అర్థం చేసుకోలేదు. అంతేకాక గుడ్డిగా ఏదో చర్చిలో జీసెస్‌ని ఆరాధించటమే నిజమయిన క్రీస్తు మతము అని ప్రపంచ వ్యాప్తంగా ఉన్న చర్చిలన్నీ భావిస్తుంటాయి. నేను ఉపవాస దీక్ష చేసిన ప్రతిసారీ నా వయస్సు ఒక సంవత్సరము తగ్గినట్లుగా నేను భావిస్తుంటాను. చాలామంది నన్ను మీ వయస్సు ఇరవై అయిదు సంవత్సరాలా? అని అడుగుతుంటారు. నేను వారితో అవుననే చెపుతాను.

ఎందుకంటే ఆ వయస్సులోనే నేను ఆధ్యాత్మికంగా తిరిగి జన్మను తీసుకున్నాను. ఎక్కడ దయాగుణము, ప్రేమ గుణము, నిస్వార్థత్వము ఉంటాయో అక్కడే నిజమయిన ఆధ్యాత్మికత వెల్లివిరుస్తుంది తప్ప చర్చికి అది పరిమితం కాదు.

నేను చర్చిలో ఆధ్యాత్మికత ఉండదు అని చెప్పడం లేదు. దాని బయట కూడా మనం దానిని గుర్తించాలని చెపుతున్నాను. ఎవ్వరూ ఆశను వదులుకోకూడదు. భగవంతుని బిడ్డలందరికి విముక్తి లభిస్తుంది. సత్యము అనేది చర్చికి, దేవాలయానికి పరిమితం కాదు. ఎందుకంటే అది సర్వత్రా వ్యాపించి ఉంటుంది.

ఇక ఈ సందేశాన్ని ముగించేముందు, సుదూర ఓడ ప్రయాణంలో నేను పొందిన దివ్యానుభూతిని కలిగించిన హృదయశాంతిని గురించి మీతో పంచుకోవాలనుకుంటున్నాను. అంతులేని సముద్రజలాలలో ఒక ఒంటరి స్టీమరును ఊహించుకోండి. అది సూర్యోదయ సమయము. ప్రతిదీ చక్కగా తనను తాను వ్యక్తపరుచుకోవాలనుకుంటుంది. చివరికి సముద్రములోని అట్టడుగు కెరటాలు కూడా ఉవ్వెత్తున పైకి లేచి సూర్యునికి నమస్కరించాలని కోరుకుంటాయి. నెమ్మదిగా, మౌనంగా, ప్రశాంతంగా సముద్రమంతటా సూర్యుని కిరణాలు పరుచుకుంటున్నాయి. అంతటా దేదీప్యమానమయిన ప్రకాశము లోపలా, బయటా, క్రిందా, పైనా తేజోవంతంగా ఉంది. బంగారు రంగు బంతిలాగా సూర్యుడు లోకాన్ని అంతటికి ప్రకాశాన్ని అందించేవాడు. ప్రతిరోజు ఉదయిస్తూ నిన్ను, నన్నూ, లోకానికంతటిని ఆశీర్వదిస్తూ, జీవితాన్ని, ప్రేమను, వెలుగును ప్రసాదిస్తున్నాడు. ఇదే చర్చిలో దొరకనిది. బయట ప్రపంచంలో ఊహకే అందనిది, వర్ణించడానికి అలవికానిది అయినటువంటి ఆధ్యాత్మికత లేదా మతము.

ఇంకొక దివ్యానుభూతి సముద్రములో పౌర్ణమి నాటి నిండు జాబిలి వెలుగులు పరుచుకున్నప్పుడు నాకు కలిగింది. ఏ విధంగా ఆ దివ్యానుభవాన్ని గురించి నేను మీకు మాటల్లో వివరించి చెప్పగలను? హఠాత్తుగా, నెమ్మదిగా చల్లని బంతి లాంటి నిండు చందమామ సముద్రపు జలాల్లో నుండి పైకి వచ్చింది. దాని చల్లని కిరణాలు ఆత్మను మేలుకొలిపే విధంగా ఉన్నాయి. అలా చూస్తూ దాన్ని గమనిస్తూ ఉండగానే చంద్రుని కిరణాలు హృదయము లోతుల్లోకి చొచ్చుకొనిపోయి అనంతమయిన శాంతిని, హాయిని, ఆహ్లాదాన్ని ప్రేమని మౌనంగానే అందించాయి. ఆ శాంతి హృదయంలో

నిండిపోయి పొంగిపొర్లిపోతుందా అనిపిస్తోంది. ఆహ్లాదము కలిగించే చల్లని చంద్రుని కిరణాల కాంతి లోపలా, బయటా, అంతటా అలుముకుంది. సముద్రపు అలలు కూడా నెమ్మదిగా, మౌనంగా, స్థిరంగా ఒక ఒరవడిలో నృత్యం చేస్తున్నట్లుగా ఉంది. ఆ క్షణం ఎంతో గొప్ప ఆహ్లాదకరమయిన దివ్యానుభూతి హృదయమంతా నిండిపోయింది. నిజంగా అదే నిజమయిన ఆధ్యాత్మికత. ఎక్కడయితే స్వర్గము తన వైభవాన్ని, ప్రాభవాన్ని ప్రకటిస్తుందో, ఆ ప్రకృతి చిత్రకారుడి కుంచెనుండి జాలువారిన అద్భుత కళాఖండంలా ఉంది.

అది నా హృదయాన్ని దివ్యానుభూతిలో ముంచి వేస్తోంది. ఇవి ఏవి కూడా ఆధ్యాత్మికత కాదు, అయినా ప్రకృతి అందాలు, సూర్యోదయము, సూర్యాస్తమయము, చంద్రుని పున్నమి రాత్రుల దివ్యానుభూతిని, ఆరాధనని భగవంతుని వైభవాన్ని గుర్తు చేస్తున్నాయి. ఈ ప్రపంచము అశాశ్వతము, అనిత్యము అయినప్పటికి, ప్రకృతి సౌందర్యాన్ని ఆరాధించకుండా ఉండలేము. చర్చిలో భగవంతుని ఆరాధించేవారితో పాటుగా చర్చి బయల ప్రకృతి రూపంలోని భగవంతుని ఆరాధించే ప్రకృతి ఆరాధకులు ఎందరో ఉన్నారు. ఈ విశాలమయిన ప్రపంచమంతా భగవంతుని దేవాలయమే. స్వర్గలోకము పైనున్న పెద్ద కట్టడం లాంటిది. నక్షత్రాలు భగవంతుని వెలిగే దీపాలవంటివి. సూర్యుడు చాలా గొప్ప, ఉన్నతమయిన ఆరాధ్యుడు. అందువలన సూర్య భగవానుడిని హృదయం లోపల నిశ్శబ్దంగా ఆరాధించాలి, బయట విశ్వంలో కనిపించే సూర్యుడిని ఆరాధించాలి. భగవంతుడు కేవలము చర్చికి, దేవాలయాలకి పరిమితమయి లేడు. ప్రపంచమంతటా, అన్నింటా, అంతటా విశ్వవ్యాప్తమయి ఉన్నాడు. మనము ఆయన ఉనికిని గుర్తించడానికి ప్రయత్నము చేయాలి.

కనిపించే దేవాలయాలను, చర్చిలను నిర్మించిన వారిని మౌనంగా పూజించి గౌరవిద్దాము. కాని ఇంత అందమైన సృష్టి చేసిన ఆ భగవంతుడిని మనము ఎప్పుడూ మర్చిపోకూడదు. శాశ్వతమైన, అంతులేని, అంతుపట్టని రీతిలో ఉండే ఆ పరమాత్మని ఆరాధించటం కూడా అవసరమే. ఇది ఈ సోదరుని ప్రార్థన.

నాకు సమయం ఎంతో అమూల్యమయినదో తెలిసినప్పటికీ, నేను చాలా నెమ్మదిగా, రోజుల తరబడి ప్రయాణించే కార్గో ఓడలోనే ప్రయాణం చేసేవాడిని. దానికి బదులుగా విమానంలో గాని లేదా పెద్ద స్టీమరులో వందల మంది ప్రయాణికులతో కలిసి సుఖంగా

సంగీతం వింటూ, తిని, త్రాగి, నృత్యం చేసేవారితో కలిసి ప్రయాణం చేయవచ్చును. కానీ నేను నా జీవితంలో గడిపిన కొద్ది ఆనందకరమైన రోజులు ఈ కార్గో ఓడలో జరిపిన ప్రయాణంలోనే గడిచాయి. అందులో కేవలం చాలా కొద్దిమంది ప్రయాణీకులు ఉంటారు. కొన్నిసార్లు అసలు ప్రయాణించేవారే ఉండరు. అలాంటప్పుడు పరమాత్మ ఆ ఓడను కేవలం నా కోసమే తయారుచేశాడేమో అన్నంత ఆనందంగా ప్రయాణం చేసేవాడిని.

అద్భుతమయిన సూర్యోదయ, సూర్యాస్తమయాల సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ మౌనంగా, ప్రశాంతంగా ప్రయాణం కొనసాగించేవాడిని. ఆనందాన్ని మాటల్లో వివరించటం సాధ్యం కాదు. ప్రతి ఓడరేవులోనూ మా స్టీమరు ఆగుతుండేది. అది సరుకులు తీసుకువెళ్ళే కార్గో స్టీమరు కావటం వలన ప్రతి రేవులో సరుకులు దించటం, మళ్ళీ ఎక్కించటం జరిగేది. కొన్నిసార్లు రోజుల తరబడి రేవులో స్టీమరు నిలిచిపోయేది. కొన్నిసార్లు కొద్ది గంటలు మాత్రమే ఆగేది. రివరెండ్ కెర్న్, నేను కలిసి అలాంటప్పుడు స్టీమరు దిగి అక్కడ ప్రజల ఆచార వ్యవహారాలు తెలుసుకోవడానికి ఊరిలోకి వెళ్ళేవారము. స్టీమరు కరాచి రేవులో ఆగినప్పుడు కెప్టెన్ స్నో గారు మాకు ఐదు గంటల సమయం ఇచ్చారు ఊరు చూచి రావడానికి. రివరెండ్ కెర్న్ ముందుగానే వచ్చాడు, కాని నేను తాపీగా స్టీమరు బయలుదేరడానికి ఒక గంట ముందుగా వచ్చాను.

ఆశ్చర్యకరంగా చాలా విచారకరంగా ముందుగా నిర్ణయించిన సమయం కన్నా చాలా ముందుగానే మా స్టీమరు కరాచీ రేవు నుండి బయలుదేరి వెళ్ళిపోయింది. అక్కడి సామాన్లు దించటం త్వరగా ముగిసినందువలన స్టీమరు తొందరగా బయలుదేరింది. నా పరిస్థితి ఊహించుకోండి, ఒంటరిగా అక్కడ మిగిలిపోయాను. కరాచీ చాలా పెద్ద ఓడరేవు. నేను మొదటిసారి అక్కడికి వచ్చాను. కరాచి భారతదేశము పాకిస్తాన్‌నుండి విడిపోక ముందు సింధు రాజధానిగా ఉండేది. అక్కడ నాకు స్నేహితులు గాని, ధన సహాయం చేసేవారు కాని ఎవ్వరూ లేరు. నా ఒంటి మీద బట్టలు తప్ప నా వద్ద డబ్బు కూడా ఏమీ లేదు. రైలు టిక్కెట్టు కొనుక్కొని బొంబాయి వరకు చేరుకుంటే అక్కడి రేవులో మా కార్గో స్టీమరును చేరుకోవచ్చును. అందువల్ల నేను ఆంధ్రాకు టెలిగ్రామ్ పంపించి వారు డబ్బులు పంపిన తర్వాత కరాచీ నుండి బొంబాయి వరకు రైలులో ప్రయాణించి మా కార్గో స్టీమరును చేరుకున్నాను. కెప్టెన్ స్నో గారు, ఇతర స్నేహితులు,

ఓడ సిబ్బంది నన్ను చూచి చాలా సంతోషించారు. నన్ను కరాచీలో ఒంటరిగా వదిలిపెట్టి వచ్చినందుకు విచారం వ్యక్తం చేశారు.

తర్వాత మా ఆశ్రమ భక్తులయిన కొందరు లాయర్లు ఆ స్టీమరు కంపెనీ మీద నన్ను తెలియని క్రొత్త ఊరులో ఒంటరిగా వదిలిపెట్టి వచ్చినందుకు నమ్మకద్రోహం చేసినట్లుగా కేసు పెట్టారు. పరిహారంగా సుమారుగా వెయ్యి రూపాయలు వచ్చింది. ఆ డబ్బును మేము ఆశ్రమ నిర్వహణకి, ఆశ్రమంలో నివసించే సభ్యులు, పిల్లల సంక్షేమానికి ఉపయోగించాము. భగవంతుని లీలలు చాలా విచిత్రంగా ఉంటాయి. మానవుని జీవితంలో ఎన్నో ఒడుదుడుకులు, కష్ట నష్టాలు ఏర్పడినప్పుడు భగవంతుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయి.

బొంబాయిలో చాలా మంది స్నేహితులు నన్ను అక్కడ ఊహించని విధంగా అనుకోకుండా కలిసినందుకు చాలా సంతోషించారు. వారు నన్ను వారింటికి తీసుకువెళ్ళి మంచి రుచికరమయిన భారతీయ వంటకాలతో విందు భోజనము ఏర్పాటు చేసి నాకు అవసరమయిన దుస్తులు, ధోతీలు తీసుకువచ్చారు. బొంబాయి తర్వాత కొలంబో, సిలోన్ వెళ్ళాల్సి ఉంది. అటు తర్వాత ఒక మంచి రోజు మా స్టీమరు మద్రాసు ఓడరేవు చేరుకుంది. శ్రీమతి మరియు శ్రీ ఆనందరావు వారి అమూల్యమయిన కూతుళ్ళు మనోరమ, సుశీలా, సుమతి నా కోసం పూలదండలతో స్వాగతం చెప్పడానికి ఆత్రుతతో ఎదురుచూస్తున్నారు. మద్రాసు నగరానికి మాత్రమే కాకుండా వారి హృదయాల్లోకి కూడా స్వాగతం పలికారు. ఈ విధంగా నా పాశ్చాత్య ప్రయాణం చివరిది అనేక విధాలుగా పరీక్షలతో, కరాచీలో ఇబ్బందులతో ముగిసింది. అయినా అది కూడా భగవంతుని ఆశీర్వాదంలాగా ఒక సరికొత్త అనుభవంగా అనిపించింది. నిజానికి ఆయన ఎల్లవేళలా నన్ను కంటికి రెప్పలాగా కాపాడుకుంటూనే వస్తున్నాడు. నన్నే కాదు భగవంతుని బిడ్డలందరిని అదేవిధంగా రక్షించుకుంటాడు. అంతా దేవుని దయ, సంతోషంగా మాతృ ఆశ్రమానికి చేరుకున్నాను.

ఒకసారి అనంత జలరాశితో కూడిన సముద్రములో ఒకే ఒక స్టీమరు ప్రయాణిస్తుంది. ఒక పక్షి ఆ స్టీమరుపై భాగంలోని లోహపు కడ్డీపై చాలా సేపు కూర్చుంది. కాని అలా అది ఎంత సేపు ఆ తెరచాప కడ్డీపై కూర్చోగలదు? అందువల్ల ఆ పక్షి అక్కడినుండి

ఎగిరి దూరంగా ఆ సముద్రముపై చక్కర్లు కొట్టసాగింది. పాపం, దానికి విశ్రాంతి తీసుకోవడానికి ఇంకొక స్టీమరు కనబడలేదు. బాగా అలసిపోయిన తర్వాత చివరికి అది తిరిగి తన మొదటి స్థానానికి చేరుకుని ఆ స్టీమరు తెరచాప లోహపు కడ్డీపై కూర్చుని విశ్రాంతి పొంది శాంతిని అనుభవించింది.

అదేవిధంగా నేను కూడా అన్ని ప్రదేశాలు తిరిగి తిరిగి, దగ్గర దూర ప్రాంతాలన్నీ, సముద్రాలు దాటి, కొండల్లో కోనల్లో, లోయల్లో తిరుగాడుతూ, హిమాలయాల్లోని పర్వత శ్రేణుల్లో తిరిగి, ఎక్కడో సుదూరంగా కాలిఫోర్నియాలోని శాంతసుసన్నా పర్వతాలను అధిరోహించి అలిసిపోయాను తప్ప నిజమయిన ప్రశాంతత నాకు లభించలేదు. ఏ విధంగా పక్షికి విశ్రాంతి దొరకలేదో అదేవిధంగా మానవుడికి ఈ ప్రపంచములో శాంతి దొరకదు. చివరికి నేను తోటపల్లి కొండల్లో నెలకొనివున్న నా మాతృ ఆశ్రమానికి చేరుకుని మౌనంగా నిజమయిన విశ్రాంతిని పొందాను. అంతులేని శాంతిని అనుభవించాను.

❖❖❖

### అధ్యాయం - 51

## తోటపల్లి కొండలకి తిరిగి వచ్చాము

ఉషోదయము కాగానే ప్రశాంతమయిన నిశ్శబ్ద వాతావరణంలో నెమ్మదిగా నా గది తలుపులు తెరుచుకుని వరండాలోనికి వచ్చాను. అందమయిన ఆ ప్రశాంతమయిన సమయంలో అక్కడే కూర్చోవాలని అనిపించింది. మసకబారుతున్న చంద్రుడు దారికి ఇరువైపులా బారులు తీరిన పొడవైన వృక్షాలపైన కనిపిస్తున్నాడు. వాతావరణం ఎంతో ప్రశాంతంగా, ఆహ్లాదకరంగా ఉంది. గదిలోకి వెళ్ళాలనిపించలేదు. కుర్చీ బయటికి లాక్కుని అందులో కూర్చుని నిండుగా పుష్పించిన వృక్షాల వంక చూస్తుండిపోయాను. అందమైన ఆర్చిలాగా కనిపిస్తున్న చెట్ల మధ్యనుండి చంద్రుడు తొంగి చూస్తున్నాడు. అంత అందమైన ప్రకృతి సౌందర్యాన్ని అనుభవించాలే తప్ప మాటల్లో వివరించటం చాలా కష్టం. అందువలన నేను చంద్రుని వృక్షాల హృదయంలోనికి చూస్తూ, గమనిస్తూ, వాటి అందాల్ని, ప్రేమని ధ్యానిస్తూ ఆనందాన్ని అనుభవించసాగాను. జోయీకిల్మర్


WELCOME
SRI SANTI ASHRAM

మాటలు గుర్తుకు వచ్చాయి. ఆయన అంటాడు “వృక్షాన్ని మించిన అందమయిన కవితను నేనెప్పుడూ చూడలేదని నాకు అనిపిస్తుంది. కవితలు నా లాంటి తెలివి తక్కువ వాళ్ళు రాస్తారు, కాని పరమాత్మ మాత్రమే వృక్షాలను సృష్టించగలడు”.

అవును నిజంగా వృక్షాలు భగవంతుడు రచించిన కవితలు లాంటివి. ఆయన చాలా అందమయిన కవితలు సృష్టిస్తాడు. మధురమయిన సువాసనలు వెదజల్లే కవితలు, అలాగే కొన్ని వేల రకాలయిన అద్భుతమయిన కవితలు వృక్షాల మీద రాస్తాడు. మా ఆశ్రమంలోని వృక్షాలను నేను ఎంతగానో ప్రేమిస్తాను. ప్రపంచంలోని ఇంకే ఇతర వృక్షాల పట్లా నాకంత ప్రేమ ఉండదు. మా ఆశ్రమ వృక్షాలు నా శరీరంలోని రక్తమాంసాలు లాగా అనిపిస్తాయి. వాటిని నా చేత్తో స్వయంగా నాటి పెంచి పోషించాను. వృక్షాలు అన్నీ ఒక్కటే అయినా నా ఆశ్రమంలోని వృక్షాలు మాత్రం నాతో మాట్లాడుతాయి. వాటిని పట్టించుకోనప్పుడు, సరిగ్గా నీరు పెట్టనప్పుడు అవి తలలు వాల్చి నాతో మాట్లాడుతాయి. భౌతిక ప్రపంచములోని వారికి ఇది వింతగా అనిపించవచ్చు. ఏదయినా సరిగ్గా పోషణ లేని వృక్షాల పక్క నుండి నేను నడిచేటప్పుడు అవి నాతో మాట్లాడడానికి ప్రయత్నిస్తాయి. “మాకు చాలా ఆకలిగా, దాహంగా ఉంది. సరయిన పోషణ లేదు. దయచేసి మాకు నీరు పోయండి” అని చెపుతాయి. నేను వెంటనే తోటమాలిని పిలిచి ఆ చెట్టుకు ఎరువు వేయించి, నీరు పెట్టించేవాడిని. అప్పుడు వృక్షాలు చిన్న మొక్కలు చాలా తృప్తి చెందేవి. వృక్షాలు, మొక్కలు బాగా పోషణ జరిగినప్పుడు సంతోషాన్ని వ్యక్తపరుస్తూ తలలాడిస్తూ, కొమ్మల నుండి చల్లని గాలిని ఇచ్చేవి.

నేను వృక్షాల క్రింద నుండి నడిచేటప్పుడు, వాటి చల్లని నీడలో వెళుతున్నప్పుడు అవి తమ ఆత్మలను ఆవిష్కరిస్తున్నట్లుగా ఒకటి రెండు పూలు నా తల మీద పడి, స్నేహపూర్వకంగా నన్ను పలకరిస్తుండేవి. నెమ్మదిగా, ఆధ్యాత్మికంగా స్పృశిస్తూ అవి ఎవ్వరినయినా ఆహ్లాదపరుస్తూ, ఆనందపెడుతుంటాయి.

ఆశ్రమములోని సభ్యులందరూ నా రాక గురించి తెలుసుకుని చాలా తొందరగా చెట్లను శుభ్రం చేసి నీరు పెట్టటానికి ప్రయత్నం చేసినప్పటికి వారు పూర్తిగా విఫలమయ్యారు. చాలా వరకు చెట్లు ఎండిపోయి ఆకులు రాల్చివేశాయి. వాటికి సరయిన పోషణ, నీరు లేదు. కొన్ని పూర్తిగా ఎండిపోయాయి. మరికొన్ని కొద్దిగా వాడిపోయాయి. ఎక్కడ చూచినా పిచ్చి మొక్కలు, కలుపుమొక్కలు పెరిగిపోయాయి. వాటిని నిర్లక్ష్యంగా


PEACE

వదిలివేశారు. ఆ వృక్షాలు, పొదలు అలాగే ప్రాణాలు నిలబెట్టుకొని నా రాక కోసం ఎదురు చూస్తున్నట్లుగా ఉన్నాయి. "మీరు మమ్మల్ని చంపలేరు. మీరు మమ్మల్ని ఎంతగా నిర్లక్ష్యం చేసినప్పటికి మమ్మల్ని భూమిలో నాటిన మా ప్రియమైన స్వామీజీని చూచేటంతవరకూ మేము జీవించే ఉంటాము. ఆయన మమ్మల్ని ఎంతగానో ప్రేమిస్తారు" అని చెపుతున్నట్లుగా ఉన్నాయి.

అలా ఆ వృక్షాలు ఎంతో కష్టం మీద పోరాడి జీవించి ఉన్నాయి. నేను వచ్చిన వెంటనే వాటికి నీరు పెట్టించి, పాదులు తవ్వించి, ఎరువు వేయించాను. ఎండిపోయిన కొమ్మలను తీసివేయించాను. మొక్కలను కత్తిరించాను. నా హృదయం చాలా బాధపడింది. ఆ విధంగా చేస్తున్నప్పుడు. కాని సర్జను రోగి భవిష్యత్తును గురించి తప్పనిసరిగా ఆపరేషన్ చేస్తాడు.

తరుచుగా నేను ఆ పొదరిళ్ళ దగ్గరికి వెళ్ళి కొమ్మలు కత్తిరించిన చోట నెమ్మదిగా నిమిరి "నన్ను క్షమించు, నిన్ను బాధ పెట్టినందుకు. కాని అది నేను నీ మేలు గురించే చేశాను. కొద్దిరోజుల్లోనే మళ్ళీ నీవు చక్కగా అందంగా పెరుగుతావు" అని వాటిని ప్రేమతో ఓదార్చేవాడిని. నేను కూడా ఉపశమనం పొందేవాడిని.

శాంతి ఆశ్రమము ఒకప్పుడు దట్టమయిన కీకారణ్యంలా ఉండి భయంకరమైన క్రూర మృగాలకు నిలయంగా ఉండేది. ఇప్పుడు చాలా అందమయిన ఆశ్రమంగా మారింది. చూడ ముచ్చటయిన కుటీరాలు, అందమయిన ఉద్యానవనాలు, పళ్ళ చెట్లు, పూల మొక్కలు, వైద్యశాల, వృద్ధాశ్రమము, గురుకుల విద్యాపాఠశాల మొదలైనవన్నీ ఉన్నాయి. చాలా అందమయిన కల లాగా ఉంది. ఇంకా పటిష్ఠమైన భవనాలు నిర్మించవలసి ఉంది. పెద్ద వంటశాల, సాధువులు, భక్తులు, పనివాళ్ళు ఆశ్రమానికి క్రమం తప్పకుండా వచ్చే గృహస్థ భక్తుల నివాసము కోసం మంచి భవనాలు నిర్మించాలి.

భగవంతుడు చాలా మంచివాడు! ఇదంతా నా ఒక్కడి వల్ల సాధ్యపడుతుందా! వెయ్యిసార్లు ఆలోచించినా సాధ్యం కాదు. ఈశ్వరుడి సంకల్పం లేనిచో గడ్డిపోచ కూడా కదలదు. ఈశ్వరుడే అందరికి తండ్రి, ఈ సృష్టికి కర్త. ఆయన తలుచుకుంటే ఏమయినా చేయగలడు. వైభవమంతా ఈశ్వరుడిదే. మనము ఈశ్వరుడి చేతిలో వాడబడే పనిముట్ల వంటి వారము. సూరదాసు మహనీయుని మాటలను నేను పదే పదే గుర్తు చేసుకుంటున్నాను.



"నా వంటి హేయమైన, నీతిబాహ్యమైన, పనికిమాలినవాడు ఎవరుంటారు? నేను నా గురువును ఈ సృష్టికర్తను, ఈశ్వరుడిని మర్చిపోయాను. నేను ఎంత స్వార్థ పూరితమయిన నమ్మకద్రోహిని!"

ఎవరికయినా జీవితంలో జీవించి ఉండటం గొప్ప ఆశీర్వచనము లాగా అనిపించే క్షణాలు ఉంటాయి. చల్లని పళ్ల చెట్ల నీడలో కూర్చున్నాను. మామిడి, జామ, సీతాఫలము, జీడి, పనస మొదలయిన మధురమయిన ఫలాలనిచ్చే చెట్లు ఆశ్రమంలో చాలా ఉన్నాయి. వాటి నుండి చల్లని గాలులు వీస్తుంటే నేను ఎంతో సంతోషంగా, సంతృప్తిగా భావిస్తాను. ఆ పరమాత్మ దివ్యానుభూతి కలుగుతుంది. ప్రతి వృక్షములోనూ నాకు ఆయన దర్శనమిస్తాడు. ప్రతి ఆకులో ఆయనే కనిపిస్తాడు. కొన్ని మిలియన్ల గొంతులతో ఆయన నాతో మాట్లాడుతాడు. తనను నమ్ముకున్న తన బిడ్డలపై ఈశ్వరుడికి అవ్యాజమయిన ప్రేమ ఉంటుంది. నా ఆశ్రమంలో అందమైన ఆ వృక్షాల ఛాయలో కూర్చుని ఈశ్వరుని దివ్యానుభవాన్ని నెమరువేసుకుంటూ పారవశ్యంలో మునిగిపోయాను. తెలియకుండానే నా నోటి వెంట "భగవాన్! ఇప్పుడు నన్ను ఏమి చేయమని ఆదేశిస్తున్నావు?" అని గొణిగాను. ఆ చల్లని గాలుల్లో ఆయన గొంతు ఇలా సమాధానమిచ్చింది. "నా బిడ్డా! నీవు ఏమి చేయవలసిన పనిలేదు. నిరంతరము మార్పు చెందే ఈ అనిత్యమయిన ప్రపంచంలో నీవు ఏమి చేయాలని నేను కోరుకోవటం లేదు. ఏమి లేకుండా ఉండు. అదే నేను ఇప్పుడూ... ఎల్లప్పుడూ ఇచ్చే సందేశము".

దీనిని వింటే ప్రతి మానవుడికి ఈ సందేశము ఆత్మను మేల్కొలుపుతుంది. అదే మానవుని జీవిత గమ్యము, జన్మహక్కు అని గ్రహించాలి. ఆ నిర్వికారస్థితిలో నేను గాఢమయిన శాంతిని పొందాను. అదే పూర్ణత్వము అని గ్రహించాను. అలాంటి నిర్వికల్పస్థితి నిత్యమయినది, సత్యమయినది, అంతటా ఆవరించుకుని ఉండేది మన శరీరములోని ప్రతి కణములోనూ, విశ్వమంతటా నిండి ఉండేది అయిన అద్వితీయ బ్రహ్మము అదే. నేను అమెరికాలో నివసించినా, భాతరదేశంలో ఉన్నా శాంతి నా జీవిత లక్ష్యము. అంతకు మించి ఇంకేమీ లేదు.

మంచి ఆత్మానుభవంతో ఆశీర్వదించబడిన మహోన్నత స్థితిని పొందిన మహనీయుడు తన విశ్వ ప్రేమ వలన తన శత్రువును, చెడ్డవాడిని కూడా ప్రేమించగల్గుతాడు. అతని విశ్వాసపూరితమయిన మతములో అందరికి స్థానము ఉంటుంది. ఎవ్వరిని వదులుకోడు.

అలాంటి వ్యక్తి అన్ని బంధనాల నుండి విముక్తి పొందుతాడు. అందరికన్నా గొప్పవాడిననే అహంకారము నుండి, మత చాంధసాల నుండి పూర్తిగా విముక్తి పొందుతాడు. అతనికి తరతమ బేధాలుండవు. కులమతాలకు అతీతంగా ఉంటాడు. మతము పట్ల ఏర్పరుచుకున్న అనాలోచితమయిన భావాలు, అభిప్రాయాలు, నిర్హేతుకమయిన మానసిక దృక్పథం నుండి విడుదల పొందుతాడు. అతను అందరికి సోదరుడిలాగా, మూగ జీవాలకు కూడా స్నేహితుడిలాగా ఉంటాడు. **విశాలమయిన ఈ ప్రపంచమే అతని గృహము. ఈ ప్రపంచములోని వారందరూ అతనికి సోదరసోదరీమణులు. అందరినీ ప్రేమించి, ప్రతి ఒక్కరికి సేవలందిస్తాడు. అదే అతని విశ్వమతానికి ఆలంబన.** అతని వ్యక్తిగత అనుభవం తెలియచేసేది ఏమిటంటే ఎక్కడ యుద్ధ వాతావరణము కల్గించే వ్యక్తులుంటారో అక్కడ మానవుడు కష్టాలు అనుభవిస్తాడు. ఎక్కడ మంచి వ్యక్తులు ఉంటారో అక్కడ ప్రజలు సంతోషంగా, ఆనందంగా, సౌకర్యంగా జీవిస్తారు. అతను ప్రపంచమంతా అందరిలో ఎలాంటి పరిస్థితుల్లో అయినా కలిసిమెలిసి జీవిస్తాడు. ఏ వ్యక్తికి ఆధ్యాత్మిక ఆత్మానుభవం ఉంటుందో అతను నిర్భయంగా అడవిలోని సింహరాజులాగా జీవిస్తాడు. అతను అణుబాంబులకు కూడా భయపడడు. అతని అనుభవము ఆత్మశక్తి మీద ఆత్మానుభూతి మీద సహస్ర సూర్యకాంతితో వెలుగొందుతూ ఉంటుంది.

“ఆత్మానుభవము పొందిన మహనీయుల వలన దేశాలన్నీ ఐక్యతతో, సామరస్యంతో కలిసి మెలిసి ఉంటాయి. అందువలన మానవులు దేవునిలో జీవించాలి” అన్న మాటల్లో ఎంతో సత్యము దాగి ఉంది. సాధు మహాత్ముల జీవితాలు భగవంతునికి అంకితమయి పోతాయి. అలాగే భగవంతుని బిడ్డలకి సేవలు చేసేవారు శాశ్వతంగా భగవంతునితో కలిసి జీవిస్తారు. అది యావత్ప్రపంచానికి ఎంతో గొప్ప ఆదర్శంగా, మార్గదర్శకంగా, ఆశీర్వచనంగా ఉంటుంది. అనాదికాలం నుండి సాధు మహాత్ములు రాజులకు ప్రబోధాలు చేసి వారి జీవితాలను ప్రభావితం చేసి గొప్ప మహోన్నతమయిన ధర్మ నిర్ణయాలు తీసుకునేవిధంగా తయారు చేస్తున్నారు.

ఎప్పుడయితే ఈ ప్రపంచము కష్టాలు, రోగాలు, పేదరికము, భయము, బాధలు, ఇబ్బందులు గల్గి, అస్తవ్యస్తంగా ఉంటుందో దానికి సాధు మహాత్ములు కూడా కొంత బాధ్యత వహించాల్సి ఉంటుంది. లేదా ఈ ప్రపంచంలో ఆనందం, శాంతి సామరస్యాలు, శక్తి, పురోగతి, నిర్భయత్వము, ఆహ్లాదము నెలకొంటాయో అప్పుడు కూడా అది సాధు

మహాత్ముల చేతుల్లోనే ఉంటుంది. అంతములేని, అమరమైన శాశ్వతమైన, విడదీయరాని విశ్వ సంబంధమైన క్రాంతి యొక్క అనుభవము పొందేవరకూ మౌనంగా, నిశ్శబ్దంగా ఉంటూ తన హక్కును నిగ్రహించగల సాధువు చాలా మహనీయుడు. ఆత్మానుభవము లేని వ్యక్తి ప్రపంచశాంతికి భంగం కలిగిస్తాడు. నూతిలో కప్పలాగా తన పరిమితమయిన జీవితమే చాలా గొప్పదని ప్రపంచానికి చాటి చెప్పటానికి తాపత్రయపడతాడు. అలాంటి వాళ్ళను చూచి నేను ఎప్పుడు జాలిపడుతుంటాను. మతాలను, దేశాలను పోల్చి చూచే స్వభావము, ప్రతి దానిని తప్పు పట్టే స్వభావము సరయినది కాదు. సరయిన అవగాహనతో, శాంతితో, మంచి స్వభావంతో ప్రతి మతము లోని గొప్పతనాన్ని, ప్రతి దేశములోని ప్రత్యేకతను చూడటం నేర్చుకోవాలి. సూర్యుడికుండే అన్ని కిరణాలు ప్రసరిస్తుంటాయి. అదేవిధంగా అన్ని మతాల గమ్యము ఒక్కటే. ఒక్కడే దైవము. అతడే ప్రేమ, శాంతి. ఏ ఒక్క మతము కూడా తాను అందరికన్నా ఇతర మతాలన్నింటికన్నా గొప్ప అని చెప్పకూడదు.

వ్యక్తిగతమయిన అనుభవము మనకు భగవంతుని గురించి అవగాహన ఏర్పడినప్పుడు ఈ ప్రపంచమంతా వ్యాపించిపోయిన, చొచ్చుకొనిపోయిన, హృదయాంతర్గతమయిన ఈశ్వరుని ఉనికిని మనము అనుభూతి చెందగల్గుతాము. అప్పుడు మనకు తూర్పు పడమరల వ్యత్యాసముండదు. ఉన్నది ఒక్కటే తత్త్వము. అది అంతటా కంటికి కనిపించకుండా వ్యాప్తమయి ఉంది. అన్ని మతాలు, దేశాలు ఆ తేజస్సు యొక్క కాంతి రేఖలే. సముద్రము తనలోనే పుట్టిన అలలు ఒకదానితో ఒకటి పోటీపడినప్పుడు నవ్వుకుంటుంది. ఒక అల సముద్రపు అడుగు నుండి ఉవ్వెత్తున ఎగిసిపడి “నేనే అన్నింటికన్నా పెద్ద అలని, నేను అందరికన్నా గొప్పదానిని, మిగిలిన అలలకన్నా నేను భిన్నం” అనుకుంటుంది. పొగరుమోతు తనంతో, అహంకారంతో ఎగిసిపడే అల ఎంత ఎత్తుకు ఎగిసినా, కొన్ని క్షణాల్లోనే విరిగిపడి కనుమరుగు అయిపోతుంది. మన కళ్ళ ముందే ఉనికి లేకుండా పోతుంది. అలలు సముద్రం కన్నా వేరు కాదు. ఏ ఒక్క అల మిగిలిన అలల కంటే వేరుగా లేదు. ఏ అలకి ప్రత్యేకత లేదు. తూర్పుదేశంలో అయినా, పశ్చిమదేశంలో అయినా సముద్రం ఒక్కటే. అలలన్నీ సముద్రము లోనివే. వాటికి ఎలాంటి ప్రత్యేకతా లేదు. అందరి రక్తము ఎర్రగానే ఉంటుంది. సముద్రములోని నీరంతా ఉప్పగానే ఉంటుంది. సముద్రము లోని నీరంతా ఒక్కటే. సముద్రము లోపలా, బయటా, చుట్టూ నీరు అంతా ఒక్కటే.

మానవుని క్షణికమయిన జీవితము కూడా సముద్రములోని అలల వంటిదే. ఈ శరీరము అనిత్యమయినది. 'నాది, నేను, నీది' అనే వ్యత్యాసాలు అన్నీ మనము కల్పించుకున్నవే. ఈ విశ్వమంతా ఒక్కటే. మనది వసుధైక కుటుంబము. మనలో మనకు ఇన్ని తేడాలు, భిన్నత్వము, తెగలు, జాతులు, మతాలు, దేశాలు అవసరమా? అన్ని బేధభావాలను సమూలంగా పెకిలించివేసి కాల్చి బూడిద చేసివేయాలి. వ్యక్తిగత ప్రేమ, వైభవోపేతమైన అంతములేని అంతర్జ్యోతి అనే అగ్నిలో అన్ని భేదాలను కాల్చివేయాలి.

మహత్తరమైన మౌనములో సాధు మహాత్ములు ఆత్మదర్శనం పొంది సఖ్యతను అవగాహనని పెంపొందించగలుగుతారు. వారు తమ ప్రతి శ్వాస ద్వారా శాంతిని లోకానికి ప్రసాదిస్తారు. సత్యము అదే అయి ఉండగా, గొప్పమతము అదే అయి ఉండగా ఇంక మతము, దేశము పేరులో భేదాలు, అల్లకల్లోలాలు సృష్టించడానికి అవకాశం ఎక్కడుంది? అవసరాలు ఒక్కటే అయినప్పుడు మన వ్యక్తిగత అనుభవం ద్వారా మనలను మనము గుర్తించాలి తప్ప భేదభావంతో కాదు.

'ఈశావాస్యం ఇదం సర్వం' ఈ విశ్వమంతా ఈశ్వరునితో నిండి ఉంది. అంతటా భగవన్మయమే. ప్రతి వ్యక్తి భగవంతుని ప్రతిరూపమే. ఆ పరమాత్మ అందరి కళ్ళలో వెలుగు నింపుతున్నాడు. ప్రతి గుండె చప్పుడులో స్పందిస్తున్నాడు. అందరి శ్వాసను ఏకం చేస్తూ దానిని విశ్వ శ్వాసగా 'సోహం'గా మారుస్తున్నాడు. ఒక్కటే జ్యోతి అయిన సత్యము, వాస్తవము ప్రతి వ్యక్తి జీవకణములోను నిండి ఉంది. అంతేకాదు విశ్వమంతా అణువు నుండి అతిపెద్ద గ్రహము దాకా అదే సత్యము ఒక్కటై ఉంది.

ప్రతి శాంతి అన్వేషకుడు తూర్పు పశ్చిమ దేశాల వారందరూ ఈ భూమి మీద శాంతి సౌభాగ్యాలను, దేశాల మధ్య ఐక్యతను, వారి వ్యక్తిగత అనుభవం ద్వారా, విశ్వ ప్రేమ ద్వారా, మహోన్నతమయిన మౌనము ద్వారా, ఎన్నటికి తరగని శాంతిని అందించాలని ఈ ఓంకార్ స్వామీజీ ప్రార్థిస్తున్నాడు.

హరిః ఓం తత్సత్

అధ్యాయం - 52

# సోదరి సుశీలాదేవి

"మహోన్నత వ్యక్తిత్వం గలవారి జీవితాలు మనకు గుర్తు చేస్తాయి. మన జీవితాలను కూడా కాంతిమయం చేసుకోవాలని వారు వెళ్ళిపోయినా మన కోసం కాలంతో వారి అడుగుజాడలు ఈ భూమి మీద వదిలి వెళతారు" – లాంగ్‌ఫెలో

'మహోన్నత వ్యక్తులు' అంటే కేవలం జుట్టు నెరిసిన పెద్ద మనుషులు అని కాదు, యవ్వనం లోని వారు కూడా ఉంటారు. అంకిత భావంతో, పసిపిల్లలు లాంటి ఆత్మ స్వరూపులు మన సోదరి సుశీలాదేవి. నాకు చాలా మంది తలనెరసిన పెద్దవాళ్ళు తెలుసు. వారందరూ అధికారుల్లాగా స్వార్థపూరితంగా, ఇతరులను అణిచివేస్తూ ఉంటారు. వాళ్ళు ఇతరులను కత్తులతో కాకుండా వాళ్ళ మాటలతో చంపివేస్తారు. వాళ్ళు యంత్రాల్లాగా మాట్లాడుతూ మన సమయాన్ని వృథా చేస్తూ ఉంటారు. పైగా వారు మూఢ విశ్వాసాలతో పూర్వాచార పరాయణుల్లాగా వ్యవహరిస్తారు. వారిలో కొందరు కులాచారాలు విపరీతంగా అనుసరిస్తారు. వారు గుడ్డిగా అంటరానితనాన్ని పాటిస్తూ అందరిని దూరంగా పెడతారు. గొప్పవారిగా ఉండటం అంటే వయస్సు మళ్ళి జుట్టు నెరవటం కాదు. దయాగుణము, కరుణా హృదయం కలవారు వయస్సులో చిన్నవారయినా వారిని పెద్దవారిగా గౌరవించాలి. వారు అందరిలో భగవంతుని దర్శించి, చిన్న కీటకము దగ్గరనుండి గొప్ప సాధు మహనీయుని వరకు అందరిని సమానంగా ప్రేమించి దేవుని ప్రతిరూపంగా భావించి సేవలందిస్తారు.

సుశీలాదేవిని పొగడ్తలతో ముంచెత్తటం నా ఉద్దేశ్యం కాదు.కానీ ఆమె ద్వారా నేను ఏమి పొందానో, ఎంత నేర్చుకున్నానో అది అమెరికాలోగాని, లేదా భారతదేశంలోగాని దానిని మీతో పంచుకోవాలని భావిస్తున్నాను.

మనము విషయాన్ని ఆశ్రమంలో నివసించే కుక్కలు, పిల్లులతో మొదలు పెడదాము. సోదరి సుశీలాదేవికి అవంటే ఎంతో ఇష్టం. ఆమె ఆశ్రమానికి రాకముందు మేము వాటిని ఎప్పుడు నిర్లక్ష్యం చేయలేదు. అవి ఆకలితో ఉన్నప్పుడు మేము వాటికి తరచుగా భోజనం పెట్టే వాళ్ళము. కాని మేము వాటి జీవితాల్లోకి తొంగి చూచి, వాటి దుఃఖము,

సంతోషంలో పాలుపంచుకుని, వాటి భావాలను కూడా పంచుకోవాలని భావించలేదు. సుశీలాదేవి ఆశ్రమంలోకి అడుగుపెట్టేంతవరకు, ఆమె తన అనంతమైన ప్రేమ, నిస్వార్థపూరిత హృదయముతో మూగ జంతువులను మాకు ఎంతో దగ్గర చేసింది. మేము కూడా వాటి మెరుస్తున్న కళ్ళలో భగవంతుని దర్శించటం నేర్చుకున్నాము. అమాయకమయిన వాటి హృదయస్పందనలో వాటి ప్రతి కదలికలో దైవాన్ని దర్శిస్తున్నాము. ప్రతి జీవి హృదయంలో అంతర్యామిగా కొలువై, ప్రతి శ్వాసలో కూడా పరమాత్మ ఉన్నాడు.

కళ్ళుండి కూడా చూడలేమా? చెవులుండి కూడా వినలేమా? ప్రాపంచిక విషయాలలో చిక్కుకుపోయి భౌతికమయిన పనులు చేసుకుంటూ జీవితం పూర్తిగా వాటి కోసమే వినియోగించేవారికి ఒక ఆవులో కేవలం రక్తమాంసాలు తప్ప ఇంకేమీ కనిపించవు. కాని సాధు మహాత్ముల దృష్టికోణం వేరుగా ఉంటుంది. అది సాధారణమయిన వ్యక్తికి వింతగా తోచవచ్చు. ఆమె మూగ జంతువుల మనోభావాలను, సంతోషాన్ని, దుఃఖాన్ని, బాధని అర్థం చేసుకుని వాటి అవసరాలన్నింటిని తీర్చి చాలా జాగ్రత్తగా వాటిని సంరక్షించేది. ఆమె వాటి కళ్ళలో పుసులు శుభ్రం చేసేది. పుండ్లు కడిగి శుభ్రం చేసేది, కార్బోలిన్ సబ్బుతో, వేడినీటితో స్నానం చేయించేది. గాయాలను శుభ్రం చేసి మందులు రాసి కట్లు కట్టేది. వాటికి ఆకలివేసినా, దాహం వేసినా, జబ్బు చేసినా లేదా బాగా ఆరోగ్యంగా ఉన్నాసరే ఆమె చుట్టూ తిరుగుతూ ఉండేవి. ఆమె రాత్రి పగలు తేడా లేకుండా ఆ మూగ జీవాలకు సేవలందించేది. ఎప్పుడూ చిరునవ్వుతో వాటిని ప్రేమగా చూసేది. ఆమె ఆ జీవాల్లో పరమాత్మని దర్శించి సేవించేది.

ఆమె నిస్వార్థ పూరితమయిన సేవ, అనంతమయిన దయ, ప్రేమలకు గుర్తుగా జరిగిన ఒక సంఘటన ఎన్నటికీ మర్చిపోలేను. ఒకసారి పశువులకి ఏదో జబ్బు చేసి చుట్టు ప్రక్కల గ్రామాల్లో, ఆశ్రమంలో కూడా చాలా పశువులు చనిపోసాగాయి. అప్పుడు సుశీలాదేవి ఎంతో ఓపిగ్గా, సహనంతో ఆశ్రమంలోని పశువుల సంరక్షణ బాధ్యత వహించింది. ఒకనాటి అర్ధరాత్రి దాటిన తర్వాత జబ్బు పడిన దూడ ఎంతో బాధగా మూలుగుతూ కష్టం మీద నడుస్తూ సుశీలాదేవి నివసించే కుటీరం దగ్గర తచ్చాడసాగింది. నడవలేక కుటీరం దగ్గరలో పడిపోయింది. దాని బాధతో కూడిన అరుపు విని సుశీలాదేవి నిద్రలేచి, అంతరాత్రివేళ వేడి నీరు సిద్ధం చేసి ఆ లేగ దూడ పక్కనే కూర్చుని, ప్రేమగా

దానిని నిమిరి, దాని తల తన ఒళ్ళో పెట్టుకొని జాగ్రత్తగా చూసుకుంది. ఆ రాత్రి చీకట్లో నక్షత్రాల కాంతిలో ఒంటరిగా దానికి సేవలు చేస్తూ దాని గాయాలు కడిగి, కాళ్ళలో గుచ్చుకున్న ముళ్ళు తీసి మందులు రాసి, కట్లు కట్టి దానిని తన కుటీరం లోనికి తీసుకువెళ్ళి వెచ్చగా పడుకోబెట్టింది. మెత్తని పక్క వేసింది. కేవలం పరమాత్మ, అంతర్యామి మాత్రమే అలాంటి సన్నివేశాలకు సాక్షిగా నిలిచాడు.

గుఱ్ఱపు బండిలోగాని, ఎడ్ల బండిలో గాని ప్రయాణం చేయడానికి సుశీలాదేవి ఇష్టపడేది కాదు. తప్పనిసరి అయినపుడు బండి తోలే వ్యక్తిని నెమ్మదిగా నడపమని, వాటిని హింసించవద్దని చెప్పేది. ఆమెది అంత సున్నితమయిన హృదయము. జీవితం పట్ల ఆమె దృక్పథం అది. ఎప్పుడయినా పట్టణంలో ప్రయాణించాల్సి వచ్చినప్పుడు బండి యజమాని దయారహితంగా గట్టిగా అదలిస్తూ కొరడా దెబ్బలు కొట్టినప్పుడు, సుశీలాదేవి ఆ కొరడాదెబ్బలు తనకే తగినట్లుగా బాధతో కళ్ళనీరు పెట్టుకొని వణికి పోయేది. తరుచుగా ఆమె నాకు బుద్ధ భగవానుని దయ, కరుణ, జాలి గుర్తుకు తెచ్చేది. ప్రత్యేకంగా మూగజీవాల పట్ల ఆమె ప్రేమ అలాంటిది.

ఒకసారి సుశీలాదేవి నాలుగు ఎలుక పిల్లలకి తల్లిగా మారింది. నేను నా కుటీరం ముందు కూర్చుని ఉండగా ఆ నాలుగు చుంచు పిల్లలు ఒకదాని తర్వాత ఒకటిగా నా దగ్గరికి వచ్చాయి. నేను దాని తల్లి కోసం వెతికాను కాని కనిపించలేదు అందువలన నేను సుశీలాదేవికి వాటి సంరక్షణ బాధ్యత అప్పగించాను. ఆమె మూగ జీవాలను తల్లిలాగా సంరక్షిస్తోంది. దానితో ఆమె వాటిని జాగ్రత్తగా ఒక అట్టపెట్టెలో ఉంచి ఎంతో ప్రేమగా వాటికి ఆహారం అందించసాగింది.

రాత్రివేళ దీపం వెలిగిస్తే పురుగులు చనిపోతాయని ఆమె దీపము వెలిగించేది కాదు. బల్లులు ఆ పురుగులను తినటానికి ఎదురుచూస్తుండేవి. ఆమె ఆ చీకటిలో కూడా జాగ్రత్తగా ఆ పురుగులను కిటికీలో నుండి బయటికి పంపివేసేది.

ఒకసారి 'రామి' అనే కుక్కపై చిరుతపులి దాడిచేసి గాయపరిచింది. సుశీలాదేవి ఎంతో లాఘవంగా భయంతో వణికిపోతున్న ఆ కుక్కని చిరుత నోటి దగ్గర నుండి లాగివేయటమే కాకుండా, దాని ప్రాణాలు నిలబెట్టి దానికి ఎంతో జాగ్రత్తగా మందులు రాసి కట్టుకట్టి సంరక్షించింది. ఆ ప్రమాదం జరిగినప్పుడు 'రామి'ని చూస్తే మాంసం

ముద్దలాగా అనిపించింది. రక్తం మడుగులో తడిచిపోయింది. ఆ రాత్రి అంతా సుశీలాదేవి నిద్రపోకుండా దానిని జాగ్రత్తగా చూసుకొంది. తెల్లవారిన తర్వాత వైద్యుడు వచ్చి దానికి గాయాలకు కుట్లు వేసి కట్టుకట్టాడు. ఈ రోజుకి కూడా అది తలుచుకుంటే సుశీలాదేవి లాగా నేను 'రామికి' సహాయం చేయలేకపోయినందుకు సిగ్గు అనిపిస్తుంది. అదిరాత్రి అంతా బాధతో మూలుగుతూనే ఉన్నా నేను నిర్లక్ష్యంగా నిద్రపోయాను. మధ్యలో రెండు మూడు పర్యాయాలు నిద్రాభంగమయినప్పుడు చూస్తే సుశీలాదేవి మేలుకొని దానికి సేవలు చేయటం కనిపించింది. అంతకుముందు రోజు పగలంతా నేను బాగా పనిలో నిమగ్నమవటం వలన నిద్ర ఆపుకోలేకపోయాను. అందుకు సుశీలాదేవి నన్ను క్షమించింది.

రామికి చాలా బలమయిన గాయాలు కావటం వలన అది బ్రతకటం చాలా కష్టం అని భావించి, వైద్యులు దానిని వైద్యశాలకు తీసుకువెళ్ళారు. భగవంతుని ఆశీస్సులతో, వైద్యుల ప్రత్యేకమయిన శ్రద్ధ వలన, సుశీలాదేవి ప్రార్థనల వలన రామి ప్రమాదం నుండి క్షేమంగా బయటపడింది. సుశీలాదేవి దానిని చూడడానికి వెళ్ళింది. వారిద్దరి ప్రేమానురాగాలు హృదయాలను కట్టిపడవేశాయి. అది చూడాలి తప్ప మాటల్లో వివరించటము కష్టము. సుశీలాదేవి కన్నీళ్ళు కారిస్తే రామి ప్రేమతో, కృతజ్ఞతతో ఆమెను చుట్టుకుపోయింది. అక్కడ సుశీలాదేవి, లేదా రామి కాదు ముఖ్యం. నిస్వార్థమయిన ప్రేమ ఒక జ్వాలలాగా ఎన్నటికీ మరణం లేనిది, అన్నింటినీ దగ్ధం చేసేది. అది చూస్తే ఎప్పటికీ మర్చిపోలేని గుర్తుగా ఉండిపోయింది. నిస్వార్థ ప్రేమికులకు నా గౌరవ వందనాలు. వారు ఎలాంటి గౌరవాలు కోరుకోరు. కేవలం అందరినీ ప్రేమించటంలోనే వారికి ఆనందము. ప్రేమతో జీవించటమే వారు కోరుకుంటారు.

సుశీలాదేవి నిస్వార్థ సేవలు జంతువులకు మాత్రమే పరిమితం కాలేదు. ఆశ్రమములోని జబ్బు పడిన వారిని, చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలను కూడా ఎంతో ప్రేమతో ఆదరించి సేవలు అందించేది. స్థలాభావం చేత నేను అవన్నీ మీకు వివరంగా తెలియచేయలేకపోతున్నాను. ఆశ్రమములో తోటమాలికి దెబ్బ తగిలినపుడు ఆమె నెలరోజుల పైగా సేవ చేసింది. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం అతని నివాసం వద్దకు వెళ్ళి గాయానికి మందురాసి కట్టు కట్టేది. జనులందరూ అన్ని రకాల వాళ్ళు, ధనవంతులు, పేదవారు, ముసలివాళ్ళు, యువకులు, ఆరోగ్యవంతులు, జబ్బు పడిన

వాళ్ళు సుశీలాదేవి చుట్టూ గుమిగూడి సాంత్వన పొందుతూ, ఆమె సలహాలు అడుగుతూ ఉండేవారు. ఒక దేవదూత లాగా, ఎంతో అలసట చెందిన క్షణాల్లో కూడా ఆమె ఎంతో ఓర్పుతో, ప్రేమతో, తీయగా మాట్లాడుతూ అందరికి సేవ చేయటానికి సిద్ధంగా ఉండేది.

ఒకసారి అర్థరాత్రి సమయంలో ఒక రైతు ఆశ్రమానికి కళ్ళనీళ్ళతో పరిగెత్తుకుంటూ వచ్చాడు. అతని కుమార్తెకు చాలా జబ్బు చేసింది. వెంటనే సుశీలాదేవి అతడితో తన సంచిలో మందులు తీసుకుని వేగంగా వెళ్ళింది. ఆమె వెంటనే ఆ రోగిని వేడినీటితో తుడిచి శుభ్రం చేసి తన బట్టలు తీసుకువెళ్ళి ఆమె మురికి బట్టలు మార్చి కట్టింది. ఆమె తల్లిదండ్రులకు ధైర్యం చెప్పి తెల్లవారుజామున ఆశ్రమానికి చేరుకుంది. పల్లె ప్రజలు సుశీలాదేవిని ప్రేమ, కరుణా, దయ మూర్తీభవించిన దేవతలాగా చూసేవారు.

సుశీల కేవలం మంచి హృదయం గల నర్సు మాత్రమే కాదు. ఆమె జంతువులను, జబ్బు పడిన వారికి సేవ చేయటంతో పాటు ఆశ్రమ కార్యకలాపాల్లో కూడా చురుకుగా పాలుపంచుకునేది. ఆశ్రమంలో అంతటా ఆమే కనిపించేది. విదేశాల నుండి వచ్చే ఉత్తరాలకు ప్రత్యుత్తరాలు వ్రాయటం, స్టెనోగ్రాఫర్‌గా, క్లర్కుగా చేసేది. అమెరికా, యూరప్ నుండి పర్యాటకులు ఆశ్రమానికి వచ్చినప్పుడు ఆమె వారికి కావాల్సినవన్నీ వండిపెట్టి, వారి అవసరాలన్నీ తీర్చేది. ఆశ్రమంలో ఆమె సెక్రటరీ పాత్ర కూడా పోషించేది. ఆశ్రమ శాంతి ప్రచారంలో మౌనంగా పాలుపంచుకునేది. ఆత్మోన్నతి పొందిన గొప్పవారికి భక్తి విశ్వాసంతో ఉండే అనుయాయురాలిలాగా ఉండేది. సత్యాన్వేషకులయిన సాధకులకు, జిజ్ఞాసువులకు ప్రబోధకురాలిగా వ్యవహరించేది. ఆ విధంగా సుశీల నిస్వార్థపూరిత సేవలు చేస్తూ భౌతికంగా, మానసికంగా మరియు ఆధ్యాత్మికంగా ఉన్నత స్థితిలో కాలం గడపసాగింది.

ఆశ్రమము తరఫున వివిధ పట్టణాలలో శాంతి సందేశాలను ప్రచారము చేయడానికి భక్తులు ఆహ్వానించినప్పుడు సుశీలాదేవి ముందుండి ఆశ్రమ సందేశాలను అందిస్తూ అందరి హృదయాలను చూరగొని, సత్యం వైపు వారిని నడిపించేది. తన నిస్వార్థ సేవలు, అపూర్వమయిన ప్రేమ తత్త్వము ద్వారా ఆమె దీనిని సాధించేది. ఒకసారి మంచి జిజ్ఞాసువులు ఆధ్యాత్మికంగా పురోగతి సాధించిన సాధకులు, మంచి సంస్కారము గల వారు హాజరయిన సమావేశంలో సుశీలాదేవి అందరినీ ప్రభావితం చేసి వారిని ఆకట్టుకుంది. ఆమె ప్రవచనం శ్రవణం చేస్తున్నంత సేపు వారు లోకాన్ని, వారి

నామరూపాలను కూడా మరిచిపోయి అందులో లీనమయిపోయారు. అందరికి కళ్ళ వెంట ఆనందబాష్పాలు కారసాగాయి. పరమాత్ముని విశ్వప్రేమలో అందరూ తడిసి ముద్దయినారు. ఆమె సందేశాలు ప్రేమ, త్యాగము గురించి విన్నప్పుడు ఎవరికయినా హృదయం ఉప్పొంగిపోయి కన్నీరు ఆగదు. అందమయిన వాషింగ్టన్ ఇర్వింగ్ మాటలు గుర్తుకు వస్తున్నాయి.

"కన్నీటిలో పవిత్రత ఉంది. కన్నీరు బలహీనతకి గుర్తు కాదు. అది బలానికి, శక్తికి సంకేతం. వేయి మాటలకన్నా గొప్ప భావాన్ని అవి పలికిస్తాయి. మనస్సులోని తీవ్రమైన దుఃఖాన్ని, భావోద్వేగాన్ని, మాటల్లో వివరించలేని ప్రేమానుభూతిని కన్నీరు ఒక సందేశం లాగా అందిస్తాయి."

ఆ క్షణం అంతటా ప్రశాంతమయిన నిశ్శబ్దం ఆవరించింది. ఏ ఒక్కరూ కూడా మాట్లాడడానికి, కదలటానికి కూడా చాలాసేపు ప్రయత్నించలేదు. నెమ్మదిగా చీకట్లు ముసురుకున్నాయి. ప్రతిసారి చివర్లో పలికే శాంతి ప్రార్థన కూడా మరిచిపోయి నెమ్మదిగా అందరూ ఒకరి తర్వాత ఒకరు వెళ్ళిపోయారు. పైకి కనబడనటువంటి నిశ్శబ్దం అంతటా పరుచుకుంది. ఆ రోజు నిజంగా ఎంతో పవిత్రమయినది. ఎంతో పవిత్రమయిన జ్ఞాపకాలు. నాకు మాత్రమే కాదు, ఆ రోజు సమావేశానికి హాజరయిన ప్రతి ఒక్కరికి కూడా ఎంతో పవిత్రమయిన రోజు. భగవంతుని దివ్యానుభూతిని ఆ మౌనంలో, నిశ్శబ్దంలో ప్రతి ఒక్కరూ అనుభూతి చెందారు.

అనేక సంవత్సరాలు కష్టపడి మిషనరీలు భారతదేశంలో చేయలేని పని ఆ రోజు సుశీలాదేవి చేయగల్గటంలో సఫలీకృతురాలయింది. ఆమె తన నిస్వార్థమయిన, నిరాడంబరమయిన, ప్రేమపూరితమయిన, దయా, కరుణ అందరిపై చూపించటం ద్వారా జీసస్ క్రీస్తు మార్గాన్ని ఆచరణాత్మకంగా అనుసరించడం ద్వారా అందరి హృదయాలను గెల్చుకున్నారు. భారతదేశంలోని సంప్రదాయ కుటుంబాలకు చెందిన ధనవంతులయిన గొప్ప కులాలకి చెందిన మహిళలు సైతం ఆమెను ఆరాధించి పూజించేవారు. ఆమెను నిస్సంకోచంగా వారి పూజా మందిరం లోనికి ఆహ్వానించేవారు. అనేక ఆధ్యాత్మిక కుటుంబాల వారు ఆమెలో తాము నిత్యము పూజించే దేవత ఉనికిని కనుగొని ఆమెను ఆరాధించటము నా హృదయాన్ని బాగా కదిలించివేసింది. సత్యాన్ని దర్శించటం కంటే గొప్ప విషయం ఇంకేముంటుంది? భగవంతుడు అందరికీ

చెందినవాడు. కుల మతాలను మరిచిపోయి రంగు రూపు బేధము లేకుండా దేశము జాతి అనే తేడా లేకుండా విశ్వప్రేమ ద్వారా మాత్రమే పరమాత్మను దర్శించగలము. ఎక్కడ నిజమయిన ప్రేమ ఉంటుందో అక్కడే నిజంగా భగవంతుడు నివసిస్తాడు.

ఎంతో గొప్పవారు, గౌరవించదగిన ఆత్మ స్వరూపులు అయిన నారాయణస్వామీజీ శ్రీ రామతీర్థ గారి ప్రియ శిష్యుడు. ఇంకా ఎందరో మహాత్ములు, హిమాలయాలకు చెందిన యోగులు, కాశ్మీర్ మహారాజా గారి గురువులు, ఎందరో ఆధ్యాత్మిక ఆత్మ బంధువులు సుశీలాదేవిని ఎంతగానో ప్రేమించటమే కాక, ఆమె నిస్వార్థమయిన, నిరాడంబరమయిన జీవితాన్ని, సేవలను కొనియాడేవారు. ఆమె ఆదర్శవంతమయిన జీవితము అందరికీ ఆమె పట్ల గౌరవాన్ని, పూజ్యభావాన్ని కలిగించేది. ఆమె ఎందరో భక్తుల హృదయాల్లో, వారి ఇంటిలో స్థానం సంపాదించుకుంది. ఆమె భారతదేశమంతటా తన పర్యటనలు కొనసాగించేది.

అలాంటి ఆధ్యాత్మిక సహచరురాలిని మేమందరము ఎంతగా కోల్పోయామో మీకు ప్రత్యేకంగా మాటల్లో వివరించలేను. ఆమె ఆశ్రమానికి జీవము, ఆత్మ అయిపోయింది. భారతదేశములోని ఆశ్రమ భక్తులందరూ ఆమె లేని లోటును అనుభవించారు. సుశీలాదేవి కోసం ఆశ్రమంలోని కుక్క రోజూ ఆమె నివసించిన కుటీరము దగ్గరే తచ్చాడుతూ ఉండేది. అది నా హృదయాన్ని కదిలించివేసింది. ఆమె రాక కోసం ఆశ్రమంలోని భక్తులు, గురుకులములోని విద్యార్థులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు, చిన్నపిల్లలు నేను ఏదయినా వ్రాసుకునేటప్పుడు నా వద్దకు వచ్చి “స్వామీజీ! మీరు సుశీలాదేవి గారికి ఉత్తరము వ్రాస్తున్నారా?’ అలా అయితే మా నమస్కారాలు ఆమెకు తెలియచేయండి” అని చెప్పేవారు. ఒక రోజు ఒక చిన్నపిల్లవాడు నాతో “స్వామీజీ! నేను భూగోళ శాస్త్రం నేర్చుకుంటున్నాను. సుశీలాదేవి ఇప్పుడు ఎక్కడ ఉన్నారో తెలుసుకోవడానికి” అని చెప్పాడు. ఈ పిల్లలు సుశీలాదేవి పట్ల ఏర్పర్చుకున్న ఆరాధనాభావాన్ని మించిన గౌరవం ఇంకేముంటుంది? ఆ విధంగా సుశీలాదేవి ఆశ్రమానికి సేవలందించింది.

సుశీలాదేవి లాంటి ఆధ్యాత్మిక ఆత్మజ్ఞానం కల్గిన నిరాడంబరమయిన నిస్వార్థమయిన సేవలందించే ప్రేమమూర్తికి జన్మనిచ్చిన అమెరికా దేశము ధన్యత చెందింది. భారతదేశము ఆమె నిస్వార్థ సేవలను అందుకోవటం ద్వారా ఆశీర్వదించబడింది. ఆమె ఆధ్యాత్మిక జీవితాన్ని గురించి చదవటం ద్వారా నా ప్రియమయిన పాఠకులారా! మీరు కూడా

ధన్యులయ్యారు. ముగించేముందు నేను మీకు ప్రత్యేకంగా చెప్పవలసిన పని లేదు అనుకుంటాను, నేను కూడా ఆమె ఆధ్యాత్మిక సోదరుడిగా, ఆధ్యాత్మిక సహచరుడిగా ఎంతగా ఆశీర్వదించబడ్డానో, మేమిద్దరము చేతులు కలిపి ఆధ్యాత్మిక మార్గంలో ప్రయాణం కొనసాగించాము. కలిసి స్వర్గలోకపు వాకిళ్ళ దాకా ఉన్న మెట్లు ఎక్కాము. శాంతి సామ్రాజ్యాన్ని స్థాపించి పవిత్రమయిన జీవితాన్ని గడిపాము.

ఓం తత్సత్ ఓం

## అధ్యాయం - 53

# విశ్వశాంతి చిహ్నము

ఎంతో అందమయినది, ప్రభావితము చేసేది అయిన విశ్వశాంతి చిహ్నము పద్మము, పవిత్రమయిన ఓంకారము, శిలువ గుర్తు. అలాగే అర్థచంద్రాకారములో ఉండే నక్షత్రము గుర్తు. అన్నీ కలిసినది, పూజనీయమయినది. తూర్పు, పడమర దేశాల్లో మనకు ఎన్నో దేవుని ప్రతిమలు, పవిత్రమయిన గుర్తులు లేదా చిహ్నాలు దేవాలయాల్లో, చర్చిల్లో కనబడుతుంటాయి. కాని ఈ విశ్వశాంతి చిహ్నము చాలా అరుదయినది, అపూర్వమయినది. ఒక పరిపక్వస్థితికి లేదా పరాకాష్ఠ అయిన ఆధ్యాత్మిక స్థితికి చేర్చే అన్ని దేవాలయాలు, చర్చిలు, మసీదులు, సన్యాసులు ఉండే మఠాలు అన్నింటిని ఒకే చోటికి చేర్చే ఒక గొప్ప ఏకాగ్రతని కలిగించే చిహ్నమిది.

"ఏకం సత్ విప్రా బహుధా వదంతి" అని శాస్త్రములు ఘోషిస్తున్నాయి. ఉన్నది ఒక్కటే సత్యము. కాని అనేకులు అనేక విధాలుగా భావిస్తుంటారు. అందువల్ల విశ్వ సత్యము ఏదయితే దానిని ఆరాధించాలి. మా ప్రార్థనా మందిరముయొక్క హృదయ మధ్యలో విశ్వశాంతి చిహ్నము ఉంది, దానిపైన ఈ విధంగా వ్రాయబడింది. "భగవంతుడు ఒక్కడే. విశ్వమంతా ఆయనని పూజించాలి". విశ్వశాంతి చిహ్నము క్రింద ఈ మంత్రాన్ని ఆచరణాత్మకము, ఎంతో శక్తిమంతము అయిన పదాలతో, **"శ్వాస తీసుకోవటంలో, శ్వాస వదలటంలో శాంతిని పొందు. అదే నీ జన్మహక్కు"** అని ఉంటుంది.

విశ్వశాంతి చిహ్నంలోని ప్రతి చిహ్నము కూడా అనంతమైన ప్రేమ సముద్రము నుండి ఆవిర్భవించినవే. అవి భగవంతుని ప్రతిరూపంగా స్పష్టంగా, అందరికీ విదితమైనట్లుగా ఆవిర్భవించాయి. అలలు సముద్రము నుండే ఆవిర్భవించి, కొంతసేపు సముద్ర మట్టముపైన నృత్యము చేసి, చివరికి సముద్రంలో కలిసిపోయి రూపాన్ని కోల్పోయినట్లుగా, అన్ని మతాలకీ కూడా ఆవిర్భావ స్థానము ఆ పరమాత్మ మాత్రమే. అన్ని మతాలకి చెందిన మానవులు భగవంతునితోనే కలిసి జీవిస్తారు. చిట్టచివరికి ఆ భగవంతునిలోనే తిరిగి ఐక్యమవుతున్నారు. వారు తమ జీవిత లక్ష్యాన్ని తెలుసుకో గలిగినపుడు అజ్ఞానంలో ఉన్నవారు మాత్రమే భగవంతుడు తమ కంటే వేరుగా భిన్నంగా దూరంగా ఎక్కడో ఉన్నాడని భావిస్తారు. ఎప్పుడయితే జ్ఞానము లభిస్తుందో అప్పుడు పరమాత్మ మానవునికి అత్యంత ఆప్తుడు, దగ్గరివాడు అవుతాడు. భగవంతుడే అంతటా అన్నింటా నిండి ఉన్నాడు. భగవంతుడు మాత్రమే శాశ్వతము, మిగిలినవన్నీ కూడా అశాశ్వతమే.

పద్మము బౌద్ధుల మత చిహ్నము. ప్రేమ, దయ, కరుణ అనే సముద్రము నుండి ఆవిర్భవించింది. పద్మము హృదయానికి, పవిత్రతకి చిహ్నము. అది ఎప్పుడూ మానవుడి లోపలే ఉంటుంది కానీ బయట కాదు. అతను అజ్ఞానంతో దానిని గుర్తించలేకపోయినా సరే అది అతడిలోనే ఉంది. పద్మము, హృదయము అనేది కేవలము బౌద్ధులకి మాత్రమే పరిమితం కాదు. హిందువులు, జైనులు, క్రైస్తవులు, మహమ్మదీయులు, పార్సీలు అందరికీ చెందుతుంది. ఏ మానవుడు అయినాసరే హృదయము లేకుండా ఎలా ఉండగలడు? అందువలన ప్రతి మతము కూడా కొన్ని ఇతర మతాల లక్షణాలు కల్గి ఉంటుంది. సముద్రములో ప్రతి అల కూడా ఇతర అలలతో సంబంధము కల్గి ఉన్నట్లుగా, అందువలన మతాలు విడివిడిగా ఉండలేవు. అవిభాజ్యమైన ఐక్యత కలిగి ఉంటాయి. బుద్ధిజంలోని చాలా గొప్ప మంత్రము "ఓం మణి పద్మే హమ్" ప్రపంచములోని నాలుగు గొప్ప మతాలను సమన్వయం చేస్తూ ఉంటుందని అనిపిస్తుంది.

ఓం – హిందూ మతానికి గుర్తు
మణి – క్రైస్తవ మతానికి గుర్తు
పద్మే – బౌద్ధ మతానికి గుర్తు
హమ్ – ఇస్లామ్ మతానికి గుర్తు



మానవుడు తన హృదయాన్ని గుర్తించగల్గినంత కాలము పద్మము అతనిలోనే ఉంటుంది. ఎక్కడ పద్మము ఉంటుందో అక్కడ దయ, కరుణ ఉంటాయి. ఎక్కడ దయాగుణము, కరుణా గుణము ఉంటాయో అక్కడ బుద్ధభగవానుడు ఉంటాడు. అందువల్ల దయాగుణము కలవారి హృదయంలో బుద్ధభగవానుడు తిష్ఠ వేసుకుని ఉంటాడు. అతను క్రైస్తవ మతానికి చెందినా, జైన మతానికి చెందినా, పార్శీ అయినా, మహ్మదీయుడైనా, హిందువు అయినా ఇంకే ఇతర మతానికి చెందినా, అసలు ఏ మతానికి చెందకపోయినా కూడా బుద్ధుడు వారి హృదయంలో నివసిస్తాడు. పద్మములోని ఎనిమిది రేకులు బుద్ధుని అష్టాంగ మార్గాన్ని సూచిస్తున్నాయి.

పరమ పవిత్రమయిన ఓంకారము హిందూయిజానికి గుర్తు. ఓంకారమే ఆది,మధ్య, అంతము. ఆది అన్నింటిని తనలో కలుపుకుంటుంది. ఏ ఒక్కరినీ వదిలిపెట్టదు. విశ్వంలో ఆవిర్భవించిన వసుధలో శబ్దము ఓంకారమే. ఓంకారమే మొట్టమొదటి మాట. దాని నుండే సమస్తమయిన శబ్దాలు, ఆకారాలు, నామరూపాలు ఏర్పడ్డాయి. ఓంకారము అన్ని మతాల్లోనూ ఉంది. అది ప్రతి మానవుని జన్మహక్కు. అకార, ఉకార, మకారములు కలిపితే ఓంకారము అవుతుంది. అకారము బుద్ధిజానికి గుర్తు అయితే ఉకారము క్రిష్టియానిటీకి గుర్తు. ఇక మకారము మహ్మదీయ మతానికి గుర్తు. ఈ విధంగా సంపూర్ణంగా ఓంకారము పరిపూర్ణత్వాన్ని సూచించే హిందూయిజానికి సంకేతంగా నిలుస్తుంది.

ఓంకారము పుష్పాల్లోని సువాసనలాంటిది. గాలికి కదలాడే గడ్డిపరకల్లోని సున్నితత్వము లాంటిది. పక్షికూతల్లోని మధురమయిన శబ్ద తరంగాల వంటిది. జంతువు భయంకరమైన అరుపు వంటిది. మానవుని మాటల వంటిది. ఈ సృష్టిలోని ప్రతి ప్రాణి నుండి ఓంకారమే వినిపిస్తుంది. ఎందుకంటే సమస్త విశ్వము ఆ పరమ పవిత్రమయిన ఓంకార నాదము నుండే ఆవిర్భవించాయి. ఓంకారమే ప్రతివాని హృదయ స్పందనలో వినిపిస్తుంది. ప్రతి ఒక్కరి శ్వాసలోనూ ప్రవహిస్తోంది. అందువల్ల ఎవరు దానిని తనలోనూ, సమస్త విశ్వంలోనూ శ్రవణం చేయగల్గుతారో, గుర్తించగల్గుతారో, దర్శించగల్గుతారో వారిని హిందువులుగా భావిస్తారు. ఎప్పుడు స్పష్టంగా విదితమైన 'ఓంకారము' గాఢమైన మౌనంలో, ధ్యానంలో నిమగ్నమయిపోతుందో అప్పుడే మానవుడు

'నిర్వికల్ప సమాధిని', 'నిర్వాణాన్ని' లేదా అన్నింటినీ అర్థం చేసుకోగలిగే ప్రశాంతతని పొందగల్గుతాడు.

తర్వాత విశ్వశాంతి చిహ్నాములోని గుర్తు శిలువ. పవిత్రమయిన భగవాన్ క్రీస్తుకి గుర్తు. ఎవరి జీవితమయితే త్యాగానికీ, తోటివారి సేవలకు అంకితమయిపోయిందో అలాంటి పవిత్రమయిన జీవితానికి గుర్తు. నీ చేతులను ఇరువైపులా చాచినప్పుడు నీవు హిందువయినా, జైనుడవయినా, మహ్మదీయుడవైనా, బౌద్ధుడవయినా నీ భౌతిక శరీరము శిలువ మీద జీసస్ యొక్క ఆకారాన్ని పొందుతుంది. పవిత్రమయిన శిలువ యొక్క హృదయము, ఆత్మ ప్రకాశాన్ని పొందిన ఆత్మ, స్వయం ప్రకాశాన్ని జీసస్ పొందిన స్థితిని ప్రతి ఒక్కరిని ఆ మహోన్నతమయిన స్థితిలోనికి తీసుకువెళుతుంది. శిలువ త్యాగానికి, నిస్వార్థ సేవలకు ప్రతీకగా నిలుస్తుంది. కనుక నీవు ఎవరివయినా, ఎక్కడ ఉన్నప్పటికీ నీవు ఇతరుల కోసం జీవిస్తుంటే నీవు స్త్రీమూర్తివయినా, పురుషుడివయినా అప్పుడు జీసస్ క్రీస్తు అన్నట్లుగా, "నేను నీతోనే ఎల్లప్పుడూ ఉంటాను" అని ఉంటుంది.

అర్ధచంద్రాకార గుర్తు ఇస్లాం మతంలో చాలా ఉన్నతోన్నతమయిన స్థితిని వివరిస్తుంది. అది పరాక్రమానికి సంకేతం. బలానికి, ఆత్మార్పణకి సంకేతము. ఎప్పుడయితే మానవుడు భగవంతునికి శరణాగతి చెందుతాడో, అప్పుడు అతను ఏ మతానికి చెందిన వాడయినా ఫర్వాలేదు. అప్పుడు అతడు ఇస్లాము మతములోని మహోన్నతమయిన ఏకత్వాన్ని నిరూపించుకుంటాడు. అర్ధ చంద్రాకారములోని నక్షత్రము ఇస్లాము మతంలోనే కాదు, జుడాయిజములో కూడా ఉంది. అది దావీద్ నక్షత్రానికి గుర్తు, ఒక పవిత్రమయిన నక్షత్రము కొంతమంది తెలివయిన వారికి పవిత్రమయిన జీసస్ క్రీస్తు జన్మ తీసుకున్న ప్రదేశానికి మార్గదర్శనం చేసింది. నక్షత్రం అంటే మహోన్నతము అయిన ప్రదేశము. అది సహస్రార పద్మానికి సంకేతము. బ్రహ్మ రంధ్రానికి సంకేతము. భగవద్దర్శనానికి దారి చూపిస్తుంది. సత్యానికి మార్గదర్శనం చేస్తుంది. పరిపక్వతని కల్గిస్తుంది. ఆధ్యాత్మిక వికాసాన్ని కలుగచేస్తుంది.

విశ్వశాంతి చిహ్నాము మధ్యలో అగ్ని గుర్తు ఉంది. అది పార్శీ మతానికి సంకేతము. జోరాస్టర్లు దానిని అనుసరిస్తారు. వాళ్ళు అగ్నిని ఆరాధిస్తారు. ఇక్కడ అగ్ని అంటే సూర్య భగవానుడు. అగ్ని అందరినీ పవిత్రీకరిస్తుంది. అగ్ని అంటే పవిత్రతకి చిహ్నాము. ఎవరయితే అగ్నిని ఆరాధిస్తారో వాళ్ళు వెలుగులకే వెలుగునిచ్చే తేజస్సులో

లీనమయిపోతారు. విశ్వమయ తేజస్సును గుర్తించి తెలుసుకున్నవారు పార్శి మత విశ్వాసంలోని ఏకత్వాన్ని సాధించుకుంటారు.

సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, ఇంకా అనేకములయిన పద్మాల మొగ్గలు, సముద్రము ఇవన్నీ కూడా తూర్పు, పడమర దేశాల్లోని మనకు తెలిసిన, తెలియని, ఇంకా భవిష్యత్తులో రాబోయే అన్ని క్రొత్త మతాలన్నింటికి సంకేతాలుగా నిలుస్తాయి. అందువలన మన విశ్వమత చిహ్నము అన్ని మతాలను కలుపుకుంటుంది తప్ప ఏ ఒక్క మతాన్ని వదిలిపెట్టదు. నాస్తికులకు, దేవుని గురించి ఏమి తెలియదు, కేవలము భౌతిక ప్రపంచం గురించి మాత్రమే తెలుసు. సముద్రములోని నీరు భగవంతుని తత్వాన్ని తెలుసుకున్న ఆత్మ స్వరూపులకు గుర్తు. భక్తులు ఆ నీటి కెరటంలో ఈదులాడి జీవితాన్ని అనుభవించి దివ్యత్వం వైపుగా పయనించి వెలుగులకు వెలుగునిచ్చే సూర్యుని చేరుకుంటారు.

విశ్వశాంతి చిహ్నము క్రింద ఎంతో శక్తిమంతమయిన మంత్రముంది. "ఉచ్ఛ్వాస నిశ్వాసల్లో శాంతిని అనుభవించు. అది నీ జన్మహక్కు" నెమ్మదిగా లేదా ఆలస్యంగానయినా ఈ దివ్యమంత్రము మానవుడిని పరిపూర్ణుడిని చేస్తుంది. నీవు భగవంతుని బిడ్డగా ఉన్నంతకాలం, నీ ప్రతి శ్వాసలో కూడా శాంతి నిర్విరామంగా ప్రవహిస్తుంది. నీవు నాస్తికుడివి అయినా, భౌతిక ప్రపంచానికి మాత్రమే పరిమితము అయినా ఫర్వాలేదు. శాంతి అనేది నీ దివ్య లక్షణము. అది ప్రతి ఒక్కరికి సమానంగా జన్మహక్కుగా ప్రాప్తిస్తుంది. పురుషులు, స్త్రీలు, పిల్లలు, ప్రతి దేశములోని వారందరికి అది వర్తిస్తుంది. కావలసినదల్లా కేవలము భగవంతుని ఉనికి పట్ల విశ్వాసము, ఆయనని గుర్తించడము. ఎప్పుడయితే ఈశ్వరుడిని విస్మరిస్తామో, విశ్వ సత్యానికి దూరమవుతామో అప్పుడే మానవుడిని ఈర్ష్యా ద్వేషాలు, విద్వేషాలు, విధ్వంసాలు, మరణము కబళిస్తాయి.

దేవుని బిడ్డలారా! మీరు ఎక్కడ ఉన్నప్పటికీ మీరు ఎవరయినప్పటికీ శాంతి మీ ప్రతి శ్వాసలోనూ ప్రవహిస్తుంది. అది మీరు జీవితం కొనసాగినంత కాలం ఉంటుంది. మనమిప్పుడు మన ప్రతి శ్వాస మీదా, ఉచ్ఛ్వాస నిశ్వాసల మీద ఏకాగ్రతతో ధ్యానము చేద్దాము. అది మన జన్మహక్కు. శాంతి మన లోపల బయటా, పైనా, క్రిందా, మన చుట్టూ నెలకొను గాక! నిజంగా మనము శాంతిలో తేలియాడుతున్నాము. పరమాత్మలో లీనమయి పోయాము. మన భౌతిక దేహాలు విశ్వశాంతి చిహ్నాలు. ప్రపంచంలోని ఎన్ని

మతాలున్నాయో అవన్నీ మన శరీరంలోనే ఉన్నాయి. మన లోపలే ఉన్న విశ్వశాంతిని గుర్తించాలి. మన వెలుపలి గుర్తులను వదిలివేయాలి. మనము నడుస్తుంటే విశ్వశాంతి చిహ్నము నడుస్తున్నట్లుగా భావించాలి. మనము శ్వాస తీసుకొంటుంటే విశ్వశాంతి చిహ్నము శ్వాస తీసుకుంటున్నట్లుగా భావించాలి.

మనము విశ్వశాంతి చిహ్నముపై ధ్యానము చేస్తున్నప్పుడు మనలోనే శ్రీకృష్ణుడు, బుద్ధుడు, శివుడు, జీసస్ క్రీస్తు, మోసస్, మహమ్మదు, జోరాష్టర్, నానక్, రామకృష్ణ పరమహంస, రామతీర్థ ఇంకా ఎందరో సాధు మహాత్ములు, యోగి పుంగవులు తూర్పు పడమర దేశాల్లోని మహనీయులందరూ ఉన్నట్లుగా భావన చేయాలి. అందరూ మనలోనే నెలకొని ఉన్నారు. విశ్వమంతా మనలోనే దాగి ఉంది. మానవాళిని ప్రభావితము చేసే మహనీయులందరూ కలిసి మనలో ఉన్నారు అనే భావన మనలను ఎంతగానో ఉత్తేజితులను చేసి ఆత్మానందాన్ని కలిగిస్తుంది. అందరితో ఏకత్వాన్ని అనుభవించు, అనుభూతి చెందు. విశ్వ తేజస్సులో మునిగి అందులో లీనమయిపోవాలి. విశ్వశాంతి చిహ్నము మనందరి హృదయాలలో విశ్వశాంతిని ఇచ్చుగాక! ఆ విధంగా భూమిపైన శాంతి నెలకొను గాక! దేశాల మధ్య సామరస్యం నెలకొనుగాక! అందరి హృదయాలలో శాంతి నెలకొనుగాక!

ఓం... ఓం... ఓం...

**అధ్యాయం - 54**

# రెండు అపురూపమయిన క్షణాలు

సత్యాన్వేషకులందరి జీవితాలలో, మానవ జీవిత గమ్యాన్ని చేరుకోవాలి అనే ప్రయత్నంలో రెండు అపురూపమయిన క్షణాలు ఉంటాయి. వారు తూర్పుదేశాలకి చెందిన వారయినా, పడమర దేశాలకి చెందినవారయినా పవిత్రమయిన ఆత్మ స్వరూపులు, ఆశీర్వదించబడిన వారు కనుక వారు తమని తాము ఉద్ధరించుకోవటమే కాకుండా, వారి దేశాన్ని మొత్తము ప్రపంచమానవాళిని కూడా తరింపచేస్తారు. అలాంటి అరుదయిన, అపురూపమయిన, అమూల్యమయిన క్షణాలు ఏమిటి?

1. తన పట్ల మమకారాన్ని వదిలిపెట్టి, ఇతరుల కోసం నిస్వార్థమయిన ప్రేమతో అహంకార రాహిత్యంతో, నిస్వార్థంగా మానవాళి బాగు కోసం సేవలు అందించిన అమృత క్షణాలు.

2. దేహాన్ని దేహంగా కాకుండా, బుద్ధిని బుద్ధిగా కాకుండా, ప్రపంచాన్ని ప్రపంచంగా కాకుండా మానవ చరమ లక్ష్యమయిన ఆత్మోన్నతి కోసం భగవదనుభూతిలో ఓలలాడిన దివ్య క్షణాలు.

ఈ దివ్యమయిన అపూర్వమయిన క్షణాలలో ఉన్న ఒకే లక్షణము నిస్వార్థ పరత్వము, అహంకార రాహిత్యము. మానవుడు తనను తాను మర్చిపోయినపుడు మాత్రమే ఇతరులకు నిస్వార్థంగా సేవలందించ గల్గుతాడు. అతడు నిమ్నస్థితి నుండి బయటపడినప్పుడు, అహంకారం నుండి విడివడినప్పుడు అతను తాను చేసే నిస్వార్థ సేవలకు ఎలాంటి గుర్తింపులు, గౌరవాలు, పురస్కారాలు కోరుకోడు. సేవ చేయగల్గడమే గొప్ప పురస్కారంగా అతను భావిస్తాడు. భగవంతునిలో మమేకమైన వ్యక్తి ధ్యానములో అంతర్జ్యోతిని తన లోపలా బయట కూడా దర్శించగల్గుతాడు. తనలోనే కాకుండా ఇతరుల్లో కూడా దర్శించగల్గుతాడు. ఎందుకంటే అతడిలో నిమ్నస్థితి అడుగంటిపోతుంది. అతడు ఇతరుల నుండి ఏమి ఆశించడు, ఎలాంటి కోరికలు కోరుకోడు.

ఇతరులకు నిస్వార్థంగా సేవలు చేసే వ్యక్తి గొప్పవాడా? లేదా భగవంతుని అనుభవాన్ని పొందిన వ్యక్తి గొప్పవాడా? ఇద్దరిలో ఎవరు గొప్ప వ్యక్తి అనే ప్రశ్న ఇప్పుడు మనకు అనవసరము. ఇద్దరూ కూడా ఎవరి పరిధిలో వారు అత్యుత్తములే అవుతారు. ఇద్దరూ కూడా మానవాళి శ్రేయస్సు కోసమే పనిచేస్తారు. ఇద్దరూ గౌరవంగా పూజింపబడతారు. ఇద్దరూ నిస్వార్థంగా సేవ చేస్తారు, ధ్యానము చేస్తారు. ఇద్దరూ వారి వారి పరిధుల్లో ప్రపంచానికి మంచి జరిగేలా పాత్ర వహిస్తారు. అన్నింటికన్నా ప్రాధాన్యత ఇద్దరి జీవితాల్లోనూ సంపూర్ణంగా వ్యక్తిగత భావనని వదిలిపెట్టడమే.

స్వార్థ పూరితమయిన వ్యక్తి ఈ భూమికి భారంగా తయారవుతాడు. అతను ఏదయినా పని చేసినా లేదా చేయకపోయినా సరే అతడు ఈ భూమికి భారమే. నిస్వార్థ జీవి మానవాళికి గొప్ప వరంగా భాసిల్లుతాడు. అతడు ఒక కర్మయోగిలాగా ఇతరులకు సేవ

చేసినా, జ్ఞానయోగి లాగా మౌనంగా ధ్యానంలో కాలం గడిపినా, తన ఆదర్శంతమైన జీవన విధానం ద్వారా శాంతిని ప్రసాదిస్తాడు.

స్నేహితులారా! ఇప్పుడు మిమ్మల్ని మీరు పరీక్షించుకోండి. మీ జీవితాలను పరిశీలించి చూసుకోండి. మీ సొంత పవిత్రమయిన క్షణాలు సేవలో లేదా మౌనంగా ధ్యానంలో గడిచినవా? అని ప్రశ్నించుకోండి. నా ప్రార్థన ఏమిటంటే మీలో ప్రతి ఒక్కరూ మీ జీవితాలను ఇతరుల సేవలో, భగవంతుని బిడ్డలకు నిస్వార్థమయిన సేవలందించటంలో చక్కగా సద్వినియోగం చేసుకోవాలి. తద్వారా మానవ జీవిత గమ్యము చేరుకోవాలి పిలుపు రాకముందే.

ఎవరయితే తన జీవితాన్ని నిస్వార్థ పూరిత సేవల్లోనూ, మౌనంగా భగవంతుని ధ్యానంలోనూ కూడా గడిపేవారు అదృష్టవంతులు. వారు నిస్వార్థపరులు మానవాళి క్షేమం కోరుతూ అందరిలోకి శ్రేష్ఠులుగా జీవిస్తారు. అతను సమస్త ప్రపంచాన్ని తన సొంత కుటుంబంలాగా ప్రేమించి ప్రపంచ మానవాళి శ్రేయస్సు కోరుకుంటాడు.

## నా జీవితంలో అమూల్యమయిన రెండు సంఘటనలు

నా జీవిత చరిత్రలో, సుదీర్ఘమయిన నా డెబ్బై ఏడు సంవత్సరాల జీవితంలో రెండు అపురూపమయిన సంఘటనలు, ఎంతో పవిత్రమయినవి. ఎంతో ఉత్తేజితులను చేసేవి నా జీవితంలో జరిగాయి.

ఆ క్షణంలో ఆత్మ సాక్షాత్కారస్థితి, భగవంతుని దివ్యానుభవము, ఆ ఈశ్వరుని అనుగ్రహము నా ప్రమేయము ఏమీ లేకుండా హఠాత్తుగా ప్రసరించింది. నా భౌతిక శరీరము, బుద్ధి, హృదయము, ఆత్మ అన్నింటినీ మర్చిపోయాను. నా శరీరమంతా సర్వం కోల్పోయినట్లుగా తిమ్మిరెక్కిపోయింది. బుద్ధి పనిచేయటం మానివేసింది. హృదయము నిర్మలంగా, ప్రశాంతంగా మారిపోయింది. ఆత్మ పరిపూర్ణత చెందింది. ఇదంతా ఏ మాత్రము ఊహించని విధంగా నేను కుర్చీలో కూర్చుని నా ఆశ్రమ పనులు చేసుకుంటున్నప్పుడు జరిగింది. ఈ అమూల్యమయిన అనుభవం గురించి నేను మీకు మళ్ళీ వివరంగా తెలియచేస్తాను.

ఇంక రెండవ అపూర్వమయిన క్షణము, నేను నా జీవితంలో ఒక చిన్న పాప కోసం నిస్వార్థంగా సేవ చేయడానికి అవకాశం వచ్చింది. ఆమె జీవితంలో ఇంక నడవలేక పోయి ఉండేది. 1950 ఆగష్టులో నేను వాల్తేరు ఆశ్రమములో శాంతి మిషన్ కార్యక్రమాల్లో ఉండగా ఒక చిన్న పాపను ఆమె తండ్రి నా వద్దకు తీసుకువచ్చాడు. నేను అతడిని ఎందుకు ఆమెను ఎత్తుకుని తీసుకువస్తున్నావు? అని అడిగినప్పుడు అతడు నాతో ఆ పాపకి ప్రమాదవశాత్తూ కాలు నలిగిపోయిందని చెప్పాడు. ఆ పాప పేరు నిర్మల. ఆమె బాధతో ఎంతో ఇబ్బంది పడింది. ఢిల్లీ మరియు విశాఖపట్టణంలోని వైద్యులు ఆమె బాధ తగ్గించడానికి ఒకే ఒక మార్గమున్నదని ఆమె కాలి ఎముకను గంటు పెట్టి ఆపరేషన్ చేయవలసి ఉందని, లేకపోతే ఆ పాప శాశ్వతంగా తన కాలు కోల్పోతుందని చెప్పారట.

ఆ పాప తండ్రి బాధ్యతాయుతమైన ఉద్యోగంలో ఉన్నాడు. అతనిది చాలా పెద్ద కుటుంబము, బాధ్యతలు ఉన్నాయి. అందువలన చాలా నెలల పాటు ఆ పాపను వైద్యశాలలో కాలికి కట్లతో ఉంచి భరించగల స్తోమత లేదు. ఎవరయినా దయాహృదయం గల దాతలు తమ కాలి ఎముకను ఇవ్వగలరా? అని చాలా ప్రయత్నాలు చేశాడు. డబ్బు ఇస్తానని చెప్పినా ఎవ్వరూ ముందుకు రాలేదు. ఆమె తల్లిదండ్రులు చాలా దయనీయమయిన స్థితిలో ఏమి చేయలేని పరిస్థితిలో పడిపోయారు.

నాకు బాల్యం నుండి ప్రకృతి వైద్యం పట్ల గల ఆసక్తి వలన వాల్తేరు ఆశ్రమంలోని కొంత భూమిలో కొన్ని కుటీరాలు నిర్మించి ప్రకృతి వైద్యశాలను నిర్వహించేవారము. ఎంతో పేరు ప్రఖ్యాతులు కల్గిన ప్రకృతి వైద్యుడు అక్కడ సేవలందించేవాడు. నిర్మల తల్లిదండ్రులు అతని గురించి విని ఆశ్రమానికి వచ్చారు. కాని అతడు నిర్మలకి ప్రకృతి వైద్యము వలన నయం కాదని చెప్పి వారిని చాలా నిరాశపరిచాడు. శాంతి ఆశ్రమము శాంతికి నిలయం కావటం వలన, ఆశ్రమం తలుపులు ఎప్పుడూ సేవకు తెరిచే ఉంటాయి కనుక నిర్మల తండ్రి అడుగులు మా ఆశ్రమము తలుపులు తట్టాయి. అన్ని విషయాల్లో విఫలమయినపుడు మానవులు భగవంతునిపైన భారం వేసి నిజమయిన సహాయం కోసం ఎదురుచూస్తారు.

ఆ రోజు నిజంగా చాలా పవిత్రమయిన రోజు. నిర్మలకి, ఆమె తల్లిదండ్రులకు మాత్రమే కాదు, నాకు కూడా. నేను వారిని చూచి, వారి కథని విన్న వెంటనే ఎలాంటి సంకోచము లేకుండా, ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా ఆశ్రమ సభ్యులతో ఎవ్వరిని



బేబి నిర్మల

సంప్రదించకుండానే, వెంటనే ఆమె తల్లిదండ్రులకి నా ఎడమ కాలి నుండి చిన్న ఎముకను ఆ పాప కోసం దానం చేయడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పాను. ఈ విషయాన్ని వైద్యులకి తెలియచేసి ఆపరేషన్‌కి అవసరం అయిన ఏర్పాట్లన్నీ చేసుకోవాల్సిందిగా సూచించాను. అయితే నిర్మల తండ్రి నేను చెప్పిన విషయాన్ని నిజం అని నమ్మక నేను సరదాగా మాట్లాడుతున్నాను అని భావించి ఇంటికి వెళ్ళగానే ఆ సంఘటన గురించి, నేను ఇచ్చిన వాగ్దానం గురించి కూడా మర్చిపోయాడు.

కానీ వాళ్ళు ఆశ్చర్యపడేవిధంగా నేనే వాళ్ళతో మాట్లాడి, కింగ్ జార్జి వైద్యశాలలో ఆపరేషన్ కోసం ఏర్పాట్లు చేసుకోవాల్సిందిగా వత్తిడి చేశాను. డా॥ ఎం.వి. రమణ మూర్తి నా పాత స్నేహితుడు, మరియు డా॥ సి.కె. ప్రసాద్‌రావు ఆ వైద్యశాల సూపరింటెండెంట్ నన్ను చూడడానికి వచ్చారు. నేను చెప్పిన విషయం వినగానే వాళ్ళు సంతోషించినా, నా జీవితం చాలా విలువైనదని, ఎలాంటి అవకాశాలు, ఇబ్బందులు తీసుకోకూడదని సూచించారు. డా॥ కిన్ని ఎముకల సర్జను అప్పుడు బొంబాయిలో ఉన్నారు. ఆయన కూడా నాకు నా జీవితం ఎంతో అమూల్యమయినది కనుక ఎలాంటి రిస్కు తీసుకోవటం మంచిది కాదని సందేశం పంపించారు. ఆయన నాకు మంచి స్నేహితుడు, శ్రేయోభిలాషి. అమెరికాలో మంచు మీద జారిపడినప్పుడు నా ఎడమ కాలి తుంటికి ఆపరేషన్ చేసింది కూడా ఆయనే. వాల్తేరు ఆశ్రమంలో శాంతి వైద్యశాలను స్థాపించి చాలా సంవత్సరాల క్రితమే ఆశ్రమానికి ఆయన ఎన్నో సేవలందించారు.

చాలా మంది స్నేహితులు, భక్తులు, ఆశ్రమ సభ్యులు, ఎంతో దూర ప్రాంతాల్లోని భక్తులు ఈ విషయం తెలుసుకుని చాలా బాధపడి, ఈ విషయం గురించి గట్టిగా పట్టుబట్టి వద్దని చెప్పారు. అనవసరంగా నేను నా కాలి ఎముకను త్యాగం చేయటం గురించి వారు చాలా కంగారుపడ్డారు. అయితే ఈశ్వరుని ఆజ్ఞ లేనిదో గడ్డి పరక కూడా కదలదు. వాగ్దానం అంటే అది జరిగి తీరవలసిందే. ఆ ప్రాణం పోయినా సరే నేను మాట ఇచ్చిన విధంగా చేయటానికే కృతనిశ్చయుడనయ్యాను. సమయానికి అవసరమయిన జాగ్రత్తలన్నీ పాటించి నేను, బేబి నిర్మల ఇద్దరము వైద్యుల సూచనల మేరకు ఆపరేషన్ థియేటర్‌లోనికి చేర్చబడ్డాము.

నేను 'ఓంకారాన్ని' జపించటం మొదలుపెట్టాను. తర్వాత వైద్యులతో వారి పని చేసుకోవాలని చెప్పాను. ఆపరేషన్ జరుగుతున్నంతసేపు నేను పూర్తిగా స్పృహలోనే

ఉండాలని నిశ్చయించుకున్నాను. అందువలన మత్తు ఇవ్వవద్దని వైద్యులకి చెప్పాను. నా ఎడమ కాలి మాంసం కోసి తెరిచి కాలి ఎముకను రంపంతో కోసి, కత్తిరించి సుమారుగా ఎనిమిది ఇంచుల ఎముకను బయటికి తీశారు. తర్వాత నా ఎడమ కాలికి గట్టి సిమెంటు కట్టు వేశారు. అది నా తుంటిని దాటి పై వరకూ వచ్చేవిధంగా కట్టు వేశారు. అంతా పూర్తి అయిన తర్వాత నా గదిలోనికి తీసుకువెళ్ళారు విశ్రాంతి కోసం.

తర్వాత వైద్యులు, నర్సులు నా నుండి సేకరించిన ఎముకను బేబి నిర్మల కాలికి ఎక్కడ విరిగిందో అక్కడ అతుకు పెట్టడానికి ఆపరేషన్ మొదలుపెట్టారు. భగవంతుని ఆశీర్వచనములతో ఆపరేషన్ విజయవంతంగా ముగిసింది. చిన్నారి నిర్మలని పిల్లల వార్డులోనికి విశ్రాంతి కోసం తీసుకువెళ్ళారు. నాకు ఎలాంటి బాధ కల్గలేదు. కేవలము నా కాలి ఎముకను ఎక్కడ కత్తిరించి తీశారో అక్కడ కొద్దిగా తెలిసింది. కానీ రెండు రోజుల వరకూ రక్తం ధారలుగా కారి కట్టు తడిసిపోయింది. నేను పడుకున్న మంచం మీది పక్క కూడా రక్తంతో తడిచి ముద్దగా మారింది. దీని వలన వైద్యులు, నర్సులు చాలా ఆందోళన చెందారు. కాని నేను మాత్రం ప్రపంచంలోని అందరికన్నా అదృష్టవంతుడిలాగా భావించాను తప్ప ఎలాంటి ఆందోళన చెందలేదు. ఒక అమాయకపు పసిపాపకు సహాయం చేయడానికి అవకాశాన్ని కల్పించిన పరమాత్మకు ధన్యవాదాలు తెలియచేసుకున్నాను. రెండు, మూడు రోజుల తర్వాత రక్తం ప్రవహించటము నెమ్మదిగా తగ్గింది. అందువలన అందరూ సంతోషించారు. ఆపరేషన్ విజయవంతమయినందుకు సంతృప్తి చెందారు.

నాకు ఇంకా బాగా గుర్తుంది. ఆపరేషన్ జరుగుతున్నప్పుడు ఒక వైద్య విద్యార్థిని మిగిలిన వైద్య బృందానికి సహాయకారిగా ఉంది. ఆమె బేల హృదయంతో కన్నీరు కార్చసాగింది. దానికి వైద్యులు ఆమెను నిరాకరించారు. కాని ఇప్పుడు ఆమె చాలా గొప్ప వైద్యురాలు. ఎంతో బాధ్యతాయుతమైన, గౌరవప్రదమయిన పదవిలో ఉంది. ఆమె ఆశ్రమానికి జీవితకాలము మంచి స్నేహితురాలిగా మారిందని చెప్పవలసిన పని లేదనుకుంటున్నాను. భగవంతుని లీలలు ఆశ్చర్యకరంగా పరమ అద్భుతంగా ఉంటాయి. ఆ రోజుల్లో చాలా మంది ఆశ్రమ భక్తులు దగ్గరలోని వారే కాక బహుదూరం నుండి కూడా వచ్చి చూచి వెళ్ళేవారు. నమ్మశక్యం కాని విధంగా ఎముకను తీసి ఇంకొకరికి అతికించటం వారికి ఆశ్చర్యంగా ఉండేది. డైరెక్టరు జనరల్ ఆఫ్ హాస్పిటల్స్ మద్రాసు

నుండి వచ్చి కింగ్ జార్జి హాస్పిటల్ చేసిన అరుదయిన ఆపరేషన్ గురించి, ఎంతో విజయవంతంగా చేయటం గురించి స్వయంగా అభినందనలు తెలియచేశారు. ఎముకను ఎలాంటి ఫలితాన్ని ఆశించకుండా, ఎలాంటి గౌరవాలు, పురస్కారాలు కోరుకోకుండా దానము చేసినందుకు గౌరవాభినందనాలు తెలియచేశారు.

హాంగ్‌కాంగ్‌లోని ఆశ్రమ నిర్వాహకుల్లో ఒకరు, జీవిత సభ్యత్వము పొందిన మాతృదేవి రుత్తోన్జి. ఆమె కుటుంబ సభ్యులు, మంచి భక్తులు. ఆశ్రమాన్ని ఎంతో జాగ్రత్తగా నిర్వహించేవారు. వారు ప్రతి నెల కొంత మొత్తాన్ని సేకరించేవారు. అలా సంవత్సరాలుగా సేకరించిన ధనాన్ని వైద్యశాలకు విరాళంగా పంపించింది. ఆమె పంపిన హృదయ పూర్వకమయిన ప్రేమతో నిండిన ఆ బహుమతిని నేను ఆ వైద్యశాలలోని రోగులు అందరితో కలిసి పంచుకోవాలని భావించాను. ఆ ఫలాన్ని ఎంతో శాంతి, ఆరోగ్యము, ప్రేమతో కూడిన అభినందనలను నాతో పాటుగా అక్కడి వైద్య సహాయం పొందుతున్న రోగులందరికి చెందాలని నేను భావించాను. అలాగే ఆ వైద్యశాలలోని వైద్యులు, నర్సులు, వార్డు బాయ్‌లు, సేవలందించే నర్స్‌లు అందరికీ అది చెందాలి. నేను ఎంత గొప్ప ఆనందాన్ని అనుభవించానో మామూలు చిన్న చిన్న మాటల్లో ఇమిడ్చి చెప్పలేక పోతున్నాను. భగవంతునికి నా ధన్యవాదాలు. అన్నీ తెలిసిన ఆ పరమాత్మ నాకు మాత్రమే ఒక అరుదయిన అవకాశాన్ని కల్పించాడు. ప్రపంచంలో మిలియన్ల కొద్దీ మానవులు ఎందరో ఉండగా, దురదృష్టవశాత్తూ, విధివశాత్తూ కష్టంలో ఉన్న నిస్సహాయురాలైన ఒక చిన్న పాపకి సహాయం చేయడానికి ఎవ్వరూ ముందుకురాని సమయంలో ఆ అవకాశాన్ని భగవంతుడు నాకు అనుగ్రహించాడు.

భక్తులు పొగడ్తలతో ముంచెత్తినపుడు, గొప్పసేవ, త్యాగము చేసినందుకు అభినందనలు తెలియచేసినపుడు నేను వారితో చిరునవ్వుతో "ఆ చిన్న ఎముక ముక్క చాలా ఆశీర్వదించబడింది. దానిలాగే నా శరీరంలోని ఇతర ఎముకలు కూడా అదేవిధంగా ఇతరుల సేవకోసం వినియోగించబడితే, భగవంతుని బిడ్డల సేవ నిమిత్తం వాడబడితే బాగుంటుందని భావిస్తున్నాను" అని చెప్పేవాడిని. నాకు నిజంగా తెలియదు, ఏదయినా గొప్ప పని చేసినప్పుడు అహంకారము వస్తుందేమో. ప్రత్యేకంగా దాని గురించి ఇతరులు పొగిడినప్పుడు, అభినందనలు తెలియచేసినప్పుడు అలా అహంకారం ఏర్పడినట్లయితే,

దానిని సమూలంగా కాల్చి నాశనం చేసి వేయడానికి ఒక్కటే మార్గమున్నది. అదే నిస్వార్థమయిన సేవ చేయటం ద్వారా సాధించవచ్చు.

నిజం చెప్పాలంటే, సేవ చేయటమే ఒక గొప్ప బహుమతి. ఎంతటి చిన్నవారికయినా సేవ చేయగల్గితే, అది ఆ పరమాత్మకే చెందుతుంది. సజీవంగా తిరుగాడే ప్రతి జీవి కూడా పరమాత్మకు ప్రతిరూపమే. ఆ కనిపించని పరమాత్మకు ప్రతిబింబమే.

ఇంత మంచి పని జరిగిన తర్వాత బేబి నిర్మల తల్లిదండ్రులు ఆశ్రమానికి మంచి భక్తులుగా మారిపోయారు. జీవితాంతము వారు శాంతి మిషన్‌కి సేవలందించారు. ఆమె తండ్రి ఆశ్రమానికి చాలా సంవత్సరాలు వైస్ ప్రసిడెంట్‌గా సేవలందించారు. భగవంతుని లీలలు ఈ విధంగా బహువిధంగా ఉంటాయి.

గొప్పతనమంతా ఆ భగవంతునిదే. ఆ పరమాత్మ బేబి నిర్మలను ఆరోగ్యంతో, శాంతితో ఆశీర్వదించుగాక! ఆమె భక్తిమయ జీవనము భగవంతుని బిడ్డలకి ఆశీస్సులు అందించుగాక! ఇది నా ప్రార్థన.

ఓం...ఓం...ఓం...

## గమనిక

ఆపరేషన్ జరిగిన తర్వాత స్వామీజీ కాలికి సిమెంటు కట్టు ఆరు నెలల వరకు ఉంచాల్సి వచ్చింది. ఆ సమయంలో వారు కైలాస పర్వతంపై ఉన్నారు. ఆరునెలల పర్యంతము మళ్ళీ ఇంకొకసారి స్వామీజీ మౌనంగా, నిశ్శబ్దంలోని ఆనందాన్ని అనుభవిస్తూ, పూర్వము పొందిన అనుభవాన్ని సొంతం చేసుకున్నారు. మాతృ ఆశ్రమంలో అంతకు ముందు స్వామీజీ నలభై రోజులు ఉపవాసము, మౌనదీక్ష సాగించారు. భగవాన్ జీసస్ క్రీస్తు అడుగుజాడలను అనుసరించారు. ఆ సమయంలోనే వారు “ఆధ్యాత్మిక మెరుపులు” రచించారు. తర్వాత అది శ్రీ కె.ఎస్.డి. అయ్యర్, కోయంబత్తూరు ఆధ్యాత్మిక హీలింగ్ కేంద్రము యొక్క సెక్రటరీ ద్వారా గ్రంథరూపము దాల్చింది.

కైలాసాశ్రమములోని అందమయిన పర్వత శిఖరము మీద కూర్చుని చుట్టూ నీలి రంగులో పరుచుకున్న సముద్రపు అందాలను ఆస్వాదిస్తూ పూజ్యశ్రీ స్వామీజీ మౌనదీక్ష సాగించారు. ఆపరేషన్ తర్వాత కట్టిన సిమెంటు కట్టు తీసివేశారు. జనవరి 21వ తేది

1951లో స్వామీజీ ఏభై ఏడవ జన్మదినము. దీర్ఘకాలము మౌనదీక్ష సాగించటం వలన తాను ప్రపంచమానవాళికి మరింతగా సేవలందించగల శక్తిని పొందగలనని స్వామీజీ భావించారు. మౌనము వలన సంతోషము, శాంతి, సౌకర్యము, ఆత్మానందము కలుగుతాయి. అది విశ్వానికంతటికి ప్రసరిస్తుంది. ఇంతకాలము నుండి భారతదేశములో, అమెరికాలో ఇంకా అనేక ఇతర దేశాల్లో చేసిన సేవలన్నింటికన్నా మిన్నగా మౌనం ద్వారా ప్రపంచాన్ని సేవించవచ్చు.

**అధ్యాయం - 55**

# ఆధ్యాత్మిక అనుభవాలు

నా ప్రియమయిన భక్తుడు, స్నేహితుడు, నా జీవితము ప్రారంభమునుండి ఇప్పటి వరకు నేను పొందిన ఆధ్యాత్మిక అనుభవాలను గురించి వ్రాయమని అభ్యర్థించాడు. నేను గతంలోనికి వెళ్ళడానికి ఇష్టపడకపోయినా, ఎప్పుడూ భవిష్యత్తులో జీవించడానికే ఇష్టపడినా, ఎల్లప్పుడూ వైభవోపేతమైన ఈశ్వరుని ప్రకాశవంతమయిన తేజస్సును లోపలా, బయటా అనుభూతి చెందుతూ ఆనందించే నాకు నా ప్రియమయిన, గౌరవనీయుడయిన స్నేహితుని కోరికను కాదు అని అనలేక నా బాల్యంలోని కొన్ని ఆధ్యాత్మిక అనుభవాలను ఇక్కడ పొందుపరుస్తున్నాను.

'నేను, నాది' అనే పదాలు వాడకుండా వ్యక్తిగతమయిన అనుభవాలను వ్రాయటము ఎవరికయినా కష్టసాధ్యము. వ్యక్తిగత అనుభవాలన్నీ కూడా చివరికి ఆధ్యాత్మిక అనుభవాలుగా మారిపోతాయి. వ్యక్తిగత జీవితం కూడా తనది కాని జీవితం అవుతుంది. 'నేను' అనే వ్యక్తిగత భావం నశించిన వాళ్ళు అదృష్టవంతులు, భగవంతుని ఆశీస్సులు పొందిన వారు అవుతారు. అలాంటి వారిలో అత్యున్నతమయిన మహోన్నతస్థితి, ప్రకాశవంతంగా నెలకొంటుంది.

నా ఆధ్యాత్మిక అనుభవాల గురించి మొదలు పెట్టాలంటే ముందుగా విశ్వశాంతి ప్రార్థనకి నేను గౌరవాన్ని, భక్తిని ప్రకటించాలి. అది నా బాల్యం నుండి కూడా నాకు ఎంతో సహాయపడింది. ఈ ప్రార్థనని చేసిన ప్రతి పర్యాయము అది నాలో ఆనందాన్ని,

దివ్యానుభూతిని, తన్మయత్వాన్ని నింపి, నన్ను నా లోపల నిండియున్న పరమాత్మ ఉనికిని, నా శరీరంలోని ప్రతి అణువులో నిండి నిబిడీకృతమైన ఈశ్వరుడిని అనుభూతి చెందేలా చేస్తుంది. విశ్వశాంతి ప్రార్థన చేసిన ప్రతిసారి నాకు అలాంటి అనుభవమే కల్గుతుంది. మీకు కూడా అలాంటి అనుభవమే కల్గవచ్చు. మీరు విశ్వశాంతి ప్రార్థన చేసినప్పుడు గాని, లేదా ఇంకేమయినా మీ మనస్సుకు బాగా నచ్చిన ప్రార్థన చేసినప్పుడు గాని, లేదా ఆధ్యాత్మిక ప్రార్థనలు చేసినప్పుడు గాని మీకు అలాంటి దివ్యానుభూతి కల్గవచ్చు. అది మిమ్మల్ని ఈశ్వరుడి సన్నిధికి చేర్చడానికి సహాయకారిగా మారుతుంది.

ఎవరయినా ప్రార్థనని, ఉపవాసాన్ని, ధ్యానాన్ని వేరు వేరుగా భావించరాదు. ఉపవాసదీక్షలో సాధకుడు అహంకార రాహిత్యం కోసం ప్రార్థన చేస్తాడు. మొదట్లో నేను ఒక రోజు మాత్రమే ఉపవాసము చేసేవాడిని. నేను అప్పుడే ఆధ్యాత్మిక జీవితాన్ని నేర్చుకుంటున్న దశ అది. ఉపవాస దీక్ష వలన నేను పరమాత్మకు దగ్గరయ్యాను. తర్వాత నెమ్మదిగా ఒక రోజు నుండి రెండు, మూడు రోజులు ఉపవాసం చేయటం అలవాటు చేసుకున్నాను. నా శరీరంలో ఆరోగ్యము, బుద్ధిలో వికాసము, హృదయంలో శాంతి పెరగటం గమనించి ఒకసారి వారం రోజులు ఉపవాసదీక్ష కొనసాగించాను. తర్వాత పది రోజులు చేసి ప్రతి రోజు నా ఆధ్యాత్మిక అనుభవాలను వ్రాయటం మొదలుపెట్టాను. తర్వాత పదిహేను రోజులు చేశాను. ఉపవాస దీక్ష గురించిన పుస్తకాలు నాకు చాలా ఉపయోగపడ్డాయి.

చాలామంది తరుచుగా ఆరోగ్యం బాగోలేనప్పుడు మాత్రమే ఉపవాసం చేస్తుంటారు. మందులు పనిచేయనప్పుడు వారు ఉపవాసం మీద ఆధారపడతారు. చాలాసార్లు ఉపవాసమే సర్వరోగ నివారణంగా, శాశ్వత పరిష్కారంగా భావించబడుతుంది. శరీరంలోని జబ్బులన్నింటిని నయం చేస్తుందని విశ్వసిస్తారు. కాని భగవంతుని దయ వలన నా విషయంలో నేను మొదటినుండి చాలా ఆరోగ్యవంతుడిని. నేను ఉపవాసం చేసిన ప్రతి పర్యాయము భగవంతునికి మరింత చేరువగా అయిన భావన కలిగేది. నేను భౌతికమయిన లబ్ధికోసమో, ఆరోగ్యం కోసమో, దీర్ఘకాల జీవితం కోసమో కాకుండా అంతర్యామిగా కొలువైన ఈశ్వరుని కోసం ఉపవాస దీక్ష చేసేవాడిని. నా తర్వాత దీక్ష ఇరవై ఒక్క రోజులు కొనసాగింది. ఆ సమయంలో అంతులేని ఆనందానుభూతిని, నిశ్చల స్థితిని,

శాంతిని పొందాను. భగవంతుని దివ్యానుభూతిని నా లోపలా, బయటా కూడా అనుభవించాను.

ఉపవాసదీక్ష, మౌనదీక్ష నాకు చాలా ఇష్టమయినప్పటికీ, నేను దానిని అందరిని పాటించమని చెప్పను. వ్యక్తిగతంగా ఎవరికి ఏది ఉపయోగకరంగా ఉంటుందో, భగవంతుడిని తెలుసుకోవడానికి ఉపకరిస్తుందో, అది ఉపవాసము కావచ్చు లేదా విందు భోజనము కావచ్చు, దానినే పాటించవచ్చును.

తర్వాత నేను నెలరోజులు సుదీర్ఘకాలము ఉపవాస దీక్షను, మౌనదీక్షను పాటించాను. నేను ఉపవాసదీక్ష పాటించిన ప్రతిసారి నా అనుభవాలను వ్రాయలేదు. కాని నెల రోజుల దీక్షా సమయంలో మాత్రము నా ప్రతి రోజు దినచర్యని, వ్యక్తిగత ఆధ్యాత్మిక అనుభవాలను, దివ్యానుభూతులను ముప్పై అధ్యాయాలుగా వ్రాశాను. తర్వాత అవన్నీ "ఆధ్యాత్మిక ఉపవాసము" పేరుతో పుస్తకంగా ముద్రించబడింది. నా బాల్యంలో గొప్ప పవిత్ర గ్రంథమయిన బైబిల్‌లో జీసెస్ క్రీస్తు నలభై రోజుల పాటు ఉపవాస దీక్ష చేసినట్లుగా చదివి ప్రభావితుడనై నేను కూడా అదేవిధంగా చేయాలని భావించాను. అందువలన నన్ను నేను అందుకు అనుగుణంగా మార్చుకునేందుకు వీలుగా సంవత్సరం ... సంవత్సరం ఉపవాస దీక్షలు చేస్తూ సమాయత్తమయ్యారు. సంకల్పము బలంగా ఉంటే ఈశ్వరుడే తన బిడ్డల కోరికలను నెరవేరుస్తాడు. ఆ విధంగా నేను సంకల్పం చేసుకున్నవిధంగా చిట్టచివరికి నలభై రోజులు ఉపవాసదీక్ష చేసే సమయం ఆసన్నమయింది. మార్చి 1950 సంవత్సరం తోటపల్లి కొండల్లోని ఆశ్రమంలో నలభై రోజులు ఉపవాసదీక్ష చేశాను.

ఆ పవిత్రమయిన ఆధ్యాత్మిక అనుభవాలు ఏవయితే ఆ రోజుల్లో నాకు అనుభవంలోకి వచ్చాయో. వాటిని మామూలు మాటల్లో వర్ణించలేను. భక్తుల అభ్యర్థన మేరకు ఏదో విధంగా ఆ నలభై రోజుల మౌనదీక్షలో కలిసి చేసిన ఉపవాస దీక్ష గురించి నలభై అధ్యాయాలు తెలుగులోనూ, నూట ఎనిమిది అధ్యాయాలు ఇంగ్లీషు భాషలోనూ రచించాను. ఈ అధ్యాయంలో నేను పొందిన చిన్న, గొప్ప అనుభవాలు, దివ్యమయిన అనుభూతులు వివరించబడ్డాయి. నా పాఠకులందరికి ఇది నా నిజాయితీతో కూడిన ప్రార్థన. దయచేసి అర్థంచేసుకోవడానికి ప్రయత్నం చేయండి, అవగాహన చేసుకోండి. ఈ సృష్టికర్త అయిన ఈశ్వరుడితో, అంతర్యామిగా నెలకొనియున్న శక్తితో ఆ రోజుల్లో

నేను పొందిన అతి దగ్గరి సాన్నిహిత్యము, అలాంటి పవిత్రమయిన అనుభవాలు అమరమైనవి. అలాంటి మహోన్నతమయిన అనుభవాన్ని, దివ్యానుభూతులను మాటల్లో వివరించటం అసాధ్యం. ఏ విధంగా చక్కెర తియ్యదనాన్ని వర్ణించి చెప్పగలము? అది కేవలం అనుభవించినప్పుడే తెలుస్తుంది. పరిమితమయిన బుద్ధితో, పరిమితమయిన భాషలో అపరిమితమయిన ఈశ్వరుని వైభవాన్ని వివరించటము ఎవరికయినా ఎలా సాధ్యపడుతుంది?

అందువలన మనము బ్రహ్మాన్ని తెలుసుకోవడానికి అయినా ప్రయత్నించాలి. మిలియన్ల కొద్దీ సూర్యుల తేజస్సును తనలో స్వయం ప్రకాశంగా వెలుగొందుతున్న పరమేశ్వరుడిని తెలుసుకోవడానికి ప్రయత్నం చేయాలి. అప్పటిదాకా వైభవంగా అనిపించిన అహంకారమే కాకుండా గొప్పదయిన ప్రపంచము కూడా మాయమయిపోతుంది. ఎప్పుడూ బయట సంచరించే విషయవాసనలన్నీ (ఇంద్రియాలు) అంతర్ముఖమవుతాయి. బుద్ధిలో ఏకాగ్రత కుదురుతుంది. ఆలోచనాశక్తి స్థిరమవుతుంది. అహంకార రాహిత్యము ఏర్పడుతుంది. అన్ని స్థితులను దాటి ఆనందాల్లో తేలియాడే సత్యాన్వేషకుడు, ఆ స్థితిలో ప్రయాణించి చివరికి మౌనంలో నిమగ్నుడవుతాడు.

ఈ విధమయిన సందేశము ఆధ్యాత్మిక అనుభవాల గురించి ఇచ్చినపుడు చాలా మంది నిరాశ చెందవచ్చు. వారికి అతీంద్రియ శక్తుల మీద ఆసక్తి ఉంటుంది. ఆధ్యాత్మిక అనుభవాలు అంటే దూరదృష్టి ఏర్పడటం, చనిపోయిన వారితో, లేదా దూరంగా ఉన్నవారితో మాట్లాడగల్గటం, వింత వింత వెలుగులను, కాంతులను దర్శించటము లేదా ఏదయినా పవిత్రమయిన మంత్రోచ్చారణలు వినగల్గటము, సంగీత ధ్వనులు వినటము ఇలాంటివన్నీ ఊహించుకుంటారు. కానీ నేను నిజమయిన సత్యాన్వేషకులకు వాస్తవాన్ని, సత్యాన్ని తెలియచేయాలని భావిస్తున్నాను. అలాంటి ఆలోచనలు తక్కువ స్థితికి చెందిన సాధకులకు గాని, ఉన్నతమయిన స్థితికి చేరుకున్న సాధకులకు గాని కల్గవచ్చు. అయితే అక్కడ ద్వైతస్థితి ఉంటుంది. ద్వైతము అజ్ఞానానికి సంకేతము.

అన్ని ఆధ్యాత్మిక అనుభవాలకి చరమ గమ్యము భగవంతుని దివ్యానుభూతిని పొందటము, పరమాత్ముని ఉనికిని తెలుసుకోవటము, గుర్తించటము అయిఉంది. దానిని ముందుగా గుర్తించు. నీవు ఉపవాసదీక్షలో ఉన్నా లేదా ఏదయినా పనిచేస్తున్నా ప్రార్థనలోఉన్నా, ధ్యానములో ఉన్నా, మాట్లాడుతూ ఉన్నా లేదా పూర్తి మౌనంలో ఉన్నా నీవు తెలుసుకోవాల్సింది ఏమిటంటే పనిచేయటమే పరమాత్మను పూజించటము.

పరమాత్మానుభవము లేదా అద్వితీయ మౌనము అన్నింటిలోకి మహోన్నతమయిన స్థితి. పనికిమాలిన పనులతో అలసిపోయి గమ్యాన్ని మర్చిపోకు. జీవించి ఉండగానే, నీలో ఆ దివ్యమయిన తేజస్సు ప్రకాశిస్తుండగానే నీ నిజమయిన గమ్యాన్ని చేరుకోవటానికి ప్రయత్నము చేయాలి. అప్పుడు వ్యక్తులు సార్వత్రికమవుతారు. వ్యక్తిగతము ప్రత్యేక వ్యక్తిగతము కాకుండా ఉంటుంది. అవుతారు అని చెప్పటము ఒక విధంగా సరయిన పదము కాదు. ఎందుకంటే నిజానికి వ్యక్తులు ఎన్నటికి సార్వత్రికము లేదా విశ్వము కాలేరు. ఉన్నది ఒక్కటే. అది ఎల్లప్పుడూ ఉంటుంది. మన కంటికి కనిపించని విశ్వశక్తి అది. వ్యక్తులు దాన్ని తెలుసుకోగల్గుతారు. గుర్తించగలుగుతారు లేదా గ్రహించగల్గుతారు. అలా గ్రహించిననాడు జీవుడు బ్రహ్మముగా మారిపోతాడు.

మనము భావాతీతమైన అతీత తాత్త్విక చింతనయొక్క వైభవముతో శాశ్వతంగా నిమగ్నమవుదము గాక! అది ఇంద్రియాలు, బుద్ధి, వివేకము, అహంకారము, కాలము, కారణము అన్నింటికి అతీతమయినది. మన ఆలోచనలు, దృష్టికోణము, పరిమితమయిన బుద్ధితో కేవలము ఇంద్రియాలకు మాత్రమే గోచరమగు దృశ్యములన్నీ కూడా భ్రమ అని, ఎడారిలో ఎండమావుల్లాంటివి అని గుర్తుంచుకోవాలి. మనము ఎప్పుడు సంతోషంగా, సంతృప్తిగా ఉంటామో అప్పుడే మనకు శాంతియొక్క అనుభవము, అవగాహన ఏర్పడుతుంది.

ఓం.... ఓం.... ఓం....

**అధ్యాయం - 56**

# కైలాస ఆశ్రమము - మౌనంగా కొన్ని సంవత్సరాలు

నేను రాస్తున్న ఆత్మకథని కోటగిరిలో నెలకొనివున్న శాంతి కేంద్రములో వ్రాసి పూర్తిచేస్తే బాగుంటుందని సోదరి శాంతి ప్రతిపాదించింది. నేను అంతకు పూర్వమే అక్కడ కొన్ని అధ్యాయాలు ఆ అందమయిన, ఆరోగ్యకరమైన కేంద్రంలో వ్రాశాను. మేము నీలగిరి కొండల్లోని శాంతి కేంద్రానికి వెళ్ళడానికి సమాయత్తమవుతుండగా, పూజ్య రామానంద తీర్థ గారు హిమాలయాల్లోని తెహ్రీలోని శ్రీ రామతీర్థ జ్ఞాపకార్థం నిర్మించిన స్తూపాన్ని ఆవిష్కరించడానికి ఆహ్వానించారు. అక్కడే శ్రీ రామతీర్థ స్వామీజీ పవిత్రమయిన

గంగానదిలో తమ భౌతిక దేహాన్ని త్యజించారు. ఈ స్తూపాన్ని ఆవిష్కరించటము అంటే అది నా జీవితానికి ధన్యతను చేకూర్చేపని. నాకు ఎంతో ఇష్టమయినది. శ్రీ రామతీర్థ గారు అంటే నాకు బాల్యం నుండి ఎంతో ఇష్టం. ఆయన జీవితము, వారు రచించిన గ్రంథాలు ఆయన చేసిన అద్భుత కార్యాలు నన్ను ఎంతగానో ప్రభావితము చేశాయి. ఆయన చాలా గొప్ప కవి, సాధు మహనీయుడు, పంజాబీ, ఆయన తన మాతృదేశం అయిన భారతదేశాన్ని పవిత్రమయిన అభిలాషను ఎంతో ప్రేమించాడు.

మేము హిమాలయాలకు బయలుదేరేముందే నాలుగు రోజుల ముందు శ్రీ రామతీర్థ శాంతి ఇనిస్టిట్యూట్ విద్యార్థులను వెంటబెట్టుకొని వాల్తేరు ఆశ్రమాన్ని చూడడానికి వెళ్ళాము. రిషికొండ బీచ్ దగ్గర కొంత పని చేసుకున్న తర్వాత మేము కైలాసగిరి కొండ ఎక్కాము. అక్కడ నేను 1951 నుండి 1957 వరకు ఆరు సంవత్సరములు మౌనదీక్షలో గడిపాను.

కైలాసగిరి పర్వతముపైనుండి చూస్తూ ఎల్లలు లేని నీలిరంగు సముద్రము మూడువైపులా, ఒకవైపు పర్వతాల వరసలు కనిపిస్తూ కనువిందు చేస్తుంటే నా మనస్సు ఎంతో ఆనందించింది. కొన్ని మిలియన్ల నక్షత్రాలు ఆకాశం నిండా పరుచుకొని నన్ను ఈ ఆత్మకథని పూర్తి చేయడానికి ప్రేరణనిస్తున్నట్లుగా ఉన్నాయి. ఆశ్రమవాసులు, శ్రేయోభిలాషులు, భక్తుల కోరిక నెరవేర్చమని చెపుతున్నట్లుగా ఉన్నాయి.

ఈ పవిత్రమయిన రోజున, తెల్లవారుజామున, ఎంతో గొప్ప సంతోషంతో, ఆనందంతో, సంతృప్తిగా వెలుతురు సరిగ్గా లేకపోయినా నేను ఈ అధ్యాయం వ్రాయటం మొదలుపెట్టాను. కైలాసగిరిపైన ఎలక్ట్రిక్ దీపాలు లేవు. అందువలన నేను కిరసనాయలు దీపాన్ని వాడేవాడిని. ఈ ప్రపంచంలోకెల్లా నేను చాలా గొప్ప ధనవంతుడిగా భావించాను. ఎందుకంటే తెల్లవారుజామునే నిద్రలేవటం వలన నా వద్ద చాలా సమయం ఉంది. నాతో పాటు వచ్చిన విద్యార్థులందరు ఇంకా గాఢమయిన నిద్రలో ఉండగా, నా ప్రక్కన నాకు ఎంతో విశ్వాసపాత్రమయిన కుక్క 'రామి' నాకు తోడుగా ఉండగా నా వైపు చూస్తూ త్వరగా నా ఆత్మకథని పూర్తిచేయమని ప్రార్థిస్తున్నట్లుగా ఉంది. పెన్ను తీసుకుని వ్రాయటం మొదలుపెట్టాను. చివరికి జంతువు అయిన 'రామి' కూడా దానిని పూర్తిచేయమని చెపుతుంటే మిగిలిన అధ్యాయాలు తొందరగా పూర్తిచేయాలని అనిపించింది.

ఇవన్నీ ప్రక్కనపెడితే, అసలు ఆత్మకథని వ్రాస్తున్నది ఎవరు? ఇదంతా ఆయనే వ్రాస్తున్నాడు. ఒకే ఒక్కరు వ్రాయగలరు. అందరిలో నెలకొని ఉండే ఆ ఒక్కటే అతడు. ఆయనే వ్రాస్తున్నప్పుడు, వైభవమంతా ఆయనకే చెందుతుంది. నేను అనేక ఆశ్రమాల పనుల వత్తిడిలో ఉన్నాను. తోటపల్లి కొండలు, వాల్తేరు, కైలాసగిరి, కోటగిరి శాంతి కేంద్రము మొదలైన ఆశ్రమ వ్యవహారాలు చూడటంతో పాటు ఇంకొక నిత్యమయిన ఇబ్బంది ఏమిటంటే నేను గతంలోనికి, దాదాపుగా ఇరవై లేదా ముప్ఫై సంవత్సరాలు వెనక్కి వెళ్ళి అప్పటి వ్యక్తులను, ఆనాటి సంఘటనలను తవ్వి తీయవలసి వస్తోంది. ఈ రోజుల్లో నేను గతాన్ని మర్చిపోయి ఈ క్షణంలో జీవించడానికి ఇష్టపడతాను. కైలాసగిరిలోని ప్రధానమైన భవన సముదాయములోని ఒక పెద్ద హాలులో కూర్చొని ఇప్పుడు నేను వ్రాస్తున్నప్పుడు, నా ఎదురుగుండా ఉన్న గోడ మీద ఉన్న గుర్తు నన్ను ఎంతో ప్రభావితం చేస్తోంది. ఆ గుర్తులోని సందేశము నా జీవితాన్ని ఎంతో ప్రభావితం చేసింది. అది కేవలం ఒకే ఒక్క పదము. కాని అది జీవితాన్ని మంచిమార్గములో నడిపిస్తుంది. జిజ్ఞాసువులకు, సాధకులకు, సత్యాన్వేషకులకు ఆధ్యాత్మిక బలాన్ని చేకూరుస్తుంది. వారు తూర్పు దేశాలవారయినా లేదా పశ్చిమ దేశాలవారయినా సరే. ఆ సందేశము ఈ క్షణంలోనే. వర్తమానంలో జీవించేవారు ఆశీర్వదించబడతారు. గతాన్ని వదలిపెట్టాలి. భవిష్యత్తు నీ చేతిలో లేదు. అది అనిశ్చితము. కనుక ఈ క్షణంలో వర్తమానంలో జీవించాలి. ప్రతి క్షణము, అనుక్షణము పైపైకి రావటానికి ప్రయత్నించి ఉన్నతమయిన స్థితికి చేరుకోవాలి. చివరికి మానవుని జీవిత గమ్యము చేరుకోవాలంటే ప్రతి క్షణాన్ని, వర్తమానాన్ని సాధ్యమయినంత చక్కగా సద్వినియోగం చేసుకోవాలి.

'వర్తమానము' మీద చక్కని కవిత నాకు చాలా ఇష్టము. దానిని మీ కోసం ఇక్కడ పొందుపరచాలనుకుంటున్నాను.

### ఈ రోజు

ప్రతి సూర్యోదయము వలన మీ జీవితము ప్రారంభమయినట్లుగా భావించు.
గతము అయిపోయింది కనుక దానిని లోతుగా పాతిపెట్టు
గడిచిపోయిన రోజులన్నింటిని వాటిని నిద్రలోకి జారిపోనీయి
నిన్ను నీవు 'ఈ రోజు'కి చెందినవాడిగా గుర్తించు
అర్థం చేసుకో, నీ మనస్సుకు తెలియచెప్పు, తలవంచు

ప్రణాళికలు సిద్ధం చేసుకో, సమయం ఆసన్నమయింది
'ఈ రోజు' మానవునికి మంచి స్నేహితురాలు
'నీవు' 'ఈ రోజు' నీ ఆత్మను శుద్ధి చేసుకో
ఈ సమయం చాలా అమూల్యమయినది
ఆ పరమాత్మతో అనుబంధాన్ని పెంచుకో
ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్ళిపో, సాధించు దాన్ని సాధించు.

## ఈ క్షణంలోనే చేయి

నేను ఈ దారిలో ఒక్కసారే రాగల్గుతాను అనుకుంటున్నాను. అందువలన నా వలన ఏదయినా మంచి పని జరిగితే, ఇతర మానవాళికి నా వల్ల ఏదయినా దయాగుణము చూపించగల్గితే, మేలు జరిగితే, దానిని నేను ఇప్పుడే, ఈ క్షణంలోనే చేయాలను కుంటున్నాను. దానిని నిర్లక్ష్యం చేయడం గాని, దాని నుండి మరలిపోవడం గాని చేయను. ఎందుకంటే మళ్లీ ఈ దారిలో నేను రాగలనో లేదో తెలియదు కదా!

ఇప్పుడు ప్రశాంతంగా, అందంగా ఉన్న కైలాసగిరి పైన కూర్చుని ఉన్నాను. చాలా వరకు శిథిలావస్థకు చేరుకుంది, అక్కడి భవనాలు, గోడలు, పక్షులు, చెట్లు, మొక్కలు అన్నీ కూడా శాంతి ఆశ్రమానికి భగవాన్ శివుని నివాసస్థలమయిన కైలాసగిరి స్వర్గసీమ లాంటి పవిత్ర స్థలాన్ని భగవంతుడు ఏ విధంగా అందేవిధంగా పరిస్థితులు సృష్టించాడో పాఠకులకు తెలియచేయమని ప్రార్థిస్తున్నాయి. సత్యాన్వేషకులకు, తూర్పు పడమర దేశాల్లోని భక్తులకు, సాధకులకు ఆధ్యాత్మిక సాధనకు అది ఎంతగానో ఉపయోగపడింది.

అన్నింటికన్నా సంతోషకరమయిన విషయం కైలాసగిరిగురించి ఇప్పుడు మీతో పంచుకోవాలని ఉంది. భగవంతుని ఆశీస్సుల వలన ఇక్కడే నేను ఆరు సంవత్సరాల సుదీర్ఘ కాలము కేవలము ప్రార్థనలు, ధ్యానములోనే కాకుండా పూర్తి మౌనంలో గడిపాను. నేను ఎల్లప్పుడూ జ్ఞానేశ్వరికి కృతజ్ఞుడనై ఉంటాను, ఎందుకంటే ఆ సమయంలో ఆమె నా గురించి ఎంతో శ్రద్ధతో జాగ్రత్తగా చూసుకుంది. ప్రతిరోజు ఆమె వాల్తేరు ఆశ్రమము నుండి కైలాసగిరి కొండపైకి వర్షంలో తడుస్తూ అలాగే మండుటెండలో కూడా కొండ ఎక్కి నడిచి వచ్చేది. నాకోసం భోజనము, ఇతర అవసరమయిన వస్తువులు తీసుకు వస్తుండేది. స్నేహితులు, శ్రేయోభిలాషులు ఆమె భక్తి శ్రద్ధలకు ముగ్ధులయిపోయేవారు.

ఆమె పక్షిలాగా ఎంతో సంతోషంగా, సునాయాసంగా ఎగురుతూ కైలాసగిరి కొండ శిఖరానికి చేరుకునేది. నేను ఆరు సంవత్సరాలు మౌనంగా ఉన్నా ఆ సమయంలోనే మేము శాంతి ఆశ్రమాల్లో అలాగే వాల్తేరు ఆశ్రమంలో ఎన్నో ముఖ్యమయిన పనులు ఆశ్రమ అభివృద్ధి కోసం చేయగలిగాము. వాల్తేరు ఆశ్రమంలో ముద్రణాలయం నెలకొల్పాము. అలాగే శాంతి పత్రికను వెలువరించటం ద్వారా భక్తులకు ఆధ్యాత్మికంగా ఎంతో గొప్ప సాహిత్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చాము. ప్రత్యేకంగా విశాఖపట్టణం తదితర దగ్గర ప్రాంతాల వారికి చాలా ఉపయోగకరంగా చేశాము.

భగవంతుని అనుగ్రహం వలన, అన్ని ప్రాంతాల నుండి భక్తుల ప్రార్థనల మూలంగా 'మౌనపు ఘడియలు' అనే పుస్తకము కైలాసగిరిపై మౌనంలో నాకు కల్గిన ఆధ్యాత్మిక అనుభవాల గురించి వ్రాసినది ప్రచురించడం జరిగింది. అందులోని అధ్యాయాలు తెలుగు, ఇంగ్లీషు రెండు భాషల్లో ప్రచురించాము. కాని ఇంకా చాలా అధ్యాయాలు రెండు పెద్ద మడతల్లో ఉండిపోయాయి. అవి కనీసం ఇంకొక రెండు పుస్తకాలు అయి ఉండేవి. వాటిని మర్చిపోయినందుకు చాలా విచారంగా ఉంది. ప్రతిరోజూ భగవంతునిపై భారం వేసి శాంతి ఆశ్రమాన్ని నిర్వహిస్తున్నాము. అందువలన మాకు ఇంకా ఇతర గ్రంథాలను ప్రచురించడానికి సమయం గాని, ధనం గాని అందుబాటులో లేవు. అందువలన వాటిని దేవునికే వదిలివేసి సరయిన మంచి సమయం ఆసన్నమయినప్పుడు ఆ గ్రంథాలు ప్రచురించబడి తూర్పు పడమర దేశాల్లోని సత్యాన్వేషకులందరికి అందుబాటులోకి వస్తాయని ఆశిస్తున్నాను.

కైలాసగిరి నుండి మిలిటరీ వాళ్ళు వెళ్ళిపోయిన మరునిముషము నుండే గూండాలు, నీచులు, మూర్ఖులు, రౌడీలు వాళ్ళ పని మొదలుపెట్టి, కరెంటు బల్బులు, వైర్లు, ఇంకా అనేకమయిన విలువయిన వస్తువులు తేలికగా మోసుకుపోలేని వాటిని కూడా దొంగిలించారు. తాళాలు పగలగొట్టి, చివరికి తలుపులు కూడా పీక్కుని తీసుకుపోయారు. కైలాసగిరి ఆశ్రమాన్ని సంరక్షించుకోవడం కోసం మేము ఒక తోటమాలిని ఏర్పాటు చేశాము. అయితే అతను ఒంటరిగా అక్కడ నివసించడానికి ఇబ్బంది పడుతుంటే, ఇంకొక తోటమాలి కుటుంబాన్ని కూడా అక్కడ ఉండడానికి ఏర్పాటు చేశాము. మాతృ ఆశ్రమంలో,ఇంకా అనేకమయిన ఇతర శాఖల్లో అనేకమయిన పనుల వత్తిడి ఉండడం వలన నేను ఎక్కువగా కైలాసగిరి ఆశ్రమంలో ఉండటం కష్టమయింది. అందువలన

కైలాసగిరిపై మౌనంగా ప్రార్థనలు, ధ్యానములో ఒంటరిగా సాధనలు చేసుకునే సాధువు, సన్యాసి కోసం ప్రయత్నించాము. బుద్ధి కోతి వంటిది కనుక సాధువుని అయినాసరే అది స్థిరంగా ఉండనీయదు. ఆధ్యాత్మిక మార్గంలో పురోగమించే పవిత్రమయిన ఆత్మ స్వరూపులు కూడా ఏదో ఒక స్థలంలో ఏకాంతంగా మౌనంలో శాంతిగా ధ్యాన ప్రార్థనలు చేసుకోవటం చాలా కష్టమయిన విషయం. స్వామి బోధానందజీ అనే గొప్ప మహనీయుడు దాదాపు పదకొండు నెలలు కైలాసగిరి ఆశ్రమంలో మౌనంగా ధ్యాన ప్రార్థనల్లో కాలము గడిపాడు. ఆయన ధ్యానములో ఉండగా ఒక పులి అక్కడికి వచ్చి అదే భవంతిలో ఒక ప్రక్క విశ్రాంతిగా పడుకునేది. ఆ సాధుమహాత్ముడికి, దానికి ఎలాంటి భయము కలిగేది కాదు. తర్వాత కొందరు వేటగాళ్ళు, అనవసరంగా ఆ పులిని తుపాకితో కాల్చి చంపివేశారని తెలిసి చాలా బాధపడ్డాను. భగవంతుడు ఆ నేరగాళ్ళను దయతో క్షమించుగాక! ఆ పులి ఆత్మకు దైవము శాంతిని ప్రసాదించుగాక!

ఇప్పుడు మేము లేనప్పుడు కైలాస ఆశ్రమము ఇంకా ఇంకా శిథిలావస్థకు చేరుకోసాగింది. స్వామి రామానంద తీర్థ గారు ఆశ్రమానికి ఎంతో శ్రేయోభిలాషులు. వారు కూడా ఆశ్రమంలో ఒక భాగం వంటివారు. అప్పుడప్పుడు కైలాస ఆశ్రమాన్ని సందర్శించి వస్తుండేవారు. శ్రీ తెన్నేటి విశ్వనాథం గారు ఆశ్రమానికి అధ్యక్షులు, అలాగే నా చిన్ననాటి స్నేహితుడు కూడా ఆశ్రమాన్ని సందర్శించి, తన పలుకుబడిని వినియోగించి ప్రభుత్వం నుండి కొంత సహాయ సహకారాలు పొందటానికి ప్రయత్నించాడు. అదేవిధంగా ఎందరో భక్తులు వారి ప్రయత్నాలు చేశారు. ఇక ఇప్పుడు డా.కె. రామకృష్ణారావు గారు ఆంధ్రా విశ్వవిద్యాలయము, మానసిక శాస్త్రము డిపార్టుమెంట్, అలాగే వారి సహోద్యోగులు డా॥ కె. సచ్చిదానందమూర్తి గారుకూడా ఎంతో శ్రద్ధగా కైలాసగిరిపైన పారా సైకాలజి ఇనిస్టిట్యూట్ ప్రారంభించి విద్యార్థులకు ధ్యానము, తపస్సు వల్ల కలిగే ప్రయోజనాలను తెలియచేయాలనుకున్నారు. మ్యానిచ్ విశ్వవిద్యాలయానికి చెందిన డా॥ పరమాత్మ ప్రకాశ్ గారు, నేను కైలాసగిరిపైన మౌనదీక్షలో ఉన్నప్పుడు మొదట దర్శించుకున్నారు. ఇప్పుడు వారు కూడా కైలాసగిరి పైన ఒక కుటీరాన్ని సాధువులు ఉండడానికి లేదా జిజ్ఞాసువులైన సాధకులు మౌనంగా సాధన చేసుకొనే నిమిత్తం నిర్మించి ఇస్తానని వాగ్దానం చేశారు.

శివుడు కైలాసానికి అధిపతి కనుక, ఆయన ఎన్నటికి అంత అందమయిన స్వర్గం లాంటి ఆశ్రమాన్ని శిథిలమయిపోనీయడని నా అభిప్రాయం. ఎవరో ఒకరి రూపంలో

తిరిగి ఆశ్రమాన్ని బాగు చేసుకోవడానికి ఒక పరికరంలాగా వినియోగిస్తాడని భక్తుల విశ్వాసం. అదే జరిగితే నా అభిలాష, సంకల్పం కూడా నెరవేరి కైలాసగిరి ఆశ్రమము శాంతికి నిలయంగా, సత్యాన్వేషకులకు, సాధకులకు శాంతిని, ఆనందాన్ని, సత్య దర్శనాన్ని అందిస్తుంది.

ఈ భౌతికమయిన శరీరాలు నిశ్చయంగా కనుమరుగు అయిపోతాయి. కానీ భగవంతుని బిడ్డలకి మనము ఏదయితే సేవలు చేస్తామో అవి మాత్రము శాశ్వతంగా, చిరస్థాయిగా నిలిచిపోతాయి. వారి పేరు శాశ్వతంగా ఉంటుంది. సమస్త మానవాళి శ్రేయస్సు ఆశించి సేవలు చేసేవారి జీవితాలు ధన్యమగు గాక!

నేను కైలాసగిరిపై చాలా కాలము సంతోషంగా మౌనంలో ఉన్నప్పుడు తూర్పు పడమర దేశాల్లోని భగవంతుని బిడ్డలందరూ శాంతిగా ఉండాలని కోరుకున్నాము. ఆ సమయంలో ఎందరో పేరు ప్రఖ్యాతులు గడించిన వారు అందమయిన ఆ పర్వత శిఖరాన్ని అధిరోహించి వచ్చేవారు. ఆ ప్రదేశంలోని అందాలను, శాంతిని నేను మాటల్లో వర్ణించి చెప్పజాలను. ప్రతి రోజు ఉదయకాలములో అది నిజంగా స్వర్గలోకపు ఆనందంలా, భగవంతుని కానుకలాగా నీలిరంగు సముద్రమునుండి సూర్యోదయాన్ని తిలకించటము, సాయంసంధ్య వేళల్లో ఎర్రని అగ్ని గోళం లాంటి సూర్యుడు కొండల్లోకి దిగిపోవటము, ఈ క్రిందిగా విశాఖపట్టణము నగరము చూడడానికి ఎంతో అందంగా ఉండేది. నిశ్శబ్ధమయిన నిశీథి వేళలో నగరంలోని దీపాలన్నీ మసకబారిపోయిన వేళ పైన ఆకాశంలోని నక్షత్రాలు ఉజ్జ్వలంగా ప్రకాశిస్తూ నన్ను వాటితో కలిసిపోమని పిలుస్తున్నట్లుగా ఉండేది. అలాంటి అద్భుతమయిన దృశ్యాలు నన్ను మానవ సమాజం నుండి, భౌతిక ప్రపంచమునుండి దూరంగా ఉంచేవి.

అలాంటి పవిత్రమయిన క్షణాలు నన్ను సూర్యునికే సూర్యుడయిన వాని హృదయంలోనికి లాగివేసేది. ఆకాశంలోని నక్షత్రాల ఎత్తుకి తీసుకువెళ్ళేది. అప్పుడు నిద్రాణంగా అట్టడుగున ఉన్న వారందరిని నిద్ర లేపాలని నా హృదయం తపించిపోయేది. కేవలము భౌతికమయిన దేహమే నిత్యమని భావించి అనిత్యమయిన సుఖ సంతోషాల్లో మునిగితేలుతూ, కుటుంబ సౌఖ్యము కోసం ప్రాకులాడుతూ ప్రవృత్తి మార్గంలో నివసించే వారిని ఉన్నతమయిన నక్షత్ర మార్గంలోనికి, నిజమయిన జీవితాన్ని, అంతర్ముఖ స్థితిని ఇచ్చే నివృత్తి మార్గం వైపుగా మళ్లించాలని అనిపించేది. నిస్వార్థంగా ఇతరులను

సేవించడానికే జీవించే వారికి, ప్రేమతో వారి బాగోగులను చూచేవారికే అది దక్కుతుంది. భగవంతుని కోసం పరితపించేవారు మాత్రమే జీవించి ఉన్నట్లు. అంతర్యామిగా ఉన్న దివ్యజ్యోతి స్వరూపము, మానవ జీవిత లక్ష్యము, గమ్యము అయిన పరంజ్యోతిని దర్శించు.

మౌనము నాకు నిజమయిన స్నేహితుడు, నా జీవిత సహచరుడు కూడా. బాల్యం నుండి నాకు మౌనంగా గడపటము అంటే ఎంతో ఇష్టము. స్వభావసిద్ధంగా కూడా నేను ఎక్కువగా మాట్లాడకుండా మౌనంగా గడుపుతాను. అందువల్లనే నేను కైలాసగిరిపైన రోజులు, నెలలుకాకుండా ఆరు సంవత్సరాలు మౌనంగా గడపటం పెద్ద ఆశ్చర్యమేమీ కాదు. ఆరు సంవత్సరాలు ఆరు రోజుల్లాగా గడిచిపోవటం తలుచుకుంటే ఎంతో ఆనందంగా, ఆశ్చర్యంగా అనిపిస్తుంది ఇప్పుడు. వైభవం అంతా మౌనంలోనే ఉంది. మౌనము భగవంతుడు ఒక్కటే. ఈశ్వరుడు, అందరినీ పాలించేవాడు. ఆయన మౌనము యొక్క ఆత్మ స్వరూపము.

## మౌన యజ్ఞము

ఈ మౌన యజ్ఞము జనవరి 21వ తేదీ 1951వ సంవత్సరంలో మొదలుపెట్టాను కైలాసగిరిపైన. కేవలం నా వ్యక్తిగత శాంతి కోసం కాకుండా ప్రపంచ ప్రజలందరికీ శాంతి కోసం నేను మౌన యజ్ఞము ఆరంభించాను. భగవంతుని అనుగ్రహము వలన నా లోపల కలిగిన ప్రేరణను అనుసరించి మౌన యజ్ఞము కొనసాగించటం వలన దగ్గరిలోని వారే కాకుండా సుదూర ప్రాంతాల్లోని వారు కూడా తేలికగా అక్కడికి చేరుకుని భగవంతుని దివ్యానుభూతిని పొందగలిగారు. ప్రపంచంలోని ఏ మూల నుండయినా ఎవ్వరయినా ఇందులో పాలుపంచుకోవచ్చును. ఎందుకంటే ఇది ప్రతి ఒక్కరికి కూడా, భగవంతుని బిడ్డలందరికీ, జాతి, మతము, దేశము అనే బేధము లేకుండా, వారికి ఇందులో నమ్మకం ఉన్నా లేకపోయినా కూడా అందుబాటులో ఉంటుంది. కైలాస ఆశ్రమము హృదయపూర్వకంగా ప్రతి ఒక్కరిని ఆహ్వానిస్తోంది. పాత, క్రొత్త మతాలను అనుసరించే వారందరిని కూడా ఈ మౌన యజ్ఞంలో పాల్గొనవలసిందిగా కోరుతోంది.

ఈ యజ్ఞంలో ప్రధాన పూజారి అహంకారము, బుద్ధి, అగ్నిహోత్రము, ఆలోచనలు అనే సమిధలను యజ్ఞంలో శ్వాస అనే నెయ్యితో వేల్చాలి. ఈ మౌన యజ్ఞంలో

ప్రధానమయిన మహా మంత్రము 'సోహం'. అన్ని మతాలకి కూడా మూల మంత్రము 'అజప' అనే మాట పవిత్రము, నోటితో ఆ పవిత్ర మంత్రాన్ని నిరంతరం జపిస్తూ ఉండాలి. ఈ పవిత్ర యజ్ఞము రాత్రింబవళ్ళు నిరంతరాయంగా జరగాలి. ప్రతి వ్యక్తి హృదయంలో ఆధ్యాత్మిక జ్ఞానజ్యోతిని వెలిగించటమే ఈ యజ్ఞం యొక్క ప్రధాన లక్ష్యము. ప్రతి ఒక్కరికి శాంతి కలగాలని, భూమిపై శాంతి నెలకొల్పాలని, అన్ని జాతుల వారికి శ్రేయస్సు కలగాలని, ప్రపంచంలోని అన్ని దేశాలు సుఖసంతోషాలతో, సౌభాగ్యంతో వర్ధిల్లాలని ఈ యజ్ఞం యొక్క లక్ష్యము.

అన్ని యజ్ఞాల్లోకి మౌన యజ్ఞము చాలా గొప్ప శక్తివంతమయినది. ప్రభావం చూపించేది. దాని ఉపయోగాన్ని నేను మాటల్లో మీకు వివరించి చెప్పలేను. అది సాధ్యం కాదు. అంత పవిత్రమయినది, వర్ణించడానికి సాధ్యము కానిది. అది అనిపించటం కాదు. దాన్ని మౌనంగా అనుభూతి చెందాలి. జీవుడు తన హృదయ క్షేత్రంలో కొలువైన అంతర్యామిగా ఉన్న పరమ శ్రేష్ఠమయిన ఆది సత్యము 'నేను'గా ప్రకాశిస్తున్న దేవాది దేవుడిని అనుభూతి చెందాలి. చాలా చిన్నదయిన విలువలేని, పరిమితమయిన అహంభావాన్ని ఈ మౌనయజ్ఞంలో కాల్చివేయాలి. ఈ పవిత్రమయిన యజ్ఞము కేవలము కైలాసగిరి లేదా భారతదేశంలోని సన్యాస ఆశ్రమ సంప్రదాయానికి మాత్రమే చెందినది కాదు. దీనికి మూలము పూర్తి ప్రపంచానికి చెందినది. మరి ఈ మౌన యజ్ఞము ఎప్పుడు పూర్తి అవుతుంది? అనే ప్రశ్న ఉదయిస్తుంది. ఎప్పుడయితే అహంభావన పూర్తిగా నశిస్తుందో, మౌనము అనే అగ్నిలో అది పూర్తి దగ్ధం అయిపోతుందో, నామరూపాలు కూకటివేళ్ళతో సహా పెకిలించబడతాయో అప్పుడు మాత్రమే ఈ యజ్ఞము పరిసమాప్తమవుతుంది.

ప్రియమైన పాఠకులారా! మీరు ఎవరయినా, ఎక్కడివారయినా, ఏ పనిలో మీరు నిమగ్నమయి ఉన్నా ఈ మహోన్నతమయిన మౌన యజ్ఞానికి మీకందరికి స్వాగతం పలుకుతున్నాను. అందరికి శాంతి, మౌనము, విజ్ఞత కల్గటమే ఈ యజ్ఞము యొక్క ఆశయము, అభిలాష, గమ్యము. ఈ వైభవోపేతమయిన ఆచరణ అనేది వ్యక్తిగత శాంతి నుండి మొదలవుతుంది. మీకు కైలాసగిరి ఆశ్రమానికి రావటానికి అనుకూలత లేకపోయినప్పటికీ మీరున్న స్థలం నుండే మీ ఆలోచనలు కనీసం మాతో కలిపి జత కలపండి. మీకు ఎప్పుడు అవకాశము, సానుకూలత ఏర్పడితే అప్పుడే ఆ పని చేయండి.

ఈ యజ్ఞము ఉషోదయము నుండి సూర్యాస్తమయం వరకు, తిరిగి సూర్యాస్తమయం నుండి ఉషోదయం వరకు నిరంతరాయంగా జరుగుతూ ఉంటుంది. ఎలాంటి ఆటంకము ఉండదు.

దయచేసి ప్రార్థిస్తున్నాను, ఈ యజ్ఞ ప్రసాదాన్ని స్వీకరించండి. అదే విశ్వ ప్రేమ. అది అందరినీ అంతులేని శాంతిలో శాశ్వతమయిన శాంతితో ముంచివేస్తుంది. దివ్య ప్రకాశము, దివ్యమయిన జీవితము, ఆద్యంతములు లేని శక్తి, వీటన్నింటిని మించి నిశ్చలమయిన నిశ్శబ్దంలో మౌనంలో, పరమ శ్రేష్ఠమయిన, మహోన్నతమయిన ప్రశాంతతలో, ఆధ్యాత్మిక జ్ఞానమనే అగ్నిలో మిమ్మల్ని నింపివేసి, చుట్టి వేస్తుంది. దయచేసి దానిని స్వీకరించండి. మౌనము జీవుడి హృదయము. అదే అతడి ప్రాణశక్తి. విశ్వానికి అదే శ్వాస.

## ఆరు సంవత్సరాల నా మౌనదీక్ష

ఆశ్రమ భక్తుడు ఒకరు నేను ఆరు సంవత్సరాలు మౌనదీక్షలో ఉన్నప్పుడు పొందిన ఆధ్యాత్మిక అనుభవాలను వ్రాయవలసిందిగా అభ్యర్థిస్తూ ఉత్తరము వ్రాశాడు. వివిధ దేశాల్లోని అతని స్నేహితులకు ఉపకరించేవిధంగా అతను వాటిని జర్మన్, రష్యన్ భాషల్లోకి అనువాదం చేయాలని అతని అభిలాష. వారికి ఇంగ్లీషు చదవటం రాదు. అతని కోరిక మేరకు ఈ సందేశాన్ని వ్రాయటం జరిగింది.

సందేశాన్ని ప్రారంభించడానికి ముందుగా, ఆరు సంవత్సరాల సుదీర్ఘమయిన నా మౌనదీక్ష ఆరు రోజుల్లాగా గడిచిపోయిందని చెప్పాలి. మౌన దీక్ష 1951 జనవరిలో ప్రారంభించాను. అంతర్యామిగా కొలువైయున్న ఈశ్వరుడిని నమ్ముకున్నవానికి అన్ని విషయాలు ఆయన అనుగ్రహము వలన సులభసాధ్యం అయిపోతాయి. భౌతిక ప్రపంచంలో జీవించే వ్యక్తికి ఒక్క రోజు మౌనంగా గడపటం కూడా అసాధ్యం అయిపోతుంది. నిరంతరము ఇతరుల సాంగత్యంలో గడిపేవారికి, ఒంటరిగా మౌనంలో గడపటం అంటే అతనికి వెర్రెక్కి పోతుంది లేదా మతిపోతుంది.

అంతరంగ శాంతి, ఉద్దీపనతో పాటుగా నేను మౌనదీక్ష పాటించిన సమయంలో మరొక గొప్ప లబ్ధి పొందాను. అనవసర ప్రసంగాలతో, వాదోపవాదాలతో జీవంలేని

నిరర్థకమయిన మాటలతో ఎండిపోయిన ఎముకలను నమిలి ఆనందించేవారిలా భౌతిక ప్రపంచంలో మునిగితేలే వ్యక్తుల బారినుండి నా అమూల్యమయిన సమయాన్ని రక్షించుకోగలిగాను. భౌతికమయిన విషయాలన్నింటినుండి దూరమయిన నన్ను వారు నా మానాన నన్ను మౌనంగా ఉండనిచ్చారు. మౌనంగా, ఒక్క మాట కూడా మాట్లాడని నా ముందు కూర్చుని వారి సమయాన్ని వృథా చేసుకోవటం ఎందుకు అని వారు భావించి ఉండవచ్చు. ఆ విధంగా నేను నా మౌనంలో నా అమూల్యమయిన సమయాన్ని గడపటానికి అవకాశం చిక్కింది. భౌతిక ప్రపంచంలో జీవించే వ్యక్తికి అసాధ్యము, అసహజము, అతి క్లిష్టము అనిపించేవన్నీ కూడా ఆధ్యాత్మిక జీవితం గడుపుతూ భగవంతునికి చెందిన వ్యక్తికి చాలా సులభంగా, అత్యంత సహజంగా, సులభసాధ్యంగా అనిపిస్తుంది.

ముందుగా మనము అసలు మౌనము అంటే ఏమిటి? అని తెలుసుకోవాలి. మాట్లాడకుండా ఉండటం మౌనం కాదు. నా గదిలో బల్లపైన ఒక బొమ్మ ఉంది. అది మూడు కోతులు. కళ్ళు, చెవులు, నోరు మూసుకొని ఉంటాయి. దాని అర్థం "చెడు చూడకు, చెడు వినకు, చెడు మాట్లాడకు". మౌనము అంటే బాహ్యమయిన పదాల కంటే గాఢమైన అత్యున్నతమైన స్థితి. అందువల్లనే మన ఋషులు మనకు మౌనమే భగవంతుని మాటలుగా వర్ణించారు. "నిశ్శబ్దో బ్రహ్మం" మాటలకి అందనిది బ్రహ్మము. ఎలాంటి కదలికలు లేని నిశ్చలత్వము మనస్సులోనూ, బాహ్యంలోనూ కూడా ఏర్పడటమే మహోన్నతమయిన స్థితి.

ఋషి మౌనంగా ఉంటాడు. ఎందుకంటే పరమాత్మ తత్త్వము మౌనము కనుక. అదే గొప్ప అద్వితీయము. అందువల్ల ఋషి ఎప్పుడూ మాట్లాడడు. తన మౌనంతోనే శ్రేయస్సు చేకూరుస్తాడు. జీవుడు రక్తమాంసములతో ఒక రూప నామానికి పరిమితమయి ఉండి, ఒక వేళ మౌనం పాటించినప్పటికీ, అంతరంగంలో రకరకాల ఆలోచనలు, ప్రణాళికలు బాహ్య జీవితంలోని కోరికల గురించి రచిస్తూ ఉంటాడు. అలాంటి వ్యక్తి జీవించి ఉన్నా మరణించిన వాడితో సమానమే. ఆరు సుదీర్ఘ సంవత్సరాల మౌనంలో ఆరు రోజుల్లాగా గడిచిపోయినందుకు మౌనాన్ని మించిన మూల్యాన్ని ఏ విధంగా చెల్లించగలను? ఎన్ని సంవత్సరాల కాలమయినా తెలియకుండానే సునాయాసంగా గడిచిపోతుంది. ఎలాంటి అసౌకర్యము, ఇబ్బంది లేకుండా, ఎందుకంటే మౌనము

కాలానికి అందనిది, కాలం కంటే అతీతమయింది. మౌనాన్ని జాగ్రత్తగా గమనించి చూడాలి.

ఇప్పుడు మౌనము యొక్క ఆచరణని గురించి తెలుసుకుందాము. మౌనము అన్ని మౌన ఆత్మలను సత్యానికి దగ్గరగా చేరుస్తుంది. మౌనము ఒక్క మాట కూడా అవసరం లేకుండా ఆత్మను సృష్టిస్తుంది. బుద్ధుడు, జీసస్ క్రీస్తు, శ్రీకృష్ణుడు, మహ్మదు ఇంకా ప్రపంచంలోని రక్షకులందరూ కూడా మౌనం యొక్క ఫలితంగా మనకు లభించారు. మాటలతో ఈ ప్రపంచంలో చేయలేని, సాధించలేని కార్యాలను మౌనంతో ఒక్క నిముషంలో సాధించవచ్చును. మౌనము అంటే స్వార్థము లేని నిస్వార్థ పరత్వము. మౌనం అంటే ఒకరితో ఒకరికి సంబంధం లేకుండా ఉండటం కాదు. మౌనం అంటే ఎల్లలు లేని ప్రేమతో అందరినీ ఒక్కటిగా ఏకం చేసే శక్తి.

మౌనము ప్రపంచంలోనే మహోన్నతమయిన స్థితి. అది జీవితాన్ని, వెలుగును, ప్రేమను మాటలతో అవసరం లేకుండా అందిస్తుంది. అన్నింటిని మించి మౌనము అంటే బ్రహ్మ భావన, భగవద్భావన, నిశ్చలత్వము, అది అందరిని కల్పుకుంటుంది. ఏ ఒక్కరిని వదిలిపెట్టదు.

కైలాస ఆశ్రమానికి దర్శనానికి వచ్చే వందలకొద్దీ భక్తులను సేవించటంతో పాటు, ఆరు సంవత్సరాల మౌనదీక్ష వలన పొందిన యథార్థమయిన ఫలితము ఏమిటంటే అది భగవంతుని అనుగ్రహమే. ఇంగ్లీషు, తెలుగులో వెయ్యి సందేశాలు మూడు సంపుటాలుగా “మౌనపుఘడియలు” పేరుతో తయారయ్యాయి.

స్నేహితులారా! మౌనమే మన ఆత్మ స్వరూపము, మన జీవిత గమ్యము. అది నీవు తెలుసుకున్నా లేదా తెలుసుకోలేకపోయినా, మౌనము యొక్క వైభవాన్ని నీవిప్పుడు గుర్తించినా లేదా రేపు గుర్తించినా, అది నీ జన్మహక్కు. ఎందుకంటే నీవు మౌనము నుండే జన్మించావు. ఏమి లేనటువంటి శూన్యమయిన స్థితి, వర్ణించడానికి వీలు కానటువంటి వైభవము. అతి తొందరలోనే నీవు ఈ సత్యాన్ని తెలుసుకోగలుగుతావు. అప్పుడు నీవు మౌనాన్ని నీ నిత్యజీవితంలో ఆచరించగల్గుతావు.

మౌనాన్ని నేర్చుకోవటం కోసం దయచేసి ప్రయత్నపూర్వకంగా ముందు వారానికి ఒక రోజు మౌనంగా ఉండటం అలవాటు చేసుకోండి. మహాత్మాగాంధీ గారు ప్రతి

సోమవారము మౌనాన్ని పాటించేవారు. అది మీకు సాధ్యం కాకపోతే కనీసం నెలకి ఒక్క రోజయినా మౌనాన్ని పాటించండి. అది కూడా మీకు కష్టమనిపిస్తే చివరికి సంవత్సరంలో ఒక్క రోజయినా మౌనాన్ని పాటించండి.

మనలో ప్రతి ఒక్కరూ కూడా జీవితంలో ఏదో ఒక రోజు మౌనం వహించాల్సి వస్తుంది. అది మనము మరణించినప్పుడు. అందువలన మనము జీవించి ఉండగానే మౌనం యొక్క వైభవాన్ని గుర్తించటం అవసరం. వెలుగు ఉండగానే మేల్కోవాలి. వెలుతురు ఉండగానే అన్నీ చక్కబెట్టుకోవడం ఉత్తమం. చీకట్లో తడుముకోవటం వలన అంతా ఆలస్యమయి పోతుంది. మౌనంగా ఉండటం వలన ఎవ్వరూ ఏమీ పోగొట్టుకోరు. పైగా మౌనం వలన ఆంతర్యంలోనూ, బాహ్యంలోనూ ఎంతో లబ్ధి పొందుతారు. మౌనంలో అనంతమయిన శక్తి దాగి ఉంది. ఆద్యంతములు లేని సర్వశక్తిమంతుడు, సర్వవ్యాప్తి, సర్వాంతర్యామి అయిన ఈశ్వరుడికి హృదయము, అతి ముఖ్యమయినది మౌనమే.

ఇక ముగించేముందు నేను చెప్పదల్చుకున్నది ఏమిటంటే మౌనము అంటే ఏమి చేయకపోవటము లేదా సోమరితనము కాదు. నిజానికి మౌనము అత్యంత శక్తిమంతమయినది. నిజమయిన తీవ్రమైన తరంగములు లేని పనిచేసే వ్యాపకము. నిరంతరము మాట్లాడే యంత్రాల వంటి వారికి, పనికిమాలిన ఉబుసుపోక మాటలు మాట్లాడుకునేవారికి అది అర్థం కాదు. ఎవరయితే మానవ జీవిత గమ్యము, మానవ జన్మహక్కు మర్చిపోతారో వారికి కాలము భారంగా మారుతుంది. ఎవరికి ఆ అగ్ని లాంటి అభిలాష ఉంటుందో వారిలో తీవ్రమయిన వాంఛ ఉపశమించిపోతుంది. మాటలు అపార్థాలు, ఇబ్బందులు కలిగిస్తాయి. శాంతి, సఖ్యతలు ఏ మార్గములో ప్రయత్నము చేసే వారికయినా చివరికి విజయాన్ని చివరికి చేకూరుస్తాయి.

ఈ ఆరు సంవత్సరాల మౌనదీక్షలో మన ద్రష్టలు, ప్రవక్తలు చెప్పే ప్రబోధము నా హృదయానికి చేరువుగా వచ్చి నాకు ఉత్తేజాన్ని, గొప్ప బలాన్ని చేకూర్చింది. దానిని మీతో పంచుకోవాలనుకుంటున్నాను. “మౌనము సర్వత్ర సాధనమ్” అంటారు. అన్ని ప్రయత్నాలను ఎలాంటి వైఫల్యము లేకుండా మౌనము విజయవంతం చేస్తుంది.

స్నేహితులారా! తెలివయిన వారికి ఒక్క మాట చాలు. అందువలన నా మాటలతో అచంచలమైన నిశ్శబ్దాన్ని ఛేదించదల్చుకోలేదు. కాని మనమందరము ఇప్పుడు మౌనము

పాటిద్దాము. మౌనంలోని గొప్పతనాన్ని అవగాహన చేసుకుందాము. శక్తిని, శాంతిని మన ప్రతి జీవ కణములోనూ ఇముడ్చుకుందాము.

ఓ మౌనమా! తూర్పు పడమర దేశాల్లోని అశాంతితో అల్లాడిపోతున్న ప్రజలందరిని ఆశీర్వదించు. భావాతీతమయిన నీ వైభవము పట్ల సరయిన అవగాహన లేని మమ్మల్ని ఆశీర్వదించు. దాని వలన మేము మా పనులను, కర్తవ్యాలను, బాధ్యతలను ఎలాంటి వత్తిడులు లేకుండా సక్రమంగా మాటలతో కాలము వృథా చేయకుండా నిర్వర్తించ గల్గుతాము. ఈ సృష్టి ప్రారంభము నుండి ప్రపంచానికి వెలుగును, జీవాన్ని, ప్రేమను, ప్రాణాన్ని ప్రసాదిస్తున్న సూర్యభగవానుడు మాటలతో పనిలేకుండా మౌనంగానే తన కర్తవ్యాన్ని నెరవేరుస్తున్నాడు. మాటలు అనే అజ్ఞాన తిమిరంలోనుండి మౌనము అనే జ్ఞానపథం వైపుగా మనలను నడిపిస్తున్న మౌన గురువు కనిపించే జీవించి ఉన్న గురువు ఆ సూర్యుడు. భగవంతుని వాక్కు మౌనము. అది మనలను ఆశీర్వదించుగాక! సత్యాన్వేషకులందరిని అనుగ్రహించుగాక! శాంతికాముకులందరిని దీవించుగాక! మీ సోదరుడు ఓంకార్ యొక్క ప్రార్థన ఇది.

ఓం...ఓం...ఓం...

**అధ్యాయం - 57**

## షష్టి పూర్తి - జనవరి 1956 - కుమారి జ్ఞానేశ్వరి

భగవంతుని ఆశీస్సులతో, మీ అందరి ప్రార్థనలు, మంచి కోరికల వలన స్వామీజీ షష్టిపూర్తి మహోత్సవము చాలా విజయవంతంగా జరిగింది. ఆశ్రమము చరిత్రలో నలభై సంవత్సరాలలో ఇంత పెద్ద కార్యక్రమము జరగటము ఇదే మొదటిసారి. రాత్రి పగలు తేడా లేకుండా ఎంతో భక్తిశ్రద్ధలతో భక్తులు పెద్ద గుంపులుగా ఆశ్రమాన్ని దర్శిస్తూనే ఉన్నారు. పది రోజుల ఉత్సవాలలో నలభై వేల మంది భక్తులు భోజనాలు చేశారు. ఆ ఉత్సవాల రోజుల్లో ఏకాహం, భజనలు, ప్రార్థనలు జరిగాయి. కనీసం వేయి మందికి తక్కువ కాకుండా పాల్గొని భగవన్నామాన్ని నిరంతరాయంగా ఇరవై నాలుగు గంటలూ జపించారు. జీవం ఉట్టిపడుతున్న నిలువెత్తు సైజులో శ్రీకృష్ణుడు, భగవాన్ జీసస్ క్రీస్తు,

భగవాన్ బుద్ధుడు, మహాత్మాగాంధీ గారి విగ్రహాలు నూతనంగా ఆవిష్కరించబడ్డాయి. అవి అందరి దృష్టిని ఆకర్షించి ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని కల్గించాయి భక్తులకు. మంచి పండితులు, వక్తలు, దగ్గర నుండే కాకుండా సుదూర ప్రాంతాల నుండి కూడా వచ్చి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొని ప్రవచనాలు అందించారు. శ్రోతలు హరికథలు, బుర్రకథలు విని ఆనందించారు. అనేక సాంస్కృతిక బృందాల వారు, సంగీత కచేరీలు చేశారు. వీణ, వయొలిన్ మొదలైన పరికరాలపై చక్కని సంగీతాన్ని వినిపించారు. భరతనాట్య ప్రదర్శనలు కూడా జరిగాయి. మా ఆశ్రమ నిర్వహణాధికారి శ్రీ దాదాబాయి గారు కర్ణాటక సంగీతాన్ని వినిపించారు. ప్రపంచంలోని అనేక దేశాల నుండి ముఖ్యంగా అమెరికా, కెనడా, యూరప్, చైనా, మలేషియా, ఆస్ట్రేలియా, జర్మన్ మొదలైన ప్రాంతాల నుండి, భారతదేశంలోని పలు ప్రదేశాల నుండి భక్తులు తంతి ద్వారా, సందేశాలు, కానుకలు పంపించిన వారందరికి మా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియచేసు కుంటున్నాము.

“కోటిపత్రి పూజ” కార్యక్రమాలకు హాజరయిన వేలాదిమంది భక్తులను ఆధ్యాత్మికంగా ఎంతో అలరించింది. యాభై మందికి పైగా దంపతులు ఈ మహాక్రతువులో పాల్గొని తరించారు. అందులో విశ్వశాంతి చిహ్నాన్ని మిలియన్ల కొద్ది బిల్వ పత్రాలతో పూజించారు. షష్టిపూర్తి మహోత్సవాలు జరిగిన పది రోజులు ఈ కార్యక్రమం జరిగింది. చివరి రోజయిన పూర్ణాహుతి రోజున అందరూ సంపూర్ణ శరణాగతి చెందుతూ అహంకారము అనే అజ్ఞానాన్ని జ్ఞానాగ్నిలో దగ్ధం చేసినట్లుగా, పూజారులు ప్రపంచంలోని సమస్త దేవతలకు ఆహుతులు సమర్పించారు. పరమ పవిత్రమయిన హవన కార్యక్రమం పూర్తి అయిన తర్వాత నిరుపేద ప్రజలందరికీ అన్నదానం జరిగింది.

మన పురాణ ఇతిహాసాల్లో, ఋషులు చెప్పినట్లుగా దేవతలు, భగవంతుడు ఈ విధమయిన పవిత్ర ఆధ్యాత్మిక కార్యక్రమాలు, పూజలు, యజ్ఞాలు జరిపించినపుడు వారు సంతృప్తి చెందినప్పుడు ఆశీర్వాద రూపంగా అమృత వర్షాన్ని కురిపిస్తారట. అప్పుడు వర్షాకాలము కాకపోయినప్పటికీ ఆకాశము ఎంతో నిర్మలంగా ఎలాంటి మబ్బులు లేకపోయినా యజ్ఞ కార్యక్రమం, పూర్ణాహుతి, నిరుపేదలకు అన్నదానము పూర్తి కాగానే ఆకస్మాత్తుగా మొదలయి దాదాపు గంట సేపు ఆగకుండా వర్షం కుమ్మరించినట్లుగా



పడింది. భక్తులందరూ అంత వర్షంలో కూడా ఆఖరిరోజు కావటం వలన, ఎంతో శ్రద్ధగా డేరాల క్రింద నిలబడి మహాత్ముల సందేశాలను శ్రవణం చేశారు.

భగవంతుని దివ్య వైభవముతో, ఆయన అనుగ్రహముతో అన్ని కార్యక్రమాలు ఎంతో సంతోషంగా, భక్తులందరి హృదయాల్లో పరమాత్మ దివ్యానుభవాన్ని నింపాయి. దాదాపు నూట యాభై ఛాయా చిత్రాలు ఎంతో ముఖ్యమయిన కార్యక్రమాలకు సంబంధించి తీయబడ్డాయి. అందులో కొన్ని రాబోయే శాంతి పత్రికలో ప్రచురించ దలిచాము. పరమపూజ్య స్వామీజీ గారి ముప్పై పైగా ఎంతో ఉత్తేజభరితమయిన సందేశాలు భక్త సమ్మేళనములో, ప్రార్థనా మందిరాల్లో వినిపించబడ్డాయి.

ఓం శాంతి... శాంతిః

## నాతో కలిసి జీవించే వారి నుండి నేను ఏమి ఆశిస్తున్నాను - స్వామి ఓంకార్ పీస్ పత్రిక - 1956

జాగరూకతతో, ఎప్పుడూ ఏదో ఒక పనిచేస్తూ నూటికి నూరు శాతము భగవంతుని దివ్య తేజస్సును లోపలా, బయటా కూడా దర్శించాలని కోరుకుంటాను. నాకు సోమరితనంతో ఉండేవారిని చూస్తే చాలా బాధగా ఉంటుంది. భగవంతుడు ప్రసాదించిన అమూల్యమయిన జీవితాన్ని ఏ పని చేయకుండా శక్తిహీనుడిలా ఉండే వారిని చూస్తే బాధ వేస్తుంది. ఆశ్రమంలో జీవితం గడపాలి అంటే కేవలం ఒక్కటే నియమము ఉంది. వారు ఎల్లప్పుడూ ప్రతి క్షణము పరమాత్ముని దివ్యానుభూతిలో గడపాలి.

ఆశ్రమ శ్రేయోభిలాషులు, స్నేహితులు, ఆశ్రమాన్ని దర్శించడానికి వచ్చేవారు, శాంతి ప్రార్థనలు చేసేవారు ప్రతి ఒక్కరూ కూడా ఆశ్రమంలో నివసించినప్పుడు వారందరూ ప్రతి క్షణము వారి బాహ్య జీవితంలోని బాధలు, కష్టాలు, ఇబ్బందులు అన్నింటిని మర్చిపోయి ఆనందంగా భగవదనుభూతిలో కాలము గడపాలని నేను కోరుకుంటాను.

ప్రతి క్షణము కూడా ఎంతో అమూల్యమయినది కనుక నేను ప్రతి క్షణము గాఢమయిన ధ్యానము లేదా నిస్వార్థమయిన సేవలో వినియోగించుకోవాలని కోరుకుంటాను. తెలిసి గాని, తెలియకుండా గాని కాలాన్ని వృథా చేయటము, అనవసరమయిన మాటలు మాట్లాడటము, గుసగుసలాడుకోవటము, ఇతరుల గురించి చెడుగా ప్రచారము

చేయటము ఆధ్యాత్మిక జీవితం గడిపేవారికి చాలా కీడు చేయటమే కాక ప్రమాదకరం కూడా అవుతాయి. అలాంటి వ్యక్తులు నా చుట్టూ ఉండి సమయాన్ని వృథా చేస్తూ జీవితాన్ని పాడు చేసుకుంటుంటే నాకు జ్వరం వచ్చినట్లుగా అనిపిస్తుంది. సోమరులకు, స్వార్థపరులకు ఆశ్రమంలో గాని, నా హృదయంలో గాని ఎలాంటి స్థానము ఉండదు. అనవసరపు ఉపన్యాసాలిచ్చే వారన్నా, భోజన ప్రియులన్నా నాకు భయము. అతిగా తినటము, భోజనము మధ్యలో ఏదో ఒకటి నమలటము, చిరుతిళ్ళు తినటం, ఎలాంటి భేదము లేకుండా ఏదో ఒకటి తినటము వలన పగటిపూట నిద్ర వస్తుంది. సోమరితనము శక్తిహీనత అన్ని విషయాల్లో కనిపిస్తుంది.

విచారవదనము, నిత్సహాయతతో కూడిన ముఖంతో వ్రేలాడే వాళ్ళను చూడటం నాకు ఇష్టం ఉండదు. ఉత్సాహపూరితమైన, చిరునవ్వుతో కూడిన ఆహ్లాదకరమైన ముఖాలు, హృదయం నిండా సంతృప్తి, భగవంతుని దివ్యమయిన అనుభూతిలో మునిగి తేలేవారంటే నాకు చాలా ఇష్టము. సోమరితనము నిద్రకు, శక్తిహీనతకు, ఉత్సాహాన్ని చంపివేసి అపవిత్రతకి దారితీస్తుంది. చిన్నగా కునుకు తీయటము, సోమరితనము ప్రమాదకరము. ఈ క్రింది కవితలో ఎంత యథార్థమయిన తెలివయిన అర్థమున్నదో గమనించండి.

"స్వర్గలోకపు వాకిళ్ళ ముందు ఒక నిరు పేదవాడు వేయి సంవత్సరాలు వేచి ఉన్నాడు. కాని ఒక్క క్షణం ఆదమరచి చిన్న కునుకు తీసి నిద్రలోకి జారిపోయాడు. స్వర్గ ద్వారాలు తెరుచుకొని, మూసుకుపోయాయి. అయ్యో! అతను తెలివయిన వాడేనా?"

సోమరి జీవితాల వలన ఈ విధంగా హాని జరుగుతుంది. మతిమరుపు లేదా అశ్రద్ధ ఏవిధంగానూ మేలు చేయదు. "సోమరిపోతు మెదడు దెయ్యాలకి నిలయము" అని పెద్దలు చెప్పిన వాక్యాలలో ఎంతో సత్యమున్నది. ఒకవేళ మనము ధ్యానము, ప్రార్థనల్లో లేకపోయినా ఏదో ఒక పనికివచ్చే పనిలో నిమగ్నమవ్వాలి. దాని వలన ఇతరులకు మేలు జరగాలి. పనిచేయటమే భగవంతుని పూజ. అది మనలను సోమరితనము నుండి దూరం చేస్తుంది. పనిచేయటం వలన ఎవ్వరూ మరణించరు గానీ సోమరితనము, ఆందోళన మనుష్యులను చంపివేస్తుంది.

నాతో కలిసి జీవించే ఆధ్యాత్మికోన్నతి పొందిన పవిత్ర ఆత్మ స్వరూపులు. కలిసి పనిచేయక పోయినా విశ్వప్రేమికులయిన వారు, నిస్వార్థంగా ఎలాంటి బిరుదులు

ఆశించకుండా సేవలందించేవారు. అందరినీ ప్రేమించేవారు, భక్తులు, ప్రేమస్వరూపులు మొదలైన వారందరిని నా సొంత రక్త సంబంధీకులుగా భావిస్తాను. స్వార్థపరులు, పేరు ప్రతిష్ఠల కోసం ప్రాకులాడేవారు. భౌతికమయిన సుఖభోగాలనే మబ్బుల వెంట పరుగులు తీసేవారు, రక్తం పీల్చేవారు అని భావిస్తాను. వారు నా సొంత రక్త సంబంధం కల్గిన వారయినా సరే. వారు నా రక్త సంబంధీకులయినా, కాకపోయినా, ఆత్మ సోదరుల పట్ల వయస్సులో పెద్దవారయినా లేదా చిన్నవారయినా సరే, వారు నిస్వార్థపరులయితే కనుక అంకిత హృదయం కలవారయితే కనుక, ఉన్నతోన్నతస్థితిని పొందిన వారయితే కనుక, స్తుతినిందలకు అతీతులయితే కనుక, భౌతిక ప్రపంచపు నీలి నీడల వెనుక పరుగులెత్తని వారయితే కనుక వారి ముందు నా తల వంచి ఆరాధిస్తాను. వారిని పూజిస్తాను. అలాంటి పవిత్రమయిన ఆత్మజ్ఞానులకి ప్రతి నిముషము ఎంతో అమూల్యమయినది. జీవితంలో ప్రతి క్షణము కూడా అమరమయిన, శాశ్వతమయిన ఆనందాన్ని హృదయానికి అందిస్తుంది.

నా ఆశ్రమంలో నాతో కలిసి జీవించే ఆశీర్వదించబడిన పవిత్ర ఆత్మ స్వరూపులు అందరి వద్ద నుండి నూటికి నూరు శాతము మంచి కార్యదక్షత, నిస్వార్థమయిన సేవలు, గాఢమయిన ధ్యానస్థితి, మహోన్నతమయిన స్థిరమయిన మౌనస్థితిని నేను ఆకాంక్షిస్తున్నాను.

## నా జీవితంలో అత్యంత విలువైన క్షణాలు – నవంబరు 18, 1956 – స్వామి ఓంకార్

ఆ రోజు ఆదివారము. సూర్యోదయ సమయము. ఆనాడు పూర్ణిమ. నిండు జాబిలి రోజు. ఆశ్రమ వాసులు, భక్తులు భక్తిశ్రద్ధలతో 'ఏకాహం' చేస్తున్నారు. పౌర్ణమి రోజు ఆశ్రమవాసులు ఇరవై నాలుగు గంటలు నిరంతరాయంగా భగవన్నామాన్ని జపిస్తారు.

ప్రతి రోజులాగే ఆ రోజు కూడా తెల్లవారుజామునే నిద్ర లేచి నా ఆధ్యాత్మిక సాధన "ఆధ్యాత్మిక మెరుపులు", "అష్టావక్రగీత" మొదలయినవి చదువుకుంటున్నాను. భక్తుల ఉత్తరాలకు సందేశాలు వ్రాయడానికి బదులుగా నేడు నేను శాంతి ప్రార్థనని పదే పదే చేస్తూ, గాఢమయిన ధ్యానములో కాలాన్ని సద్వినియోగం చేయాలని నిర్ణయించుకున్నాను.

ఉదయాన్నే ఒక గంటసేపు తోట పనిలో గడిపాను. తర్వాత స్నానం చేశాను. డా॥ మాధవరావు గారు, డా॥ మార్కండేయ గారు నిర్వాణ మందిరంలో సంచార వైద్యశాలను ప్రారంభించడానికి నాతో సంప్రదించడానికి వేచి ఉన్నారు. వారు వెళ్ళిపోయిన తర్వాత నేను కొద్దిగా పాలు, పళ్ళు ఉపాహారంగా తీసుకున్నాను. తర్వాత ఉదయము 9-30 ని॥లకు నా బల్ల వద్ద కూర్చుని ఏవైనా వ్రాసుకోవాలని, పరమాత్మ దివ్యానుభూతిని పొందాలని భావించాను.

హఠాత్తుగా, ఎంతో అద్భుతం జరిగిపోయింది. నా పాదాల వద్ద ప్రారంభమయింది. నా పాదాలు భూమిని తాకటం లేదు. నా పాదాల్లో తిమ్మిరిగా అనిపించి స్పర్శ తెలియడం మానివేసింది. గాలిలో తేలిపోతున్న అనుభూతి కల్గసాగింది. భౌతిక దేహము కనుమరుగు అయిపోయింది. ఒక విధంగా అది శూన్యంలోకి ఆవిరి అయినట్లు ఉంది. ఆ దివ్యానుభూతిని మామూలు మాటల్లో వర్ణించి చెప్పటం సాధ్యము కాదు. అనుభవం లోనికి వచ్చినప్పుడు మాత్రమే అర్థమవుతుంది. అలాంటి అరుదయిన అనుభవం ఎవరి జీవితంలో అయినా చాలా అరుదుగా వస్తుంది.

నేను ఒంటరిగా గదిలో ఉన్నాను. తలుపులు వేయటానికి ప్రయత్నించి విఫలమయ్యాను. అది ఒక దివ్యానుభూతి, తన్మయత్వ స్థితి. నా శరీరంనుండి శ్వాస తీసుకోవటం కూడా ఒక్క క్షణం ఆగిపోయిన అనుభూతి కల్గింది. నా తల వెనక్కి వాలిపోయింది. బాహ్యస్మృతి కోల్పోయినట్లుగా ఉంది. కాని 'నేను ఉన్నాను' అనే మహోన్నతమయిన స్థితి నాకు అనుభవంలోనికి వస్తోంది. ఈ అనుభవము స్పృహ కోల్పోవటం కాని లేదా భౌతికమయిన శరీరానికి మూర్ఛ వంటిది రావటం గాని కాదు.

పరమాత్మ దివ్యానుగ్రహము వలన నేను చాలా ఆరోగ్యంగా, ఉత్సాహంగా, బలంగా ఉన్నాను. నా శరీరంలో ఎలాంటి లోపము లేదు. ఆ దివ్యానుభవం తర్వాత కొంతసేపటికి నేను యథాస్థితికి వచ్చేశాను. అప్పుడు కూడా ఇంకా కొద్దిగా నా శరీరము తేలిపోతున్నట్లుగానే అనిపించసాగింది.

ఈ అద్భుతమయిన అనుభవం నాకు స్వామి వివేకానందుడి గురువు శ్రీ రామకృష్ణ పరమహంస తాకినప్పుడు ఆయనకి కల్గిన పవిత్రమయిన సమాధిస్థితిని గుర్తుకు తెచ్చింది.

ఇక్కడ నేను సర్వాంతర్యామి, సర్వత్రా నిండి నిబిడీకృతమైన ఆ సర్వేశ్వరుడి అనుగ్రహ స్పర్శను అనుభవించాను.

ఒక అమెరికన్ సాధకుడికి ఆకస్మాత్తుగా కల్గిన ఆధ్యాత్మిక అనుభవాన్ని కూడా నాకు గుర్తుకు తెస్తోంది. ఆయన పనిచేసుకొంటున్నప్పుడు కల్గిన అనుభవాన్ని ఆయన ఒక గ్రంథంగా ప్రపంచానికి అందించాడు. "అమరత్వంలో ఏడు క్షణాలు" దాని పేరు.

### అమరమయిన క్షణాలు

నా ప్రయత్నం లేకుండానే, నాకు ఏర్పడిన ఆ దివ్యానుభవము నాకు గుర్తుకు వచ్చినప్పుడు నేను దాన్ని వివరంగా తెలియచేయలేకపోతున్నాను. అది అన్నింటికి అతీతమయినది. భగవంతుడు ప్రసాదించిన వరప్రసాదం, అమరమైనది, శాశ్వతమయినది. అది విశ్వ సంబంధమయిన సంతోషము, అన్నింటికి అతీతమయిన ఆనందము. అక్కడ నేను మహోన్నతమయిన స్థితికి చేరుకున్నాను. అక్కడ కాలము స్తంభించి పోయింది. బుద్ధి కరిగిపోయింది. అనంత తత్త్వంలోనికి నేను చేరుకున్నాను.

ఓం...ఓం...ఓం...

## అధ్యాయం - 58

# శాంతి ఆశ్రమములో సేవా కార్యక్రమాలు

### గురుకులము

చివరికి మా జ్ఞానేశ్వరి యొక్క గొప్ప ప్రేమ, సేవల మూలంగా ఇంకా శ్రీ సి.హెచ్.వి.రాజు గారు ఇంకా ఇతర ఆశ్రమ సభ్యులు, శ్రేయోభిలాషులు, స్నేహితుల సహకారము వలన మేము ఇరవై మంది పిల్లలతో గురుకులాన్ని ప్రారంభించాము. నెమ్మదిగా పిల్లలు పెరుగుతూ వచ్చి ఇప్పుడు డెబ్బై ఐదు మంది విద్యార్థులు ఉన్నారు. వారందరూ అనాథలు, నిరుపేదలు, అలాగే భక్తుల పిల్లలు కూడా ఉన్నారు. భక్తులు ఇది తమకు చాలా మంచి అవకాశంగా భావించి, తమ పిల్లలు ఆశ్రమ వాతావరణములో, పవిత్రమయిన స్థలంలో ఆధ్యాత్మిక విద్యను నేర్చుకుంటారని భావించారు. విశ్వ



విద్యాలయాల్లో బిఎ, ఎంఎలుగా మార్చినట్లుగా మేము మా గురుకులంలోని విద్యార్థులను భగవంతుని అనుగ్రహంతో కొద్దిమందినయినా శ్రీకృష్ణుడిగా, జీసస్‌గా, బుద్ధుడిగా, మహమ్మదుగా, గాంధీగా, నెహ్రూగా, వివేకానందుడిలాగా, విశ్వనాధ్‌లాగా తయారు చేయాలని ఆశిస్తున్నాము.

ఒక గొప్ప జ్ఞాని అంటారు "మీరు గొప్ప వేటగాడు కావాలి అని కోరుకుంటే దోమలను, ఈగలను వేటాడవద్దు. పులలను, సింహాలను వేటాడాలి". మనము కలలు కనాలనుకుంటే మహోన్నతమయిన కలలు కనాలి. ఈ విశ్వంలోని సమస్త మానవాళి ప్రయోజనం కోసం కేవలం ఈ రోజుకి కాకుండా శాశ్వతంగా మేలు చేయాలి.

నేను ఎల్లప్పుడూ కలలు కంటూ ఉండేవాడిని. శాంతి ఆశ్రమము గురించి కలలు కన్నాను. తోటపల్లి కొండల్లోని అడవిని ఆశ్రమంగా మలిచాము. అదే విధంగా వాల్తేరు ఆశ్రమము, కైలాస ఆశ్రమము ఋషికొండ సముద్రపు ఒడ్డున అందరి శ్రేయస్సు కోరి తీర్చిదిద్దాము. వాటి గురించిన నా కలలు సాకారమయ్యాయి. వాటిని మీ అందరికి వారసత్వ సంపదగా సమర్పిస్తున్నాను. ఇప్పుడు గురుకులానికి బీజము వేశాము. అది నా చిరకాలమయిన కల. దానిని మీకు అందచేయటము నా కర్తవ్యము. అది పెద్ద వట వృక్షంగా మారి తూర్పు పడమర దేశాల్లోని అన్ని మతాలకి చెందిన విద్యార్థులందరికీ చల్లని నీడని ప్రసాదించే వరకు మీరు దానిని జాగ్రత్తగా సంరక్షించాలి.

మా వద్ద మంచి అంకితభావం గల ఇద్దరు ఉపాధ్యాయులున్నారు. వారిలో ఒకరు సంగీతము, ఇంకొకరు కుట్టుపని నేర్పేవారు. పాఠశాలకు చాలా పెద్ద భవనము, ఆడపిల్లలకి, మగపిల్లలకి రెండు వసతి గృహాలు ఉన్నాయి. పిల్లలందరూ ఉదయాన్నే నిద్రలేచి స్నానం చేసి ఆధ్యాత్మిక భక్తి గీతాలు ఆలపించేవారు. ఉపాహారం తర్వాత పాఠశాలకు వెళతారు. వాళ్ళందరూ తోటపని లాంటి వివిధ పనుల్లో నిమగ్నమయ్యేవారు. వారిలో కొంచెము పెద్దవాళ్ళు ముద్రణాలయంలో, ఆశ్రమ వాసులకు సహాయం చేసేవారు. గురుకుల విద్యార్థులు ఆడుకోవడానికి ఆటస్థలములో ఉయ్యాలలు, సీసాలాంటి ఇతర ఆట వస్తువులుండేవి. సాయంత్రపు వేళల్లో విద్యార్థులు భజనల్లో, ప్రార్థనల్లో పాల్గొనేవారు. ప్రత్యేకమయిన పండుగ సెలవు దినాల్లో క్రిస్టమస్, శ్రీరామనవమి మరియు శ్రీ కృష్ణ జన్మాష్టమి ప్రత్యేకమయిన సత్సంగాల్లో విద్యార్థులు పాల్గొనేవారు. కొన్ని పర్యాయాలు పిల్లల కోసం ప్రత్యేకంగా పూజలు నిర్వహించేవాళ్ళము. వారికి ఇష్టమయిన దీపావళి



పండుగ సెలవు దినాన పిల్లలు ఆలస్యంగా మేల్కొని ఉండి రంగు రంగుల దీపాలు అలంకరించి టపాసులు కాల్చేవారు.

ప్రస్తుతము గురుకులములో ఆరు సంవత్సరాల వయస్సు వారిని చేర్చుకుని వారిని ఏడవ తరగతి వరకూ చదివిస్తున్నాము. తర్వాత వారు ఇంటికి తిరిగి వెళ్తారు. అనాథలయితే వారి భవిష్యత్తు కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తాము. కుమారి జ్ఞానేశ్వరీ, ఆశ్రమ పాత భక్తురాలు శ్రీమతి శేషమ్మ గారు నిజమయిన తల్లుల్లాగా ఆ బిడ్డల యోగ క్షేమాల పట్ల శ్రద్ధ వహించేవారు. వారు పరిశుభ్రంగా, ఆరోగ్యంగా, సౌకర్యంగా ఉండేవిధంగా చూసుకునేవారు. విద్యార్థులకు ప్రతి రోజు మూడుసార్లు పౌష్టికమయిన ఆహారాన్ని ఏర్పాటు చేసేవారము. అలాగే ప్రత్యేకదినాల్లో తీపి పదార్థాలుండేవి. గురుకులము కేవలము వారికి విద్యనే కాకుండా ఆధ్యాత్మికంగా ఉన్నతమయిన స్థితికి ఎదగడానికి తోడ్పడేది.

## సింహాచల యాత్ర

నిజమయిన విద్య కేవలము పుస్తకాలకే పరిమితము కారాదు. మన హృదయాలను విశాలంగా, అవగాహనతో అందరి పట్ల ప్రేమానురాగాలతో పెంచుకోవాలి. గురుకులములోని విద్యార్థులు, ఆశ్రమవాసులు అక్కడ పనిచేసేవారు అందరికి వాల్తేరు ఆశ్రమానికి వెళ్ళి నాలుగు రోజులుండి విశాఖపట్టణం చుట్టు ప్రక్కల ముఖ్యమయిన ప్రాంతాలన్నింటిని సందర్శించే సదవకాశము లభించింది. వారందరూ స్వామి జ్ఞానానందగారికి వందనాలు సమర్పించారు. ఆంధ్రా విశ్వవిద్యాలయం, వాల్తేరులోని డిపార్టుమెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఫిజిక్స్‌కి ఆయన అధిపతిగా ఉండేవారు. వారు విద్యార్థులను ఆశీర్వదిస్తూ మంచి మాటలు చెప్పారు.

మా విద్యార్థులందరూ ఎంతో సంతోషంగా ఓడరేవును, విమానాశ్రయాన్ని సందర్శించారు. అక్కడి అధికారులు కూడా ప్రత్యేకమయిన శ్రద్ధతో, ప్రేమగా పిల్లలందరికీ ఓడలను, విమానాలను చూపించారు. ఆ రోజు నిజంగా చాలా సుదినము. పిల్లలందరు పవిత్రమయిన సింహాచలం పుణ్యక్షేత్రాన్ని దర్శించారు. దేవాలయం లోని పూజారి చాలా దయతో పిల్లల పట్ల శ్రద్ధ తీసుకొని దేవుని దర్శనం చేయించి, అందరికీ ప్రసాదాన్ని పంచిపెట్టారు. విద్యార్థులతో పాటు ఆశ్రమ భక్తులు చాలా మందిమి ఉన్నాము. అందరికీ

ఎంతో శ్రద్ధగా దర్శన ప్రసాదాలు అందించారు. ఆశ్రమానికి జీవితకాలము భక్తులుగా తరించిన డా॥ జి.వి.ఎస్. మూర్తి మరియు సోదరి అమలమ్మ గారి అందమయిన ఇంటిలో ఆ సాయంత్రము అందరమూ ఆనందంగా గడిపాము.

ఆదివారము ఉదయము పిల్లలు చేసిన ప్రార్థనలు, ప్రత్యేకించి భజనలు మమ్మల్ని ఎంతో ఉత్తేజితులను గావించి భగవంతుని దివ్యానుభూతిని కలిగించాయి. ప్రార్థనామందిరము వరండా కూడా భక్తులు, స్నేహితులతో నిండిపోయింది. ప్రేమ సమాజాన్ని, దాని సెక్రటరీ శ్రీ రమణ గారు చూపించిన ఆదరాభిమానాలు, విద్యార్థుల ఆశ్రమ వాసుల హృదయాలను చూరగొన్నాయి. ఆ రోజు సాయంత్రం శ్రీ రమణ గారు ప్రేమ సమాజం పిల్లలందరినీ తీసుకువచ్చి స్వామీజీకి ప్రణామాలు చేయించారు. స్వామీజీ అందరినీ ఉద్దేశించి ఉత్తేజపూరితమయిన సందేశాన్ని అందించారు. శ్రీ రమణ గారు పిల్లలందరికీ సినిమా వేసి చూపించారు. దాని వలన పిల్లలు ఏ విధంగా నిస్వార్థంగా సేవలు చేయాలో, పరిశుభ్రంగా ఎలా ఉండాలో, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవటం గర్వం లేకుండా పనిచేయటం మొదలైన పాఠాలు నేర్చుకున్నారు. భగవంతుడు ప్రేమ సమాజం చేస్తున్న మంచి పనులను ఆశీర్వదించుగాక!

మా గురుకులంలోని విద్యార్థులు సంతోషంగా, కష్టపడి పనిచేస్తున్నప్పుడు, ఆశ్రమానికి సేవలందిస్తున్నప్పుడు, దినదినము ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి వస్తున్నందుకు నాకు చాలా ఆశ్చర్యం కల్గుతుంది. ఇదంతా ఎవరు చేస్తున్నారు? అనిపిస్తుంది. అది నేను మాత్రం కాదు. ఇది అంతా ఆ పరమాత్మ చేస్తున్న పని మాత్రమే. ఆయన దివ్యానుగ్రహము చేస్తున్నది. మేమందరము ఆయన ఎన్నుకున్న పరికరాలము మాత్రమే. భక్తులకు, ఆశ్రమ సభ్యులకు, స్నేహితులకు, దగ్గరలోని వారికే కాకుండా సుదూర తీరాల్లోని వారికి కూడా శ్రీ శాంతి ఆశ్రమము అనేక ధన్యవాదాలు తెలియ చేసుకుంటోంది. ఎందరో దాతలు ముందుకు వచ్చి కేవలము వారి ధనాన్ని మాత్రమే కాకుండా వారి ప్రేమ, దయ, ప్రార్థనలు, సేవలు అందించి ఆదర్శవంతమయిన గురుకులాన్ని ప్రయోగాత్మకంగా నడిపించాలనే నా కలను సాకారం చేశారు.

## వృద్ధాశ్రమము

జీవించి ఉన్న ప్రతి ఒక్కరూ దేవుని ప్రతిరూపాలే కనుక శాంతి ఆశ్రమము అనాధలు, నిరుపేదలు అయిన చిన్నారులను గురుకులము నిర్వహించి సేవలందించటంతో తృప్తి పడలేదు. నేను ఎప్పుడూ వృద్ధులు, రోగులు, క్రుంగిపోయినవాళ్ళు, బిడ్డలు చూసుకోకుండా వదలివేసిన వాళ్ళకు కూడా సేవలందించాలని కలలు కన్నాను. మన పురాణాల్లో చెబుతారు వయస్సు మళ్ళిన మగవారందరూ భగవాన్ శివుని ప్రతిరూపాలు, అలాగే పాతకాలపు స్త్రీలు అందరూ కూడా పార్వతీదేవికి ప్రత్యక్ష రూపమేనని, అందువలన మేము ఒక ఆదర్శవంతమయిన వృద్ధాశ్రమాన్ని నిర్మించి శాంతి ఆశ్రమంలో ఆ భక్తులయిన తాతయ్యలకు, నానమ్మలకు, అమ్మమ్మలకు సేవలందించాలనుకున్నాము. ఇప్పుడు ఇరవై ఐదు మంది స్త్రీ పురుషులున్నారు వృద్ధాశ్రమంలో. ఆశ్రమము వారందరినీ ఎంతో ప్రేమానురాగాలతో చూసుకుంటోంది. వారిలో కొందరు స్త్రీలు ఆశ్రమంలోని వంటశాలలో కొన్ని గంటలు సహాయం చేస్తుంటారు. కూరగాయలు కోస్తుంటారు. అలాగే గురుకులములోని విద్యార్థులకు నిజమయిన అమ్మమ్మల్లాగా ఉండేవారు. వారందరూ శాంతి ఆశ్రమానికి వరంలాగా ఆశీస్సులందించేవారు. ప్రపంచంలోని వృద్ధులయిన స్త్రీ, పురుషులందరిని భగవంతుడు ఆశీర్వదించుగాక! శాంతిని ప్రసాదించుగాక! కొందరు పెద్దవారు ఆశ్రమంలో కొంతకాలము శాంతితో గడిపి తర్వాత ఇళ్ళకు తిరిగివెళ్ళి వాళ్ళ పిల్లలకి, మనమలు, మనమరాళ్ళకి శాంతిని ప్రచారం చేసేవారు. ఆ విధంగా మౌనంగా నిశ్శబ్దంగా శాంతి ఆశ్రమము ఎందరో అంకితభావం గల భక్తుల హృదయానికి చేరువయింది.

వృద్ధులకు ఆశ్రమాలుండటం చాలా బాగుంటుంది. వారు నిస్సహాయ స్థితిలో ఉంటారు. కొందరు నిరుపేదలుంటారు. వారు యవ్వనంలో ఉన్నప్పుడు చక్కని జీవితాన్ని గడిపి ఉంటారు. ఈ భౌతిక ప్రపంచంలో మనము తరుచుగా చూస్తూనే ఉంటాము. వారు ఆరోగ్యంగా ఉండి అందరికి సేవలు చేస్తున్నంత కాలము ఎంతో ప్రేమగా, ఆరాధించబడతారు. ఒక్కసారి ఆరోగ్యం దెబ్బతిని, వృద్ధులయిపోయి, సంపాదన లేక ఇతరులపై ఆధారపడే పరిస్థితి రాగానే అంతవరకు ఎంతో ప్రేమించిన సొంతవారు, దగ్గరి వారు కూడా వారిని నిర్లక్ష్యం చేయటము, మర్చిపోవటము, వదలివేయటము చేస్తుంటారు. కొన్నిసార్లు వాళ్ళని చాలా భారంగా కూడా భావిస్తుంటారు. మనము



కూడా ఏదో ఒక రోజు తొందరగానో, ఆలస్యంగానో ముసలివారమవుతాము. మనము కూడా ఒక రోజు అదే పడవలో వృద్ధులతో కలిసి ప్రయాణించాల్సి ఉంటుందని గుర్తు పెట్టుకొని దాని గురించి జాగ్రత్తగా ఆలోచించాలి. వారి సంరక్షణ గురించి, భవిష్యత్తు గురించి ఏమయినా చేయగల్గితే అది మనకు సంతృప్తిని, సౌకర్యాన్ని కల్గిస్తుంది. మన వృద్ధ సోదరసోదరీమణులు కూడా భగవంతుని బిడ్డలే కదా!

ఆశ్రమానికి వృద్ధులయిన పెద్దలు ఎప్పుడూ వస్తుంటారు. చెందుర్తికి చెందిన మాతృమూర్తి సూరమ్మ ఆశ్రమము ప్రారంభంలో మాతో కలిసి నివసించిన భక్తురాలు. ఇప్పుడు ఎనభై ఏళ్ళ వృద్ధురాలయింది. నా మనస్సులో ఒక బలమయిన నిర్ణయం ఏర్పడింది వృద్ధాశ్రమం నిర్మించాలని. ఆశ్రమానికి పెద్దగా మూలధనం లేదు. ఆలోచన వచ్చింది కనుక నేనిప్పుడు రెండు కుందేళ్ళ వెనుక పరుగెత్తాల్సి ఉంటుంది. చాలా వాటి వెనుక పరుగెత్తాలి. అయినప్పటికి అది నాకు సంతోషాన్ని, సంతృప్తిని కలిగిస్తుంది. ఇప్పుడు నేను నాటిన విత్తనము తప్పకుండా మొలకెత్తి, పెద్ద వృక్షంగా ఒక నాటికి మారుతుంది. ప్రత్యేకంగా మనము వాటిని చక్కగా నీరుపోసి పోషించవలసి ఉంటుంది.

మనము ఏదో ఒక్క బీజాన్నే నాటాలని అనుకోకూడదు. మన శాంతి ఆశ్రమము పొలాల్లో వరి పండిస్తున్నాము. అలాగే మొక్కజొన్న, మినుములు, పెసలు, కందులు ఇంకా వేరుశనగ కూడా పండిస్తున్నాము. అందువలన ఏ విత్తనాలు నాటామో ఆయా ఫలాలు వాటికి అనుకూలమయిన వాతావరణంలో ఫలిస్తాయి. అదేవిధంగా ఆశ్రమములో గురుకులానికి, ముద్రణాలయానికి, ఇంకా ఎన్నో మంచి పనులకు బీజం వేశాము. ఇప్పుడిక వృద్ధాశ్రమం స్థాపించడానికి బీజము వేయడం నాకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తోంది. ఈ రోజు మాత్రమే మనది, రేపటి గురించి నేను ఆలోచించను. అందువలన మంచి పనులు వెంటనే ఈ రోజే ప్రారంభించాలి. ఫలితాన్ని మాత్రము పరమాత్మకు వదిలిపెట్టాలి.

ఈ భౌతిక దేహము ప్రపంచాన్ని వదలిపెట్టి ఈ రోజే వెళ్ళిపోయినా లేదా ఏదో ఒక రోజు వెళ్ళిపోయినా మనము నాటిన విత్తనాలు తప్పకుండా ఎవరో ఒక ఆత్మజ్ఞానుల ద్వారా పోషింపబడి పేదలకి, నిస్సహాయులకు మహోన్నతమయిన సహాయకారిగా ఆంధ్రదేశంలోనే కాకుండా భారతదేశంలోనే గొప్ప సేవలందిస్తాయి. మంచి దృఢమైన, ఆరోగ్యవంతమయిన వారిని ఎవరయినా సంరక్షిస్తారు. కాని రోగులను, పేదలను,

వృద్ధులను, నిస్సహాయులను జాగ్రత్తగా సంరక్షించడానికి పవిత్రమయిన హృదయం గల భక్తులు కావాలి. భగవంతుడు పేదవారి రూపంలో, వృద్ధుల రూపంలో మన వద్దకు వస్తాడని చెపుతారు. వారిని జాగ్రత్తగా సంరక్షించి, పూజించటం, ప్రేమతో, అనురాగంతో చూసుకోవటం మనకు దొరికిన మంచి అవకాశం. ఈ ప్రపంచమంతా భగవంతుని స్వరూపమే అయినప్పుడు భగవంతుని బిడ్డల్లో అట్టడుగు వాటికి సేవచేసినా ఆ పరమాత్ముడిని సేవించినట్లే అవుతుంది. ఆశ్రమంలో దాదాపు నలభై సంవత్సరాల నుండి కొందరు సోదర సోదరీమణులు శాంతి ఆశ్రమం కోసం ఎందరికో ఎన్నో సేవలను అందిస్తున్నారు. వారిలో చాలా మంది ఇప్పుడు వృద్ధులయిపోయి, ఎలాంటి పనులు చేసుకోలేక పోతున్నారు. వారిలో ఒక సోదరుడి కంటిచూపు పోయింది. ఇంకొక వ్యక్తికి చెముడు వచ్చింది. ఇంకొక సోదరి క్రొత్తగా ఆశ్రమానికి వచ్చింది. ఆమె ఒంటరిది, నిస్సహాయురాలు, కనీసం నడవలేని స్థితిలో ఉంది. వీరందరికి మనము ఏమి చేయగలము? వాళ్ళు ఆశ్రమానికి ఎలాంటి సహాయము చేయలేని స్థితిలో ఉన్నారని ఇప్పుడు వారిని నిర్లక్ష్యంగా బయటికి పంపివేస్తే అది పాపము కదా! వారిని ప్రేమతో, చిరునవ్వుతో ఆదరించటం, జాగ్రత్తగా సంరక్షించడం మన బాధ్యత. ఆరోగ్యంగా, దృఢంగా ఉన్నవారి కంటే వీరి పట్ల ఇంకా ఎక్కువ శ్రద్ధ పెట్టవలసిన అవసరముంది. వారి అవసరాలను వారే సమకూర్చుకోగలవారిని ఎవరయినా ప్రేమగా గౌరవంగా చూస్తారు. కాని ఎవరయితే రోజువారి అవసరాలు కూడా తీర్చుకోలేని నిస్సహాయస్థితిలో ఉన్నారో వారిని కూడా మనము ప్రేమతో సేవించాలి. ఇదే నిజమయిన గొప్ప సేవ. భగవంతుడు మన జీవితంలో అందించిన గొప్ప అవకాశము. ఈ ప్రపంచంలో ఎవ్వరూ కూడా నిరుపయోగం కాదు, వారు యవ్వనంలో ఉన్న లేదా వృద్ధులయినా సరే. ప్రతి ఒక్కరూ భగవంతుని దివ్యలీలలో పాత్ర వహించవలసిందే.

ఈ వృద్ధులయిన సోదరసోదరీమణులు ఆశ్రమానికి ఎంతో గొప్పసేవ చేస్తున్నారని చెప్పాలి. వారు ప్రపంచశాంతి కోసం నిరంతరం భగవన్నామాన్ని జపిస్తుంటారు. వ్యక్తులకు, దేశాలకి కూడా శాంతి సౌభాగ్యాలు కలగాలని కోరుకోవటం కంటే గొప్ప సేవ ఇంకేముంటుంది? శాంతి ఆశ్రమంలో 'ఏకాహం' భగవంతుని పవిత్ర నామ జపము నిరంతరాయంగా రోజంతా జరుగుతుంటుంది. మన వృద్ధులు అందులో రెండు మూడు గంటలు పాలుపంచుకుంటారు. పదే పదే భగవన్నామాన్ని జపించటము వలన వారు

పరమాత్మతో మమైకం అవుతారు. అంతేకాక భగవన్నామాన్ని శ్రవణం చేసేవారికి కూడా ఎంతో ఉత్సాహంగా ఉంటుంది. వారు అలా భగవన్నామాన్ని పాడుతున్నప్పుడు మనము వ్యక్తిగతంగా అనుభవించాలే తప్ప మాటల్లో వర్ణించి చెప్పలేము.

అయినా, మన జీవితంలో వృద్ధులకి, నిస్సహాయులకు, రోగులకి, దేవుని బిడ్డలందరికీ, అవసరమయిన వారందరికి సహాయ సహకారాలు అందించటం మన కర్తవ్యం.

ఓం...ఓం...ఓం...

**అధ్యాయం - 59**

# కోటగిరిలో శాంతి కేంద్రము

## తోటపల్లి నుండి కోటగిరికి, అక్టోబరు 1957

భగవంతుని దారులు చిత్రవిచిత్రంగా, అనూహ్యంగా ఉంటాయి. ఆయన ఒకే మూలానికి చెందిన ఆత్మస్వరూపులను విచిత్రంగా కలిపి ఆయన బిడ్డలకి సేవలు అందిస్తాడు. చాలా కాలమునుండి తోటపల్లి కొండల్లోని శాంతి ఆశ్రమాన్ని దర్శించడానికి వచ్చే లలిత అనే భక్తురాలు తమిళనాడులోని నీలగిరి కొండల్లోని ప్రదేశానికి నన్ను రమ్మని ఎంతో గౌరవంగా ఆహ్వానించింది. అక్కడ అనేకమంది భక్తులు శాంతి సందేశాలను వినటానికి ఆతురత చెందుతున్నారని తెలిపింది.

నేను ఎప్పుడు గాఢమయిన ధ్యానములో కాలము గడపాలని, మౌనంగా ఉండాలని కోరుకుంటాను. ఆశ్రమాన్ని వదలిపెట్టి ఇతర కేంద్రాలకి వెళ్ళాలని భావించను. అందువలన ఆమెను క్షమించమని చెప్పాను. తప్పకుండా ఆమె కోరిక నెరవేరుస్తానని, కనీసం నాకు ఆరు నెలల గడువు ఇవ్వమని చెప్పాను. ఆమె పదే పదే ఉత్తరాలు వ్రాస్తుండేది. అయినా ప్రతిసారి కూడా నేను ఆలస్యం చేసేవాడిని. ఆంధ్రాలోని వివిధ ఆశ్రమాల పనుల వత్తిడి వల్ల వెళ్ళలేకపోయాను.

చివరికి ఆమె వ్రాసిన ఉత్తరము నాకు అందింది. అందులో ఆమె నన్ను ప్రశ్నించింది. "ఎవరయినా వ్యక్తి దాహంతో త్రాగటానికి మంచినీళ్ళు అడిగితే అప్పుడు కూడా మీరు అతడిని ఒక సంవత్సరం తర్వాత రమ్మని సందేశం ఇస్తారా?" అని. అది చదివిన వెంటనే నేను అక్కడికి వెళ్ళడానికి వెంటనే ఏర్పాట్లు చేసుకోవాల్సిన అవసరముందని అనిపించి తోటపల్లి నుండి సెప్టెంబరు 16వ తేదీన బయలుదేరాలి అని నిశ్చయించ బడింది.

నేను తొందరగానే మేల్కొన్నప్పటికీ, నాకు వెన్ను నొప్పి రావటం మొదలయింది. అప్పటికి మేము నా కాలికి గాయం అయి బాగా వాచిపోవటం వలన అనుకున్న ప్రయాణాన్ని వాయిదా వేశాము. మళ్ళీ ప్రయాణాన్ని వాయిదా వేయటం సబబుగా అనిపించలేదు. ముందుగానే మా ప్రయాణం గురించి తెలుసుకున్న అనేక మంది భక్తులు అనేక ప్రాంతాల వారిని, లలితాదేవిని నేను నిరాశపర్చదలుచుకోలేదు. పిఠాపురం నుండి స్నేహితులు నా కోసం వాహనాన్ని సిద్ధం చేశారు తుని రైలు స్టేషను వరకు వెళ్ళడానికి ప్రయాణాన్ని వాయిదా వేయలేము కనుక వెన్నునొప్పి తగ్గటానికి వేడినీటి కాపడం పెట్టుకొని నెమ్మదిగా ప్రయాణము ఏర్పాట్లు చేసుకున్నాము. ఆశ్రమవాసులందరితో కలిసి ప్రార్థనలు చేసి చివరికి నిత్యానంద స్వామీజీతో ఆయన సోదరితో కలిసి ఉదయము 10-30 నిముషములకు వాహనంలో బయలుదేరాము.

వర్షాలు విపరీతంగా పడటం వలన రోడ్లు అన్నీ బాగా గుంటలు పడి నీరు నిల్చిపోయింది. ఆ ఇరుకుల దారిలో గతుకుల దారిలో ప్రయాణం చేయటము చాలా ప్రమాదమే, సరాసరి స్వర్గానికి చేరుస్తుంది. నిజానికి చెప్పాలంటే స్వర్గం చేరుకునే మార్గం ఎల్లప్పుడూ పడిపోయే గోతులతో, ఎండమావులతో నిండి ఉంటుంది. నేను చెప్పిన విషయం నా పాఠకులకు క్రొత్తగా అనిపించవచ్చును. తుని స్టేషను చేరుకునేసరికి కారు దారి పొడగునా ఎగిరి పడటము వలన కాబోలు నా వెన్నునొప్పి పూర్తిగా మటుమాయమయి పోయింది. అక్కడి నుండి మేము మెయిల్ ఎక్స్‌ప్రెస్‌లో మద్రాసు చేరుకోవాలి. చాలా మంది స్నేహితులు కలుసుకున్నారు. అందరము కలిసి ధ్యానము, ప్రార్థనలు చేశాము. 'కృష్ణాజీ' అనే పిల్లవాడు చక్కగా ప్రార్థన చేశాడు. అలాంటి అమాయకమయిన పవిత్ర హృదయం కల పిల్లలు భగవంతుని సామ్రాజ్యానికి చెందినవారు.

దారిలో మేము పిఠాపురం, సామర్లకోట, రాజమండ్రి మరియు విజయవాడ రైల్వే స్టేషన్లలో ఆగినప్పుడు ఎందరో ఆశ్రమ భక్తులు ప్లాట్‌ఫారంపై కలుసుకుని పూలు పళ్ళు సమర్పించారు. మిఠాయిలు తెచ్చారు.

విజయవాడలో ఇద్దరు విమానం నడిపేవారు పైలెట్లు మా రైలులో ఎక్కారు. వారు మాకు ప్రణామాలు చేసిన తర్వాత ప్రపంచ పరిస్థితులను గురించి మాట్లాడటం మొదలు పెట్టారు. వారికి సిగరెట్లు త్రాగే చెడ్డ అలవాటు ఉండటం వలన దానికై మా అనుమతి కోరారు. వారు దేశాధ్యక్షుడి నుండి ప్రధానమంత్రి దాకా అందరి గురించి మాట్లాడుతూ ఒక దాని తర్వాత ఒకటిగా సిగరెట్లు కాలుస్తూనే ఉన్నారు. రైలు బోగి మొత్తం సిగరెట్ల పొగతో నిండిపోయింది. కొంతసేపటికి నాకు కూడా సిగరెట్టు పీల్చిన అనుభూతి కలిగింది. ఎందుకంటే ఆ సిగరెట్ల పొగను వాసనని అంతవరకూ ఊపిరిగా పీలుస్తున్నాము కనుక. ఈ విధంగా ఎవరయినా మంచి పని గాని, చెడుపని గాని ఇతరుల సాంగత్యం వలన నేర్చుకుంటారు.

మద్రాసు స్టేషన్‌లో 'ఉపనిషత్ విహార్' స్వామీజీ రాజేశ్వరానంద గారు వచ్చి మాకు స్వాగతం పలికి మేము వచ్చిన దగ్గరినుండి తిరిగి నీలగిరి ఎక్స్‌ప్రెస్ ఎక్కే వరకూ మాకు కావాల్సిన సౌకర్యాలన్నీ చూసుకొన్నారు. ఇంకా ఎందరో స్నేహితులు కూడా పూలదండలతో మాకు స్వాగతం పలికారు. అక్కడ మేమున్న ఆ కొద్ది సమయంలోనే బొబ్బిలి మహారాణి గారి అందమయిన గృహానికి వెళ్ళి అక్కడ ప్రార్థనలు, ధ్యానము చేశాము. ఒక పవిత్రమయిన పుణ్యక్షేత్రంలో లాగా అక్కడ మేము గడిపిన క్షణాలు ఎంతో అద్భుతంగా, ప్రశాంతంగా, పవిత్రమయిన అనుభూతిని కల్గించాయి.

మద్రాసు నుండి కోటగిరికి మేము "బ్లూమౌంటెన్ ఎక్స్‌ప్రెస్'లో బయలుదేరాము. మా రైలు బోగిలో ఇద్దరు కొత్త భక్తులు, తర్వాత ఆశ్రమ శ్రేయోభిలాషులు అయ్యారు. శాంతి ప్రార్థనని గుర్తు చేస్తుంటాను. స్వామి నిత్యానంద ఎంతో అంకితభావంతో నాకు కావాల్సిన సదుపాయాలన్నీ చూసుకున్నారు. కోయంబత్తూరులో శ్రీ ఎస్.కె.డి. అయ్యర్ గారు తన స్నేహితులు, నిస్వార్థ సేవకులు, ఆధ్యాత్మిక హీలింగ్ కేంద్రము సభ్యులతో కలిసి స్టేషన్‌కి వచ్చి పూలమాలలు, పళ్ళు సమర్పించి ఘనమైన స్వాగతం పలికారు. వారందరూ కూడా శాంతి ప్రార్థనని పాడటం నాకు ఆశ్చర్యం కల్గించింది.

మేట్టుపాలయం స్టేషనులో మా కోసం కారు సిద్ధంగా ఉంది. మా సామాన్లు శాంతి సందేశాలతో కూడిన సాహిత్యం, పళ్ళ బుట్టలు కారులో ఎక్కించాము. అక్కడి నుండి కోటగిరికి బయలుదేరాము. మేట్టుపాలయం నీలగిరి కొండలకి తలుపులాంటిది. అందమయిన నీలగిరి కొండలు మమ్మల్ని ఆహ్వానిస్తున్నట్టుగా ఉన్నాయి. మేము సుఖంగా, సౌకర్యంగా ప్రయాణించడానికి కారు ఏర్పాట్లు చేసిన లలితాదేవి ఆ కారును నడిపే వ్యక్తితో స్వాగత పత్రాన్ని పంపించింది.

అక్కడి స్టేషనులో జరిగిన చిన్న సంఘటన నా హృదయాన్ని బలంగా కదిలించింది. ఒక నిరుపేద మహిళ తన కుమార్తెతో కలిసి భిక్షమెత్తుతోంది. ఆ అమ్మాయి నా వెంటపడి 'స్వామియార్', స్వామియార్' అని పిలవసాగింది. ఆమె నా నుండి కొద్ది పైసలు ఆశిస్తోంది అనుకొన్నాను. ఆశ్చర్యంగా పైసలు బదులుగా ఆ అమ్మాయి నా చేతిలోని పూలగుత్తిని ఇవ్వమని బ్రతిమాలసాగింది. నేను ఆమె చిన్న కోరికను కాదనలేక నా చేతిలోని అందమైన పూలగుత్తిని ఆమెకిచ్చాను. ఆ చిన్నపాప మధురమైన ముఖం ఆనందంతో సంతోషంతో సంతృప్తిగా వికసించింది. ఆ నవ్వు స్వర్గలోకపు వాసులది. నేనా దివ్యానుభూతితో కన్నీరు కార్చాను. ఆ దివ్య క్షణాలు భగవంతుని పవిత్రమయిన దివ్యానుభూతిని కలిగించాయి. భగవంతుడు మన వద్దకు ఏదో ఒక రూపంలో రోగిలాగా, పేదవారిలాగా వివిధ రూపాల్లో వస్తుంటాడు. అప్పుడు మనము వారికి సేవ చేసి, పూజించి ఆ భగవంతుని దర్శించగల్గటం మన అదృష్టం. ఇతరులను సంతోష పెట్టడం వలన మనము కూడా సంతోషంగా జీవించగల్గుతాము. మానవులను ప్రేమించటమే మాధవుడిని ప్రేమించటం.

## కోటగిరిలో శాంతి కేంద్రము, లక్ష్మీ కుటీరము

గడ్డిపరక కూడా భగవంతుని సంకల్పము లేకుండా కదలలేదు. భగవంతుడు దసపల్లా రాణి సాహెబా, మరియు రాజా సాహెబాలకు సంకల్పం కలిగించి వారి విలువైన భూమిని కోటగిరిలో చాలా తక్కువ ఖరీదుకి శాంతి కేంద్ర స్థాపనకు ఇచ్చేలా చేశాడు. ప్రపంచంలోని వారందరి హృదయాలకి శాంతిని ప్రసారం చేయటము భగవంతుని కార్యమే కదా!

లక్ష్మీ కుటీరము ప్రధానమయిన భవనము, అందులో నాలుగు పడక గదులున్నాయి. ప్రతి దానికి స్నానపు గది, అలంకరించుకునే గది ఉంటాయి. అతిథులు ఉండేందుకు

పెద్ద హాలు, రెండు వరండాలు, భోజనశాల, దానికి అనుబంధంగా వంటశాల ఉన్నాయి. అంతేకాకుండా ఇంకొక కుటీరములో పడక గది, స్నానపు గది కూర్చోవడానికి వేరే గది, వంటగది. పనిచేసేవారికి విడిగా గదులు ఆరు కుటుంబాలు ఉండేందుకు అనువుగా ఉంది. అన్ని గదుల్లో మంచి ఖరీదయిన వస్తువులు, సామగ్రి ఉన్నాయి. లక్ష్మి కుటీరానికి ఆరు ఎకరాల భూమి, చక్కని ఉద్యానవనము, ఫియర్ వృక్షాలుండేవి.

కోటగిరిలోని మా శాంతి కేంద్రాన్ని శాంతికి నిజమయిన నిలయంగా, దేవాలయంలాగా తీర్చిదిద్దాలని, సత్యాన్వేషకులందరికి తూర్పు పడమర దేశాల వారికి అన్ని దేశాల వారికి, మతాల వారికి స్థానం కల్పించాలని సంకల్పించాము. ముందుగా గ్రంథాలయము, అందులో ఎన్నో ఆధ్యాత్మిక గ్రంథాలుంచాము, చదువుకోవడానికి ప్రత్యేకంగా ఒక గది, ప్రశాంతంగా ధ్యానము చేసుకోవడానికి ధ్యాన మందిరము ఏర్పాటు చేశాము.

## శాంతి కేంద్రము ఆదర్శాలు

1. ప్రపంచంలోని అన్ని మతాలు వేరువేరుగా వ్యక్తపరిచినప్పటికి, అన్ని మతాల సారాంశము ఒక్కటే సత్యము లేదా యథార్థము అయి ఉంది.

2. మన ఉనికికి న్యాయం చేయాలంటే భగవంతుని సన్నిధిని మన లోపల, బయటా, ఇప్పుడు, ఇక్కడే అనుభూతి చెందాలి.

3. మనము సంతోషంగా, ఆనందంగా ఉండాలంటే భౌతికమయిన దేహముతో సంపర్కము కాకుండా భగవంతునిలో సంపర్కము కల్గి ఉండాలి. దేహ స్పృహ మనకు దుఃఖాన్ని కలిగిస్తుంది.

4. మన అహంకారాన్ని అణిచివేయడానికి మనస్సును నియంత్రణలో ఉంచు కోవటానికి ప్రాణాయామముతో కూడిన ధ్యానము అభ్యసించాలి. దాని వలన వ్యక్తిగత శాంతి లభిస్తుంది. ఆ శాంతి ప్రపంచ దేశాల మధ్య శాంతి సామరస్యాలకి దారితీస్తుంది.

5. ఆత్మసాక్షాత్కారము లేదా పరిపూర్ణత్వము అనేది సమస్త మానవాళికి సేవలందించడం ద్వారా భగవంతుని గుర్తించిన వారు మాత్రమే నిస్వార్థ పూరితమయిన సేవలందించ గలుగుతారు.

6. ఇతరులపై ఆధారపడటము, నిస్సహాయత మొదలైన పెడత్రోవ పట్టించే విషయాలను పూర్తిగా వదిలించుకుని తనలోనే నెలకొనివున్న దివ్యత్వాన్ని గుర్తించాలి.

7. అందరూ కూడా ఈ శాంతి కేంద్రంలో జరిగే కార్యక్రమాలకి ఆహ్వానితులే. వారు తమ స్నేహితులను, సన్నిహితులను శాంతి కార్యక్రమాల్లో పాలుపంచుకొనేందుకు తీసుకురావచ్చు. ప్రపంచంలోని ఏ బజారులో దొరకని అమూల్యమయిన ధనాన్ని వెచ్చించినా కూడా దొరకని శాంతిని ఇక్కడ మీరు ఉచితంగా పొందవచ్చును. అన్ని మతాలకి చెందిన ఆత్మ స్వరూపులు వారి వారి ఆరాధనా పద్ధతుల్లో భగవంతుని ఆరాధనలో పాలుపంచుకోవచ్చును. ఎందుకంటే అన్ని మార్గాలు ఒకే గమ్యాన్ని చేరుకుంటాయి. నదులన్నీ చివరికి సముద్రాన్ని చేరుకున్నట్లుగా.

8. "భగవంతునితో కలిసి జీవించు, అలా జీవించటం కోసం ఇతరులకు సహాయం చేయి" ఇదే శ్రీ శాంతి ఆశ్రమము యొక్క ఆదర్శము. ఆశ్రమము ప్రారంభించి నలభై అయిదు సంవత్సరాలు అయింది. భగవంతుడే మనలందరినీ సృష్టించాడు కదా!

భగవంతునికి మనము ధన్యవాదాలు సమర్పించుకోవాలి. ఇంత అద్భుతమైన కానుక మనకి ప్రసాదించినందుకు. మానవ ప్రయత్నంతో పనులు నెరవేరాలి అంటే దానికి ఎంతో కష్టపడాలి. ఎన్నో ఇబ్బందులు, ఆటంకాలు ఎదుర్కోవాలి. కాని ఎప్పుడయితే భగవంతుడు మనలను ఆశీర్వదిస్తాడో అప్పుడు మనము చేసే మంచి పనులు సంతోషంగా, తేలికగా, ప్రణాళికాబద్ధంగా జరుగుతాయి. మానవ ప్రయత్నాలు ఎలా ఉంటాయంటే, మండు వేసవిలో తాటి ఆకులతో చేసిన విసనకర్రతో విసురుకున్నట్లుగా ఉంటాయి. భగవంతుని అనుగ్రహము ఎలాంటిది అంటే ప్రాణం పోసే చల్లని గాలి లాగా, దివ్యత్వం నింపుకున్న పిల్లగాలిగా, చల్లగా, ఉల్లాసంగా ఎలాంటి శ్రమ ప్రయత్నం లేకుండా అందరికీ మలయమారుతంలా అందే చల్లని గాలిలా ఉంటుంది.

భగవంతుని లీలలు ఊహించలేని విధంగా, పరమ అద్భుతంగా ఉంటాయి. మానవుని పరిమితమయిన ఊహకి అవి అందవు. ఆయన మనలను ఎన్నుకొని చక్కని పరికరాల్లాగా ఉపయోగించుకుంటాడు. లక్ష్మీ కుటీరం మొదట్లో ఒక నెల రోజుల కోసం ఇచ్చారు. రెండవ సంవత్సరం రెండు నెలల పాటు శాంతి కార్యక్రమాల కోసం ఇచ్చారు. మూడవ

సంవత్సరం వచ్చేసరికి దాన్ని శాంతి కేంద్రం నిర్వహిస్తున్న కార్యక్రమాల కోసం శాశ్వతంగా ఇచ్చివేశారు.

మేము ఆ అందమయిన ప్రశాంతమయిన లక్ష్మీ కుటీరాన్ని దాని చుట్టూ ఉన్న భూమిని కొన్నప్పుడు దయాగుణము గల జమిందారు నాతో "స్వామీజీ! మీరు దేవుని కార్యాన్ని జరిపిస్తున్నారు. అందువలన కుటీరాన్ని, భూమిని కూడా మీకు ఉచితంగా ఇచ్చివేయాలని మా మనస్సులో ఉంది కానీ దురదృష్టవశాత్తూ మేము అలా ఇవ్వలేము. అందువలన అందులోని ఖరీదయిన సామాన్లకు కొద్ది మొత్తము వెలకట్టి ఇవ్వండి. దానితోనే మేము తృప్తి పడతాము" అని చెప్పాడు. దాని కోసము ఫలానా తారీఖు లోపల డబ్బు ఇవ్వాలని నిర్ణయించారు. మేము వారికి దాని కోసము ఇరవై వేల రూపాయలు ఇవ్వడానికి అంగీకరించాము.

నా నలభై నాలుగు సంవత్సరాల జీవితకాలము చేసిన పనులు అన్నీ ఆశ్రమాలు, వాటి ఆస్తులు అన్నీ కూడా కమిటీ పేరు మీదే రిజిష్టరు చేశాము. కమిటీలోని సభ్యులందరూ మంచి పేరున్నవారు, నిస్వార్థపరులు, అంకితమయిన మనస్సు గల ఆత్మ స్వరూపులు. ఓంకార్ స్వామీజీకి ఏమి చెందవు. ఇంకా చెప్పాలంటే స్వామీజీ జీవించి లేరు. కేవలము 'ఓంకారము' మాత్రమే జీవించి ఉంది. ప్రతి ఒక్కరిలో తనను తాను తెలియ చేసుకుంటున్నారు. అలాగే కోటగిరిలోని శాంతి కేంద్రము కూడా కమిటీ పేరు మీదే రిజిష్టరు చేయబడింది. అది సోదర సోదరీమణులయిన భక్తులందరికి సమానంగా చెందుతుంది. ఎలాంటి విశ్వాస బేధము, దేశ, జాతి బేధాలు ఉండవు. మేనేజింగ్ కమిటీలో కూడా నా పేరు లేదు. నేను సంతోషంగా, స్వతంత్రంగా, స్వేచ్ఛగా ఒక పక్షిలాగా జీవించాలనుకుంటాను. అందుకే ఏదీ నాకు చెందదు. అన్నీ మీకే చెందుతాయి. స్వామీజీ మరణించారు. కేవలము ఓంకార్ మాత్రమే మీ అందరి కోసం జీవించి ఉన్నారు.

ఒక మంచి రోజున లలితాదేవి ప్రార్థనా మందిరానికి శంకుస్థాపన చేసింది. కోటగిరిలోని భక్త బృందమంతా విశ్వశాంతి కార్యక్రమానికి హాజరయ్యారు. మేమందరము కలిసి పూజలు, భజనలు, ప్రార్థనలు మొదలయినవి చేసి భగవంతుని దివ్యానుగ్రహము కోసం ఈ గొప్పకార్యము విజయవంతం కావాలని ప్రార్థించాము. ధ్యాన మందిరం పూర్తి అయిన తర్వాత అందులో ఆరు వందల మంది కూర్చోవటానికి అవకాశం

ఏర్పడింది. ఎంతో విలక్షణమయిన ప్రత్యేకతలున్న విశ్వశాంతి చిహ్నము అన్ని మత విశ్వాసాలకు ప్రతీకగా దేవాలయంలో నెలకొల్పాము. రంగు రంగుల దీపాలతో అలంకరించి భక్తుల హృదయాల్లో ఆనందాన్ని విశ్వాసాన్ని నింపాము.

విశ్వశాంతి ధ్యాన మందిరంలో ప్రక్కనే దానిని ఆనుకొని నాలుగు గదులు సాధువులు, మహాత్ములు విడిది చేసేందుకు వీలుగా ఏర్పరిచాము. ఒక ప్రత్యేకమయిన గ్రంథాలయము, హాస్పిటలు దానిని ఆనుకొని ఉన్నాయి. విశ్వశాంతి చిహ్నము వింత వింత రంగుల దీపాలతో వెలిగిపోతూ భగవంతుని బిడ్డలందరికీ వెలుగును ప్రసాదిస్తుంది. సాధువులు, గృహస్థులు, పండితులు, పామరులు, ధనవంతులు, పేదవారు, ఆరోగ్యవంతులు, రోగులు అనే భేదము లేకుండా అందరికీ విశ్వశాంతి చిహ్నము వెలుగులు ప్రసాదించుగాక!

ఓం...ఓం...ఓం...

అధ్యాయం - 60

## సోదరి సుశీలాదేవి జ్ఞాపకార్థం - డిసెంబర్ 1957 - నివాళులు

వేలమంది ఆశ్రమ భక్తులు భారతదేశ వ్యాప్తంగా మరియు విదేశాల్లోని వారు కూడా సోదరి సుశీలాదేవి ఆకస్మిక మరణవార్త విని నిర్ఘాంతపోయారు. ఆమె భౌతికంగా ఈ లోకంలో జీవించిలేకపోయినా ఆత్మ స్వరూపంగా ఇప్పుడు ఇంకా ఎక్కువగా అందరి హృదయాల్లో జీవించే ఉన్నారు.

ఆమె యవ్వనంలోనే శాంతి కార్యకలాపాలకి తన జీవితాన్ని అంకితం చేసి, భారతమాత బిడ్డలకి, బాధితులకు, రోగులకు సంవత్సరాలుగా ఎన్నో సేవలందించారు. ఆమె నిరంతరము కష్టపడి, చిరునవ్వుతో నిస్వార్థంగా, ఉచితంగా సేవలు చేసేవారు. పేరు ప్రఖ్యాతులు గల సర్జన్లు డా॥ ఎం.సి. కిన్ని గారితో, డా॥ సి.కె. ప్రసాదరావు గారితో, డా॥ జానాదేవన్ గారితో అలాగే డా॥ రమణ గారితో కలిసి పనిచేశారు. వాల్తేరులోని శాంతి కేంద్రములోని వైద్యశాలలో వీరికి సహాయకారిగా సేవలందించారు.

తన తల్లిగారి ఆరోగ్యం చూసుకోవడానికి అమెరికా వెళ్ళిన సోదరి సుశీలాదేవి త్వరలోనే తన సొంత ఇల్లు అని భావించే భారతదేశానికి తిరిగి రావాలనుకున్నారు. చాలా సంవత్సరాలు ప్రయత్నించారు, కానీ ఎప్పుడూ ఆమె ఇంటిలో ఎవరో ఒకరు జబ్బు పడటం వలన వారికి సేవలందిస్తూ ఉండిపోయారు. చివరికి ఈ సంవత్సరము భారతదేశానికి తిరిగి రావాలని నిర్ణయించుకొని అందుకు అవసరమయిన ఏర్పాట్లు అన్నీ పూర్తి చేసుకున్నారు. ఇండియన్ ఎంబసీ మరియు యు.ఎస్.ఎ. ప్రభుత్వం నుండి అనుమతి పొందారు.

న్యూయార్క్ నగరంలో ఒక సమావేశంలో పాల్గొని తన సోదరుడితో కలిసి తన ఇంటికి న్యూజెర్సీకి తిరిగి ప్రయాణమయ్యారు. ఆమె సోదరి చార్లెట్టు వద్ద నుండి అందిన సమాచారం చూచి మేమందరము నిర్ఘాంతపోయాము. అందులో ఇలా ఉంది. "సోదరుడు ఓంకార్ గారికి ప్రణామాలు, మీకు ఇలాంటి చెడు సమాచారం అందించవలసి వచ్చినందుకు నేను చాలా విచారిస్తున్నాను. నా ప్రియమయిన సోదరి, సోదరుడు నిన్న రాత్రి న్యూయార్క్ నుండి తిరిగి వస్తుండగా ఇంటికి సమీపంలోనే కారు విపరీతమయిన వేగంతో వచ్చి గుద్దటం వలన వెంటనే ప్రమాదస్థలంలోనే మరణించారు. ఒక వైద్యుడు వెంటనే వారి వద్దకు పరుగెత్తుకొని వెళ్ళాడు కాని వారు అప్పటికే మరణించారు. నేను ఇంకా అందులో నుండి బయట పడలేదు. కూర్చుని ఏడుస్తూనే ఉన్నాను.

క్లెయిర్, మీ సోదరి సుశీలా చాలా సంతోషకరమయిన జన్మదినాన్ని జరుపుకుంది. మీ వద్ద నుండి ఉత్తరము, ఆశీస్సులు అందుకుని ఈ శీతాకాలంలో భారతదేశము రావటానికి సమాయత్తమయింది. నేను వారిద్దరిని చాలా కోల్పోయాను. నవంబరు 19వ తేదీన ఆమెను సమాధి చేస్తున్నాము. నా సోదరి భారతదేశంలో ఉన్నప్పుడు మీరు ఆమెపట్ల చూపించిన ప్రేమానురాగాలకు నా ధన్యవాదాలు.

ఈ సమాచారానికి బదులుగా ఎంతో బాధతో ఆమెకు టెలిగ్రాము సందేశము పంపించాము. "భారతదేశము తన ప్రగాఢ సానుభూతిని ప్రకటిస్తోంది. మీ ఉత్తరానికి ధన్యవాదాలు. ధైర్యంగా ఉండు. భగవంతుని సన్నిధిని అనుభూతి చెందు. ఉత్తరాలు వ్రాస్తుంటాను – ఓంకార్."

సుశీలాదేవి జన్మదినము నవంబరు 9వ తేదీన ఆమె ఇంట్లో యు.ఎస్.ఎ. అలాగే ఆశ్రమములో కూడా జరపబడుతోంది. ఆమె తన ఆఖరి ఉత్తరాన్ని నవంబరు 13వ తేదీ రాత్రి 8 గంటలకు పంపించింది. అందులో ఆమె తొందరలోనే భారతదేశానికి వస్తున్నట్లుగా వ్రాసింది. ఆ తర్వాత రాత్రి ఆమె ప్రమాదవశాత్తూ తన ప్రియమయిన సోదరుడు ఫ్రాంక్‌తో కూడా మరణించింది. ఆమెను నవంబరు 19వ తేదీన సమాధి చేశారు. అంతా పది రోజుల కాలములో పూర్తి అయిపోయింది. ఈ భౌతికమయిన జీవితము నిజంగా ఎంత అనిత్యమయినది. కాని అంతర్ముఖ జీవితము, ఆధ్యాత్మికంగా శాశ్వతమయినది, అనంతమయినది. భగవంతుని లీలలు చిత్రంగా, అనూహ్యంగా ఉంటాయి. మన సంకల్పాలు కాకుండా భగవంతుని సంకల్పము ఎప్పుడు పనిచేస్తుంటుంది.

ఆశ్రమ వాసులందరికీ ఈ బాధాకరమయిన ప్రమాదవార్త ఎంతో భయంకరంగా, ఆశనిపాతంలా ఉంది. హృదయవిదారకమయిన, తిరిగి మళ్ళీ పూడ్చుకోలేనటువంటి ఈ లోటు ఆశ్రమానికి, భారతమాతకు ఎంతో భారమయినది. ఆమె భారతదేశంలో నివసించినంత కాలం తన పూర్తి జీవితాన్ని అంకితం చేసింది. రామేశ్వరంనుండి హిమాలయాల దాకా భారతదేశమంతా ఆమె పర్యటనలు చేసి, అన్ని ముఖ్యమయిన ప్రదేశాలను సందర్శించి, భగవంతుని బిడ్డలందరి హృదయాల్లో శాంతి బీజాలను జాతి, మత, కుల భేదము లేకుండా నాటింది.

ఆధ్యాత్మిక ప్రపంచంలో, స్వామి నారాయణన్ శ్రీ రామతీర్థ గారి ముఖ్య శిష్యులు. న్యూయార్క్ నగరానికి చెందిన రామకృష్ణ మఠం స్వామీజీ బోధానంద గారు, అలాగే స్వామి యోగానంద గారు, దివ్యజీవన సంఘం వ్యవస్థాపకులయిన స్వామి శివానంద గారు, ఆనందాశ్రమాధిపతులు స్వామి రామదాస్ గారు, స్వామి రాజేశ్వరానంద గారు, ఇంకా అనేక మంది ఇతర స్వామీజీలు అందరికీ సుశీలాదేవి పట్ల ఎంతో గౌరవము, ఆదరాభిమానాలు ఉండేవి. ఆమె అంకితమయిన జీవితము పట్ల నిస్వార్థమయిన సేవల పట్ల వారికి ఎంతో పూజ్యభావముండేది. అదే స్ఫూర్తితో ఆమె తిరిగి భారతదేశము వచ్చి గొప్ప కార్యాలు చేయాలనుకుంది. హా! ఇంక మనము ప్రేమమూర్తి అయిన సుశీలాదేవిని చూడలేము. ఆమె భారతదేశానికే కాకుండా అమెరికా దేశానికి కూడా గొప్ప వరం లాంటిది.

కన్నీరు రావటం లేదు. దాని వలన ఆమెకి గాని, మనకి గాని ఎలాంటి ప్రయోజనము లేదు. ఆమె ఖాళీ చేసిన స్థలం వైపు నేను ఎంతో గొప్ప స్ఫూర్తితో చూస్తుంటాను. నేనిప్పుడు ఇంకా దగ్గరగా ఉన్నట్లుగా భావిస్తుంటాను. ఆమె ప్రేమమయ ఆత్మను అనుభూతి చెందుతుంటాను. విచారించడానికి బదులుగా ఆమె ప్రేమ, దయ, సేవ, కరుణ ఇంతకు ముందు కంటే ఎక్కువగా నాలో ప్రవేశించి నాకు స్ఫూర్తిని అందిస్తున్నట్లుగా అనిపిస్తోంది. మన భౌతిక దేహము జీవించిన చోట కంటే మన మనస్సు జీవించిన చోట మనము నిజంగా బ్రతికి ఉన్నట్లు అని పెద్దలు చెపుతారు. ఆమె దేహము యు.ఎస్.ఎ.లో ఉన్నప్పటికీ, ఆమె హృదయము, మనస్సు, ఆత్మ భారతదేశములోనే ఉంది. ఆమె చేసిన నిరుపమానమయిన సేవల ద్వారా, జంతువులకు, రోగులకు, పేదలకి, దేవుని బిడ్డలందరికి సేవలందించింది. అన్నింటికి అతీతమయిన స్థితికి చేరుకున్న వారు మరణించిన తర్వాత వారి ఆత్మ భగవంతునిలో లీనమవుతుంది అని చెపుతారు.

భగవంతుడు ఎక్కడ ఉన్నాడు? ఈ భూమి మీద మన శరీరాల్లో ఆయన నివసించి ఉన్నాడు. అందువలన ఆమె ఆత్మ మనందరిలోనూ ప్రవేశించి మనతోనే ఉంది అనటం ఎంతో సహజమయిన విషయం.

సుశీలాదేవి విశ్వప్రేమ, నిస్వార్థ సేవలు నాకు శుక మహర్షిని గుర్తుకు తెస్తాయి. శుకదేవుడు ఇల్లు వదిలి అరణ్యాల్లోనికి తపస్సు, కఠోరమయిన నియమాలతో కూడిన సాధనలు చేయటానికి వెళ్ళాడు. అతని వృద్ధుడయిన తండ్రి పుత్రుడి పట్ల మమకారముతో అతని వెంట వెళుతూ ఆర్తితో పిలవసాగాడు. "శుకా, శుకా, శుకా" అని. అప్పుడు వ్యాసుడు ఆశ్చర్యపడేవిధంగా ప్రకృతిలోని కొండలు, సరస్సులు, చెట్లు, పొదలు అతని పిలుపుకి స్పందించాయి. ప్రకృతిలోని అణువణువు సమాధానమిస్తోంది. శుకునికి బదులుగా, ఎందుకంటే శుకుడు ఒక దేహానికి పరిమితమయిన వాడు కాదు అని. అతను విశ్వప్రేమ కోసం జీవిస్తున్నాడని, అందరి గురించి అనుభూతి చెందుతాడని, అందరిని సమానంగా ప్రేమిస్తాడని ఇది ఋజువు చేస్తోంది. మన సుశీల జీవితం కూడా నిజంగా అలాంటిదే. ఆమె దగ్గర ఏముందో, దానిని అందరితో పంచుకునేది. పేదవారితో, రోగులతో అందరితో పంచుకునేది. కుడిచేతితో చేసినపని ఎడమచేతికి తెలియనిచ్చేది కాదు. నిస్సహాయులందరికి సేవలందించేది. ఆమె ప్రేమతో జీవించడానికి


SERVICE OF MAN
SRI SANTI ASHRAM

ప్రయత్నించేది. అందరి గురించి బాధపడేది. ఆమె ప్రేమకు అందరూ పాత్రులయ్యారు. ఆమె ఎవ్వరినీ వదిలిపెట్టలేదు.

నా హృదయం ఆమె జ్ఞాపకాలతో బరువెక్కిపోగా నేను చుట్టూ చూశాను. ఆమె ప్రేమ, ఆమె ఉనికి నాకు కొండ కోనల్లో, చెట్లలో, పుట్టల్లో, పొదల్లో, పక్షుల కిలకిలారావాల్లో వికసించిన పూల సుగంధాలలో, చిన్ని పిల్లిపిల్ల అరుపులో, పసిపాప చిరునవ్వులో అంతటా కనిపించసాగింది. మనకు అంతటా ఆమె ఉనికి, ప్రేమ అనుభవంలోనికి వస్తున్నాయంటే ఆమె వాటన్నింటిలోనూ, ఆయా రూపాల్లో దర్శనమిస్తోందంటే ఆమె అంతటా ప్రవేశించింది? అన్ని బంధాల నుండి విముక్తి పొందిన ఆత్మలు దేహాన్ని వీడి నామ రూపాలను వదిలి గాలి బుడగలాగా అనంతమయిన సముద్రము లాంటి భగవంతునిలో చేరుకుంటారని మనకు పెద్దలు చెప్పారు కదా?

ఆమె జీవించి ఉన్నప్పుడు పలు పనులు చేసేది, ఊపిరిపీల్చేది, భగవంతుని బిడ్డలందరికి సేవలందించాలని కలలు కనేది. ఇప్పుడు మరణించినా, దేహము వదిలి మారిపోయినా ఆమె ఇంకా తాను వదిలి పెట్టి వెళ్ళిన మానవ సేవ గురించే కలలు కంటుంది.

ఏ విధంగా మనము ఆమె ప్రియమయిన జ్ఞాపకాలకు శాశ్వతత్వాన్ని ఇవ్వగలము? మన వద్ద నున్న సంచార వైద్యశాలను ప్రారంభించబోతున్నాము. అలాగే శాంతి వ్యాను ద్వారా ఆధ్యాత్మిక ప్రచారము చేయాలి. అది పల్లె పల్లెలకూ, ఒక పట్టణం నుండి వేరొక పట్టణానికి తిరిగి అందరి హృదయంలో శాంతిని నింపి ప్రతి వ్యక్తికి, వ్యక్తిగతంగా ఆధ్యాత్మికంగా ఎదగటానికి, వారి కుటుంబాలను స్వర్గసీమగా మార్చుకునేందుకు సహాయపడుతుంది. ఆ శాంతి వ్యానుకి "సుశీలా శాంతి వ్యాను" అని పేరు పెట్టాము. దానిని కొనటానికి సుశీలాదేవి ఇరవై ఐదు వేల రూపాయలు పంపించింది. శాంతి ఆశ్రమము వృద్ధి చెందాలని ఆమె కోరిక. ఇక తొందరలోనే పూర్తికావస్తున్న వైద్యశాలకు కూడా "సుశీలా వైద్యశాల" అని పేరు పెట్టాలని నిర్ణయించుకున్నాము. ఆమె అసలయిన అమెరికా పేరు సెయింట్ క్లెయిర్ నోవాల్డు అందువలన వైద్యశాలలోని ప్రసూతి విభాగానికి 'సెయింట్ క్లెయిర్ మెటర్నటీ వార్డ్' అని పేరు పెట్టాలనుకున్నాము. ఆమె ఇప్పుడు మాతో ఇంకా ఎక్కువగా ఉంది. అందువల్ల ఆమె భక్తులయిన స్నేహితులందరూ ఆమె కలలను సాకారము చేయటం చూచి ఎంతో సంతోషిస్తుంది.

ఈ ప్రపంచంలోనికి మనము ఖాళీ చేతులతో నిరుపేదలుగా వచ్చాము. ఈ ప్రపంచము నుండి మనము ఖాళీ చేతులతో నిరుపేదలుగానే వెళ్ళిపోతాము. మనము ఇతరులకు చేసిన సహాయము మనలను వెంబడించి మనతో వస్తుంది.

నేను సుశీలాదేవి భక్తులయిన స్నేహితులను, శ్రేయోభిలాషులను ఆమె కోసం ప్రార్థించవలసిందిగా అభ్యర్థిస్తున్నాను. ఆమె ప్రియమయిన కలలు అన్నీ కార్యరూపం దాల్చాలని కోరుకుంటున్నాను. సుశీల వైద్యశాల, చాలా గొప్ప సహాయకారిగా ఇక్కడి అందమయిన కొండకోనల్లోని నిరుపేదలయిన రోగుల అవసరాలు తీరుస్తుంది. ఇక్కడ వైద్యం అనేది పూర్తిగా అందుబాటులో లేదు. అందువలన వైద్యశాలని సుశీలాదేవి పేరుతో అంకితం చేస్తున్నాము. ప్రియ సోదరి జీవించే ఉంది మాతో కలిసి. ఇంతకు ముందు కంటే ఎక్కువగా పనిచేస్తోంది. వైభవమంతా ఆ పరమాత్మదే. తూర్పు పడమర దేశాల్లోని దేవుని బిడ్డలందరికి శాంతి లభించుగాక! ఆమెన్.

ఓం శాంతి ... ఓం శాంతి ... ఓం శాంతి...

అధ్యాయం - 61

# సోహం బంధ విమోచనానికి దారితీస్తుంది

ఒక పర్యాయము శాంతి ఆశ్రమములో సుశీలాదేవి నాతో ఇలా అంది. “మీకు తెలుసా స్వామీజీ? మీ సందేశాల సారాంశమంతా మన శాంతి పత్రిక అట్టమీదే ఉంది. నేను ఎప్పుడు “శ్వాస పీల్చి వదిలేటప్పుడు శాంతిని పొందండి” అనే మాటలు చూచినా నాకు ఇంతకంటే ఎక్కువగా చదవటానికి గాని, చెప్పటానికి గాని లేదు అనిపిస్తుంది. అందువలన మనము “సోహం” సాధన చేసినప్పుడు ప్రతి శ్వాసలోనూ, ఊపిరి లోపలికి పీల్చినప్పుడు శాంతి, అలాగే ఊపిరి బయటికి వదిలినప్పుడూ శాంతి, శ్వాస పీల్చినపుడు క్రాంతి, అలాగే ఊపిరి వదిలినప్పుడూ క్రాంతి, ఈ విధంగా మనము తేలికగా పరమాత్మను చేరుకోగల్గుతాము. మన లోపల వెలుగుతున్న ఆ జ్యోతి స్వరూపాన్ని, మన ఆత్మను, మానవ జీవితానికి గమ్యస్థానాన్ని చేరుకోగల్గుతాము.”

పాశ్చాత్య దేశాల్లోని శాస్త్రవేత్తలు వారి జీవితాలను అంకితము చేసి ఎన్నో పరిశోధనలు చేస్తుంటారు. భౌతికమయిన పదార్థాల గురించి అవగాహన కోసమూ, ప్రకృతిలోని పదార్థాల గురించి తెలుసుకోవడానికి వారు పరిశోధిస్తుంటారు. అదే విధంగా మన తూర్పుదేశాల్లో దివ్యత్వాన్ని నింపుకొన్న శాస్త్రవేత్తలున్నారు. వారినే యోగులు అంటారు. ఈ భౌతిక ప్రపంచంలోని నామరూపాలను త్యజించి, కీకారణ్యాల్లోకి వెళ్ళి అక్కడ ఏకాగ్రతతో ధ్యానంలో నిమగ్నమయి పగలురాత్రి తేడా లేకుండా తపస్సులో లీనమయి పోయి, వారు పొందిన దివ్యానుభవాలను సామాన్యులకు ఉపయోగపడే విధంగా సాయం చేస్తుంటారు. అటామిక్ బాంబును తయారుచేసే శాస్త్రవేత్తల మాదిరిగా, నిరంతరము ప్రయోగాలతో తీరిక లేకుండా కాలం గడిపినట్లుగా మన యోగులు కూడా ఆత్మశక్తిని వారి అంతర్ముఖ జీవన విధానం ద్వారా వెలికితీసి ఆత్మసాక్షాత్కారం పొందుతారు.

మన ప్రాచీన యోగులు వారి అనుభవం ద్వారా ప్రతి మానవుడు రోజుకి 21,600 సార్లు శ్వాస పీల్చి వదులుతాడు అని గ్రహించారు. వారి అవగాహన పూర్తిగా యథార్థమని నేటి ఆధునిక శాస్త్రవేత్తలు కూడా అంగీకరించారు. అందువలన "సోహం" అనేది ప్రతి వ్యక్తిలోనూ ఉంది. వారు మగవారు అయినా లేదా ఆడవారు అయినా, పిల్లలయినా, పక్షిలోనూ, పురుగులోనూ, చెట్లలో కూడా సోహం ఉంది. అదే అందరికి అనంతమయిన శక్తిని అందిస్తోంది. ఇదే నిత్యమయిన సత్యము. ఈ సృష్టిలోని ప్రకృతి అంతటా ఆవరించుకుని ఉన్న మహాశక్తి ఆ సోహంకారమే. ఇది కేవలము భారతదేశము లోని యోగిపుంగవులకు మాత్రమే పరిమితము కాదు. ప్రపంచంలోని భగవంతుని బిడ్డలందరికి సమానంగా జన్మహక్కు అయిఉంది. జాతి, మతము, రంగు, రూపు లాంటి ఎలాంటి బేధాలు లేకుండా అందరికి చెందుతుంది. ఇది ఎంతో అద్భుతంగా ఉంది, అందరిని ఏకం చేస్తూ, దగ్గర చేస్తూ, శాశ్వతంగా ఒక్కటిగా చేస్తుంది. అది మనందరికి జీవితాన్ని ప్రసాదిస్తుంది. అందరికి దివ్యత్వాన్ని అందిస్తుంది. అది విశ్వంలోని అందరిని ఒకరితో ఒకరిని కలిపి ఏకం చేస్తుంది.

మనము శ్వాస లోపలికి తీసుకున్నప్పుడు 'సో' అని వినిపిస్తుంది. అలాగే శ్వాసను బయటికి వదిలినప్పుడు 'హమ్' అని వినిపిస్తుంది. 'సో' అంటే అది ఆ దివ్యత్వము భగవతత్త్వము మరియు అది సూర్యునికే సూర్యుడయిన పరమాత్మనే సూచిస్తుంది. 'హమ్'

అంటే అది నీవే అయి ఉన్నావు అని అర్థము. 'నేను' అంటే ఈ సృష్టి అని సూచిస్తుంది. అంటే పరమాత్మకు ప్రతిరూపము అని అర్థము.

మన ప్రతి శ్వాసలోనూ రాత్రి పగలు కూడా మనకు తెలిసినా, తెలియకపోయినా మనము 'సోహము' అని పదే పదే అంటున్నాము. 'ఆ దివ్యత్వమే నేను'. 'సోహము' యొక్క సారమంతా ఓంకారములోనే ఇమిడి ఉంది. అది భూత, భవిష్యత్తు, వర్తమానాలను ఆవరించి ఉంది. మనము నడుస్తున్నా, నిద్రపోతున్నా, కలలు కంటున్నా 'సోహం' జరుగుతూనే ఉంటుంది. అది చిట్టచివరికి మనలను కాలానికి, స్థలానికి, కారణానికి అతీతమయిన స్థితికి చేరుస్తుంది. ఇదే నిజమయిన సత్యము. అంతర్ముఖ జీవితాన్ని గడిపే ఆత్మజ్ఞానులయిన శాస్త్రవేత్తలకు మాత్రమే ఉన్నతమయిన ఆలోచనలు, ముఖ్యమయిన, యథార్థమయిన తత్త్వము అర్థమవుతుంది అంతేకాని భౌతికమయిన పదార్థాల గురించి, భౌతికమయిన బాహ్య జీవనాన్ని గురించి అధ్యయనం చేసే విద్యార్థికి అవి అర్థం కావు. అయినా గొప్ప విషయం ఏమిటంటే సత్యము శాశ్వతమయినది, భగవంతుడు సర్వాంతర్యామి. ఎవరయినా అతడిని తెలుసుకోగల్గుతారు, అనుభూతి చెందగల్గుతారు. ఎప్పుడయితే నిరంతరము పరిశీలన చేస్తూ ఉంటారో అప్పుడే అది సాధ్యపడుతుంది.

మన మత సంబంధమయిన గ్రంథాలు మనకు చెప్పేది ఏమిటంటే, మహోన్నతమయిన అతీత తాత్త్విక చింతనా మార్గము, దానిని మీరు ఏ పేరుతో పిలవడానికి ఇష్టపడినా, అది అన్నింటికి అతీతమయినది. తెలుసుకోవటము లేదా తెలియకపోవటము రెంటికి అతీతమయినది. అది కేవలము ఈశ్వరుని అనుగ్రహము చేత మాత్రమే అవగాహనకి వస్తుంది. 'నేతి, నేతి' అంటే 'ఇది కాదు, ఇది కాదు' అంటూ నామ రూపాలన్నింటికి అతీతంగా ప్రతి దానిని వేరు చేస్తూ అర్థం చేసుకోవాలి.

ప్రియమయిన పాఠకుల్లారా! మీరు ఈ అధ్యాయాన్ని చదివేటప్పుడు, ఇప్పుడే ఒక్కసారి దయచేసి మీ కళ్ళు ఒక్క క్షణం మూసుకొని శ్వాస లోపలికి, బయటికి వచ్చేటప్పుడు ఆ ధ్వనిని నిశ్శబ్దంగా గమనించండి. శ్వాసలోపలికి తీసుకున్నప్పుడూ, అలాగే శ్వాసను బయటికి వదిలి పెట్టినప్పుడు శ్వాస పీల్చినప్పుడు 'సో' అంటే 'అది' అనగా ఆ దివ్యత్వము అలాగే శ్వాసకు బయటికి వదిలిపెట్టినప్పుడు 'హమ్' అనగా అది నేనే అయి ఉన్నాను.

నేను మళ్ళీ ఈ ఆలోచన గురించి పదే పదే చెపుతున్నాను. నిజమయిన సత్యాన్ని మీ మనస్సులో గాఢంగా నాటుకోవాలని, ఈ అధ్యాయంలోని సారాంశమంతా ఇందులోనే ఇమిడి ఉంది.

మంత్రాలన్నింటికి మూలమయిన మహా మంత్రము 'సోహమ్'. అది ఎంతో శక్తిమంతమయినది, పవిత్రమయినది అని నిర్ధారణగా చెప్పవచ్చును. ఎందువల్లనంటే అది ఎలాంటి ప్రయత్నము చేయకుండానే లోపలా, బయటా కూడా జరుగుతుంది. అందువల్ల 'సోహమ్'ని 'అజప గాయత్రి' అని అంటారు. 'అజప' అంటే మన ప్రయత్నం లేకుండా దానంతట అదే పదే పదే మననము అయ్యే మంత్రము. అది ఎల్లప్పుడూ, అత్యంత సహజంగా జరిగిపోతుంది. ఈ పవిత్రమయిన మంత్రము కేవలము యోగులకు, జ్ఞానులకు, తెలివయిన వారికి మాత్రమే పరిమితము కాదు. అది ఏ మతము వారికయినా, సర్వసాధారణమయిన భక్తులకయినా సౌకర్యాన్ని మనస్సుకు ఊరటని, శాంతిని ఇస్తుంది. ఎందుకంటే వారు తమ ప్రతి శ్వాసలోని ఉచ్ఛ్వాస నిస్వాసల్లో తమ ఇష్ట దేవత రూపాన్ని, నామాన్ని గుర్తు చేసుకుంటారు. అది విగ్రహమయినా లేదా దేవత అయినా కావచ్చు. ఉదాహరణకి ఒకరికి రాముడు అంటే ఆరాధన ఉంటే వారు శ్వాస తీసుకొనేటప్పుడు 'రా' అని, శ్వాస విడిచేటప్పుడు 'మ' అని భావన చేస్తూ చిట్టచివరికి శ్రీరాముడిలో ఐక్యమయిపోతాడు. ఆయనే తేజస్సుకు తేజస్సు, పరంజ్యోతి స్వరూపుడు. అదేవిధంగా వివిధ మత సంప్రదాయాలకు చెందిన వారు ఆయా దేవతలను ఆరాధించేవారు జీసస్, కృష్ణుడు, అల్లా మొదలైన పేర్లను, రూపాన్ని వారి ప్రతి శ్వాసలో అనుభూతి చెందుతారు. ఆ విధంగా తూర్పు, పడమర దేశాల్లోని మత సంప్రదాయాలన్నీ కూడా మన ప్రతి శ్వాసలోనూ భగవంతుడు ఉన్నాడని చెపుతున్నాయి.

ఇంకా ముందుకు వెళితే, ప్రకృతిని ఆరాధించేవారు, తమకు దేవుని గురించి ఏమి తెలియదు కేవలము భౌతిక ప్రపంచం గురించి మాత్రమే తెలుసు అని నమ్మే వ్యక్తులు, నాస్తికులు అంటే దేవుని పట్ల ఏ మాత్రము నమ్మకము లేనివారు కూడా 'సోహమ్'ని అనుభవించవచ్చు. ఎందుకంటే వారికి కూడా శాంతి, ప్రేమ, తేజస్సు కావాలి కదా! అలాంటప్పుడు వారు శాంతి అనే పదం మీద ధ్యానము చేయవచ్చును. లేదా ఇంకేదయినా వారికి ఉపకరించే ఆలోచన మీద ధ్యానము చేయవచ్చును. వారి ప్రతి శ్వాస మీద

దృష్టిని కేంద్రీకరించి ధ్యానము చేసినప్పుడు, వారు కూడా వారి పద్ధతిలో. వారిదయిన జీవన మార్గంలోనే మానవ జీవిత గమ్యాన్ని చేరుకొని వారి జన్మహక్కును పొందవచ్చును.

భగవంతుని సన్నిధిని అనుభవంలోనికి తెచ్చుకోవటం ఎంత అద్భుతమయిన విషయం!! ఎంతో దగ్గరగా, ఆయన కంటే మనము ఏ మాత్రము వేరు కాదు అనే దివ్యానుభూతిని పొందటం నిజంగా ఎంతో అదృష్టం. అయినప్పటికి మనము అజ్ఞానంతో నిజమయిన జీవితాన్ని వదిలిపెట్టి నీటి ఒడ్డున పడి గిలగిలా తన్నుకొనే చేప మాదిరిగా భౌతిక జీవితంతో సతమతమవుతున్నాము. చేప సముద్రంలోనే ఉంటే అది దాహంతో, ఆకలితో చనిపోవల్సిన పని ఉండదు. అదేవిధంగా మానవునికి కూడా ఆకలి దప్పులతో బాధపడవలసిన పని ఉండదు. ఎప్పుడయితే అతను దివ్య జీవనాన్ని నింపుకుంటాడో, సత్, చిత్, ఆనందంలో మునిగిపోతాడో, జ్ఞానము, సచ్చిదానందము, కంటికి కనబడనటువంటి ఆ పరమాత్ముని దివ్యానుభవాన్ని పొందిన వారికి ఎలాంటి తాపత్రయాలు ఉండవు.

అనాది కాలము నుండి మన భారతీయ ఋషి పుంగవులు, సాధువులు సంపుటాలు తర్వాత సంపుటాలుగా అనేక గ్రంథాలు ఈ ముఖ్యమయిన విషయం గురించే వ్రాస్తూ వస్తున్నారు. కానీ వాటిలో ఏ ఒక్క సంపుటాన్ని కూడా మనము యథార్థంగా ఆచరణలో పెట్టడం లేదు. ఆచరణ లేకుండా వాటిలో దేనిని మనము అర్థం చేసుకోవటం సాధ్యం కాదు. అవసరమయినదల్లా ఏమిటంటే నిత్య జీవితంలో అనుక్షణము ఏకత్వాన్ని అనుభవించి అందులో మునిగిపోవాలి. కాని దానిని ఏ విధంగా మొదలుపెట్టాలి? ఏ విధంగా ముందుకు ప్రయాణించాలి? అదంతా కూడా నీవు నీ ప్రతి శ్వాసలోనూ ఊపిరి పీల్చినపుడు, ఊపిరి వదిలినప్పుడూ కూడా ఆ 'సోహం భావం' అనుక్షణము గమనిస్తూ ఉండాలి. దానికి ఎలాంటి ఆటంకము ఉండకూడదు. తైలధార లాగా ఉండాలి. నూనెను ఒక గిన్నెలో నుండి ఇంకొక గిన్నెలోకి పోసినప్పుడు ఎడతెగకుండా ఎలా ఉంటుందో ఆ విధంగా ఉండాలి.

"నిశ్చలంగా ఉండు. నీవే ఆ దైవము అని గుర్తించు" ఆ నిశ్చలత్వము మౌనంలోనే నీ ఆత్మలో నీవు నీలో ఉన్న ఆ దివ్యత్వాన్ని గుర్తించగల్గుతావు. "అది నేనే అయి ఉన్నాను" అదే జీవిత సత్యము అని నీవు పగలు రాత్రి తేడా లేకుండా నిరంతరాయంగా నీ ప్రతి శ్వాసలోనూ అనుభూతి చెందాలి. నీవు ఆ సత్యము, తేజస్సు, దివ్యత్వము, ప్రపంచానికి

వెలుగువి, సూర్యునికే సూర్యుడివి, ఆ పరమాత్మవి అయి ఉన్నావు. ఆ విధంగా సాధన చేయాలి. ప్రతి రోజు కొద్దిసేపు ఆ విధంగా సాధన చేయటం వలన నీవు సంతోషంగా, పరిపూర్ణంగా ఉంటావు. అమరము, శాశ్వతమయిన దివ్యానంద మకరందాన్ని గాఢంగా త్రాగి ఈ జీవితంలోనే ముక్తిని పొందుతావు. అది నీ జన్మహక్కు.

'సోహమ్' సాధన చాలా సహజంగా, తేలికగా, ఎలాంటి ఇబ్బంది లేకుండా ఎవరయినా చేయవచ్చును. చిన్నపిల్లలు, ముసలివాళ్ళు కూడా చేయవచ్చు. ఇది ఎలాంటి ప్రయత్నము లేని ధ్యానస్థితి. చాలా కొద్దిపాటి ప్రయత్నము చాలు. ఈ ధ్యానము శాంతియుతమయినది. చాలా సహజమయినది, ఎలాంటి ప్రయత్నము అక్కరలేనిది, శ్రావ్యమైనది కావటం వలన మనస్సుకు ఆరోగ్యాన్ని, ఆత్మకు శాంతిని ప్రసాదిస్తుంది. ఈ ధ్యాన సాధనలో పురోగతి సాధిస్తున్నప్పుడు సాధకుడు తాను ఎలాంటి ప్రయత్నము చేయవలసిన అవసరం అసలు ఉండదని అర్థం చేసుకుంటాడు. తన శ్వాసకు తానే సాక్షిగా మారి గమనిస్తుంటాడు. అప్పుడు మొత్తం విశ్వమంతా సముద్రంలో అలలు లీనమయినట్లుగా తనలో లీనమయిపోయి, తన ఉనికి అనేది పూర్తిగా మర్చిపోయి సర్వాంతర్యామిలో, నిత్యమయిన శాశ్వతమయిన సత్యంలో, పరమశ్రేష్ఠమయిన, మహత్తరమయిన సాక్షాత్కారము పొందుతాడు.

ఈ 'సోహమ్' సందేశములో శ్రీ రామతీర్థ గారు, అన్ని బంధాల నుండి విముక్తి పొందిన పరమాత్మానుభవము పొందిన ఆత్మజ్ఞాన సంపన్నులు వ్రాసిన సందేశము కూడా పొందుపర్చకపోతే అది అసంపూర్తి అవుతుంది. వారి సందేశము 'సోహమ్' గురించి వారి మాటల్లోనే చెపుతాను.

'సో' అది నేను – అదే నేను అయి ఉన్నాను

భగవంతుడు నేను – దివ్యత్వము నేనై ఉన్నాను

ఏకంగా నేను ఉన్నాను – శక్తిసంపన్నుడను నేను అయి ఉన్నాను

ఇక ముగింపుకు వచ్చేముందు, నా పాఠకులందరితో ఒక చిన్న శ్లోకాన్ని మీతో పంచుకోవాలనుకుంటున్నాను. నా సాధన ప్రారంభ దశలో అది నాకు ఎంతగానో సహాయపడింది. ఎందుకంటే ప్రపంచంలోని అన్ని మతాల సారాంశము అందులో

ఇమిడి ఉంది. అది ఎంతో గొప్ప సందేశము. అదే చిట్టచివరి గాఢమయిన గొప్ప సందేశము. దీనిని పదే పదే మననము చేస్తూ ఉండాలి. అది తప్పకుండా సాధకులను ఉన్నతోన్నతమయిన దివ్యత్వము వైపుగా తీసుకువెళుతుంది.

**దేహో దేవాలయః ప్రోక్తో దేవః సనాతనః ।**
**త్యజేదజ్ఞాన నిర్మాల్యం సోహం భావేన పూజయేత్॥**

ఈ దేహమే భగవంతునికి దేవాలయము. జీవుడు వ్యక్తి కాదు. అతడు ఎల్లప్పుడూ బ్రహ్మమే, శాశ్వతుడు. అజ్ఞానము వలన తన స్వస్వరూపానికి దూరంగా, భిన్నంగా ఉంటున్నాడు. అందువలన దేవుడిని సోహం భావనతో పూజించు.

మన ప్రతి శ్వాస ద్వారా భగవంతుడిని ఆరాధించుదాము. ఇప్పుడు, ఎల్లప్పుడు భగవంతునితో ఏకమై ఉందాము. నీ ప్రతి శ్వాసలోనూ ఆయనే ఉన్నాడు. నీవు ఎప్పుడు గుర్తిస్తావా? అని ఎదురుచూస్తున్నాడు. ఆయన నీ ఊపిరిలో ఊపిరై ఉన్నాడు. ఈ ప్రపంచమంతా ఒక్కటిగా కలిసి ఉన్నట్లయితే, ప్రేమతో సోదర భావంతో ఏకమైనట్లయితే, ఈ భూమి మీద శాంతి నెలకొని ఉంది అంటే, వ్యక్తుల మధ్య, దేశాల మధ్య సఖ్యత నెలకొని ఉంది అంటే అది కేవలము మౌనంగా మహామంత్రమయిన 'సోహమ్' భావాన్ని ఆచరణలో పెట్టటం వల్ల మాత్రమే సాధ్యపడుతుంది. 'సోహమ్' 'అది నేనై ఉన్నాను' సోహమ్ అందరిని ఏకం చేస్తుంది. అది ఒక్కరినికూడా వదిలిపెట్టదు.

మీరు మీ లోపల అనుభూతి చెందే మీ శ్వాస, మీ ఇంటిలో గాని, ప్రశాంతంగా అంతర్ముఖమయ్యే తూర్పు దేశాల్లో గాని, ఎల్లప్పుడు భౌతిక ప్రపంచ వాసనలతో తీరిక లేకుండా కాలం గడిపే పడమర దేశాల్లోగాని అంతటా ఒకే విధంగా ఉంటుంది. ప్రపంచంలోని సోదర సోదరీమణులందరి ఉచ్ఛ్వాస నిశ్వాసలు ఒకే రకంగా 'సోహమ్' అంటూ ఉంటాయి. ఒకరు తూర్పులో ఉండవచ్చు, వేరొకరు పడమరలో ఉండవచ్చు. కొందరు చర్చిలో ఉండవచ్చు, మరికొందరు కార్యాలయంలో పనిలో నిమగ్నమయి ఉండవచ్చు. కానీ 'సోహమ్' మాత్రం నిరంతరాయంగా జరుగుతుంటుంది. ఎప్పటికీ శాశ్వతంగా ఉంటుంది. జాతి, మతము, కులము, రంగు, రూపు భేదము లేకుండా అందరినీ ఏకం చేస్తూ ఒక్కటే మానవజాతిగా ఒకే ఆధ్యాత్మిక ఆత్మజ్యోతిగా మారుస్తుంది.

నా ప్రియమయిన పాఠకులారా! నా 'సోహమ్' మిమ్మల్ని అందరినీ ఇప్పుడు బంధ విముక్తులను చేసివేసింది. మీ హృదయాలను అంతరంగ శాంతి తరంగాలతో నింపి వేసింది. ఆ విధంగా ఈ భూమి మీద శాంతి నెలకొల్పి జాతుల మధ్య, దేశాల మధ్య ఐక్యతను, సఖ్యతను నెలకొల్పుతుంది. ఇది మీ సోదరుడు ఓంకార్ యొక్క ప్రార్థన.

ఓం....ఓం....ఓం....

**అధ్యాయం - 62**

# శాంతి ప్రచారము

భగవంతుని అనంతమయిన దయ, జ్ఞానము వలన మా ఆశ్రమానికి 'పీస్‌వాన్' అందులో మైక్రోఫోన్, లౌడ్ స్పీకర్, దానితో పాటుగా సంచార వైద్యశాల సమకూర్చాడు. దాని వలన మేము శాంతి సందేశాలను ప్రేమను, ఆరోగ్యం పరిరక్షణ కోసం మందులను గ్రామ గ్రామాలకు, పట్టణాలకు సంచారము చేస్తూ అందరికి అందించగల్గుతున్నాము. అలాగే స్నేహితులకు, శాంతి ఆశ్రమ భక్తులకు కూడా సేవలందుతున్నాయి.

ఇప్పుడు మాకు నీలగిరి కొండల్లో కూడా ఒక శాంతి కేంద్రము ఏర్పడింది. కనుక అక్కడి సభ్యులు, స్నేహితుల ఆహ్వానం, కోరిక మేరకు స్వామీజీ ఆశ్రమాన్ని వదిలి ఏప్రిల్ మొదటి వారములో 1958 వ సంవత్సరంలో మా పీస్ వ్యాన్‌లో కొద్దిమంది ఆశ్రమ భక్తులు, పనివారితో కలిసి ప్రయాణం చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. అందువలన ఎవరయినా ఆశ్రమ భక్తులు, స్నేహితులు దక్షిణ ప్రాంతానికి వెళ్ళే దారిలో నివసించేవారు స్వామీజీని మరియు వారితో ఉన్నవారిని ఆహ్వానించి ఆధ్యాత్మిక కేంద్రంలో సత్సంగాలు ఏర్పాటు చేసుకోవాలని తలంపు వస్తే ఆశ్రమానికి ముందుగా తెలియచేయ వలసిందిగా అప్పుడు ఆయా కార్యక్రమాలు ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం కల్పించబడుతుంది అని ప్రకటన చేయబడింది.

మన స్వామీజీ పూర్తిగా విశ్వసిస్తారు, వ్యక్తిగత శాంతి విశ్వశాంతికి బాటలు వేస్తుందని. అందువలన ఆయన ప్రతి వ్యక్తి హృదయంలో శాంతిని నెలకొల్పాలని వారి గృహాలను

శాంతిమయం చేయాలని, అందుకోసం విశ్వశాంతి ప్రార్థనని పదే పదే మననం చేయించాలని, దాని వలన వారు భగవంతుని దివ్యానుభూతిని పొందుతారని సంకల్పించారు. స్వామీజీ ఆశయం ఏమిటంటే భక్తులకు వారి గృహాలను పూజా మందిరాలుగా భూమి మీద స్వర్గలోకం లాగా మార్చివేయాలని, అందుకు వారికి సహాయ సహకారాలు అందించాలని అనుకుంటారు.

"నిన్నటి పూమొగ్గలు ఈ రోజు వికసించిన పుష్పాలు" అన్న మాటల్లో ఎంతో సత్యముంది. స్వామీజీ ఆరు సంవత్సరాలు మౌనంగా గడిపినప్పుడు తీవ్రంగా ఆలోచించి చెప్పిన మాటలు.

ఎప్పుడయినా మీ మౌనాన్ని వీడి మాట్లాడటం మొదలుపెడితే మీరు అప్పుడు ఏమి చేస్తారు? అప్పుడు మీ కోరిక లేదా సంకల్పం ఏమిటి?

"అప్పుడు నేను శాంతి ప్రార్థనని ప్రచారము చేయడానికి ఆత్రుత పడతాను. అది నిజంగా ఒక గొప్ప శక్తిని ప్రసాదించే తాయెత్తు లాంటిది. చాలా మంది తూర్పుపడమర దేశాల్లోని శాంతి ఆశ్రమ భక్తులకు ఒక హృదయం నుండి మరొక హృదయానికి, గ్రామాల్లో, పట్టణాల్లో, ప్రపంచమంతటా ప్రచారము చేయాలని ఉంది. **ప్రపంచమంతా నా సొంత ఇల్లు లాంటిది. అందులో నివసించే ప్రజలందరూ మనకు సోదర సోదరీమణుల వంటి వారు. వాళ్ళకి సేవ చేయటమే మన నిజమయిన మతము.**"

ఆ విధంగా స్వామీజీ మౌనంగా ఉపవాస దీక్షలో ఉన్న సమయంలో ఏదయితే సంకల్పం చేశారో అదేవిధంగా వారు ప్రేమ, శాంతి బీజాలను దగ్గరివారికి, దూరంలో ఉన్నవారి హృదయాల్లో, భక్తుల హృదయాల్లో నాటుతున్నారు.

విజ్ఞులయిన పెద్దలు ఈ ప్రపంచంలో రెండు రకాల వ్యక్తులుంటారని చెపుతారు. భౌతికంగా మరణించినా శాశ్వతంగా ఈ ప్రపంచంలో జీవించి ఉండేవారు ఒకరయితే, ఇక రెండవ వారు కేవలం భౌతికంగా జీవించి ఉంటారు కానీ ఆధ్యాత్మికంగా వారు మరణించిన వారితో సమానము.

జీవించి ఉండగా, సుశీలాదేవి కేవలము మంచి పనులు చేయటానికే బ్రతికింది. భగవంతుని బిడ్డలందరికీ హృదయాల్లో ప్రేమ, శాంతి బీజాలను నాటింది. ఆమె భౌతికంగా జీవించి లేకపోయినా ఇప్పుడు కూడా 'పీస్ వ్యాన్' ద్వారా మంచి పనులు చేయడానికి దోహదపడుతోంది. మానవుడు సృష్టించుకున్న జాతి మత భేదాలు లేకుండా

రంగు, రూపు, దేశము, ప్రాంతము తేడా లేకుండా దేవుని బిడ్డలందరికి సేవలు అందించగల్గుతున్నాము. ఈ 'పీస్ వ్యాన్' సుశీలాదేవి ఇచ్చిన ప్రత్యేకమయిన కానుక. అందువలన సహజంగానే మేము దానికి 'సుశీలా పీస్ వ్యాన్' అని పేరు పెట్టాము.

ఆమె జీవితంలో అమూల్యమయిన ఇరవై అయిదు సంవత్సరాల కాలాన్ని ఆశ్రమ సేవలకి అంకితం చేసింది. ఆమె ఆశ్రమానికి ఎన్నో కానుకలు అందించింది. అవన్నీ ఆమె హృదయానికి అత్యంత ఆత్మీయమైనవి. వాల్తేరు ఆశ్రమంలో సుశీలా కుటీరం ఉంది. తోటపల్లి ఆశ్రమంలో సుశీలా మందిరం గత నలభై రోజుల్లో రూపుదిద్దుకుంది. ఇప్పుడు ఆ మందిరంలో విదేశాల నుండి వచ్చిన అతిథులు, స్నేహితులు ఎంతో సౌకర్యంగా బస చేస్తున్నారు. ఇక ఆమె చివరి కానుక ఈ ప్రపంచాన్ని వదిలిపెట్టే ముందు ఆశ్రమానికి ఇచ్చినది ఈ 'పీస్ వ్యాన్'.

అందువలన ఆమె గౌరవపూర్వకమైన జ్ఞాపకాలతో మేము మా ప్రయాణాన్ని పీస్‌వ్యాన్‌లో జూన్ 8వ తేది 1958లో కోటగిరి నీలగిరి కొండల్లో నెలకొన్ని ఉన్న కేంద్రానికి మొత్తం పన్నెండు మందిమి బయలుదేరాము. వారిలో సంగీతము నేర్పించే గురువు, ఇంకా ఆరుగురు విద్యార్థులు కూడా ఉన్నారు. మేము దాదాపు వేయి మైళ్ళ దూరం ప్రయాణించాము. భగవంతుని అనుగ్రహముతో దారి పొడగునా అనేక మంది భక్తుల హృదయాల్లో శాంతి బీజాలు నాటాము.

ప్రపంచములోని సంపద అంతా నాకే చెందుతుంది. మనమందరము భగవంతుని చేతిలో ఉన్నాము. అందువలన దైవకార్యాలను దైవమే ఎవరో ఒకరి ద్వారా, ఏదో ఒక మార్గంలో చేయించుకుంటాడు. మా ప్రయాణంలో మేము ఇరవై రెండు బహిరంగ సమావేశాలు, ముప్పై నాలుగు గృహాల్లో సత్సంగాలు నిర్వహించాము. దాదాపు నాలుగువేల రూపాయలు వివిధ ఆశ్రమ కార్యక్రమాల నిమిత్తమై ఖర్చు చేశాము. పెదపూడి అనే గ్రామంలోని భక్త కుటుంబము వారు వారి బిడ్డ అయిన చంద్రశేఖర్‌ను ఆశ్రమ గురుకులానికి ఇచ్చారు. మా ప్రయాణంలో ఎవరు ఆయనకు పూలదండ వేసినా ఆయన దానిని 'పీస్‌వ్యాన్'కి వేసేవారు. సుశీలాదేవికి ఆ దండను వేస్తున్నట్లుగా ఆయన చెప్పారు.

ఓం... ఓం... ఓం...

## అధ్యాయం - 63

# సేవలోని వైభవము

మార్చి 1958లో తూర్పుగోదావరి జిల్లా బోర్డ్ వారు చాలా దయతో తోటపల్లి ఆశ్రమంలో వైద్యశాల నిర్మాణం నిమిత్తమై 14 వేల రూపాయలు విరాళంగా ఇచ్చారు. మేము వారికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియచేసుకుంటున్నాము. ఆశ్రమము తరఫున వైద్యశాల నిర్మాణానికి అందులో నాల్గవ వంతు భాగము 3,500 రూపాయలు మాత్రమే ఇవ్వగలిగాము. 'సెంట్రల్ సోషల్ వెల్ఫేర్ బోర్డు' నుండి 15 వేల రూపాయలు సంచార వైద్యశాల నిమిత్తము ఇచ్చారు. దానితో ఇంజను కొన్నాము. మిగిలిన భాగాలు భక్తుల నుండి విరాళాలు సేకరించి కొన్నాము. ఎంతో అంకితభావముతో శాంతి ప్రచారము కోసం మెడికల్ ఆఫీసర్ తన సేవలను ఉచితంగా అందించడానికి అంగీకరించారు.

1959 అక్టోబర్ నాటికి వైద్యశాల నిర్మాణము పూర్తి అయ్యింది. అలాగే పంచాయితీ సమితి వారు అందులో వైద్యసేవలు ప్రారంభించారు. ఆశ్రమము చుట్టు ప్రక్కల దాదాపు ఇరవై, ఇరవై అయిదు గ్రామాల ప్రజలకు దీని వలన వైద్యసేవలు అందుబాటులోనికి వచ్చాయి. ఇంక ఆశ్రమానికి వైద్యం నిమిత్తం రాలేని వారి కోసం సంచార వైద్యశాల, వ్యాన్ ద్వారా అక్కడికి వెళ్ళి ఆయా గ్రామాల ప్రజలకు మందులు, వైద్యసేవలు అందించే వారము.

గ్రామాల్లోకి వెళ్ళినప్పుడు వ్యాన్‌లో వచ్చిన పిల్లలు భగవంతుని కీర్తిస్తూ సంకీర్తనలు, భజనలు చేసేవారు. అది విన్న గ్రామస్థులందరూ చుట్టూ గుమిగూడేవారు. అప్పుడు వైద్యుడు, నర్సులు అక్కడి వారందరి అవసరాలు అడిగి తెలుసుకుని వారికి అవసరమయిన వైద్య సహాయం అందించేవారు. వారిలో ఎవరికయినా ప్రత్యేకమయిన జాగ్రత్తలు తీసుకోవాల్సి వచ్చినా వైద్యశాలలో చేర్పించవలసి వచ్చినా వారిని వ్యాన్‌లో దగ్గరలోని వైద్యశాలలో చేర్పించేవారము. ఇక వ్యాన్‌లో వచ్చిన విద్యార్థులు గ్రామమంతా తిరిగి గ్రామస్థులకు పారిశుద్ధ్యం గురించి చెప్పి, వారి సహాయం తీసుకుని వారితో కలిసి గ్రామమంతా శుభ్రం చేసేవారు. వైద్యులు, నర్సులు గ్రామస్థులకు పారిశుద్ధ్యం గురించి అవగాహన కల్పిస్తూ పరిసరాలను ఎలా శుభ్రంగా ఉంచుకోవాలి, వారి గృహాలను,

గ్రామాన్ని ఎలా పరిశుభ్రంగా ఉంచుకోవాలో, అలాగే వ్యక్తిగత శుభ్రత గురించి వారికి వివరంగా తెలియచెప్పేవారు.

ఆరోగ్యాన్ని జాగ్రత్తగా పరిరక్షించుకోవటం గురించి చక్కని ఉపన్యాసాలు కూడా ఉండేవి. సాధారణంగా వచ్చే జబ్బుల గురించి, వాటి గురించి కాపాడుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి చెప్పేవారు. ఆరోగ్య పరిరక్షణ, వైద్యసేవలు అందించిన అనంతరము గ్రామములోని కూడలిలో సమావేశము ఏర్పాటు చేసేవారు. అలాంటి సమావేశాల్లో పూజ్యశ్రీ ఓంకార్ స్వామీజీ గారి సందేశాలను చదివి వినిపించేవారు. అవకాశము, సమయము బట్టి చక్కని భక్తి గీతాలను కూడా ఆలపించేవారు. చివరిలో విశ్వశాంతి ప్రార్థనని చెప్పి ఆ సమావేశాన్ని ముగించేవారు.

ఆశ్రమము ఈ నిస్వార్థమయిన సేవలను ఎలాంటి గౌరవాలు, పురస్కారాలు ఆశించి చేయటం లేదు. అయితే అవన్నీ కూడా దయాగుణం గల వ్యక్తుల సహకారము తోనే సాధ్యపడింది. ఇంకా ఇంకా విరాళాలు అవసరముంది. కేవలము మందులు, వైద్య పరికరాలు ఉంటే సరిపోదు. వైద్యసేవలు అందించాలంటే, మొబైల్ వ్యాన్ నడిపించడానికి పెట్రోల్ కావాలి. అలాగే డ్రైవరు, క్లీనరు, కాంపౌండరు, నర్సులు మొదలైన వారికి నెలవారి జీతాలు ఇవ్వాలి. అందువలన శాంతి మిషన్ దీని కోసం మానవతా దృక్పథంతో విరాళాలు ఇచ్చే దాతల కోసం ఎదురుచూస్తోంది. మా సంచార వైద్యశాల ద్వారా జరిగే సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకునే గొప్ప అవకాశం తద్వారా వారికి కూడా లభిస్తుంది. మందులు తయారుచేసేవారు, వాటిని ప్రచారము చేసేవారు కూడా ఈ సేవా కార్యక్రమంలో పాలుపంచుకుంటూ మందులను ఉచితంగా అందించేవారు.

నలభై సంవత్సరాల అనుభవం గల గొప్ప వైద్యుడు డా॥ మార్కండేయ గారి గురించి నేను మీకు తప్పకుండా చెప్పాలి. ఆయన చేబ్రోలు డిస్పెన్సరీకి రూరల్ మెడికల్ ఆఫీసర్‌గా వచ్చారు. ఆయన అర్థరాత్రి దాకా గ్రామాల్లో తిరుగుతూ పనిచేస్తుండేవారు. మా ప్రాంతంలో రూరల్ మెడికల్ ఆఫీసర్ లేనందువలన ప్రభుత్వము ఆయనని మా డిస్పెన్సరీని కూడా చూసుకోవాల్సిందిగా ఆదేశించింది. అందువలన ఆయన వారానికి రెండుసార్లు వచ్చేవారు. రోగులు బండ్లు కట్టుకుని ఆయన చల్లని చేతుల ద్వారా వైద్యం పొందటానికి దగ్గరి నుండే కాకుండా దూర ప్రాంతాల నుండి కూడా వచ్చేవారు. ఆయన ఎంతటి అంకితభావం గల వైద్యుడంటే, ఒక పర్యాయం ఆయన స్వయంగా జబ్బుపడి ఎంతో

బాధపడుతున్నప్పటికీ మా ఆశ్రమంలోని ఒక రోగికి వైద్యం చేయటం కోసం చీకటిలో ఐదు మైళ్ళ దూరం నడిచి వచ్చారు. మా ఆశ్రమవాసి ఆయన కోసం ఎడ్లబండి, లాంతరుతో వెళ్ళటం మరిచిపోయినా, ఆయనే శ్రమపడి వచ్చారు. ఆయన నిరుపమానమయిన సేవ జీవనం అలాంటిది. మా ఆశ్రమము ఎంతో పుణ్యం చేసుకుంది, అలాంటి సేవా దృక్పథము, అంకితభావము గల వైద్యుడిని పొందటానికి.

మా హృదయాలు సంతోషంతో ఉప్పొంగిపోతున్నాయి. మా విశ్వశాంతి ప్రార్థన బాగా ప్రచారమవుతున్నది. కారాగృహంలో నిర్బంధంలో ఉండే ఖైదీలు కూడా శాంతి ప్రార్థనలు చేస్తున్నారు. అందరూ మనవాళ్ళే కదా!

ప్రభుత్వము ఆశ్రమం తరుఫున మా శాంతి మిషన్‌కి విశాఖపట్టణములోని కారాగారములోని ఖైదీలకు ఆధ్యాత్మికమయిన బోధలు, సూచనలు ఇవ్వమని ఆదేశించింది. మా వాల్తేరు ఆశ్రమము మేనేజరు శ్రీ బి.వి. రమణనాయుడు గారు ఆ ఖైదీలకు సహాయం చేయడానికి నిర్ణయించుకుని వారికి తరగతులు నిర్వహించారు. మేము ఆనందంతో ఆశ్చర్యపడే విధంగా ఖైదీలు ఎంతో ఆసక్తితో అవన్నీ చక్కగా నేర్చుకున్నారు. శాంతి ప్రార్థన వారిని ఎంతగా ప్రభావితం చేసిందంటే, వారిలో కొందరు దానిని ఫోటో కట్టించుకున్నారు. మరికొందరు ఖైదీలకిచ్చే నంబరు చుట్టూ మెడలో వేసుకున్నారు. భగవంతుడు ఎంత మంచివాడు!!

సిమెందు గోడలు జైలును నిర్మించలేవు. మన మనస్సును మార్చుకుంటే జైలు కూడా స్వర్గంలాగా మారిపోతుంది. అంతా ఆ ఈశ్వరుని వైభవమే. ఇది శాంతి యొక్క వైభవము. భగవంతుడు విశాఖపట్టణంలోని జైలులోని ఖైదీలకు సుదీర్ఘమయిన జీవనాన్ని ప్రసాదించుగాక!

## ఆశ్రమానికి బస్సు మార్గము

ఇప్పుడు కూడా అద్భుతాలు జరుగుతుంటాయి. ఆశ్రమ సభ్యులు, శ్రేయోభిలాషులు ఆశ్రమానికి బస్సు సౌకర్యము ఏర్పడటం ఒక అద్భుతంలాగా భావిస్తున్నారు. నలభై అయిదు సంవత్సరాల క్రితం 1917వ సంవత్సరంలో ఆశ్రమము ప్రారంభించినపుడు ఈ ప్రదేశమంతా భయంకరమైన కీకారణ్యంలాగా ఉండేది. అన్ని రకాల క్రూర మృగాలు పగలు కూడా యథేచ్ఛగా సంచరిస్తుండేవి. చిరుత పులులు, తోడేళ్ళు, ఎలుగుబంట్లు

మొదలయినవి తరుచుగా కనబడేవి. ఒక చిన్న పూరిపాక కూడా లేదు. ఒకే ఒక మామిడిచెట్టు చల్లని నీడలో నివసించేవాడిని. రాత్రివేళల్లో చెట్టుపై ఉయ్యాల కట్టుకొని నిద్రించేవాడిని. ఆ ప్రదేశంలో మండ్రగబ్బలు, తేళ్ళు, కాళ్ళజెర్రిలు అన్ని రకాల విషసర్పాలు తిరుగుతుండేవి. ఒక పెద్ద పాము పుట్ట మొదట్లో కూర్చుని నేను ధ్యానము చేసుకునేవాడిని. ఆ రోజుల్లో ఎంతో స్వేచ్ఛగా, నిర్భయంగా, శాంతిగా ఉండేది.

నలభై ఐదు సంవత్సరాల కాలంలో రోడ్లు వచ్చాయి. గురుకులము కోసం ఎన్నో భవనాలు నిర్మించబడ్డాయి. అదేవిధంగా వైద్యశాల, ప్రింటింగ్ ప్రెస్, గ్రంథాలయము, ప్రార్థనా మందిరము, ఇంకా ధ్యానము చేసుకోవడానికి సాధకుల కోసం ఎన్నో కుటీరాలు, అతిథుల కోసం అతిథి గృహాలు నిర్మించబడ్డాయి. నిజంగా భగవంతుడు ఎంత మంచివాడు. మొదట్లో కనీసం నడవటానికి సరయిన దారి కూడా లేదు. ఎడ్ల బండ్లు కూడా ఒరిగిపోయి అందులో ప్రయాణించేవారు గాయాలపాలయ్యారు. అక్కడ ఇప్పుడు భగవంతుని అనుగ్రహం వలన ఎంతో నిర్భయంగా, శాంతికి నిలయంగా మారింది. విద్యుత్ దీపాలు, అందమయిన ఉద్యానవనాలు, ఇంకా ఎన్నో సౌకర్యాలు ఏర్పడ్డాయి. ఇక ఇప్పుడు ప్రత్యేకంగా ఆశ్రమానికి బస్సు సౌకర్యం కూడా ఏర్పడటం వలన ఆశ్రమవాసులకు, ఆశ్రమానికి వచ్చే అతిథులకు చాలా తేలికగా, సౌకర్యంగా ఉంది.

భౌతికమయిన విషయాల పట్ల ఆసక్తిని తగ్గించుకుని భగవంతునికి మరింతగా దగ్గరవ్వడానికి ప్రయత్నము చేద్దాము. ఎంతో విలువైన మానవజన్మ వచ్చినందుకు జీవిత గమ్యం చేరుకోవడానికి మనలోని జ్యోతి ఆరిపోకముందే ప్రయత్నం చేద్దాము.

ఓం...ఓం...ఓం...

**అధ్యాయం - 64**

# నా పూజ, భగవంతుని ఆరాధన

ఏ విధంగా అయితే వ్యక్తిగత శాంతి ప్రపంచ శాంతికి దారితీస్తుందో అదేవిధంగా వ్యక్తిగత పూజ, ఆరాధన కూడా విశ్వారాధనకి దారితీస్తుంది. మానవుడు ఎంతగా

భౌతిక ప్రపంచం నుండి విడివడి, అంతర్ముఖస్థితికి చేరిపోయినా, అతను అన్నింటికి దూరంగా, విశ్వారాధనకి కూడా దూరమయిపోడు. అలలు సముద్రాన్ని ఎన్నటికి వదిలిపెట్టవు. వ్యక్తిగత ఆరాధనలో అహంకారము విలక్షణమయిన స్థానాన్ని ఆక్రమించి ఉంటుంది. విశ్వారాధనలో అహంభావన 'నేను' అనే భావన పూర్తిగా నశించిపోతుంది. వ్యక్తిగత ఆరాధన అహంభావనతోనే మొదలయినప్పటికీ అది చివరికి విశ్వారాధనకి దారితీస్తుంది. అక్కడ మన అహంభావము విశ్వంలో పరమాత్మలో విలీనమయిపోతుంది.

ఇక్కడ నేను 'వ్యక్తిగత ఆరాధన', 'విశ్వారాధన' అనే పదాలు వాడినప్పుడు నిజానికి దాని అర్థం వ్యక్తిగతంగా ఆరాధించము లేదా విశ్వాన్ని ఆరాధించటము అని అర్థం కాదు. నేను రెండు రకాల ఆరాధనా విధానాలను గురించి చెప్పటానికి ప్రయత్నం చేస్తున్నాను. మనము వ్యక్తిగతంగా చేసుకునే పూజ ఒకటయితే, ఈ విశ్వానంతటిని పూజించటము రెండవది. అవి ఏ విధంగా వ్యక్తుల హృదయాల్లో కొనసాగిపోతూ ఉంటాయో, అలాగే విశ్వంలో బాహ్యంగా మనకు కనబడవు. ఈ అధ్యాయంలో నేను మీకు సర్వసాధారణము అయిన బాహ్య పూజలు, ఆరాధనల గురించి చెప్పాలనుకోవడం లేదు. ఇక్కడ పూజ, ఆరాధన అనగానే ఏదో ఒక విగ్రహము, దేవతారూపము, పుష్పాలు, అగరబత్తులు, దీపాలు మొదలయినవి కావు. నేను మీకు చెపుతోంది అంతరంగ పూజ గురించి, మానవుని యొక్క మహోన్నతమయిన, ఉన్నతమయిన స్థాయి గురించి చెబుతున్నాను.

ఇప్పుడు నా ప్రియమయిన పాఠకులతో నా వ్యక్తిగత అనుభవాలను గురించి పంచుకోవాలనుకుంటున్నాను.

మూడు రోజుల క్రితం, ఉషోదయ కాలంలో, ఇంకా తూర్పు దిక్కున సూర్యోదయం కాక పూర్వమే, చీకటిగా ఉండగానే నాకు కొద్ది దూరం నడవాలనిపించింది. భగవంతుని సన్నిధిని అనుభవిస్తున్నాను. ఆశ్రమము ప్రధాన ద్వారం వైపుగా నడుస్తూ తనువును నడిపించే ఆ దైవిక శక్తిని గురించి గుర్తు చేసుకుంటున్నాను. నా ప్రతి అడుగు భగవంతుని వైపుగా దారి తీస్తుంది. అది ఆయన దివ్యమయిన శక్తి, ఆత్మశక్తి శరీరంలోని ప్రతి కదలికా కూడా ఆ దేవుని శక్తితోనే జరుగుతుంది. అందువలన నేను నా ప్రమేయం లేకుండా, గాలిలో తేలిపోతున్నట్లుగా, భగవంతుని శక్తితో దూరంగా ఉన్న కొండల వైపుగా నడక సాగించాను.

నాకు తెలియకుండానే నేను దాదాపుగా తన్మయత్వంతో రెండు మైళ్ళ దూరం నడిచాను. కొండల మీద నుండి జలపాతము క్రిందనున్న శివలింగము మీద ధారగా పడే ప్రదేశానికి చేరుకున్నాను. ఆ జలపాతాన్ని 'మల్లికార్జున ధార' అంటారు. శివునికి ప్రతిరూపము. ప్రకృతిలోనిదంతా భగవంతుని ప్రతిరూపమే కనుక మానవుడు దేవుని ప్రతిమను పూజించటము ఏదో ఒక విధంగా తప్పనిసరి అవుతుంది. విగ్రహం ద్వారా అతని ఆదర్శాన్ని అతను గుర్తించగలగాలి. బాగా చదువుకున్న వ్యక్తి, నాగరికత నేర్చినవాడు విగ్రహారాధనని అంగీకరించకపోవచ్చును. అతను తన భౌతిక దేహాన్ని రక్తమాంసాలతో కూడిన శరీరాన్ని ప్రేమించి, తన బుద్ధి శక్తిని, పూజించవచ్చును. ఇక్కడ మనము జీవన్ముక్తుని గురించి మాట్లాడుకోవడం లేదు. జీవితంలో వారు అన్నింటి నుండి స్వేచ్ఛను, విముక్తిని పొందినవారు, ఈ భౌతిక దేహము, మనస్సు, ప్రపంచానికి అన్నింటికి వారు అతీతులు. అలాంటి మహాత్ములందరికీ వందనాలు.

భగవంతుడు సర్వవ్యాపకుడు. అణువణువులోనూ చొచ్చుకొనిపోయిన వాడు, యావత్తు ప్రపంచంలోనూ, విశ్వమంతటా వ్యాపించినవాడు. అది ఒక వ్యక్తి భౌతికమయిన రక్తమాంసాలతో కూడిన దేహములో కావచ్చు, లేదా బ్రహ్మాండమయిన గ్రహములోని తేజస్సులో కావచ్చును. అంతటా నిండి నిబిడీకృతమైన ఈశ్వరుడిని, ఆయన ఉనికిని అనుభూతి చెందాలి. అది అంతర్ముఖస్థితిలో కావచ్చు లేదా బాహ్యంగా ప్రపంచంలో కావచ్చు. ఆంతర్యంలోనూ, బాహ్యంలోనూ స్పష్టంగా విదితమయిన ఆ పరంజ్యోతి స్వరూపాన్ని ఒక్కటిగానే తెలుసుకోవాలి.

ఇక ఇప్పుడు నా వ్యక్తిగత అనుభవాలను గురించి చెపుతాను. నేను మౌనదీక్షలో ఉన్న కాలములో నేను పరమానందంగా నా వ్యక్తిగత పూజను మూడు పద్ధతుల్లో చేసేవాడిని. భౌతికమయిన పూజ, మానసికమయిన పూజ మరియు ఆధ్యాత్మికమయిన పూజ. వీటిని గురించి మీకు మరింత స్పష్టంగా వివరిస్తాను.

## భౌతికమయిన ఆరాధన

ప్రపంచాన్ని త్యజించిన సన్న్యాసి అయినా కూడా ఎలాంటి కదలికా లేకుండా రాయి మాదిరిగా ఉండలేడు. ప్రతిదినము ఆయన తన కార్యక్రమాలను నిర్వర్తించేటప్పుడు, పనులు చేసుకునేటప్పుడు కదులుతూనే ఉంటాడు. భోజనము చేయుటము, నడవటం,



మాట్లాడటం, త్రాగటం, చేతులు, కాళ్ళు కడుక్కోవడం, స్నానం చేయటం ఇలా ప్రతిదీ పనే. కదలికే అవుతుంది. శరీరంలో ఎలాంటి కదలిక అయినా అది ఆ కదలికలు లేకుండా నిశ్చలంగా ఉండే ఈశ్వరుడికి సమర్పించే ఆరాధనగానే భావించాలి.

అందువలన నేను నడిచేటప్పుడు భగవంతునికి ప్రదక్షిణం చేస్తున్నాను అని భావిస్తాను. ఆయన వైపుగా నడుస్తున్నానని అనుకుంటాను. నా భౌతిక దేహంతో చేసే ప్రతి పని ఈ సృష్టికర్తకు నేను సమర్పించుకుంటున్న పూజ లేదా ఆరాధన అని భావిస్తాను. ఇదే భౌతికమయిన ఆరాధన.

## మానసిక ఆరాధన

నేను ఏ విధమయిన పని చేయకుండా, ఎలాంటి కదలికలు లేకుండా, నా శరీరం స్థిరంగా, ప్రశాంతంగా నిశ్చలంగా ఉన్నప్పుడు కూడా నా బుద్ధిలో రకరకాలయిన ఆలోచనలు, ప్రణాళికలు, చేయవలసిన వాటి గురించిన ఆలోచనలు వస్తూనే ఉంటాయి. అలాంటప్పుడు ఆలోచనలు చేయటం మంచిది కాదు అని నేను నిరాశపడను. దానికి బదులుగా నా ప్రతి ఆలోచనని నేను భగవంతుడికి సమర్పించే పూజగా భావిస్తాను. నా ఆలోచనలన్నీ కూడా ఆ దేవాదిదేవుని పాదాల చెంత సమర్పించబడిన ఆరాధనా పుష్పాలు.

అగరుబత్తులు వెలిగించినప్పుడు, ఆ పొగ పైపైకి వెళ్ళి గాలిలో కలిసిపోయినప్పటికీ వాతావరణమంతటిని సుగంధ భరితం చేసినట్లుగా ఆలోచనలు కూడా అలాంటివే. సర్వాంతర్యామి, సర్వ వ్యాపకుడు, సర్వేశ్వరుడు అయిన భగవంతునికి అగరుబత్తి వెలిగించి పూజించినట్లుగా, మనలో కదిలే ఆలోచనలన్నింటిని ఆ దేవాదిదేవునికి సమర్పించటము ఎంతో అద్భుతమయిన రకరకాలయిన ఆభరణాలు తయారయినట్లుగా, భగవంతుడి నుండే అన్ని రకాల ఆలోచనలు పుడుతున్నాయి. అలాగే మానసికమయిన తరంగాలు, భగవంతుడి నుండే పుడుతున్నాయి. అక్కడికే అవి చేరుకుంటాయి. కనుక మన ఆలోచనలన్నింటినీ అవి బలహీనత అయినా గొప్ప సంకల్పము అయినా మన హృదయంలో అంతర్యామిగా కొలువై ఉన్న, విశ్వమంతా వ్యాపించిఉన్న ఈశ్వరుడికే సమర్పించుదాము.

## ఆధ్యాత్మిక ఆరాధన

అన్నింటిలోకి ఇది ఉత్తమోత్తమమయిన ఆరాధనా విధానము. మన భౌతిక శరీరము కదలికలు లేకుండా స్థిరంగా ఉన్నా, బుద్ధిలో ఆలోచనలు అటూ ఇటూ పరుగెత్తకుండా నిశ్చలస్థితి ఏర్పడినా, ఈ పవిత్రమయిన ఆరాధనలో బుద్ధిలోని ఆలోచనలు సరస్సులోని అలలు స్థిరంగా ఉన్నట్లుగా సమసిపోతాయి.

అక్కడ కేవలము ఒకే ఒక్క ఆలోచనాతరంగము ఉంటుంది. అది 'సోహం'. ఈ ఆరాధన అత్యంత సహజంగా, యాంత్రికంగా పగలురాత్రి భేదం లేకుండా జరిగిపోతుంది. నీవు చేయవలసినదల్లా ఒక్కటే, అది సాక్షిగా ఉండి గమనించటం. ఇది ఎంతో సహజంగా, మహోన్నతంగా జరిగే ప్రక్రియ. నీవు నడుస్తున్నా, నిద్రపోతున్నా, కలలు కంటున్నా కూడా ఈ ఆరాధన దానంతట అదే జరిగిపోతుంది. మౌనంగా నీవు పదే పదే ఆ భగవంతుని చిన్ని గొంతుకతో చెప్పే ఆ 'సోహం ... సోహం ... సోహం" నీ ప్రతి శ్వాసలోనూ వినవచ్చు. 'ఆ దివ్యత్వము నేనే', 'ఆ తేజస్సు నేనే', 'అంతటా నేనే నిండి ఉన్నాను', జ్ఞాన స్వరూపమై ఉన్నాను. ఆనంద స్వరూపంగా ఉన్నాను.

ఈ విధమయిన అపూర్వమయిన, అత్యున్నతమైన ఆలోచనలు కదులుతుండగా మల్లికార్జున ధార దగ్గర ఈశ్వరుని సన్నిధిలో ఒంటరిగా జలపాతం ఎదురుగా కూర్చుని ఏకధాటిగా ప్రవహిస్తున్న ఆ జలపాతము చేస్తున్న సంగీత ధ్వనులు వింటున్నాను. కొండ రాళ్ళపై నుండి జలపాతం నీటిధారలు పాయలు పాయలుగా జాలువారి చివరికి ఏకమయి ఒక చోటికి కుండపోతగా పడుతున్నాయి.

సూర్యుడు ఇంకా ఆ జలపాతం వద్ద కనిపించడం లేదు. అది చాలా లోతయిన కొండలోయ కావటం వలన. అయినా సూర్యుని యొక్క వెలుగు నెమ్మదిగా అంతటా పరుచుకోవటం మొదలుపెట్టింది. అదంతా చాలా అద్భుతంగా, ఆహ్లాదంగా అనిపించసాగింది. కొండలు, గుట్టలు, పెద్ద పెద్ద పొదవయిన వృక్షాలు, చిన్న పొదలు, చక్కగా వికసించిన పుష్పాలతో చుట్టు పక్కలంతా అందంగా పరుచుకుని ప్రకృతి ఎంతో మనోహరంగా ఉంది. పక్షుల కిలకిలారావాలు, తీయగా పాడుతున్న పిట్టలు, వాటన్నింటికన్నా జలపాతపు సవ్వడులు నాకు పవిత్రమయిన ఓంకారాన్ని గుర్తుకు

తెస్తోంది. అక్కడి వాతావరణము నిజంగా ఎంతో ఆహ్లాదకరంగా, మనస్సును రంజింప చేస్తూ, బుద్ధికి ఉత్తేజాన్ని కల్గించే విధంగా ఉంది.

నేను ఆ ప్రకృతి సౌందర్యంలో లీనమయిపోయి వ్యక్తిగతమయిన పూజను మర్చిపోయి, విశ్వపూజలో నిమగ్నమయిపోవటంలో ఆశ్చర్యం ఏముంటుంది? అక్కడ పుష్పాలు అన్నీ భగవంతుని కోసమే వికసించాయి. ప్రతిదీ తనను తాను ఈశ్వరుడికి సమర్పించు కుంటుంది. అదంతా ఈశ్వరుడి వైభవము, ఆ విశ్వరాధనలో నేను కొండల్లో నివసించే తోటపల్లి గ్రామస్థులయిన గిరిజనులు చెట్లను నరకటం, స్త్రీలు నెత్తిమీద కుండల్లో నీరు తీసుకు వెళ్ళటము, పిల్లగాళ్ళు పశువుల మందలను మేపటము గమనించాను. ఇదంతా విశ్వారాధన కాదా? స్త్రీలు, పురుషులు, బాలురు వారి వారి పనులు చేసుకోవటంలో తెలియకుండానే ఈశ్వరుడిని ఆరాధిస్తున్నారు. వారి విధులు నెరవేర్చడం కూడా ఈశ్వరుడి ఆరాధనే కదా!

చల్లగా తాకే మలయమారుతము, వెచ్చగా తాకే సూర్యుని నులివెచ్చని కిరణాలు, సముద్రపు అలలు నురగలు కక్కుతూ నాట్యమాడటము, నక్షత్రాల్లోకి మిలమిలలాడే కాంతి పుంజాలు ఇదంతా కూడా భగవంతుడిని వాటి పద్ధతిలో ఆరాధింటచమే కదా! అందువలన నేను మౌనంగా, నా వ్యక్తిగత భావనని వదిలిపెట్టి విశ్వంలో విలీనం చేసి చాలా సేపు అలా నిశ్చలంగా ఉండిపోయాను. చివరికి నేను నా కళ్ళు తెరిచినపుడు, అది నా జీవితంలోని మరుపురాని మధురమైన దివ్యానుభవాన్ని అందిస్తూ వందల కొద్దీ అందమయిన పక్షులు కిలకిలారావాలు చేస్తూ తమ మధురమయిన సంగీత ధ్వనులను, చాలా గొప్ప సహజమయిన ఆరాధనా పద్ధతిలో రకరకాల ధ్వనులను వినిపించసాగాయి.

ఆకాశంలో ఎగిరే పక్షుల నుండి మానవుడు ఎంతో నేర్చుకోవాల్సి ఉంది. అవి ఎంతో స్వేచ్ఛగా, సంతోషంగా ఎంత సహజంగా ప్రవర్తిస్తాయి? జీసస్ క్రీస్తు ఇలా చెప్పారు "పక్షులు విత్తనాలు నాటి, పంటలను పండించలేదు. ధాన్యాన్ని ప్రోగుచేసి దాచి పెట్టుకోలేదు. లేదా రేపటి కోసం కంగారు పడవు. స్వర్గలోకపు తండ్రి తన బిడ్డలందరి కోసము ఎంతో జాగ్రత్త తీసుకుంటాడు. వారు మానవులు అయినా, పక్షులయినా, పశువులయినా లేదా సృష్టిలోని అతి చిన్న, అత్యల్పమయిన ప్రాణి అయినా సరే మానవుడికి కావల్సినదల్లా భగవంతుని పట్ల విశ్వాసము మాత్రమే తన అంతర్యామిగా కొలువైన ఈశ్వరుడి పట్ల కనీసం ఆవగింజ అంతయినా విశ్వాసం కల్గి ఉండాలి."

నేను జలపాతము పాదాల చెంత అతి దగ్గరగా కూర్చుని ఉండటం వలన అది నన్ను స్నానం చేయమని ఆహ్వానిస్తున్నట్లుగా అనిపించింది. గలగలా పారుతున్న ఆ జలపాతపు నీరు నా తలను తడపసాగింది. అప్పుడు నాలో ఒక్కటే ఆలోచన, ఒక్కటే ప్రార్థన, దానిని నేను నా ప్రియమయిన పాఠకులతో పంచుకోవాలనుకుంటున్నాను.

ఏ విధంగా జలపాతం నీరు ఒక్కసారిగా ప్రవహించి, ధారగా, ఏ విధమయిన ఆటంకము లేకుండా నా మీద పడుతున్నాయో, అదే విధంగా మన బుద్ధి కూడా మహోన్నతమయిన స్థితి వైపుగా నిరంతరాయంగా, నిరాటంకముగా ప్రవహించి చివరికి ఆ విశ్వంలో విలీనమయిపోవాలి. ఈ జీవితంలోని ప్రతి శ్వాస ఈశ్వరుడికి పూజగా మారిపోవాలి. ఈశ్వరుడు నిరాకారుడు, అఖండమయిన సచ్చిదానంద స్వరూపుడు అవధులు లేని, పరిమితులు లేని పరిపూర్ణుడు, జ్ఞాన స్వరూపుడు, ఆనంద స్వరూపుడు.

ప్రతి ఒక్కరి హృదయం లోపలా, బయటా శాంతి నెలకొనుగాక! ప్రపంచమంతటా శాంతి నెలకొను గాక! సూక్ష్మ జగత్తులోనూ అదే విధంగా విశాలమయిన, సంపూర్ణమయిన స్థూల జగత్తులోనూ కూడా శాంతి నెలకొనుగాక! వ్యక్తుల మధ్య, దేశాల మధ్య, ప్రపంచంలోని ప్రతి జీవరాశి మధ్య శాంతి సౌభాగ్యాలు, సంతోషము, ఆనందము, సఖ్యత, ఐక్యత పెంపొందుగాక!

అధ్యాయం - 65

# ఉత్తర భారతదేశంలో తీర్థయాత్రలు - 1960

భగవంతుని దివ్యానుగ్రహము లేదా దివ్యానుభూతి వలన నాకు ఆశ్చర్యం కలిగించే విధంగా అందమయిన తోటపల్లి కొండలను, నిర్వాణ మందిరాన్ని వదిలిపెట్టి మా పీస్ వ్యాన్‌లో దాదాపుగా ఐదు వేల మైళ్ళ దూరాన్ని అధిగమించి ఎన్నో పవిత్రమయిన తీర్థక్షేత్రాలను, ఎందరో మహాత్ములను దర్శించగలిగాను.

ఉత్తర దేశంలోని వేలమంది భక్తులు సహకరించటము వలన పెద్ద పెద్ద సమావేశాలను ఏర్పాటు చేసి అనేక పట్టణాలలో అద్భుతంగా, ఉత్తేజభరితంగా విశ్వశాంతి ప్రార్థనలు

చేయగలిగాము. అది నిజంగా జరిగిందా లేదా కల కంటున్నామా అనిపించింది. ఒకవేళ అది కలయినా కూడా సేవ, ప్రేమ నిండిన ప్రశాంతమయిన కల అది. దానికి అన్ని విధాలయిన అనుభవాలు భౌతికమయినవి, మానసికమయినవి, అలాగే ఆధ్యాత్మిక మయినవి కూడా తోడయినాయి. అది ఎంత గొప్ప సౌభాగ్యవంతమయిన కల?!

డెబ్భై రెండు రోజులు నిజంగా డెబ్భై రెండు క్షణాల్లాగా గడిచిపోయాయి. నిజానికి అది కల అయినా లేదా వాస్తవమే అయినా నేను పొందిన భవ్యమయిన ఆధ్యాత్మిక అనుభవాలను మార్చలేను, ఎన్నటికి మర్చిపోలేను. పైగా ఈ ప్రయాణము వలన ఎందరో క్రొత్త భక్తులతో పరిచయాలు ఏర్పడి అవన్నీ కూడా ప్రపంచ శాంతికి, వైభవానికి దారితీశాయి.

గడ్డిపరక కూడా భగవంతుని ఇచ్ఛ లేకుండా కదలలేదు. ఈశ్వరుడే ఆయన బిడ్డలకు సహాయం చేసి మమ్మల్ని కంటికి రెప్పలాగా పగలు రాత్రి కూడా కాపాడాడు. మమ్మల్ని క్షేమంగా తిరిగి మా శాంతి క్షేత్రానికి చేర్చాడు. ఎన్నో క్రొత్త ఆధ్యాత్మిక అనుభవాలను అందించాడు. అదేవిధంగా ఈ ప్రపంచానికి కూడా అందాయి.

ప్రత్యేకమయిన గౌరవం మా సుశీలా పీస్ వ్యాన్‌కి దక్కుతుంది. మమ్మల్ని ఎంతో ఓపికగా అన్ని ప్రాంతాలకి తీసుకువెళ్ళింది. ఎంతో ప్రేమగా క్షేత్రాలన్నింటికి చేర్చింది. వ్యాన్ టైర్లు అరిగిపోయి, ఋషికేశ్ నుండి ఢిల్లీ వరకు రోడ్డు మార్గంలో ఎన్నో అవరోధాలను అధిగమించి చేర్చింది. దాదాపు ఐదువేల మైళ్ళ దూరం ప్రయాణించాము. వ్యాన్‌ని నడిపిన రాజాజీకి కూడా గొప్ప గౌరవం దక్కుతుంది. ఎందుకంటే బాగా కిక్కిరిసిపోయి ఉండే లక్నో ఢిల్లీ, కలకత్తా నగర వీధుల్లో అనుభవం లేకపోయినా జాగ్రత్తగా నడిపించాడు. మా వ్యాన్ అసలు డ్రైవర్ ఉత్తరదేశంలో జబ్బు పడటం వలన రాజాజి వ్యాన్‌ని నడిపించ వలసి వచ్చింది.

ఇంక మిగిలిన గౌరవము మా స్వామి గురువానందజీ గారికి, కుమారి జ్ఞానేశ్వరికి, మా సంగీత టీచరకు, ఇంకా ఇతర సభ్యులకి, మా బృందములోని పిల్లలందరికి ప్రత్యేకించి తొమ్మిది సంవత్సరముల చిన్న బాలుడు చంటి సత్యకుమార్‌కి దక్కుతుంది. ఆ బాలుడు మా మొత్తం ప్రయాణాన్ని ఆనందంగా, ఆహ్లాదం, సరదాగా గడిచిపోయేలా చేశాడు. అది శీతాకాలము కావటం వలన చిన్న పిల్లలను మా ప్రయాణంలో చేర్చుకోకూడదు



అని నిర్ణయించుకున్నాము. ఉత్తరాదిలో చలి విపరీతంగా ఉంటుంది. కాని చంటి ముందుగానే అన్నీ సర్దుకుని ఎంతో ఉత్సాహంగా ప్రయాణానికి సిద్ధమవటం వలన అతడిని నిరాశ పరచటడం ఇష్టం లేక మాతో తీసుకువచ్చాము. చంటి 'ఓం' జెండాని మా పీస్ వ్యాన్ ముందుభాగంలో ఉంచాడు. నేను తరుచుగా ఆశ్చర్యపడుతుంటాను. ఆ అమాయకపు బాలుడు పవిత్రమయిన ఓంకారము జెండాని ఉంచటం వల్లనే మేము ఎంతో సురక్షితంగా సార్‌నాథ్‌కి, హిమాలయాలకు ప్రయాణించి తిరిగి తోటపల్లికి చేరుకోగలిగాము. చంటి మాకందరికి లీడర్‌లా ఉండి మా సంగీతం టీచర్‌తో కలిసి వయోలిన్‌పై చక్కని పాటలు పాడేవాడు. పూజ్యశ్రీ స్వామి శివానంద గారు అతని విద్వత్తును గుర్తించి 'సంగీత సుధాకర' అనే బిరుదును కూడా ఇచ్చారు.

అందువలన మా ప్రయాణం చక్కగా విజయవంతం కావటానికి ముందుగా మా పీస్‌వ్యాన్, తర్వాత సభ్యులు చివరిగా చిన్ని చంటి, కారణము. నేను స్వేచ్ఛగా, హాయిగా ఎలాంటి గౌరవము లేకుండా 'జీరో'గా ఉండటానికి ఇష్టపడతాను. నా సేవా కార్యక్రమాలను ఇంతకు ముందు కంటే నిశ్శబ్దంగా, మౌనంగా నిర్వహిస్తాను. ఈ సందేశాన్ని వ్రాయడానికి ముఖ్య కారణము తీర్థయాత్రల్లో నేను పొందిన అనుభవాలను మీతో పంచుకోవటమే. మా యాత్ర భగవంతుని దర్శించటం కోసం నిర్దేశించబడింది. పవిత్రమయిన హిమాలయాల్లో భగవంతుని దివ్యదర్శనము గంగానది ఎదురుగా హరిద్వార్‌లో కలిగింది. అలాగే అక్కడి పుణ్యక్షేత్రంలో నివసించే మహాత్ములను, యోగులను, స్వామీజీలను, అనేక మతాలను, క్రొత్తవాటికి, పాతవాటిని కూడా దర్శించుకున్నాము. మా శాంతి యాత్ర అవధులు లేని ప్రేమానురాగాలు గల పరమ పూజ్య స్వామీజీ, ఉత్తేజపూరితమయిన జీవితాన్ని గడిపే సాధు పుంగవుడు, మహాత్ముడు, మమ్మల్ని ఎంతో జాగ్రత్తగా చూసుకున్న శ్రీశ్రీశ్రీ శివానంద మహరాజ్ గారి దివ్యాశీస్సులతో చక్కగా జరిగింది. ఆయన పవిత్రమయిన హిమాలయాల్లో ఉంటారు.

ఇంకొక సాధు మహాత్ముడు, వేదాంత తత్త్వబోధకుడయిన సాధు మహనీయుడు స్వామి శాంతానందగారిని కూడా మా తీర్థయాత్రలో మేము దర్శించుకున్నాము. ఆయన ఒక కొండ గుహలో నివసించేవారు. మానవాళి పట్ల ప్రేమ మూర్తీభవించిన గొప్ప దాతృత్వం గల రక్షకుడు. మేము ఢిల్లీలోని బిర్లా ధర్మశాలలో విడిది చేసిన విషయం తెలుసుకున్న స్వామి మాకు ఆశ్చర్యం కలిగించే విధంగా మా వద్దకు వచ్చి దర్శనం

ఇచ్చారు. ఆయన ప్రపంచమంతా పర్యటిస్తూ శాంతి ప్రచారం చేస్తుంటారు. భారత దేశంలోని అనేకమంది ప్రభుత్వ అధికారులు, గవర్నర్లు, ప్రెసిడెంటు మొదలైన వారందరూ స్వామీజీతో సన్నిహితంగా ఉంటారు. ఆయన చాలా గొప్ప మహనీయుడు. భగవంతుని దివ్యానుభూతిని పొందినవారు, పవిత్రమయిన ఆత్మజ్ఞాని. మా పట్ల ఎంతో ప్రేమతో దివ్యాశీస్సులను కురిపించినందుకు అనేక ధన్యవాదాలు.

మరొక తన్మయత్వం కలిగించే దివ్య క్షణము కరగ్‌పూర్‌లో ఇద్దరు పెద్దవారయిన స్వామీజీలు నాకు ఇరువైపులా కూర్చుని ఉండగా నన్ను సందేశము ఇవ్వమని కోరినప్పుడు దొరికింది. వారిద్దరు సుమారుగా డెబ్భై ఐదు సంవత్సరాల వయస్సు వారు. నేను నిజానికి వారిద్దరూ గొప్ప సందేశాన్ని ఇచ్చి ప్రజలను భగవంతుని దివ్యానుభూతిలో ముంచి తేలుస్తారని భావించాను.

భగవంతుని దివ్యానుగ్రహము, ఆశీస్సుల వలన ప్రతి స్థలములోను అది పాఠశాల అయినా, కాలేజీ అయినా, బజారులో అయినా, దేవాలయములో అయినా, ఆశ్రమం అయినా, ప్రతి సమావేశము ఎంతో వైభవంగా, విజయవంతంగా జరిగింది. భగవంతుని దివ్యమైన వైభవము వలన ప్రతి సమావేశంలో కూడా విశ్వశాంతి ప్రార్థనని వేల మంది జనంతో పదే పదే పాడించటము నాకు ఎంతో ఆనందాన్ని, సంతోషాన్ని కలగచేసింది. అది భగవంతుని దివ్యానుభూతిని అందరికి అందచేసింది. మా విశ్వశాంతి ప్రార్థన అక్కడి ప్రాంతీయ భాషల్లోకి అనువదించబడి, ప్రతి ఒక్కరికి ఉచితంగా ఇవ్వబడింది. ఈ విధంగా విశ్వశాంతి ప్రార్థనని విస్తృతంగా ప్రచారం చేయగలిగినందుకు, ఆ శాంతి ఒక హృదయం నుండి మరొక హృదయానికి వ్యాపించి పల్లెలలో, పట్టణాలలో ప్రపంచమంతటా వ్యాప్తి చెందింది.

మరొక అద్భుతమయిన అవకాశం లభించింది. పవిత్రమయిన హిమాలయాల్లో రెండు పర్యాయాలు అలాంటి అరుదయిన అవకాశం లభించింది. అది విద్యార్థులకో, అధ్యాపకులకో లేదా గృహస్థులకో ఇచ్చిన సందేశము కాదు. సాక్షాత్తు యోగులకు, స్వామీజీలకు, మహాత్ములకు, భగవంతుని దివ్యానుభూతిని సాక్షాత్కరించుకున్న సాధు మహాత్ములకు సాధు మాతలకు ఇచ్చిన సందేశము. ఆ విధంగా నేను నా లోపల అంతర్యామిగా కొలువైన ఈశ్వరుడికి నా ప్రార్థనలను సమర్పించుకున్నాను.

"భగవాన్! ఈ రోజు నేను ఈ మహాత్ములందరితో మాట్లాడాలని అనుకుంటున్నాను. వారందరికి సహాయపడాలనుకుంటున్నాను. వీరిలో ప్రతి ఒక్కరికి సహాయం చేయాలని ఉంది. నేను నా ఉనికిని, దివ్యానుభూతిని అణువణువులోనూ, శరీరంలోని ప్రతి కణజాలము లోనూ అనుభూతి చెందుతున్నాను. నీవే మమ్మల్ని నడిపిస్తున్నావు.

సర్వము తెలిసిన ఈశ్వరుడే, సర్వాంతర్యామియైన పరమేశ్వరుడే ఈ వినయపూర్వక మయిన పరికరము ద్వారా తన బిడ్డలందరికి తన దివ్యానుభూతి కలిగే విధంగా మాట్లాడించాడు. ఎంత మంచి విషయం. భగవంతుడు ఎంత ప్రేమమూర్తి, తల్లి కంటే, తండ్రి కంటే కూడా ఈశ్వరుడు తన బిడ్డలను ఎంతో జాగ్రత్తగా సంరక్షిస్తుంటాడు. ఎంతో ప్రేమానురాగాలతో చూస్తుంటాడు. ఎందుకంటే భగవంతుడు అంటే ప్రేమ. ప్రేమ అంటే భగవంతుడు. రెండింటికీ భేదం లేదు. వైభవమంతా ఈశ్వరుడిదే అవుతుంది.

నలభై ఎనిమిది సంవత్సరాలకు పూర్వము నేను బాలుడిగా ఉండగా ఒంటరిగా, అందమైన ఆహ్లాదకరమైన ప్రదేశాలలో ధ్యానములో కాలము గడిపిన ప్రదేశాలన్నింటిని మళ్ళీ దర్శించటము నాకు ఎంతో మధురానుభూతిని కలిగించింది. హిమాలయాల్లో ప్రత్యేకించి స్వర్గాశ్రమంలో దివ్యమయిన జీవితాన్ని గడిపాను. పవిత్రమయిన గంగానది ఒడ్డున కూర్చుని మహోన్నతమయిన హిమగిరులను చూస్తూ ఉంటే కలిగే దివ్యానుభవాన్ని మాటల్లో వివరించి, వర్ణించి చెప్పటం ఎవరికీ సాధ్యం కాదు. నేను నిజంగానే ఈ భూమి మీద లేకుండా భగవంతుని ఒడిలో కూర్చుని ఉన్నట్లుగా అనుభూతి చెందసాగాను.

మా తీర్థయాత్ర భగవంతుని వైపుగా సాగింది. భగవంతునిలోనికి, భగవంతుని కోసం, ఆయన దివ్యమయిన ప్రేమలో మునిగి ఓలలాడినాము. అన్నివైపుల నుండి, అన్ని ప్రదేశాల నుండి పరమాత్ముడి దివ్యమయిన ప్రేమ మమ్మల్ని చుట్టుముట్టింది. భగవంతుని దివ్యానుభూతిలో జీవించటము ఎంత అదృష్టము.

మేము భగవంతునిలో ఉండిపోయాము. భగవంతుడు మాలో ఉన్నాడు. సర్వాంతర్యామి, సర్వవ్యాపకుడు అయిన ఈశ్వరుడు మమ్మల్ని చుట్టుముట్టి మా లోపలంతా నిండిపోయాడు. ఆయన దివ్యశక్తి మా అణువణువులో నిండిపోయి మా జీవితాల్లోకి ప్రతిక్షణం ఆయన కార్యాలను చేయించుకుంది. అసలు భగవంతునికంటే వేరుగా ఒక్క క్షణమయినా, గతంలో గాని, వర్తమానంలోగాని, భవిష్యత్తులో గాని ఉండగలమా?

ఎంత అదృష్టవంతులము. ఆత్మను మేల్కొలుపుతూ ప్రతి క్షణమూ మా జీవితాలను ధన్యము చేసుకోగలిగాము. ఏ విధంగా చేతులు కదులుతున్నాయి? కళ్ళు చూడగల్గుతున్నాయి? బుద్ధి ఆలోచించగల్గుతోంది? ఈశ్వరుడి ఇచ్ఛ లేకుండా, ఉనికి లేకుండా అది సాధ్యపడుతుందా? అందువల్ల వైభవమంతా ఈశ్వరుడిదే అవుతుంది.

ఓం...ఓం...ఓం...

### అధ్యాయం - 66

# శాంతి ప్రార్థన గొలుసు

మొదటిసారి నేను 'చైన్ స్మోకింగ్' అనే పదం విన్నప్పుడు నాకు దాని అర్థం తెలియలేదు. దాని గురించి అడిగి తెలుసుకున్నాక దాని అర్థం నాకు బోధపడింది. ఒక సిగరెట్టు వెలిగించి, ఇక ఒక దాని తర్వాత ఒకటిగా నిరంతరాయంగా, విడవకుండా కాల్చటమని చెప్పారు.

అదేవిధంగా విడవకుండా నిరంతరాయంగా భగవంతుని ప్రార్థించేవారు ఎంతమంది ఉంటారు? అలాంటి పవిత్రమయిన భగవన్నామ స్మరణలో పగలు రాత్రి తేడా లేకుండా నిరంతరము కాలము గడిపే ఆత్మస్వరూపులు ధన్యులు. భగవంతునికి ధరింపచేసే పుష్పమాలలో ప్రతి ప్రార్థన కూడా ఒక ముడి లాంటిదే. ప్రతి ముడి ఇంకొక ముడితో కలిసినప్పుడే పూలదండ తయారవుతుంది. భగవంతుడే సూత్రము, గొలుసు లేదా విశ్వదారము దానితోనే అన్ని రకాల పూసలను కలిపి ముడివేస్తాము. జీవులు, ఆత్మలు ఆ పూసలు.

ఋషికేశ్‌లోని స్వామి శివానందాశ్రమములోనూ, అలాగే ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో ఉన్న సీతారామక్షేత్రంలోనూ నిరంతరము పగలు రాత్రి భేదము లేకుండా హరే రామ మంత్ర జపము జరుగుతుంటుంది. ఇది చాలా సంవత్సరాలుగా జరుగుతోంది. శాంతి ఆశ్రమములో కూడా భగవన్నామ జపాన్ని ఉదయము ఆరు గంటల నుండి

సాయంత్రం ఆరు గంటల వరకు నిరంతరాయంగా జరిపిస్తున్నాము. భక్తుల ప్రపంచంలో నిజంగా అవన్నీ ఎంతో పవిత్రమయిన ఆశీర్వదించబడిన ప్రదేశాలు.

విశ్వశాంతి ప్రార్థన అంటే నాకు ఎంతో ప్రేమ. అందువలన నాకు కూడా శాంతి ప్రార్థన గొలుసులాగా చేయటం చూడాలని ఉంది. విశ్వశాంతి ప్రార్థన విశ్వమంతా ఒక బంగారు గొలుసులాగా నిరంతరాయంగా, నిరాటంకంగా జరిగి వ్యక్తులను విశ్వంతో అనుసంధానము చేయాలని నా ఆకాంక్ష. అంతర్యామిగా కొలువైన పరమాత్మతో ఐక్యతను కలిగించాలి. వ్యక్తిగత శాంతి మాత్రమే విశ్వశాంతికి బాటలు వేయగల్గుతుంది. అందువలన నేను మన ఆశ్రమ భక్తులకు ఒక విజ్ఞప్తి చేస్తున్నాను. మీలో ప్రతి ఒక్కరూ విశ్వశాంతి ప్రార్థనను వ్రాసుకుని ఈ నెలలో దానిని ముగ్గురికి పంపించండి. ఈ విధంగా ప్రతి నెలా ముగ్గురికి పంపించటం వలన సంవత్సరము జరిగే సరికి ముప్ఫై ఆరు మందికి మీరు విశ్వశాంతి ప్రార్థనని ప్రచారము చేయగల్గుతారు. దాని వలన విశ్వశాంతి కల్గుతుంది.

అదేవిధంగా మీరు పంపించిన వారిని కూడా అదేవిధంగా ముగ్గురికి విశ్వశాంతి ప్రార్థన పంపించమని అడగండి. దాని వలన చాలా కొద్ది సమయంలోనే నూట ఎనిమిది మందికి విశ్వశాంతి ప్రార్థన చేరుతుంది. భగవంతుని అనుగ్రహము వలన ఈ శాంతి ప్రార్థన ఒక హృదయం నుండి వేరొక హృదయానికి గ్రామము నుండి వేరొక గ్రామానికి, అలాగే ఒక పట్టణము నుండి వేరొక పట్టణానికి, చివరికి ప్రపంచమంతటా ప్రచారమయి పోతుంది. సర్వాంతర్యామిపై విశ్వాసం ఉన్నవారికి విశ్వశాంతి ప్రార్థన పట్ల నమ్మకమున్న వారికి అన్నీ సాధ్యపడతాయి. వారికి అసాధ్యం అనేది ఏమీ ఉండదు. విశ్వశాంతి ప్రార్థన వైభవము, గొప్పతనము ఏమిటంటే దీనిని చదివిన వారికి తప్పకుండా పరమాత్ముని దివ్యానుభూతి కలుగుతుంది. కేవలము దానిని మళ్ళీ మళ్ళీ చదివినంత మాత్రాన్నే ఇది సాధ్యపడుతుంది. ఎందుకంటే భగవంతుడు హృదయాలకి హృదయం వంటివాడు, శ్వాసకే శ్వాస వంటి వాడు, ఆత్మకే ఆత్మ వంటివాడు.

ఆశ్రమ భక్తుల్లో అనేకమంది చాలా తేలికయిన, సరళమయిన ఈ శాంతి ప్రార్థన చేయటం వలన ఎంతో ఉపయోగాన్ని పొందారు. ఇది దేశాలకి, మతాలకి అతీతమయింది. అందుకే ఆశ్రమ భక్తుల్లో అన్ని మతాల వారు, అన్ని దేశాల వారు ఉన్నారు. జర్మనీ నుండి ఒక స్నేహితుడు తాను విశ్వశాంతి ప్రార్థన చేయడం ద్వారా

జీవితంలో ఎదురయిన ఎన్నో కష్టాల నుండి, ఆపదల నుండి, ఇబ్బందుల నుండి విముక్తి పొందానని వ్రాశాడు. భారతదేశంలోని భక్తుడు ఒకరు తాను శాంతి ప్రార్థనని నూట ఎనిమిది సార్లు పారాయణం చేయటం వలన శాంతిలోని మకరందాన్ని అనుభవించానని, సమాధిస్థితిని అనుభవించానని వ్రాశాడు. సుశీలాదేవి విశ్వశాంతి ప్రార్థన ఒక బంగారు గొలుసు వంటిదని అది జీవుడిని, దైవంతో అనుసంధానం చేస్తుందని అంటూ ఉండేది.

భగవంతుని అనుగ్రహమువలన విశ్వశాంతి ప్రార్థన భారతదేశంలోని ప్రధానమయిన భాషలన్నింటిలోనికి, అలాగే ప్రపంచంలోని కొన్ని భాషల్లోనికి అనువదించబడింది. ఆశ్రమానికి వ్రాసిన వారందరికి ఉచితంగా పంపించేవారము. మనము సంతోషంగా ఆనందంగా ఉండాలని అంటే దానికి చాలా సరళమయిన, తేలికయిన మార్గము ఇతరులను సంతోషంగా, ఆనందంగా ఉండేలా చూసుకోవటమే. కేవలం నీ గురించి మాత్రమే నీవు ఆలోచిస్తే నీ జీవితము దుఃఖమయంగా మారిపోతుంది. అందువలన నీవు సంతోషంగా ఉండాలంటే ఇతరుల గురించి ఆలోచించు. ఇతరులకు సహాయము చేయటం ద్వారా వారికి సేవ చేసి శాంతి ప్రార్థనని ప్రచారము చేద్దాము. మనలో ప్రతి ఒక్కరము విశ్వం యొక్క గొలుసు. లేదా సూత్రములోని ఒక్కో ముడిగా మారితే భగవంతునికి మాలగా మారిపోతాము. ఇతరులకు సేవ చేయటము అంటే నీకు నీవు సేవ చేసుకోవడమే. ఈ విధంగా విశ్వశాంతి ప్రార్థనని ప్రచారము చేయుట ద్వారా విశ్వశాంతి ప్రార్థన బంగారు గొలుసులో ముడులుగా మారి ఈ భూమిపైన శాంతి సౌఖ్యాలను, దేశాల మధ్య సమైక్యతను సాధించుదాము.

## తోటపల్లి కొండలకి రాక్‌ఫెల్లర్‌ని

ఒక పర్యాయము నిర్వాణ మందిరము డాబాపైన కూర్చుని చుట్టూ కనబడుతున్న నీలి కొండలను ఆశ్రమాన్ని పరివేష్ఠించి ఉన్న ఆ కొండలను చూస్తూ, అందమయిన పక్షుల కిలకిలారావాలు వింటూ, సూర్యుని కిరణాలలో తడవసాగాను. ఈ అందమయిన ప్రకృతి అంతా కనిపించే దైవమే. అందుకే చల్లగా వీచే పిల్లగాలుల్లో నేను ఆయన ఉనికిని అనుభూతిని చెందుతుంటాను. అలాగే నాకు నేను 'రాక్‌ఫెల్లర్' లాగా అనిపిస్తుంటాను. ఎందుకంటే నేను సంతోషంగా, సంతృప్తిగా ఉన్నాను.

ప్రియమయిన పాఠకులారా! నేనే కాదు, మీరు కూడా ఏదో ఒక రోజు 'రాక్‌ఫెల్లర్' కావచ్చు. ఎప్పుడయితే మీ అభిప్రాయాలను అసత్యమునుండి సత్యం వైపుగా మార్చుకున్నప్పుడు, అనిత్యము నుండి నిత్యత్వము వైపుగా అలాగే వికాశము వైపునుండి అమరత్వం వైపుగా మార్చుకుంటారో అప్పుడు. ఇంతకంటే ఇంకేమి కావాలి. నాకు ఏదయితే చెందుతుందో అదంతా మీకు కూడా చెందుతుంది. ఈ శాంతి ఆశ్రమము, శాంతి మిషన్ నాకే కాదు మీకు, అలాగే సత్యాన్వేషకులందరికి వారసత్వంగా చెందుతుంది. ఇప్పుడు ప్రపంచంలోని ధనవంతులందరి కంటే ఎక్కువగా మనమే గొప్ప ధనవంతులము అనిపిస్తోంది. కోరికలన్నింటికి అతీతులము కనుక. నా హృదయము ఎంతో సంతోషంతో మళ్ళీ మళ్ళీ చెపుతోంది. మిలియన్ల డాలర్ల డబ్బు అవసరం లేకుండానే ఈ ప్రపంచంలో ఎవరయినా కుబేరులు కావచ్చునని.

ఆధ్యాత్మిక జ్ఞాన సంపద, దివ్యత్వము ప్రతి స్త్రీ, పురుషుల జన్మహక్కు. అది వారి అంతరంగంలోనే నిబిడీకృతమై ఉంది. తనను గుర్తించమని అది ఎదురుచూస్తుంది. అందువలన ఇప్పుడు నీ వంతుగా నీవు దానిని గుర్తించు. ఆ దివ్యత్వాన్ని అనుభవించు. నీ ప్రతి ఆలోచనలో, మాటల్లో, చేతల్లో ఆ దివ్యత్వాన్ని ప్రదర్శించు. అప్పుడు నీవు కూడా 'రాక్‌ఫెల్లర్'వి కాగల్గుతావు. ప్రపంచ మానవాళి సముద్ధరణ కోసం సహాయపడ గల్గుతావు.

ఓం...ఓం...ఓం...

**అధ్యాయం - 67**

# కుమారి జ్ఞానేశ్వరి

ఈ ప్రాపంచికమయిన ఇహానికి సంబంధించిన ప్రపంచము ద్వంద్వముతో కూడి ఉంటుంది. అలాంటి ప్రపంచంలో కనీసము ఒక్కరయినా నిజమయిన ప్రేమ కల్గిన శిష్యులు, తమ పట్ల సంపూర్ణమయిన అవగాహన కల్గి అర్థం చేసుకోగల్గిన వారు దొరకటము చాలా అదృష్టము. నేను ఎప్పుడూ శిష్యుల కోసము, గురువుల కోసము,

మహాత్ముల కోసము పరిగెత్తలేదు. నేను కనిపించే ప్రతి ఒక్కరిలో ఆ పరమాత్మ ప్రతిరూపాన్నే దర్శిస్తాను. అందరిలో ఏకత్వాన్ని బ్రహ్మాన్ని దర్శించటం నాకు అత్యంత ఆనందాన్నిస్తుంది. ఈ ప్రపంచమంతా ఈశ్వరునితో నిండి ఉంది. 'ఈశావాస్యం సర్వమిదం".

కుమారి జ్ఞానేశ్వరి ఎంతో అంకితభావము, ప్రేమ, వినయము, మృదువయిన స్వభావము కలది. ఆమె తన గురించి ఎన్నడూ ఆలోచించదు, కానీ ఎల్లప్పుడూ ఇతరులకు ఏ విధంగా సహాయపడగలనా? అని ఆలోచిస్తుంటుంది. ఆమె బాల్యంనుండి కూడా నా పట్ల అపరిమితమయిన ప్రేమానురాగాలు చూపిస్తూ నన్నే తన సర్వస్వంగా భావించేది. ఆమె నన్ను ఎంతగా ప్రభావితము చేసిందంటే ఆమెను భగవంతుడే స్వయంగా నిర్దేశించి శిష్యురాలిగా పంపించాడు అని నేను భావించేవాడిని. ఆమె పూర్తిగా నిస్వార్థ జీవి. ఉదాత్తమయిన మంచి శీలము, విశాల దృక్పథము కలది. అంతేకాదు ఆమె ఎల్లప్పుడు దాతృత్వము కల్గి ఉండేది. చాలా సందర్భాలలో ఆమె నాకు గురువు కంటే ఎక్కువగా భావించేవాడిని. ఆమె నాకు అనుయాయురాలిగా, శిష్యురాలిగా కంటే ఒక ఉపాధ్యాయురాలి లాగా కనిపించేది. ఎందుకంటే ఆమె నిస్వార్థపరత్వము నాకు కూడా అనుసరించ దగినదిగా ఉండేది. ఇప్పుడు నేను ఆమెలోని గొప్ప సుగుణాలను గురించి పొగడడానికి లేను. దాని వలన ఆమెకి గాని నాకు గాని మంచిది కాదు. ఆమెలో ఉన్న మరొక సుగుణం ఏమిటంటే ఎవరయినా పొగిడితే ఆమెకు అస్సలు ఇష్టం ఉండదు.

ఇప్పుడు నేను మీకు నిన్న జరిగిన ఒక హృదయాన్ని కదిలించి వేసే సంఘటన గురించి చెప్పాలనుకుంటున్నాను. దాని వలన మన పాఠకులు వారే నిర్ణయించుకుంటారు ఆమెలోని గొప్ప ఆత్మ స్థైర్యము, అంతేకాక పని పట్ల ఆమెకు ఉన్న నిబద్ధత, నిస్వార్థము మొదలైన సుగుణాల గురించి నేను చెప్పిన విషయాలు ఎంత యదార్థమో అర్థం చేసుకుంటారు.

ఆ రోజు విపరీతంగా వర్షం కురుస్తోంది. పైగా బాగా చీకటి పడింది. డా॥ సి.కె. ప్రసాద్‌రావు గారు, మద్రాస్ జనరల్ హాస్పిటల్ డీన్ గారు అప్పుడు మా ఆశ్రమంలోనే ఉన్నారు.

రాత్రి అయినా పగలయినా, వేడిగా ఉన్నా చలిగా ఉన్నా, వర్షం పడినా, ఎండ కాచినా, మా జ్ఞానేశ్వరికి ఆమె పని ముఖ్యం. అందువలన అంత కుండపోతగా వర్షం కురుస్తున్నప్పటికీ ఆ చీకటి రాత్రి వేళ ఆమె డా॥ ప్రసాదరావు గారి కుటీరానికి భోజనము తీసుకువెళ్ళసాగింది. దారిలో ఆమెను విషపూరితమయిన పాము కరిచింది. అయినా ఆమె లెక్కచేయకుండా భోజనము తీసుకువెళ్ళి, ఆయనకి వడ్డించి, ఆయన భోజనము చేయటం పూర్తి అయ్యేవరకు అక్కడే వేచి ఉండి, పూర్తి అయిన తర్వాత ఆ పాత్రలను వెనక్కు తీసుకువచ్చి శుభ్రంగా కడిగి సర్దిపెట్టింది. అంతవరకు ఆమె ఎవ్వరితో తనను విషసర్పము కాటువేసిన సంగతి ఒక్క మాట కూడా చెప్పలేదు. ఆమెకు భరించరాని బాధ కల్గినా, స్వయంగా డాక్టరు గారితో కూడా ఆమె ఆ విషయం చెప్పలేదు.

ఈ ప్రపంచంలో తన బాధలను మర్చిపోయి ఇతరుల గురించి ఆలోచించేవారు ఎక్కడ ఉంటారు? అలాంటి అరుదయిన ఆత్మస్వరూపులు నిజంగా ఆశీర్వదించబడినవారు.

కొద్దిసేపటి తర్వాత జ్ఞానేశ్వరి ఎంతో మామూలుగా నా గదికి వచ్చి బక్కెట్టులో నీరు తీసుకొని వచ్చి కాళ్ళు కడుక్కోసాగింది. అప్పుడే ఆమె నాతో చెప్పింది. తనను ఏదో కరిచిందని, కానీ చీకటి, వర్షం వల్ల తాను అది ఏమిటో సరిగ్గా చూడలేదని చెప్పింది. మేము ఆమె పాదము మీద చల్లని నీటిని ధారాపాతంగా పోశాము. కాని ఆమె తన నోరు చేదుగా, తిమ్మిరిగా మారిపోతోందని చెప్పింది. మేము ఆమెను మంచంపైన పడుకోబెట్టాము. అప్పటికే ఆమె స్పృహ కోల్పోయింది. కొద్ది సేపటి వరకూ ఆమె కళ్ళు తెరవలేకపోయింది. మాకు ఎలాంటి సమాధానము ఇవ్వలేని స్థితిలో ఉంది. మేమంతా ఎంతో విషాదంలో, నిస్సహాయస్థితిలో ఉండిపోయాము. మా అందరి హృదయాల్లో కొలువై యున్న అంతర్యామి, ఆ ఈశ్వరుడే మాకప్పుడు శరణము. మా ఆత్మ, మా గమ్యము, ప్రత్యేకించి ఇప్పుడు జ్ఞానేశ్వరికి ఆమె కష్టంలో, బాధలో ఈశ్వరుడే దిక్కు అనిపించింది.

కొద్దిసేపటి తర్వాత ఆమె నెమ్మదిగా కళ్ళు తెరిచి గొణగసాగింది. మేము డా॥ ప్రసాదరావు గారికి కబురు చేద్దాము అనుకున్నాము. కానీ అంత బాధలో కూడా ఆమె మా ప్రయత్నాలను అర్థం చేసుకొని ఆయనని ఆ సమయంలో ఇబ్బంది పెట్టవద్దని సైగ చేసింది. డా॥ ప్రసాదరావు గారు ఆ సమయంలో మౌనంగా, ధ్యానంలో ఉంటారు. అయినప్పటికీ ఆమె పరిస్థితి బాగా ఆందోళనకరంగా ఉండడం వలన మేము డా॥



ప్రసాదరావు గారికి కబురుచేశాము. ఆయన వెంటనే వచ్చి ఎంతో దయతో, చాలా జాగ్రత్తగా, తెలివయిన సూచనలు చేశారు. గొల్లప్రోలులో ఉండే డా॥ మార్కండేయులు గారిని కూడా మా పీస్‌వ్యాన్‌ని పంపించి తీసుకురావాలని అనుకొన్నాము. కొంతమంది మాతో దుర్గాదా రైల్వేస్టేషన్‌కి వెళ్ళి తాంత్రికుడుకి ఫోన్ ద్వారా విషయం చెప్పమని చెప్పారు. ఒకవేళ ఎవరినయినా పాము కరిస్తే ఆ తాంత్రికుడికి కబురు చెబితే ఆయన ఏవో మంత్రాలు చదివి తాను ధరించిన వస్త్రాన్ని రెండుగా చీల్చివేస్తాడట. వెంటనే పాము కరచిన రోగి ఎవరయినా, ఎంత దూరంలో ఉన్నా సరే ఆ విషం నుండి పూర్తిగా కోలుకుంటారట. ఇది ఏదో పుస్తకంలో చదివిన కథ కాదు. ఇది పూర్తిగా యథార్థమయిన విషయం. ఆయన ఎన్నో సంవత్సరాలుగా ఎంతో మంది ప్రాణాలను ఎంతెంత దూర ప్రాంతాల వారిని కూడా పాము కాటు నుండి కాపాడారు. అది ఆయనకి భగవంతుడు ప్రసాదించిన వరము. అది నిజంగా అరుదయిన విషయం. ఎంతో మంది బాధితులకు సహాయం అందింది. అంతా భగవంతుని అనుగ్రహము. అలాంటి వ్యక్తి చిరకాలము జీవించి ఎందరికో మేలు చేయుగాక!

కాని మేము మా జ్ఞానేశ్వరిని ఎక్కడికి తీసుకు వెళ్ళలేదు. అలాగే బయటినుండి ఏ వైద్యుడిని పిలువలేదు. అలాగే తాంత్రికుడికి కూడా ఎలాంటి కబురు చేయలేదు. మా డా॥ ప్రసాదరావు గారి పర్యవేక్షణలో మేము ప్రకృతి వైద్యాన్ని ఆశ్రయించాము. ఆయుర్వేద మందులు కూడా డా॥ సూర్యనారాయణ గారు ఇచ్చారు. ఇవన్నీ భగవంతుని అనుగ్రహము వలన జ్ఞానేశ్వరికి ఎంతో ఉపశమనం కలిగించాయి. ఆమె తాను పడుతున్న బాధ కంటే, మా కందరికీ ఇబ్బంది కల్గించినందుకే ఎక్కువగా బాధ పడసాగింది. ఆమె మా అందరినీ వెళ్ళి నిద్రపొమ్మని చెప్పింది. తనకి ఇప్పుడు చాలా వరకు ఇబ్బంది తగ్గిపోయిందని చెప్పింది. కానీ ఆమెకి ఇంకా బాధ, నొప్పి ఉన్నాయి. పాము కరిచిన చోట పాదము బాగా వాచింది. ఈ విధంగా ఆమె తెల్లవారుఝాము దాకా ఇబ్బంది పడుతూనే ఉంది. భగవంతుని అనుగ్రహము వలన ఆమె జీవితము సురక్షితంగా ఉంది. ఎందుకంటే తూర్పు పడమర దేశాల్లోని ఈశ్వరుడి సంతానము కొరకు ఆమె ఎన్నో సేవలు చేయవల్సి ఉంది.

ఈ మధ్యనే నేను విన్నాను. ముగ్గురు జ్యోతిష్కులు ఆమె చేతిని చూచి ఆమె జీవితము సంపూర్ణంగా భగవంతుని సేవకే అంకితమయిపోయిందని చెప్పారు. ఆమె పాశ్చాత్య

దేశాలకు కూడా పర్యటనలు చేస్తుందని కూడా చెప్పారు. ఎప్పుడయినా నాకు వచ్చే ఉత్తరాలు, సందేశాలు చదవమని చెప్పినప్పుడు, అలాగే శాంతి పత్రిక చదివేటప్పుడు ఆమె ప్రసక్తి, పేరు వచ్చినప్పుడు ఆమె దానిని వదిలివేసి మిగతా విషయాలు చదువు తుండేది. ఈ భౌతిక ప్రపంచంలో ద్వంద్వాలతో కూడిన వ్యక్తుల మధ్య అలాంటి నిస్వార్థ పరత్వము, శీలసంపద గల వారిని చూడటము చాలా అరుదుగా సంభవిస్తుంటుంది. అలాంటి వారు ఈశ్వరుడు ప్రసాదించిన వరము వంటి వారు. ఒకవేళ నేను జ్ఞానేశ్వరిని నాకు గురువుగా భావించినా లేదా శిష్యురాలు అనుకున్నా లేదా సోదరిగా, బిడ్డగా అనుకున్నా నాకు సంతోషంగా ఉంటుంది. నేను ఎల్లప్పుడూ ఆమె గురించి ఎంతో సంతోషంగా, సంతృప్తిగా, గర్వంగా అనుకుంటాను. కనీసం ఒక్కరయినా ఆమె లాంటి శీలసంపద, నిస్వార్థ ఆత్మ స్వరూపిణి దొరకటము నా అదృష్టము. ఆమె జీవితము, శ్వాస, పనులు ఆమె కోసం కాదు. ఇతరుల సౌభాగ్యం కోసం, ఇతరులకు శాంతిని అందించటము కోసం, ఆశ్రమ పురోభివృద్ధి కోసం కేటాయించుకుంది.

శాంతి ఆశ్రమానికి ఇప్పటికే వందలు, వేలకొద్దీ భక్తులున్నారు, అనుయాయులున్నారు. అన్ని మతాల వారు, అన్ని దేశాల వారు ఉన్నారు. తూర్పు పడమర దేశాల్లో ఎందరో భక్తులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు ఉన్నారు. వారందరికి సంతోషాన్ని కలిగించే విధంగా నేను నా మనస్సులోని కోరికను చాలాకాలము క్రితమే తెలియచేశాను. నేను నా కళ్ళు మూసుకొని, ఈశ్వరుని పిలుపు కోసం ఎదురు చూసినప్పుడు ఆ క్షణంలో నాకు ఒకే ఒక్కరు కనిపిస్తున్నారు. ఈ ఆశ్రమానికి అధిపతిగా ఉండి ఎంతో విజయవంతంగా, సమర్థవంతంగా, ఆధ్యాత్మికంగా ఆశ్రమాన్ని పురోగవృద్ధిబాటలో నడిపించగలిగేది కేవలం ఈ చిన్ని జ్ఞానేశ్వరి మాత్రమే. ఈ ఆశ్రమము ప్రపంచవ్యాప్తంగా ఉన్న భగవంతుని బిడ్డలందరికి వారసత్వ సంపదగా చెందుతుంది. నేను ఇప్పుడే వ్రాస్తున్నాను, ఎప్పుడో నేను చేసినప్పుడు చెప్పటం కాకుండా. ఎందుకంటే ప్రపంచంలోని సుదూర ప్రాంతాల్లోని సోదర సోదరీమణులు, భారతదేశంలోని భక్తులు, ఆశ్రమ శ్రేయోభిలాషులు అందరూ కూడా వారి ఆశీస్సులు, ప్రార్థనలు జ్ఞానేశ్వరికి అందించాలి. అప్పుడే ఆమె తన నిరాడంబరమయిన జీవితాన్ని అదేవిధంగా కొనసాగిస్తూ ఆశ్రమానికి నిరుపమానమయిన బహుమతిగా మారుతుంది. అయినా ఆమె బాల్యంలో తొమ్మిది సంవత్సరాల వయస్సులో ఆశ్రమానికి చేరినప్పటి నుండి కూడా ఎంతో ఉన్నతమయిన, ఆదర్శవంతమయిన సుగుణ సంపదతో జీవిస్తోంది.

మహాకవి షేక్స్‌పియర్ అంటాడు "ఈ ప్రపంచం అంతా ఒక నాటక రంగము. అందులో మనమందరము పాత్రధారులము". ఈ ప్రపంచంలోకి మనమందరము వచ్చాము. అలాగే ఒక రోజు వెళ్ళిపోతాము. భగవంతుడు మనకు నిర్దేశించిన పాత్రను పోషించి వెళ్ళిపోతాము. ఈ భూమి మీద మనము శాశ్వతంగా ఉండిపోము. మనము ఈ భూమిని ఎంతగా ప్రేమించినప్పటికి దానిని అంటిపెట్టుకొని ఉండిపోము. దాదాపుగా ఏభై సంవత్సరాలు నాకు సాధ్యమయినంత సమర్థవంతంగా నేను పనిచేశాను. ఇదంతా కేవలము ఈశ్వరుని అనుగ్రహమే. ఈ ఆశ్రమాన్ని, శాంతి దేవాలయాన్ని స్థాపించి మీకందరికీ సేవలందించాను. ఈ ఆశ్రమము మీ అందరికీ చెందుతుంది అని చెప్పటానికి నాకు చాలా సంతోషంగా ఉంటుంది. ఇది నాకు ఏ విధంగా చెందుతుందో, మీకుకూడా అదేవిధంగా సమానంగా చెందుతుంది. ఈ ఆశ్రమము మీకు ఆధ్యాత్మికమయిన ఇల్లు వంటిది.

జ్ఞానేశ్వరి ఇక్కడా, అక్కడా, అన్నిచోట్లా ఉంటుంది. నిరంతరము ఎవరో ఒకరికి సహాయం చేస్తూ, సేవ చేస్తూ కనిపిస్తుంటుంది. ఒకచోట చిన్న పిల్లలతో కలిసి కనిపిస్తుంటుంది. వంటశాలలో వంట చేస్తుంటుంది. వైద్యశాలలో రోగులకు సేవలు అందిస్తూ కనిపిస్తుంది. అలాగే ఆశ్రమానికి వచ్చే అతిథులను పలుకరిస్తూ కనిపిస్తుంది. నా బిడ్డ అయిన జ్ఞానేశ్వరి గురించిన ఈ సందేశము 'ఇతరులు' అనే కవితను గురించి చెప్పకపోతే అది అసంపూర్ణంగా ఉంటుంది. జీవించినప్పుడు మరణించేటప్పుడూ కూడా ఇతరుల గురించి కలలు కనటము, వారి కోసమే జీవించటము నిజంగా ఎంత అదృష్టము. నేను నా పాఠకులందరికి విజ్ఞప్తి చేస్తున్నాను, నా జ్ఞానేశ్వరి గురించి మీరందరూ మౌనంగా ప్రార్థించండి. ఆమె చేసే గొప్ప ఘన కార్యాల గురించి, ఆమె నిరాడంబర జీవితము అదేవిధంగా కొనసాగుతూ భగవంతుని బిడ్డలందరికీ వరంగా మారుగాక! ఇది మీ అందరిని ప్రేమించే వ్యక్తి ప్రార్థన.

**ఇతరులు**

"భగవాన్! నన్ను నేను మర్చిపోయి ప్రతిదినము ఇతరుల కోసం జీవించే విధంగా నాకు సహాయము చేయి. నేను మోకాళ్ళపై వంగి ప్రార్థన చేసేటప్పుడు కూడా ఆ ప్రార్థన ఇతరుల కోసం చేసేవిధంగా చూడు. నేను నా పనిని నిజాయితీగా, యథార్థంగా చేయడానికి నీవు సహకరించు. నేను నీ కోసం ఏదయితే చేస్తున్నానో అది ఇతరుల

కోసం చేయాలని నాకు అర్థం అయ్యేవిధంగా చూడు. 'నేను' అనే అహంభావనని నిర్ధాక్షిణ్యంగా కనిపించకుండా లోతుగా పూడ్చి పెట్టివేయి. అలా చేయకపోతే ఇతరుల కోసమే జీవించడానికి నేను చేసే ప్రయత్నాలు అన్నీ వ్యర్థం అయిపోతాయి. ఈ భూమి మీద నేను పనిచేస్తున్నప్పుడూ, స్వర్గంలో నా పని మొదలుపెట్టేటప్పుడు కూడా నేను ధరించిన కీర్తి కిరీటాన్ని మర్చిపోయేలా నన్ను అనుగ్రహించు. నన్ను ఎల్లప్పుడూ ఇతరుల గురించే ఆలోచించేలాగా ఉంచు. కేవలము ఇతరుల గురించి, ఇతరుల గురించే ఆలోచించేలాగా చూడు. అదే నా జీవిత పరమార్థం కావాలి. నేను నాలాగా జీవించాలి అంటే నేను ఇతరుల కోసమే జీవించే విధంగా నాకు సహాయం చేయి."

ఇక ఇప్పుడు ఈ అధ్యాయాన్ని ముగించేముందు 1967 జనవరిలో జరిగిన 'గోల్డెన్ జూబ్లీ సంచిక'లో జ్ఞానేశ్వరి స్వయంగా వ్రాసిన విషయాలను కూడా పొందుపరచటం చాలా అవసరం.

## నేను స్వామీజీ వద్ద నేర్చుకున్న విషయాలు - జ్ఞానేశ్వరి

1. నేను స్వామీజీ వద్ద నేర్చుకున్నది ఏమిటంటే భగవంతుడు అంటే ప్రేమ మరియు ప్రేమ అంటేనే భగవంతుడు. కనుక ఎక్కడ ప్రేమ ఉంటుందో, అక్కడ భగవంతుడు ఉంటాడు.

2. నేను స్వామీజీ వద్ద నేర్చుకున్నది ఏమిటంటే మతము జీవితము రెండు వేరుకాదు ఒక్కటే. కనుక నేను కళ్ళుమూసుకుని ధ్యానములో ఉన్నా లేదా కళ్ళు తెరుచుకుని ఏ పనిచేస్తున్నా భగవంతుని ఉనికిని గ్రహించగల్గుతాను.

3. నేను స్వామీజీ వద్ద నేర్చుకున్నది ఏమిటంటే పనిచేయటమే ఈశ్వరుడిని పూజించటము. నేను ఏ పని చేసినా అది కేవలము భగవంతుని ఆరాధించటమే.

4. నేను స్వామీజీ వద్ద నేర్చుకున్నది ఏమిటంటే సమయము చాలా అమూల్య మయినది. ప్రతి క్షణము విలువైనదే. ఎవరయితే సమయాన్ని వృథా చేస్తారో వారు జీవితాన్ని వృథా చేసుకుంటున్నారు. ఏదయినా పోగొట్టుకుంటే తిరిగి సంపాదించుకోవచ్చు. కానీ విలువైన, అమూల్యమయిన సమయాన్ని మాత్రం తిరిగి పొందలేము.

5. నేను స్వామీజీ వద్ద నేర్చుకున్నది ఏమిటంటే సోమరితనము చాలా ప్రమాదకరమైన వ్యాధి. సోమరిపోతు తనకే కాకుండా ఇతరులకు కూడా హాని చేస్తాడు. ఎవరయితే ఏ పనీ చేయకుండా సోమరిగా ఉంటారో వారి జీవితం గడుపుతారో వారికి తినటానికి ఎలాంటి హక్కు ఉండదు.

6. నేను స్వామీజీ వద్ద నేర్చుకున్నది ఏమిటంటే పరిశుభ్రత దైవత్వము. ఎవరయితే బాహ్యంగానూ, ఆంతర్యంలోనూ పవిత్రంగా ఉంటారో వారే నిజమయిన దేవుని బిడ్డలు.

7. నేను స్వామీజీ వద్ద నేర్చుకున్నది ఏమిటంటే నిర్మలత్వము. ఆధ్యాత్మిక జీవితానికి పునాదిరాయి లాంటిది. ఆలోచనల్లో, మాటల్లో, చేతల్లో ఎవరు పవిత్రంగా ఉంటారో వారు అదృష్టవంతులు. భగవంతుని చేత ఆశీర్వదించబడతారు.

8. నేను స్వామీజీ వద్ద నేర్చుకున్నది ఏమిటంటే శ్వాస పీల్చినప్పుడు, శ్వాస వదిలినప్పుడు ప్రతి శ్వాసలోనూ శాంతిని పొందాలి. ఇది చాలా సరళమయిన, సహజమయిన ప్రాణాయామము. ఈ శ్వాస ప్రక్రియ వల్ల నాడులన్నీ శుద్ధి అవుతాయి. మన లోపలి నరాలు కూడా పరిశుద్ధమవుతాయి. దీని వలన క్రమక్రమంగా కుండలినీ శక్తి ఉద్దీపనము భగవదనుభూతిని కలిగిస్తాయి. దీనికి ఎలాంటి రహస్యమయిన యోగ ప్రక్రియలు చేయాల్సిన అవసరం లేదు. అలాంటివి చాలా క్లిష్టంగా ఉండి కొన్నిసార్లు ప్రమాదకరంగా ఉంటాయి. ప్రత్యేకించి శిక్షణ పొందిన గురువు సహాయం ఉండాలి.

9. నేను స్వామీజీ వద్ద నేర్చుకున్నది ఏమిటంటే క్రీస్తు చెప్పిన సరళమయిన మార్గము నీ వలే నీ పొరుగువారిని కూడా ప్రేమించు. శ్రీకృష్ణభగవానుడు సూటిగా చెప్పిన మార్గము 'ప్రతి జీవిలో ఈశ్వరుడిని దర్శించు'. ప్రపంచంలోని ప్రతి ఒక్కరిలో ఆ బ్రహ్మమును దర్శించాలి. మరియు బుద్ధభగవానుడి దయాగుణము అందరినీ గౌరవించాలి, అందరిపట్లా ప్రేమ, దయ, కరుణ, సానుభూతి కల్గి ఉండాలి.

10. నేను స్వామీజీ వద్ద నేర్చుకున్నది ఏమిటంటే మతాలన్నీ విశ్వ సౌభ్రాత్రం కల్గి ఉండాలి. ప్రతి ఒక్కరిని సమానంగా గౌరవించాలి, ఆరాధించాలి. అందరూ ప్రవక్తలను, అవతారాలను, మార్గదర్శకులను, అన్ని మతాలకు చెందిన వారిని ఒకరితో ఒకరిని పోల్చకుండా, విమర్శించకుండా, వారి మతాన్ని, మత సంబంధమైన విషయాలను సమానంగా గౌరవించాలి.

11. నేను స్వామీజీ వద్ద నేర్చుకున్నది ఏమిటంటే "నేను ఎప్పుడూ బావిలో కప్పలాగా అజ్ఞానంతో ఉండకుండా, విశాలమయిన దృక్పథంతో, తెలివితేటలతో ఈ విశాలమయిన ప్రపంచమంతా నా సొంత ఇల్లు లాగా, అందులో నివసించే వారందరూ నా సోదర సోదరీమణులు లాగా భావించాలి. ఎలాంటి గౌరవాన్ని ఆశించకుండా ఇతరులకు సేవ చేయటం, ప్రేమించటం వలన ఆశీర్వదించబడతాము. ఇదే నా మహోన్నతమయిన మతము.

12. నేను స్వామీజీ వద్ద నుండి నేర్చుకున్నది ఏమిటంటే "భగవంతుని సర్వత్రా సర్వ వేళల్లో దర్శించటము. ఇప్పుడు ఇక్కడ మాత్రమే కాదు, నిరంతరము ప్రతి ఒక్కరిలో, ప్రతి క్షణము తన జీవితంలో ఆ భగవంతుడిని దర్శించాలి. ఆత్మసాక్షాత్కారానికి ఇదే అతి రహస్యమయిన మార్గము.

13. నేను స్వామీజీ వద్ద నేర్చుకున్నది ఏమిటంటే ఆత్మసాక్షాత్కారము యొక్క వైభవము. బాహ్యమయిన సుఖ సౌఖ్యాలు, సంపదల కోసం వెంపర్లాడకుండా, గొప్ప గొప్ప బిరుదులు, పేరు ప్రఖ్యాతుల కోసం ప్రాకులాడకుండా, నీ లోపల దివ్యంగా వెలుగుతున్న జ్యోతి స్వరూపంపైన ఆధారపడి జీవించాలి.

14. నేను స్వామీజీ వద్ద నేర్చుకున్నది ఏమిటంటే జీవితములో ఎదురయ్యే కష్టాలు భగవంతుడు భూమిపైన వర్షించే వర్షం లాంటివి. జీవితములో ఎదురయ్యే ఇబ్బందులు నిన్ను ఇబ్బంది పెట్టకముందే నీవు ఇబ్బందులు పడటం మొదలు పెట్టవచ్చు.

15. నేను స్వామీజీ వద్ద నేర్చుకున్నది ఏమిటంటే భగవంతుడిని మర్చిపోవటం మరణంతో సమానము. పరమాత్మ గురించిన అవగాహన, ఆయన యొక్క దివ్యానుభూతి శాశ్వతమయిన అమరత్వాన్ని నీ జీవితానికి కలిగిస్తుంది.

16. నేను స్వామీజీ వద్ద నేర్చుకున్నది ఏమిటంటే ఉపన్యాసాలు వెండి వంటివి అయితే నిశ్శబ్దము బంగారము వంటిది. మౌనము, నిశ్శబ్దము ఆభరణము వంటిది. ఆధ్యాత్మిక జీవితానికి కిరీటం వంటిది. ఎక్కువగా మాట్లాడటము వలన ఇబ్బందులు, అపార్థాలు వస్తాయి. మౌనము వలన నిజమయిన శాంతి లభిస్తుంది. మౌనము ఆత్మలను సృష్టిస్తుంది.

17. నేను స్వామీజీ వద్ద నేర్చుకున్నది ఏమిటంటే ఈ ప్రాపంచిక జీవితంలో ఎదురయ్యే కష్టాలకు, పరీక్షలకు ఓర్పుతో సహనంతో వ్యవహరించాలి. అవన్నీ కూడా కదిలిపోయే మేఘాల వంటివి. కష్టాలు, పరీక్షలను తట్టుకోవటం వలన మానసికంగా ధైర్యం వస్తుంది. ఈ ప్రపంచంలో ఎవ్వరి జీవితము పూలపాన్పులాగా ఉండదు. అలాగే జీవితం ఎప్పుడూ మధురమయిన పాయసంలాగా ఉండదు.

18. నేను స్వామీజీ వద్ద నేర్చుకున్నది ఏమిటంటే సంపదలను కోల్పోతే ఏమి కోల్పోయినట్లు కాదు. ఆరోగ్యం కోల్పోతే కొంత నష్టపోయినట్లే. కానీ వ్యక్తిత్వాన్ని కోల్పోయినట్లయితే సర్వస్వము కోల్పోయినట్లే అవుతుంది. వ్యక్తిత్వము భగవంతుని జీవితాన్ని గడిపేవారికి హృదయం, ఆత్మ వంటిది.

19. నేను స్వామీజీ వద్ద నేర్చుకున్నది ఏమిటంటే ఆత్మ మన లోపలే ఉంది. అది సంపూర్ణమయినది. బాహ్యంలో నేర్చుకోవడానికి ఏమీ లేదు. ఒకవేళ బాహ్యంలో నేర్చుకున్నది ఒకానొకప్పుడు మర్చిపోవచ్చు. నిజమయిన శాంతి గ్రంథాలను అధ్యయనం చేసే పుస్తకాల పురుగులకు దొరకదు. ఈ ప్రపంచంలోని ద్వంద్వాలన్నింటికి అతీతమయిన స్థితికి చేరిన అరుదయిన ఆత్మజ్ఞాన స్వరూపులకు మాత్రమే నిజమయిన శాంతి దొరుకుతుంది. మహోన్నతమయిన స్థితికి చేరిన సాధు మహాత్ములు శాస్త్ర జ్ఞానము ప్రారంభ సాధకులకు మాత్రమే ఉపయోగపడుతుందని, జ్ఞానులకు అవసరముండదని చెపుతారు.

20. నేను స్వామీజీ వద్ద నేర్చుకున్నది ఏమిటంటే ఎండిపోయిన ఎముకలను నమలటము వలన నేను తృప్తి చెందను. ఇతరుల వృథా ప్రేలాపనలతో తృప్తి చెందను. ప్రపంచంలోని ఆవులన్నింటిని లెక్కపెట్టటము వలన నాకు తృప్తి కలగదు. కొద్దిగానే అయినా తన స్వంత చిన్న ఆవు ఇచ్చే తాజాపాలు శ్రేష్ఠమయినవి. వ్యక్తిగత అనుభవము జీవితంలో ఎవ్వరికయినా ఉపయోడపడుతుంది. అలాంటి మహోన్నతమయిన స్వానుభవము పొందిన ఆత్మజ్ఞులు ధన్యులు. వారు ఈ భూమిపైన ఉప్పులాంటివారు. వారే ఈ ప్రపంచానికి మార్గదర్శనం చేయగల్గుతారు. అసత్యం నుండి సత్యం వైపుగా, చీకటి నుండి వెలుగు వైపుగా అనిత్యం నుండి శాశ్వతత్వం వైపుగా మనలను నడిపిస్తారు. అలాంటి మహానుభావులకు అభివందనాలు.

ఓం... అందరికి శాంతి లభించుగాక!

అధ్యాయం - 68

# మహామండలేశ్వరులు స్వామి శివానంద మహరాజ్ గారి మహా సమాధి

భౌతికంగా వారు కనుమరుగు అయిపోయినా, గొప్ప ఆత్మజ్ఞానసంపన్నులయిన స్వామి శివానంద మహరాజ్ వంటి వారికి మరణం లేదు. భౌతికంగా జీవించి ఉన్న స్వార్థపరులు ఈ ప్రపంచంలో మరణించిన వారితో సమానమే అవుతారు. స్వామీజీ వంటి నిస్వార్థపరులు ఎల్లప్పుడూ జీవించే ఉంటారు. ఇంతకు ముందు కంటే ఇప్పుడు ఇంకా ఎక్కువగా వారు ఉంటారు. భౌతికంగా లేకపోయినా వారు విశ్వవ్యాప్తంగా పరివేష్ఠించి ఉంటారు. నిజానికి మనము సాధువులము, యోగులము అయినప్పటికీ ఒకవైపు మానవతా దృక్పథము ఉంటుంది. ఎప్పుడూ హృదయము ప్రేమతో నిండి ఉంటుంది. స్వామి శివానంద గారి నిర్వాణవార్త అందగానే మాకు దిగ్భ్రాంతిని, విచారాన్ని కలిగించింది. ఆశ్రమవాసులందరికి ఈ వార్త ఆశనిపాతంగా అనిపించింది.

నేను ఈ విచారకరమయిన వార్త వినగానే కళ్ళు మూసుకొని స్వామీజీ రూపాన్ని దర్శించడానికి, ఆయన సన్నిధిని అనుభూతి చెందటానికి ప్రయత్నించాను. వారి ఆలోచనలు నాలో మెదలగానే సేవ, ప్రేమ, దయ మూర్తీభవించిన గొప్ప ఆత్మశక్తి నాలో ప్రవేశించి నాకు సౌకర్యాన్ని, ధైర్యాన్ని, ఆనందాన్ని, ఉత్తేజాన్ని కలిగించింది. స్వామీజీ నా పట్ల చూపించిన ప్రేమ ఇంతకు ముందుకంటే మరింతగా పెరిగినట్లు అనుభూతి చెందాను. ఆయన ఉనికిని ఇప్పుడు, ఇక్కడే నేను అనుభవించటము నిజంగా ఎంతో అదృష్టంగా భావించాను. ఎలాంటి బాధనయినా, క్రుంగుబాటు నయినా అధిగమించడానికి ఇదే సరయిన మార్గము.

స్వామీజీ, నేను ఇద్దరము వేరు వేరు కాదు. ఇద్దరము ఒక్కటే. మా ఇద్దరికి దాదాపు నలభై సంవత్సరాల అనుబంధము ఉంది. స్వామీజీ నా పట్ల చూపించిన ప్రేమానురాగాలను మీకు నేను పరిమితమయిన మాటల్లో వివరించలేను. ఆయన ప్రపంచవ్యాప్తంగా పేరు పొందిన 'దివ్య జీవన సంఘాన్ని' స్థాపించక పూర్వమే మా శాంతి ఆశ్రమానికి వచ్చి మమ్మల్ని ఆశీర్వదించారు. మా శాంతి ఆశ్రమములోని ఒక

చిన్న కుటీరములో స్వామీజీ ధ్యానము, తపస్సు చేసుకునేవారు. అది నా కళ్ళ ముందు ఇప్పటికీ కదలాడుతూనే ఉంది. ఆయన గ్రంథ పఠనం బాగా చేసేవారు. ఆయనకి వేదాంత పఠనం, శాస్త్ర అధ్యయనం పట్ల చాలా ఆసక్తి ఉండేది. ఆయనకి బాధా వేదాంతము అంటే చాలా ఇష్టము. నేను అమెరికాలో ఉండగా స్వామీజీ పంపిన సందేశం నాకు ఇంకా గుర్తుంది. ఆయన కళ్ళుమూసుకుని గాఢమయిన ధ్యానంలో లీనమవటం నా కళ్ళముందు మెదలుతోంది. ఆశ్రమంలో ఆయన తన శిష్యులు స్వామి పరమానందజీ, స్వామి ఆత్మానందజీ మరియు స్వామి స్వరూపానందజీతో కలిసి చాలా నెలలు ఉండేవారు. శాంతి ఆశ్రమంలో వారున్న దినాలు గుర్తువస్తే చాలా సంతోషంగా ఉంటుంది.

మేము లక్ష్మీనారాయణ పురం రాణీసాహెబా గారి భవంతిలో అద్భుతమయిన సత్సంగము జరిపాము. భజనలు, సంకీర్తనలు ఉత్తేజభరితమయిన సందేశాలు చేశాము. రాణి సాహెబా గారు శాంతి ఆశ్రమానికి విరాళముతో పాటుగా స్వామీజీకి కూడా దక్షిణలు ఇచ్చారు. వెంటనే స్వామీజీ దానిని కూడా శాంతి ఆశ్రమానికే ఇచ్చివేశారు. వారు ఎంతో దయాగుణము కలవారు.

మమ్మల్ని తరచుగా మాజీ వైస్ ఛాన్సలర్ శ్రీ లక్కరాజు సుబ్బారావు ఇంకా కొందరు జమిందారులు, ఆశ్రమభక్తులు వారింటికి సత్సంగాలకి తీసుకు వెళుతుండేవారు. స్వామీజీ అక్కడ ఎంతో అద్భుతంగా, ఉత్తేజభరితమయిన భజనలు మధురమయిన కంఠంతో గానం చేసేవారు. సుశీలాదేవి పట్ల స్వామీజీకి ఉన్న గొప్ప ప్రేమ, ఆరాధన, పూజ్యభావము గురించి వర్ణించి చెప్పటం సాధ్యం కాదు. వారిద్దరికి ఒకరి పట్ల ఒకరికి ఉన్న పూజ్య భావన వలన వారిద్దరూ గంటల తరబడి ఆధ్యాత్మిక విషయాల గురించి చర్చించుకుని ఒకరి మనోభావాలు మరొకరు పంచుకునేవారు. ఇప్పుడు సుశీలాదేవి జీవించి లేదు. అలాగే స్వామీజీ కూడా భౌతిక దేహాన్ని చాలించారు. నిజానికి వారిద్దరూ మరణించారా? వేయిసార్లు చెప్పవలసి వచ్చినా సరే 'లేదు' అనే చెప్పాల్సి వస్తుంది. వారి గొప్ప దయాగుణము, సేవాతత్పరత, ప్రేమ స్వభావము వారిని ఆశ్రమవాసులందరి హృదయాల్లో సజీవంగా నిల్పి ఉంచాయి. ఇంతకు ముందు కంటే ఎక్కువగా అని చెప్పాలి. వారి యొక్క ఉనికిని అనుభూతి చెందగల్గటం వల్లనే మేమందరము మామా బాధ్యతలను, పనులను చక్కగా నెరవేర్చగలుగుతున్నాము. వారిని ఆదర్శంగా భావిస్తూ మా జీవితాల్లో చిన్నా, పెద్దా పనులు నిర్వర్తించగలుగుతున్నాము. వారి జీవితాలు ఆదర్శవంతమయినవి.

నిస్వార్థపూరితమయిన పవిత్రమయిన ఆత్మస్వరూపులు, వారు మానవాళి శ్రేయస్సు కోరి తమ కోసం కాకుండా ఇతరులను సేవించడానికే జీవించారు.

ఇక ఇప్పుడు నా వ్యక్తిగత అనుభవాల గురించి, స్వామీజీతో నేను ఎంతో దగ్గరిగా, అనుబంధం కల్గి, పొందిన దివ్యానుభూతుల గురించి మీకు వివరించాలనుకుంటున్నాను. చాలా సంవత్సరాల క్రితం నేను, సుశీలాదేవి హిమాలయాలను దర్శించడానికి వెళ్ళాము. అప్పుడు స్వామీజీ స్వర్గాశ్రమములో నివసించేవారు. దానికి ఎదురుగా దివ్యజీవన సంఘము పవిత్రమయిన గంగామాత నది ఒడ్డున ఉంది ఆ ఆశ్రమము. స్వామీజీ అప్పుడు మా పట్ల చూపించిన ప్రేమానురాగాలు, వారు మా పట్ల తీసుకున్న శ్రద్ధ మీకు నేను మాటల్లో ఏ విధంగా వివరించి చెప్పగలను? అవన్నీ మా హృదయంలో శాశ్వతంగా సంతోషకరమైన జ్ఞాపకాలుగా మిగిలిపోయాయి. అందులో ఒక పవిత్రమయిన సన్నివేశాన్ని ఎంతో సంతోషంతో నేను గుర్తు చేసుకుంటాను. స్వర్గాశ్రమంలోని ఒక పెద్ద సమావేశ మందిరంలో స్వామీజీ మా గురించి ఒక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అది ఏమీ పట్టణము కాదు, అనేకమంది ప్రజలను అక్కడికి రప్పించడానికి. కాని అది చాలా పెద్ద, గొప్ప ఆశ్రమము. సాధువులు, మహాత్ములు, స్వామీజీలు మరియు యోగులు అన్ని సంప్రదాయాలకు చెందినవారు, అన్ని తరగతులకు చెందిన వారు అక్కడ సమావేశమయ్యారు. నేనింకా తన్మయత్వంతో ఆ సమావేశంలో హాజరయిన మహాత్ములను దర్శించగల్గుతున్నాను. స్వామీజీ మా ఇద్దరిని వారికి పరిచయం చేస్తూ, వారి పవిత్రమయిన హృదయాలను ఉత్తేజితపరుస్తూ, వారి ఆంతర్యం స్పందించే విధంగా మా గురించి చెప్పారు. తోటపల్లి కొండల్లోని శాంతి ఆశ్రమంలో వారు ఎంత సంతోషంగా నివసించారో, వారి అనుభవాలన్నింటిని వివరించారు. తర్వాత మేము మా సందేశాలను వినిపించాము. స్వామీజీకి హృదయపూర్వకంగా గౌరవ అభినందనాలు తెలియపరిచాము.

ఈ రోజుకి కూడా ఆనాటి సమావేశంలో ఎన్నుకోబడిన సాధు మహాత్ముల సమూహాన్ని తలుచుకుంటే నా హృదయం ఆనందంతో, తన్మయత్వంతో పొంగిపోతుంది. అది భూమి మీద జరిగిన సత్సంగంలాగా కాక స్వర్గంలో దేవి దేవతల యొక్క సమావేశంలాగా నాకు భావన కల్గుతోంది. ఈ సత్సంగము స్వర్గాశ్రమములో భగవంతుని ఆవాసంలో, పవిత్రమయిన గంగానది ఒడ్డున, మహామండలేశ్వరులు పరమపూజ్య శ్రీశ్రీశ్రీ శివానంద మహరాజు గారి పర్యవేక్షణలో జరిగింది. ఆయన సాక్షాత్తు శివ స్వరూపులు. దేవతా

స్వరూపులు. అలాంటప్పుడు ఆ సమావేశం అలా కాకుండా ఇంకొక విధంగా ఎలా ఉంటుంది? అది ఒక ఆధ్యాత్మిక పండగ వాతావరణాన్ని సృష్టించింది.

తర్వాత చాలా సంవత్సరాలకు మళ్ళీ స్వామీజీ సంపూర్ణమయిన బాధ్యత వహించి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న సమయంలో మేము ఋషికేశ్‌ని సందర్శించాము. ఈసారి నాతో పాటు కుమారి మోతీ, జ్ఞానేశ్వరీ ఇంకా అనేకమంది ఆశ్రమ సభ్యులు, అలాగే గురుకుల విద్యార్థులు ఉన్నారు. ఆ సమయంలో స్వామీజీ ఆరోగ్యం అంతగా బాగుండలేదు. అయినా వారు మా పట్ల పగలు, రాత్రి తేడా లేకుండా ఎంతో జాగ్రత్తగా, శ్రద్ధగా అన్ని ఏర్పాట్లు చేశారు. మా కోసం కొందరు ఆశ్రమ భక్తులను వినియోగించారు. మేము సౌకర్యంగా, సంతోషంగా ఉండే విధంగా జాగ్రత్త వహించారు. దాదాపు గంట గంటకీ స్వామీజీ మా కోసం ఏదో ఒక బహుమతులు పంపేవారు. యాపిల్స్, నారింజ పళ్ళు, పుస్తకాలు, మందులు, పూలదండలు, బిస్కెట్లు ఇంకా డబ్బాల్లో తినుబండారాలు పంపుతుండేవారు. మా కోసం ప్రత్యేకంగా ఆంధ్రా వంటకాలను వండించారు. మా పట్ల వారి దివ్యమయిన ప్రేమను అమృతంలాగా వర్షింపచేశారు.

ఈ విధమయిన గొప్ప ప్రేమ స్వామీజీ మా పట్ల చూపించారో అది మాకు ఆయన మా తోటపల్లి కొండల్లోని శాంతి ఆశ్రమంలో వారు నివసించిన రోజులను గుర్తుకు తెస్తోంది. ఆయన ఎప్పుడూ నన్ను తన సొంత వ్యక్తిలాగా భావించేవారు. ఆయన కంటే నన్ను ఎప్పుడూ భిన్నంగా అనుకునేవారు కాదు. ఒకరోజు నన్ను అడిగారు "స్వామీజీ! ఈ రోజు మనము ప్రత్యేకంగా ఆంధ్రా వంటకాలను తయారుచేయమని చెబుతాము. ఈ రోజు ప్రత్యేకంగా ఇడ్లీలు తయారుచేయించుకుందామా?" ఆయన చిన్నపిల్లవాడి మాదిరిగా, ఎప్పుడూ అవ్యాజ్యమయిన ప్రేమానురాగాలు, దయాగుణము కలిగి ఉండేవారు. వారు మా ఆశ్రమంలో నివసించినప్పుడు మేము ఎంతగానో ఆశీర్వదించ బడ్డాము. మాకు చేతనయిన విధంగా వారిని సేవించుకోగలిగాము. దానికి మారుగా మేము వారి వద్దనుండి వేయి రెట్లు అధికంగా ప్రేమ, సేవ పొందాము. ఆయన వారి పూర్తి ప్రేమను, అనురాగాన్ని, ఆశీస్సులను మా మీద వర్షంలాగా కురిపించారు. దాదాపు పది రోజులు మేము వారి ఆశ్రమంలో విడిది చేశాము.

చివరి రోజున మేము ప్రయాణమయి బయలుదేరే ముందు స్వామీజీకి ఆరోగ్యం బాగాలేకపోయినా ఆయన మమ్మల్ని అందర్నీ పిలిచి కూర్చోబెట్టుకున్నారు. గురుకుల

విద్యార్థుల చేత పాటలు పాడించుకుని విన్నారు. ఆయన శాంతి ఆశ్రమంలో ఉండగా వారు పాడిన పాటలే పిల్లలు పాడి వినిపించారు. స్వామీజీ ఆలోచనలు ఎంతో సున్నితంగా హృదయాన్ని కదిలిస్తాయి. మాకందరికి పేరు పేరునా అనేక పుస్తకాలు, మందులు, హిమాలయాల్లో దొరికే ప్రత్యేకమయిన మధురమైన తేనె మొదలైనవి బహుమతిగా ఇచ్చారు. ఆశ్రమవాసులకు, గురుకుల విద్యార్థులందరికీ బహుమతులు అందాయి. అంతేకాకుండా మా తిరుగు ప్రయాణానికి అవసరమయిన డబ్బు కూడా ఆయన ఇచ్చారు. దివ్యజీవన సంఘం సమావేశ మందిరంలో ఏర్పాటు చేయబడిన రెండు సత్సంగాలు కూడా ఎంతో దివ్యానుభూతిని కలిగిస్తూ ఇప్పటికి కూడా మా జ్ఞాపకాల్లో పదిలంగా ఉన్నాయి. మేము అక్కడ గడిపిన పది రోజుల్లో స్వామి పరమానందజీ, స్వామి మాధవానంద జీ స్వామి వెంకటేశానంద జీ ఇంకా ఇతర సాధు మహాత్ములు మా పట్ల ఎంతో ప్రేమను చూపించారు.

1960 సంవత్సరంలో నేను కోటగిరిలో శాంతి కేంద్రములో ఉండగా అఖిల భారత దివ్యజీవన సమావేశాలు, అలాగే సకల మత సమ్మేళనము మైసూరులో జరిగినప్పుడు స్వామి శివానంద మహరాజ్ గారి పట్ల నాకున్న అత్యంత గౌరవము వలన ఆ సభలకు నేను అధ్యక్షత వహించాను. లలితాదేవి, ఇంకా ఇతర ఆశ్రమ భక్తులు ఎందరో ఆ సమావేశాల్లో పాలుపంచుకున్నారు. ఆ సమావేశాలకి దాదాపుగా అన్ని సంప్రదాయాలకు చెందిన ఐదువేల మంది భక్తులు హాజరయ్యారు. దాదాపుగా పది గంటలు ప్రవచనాలు జరిగాయి.

స్వామీజీ జీవితము ఎంతో ఆదర్శవంతమయినది. అది నాకు మాత్రమే కాదు. ప్రపంచవ్యాప్తంగా, తూర్పు పడమర దేశాల్లోని లెక్కలేనంత మంది ఆత్మజ్ఞాన స్వరూపులకు ఆయన జీవితము గొప్ప ఆదర్శాన్నిచ్చింది. లక్ష్మీవిహార్‌లో నా గదిలో గత రెండు సంవత్సరాలుగా స్వామీజీ చిత్రపటము గోడ మీద ఉండేది. స్వామీజీ మహాసమాధి చెందారు అని నాకు కబురు తెలియడానికి కొద్ది సమయము ముందే నేను ఆ చిత్రపటాన్ని నా గది నుండి తీసివేసి ప్రక్కనే ఉన్న ఒక ఆంధ్ర భక్తుని గదిలో ఉంచాను. స్వామీజీ పరమపదించిన తర్వాత ఆయన దివ్యమయిన ఆత్మ నా లోపల ప్రవేశించిన అనుభూతి కల్గింది. దానికి ఎలాంటి కారణము నేను చెప్పలేను. ఆయన చిత్రపటము అయితే స్థలము మారింది కానీ, ఆయన దివ్యమయిన ఆత్మ అంతటా విశ్వవ్యాప్తమయినట్లుగా,

సర్వాంతర్యామిగా, సర్వశక్తిమయంగా, సర్వస్వంగా ఇంకా ఇంకా ఎక్కువగా అనుభవంలోనికి వస్తోంది. అందువలన ఇప్పుడు నేను ఇంతకు పూర్వం కంటే శక్తివంతంగా, నూతన ఉత్తేజంతో వారి ప్రేమానురాగాలతో కనిపించసాగాను.

స్వామీజీ యొక్క పవిత్రమయిన ఆత్మ నన్ను కౌగలించుకున్నప్పుడు కలిగే తన్మయత్వము, ఆనందానుభూతి నేను మీకు మాటల్లో ఎలా వివరించి చెప్పగలను? మా ఇద్దరిది సుదీర్ఘకాల సన్నిహిత అనుబంధము. ఇప్పుడు నేను ఇంతకు ముందు కంటే ఎక్కువగా స్వామీజీ సన్నిధిని, కౌగిలింతలో కలిగే దివ్యానుభూతిని నిరంతరము పొందుతున్నాను. ఎందుకంటే మా ఇద్దరికి ఎడబాటు అనేది లేదు.

**అధ్యాయం - 69**

# శాంతి పత్రిక - జనవరి 1964 - చికిత్సాలయంలో...

శ్రీ స్వామి ఓంకార్ గారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవడానికి మన పత్రిక పాఠకులు ప్రియమయిన భక్తులు ఆందోళన చెందుతుంటారు. కనుక ఆకస్మికంగా స్వామీజీ అనారోగ్యం పాలవటం గురించిన కొన్ని వివరాలను మీకు తెలియచేయడానికి ప్రయత్నిస్తున్నాము. ముందుగా, వారికి అనారోగ్యంగా ఉన్నప్పుడు సేవ చేసే అవకాశం లభించినందుకు, అలాగే ఎంతో సుదూర ప్రాంతాల నుండి స్వామీజీని దర్శించడానికి వచ్చిన అనేకమంది భక్తులను కలుసుకోవటం చక్కని అవకాశంగా భావిస్తున్నాను. నిరంతరము శ్రమతో కూడిన ఆశ్రమ బాధ్యతమూలంగా అవిశ్రాంతంగా శ్రమించటము వలన స్వామీజీకి గుండెజబ్బు వచ్చింది. విశాఖపట్టణంలోని సెయింట్ జోసఫ్ వారి మేరిలాండ్ నర్సింగ్‌హోమ్‌లో స్వామీజీని చేర్పించాము. వెంటనే ఆశ్రమ భక్తులకు ఈ క్రింది ఉత్తరాన్ని పంపించటము జరిగింది.

"స్వామీజీ అవిశ్రాంతంగా ఆశ్రమ కార్యక్రమాల్లో, నిర్వహణలో ఉండటము వలన ఆయన గుండె బలహీనమయింది. వైద్యులు ఆయనని వెంటనే వైద్యశాలకు విశ్రాంతి కోసం తరలించారు. స్వామీజీ మాత్రము తాను స్వర్గంలో ఉండి విశ్రాంతి తీసుకుంటూ శాంతిగా ఉండేందుకు అవకాశం లభించింది అన్నారు. ఆయన తన ప్రేమను అందరికి

తెలియచేస్తూ నిరంతరము భగవంతుని దివ్యానుభూతిలో ఉండవలసిందిగా భక్తులకు సందేశము పంపించమని కోరారు."

మీ అందరికి సానుభూతి ప్రేమకు ధన్యవాదాలు.

ఆయన నర్సింగ్‌హోమ్‌లో ఉన్న కొద్ది కాలములోనే మదర్ సుపీరియర్, నర్సులు, సిస్టర్లు అందరూ స్వామీజీని ఎంతో ప్రేమగా చూసుకున్నారు. స్వామీజీ కూడా వారితో కలిసిపోయి తాను కూడా ఒక క్రైస్తవ సన్న్యాసి లాగా భావించేవారు. చాలా ఆసక్తికరమయిన సందేశాన్ని స్వామీజీ వ్రాశారు. "స్వర్గసీమ లాంటి మేరిలాండ్‌కి ఎంతో మంది భక్తులు స్వామీజీని చూడడానికి వైద్యశాలకు వచ్చేవారు. స్వామీజీ మాట్లాడకూడదు కనుక వారి సందేశాన్ని కాగితంపైన వ్రాసి ఇచ్చేవారు. అది చదివి సందర్శకులు సంతోషించేవారు. వారు మౌనంగా కొద్దిసేపు ధ్యానం చేసి వెళ్ళేవారు. స్వామీజీ ఆశయము, కోరిక ఏమిటంటే ఆయన ఆరోగ్యంగా ఉన్నా లేదా అనారోగ్యంగా ఉన్నా సరే, తన వద్దకు వచ్చిన భక్తులు ఖాళీ హృదయాలతో తిరిగి వెళ్ళరాదు. వారు భగవంతుని దివ్యానుభూతిని ఇప్పుడే ఇక్కడే అనుభవించాలి. అందువలన స్వామీజీ వారిని భగవదనుభూతిని వారితో తీసుకొని వెళ్ళమని కోరేవారు. వారిచ్చిన సందేశము ఈ విధంగా ఉంది.

"ప్రియతములారా! శాంతి, ఆరోగ్యము, సంతోషము మిమ్మల్ని చూడటంవలన కలిగాయి. వైద్యులు నన్ను మాట్లాడకూడదు అని ఆజ్ఞాపించారు. కానీ నేను మీ అందరిలో ఆ దైవాన్ని చూస్తున్నాను. భగవంతుడు సర్వాంతర్యామి కనుక. మీరందరూ దైవానికి ప్రతిరూపాలు. భగవంతుని ఉనికిని అనుభూతి చెందటానికి ఈ విధంగా మీరందరూ నాకు దయచేసి సహకరించండి. ఇది మీ సోదరుడి ప్రార్థన. మీ అందరిని ప్రేమించే, మీ అందరి శాంతిని కోరే మీ జీవిత గమ్యమయిన మీ జన్మహక్కును పొందాలని ఆశించే మీ ఓంకార్".

స్వామీజీని మర్చిపోండి కాని భగవంతుని దివ్యానుభూతిని నిరంతరము పొందండి.

స్వామి చిన్మయానంద గారు తన శిష్య పరివారముతో కలిసి వచ్చి స్వామీజీని పరామర్శించి వెళ్ళటము మర్చిపోలేని మధురానుభూతి. ఆయన ఆశ్రమానికి శ్రేయోభిలాషి. అలాగే స్వామీజీకి పాత స్నేహితుడు ఆయన ఎంతో జ్ఞానముతో కూడిన

సందేశాలను శాంతి పత్రికకి తరుచుగా పంపించేవారు. ఆయనవిశ్వశాంతి ప్రార్థన సంస్కృతములోనికి అనువాదం చేశారు. స్వామీజీ చేసే కార్యక్రమాలను అభినందించే వారు.

'మేరిలాండ్' నర్సింగ్‌హోమ్ గురించిన నా అనుభూతులను మీతో పంచుకోవాలని అనుకుంటున్నాను. 'మేరిలాండ్' మేరిమాత లాంటి వారికి నివాస స్థలము. మదర్ సుపీరియర్ నిజంగా జీవించి ఉన్న మేరిమాత లాంటిది. ఆమె హృదయం ప్రేమ, దయాగుణాలతో నిండి ఉండేది. యజమాని ఎలాంటి వాడు అయితే అతని సేవకులు కూడా అలాంటివారే అవుతారు. అందువలన అక్కడి సోదరీమణులు అందరూ మదర్ రెయిన్ అడుగుజాడల్లో నడిచేవారే. సేవాగుణమే వారి జీవిత దృక్పథము. అందుకు బదులుగా వారు ఎలాంటి బిరుదులు, గౌరవాలు ఆశించేవారు కాదు. మేరిలాండ్‌లో నివసించే నిస్వార్థ సేవా పరాయణులు, ప్రేమమూర్తులు భగవంతునిచే ఆశీర్వదించబడిన అమృతమూర్తులు. సేవ, ప్రేమలకు వారి జీవితాలను అంకితం చేశారు. మేరిలాండ్‌లో నేను మూడు రోజులు ఉండే అవకాశం లభించింది. మదర్ సుపీరియర్, ఇతర సిస్టర్ల సేవలను ఆంగీకరించవలసి వచ్చింది.

నా మంచి కర్మల ఫలితంగానే నేను ఇక్కడికి తీసుకురాబడ్డాను. అందువల్లనే వారి పవిత్రమయిన జీవితాలను చూచే అవకాశం లభించింది. సెయింట్ జోసఫ్ వైద్యశాల నర్సింగ్‌హోమ్‌లాగా ఉండదు. ఒక పవిత్రమయిన ప్రార్థనా స్థలం లాగా, ధ్యాన మందిరం లాగా ఉంటుంది. అందువలన ఇక్కడ ఉండే రోగులకి తాము జబ్బుతో ఉన్నాము అనే విషయమే గుర్తుండదు. ఇక్కడ ఉదయము, మధ్యాహ్నము, సాయంత్రము, రాత్రివేళల్లో ప్రార్థనలు చేస్తారు. ఇక ఆదివారము నాడు ప్రత్యేక ప్రార్థనలుంటాయి. నర్సింగ్‌హోమ్‌లోని రోగులకు స్వస్థత చేకూర్చమని, అలాగే సర్వమానవాళి సంక్షేమము కోసం నిరంతర ప్రార్థనలు జరుగుతాయి. జాతి, మతము, కులము, దేశము అనే భేదభావము లేకుండా సర్వ జనులు సంతోషంగా ఉండాలని ప్రార్థిస్తారు.

వీరి ప్రార్థనల ప్రభావం ఎంతగా ఉంటుంది అంటే అక్కడి రోగులకు మందుల అవసరం ఉండదు. నేను వారితో హృదయపూర్వకంగా చెప్పాను. మదర్ సుపీరియర్ మరియు ఇతర సోదరీమణుల హృదయంలో భగవంతుడు నివాసమున్నాడని. అందుకు బదులుగా వారు భగవంతుడు కేవలం అంకిత హృదయాల్లోనే కాకుండా భగవంతుని

బిడ్డలందరి హృదయాల్లో కొలువై ఉంటాడని చెప్పారు. ఆ మాటల్లో ఎంత సత్యమున్నది? ఎందుకంటే భగవంతుడు సర్వాంతర్యామి కదా! ఆయన ఉండని స్థలం అంటూ ఎక్కడ ఉంటుంది? జీవుడి శరీరం లోపలా ఉంటాడు. బాహ్యంలో ఈ ప్రపంచమంతటా విస్తరించి, ఆవరించి ఉంటాడు. సూదిమొన మోపినంత స్థలం కూడా భగవంతుడు లేని ప్రదేశము ఈ ప్రపంచంలో ఉండదు.

ప్రతి చోటా భగవంతుని దర్శించేవారు, ప్రతి ధ్వనిలోనూ ఆయనని అనుభవించే వారు నిజంగా ధన్యులు అవుతారు. అందరూ కనిపించని ఆ భగవంతుని ప్రతిరూపాలే. మేరిలాండ్ హాస్పిటల్‌లో మంచంపైన పడుకొని ఉన్న నాకు అనంతమయిన జలరాశితో ఉన్న సముద్రము నిరంతరము ప్రార్థనలు చేస్తున్నట్లుగా అనిపిస్తుంది. “నీవు ఎందుకు ప్రార్థన చేయటం లేదు మానవుడా?” అని ప్రశ్నిస్తుంది. అది పగలు, రాత్రి తేడా లేకుండా ప్రార్థనలు చేస్తూనే ఉంది. మనము కూడా అలాగే ప్రార్థనలు చేద్దాము. ప్రతి కెరటము కూడా ఒక ప్రార్థనే. మనలో కదిలే ప్రతి ఆలోచనా కూడా ఒక ప్రార్థన కావాలి. కొన్నిసార్లు సముద్రము అల్లకల్లోలముగా మారిపోయి, అశాంతిగా, గర్జిస్తూ ఉంటుంది. అది ప్రశాంతంగా విశ్రాంతిగా ఉన్నప్పుడు అది మనకు ఎంతో ఆహ్లాదాన్ని, సంతోషాన్ని, శాంతిని అందిస్తుంది. మన జీవితాలు కూడా ప్రశాంతంగా ఉన్న సముద్రములాగా ఇతరులకు ప్రేమను, సంతోషాన్ని, ఆనందాన్ని, ఆహ్లాదాన్ని అందించాలి.

అక్కడ నేను ఉన్న రోజుల్లో నాకు ఎన్నో ఆధ్యాత్మికమయిన వ్యక్తిగత అనుభవాలు కలిగాయి. నిరంతరము భగవంతుని దివ్యానుభూతిని అనుభవించాను. ఒక రోజు అర్థరాత్రి వేళ ఒక సిస్టర్ లాంతరుతో నా గదికి వచ్చినప్పుడు నేను మెలకువగా ఉండడం చూచి ఆశ్చర్యపోయింది. ఆమె నన్ను ఎందుకు మేలుకొని ఉన్నారు? అని అడిగింది. నేను తన్మయత్వంతో ఆమెతో చెప్పాను “భగవంతుడు మేలుకొని ఉండగా నేను ఏ విధంగా నిద్రపోగలను?”

## ఆధ్యాత్మిక విశ్వసంబంధమయిన అనుభవాలు

ఈ సందేశాన్ని ఇంకా చాలా పెద్దదిగా చేయాలని లేదు. మా వైద్యులు, స్నేహితులు నా ఆరోగ్యం బాగాలేదు కనుక, గుండె జబ్బు ఉంది కనుక నన్ను మౌనంగా ఉండమని, మాట్లాడవద్దని, వ్రాయటం కూడా మంచిది కాదని చెప్పారు.

మదర్ మేరీకి నన్ను వారి మత సంబంధమయిన మందిరంలోనికి, పవిత్రమయిన ప్రార్థనా మందిరములోనికి, ఎక్కడయితే వారు రాత్రి, పగలు ప్రార్థనలు చేస్తుంటారో అక్కడికి తీసుకువెళ్ళటము నాకు చాలా ఆనందాన్ని కలిగించిన క్షణాలు. ఆమె ఎంతో ప్రేమతో నా గురించి, నా ఆరోగ్యం గురించి ప్రత్యేక ప్రార్థనలు చేసింది. అక్కడి క్రైస్తవ సన్యాసినులు అందరూ మోకాళ్ళ మీద కూర్చుని ప్రార్థనలు చేయటం చూస్తుంటే నాలో ఏదో తెలియని ప్రేరణ, ఉత్తేజము కలిగింది. వారందరూ కళ్ళు మూసుకొని చేతిలో జపమాలను త్రిప్పుతూ ప్రార్థనలు చేస్తున్నారు. నాకు కూడా అప్పుడు వారి లాగా జపమాల పట్టుకొని ప్రార్థన చేయాలనిపించింది. దాని వలన భగవంతుని అనుభూతిని నిరంతరాయంగా పొందవచ్చు. నేను అక్కడ ఉన్నకొద్ది సమయంలో నాకున్న గుండె జబ్బు గురించి గాని, నా గురించి గాని పూర్తిగా మర్చిపోయాను. అమాయకంగా కనిపిస్తున్న జీసెస్ క్రీస్తు ముఖం చూస్తూ ఉంటే కేవలం పరమాత్ముని సన్నిధి మాత్రమే అనుభవంలోకి వస్తోంది.

ఒకరోజు నేను నా ధ్యానములో గాఢంగా లీనమయిపోయి, ఉన్నతమయిన, సంతోషకరమైన స్థితిలో అంతరాంతరాలలో 'సోహం' భావనలో ఉండగా మదర్ సుపీరియర్ నా వద్దకు వచ్చి రెండు జపమాలలను చూపించారు. అందులో ఒకటి ముత్యాలతో కూర్చినది. రెండవది చందనముతో తయారుచేసినది. అందులో ఒక దానిని నా వ్యక్తిగత జపమాల కోసం ఎన్నుకోవలసిందిగా ఆమె చెప్పారు. "స్వామీజీ! దయచేసి ఇందులో ఒకదానిని ఎంచుకోండి. మీరు మీ పవిత్ర నామ జపమయినా చేసుకోవచ్చును. కాని దయచేసి మొదటి నామము మాత్రము మేరి మాతది అయిఉండాలి" అన్నారు. నాకు అందరూ ప్రేమమూర్తులు, సేవామూర్తులయిన తల్లులు ఎందరో తూర్పు, పడమర దేశాల్లో ఉన్నారు. అలాగే నేను ఎప్పుడూ అందరూ దేవతామూర్తులను పూజిస్తాను, ఆరాధిస్తాను. మేరీమాత, లక్ష్మీదేవి, సరస్వతి, పార్వతి ఇలా అందరూ కూడా పరాశక్తి యొక్క ప్రతిరూపాలే కదా! అందరూ ఈ జగత్తుకు తల్లులే. జగన్మాతలు. అందువలన నేను సంతోషంగా ఆమె షరతుకు అంగీకరించాను.

చందనము ఎప్పుడు పవిత్రమయిన సుగంధాన్ని వెదజల్లుతుంది. అందుకే నేను దానినే సంతోషంగా ఎంచుకున్నాను. ఆ పవిత్రమయిన జపమాలను నేను తరుచుగా వాడి గొప్ప లాభాన్ని పొందాను. రోజులు గడిచేకొద్దీ ఆ జపమాల నా చేతుల్లోంచి జారి

పడిపోయేది. నా చేతులు తిమ్మెర్లు ఎక్కేవి. బాహ్యంగా జరిగే జపము ఆగిపోయి ఆంతర్యంలో జపము నిరంతరాయంగా జరిగిపోతుండేది. అది నిరంతరము 'సోహం' తో కలిసిపోతుండేది. నేను శ్వాస పీల్చి వదిలేటప్పుడు అది విశ్వ సంబంధమయిన శ్వాసగా మారిపోయి, సముద్రాలు, ఖండాలు దాటిపోయి గ్రహాలు చుట్టూ తిరుగుతుండేది, సోహం అన్నింటినీ ఏకం చేసివేస్తుంది. ఏ ఒక్కదానిని వదిలిపెట్టదు. ప్రతి శ్వాస ద్వారా ప్రకృతి రూపంలోని పరమాత్మ, ఈ ప్రపంచము అంతా జీవంతో, ప్రేమతో, సహస్ర సూర్యకాంతితో నిండిపోయేది.

అందువలన నేను 'సోహం' భావనని నిరంతరాయంగా జపిస్తూండేవాడిని. ఎంత మహోన్నతమయిన స్థితికి, పరమగమ్యానికి చేరుకున్నానంటే అక్కడ శ్వాస, ప్రతి శ్వాస లేవు. కేవలం నిశ్శబ్ద, నిరాకార, నిశ్చలస్థితిలో ఉండిపోయేవాడిని. మిలియన్ల సూర్యకాంతి తేజోమండలంలో ఆత్మజ్ఞానస్థితిలో వెలుగొందేవాడిని.

ఎక్కడ మంచి ఉన్నా దానినుండి నేర్చుకోవటం నా స్వభావం. అది చిన్నప్పటి నుండి నాకు అలవాటుగా ఉండేది. మేరిలాండ్ నర్సింగ్‌హోమ్‌లో అలాగే వారి ధ్యానమందిరంలో నేను గడిపిన పవిత్ర క్షణాలు నన్ను భగవంతునికి ప్రతిజ్ఞ చేసే విధంగా ప్రేరేపించాయి. నేను కూడా సుశీలా వైద్యశాలలో ఒక ప్రత్యేకమయిన ధ్యానమందిరాన్ని కట్టిస్తానని అనుకున్నాను. నేను జబ్బుతో మంచంపై పడుకొని కూడా, నా హృదయం ఆనందంతో చూస్తోంది, తోటపల్లి కొండల్లోని ఆశ్రమంలో వైద్యశాలలోని వైద్యులు, నర్సులు పనిచేసేవారు. రోగులు అందరూ ఆ ధ్యానమందిరములో సంతోషంగా ప్రార్థనలు చేయటం కనిపిస్తోంది. అది వారికి చాలా ఉత్తేజాన్ని, ధైర్యాన్ని ఇస్తుంది. కొద్ది నిముషాలు భగవంతుని సన్నిధిలో గడిపి ప్రార్థించటం వలన భగవంతుడే ఈ ప్రపంచంలోని వారందరిని మౌనంగా రోగ విముక్తులను చేస్తాడు.

భారతదేశము అనాది కాలమునుండి కూడా ఆధ్యాత్మిక భూమిగా పేరు గాంచింది. మనకు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా మన రాజకీయ నాయకులు ఆలస్యం చేయకుండా అన్ని రంగాలలో ఆధ్యాత్మిక మందిరాలను నిర్మించాలి. దాని వలన వారు ఆయా రంగాలలో చక్కగా పనిచేయగల్గుతారు. భగవంతుని గొప్ప ఆశీస్సులు వారికి అందుతాయి. వారి పని మొదలుపెట్టే ముందు కొద్దిసేపు నిశ్శబ్దంగా ధ్యానంలో గడుపుతారు. నాతో ఒకసారి ఎవరో చెప్పారు. భగవంతుడే రోగులకు జబ్బులు నయం

చేస్తాడు. కానీ ఆ గొప్పతనము వైద్యులకు చెందుతుంది. కాని ఎప్పుడయినా ఏ రోగి అయినా జబ్బుతో మరణించినప్పుడు మాత్రం వారు అంటూ ఉంటారు, అదంతా భగవంతుని నిర్ణయము లేదా ఆ రోగి కర్మ వల్ల జరిగిందని.

'మేరీలాండ్'లో నేను గడిపిన క్షణాలను గుర్తు చేసుకుంటూ ఒక చేతితో ప్రేమ, మరో చేతితో మానవత్వము మూర్తీభవించిన పరమాత్మను ఆలింగనము చేసుకుంటున్నాను. భగవాన్! ఇతరులు గొప్పవారు, కీర్తిమంతులు అగుదురు గాక! మరియు నేను అజ్ఞాతంగా, గుర్తింపు లేకుండా, వినయంగా మరుగున ఉండిపోదును గాక!

అధ్యాయం - 70

# వారసత్వము మరియు వీలునామా

మేరిలాండ్‌లో నేను తల్లులందరితో కలిసి ఉండటం వలన నన్ను నా మనస్సులోని నా ప్రియమయిన పాఠకులకు చెప్పినట్లుగా నా వారసుల గురించి, మరియు నా మాతృదేవతలందరి గురించి వివరంగా చెప్పాలనుకుంటున్నాను. ఏ విధంగా ఆ మాతృమూర్తులు నాపైన వారి ప్రేమామృతాన్ని వర్షంలాగా కురిపించారో, ఎంతో ప్రేమతో, అంకితభావంతో గత డెబ్భై ఏడు సంవత్సరాలుగా నన్ను చూసుకున్నారో చెప్పాలి.

## మాతృమూర్తులు

ప్రారంభించాలి అంటే ముందుగా నాకు జన్మనిచ్చిన మాతృమూర్తి చనిపోయింది. నేను చాలా చిన్నవాడిగా ఉండగానే, నాకు ఊహ తెలియకముందే ఆమె దేహం చాలించింది. కాని భగవంతుడు నాకు మాతృప్రేమను దూరం చేయలేదు. అంతేకాక ఎందరో మాతృమూర్తులను తూర్పు పడమర దేశాల్లో ఏర్పరచి నన్ను ఆశీర్వదించాడు. నేను స్కూలుకి వెళ్ళేటప్పుడు విశాఖపట్టణంలో మా అక్కగారి వద్ద ఉండేవాడిని. ఆమె పేరు వెంకాయమ్మ, భర్త గారు రెడ్డమ్ గార్డెన్ వద్ద ఉండేవారు. వారిద్దరూ నన్ను సొంత బిడ్డలాగా ప్రేమతో చూసుకున్నారు. మా అక్కగారు సొంత తల్లిలాగా ఎంతో ప్రేమతో

లాలించేది. నా పట్ల మమతానురాగాలు చూపించేది. తర్వాత మాతృమూర్తి రత్నం వారి భర్త శ్రీ కె. రామారావు నన్ను హిమాలయాల నుండి పిలిపించి రాజమండ్రి, పరిసర ప్రాంతాల భక్తులకు సేవలందించేందుకు ఏర్పాట్లు చేశారు. వాళ్ళిద్దరూ కూడా నాకు తల్లిదండ్రుల వంటివారే. రత్నంగారు నిజంగా తల్లి వంటిదే. ఆమె నన్ను జాగ్రత్తగా చూసుకోవటమే కాకుండా నా ప్రతి అవసరాన్ని గుర్తుంచుకొని తీరుస్తుండేది. ఆమె ఇంటిని శాంతి ఆశ్రమానికి అనుబంధ శాఖగా మార్చివేసి భక్తులందరికి ఎంతో ప్రేమతో సేవలందించి భగవంతుని దివ్యానుభూతిని కలిగేలా చేసేది. ఆమె తన చిన్న కుమారుడు ఆత్మారామ్‌ని నేను రెండవ పర్యాయము అమెరికా వెళ్ళినప్పుడు నాతో పంపించింది. ఆమె ఎప్పుడు తనకు ఇద్దరు కాదు ముగ్గురు కుమారులు అని చెప్పేది. సోదరి సుశీలాదేవి మొదటిసారి భారతదేశం వచ్చినప్పుడు మాతృమూర్తి రత్నం గారు ఆమె పట్ల ఎంతో శ్రద్ధ వహించింది. ఆమెకు తేలికయిన ఆహారము, పౌష్ఠికాహారము సమకూర్చి భారతీయ సంస్కృతిని అలవాటు చేసింది. రామారావు గారు శాంతి ఆశ్రమంలోనే వారి చివరి రోజులు గడిపారు. అమ్మ రత్నం గారు ఆమె సమయాన్ని ముగ్గురు బిడ్డలకి పంచి పెట్టారు. మాతృ ఆశ్రమంలోని అందమయిన ధ్యాన మందిరము ఎంతో దయతో రామారావు రత్నం దంపతులే కట్టించారు. మధ్యాహ్నం వేళ ఆశ్రమవాసులు సత్సంగాలకు హాజరయినప్పుడు నేను ఎప్పుడు వారిని తలుచుకొని ఆశీర్వదిస్తూ ఉంటాను.

మేరిలాండ్‌లోని మాతృమూర్తుల ధ్యానమందిరం స్ఫూర్తితో మేమిప్పుడు సుశీలా వైద్యశాలలో రెండవ అంతస్తు కడుతున్నాము. అది ఒక ఆధ్యాత్మికంగా జబ్బులను నయం చేసే కేంద్రంలాగా అవుతుంది. అక్కడ భక్తి భావం కల ఆత్మ స్వరూపులు నిరంతరము ప్రార్థనలు చేస్తారు. రోగుల కోసం వారి బాధలనుండి విముక్తి కోసం భగవంతుని బిడ్డలందరి యోగక్షేమాల కోసం ప్రార్థనలు చేస్తారు.

శాంతి ఆశ్రమములోని కమలా మందిరంలో ఎందరో సాధకులు సంతోషంగా నివసిస్తున్నారు. ఆ మందిరాన్ని మద్రాసు నివాసులయిన శ్రీమతి కమలాదేవి ఆమె భర్త ఆనందరావు గార్ల వితరణ వలన నిర్మించబడింది. కమలాదేవి ఎప్పుడు ఆశ్రమానికి వచ్చి విశ్రాంతిగా గడపాలన్నా, ధ్యానము చేసుకోవాలన్నా ఆ మందిరములోనే బస చేస్తుంది. ఆమె అందించిన బహుమతి ఆశ్రమంలో నివసించే అనేకమంది సాధకులకు, జిజ్ఞాసువులకు గొప్ప వరం అని చెప్పాలి. వారందరూ చక్కగా సాధనలో, ధ్యానములో

నిమగ్నమయి ప్రశాంతంగా వారి మానవజన్మ యొక్క గమ్యాన్ని తెలుసుకొని, జీవితాన్ని సార్థకము చేసుకుంటున్నారు. ఆమెలో వసించే పరమాత్మను దర్శించగల్గుతున్నారు. నేను అమెరికా నుండి తిరిగివచ్చినప్పుడు మద్రాసులో కమలాదేవి, ఆమె భర్త, వారి ముగ్గురు ఆధ్యాత్మికంగా ఉన్నతస్థితికి చేరుకున్న కుమార్తెలు మనోరమ, సుశీలా మరియు సుమతి వచ్చి వారింటికి తీసుకువెళ్ళేవారు. మద్రాసులోని ఆధ్యాత్మిక వాసనలు గల జిజ్ఞాసువులందరినీ సమావేశపరిచి వారి కుటుంబము ఎన్నో సత్సంగాలు నిర్వహించేది. కమలమ్మ గారు ఎన్నో సంవత్సరాలుగా శాంతి ఆశ్రమంలో ఉండి మాతృ హృదయంతో అందరినీ ప్రేమించి సేవలందించారు. ప్రతి సంవత్సరము నా పుట్టినరోజు వేడుకలకి ఆమె వచ్చి ఒక నెల రోజులు ఆశ్రమంలోనే ఉండి ధ్యానములో కాలం గడుపుతూ తన మధురమైన కంఠంతో చక్కని భజనలు, సంకీర్తనలు పాడేది. ఆ విధంగా ఆమె మమ్మల్ని సంతోషపెట్టేది. ఆమె వలె భక్తి భావం గల ఆమె కుమార్తె మనోరమ కూడా బెంగుళూరు నుండి తరుచుగా వచ్చి తన వయొలిన్‌పై అద్భుతమయిన సంగీతాన్ని వినిపించి మమ్మల్ని మంత్ర ముగ్ధులను చేసేది. ఆమె పాటలు ఎంతో ఆత్మానందాన్ని కలిగించేవి.

మాతృదేవి మరియామాత గొప్ప మాతృప్రేమ కలిగిన తల్లి. ఆమె నన్ను తన దత్తపుత్రుడిలా కాకుండా తన గర్భంలో నుండి తన రక్తమాంసాలు పంచుకుని పుట్టిన సొంత బిడ్డలాగా ప్రేమించేది. నేను ఆమె జీవితములో ఒక భాగం అయిపోయాను. ఆమె తనకు సాధ్యమయినంత త్యాగాన్ని నా క్షేమం కోసం, శాంతి ప్రచారం కోసం చేసింది. ఆమె భారతదేశానికి సుశీలాదేవితో పాటుగా రావాలని, ఇక్కడే తన శేష జీవితాన్ని సంపూర్ణంగా గడపాలని నిర్ణయించుకుంది. కానీ అనుకోకుండా ఆకస్మికంగా సుశీలాదేవి మరణించటం వలన తన నిర్ణయాన్ని మార్చుకుంది. నేను నా ప్రియమయిన పాఠకులతో సుశీలాదేవి మరణించినప్పుడు హృదయాలను కదిలించివేసే విధంగా ప్రేమతో మరియా మాతృదేవి వ్రాసిన ఉత్తరాన్ని మీ కోసం ఇక్కడ పొందుపరుస్తున్నాను.

"నా అపురూపమయిన ఓంకార్,

ఆ సర్వేశ్వరుడు నిన్ను నా కోసం ఎల్లప్పుడూ క్షేమంగా ఉంచుగాక! నేను ఎప్పుడూ నీ హృదయంలోనే నివసించి ఉంటానని తెలుసుకో. ఆ భగవంతుడు నిన్ను సదా చెడు నుండి రక్షించి క్షేమంగా ఉంచుగాక!

ఈ రోజు నేను నా జీవితంలో ఎన్నడూ అనుభవించనంతగా విషాదంలో మునిగి పోయాను. నీకు తెలుసా? నా ప్రియమయిన సుశీలాదేవి దేహాన్ని పరిత్యజించి ఉన్నత లోకాలను చేరుకుంది. ఇక ఇప్పుడు ఆమె భూమి మీద పుణ్యక్షేత్రాలు కాకుండా స్వర్గంలో నివాసం ఏర్పరుచుకుంది.

మేమిద్దరము కలిసి అతి తొందరలో భారతదేశానికి రావాలని ప్రయత్నాలు, సన్నాహాలు చేసుకున్నాము. మేము నిన్ను అమెరికా రమ్మని ఆహ్వానించాలనుకొన్నాము. అప్పుడు నేను కూడా నీతో కలిసి భారతదేశానికి రావచ్చు అనుకున్నాను. ఓ.... ఓంకార్! ఈ రాత్రి నేను చాలా విషాదంలో మునిగిపోయాను. ఎందుకంటే నా ప్రియమయిన, ప్రేమ మూర్తి సుశీలాదేవి నాతో కలిసి ఇక భారతదేశానికి ఎప్పటికీ రాలేదు. నేను భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. ప్రేమమయుడయిన, నిత్యుడయిన తండ్రిని ఆమెను జాగ్రత్తగా చూసుకోమని, నీవు, నేను ఆమె ప్రేమించే వ్యక్తులందరము ఆమెను కలుసుకునేంతవరకు. ఆమె ప్రియమయిన ఉత్తరాలు ఇంక నేను చదవలేను. భగవంతుడు ఆమె ఆత్మకు శాంతి చేకూర్చుగాక! స్వర్గలోకంలో సర్వేశ్వరుడి చెంత ఆయన చేతుల్లో మన సుశీల ప్రశాంతంగా సేదతీరుతుంది.

నేను చాలా దిగ్భ్రాంతి చెందాను. నేను సరిగ్గా ఆలోచించ లేకపోతున్నాను. ఆమె కోసం ఎదురుచూస్తూ నేను తనగదిని చక్కగా సర్దుతున్నాను. ఆమె పడకను ఏర్పాటు చేస్తున్నాను. మన సుశీల, మీ సుశీల, ఈ ప్రపంచానికి సుశీల. ఆమె అందరినీ ప్రేమిస్తుంది. అలాంటి ఇంకొక వ్యక్తిని మళ్ళీ మనము చూడలేము. ఆమె నాకు ప్రియమయిన బిడ్డలాంటిది.

ప్రియమైన హృదయమా! ఇప్పుడు అర్ధరాత్రి దాటింది. ఇక నేను తప్పనిసరిగా నిద్రపోవాలి. కానీ నేను చాలా దుఃఖంతో, విచారంగా ఉన్నాను. శుభరాత్రి నా ప్రియమైన బిడ్డా!

ఎప్పుడూ నీ ప్రేమమయమయిన మాతృహృదయంతో మరియా మాతృదేవి”

శ్రీమతి జీన్‌లిల్లి, మన శాంతిదేవి, శ్రీమతి ఇ.బి. హోగన్ మాతా జగదంబ, అలాగే మిల్‌డ్రడ్ హేవార్డ్ జ్ఞానాదేవి మొదలైన వారు అమెరికాలోని మాతృమూర్తులు. వారందరూ

ఎంతో సహృదయంతో వారి గృహాలను శాంతి కేంద్రాలుగా, శాంతి సెంటర్లుగా మార్చివేశారు. శాంతి దేవి నా గురించి ఎంతో శ్రద్ధ వహించింది. నా తుంటి ఎముక రెండు పర్యాయాలు విరిగిన సందర్భంలో ఆమె చేసిన సేవలు నిరుపమానమయినవి. ఆమె న్యూయార్క్ నగర వాసులకు శాంతి కేంద్రము ద్వారా శాంతిని ప్రసాదించింది. జ్ఞానాదేవి, ఆమె భర్త జాన్‌హేవార్డ్ ఇద్దరు చాలా ఉత్తములు, జ్ఞానాదేవి రచయిత్రి. ఆమె వ్రాసిన 'స్వామి ఓంకార్' ఈ అధ్యాయము చివరిలో చేర్చబడింది.

మాతృమూర్తి జగదంబ ఒక పర్యాయము భారతదేశాన్ని పర్యటించి కైలాస ఆశ్రమము, వాల్తేరు ఆశ్రమములలో కొద్ది కాలము గడిపింది. ఆమెకు హిందూ మత ధర్మాలని బోధించే విద్యాలయాన్ని నెలకొల్పటానికి సహాయపడటంలో చాలా ఆసక్తి ఉండేది. దాని కోసం ఆమె భారతదేశంలోని ప్రముఖులను కలుసుకునేది. వారిలో పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, డా॥ స్వామి జ్ఞానానంద జీ అలాగే డా॥ కె. సచ్చిదానందమూర్తి గారు ఆంధ్రా విశ్వవిద్యాలయము భౌతిక శాస్త్రము అలాగే వేదాంత శాస్త్రము డిపార్టుమెంట్‌కు చెందినవారు కూడా ఉన్నారు.

శాంతిదేవి గుర్తు వచ్చినప్పుడల్లా సంతు మౌనిదేవిని ప్రేమ, అంకితభావము గల ఆమెను గుర్తు చేసుకునేవాడిని. భారతమాత గురించి ఎంతో అద్భుతంగా మధురంగా ఆమె గీతాలు ఆలపించేవారు. ఆమె మా ఆశ్రమంలో ఎక్కువ కాలం గడిపారు. అలాగే ఆమె సుశీలాదేవిని ఎంతగానో ప్రేమించారు. నేను మళ్ళీ అమెరికా దేశం వెళుతున్నాను అని తెల్సినప్పుడే ఆమె అన్నారు"ఆహా! సూర్యుడు ఇప్పుడు పడమర దేశాల్లో మరింత ఉజ్జ్వలంగా ప్రకాశాన్ని అందిస్తాడు. ఇక తూర్పు దేశాల్లో సూర్యుని తేజస్సు తగ్గిపోతుంది."

మా స్విస్ మాతృమూర్తి శ్రీమతి బెట్టి ఫారెస్టర్ మంచి భక్తురాలు. ఒక సంవత్సర కాలము భారతదేశంలో మాతో కలిసి ఉండడానికి వచ్చింది. ఆమెకు శాంతి దేవి అనే ఆధ్యాత్మిక పేరును ఇవ్వాలని నాకు మనఃస్ఫూర్తిగా అనిపించింది. ఆమె ఆశ్రమంలో ఉన్న సంవత్సర కాలంలో విశ్వశాంతి ప్రార్థనని ఫ్రెంచ్ భాషలోనికి అనువదించడమే కాకుండా ఎన్నో ఆధ్యాత్మిక ఫ్రెంచ్ పాటలను పాడి వినిపించేవారు. ఆమె వాల్తేరు, కైలాస ఆశ్రమాలను సందర్శించి అనేక విధాలుగా ఆశ్రమ అభివృద్ధికి సహకరించారు. ఇప్పుడు ఆమె తిరిగి స్విట్జర్లాండ్ దేశానికి వెళ్ళిపోయినా తరుచుగా ఉత్తరాలు వ్రాస్తూ పలు మంచి బహుమతులను, చిత్రపటాలను ఆశ్రమానికి పంపుతూ ఉంటారు.

ఎక్కడ మాతృ ఆశ్రమము, ఎక్కడ యూరప్? చాలా ఆశ్చర్యకరంగా చాలా మంది భక్తుల నుండి మాకు ఉత్తరాలు రావటం మొదలయ్యింది. ముఖ్యంగా జర్మనీ, స్విట్జర్లాండ్, స్వీడన్, ఫ్రాన్స్, జకోస్లోవేకియా ఇంకా ఎన్నో ఇతర దేశాల నుండి భక్తుల నుండి ఉత్తరాలు వస్తుండేవి. శ్రీమతి ఇర్మ్‌గార్డ్ స్క్వోల్డ్ ఆమెకు నేను గంగామాయి అని పేరు పెట్టాను. ఆమె మంచి భక్తురాలుగా మారి విశ్వశాంతి ప్రార్థనని జర్మనీ భాషలోనికి అనువాదము చేసి జర్మన్ దేశస్తులందరికీ ప్రేమ, శాంతిని పంచిపెట్టింది. ఆమె ప్రేమ, భక్తి నిండుగా ఉన్న నిజమయిన మాతృమూర్తి. ఆమె 'ఆధ్యాత్మిక మెరుపులు' గ్రంథానికి ప్రతి అధ్యాయం ప్రారంభంలో ఒక కవితను చక్కగా కూర్చింది. ఇంకా ఎందరో భక్తులు మేము వారిని భౌతికంగా చూడకపోయినా మాకు మంచి స్నేహితులుగా మారిపోయారు. వారిలో వ్యాస, ఆల్‌బర్డ్ మోల్డ్‌న్‌హర్ ముఖ్యులు. భగవంతుడు మా గంగామాయికి ఆమె ఆధ్యాత్మిక జీవితానికి ఆశీస్సులు అందించుగాక! అలాగే వివిధ ప్రాంతాల్లోని, ప్రపంచ దేశాల్లోని సోదర సోదరీమణులందరికి శాంతిని ప్రసాదించుగాక!

గొప్ప మాతృప్రేమ మూర్తీభవించిన ప్రేమమూర్తుల్లో దయామూర్తుల్లో ఒకరు మాతృశ్రీ రుత్తోన్ జీ హాంక్యాంగ్‌కి చెందినవారు. ఆమెతో పాటుగా రామ్‌దాస్ గారు శ్రీ పావో ఇంకా వారి ఇతర కుటుంబ సభ్యులు ఆధ్యాత్మిక భక్తి కుటుంబానికి చెందినవారు. కాలక్రమంలో మాతృశ్రీ రుత్తోన్ జీ అనేక విధాలుగా సహాయసహకారాలు అందించటం వలన ప్రపంచ వ్యాప్తంగా శాంతి మిషన్ ఎంతో పురోభివృద్ధిని సాధించిందని చెప్పాలి. భగవంతుడు నా పట్ల ఎంత మంచి చేశాడో వర్ణించడానికి నాకు తన్మయత్వంతో మాటలు రావటం లేదు. ఈ చిన్నపిల్లవాడి పట్ల ఆయన ఎంత దయ చూపించాడు. ఎంతో గొప్ప మాతృ హృదయం గల తల్లులను ప్రసాదించాడు. వారి భక్తి, అంకితభావం, ప్రేమ, శ్రద్ధ, దయాగుణము నా జీవితాన్ని నింపివేసింది.

## స్వామి ఓంకార్ - జ్ఞానాదేవి (మెలడ్రెడ్ షేవార్డ్)

దాదాపు మూడు సంవత్సరాల క్రితం నేను దివ్య శాస్త్రము గురించి పనిచేయటం మొదలుపెట్టాను. నేను అదృష్టవశాత్తూ పరమపూజ్యులు అయిన శ్రీ స్వామి ఓంకార్ గారిని కలుసుకుని ఆశీర్వదించబడ్డాను. శ్రీధన్‌గోపాల్ ముఖర్జీ భారత దేశము గురించి ఎన్నో విజ్ఞానవంతమయిన, అద్భుతమయిన గ్రంథాలను రచించారు. "భారతదేశపు

బిడ్డ సమాధానాలు" అనే వారు వ్రాసిన చివరి గ్రంథంలో పవిత్రమయిన పరమ పురుషుల్లో ఓంకార్ స్వామీజీ  ఆరుగురిలో ఒకరని ప్రస్థావించారు.

నేను స్వామి ఓంకార్ గురించి మాట్లాడుతున్నప్పుడు బాగా చదువుకున్న అమెరికన్ వనిత నన్ను 'పవిత్రమయిన వ్యక్తి' అంటే అర్థం ఏమిటి? మన మంత్రుల్లాగా అని మీ ఉద్దేశ్యమా? అని అడిగింది. అప్పుడే నాకు అర్థమయింది. తూర్పుదేశాల్లోని ప్రాచ్య సంస్కృతి పట్ల వారి ఆదర్శాలు, ప్రవచనాల పట్ల పశ్చిమ దేశాలవారికి సరయిన అవగాహన లేదు అనిపించింది. 'పవిత్రమయిన వ్యక్తి' యొక్క సహజమయిన స్థితి, ఆయనకు చెందిన ఉన్నతమయిన స్థితి గురించి, ఆయన జీవన విధానము గురించి ఇక్కడ వారికి చాలా చాలా తక్కువ తెలుస్తుంది.

భారత దేశంలో 'పవిత్రమయిన వ్యక్తి' అంటే భౌతిక ప్రపంచాన్ని త్యజించినవాడు అని, ప్రాపంచిక భోగాలన్నింటిని త్యాగము చేసినవాడని, భగవసాక్షాత్కారము అనే ఆనందామృతంలో మునిగితేలేవాడని అందరికీ అర్థమవుతుంది. ఓంకార స్వామీజీ చాలా చిన్న వయస్సులోనే అలాంటి ప్రమాణాన్ని స్వీకరించి ప్రాపంచిక భౌతిక సుఖాలకి దూరంగా ఉన్నారు. ఆయన నిరంతర సాధన భగవంతుని దివ్యానుభవాలను అందించటంలో పాటుగా ఆయనని దివ్యజ్ఞాన దీపికలను అందించే ఒక మార్గదర్శకుడిగా మార్చివేసింది. ఈ విషయంలో ఆయనలో ఎంతో స్పష్టత, దృఢమయిన విశ్వాసము ఉన్నాయి. ఎందుకంటే ఆయన నిజంగా జీవించము కోసమే జీవితం గడిపారు. అందువల్లనే ఆయన వేల మంది జీవితాలకు స్ఫూర్తిని అందించి వారి జీవితాలను ప్రభావితము చేసి వారిని పరిపూర్ణులుగా, పవిత్రంగా మార్చి వారందరిని ఆధ్యాత్మిక బాట వైపుగా మళ్ళించగలిగారు.

స్వామి ఓంకార్ గారి గురించి నేను మొట్టమొదటి సారిగా సోదరి లూయిస్ మల్లరే ద్వారా విన్నాను. ఫిలడెల్ఫియాలో వారిని మొదటిసారి కలుసుకున్నాను. నేను వచ్చిన వెంటనే ఆమె ఎంతో ఆత్రుతతో ముఖర్జీ గారు ఆమెను, ఆమె భర్తని 'పవిత్రమయిన వ్యక్తి' సందేశాలను వినడానికి తీసుకువెళ్ళారని చెప్పింది. ఆ మహాత్ముడు భారతదేశము నుండి వచ్చి ఫిలడోల్ఫియాలో శాంతి మిషన్‌ని ప్రారంభించాలనుకుంటున్నట్లుగా చెప్పింది. ఆయన ప్రవచనము ఎంతో అద్భుతంగా ఉందని చెప్పింది. ఆ మహనీయుడు ఆధ్యాత్మికంగా, సంతోషంగా, ఉల్లాసంగా, ఉత్తేజభరితంగా ఉన్నారని చెప్పింది. ఆమె

ఇంటికి తిరిగి రాగానే ఆమె ఆరేళ్ళ కుమారుడు ప్రశాంతంగా నిద్ర నుండి మేలుకొని తల్లి ముఖంలోని దివ్యమయిన తేజస్సును గమనించి, నవ్వు ముఖంతో "అమ్మా! నీ ముఖంలో ఆ వెలుగు ఎక్కడ నుండి వచ్చింది?" అని అడిగాడు.

ఇంక ఏ విధంగానూ సమయాన్ని వృథా చేయకుండా మరుసటి రోజు ఆమె నన్ను స్వామీజీని కలవటానికి తీసుకువెళ్ళింది. నేను ఎన్నటికీ మర్చిపోలేను ఆ మహనీయుడిలో కనిపిస్తున్న అసంగత్వము, ప్రవచనము చేస్తున్న విధానము, ఆయనలోని అంతర్వాణి ద్వారా మాట్లాడుతున్న భావన కలుగుతోంది వారి మాటలు వింటుంటే.

పరిమితమయిన 'నేను' అనే భావనని ఏ విధంగా పరిత్యజించాలో ఆ మహనీయుడు తన ప్రవచనాల ద్వారా నేర్పిస్తారు. అలాగే ఏ విధంగా అంతర్ముఖస్థితిని పొందాలో, ఆ దివ్యత్వంలో ఎలా మునిగి తేలాలో వివరిస్తారు. ఆయనకి పేరు ప్రఖ్యాతులకి ఎలాంటి విలువా లేదు. స్తుతి నిందలకు ఆయన అతీతుడు. ఆయన దృష్టిలో అంతా భగవంతుని స్వరూపమే. ప్రతి మాట భగవంతుని సందేశము, ఆదేశంగా భావిస్తారు. పగలు రాత్రి బేధం లేకుండా ఎల్లవేళలా ఆయన ప్రబోధించేది ఒక్కటే. శాశ్వతమయిన జ్ఞాన సంపద నీలోనే దాగి నిగూఢంగా ఉంది. అది బయటికి వ్యక్తం కావటానికి ఎదురు చూస్తోంది. మన శరీరములోని ప్రతి జీవకణములోనూ దైవము నెలకొని ఉన్నాడని ఆ మహాత్ముడు ప్రబోధిస్తున్నారు. మనలోనే ఆ దైవము దివ్యజ్యోతిగా వెలుగొందుతోంది. క్రీస్తు చెప్పినట్లుగా "నిన్ను నీవు తెలుసుకో. ఈ ప్రపంచానికి నీవే జ్యోతివి".

నేను ఎంత తరుచుగా వీలయితే అంతగా స్వామీజీ దగ్గర జ్ఞానాన్ని పొందటానికి వెళుతున్నాను. భగవంతుడే స్వామీజీ ద్వారా నాకు ఇంత చక్కని అవకాశాన్ని ఇచ్చాడని నేను భావిస్తున్నాను. ఆయన ఏమి నేర్పిస్తారో అదంతా ఆకళించుకోవడానికి నేను ఎంతో ఆత్రుతతో ఉన్నాను.

ఆయన ఉపదేశాల వలన ఎవరయినా వ్యక్తిగత భావన అనే శిలువను వదిలించుకుని అంతర్ముఖస్థితిలోని దివ్యానుభూతిని గుర్తించడానికి ప్రయత్నము చేస్తారు. లేదా అహంభావన అనే తొడుగు చాటున మరుగునపడిపోయిన ఆ దివ్యత్వాన్ని గుర్తించ గలుగుతారు.

అహంకారమే శిలువ వంటిది. అదే మనకు అన్నివిధాలయిన ఇబ్బందులు, అశాంతి, బాధలు కలిగిస్తుంది. బుద్ధి, మనస్సు అనేవి అహంకారానికి వస్తువులు, మనలను మనము మనస్ఫూర్తిగా అంతర్యామిగా వెలుగొందుతున్న దివ్యజ్ఞాన స్వరూపానికి సమర్పణ గావించుకోవాలి. అప్పుడు బుద్ధి సక్రమంగా ఆలోచించటము మొదలు పెడుతుంది. భగవంతుని ఆలోచనలు, పనుల వైపుగా మనస్సును మళ్లిస్తుంది. ఎప్పుడు అహంభావన పూర్తిగా సమసిపోతుందో, అప్పుడే మనము జ్ఞానపథం వైపుగా ప్రయాణం మొదలు పెడతాము.

స్వామి ఓంకార్ గారి ప్రవచనాలు నాకు ఎంతో స్ఫూర్తిని అందించి, మంచి మార్గం వైపుగా నా జీవితాన్ని ఉన్నతమయిన స్థితికి చేర్చాయి. నేను ఎల్లప్పుడూ వారికి కృతజ్ఞతా భావంతో ఉంటాను. ఆయన జీవితము మచ్చ లేనటువంటి దివ్యమయిన కారణము కోసమే అంకితమయింది.

ఓం..ఓం..ఓం..

## అధ్యాయం - 71

# ఆత్మానుబంధాలు

కొంతమంది పాఠకులు ఆత్మానుబంధము అంటే అర్థము ఏమిటి అని అడుగుతారు. మనము రక్తసంబంధాల గురించి విన్నాము. ఇది అలాంటిది కాదు. నా సమాధానము ఏమిటంటే భగవంతునితో మనకు ఉన్న అనుబంధమే ఆత్మానుబంధము. భగవంతుడు ఒక్కడే అన్నది పురాతనమయిన సత్యము. మనమందరము ఆయనకి సంబంధించిన వాళ్ళమే. రక్తసంబంధాలు కేవలము కుటుంబాలకు పరిమితమయినవి. చిన్న కుటుంబము, లేదా ప్రత్యేకమయిన జాతి. కాని భగవంతునితో సంబంధము అంటే అన్ని కుటుంబాలు, అన్ని జాతులు, అన్ని దేశాలు, సమస్త మానవాళి చేరిపోతారు.

తాజాగా జరిగిన ఒక సంఘటన నా హృదయాన్ని కదిలించివేసింది. అది పూర్తిగా ఆత్మానుబంధము వైభవాన్ని తెలియచేస్తుంది. డా॥ ప్రిస్‌హమ్ తోటపల్లిలోని శాంతి

ఆశ్రమాన్ని దాదాపు ముప్పై సంవత్సరాల క్రితం సందర్శించి కొంతకాలము ఆశ్రమంలో గడిపారు. ఆమె ఇక్కడ నిశ్శబ్దంగా జరుగుతున్న శాంతి కార్యక్రమాలకు గాఢంగా స్ఫూర్తిని పొందారు. ఆమె అతిథుల పుస్తకంలో "స్వామి ఓంకార్ మరియు శాంతి ఆశ్రమము రెండు కాదు. ఇద్దరూ ఒక్కటే" అని వ్రాశారు. ఆమె తిరిగి ఆశ్రమానికి వచ్చి ఇక్కడే తన శేష జీవితాన్ని గడపాలి అని సంకల్పించుకున్నారు. ఆశ్రమములోని పేదవారికి, రోగులకు సేవలందించాలనుకున్నారు. ఆమె ఆశ్రమంలోనే ఉండిపోవడానికి అవసరమయిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. ఆమె భారతదేశానికి రావటానికి టిక్కెట్టు కూడా తీశారు. కాని విధి లీలలు చిత్రంగా ఉంటాయి. మానవుని జీవితము చాలా అశాశ్వతమయినది. ఈ రోజు జీవించి ఉన్న వ్యక్తి రేపు కనిపించకుండా కనుమరుగు అయిపోతాడు. ఆమె కోసం పరమేశ్వరుడి పిలుపు హఠాత్తుగా వచ్చేసింది. అయినప్పటికి ఆ పిలుపు హఠాత్తుగా వచ్చినా ఆమె తన ఆత్మానుబంధాన్ని, ఎక్కడో సుదూరంగా భారతదేశంలోని పవిత్రమయిన దేవాలయము లాంటి శాంతి ఆశ్రమంలో ఏర్పడింది అనే విషయం గుర్తుంచుకుంది. ఆమెకు ఏదయితే స్వల్ప ఆస్తి చెందుతుందో, దానిని ఆమె తన రక్తసంబంధీకులకో, దగ్గరి స్నేహితులకో కాకుండా శాంతి ఆశ్రమానికి చెందే విధంగా ఏర్పాటు చేసింది.

ఆశ్రమము కూడా ఆమె గుర్తుగా శాశ్వతంగా మర్చిపోకుండా ఉండే విధంగా ఏదయినా కట్టడాన్ని నిర్మించడానికి ప్రయత్నము చేస్తోంది. దాని ద్వారా పేదలకు, రోగులకు సహాయం జరగాలి. ఆమె జీవితాశయము కూడా అదే. భగవంతుడు మన సోదరి ఆత్మకు శాంతి ప్రసాదించి శాశ్వతమయిన విశ్రాంతిని ఇచ్చుగాక!

ఆత్మానుబంధము యొక్క వైభవము అలాంటిది. అక్కడ ప్రతి ఒక్కరి గురించి మనము ఆలోచించి బాధపడతాము. ప్రతి ఒక్కరిని ప్రేమిస్తాము. ఆత్మానుబంధానికి పునాది ఈ క్రింది వాక్యాల్లో ఇమిడి ఉంది.

**"ఈ ప్రపంచమంతా మన కుటుంబము. ఇందులో నివసించే ప్రజలందరూ మన సోదర సోదరీమణులు. వారిని ప్రేమించి, సేవించి, ఆరాధించాలి."**

భగవంతుని అనుగ్రహము వలన నా జీవితములో ఎన్నో అద్భుతాలు జరిగాయి. ఇది నా జీవితంలో సంతోషకరమయిన హఠాత్తుగా, అనుకోకుండా జరిగిపోయిన విషయాలు. నాకు తెలియకుండానే నన్ను సర్వేశ్వరుడు తన పరికరంగా వినియోగించుకుని

ఆయన ఆశీస్సులు కురిపించి ఎన్నో కార్యాలను చేయించుకున్నందుకు గౌరవంతో, వినయంతో నా హృదయపూర్వకంగా భగవంతుని స్తుతిస్తున్నాను.

భగవంతుని అంతులేని దయ వలన జరిగిన ఒక మరుపురాని సంఘటనని మీతో పంచుకోవాలనుకుంటున్నాను. ఆ సంఘటన కూడా నా హృదయాన్ని ఎంతగానో కదిలించి వేసింది. భగవంతుని అపారమైన దయ దీని వలన వ్యక్తమయినది. మేము నీలగిరి శాంతి కేంద్రము నుండి బయలుదేరి వస్తుండగా 1963వ సంవత్సరంలో ఒక గ్రామములో చాలా పెద్ద వయస్సు ఆవిడ జ్ఞానేశ్వరి వద్దకు వచ్చి ఆమె చేతిలో వేయి రూపాయలు పెట్టి ఈ విధంగా చెప్పింది. “బిడ్డా! ఈ డబ్బుని స్వామీజీ సొంత ఖర్చులకోసం వినియోగించండి. నేను మరణించిన తర్వాత కూడా ఈ మూలధనాన్ని ఖర్చు చేయవద్దు. దాని మీద వచ్చే వడ్డీ డబ్బులతో స్వామీజీ అవసరాలకు వినియోగించండి. అలాగే ప్రతి సంవత్సరము జనవరి 21వ తేదీన స్వామీజీ జన్మదినం రోజున పళ్ళు, భోజనము, బట్టలు మొదలయిన వాటికి ఖర్చుపెట్టండి” అంది.

భగవంతునికి నేను ఏ విధంగా ధన్యవాదాలు తెలియచేయగలను, అదీ మామూలు మాటల్లో. ఆయనే మాతృమూర్తి అన్నపూర్ణమ్మ హృదయంలో ప్రవేశించి ఆమెలో ఆ సంకల్పం కల్గించటము వలన తూర్పు, పడమర దేశాల్లోని ఎందరో తల్లులకి అది స్ఫూర్తిగా నిలిచింది. నేను ఫిలడెల్ఫియాలో ఉండగా మరియా మాత కూడా నా కోసం కొంత డబ్బును విడిగా తీసి ఉంచి “నా ప్రియమయిన బిడ్డా! నేను ఈ భూమిని విడిచి వెళ్ళిపోయిన తర్వాత కూడా నీవు ఎప్పుడూ ఇబ్బంది పడకూడదు” అని చెప్పింది.

ఇంత విశాల హృదయం గల తల్లులందరికీ నేను ఎంతో ప్రగాఢమయిన ధన్యవాదాలు తెలియచేసుకుంటున్నాను. నన్ను ఇంత జాగ్రత్తగా కాపాడుకొంటున్నందుకు. కేవలం ఈ శరీరం భౌతికంగా నిలిచి ఉండగానే కాకుండా, ఈ ప్రపంచమునుండి నేను వెళ్ళిపోయిన తర్వాతకూడా ఉపయోగపడే విధంగా సహాయం చేశారు. “మనము భగవంతుని పని చేస్తున్నప్పుడు భగవంతుడు మన పని చేస్తూ ఉంటాడు” అని చెప్పడానికి నాకు ఎంతో సంతోషంగా ఉంది. మనము పరమాత్మను నిస్వార్థంగా ప్రేమించినప్పుడు, ఆయన మనలను అతి జాగ్రత్తగా, సున్నితంగా కాపాడుకొంటూ ఉంటాడు నిరంతరం. ఏ విధంగా తల్లి తన బిడ్డలను జాగ్రత్తగా చూసుకుంటుందో, కంటి రెప్పలు కంటి

పాపను జాగ్రత్తగా కాపాడుతుంటాయో ఆ విధంగానే పరమాత్మ జీవాత్మను కాపాడు తుంటాడు.

## వేదాదేవికి గౌరవవందనాలు

వేదాదేవి రీడ్‌స్వాన్ మంచి ఉత్తమమయిన రచయిత్రి, అలాగే ఆధ్యాత్మిక జ్ఞాన సంపన్నురాలు. తూర్పు పడమర దేశాల్లోని సత్యాన్వేషకులకు ఆమె రచనలు ఎంతగానో తోడ్పడినాయి. ఆమె రచనల్లో పూర్తిగా యథార్థమయిన, లోతయిన ఆధ్యాత్మిక జ్ఞానము ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. అవన్నీ ఆమె అంతరంగములో నుండి, వ్యక్తిగతమయిన అనుభవాల నుండి వచ్చినవి కనుకనే ఆమె రచనలు అందరికి సహాయపడేవి. ఆశ్రమానికి ఆమె మంచి శ్రేయోభిలాషి, ఎల్లప్పుడు శాంతి ప్రచారము కోసము సహాయపడేది. భౌతికంగా ఆమె ధనవంతురాలు కాకపోయినా, ఆధ్యాత్మికంగా జ్ఞాన సంపన్నురాలు కనుక ఆమె జ్ఞానసంపదని మాతో కల్సి పంచుకునేది.

ఎప్పుడో ఒకప్పుడు ప్రతి ఒక్కరికి మరణము తప్పదు. కొందరికి ముందుగా వస్తుంది. మరికొందరికి ఆలస్యంగా వస్తుంది. అంతే తేడా, ఒక రోజు వేదాదేవి మరణించింది. అనే విషాదకరమయిన వార్త మమ్మల్ని అందరినీ తీవ్రమయిన దిగ్భ్రాంతికి గురి చేసింది. జ్ఞానానికి అధిదేవత అయిన వేదాదేవి అని ఆమెకు నామకరణము చేసి ఆమెను నేను ఆశీర్వదించాను.

వేదాదేవి మరణించేముందే ఆశ్రమానికి మూడు వందల డాలర్లు నా పేరు వీలునామా వ్రాసినట్లుగా నాకు ఫస్ట్ సెక్యూరిటీ నేషనల్ బ్యాంకు నుండి రిజిష్టరు ఉత్తరము అందటము నాకు విషాదాన్ని, ఆశ్చర్యాన్ని కూడా కలిగించాయి. ఇప్పుడు ఆమె నాకు తల్లిలాగా అనిపిస్తోంది. నేను ఇంతకు పూర్వము కంటే ఎక్కువగా ఆమె సొంత బిడ్డలాగా భావిస్తున్నాను. నేను ఎప్పుడు ఆమె నుండి భౌతికమయిన సంపదని కోరుకోలేదు. ఎక్కడో సుదూరంగా కాలిఫోర్నియా కొండల్లోంచి వేదాదేవి నుండి ఒక ప్రవాహంలాగా ఆధ్యాత్మిక కాంతి తరంగాలు వెల్లువలా వచ్చి నన్ను ఆ కాంతి పుంజాల్లో నింపివేసి విశ్వ ప్రేమలో ఓలలాడించేవి. భగవంతుని లీలలు ఎవ్వరికీ అంతు చిక్కవు. ఇప్పుడు నాకున్న ఆశయం ఒక్కటే. వేదాదేవి పంపిన ప్రేమపూర్వకమయిన దక్షిణని ఆమె గుర్తుగా చక్కగా సద్వినియోగం చేసి జీవితాంతము ఆమె పేరు గుర్తుండిపోయేలా చేయాలి.

ఆశ్రమాన్ని ఎప్పుడూ అభివృద్ధి పథంలో నడిపించడానికి నేను ఎల్లప్పుడూ ఏదో ఒక ప్రయత్నం చేయటం నాకు సంతోషాన్ని కలిగిస్తుంది. అది సత్యాన్వేషణకు ఉపయోగకరంగా ఉండాలని భావిస్తాను. క్రొత్తగా మేము ఆశ్రమాన్ని కొండ పాదము వరకూ విస్తరించాము. ఇప్పుడు కొండ మీద కూడా క్రొత్తగా నిర్మాణాలు చేపట్టాలని భావిస్తున్నాను. కొండ మీద చాలా ఆహ్లాదకరమయిన 'జ్ఞాన తపోవనము' నిర్మించాము. అక్కడ రెండు కుటీరాలను కూడా ఏర్పాటు చేశాము. ఒకటి జ్ఞాన కుటీరము, రెండవది శాంతి కుటీరము. అందులో సాధువులు, స్వామీజీలు, ఆధ్యాత్మిక జిజ్ఞాసువులు ప్రశాంతంగా ధ్యానము చేసుకోవచ్చు. మౌనంగా, ప్రశాంతంగా సాధన చేసుకోవడానికి ఆ స్థలము చాలా అనుకూలంగా ఉంటుంది. వేదాదేవి ప్రేమతో పంపిన డబ్బుతో ఈ రెండు కుటీరాలను నిర్మించాము. ఆమె పంపిన డబ్బు సద్వినియోగం అయినందుకు వేదాదేవి ఆత్మసంతృప్తి చెందుతుంది.

జ్ఞాన తపోవనములో నీటికోసం మేము పెద్ద గోతులు త్రవ్వి ప్రయత్నించాము. కానీ అదంతా కొండ ప్రాంతము కావటం వలన నీరు పడలేదు. అందువలన మేము కొండను తొలచి ఒక గుహను తయారుచేయాలని నిర్ణయించుకున్నాము. అది ధ్యానానికి చాలా అనువుగా ఉంటుంది. సాధకులకు నిజంగా కొండ గుహలో మౌనంగా, ప్రశాంతంగా జ్ఞానం కోసం సాధన చేయటం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. భౌతిక ప్రపంచానికి దూరంగా, సాధనకి అనుకూలంగా, జ్ఞానానికి ఆలవాలంగా ఉన్న ఆ గుహకి 'జ్ఞాన గుహ' అని పేరు పెట్టాము.

మాకు ఏ విధమయిన సహాయం లభించినా, అది మరణించిన వారి వద్ద నుండి గాని, లేదా జీవించి ఉన్నవారి వద్ద నుండి గాని దాన్ని చక్కగా ఏవైనా నిర్మాణానికి వినియోగించి ఆధ్యాత్మిక లాభం అందరికీ అందించడానికే ప్రయత్నించాము.

ఆశ్రమానికి ఎందరో ప్రేమమూర్తులు, దయామయులు అయిన తల్లులున్నారు. వారందరినీ ఎలా ఇక్కడ ప్రస్తావించగలను? లలితాదేవి కూడా ఎంతో గొప్ప శాంతి మూర్తీభవించిన మాతృమూర్తి. మమ్మల్ని కోటగిరికి తీసుకువచ్చి విశ్వప్రేమ సందేశాలను ప్రచారము చేయడానికి ఎంతగానో సహకరించింది. ఆమె కూడా ఈ లోకాన్ని విడిచిపెట్టి వెళ్ళిపోయినా నా హృదయంలో ఆమె నిస్వార్థమయిన సేవలు శాశ్వతంగా గుర్తుండిపోతాయి.

నగుబాయమ్మ గారు మద్రాసు నివాసి. శ్రీ ఎం.వి. బాబ్జి గారి తల్లిగారు ఆమె మంచి భక్తురాలు. ఆమె శాంతి మిషన్‌ని ఎంతో ప్రేమించి, సహాయం అందించేది. ఆమె ఆశ్రమానికి అందమయిన వెదురుకుర్చీలు, టేబులు ఇచ్చింది. అవి ఇప్పుడు వరండాలో నిర్వాణమందరింలో ఆశ్రమ వాసులు, అతిథులు కూర్చోవడానికి ఉపయోగ పడుతున్నాయి.

నా చిన్ననాటి స్నేహితుడు మంచి హస్తవాసి గల వైద్యుడు డా॥ సి.కె. ప్రసాదరావు గారి కుమార్తె డా॥ రమణి నా పట్ల నిజమయిన ప్రేమమూర్తీభవించిన తల్లిలాగా నేను హృద్రోగంతో బాధపడుతున్న రోజుల్లో సేవలందించింది. ఆమె నన్ను బలవంతంగా తన ఇంటికి తీసుకువెళ్ళి పగలు రాత్రి తేడా లేకుండా నిరుపమానమయిన జాగ్రత్తలతో సేవలు చేసింది. ఎన్నో విధాలుగా ప్రేమతో సేవలందించింది. ఆమె, డా॥ దేవకి ఇద్దరూ కూడా ఎప్పుడూ వారి తండ్రి గారి అడుగుజాడల్లోనే పయనిస్తూ, నిస్వార్థమయిన జీవితం గడుపుతూ రోగులకు, కష్టాల్లో ఉన్నవారికి సేవలందించేవారు.

డా॥ రాజేశ్వరి ఇప్పుడు గావాలోని రోగులకు సేవలందిస్తోంది. ఆమె కూడా నిస్వార్థమయిన సేవలు అందించే గొప్ప ఆత్మ స్వరూపులు. ఆమె భర్త గారు శ్రీ రాఘవేంద్ర రావు ఎంతో దయతో మాకు ఎన్నోవిధాలయిన సహాయాలు అందించారు. వారు ఆశ్రమంలో జిజ్ఞాసువుల సాధన కోసం ఒక మందిరాన్ని నిర్మించారు.

బొబ్బిలి రాణి సాహేబా, లక్ష్మీ సుభద్రాదేవి మరియు ఆమె సోదరి లక్కవరము జమిందారిణీ మొదలైన వారందరూ మా ఆశ్రమానికి మంచి స్నేహితులు. ఆశ్రమములో శ్రీ కృష్ణమందిరాన్ని నిర్మించి ఆశ్రమానికి, ఆశ్రమ భక్తులకు అనేకవిధాలుగా సహకరించారు.

పరమాత్మ ఈ తల్లులందరిని ఆశీర్వదించుగాక! వారి నిస్వార్థమయిన సేవలు, ఎల్లలు లేని ప్రేమ మరువరానిది. ప్రపంచములోని ప్రేమమూర్తులయిన తల్లులందరినీ, ఎవరయితే భగవంతుని బిడ్డల యోగ క్షేమాల కోసం పనిచేస్తున్నారో వారి పూర్తి సమయాన్ని, ధనాన్ని పేదలకు, నిస్సహాయులకు, జబ్బులతో, బాధలతో ఇబ్బంది పడుతున్న వారందరిని సంరక్షిస్తున్నారో వారందరిని భగవంతుడు ఆశీర్వదించుగాక! ప్రపంచములోని మాతృమూర్తులందరూ కూడా ఒకే ఒక తల్లి, విశ్వమాత, పరాశక్తి యొక్క ప్రతిరూపాలే

అవుతారు. ఆధ్యాత్మిక విశ్వమాత, మనందరిని తన చేతులతో సంరక్షిస్తూ, ఎల్లలు లేని ప్రేమతో తన ఒడిలో చేర్చుకొని లాలిస్తుంది. పసిపిల్లల్లాంటి మనలను జాగ్రత్తగా చూస్తూ ఉంటుంది. మన ప్రతి అవసరాన్ని తీరుస్తుంటుంది. మనకు కావాల్సినవన్నీ కొద్ది కొద్దిగా ఎంతో ప్రేమతో, అద్భుతంగా మన మానవ జీవిత గమ్యానికి నెమ్మదిగా చేరుస్తుంది. బ్రహ్మము, పరమశక్తి, శివ పరమాత్మ, సర్వేశ్వరుడు, సహస్ర తేజోమయుడు, తేజస్సుకు తేజస్సు అయినవాడు ఈ భౌతికమయిన ప్రపంచానికి దూరంగా, మన హృదయానికి అతి చేరువగా అంతర్యామిగా కొలువైన సర్వేశ్వరుడు.

**అధ్యాయం - 72**

# నేను మార్కండేయుడిని

యముడు నన్ను పిలుస్తున్నాడు. మార్కండేయుడు పురాణ కాలము నాటి బాల సాధువు. అతను పదహారేళ్ళ వయస్సులోనే మరణించవలసి ఉంది. యముడు తన నియతి ప్రకారము అతడిని భౌతిక ప్రపంచము నుండి తీసుకువెళ్ళవలసిన సమయానికి వచ్చాడు. కానీ మార్కండేయుడు పూజలో నిమగ్నమయి ఉన్నాడు. మహోన్నతమయిన దైవాన్ని పరమేశ్వరుడిని, శివలింగాన్ని అంటిపెట్టుకొని ఉన్నాడు. అంతర్యామి అయిన సర్వాంతర్యామిని తేజోరూపంలో వెలుగొందుతున్న ఈశ్వరుడిని 'సోహం' భావనతో పూజిస్తున్నాడు. అతని సర్వాన్ని సమర్పించి, బుద్ధిని, మనస్సును, హృదయాన్ని, ఆత్మను ఏకం చేసి పూజిస్తున్నాడు. అప్పుడు పాపం యముడు ఏమి చేయగలడు? ప్రయత్నించి, ప్రయత్నించి యముడు ఆ బాలుడి ప్రాణాలు హరించటములో విఫలుడయ్యాడు. జీవితంలో మొదటిసారి యముడు తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించడంలో సఫలీకృతుడు కాలేకపోయాడు. అందువలన నిరాశతో తిరిగి తన స్థానమయిన యమలోకానికి తిరిగి వెళ్ళిపోయాడు.

నాకు గుండె జబ్బు వచ్చిన దగ్గరనుండి నేను తరుచుగా అనుకోసాగాను. నేను జీవించి ఉన్న మార్కండేయుడిని అని, మెలకువలోనూ, నిద్రలో కూడా అదే భావనలో ఉంటున్నాను. యువకుడయిన మార్కండేయుడిలాగా ఉండగల్గటం నిజంగా ఎంత

అదృష్టం. నేను పదహారేళ్ళ యువకుడి మాదిరిగా కైలాసగిరి కొండ మీద ప్రశాంతంగా పవిత్రమయిన క్షణాలు గడపడానికి వాల్తేరు ఆశ్రమము నుండి బయలుదేరాను. యముడు తన దూతలను గుండె జబ్బు రూపంలో పంపించాడు. కాని నేను 'సోహం భావన'లో లీనమయిపోయాను. అంతర్ముఖస్థితిలో దివ్యతేజోమయ జ్యోతిస్వరూపుడిని దర్శిస్తున్నాను. నన్ను నర్సింగ్‌హోమ్‌కి తీసుకువెళ్ళారు. కానీ నేను అంతరాత్మలోని జ్యోతి స్వరూపంతో ఉండగా పాపము యముడు ఏమి చేయలేక వెళ్ళిపోయాడు.

నేను డా|| రమణి గారి అతిథి గృహంలో సౌకర్యంగా విడిది చేసిన సమయంలో యముడు మళ్ళీ తొంగి చూశాడు. కాని అంకితభావంతో వైద్యులు, నర్సులు అందరూ భజనలు, సంకీర్తనలు, ధ్యానము చేయటము చూచి ఏమీ చేయలేక మళ్ళీ వెళ్ళిపోయాడు. తర్వాత కూడా రెండు మూడు సార్లు యముడు నా జీవితంలోనికి తొంగి చూడడానికి ప్రయత్నించాడు. నేను భగవంతుడిని మర్చిపోయానా? లేదా అంతర్జ్యోతిని వదిలిపెట్టానా? సోహం భావనని వదిలివేశానా? అని పరీక్షించడానికి వచ్చాడు. కానీ పాపము మళ్ళీ నిరాశతో అతను వెనుతిరగవలసి వచ్చింది. ప్రతిసారి నేనే జయించాను. అంతా పరమేశ్వరుని అనుగ్రహమే. ఆయన ప్రత్యేకమయిన ఆశీస్సులు ఎందుకంటే నేను ఎల్లప్పుడూ భగవంతునికి ముద్దుబిడ్డనే.

సర్వజ్ఞుడయిన ఈశ్వరుడే నా పనులు అన్నీ చేస్తున్నాడు. కోటగిరిలో ప్రార్థనా మందిరము, గ్రంథాలయము, అతిథి గృహము మొదలయిన నిర్మాణాలు పూర్తి చేసి భగవంతుని బిడ్డలకి సేవలు చేయాల్సి ఉంది. వైద్యులు నన్ను కొండ ఎక్కకూడదు అని చెప్పినప్పటికీ నేను వెళుతుండేవాడిని. అలాంటి సమయాల్లో యముడు నన్ను చూచి నవ్వుతుండేవాడు.

గతుకుల రోడ్డు పైన ప్రయాణించి నేను మంత్రాలయము వెళ్ళినప్పుడు నా గుండె దడదడలాడిపోతూ నీటిని తోడే యంత్రం లాగా పనిచేయసాగింది. యముడు నా అడుగు జాడలను అనుసరించి వచ్చి పరిస్థితి దిగజారిపోవటానికి ఎదురుచూడసాగాడు. అప్పుడు కూడా నేను యముడికి నిరాశనే మిగిల్చాను. ఎందుకంటే ఆ పరిస్థితుల్లో కూడా నేను అంతర్ముఖుడిని అయి 'సోహం' అనే శివలింగాన్ని అంటిపెట్టుకొని ఉండిపోయాను. ఎప్పుడయినా లౌకిక విషయాలలో నా సమయాన్ని వృథా చేస్తూ వాదోపవాదాలు చేసేవారిలో మాట్లాడవలసి వచ్చినప్పుడు నా అంతర్వాణి లోపల నుండి

నెమ్మదిగా నన్ను ఇలా హెచ్చరిస్తూ ఉండేది. "బిడ్డా! నీ ప్రతి క్షణము కూడా ఎంతో విలువైనది. ఏ నిముషంలో అయినా ఏదయినా జరగవచ్చు. యముడి వైపు ఒక్కసారి చూడు. మహాభయంకరమయిన వాడు. అతను ఎంతో నిర్దాక్షిణ్యంగా ఎందరో గొప్పవారిని, మేధావులను, స్వామీజీలను, యోగులను తన పాశాలతో బంధించి లాక్కుపోతూ ఉంటాడు. అందువలన సమయాన్ని వృథా చేయకుండా, నిరంతరము ఎలాంటి మార్పులేని శాశ్వతమయిన ఆత్మలింగాన్ని, నీ లోపలే నెలకొనివున్న శివుడిని గట్టిగా వదలకుండా పట్టుకొని ప్రార్థించు. అప్పుడే నీవు క్షేమంగా యముడి బారి నుండి తప్పించుకోగల్గుతావు."

మనము ఎప్పుడు జ్యోతి స్వరూపాన్ని మర్చిపోతామో అని ఆయన ఎదురుచూస్తూ ఉంటాడు. మరణము ఎప్పుడూ మన దగ్గరలోనే తచ్చాడుతూ ఉంటుంది. అది మన పైనా క్రిందా మన చుట్టూ ఆవరించుకొని ఉంటుంది. భగవంతుడిని నిర్లక్ష్యం చేసి దేహాన్ని అంటిపెట్టుకొని ఉండేవాడిని మరణం కబళించి వేస్తుంది. స్వార్థము, మరణం ప్రాణస్నేహితులు. నిస్వార్థ జీవుల దరిదాపులకు రావడానికి మరణము కూడా ధైర్యం చేయలేదు. అశాశ్వతమయిన సంపదలను చూసుకొని విర్రవీగే వ్యక్తులను చూస్తే మరణం పగలబడి నవ్వుతుంటుంది. శాశ్వతమయిన జ్ఞాన సంపదను దొంగలు దొంగిలించలేరు. చీమలు తినివేయలేవు లేదా ప్రభుత్వము ఆ జ్ఞానసంపదని స్వాధీనము చేసుకోలేదు.

ఓ మరణమా! నీవు ఎక్కడ కూర్చుని ఉన్నావు? నీవు నన్ను ఏ విధంగా పట్టుకోగలవు? నేను నిరంతరము మార్కండేయుడిలాగా 'సోహం' దివ్యజ్యోతిని నా లోనే దర్శిస్తున్నానుగా? 'నేను' 'నాది' అనే ఆలోచనలతో అమూల్యమయిన సమయాన్ని వృథాగా గడిపే స్వార్థపరులు, సోమరిపోతులు ఎక్కడ ఉన్నారో దయచేసి అక్కడికి వెళ్ళు. వారు కేవలము వారి కోసమే జీవిస్తుంటారు. రోగులు, నిస్సహాయులు, పేదల రూపంలో వారి వద్దకు వచ్చే ఈశ్వరుడిని గుర్తించలేక నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంటారు. అమూల్యమయిన క్షణాల విలువ తెలియని అలాంటి వారి వద్దకు వెళ్ళు. కాలము ఎంతో విలువయినది. భౌతికమయిన సంపద కంటే ప్రతి క్షణము విలువైనదే. మార్కండేయుడు తన జీవితంలోని ఒక్క క్షణంలో మిలియన్ల వంతు కాలాన్ని కూడా భగవంతుని నామస్మరణని మర్చిపోలేదు. అందువల్లనే యముడు అతడిని ముట్టుకోలేదు. తలవెంట్రుకని కూడా తాకలేకపోయాడు. అతని దగ్గరికి వెళ్ళడానికి కూడా ధైర్యం చేయలేకపోయాడు.

ప్రియమయిన పాఠకులారా! మీరందరూ జీవించి ఉన్న మార్కండేయులు. మరణం లేని మార్కండేయులు. చిరంజీవులయిన మార్కండేయులు. అప్పుడప్పుడు జబ్బులు అనే మబ్బులు వచ్చిపోతుంటాయి. నీవు శాశ్వతుడవు, అమరుడవు. అది నీ జన్మహక్కు. ఇప్పుడు ఇక్కడే ఈ అధ్యాయాన్ని చదువుతుండగానే నీవు ప్రార్థన చేయి. నీ దివ్యత్వాన్ని గుర్తు చేసుకో.

మానవుడు తన జీవిత గమ్యాన్ని తానే నిర్దేశించగలడు. తన తెలివితేటలతో ఈ భౌతిక ప్రపంచంలో ఎన్నింటినో సాధించాడు. ఇప్పుడు తలుచుకుంటే యముడిని కూడా జయించగలడు. యముడు ఒక్కడే మానవుడిని నిర్దాక్షిణ్యంగా, క్రూరంగా, జాలి, దయ లేకుండా, ఎలాంటి కనికరము లేకుండా ప్రార్థించినా, బ్రతిమాలినా వినకుండా ఈడ్చుకొని తీసుకుపోయే శత్రువు. ప్రవృత్తి మార్గంలో, భౌతిక ప్రపంచంలోని ద్వంద్వాలు యముడిని ఆహ్వానిస్తాయి. నివృత్తి మార్గంలో అంతర్ముఖస్థితిలో ఐక్యత, ప్రేమ, శివతత్త్వము, అంతర్జ్యోతి స్వరూపము సోహం నిన్ను ఆహ్వానిస్తుంది. ఇప్పుడిక నీ వంతు, నీవు చీకటిని ఆహ్వానిస్తావా? లేదా జ్యోతి స్వరూపాన్ని ఆహ్వానిస్తావా? మరణమా లేదా జీవితమా? అనిత్యమా లేదా అమరత్వమా? యముడినా లేదా భగవంతుడినా? గాఢమయిన అజ్ఞానాంధకారములో నుండి మేలుకో. ఈ క్షణము మాత్రమే నీది. ఈ రోజు మాత్రమే మనది రేపు మనది కాదు. ఈ క్షణము మాత్రమే మన చేతుల్లో ఉంది. ప్రతి క్షణమూ మార్కండేయుడికి విలువైనదే.

ఇంకా నేను దీని గురించి ఏమి చెప్పాలి? నేను, మీరు, అందరము మార్కండేయులమే అవుతాము. యముడు, మరణానికి అధి దేవత మనలను ముట్టుకోవడానికి కూడా ధైర్యం చేయలేదు.

**"ఓం త్రయంబకం యజామహే సుగంధిం పుష్టివర్ధనమ్,**
**ఉర్వారుక మివ బంధనాన్మృత్యోర్ముక్షీయ మామృతాత్"**

మనము మూడు కన్నులు కలవాడు భగవాన్ శివుడిని పూజిస్తాము. ఆయనే అందరిని రక్షించేవాడు, పోషించేవాడు. మనలను మరణము నుండి విడుదల చేయు గాక! శాశ్వతత్వాన్ని, అమరత్వాన్ని ప్రసాదించుగాక! దోసకాయ తొడిమనుండి తనంతట తానుగా విడిపోయినట్లుగా బంధనమునుండి ఈశ్వరుడు మనలను విడుదల చేయుగాక!

మహా మృత్యుంజయ మంత్రము జీవితాన్ని ప్రసాదించే మంత్రము. అన్నీ జబ్బులకు ఆయుధం లాంటిది. ఈ మహామంత్రముతో మృత్యువును జయించవచ్చు. అది మోక్ష మంత్రము కూడా. అది సుదీర్ఘ జీవితాన్ని, శాంతిని, ఆరోగ్యాన్ని, ఐశ్వర్యాన్ని, సంతృప్తిని, అమరత్వాన్ని, నిత్యత్వాన్ని ప్రసాదిస్తుంది.

అధ్యాయం - 73

# ప్రార్థనా మందిరము ప్రారంభోత్సవం - కోటగిరి శాంతికేంద్రము 1966

1966వ సంవత్సరము ఆగష్టు 17వ తేదీన మైసూరు గవర్నరుగా పనిచేస్తున్న శ్రీయుతులు శ్రీ వి.వి. గిరి గారు ప్రార్థనామందిరాన్ని, శాంతి గ్రంథాలయాన్ని రిబ్బను కత్తిరించి, దేవాలయంలో దీపాన్ని వెలిగించి ప్రారంభించారు. కార్యక్రమానికి హాజరయిన భక్తులందరూ ఓంకారాన్ని జపించారు. గవర్నరు గారు రావటానికి ముందే పెద్ద సంఖ్యలో ప్రార్థనా మందిరంలో సమావేశమయిన భక్తులు సంకీర్తనలు, భజనలు చేశారు. మేము అనుకొన్న దానికంటే పెద్ద సంఖ్యలో భక్తులు రావటం వలన ప్రార్థనా మందిరంలో స్థలం సరిపోనందువలన చాలా మంది బయటే నిలబడవలసి వచ్చింది.

శ్రీ వి.వి. గిరి గారు ఆహ్వాన ప్రసంగం చేసిన ఉపన్యాస సారాంశాన్ని ఇక్కడ పొందుపరుస్తున్నాను.

"నా హృదయము శ్రీ వి.వి.గిరి గారిని, ఇంకా మీ అందరినీ సంతోషంగా ఆహ్వానిస్తోంది. మనమందరము ఈశ్వరుని సన్నిధిలో కూర్చుని ఉన్నాము. ఇప్పుడు, ఇక్కడ దైవము మనలోనే ఉన్నాడు. మనమందరము ఆయనలోనే ఉన్నాము. మన జీవితంలోని సంతోషకరమయిన క్షణాలను శాశ్వతం చేసుకోవాలని చెపుతారు. మనము ఈశ్వరుడి ఉనికిని మన లోపల, బయటా క్రిందా,పైనా మన చుట్టూ అనుభూతి చెందుతున్న క్షణాలను శాశ్వతం చేసుకుందాము. మన కోసమూ అలాగే అందరి శాంతి కోసము" భగవంతునిలో జీవించు. దాని కోసమే ఇతరులను సేవించు" అన్నదే సరళంగా,



స్ఫూర్తిని అందించే శాంతి ఆశ్రమము ఆదర్శము. ఆశ్రమ నిర్మాణము జరిగిన నలుభై సంవత్సరాలుగా దీనినే అనుసరిస్తున్నాము.

గుడ్డివాడు ఇంకొక గుడ్డివానికి దారి చూపించలేడు. మనము ఇతరులకు బోధించాలి. ప్రబోధించాలి కాని మనము మాత్రము ప్రబోధించే ఆదర్శాలను ఆచరించము అంటే అది సమయాన్ని వృథా చేయటమే అవుతుంది. ఇతరులను బాగు చేయాలి అనుకున్నప్పుడు ముందుగా నిన్ను నీవు సంస్కరించుకోవాలి. అప్పుడే ప్రపంచాన్ని నీవు సంస్కరించ గల్గుతావు. వ్యక్తిగత శాంతి మాత్రమే విశ్వశాంతికి బాటలు వేస్తుంది.

నా బాల్యంలోని ఒక ఆసక్తికరమయిన సన్నివేశాన్ని మీతో పంచుకోవాలి అని భావిస్తున్నాను. అప్పుడు నేను, శ్రీ వి.వి. గిరిగారు కౌమారంలో ఉన్నాము. ఇప్పుడు నాకు సరిగ్గా గుర్తులేదు అది ఏ సంవత్సరంలో జరిగిందో, కాని దాదాపుగా యాభై ఐదు సంవత్సరాల క్రితం శ్రీ గిరిగారు ఇంగ్లాండులో న్యాయశాస్త్రము చదువుతున్నారు. నేను వైద్యుడిని కావడానికి అమెరికా వెళుతున్నాను. ఆ సమయంలో నేను ఆయనకి అతిథిగా ఉండే అవకాశం లభించింది. అప్పుడు నేనున్న పరిస్థితుల్లో వారు నాకు బంగారునాణెము ఇచ్చి ఆదుకున్నారు. అప్పటి నుండి కూడా వారి జీవితంలో దేవుని బిడ్డలందరికి సహాయ సహకారాలు అందించడానికి అంకితమయి పోయారు. వారు ఎంతో ప్రేమతో, దయతో అవసరమున్న వారందరికి సహాయం అందిస్తున్నారు.

గడ్డిపరక కూడా భగవంతుని ఇచ్ఛ లేకుండా కదలలేదు అని నమ్మేవాడిని నేను. మీరందరూ ఈ ప్రార్థనా మందిరాన్ని నేను కట్టించానని భావించవచ్చు. కాని దైవము మాత్రమే ఈ భౌతిక శరీరాన్ని తన పరికరంగా వినియోగించుకుని ఈ పనిని పూర్తి చేశారు. గొప్ప ఘనకార్యాలు సాధించవలసి వచ్చినప్పుడు ఎన్నో ఇబ్బందులు, కష్టాలు వస్తాయి. అలాగే మేము కూడా ఇబ్బందులు, అలాగే ఆశీస్సులు కూడా దగ్గరి వారి నుండి దూరం వారినుండి కూడా పొందాము. ఈ ప్రార్థనా మందిరము చేతిలో ఎలాంటి ధనము లేకుండా, ముందుగా ఎలాంటి ప్రణాళిక లేకుండానే పూర్తి చేయబడింది. ఇప్పుడు నాకు పూర్వం కంటే బాగా అర్థమవుతోంది. ప్రపంచంలో కెల్లా నేనే భాగ్యవంతుడిని. ఎవరో తెలియని వ్యక్తుల నుండి, అనుకోని విధంగా డబ్బు వెల్లువలా వచ్చి ఈ ప్రార్థనామందిర నిర్మాణము పూర్తి చేయబడింది.

నేను మానవుల సహాయం అర్థించడానికి కాకుండా, ఈశ్వరుడిపై ఆధారపడటానికి సంతోషిస్తాను. సర్వజ్ఞుడయిన ఈశ్వరుడికి తెలుసు. అందుకే అనంతమయిన ప్రేమతో నా కోరికలన్నింటిని చిన్నవి, పెద్దవి అని తేడా చూడకుండా ఆయన నెరవేర్చాడు. మానవులు మనలను నిరాశపర్చవచ్చు గాని ఈశ్వరుడు ఆ విధంగా ఎన్నిటికి చేయడు. అందువలన మనము సర్వేశ్వరుడిని శరణాగతి చెందాలి. జ్ఞాననిధి, శాంతి ప్రదాత, అన్నింటిని ప్రసాదించగల సర్వజ్ఞుడు ఈశ్వరుడే. అందువలన మనమందరము ఈశ్వరుడిని ప్రార్థించుదాము. వ్యక్తులందరి హృదయాలలో శాంతి నెలకొనుగాక! అలాగే జాతుల మధ్య, దేశాల మధ్య శాంతి నెలకొనుగాక! విశ్వమంతా శాంతిమయమగు గాక!

శ్రీ వి.వి. గిరి మైసూరు గవర్నరుగారు మాట్లాడుతూ "గౌరవనీయులైన ఓంకార్ స్వామీజీకి, శ్రీ రామానందతీర్థ గారికి మరియు స్నేహితులకి నమస్కారములు. నేను చాలా కాలము నుండి కోటగిరి ఆశ్రమానికి వచ్చి స్వామీజీకి వందనాలు తెలుపాలని భావిస్తున్నాను. అదృష్టవశాత్తూ స్వామీజీ నాకు పదహారు సంవత్సరాల వయస్సులో లండన్‌లోనే పరిచయమయ్యారు. ఆయన బాల్యంనుండి కూడా సామాన్యుల గురించి ఆలోచించేవారు. పేదల గురించి, ఇబ్బందులు, బాధలు, కష్టాల్లో మునిగిపోయేవారి గురించి జబ్బులతో బాధపడేవారి గురించి ఆందోళన చెందేవారు. చాలా చిన్న వయస్సులోనే ప్రాపంచిక భోగాల పట్ల ఆసక్తిని వదలిపెట్టి, అమెరికా వెళ్ళారు. తిరిగి వచ్చిన తర్వాత తోటపల్లి కొండల్లో ఆశ్రమాన్ని నెలకొల్పారు.

దాదాపు అర్థశతాబ్దంగా వారు చేస్తున్న కార్యక్రమాల గురించి నాకు తెలుసు. ఆయనలో ఉన్న ఉన్నతమయిన ఆశయాలు, ఆలోచనలు, అతి సాధారణమయిన జీవన విధానము, నిస్వార్థమయిన సేవ పట్ల ప్రేమ ఆయనలోని గొప్ప సుగుణాలు. భారతీయ వేదాంత సిద్ధాంతాలకు ఆలవాలమయిన భగవద్గీత, వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు బోధించిన ఆధ్యాత్మిక జ్ఞానము ఆయన సొంతము చేసుకున్నారు. చిన్న వయస్సులోనే అన్నింటిని త్యజించి, సమస్త మానవాళి సేవకు అంకితము అయ్యారు. ఆయన కేవలము హిందూమత సంబంధమయిన గ్రంథాలే కాకుండా ఇతర మతాలకు చెందిన విషయాలను కూడా అధ్యయనం చేశారు. ఆయన భగవద్గీతను అధ్యయనం చేయటమే కాకుండా ఆయన జీవితంలో ప్రతి క్షణము దానిని ఆచరణలో పెట్టారు. ఆయన పైకి అందరిలాగానే

పనులు చేస్తున్నట్లుగా కనిపించినా, అంతర్ముఖంగా ఆయన ఎలాంటి బంధాలు లేకుండా, ఆధ్యాత్మికంగా అంటి అంటనట్లుగా వ్యవహరిస్తారు. అన్నింటికీ అతీతంగా ఉంటారు.

చాలా సంవత్సరాలనుండి ఎంతో నిస్వార్థంగా పనిచేస్తున్నారు. జయాపజయాల్లో, కష్టసుఖాల్లో, సుఖదుఃఖాల్లో మనస్సును అన్నింటికి అతీతంగా ఉంచుకుంటారు. జీవితంలో చాలా తొందరగా నిర్మలత్వాన్ని పొందారు. అందువల్లనే ధ్యానము, ప్రార్థనలు, భక్తి భావనతో పండిపోయారు. మనసా, వాచా, కర్మణా త్రికరణశుద్ధిగా పవిత్రంగా పనులు చేయాలని అనుకుంటారు. ఎలాంటి కోరికలు లేకుండా సరయిన మార్గంలో ప్రవర్తిస్తుంటారు. ఏ వ్యక్తి అయినా జీవితంలో పనిచేస్తూ కూడా నిస్వార్థంగా, అన్నింటికి అతీతమయిన స్థితికి ఎదగవచ్చునని నిరూపించారు.

మన దేశంలో కొంతమంది సన్న్యాసులు ప్రపంచాన్ని పూర్తిగా వదిలిపెట్టి అరణ్యాల్లోనికి పారిపోయి అక్కడ విశ్రాంతిగా జీవిస్తూ ప్రాపంచిక విషయాలతో ఎలాంటి సంబంధము పెట్టుకోకుండా, నిస్సహాయతలో ఉన్న ప్రజలకు ఎలాంటి సేవలు చేయకుండా జీవిస్తుంటారు. కాని నిజమయిన సన్న్యాసము అంటే నిస్వార్థంగా కర్మలను ఆచరించటమే కాని ప్రపంచాన్ని త్యజించి దూరంగా ఉండటము కాదు.

ఓం..ఓం..ఓం..

## అధ్యాయం - 74

# శ్రీ స్వామి రామతీర్థ శాంతి కేంద్రము

నా బాల్యమునుండి నేను స్వామి రామతీర్థ గారి పవిత్రమయిన జీవితము ద్వారా గొప్ప స్ఫూర్తిని పొందాను. ఆయన పంజాబుకు చెందిన గొప్ప కవి. ఆయన గొప్ప వేదాంత సందేశాలను, ఆత్మ సాక్షాత్కారానికి మార్గాలను సూచించారు. నా మొదటి పరాజయము నుండి నాకు అమితమయిన ధైర్యాన్ని, బలాన్ని ఇచ్చింది, నన్ను అమెరికా వారు దేశంలో అడుగుపెట్టనివ్వకుండా తిరస్కరించినప్పుడు స్వామి రామతీర్థ గారు రచించిన ఎంతో గాంభీర్యము, ఉన్నతమయిన రచనల ప్రభావము వలన నేను కూడా



ఆత్మ సాక్షాత్కార మార్గములో పయనించాలనే తపనతో పవిత్రమయిన హిమాలయాల్లో పరమ పావనమయిన గంగామాత ప్రక్కన, బ్రహ్మపురి అడవుల్లో తపస్సు చేశాను. శ్రీ రామతీర్థ గారు అమెరికా వెళ్ళి ఆత్మసాక్షాత్కారము గురించి, శాంతి ప్రచారము చేశారు. నేను కూడా ఆయన అడుగుజాడల్లో పయనించి అమెరికాలో శాంతి, వేదాంత ప్రచారము చేయటానికి తహతహలాడాను.

శ్రీ రామతీర్థ గారి ప్రత్యక్ష శిష్యుడు స్వామి నారాయణగురు. ఎంతో ప్రేమతో గొప్ప హృదయంతో స్వామికి సేవలందించాడు. ఆయన శిష్యుడు శ్రీ రామానంద తీర్థ గారు మా శాంతి ఆశ్రమానికి పరిచయం కావటం విచిత్రంగా జరిగింది. శాంతి మిషన్ చేపట్టిన కార్యక్రమాలకు ఆయన అనేకవిధాలుగా సేవలందించారు. సుశీలాదేవి మొదటిసారి శ్రీ పూజ్య స్వామి రామానంద తీర్థజీ గారితో చాలా సంవత్సరాల క్రితము అడగటము వలన మా శాంతి పత్రికకి ఎన్నో స్ఫూర్తిదాయకమయిన రచనలు పంపేవారు. అవన్నీ మా పత్రిక ద్వారా ప్రచురించబడ్డాయి. అయినా చాలా సంవత్సరాలు వరకూ మేము వారిని కలవటం జరగలేదు.

స్వామి రామానంద తీర్థ గారి నిరంతర పరిశ్రమ వలన మేము ఆత్మను మేల్కొలిపి, జీవితాన్ని ప్రసాదించే ఈ కేంద్రాన్ని ప్రారంభించగలిగాము. ఆయన అభ్యర్థన మేరకు శ్రీ జయప్రకాశ్ నారాయణ గారు ఆయన సతీమణి శ్రీమతి ప్రభావతి దేవి గారితో కలిసి వచ్చి ఈ కేంద్రాన్ని ప్రారంభించారు.

ఈ శిక్షణాకేంద్రము ఇప్పటికే రెండు బృందాల విద్యార్థులకు చక్కని శిక్షణని ఇచ్చింది. జాతి, కులము, మతము, దేశము తేడా లేకుండా ఎవ్వరయినా ఇక్కడ శిక్షణ పొందవచ్చు. ఒకే ఒక్క షరతు ఏమిటంటే ఇక్కడ శిక్షణ పొందాలనుకునే విద్యార్థులు ఈ ప్రపంచాన్ని వసుధైక కుటుంబంలాగా భావించాలి. ప్రపంచమంతా వారి సొంత ఇల్లులాగా, అందులో నివసించే వారందరూ తమ సోదర సోదరీమణులు లాగా భావన చేయాలి. ప్రపంచ మానవాళికి సేవ చేయటమే నిజమయిన మతము అని గుర్తించాలి. మతము, జీవితము వేరు కాదు ఒక్కటే అని గ్రహించాలి. ఈ శిక్షణా కేంద్రంలో శిక్షణ పొందటానికి వయస్సుతో నిమిత్తము లేదు.

అందరికి కావల్సినది ఒక్కటే. శ్రీరామతీర్థ గారు అన్నట్లుగా “దివ్యానందాన్ని అనుభవించటము’. అందువలన ఏ హృదయంలో మూఢభక్తి ఉండదో, ఎవ్వరు ఒక్కటే మతానికి అంటిపెట్టుకుని ఉండరో, ఎవ్వరయితే అన్ని మతాలకి చెందిన వారు భగవంతుని బిడ్డలే అని భావిస్తారో అలాంటి వారందరూ ఇక్కడ అందరికి కావాలి. అలాంటి ఆశీర్వదించబడిన పవిత్రమయిన హృదయము కలవారందరూ ఇక్కడ శిక్షణ పొందటానికి అర్హులే. ప్రపంచాన్ని తన ఇల్లుగా, సమస్త మానవాళి గురించి ఆలోచించేవారయి ఉండాలి.

ఇక్కడ శిక్షణ పూర్తయిన తర్వాత విద్యార్థులు ఈ లౌకిక ప్రపంచంలోనికి తిరిగి వెళ్ళవచ్చును. వారు వారి హృదయంలో, గృహాల్లో, సంఘంలో, పల్లెల్లో, పట్టణాలలో నెమ్మదిగా, ప్రశాంతంగా వారి జీవన విధానం ద్వారా, ఆదర్శాల ద్వారా శాంతిని నెలకొల్పాలి. పవిత్రమయిన జీవితాన్ని సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలి. వారు ప్రపంచంలోనే జీవిస్తుండాలి. కాని వారి ఆదర్శము మాత్రము ప్రపంచశాంతి కావాలి. స్వామి రామతీర్థ గారి ఆదర్శాలను విస్తృతంగా ప్రచారం చేయాలి. ఎప్పుడు దైవధ్యానంలోనే ఉంటూ ప్రపంచానికి, సర్వమానవాళికి సేవలు అందించాలి.

తూర్పు పడమర దేశాల్లోని ప్రజల జీవన విధానము, సామాన్యుడి జీవనశైలి ఎలా ఉంటుందో ఆలోచించాలి. అజ్ఞానంలో జీవిస్తూ, పెళ్ళి, పిల్లలు అంటూ బంధనాలతోనే మరణిస్తున్నారు. భగవంతునికి ప్రతిరూపమయిన మానవుడు, సింహగర్జనలు చేయవలసిన వాడు అజ్ఞానంతో గొర్రెపిల్లలాగా జీవిస్తూ చీకట్లో బ్రతుకుతూ, అజ్ఞానంతోనే మరణించటము ఎంతో విషాదకరము.

మతము అంటే వేలం వెర్రి కాదు. ఎవరయినా తన నిజమయిన మతము ఏమిటి అని గ్రహించాలి. వాచా వేదాంతము కాకుండా అనుక్షణము ఆచరణాత్మకంగా జీవించాలి. అప్పుడు అన్ని మతాలను సమానంగా ప్రేమించి, గౌరవించగల్గుతారు. నిజమయిన మతమంటే బయట ఉన్న భగవంతుడిని ఆరాధించటము కాదు. పూర్తిగా విశ్వాసంతో తనలోనే నెలకొని వున్న అంతర్యామిగా కొలువైన దివ్యజ్ఞానజ్యోతిని, దివ్యత్వాన్ని గుర్తించటము. రామతీర్థ శాంతి శిక్షణా కేంద్రము ఆశయము ఒక మతములో నుండి వేరొక మతములోనికి మార్చటము కాదు. హృదయాలను పవిత్రీకరించటము, అన్ని మతాలను అనుసరించే వారందరిలో ఆ సర్వాంతర్యామి అయిన ఈశ్వరుడిని దర్శించటము.

శ్రీరామతీర్థ స్వామి అంటారు "ఒక్కరు దైవ మార్గంలో ప్రయాణించినా చాలు, మొత్తం దేశమంతా వారి ఆదర్శవంతమయిన జీవితాన్ని అనుసరించి ఆ మార్గంలో ప్రయాణిస్తారు."

లోకాసమస్తా సుఖినోభవంతు!

అధ్యాయం - 75

# స్వర్ణోత్సవాలు - 1967

ఆశ్రమానికి స్వర్ణోత్సవాలు వచ్చాయి. ప్రార్థనలు, భజనలు, సత్సంగాలు, పేదలకు అన్నదానము, దక్షిణలు, బహుమతులు ఇలా ఎంతో ఆనందకరంగా జరిగాయి. ఎన్నో భవన సముదాయాల నిర్మాణం జరిగింది. వాటి అన్నింటికన్నా నాకు ఎంతో విలువయినది నేను తీసుకున్న నిర్ణయాలు.

భగవాన్! ఇతరులు గొప్పవారు, కీర్తిమంతులు కావాలి. నన్ను మాత్రము ఎలాంటి గుర్తింపు లేకుండా జీవించనివ్వు. చాలా తక్కువగా మాట్లాడుతూ, ఎక్కువగా ధ్యానము చేయాలి. నా గురించి తక్కువగా ఆలోచించి ఇతరుల సేవకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి. అహంకారాన్ని పూర్తిగా నాశనం చేయాలి. అది పనిలో గాని, ధ్యానములో గాని. ఈ ప్రపంచంలోని సంపదలన్నింటికన్నా నాకు ప్రతి క్షణము చాలా అమూల్యమయినది. మౌనంగా ఉండటాన్ని నేను ప్రేమిస్తాను. అదే సర్వమతాల సారాంశము. ప్రపంచములోని మత గ్రంథాలన్నింటికన్నా మౌనము మహోన్నతమైనది. స్వామీజీ ఇంతకు ముందు కంటే ఎక్కువగా మరణించి, మీ అందరిలో జీవించి ఉండి మీకు మేలు చేయుగాక! నా ప్రతి శ్వాస ఇతరుల మేలు కోసం జరగాలి. అందరూ భగవంతుని ప్రతిరూపాలు కనిపించని ఆత్మ స్వరూపాలు.

ఓం..ఓం..ఓం..

## అధ్యాయం - 76

# దాదా టి.ఎల్. వాస్వాని

శ్రీ వాస్వాని గారు, నేను ఇద్దరము కాదు. ఒక్కరిమే. శాశ్వతంగా ఒక్కరిమే. మేమిద్దరము భౌతికంగా కలుసుకోలేదు. మాది ఆత్మానుబంధం. అందువలన మేము ఎప్పుడూ ఒక్కటిగానే ఉన్నాము. గతంలో ఇప్పుడూ, భవిష్యత్తులో కూడా ఒక్కటిగానే ఉంటాము.

1928 నుండి మా శాంతి పత్రిక వెలువడుతోంది. దాదాపు నలభై సంవత్సరాల క్రితం నుండి ప్రచురింపబడుతోంది. దాదాజీ ఆయన విజ్ఞానాన్ని, అలాగే హృదయ పూర్వకమయిన అంకితభావంతో ఆశ్రమానికి ఎన్నో దక్షిణలు సమర్పించారు. మీరు ఎప్పుడయినా శాంతి పత్రికలు పాతవి తిరగవేస్తే ఆయన వ్రాసిన స్ఫూర్తిని కలిగించే సందేశాలు చదవవచ్చు.

దాదాజీ గారు అనారోగ్యంతో భౌతిక దేహాన్ని చాలించారు అనే వార్త విని నేను చాలా దిగ్భ్రాంతి చెందాను. ఆయన జబ్బు పడినా, ఆయన చివరి క్షణాల వరకూ కూడా బిడ్డలకు సేవలందిస్తూనే ఉన్నాడు.

ఆయన జీవితము మొదటి నుండి పూర్తి అయ్యేవరకు కూడా త్యాగము, సేవ కోసమే జీవించారు. ఏ విధంగా జీసస్ క్రీస్తు ఎల్లప్పుడూ ఇతరుల కోసమే ఆలోచించాడో, తన గురించి ఆలోచించలేదో అలాగే దాదాజీ కూడా జీవితం గడిపారు.

శ్రీ మీరా పాఠశాల ఆయన మానవత్వంతో చేసిన సేవకు ప్రతిరూపంగా, ఆయన సాధు జీవితానికి ఆదర్శంగా నిలుస్తుంది. ఈ సృష్టిలో వ్యక్తమయిన, అవ్యక్తమయిన అన్నింటిలో ఒకటిగా ఆయన నిలిచాడు.

దాదాజీ శరీరాన్ని త్యజించేముందు, నాకు ఆశ్చర్యాన్ని కలిగిస్తూ నేను క్రింద పడి కాలు, చేయి విరగగొట్టుకున్న సమయంలో 116 రూపాయలు మనియార్డరు పంపించి దానిని నా వ్యక్తిగత ఖర్చులకు వినియోగించుకోవల్సిందిగా కోరాడు. ఆయన నన్ను ఎన్నడూ కలవకపోయినా కూడా నా పట్ల చూపించిన గొప్ప అనుబంధాన్ని తలుచుకొని

నా హృదయంలో ఆయన పట్ల ప్రేమ గాఢంగా ముద్రపడింది. ఆయన ఆత్మ మనందరి పట్ల ప్రేమ తరంగాలను కురిపించుగాక! ఎందుకంటే ఆయన ప్రేమకు ప్రతిరూపం కనుక.

ఓం...ఓం...ఓం...

అధ్యాయం - 77

# శ్రీరామతీర్థ మెమోరియల్ - టెహ్రి - హిమాలయాలు

దాదాపు పది సంవత్సరాల క్రితము కీర్తిశేషులు లాల్ బహదూర్ శాస్త్రి గారు అప్పటి హోమ్ మినిష్టరు గారు ఎక్కడయితే స్వామి రామతీర్థ గారు బిలంగానా నదీ ప్రవాహంలో తన భౌతిక శరీరాన్ని వదిలివేశారో ఆ ప్రదేశంలో పాలరాతితో ఒక స్తూపాన్ని నిర్మించాలని సూచించారు. బిలంగానా నది భాగీరథీ గంగానదికి ఉపనది. ఈ స్తూపాన్ని నిర్మించడానికి ఒక కమిటీ కూడా వేశారు. అందులో లాల్‌బహదూర్ శాస్త్రి గారు ఒక సభ్యుడు. కమిటి స్థూప నిర్మాణాన్ని అంగీకరించింది. కీర్తిశేషులయిన లాల్ బహదూర్ శాస్త్రి గారు శ్రీ రామతీర్థ స్వామీజీకి గొప్ప భక్తుడు. ఆయన జీవితంపై భారతదేశపు గొప్ప కవి, సాధు మహాత్ముడి యొక్క దివ్య జీవితము, ప్రబోధాల ప్రభావము చాలా ఉంది.

తోటపల్లిలో నేను స్వామి రామానంద తీర్థ ఇద్దరము కలిసి ప్రకృతిని ఆస్వాదిస్తుండగా, ఎంతో ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని కలిగించే విధంగా రామానందతీర్థ గారు ఆ స్మారక స్తూపాన్ని నన్ను ప్రారంభించమని అభ్యర్థించారు. నా జీవితములోని చివరి అంకములో ఇలాంటి అరుదయిన గౌరవము, అవకాశము లభించటము నిజంగా నా అదృష్టంగా భావించాను.

అయినప్పటికి, అది చాలా సుదూర ప్రాంతము. మేము అక్కడికి చేరుకోవాలంటే మూడు రాత్రులు, మూడు పగళ్ళు రైలులో ప్రయాణించాలి. దాదాపు 1600 మైళ్ళ దూరం ప్రయాణం చేయాలి.తర్వాత దాదాపు 60 మైళ్ళ దూరం కొండల్లో బస్సులో గాని లేదా టాక్సీలో గాని ప్రయాణించి అక్కడికి చేరుకోవాలి. నా భక్తులయిన స్నేహితులు

గొణుగుతూ నన్ను ప్రశ్నించారు. “ఏ విధంగా మీరు గుండెజబ్బుతో అంత దూరము హిమాలయాల్లో ఎత్తైన కొండల్లో మంచు, చలిలో ఆ అడవి ప్రదేశంలోనికి వెళ్ళగలరు?” కానీ నేను దృఢసంకల్పంతో వెంటనే దీనికి అంగీకారము తెలిపాను. అది కేవలము భగవంతుడినుండి అందిన పిలుపుగా నేను భావించాను. దానితో స్వామి రామతీర్థ గారు ఎంతో ఉత్సాహంగా మా ప్రయాణానికి, అక్కడ బస చేయడానికి అన్నివిధాలయిన ఏర్పాట్లు చేయసాగారు.

శ్రీ స్వామి రామానందజీ పగలు రాత్రి నిరంతరము శ్రమించి చేసిన ప్రయత్నాల ఫలితంగానే మనము ఇప్పుడు పంజాబు సాధు మహనీయుడయిన శ్రీ రామతీర్థ స్మారక స్తూపాన్ని పొందగల్గుతున్నాము. స్మారక స్తూప నిర్మాణము నెమ్మదిగా, ప్రశాంతంగా జరిగినా మంచి పటిష్ఠంగా రూపుదిద్దుకుంది. శ్రీ రామతీర్థ స్వామి భౌతిక శరీరాన్ని విడిచిపెట్టి అరవై సంవత్సరాలు దాటిపోయినా, ఇంత ఆలస్యంగా అయినా ఆయన గొప్ప భక్తులు, ఆరాధకులు ఇప్పటికయినా కళ్ళు తెరిచి ఆయన చేసిన ఘనకార్యాలను, చేసిన ధర్మప్రచారాన్ని కేవలము భారతదేశములోనే కాకుండా యావత్తు ప్రపంచానికే గొప్ప ఆదర్శాలను అందించాలనే విషయం గుర్తించటము నాకు చాలా ఆనందాన్ని కలిగించింది. ఆయన చేసిన ధార్మిక ప్రచారము ఆవశ్యకతను, వారి వైభవము మనందరికి ఆశీస్సులుగా పరిణమించాయి.

## 1968 జూన్ 20న ప్రారంభోత్సవ సభలో నేను చేసిన ప్రసంగము

ప్రియమయిన శ్రీరామతీర్థ గారి జీవించి ఉన్న ప్రతిరూపాల్లారా! నా హృదయము మీ ప్రేమమయమయిన, అంకిత హృదయాలను శ్రీ రామతీర్థ గారి అపారమయిన ప్రేమతో నిండిన మిమ్మల్ని తాకటానికి ఆరాటపడుతోంది. ఆయనది విశ్వప్రేమ. ఎవ్వరిని వదలకుండా ప్రతి ఒక్కరిని ప్రేమించే హృదయం వారిది. ఈ రోజు ప్రత్యేకంగా ఈ ప్రారంభోత్సవ ఆనంద సమయంలో నేను భగవంతుని సన్నిధిని ఇంతకు ముందు కంటే ఎక్కువగా అనుభూతి చెందుతున్నాను. ఆయన అపారమయిన ఆశీస్సులు మనందరికి ఉన్నాయి. ఇది నిజంగా ఒక అద్భుతము. ఎక్కడో దక్షిణాపథంలో ఉండే నన్ను, మీ అందరినీ ఈ మారుమూల ఉత్తరపథానికి ఆయన చేర్చారు. ఇంత గొప్ప అవకాశాన్ని ఇచ్చి ఆశీర్వదించారు. కేవలము మీ అందరికి సేవ చేయటం కోసమే

కాకుండా, ఈ ప్రారంభోత్సవ వేడుకల రూపంతో యావత్తు ప్రపంచంలోని సత్యాన్వేషకులందరిని సేవించే అవకాశం కల్గించారు. ఈ ప్రపంచంలో రెండు విధాలయిన వ్యక్తులుంటారని నేను పదే పదే చెపుతుంటాను.

భౌతికంగా ఈ ప్రపంచంలో జీవించి ఉన్నప్పటికి వారు మరణించిన వారితో సమానమే. వారు మొదటి కోవకు చెందినవారు. ఇక రెండవ కోవకు చెందినవారు ఎవరయితే నిస్వార్థంగా, భగవంతుని ప్రేమిస్తారో, భగవంతుని కోసం పరితపిస్తారో, అలాంటి వారు భౌతికమయిన దేహాన్ని విడిచిపెట్టినప్పటికి శ్రీ రామతీర్థ గారి లాగా శాశ్వతంగా జీవించే ఉంటారు.

ఇప్పుడు మనలను మనము పరిశీలించి, పరిశోధించి తెలుసుకోవాల్సి ఉంటుంది. మనము నిజంగా జీవించి ఉన్నామా లేదా మరణించిన వారితో సమానమా అని ప్రశ్నించుకోవాలి. జీవించినా, మరణించినా మన జీవితాలు ఇతరులందరికి ఆదర్శంగా, ఆశీస్సులుగా ఉండాలి.

మనకంటికి కనిపించని ఆత్మ స్వరూపము ఆయనే ఈ ప్రారంభోత్సవాన్ని చేశారు. ఆయన మార్పులేని సత్య స్వరూపము. ఒక్కటే అయిన నిత్యమయిన సత్యము. ఉపనిషత్తులు మనకు తెలియచేస్తున్నాయి. ఉన్నది ఒక్కటే సత్యము. కాని మన ఋషులు దానిని వివిధ నామాలతో పిలుస్తుంటారు 'ఏకం సత్ విప్రా బహుధా వదంతి' ఆ సత్యమే దానినే దైవము, పరమాత్మ అంటున్నాము. ఆయనే మనలందరిని ఇక్కడ ఒక్కటిగా చేశారు. ఆయన ఉనికి వల్లనే నేను ఈ విధంగా మాట్లాడగలుగుతున్నాను. మీరు వినగల్గుతున్నారు. అందువలన ఇప్పుడు ఇంతకు ముందు కంటే ఎక్కువగా ఆ పరమాత్మని దివ్యానుభూతిని ఈ ప్రారంభోత్సవ సందర్భంగా పొందుదాము.

ఈ స్తూపాన్ని నేను రామతీర్థ జ్యోతి స్తూపము అని ప్రేమతో పిలవాలని భావిస్తున్నాను. ఎందుకంటే రామతీర్థ జ్యోతిలో జీవించారు. ఆ పరంజ్యోతి ఆయనలో ఉంది. నిజం చెప్పాలంటే ఆయనే నిజంగా జ్యోతిస్వరూపుడు. కాబట్టి ఈ పవిత్రమయిన రోజుకి గుర్తుగా స్ఫూర్తిని అందించే మూడు సందేశాలను మనతో తీసుకు వెళదాము. **"మనమందరము జ్యోతి స్వరూపంలో ఉన్నాము, మనలో ఆ జ్యోతి స్వరూపం ఉంది. మనమే ఆ జ్యోతి స్వరూపము".**

ఆ దివ్యజ్యోతి స్వరూపము లేకుండా గతంలో గాని, వర్తమానంలో గాని, భవిష్యత్తులో గాని ఏమీ ఉండవు.

నా మంచి కర్మల ఫలితంగా నేను యవ్వనంలో ఉండగా ఆరు సంవత్సరాలు స్వర్గాశ్రమంలో, ఋషికేశ్‌లో చిన్న అందమయిన కుటీరంలో కొండ మీద నివసించాను. అక్కడ ఉన్న రోజుల్లో నేను తపస్సులో కాలం గడిపాను. ఆధ్యాత్మిక గ్రంథ పఠనం చేసేవాడిని. అప్పుడు నా వద్ద ఉన్నవి కేవలం అష్టావక్ర గీత. ఇంకా శ్రీ రామతీర్థ గారు ప్రపంచానికి అందించిన సందేశాలతో కూడిన గ్రంథాలు.

ఆంధ్రప్రదేశ్‌లోని తోటపల్లి కొండల్లో, లోయల్లో నేను 1917లో శాంతి మందిరాన్ని సత్యాన్వేషకుల ఉపయోగార్థం ప్రారంభించాను. పరమపూజ్య శ్రీ స్వామి నారాయణ శ్రీ రామతీర్థ గారి ప్రత్యక్ష శిష్యుడు అక్కడికి వచ్చి మేము చేస్తున్న నిశ్శబ్దమయిన కార్యక్రమాలను గమనించి మమ్మల్ని ఎంతో మెచ్చుకున్నారు. శ్రీ రామతీర్థ గారికి ఆ పనులన్నీ అంకితము చేశాము.

ఓం..ఓం..ఓం..

**అధ్యాయం - 78**

# ఆఖరి నలభై రోజుల తీర్థయాత్ర

రోజులు గడిచిపోతున్న కొద్దీ నేను చిన్న పిల్లవాడిలాగా కొత్త జీవితాన్ని అనుభవిస్తూ తిరిగి మళ్ళీ జన్మ ఎత్తినట్లుగా భావిస్తున్నాను. నేను స్నానం చేసేటప్పుడు నా గతాన్ని పూడ్చిపెట్టి, నేను తిరిగి జన్మించి క్రొత్త రోజుని గడుపుతున్నట్లుగా ఉంటుంది. అందువలన 'తీర్థయాత్రలు' అనే ఈ అధ్యాయం ఏదో కొత్తగా నేర్చుకోవటానికి ఇవ్వబడిన సందేశము కాదు. చిన్నపిల్లవాడి కేరింతలు లాంటివి మాత్రమే. నా మనస్సు లోలోపల మెదలుతున్న ఆలోచనలు అన్నింటిని బిగ్గరగా చెపుతున్నాను. ఎంతో సంతోషంగా నా ప్రతి ఆలోచనలను మీతో  పంచుకోవాలనుకుంటున్నాను.

దీనిని నేను ఎందుకు 'చివరి తీర్థయాత్ర' అని అంటున్నానని మీరు అడగవచ్చు. దానికి నా దగ్గర ఒక్కటే సమాధానమున్నది. 'ఈ రోజు మాత్రమే మనది. రేపు మనది కాదు' ఎవరు మాత్రం రేపటి గురించి ఖచ్చితంగా చెప్పగలరు? ఈ రోజు ఉన్న వ్యక్తి రేపు ఉండకపోవచ్చు అన్న మాటల్లో ఎంతో సత్యమున్నది. ఈ క్షణంలో జీవించే వ్యక్తి నిజంగా ఆశీర్వదించబడిన వాడు. గతాన్ని మరిచిపోయి భవిష్యత్తుని గురించి ఆశలు పెంచుకోకుండా వర్తమానంలో జీవించాలి. ఈ భౌతిక శరీరము వేయి సంవత్సరాలు ఇలాగే ఉండవచ్చు. లేదా ఈ క్షణంలోనే కనుమరుగు కావచ్చు. కానీ ఆత్మకు అంతా ఒక్కటే. మన కంటికి కనిపించని ఆత్మ. ఆ తేజస్సులో ఎలాంటి మార్పు ఉండదు. అది అన్నివేళలా ఒకే విధంగా ఉంటుంది.

ఆధ్యాత్మిక ప్రపంచంలో నలభై సంఖ్యకి ఎంతో ప్రాధాన్యత ఉండటం నాకు చాలా ఆశ్చర్యం కలిగిస్తుంది. అలాగే ఈ భౌతిక ప్రపంచములో కూడా దానికి ప్రాధాన్యత ఉంది. ఆశీర్వదించబడిన జీసస్ క్రీస్తు నలభై రోజులు భగవద్ధ్యానంలో ఏకాంతంగా ఉపవాస దీక్షలో సాధన చేశాడని చెపుతారు. కేవలము తేనె కొన్ని దుంపలు తీసుకున్నాడు. అలాగే ఎందరో ఋషులు, సాధువులు, యోగులు మౌనంగా, ఉపవాస దీక్షలు నలభై రోజులు చేసి భగవదర్శనాన్ని, ఆ దివ్యానుభూతిని అనుభవించారు వారి సాధనా కాలములో. మన జీవితంలో ఎప్పుడో ఒకసారి అయినా కనీసం ముప్పై లేదా నలభై రోజులు ఏకాంతంగా భగవద్ధ్యానంలో కాలం గడపాలి. మౌనంగా ధ్యానం చేస్తూ, ప్రార్థనలు చేస్తూ ఉండాలి. ప్రతి ఒక్కరూ సంవత్సరంలో నలభై రోజులు ఈ విధంగా దైవ ధ్యానంలో ఏకాంతంగా ఉండి అంతర్యామిగా దివ్యతేజస్సుతో వెలుగొందుతున్న పరమాత్మ దివ్యానుభూతిని పొందటానికి ప్రయత్నించి మానవ జీవిత గమ్యాన్ని తెలుసుకొని అమూల్యమయిన మానవ జన్మను సార్థకం చేసుకోవాలి.

భగవాన్ శ్రీ రామకృష్ణ పరమహంస ఇనుప కాలము అయిన ఈ కలియుగములో మనలను కనీసం మూడు రోజులయినా ఏకాంతంగా పరమాత్మ ధ్యానంలో గడపమని చెపుతున్నారు. కొంతమంది ఏకాదశికి ఉపవాసం ఉంటారు. మరికొందరు వారానికి ఒకరోజు మౌనంగా ఉపవాసదీక్షలో కాలము గడుపుతారు. ఆ విధంగా వారు శాంతిని పొందుతుంటారు.



ఇంకా ఆలోచనల గురించి ఆపి, మా ప్రయాణం గురించి చెపుతాను. ఈసారి ఆశ్రమవాసులు, గురుకుల విద్యార్థులను మాతో పాటు ఈ సుదీర్ఘ ప్రయాణం చేయడానికి అనుమతించలేదు. కొందరు మాతో కలిసి వచ్చి మా అనుభవాలను పంచుకోవాలని ఆశించారు. ప్రత్యేకమయిన ప్రార్థనలు, ధ్యానము జరిగిన అనంతరము మేము అందరి దగ్గరా వీడ్కోలు తీసుకొని 'హరే రామ, హరే కృష్ణ' భజనలు, సంకీర్తనలు చేస్తూ, పవిత్రమయిన ఓంకారాన్ని జపిస్తూ తీర్థయాత్రకు బయలుదేరాము.

దాదాపు ఏభై సంవత్సరాల క్రితము నేను బాల్యంలోనే హిమాలయాల్లో పావన గంగామాత ఒడ్డున జీవితము గడిపాను. అప్పుడు శివానందాశ్రమము గాని, గీతా భవనము గానీ లేవు. 'నికేతన్ పరమాత్మ' లేదు. చాలా అద్భుతమయిన ప్రశాంతమయిన ప్రదేశము అది. అక్కడ ఎందరో సాధువులు, మహాత్ముల విగ్రహాలు ఉన్నాయి. అలాగే రామాయణము, మహాభారతములోని సన్నివేశాలు చిత్రీకరించబడ్డాయి.

గంగానది ఆవలి ఒడ్డున నేను బాల్యంలోనే తపస్సు చేసుకొన్న జ్ఞాపకాలు, పడవలో గంగానది దాటి రావడం ఒక మధురమయిన స్మృతి. ఆ రోజుల్లో అక్కడ కేవలం ఒక్కటే భవనం ఉండేది. రామతీర్థ గ్రంథాలయమును ఒక విశ్రాంతి జడ్జిగారు శ్రీ రామతీర్థ గారి శిష్యుడు బైనాద్‌జీ గారు విరాళంతో నడిపించేవారు. అక్కడ నేను గంటల తరబడి కూర్చుని ఆధ్యాత్మిక గ్రంథాలు పఠించేవాడిని. ఆ రోజుల్లో నేను ఎంతో ఉత్తేజపూరితంగా ఉండేవాడిని. నా కుటీరంలో కనీసం దీపము కూడా ఉండేది కాదు. నారాయణస్వామి భగవంతునిలాగా నన్ను జాగ్రత్తగా సంరక్షించేవారు. ఎంతో ప్రేమ, భక్తితో ఆయన నా కోసం శ్రద్ధగా అన్నము, పప్పు ప్రతిరోజు తీసుకువచ్చి ఇచ్చేవారు.

ప్రస్తుతము మా తీర్థయాత్ర సమయంలో శ్రీ స్వామి దేవానందజీ గారు మా కోసం ప్రతి చిన్న అవసరాలను గమనించి తీరుస్తున్నారు. నన్ను శివానందాశ్రమంలో మొదటిసారి చూచిన దగ్గర నుండి నీడలాగా ఉంటూ ప్రతిక్షణమూ సేవ చేస్తున్నారు.

శివానందాశ్రమంలోని చక్కని సౌకర్యవంతమయిన కుటీరములో ఉండే ఎవ్వరికయినా స్వర్గం లోకం లోనికి ఆశీస్సులతో, దివ్యానుభూతిని అనుభవించడానికి పంపించినట్లుగా అనుభూతి కల్గుతుంది. అర్థరాత్రి సమయంలో కూడా వరండాలో కూర్చుని రంగు రంగుల విద్యుద్దీపాలను చూస్తూ, వేదమంత్ర ఘోష లాంటి గంగానది ప్రవాహ ఝురులను

వింటూ ఆనందించేవాడిని. పవిత్రమయిన గంగానది ప్రవాహంనుండి అద్భుతమయిన ఆధ్యాత్మిక తరంగాలు వచ్చి నన్ను చుట్టుముట్టి ఆత్మానుభూతిని కలిగించటము మరువలేని దివ్యానుభవము అని చెప్పాలి.

హిమాలయాల వంటి స్వర్గధామం లాంటి సుందర ప్రదేశము, అలాగే నిరంతరము ఓంకార నాదాన్ని జపిస్తున్నట్లుగా గలగలలాడుతూ ప్రవహించే గంగామాతతో పోల్చి చూచినప్పుడు అనుకోకుండానే నాకు ఒక్కో పర్యాయము ఆశ్చర్యం కల్గుతుంటుంది. ఆంధ్రదేశంలో చిన్న ఎలుకల కన్నం లాంటి చోట నేను ఎందుకు శాంతి ఆశ్రమాన్ని ప్రారంభించానో అనిపిస్తుంటుంది. అక్కడ మహోన్నతమయిన తండ్రి లాంటి హిమగిరులు లేవు, గంగామాత లేదు. అయినప్పటికీ చిన్న ఎలుక కూడా మహా గణపతికి వాహనము అయింది కదా! అదంతా ఆశీస్సులే. అందువలన శాంతి ఆశ్రమము కూడా చిన్న ఎలుకల కన్నంలాంటి చోట నెలకొల్పినప్పటికీ ఆ ప్రదేశము ఎందరో తూర్పు పడమర దేశాల్లోని మహాత్ములు, సాధువులు, యోగులు స్వామీజీల పాదస్పర్శ చేత పునీతమయింది. ప్రత్యేకంగా స్వామి శివానంద మహరాజ్ మరియు శ్రీ రామతీర్థ ప్రత్యక్ష శిష్యులయిన శ్రీ స్వామి నారాయణ మొదలయినవారి పవిత్రమయిన జ్ఞాపకాలతో శాంతి ఆశ్రమము నిర్మించబడింది.

ఒక మంచి రోజున హరిద్వార్ నుండి ఋషికేశ్‌కు టాక్సీ వచ్చింది. బదరీనాథ్ వెళ్ళడానికి 900 రూపాయలు అడిగాడు. రామ్‌సింగ్ మా డ్రైవరు ఆ ప్రాంతమంతా బాగా తెలిసినవాడు. అక్కడి పోలీస్ వారితో పరిచయాలున్నాయి. పైగా వాహనం నడపటంలో మంచి నైపుణ్యం ఉంది. బదరీ వెళ్ళే దారి చాలా ఇరుకుగా ఉంటుంది. వాహనాల రద్దీ కూడా చాలా ఎక్కువ. అందువలన అక్కడి ప్రభుత్వం ప్రమాదాలు జరక్కుండా ఉండేందుకు ఒకే రహదారిని వినియోగించాలని విజ్ఞప్తి చేశారు. ఒక వైపు నుండి వాహనాలు పూర్తిగా వెళ్లేవరకూ రెండవ వైపు వారు ఆగాల్సి ఉంటుంది. ఆఖరి వాహనము వెళ్ళిన తర్వాత సైరన్ మ్రోగుతుంది. రుద్ర ప్రయాగ వద్ద మేము ఆగి ఒక రాత్రి బస చేశాము. రామానంద స్వామి మా బస గురించి భోజనము గురించిన ఏర్పాట్లు చేయటంలో మునిగిపోయారు.

మరుసటి ఉదయము స్నానం చేసి ఉపాహారము తీసుకున్న తర్వాత భగవంతుని ఆశీస్సులతో తిరిగి మేము బదరీనాథ్ వైపుగా ప్రయాణం కొనసాగించాము. ఒక పర్వతము

తర్వాత ఒక దాన్ని దాటుతూ మేము బదరీని సమీపిస్తున్నాము. మంచుతో కప్పబడిన పర్వతాలు మాకు స్వాగతం పలుకుతున్నట్లుగా ఉన్నాయి. అక్కడి వాతావరణం బాగా చల్లగా ఉంది. చీకటి పడుతున్న సమయానికి భగవంతుని దయ వలన మేము క్షేమంగా పరమ పవిత్రమయిన బదరీ నారాయణ క్షేత్రాన్ని చేరుకున్నాము.

మా టాక్సీ ఆగగానే అక్కడి పండాలు గుంపుగా మా చుట్టూ మూగిపోయారు. వారిలో ఉత్తములున్నారు. అలాగే అజ్ఞానులు కూడా ఉన్నారు. వారిలో చాలా మంది కోట్లు ధరించారు. అక్కడి వాతావరణం విపరీతమయిన చలిగా ఉంది. పండాల్లో కొందరు సిగరెట్లు త్రాగటం చూచి నాకు చాలా బాధగా అనిపించింది. వాళ్ళు దైవధ్యానంలో ఉంటూ మా లాంటి యాత్రికులను భగవాన్ బదరీ నారాయణ స్వామి సన్నిధికి తీసుకువెళ్ళి మాకు అన్ని సౌకర్యాలు, అవసరాలు తీర్చాలి. కానీ చాలా పుణ్యక్షేత్రాల్లో పండాలు యాత్రీకులను డబ్బు కోసం జలగల్లాగా పీల్చివేస్తూ ఉంటారు. చేసేది ఏమీ లేదు కనుక మేము తప్పనిసరి అయి సత్యనారాయణ అనే పండా చేతుల్లో పడ్డాము. అతను దగ్గరిలోని రమణాయ ఆశ్రమంలో అన్ని ఏర్పాట్లు చేస్తానని వాగ్ధానం చేసి మమ్మల్ని అక్కడికి తీసుకువెళ్ళాడు.

కాని అక్కడి పరిస్థితి చాలా దారుణంగా ఉంది. గదిలో ఎలాంటి వస్తువులు లేవు. కనీసం లైటు కూడా వెలగటం లేదు. పండా మా కోసం కొన్ని రగ్గులు అద్దెకు తీసుకు వచ్చాడు. అలాగే వేడినీటి బుగ్గ దగ్గరనుండి ఒక బక్కెట్టు వేడి నీరు తెచ్చాడు. కనీసం పడుకోవడానికి ఒక మంచము కూడా లేదు. నా తుంటి ఎముక విరిగినందువల్ల నేను నేల మీద పడుకోలేను. అందువలన అతి కష్టం మీద నాలుగు అడుగుల బల్ల ఒక దానిని తెచ్చాడు. నేను ఎలాగో దాని మీద పడుకొని నా కాళ్ళని కుర్చీ మీద చేర్చి సర్దుకున్నాను. కప్పుకున్న రగ్గులు జారి క్రిందపడిపోయాయి. అంత చలిలో గడగడలాడుతూ పడుకోవాల్సి వచ్చింది. మా కష్టాలకి తోడు ఆ గదికి స్నానపు గది గాని, మరుగుదొడ్డి గాని లేదు. మాతో పాటు వచ్చిన వాళ్ళందరూ పెద్ద హాలులో సర్దుకుని పడుకున్నారు. నాకు సహాయకారిగా ఉండే చిన్న పిల్లవాడు సత్యానందం బాగా అలసిపోవటం వలన గాఢనిద్రలో మునిగిపోయాడు. నా కోసం కమోడ్‌ని ప్రక్క గదిలో ఏర్పాటు చేశారు. కానీ మేము నీరు పోసినప్పుడు అది కారటం చూచి మాకు

విచారం కలిగింది. అందులోంచి కారిన నీరు మా గదిలోనికి ప్రవాహంలాగా అలకానంద ఉపనదిలాగా ప్రవహించి రాసాగింది.

విపరీతమయిన చలి వలన నాకు నిద్రపట్టక లేచి కూర్చుని ఆ చిన్న బల్ల మీద రగ్గు కప్పుకొని కూర్చున్నాను. అంత చలిలో ఎన్నో ఇబ్బందులు, కష్టాలు ఎదుర్కొని ఎంతో క్షేమంగా మేము బదరీ క్షేత్రం చేరుకున్నాము. నిజంగా నేను మౌనంగా గాఢమయిన ధ్యానములో బదరీ నారాయణుడిని స్మరించసాగాను. "హృదయపు లోతుల్లోంచి క్రొత్త బలం చేకూరింది. చీకట్లో వెలుగులు వెదజల్లాయి. నిస్సహాయ స్థితిలో సరయిన మార్గంలో ప్రవేశించాము". ఆ చలిలో వణికిపోతూ ఒక విధమయిన నిరుత్సాహానికి లోనయ్యాను. హఠాత్తుగా నేను బదరీనారాయణుడి సన్నిధికి చేరుకున్న భావన కలిగింది. పవిత్రమయిన బదరీనారాయణుడి దేవాలయము తలుపులు తెరుచుకుని నా ఆత్మ భగవంతుడి ఎదురుగా కూర్చుని వెచ్చని అనుభూతిని పొందుతూ దివ్య మయిన తేజఃకాంతిపుంజం వెలుగుల్లో స్వామితో సంభాషణ మొదలుపెట్టింది.

ఓంకార్ : బదరీనారాయణుడితో నా సంభాషణ ఈ విధంగా కొనసాగింది.

ఓంకార్ : ప్రియమయిన దైవమా! నీకు గుర్తుందా! ఏభై ఐదు సంవత్సరాల క్రితము నేను నీతో ఈ గర్భగుడిలో మూడు రోజులు గడిపాను?

బదరీనారాయణుడు : ఎలా మర్చిపోగలను? నాకు మరుపు అనేది ఉండదు కదా!

ఓంకార్ : నీ ఇచ్ఛ లేకుండా గడ్డి పరక కూడా కదలలేదు కదా! ఎందుకు నీవు నన్ను మళ్ళీ నీ పవిత్రమయిన సన్నిధికి యాభై సంవత్సరాల తర్వాత తీసుకువచ్చావు?

నారాయణుడు నా వైపు నవ్వుతూ చూచాడు. ఇద్దరమూ అలా ఒకరి వైపు ఒకరము చూసుకుంటూ చాలాసేపు ఇద్దరము లీనమైపోయాము.

బదరీ నారాయణుడు : అవును, నిన్ను నేను ఒక మంచి కార్యము నిమిత్తము మళ్ళీ ఇక్కడికి తీసుకువచ్చాను. నీకు మళ్ళీ క్రొత్త జీవితాన్ని, పవిత్రతని ప్రసాదించి, తద్వారా యావత్తు ప్రపంచానికి, నా బిడ్డలందరికీ శాంతిని ప్రసాదించాలనుకుంటున్నాను.

ఓంకార్ : 'భగవాన్ నారాయణా! నీవు నీ మందిరంలో కూర్చుని నీ దర్శనం కోసం వచ్చే వందల వేల భక్తులను ఆశీర్వదిస్తుంటావు. నిన్ను దర్శించుకోవడానికి ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి, ఎన్నో ఇబ్బందులు పడి ఇంత దూరం నీ కోసం వచ్చే వందల, వేల భక్తుల గురించి నీవు ఏమయినా ఆలోచిస్తున్నావా? నిన్ననే ఒక బస్సు బోల్తా పడి లోయలో పడిపోయి పధ్నాలుగు మంది అక్కడికక్కడే చనిపోయారు. నీ గుడి ఎదురుగానే చలికి తట్టుకోలేక ఆరుగురు చనిపోయారని విన్నప్పుడు నాకు ఎంతో బాధ కల్గింది. వారికి కప్పుకోవడానికి సరయిన దుస్తులు గాని, ఉండడానికి బస గాని లేదు. నీవు ఎప్పుడయినా వారి బాధాకరమయిన స్థితి గురించి ఆలోచించావా? నీవు హాయిగా, వెచ్చగా ఉన్న నీ మందిరాన్ని వదిలి బయటకు వచ్చి నీ పేరు మీద మరణించేవారిని గురించి ఏమి రక్షణ వహిస్తావు?

భగవంతుడు నా పిల్లతనపు ఆలోచనలు గురించి నవ్వుకుంటున్నట్లుగా నాకు అనిపించింది.

నారాయణుడు : 'ప్రియమైన బిడ్డా! నేను కేవలము సర్వసాక్షిని మాత్రమే. వెలుగుతున్న సూర్యుడిలాగా సాక్షీమాత్రంగా ఉంటాను. నేను అంటి అంటనట్లుగా, ఎవ్వరితో ఎలాంటి అనుబంధము లేకుండా ఉంటాను. మానవులు ఏదయితే చేస్తారో ఆ కర్మ ఫలితాలనే అనుభవిస్తుంటారు. వారి ఆలోచనలు, మాటలు, పనుల యొక్క ఫలితాలను అనుభవిస్తుంటారు. సత్యాన్ని అన్వేషిస్తూ స్వర్గదారుల్లో పయనిస్తూ మరణించేవారు ఆశీస్సులు అందుకున్న ధన్యజీవులు అవుతారు.

ఓంకార్ : "భగవాన్! నీవు సర్వజ్ఞుడివి కనుక ఎవరికి ఏది మేలు చేస్తుందో నీకు తెలుసు. అలాగే సమాజానికి, దేశాలకి ఏవి మంచిదో నీకు తెలుసు. నీ సంకల్పము మేరకు భూమి మీదా, స్వర్గంలో కూడా అన్నీ జరుగుతుంటాయి. నీటి బుడగ కొలనులోని నీటి లోతును కొలవగలదా? అలాగే ఎల్లలు లేని సముద్రము నీటి పట్ల సంపూర్ణమయిన అవగాహన చేసుకోగలదా? అదేవిధంగా పరిమితులు గల మానవుడు నీ అపరిమితమయిన వైభవాన్ని ఎలా తెలుసుకోగల్గుతాడు?

భగవానుడు : చాలా కొద్ది మంది అరుదుగా నన్ను గుర్తించగలుగుతారు. మార్పులేని నా దివ్యమయిన ధర్మాలను అర్థం చేసుకుని మౌనంగా, సంతృప్తిగా నాలో ఐక్యత పొంది సహస్ర సూర్య దివ్యతేజస్సులో లీనమవుతారు.

ఓంకార్ : "ప్రియమయిన దైవమా! మా ఆశ్రమంలో మండయ్య అనే భక్తుడు నీ దర్శనానికి బదరీ రావాలనుకున్నాడు. నీకు అతను తెలుసా?"

భగవంతుడు : "నాకు తెలియని వారు ఎవరయినా ఉంటారా? నా నుండి ఏదయినా దాగి ఉండగలదా? నేను ఈ విశ్వమంతా వ్యాపించి ఉన్నాను కదా! మండయ్య నాకు భక్తుడు. అతనికి మతము, జీవితము వేరు కాదు ఒక్కటే అని నాకు తెలుసు. అతను పనిచేసుకునేటప్పుడు నా నామ స్మరణ చేస్తుంటాడు. కొందరు అతడిని చూచి నవ్వుతూ ఎగతాళి చేస్తుంటారు. కొద్దిమంది అతడిని పొగడుతూ ఉంటారు. కానీ అతడిలాగా జీవించాలని ఎవ్వరూ భావించరు. లౌకిక జీవితంలోనే జీవించేవారికి నేను కావాలి కాని దానికి తగిన మూల్యాన్ని చెల్లించరు. వారి మనస్సును, బుద్ధిని సంపూర్ణంగా నాకు సమర్పించకుండా నేను కావాలని కోరుకుంటారు. నీవు మండయ్యని నా వద్దకు తీసుకురాలేకపోయినా అతడు నాలోనే ఉన్నాడు. నేను అతడిలో ఉన్నాను".

ఓంకార్ : భగవాన్! నేను నిన్ను ఎన్నోసార్లు నిర్లక్ష్యం చేశాను. మిలియన్న సార్లు నిన్ను మర్చిపోయి ఉంటాను. అయినా ఎంతో దయతో నీవు నన్ను క్షమించి ప్రతిసారి నీవు నన్ను పైకి లేవనెత్తావు. అది నీ దివ్యమయిన ప్రేమ వైభవము. అందువల్లనే ఇప్పుడు నేనిక్కడ ఉన్నాను. ఏభై ఐదు సంవత్సరాల వియోగం తర్వాత మళ్ళీ నీవు నన్ను నీ దరికి చేర్చుకున్నావు. ఇప్పుడు నా హృదయం నీలో ఐక్యం కావాలని తపించి పోతోంది. ఇంక ఎలాంటి వియోగాన్ని భరించలేను. ఇంక నిన్ను ఒక్క క్షణం కూడా మర్చిపోలేను.

భగవాన్ : "బిడ్డా! నేను ఎల్లవేళలా నీతోనే ఉన్నాను అని తెలుసుకో. ఒక్క క్షణం కూడా నీతో వియోగం గాని, వేరుగా గాని నేను లేను. నీకు ప్రత్యేకమయిన పని నా బిడ్డల గురించి చేయవలసి ఉంటే ఇంతకు పూర్వము కంటే గొప్ప శక్తితో, నూతన ఉత్సాహంతో నీవు ఎక్కడికి వెళ్ళినా నన్ను కూడా నీతో తీసుకువెళ్ళు. అలాగే నీ ప్రతి

ఆలోచనలో, మాటల్లో, చేతల్లో నన్ను వ్యక్తం చేయడానికి ప్రయత్నించు. బిడ్డా నీకు కేవలం ఒక్క మాట చాలు.”

నేను తన్మయత్వంలో మునిగిపోయాను. బదరీ నారాయణుడు ఆ దివ్యమయిన మందిరంలో ప్రతిమ రూపంలో కాకుండా ఇంతకు ముందుకంటే ఎక్కువగా నాలో ప్రవేశించి నేనుగానే ఉన్నాడు. నా శరీరమనే దేవాలయంలో కొలువై ఉన్నాడు.

మంచు కప్పిన పర్వతాల పైన ఉషఃకాంతులు వెలుగుతుండగా, భక్తులు చేస్తున్న కోలాహలము బిగ్గరగా వినిపించసాగింది. భక్తులు పెద్దగా ‘బద్రినాధ్‌కి జై, బద్రి బీసాల్‌కి జై’ అని చేసే జైజైలు నాకు ఎంతో ఉల్లాసాన్ని కలిగించాయి.

ఆ విధంగా నేను ధ్యానంలో నుండి మేలుకొని పవిత్రమయిన దేవాలయము నుండి రామానుజ ఆశ్రమానికి తిరిగి వచ్చాను. కాని బద్రీనాద్ యొక్క వెచ్చని దివ్యానుభూతి ఇంకా నాలో అలానే మిగిలి ఉంది. అలా పవిత్రమయిన మా అనుభూతి భగవానుడితో జరిగింది. ఆయనే నా జీవితము, ప్రేమ, జ్యోతి.

ఓం..ఓం..ఓం..

అధ్యాయం - 79

# ఎన్నో ఘనకార్యాలు చేయవలసి ఉంది

ఉత్తరాది యాత్ర నా కళ్ళను తెరిపించింది. ఇంకా చేయవలసిన కార్యక్రమాలు ఎన్నో ఉన్నాయని తెలియచేసింది. నిజానికి నేను తోటపల్లి నుండి ఇష్టం లేకుండా ఏదో శక్తి బలవంతంగా లాక్కుపోయినట్లుగా వెళ్ళాను. కాని నేను ఎప్పుడు వెళ్ళినా భగవంతుని సేవ చేయడానికే ప్రయత్నిస్తుంటాను. ఎలాంటి గౌరవాలు ఆశించకుండా పనిచేస్తాను. నాకు దక్కవలసినదల్లా ఒక్కటే, అది నా సందేశాల వల్ల భక్తులు విశ్వశాంతి ప్రార్థనల ద్వారా భగవంతుని దివ్యానుభూతిని అనుభవించటము.

నిన్నటి పూమొగ్గలు ఈ రోజు పుష్పాలుగా వికసిస్తాయి అన్నది ఎంతో వాస్తవము. అవి వాటి సుగంధాన్ని వెదజల్లుతూ దగ్గర వారినే కాకుండా సుదూరంగా ఉన్నవారిని కూడా ఆహ్లాదపరుస్తాయి. అదేవిధంగా ఈ రోజు మనము చేసే పనులు సాధించిన ఘనకార్యాల వెనుక మన గతంలోని ఆలోచనలు, ఆశలు ఉంటాయి. నేను ఆరు సంవత్సరాలు మౌనంగా ఉన్నప్పుడు, నాకు ఈ విధమయిన ఆలోచనలు వచ్చాయి. “ఒక వేళ నీవు నీ మౌనాన్ని వదిలిపెట్టితే అప్పుడు నీవు ఏమి చేయాలి అని ఆశిస్తున్నావు? నీ మాటల ద్వారా ఏమి సాధించాలనుకుంటున్నావు?” దానికి సమాధానం ఈ విధంగా వచ్చింది.

“నేను విశ్వశాంతి ప్రార్థనని ప్రచారము చేయాలనుకుంటున్నాను. హృదయంనుండి వేరొక హృదయానికి, ఒక గృహమునుండి వేరొక గృహానికి, ఒక పల్లెనుండి వేరొక పల్లెకు, ఒక పట్టణమునుండి వేరొక పట్టణానికి, ఒక సమాజంనుండి వేరొక సమాజానికి, ఒక దేశమునుండి వేరొక దేశానికి, తూర్పునుండి పడమరకు ఈ విధంగా యావత్తు ప్రపంచానికి ఎందరో వ్యక్తులకు ఉత్తేజాన్ని కలిగిస్తూ విశ్వశాంతి ప్రార్థనని మళ్ళీ మళ్ళీ చెప్పి అందరినీ భగవంతుని దివ్యానుభూతిలో ఓలలాడించాలనుకుంటున్నాను.”

నిజంగా నా జీవితము ధన్యమయింది. నేను కన్న కలలు సాకారమయ్యాయి. మా ప్రార్థనా సమావేశాల్లో భక్తులు వాళ్ళ కళ్ళు మూసుకొని విశ్వశాంతి ప్రార్థనని జపిస్తూ, తన్మయత్వంతో భగవంతుని దివ్యానుభూతిని పొందటం చూస్తుంటే నా మనస్సు తన్మయత్వం చెందుతుంది. వాందరూ ఈ దివ్య క్షణాలలో మానవుడు కల్పించుకున్న జాతి, మతము, కులము, రంగు, దేశము మొదలయిన భేదాలన్నింటిని మర్చిపోతున్నారు. మా సమావేశాలకి హాజరయ్యేవారిలో క్రైస్తవులు, బౌద్ధులు, ముస్లిమ్‌లు, హిందువులు అందరూ వారి మతము అనే గుర్తును మర్చిపోతుంటారు. అలాగే దేశాన్ని కూడా మర్చిపోతారు. అప్పుడు వారికి తామందరు భగవంతుని బిడ్డలము అని మాత్రమే అనిపిస్తుంది. వారందరికి ఒక్కడే తండ్రి. ఈ ప్రపంచంలోని వారందరూ ఆయన బిడ్డలు. కంటికి కనిపించని ఆ పరమాత్మకు ప్రతిరూపాలు. దివ్యతేజోమయమయిన కాంతిపుంజాలు. అలాంటి మహోన్నతమయిన స్థితిలో మాత్రమే చిరునవ్వుతో అంటారు **“ఈ ప్రపంచమంతా నా గృహము వంటిది. అందులో నివసించే వారందరూ నాకు**

**సోదర సోదరీమణులు. వారికి సేవ చేయటము, వారిని ప్రేమించటము నిజమయిన మతము.”**

మేము ఉత్తరాది యాత్రనుండి క్షేమంగా, సంతోషంగా, సంతృప్తిగా మా ఆశ్రమానికి తిరిగి వచ్చాము. ఎందుకంటే మేము మా బాధ్యతలను మా శక్తి మేరకు చక్కగా నెరవేర్చాము. తండ్రి అయిన ఈశ్వరుడు ఎప్పుడూ నా చెవిలో చెబుతున్నట్లుగా అనిపిస్తుంది. “చక్కగా చేశావు. నా బిడ్డా! నేను నీ పట్ల చాలా సంతృప్తిగా ఉన్నాను”. ప్రతి క్షణము, నా ప్రతి అడుగులోనూ ఆ పరమాత్మనాకు తోడుగా ఉండి ఆయన బిడ్డలకు సేవ చేయడానికి, సహాయం చేయడానికి దారి చూపించాడు. ఆయన అనుమతి లేకుండా గడ్డిపరక కూడా కదలలేదు కదా? అందువల్ల ఆయనే ఈ ఉపాధిని పరికరంగా వాడుకొని ఆయన బిడ్డలకి సేవ చేయించాడు. అందువలన దివ్య వైభవము అంతా ఆ పరమాత్మకే చెందుతుంది.

ఈ తీర్థయాత్ర వలన ఎవరికి ఎక్కువగా ఉపయోగం జరిగింది? అనే ఆలోచన నాలో కలిగింది. ప్రతి ఒక్కరూ ఎవరికి వారు వారే ఎక్కువగా లాభం పొందారని భావించి ఉండవచ్చు. నా హృదయం నిండుగా సంతోషంతో, సంతృప్తిగా పెద్దగా చెపుతున్నాను. ఓంకార్ అందరికంటే ఎక్కువగా ఈ యాత్ర వలన లాభం పొందాడు. ధర్మం ఏమిటంటే నీవు ఎంత ఎక్కువగా ఇస్తావో నీవు అంత ఎక్కువగా తిరిగి పొందుతావు. ఇచ్చేవాడు కాలంలో ఎంతో ఎక్కువగా లాభాన్ని పొందుతాడు. నేను భగవంతుడు నాకు అందించిన అవకాశాల వల్ల అతని బిడ్డలందరిని సేవలు అందించగల్గి నందుకు చాలా సంతోషంగా, సంతృప్తిగా ఉన్నాను.

విశ్వశాంతి ప్రార్థన నాకు ఎంతో సహాయం చేసింది. ఇంకా అది నాకు సహాయకారిగా ఉంది. పదే పదే మననము చేయటం ద్వారా నిరంతరము నేను నామరూపాలను మర్చిపోయి అందరిలో ఆ పరమాత్మనే దర్శించగల్గుతున్నాను. అది ఎలాంటి ప్రార్థన అంటే దాని వలన ఎవరయినా పరమాత్మ దివ్యానుభూతిని కేవలము రేపు మాత్రమే కాదు, భవిష్యత్తులో, వర్తమానంలో ఎప్పుడూ ఆ అనుభూతిని పొందగల్గుతారు. పాయసాన్ని తిన్నప్పుడే దాని రుచి తెలుస్తుంది. అలాగే విశ్వశాంతి ప్రార్థనని రెండు మూడు పర్యాయాలు మననము చేసినప్పుడు మీరే తెలుసుకుంటారు దాని ఫలితాలు ఏ విధంగా ఉంటాయి అని. మీ భౌతిక శరీరము జీవంతో ప్రేమ, వెలుగుతో

వెలిగిపోతుంది. మీరు విశ్వశాంతి ప్రార్థన చేసేటప్పుడు అంతటా నిండి నిబిడీకృతమైన ఈశ్వరుడి ఉనికిని మీలో మీరు దర్శించ గల్గుతారు.

స్నేహితులారా! ఇంకా మీకు ఏమి కావాలి? మీరు భగవంతుని కోసం తపించిపోతే ఇప్పుడు ఇక్కడే ఈ క్షణంలోనే ఆయన ఉంటాడు. మీరు శాంతిని అనుభూతి చెందాలని పరితపిస్తే, అర్థం చేసుకోవాలనుకుంటే అది మీ లోపలే ఉంది, మీరు గుర్తించాలని ఎదురుచూస్తోంది. చాలా సరళమయిన ఈ విశ్వశాంతి ప్రార్థనని మీరు పూర్తి మనోబలంతో మీ బుద్ధిని, హృదయాన్ని, ఆత్మను సమర్పించి ప్రార్థిస్తే మీ లోపల వెలుగొందుతున్న అంతర్జ్యోతి స్వరూపము వ్యక్తమవుతుంది. తన దివ్యవైభవాన్ని తెలియచేస్తుంది. పండితులు, పురోహితులు ఈ విశ్వశాంతి ప్రార్థనలో క్రొత్తగా ఏముంది అని భావించవచ్చు. ఎందుకంటే కేనోపనిషత్తు మరియు ఇతర ఉపనిషత్తుల సారాంశమే ఈ విశ్వశాంతి ప్రార్థన. నిజమే వారితో నేను ఏకీభవిస్తాను. శాస్త్రాలన్నీ దానినే చెపుతున్నాయి. అయితే విశ్వశాంతి ప్రార్థన దానిని నిత్యజీవితంలో అనుభవైక్యముగా చేస్తుంది. స్వానుభవంగా తెలియచేస్తుంది. శాస్త్రాల యొక్క సారాంశాన్ని మీ హృదయానికి హత్తుకొనే విధంగా మీ జీవితంలో తెలియచేస్తుంది.

వేదాలు, బైబిల్, పిఠకాలు, ఖురాను మొదలైన పవిత్ర గ్రంథాల్లో దేనిని గురించి చెపుతున్నారో దానిని మన బుద్ధిలో, హృదయంలో, ఆత్మలో మనము నింపుకోవాలి. మన నిత్య జీవితంలో దానిని ఆచరణలో పెట్టాలి. అనుక్షణము ఆ పరమాత్మ దివ్యానుభూతిని పొందటానికి ప్రయత్నం చేయాలి. ఇది చాలా తేలికయిన, సులభమయిన, సూటి అయిన మార్గము ఆత్మసాక్షాత్కారాన్ని పొందటానికి. మన సరళమైన విశ్వశాంతి ప్రార్థన దానికి దోహదపడుతుంది. ఇది నా వ్యక్తిగత అనుభవము మీకు కూడా అలాంటి స్వానుభవము కలగాలని నా తపన. ఎందుకంటే మనమందరము ఈశ్వరుడి సంతానము కదా!

మా ఉత్తరాది యాత్రా సమయంలో ఎందరో సత్యాన్వేషకులకు, వివిధ మత సంప్రదాయాలకు చెందిన వారి హృదయాలలో శాంతిని నెలకొల్పటానికి నాకు అవకాశము లభించింది. చాలా మంది గృహాల్లో శాంతికి బదులుగా బాధలు, దుఃఖము, రోగాలు, కష్టాలు కనిపించాయి. వారు సంతోషంగా, ఆరోగ్యంగా, ఆనందంగా లేనందుకు నా హృదయం బాధతో నిండిపోయింది. కేవలము కొద్దిమంది గృహస్థులు

మాత్రమే శాంతిగా జీవిస్తున్నారు. గుఱ్ఱపు బండి ముందు గుఱ్ఱాన్ని కట్టివేస్తాము. అప్పుడు భార్య ఆ బండి హరిద్వార్ వైపుగా ప్రయాణించాలని కోరుకుంటే భర్త ఆ బండి కన్యాకుమారి లేదా రామేశ్వరము వైపుగా వెళ్ళాలని భావిస్తాడు. అప్పుడే జీవితంలో సుఖశాంతులు లోపిస్తాయి.

ఒకవేళ మీరు తిరుపతి వెళ్లాలనుకున్నా లేదా కైలాసం వెళ్ళాలనుకున్నా బండికి కట్టిన ఎద్దులు రెండూ జీవితంలో ఒకే దారిలో నడవాలి. అప్పుడే మీకు అభివృద్ధి, ఆనందము లభిస్తాయి. లేదంటే ఆ ఇల్లు నరకంలాగా మారిపోతుంది. దంపతులు ఇద్దరి మధ్యా అభిప్రాయ భేదాలు, అనుమానాలు, అసహనము వచ్చేస్తాయి. గుడ్డివాడు వేరొక గుడ్డివాడికి దారి చూపిస్తే ఇద్దరూ కలిసి గుంటలో పడిపోయినట్లుగా అజ్ఞానంలో పడిపోతారు. నేడు తల్లిదండ్రులు వారి పిల్లల ఆధ్యాత్మిక వికాసాన్ని మర్చిపోయి పూర్తిగా భౌతికమయిన చదువుల పట్ల మాత్రమే శ్రద్ధ చూపిస్తున్నారు.

ఇంటిని స్వర్గంగా మార్చుకోవాలన్న లేదా నరకంలాగా తయారుచేసుకున్నా అది ఆ వ్యక్తి చేతుల్లోనే ఉంటుంది. ఇప్పుడు నేను ప్రతి ఇంటిని స్వర్గసీమలాగా మార్చటానికి వారికి సహాయం చేయాలని తపించిపోతున్నాను. వారికి వారే సహకరించుకునేందుకు సహాయపడాలనుకుంటున్నాను. వారి గృహాలను భూమిపైన వెలసిన స్వర్గంలాగా, దేవాలయాలలాగా మార్చుకోవటానికి సహకరించాలనుకుంటున్నాను. శాంతికి నిలయంగా వారి గృహాలు ఉండాలని భావిస్తున్నాను.

ఒక భక్తుని వద్ద నుండి వచ్చిన ఉత్తరము చదివినప్పుడు నా హృదయము సంతోషంతో నిండిపోయింది. అది మా యాత్రకు లభించిన సత్ఫలితంగా భావిస్తున్నాను.

"పూజ్య స్వామీజీ! మీరు మీ ఆశ్రమవాసులతో మా గృహాన్ని పావనం చేయటం గొప్ప ఆశీస్సులుగా భావిస్తున్నాము. ఆ సందర్భంగా మీరు అందించిన సందేశాన్ని మేము ఎల్లవేళలా గుర్తుంచుకుంటాము. రెండు ఆత్మలు నిస్వార్థంగా ఒకరిని ఒకరు ప్రేమిస్తే అక్కడ స్వర్గం ఉంటుంది. స్వామీజీ మా గృహంలో శాంతిని, ప్రేమను నింపి వెళ్ళారు. మా దంపతులము ఇద్దరము మీరు మా ఇంటికి వచ్చి చక్కని సందేశాన్ని అందించినందుకు ధన్యవాదాలు తెలియచేసుకుంటున్నాము.

స్వామీజీ! ఇప్పుడు మాకు అర్థమయింది. భగవంతుని దివ్యానుభూతిని పొందగల్గినప్పుడే మనము సంతోషంగా ఉండగల్గుతాము. అలాగే ఇతరులు కూడా ఆ అనుభూతిని పొందటానికి సహకరించాలి. మీకు మేము వాగ్దానం చేసి చెపుతున్నాము. మాకు సమయం దొరికినప్పుడల్లా విశ్వశాంతి ప్రార్థనని పదే పదే మననము చేస్తాము. మేము పనిలో మునిగి ఉన్నా శాంతి ప్రార్థనకు సమయం చేసుకుంటాము.

భౌతికమయిన లౌకిక జీవితములో మునిగితేలే మాకు మీ సహాయం కావాలి. మీ ఆలోచనలను, సందేశాలను పండించటం ద్వారా మేము మర్చిపోకుండా ఉంటాము. మీరు మా గృహానికి వచ్చిన సమయంనుండి మా జీవితాలలో అనూహ్యమయిన మార్పు సంభవించింది. అది శాశ్వతంగా నిల్చిపోవాలను కోరుకుంటున్నాము. మేము ఆశ్రమానికి వచ్చి దర్శనము చేసుకోవాలని, ఆ పవిత్రమయిన వాతావరణములో అనంతమయిన శాంతిని, సంతోషాన్ని పొందాలని తపించిపోతున్నాము."

నేను తల్లిదండ్రులని ప్రార్థిస్తున్నాను. మీరు మీ బిడ్డల్లో ఆ పరమాత్మను దర్శించండి. అలాగే బిడ్డలందరూ మీ తల్లిదండ్రుల్లో దైవాన్ని దర్శించండి. అదే విధంగా భార్యాభర్తలు ఒకరిలో ఒకరు ఆ పరమాత్మనే దర్శించాలి. కనిపిస్తున్న మానవుడిని ప్రేమించలేకపోతే, మన కంటికి కనిపించని భగవంతుడిని మనము ఏ విధంగా ప్రేమించగలము? అందువలన మానవులను ప్రేమించటము అంటే భగవంతుడిని ప్రేమించటమే అవుతుంది.

ఒక పేరు ప్రఖ్యాతులున్న పండితుడు వెలుగుతున్న ముఖంతో నాతో "స్వామీజీ! మీరు ప్రవచనం చేసినప్పుడు చెప్పిన విధంగా నేను ఇంటికి వెళ్ళి నా భార్యాబిడ్డల్లో ఆ పరమాత్మను దర్శించగలిగాను. అప్పుడు నా ఇల్లు స్వర్గంలాగా మారిపోయింది. మేము ఇప్పుడు ఎంతో సంతోషంగా ఉన్నాము. మీకు ధన్యవాదాలు" అని చెప్పినప్పుడు నాకు ఎంతో ఆనందం కలిగింది.

## ఇప్పుడు ప్రపంచానికి చేయవలసినది

ఇంకా భౌతిక ప్రపంచంలో చేయవలసింది చాలా ఉంది అని నాకు అనిపిస్తోంది. భారతదేశములోనే కాకుండా సుదూర ప్రాంతాల్లో కూడా చేయవలసిన పని ఎంతో ఉంది. దాని అర్థం ప్రతి ఇంటిని కూడా స్వర్గంలాగా మార్చాలని. గృహాలను, పల్లెలను, పట్టణాలను స్వర్గసీమల్లాగా శాంతి సౌభాగ్యాలతో, ప్రేమతో నింపి వేయాలి. అది ఎంతో

గొప్ప కార్యము. ఆ పనికి ఎలాంటి పరిమితులు లేవు. చాలా కష్టసాధ్యమయిన పని అయినా చెపుతారు కదా! చిన్న చీమలు కూడా మహోన్నతమయిన పర్వతాల మీద ప్రయత్నంతో దారులు ఏర్పాటు చేయగలవు అంటారు.

నా కలను సాకారము చేసుకోవడానికి, నా బాధ్యతను, కర్తవ్యాన్ని పూర్తి చేయడానికి మీ అందరి సహకారము, సానుభూతి కోరుకుంటున్నాను. నాకు సహకరించడానికి మార్గము ఏమిటంటే, ముందుగా మీరందరూ మీ హృదయాలను శాంతితో నింపుకోండి. దాని కోసము నిరంతరము విశ్వశాంతి ప్రార్థన చేస్తూ ఉండండి.

విశ్వశాంతి ప్రార్థనని తరుచుగా, సాధ్యమయినంత ఎక్కువగా చేయాలి. ముందుగా బిగ్గరగా పలకండి, తర్వాత నెమ్మదిగా పెదాలతో పలకండి, చివరిగా అంతర్ముఖస్థితి లోనికి వెళ్ళి విశ్వశాంతి ప్రార్థనని మననము చేయండి. మీ హృదయం తన్మయత్వం చెంది, అది అనంత తేజోమయ కాంతి పుంజంలో లీనమయి పోయేదాకా చేయండి. అప్పుడు ఆ దివ్య తేజస్సు మీ హృదయంనుండి ఇంకొక హృదయానికి ఆ విధంగా ప్రపంచమంతా ప్రసారం అవుతుంది. ప్రపంచాన్ని మనము ఒక్కసారిగా మార్చివేయలేము. కాని కనీసం మనలను మనము మార్చుకోగలము కదా! ఇప్పుడ శాంతి, ప్రేమలను మన హృదయాల్లో నింపుకుందాము.

**మన హృదయాల్లో ప్రేమ, శాంతి నెలకొనుగాక!**
**మన గృహాల్లో ప్రేమ, శాంతి నెలకొనుగాక!**
**మన ఆశ్రమములో ప్రేమ, శాంతి నెలకొనుగాక!**
**మన సమాజంలో ప్రేమ, శాంతి నెలకొనుగాక!**
**మన దేశంలో ప్రేమ, శాంతి నెలకొనుగాక!**
**యావత్తు ప్రపంచమంతా ప్రేమ, శాంతి నెలకొనుగాక!**
**విశ్వమంతా ప్రేమ, శాంతి నెలకొనుగాక!**

ప్రపంచ శాంతి, అభివృద్ధి మన వ్యక్తిగత శాంతి, అభివృద్ధి అవుతుంది. సమస్త మానవాళి సంక్షేమమే మన వ్యక్తిగత సంక్షేమము అని భావించాలి.

ఓం...ఓం...ఓం...

## అధ్యాయం - 80

# అనుగ్రహము - ఆశీస్సులు

1970 అక్టోబరు 20 వ తేదీ, ఆదివారము తెల్లవారుఝామున ఉషఃకాలములో ఆత్మకథకి ఆశీస్సులతో ముగింపు వ్రాయాలని నా బల్ల వద్ద కూర్చున్నాను. ఒక చిన్ని పుస్తకము కనిపించింది "విశ్వశాంతి ప్రార్థన ద్వారా ప్రపంచ శాంతి".

ఆ చిన్ని పుస్తకములోని సందేశము ఈ ముగింపుకు ముందు అధ్యాయంగా తనను కూడా చేర్చమని నన్ను అడుగుతున్నట్లుగా అనిపిస్తోంది. భగవంతుని లీలలు మనకు ఊహించటము సఖ్యము కాదు. ఏది జరగవలసి ఉంటుందో అది జరిగే తీరుతుంది. ఏది ఈ గ్రంథంలో చేర్చబడవలసి ఉందో అది తప్పకుండా దీనిలో చేర్చబడుతుంది. "భగవాన్! ఇందులో నా ఇచ్ఛ ఏమి లేదు. నీ ఇచ్ఛ ప్రకారమే అంతా జరుగుతుంది. ఎల్లవేళలా, ఎల్లప్పుడూ అదే జరుగుతుంది."

వెలుగుతున్న దీపము ఆరిపోయే ముందు ఈ భూమి మీద దాని ఉనికిని ముగించేముందు అది మరింత దేదీప్యమానంగా ప్రకాశాన్ని అందిస్తుంది. ప్రపంచానికి అది అందించే చివరి బహుమతిగా. అదే విధంగా మీ అందరికి నా ఆశీస్సులు అందించాలని నా హృదయం తపిస్తోంది. నా హృదయం మీ అందరి హృదయాలను కదిలించి మీలో ఆ భగవంతుని దివ్యానుభూతిని పొందే విధంగా చేయాలని తపించిపోతోంది. మీరు ఈ ఆశీస్సులు చదువుతున్నప్పుడు ఆ పరమాత్మ మీతోనే ఉన్నాడు. మీలోనే ఉన్నాడు. మీ ప్రతి జీవకణములోను నిండి నిబిడీకృతమై ఉన్నాడని తెలుసుకోండి.

భగవంతుని కోసం జీవించటము, ఇతరులకు సహాయము చేయటము గొప్ప అదృష్టము. ఇదే నా జీవిత ఆదర్శము. అదే శాంతి ఆశ్రమము ఆదర్శము. నిజంగా ఇదంతా ఒక కలలాగా అనిపిస్తోంది. కాని సంతోషంగా, ఆనందంగా ఆహ్లాదకరమయిన కల ఇది. అది అందరికి, ఎందరికో మనో ధైర్యాన్ని, సౌకర్యాన్ని, ఆదర్శాలను, స్ఫూర్తిని అందించింది. అబ్రహంలింకన్ మాటలు ఈ గ్రంథంలో పలు పర్యాయాలు వ్రాసి ఉంటాను.

**"హృదయపు లోతుల్లోంచి క్రొత్త బలంతో**
**చీకటిలో నుండి క్రొత్త కాంతిలోనికి**
**మసక చీకటిలో కూడా మార్గం తప్పకుండా ప్రయాణించాలి."**

అది నా జీవితంలో సంతోషాన్ని, మనోధైర్యాన్ని, స్ఫూర్తిని అందించింది. మనము భగవంతుని మధ్యలో, శాశ్వతంగా ఆయనతో ఉన్నాము. గతంలో కూడా మనము పరమాత్మతో కలిసి ఉన్నాము. వర్తమానములోనూ ఆయనతోనే ఉన్నాము. భవిష్యత్తులో కూడా మనము పరమాత్మతో కలిసి ఉంటాము. మనము భగవంతునితో కలిసి లేని క్షణం గాని, ఆయనతో విడిపోయిన క్షణం గాని ఉందా? ఈ విశ్వమంతా, పైనా, క్రిందా, ఆకాశంలో, భూమి మీద, ఒక్క అణువయినా పరమాత్మ లేని ప్రదేశము లేదు. పైగా పరమాత్మ మన లోపలా, బయటా, పైన, క్రిందా, మన చుట్టూ మన శరీరంలోని అణువణువులోనూ నిండి ఉన్నాడు. మనకు కావాల్సినదల్లా ఒక్కటే. ఆయన దివ్యానుభూతిని అనుభవించాలి. మన లోపల అంతర్యామిగా కొలువైన ఈశ్వరుడిని, స్వయంజ్యోతి ప్రకాశాన్ని, సహస్ర సూర్యతేజోమయుడిని దర్శించాలి.

నేను మిమ్మల్ని అందరినీ ఆ దివ్యానుభూతిలో వదిలిపెడుతున్నాను. అదే మీ నిజమయిన మానవ జన్మ సార్థకత. దివ్యత్వము, జన్మహక్కు అయి ఉంది. ఆ 'సచ్చిదానందము' ఆ సచ్చిదానంద పరబ్రహ్మ స్వరూపాన్ని దర్శించండి. రెపరెపలాడుతున్న ఈ జ్యోతి మీ అందరి హృదయాలలో ప్రవేశించి, మౌనంగా, శాంతిగా ఉంచుగాక! ఇంక ఈ జ్యోతి మాట్లాడదు. మీలోనే లీనమయిపోతుంది.

మానవుడు అజ్ఞానంతో దుర్భరమయిన జీవితము గడుపుతాడు. ఎందుకంటే అజ్ఞాని కేవలము తన గురించి మాత్రమే ఆలోచిస్తాడు. మనము సంతోషంగా ఉండాలి అంటే ఇతరులను సంతోషంగా ఉంచాలి. అహంకారాన్ని వదిలిపెట్టాలి. పూర్తిగా దాన్ని మర్చిపోవాలి. నిరంతరము, విశ్వశాంతి ప్రార్థనని మననము చేయటము వలన అహంభావన నశిస్తుంది. అప్పుడు మీ హృదయాల్లో, ఆత్మలో శాంతి స్థిరంగా, శాశ్వతంగా నెలకొంటుంది.

ఇంక ఈ సందేశాన్ని పవిత్రమయిన శ్లోకంతో ముగిస్తాను.

నేను భగవంతుని ముందు తలవంచుతున్నాను. 'సత్' ఈ ప్రపంచమంతా వ్యాపించి ఉన్నాడు. నేను పూజిస్తాను 'చిత్' అనగా జ్ఞానము. అది నీలో తెలివితేటల రూపంలో ఉంది. నేను శరణాగతి చెందుతున్నాను 'ఆనంద స్వరూపునికి'.

అంతటా నిండి ఉన్న ఆ సర్వాంతర్యామి ఒక్క క్షణము కూడా మనతో లేకుండా లేడు. ఇది మిమ్మల్ని నిరంతరము ప్రేమించే మీ 'ఓంకార్' ప్రార్థన. మీ శాంతి కోసము, సంక్షేమము కోసము ప్రార్థిస్తున్నాను. ప్రేమ వెల్లువలాగా, ఆ భగవంతుని దివ్యప్రేమ మీ లోపల కదలాడుతూ ఉండాలి. మీ ద్వారా మిమ్మల్ని కలిసిన వారందరి హృదయాలకు అది ప్రవహించాలి. గుర్తు పెట్టుకోండి భగవంతుడు మీలోనే ఉన్నాడు. అందరిలోనూ ఆ భగవంతుడే ఉన్నాడు.

హరి ఓం తత్సత్

ఓం

# నా ఆత్మకథ సారాంశము

ఎంతో ఓపిగ్గా చదువుతున్న నా ప్రియమయిన రపాఠకులతో నా ఆత్మకథ సారాంశాన్ని పంచుకోవాలని నా హృదయం ఆరాటపడుతోంది. ప్రారంభించేముందు నా హృదయానికి ఎంతో ఇష్టమయిన శ్రీసూరదాసు చిన్న సాధారణమయిన కవితను మళ్ళీ ప్రేమతో మీకు చెప్పాలనుకొంటున్నాను.

**నా వంటి హేయమయిన, నీతిబాహ్యమయిన**
**ఏవగించుకోవాల్సిన వ్యక్తి ఎక్కడ ఉంటాడు?**
**నేను నా గురువును, సృష్టికర్తను మర్చిపోయాను**
**ఎంతో నిర్మోహమాటంగా వ్యవహరించాను!**

మనలో ప్రతి ఒక్కరికి జీవితంలో బలహీనత, కృంగుబాటు ఏర్పడిన క్షణాలలో భక్త సూరదాసు రచించిన అందమయిన ఈ కవిత గుర్తుకు వస్తుంది. నేను తన్మయత్వంలో మునిగిన క్షణాలలో, పరమాత్మ దివ్యానుభూతిని నా లోపలా, బయటా కూడా అనుభూతి చెందినప్పుడు, ఆ దైవము మాత్రమే పరమసత్యము అయినప్పుడు నేను ఎంతో సంతోషంతో వేదసారమయిన ఈ శ్లోకాన్ని మననం చేస్తూ ఉంటాను.

**జ్ఞాతం జ్ఞాతవ్య మధునా ద్రష్టం ద్రష్టవ్య మద్భుతం।**
**చిరం శ్రాంతః విశ్రాంతోస్మి చిన్మాత్రా నాస్థి కించన।**

తెలుసుకోవలసినది తెలుసుకొన్నాను. చూడవలసినది చూశాను. అది అద్భుతము. ఇంతవరకు ద్వంద్వములతో చాల బాధ పడ్డాను. ఇప్పుడు విశ్రమించాను. ఏలనగా చిన్మాత్ర తప్ప అన్యమెప్పుడును, యెచ్చటను లేదు.

మీ అందరి ప్రార్థనల కారణంగా పరమాత్మ అనుగ్రహము నా మీద ఈ రోజు పూర్వము కంటే ఎక్కువగా ఉన్నందుకు ఆనందంతో ఉబ్బితబ్బిబ్బవుతున్నాను. నా ప్రియమయిన పాఠకులతో, నా ఆత్మకథ చదువుతున్న వారందరితో తరుచుగా ఈ

రోజుల్లో నేను తన్మయత్వంతో మననం చేసే ఈ పవిత్రమయిన శ్లోకాన్ని పంచుకోవాలనుకుంటున్నాను. అది మీ అందరి కోసం ఇక్కడ పొందుపరుస్తున్నాను.

**అహం బ్రహ్మాస్మి మంత్రోయం కోటిపాపం వినశ్యతి।**
**అహం బ్రహ్మాస్మి మంత్రోయం జ్ఞానాన పాపం వినశ్యతి॥**
**అహం బ్రహ్మాస్మి మంత్రోయం బుద్ధి పాపం వినశ్యతి।**
**అహం బ్రహ్మాస్మి మంత్రోయం జ్ఞానానందం ప్రాయశ్చిత్తే॥**

ఓం బ్రహ్మాస్మి మంత్రోయం మరియు సోహంమంత్రం రెండు కాదు ఒక్కటే. సోహాన్ని అనుసరించండి. తైలధార లాగా అసిధారంగా ఉండాలి. నూనెను ఒక పాత్ర నుండి వేఱొక పాత్రలోనికి పోసినప్పుడు ఏ విధంగా ఎలాంటి విరామము ఉండదో ఆ విధంగా ఉండాలి. ఇక ఇప్పుడు మనము ఈ సుదీర్ఘమయిన ఆత్మకథని ఉపనిషత్తుల్లోని శాంతి మంత్రంతో ముగిద్దాము.

**ఓం పూర్ణ మదః పూర్ణమిదం పూర్ణాత్పూర్ణ ముదచ్యతే**
**పూర్ణస్య పూర్ణమాదాయః పూర్ణమేవా వశిష్యతే**
**హరిః ఓమ్ శాన్తిః శాన్తిః శ్శాన్తిః॥**

ఓం... అది పూర్ణము. ఇది పూర్ణము. ఆ పూర్ణము నుండి ఈ పూర్ణము వచ్చింది. ఈ పూర్ణాన్ని ఆ పూర్ణము నుండి తీసుకున్నప్పటికి అది పూర్ణముగానే ఉండిపోతుంది.

**ఓం శాంతి...శాంతి...శాంతిః**

భగవంతుడు ఈ ఆత్మకథని చదువుతున్న పాఠకులందరికి సంపూర్ణమయిన ఆయుష్షు, ఆరోగ్యము, సుదీర్ఘమయిన జీవితాన్ని ప్రసాదించి ఆశీర్వదించుగాక!

ఇది మీ ఓంకార్ యొక్క ప్రార్థన!

అందరికి శాంతి లభించుగాక!

**ఓం..ఓం..ఓం..**

# ముగింపు

1982 జూన్‌లో పూజ్య స్వామీజీ మహాసమాధి చెందారు. వారికి అప్పుడు ఎనభై ఎనిమిది సంవత్సరాలు. ఇప్పుడు ఆశ్రమము ఉన్న స్థితికి తీసుకు రావడానికి ఆయన జీవిత కాలము పూర్తిగా ప్రతి క్షణము శ్రమించి పనిచేశారు. యుక్తవయస్సులో ఉండగా స్వామీజీ ఉషోదయము నుండి సూర్యాస్తమయం వరకూ కొన్ని వందల చెట్లు ఆయన స్వహస్తాలతో నాటారు. మాతృ ఆశ్రమంలోని ప్రతి వృక్షము నేడు స్వామీజీ నామస్మరణ చేస్తోంది ఎంతో పూజ్యభావంతో.

స్వామీజీకి మౌనంగా ధ్యానంలో కాలం గడపటం అంటే చాలా ఇష్టం. ఆయన చివరి తీర్థయాత్ర తర్వాత పూర్తిగా మౌనంగా ధ్యానంలో మునిగిపోయారు. ఆయన జీవితమంతా మౌనానికి, ధ్యానానికి ఎంతో ప్రాముఖ్యము నిచ్చారు. నియమిత కాలం ప్రకారం ప్రశాంతంగా మూడు ఆశ్రమాల మధ్య తిరుగుతూ కాలం గడిపేవారు. అయినా ఎప్పుడూ ఆయన దర్శనం కోసం వచ్చే భక్తులకు అందుబాటులో ఉండేవారు. చిరునవ్వుతో, మెరుస్తున్న తేజస్సు నిండిన కళ్ళతో, మృదువుగా మాట్లాడేవారు. ఆయన మాటల్లో ప్రేమ, దయ, ఉత్సాహము తొణికిసలాడేవి. మనుషుల మధ్య పోట్లాటలు వస్తుంటాయి. ఒకరు వేరొకరిని కించపరిచి మాట్లాడుతుంటారు. నమ్మకద్రోహం చేసి వారి విశ్వాసాన్ని వమ్ము చేస్తారు. అయినా ఆయన ఏ మాత్రము మార్పు లేకుండా, నిశ్చలంగా ఉండి అదే విధంగా ప్రేమిస్తాడు. స్వామీజీ అంటేనే ప్రేమ, నమ్మకము. ఆయన తనలోనూ, ఇతరులలోనూ కూడా శాశ్వతమయిన సత్యాన్ని దర్శించారు.

చివరి రోజుల్లో ఆశ్రమములో కొంతమంది అంకితభావంతో ఎంతో సేవ చేశారు. వారు వరిచేలల్లో పనిచేసేవారు. పొలాల్లో పనిచేసేవారు. అలాగే విద్యాలయాల అభివృద్ధి కోసం పాటు పడేవారు. స్వామీజీ తన చివరి క్షణాల వరకూ ఆశ్రమము కోసం పనిచేస్తూనే ఉండేవారు. అయినా జ్ఞానేశ్వరి మాత స్వామీజీ విజయానికి కారకురాలు. ఇప్పుడు ఆశ్రమానికి మాతాజి. ఆమె ఒక ఆవిరి యంత్రంలాగా కార్యదక్షతతో ఆశ్రమ వ్యవహారాలను, పాలనా యంత్రాంగాన్ని నెమ్మదిగానే అయినా స్థిరంగా, ధైర్యంగా నిర్వహించారు. స్వామీజీ ముందుగా ఆమెకు అన్నీ నేర్పించారు. అప్పుడే ఆమెకు నెమ్మదిగా బాధ్యతలను అప్పగించారు. ఆయన ఉండగానే అన్ని వ్యవహారాలు నేర్పించటము వలన



స్వామీజీ పరమపదించిన తర్వాత క్లిష్ట పరిస్థితుల్లో కూడా ఆమె ఎలాంటి తప్పులు చేయలేదు. పైగా ఆమె మహోన్నతమయిన శక్తి సామర్థ్యాలతో ఉవ్వెత్తున పైకి లేచిన కెరటంలాగా పనిచేసి ఆశ్రమానికి ఉజ్జ్వలమైన స్థితిని చేకూర్చి ఆకాశంలో ధ్రువతారలాగా మెరిసిపోయారు.

జ్ఞానేశ్వరి మాతాజీలో స్వామీజీ తిరిగి జీవించారు. ఎందుకంటే ఆమె ఎల్లప్పుడు స్వామీజీ అడుగుజాడల్లోనే నడిచారు. ఆమె మహోన్నతమయిన స్థితిని పొందిన ఆత్మజ్ఞాన స్వరూపిణి. తన గురువు చేరుకున్న మహోన్నతమయిన స్థితిని ఆమె కూడా చేరుకున్నారు అని చెప్పటంలో ఎలాంటి సందేహము లేదు. స్వామీజీ – మాతాజీ మధ్య ఎన్నో సంవత్సరాల గురుశిష్యుల అనుబంధము ఉండటం వలన ఆమె హృదయంలో తాను కేవలము ఒక శిష్యురాలిలానే ఉంటారు. ఆమెలో ఉన్న ఆ అణకువ వలన భక్తులందరూ ఆమెనుకూడా గురుదేవులను పూజించిన విధంగానే పూజించి గౌరవిస్తారు. ఆమెలోని నిజమయిన ప్రేమ, అణకువ, పవిత్రత, నిస్వార్థత, అంకితభావము, సమర్పణ వల్లనే స్వామీజీకి ఆమె దగ్గర కాగలిగింది, ప్రేమించబడింది. మనము కూడా అదే విధంగా ఉండడానికి ప్రయత్నము చేద్దాము.

స్వామీజీ మరియు జ్ఞానేశ్వరి మాతాజీ పవిత్రమయిన పాదాలకు

ప్రేమతో, కృతజ్ఞతతో... **నారాయణి**

# ముగింపు ప్రార్థన

ఓం నమస్తే సతేతే జగత్కారణాయ
నమస్తే చితే సర్వలోకాశ్రయాయ
నమో అద్వైత తత్వాయ ముక్త ప్రదాయ
నమో బ్రహ్మణే వ్యాపినే శాశ్వతాయ

పృథివీ శాన్తిః। అన్తరిక్షం శాన్తిః ద్యౌః శాన్తిః ఆపః శాన్తిః
ఔషధయః శాన్తిః। వనస్పతయః శాన్తిః। విశ్వేమే దేవాః శాన్తి।
బ్రహ్మం శాన్తిః।శాన్తిః శాన్తిః

జ్ఞాతం జ్ఞాతవ్య మధునా
ద్రష్టం ద్రష్టవ్య మద్భుతం
చిరం శ్రాంతః విశ్రాంతోస్మి
చిన్మాత్రా నాస్థి కించన

అహం బ్రహ్మోస్మి మంత్రోయం కోటిపాపం వినశ్యతి
అహం బ్రహ్మోస్మి మంత్రోయం జ్ఞానాన పాపం వినశ్యతి
అహం బ్రహ్మోస్మి మంత్రోయం బుద్ధి పాపం వినశ్యతి
అహం బ్రహ్మోస్మి మంత్రోయం జ్ఞానానందం ప్రాయశ్చిత్తే
ఓం పూర్ణ మదః పూర్ణమిదం పూర్ణాత్పూర్ణ ముదచ్యతే
పూర్ణస్య పూర్ణమాదాయః పూర్ణమేవా వశిష్యతే
హరిః ఓమ్ శాన్తిః శాన్తిః శ్శాన్తిః॥

# లోకశాంతి ప్రార్థన
## (వ్యక్తి శాంతికి - విశ్వశాంతికి)

ఓ పూజనీయమైన ఓ దివ్య స్వరూపా!
మా లోపలను వెలుపలను మీదను క్రిందను అంతటను
నిండియున్న ఓ సర్వాంతర్యామీ! మా లోపల ప్రత్యణువు
నందును ఇమిడి యుండి మా నేత్రములకు నేత్రము,
కర్ణములకు కర్ణము, హృదయములకు హృదయము,
మనస్సులకు మనస్సు, శ్వాసలకు శ్వాస, ప్రాణములకు ప్రాణము,
ఆత్మలకు ఆత్మవై వెలుగొందు ఓ దేవా!

ఓ ప్రేమైక మూర్తీ!
నిన్ను తెలుసుకొను భాగ్యము ఇప్పుడు ఇచ్చటనే మాకు
ప్రసాదింపుము. ఓ తేజోమయమూర్తీ! తూర్పు పడమరల,
ఉత్తర దక్షిణముల, ఈ విశ్వము నందంతటను అందరును
నీ దివ్య తేజస్సును గ్రహింతురు గాక!

ఓ సచ్చిదానంద స్వరూపా!
ప్రతి మానవ హృదయము నందును, నానాజాతి మధ్యమునను
శాంతి సామరస్యములను ప్రతిష్ఠింపజేయుము
ఓ దేవా! ఇదియే మా మనఃపూర్వకమైన ప్రార్థన.
లోకాస్సమస్తా స్సుఖినోభవంతు!

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

శ్రీశ్రీ ఓంకార స్వామి వారు లోకానికి అందజేసిన శాంతి ప్రార్థన
అన్ని మతములకు సమ్మతమైన ఈ శాంతి ప్రార్థనను
నిత్యము స్మరించి లోకశాంతికి తోడ్పడ ప్రార్థన.

# శ్రీ శాంతి ఆశ్రమము - ఒక పరిచయం

పూజ్యశ్రీ ఓంకారస్వాములవారు తరుణప్రాయముననే సన్యసించి చాలా సంవత్సరములు హిమాలయములలో తపమాచరించి తపఃస్సిద్ధులై ఆంధ్రదేశమునకు తిరిగి వచ్చి, తూర్పుగోదావరి జిల్లా, ప్రత్తిపాడు మండలము నందు తోటపల్లి కొండల మధ్యనున్న రమణీయమైన అరణ్యములో కొంతకాలము తపమాచరించిన పిమ్మట దైవ ప్రేరణచే 1917వ సంవత్సరంలో శాంతి ఆశ్రమమును స్థాపించిరి.

ఆనాటి నుండియు ఆశ్రమము దినదిన ప్రవర్ధమానమగుచు నేటికి సువిశాలమైన (100 ఎకరములు) ఫల, పుష్ప, వృక్ష సముదాయములతో నేత్రానందకరమై యొప్పుచు, అనేకమంది నిరాశ్రయులకు, అనాథ బాలబాలికలకు ఆశ్రయమై నిరంతరము అన్న, వస్త్ర, విద్య, వైద్య దానము లొనర్చుచు శాంతికాముకులకు, దైవ పిపాసులకు ప్రశాంతి నిలయముగా అలరారుచున్నది. పూజ్యశ్రీ స్వామీజీ పవిత్రాశీస్సులతో 'పీస్', 'శాంతి' పత్రికల ద్వారా ఆధ్యాత్మిక సందేశములు అందించుచున్నది.

సర్వమత సామరస్యము, దీనజనోద్ధరణ, నిస్వార్థ, ప్రేమయుత సేవా జీవితము, ఆశ్రమము చూడవచ్చిన వారిని దైవోన్ముఖముగా జేయుటయే - శ్రీ స్వామీజీ జీవిత ధ్యేయము.

జాతి, మత, కుల వివక్ష లేక సర్వులకు జ్ఞాన గృహముగా నిరంతరాశ్రయమిచ్చుటే శ్రీ శాంతి ఆశ్రమ లక్ష్యము.

ఈ మాతృ ఆశ్రమము వివిధ రీతుల అభివృద్ధి నొందుటయే గాక వాల్తేరు, కాకినాడ, పిఠాపురం (ఆం.ప్ర.), కోటగిరి (తమిళనాడు) మొదలగు అనేక తావులలో ఈ ఆశ్రమ శాఖలు అభివృద్ధి చెందుతూ ఆయా ప్రాంతపు భక్తుల ఆధ్యాత్మికాభివృద్ధికి తోడ్పడుచున్నది. దేశ, విదేశములందలి శాంతి కోరు భక్తులందరు మాతృ ఆశ్రమమును, శాఖలను దర్శించుచు, శాంతిని బడసి వెళ్ళుచుండిరి. ఇంతకు ముందు దర్శించని భక్తులకు, ఆశ్రమమునకు, దైవ సన్నిధికి హృదయపూర్వక సుస్వాగతము.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

**1. మాతృ ఆశ్రమం :**
శాంతి ఆశ్రమము
తోటపల్లి కొండలు, పిన్ : 533 446
వయా శంఖవరం, తూ.గో. జిల్లా
ఫోన్ : 7382009962

**2. విశాఖపట్టణం శాఖ :**
లాసన్స్ బే, పెద వాల్తేరు – 530017
విశాఖపట్టణం
ఫోన్ : 0891–2538689

**3. విశ్వశాంతి క్షేత్రం :**
కైలాసగిరి,
విశాఖపట్టణం

**4. కోటగిరి శాఖ :**
పీస్ సెంటర్, ధర్మోన రోడ్
కోటగిరి – 643217
నీలగిరి జిల్లా, తమిళనాడు
ఫోన్ : 04266–271945

**5. కాకినాడ శాఖ :**
శాంతి ఆశ్రమము
అశోక్ నగర్, కాకినాడ
533 004, తూ.గో. జిల్లా

**6. పిఠాపురం శాఖ :**
స్టువర్టు పేట, పిఠాపురం
533450

# శ్రీ శాంతి ఆశ్రమ ప్రచురణలు

## తెలుగు

1. శ్రీ స్వామి ఓంకార్ ఆత్మకథ
2. ఓంకార్ సద్బోధామృతము
3. సోహం
4. ఓం జపం
5. మౌనపు ఘడియలు
6. ప్రేమయే దైవము
7. భగవత్సాక్షాత్కారము ఇప్పుడు – ఇక్కడే
8. శాంతి దళములు
9. ఆధ్యాత్మిక మెరుపులు
10. సత్సంగ సందేశములు
11. శ్రీమద్భగవద్గీత (మూలము – పారాయణ ప్రతి)
12. ఓంకార్ సూక్తులు
13. ఓంకార స్తోత్ర కదంబం
14. శాంతి సూక్తులు
15. శాంతి ప్రార్థన
16. శ్రీ శాంతి స్తోత్రములు
17. స్వామి ఓంకార్ ఆత్మదర్శిని
18. సందేశ తరంగిణి
19. నా చెల్లి పునర్జన్మ
20. నేను ఆంగ్లము ఎలా నేర్చుకున్నాను?
21. శ్రీశ్రీశ్రీ ఓంకార స్వామి స్తోత్రమ్
22. శాంతి దూత స్వామి ఓంకార్
23. స్వామి ఓంకార్ – జీవిత విశేషాలు
24. శ్రీ శాంతి ఆశ్రమ చరిత్ర
25. శ్రీ శాంతి ఆశ్రమ పాఠశాల ప్రార్థనలు

## English

1. Auto Biography of Swami Omkar
2. Life and Teachings of Swami Omkar
3. Soham
4. Cosmic Fast
5. Meditation by Swami Omkar
6. Om Japa
7. Control of Mind
8. Cosmic Flashes
9. In the House of Silence
10. The soul of Omkar
11. How I learned English
12. Reincarnation of My Little Sister
13. God Realization Now and Here
14. Mystic Prayers and Poems